Telugu Poet, Critic and Writer
Shri Y. Rama Theertha's
Essays, Poems and Articles

● కవిత

జల ఉరి

ప్రచండ వాతూలం
ప్రళయ జల విస్ఫోటనం
డ్రోన్‌లాంక వెయ్యి హోరుహోరుగా
గాలిగుర్రాలొక లక్ష ఖడ్గధారగా
బీభత్స భైరవాలొక కోటి ఒక్క వేటుగా
దాడి కళింగాంధ్రపై
అయినా పేరు నగరానిదే పైకి వాస్తోంది
కానీ తుడిచి పెట్టుకు పోయింది
నాలుగు వందల మైళ్ల ప్రాంతం
నదులు, కొండలు, చెట్లు, పొలాలు,
బాటలు, చెరువులు, పక్షులు, పశుగణాలు
గడగడలాడి పోయిన ధ్వంస రచన
ఏ సాంప్రదాయ బాంబూ
ఇంత ప్రాంతాన్ని ప్రభావితం చేయదు
విశాఖ నెత్తిన నీటి బాంబు పేలింది
గాలి క్షిపణి వేగాన తోడయ్యింది
ఆరుద్ర చెప్పిన విశాల లోకం సర్కస్
ఆగిపోయింది.
నాగరిక గుర్తులన్నీ వెతికి వెతికి
ఉరి తీసింది హుద్‌హుద్.
ఇంటా బయటా లోపలా పైనా
ఊరికి జల ఉరి బిగిసింది
కాలి కింద సౌకర్యాల బల్లను కూలదన్నింది.

- రామతీర్థ

రసదండి రాళ్ళబండి

అహో సాంద్ర భోజా!
కవితా ప్రసాద రాయా!!
కనులకై కలలెన్నో దాచినావు
కనుపాపవే నీవు ఏ కారడవి దాగినావు
మహోర్వాటి నుంచి నువ్వు దిగొచ్చిన వాహనం
పద్యపు కులుకు జవరాళ్ళ బండి-
అవధాన మేఘం మీద
లోలోపలి ఉత్సవ వర్షమై, ఉన్నత హర్షమై,
నాలుగు కాలాలే నిలిచి వ్యవధానం లేకుండా
కవి హంసలు పిలుస్తున్నాయని
మానసరోవరాలు దాటి వెళ్లిపోయావు-
పద్యం నీకు తలచినపుడు నర్తించే పదాభినేత్రి
ఆశు శతక గంగ నీ వెను వెనుకే సాగంగా
నగర పుత్రుల, సగటు బతుకుల బూది కుప్పలు
ముంచెత్తమన్నావు బహు జన్మ పావన మయంగా-
నువ్వు రాయలవైతే నీకోసం
మంత్రులు నిజంగానే మంత్రులయారు
మృదు హృదయ విద్యలో బండలు కరిగించడమే కాదు
బండి పరుగులు తీయించడమే కాదు
రాళ్ళకు పూల వాసనలు తెచ్చిన
రసదండి రాళ్ళబండి -
తాళ వృక్షాంత చంద్రమూర్తి
మేం తేరిపార చూసిన నీదు కీర్తి -
పద్యాలతో ఆడుకునే పిలగాడా!
ఏ స్వర్గ మైదానం పిలిచిందయా
శిశుర్వేత్తి పశుర్వేత్తి యాత్రలో
ఒంటరి పూల బుట్ట ఒకటి
రాళ్ళ బండిలో వేసుకు వెళ్ళిపోయావు
గగన రేఖల లోకంలోకి
నాలుగు పూల రేకలే తీసుకెళ్లావు
అవీ లోకపు ప్రేమ లేఖలని!
వదిలి వెళ్లావు మాకై నీ పద్యాల పూల తోట
కవిలోక గణపతీ, అవధాన స్థపతీ
కవితా రాజ ప్రాసాదాల
స్వేచ్ఛా విహారాల ప్రసాద రాజా!!
కొత్త లోకంలో నీ ఠికాణా
పద్యావధాన ప్రవాహాల షామియానా.

- రామతీర్థ

ఎర్ర్ర కారు ఏరువాక

ఎర్రెర్రని చిందులోన ఎర్ర దిబ్బలూగాయి
తూర్పు కనుమ డప్పుగా ఎరుపుదళం సాగింది
బంగాళాఖాతాన ఎర్రసముద్రం కలిసింది
జనసాగర, జలసాగర సంగమం ఇది ధన్యకుమారి
ఆట, పాట, అభినయం, ఆలాపన, ఆంగికం, వాచికం,
అక్షరం సాక్షిగా సర్వ కళా బహువచనం
పుస్తకాలే తోడుగా మస్తకాలే పులకించి
సాంకేతిక మైదానం సరస్వతీ రూపమై తిలకించి
ఉత్తరాంధ్ర పలకరించగా
ప్రత్యక్షమైన తెలుగు ప్రజల వెలుగు పున్నమి
పదిరోజులు నేల పైన నిలిచిన దృశ్యం
విశాఖ సుందరి సిగలో విరిసిన భావ విప్లవాల మంకెన
మారాలి అక్షరం మారాలి మన తరం
రావాలి బాధ్యతల బరువులు మోసే భుజాల వంతెన
మేధావులు పిలిచారు
చిన్నారులు పలికారు
రచనలు రక్షణ కవచాలుగా ఎదిగే పోరాట శ్రేణులకు
విత్తనాల చాలురా ఈ విశాఖ నేల
పరిగెత్తుకు వస్తున్న ప్రమాదాల ముందు
జనాలు ఆనకట్టలై నిలబడతారు
అందుకు తోడై నిలిచే వామపక్ష జనభూమిక
దేశదేశాకాశాలలంకరిస్తున్న అంగార తారక
విశాఖ ఫెస్ట్
వినోదం, విజ్ఞానం, వికాసం, వివేకాల మాధ్యమం,
నయాగరాలు నడిచిరాగ చెలరేగిన
కలల శివ తాండవం
కురు భూముల యుద్ధాలను గెలిచేందుకు
సమైక్యమవుతున్న జన పాండవం
సమాజపు అందని ఉట్టిలలోని నవనీత సంపదలు
నేల బారు చేసేందుకు నిర్మాణమవుతున్న
ప్రజాస్వామిక ప్రతిఘటనా సముద్రం
సముద్రాన్ని ఎరిగిన వాడే
సముద్ర నిర్మాణం చేయగలడు
కూడలిలో నిలిచిన జన సముద్రాలు
దోపిడి రాజ్యాల డుల్లి పడవలను ముంచేసే
క్రాంత దర్శనాల పదఘట్టన
ఈ పది రోజులూ విశాఖ వొడ్డున
ఈ పాఠం నిలుస్తుంది
రణపాఠం గుణపాఠమై కాలాన్ని గెలుస్తుంది
ఎవరి జమ్మి చెట్లు ఏవో గుర్తెరిగి
ఎవరి ఆయుధాలు వారు స్వీకరించుదాము
కలమో, గళమో, చిందేసే పాదమో,
చిమ్మేసే చిత్రమో, పత్రికా రచనమో,
నట ధూర్జటి నటనమో,
రాబోయే పిడుగుల దండయాత్రకు
ఇదొక కళల కరవాలాల తళత్తళ
ఎర్ర కారు ఏరువాక ఎత్తిన జయపతాక
వైజాగ్‌ఫెస్ట్ ఇది జనోత్సవ విశాఖ!

–రామతీర్థ

98492 00385

డ్రోన్ల హోరు - సర్వేల జోరు

ఇటుక ముక్కకు గతి లేదు రామా హరి
ఇంద్రుని రాజధాని కడతాము కాదా మరి
ఈ ట్రిక్కు, ఆ ట్రిక్కు, ఏ ట్రిక్కు అయినా సరి
ఆ నగర మేడలకు ఇటుకలే విటమిన్లు కృష్ణా హరి
కళ్ళు మనవైనాను, ఊళ్ళు మనవైనాను రామా హరి
చూసేటి అద్దాలు ఆ సింగపూరే ఇవ్వాలి సరాసరి

రైతునెరగని వారు, పంట చూడని వారు సై సింగపూరు
దిగుమతులే బతుకుగా రోజు గడిపే వారు సై సింగపూరు
మన నేల మన నీరు, మన చెట్టు, మన గాలి అతి వింతలూర
చూపుతారట త్రీ-డీ బొమ్మలుగా ఇక కరువు తీర

భూమికి భూమంటూ చేసే పరిహార పథకాల అమలు
వారి డ్రోన్ లెగిరితే గాని తెలియదంట మన నేల మనకు
సర్వేలు, రికార్డులు, రెవెన్యూ నిపుణులున్నా సై సింగపూరు
డ్రోన్ లెగురకపోతే మన నేల తీరేదో మనకే తెలియదన్నారు

తుళ్ళూరు, మంగళగిరి, తాడేపల్లి ఆకాశాల ఎగిరింది డ్రోనూ
జీను లేని గుర్రమది ఎగిరింది వివరాలకేనంట అవునూ
వివరాలది ఏర్చి తీర్చాక రావయ్యా ఓ పొలమిచ్చిన రైతన్న
డ్రోన్ చూపిన నేల నీకు కేటాయింపోనూ గొప్పగా ఓరన్న

హై టెక్కు పాలనలో, తైతక్క పద్ధతిలో రామా హరి
ఎంత డ్రోన్‌కు అంత కూలి ఎరగాలి జనులు కృష్ణా హరి
డ్రోన్ చూపితే గాని మనం మండలాలను మనమెరుగలేమా
డ్రోన్ చూపితే గాని ఏ భూమి పరిహార అర్థమో తీర్చలేమా

ఇది భూకంప జోన్ అన్నకృష్ణ సంఘంకన్నా తెలివైనదా డ్రోన్
జవాబు చెప్పరెవరు రాజధాని వయ్యారాల సింగపూరు సిద్ధాంతులు
సరదాల దసరాల పాట -అయ్యవారికి చాలు అయిదు వరహాలు
పిల్లవాళ్ళకు చాలు పప్పు బెల్లాలు పాట పాత బడ్డది రామా హరి

ఇన్ బాక్స్

రాజధాని కొరకు సింగపూరు అయ్యవారు
ఇచ్చేటి బిల్లు కృష్ణా హరి
పండుగ దండగలా దాటి పోవును
పదేడు వందల కోట్ల డాలర్లు
పప్పు బెల్లాలైన ప్రజలకు మిగులునో లేదో
ఈ రాజధాని హోరులో.
(తుళ్ళూరు, మంగళగిరి, తాడేపల్లి మూడు మండలాల్లో, సింగపూర్ కంపెనీ డ్రోన్‌లు సర్వేలు జరిపి, పంట భూములిచ్చిన రైతులకివ్వవలసిన పరిహార భూమిని నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి అన్న వార్తలు చదివాక).

- రామతీర్థ 98492 00385

కవిత

అమీబావతి

కనిపిస్తోంది అమీబాలా తయారైంది సింగపూర్లో
అయ్యో అదొక నగర రాజ్యం మనదొక రాష్ట్ర రాజ్య వైశాల్యం
ఇసుక తక్కువైతే సింగపూరియన్లు
ఇతర దేశాలను తిరిపెమెత్తుకోవాలి
నేల తక్కువై నిట్ట నిలువు నిర్మాణాలకు దిగక తప్పదు వారికి!
ఇది అమీబావతి ఎటుపోయినా పోవచ్చు ఎటు పెరిగినా పెరగచ్చు
భూకంప పరిధిలో ఉందట, అయితే ఏం?
సింగపూర్, సీమాంధ్రుల సంపన్నుల క్లబ్‌లో ఎందరికట సభ్యత్వం?
ఎందరికట నిర్మాణ దాయిత్వం? రాయిపూర్ నడుగుదామా?
ఎంతకీ తెమలని రాజధాని రహస్యమేదో చెప్తుంది!
జార్ఖండ్ నడుగుదామా? అద్దె శాసనసభలో పద్నాలుగేళ్ళయి
అస్థిర వాసం చేస్తోంది!
కొత్త రాజధానులు కబుర్లలో స్వర్గాలు
కంప్యూటర్లలోనే వాటికి మార్గాలు
పోలికలో మన రాజధానితో పదోవంతు లేనట్టి సింగపూర్
కడుతుందట ఆంధ్రలో పదిరెట్ల పెద్ద రాజధాని!
సింగపూర్ సోదరులకు ఇది చేతికొచ్చిన లడ్డు
ఎవరు చెప్పగలరు అడ్డు?
తెలుగునాట రాజధాని బజా భజంత్రీల మోత మోగుతోంది
తెల్లారితే పత్రికల్లో, తెల్లార్లూ ఛానళ్లలో
అదిగదిగో స్వర్గమంట అరచేతికి అందుతూ!
అమరావతి గ్రామమా, కార్పొరేటు కుంజరాలు పైపైకి చొచ్చుకొచ్చే
నిన్ను చూస్తే జాలి! ఫలకాలూ, పథకాలూ, పతకాలూ ... అబ్బో!
జూదరాశి పెద్దయ్యలే అందరూ, జీవయోగ్య నగరాలుగా మార్చే నేర్పరులే!

చెప్పవమ్మా సింగపూరూ, ఎక్కడమ్మా నీ రైతూ?
నగరాల అమ్మవార్ల, నవ డిజిటల్ గణాచార్ల రద్దీలో ఎక్కడమ్మా నీ పంటా
చెప్పవమ్మా సింగపూరూ? అరశాతం భూమిపై ఒక శాతం జనాభా
ఉండిరంట రైతులూ, పంటలు పండేదీ ఆ అరశాతంలోపే!
ఉల్లిపాయ, ఉప్పుచేప అన్నీ దిగుమతులే
ఆకుకూర, అరటికాయ, పాలు, పళ్ళు, మాంసాలు రేవు దిగితేనే
సింగపూరు భోజనాల బల్ల అమరేది ఆహారాలతో...
సింగపూరు మోడలంట, జీవయోగ్య నగరమంట
అంతస్తుల పొరలుగా, భూమి రాక్ అరలుగా నిలువు పంట దారులంట
తొమ్మిదో అంతస్తులో తోటకూర, పదకొండో అరలో పాలకూర
ఎంత సూర్యుడికంత పంట అడుగున్నర అంతస్తుల ఆధునిక మడిలో
అదీ సింగపూరు - చాలీచాలని పంటలకు అతికీ అతకని ప్రయోగాలు!
రైతంటే ఉండేది సింగపూరు మ్యూజియంలో-
మలేషియా, ఇండియా, చీనా, ఇండోనేషియా, వియత్నాం, కంపూచియా
దేశాల నుంచి దిగుమతులయితేనే దినం గడుస్తుంది!
ఒక నగరం దేశం అయినప్పుడు
అంతా సముద్రంలోనే అంతమైపోతున్నప్పుడు
అదొక పరిమిత ముచ్చట!
మట్టీ మనుషులూ నిండిన దేశాలకు
సింగపూరు అంటే ఎద్దుబళ్ళు తిరిగినంత దూరం
మాది ఏ మోటారు బళ్లూ సాల్లేని భౌగోళిక వైశాల్యం
అది ఎలా తెలుస్తుంది నీకు సింగపూరు వ్యాపారీ?
సింగపూరు గొప్ప దేశం అన్నది మీరు రోజూ చేసే భోజనమంత అబద్ధం
సింగపూరు వ్యాపారావకాశం ఒక నగర దేశానికి
అన్నది దేశాదేశాల దిగుమతులంత నిజం
మంది తక్కువైనప్పుడు మజ్జిగ చిక్కనే
నగటు డాలర్ల రాబడి తలసరిలో అమెరికాను మించడం
గణాంకాల గారడీ!
మహా అయితే పెద్ద దేశాలు గమనించి
ఊరుకోదగిన అల్పసంఖ్యాక పౌర దేశపు అసాధ్యం
నీటిని ఎడం పెట్టి నేల చేసుకోవాలి మీరు
ఎంత ఏమున్నా నేల లేని పేదవాళ్ళు
నిటారుగా నిట్ట నిలువుగా ఎదగాలి తప్ప
అడ్డంగా వ్యాప్తి చెందడానికి మీకు అడ్డంకులు అసంఖ్యాకం
తివిరి ఇసుమున తైలము దీయవచ్చు, నిజమే,
ఇసుక పోసి నేలను తీశారు మీరు
లక్షల టన్నుల ఇసుకతో ఇరవై చదరపు కిలోమీటర్ల
నేలను సృష్టి చేశారు!
అయినా దానికీ పరిమితులున్నాయి
సాధ్యాసాధ్యాలున్నాయి
సింగపూరు మోడల్ అంటే, తినడానికేమీ పండని,
తాగడానికేమీ దొరకని, గాజు మొహాలేసుకు తిరిగే
కాంక్రీటు చర్మాల కారడవి!
రోజూ డాలరు గుండె చూసుకోవల్సిందే
రెండు విశాఖపట్నాలంత లేని, ఒక కలకత్తాలో సగం కాని
గాజుబొమ్మ దేశమా, సింగపూరు రాజ్యమా,
తేలుతుంది చరిత్రలో మా రాజధాని తలపాగా కట్టడం
నీకు తలకు మించిన బరువని!!

- రామతీర్థ
98492 00385

ఆదివారం

కవిత

కాళీ నా పాళీ

[illegible]
[illegible]
[illegible]
[illegible]
కాళీ నా పాళీ

[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
కాళీ నా పాళీ

[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
కాళీ నా పాళీ

[illegible]
ఈ కాళీ నా పాళీ
[illegible]
[illegible]
[illegible]
ఈ కాళీ నా పాళీ

రెండు వేల ఏళ్ల రాళ్లూ మనిషి పక్క మున్నాయి
తెగించి పోరింది. ఎగబడి పీకింది. కత్తులతో మాత్రమే
చెత్తగాల
ఈ కాళీ నా పాళీ

అదిగో సింహాన్ని కాముకిస్తుంది పోరాట యోధురాలికే
మద్యం ప్రేమించే పరిణామ శీల మద్దం మనిషి
మతాల మోకాలు వాటిని బలి తీసుకోలేవు
లోలోపలి చీకటి గుహాల మత మౌఢ్య
మూలపురుష్యుల సృష్టి అయిన
ఈ కాళీ నాపాళీ

అందుకే వేటకు బయలుదేరింది కాళీ
ప్రళయ భీకర ప్రతీకలు
మతాతీతంగా వస్తువడిపోతున్నాయి
ప్రాంతాతీతంగా వెలకట్టిస్తున్నాయి
నలుదేశాల నుంచి భారతి భారతి నిరసనలు
అతి స్పష్టం
మనిషి పక్క మతానికి తప్ప మనిషికి చోటులేని
ఈ కాళీ నా పాళీ
అందుకే బహు భాషల్లో పలుకొత్తుతే
కాళీ నా పాళీ

-రామతీర్థ
సెల్: 98492 00385

ద్రోణాచార్యుడి తరగతి గది

దేశం ఒక ద్రోణాచార్యుడి తరగతి గది!
లోపలికెళ్ళాలంటే ద్వార తోరణాలుగా
కులాహంకార జంఝుప్పోసలు బహుకాలమై
వినియోగంలో ఉన్నాయి
రేపు తయారవబోయే శాస్త్ర విద్యార్థులంతా
ఇవాళే శవాలుగా
రహస్యంగా తమ అంత్యక్రియలు నిర్వహించమని
దరఖాస్తులు పెట్టుకుని
వరుసలుగా నిలబడి ఉన్నారు!
విశ్వ విద్యాలయాలు జారీ చేసిన
జీవన్మ తులన్న యోగ్యతా పత్రాలు
మెడల్లో వేళ్లాడుతూ ....

దేశం ఒక ద్రోణాచార్యుడి తరగతి గది!
అడుగు పెడుతూనే
నీవు కులమే అయినందుకు వ్యాకులమైపోతావు
వేర్పాటువాద వివాద ప్రౌఢిమలో
కంచు ఢక్కలు పొందిన పండిత వషభాలు
ద్వాపర యుగం నుంచి పెద్దగా మారలేదు
అవటానికందరూ కౌరవులే అయినా
సామరస్యం, సహిష్ణుతా నేర్పాల్సింది పోయి
వైషమ్య పాఠాలు నేర్పిన వైదుష్య ధురీణులు
ద్రోణులు –
రక్తపాతాన్ని పాఠాలుగా చెప్పిన కఠోరులు
ఇంతా చేసి అన్నదమ్ముల పోరుకు
సగం భూమండలం నష్ట పోయిందానాడు
ఆచార్యులు అఘోరించిన ముదనష్టపు పాఠాలవల్ల ...
అస్త్రాల మర్మాలు చెప్పారు తప్ప
ఆహ్లాద సూత్రాలు నేర్పలేదు
జీవితం ఒక విల్లెక్కుపెట్టిన, కత్తులు దూసిన
మరణరంగం అని బోధించారు తప్ప
జీవితపు అమోఘ శాంతి
సమస్త జనుల సమష్టి కృషి ఫలితంగా
కలిసి, కలగలిసి నిలబెట్టుకోవాలని ఉపదేశించలేదు
యుగాలముందరి పాఠాలే ఈనాడూ
'ప్రచండమైన పగలకు కొత్త బట్టలు తొడిగి
పట్టుపుట్టాలు, జ్ఞాన భాండాగారాలు,
సాంస్కృతిక వైభవాలు తామే అని, తమవే అని
తలపోసే కులశేఖరులందరూ
ఆచార్యత్వాల అహంకార సామ్రాజ్య రక్షకులమ్
తామే అని సంభావిస్తూ
కురుక్షేత్రాల నుంచి కులక్షేత్రాలదాకా మాత్రమే వచ్చారు!
యుగాలు గడిచినా
ఆచార్య దేవోభవ అని ప్రణతులర్పించాల్సిన
పేద, సాద, బడుగు, బలహీన దళిత శ్రేణుల
ఛాత్ర పరిషత్ విస్తుపోతోంది!
తమ కన్నా ముందరే
'కుల దేవోభవ' అని ఆచార్యులు
అభినందన సహస్రాలు ఆచరిస్తుంటే ...!

దేశం ఒక ద్రోణాచార్యుడి తరగతి గది!
ఏకలవ్యుల బొటనవేళ్లే
ఇక్కడ పాఠాలు చెప్పే సుద్ద ముక్కలు
అణగారిన జాతుల అణిగిపోని జ్ఞానతృష్ణ
విద్యా వికాస శిఖరాలకై అంగలార్పు
అంతా గోరీలకే పరిమితం అంటున్న
ఆచార్య వర్గాలు, ఆధిపత్య జాతులు, పాలక పక్షాలు,
చూపులోన, చేత లోన, మాట లోన, సైగ లోన
ఇంకా నోరెత్తక సాధిస్తూ
ఆత్మలను హత్య చేస్తున్న ప్రావీణ్య కళకు
నవీన టెక్నిక్కుల పురాతన రాజధానులు ..

దేశం ఒక ద్రోణాచార్యుడి తరగతి గది!
పిల్లలపై వివక్షల 'వికత కళాప్రపూర్ణ'లమలు చేసే
జీవన్మరణ సమస్యల వినోద వల్లరి
తలారులెవరూ ఉండరు
అయినా తలలు తెగి పడుతూనే ఉన్నాయి
పసులు కాసే పిలగాడా, పందుల మేపే పసివాడా,
యానాది సెందురుడా, ఆదివాసీ అక్షరాభ్యాసీ,
కన్ను తెరిచింది మొదలు ఎన్నో అడ్డంకుల మధ్య
చదువుల నిచ్చెన ఎక్కి వస్తివా
విశ్వ విద్యాలయపు గోడలు నిన్ను భయపెడతాయి!
ఒక ప్రొఫెసరు, ఒక పోలీసు స్టేషన్,
ఒక హాస్టల్ వార్డెన్ , ఒక కుల రక్కసి
ఎన్నో ఏండ్లు గతించిపోయినా
క్రూరమ గాలు తిరుగుతున్న విద్యారణ్యమది
అడవికి నీతుండదు
కాలు దువ్వుతుంది, కొమ్ము విసురుతుంది,
చందనపు చారల చిరుత పులులూ,
విబూది పూసుకున్న విషనాగులూ,
జపం చేస్తుంటాయి, నెపం నీ మీదే ఉంచుతాయి
ఏటి దిగువన నీరు తాగే మేకపిల్లవు నువ్వు
ఎగువనున్న తోడేలు పిల్లలు
స్థాన బలిమితో నీతో కుతర్కానికి దిగుతాయి!

దేశం ఒక ద్రోణాచార్యుడి తరగతి గది
రారమ్మంటున్నా చదువులకు– గైడ్లను కేటాయించరు
స్కాలర్ షిప్పుల విడుదల ఉండదు
మెస్‌బిల్లులు ఉరుముతూ చూస్తాయి
కులరక్కసులు వెక్కిరింత దండలతో రోజూ గౌరవిస్తారు
సమర్పించిన పేపర్లు దిద్దడం ఉండదు
చిత్రహింస చాలా గౌరవంగా ఉంటుంది!
అరిస్తే నువ్వు అరవాలి తప్ప
గురివింద గురువులకు కించిత్ కదలిక రాదు!

తెలుసుకుంటావు నాయనా!
ఆత్మలను హత్య చేయడంలో
నవీన రీతుల శాపం, శిక్ష, వివక్ష, వెక్కిరింత
దేశమంత ద్రోణాచార్యుల తరగతి గదుల్లో
దశాబ్దాలుగా జరుగుతున్న అహర్నిశల అత్యాచారం!
ఆత్మలతోనే పనివారికి .. వాటిని ధ్వంసిస్తే చాలు!
దేహాలనెలాగా మీరే నష్టపర్చుకుంటారు కనుక !!

'నా పుట్టుక ఒక ప్రాణాంతక తప్పిదం' అన్నాడొక వ్యథార్తుడు
అక్షరారాధకులుగా వచ్చే వారిని కులం అస్త్రం చేసి
ఆత్మలను హత్య చేసే ప్రావీణ్య విషయంలో
డాక్టరేట్లు పొందినవారు చెలరేగుతున్న
విద్యారణ్యాలతో నిండిపోయిన
ఈ దేశం ద్రోణాచార్యుల తరగతి గది!
పాఠం పీకల మీదికొస్తున్నప్పుడు
తండోపతండాల ప్రశ్నగుర్తులుగా విద్యార్థులు వీధుల్లోకొస్తారు!
తరగతి గది గతి మారుస్తారు
తీరు మారని ద్రోణులు జాతి ద్రోహులని ప్రకటిస్తారు
విశ్వ విద్యాలయాల కుల రాక్షసాల మీద
బలిమి గల కులాల రాజసాల మీద
తమ మరణాల పేడ ముద్ద విసురుతారు

ప్రాణాల్ని బాణం చేసి సంధించినవాడా!
నువ్వొదిలిపోయిన నీ ఒళ్ళు
బాణం వేసేందుకు ఎక్కు పెట్టిన విల్లు
విడుదలయిన ప్రాణబాణం
అన్ని విద్యారణ్యాల్లో చేసింది ఒకే గాయం!
అదే వేలాది గొంతుకలై
దిక్కులు పిక్కటిల్లేలా కోరుతోంది ఒకే న్యాయం
కావాలి నాయనా రేపటికి
నీ పుట్టుక ఒక ప్రాణానంద శోభితం!!

– రామతీర్థ
98492 00385

కవిత్వం

కరెన్సీ వేస్ట్‌లాండ్

కవిత్వం

ఆంగ్లేయుల దేశమా! అత్యాశా పాశమా!!
ఏ రాజ్యం మిగిలుందని ప్రజా స్వామ్య యుగంలో
మిగుల్చుకున్నావు ఇంకా నీ పేరులో కింగ్ డమ్?
అతి పాశ్చాత్య అమెరికాకు యూరప్‌లో భ త్యరికం
చేయడమే తీరుగా చూస్తున్నాము

ఏడు దశాబ్దాలుగా నీ స్వింగ్ డమ్!
నా బ్రిటనూ, నా లండనూ, నా పౌండ్ స్టెర్లింగూ
అంటూ బయలుదేరిన కొత్త కోడిపుంజూ!
ప్లెబిసైటు పేరిట నీ మీద నువ్వే వేసుకున్న వోటు
యూరప్ సాంస్క తిక అఖండతపై వేటు

కలిసి ఉంటే కలదు దుఖం అనుకుంటూ
బయలుదేరుతున్నావు పాత సముద్రాల మీద
పాత దురాకాంక్షలకు కొత్త పేర్లు పెట్టుకుని
వలస పాలన రోజులు కావు
దేశాల విలువలు, సంపదలు ఓడలకెత్తి
తరలించుకు పోవడానికి
పోతూ పోతూ పాలిత దేశంలో వారికి తగువులు పెట్టి
తగిలించి తమాషా చేయడానికి-
కాలి సంకెల అనుకుంటూ కాలదన్నావు
నీ పుట్టి గడ్డ యూరప్ తో నెత్తుటి బంధాన్ని

కరెన్సీ కాదది మార్చుకుంటే మారడానికి-
వేల ఏళ్ల మానవ పరిణామ గంధం!
గొప్ప దేశంలా కాక చిన్న ద్వీపంలా ప్రవర్తించావు
వ్యక్తి గొప్ప, ప్రాంతం గొప్ప, దేశం గొప్ప
సాలెగూటిలో చిక్కుకుపోయి మాట్లాడుతున్నావు

పౌండ్ తెరచాపతో రక్తదాహాల సొర చేపలా
బయలు దేరుతున్నావు లోకాలు గెలుద్దామని
అమెరికా భత్యరికంలో అయిన వాళ్ళను వదులుకుని-
కాపిటలిస్ట్ కుమ్ములాటలో
నీ విశ ంఖల ఒంటరితనం మొదలయింది
సహ ప్రాంతాలను కోల్పోతావు
సార్వత్రిక సాంకేతిక స్వార్థ శ్రేణి యుగంలో
ఎవరూ సమూహంగా వోటు వేయలేదు
ఒంటరి ఒంటెలు గానే వేశారు-

అందుకే సమీప భావిలో
శతాబ్దాల స్వతంత్రతా స్వరాలు
స్కాట్లాండ్, ఉత్తర ఐర్లాండ్
నీవు నేర్పిన విద్యను నీకే నేర్పుతాయి
నీ జెండా నుంచి తమ అందాలు చించి పట్టుకుపోతాయి
నా కరెన్సీ నాదని అన్నానని అనుకుంటున్నావు కానీ
జాతి ద్వేషాల రంగుల్లో ముద్రణయ్యే కొత్త పౌండ్
షేక్స్ పియర్ చెప్పినట్టు
రోజూ ఒక పౌండ్ నీ మాంసమే కోరుతుంది

లండన్ బ్రిడ్జ్ ఈజ్ ఫాలింగ్ డౌన్, ఫాలింగ్ డౌన్
ఒక సహస్రం పాటు మేధా వారధి గా నిలిచిన
లండన్ వంతెన పడిపోతున్నది పడిపోతున్నది
అలనాడు ఇలియట్ మహాకవి అన్నాడది సత్యం
అతి పూజిత అతి కామిత అతి శ్లాఘిత ఇంగ్లాండ్
కరెన్సీ సింహాసన భ్రమణంలో కళ్ళు బైర్లు కప్పి పోయిన
నువ్వు యివాళ నిజంగా ఒక వేస్ట్ లాండ్ !
నువ్వు రాబోయే పెట్టుబడిదారీ ప్రపంచ విస్ఫోటాల బ్లాస్ట్ లాండ్ !!

- రామతీర్థ
98492 00385

Hollow men poem by T.S.Eliot

Hollow machines

M/s Big Notes –they dead
Two pennies for the old bills
I

We are the hollow machines
We are the stuffed machines
Waiting in all weathers
Headpiece filled with cash-ash. Alas!
Our static money vents, when
We cough together
Are quiet and meaningless
As no notes in the inner slots
Or mouse with out tail sliding on a pad
In a AC glass chamber

Shape without form, shade without colour
Paralysed value, dead emotion without Gesture

Those who have crossed
With expectant eyes, to despair's
Other shore
Remember us – if at all- not as lost
Dried out contraptions
But only as the man made
Hollow machines
The stuffed machines

Paraphrased by Rama Teertha
Depicting the Indian currency drought

కవిత

స.భ.

భారతంలో పర్వాలు కలగాపులగమయ్యాయి
సభా పర్వాలన్నీ అరణ్య పర్వంలోకి చొచ్చుకెళ్ళాయి
చావు బతుకుల జూదాలు,
అవయవాల పెకలింతలు, గుడ్డలూడదీతలు
పర్వాల సందిగ్ధ క్షోభ వర్తమాన ద శ్యం
సాహిత్యం తీసుకురండి, తప్పక తెండి
అది సభకు అవసరం
ప్రయాణపు పెట్టెలు, అవీ తీసుకు రండి
వంట పాత్రలూ, ఎండు కట్టెలు, అవీ తీసుకు రండి
అయ్యా, అవీ కావాల్సినవే, వెయ్యండి బండిలో
ఆహ్వానాలు అందరికీ అందాయో లేదో
ఎస్సెమ్మెస్ లయినా ఇచ్చారా జాగ్రత్తగా
అవును సర్, షాట్ మెసేజ్ సర్వీస్‌లో తెలిపాం
ఇంకా బళ్ళకెత్తారా పనిముట్లూ, పరికరాలూ
అంతా రెడీ సర్!
పదండి బహు పరాకుగా సభ కెళ్దాం
పదండి పిల్లి అడుగులతో సభ పెడదాం -
నాయనలారా, సభలకు నగరాలున్నాయి
జనావాసాలున్నాయి అక్కడ చూసుకోండి
సభా పర్వాలతో అరణ్య పర్వాన్ని అక్రమించకండి
ఇది జీవన భారతానికి విరుద్ధం
అంటున్న వ్యాసులందరి మీదా ప్రజలను రెచ్చగొడ్తున్న
నేరం ఆరోపించబడింది
సభా మర్యాదల సంరంభాలన్నీ
అడవికొండలోకి ప్రవేశించాయి
అగ్గి మొగ్గ లక్క ఇల్లు
అది దాటితే అడవికెళ్ళు
సభకు అధ్యక్షులు, ముఖ్య వక్తలు,
రౌరవాతిథులు ఎవరేం చెప్పారో
ఎంత హింసా రిరంస విలయాన్వితమయిందో
అడగ రాదు
పరికరాల, పనిముట్ల వాడకంలో
దంథన సమర్పణ, థన్ థనా సమర్పణ
మాత్రం చేశారు
సభ జరిగింది, సభ జరిగి పోయింది
సభ జరుగుతూ ఉంటుంది ఇంకా ఇంకా
కొందరు అదవంటుకున్న అన్యాయంలోంచి
లాఘవ రాఘవీయంగా బయట పడతారు!

సభ అంటే సర్వ భస్మం
అది జరిగినప్పుడు ఒకటే దాఖలా
శవాలుంటాయి, సవాళ్ళుంటాయి
మిశ్రమ స్పందనలుగా కాసినోలు, కార్నివాల్లూ
ఎద్లూ, ఎలుగుబంట్లూ షాక్ ఎక్స్చేంజ్లూ ఉంటాయి
మనకు తెలుస్తుంటుంది మనల్నే చంపేస్తున్నారని
తెలుపుతుంటారు కూడా!
అయినా అక్కడ మనల్ని మనమే గుర్తు పట్ట లేము
తూటాలు మంచివే, ఒక్క దెబ్బకు చంపేస్తాయి
చిత్రహింసలు చేయవు
సభలో మిగిలిన కట్టెలు బాగుంటాయి
కట్టెలై పోయిన మనుషుల కన్నా
చిత్రహింసాతి హింసల స్వాగతంతోనే కదా
సభ మొదలవుతుంది!
అడవిలో, అరణ్య పర్వంలో చిక్కుకున్న
సభల గురించి, సభా పర్వాల గురించి
అక్కడి చెట్లూ, చిట్టిలుకలు కూడా మాట్లాడవు
మాట్లాడవు అంటే మర్చిపోయారని కాదు!

- రామతీర్థ

('త్వమేవాహం'లో చెట్లూ, చిట్టిలుకలు అన్న అరుద్రకు కృతజ్ఞతతో)

Field bank Piano

Daily at dawn tossing a cloud on my shoulder
I go to the farming
The trees who tucked in the tresses
stars picked during the night
plant letters in my fields
folding at navel the iridescent sari –ends
the sky and the peacock break into a song
and the dance of the birds
on the farm bank piano is taken for granted

I use myself as manure
For every letter planted
And I leaf afresh as a smile of the nation
At the end of every sprouted sentence

A crescent moon, or a cottony fog, or a cataract
Change their duties and bring me
The breakfast
That's how the altos of life
Continue year long
The primordial human dream
That has bloomed throughout
Length of time
Now comes in as abundant yield

I place the yield in my hand
For sale in the world markets
And announce peace as the rate
The summit meets of leader as usual happen
Know not which loans will be cleared in what ways
But the nature patting my back
places in my hand the loan waiver declaration
The pesticide drinking me becomes elixir
Tossing me into a flight
The noose fragrantly blossoms
All the souls of farmers who departed half the way
Come down as soothing showers on me
I am just a farmer, Sir, a day dreaming dimwit.

Telugu Original – Dr Prasadamurthy
English Translation - Rama Teertha .

- Taken from the book 'Chenugattu Oiano', which was released during Yanam Poetry Festival 2016.

ఎనభయ్యేళ్ళ 'కవితా! ఓ కవితా!'

"కవులు ప్రపంచపు అనధికార శాసనకర్తలు" అని ఆంగ్ల మహాకవి షెల్లీ 1821లో అన్నాడు. ఈ కవి నమ్మింది కవులు తత్వవేత్తలనీ, నైతిక సాంఘిక ప్రవర్తనా నియమావళి రూపకర్తలనీ, కవి కల్పనలే సమస్త శాస్త్రీయ పురోగతికి మూల చోదకాలనీ ఆయన విశ్వసించాడు. షెల్లీ ఇలా రాసిన నూట పదహారేళ్ళకు, ప్రపంచంలో మరో మూల, మనకు దగ్గరగా మరొక యువకవి, కవిత్వావతరణ క్షణాన్ని తన విశ్వాక్షరాల్లో పట్టుకున్నాడు. ఈ యువ కవే మన మహాకవి శ్రీశ్రీ. ప్రపంచ సాహిత్యంలో ఎటు చూసినా, కవిత్వం దిగి వచ్చే, ప్రత్యక్షం అయ్యే, మంత్ర లిప్తలు ఎటువంటివో చెప్పిన కవి మరొకడు లేడు.

"ప్రశాంతతలో జ్ఞాపకం చేసుకున్న భావ బంధురత" అని వర్డ్స్ వర్త్ తన "ప్రిలూడ్ టు లిరికల్ బల్లాడ్స్"లో 1801లో ప్రస్తావన చేశాడు. ఆలోచన, ఆవేశాల కలబోత కవిత్వానికి తప్పనిసరి అంటాడు ఇందులో రెండు చోట్ల. దిగివచ్చే కవిత్వానికి ఎగిసిపడే స్వాగతాలు, ప్రళయార్భాట క్షణాల పారవశ్య ఘోషగా శ్రీశ్రీకి ముందర నమోదు కాలేదు. కవిత్వ రూపాన్ని తల్లిగా, చెలిగా భావించిన కవి పుంగవులు అనేకులు. కానీ ఒక విరాట్ స్వరూపంతో పెనుగులాట, ఆమె ప్రత్యక్షం అయినప్పటి యుగ నాదం, అందుకున్న కవులు ఇటు ప్రాచ్య, పాశ్చాత్య కవిత్వ లోకాన కనిపించరు. భారత భారతి అన్న వారూ, ఆమె కన్నీరు తుడిచే వారు, వాణి నా రాణి అన్న వారు, నా కవిత్వం నీకు నిత్య అలంకారం అన్న వారూ, ఇలా గొప్ప కవులున్నా, ఆవిర్భూత కవిత్వానికే వారు ఇచ్చే ఆశ్వాసనలు, చేసే నివేదనలు, తప్ప, కవిత్వావిర్భావ క్షణాలకు, ఆ ప్రసవ వేదనామయ సంతోష ముహూర్త సంఘటనలను ప్రేరేపించి, తన ఎదుర్రొమ్ముతో ఢీకొన్న కవిజెట్టి శ్రీశ్రీకి ముందు, మరొకరు లేరు. విన్న వెంటనే, వేదికపైనే ఆనందంతో కౌగిలించుకుని, వెయ్యేళ్లలో ఇటువంటి కవిత రాలేదు అన్న విశ్వనాథ సత్యనారాయణగారు సాక్షిగా, కవితా! ఓకవితా! కు (పొయెమ్ ఆఫ్ ద సెంచురీ) శతాబ్ది కవితగా విలక్షణ స్థానం.

అందుకే, "కవితా! ఓ కవితా!", ఇరవయ్యో శతాబ్దం తెలుగు కవిత్వంలో అత్యంత ప్రధానం అయిన కవిత. ఈ

> **నది మూలం, ఋషి మూలం అడగరాదు అన్నారు. అడిగి మరీ కవిత్వ మూలం కోసం శ్రమించి, తాను చూసిన, మనకు చూపిన కవిత్వావతరణ జ్ఞాన సిద్ధుడు యువ శ్రీశ్రీ. 'కవితా! ఓకవితా!' కవిత ఇరవయ్యో శతాబ్దంలో తెలుగులో వెలువడడం ఒక అపూర్వ ఘట్టం.**

కవిత వెలువడి, నేటికి ఎనిమిది దశాబ్దాలు. ఈ కవిత తాను ఏకధాటిగా రాశాను అని చెప్పారు శ్రీశ్రీ. ఆరువందల ముప్పై మాటల పరిమాణంలో, ఈ రచన మహాప్రస్థాన కవిత్వ సంపుటిలో అన్నిటికన్నా పెద్ద కవిత. కవి అనుభవ మండపంలోంచి, ప్రపంచానుభవ మహర్వాటిలోకి ఎదిగే, ఎగిరే కవిత. సబ్జెక్టివ్, ఆబ్జెక్టివ్ మధ్య హద్దులను చెరిపేస్తూ సాగే ఒక విధ్వంస నిర్మాణం. ఒక నిర్మాణ విధ్వంసం. కవితా! ఓ కవితా!లో దర్శనమిస్తుంది.

దశలుగా చూస్తే, అన్వేషణ, తపన, సేకరణ, విజృంభణ, స్మరణ, స్ఫురణ, శ్రవణ, దర్శన, సాధన, మథన, సమర్చన, సమర్పణ, సాక్షాత్కరణ, సంరక్షణ, కరుణ, ప్రతిజ్ఞ అనే పదహారు భావావేశ భాగాలుగా ఈ పూల దండ కనుల ముందర నిలుస్తుంది. కవిత ఆరంభంలో కవిత్వం అంటే ఏమిటో ఎరుగని తరుణ దశలో ఉంటుంది అన్వేషక స్వరం. కవిత్వాన్ని అందని అందానివిగా భావించిన రోజులవి. బతుకే తపమై ఒక్కడై స్రుక్కిన రోజులు. వేగంగా దశలు దాటుతూ ఈ కవిత పరిగెడుతుంది. తపన దశలో తపస్సమీక్షణ, సేకరణ దశలో ఏరి తెచ్చుకున్న ప్రోవుల కవిత్వ దినుసులు, విజృంభణ దశలో అందిన భూకంపాల, విప్లవాల విలయ లయ ఘట్టాలూ, స్మరణ దశలో దృశ్యాలూ, భాష్యాలూ, స్ఫురణ దశలో ఎదలో కదలాడిన శిశువుతో మొదలై, చీకాకుల శోకాకుల లోక చిత్రాలూ, శ్రవణ దశలో విన్న పాటలూ, పల్లవులూ, పిచ్చోడి గుండెలో గూబ అరపులూ, కప్ప బెకబెకలూ, కార్మిక జన సంక్షోభ సంధ్యలూ, దర్శన దశలో నక్షత్రాలు, జలపాతాలు, సముద్ర తరంగాలు, సాధన దశలో, వెనక్కు మళ్లిన నిఘంటువులు, చంధో బందోబస్తులు, పాము కౌగిళ్ళు, మథన దశలో భ్రమణంలో, చంక్రమణంలో, పరివర్తనంలో. సమర్చన దశలో సకాలేంద్రియ శ్రద్ధా గతిలో, సమర్పణ దశలో చుక్కల నెనరు పుట్టుకల పాటల పండుగలో, నాడుల తీగలపై నాద బ్రహ్మ నాట్యంలో మాటలకందిన నైరూప్య శబ్ద సంచయాల దివ్యానుభవం, బ్రహ్మానుభవంగా, సాక్షాత్కారణ దశలో, కవిత శిఖరాగ్ర స్థాయి చేరుతుంది.

ఇదే సాక్షాత్కార కవిత, కవిని సంరక్షిస్తుంది, అభయముద్రతో. కరుణ తన సారమని విశద పడుతుంది. ఈ చలన వేగాల కవితలో, కవి, పొందిన అనుభవం నుంచి, తిరిగి కవిత్వం రాయాలని ప్రయత్నిస్తాడు, జనుల కోసమే తన కవిత అనే లక్ష్య సిద్ధి సాధ్యమేనని సుదృఢంగా భావించి, తనకు ఒక మహత్తర క్షణాల సాక్షాత్కరించిన కవితామతల్లిని సాకారం చేసుకుంటూ తన కవిత్వం, అదీ అందకపోయే ఆమె చెంగుల కొస గాలులతోనే, తన నుడి గుడిగా నిర్మిస్తానని ప్రతిన పూనుతాడు. అది రస ప్రవాహిని అయిన పుప్పొడి ఏరు, పూల హోరు. ఈ కవిత ముగింపులో, కవి ఇప్పుడు, కవిత్వ సృజన దక్షుడు. తన ఊహాకాశాలు లోకాలకు చేరువ కావాలని, ఆదర్శాలు సోదరులకై వెలుగుల రవ్వల జడులు కావాలని లోక హితం కోరే సనాతన చార్వాకుడు. దర్శనంలో, సబ్జెక్టివ్ ఏదైనా, అది ఆబ్జెక్టివ్ విశాలత నుంచే ఏర్పడాలన్న భౌతిక వాదానికి, తన కవితను ఒక వితర్ది చేసిన సాహసికుడు. ఇది మా కవిత్వం అని చెప్పుకున్న ఆత్మ నాడీ పరీక్షల పరిధిలోనిది కాదు ఈ కవిత. కవిత్వం పుట్టుకను కాలంలో నిలిచిపోయే ఒక ఫ్రీజ్ ఫోటోగా, కలం చిత్రంగా నిలిపిన కవిత. నది మూలం, ఋషి మూలం అడగరాదు అన్నారు. అడిగి మరీ కవిత్వ మూలం కోసం శ్రమించి, తాను చూసిన, మనకు చూపిన కవిత్వావతరణ జ్ఞాన సిద్ధుడు యువ శ్రీశ్రీ. ఈ కవిత, ఇరవయ్యో శతాబ్దంలో తెలుగులో వెలువడడం ఒక అపూర్వ ఘట్టం. ఎంతో శ్రమిస్తే కానీ, అటు భారతీయ సాహిత్యంలో, అలాగే ప్రపంచ సాహిత్యంలో, ఇలా కవిత్వం దిగివచ్చే దృశ్యం మరో చోట అక్షరాలుగా కనిపించదు. నిర్వచనాలు, వర్ణనలు, స్తుతులు, ప్రతిజ్ఞలు, కొల్లలుగా చూపవచ్చు. సాహిత్య సందోహంలో, ఇది వచనంలో రావణ కృత శివ స్తోత్రం వంటిది. తన పేగులపై ఆ ద్రావిడ బ్రహ్మ మోగించిన సంగీత ఝుంఝు, ఈ వచన కవితలో అంతటా పరచుకుని ఉన్నది. బాణోచ్ఛిష్టం జగత్సర్వం, అన్న ఒక ప్రాచీన మహా కవి వలె, మన కాలపు మహాకవి నభూతో అయిన స్వరంలో ఈ కవిత్వం ద్వారా ప్రవచించిన సత్యం ఇదే "కవితోత్కృష్టం జగత్సర్వం".

■ రామతీర్థ

(నేడు శ్రీశ్రీ 34వ వర్ధంతి)

ఆంధ్రజ్యోతి Thu, 15 June 2017
epaper.andhrajyothy.com/c/19805534

అవిశ్వాసం - అశ్వరభశ్వరభ

కన్ను గీత, కౌగిలింత
పాలకులు ముగ్ధమోహనంగా ఉన్నారు
ప్రజలే గందరగోళంలో ఉన్నారు
పన్నెండు గంటల ప్రత్యక్ష ప్రహారం
తట్టుకుని దేశం నిర్వికారంలో ఉన్నది
అందరూ అవధులు మించి నటించారు
పాటలు పాడుకున్నారు
నోటికొచ్చిన కవితలూ చెప్పారు
సినిమా పేర్లైతే పేలించారు
ఒక జనాదేశ ఆధికార చివరిదశలో
అందరూ గాలిలో కత్తులు తిప్పారు
ఇగిరిపోయిన ఉద్యోగాలకు,
చివరి కోటి దాకా తిరిగొచ్చిన నోట్ల జమకు,
మరణించిన రైతన్నల వైఫల్య బాధ్యతలకు
లక్షల కోట్ల ఎగవేత అప్పులతో దేశాంతరాల
పలాయన వ్యాపారుల విషయాలకు
దేశం కళ్ళలో కళ్ళు పెట్టి చూడలేని వారు
వందల సంఖ్యలో ఉన్నారక్కడ
చౌకీదార్లైతే దోపిడీ వర్గాలకు విమాన యానాలు
వజ్రాల అమ్మకాలకు బాంక్ ఋణ మేళాలు
వరి పంట రైతుకు సహాయ తిరస్కారాలు చేయరు
భాగీదార్లైతే ఉపాధికి యువతని దూరం చేయరు
పరిశ్రమల అభివృద్ధిని శిలా ఫలకాలకు పరిమితం చేయరు
పదవుల కాంట్రాక్టర్లుగా రంగు రంగుల కండువాల వీరులు
సభ నిండా / మాయాబజారులో పాండవుల్లా
ప్రజల పేరు వినిపిస్తూ ఉంటుంది
కానీ వారెక్కడా కనిపించరు
గణాంకాల గందర గోళంలో అక్కడికి వారినెవరు పంపారో
ఆ సామాన్య భారతీయుడి గుర్తు లేదేవరికీ
కొందరికి కుర్చీ లాలస / కొందరికి హోదా తహతహ
కొందరికి జాతి భజన, కొందరికి మందిరాల శ్రద్ధ
కొందరు రవాణా వాహనాల కొనుగోళ్ళు చూపి
అవే ఉద్యోగాలను కల్పించాయని చెప్పే చతురత
ఏడు పదుల ప్రజాస్వామ్యంలో
ఏడుగడగా ఎదగాల్సిన దేశ స్వాతంత్ర్యం
ఎవరి పెరళ్ళ లోకో పూలూ కాయాలూ కాస్తున్నది
అడవి ఇదే మాట అంటున్నది
కడలి ఇదే రొద చేస్తున్నది
పల్లెల శూన్యాలు ఈ సభని భయపెట్టాలి
డబ్బు లేని ఆర్భాటాల ఏ. టీ. ఎం. లాగా
ఈ దేశపు సగటు రాజకీయ గణ తాంత్రికులు
అయిదేళ్ళకోసారి ఎన్నికల పూజలకు మాత్రం సిద్ధం
ప్రజలు వారి పరిగణనలో
కుంకుమ, పసుపూ, నిమ్మకాయ, కోడిపెట్ట
ఎర్రముగ్గు, వేప మండా
ఇక చూడండి / తాంత్రిక ఎన్నికల్లో
దేశాన్ని కొత్త దెయ్యాలు పట్టుకుంటాయి
నాయకుల కీర్తి మంత్రాల నడుమ
దేశం అంతటా ఛిద్ర పూజలే
ఏమీ తోచనప్పుడు అవిశ్వాసం ఆట ఆడుకోవచ్చు
ఉత్తుత్తి పూతరేకు కత్తులతో ప్రదర్శనలు చేసి
ఆలింగనాల గందర గోళం ప్రజలకు కానుకిచ్చి
అవిశ్వాసం పులిముగ్గు ఆటలో
మేకలన్నీ బయటే ఉన్నాయి బహు వినయంగా
వాగ్దానాల కత్తులతో అయిదేళ్ళకోసారి
క్రతువుకొచ్చే గణ తాంత్రికుల తాజా రాక కోసం.
అశ్వరభశ్వరభ

- రామతీర్థ
98492 00385



పంచ సప్తతి శివః

రామతీర్థ

ఉప్పు తక్కువ సముద్రాలకు
ఉపకారం వాడురా
బుద్ధి తక్కువ రాజ్యాలకు
తేపంచాకరి వాడురా
మూడు పాతికలు నడిచిన
జనాంజనం వాడురా
కలమెక్కిన పై పింగిలేల
అడవి పిందవ వాడురా
నగరమెచ్చిన మోటుగాడు
పల్లె పైరే వాడురా
కార్మికి వారి పాలవు
జగన్మెనె వాడురా
ఎమ్మె చదువుల బల్ల పై
విశాఖ బిడ్డే వాడురా
రక్తం గ్రూప్ మార్క్యడిన
మనిషి నాల్క వాడురా
చర్మాల అనివార్యత తెలిపే
లోయ పాటే వాడురా
లోకం చెరువులో ఈదులాడే
చేప నేస్తం వాడురా
కూచిపూడి పాఠశాలలో
చెందు నేర్చిన వాడురా
మనిషిని మెరుగు పెట్టే
కైత కోకిల వాడురా
ఎండు చీకట్లను వెల్కరించే
కన్నీటి నాగలి వాడురా
గుండె పగిలిన పల్లెల
రగులు కన్న వాడురా
దిగులు గువ్వల గుబులెరిగిన రాత్రి గూర్ఖా వాడురా
ఖండాల నడుమ తిరిగే
అజేయ పతాక వాడురా
వాడురా ప్రయోగాలకు సదా రెడీ
కవి ఫిరంగి శివారెడ్డి
ఏముందా సంచిలో ఏముంది
ఒక మూటలు పెట్టిన పెట్టె
గగనమంత తలలున్న అమ్మల పొది
మూడు పాతికల గురి తప్పని
అక్షరాల ప్రాణ పరిమళం
స్నేహ శీల యుద్ధాలకు
సాయుధారణ్యం వాడురా
లోకం స్వేచ్ఛా గీతం అనే
నడ గాలిపటం వాడురా
ఎద లోపలి తుఫాను పయోలిప్తకు
సజల కమాను వాడురా
శివారెడ్డి అంటే కదలి గుడారం తన కవిత వెండి కుటీరం
మూడు పాతికలు రెట్టింపైనా బతుకు ఉగ్గు గిన్నెలో
లోకాలకు బువ్వ పెట్టు తల్లి పేరు శివారెడ్డి
మూడు పాతికల బతుకు సారం
చేత మన్ను ముద్ద శివారెడ్డి చెంగల్వ పూదండ శివారెడ్డి.

లోకయాత్రికుడి విశేషయాత్ర

అటల్ బిహారీ వాజ్‌పేయి. ఆయన పేరుకి అర్థమే లోక యాత్రికుడని. ఐక్యరాజ్యసమితిలో యువ రాజకీయవేత్తగా అత్యద్భుత ప్రసంగం చేసి భారతీయ ప్రతిభను విశ్వవ్యాప్తం చేసినా, అణు పరోక్ష వలసవాదానికి (ఇండైరెక్ట్ న్యూక్లియర్ కలోనియలిజం) వ్యతిరేకంగా, అమెరికా నిఘా సంస్థలు కనిపెట్టలేని వ్యూహంతో భారతీయ అణు వైజ్ఞానిక రంగాన్ని సాహసోపేతమైన అణు బాంబు పరీక్ష ద్వారా ముందుకు తీసుకు వెళ్లినా.. భిన్నరంగాల్లో జీవన ఆసక్తులు, నైపుణ్యాలు కలిగిన ఈ దేశ రాజకీయవేత్తల తరానికి చెందిన చివరి దార్శనికుడుగా భావించదగిన వాడు.

పదవులకు వన్నె తెచ్చిన మానవ శిఖరం ఆయన. తను ప్రధానిగా ఉన్న కాలంలో, అలవి గాని ముఖ్యమంత్రులకు 'రాజధర్మం' అంటే ఏమిటో తెలియచెప్పేందుకు సహనశీల ప్రయత్నం చేసినవాడు అటల్ బిహారీ వాజ్‌పేయి.

ఆయన ఉన్నత సంస్కారం గల భారతీయ పౌరుడు. భారత మాత పుత్రుడు. వక్త, రచయిత, కవి, భారతీయ సంస్కృతీ జ్ఞాన సంపన్నుడు, ఇటువంటి విశిష్ట మూర్తి ప్రస్తుత ఓట్ల, నోట్ల, సీట్ల, ఫీట్ల రాజకీయ రంగంలో కనిపించడు.

హిందీ కవిగా కూడా ఉత్తర భారత సాహిత్య లోకానికి చిరపరిచితుడు. విలువల రాజకీయాల స్థాపనలో వజ్ర సమానుడు. ఆయన్ని మనం కోల్పోయిన ఈ క్షణాల్లో, విభేదాలకు అతీతంగా భారతీయ పౌరసమాజం, రాజకీయ నాయకులు, ఇతర వర్గాలు, ముక్తకంఠంతో ఈ నవభారత సేనానికి నివాళి అర్పిస్తున్న వేళ, కవిగా ఆయన పలికిన వివేక వాణి నుంచి కొన్ని మంచి ముత్యాలు.

రెండు రోజులు దొరికాయి ప్రసాదంగా
గాయాల ఈ వ్యాపారంలో
ప్రతిక్షణం లెక్క చూసుకోనా
లేదా నిధి శేషాన్ని ఖర్చు పెట్టేయనా
ఏ దారమ్మట వెళ్ళాలి నేను?



పగిలిన కలల వెక్కిళ్ళు వినేదెవరు
లోలోపలి తెగని వెత కనురెప్పలపై
నిలిచింది
ఓటమి ఒప్పుకోను,
వెనుతిరగను పోరులో
కాల కపాలం మీది రాత చెరిపేస్తాను
నవగీతం పాడుతాను, నవగీతం పాడుతాను

ఎందుకు నేను క్షణ క్షణంగా బతకకూడదు
కణ కణంలో అలరిన అందాల్ని తాగకూడదు

రేపు రేపంటూ ఉంటే
ఇవాళ అన్నీ చేజారుతాయి
గతం, భవిత వీటి తలపోతలో
ఓడి పోతావు నేడు అనే పందెం

నన్ను నేను ఇతరుల అంచనాల్లో
చూసుకోగలుగుతున్నాను
నేను మౌనంగానూ లేను,
పాడడమూ లేదు

నిన్న ఉన్నది నేడు లేదు
నేడున్నది రేపుండదు
ఉండడం, ఉండక
పోవడమనే దశ
ఇలాగే సాగుతూ ఉంటుంది.
నేనున్నాను, నేనుంటాను
అనే భ్రమ మాత్రం ఉంటుంది నిత్యం

మండుటెండలో కమ్మింది చీకటి
సూర్యుడు నీడ చేతిలో ఓడాడు
లోలోని స్నేహాలకు ఒత్తిడే దక్కింది
ఆరిన దీపాలకు వెలుగిద్దాము
రండి మళ్ళీ దివ్వెలు వెలిగిద్దాము

మూలం – అటల్ బిహారీ వాజ్‌పేయి
రచన – హిందీ నుంచి
కవితాపంక్తుల అనువాదం

రామతీర్థ, కవి, విమర్శకులు
మొబైల్ : 98492 00385

అటల్ బిహారీ వాజ్‌పేయి కవితలు

రండి మళ్ళీ దివ్వెలు వెలిగించ

మండుటెండలో కమ్ముంది చీకటి
సూర్యుడు నీడ చేతిలో ఓడాడు
లోలోని స్నేహాలకు ఒత్తిడే దక్కింది
ఆరిన దీపాలకు వెలుగిద్దాము
రండి మళ్ళీ దివ్వెలు వెలిగిద్దాము
మా శిబిరాలను గమ్యం ఎరుగును
లక్ష్యం కనుల ముందరే మరుగైంది
వర్తమానపు మక్కువ వలలో
వచ్చే రేపటిని మరవ వద్దు
రండి మళ్ళీ దివ్వెలు వెలిగిద్దాము
ఆహుతి బాకీ, యజ్ఞం అసంపూర్ణం
విఘ్నాలు చుట్టూ నిలిచాయి
అంతిమ విజయపు వజ్ర నిర్మాణంలో
కొత్త దధీచి వెన్నెముకలు దిట్ట పరుద్దాం
రండి మళ్ళీ దివ్వెలు వెలిగిద్దాము?

కొత్త పాట పాడుతున్నా

కొత్త పాట పాడుతున్నా
తెగిన తారల నుంచి పలికింది ఆమని
రాతి ఛాతీ నుంచి లేచింది అంకురం
వెల్లువయె జలపాతమూ
కొల్లలుగా కుహూ కుహూ రాగమూ
చూస్తున్నా తూర్పున అరుణ వన్నె రేకలూ
పాట కొత్తది పాడుతున్నా
పగిలిన కలల వెక్కిళ్లు వినేదెవరు
లోలోపలి తెగని వెత కనురెప్పలపై నిలిచింది
ఓటమి ఒప్పుకోను , వెనుతిరగను పోరులో
కాల కపాలం మీది రాత చెరిపేస్తాను
పాట కొత్తది పాడుతున్నా!

పచ్చగడ్డి పై

ఆకు పచ్చ గరిక పై / మంచు బొట్లు
క్షణమే ఉనికిలో / మరు క్షణం మాయం
ఇట్టివే ఆనందాలు / మనతో సదా నిలిచేవి
ముందెప్పుడూ లేవు / ఇంకెప్పుడూ రావు
చిమ్మ చీకటి కడుపులోంచి / రూపొందిన బాల సూర్యుడు
తూర్పు ఒడిలో కాళ్లు కదపగానే
నా తోటలోని ప్రతి ఆకూ మెరిసాయి
ఉదయ రవికి నమస్కరించనా
ఆ వేడిమిలో ఆవిరవుతున్న / మంచు బొట్లను వెదకనా
సూర్యుడొక వాస్తవం / కల్లగా చెప్పి మప్పించ లేం
మరి మంచు బొట్టూ సత్యమే
అవి క్షణికమే అన్నది వేరొక మాట
నేనెందుకు క్షణాల లెక్కన బతక కూడదు
కణ కణంలో అలరారే సౌందర్య పానం చేయకూడదు
సూర్యుడు మళ్లీ ఉదయిస్తాడు / ఎండ మళ్లీ కాస్తుంది
కానీ నా తోటలో పచ్చ గరిక పై / మంచు బొట్లు
ప్రతి రుతువులో దొరకవుగా.

మలుపులో

దూరాన ఉన్నది చూడగలను
గోడల మీది రాతలు చదవగలను
కానీ చేతి గీతలే చదవలేకున్నాను
సరిహద్దు ఆవల రగిలే మంటలు
నేను చూస్తున్నాను
కానీ కాళ్ళ చుట్టూతా నిప్పుల గుండాలు
చూడలేక పోతున్నాను
ముసలవుతున్నానా
ప్రతీ డిసెంబర్ ఇరవై అయిదునా
బతికేందుకు ఒక మెట్టు ఎక్కుతున్నాను
కొత్త మలుపులో
ఇతరులతో కన్నా ఎక్కువగా
నాతో నేను ఘర్షణ పడుతున్నాను
మందిని నోరు మూయిస్తున్నాను
నాకే నేను జవాబు చెప్పుకోలేక పోతున్నాను
నా మనసు నన్ను బోనులో నిలబెట్టి
నిలదీస్తుంటే
నా వాంగ్మూలం నాకే ప్రతిగా ఇస్తున్నది
విచారణలో నేను ఓడిపోయేలా
నా దృష్టిలో నేనే దోషినవుతున్నాను
అప్పుడింక నాకు
దూరంలోవీ, దగ్గరున్నవీ
ఏమీ కనిపించవు
నా వయసు ఉన్నట్టుండి పదేళ్లు పెరిగిపోతుంది
నేను నిజంగా ముసలినవుతాను.

(25 డిసెంబర్, 1993 జన్మదినం నాడు)

మౌనంగానూ లేను పాడడమూ లేదు

మౌనంగానూ లేను పాడడమూ లేదు
వేకువయినా తూర్పు దిక్కున
మబ్బుల మాటు సాగుతోంది
పత్తి పింజల్లాంటి దట్టమైన మావులో
గాయపడ్డ మైలు రాళ్ళు
తడబడే అడుగులు
అదృశ్యమైన పల్లెలు
నిస్తేజమూ కావు, కదలికా లేదు
నేనేమిటో ఇతరుల దృష్టిలో అంచనా
వేయగలుగుతున్నాను
మౌనంగానూ లేను పాడడమూ లేదు
కాలపు శ్వాస గాడ్పులు
దేవదారుల్ని వడల గొట్టినా
మంచు దాడికి ఎదురు నిల్చింది
ఒక ఉష్ణ ధనుర్మాల
గూళ్ళు చెదిరినాయి
పిట్టలెగిరిపోయిన అశోకాలు
కన్నీళ్లూ లేవు చిర్నవ్వులూ లేవు
మంచు నది ఒడ్డున
ఒంటరిగా కూని రాగం తీస్తున్నా
మౌనంగా లేను పాడడమూ లేదు.

రాజ్యాధికారం

పసిపిల్లలూ, ముసలమ్మలూ, పడుచువాళ్ళ
శవాల కుప్పలపైనా నడిచొచ్చి
ఎవరైతే సింహాసనాల దాకా చేరదలుస్తారో
వారికి నాదొక ప్రశ్న!
చనిపోయిన మందితో
వారికేమీ సంబంధం లేదా?
సహజ మానవబంధం లేదా?
మట్టి చుట్టరికం లేనే లేదా?
నేలతల్లికి అందరమూ బిడ్డలమే!
అధర్వ వేదపు ఈ మంత్రం జపించడానికేనా?
జీవన సూత్రంగా పాటించక్కర్లేదా?
మంటల్లో కాలిన బాల్యం
కామాలకు బలి అతివలు
బూడిద కుప్పలయ్యే ఇళ్ళు ఏ సభ్యతకి
ప్రమాణాలు?
దేశభక్తి కాదిక్కడ
అన్నీ పాశవికతా ప్రకటనలు
వేదన ఉంటే ఈ దురవస్థ పైన,
తల్లి కడుపున పుట్టిన ఈ కుపుత్రులపైనా
తల్లి గొర్రాలు కావడం నయం -
రక్తంతో తడిసిన రాజరికాల కన్నా!
రాజ్యాధికారాల అలవి కాని దాహం
పల్లకాటి దుమ్ముతో నిండి ఉంది
అది రక్త దాహం కన్నా హీనమైనది!
ఐదువేల ఏళ్ల సంస్కృతి
గర్విద్దామా, ఏడుద్దామా?
ఈ స్వార్థాల పరుగులో ఎక్కడో
స్వాతంత్ర్యాన్ని మళ్ళీ కోల్పోవద్దు!

మూలం : భారతీయ కవి ప్రధాని
అటల్ బిహారీ వాజ్ పేయి
'మేరీ ఇక్యా వన్ కవితాయే' హిందీ సంపుటి
నుంచి.
తెలుగు అనువాదం : రామతీర్థ
98492 00385

నాలుగు గోడలూ - నల్లని ముసుగు

కవిత

సాహెబ్ నన్నేమి చేయమంటారు ఈ నల్లని ముసుగు తో
తమరు నాకెందుకింత గొప్ప ఉపకారం చేసారు
నేనేమీ సంతాపంలో లేను
నా దుఖం లోకం చూసేలా దీన్ని ధరించడానికి
నేనేమీ జబ్బు పడలేదు
నా అస్వస్థతని దీని నల్లని మడతల మధ్య దాచుకోడానికి
నా నుదుట ఈ నల్లని ముద్దర వేసుకోవడానికి -
సాహెబ్, నేను మరీ తెంపరితనంగా మాట్లాడుతున్నాననుకోకపోతే,
నాకు ప్రాణ హాని లేదని మీరీ మాటిస్తే,
నేను చెప్పనా వినయంగా
అక్కడ మీ పరిమళ భరిత గదిలో
ఉన్నదొక కంపు కొట్టే శవం - మీనుంచి జాలి కోరుతున్నది
ముసుగు లేని ఆ శవానికి వేయండి ఈ తొడుగు - నాకు కాదు
ఎక్కడ చూసినా దాని దుర్వాసనే
అది కోరుతున్నది దూరాన ఏకాంతం.
ముసుగు కింద హృదయం కదిలేలా వేదనారావాలు చేస్తున్న
ఆ దిన మొుల స్వరాలు వినండి
వీరు మీకు బాగా తెలిసే ఉండాలి - ఈ సేవికలు
మీరు ఓడించిన జాతులనుంచి బలిమిన తెచ్చిన బందీలు
ఒక రాత్రికి హలాల్ వీరు, మర్నాటి ఉదయమే గెంటివేత
ఈ బానిస యువతులు మీరు ప్రసాదించిన వీర్యాల మోత మోస్తూ
జన్మ ఇచ్చిన బిడ్డలకు మాత్రం సంకర హోదాయే
అయినా అది చాలదా ఏమిటి వారి బతుకులకి?
మీ వాంఛా తల్పాల మీద తమ వంతుకై వేచి ఉండే జనానా,
గజగజలాడే బాలికల కన్యాత్వ రక్తమంటి
మీ తెల్లని గుబురు గెడ్డాలు ఎర్ర బారుతాయి
జీవితంలో ఇక కార్చేందుకు కన్నీళ్ళు లేవు
అన్నీ కారిపోయాయి ఆ సెంట్ వాసనల గదిలో యుగయుగాలుగా
ఇదే త్యాగాల నాటకం తిరిగి తిరిగి జరుగుతూనే ఉంది
సాహెబ్, ఇక దానికి తెర దించండి
ఇప్పుడు మీరీ శవాన్ని కప్పాలి
నేనీ భూమి మీద కేవలం మీ ఎడతెగని కోరికల
చిహ్నంగా మాత్రం లేను
ఈ నాల్గు గోడలూ, ఈ నల్లని ముసుగూ
వాటినే ఆశీర్వదించనీయండి ఈ కుళ్ళుతున్న అవశేషాలను -
నేను నా తెరచాపలెత్తాను
ఈ గాలి జోరులో పెను కడళ్ళ మీదకు -
తోడుగా నా పక్కన నిలబడ్డాడో జతగాడు
నా నమ్మకాన్ని చూరగొన్న సహచరుడు.

- ఫాతిమా రియాజ్

ఇటీవలే కన్నుమూసిన సుప్రసిద్ధ పాకిస్తానీ కవయిత్రి.

తెలుగు సేత :
◆ **రామతీర్థ**
98492 00385

సంతాప తీర్మానాలు

మిత్రులారా నాకీ ఉపకారం చేయండి
నేను మరణించాక నాకు అన్యాయం చేయకండి
నాకు మతాల ధ్రువపత్రాలు ప్రదానం చేయకండి
మీ ప్రసంగ ధాటిలో
ఈమె కూడా ఒక విశ్వాసి అని కట్టేయకండి
నేను ఫలానా దేశానికి, ప్రాంతానికి చెందిన దానిగా
నా విధేయతలను నిరూపించకండి
అధికార వర్గాలు గౌరవాలు చూపేందుకు
అధికంగా ఏవో చేయాలని ప్రయత్నించకండి
నిందలే నేను పొందిన కితాబులు
అవి ఒక ఎత్తుకు సైతం రాకున్నా
నన్ను ప్రేమించిన వారికి కొదవ లేదు
వాస్తవాల మొదళ్లు జీవితంలోనే దాగి ఉన్నాయి
దుమ్మూ, ధూళీ , గాలీ నా నేస్తాలు
వాటిని అవమానపరిచే పనులు చేయకండి -
సెన్సారు అధికారులు మెచ్చుకుంటారు కదాని
స్నేహితులారా
వారు కఫన్ కప్పుతారు కదాని
నా కళేబరం చేత క్షమాపణలు చెప్పించకండి
చింత వలదు
విడిచిపెట్టండి నా దేహాన్ని అడవిలో
ఎంతో హాయిగా ఉందీ ఆలోచన
అడవి జంతువులొస్తాయి నా కోసం
నా ఆలోచనలు ఏ రకమూ, వాటి స్థాయి ఏమిటూ
అని పట్టింపు లేకుండా
అవి ఆరగిస్తాయి నా శరీర భాగాలని
కెంపు వంటి నా హృదయాన్ని అన్నీ తినేస్తాయి
సంతృప్తంగా పెదవులు నాక్కుంటాయి
వాటి విధేయమైన మెరిసే కనులలో
మీరు చెప్పని నిజమేదో తళుక్కుమంటుంది
ఆ సత్యం!
ఈ శవం ఉందే
ఇది ఏం తను చెప్పాలనుకుందో అదే చెప్పిన
అందుకు జీవితాంతం పశ్చాత్తాపం లేని ఆమెది.

- ఫాతిమా రియాజ్
ఇటీవలే కన్నుమూసిన సుప్రసిద్ధ పాకిస్తానీ కవయిత్రి
తెలుగు సేత : రామతీర్థ
98492 00385

చరిత్రలో...



థామస్ హుడ్

శ్రమ గౌరవ పతాక కమీజు పాట

నూట డెబ్బై అయిదేళ్ళ కిందటి శ్రామిక వర్గ గీతం ఇది. లండన్ కార్మిక సమాజంలో కుట్టు పని కూలి వారి పాటగా,దీన్ని థామస్ హుడ్ రాశారు. 1843లో ఈ గీతం పంచ్ పత్రికలో ప్రచురితమైంది. తక్కువ జీతాలు, సెలవులు లేకుండా వారానికి ఏడు రోజులూ, పన్నెండు గంటల పని కాలం, కష్టించే ఒక ముసలి శ్రామికురాలు ఈ పాట పాడే నిర్భాగ్య స్త్రీ. ధనవంతుల ఇళ్ల నుంచి ఇలా కుట్టు పనికి బట్టలు తెచ్చుకుని, తిరిగి వారికి భద్రంగా ఇవ్వడం కోసం... ఈ పని వారు గొప్పవారికి సెక్యూరిటీ డిపాజిట్ కూడా చేసేవారు. అలా బిడెల్ అనే మహిళ, తన ఇంటికి దుస్తులు కుట్టే పని మీద బట్టలు తెచ్చుకోవడానికి, తన పేదరికంలో కూడా, అప్పట్లో రెండు పౌండ్ల ధరావత్తు చెల్లించి, కుట్టేందుకు తెచ్చిన బట్టలు, తన పిల్లల ఆకలి బాధకి తాళ లేక, కుదువ పెడుతుంది. ఈ నేరం బయటపడి, ఆమెని నిర్బంధ పని స్థలానికి పంపిస్తారు. ఇదీ థామస్ హుడ్ ఈ గీతం రాయడానికి గల నేపథ్యం.

1843 డిసెంబర్ నెల క్రిస్మస్ సంచికలో, అజ్ఞాత కవి పేరిట ఈ గీతం అచ్చయింది. ఫ్రెడెరిక్ ఎంగెల్స్ జౌళి పరిశ్రమలో శిక్షణ పొందడానికి ఇంగ్లాండ్, అప్పట్లో బట్టల బస్తీ మాంచెస్టర్ వచ్చినప్పుడు, 'ది కండిషన్ ఆఫ్ ద వర్కింగ్ క్లాస్ ఇన్ ఇంగ్లాండ్ 1844' అన్న రచనలో, మాంచెస్టర్‌లో గల శ్రామికుల జీవన పరిస్థితులను 'భూమిపై నరకం' అని ఒక్క మాటలో వర్ణించాడు. 1843లో థామస్ హుడ్ (1799 -1845) తన పరిణత వయసులో ఈ కవిత రాయడం, ఎంత సహజమో అనిపిస్తుంది, ఎంగెల్స్ తెలిపే స్థితిగతులు చదివాకా. అలా నూట డెబ్బై అయిదేళ్ళ చరిత్ర గల (1843-2018) ఈ గీతం, శ్రామిక చైతన్యోద్యమంలో ప్రారంభదశలో ప్రభావ శీల పాత్ర నిర్వహించింది. ప్రగతి అంటే అసంఖ్యాక మానవాళికి భూమిని నివాస యోగ్య, ఉపాధిశీల అవకాశాలు గల ప్రదేశంగా మార్చడం. ఈ యాత్రలో, థామస్ హుడ్ ఎగురవేసిన తొలి పతాక ఈ కమీజు పాట!

కమీజు పాట

అలిసినట్టి, అరిగినట్టి వేళ్ళతో
ఎర్రనైన బరువెక్కిన కనురెప్పలతో
కూచున్నది ముసలిదొకతె ముతుక దుస్తుల్లో
ఎడతెగని దారం, సూది కదలికల్లో
కుట్టుకుంటు, కుట్టుకుంటు, కుట్టుకుంటు
దరిద్రంలో, ఆకలిలో మురికిలో
దిగులు నిండిన గొంతుతో
పాడుతున్నదామె కమీజు పాట
పని, పని, పని
తొలి కోడి కూత లగాయితు
పని, పని, పని
ఇంటికప్పు గుండా చుక్కలు మెరిసినందాకా-
ఆటవిక తురక జాతుల్లా
బానిస బతుకుల్లో ఆడవారు
దాచుకునేందుకు ఆత్మలైనా మిగలవు
ధార్మిక క్రిస్తానీ పని తీరేనా ఇది
పని, పని, పని
మెదడు ఆలోచన మానేసి
ఈదడం మొదలిడినందాకా
పని, పని, పని,
కనులు బరువై మసక బారినంత దాకా
కుట్టు, మడతలు పెట్టు, దొంతరలుగా
దొంతరలు, మడతలు, కుట్టడం
బొత్తాములపై పడి నేను నిద్రపోయినంత దాకా
వాటిని కుడుతున్న కలలు కంటూ
'అక్క చెల్లెళ్ళున్న ఆసామీలూ
తల్లులు, భార్యలున్న పెద్దలూ
మీరు తొడుక్కునేవి బట్టలు కావు
అవి అభాగ్య మానవుల బతుకులు
కుట్టుకుంటు, కుట్టుకుంటు, కుట్టుకుంటు
దరిద్రంలో, ఆకలిలో, మురికిలో
రెండు పోగుల దారంతో గబగబా కుడుతూ
ఒక పీనుగు బట్ట, అదే సమయంలో ఒక కమీజు
కానీ నేనెందుకు చావు గురించి మాట్లాడాలి?

ఆ ఎముకల రటనం చేసే భూతం అంటే
అసలు నాకు భయం లేదు
ఎందుకంటే, అది నాలాగే ఉంటుంది
ఉంటుందది నా లాగే అచ్చంగా
ఎందుకంటే నేనుండే పస్తుల వల్ల
ఓ భగవాన్! రొట్టెలు ఎందుకింత ధర?
రక్తమాంసాలు ఎందుకింత చౌక?
పని, పని, పని
విరామం ఉండదు నా చాకిరికి
ఏమిటి ఈ చాకిరీకి జీతం
ఒక గడ్డి పక్క, ఒక రొట్టె ముక్క, పీలికలైన బట్టలు
ఆ పగిలిన పై కప్పు, ఈ చల్లని గచ్చు
పాత మేజా, విరిగిన కుర్చీ
శూన్యమైన గోడపై అది నా నీడే
అనుకుంటాను పడుతుంటుంది అప్పుడప్పుడు
పని, పని, పని
ఒకటొకటే అలిసిన గంటల గుండా
పని, పని, పని
ఖైదీలు శిక్షలో పాటు పడినట్టు
కుట్టడం, మడతలు, దొంతరలు
దొంతరలు, మడతలు, కుట్టడం
గుండె జబ్బు పడినందాక,
మెదడు మొద్దుబారినందాక
కుట్టే చేయి అలిసి పోయినందాకా
పని, పని, పని
చలి డిసెంబర్ రాత్రిలో కూడా
పని, పని, పని,
నులి వెచ్చని దినాల్లో కూడా
చూరు కింద దాగిన పిట్టలు
వాటి మెరిసే వెన్నులు చూపుతూ
వసంతం నిండిన గొంతులతో
గడ్డి పూల శ్వాసలతో శిరసు పైన నింగితో
పాదాల కడ పచ్చికతో కనీసం ఒక గంట
కాలమైనా

నేను నేనుగా ఉండేందుకు
మళ్ళీ పేదరికం ఒత్తిడిలో
పూట భోజనం కోసం
పడరాని పాట్లకు తిరిగి సిద్ధపడుతూ
ఆ ఒక్క గంట కాలపు సేద
కూసింత సేపు పని నుంచి విశ్రాంతి
ప్రేమ, ఆశలకై లేదే తీరుబడి
ఉన్న కాలమంతా వేదనలకే
ఆ కాస్త రోదనే హృదయానికి ఊరట
కానీ వాటి ఉప్పని గూడులోనే
ఆగిపోవాలి నా కన్నీళ్ళు
బయటకొస్తే అవి అడ్డు పడతాయి
కదిలే సూది, దారాలకు.
అలిసినట్టి, అరిగినట్టి వేళ్ళతో
ఎర్రనైన బరువెక్కిన కనురెప్పలతో
కూచున్నది ముసలిదొకతె ముతుక దుస్తుల్లో
ఎడతెగని దారం, సూది కదలికల్లో
కుట్టుకుంటు, కుట్టుకుంటు, కుట్టుకుంటు
దరిద్రంలో, ఆకలిలో మురికిలో
దిగులు నిండిన గొంతుతో
పాడుతున్నదామె కమీజు పాట
ఆ పాటలోని ప్రతి మాటా
చేరగలదా ధనవంతుల కోట?

మూలం : థామస్ హుడ్
తెలుగు సేత : రామతీర్థ
98492 00385

గరుడ పురాణం

ఉత్తర దక్షిణాల నెత్తురు కలిసి
ప్రవహించింది పుల్వామాలో అకారణంగా
సైనికుల కారవాన్ సరాయి పై
అపమార్గానువర్తి యువకుని దాడి
మతాలు, కులాల, ప్రాంతాల
ఏ సంకుచిత గుర్తింపులూ లేకుండా
భారతీయుల నెత్తురు
పన్నెండు నదుల జీవన శోభ
క్షణాల్లో మృత్యు క్షోభగా మారిపోయింది
పుల్వామా సైనిక వాహన శ్రేణి
ఉగ్రవాద దెబ్బ తిన్న శార్దూల బృందం –
పుల్వామా అమరులకు పదకొండో రోజు
దేశంలో పలు రాష్ట్రాలలో
పన్నెండు నదుల పావన జల సంప్రోక్షణ
దేశం పలుకుతున్నది పుణ్యాహవచనాలు-
పదకొండో రాత్రి చీకటి వాకిట
పన్నెండో ప్రభాతం ప్రఘాత సంకల్పంతో
పన్నెండు ప్రచండ గండ భేరుండాలు
కృష్ణాష్టమి రాత్రి
హద్దులు, సరిహద్దులు కొద్ది నిమిషాలు దాటాయి
అపమార్గ శిఖరులకు
వంచనానైపుణ్య కుటిల కూటములకు
వాయుసేన గరుడ పురాణం వినిపించింది
పదకొండో రోజు కొనసాగింపుగా
సంశయాలకు తిలోదకాలు ఇచ్చి
భారతీయ వాయుసేన
దేశ ప్రజల ఆసహనాల అగ్నిగోళాలు
సరిహద్దుల ఆవలి దురావేశ ప్రేరితులకు
తర్జని వర్షాలుగా కురిపించింది.
పుల్వామా అమరులారా
మీరు బతికుంటె ఏమి చేసి ఉండేవారో
మీ దేశం అదే చేసింది –
కుప్పించి ఎగసిన వాయు సేనల ధ్వాంతి
గగన భాగంబెల్ల గప్పికొన్నది.
బట్వాడా చేసింది భయాన్ని
ఉగ్రవాద శిబిరాల సుబేదారులకి.

రామతీర్థ

ప్రజాస్వామ్యంపై సంభాషణ!

రైతు :
ఓట్ల కోసమొచ్చినావ ఎమ్మెల్లే
మా పాట్లు కూడ
సూడవోయి ఎమ్మెల్లే
మందువాలు
తిరిగినావు
కందువాలు
మార్చినావు
అయిదేళ్ళ పండుగగా
పదవెలగ బెట్టినావు
కాడెద్దుకు గడ్డి నేదు
బోరు గంగ పైకి
రాదు

ఎరువు బరువు పెరిగింది, పరువు బజారయ్యింది
బాంకోడు అప్పులిచ్చి ఆదుకోడు ఇక మిగిలాయి
పురుగు మందు, పొలం గట్టు చివరి ఆసరా
బావులన్నీ టీత్తై పల్లెలన్నీ తాగినాయి కన్నీళ్ళే
కౌలు రైతు బతుకలేక పట్నాలకు వచ్చినాము
కుటుంబాలనీడ్చుకుంటు నగరాలకు ఎల్లబారినాము
రైతులని మర్చినాము వాచ్మేన్లుగ మిగిలినాము
ఓటు పండుగంట మరి మా ఇళ్లకే పోతాము
పల్లెల్లో ఓటుంది నువ్విచ్చిన మాటుంది
మడి సెక్కలు ఎండిపాయె బడిశాలలు మూతబడే
పని లేని, సదువు లేని మా పిల్లల గతి ఏందో సెప్పుతావా?

కొండబిడ్డ :
ఓట్ల కోసమొచ్చినావ ఎమ్మెల్లే
మా పాట్లు కూడ సూడవోయి ఎమ్మెల్లే
మందువాలు తిరిగినావు కందువాలు మార్చినావు
అయిదేళ్ళ పండుగగా పదవెలగ బెట్టినావు
ఆకుపచ్చ అడివి నీడ ముడుచుకునె
ఖనిజాలను తవ్వెందుకు కొండలమ్మట నక్కలు సేరె
కొండ బిడ్డలకు కొండఫలం దక్కలేదు
అభివృద్ధి విషనాగులు విమానాలు దిగినాయి
మా ఆడంగులు అన్యాయమైపోతే మీ న్యాయం నత్తనడక
మా బిడ్డలు ఎర్రదండు సంగాలని కాలిస్తే దిక్కు లేదు
గిరిజన సంఘాలకు దన్ను లేదు, తెన్ను లేదు
పోడు మూల బడ్డది, ధర లేక అడివి సరుకు సతికిల బడ్డది

బాక్సైట్ భూతాలను అడివిపైకి పంపినావు
అడ్డగోలు గని బహిరంగ తవ్వకాలకు సాయంగా నిల్చినావు
తూర్పు కనుమల చితి మంటలకు తెగించినావు
అడవికి నువు గుర్తున్నావు సాయపడని నాయకుడా

రాజధాని గ్రామీణుడు :
ఓట్ల కోసమొచ్చినావ ఎమ్మెల్లే
మా పాట్లు కూడ సూడవోయి ఎమ్మెల్లే
మందువాలు తిరిగినావు కందువాలు మార్చినావు
అయిదేళ్ళ పండుగగా పదవెలగ బెట్టినావు
పనికొచ్చే రాజధాని సిటికలోన కట్టకుండ
సినిమాలను సూపెట్టి బొమ్మరిళ్ళ దిప్పినావు
వేల యేళ్ళ పంటతల్లి కడుపులోన సిమెంటిసక పోసినావు
హక్కు లేదు రైతుకైన అమ్మనమ్ముకోడానికి
నాలుగు నగరాల నవతరాల రాజధాని సిరులు
సరి పంపకాలకు ససేమిరాగా పోసినావు
అమరావతి తిప్ప మీద రాజధాని కుప్ప
అప్పుల చిట్టా అది భావి తెలుగు బిడ్డలకు దక్కించావు
సింగపూరు సూపినావు సిత్రాలకు అంతు లేదు
ఉపాధి, ఉద్యోగం ఎండమావులైనాయి
అడ్డంకుల కులం, ప్రాంతీయదనం పెరగనిచ్చావు
మరోసారి పదవికై ముచ్చటపడుతున్నావు
ఓట్ల కోసమొచ్చినావ కాబోయే ఎమ్మెల్లే
మా పాట్లు కూడ సూడవోయి కాబోయే ఎమ్మెల్లే
మందువాలు తిరిగినావు కందువాలు మార్చినావు
అయిదేళ్ళ పండుగగా పదవి కోరుతున్నావు

భిన్న పార్టీల రాజకీయ జాతి (ప్రజానీకంతో) :
కథ వినుదురా మా కథ వినుదురా
పదవి కొరకై ప్రతి రోజు మారే మా కథ వినుదురా
జెండాలను నమ్మము, కండువాలకు కట్టుబడము
పార్టీలా మా ఎగనామాలకు చిరునామాలవి
పదవి మాకు ప్రాణ వాయువు, సేవ పేరిట దక్కుతుందది
మా సేవలన్నీ మాకే .. మేమే అతి బలహీన వర్గాలము
లేదంటే, మీ దన్ను లేకుండా మాకు ఉనికి లేదుగా
దేశంలో రాజకీయ వ్యాపారం చెలామణీ అవుతుంది
ప్రజాసేవగా
మాకూ మితులున్నై పరిమితులున్నై
ప్రతి వార్డు అమ్మవారి పండుగలకు కులం వారీ నిధులిచ్చాము
ప్రతి పరసలో పార్టీ స్టేజిలపై డాన్సు బేబీ వినోదం కల్పించాము
యువతను మద్దతుగా నిలుపుకున్నాము
బైకులు, పదవులూ, వార్డు స్థాయి హెూదాలూ
సమస్యలకు సెటిల్మెంట్లూ, సెంటిమెంట్లకు డొనేషన్లూ
పార్టీలవారీగా వార్డు, ఊరు, మండలం చీల్చాము
లబ్ధిదారులంటే, మాకెవరో, వారికెవరో, మీకే ఎరుక
సభలకు, ధర్నాలకు, జన సమీకరణ హంషారూ
బైకులు, ఆటోలు, కార్ల వారీగా తరలింపుల తిరణాల
మా తర్వాతే ఎవరైనా చేయగలరు జోరుగా
నిన్న ఎవరికి జై అన్నా, నేడు మాకు జై అన్నా స్వాగతం
ఖండన మండనలు, మద్దతు వీరంగాలు, బందులలో
మా ముద్రలు, భంగిమలూ, హై కమాండ్ కనుసన్నలో
ఉదయమూ, సాయంత్రమూ ఇది మా అభిప్రాయం వాయిదా
చెప్పాల్సిందే అది ఏదో హై కమాండ్ మాకు సర్వదా
మంతిరి పదవి ఒక వింతల పడవ
వాగ్దానాల నీరు కారు నల్ల చిల్లి కడవ
కనికరిస్తే ఒక్కసారి అదే పొలిటికల్ గోలా
రాజకీయ చెలామణీ అదే మాకు అస్తిత్వం
విధేయులలోకెల్లా వినయ విధేయ వీర సేవకులం
చేసేదల్లా ఎన్నికల వేళ మిమ్మలని గుర్తు చేసుకోవడం
ప్రలోభాల పర్వంలో ప్రజాస్వామ్య పూనకం
గణాచార్లు, గారడీ గాళ్ళు, జంతు బలుల పూజారులం

కాలం :
ఈ దేవత కోరుతుంది నిత్య ధూప దీప నైవేద్యం
ఢిల్లీలోనా, పల్లెలోనా ఎక్కడుంది వోటు విలువ
ఒక జాతర ముగిసాక ఓటరు సమూహాలు ఒంటరి ఒంటెలే
ఎడారి విస్తరిస్తున్నది ఒంటెలకు కర్తవ్య హీనంగా
ఓట్ల పండుగ అయిదేళ్లకు కచ్చితంగా జరగడం
ఆదేనా నిజమైన ప్రజాస్వామ్య లక్షణం
అయిదేళ్లలో, బాధ్యత గల పాలన, స్పష్టమైన అభివృద్ధి
కనిపించని మసకలో, ఎక్కడుంది వోటు పున్నమి
వోటరూ – రాజకీయ వ్యాపారులకు చెప్దామా
వారి మతిమరుపులో కొంత చరిత్ర చివర్లా
వోటర్లూ మీరు మీ కోసం ఆలోచిస్తే వోటర్లూ
తప్పదీ అవకాశవాదులకు, ఆషాఢ భూతులకు వాటర్లూ.
వోటర్లూ మీ చేతుల్లోనే నిరంతరం
ఈ నాటకీయుల వాటర్లూ...

– రామతీర్థ
98492 00385

చిటికెన వేలాదిగా

రామతీర్థ

చిటికెన వేలొక్కటే
కాలం నిన్ను నడిపించినా , కాలాన్ని నువ్వు నడిపించినా -
నీ సమస్త అవయవాలకు యోజనాల ప్రయోజనాలుండొచ్చు
కానీ చిటికెనవేలొక్కటే
చిద్రూప సంబంధి
అది భారతమంతా ఎరిగిన సహదేవునిలా నిలబడుతుంది
చిటికెనవేలొక్కటే అది రామాయణంలో శూర్పణఖ ముక్కు వంటిది
చిటికెనవేలొక్కటే అది భాగవతంలో వామన పాదం వంటిది
చేతి చివర్న ఏమీ ఎరగనట్టు ఉంటుంది
కానీ కాల ధ్యానం కాల జ్ఞానం దానికే ఎరుక
చితులెక్కి మండిపోయినా చిటికెన వేలిలో ఉండి పోతారు
తాతలూ, నాయనమ్మలూ, అమ్మా, నాన్నలూ -
గురువులూ, మిత్రులూ- చిటికెనవేలిలో నిండి పోతారు
చిటికెనవేలొక్కటే చిరునవ్వుల బోన్సాయ్ ల చిరునామా
చిటికెనవేలొక్కటే దేహానికి కుడి ఎడమల చివరి చర్మసీమ
చిటికెనవేలొక్కటే జ్ఞానంతారాళాల కాంతి అంగుళి
చిటికెన వేలి చుట్టూ కాలం అరవై పేర్లుగా, అరవై తీర్లుగా
తిరుగుతుంటుంది.
నిజానికి చిటికెనవేలెప్పుడూ ఒంటరి కాదు
ఏదో ఒక ఏడాది ఆ వేల్కొస పట్టుకునే ఉంటుంది
ఒక ఏడాది వదిలి పెట్టె ముందర, మరో ఏడాదికి
చిటికెన వేల్కొసను జాగ్రత్తగా అందించి సుదీర్ఘ విరామానికి సిద్ధం చేస్తుంది
జాగ్రత్తగా గమనిస్తే అరవై పేర్లతో సంవత్సర కూటమి కలిగున్నది మనము
ప్రభవ ఈ కూటమికి ప్రారంభ సంవత్సరిగము
అక్షయ ఈ కూటమి యాత్రలో సంవత్సాదనిస
ఏదో ఒక ఏడాది నీకు బాల సారె సాలు కాగా
సాలు సాలు కు ఎదిగి బ్రహ్మవిష్ణు శివాన్వితమౌ బతుకులో
మరేదో ఒక ఏడాది నీకు తలాపి దీపం పెట్టి నివాళి కూడా రాస్తుంది
చిటికెన వేలొక్కటే అరవై ఏళ్ల స్మృతితో
కాలంతో పాటు ఒక సంకలనాన్ని సంకేతిస్తుంది
చిటికెనవేలొక్కటే
చిగురించే కొత్త చిగుళ్లను, చివికిపోయే పత్రాలను
ప్రతిబింబించే అరవై ఏళ్ల ఆవర్తానికి మిత్ర సుగంధం
చిటికెన వేలంటే ఒక చిన్న విషయం కాదు
సమస్త ప్రకృతిలో మనిషి కూడా చిటికెన వేలంత వాడే
ఒంటరిగానూ, సమూహంగానూ
అందుకనే చిటికెన వేలు అందించి నడిపించే కాలాగ్ని
నిన్ను కాల్చినా పుటం పెట్టి బంగారం చేస్తుంది
అందుకనే నువ్వు చిటికెన వేలందించి నడిపించే తరాలు
ముందుకు నడుస్తూ – తెలుసుకుంటాయి
చిటికెనవేలొక్కటే పట్టుకున్నా, అందించినా
ఉగాదుల ఉత్సాహాల ఊయల ఊపు అని
ఈ ఊపిరి ఆటలే జీవన మైదానాల ప్రాణ క్రీడలు ప్రాస క్రీడలు అని.
చిటికెన వేలాదిగా, చిటికెనవేలానగా
బతుకు నిత్యం చిటికెలో ఒక చిన్మయ ఆవిష్కరణ
ఈ అరవై ఆటగాళ్ల కాల కందుక క్రీడలో –

శ్రీ వికారి నామ ఉగాది
శుభాకాంక్షలతో



జన్మ అక్షరం

కొంతమంది ప్రాంతీయులు
బహుధా భ్రాంతీయులు
తేదీలు తారీఖులు చూశారా ఆగరు
పోసుకోలు 'ఫేసుకోలు' పూనకయ్యలు
పూనకాల నకరాలు చూపుతారు
కలుపుగోరుతనాల కలయంపి జల్లలేక
కపటం, కల్మషం ఎగజిమ్ముతారు
కవి కవితల కరవాలాలు
కాలేదే మా కులవాదాలని కలత చెందుతారు
ఫేసుబుక్ పేరంటాల్లో నొక్కుకునే బుగ్గలకు
హవ్వ హవ్వ కబుర్లకు పోగు పడే బృందాలు!

కొంతమంది ప్రాంతీయులు
వింతవింతగా వారెప్పుడూ కుల స్థానులు
కవి పుట్టిన రోజంటే పాడెలతో తయారు
సోషల్ మీడియా శ్మశానాల్లో తగని హుషారు
సమాజ శుభాకాంక్షల త్రివిక్రముల జాబితా
లొల్లాయి అంత్యక్రియల కర్తలు, కర్మలకు లొంగేదా?
సమాజ సంవేదన ఏకముఖ సందర్శన
పెద్దల మాటల్లో స్పష్టమైన సమదర్శన

కొంతమంది ప్రాంతీయులు తెలియలేరు
బహుధా భ్రాంతీయులు తెలుసుకోరు
ఏ జిల్లా వాడో తెలిస్తే ముందు జిల తీరుతుంది
ఏ కులమో గగ్గోలు చేస్తే గుల చల్లారుతుంది
డిజిటల్ వంటింట్లో ముఖ పుస్తక కుంపట్లో
కంపోస్ట్ కన్నా తక్కువ విలువ భావాలు
పోస్ట్ చేస్తున్న ఖాతాదారులు
మర్చిపోయి కలుపుగోరు తనాలు
తొక్కుతున్న ప్రాంతీయ భ్రాంతీయ శివాలు
అడ్డుకోము అడ్డు రాము - సత్తా ఉన్నంత మేర
కానీండి ద్వేషాల పందేరం
కానీండి అయిష్టాల పేరంటం
మీరొదులుకున్న కవిగణాల గుర్తింపులకు
గుడ్డిగవ్వ నష్టం లేదు
మీరామోదించిన కవులకూ ఇక్కడ చలువ పందిళ్లే!

కొంతమంది ప్రాంతీయులు బహుధా భ్రాంతీయులు
వారికి లేనిదనుకునే, వారిది కాదనుకునే
సముద్రాల సాహిత్యం ఇక్కడ శాశ్వత సత్యం
అది నిరంతర ఉద్ఘోషయాత్ర
వెయ్యేళ్ళ శంఖారావం, ఢంకాధ్వానంలో
మాకు అపశ్రుతులు వినిపించవు
ఎక్కడున్నా ప్రగతిశీల ప్రేమాక్షర పతాకలే కవులు
నక్షత్ర జన్మాలకు జన్మ నక్షత్రాలెందుకు
అక్షర యాత్రా స్వరూపులకు ఆద్యంతాలెందుకు?
వెయ్యేళ్ళుగా ప్రతిరోజూ అక్షరాల జన్మదినాలే
వారికి మా స్వాగత సూర్యకాంతి
వారితో మా సహ జీవన సంక్రాంతి!

- రామతీర్థ
98492 00385

మితవాదం ఆలోచించడం మానేసి ఆగిపోయిన చోట నే నడక మొదలెడతాను అతివాదం అంకురించిన చోట నేనాగిపోతాను.... ఆలోచిస్తాను నేను వాస్తవికవాదిని

Friday, 25 March 2011

తలుపు

తెల్లారాక తెలిసింది
మా ఇంటి తలుపెవరో దొంగిలించారని
ఎడా పెడా సింహాలున్నట్లు ఎపుడూ గుర్తులేదు కాని
మాకది సింహద్వారమే
గోడలోకి వేళ్ళు తన్నిన తలుపునేవరో
తృటిలో పెకలించి పుణ్యం కట్టుకున్నారు
నెత్తురోడుతూనే ఉంది గోడ
ఎలా మర్చిపోగలను
మా నెరవేరని ఈప్సితాల మీది
బహు మర్యాదకరమైన మూతని
గడియలు బిగిసాక -- ఇదే కదా
లోకానికీ మాకూ మధ్య దారు యవనిక
ఈ తలుపు వెనుకే మా చిన్ని లోకం ఉండేది
ఇది మూసుకున్నాకే గారాలూ మారాలూ మొదలయ్యేవి
ఇది వేయందే
మా తుంటరి తనాలకి చివాట్లు పడేవి కావు
ఇది వేయందే అమ్మ చీపురు కట్ట తిరగేసేది కాదు
మా బాల్యపు పువు దీవెలు
ఎంత అల్లిబిల్లిగా అల్లుకున్నాయి ఈ తలుపుని
మేం చూడని సినిమాలు, వెళ్ళని పిక్నిక్లు
కొనుక్కోని సమస్తం ఇక్కడే ఆగిపోయేవి
ఈ తలుపు వెనుకే తమ్ముడు
పెన్సిల్ ములికి సూది వేసేవాడు
ఈ తలుపు వెనుకే మా ఇంట్లో చంటిది
ఇ ఈ అ ఆ లు రాసేది పాళీ భాషలో --
తెల్లారేక తెలిసింది
మా ఇంటి తలుపెవరో దొంగిలించారని
వాళ్ళు పలకరింపుకే వచ్చారనుకున్నాను -- నిజమే.
పెను ప్రయాణ భారం దుస్తుల మీదే ఉంది
కళ్ళ కూడళ్ళలో అసంఖ్యాక గ్రీష్మాల, నిబిడ శీతర్తువుల
మిశ్రమ వాస్తవాలున్నాయి.
వాళ్ళు నన్ను మంచి నీళ్ళే అడిగారు
తెచ్చిచ్చే లోపలే ఎక్కడ దాచుకోవాలో తెలీక
మా నాన్న గుండెలో దాచుకున్నరొక తుపాకి గుండు -
తెల్లారాక, తెలివొచ్చాక తెలిసింది
మా నాన్ననెవరో దొంగిలించారని -- అవును
మా నాన్నే మా ఇంటి తలుపు.

..................రామతీర్థ
(12-07-1993 న ఆకాశ వాణి , విశాఖపట్నం నుంచి ప్రసారితం, **"తెల్ల మిరియం "** *కవితా సంపుటిలోని తొలి కవిత)*

THE 'CLASSICAL' CONUNDRUM

Rama Teertha

Conferment of 'Classical' language status on Malayalam, and that too on the basis of its literature which is 500-600 years old, has taken the wind out of the sails of those who predicate such exalted status on the antiquity of a language's literature and edicts.

Now, one has to wonder why the Telugus and the Kannadigas strained themselves so much to prove that indeed they had more than 1,500 years of literary history. From a global standpoint, to determine the 'classical' status, the highly productive period in that language is taken as the main criterion, but not antiquity. It is a different matter that some Tamil scholars and the Tamil Nadu government had erroneously put forth antiquity as the predominant determining factor and the Union government, guided by the Sahitya Akademi, more or less endorsed it.

కవిత్వ సంచికలు ఎన్నో ఉండవచ్చు, కొత్తవి రావచ్చు, కానీ నలుపు తెలుపు నిండుదనంలో పలకరించేది, వెంటనే మనం గుర్తు పట్టేది మాత్రం, కవితా! సంచిక మాత్రమే! ఆ నిర్దిష్టత, ఆ ప్రత్యేకత, ఈ అరవంద సంచికల సాక్షిగా, బ్లాక్ అండ్ వైట్‌లో, ఈ పత్రిక సంపాదించుకున్న సంపద. ప్రముఖ కవులపై ప్రత్యేక సంచికలు తెస్తూ, ఈ ప్రయాసలో భుజం కలిపి ప్రస్తుతం నడుస్తున్న కవి మిత్రులు బండ్ల మాధవరావు, అనిల్ డానీ తదితరులకు కూడా అభినందనలు.

కలర్ ఫొటోలు వివరాలను ఇస్తాయి. బ్లాక్ అండ్ వైట్ ఫొటోలు వ్యాఖ్యానానికి వెసులు బాటిస్తాయి అన్నారు ఎలియొట్ ఎర్విట్. శ్రీశ్రీ విశ్వానికి మద్దతు పలకడం అని కాదు కానీ, ఇన్సూరెన్స్ కంపెనీలు కూడా, తమకు వచ్చిన రకరకాల క్లెయిములు సెటిల్ చేయడానికి బ్లాక్ అండ్ వైట్ ఫొటోలనే కోరుతాయి. కలర్ ఫొటోలైతే, సరిగ్గా అంచనా వేయలేమనేది వారి ప్రమాణాల సారాంశం .

1912లో హేరియట్ మన్రో చికాగోలో మొదలెట్టిన పొయెట్రీ పత్రిక నేటికీ ఇంగ్లీష్ కవిత్వ పత్రికల్లో అతి పాతది. దీని చిరునామా ప్రఖ్యాతం. 61, వెస్ట్ సుపీరియర్ స్ట్రీట్, చికాగో, ఇల్లినాయి 60654. ఇగానే, మన కవితా! పత్రిక విజయవాడ చిరునామా కూడా కవిత్వ విషయంలో లోక ప్రఖ్యాతం కావాలని ఆశిద్దాం. పసిడిరెక్కలు విసిరి కాలం పారిపోకుండా, ఆ రెక్కల ధూళిమ అక్షరాలకెత్తే ప్రయాసలో, శ్రీశ్రీ విశ్వం స్ఫూర్తి అసంఖ్యాక సంచికలుగా మహత్వ కవిత్వ పటుత్వ సంపదల్, జాతికి దఖలు పడేలా ప్రగతియాత్ర చేయాలని శుభాకాంక్షలు చెబుదాం.

– రామతీర్థ
98492 00385

సందర్భం

తూర్పు పడమరల సాహిత్య కలబోత

అరవై రెండేళ్ల కజువా ఇషిగురోకి 2017 సాహిత్య నోబెల్ వచ్చిన సందర్భంగా స్వీడిష్ అకాడెమీ పెర్మనెంట్ సెక్రటరీ సారా డేనియస్, 'గొప్ప నిజాయితీ గల రచయిత, పక్కలకు చూడకుండా తనకంటూ ఒక కళాత్మక ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకున్న సాహిత్యవేత్తగా అభివర్ణించారు. ఇంకా 'కొంత జేన్ ఆస్టేన్‌ను, కొంత ఫ్రాంజ్ కాఫ్కాను కలిపితే, కొద్దిగా మార్సెల్ ప్రౌస్ట్‌ను చేరిస్తే, అప్పుడు మీకు ఇషిగురో క్లుప్తరూపంలో అందుతాడు. అప్పుడు మీరు వారి శైలుల్ని పైపైనే కలపాలి. అలా తన రచనలు రూపొందుతాయి' అంది.

అణుబాంబు దాడికి గురైన నాగసాకిలో 1954లో పుట్టిన ఇషిగురో... తండ్రి ఉద్యోగరీత్యా ఇంగ్లాండ్‌కు వచ్చి, అక్కడే చదువుకుని స్థిరపడ్డ, బ్రిటిష్ పౌరుడు. ఇంగ్లాండ్‌లో తానొక రచయితను అని 1980ల్లో ఆయన చెప్పుకుంటే, జపాన్ భాషలో రాసే రచయిత అనుకునేవారు ప్రజలు. కానీ ఇషిగురో ఇంగ్లీష్‌లో రాస్తాడు. అక్కడి కెంట్‌లో, తదుపరి ఈస్ట్ ఆంగ్లియా విశ్వవిద్యాలయంలో కళా, మానవ వికాస రంగాల్లో ఎంఎ పొందాడు. అక్కడ లిటరరీ ప్రాజెక్టుగా కొన్ని కథలు తొలుత రాశాడు. ఈ కథల్లో ఆయన జీవితంపై గల తూర్పు, పడమర సంస్కృతుల ప్రభావం కనిపిస్తుంది. 'వెయిటింగ్ ఫర్ జె', 'విలేజ్ ఆఫ్టర్ డార్క్' వంటి అయిదు కథల సంపుటులు ఆ రోజుల్లో వెలువరించినప్పుడు ఆంగ్ల సాహిత్య సమాజం ఇదొక కొత్త స్వరంగా గుర్తించింది. ముప్పయ్ ఐదేళ్ళ సాహిత్య ప్రయాణానికి ఇషిగురోకు సాహిత్య నోబెల్ త్వరగానే వచ్చిందని చెప్పాలి.

తనకి ఐదేళ్లప్పుడు, 1959లో ఇంగ్లాండ్‌లోని సర్రేలో, తండ్రి మెరైనోగ్రఫీ శాఖలో ఉద్యోగిగా అక్కడ నివసిస్తూ, ఇంగ్లిష్ గ్రామర్ స్కూల్లో ఇంగ్లిషు నేర్వడం పిల్లవాడైన ఇషిగురోకి తొలి ఆంగ్ల అనుభవం. 'నాకు ఐదేళ్లప్పుడు ఇంగ్లాండ్ వచ్చాను. మా అమ్మ, నాన్న ఇద్దరికీ ఇంగ్లిష్ బాగా రాదు. మా అమ్మయితే అసలు ఇంగ్లీష్ మాట్లాడేది కాదు. ఇంగ్లిషు ఎలా నేర్చుకున్నానంటే స్కూల్లో పాఠాలు అయిపోయాక ఇంటికొచ్చాక... టీవీలో తెగ వచ్చే వెస్టర్న్ సినిమాలు బోన్జా, వేగన్ ట్రైన్ వంటివి చూసే. అవి చూస్తూ, రకరకాల పలుకుబడులుగా ఇంగ్లిష్ ఎలా మాట్లాడతారో గమనించాను. ఇక్కడ ఇంగ్లాండ్‌లో, అక్కడ అమెరికాలో, పల్లెల్లో... ఇవన్నీ ఎలా పలుకుతారో కొంత ఆసక్తిగా మనసులో పెట్టుకున్నాను. అయినా చాలా గందరగోళంగా ఉండేది. స్కూల్లో అందరూ నా ఇంగ్లిషును విడ్డూరంగా వినేవారు. పెద్ద గుర్రం మీద వచ్చే అర్థరియన్ కౌబాయిలా ఒక ఎత్తైన మనిషి, ఎత్తయిన గుర్రం పైన... ఆ దృశ్యం ఇది నా పసి మనసులో ఒక బలమైన ముద్ర. వీటిని చూసినప్పుడు నాకు చిన్నప్పుడు జపాన్‌లో విన్న సమురాయి యోధుల కథలు గుర్తుకు వచ్చేవి.'

.. ఇలా చెప్పుకున్న కజువో ఇషిగురో, తన తొలి కథల ప్రయత్నానికే, ఇరవై తొమ్మిదేళ్ల వయసులో 1983లో ప్రతిభావంతులైన ఇంగ్లీష్ యువ రచయితల జాబితాలో, గ్రాంటా ప్రచురణ సంస్థ మార్టిన్ ఏమిస్, అయాన్ మెక్ ఇవాన్, సల్మాన్ రష్దీ, వంటి వారితో, ఇషిగురో పేరు కూడా చేర్చి ఇతని ప్రతిభనూ,



నోబెల్ సాహిత్య బహుమతి విజేత
కజునా ఇషిగురో

ముమ్ముందు ఇంకా రాణించబోతున్న అంచనానూ ప్రకటించింది. తాను పౌరుడిగా జీవిస్తున్న బ్రిటిష్ దేశంలో ఒక బట్లర్ పాత్రను సష్టించి, ఇషిగురో తన 32వ ఏట చెప్పిన కథ 'రిమైన్స్ ఆఫ్ ద డే' బుకర్ బహుమతి పొందింది. ఈ నవలను ఆయన ఏకబిగిన నాలుగు వారాల్లో రాశాడు.

తొలి నవల 'పేల్ వ్యూ ఆఫ్ హిల్స్'లో ఒక వ ద్ధ జపనీస్ మహిళ గురించి, 'యాన్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఫ్లోటింగ్ వరల్డ్'లో ఒక నడి వయసు పెయింటర్ గురించి, రాసిన ఇషిగురో, తన మూడో నవలకు ఇంగ్లండ్ దేశంలో ఒక బట్లర్‌పై రాసిన దానికి బుకర్ అవార్డు పొందాడు. బుకర్ బహుమాన తీరు గురించి, 'ఈ బహుమతి ఈ రకమైన రచనలకు ఎలా ఇస్తారో స్పష్టం కాదు. ఒక గుర్తింపు దిశగా ఈ బహుమతి ఉపకరిస్తుంది అనుకోను' అని తన అభిప్రాయం ప్రకటించాడు. తన మొదటి నవల 'ఏ పేల్ వ్యూ ఆఫ్ హిల్స్'లో ఒక జపనీస్ మహిళ ఆంగ్ల వ్యక్తిని పెళ్లి చేసుకుంటుంది. తన కూతురి ఆత్మహత్యకు తానే కారణమనే అపరాధ భావన ఆమెను వేధిస్తూ ఉంటుంది. ఈ ఆత్మహత్య ఆమెకు నాగసాకిలో తాను కలిసిన ఒక మహిళ, ఆమెకు పుట్టిన అణు ధార్మికత సోకిన బిడ్డ, ఆ ప్రజల్లో నేటికీ బాంబుదాడి విష రసాయనాల పట్ల గల భయం, యుద్ధంలో జపాన్ లొంగుబాటు... ఇవన్నీ కథలో కలిసిపోయి కనిపిస్తాయి.

రెండో నవల 'యాన్ ఆర్టిస్ట్ ఆఫ్ ద ఫ్లోటింగ్ వరల్డ్'లో ఒక జపనీస్ కళాకారుడు, తను విని ప్రభావితుడైన జపాన్ సైనిక ప్రచారం, చివరికి ఆ ప్రాపగాండా వైఫల్యం, తను గురయ్యే ఆందోళన, వేగంగా మారిపోతున్న సమాజ విలువల తీరును చిత్రీకరిస్తాడు ఇషిగురో. తను చిన్ననాడే వదిలి వచ్చిన జపాన్ దేశం గురించి సహజశీలంగా రాయగలుగుతున్న ఆయన రచనాశక్తిని విమర్శకులు ప్రశంసించారు. మూడవ నవల 'ద రిమైన్స్ ఆఫ్ ద డే'లో స్టీవెన్స్ అనే ఒక బట్లర్ 1956లో తాను ఒక దొరతో కలిసి చేసిన ప్రయాణ వివరాలూ, చేదు నిజాలు, మనుషుల మధ్య సంబంధాలు, కర్తవ్యం, గౌరవ పరిరక్షణ పేరిట తాను కప్పి ఉంచాడో వివరిస్తూ, అటు జపాన్, ఇటు బ్రిటన్ వీటి సంస్కృతుల జమిలి ప్రభావాలు నవలలో చెప్పుకోదగ్గ ఆకర్షణగా ఈ నవల మలిచాడు. ఇది పరిశీలకులను విస్మయపరచగా, బుకర్ గౌరవాన్ని తెచ్చిపెట్టింది 1989లో. తన రచనలకు అపరాధ పరిశోధన, సైన్స్ ఫిక్షన్, చారిత్రక కాల ఇతివ త్తాలుగా 'అన్‌కన్సోల్డ్', 'వెన్ వీ వెర్ ఆర్ఫాన్స్', 'ద బురీడ్ జెయింట్', 'నెవర్ లెట్ మి గో' ఇలా ఆరు నవలలు రాశాడు ఇషిగురో. కథలు, స్క్రీన్-ప్లేలు, పాటలూ కూడా రాశాడు.

పాశ్చాత్య సాహిత్య రంగం ఇషిగురో రచనా విధానం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపిస్తోంది. వేర్వేరు సందర్భాల్లో ఆయనతో జరిపిన సాహిత్య సంభాషణలు కూడా 'కాన్వర్సేషన్స్ విత్ కజువో ఇషిగురో' పేరిట ఒక సంకలనం కూడా వచ్చింది. సాహిత్య సంభాషణలను అచ్చు వేశారంటే... ఆంగ్ల సాహిత్య లోకం ఆయనకు ఇస్తున్న ప్రాధాన్యం అర్థమవుతోంది. ఇషిగురో నవలలకు ప్రాంత ప్రత్యేకతలు, మాండలికాలూ ఉండాలనే పట్టింపు కానీ, లక్ష్యం కానీ లేవు. భాషలో ఒక మాట వాడుపు, మాటలను కొత్తగా వాడడం వంటివి, రచనకు అంతగా అవసరం లేదని భావించాడు. పైపెచ్చు అటువంటివి అనువాదంలో కష్టాలు కలిగిస్తాయని అంటాడు. అంతర్జాతీయ నవల రాయడం తన అభిమతమని స్పష్టంగా ప్రకటించాడు. అందుకే ఇషిగురో రచనల్లో దేశ కాల నిర్దిష్టతలు ఉండవు. కథ ఎక్కడ జరిగి ఉండవచ్చో అనేది పాఠకుల ఊహకే వదిలేస్తాడు. జపాన్, బ్రిటన్ రెండు దేశాల్లో తన సాహిత్య సాంఘిక అస్తిత్వం ఏర్పడ్డ కారణంగా, రాబోయే శతాబ్దాల నవల అంతర్జాతీయ నవల కావాలి, అదే సాహిత్య పురోగతి అని విశ్వసిస్తాడు. ఒక ప్రసిద్ధ ఇంటర్వ్యూలో ఇషిగురో మాటలివి :

'అంతర్జాతీయ నవలలు రాయాలనుకునే రచయితను నేను. అయితే అంతర్జాతీయ నవల అంటే ఏమిటి? ప్రపంచంలోని భిన్న ప్రదేశాల మానవుల నేపథ్యాలను ఒక విశాల లోక దృష్టితో రాయగలగడం. అందులో ఖండాంతరాలకు విమానాల్లో వేగవంత ప్రయాణాలు చేసే పాత్రలుండవచ్చు. అయితే అంత సులభంగానూ, అవి ఒక ప్రాంతానికి చెందినవిగా కథా చిత్రణలో ఒదిగిపోగలగాలి.

ఇలా అంతర్జాతీయంగా రాయాలి అన్న తలపు, ప్రణాళిక గల రచయితలకు అనేక క్లిష్టతలు ఉంటాయి. పాఠకుడి పరిజ్ఞానం పట్ల, రచయిత తెలివి తక్కువగా నిర్ధారణలకు రారాదు. కేవలం వాళ్ళు వేసుకున్న దుస్తుల బ్రాండ్ పేర్లు చెప్పడమో, వారు వాడే వస్తుజాలం ఏఏ భిన్న ప్రదేశాల్లో తయారైందో చెప్పేస్తే, అది అంతర్జాతీయ నవలగా మారదు. ఇలా రాయడం అతి తక్కువ మందికి నచ్చవచ్చు కానీ, భావి తరాల పాఠకులు దీని వలన పెద్దగా ప్రభావితం కారు. అలాగే మాటలతో ఆటలు, మాట విరుపు, ఒక నిర్దిష్ట పదజాలం వాడుక వంటి భాషకు సంబంధించిన తెలివి తేటల ప్రదర్శన వలన కూడా రచనా ప్రయోజనం కష్టమే, అంతేకాక అవి అనువాదంలో లొంగకుండా పోయే ప్రమాదమూ ఉన్నది. (నా ఉద్దేశంలో ఏ రచయిత అయితే ప్రపంచంలో తన ఒక్క భాష మాత్రమే ఉన్నది అనుకుంటాడో.. తాను అతి తక్కువ పాఠకులకు పరిమితం అయిపోవడానికి పూర్తిగా అర్హుడు.) ఏవి ప్రపంచ మానవులకు అందరికీ పట్టే విషయాలో, వాటిని గుర్తించగలగడం, ఇలా రాయాలి అనుకునే రచయితలకు చాలా అవసరం.

ప్రపంచం మొత్తం ఎప్పటికన్నా ఎక్కువగా అంతర్జాతీయం అవుతున్నది. రాజకీయాలు, వాణిజ్యం, సామాజిక మార్పుల తీరుతెన్నులూ, లేదా కళలూ, వీటి గురించిన చర్చలు, అంతర్జాతీయ ప్రాతిపదిక పైన కాక, ఇంకో సంకుచిత పరిధిలో మాట్లాడుకునే దశ మనం దాటిపోయి చాలా కాలం అయింది. నవల కనుక ఒక ముఖ్య రచనా ప్రక్రియగా వచ్చే శతాబ్దంలోకి బతికి ప్రయాణించాలి అనుకుంటే, అందుకు అనుగుణంగా రచయితలు, అందరూ అవును అనుకునే ఒక అంతర్జాతీయ నవల రూపాన్ని సృష్టి చేస్తేనే సాధ్యం. ఇటువంటి నవల సృష్టి నా ఆశయం."

కజువో ఇషిగురో నవలల్లో ఈ ఆశయసిద్ధి ఏ మేరకు సాధ్యపడ్డది అన్న చర్చ ఉన్నా తూర్పు-పడమర మానవ జీవనాల, చరిత్రల, సాహిత్య దార్శనికత తో.. ఈ ఆధునిక ఇంగ్లాండ్ దేశ, ఆసియా జాతి పౌర రచయిత సాధించిన మానవ జీవన చిత్రణ ప్రగతి.. కథ చెప్పడంలో గల ఒక పురాతనమైన మెలకువ, ప్రజ్ఞ ఇతని సృజన వేదికను.. ఖండాల విశాలత్వంతో మానవాళికి అందించినందుకు, గుర్తింపుగా అందిన నోబెల్... రాజకీయాలకు, వివాద కీర్తివంతులకు కాక, సాహిత్య నిష్ఠగల పూర్ణ ప్రతిభకు కట్టిన పట్టంగా గౌరవించి, అభినందించడానికి పూర్తిగా యోగ్యుడు, అర్హుడు, కజువో ఇషిగురో.

– రామతీర్థ
98492 00385

గాయాల గేయాలే ఉరితాళ్లు

కవిత

ఇంకా
నెత్తురు పచ్చిగానే ఉంది!
కారిన నెత్తుటి ధార
గడ్డ కట్టనే లేదు!

తమ్ముడా...
వాడు మళ్లీ కత్తులతో వస్తున్నాడు
వెయ్యి నాల్కల అబద్ధాలతో చెలరేగుతున్నాడు

చెప్పాను కదా నీకు
హెచ్చరించాను కదా నిన్ను

వాన వరదయ్యిందీ
వరద తుపానూ అయ్యిందీ
గొడుగులకు కత్తులు మొలవాలిప్పుడు
గొంతుల్లో నిరసన మొక్కల్ని నాటాలిప్పుడు

రాజ్యం వాడిదే కావొచ్చు
నిబద్ధ గుండె ధైర్యం మనది
పోలీసు బూటుకాళ్లను మనగుండెల పైకి విసరొచ్చు
కాషాయపు లాఠీలు మన మర్మాంగాలపై కలబడనూ వచ్చు

తమ్ముడా...
భయం తెలియని సమూహంపై
దాడి చేసిన వాడికేం పేరు పెడదాం?

విశాఖ సముద్రం
వాడికో మాట చెప్పమంది

దేహాల మీద దాడికొచ్చే రాజ్యమా
గాయాల గేయాలే నీకు ఉరితాళ్లు!

(ప్రజా ఉద్యమ కేంద్రాలపై దాడులకు నిరసనగా)

– స్పార్టకస్
9642108756

కవిత్వాన్ని శ్వాసించిన కాలాత్మ

''సంప్రదాయం, వైయక్తిక ప్రతిభ'' అనేది ఎలా కాల ప్రవాహంలో కవులు నడిచే దారో, అది ఎలా 20వ శతాబ్దంలో 1940–50ల నాటికే, ఎప్పటికన్నా ప్రజల పక్షాన ఉన్నదో చెప్పిన రొమాంటిక్ ఉద్యమ పారంగతుడు కృష్ణశాస్త్రి.

సందర్భం

రామతీర్థ

కళింగ కడలి యాన గాలి పాటగా, ''ఆకులందున అణిగి మణిగి కవిత కోయిల పలకవలెనోయి'' అని గురజాడ రాసిన పుష్కర కాలానికే, ''ఆకులో ఆకునై, పూవులో పూవనై, ఈ అడవి దాగి పోనా, ఎటులైన ఇచట నేనాగి పోనా'' అంటూ, అడవులను అనుమతులు అడుగుతూ, తన తృష్ణానంత కృష్ణ పక్షపు ఒక్క రెక్క తోనే పిట్టగా ఎగిరి వస్తానని కబుర్లు పంపుతూ, గురజాడకు గురువందనం చేసి, ఈ కవిత్వ మంత్ర దండం అందుకున్న ''అనంతాంబరపు నీలి నీడ'' పేరు కృష్ణశాస్త్రి. ఉద్యోగం భావకవి. ఊహాలోకంలో ఊరు దేవులపల్లి అనే దేవతల పల్లె. పుట్టింది పిఠాపురం దరి సంస్థాన ఏలుబడిలోని చంద్రం పాలెం. తాను రాసిన వంద కవితల లోపున 3 సంపుటాల అక్షర రమ్యతా, అభివ్యక్తి సంపన్న లలితత్వం, ప్రతి రచనలో పొదిగిన తన ముద్రా, ఇవీ ఒక వ్యక్తిని ఒక కవి చేసిన సామగ్రి.

''నా నివాసమ్ము తొలుత మధుర సుషమా సుధాగాన మంజువాటి, ఏనొక వియోగ గీతిక'' అంటూ, వెర్రెత్తిన ప్రేమ గంగలా చిందులేసి, గండ భేరుండంలా ఎదిగే లక్షణాలున్న శ్రీరంగం శ్రీనివాసరావు అనే కుర్రవాడిని, తన ప్రభావంలోకి లాక్కున్న కవిత్వ కృష్ణబిలం కృష్ణశాస్త్రి. కవి అజేయత్వాన్ని విశ్వసించిన కాలాత్మ కృష్ణశాస్త్రి. కవిత్వ చిరాయుష్షు రహస్యం మనకు ఈ మూడు సంపుటాల కవితల్లో స్పష్టం కాదు. తన కవితల్లో ఆకు పచ్చ గుబురులు, పొగ మంచులు, పూల తివాచీలూ, మబ్బు జలతారుల మధ్య ఉండే ఒక కవి, దేవులపల్లి కృష్ణ శాస్త్రి, బైరన్ వలె గిరజాలు పెంచుకు తిరిగే యువ కవిత్వోల్లాసి, 1925కు ముందరే ఈయన ''కృష్ణపక్షము'' రచన పూర్తయింది. 1924లో రాసినది, (అప్పట్లో ''సఖి'' పత్రిక రుథోరోద్గారి సంచిక 1923–24 లో ప్రచురితం అన్న వివరణతో ఉన్న వ్యాసం) ''మా ప్రణయ లేఖల కథ'' ఏ యువ కవి కూడా తన తొలి సంపుటికి ఇవ్వని విశేష వివరణ. ఇక ముందర రాబోయే రచనలు ప్రవాసమూ, ఊర్వశి, వీటి ప్రస్తావనలు కూడా ఈ వ్యాసంలో ఉన్నాయి. 1956లో కృష్ణశాస్త్రి మదరాసు రేడియోలో ప్రొడ్యూసర్‌గా ఉద్యోగంలో చేరారు. చేసిన ప్రసంగ వ్యాసాల్లో ఒక చోట, ఊహాశక్తి కవిత్వ పింఛంగా విప్పారాలి, వర్ధిల్లాలి అంటే సాంస్కృతికత, కాల్పనికత, వాస్తవికత, పోటాపోటీగా సమతూకంలో రాణించాలని సూత్రీకరించారు.

1922 సేక్రెడ్ వుడ్ వ్యాసాల్లో టి.ఎస్. ఇలియట్ ''ట్రెడిషన్ అండ్ ఇండివిడ్యుయల్ టాలెంట్'' అని రాసింది ఒక కవిపై పూర్వ కవుల ప్రభావాల గురించిన ఒక ప్రామాణిక పరిశీలన. ఇరవయ్యో శతాబ్దపు పాశ్చాత్య సాహిత్య రచనల్లో చాలా ముఖ్యమైనదితను రాసిన వంద లోపు కవితలు రాయడానికి కృష్ణశాస్త్రి ఎంత చదువుకుని ఉండాలో, ఆటుపై తాను ఎలా తన దృష్టి దృఢత్వాన్ని పెంపొందించుకుంటూ వెళ్లారో చెప్పేదే, ''కవి– ప్రజ'' అన్న వ్యాసం. ప్రజలదే ఉమ్మడి బహుళ వారసత్వం, ఇది కవుల ద్వారా దఖలు పడుతుంది, అన్న అవగాహన ఏర్పడ్డ శాస్త్రి గారు ఆధునికతకు గుండె చప్పుడు అని తెలుపుతుంది. ఆంగ్లంలో దీన్ని అందిస్తే, ఇలియట్ కన్నా ఒక కోణం ముందుకు వెళ్ళి, ''సంప్రదాయం, వైయక్తిక ప్రతిభ'' అనేది ఎలా కాల ప్రవాహంలో కవులు నడిచే దారో, అది ఎలా ఈ ఇరవయ్యో శతాబ్దంలో 1940–50ల నాటికే, ఎప్పటికన్నా ప్రజల పక్షాన ఉన్నదో చెప్పిన రొమాంటిక్ ఉద్యమ పారంగతుడు కృష్ణశాస్త్రి. ''ఏ అసంఖ్యాక ప్రజలతో ఈ రోజుల్లో మనకి మరీ సన్నిహిత సంబంధం ఏర్పడుతుందో, ఆ ప్రజలలో నిలిచి ఉన్న సంప్రదాయాలతో కవికి పరిచయం లేకపోతే, అతని కంఠ స్వరం ప్రజలు ఆప్తమైనదిగా పోల్చుకోలేరు. అతని మాటలు పరాయి భాష లాగా ఉంటాయి. కనుక ప్రజలతో సన్నిహిత సంబంధం కవికి ఉండాలంటే, వాళ్ళ కలిమి లేములూ, కష్టనిష్టూరాలే కాక వాళ్ళు నిలబడి ఉన్న జాతి సంప్రదాయాలు కూడా అతగాడు వివేచనతో, చనువుతో, గౌరవంతో ఎరిగి ఉండాలి'' అన్నారు 1948లో కృష్ణశాస్త్రి. అప్పటికి ఇంకా మహాప్రస్థానం అచ్చుకాలేదు. (అచ్చయింది 1950లో).

ఆయన స్థిర పడలేదు, స్థిమిత పడలేదు., పైపెచ్చు ఆ రెండూ అంటే తనకు వెగటు అని చెప్పిన కాలుండబట్టని, మనసు ఊరుకోని కళ, జీవితాల అద్వైతి కృష్ణశాస్త్రి. వీరేశలింగం గురించి రాసినా, రావి చెట్టు గురించి రాసినా, ఒక ప్రాచీన ప్రసంగావేశం వారి మాటల్లో, రాతల్లో.. తూరుపు, పడమర తేడా లేకుండా సమస్త కవిగణాల విషయమై, వారు కీర్తించిన ప్రకృతి, ప్రజల విషయంలో, మంచి మాటలే చెప్పిన కవి శిరోమణి, మానవేతిహాసంలో, అన్వేషణలో దుఃఖాలు మీదు కట్టి , ఒక అమూర్త ఊర్వశిని అవతరింపచేసుకున్న అరుదైన కవి. కవి అన్న మాటకు పర్యాయపదం లేదని చెప్పిన ద్రష్ట, సత్యం జ్ఞానులది కాగా, శివం కార్యోత్సాహులది కాగా, సుందరం మాత్రం కవుల కరతలామలక కళ అని ఉద్ఘోషించిన కాలాత్మ కృష్ణశాస్త్రి గారిని ఇంకా మనం పూర్తిగా తెలుసుకోవడం మొదలు పెట్టలేదు. వారి రచనల అయిదో సంపుటి, కృష్ణశాస్త్రి వ్యాసాలకు ముందు మాటలో ''ఇది ఇక్షుసముద్రం, ఆస్వాదిద్దాము రండి'' అని ఆహ్వానించారు శ్రీ శ్రీ. ఈ నూట ఇరవయ్యో జయంతి నుంచి ఆ పని చేద్దాము.

(రేపు కృష్ణశాస్త్రి 120వ జయంతి)

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత
మొబైల్ : 98492 00385

సాక్షి SAKSHI TELUGU DAILY
Tue, 31 October 2017
epaper.sakshi.com//c/23317699

చెరువు నిండినప్పుడు చీమలే చేపలకాహారం.
చెరువు ఎండినప్పుడు చేపలే చీమలకాహారం.
కొన్ని లక్షల అగ్గిపుల్లల తయారీకి ఒక్క చెట్టు చాలు
కొన్ని లక్షల చెట్లను కాల్చడానికి ఒక్క అగ్గిపుల్ల చాలు
పరిస్థితులు ఎలాగైనా మారవచ్చు
అందుకే ఎవరినీ తక్కువగా చూడకండి
ఎవరి మనసునూ గాయపరచకండి

'సజ్జనుడు' కాని సతీష్ చందర్‌కు 'పతంజలి పురస్కారం'

కొంతమంది సజ్జనులు కాని వారు, అలా అప్పుడప్పుడు సరిగ్గా సమయానికి వచ్చేసిన రుతు పవనాల్లా గుర్తింపు పొందుతూ ఉంటారు. తమ పుట్టుక, ప్రాంతం, మతం కూటములుగా కొలువు దీరుతున్న కాలంలో కుడితి గోలెం చుట్టూ తిరిగే పశువులా (అవి అంటే నాకు చాలా గౌరవం ఉన్నది) తమ సృజన, ఆలోచన, రచన కట్టేసుకుంటున్న కాలంలో "మాకు గోడలు లేవు గోడలు బద్దలు కొట్టడమే మా పని" అని తేల్చి చెప్పిన ఒక సారస్వతాచార్యుడు పుట్టిన శతాబ్దాన్ని పంచుకున్న అతి కొద్ది మంది మాత్రం ఈ పనిలో ఒక జీవనకాల నిమగ్నులు. వారు సజ్జనులు కారు. అలాంటి వారిలో మన కాలపు ఫీల్డ్ మార్షల్ కాకర్లపూడి నరసింహ యోగ పతంజలి. ఆయన గురుపరంపర లో గురజాడ, శ్రీ శ్రీ, రావి శాస్త్రులను స్మరించి సైనిక వందనం చేసాడు. పతంజలికి పలికే మాటా , పేలే వాక్యమూ వేరు కావు. ఆయన మాటలు, వాక్యాలు, నిప్పు కణికెల్లాంటి తూటాలు నింపిన నిలువెత్తు తుపాకుల్లా రచనామైదానాల్లో నిలబడి, ప్రజాస్వామ్య శక్తికి వందనాలు చేస్తూ ఉంటాయి. వెటకారం, వెక్కిరింత, ధిక్కారం తమ జెండా రంగులుగా గురజాడ కాలం నుంచి రచయితలు ఆధునిక సమాజానికి వీర పూజలు చేస్తూ ఉన్నారు. రావి శాస్త్రి విస్ఫోటక దండక దండనా పరంపర, పాత్రల ద్వారా పలికించినది, షేక్స్పియర్ నాటకాల పాత్రల ప్రఖ్యాత దీర్ఘ సంభాషణా చాతురిని మించిపోయిందని మనకు చదువుతుంటే తెలుస్తుంది. ముఖ్యంగా పతంజలి శకం ప్రధాన లక్షణంగా సామాజిక వచనంలో వాక్యం నిర్మాణ సౌష్టవం గల విధ్వంస తాండవం చేస్తుంది. ఆ వాక్యాలు చదువుతుంటే, మనకు వాక్య స్తంభాల్లోంచి బద్దలుకొట్టుకు పైకి వచ్చే నరసింహ దర్శనం అవుతుంది. స్తంభోద్భవ గద్యం, సమాజ న్యాయోద్భవ ఆవాహన చేసే వచనం అయితే అది వీరందరికి ముందర "శాస్త్రీయం"గా ఒక విశాఖ %--% విశ్వనాథుడికి లొంగింది. ఆ రావి శాఖల ప్రచండ బాహువులే అభ్యంతరానికి అభ్యంగన స్నానం చేయించి, కతలమ్మ , కవితలమ్మ జాతరలు జరిపే ఉన్నతులైన పతంజలి, దేవి ప్రియ, సతీశ్ చందర్ రాతల్లో, మోహన్ గీతల్లో జలపాత సదృశంగా, మూఢ నమ్మకాల పెత్తనాల బండ రాళ్ళ పై నించి లెక్క లేకుండా దుమికింది.

పతంజలి చూపున్న పాటలో ఒక పోలీసు పాత్ర ఉంటాడు -వాడు రక్షక భటుడు కాదు భక్షక రటుడు, వాడో పాట గాడిని భంగ పరచబోయిన కథ , ఎలా పాటని పాముని చేసి వాడిని వెంట తరుముతుందో, అలాగే, సతీష్ చందర్ కథలో పరమహంస అనే మరొక భక్షక రటుడు -ఏమవుతాడో "ఫుడ్ పాత్" కథలో చూస్తాము. వెక్కిరిస్తే తొక్కలాడి రావాలి, ధిక్కరిస్తే, వైరి వర్గాలకు దిక్కులు చీకటై పోవాలి, వెటకరిస్తే, తల దించుకోవాల్సిన పాతాళం కూడా సిగ్గు పడాలి. ఇది గురజాడ ఎరిగిన విద్య.ఆయన ఆయుధం చిరునవ్వు, పోరు పన్నితే వ్యంగ్య వ్యూహం. గెలుపోటములు రెండూ ఓడిపోయి, తలపడ్డ ప్రజలు ఒక్కటై సమాజానికి అలంకారాలు కావాలన్నది ఆయన తర్క దర్శనం. దీన్ని పంచుకున్న వారెవరూ సజ్జనులు కారు. అలా

సజ్జనులు కాని వారిలో ఒక తరంలో పతంజలి మొదటి వరుస సాధకుడు. అసెంబ్లీలు చతికిలపడిపోయి, మంత్రి గణాచారులు ఎలా అధికార వీరంగం ఆడుతారో, "అప్పన్న సర్దార్" లో ఒక రాష్ట్రపు సర్కార్ కథ చెప్పినప్పుడు , పతంజలి వచనం తుపాకి మందు వాసన వేసింది. ఆయన ఖాకీ వనం శతాబ్దాల నాటి తెల్లవారి రక్షక భట చట్టాలను వాటి అమలును ఎండగట్టింది. ఈయరా రచనలన్నింటా ఇరవయ్యో శతాబ్దపు పదును కనిపిస్తుంది.

'తుపాకులేడిస్తే తూటాలు కన్నీళ్ళు అవుతాయి' అని సతీష్ చందర్ రాశాడు. పతంజలి వాక్య గంధం, ఒక శతాబ్ది ప్రజాపక్ష వచనంలో తెలుగు గొంతు. అది మొదలైంది గురజాడతో. 1969లో కొలకలూరి ఇనాక్ కథ ఊర బావి రావడానికి ముందరే %--% తెలుగు కథకులు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి (సాగర సంగం, 1931 లో) , బందా కనకలింగేశ్వర రావు(గు,క్కెడు నీళ్ళు 1932లో) వేలూరి శివరామ శాస్త్రి (మాల %--%దాసరి,1933లో) కరుణకుమార (పోలయ్య, 1937లో) అనిసెట్టి సుబ్బారావు (పాకీది, 1943లో) , చలం (హరిజన సమస్య, 1946లో), అడవి బాపిరాజు (నరసన్న పాపాయి, 1954లో) గోపిచంద్ (చెప్పులు కుట్టే వాడు, 1961లో), తెలుగు సమాజ మౌఢ్యాన్ని ప్రశ్నించే కథలు రాశారు. కేవల ఆక్రోశాన్ని మాత్రమే కాక బడుగు వర్గాల ఆత్మ విశ్వాసాన్ని, ఈ కథలన్నీ పాత్రలు ఎదుర్కున్న సమస్యలు, అవమానాలు, సవాళ్ళ , స్వభావాల చిత్రణలో జవ జీవాలు, జవసత్వాలతో చెప్తాయి. వీరెవరూ కూడా సజ్జనులు కారు. ఆ కోవలో కథల్లో నవకవనం చెప్పిన సిందూరం, రక్త చందనం వంటి కథకుల కోవలోకి తన గురు త్రయం సాక్షిగా పతంజలి కి మొదటి తాంబూలం తప్పనిసరి.

అలాంటిదే, శ్రీ శ్రీ "విదూషకుని ఆత్మహత్య" ఆరంభంలా మొదలై, బిగి తగ్గని కథనంతో, సతీష్ చందర్ చెప్పిన డాగ్ ఫాదర్ కథ, నేటికీ అష్టాదశ వర్ణాల నాటి అవమానం, ఆత్మ గౌరవాల కథ. ఆక్రోశంలా మొదట కనిపించినా, కథ ముగింపులో అవి ఆత్మ విశ్వాస వచనాలని, చదువరులకి కొత్త ఎరుక కలుగుతుంది. మారే సమాజం ఎలా మారుతుందో చెప్పే నేర్పు, ఓపిక గల వేగ వంతమైన వాక్యాలను సతీష్ చందర్ రాయగలడు. మాటలతో ఆడుకోగలడు తెలుగు లిపికి, లిప్స్ కీ ముడి పెట్టగలడు. వాక్యాలకు కవిత్వ ఛంచాలనిచ్చి, తను కనిపించని నెమలిలా మయూర నర్తనం చేయగలడు. ఆంగ్లంలోనూ ఎడిటోరియల్స్ లాగా ట్విట్టోరియల్స్ అంటూ రాతోపరాతలు రాసిన దిట్ట. దశాబ్దాలుగా పత్రికల 'పెరుగులాట"లో తన సామర్థ్యాన్ని రంగరించిన పాత్రికేయ సేనాని గా కూడా పతంజలి దారిలో ఒక సహచరుడు. "గాయమే హృదయం" అనగలిగిన వాడు, బుగ్గల్నీ, మొగ్గల్నీ, బుగ్గ సొట్టల్నీ, లోయలను కలిపేయగల భౌగోళిక మాంత్రికుడు, "ప్యార్ కియా తో దర్నా క్యా" అన్నదే ఒక సనాతన ప్రతిజ్ఞ అనుకుంటే, అదే తన కథలో చెప్పినప్పటికీ, కొత్త ట్రీట్మెంట్, తన కాలం, తన ఉనికి, ఎలా "డాగ్ ఫాదర్" పద్దెనిమిదేళ్ళ కిందటి కథలో నిలబెట్టాడో చూస్తే, మనకు తెలుస్తుంది సజ్జనుదెవ్వరూ ఇటువంటి పోకడలు పోలేదని. మూకుడు లో రొయ్యలు ప్రశ్నార్థకల్లా వేగుతున్నాయని పోల్చగల ఉపమాలంకార ఉద్ధృతికి కళ్ళెం వేసి పట్టుకుని ఇలాంటి కథలో కదలికకు, ఎలా రచయిత ప్రాధాన్యత తగ్గకుండా నిర్వహిస్తాడో, ఒక సుదీర్ఘ పరిశీలనకు సరిపోయే బిగి, బిగింపు, ప్రస్తావన, ప్రచోదన, పరిసమాప్తి పాటిస్తూ, తెర లేచి, తెర దిగినట్టు చెప్పిన సాటి ఈ సతీష్ చందర్, -తన కవితలకు మహాభారత ఇతిహాస సాంప్రదాయంలో గల సామాజిక నామాలను పెట్టాడు పంచమ వేదం, ఆదిపర్వం అంటూ. రాజమండ్రి, గోదావరి, నన్నయ ఉత్కృష్టతలను తన గాలిలోంచి పీల్చుకుని, నేలలోంచి ఇంకించుకున్న వాడు ఈ సాహిత్య శ్రామికుడు. హాస్యం లోనూ నన్నయను తలుస్తాడు. శ్రీనాథ స్మరణ చేస్తాడు.

కథలో గద్దపార ఉందని చెప్పి, ఆ పనిముట్టు ఉనికిని సార్థకం చేయగల స్పృహ గలవాడూ, తెలుగు కథకు వెలుగు అంచు అయిన అతి కొద్ది కథకుల్లో ఒకడు సతీష్ చందర్. ప్రభావాలు స్పష్టమే కానీ పేలవమైన అనుసరణలు చేయని ఈ రచయిత పతంజలి కన్నా ఎక్కువగానే కవిత్వం రాశాడు. కథలు ఇంకా కొంచెం ఎక్కువగా రాయగల సత్తా ఉన్న వాడు. పాత్రికేయ రచన కొంత ఈ ప్రతిభారాశిని లాక్కున్నా, ఈ సారి పతంజలి పురస్కారం, ఒక సాహిత్య సామాజిక మాధ్యమాల నిపుణుడికి మార్చి ఇరవై తొమ్మిదిన విజయనగరంలో ప్రదానం జరగడం సముచితం. సతీష్ చందర్ చెప్పాడు 'సజ్జనులంటే' ఎవరో. ఏ మాత్రం జీర్ణించుకునే శక్తి లేకుండా, ఆ శ్రమ పడకుండా, "మా బాబాయి సజ్జనుడే " లో (1993లో రాసిన కథ) సాహిత్య , సృజన రంగాల్లో కాపీ గాళ్లని, "సజ్జలు తిని సజ్జలు విసర్జించే సజ్జనులు వారు" అని వర్ణించాడు సతీష్ చందర్. -ఇది రచయితలకు, పత్రికా రచయితలకు కూడా తగిలే విసురే -కానీ ఇలాంటి ఈటె పోట్లు పతంజలి రాజు గారికి ఇష్టమైన విద్య. ఆ విద్యలో తీసి పోని సమాజ శస్త్ర చికిత్సా నిపుణుడు, బహు సున్నితమైన పనిముట్ల "సర్జను"డు అయిన, సజ్జనుడెంత మాత్రమూ కాని సతీష్ చందర్ ని, పతంజలి కీర్తిసూత్ర బద్ధుడు అవుతున్న సందర్భంగా తెలుగు సాహిత్యలోకం అభినందిస్తున్నది.

-రామతీర్థ (98492 00385)

చూపున్న పాట



పూలతీగ కాళ్ళకు చుట్టుకుని కారెనుబోతు ఆగిపోయినట్టు ఆ వేణువాదం విని విశ్వ నాథం ఆగిపోయాడు. జన ప్రవాహం పై నుంచి వంతెన, దానిమీద రైలుపట్టాలు. వంతెన గోడ కానుకుని ఒక గుడ్డి మనిషి. అతని బండ పెదవుల వానుకొని ఎప్పుడూ ఒక మురళి. ఆ మురళీ రంధ్రాల నుంచి కాటుక పొగలై, పర్జాలై జరజర పాకివచ్చే పాటలు. విశ్వనాథానికి మోటారు సైకిలు చప్పుడులో ఆ పాటలు ఎప్పుడూ వినిపించవు. వంతెన పైనుంచి వెళ్ళిపోయే రైలూ ఆలకించదు. వంతెన కిందనుంచి ప్రవహించే జనమూ ఆలకించదు. మోటారు సైకిల్‌మీద వెళ్ళిపోయే విశ్వనాథం ఎన్నడూ వినలేదు. గుడ్డివాడి పాటలు గరిక పూలై ఆ రోడ్డునిండా గుట్టలు గుట్టలైతే విశ్వనాథం వాటిని తొక్కుకుంటూ వెళ్ళిపోతాడు.

ఒక రోజు వంతెన దగ్గర అతని మోటారు సైకిల్ ఆగిపోయింది. చీదరించుకుంటూ ఆ సైకిలుకు స్టాండు వేసి నిల్చున్నాడు. పైనుంచి చండాలంగా చప్పుడు చేస్తూ ఇంజన్ ఒకటి వెళ్ళిపోయింది. దూరంగా వున్న ఏదో చెట్టుమీద ఒక కోకిల 'న్యూసెన్స్'గా కూస్తున్నది. దానికి తోడు - ఈ గుడ్డి గాడిద కొడుకొకడు.. ఫ్లూటు అంటారు గావోసు - ఖాకీ పేంటు జేబులోంచి అతను ఖాకీ సిగరెట్టు తీసి వెలిగించి ఖాకీ పొగ వదిలాడు. గుడ్డి మనిషి వేణువులోంచి ఒక పామొచ్చి విశ్వనాథాన్ని చటుక్కున కుట్టింది. ఉలిక్కిపడ్డాడతను. -గుడ్డి లంజికొడుకు వాయిస్తున్నది ఏ పాట? గద్దరుగాడి పాట!.. అమ్మనాకొడక.. నక్సలైటు నాకొడక- దోపిడీ చెయ్యడం కాడ్నించి అడుక్కునే పన్లో కూడా మీరే దొచ్చుకుపోయేరన్నమాట. విశ్వనాథం చరచర నడుస్తూ ముసలాడి దగ్గరకు వెళ్ళాడు. 'ఏంరోయ్.. గుడ్డినాకొడకా..' అని పిలిచాడు. గుడ్డిమనిషి అది వినలేదు.

"నీ పాటా పాడుతున్నమూ.. నీ ఆటా ఆడుతు న్నామూ..' అంటోంది మురళి... వంగి అతని చేతిలోంచి మురళి లాక్కుందా మనుకుని, -మనకి దేవుడిచ్చిన కాళ్ళుండగా చేతులెందుకు పాడుచేసుకోవాలి అనుకుని ఎర్ర బూటుతో ఆ మురళిని కదిపేడు. ఆ బూటు మడమ గుడ్డి మనిషి గడ్డానికి తగిలింది. గుడ్డికళ్ళ గుహల నుంచి చీకటి చిమ్ముకొచ్చింది. అతను కంగారుగా భయంగా లేచి నిల్చున్నాడు. చేయి ముందుకు చాస్తూ - 'ఎవరది.. ఎవరది..' అని పిరికిగా, భయంగా అన్నాడు. నీ అమ్మ మొగుడ్ని.. గుడ్డి నాకొడకా.. ఏం పాటలు పాడుతు న్నావురా? కాల్జేతులు విరిచీగాల్ను..' గుడ్డి మనిషి నిజానికి పుట్టుగుడ్డి. వాడికీ వెలుతురంటే తెలీదు. మనుషుల ఆకారం తెలీదు. జంతువుల ఆకారం తెలీదు. కాని కొకుఒక్కస్తే, పోలిసోస్తే అతనికి ఎలాగో గాని తెలిసి పోతోంది. వచ్చినవాడు పోలీసని అతనికి తెలిసిపోయింది.

'పోలీసా?' అని అతను భయంగా అడిగాడు. విశ్వనా థానికి అనుమానం గట్టిపడి పోయింది. "నన్ను చూడగానే పోల్చిసావు అంటే నువ్వు నిజంగా గుడ్డోడివి కాదన్నమాట..' అన్నాడతను. "చూడగానే కాదు బాబూ, నాకు చూపు లేదు. చప్పుడు బట్టి పోల్చాను.." అన్నాడు గుడ్డి మనిషి దండం పెడుతూ దండధారులు దండాలకి కొంత తగ్గుతారు. విశ్వనాథం తగ్గి - "నువ్వు అడుక్కుతినే నాకొడుకువు కాదా?" అని అడిగాడు. "అడ్డుక్కొను తండ్రీ! నేను ఈ ముర్లి వాయిస్తాను.. దయగల తండ్రులు పావలా బేదా ఇస్తారు.." "వాయించుగానీ.. చక్కా దేవుడి పాటులుం టాయి అయి వాయించుకో.. ఇలాంటి నక్సలైటు పాటలు కానీ పాడేవంటే చవటొబ్బుతాను" అన్నాడు విశ్వనాథం గుడ్డి మనిషి కంటిముందు చూపుడు వేలు ఆడిస్తూ. గుడ్డి మనిషి మాట్లాడలేదు. విశ్వనాథం అక్కడ్నుంచి వచ్చేశాడు. మరో నాలుగు రోజులు పోయినతర్వాత ఆ దోవన వస్తుంటే ఆ గుడ్డి మనిషి మురళి వాయిస్తూడటం కనిపిం చింది. - 'మన శిశువు ఏటి వాయిస్తున్నాడో సూద్దారి' అనుకుని అతను మోటారు సైకిల్ ఆపుచేశాడు. "దండూ దండూకు నేను ఎఱ్ఱజం డవొదు భారతీ గిరియాల కూలివాలన్నాలు నా కూలీవాలన్నాలు దండుల్లేరంగో దండూ దండూకు నేను ఎఱ్ఱజండవొదు" క్షతగాత్రంతో మురళి పాడుతోంది. విశ్వనాథం పడగవిప్పాడు. సైకిల్ స్టాండ్ వేసి, గుడ్డివాడ రెక్క పట్టికొని ఆఘాట్టున పైకి లేపాడు. వళ్లంతా తూట్లుపడిన వెదురుముక్క కిందమంట్టిలో పడిపోయింది. "పదరా స్టేషన్‌కి.. నీ గుడ్డి కళు ౖ పీకేయకపోతే నేను పోలీసునై పుట్టలేదు.." అన్నాడు విశ్వనాథం. గుడ్డికళ్ళనో, అందులో మంచి చుంచెలుకల్లాగ తొంగి చూస్తున్న భయాలనో దాచడానికి అతని రెప్పలు రెక్కలు వాల్చేయా. బండపెదాలు భయంగా రోకలి బండల్లాగ ముడుచుకున్నాయి.

"ఎందుకండి బాబు" అన్నాడు గుడ్డి మనిషి

"మొన్న నీకేం చెప్పాన్రా?" గుడ్డివాడు పెదాలతో గాలి మాత్రం వూదుగలడు. అది మురళి గొంతులో మాత్రం శబ్దమౌతుంది. శక్తివంతమౌతుంది. అందువల్ల అతనేమి అనలేదు. "దేవుడిపాటలు పాడమన్నానా లేదా?" అని కోపంగా అడిగాడు విశ్వనాథం. గుడ్డి మనిషి వెర్రినవ్వు నవ్వాడు. విశ్వనాథం బుస్సుమన్నాడు. "నేను సీరియస్‌గా అడుగుతుంటే నీకునవ్వొస్తున్నాదిరా లంజకొడకా" అన్నాడు అతను "పావల డబ్బులిచ్చి ఏ పాట పాడమంటే ఆ పాటతానండి" అన్నాడు గుడ్డి మనిషి చాలా మృదువుగా విశ్వనాథం చేయి విడిపించుకుంటూ. "మరైతే నువు వాయిస్తున్న పాటకి డబ్బులు ఎవరిచ్చేరు.. మావో సేటుంగ్ ఇచ్చాడా? చారుమజుందరాచ్చేడా.. నీ అమ్మా మొగుడిచ్చాడా? చెప్పు లంజకొడకా? ఏ లంజకొడుకు నీకు డబ్బులిచ్చి ఈ చెండాలపు పాటలు పాడిస్తున్నాడు.." అని చాలా కక్షగా అడిగాడు. "ఈ పాటలు మంచియిగాదా తండ్రీ?" అని ఆ గుడ్డి మనిషి నెమ్మదిగా అడిగాడు. "కాదమ్మా. నువ్వు మంచి పాటలు పాడితే నేనెందుకు తిడతానమ్మా. నువ్వు శ్రీ వెంకటేశ ఈశా పాట వాయించు. గవర్నమెంటుతో మాట్లాడి నీకు భత్యం ఇప్పిస్తాను. మా పోలీస్‌స్టేషన్ ముందు కూచ్చుని రోజూ నువు దేవుడి పాటలు పాడు. నీకు ఎన్ని డబ్బులోస్తాయో చూసుకో. ఆ డబ్బులు పెట్టి నువ్వు చక్కా రిక్షా కొనుక్కోని ఊర్లోకి ఎక్కడబడితే అక్కడికి వెళ్ళి అడుక్కోవచ్చు. నీ బతుక్కి ఢోకా వుండదు. నీ మంచి కోరే నేనిదంతా చెబుతున్నాను.. నువ్వు భలేగా వాయిస్తావు మురళి. అసలు మురళి దేవుడిది గదా. శ్రీకృష్ణుడిది. నువు దాన్ని తీసుకెళ్ళి గద్దర్‌గాడి చేతికిస్తే ఎలాగ?" అన్నాడు విశ్వనాథం.

"గద్దర్ ఎవరండీ?" అని గుడ్డి మనిషి అడిగాడు. "నాటొకడున్నాడ్లే.. తెలుసుకోవడం నీకు మంచింది కాదు.. అసలు నీకా పాటలెలా గొచ్చురా?" అనడిగాడు విశ్వనాథం.

"మా మురికిపేటలో ఆలకించేనండి"

విశ్వనాథం తలూపాడు - అదీ కథ.. అందుకే మురికి పేటలు లేకుండా చేసేయాలి. మురికంటే పెంట కదా? పేద గదా? పేదంటే సత్తువ గదా. అక్కడ ఈ పాటలు నాటేస్తాయి. అసలు అందరూ మేడల్లో వుంటే ఈ డెంజరుండదు.."

నల్లని బండ పెదాలు సాగేయి. వాటి వెనుక తెల్లని పల్లవరుస మెరిసింది. "అవును బాబూ.." అన్నాడు గుడ్డివాడు.

టివ్వి టివ్వి టివ్వి టివ్వి ట్వీట్ టివ్వి టివ్వి టివ్వి ట్వీట్ అని అరుచుకుంటూ ఒక తీతిక ఎగిరిపోయింది.

"విన్నావా?" అన్నాడు విశ్వనాథం. "అవునండి! తీతిక.." అన్నాడు గుడ్డి మనిషి కూర్చొంటూ. "అదే.. అన్నరు. నువు గద్దరుగాడంటే ఎవడని అడిగేవు గదా. గద్దర్ అంటే తీతిక.." అన్నాడు విశ్వానాథం.

"తీతిక కూస్తే ఎవరికో కీడు మూడిందంటా రండి" అన్నాడు గుడ్డి మనిషి వేణువు కోసం తడుముతూ. "అవును మరి అపశకునం.." "అంటే ఏ లంజకొడుకో సస్తాదన్నమాటే గదండీ" అన్నాడు గుడ్డి మనిషి దొరికిన వేణువును కుడిచేత్తో అందుకుని ఇసుక దులుపుతూ. "అవునుగానీ నువ్వు రఘురామయ్యగారి 'రాను నీల మేఘశ్యామా' వాయించవా.."

"నాకు రాదండి"

"నేను నేర్పుతాను"

"నేర్పిస్తే రాదండి పాట.. మనం ఇసీసరికి పాటమనల్ని తగులుకోవాలంటి.. అదండి పాటంటే. ఆ తీతిక పాట తగులుకుంటాదండి.." అన్నాడు మొద్దు పెదాలకి పేద వేణువు చేర్చుతూ.

"పోనీ నీకొచ్చిన పాట పాడు దేవుడి పాట" అన్నాడు విశ్వనాథం.

గుడ్డి మనిషి ఊపిరి పీల్చుకుని వూదటం ప్రారంభించాడు. "వఱ్ఱెంక పెట్టు కింద వరుడో భాస్కరుడా నువు కన్నెర చేస్తివయ్య నరుడో భాస్కరుడా బఱ్ఱెంక పెట్టుకింద వరుడో భాస్కరుడా

నువు బందూకు బద్దివయ్య వరుడో భాస్కరుడా అని ప్రారంభించేదతను. పాట అగరొత్తి పొగలాగ సాగుతోంది. పాట మందార కొనలాగ ఊగుతోంది. పాట రాతిగోడలోని మర్రి మొలకలాగ పెరుగుతోంది. సగం అయ్యేసరికి విశ్వనాథానికి తెలిసిపోయింది. గుభాలువ మురళి లాక్కున్నాడు. "నిజం చెప్పు.. నువు నక్సలైటువు కదూ?"

"నక్సలైటంటే ఏటి బాబూ?"

"నువు కమ్యూనిస్టువు గదూ?"

"కమ్యూనిస్టంటే ఏటి బాబూ"

" ఏమీ కాకుంటే ఈ పాటలెందుకు పాడుతున్నావు.."

"అవంటే నాకిష్టం కాబట్టి.."

"ఎందుకని?"

"తెలీదు"

"నీకిష్టమైతే అయింది గానీ నాకు ఇష్టం లేదు. నువు మలోసారి పాడావో నరికేస్తాను. పెదాలు టీల్చేస్తాను జాగ్రత్త.. నా కొడకల్లారా.. నరికేస్తాను జాగ్రత్త.." అని కేకలేసి చేతిలోని మురళి నేలమీద పడేసి బూటు కాలితో తొక్కాడు.

బూటు కింద నలిగిన వేణువు చిట్లింది. దాని గాలి రంధ్రాల నుంచి ఇంత నెత్తురు కారింది.

కళ్ళు ఇంతలు చేసుకుని చూసేడు విశ్వనాథం.

చిట్లిన వేణువు నుంచి రక్తం ప్రవిస్తోంది.. ఆగకుండా..

అది ఇసుకలో ఇంకకుండా ధార కట్టింది.

ధార ఒక రక్తపొద పాములాగ సాగింది.

విశ్వనాథం భయంగా వెనక్కి అడుగులు వేశాడు.

ఆ ధార అతనికేసి సాగింది.

అది అంతకంతకు పెద్దదయింది.

అతనికి దగ్గరయింది.

విశ్వనాథానికి భయమయింది.

గభాలున మోటారు సైకిల్ స్టార్టు చేశాడు.

స్టార్టు చేసిన సైకిల్ గుఱ్ఱంలాగ ఒక దూకు దూకింది.

పగపట్టిన పాములాగా ఆ నెత్తుటి ధార అతని వెంటపడింది.

అది సన్నగా మొదలై, బలపడి, వెడల్పయి, పెనువేగంతో పెరిగెడుతోంది.

ముందు విశ్వనాథం మోటారు సైకిల్, వెనకాల ఆ నెత్తుటి ప్రవాహం...

పాములాగ అది అతన్ని వెంటాడుతోంది. చిట్లిన వేణువు అక్కడే వుండి నెత్తురు ప్రవహిస్తోంది.

ప్రతి సోమవారం

రైటర్స్ అకాడమీ

వారం వారం విపుల సాహిత్య విహారం

కాలం

పండుగ తోనే తెలుస్తుంది కాలం మార్పు
ఏ మార్పు లేని జీవితంలో ఓ ఆటవిడుపు
ఉగాదులు వస్తుంటాయి, పోతుంటాయి
ఉషస్సులు మాత్రం నిజం
కష్టాల కడగండ్లు దాటితే పండుగ
ఎన్ని సమస్యలనైనా ఎదిరించి పోరాడితే
అది నిజాయితీ
నిన్ను చూసి గర్వపడు
కింది వారికి సాయపడు
సమాజ హితానికై శ్రమపడు
పంచభూతాల సారం, తత్వం అదే
కాలం పరుగాపక పయనిస్తుంది
నా కంటే ముందు, నా తరువాత
నిరంతరాయంగా నీ స్థానం కై పోరాడు
వంటకంలో అన్నీ రుచులతోనే తృప్తి
మరి జీవనంలో ఆటుపోట్లంటే భయమెందుకు
ఏ రుచి ఏమౌతుందో వంట తెలియచేస్తే
ఏ కష్టం, ఏ సుఖం
మనిషిలోని నిబద్ధతని పరిచయం చేస్తుంది
ఎన్ని ఎదురైనా గుండె కొట్టుకోవడం మానదు
ఎన్ని వసంతాలు మారినా
మన జీవన యానం ఆగదు
కోయిల గానంతో ఉగాది ఆరంభమైనా
పోరాట స్ఫూర్తి తో జీవన పయనం
ఆరంభమవుతుంది.
కాలం ఒక మత్తు, గమ్మత్తు
జీవనాన్ని సరైన బాటలో నడిపే 'మహత్తు'.

-పి. రాజేష్
81255 32879

అందమైన బంధం

అవును అంతా అందగత్తెలే
స్త్రీ జాతి సమస్తం అందగత్తెలే
అందుకే బంధిస్తాం
అయితే కనురెప్పల మధ్య కాకపోతే
కెమెరా కన్నుతో - వీలైతే బిగి కౌగిట్లో
అందాన్నెప్పుడూ
అందమైన బానిసగా చూస్తాం %--
%అయితే ప్రేమతో %--% కాకపోతే శాసనంతో
కాదంటే మార(ద)క ద్రవ్యంత్లో
పెద్ద భార్యనెపుడూ గౌరవిస్తాం
ఒక్క బిడ్డనే ప్రసాదించి వీరమాతను చేస్తాం
నెలకో కొత్త రాణిని తెచ్చి
అంతఃపురానికి కొత్త శోభను తెస్తాం
వన విహారంలోనైనా
మునికన్యను గర్భవతిని చేసి
వన దేవతలను రక్షకులుగా నియమిస్తాం
అందాన్నెప్పుడూ గౌరవిస్తాం
గర్భవతినైనా వన విహారం చేయిస్తాం
మున్యాశ్రమాన్ని విడిదిగా మారుస్తాం
ముగ్గురు భార్యలలో ఒకతైనా
ముంతాజ్ మహల్ తన కోసమే కట్టానని
ప్రేమ కనుక ప్రకటిస్తాం
శీష్ మహలైనా, హవా మహలైనా,
జల్ మహలైనా,
చిన్న రాణి అందం కోసమే కట్టనని
ఆ అందం తగ్గ కూడదని
సంవత్సరానికో రాణి ని మారుస్తాం
అందం ఎక్కడున్నా ప్రపంచమంతా గాలిస్తాం
ప్రపంచ సుందరీమణిగా గెలుపొందావని
భూదేవంత పందిరి సాక్షిగా
భూ ప్రదక్షిణ చేయించి మరీ కీర్తిస్తాం
కింగ్ ఫిషర్ కేలండర్ లో మీ అందం వేలాడ దీస్తాం
మరో ఏడాదికి ఇంకో కొత్త పేజీ తిరగేస్తాం
అందానికెప్పుడూ ముసలితనం రాకూడదని
అందం తోనే అందగత్తెలందర్నీ అంతం చేస్తాం
అలనాడు రాణి పద్మావతి, ఆ నాడు కన్యక,
మలినాడు మార్లిన్ మన్రో,
ఈ నాడు మన అతిలోక సుందరి
ఎవరి అందానికైనా మేం బానిసలం
స్త్రీలందర్నీ అందంతోనే గౌరవిస్తాం

-రత్నాల బాలకృష్ణ
94401 43488

సృజన వివేచనల సమ్మేళనం

"నా సాహిత్యమంతా నా కన్నీళ్లే" అన్న మానవ ఆత్మగౌరవ సంఘర్షణశీలి ఆచార్య కొలకలూరి ఇనాక్. 1850 తరువాత అన్ని రంగాల్లో ఆధునికత సంఘాన్ని ప్రభావితం చేస్తున్న కాలానికి తమ స్వరాలను ఇచ్చిన భిన్నరంగాల సామాజిక ప్రముఖుల, సమ్యక్ ప్రతినిధిత్వ స్వరంతో ఇనాక్ రచనలు కనిపిస్తాయి. ఎనిమిది పదులకు దగ్గరవుతున్న ఈ సాహితీ మూర్తి, కథలు, కవిత్వం, నవలలు, నాటకాలు, వ్యాసాలు, అనువాదాలు ఇలా భిన్న సాహిత్య ప్రక్రియల్లో ఎన్నో దశాబ్దాలుగా కృషి చేస్తున్నారు.

"ఊరబావి" కథాసంపుటి ద్వారా చిరపరిచిత కథకునిగా, ఇనాక్ తెలుగు సాహిత్యంలో గుర్తింపు పొందారు. పలు పత్రికల్లో వారి కథలు, ఇతర రచనలు అర్థ శతాబ్దం పైబడి అచ్చవుతున్నాయి. బోధనా రంగంలో అధ్యాపకులుగా, ఆచార్యులుగా అనంతపురంలో వృత్తిలో ఉంటూ, ఔద్యోగిక పదోన్నతిలో శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతిగా కూడా పదవులు నిర్వహించి, సామాజికన్యాయమే ఆధునిక నాగరికతగా విశ్వసించే తాత్వికుడు ఇనాక్.

ఇనాక్ రచనల్లో భారతీయ సంస్కారం, విశాల సృజన భూమిక గల సంస్కృత సాహిత్య శ్రద్ధాపూర్వక అధ్యయనం కనిపిస్తాయి. సాహిత్య వైతాళికుల కృషిని చారిత్రిక ప్రాసంగికతతో కలిపి తాను అవగాహన చేసుకున్నది సుబోధకంగా పాఠకులకు విడమర్చి చెప్పడం ఉంటుంది. ఇనాక్ సాహిత్య వ్యాసాలు ఇందుకు బలమైన ఉదాహరణలు. తన డాక్టరేట్ సిద్ధాంత వ్యాసంగా సాహిత్య వ్యాసం గూర్చి ఇనాక్ చేసిన పరిశోధన ఇరవయ్యో శతాబ్దపు తెలుగు సాహిత్య పరిశోధనలో మౌలికమైనది. వ్యాసం కూడా కాల్పనికేతర సాహిత్యంగా ఇప్పుడు భావన దృఢపడినా, 1968 నాటికే ఈ విషయాన్ని తన పి.హెచ్.డి. విషయంగా ఎన్నుకున్నారు ఇనాక్. ప్రాచీన "గద్య" రచనల ప్రస్తావన, పరిశీలన చేస్తూ ఆధునిక వచన రచన వీటికి పూర్తిగా

ఎలా భిన్నమో తెలిపే వీరి సాహిత్య పరిశోధన, సాహిత్య విద్యార్థులకు, అభిమానులకు విలువైన విషయాలు తెలిపే మేలు పొత్తం. కేవలం మేధతోనే కాక హృదయం కూడా తెరిచి చేసే ఉత్తమ పరిశోధనల వలె ఇనాక్ గారి ఈ బృహత్రచన, పాఠక లోకానికి సద్యోఫలాన్ని అందచేస్తుంది.

తెలుగులో పూర్వ కవుల కావ్యేతిహాస రచనల్లో వచనం లేదా గద్య రచనల స్వభావం, పద్యం గద్యం మధ్య గల నిష్పత్తి, ఏ కవి ఎటువంటి గద్యముద్రని వదిలి వెళ్ళిందీ చెబుతూ ప్రబంధాల కాలానికి వచన నాణ్యత, కథన సందర్భ ప్రముఖ సంబంధిగా నిలబెట్టడమూ క్షీణించిందంటూ, ఇనాక్ సాహిత్య పరిశోధకునిగా చేసిన పరిశీలనలు మౌలిక విలువలతో కూడినవి. ఆధునిక సాహిత్య వ్యాసం గురించి కూడా పాశ్చాత్య సాహిత్య పత్రికా రంగాల విహంగ వీక్షణ ద్వారా వివరాలందిస్తూ, తెలుగు వారి వ్యాసం గూర్చి ఇనాక్ చేసిన ప్రతిపాదనలు సూక్ష్మ, నిశిత పరిశోధనను సూచిస్తాయి. ఆంధ్ర భాషకి సంబంధించి 'వ్యాసం' (ఎస్సే) అనే మాట 1862కి పూర్వం ప్రమేయము, ఉపన్యాసము, సంగ్రహము,

అనే పేర్లతో సామినేని ముద్దుకృష్ణమ నాయుడు, కందుకూరి వీరేశలింగం, పరవస్తు వెంకట రంగాచార్యుల వాడుకలో ఉండగా, వీరికి పదేళ్ళ ముందరే , 'వ్యాసం' అంటే 'ఎస్సే' అనే అర్థం ఖచ్చితంగా వచ్చేలా రాసినది తెలుగు భాషా సాహిత్య ఉద్ధారకుడైన సి.పి. బ్రౌన్ అంటూ, 1852లో వారు రాసిన 'ఎస్సే ఆన్ ది లాంగ్వేజ్ అండ్ లిటరేచర్ ఆఫ్ తెలుగూస్'ను ('మద్రాస్ జర్నల్ ఆఫ్ లిటరేచర్ అండ్ సైన్స్' లో ప్రచురితమైనది) ఉదహరిస్తారు ఇనాక్. ఇలాంటివెన్నో ఉన్న ఈ రీసెర్చ్ లో ఇదొక మెచ్చు తునుక మాత్రమే.

1949 కవిత్వ రచన తన 'త్వమేవాహం'లో ఒక పైథాగరస్ థీరమ్ చెప్పి సమాజ పోకడల మార్పు దిశ గమనాల అనివార్య లక్షణాలను అలనాటి యువకవి ఆరుద్ర చెప్పినట్టుగా, తన పరిశోధన గ్రంథంలో, భాష, పద్యం, గద్యం అనే త్రిభుజం గీసి, యువ ఇనాక్ ఈ బృహత్ వ్యాసంలో చేసిన సోదాహరణ పూర్వక సచిత్ర చర్చ, రసవత్తరంగా ఉన్నది. ఇది వ్యాసాలు రాయడంలోనే ఒక కొత్త పంథా. 1968 కే ఈ వ్యాస పరిణామ విషయ పరిశోధన చేస్తున్న ఇరవై ఎనిమిదేళ్ళ ఇనాక్ కూడా అనన్య సాధ్యంగా ఈ పరిశోధన నాలుగేళ్ల పాటు చేశారు అన్నదానికి ప్రతి పేజీలోనూ వారి దృష్టి వైశాల్యం, ప్రసాద సార్థకత,

నిరూపించబడి, ఆరువందల పేజీల పైచిలు ఈ సిద్ధాంత గ్రంథానికి సాహిత్య మర్యాదనీ, చదివించే లక్షణాన్ని సాధించి పెట్టాయి. ఇనాక్ కేవలం కథకుడిగానో, నవలా కారుడిగానో, కవిగానో, నాటక కర్తగానో పరిధి ఒక ప్రక్రియలో గీసుకున్న సాహిత్య మూర్తి కారు. ఈ ప్రక్రియలన్నింటా వారు ప్రతిపాదించిన జీవన సమానతా తాత్వికాంశం ఎంత విలువైనదో, అంతకన్నా ఎంతో సాంద్రతరమైన సాహిత్య గనిపనిమనిషి తనం, వారి 'తెలుగు వ్యాస పరిణామం' సిద్ధాంత గ్రంథంలో దర్శనమిస్తుంది.

తన సామాజిక అభ్యంతరాలకు, తన లోలోపలి నాగరికుడి ప్రశ్నలకు భిన్న ప్రక్రియల్లో సాహిత్య కల్పనగానూ, సమకాలిక సాహితీ వేత్తల పట్ల గౌరవ దృష్టితో కూడిన ఆమోద విభేదాలతోనూ ఎలా అభిప్రాయ ప్రకటనం చేయాలో అన్నదానికి ఒజ్జబంతి ఆచార్య కొలకలూరి ఇనాక్. సృజనాత్మక సాహిత్యం, వివేచనాత్మక విషయ రచన రెండూ సరిసమానంగా నిర్వహించిన తెలుగు రచయితలు అరుదు. వారిలో ముఖ్యులు ఆచార్య కొలకలూరి ఇనాక్.

■ రామతీర్థ

(కొలకలూరి ఇనాక్ నేడు విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో 'చందుసుబ్బారావు సాహిత్య పురస్కారా'న్ని అందుకుంటున్న సందర్భంగా)

వ్యాస శిఖరి మన కొలకలూరి

సాహితీ శిఖరం కొలకలూరి ఇనాక్‌ను ఒక కీర్తి మేఘమాల అలంకరించింది. కొద్ది నెలల్లో ఎనిమిది పదులు దాటబోయే అవిశ్రాంత అక్షర సృజనశీలి, నిరంతర వ్యాసంగంగా కథలు, నవలలు, అనువాదాలు, నాటకాలు మాత్రమే కాకుండా పన్నెండు సాహిత్య విమర్శా రచనలు చేసిన ఇనాక్ గారికి– ఈ కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం కొంత ఆలస్యంగానే వచ్చింది అని సాహితీ పరిశీలకులు భావిస్తారు. తెలుగు వ్యాసాలు, సాహిత్య దర్శిని, సాహిత్య సందర్శనం, సమీక్షణం, సమీక్షా సాహిత్యం, పీఠికా సాహిత్యం, తెలుగు కథానికా పరిణామం, చిన్ని కథల వెన్నెల, తెలుగు నవలా వికాసం, జానపదుల సాహిత్య విమర్శ, సాహిత్య ప్రయోజనం, శూద్రకవి శుభమూర్తి వసుచరిత్ర వైశిష్ట్యం, ఆంగ్లంలో 'ది ప్రిన్సిపల్స్ ఆఫ్ మాడ్రన్ క్రిటిసిజం' (1999లోనే) ... ఇలా సాగిన వీరి సాహిత్య విమర్శా పరంపరలో అవార్డు పొందిన 'విమర్శిని' ఒక తరంగం మాత్రమే! తన పిహెచ్‌డి కోసం వారు సమర్పించిన సిద్ధాంత వ్యాసం కూడా తెలుగులో వ్యాస పరిణామంపైనే! అదీ 1968లో దాదాపు యాభై ఏళ్ల కిందట కావడం ఒక చరిత్రాత్మక సంకేతం. అటువంటి విమర్శపై తన దృష్టి వ్యాసరూప సంబద్ధంగాగా ఉండడం, ఆధునిక ప్రపంచ సమాజాల్లో కొన్ని శతాబ్దాలుగా, మన తెలుగునాట కూడా వ్యాసంలోనే యావత్ సాహిత్య విమర్శ దాదాపు వందేళ్లుగా వెలువడ్డం ఒక నేపథ్యం. వారి కల్పనా సాహిత్యం పుష్కలంగా ఉండగా, వారి మేధా విస్త తికి స్వాప ప్రమాణ రచనలు నమోదైన సాహిత్య విమర్శ కృషికి ఈ అవార్డు రావడం, వారికే కాక తెలుగు సాహిత్యానికి కూడా ఇప్పుడు ముఖ్యావసరం. తెలుగు సాహిత్య విమర్శకు దక్కిన ఈ పురస్కారం, వ్యక్తిగా ఇనాక్ గారికి, వ్యవస్థగా తెలుగు విమర్శకు దక్కిన వర్తమాన గౌరవంగా చూడాలి.

విమర్శ ఒక వ్యవస్థ. అది సాహిత్య పరిశీలనలో, సృజన ఒక మౌలికరంగమైనా, ఆ మౌలికత స్ఫురమూ, స్ఫుటమూ అయిన రూపం పొందడంలో రచయితను నడిపిన చోదకశక్తులను పరిశీలిస్తుంది. వాటి దారీతెన్నూ ఏమిటో ఎరిగి, రచనను సమాజపరం చేస్తుంది. అటువంటి సామాజిక సాంస్కృతిక బాధ్యత గల విమర్శ కృషిలో, జాతీయ సాహిత్య అకాడెమీ గుర్తించిన పెద్దగా, ఇనాక్ ఈ ఏడాది అందుకోబోయే పురస్కారం, తెలుగు విమర్శ గురించి 'పెద్ద బలంగా లేదు' అనేవారు ఒకటికి రెండు సార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి కల్పిస్తుంది. ఇటీవలి సాహిత్య అకాడెమీ అవార్డులు ఎక్కువగా సాహిత్య విమర్శకే రావడం సూక్ష్మ చింతనకు పనికొచ్చే అంశం. కాత్యాయని విద్మహే, రాచపాలెం చంద్రశేఖర రెడ్డి ఇటీవల విమర్శకు సాహిత్య అకాడెమీ మన్నన పొందిన తెలుగు సాహిత్యవేత్తలు. తెలుగు సాహిత్యంలో విమర్శ బలంగా లేదు అనేవారు ఎటువంటి విమర్శను ఆశిస్తున్నారు అనేది స్పష్టంగా లేదు. వేమన గురించిన రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, సాహిత్య విమర్శ గురించి కట్టమంచి, ప్రామాణిక పరిశీలకుల్లో నిడదవోలు వెంకటరావు, సామాజిక సైద్ధాంతిక నేపథ్యంతో రాచమల్లు రామచంద్రారెడ్డి, కెవి రమణా రెడ్డి, సొదుం రామ్మోహన్, చేకూరి రామారావు, భాషాపరంగా బూదరాజు రాధాకృష్ణ, కె.కె.రంగనాథాచార్యులు, యు.ఎ.నరసింహమూర్తి విమర్శకు పేరొందిన వీరందరి వలె, సాహిత్య ముఖ్యాంగాలైన భాష, అభివ్యక్తి, ప్రయోగ దృష్టి, దాని ప్రయోజనం వంటి అంశాలను పట్టించుకున్న పెద్దలు ఇనాక్ కూడా.

విమర్శన వ్యాసం అనే విభాగంలో దశాబ్దాల కిందటే తన ఆరొందల పేజీల పరిశోధన వ్యాసంలో ఇనాక్ దాదాపు పదిహేను భాగాలుగా విషయ దర్శనం చేశారు. అవి స్థూలంగా కావ్యతత్వ వ్యాసం, కావ్యాత్మ వ్యాసం, కావ్యగుణ వ్యాసం, కావ్య చరిత్ర వ్యాసం, జీవిత చరిత్ర వ్యాసం, భాషా వ్యాసం, అన్య భాషా వ్యాసం, అనువాద వ్యాసం, ఆంగ్ల భాషా వ్యాసం, పీఠికా వ్యాసం, వేదాంత వ్యాసం, వైజ్ఞానిక వ్యాసం, రాజకీయ వ్యాసం, ఆర్థిక వ్యాసం. శైలీ దర్శనం, శైలి – వ్యక్తిత్వ లక్షణాలు, శైలి – భాషా లక్షణాలుగా సమాపన అధ్యాయంగా దీన్ని ముగించారు. ఈ అయిదు దశాబ్దాల కాలంలో వారు పలు రచనలకు బహు పురస్కారాలు పొందాక– ఇప్పుడు కేంద్ర సాహిత్య అకాడెమీ కూడా విమర్శ రంగంలో వారి కృషికి గణనీయ స్థానం అందచేయడం మంచి పరిణామం.

'విమర్శిని'లో కథ, నవలా ప్రక్రియలపై పెద్ద వ్యాసాలు సంకలితం అయ్యాయి. జానపదుల సాహిత్య విమర్శ (2010లో) అంటూ మౌఖిక సాహిత్యంలో కూడా నాటి సామాజిక దర్శనం చేయగల విమర్శ కోసం తన గురువులు కోరాడ మహాదేవ శాస్త్రి గారిని స్మరిస్తూ, ఒక కిటికీ తెరిచిన ఘనత ఇనాక్ గారిది. 1999లో రాసిన **The Principles of Modern Criticism** ఆంగ్ల గ్రంథంలో, విమర్శకుడు ఆధునిక సాహిత్య విషయ సారాన్ని అవగతం చేసుకోవల్సిన ప్రధాన బాధ్యత కలిగి ఉన్నాడు అని చెప్తారు. 'దీనికి సాహిత్యం, సమాజం నడుమ గల సంబంధంపై ఒక స్పష్టత అవసరం, సాహిత్యం సమాజం యొక్క ప్రతిఫలనంగా ఎరిగి వ్యాఖ్యానించాలి. తన కల్పనా పరిరంభంలో ఉన్న రచయిత సమాజ విషయాన్ని ఒక నవీన, ఉత్తమ సృజనవాస్తలో చెప్తాడు. రచనలోని విషయంతో తనని, తన భావ సంపదని ఒకటిగా చేసుకుంటాడు. అలా విషయంతో మిళితం కావడం సృజన ప్రక్రియలో ఒక భాగంగా విమర్శకుడు గ్రహించగలగాలి. తానూ అటువంటి ఒక మిళితమయ్యే దశలోనే, జాగ్రత్తంగా ఆ రచనను అంచనా కట్టాలి. రచయిత వాడిన కొత్తదనాలు, వాటి విలువలను నిశితంగా పరిశీలించాలి. విషయానికి, రూపానికి మధ్య గల బంధాన్ని ఎన్నిక చేయగలగాలి. ఏ నేపథ్యంలో సాహిత్య సూత్రాలను ఆయా రచనలకు అన్వయం చేస్తే, వ్యక్తి, సమాజంలో ఒక శక్తిగా ఎదిగే పరిణామ శక్తుల స్థాయిని తాను అర్థం చేసుకోగలుగుతాడో గ్రహించి తద్వారా మాత్రమే వ్యక్తికి సంఘంలో అర్థవంతమైన ఉనికి కలిగిఉండేలా జరుగుతున్న సాహిత్య ప్రయాస పట్ల నిపుణదృష్టి ప్రసరించగలడు.' హృదయవాదులైన తెలుగువారు బుద్ధి ప్రధానంగా రాసే వ్యాసాల రాశి, వాసి పెరగాలని దశాబ్దాల కిందట ఆకాంక్షించిన ఇనాక్ మాటలు నేటికీ విలువైనవే! ఇంతటి ప్రతిభాశీలిని ఈ ఏడు కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం వరించటం పట్ల తెలుగు సాహిత్య సమాజం హర్షం వ్యక్తం చేస్తోంది.

– రామతీర్థ
98492 00385

సందర్భం

బాల్యకాల కథాశిల్పులు చాసో, వేంపల్లి షరీఫ్





తెలుగు కథా ప్రపంచంలో హిమాలయ పర్వత శ్రేణి ఉంది. కథలు మంచు కొండలంత ఎత్తు. కథకులు నిత్య సాధకులు. ఒక్క మంచి కథ రాసినా, కథా శిఖరాధిరోహణం చేసిన ఘనత వస్తుంది. అయితే మంచి ఎంత, ఏ మేరకు, అది ఘనతగా, పరిణమించే క్రమం ఎంత సుదీర్ఘం, అంటే, కథలెంత విభిన్నమో, కథకుల ధోరణి అంత విభిన్నం. పాఠకులు, విమర్శకులు, కథలు సమాజం ఆస్తిగా, వాదోపవాదాలు చేయడం, ఒక ఆరోగ్యకరమైన వాతావరణం. కవిత రాసినా రాని చర్చ, కథ రాస్తే వస్తుంది. కథ, ఆ చర్చని ఆకర్షిస్తుంది. అలా చూస్తే, తెలుగు కథాలోకంలో చాసో కథలు ఎత్తయిన మంచు కొండలు. ఆ కొండలు పర్వతారోహణకి నమూనాలు. ఆ కొండల పాద భాగములు దాటి మడమల వద్దకు చేరి, కథల కొండలు ఎక్కే ప్రయాస చేస్తున్న వారిని, సఫలత దారిలో ఉన్న వారిని, ఇరవై ఏళ్లకు పైగా చాసో స్ఫూర్తి పురస్కారం గౌరవిస్తూ వస్తోంది. అలా చాసో కథా పర్వతోన్నత సీమలోకి అక్షర ప్రయాణం చేస్తున్న వేంపల్లి షరీఫ్, ఈసారి చాసో స్ఫూర్తి పురస్కారానికి ఎంపికయ్యాడు.

బాల్య కథా శిల్పిగా చాసో ప్రసిద్ధులు. ఈ బాల్యం శ్రీమంతులు, మధ్య తరగతి, పేదలు అని లేకుండా, ఎవరి స్థాయిలో వారికి అమూల్య అనుభూతులు మిగుల్చుతుంది. ఇందులో 'పోస్ట్ ఆఫీసు'లో టాగూర్ చిత్రించిన అమల్, కొంత స్థితిమంతుల ఇంటి పసివాడి పాత్ర కాగా, రావి శాస్త్రి గారికి నచ్చిన, 'ఆ గదిలోనే' అనే అతి చిన్న కథ రాసిన రచయిత్రి

సందర్భం

కూడా, బాల్యం గురించే రాయడం, అది రావిశాస్త్రి గారు జీవితంలో మర్చిపోలేని కథగా, కథనంగా, వారు 'వెన్నెల' కథ రాసినప్పుడు, తాను ఇదే సంవిధానంలో రాశానని చెప్పారు. అలాగే, చాసో రాసిన తొలి కథ కూడా 'చిన్నాజీ' తను ఇంట్లోని బాలికతో తండ్రి పొందే మహత్తరమైన ఆనందం గురించి చెప్పిన కథ. ఇంకా కుంకుడాకు, ఎందుకు పారేస్తాను నాన్నా, వెలం వెంకడు, రథ యాత్ర, బబ్బూ చాసో ఎగరేసిన పసిదనాల గాలి పటాలు.

అలా చాసో కన్ను, తన కథా కాలంలో పసి పాత్రలను ప్రవేశపెట్టి చెప్పడంలో ఉన్న కళా రహస్యం, పసితనమే మనిషి ఏదైనా కావడానికి లోముద్రలు పడే కాలం అని జీవితం గురించి ఎరుక కలిగి ఉండడం. అదే అవగాహన, తమ ఎదుటి సమస్యలను అధిగమించి, లక్ష్యాలను చేరే పట్టుదల కనిపిస్తాయి. ఎందుకు పారేస్తాను నాన్నా, వెలం వెంకడు కథల్లో బాల పాత్రలు చదువు పట్ల పట్టుదల గలవారు. తమ కుటుంబ ఆర్థిక స్థితి ఎలా అయినా తమ చదువుల కోసం కూడా ఉపయోగ పడాలని తాము బలంగా తలిచి, తల్లిదండ్రులను సమాధానపరిచే స్థిర సంకల్పం వారిది. బడికి వెళ్లలేని ఆడపిల్లల కథ 'కుంకుడాకు'లో, వారికి కావల్సింది ఏదో, కథకుడు చెప్పదల్చుకున్నది నేపథ్యంలో ధ్వనిస్తూ ఉంటుంది. చాసో ఎగరేసిన బాల్య పతంగం 'రథయాత్ర'. ఇది కృష్ణుడి మనోరథ యాత్ర కూడా. వాడేం చేయాలి అనుకుంటే అవన్నీ చేస్తాడు. తీర్థపు పరస, వాడి కలల కల్యాణం. బొమ్మల పెళ్లిలో పిల్లలు వినే కథ చెప్పేది, ఒకనాడు తాను పసిపిల్లగా ఉన్న బామ్మ

ఇలా వేంపల్లి షరీఫ్ కూడా, తన కథల్లో చెప్పుకోదగ్గ సంఖ్యలో బాల్యం విషయంగా కథలు రాసిన యువ రచయిత. 'ఆకు పచ్చ ముగ్గు', పిల్లల్లో సహజంగా ఉండే ప్రతిభకు మతం, కులం అడ్డుగోడలు కావని చిత్రిస్తుంది. ఇంటి గుమ్మంలో చక్కని ముగ్గులు పెట్టుకోవడం, ముస్లిముల ఆనవాయితీ కాకపోవడం వల్ల, ఆ పిల్ల గోరింటతో అరచేత ముగ్గులు పెట్టడంలో నిపుణత సాధిస్తుంది. ఆగస్టు 2012లో ముద్రణ జరిగిన 'జుమ్మా' ఒక సరికొత్త స్వరాన్ని ముస్లిం జీవన చిత్రణలో పలికించింది. తమ బతుకుల్లో అందాలు, పూరిపాకల్లో తాజమహళ్లుగా ఎలా అలరారుతాయో చెప్పడానికి మాట్లాడిన మల్లెమొగ్గ షరీఫ్. మాండలికాన్ని జీవభాషగా పలికించడం, రాయలసీమ కథకుల శిల్ప విన్యాసం. అందులో ముస్లిం కుటుంబాల్లో పలికే పలుకుబడులు, ఖదీర్ బాబు, దాదా హయాత్, షరీఫ్ కథల్లో ఇటీవలి దశాబ్దాల్లో జనరంజకంగా పలికాయి. ఇది ఉత్తరాంధ్రలో, గురజాడ కన్యాశుల్కం కాలం అంటే 1892 నుంచీ ఒక సృజన సాధ్యత. గురజాడ మొదటిసారిగా, తాను రాయదల్చిన మాటలకు తగిన అక్షరాలు, భాషా అమరికలు తెలుగులో ఇంకా ఏర్పడాలి అని, తన 'కన్యాశుల్కం' రెండో కూర్పులో ఎందుకు అన్నారో తెలియాలంటే, పద నిర్మాణ పద్ధతుల్లో గురజాడ, తన నాటకంలో అమలు చేసిన కొత్తదనాలపై మనం దృష్టి పెట్టాలి. ఉచ్చారణ విధేయంగా శబ్దం లిపిబద్ధం కావాలన్నది, వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో బహుశా మొదటిగా కోరినది గురజాడ వారే. వెంకమ్మ ఎలా మాట్లాడితే అలాగే రాశారు గురజాడ. 'పూటకూళ్ళ దాన్నెళ్ళు', 'దుర్మార్గపు కూతురు', 'మా బాబ్బాబు పడ్డావిషోయి', 'నాన్నం బుట్టలో లోవెయ్యడం' ... ఇలా కన్యాశుల్కంలో పలుకు మీద రాసిన గుడింతం కనిపిస్తుంది. చాసో కథల్లో కూడా 'ఆవెల' వంటి కథాశీర్షికలు, కొండగొర్ల, పరబ్రహ్మం వంటి కథల్లో పలుకుబడులు, వాక్య నిర్మాణంలో చిన్న చిన్న మాటల వాడుక, చాసో మార్క్ పద్ధతులు.

ఇలా షరీఫ్ కూడా 'మే' అంటే అమ్మను పిలవడం, 'క్కా' అంటే అక్కను పిలవడం. మొదటి శబ్దాలు మాటల్లో ఎగిరిపోతే, అదే వాడుక మాటగా – అక్షరం రాయడం చూస్తాము. తమ తొలి రచనల నించే నామిని, ఖదీర్, షరీఫ్, హయత్, తమ సీమ పలుకుబడులకు సాహిత్య గౌరవం కల్పించారు. 'దస్తగిరి చెట్టు' కథలో, కథ చెప్పే స్వరం ఒక ప్రైమరీ స్కూలు చదువుల పిల్లవాడు. వాక్యం వాడి స్థాయికే వెళ్తుంది షరీఫ్ కథలో.

మాండలికం తన సహజ సౌందర్యాన్ని పరిచయం చేసుకుంటుంది. దేనికి కన్యాశుల్కం నిలబడ్డదో, చాసో కథలు వజ్రాలై నిలిచాయో, అలా తెలుగు మాండలిక వైశాల్యంలోకి రాయలసీమ రాగాలు దొర్లుకొచ్చాయి ఇలా... : 'నేను అన్నం దీసుకోనని మొండికేసినానన్కో నాయిన సేన్లో సాయంత్రం దాంక పన్జేసి వస్తేయాల్కి వొస్తాడి. అలా వస్తేని ఆకలితో అలమటిస్తా ఇంటికొస్తే ఇంగేమైనా ఉందారా? నన్ను బట్టుకొని మల్లా నాలుగు దన్నడూ. దాన్నితే పర్వా. ఇంట్లో ఉండనిస్తాడా? ఆయాన్నీ ఆలోసించినాక నాకు పొలం కాడికి బోవడమే మంచిదనిపించినాది. మవునంగా తలొంచుకొని నిలబడుకుండాను. కాసేప్పటికి అమ్మీ అన్నం గ్యాస్ తెచ్చిచ్చా. దాన్ని దీసుకుని అమ్మీ వైపు దీనంగా జూస్తా, పొలం కాడికి యెలబార్నీ.' ఎండ. దిక్కులు జూడకుండా బిరిక్కిన నడిసి యెల్లిపో' ఎనక నుంచి పురమాయిస్తా అమ్మీ అన్నాది'.

లెక్క అంటే డబ్బు. ఉత్తరాంధ్రలో కూడా ఈ నుడికారం ఉంది. 'లెక్క జరూరుగుందండి, పాటిగాపుం కేదు యెంటనె యిప్పించమన్నారండి' అంటాడు ఒక నౌకరు పాత్ర కన్యాశుల్కంలో. షరీఫ్ కథల్లో లెక్క బాకీ పడ్డ మనుషులు కనిపిస్తారు. లెక్క సంగతి రాగానే ఒక తల్లి అంటుంది ఇట్లా : '(అమ్మనడిగితే రూపాయిమ్మను) 'అదోళ్ళ దగ్గర లెక్కలు ఎట్లొచ్చాయిరా? నేన్నీకోసం లంజరికం జేయాల. అట్లాన్నెదిలి నా దగ్గర అడగటానికి సిగ్గన్నా ఉండాల'. అంటాది'. 'ఆకుపచ్చ ముగ్గు' కథలో ముంగిటి ముగ్గు ఒప్పుకోని మతంలో, అదే కళ, అక్క పాత్ర ద్వారా, అరచేతి ఆకుపచ్చ అలంకరణగా మారే ప్రాసెస్‌ను గమనించే చురుకుదనం ఉంది. 'దస్తగిరి చెట్టు'లో సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లాలనుకునే పసివాడు, 'అయ్యవారి చదువు'లో, కష్టాలకు ఎదురీది తండ్రి సంకల్పంతో చదువుతున్న అయ్యవారు తన కథ, తన స్కూలు పిల్లగాడికి చెప్పడం, 'పంకల పండుగ'లో తోటి పిల్లల మధ్య 'యునాయకమయ' బొమ్మ గీయించుకొని, తన కొత్త పలక బడికి తీసుకెళ్ళే మదార్, 'రూపాయి కోడి పిల్ల'లో పసివాడి కలత, ఇవన్నీ పేద ముస్లిం బతుకు కథలు.

ఆనాడు గురజాడ చదువే మనిషి వికాసానికి ప్రధాన అవసరం అని చెప్పారు. చాసో కథల్లో అదే ప్రవాహధారగా కదిలింది. తెలుగు కథకులు ఎందరో, బాల్యాధారంగా భాసించే కథలు నమోదు చేశారు. రాయలసీమ జీవన కథల్లో పర్వా, జుమ్మా రజాక్ మియా సేద్యం, జీపొచ్చింది నిండైన కథలు. తెలుగోళ్ళ దేవుడు కథ మాత్రం ఒకింత హడావిడి ప్రచారికగా కనిపిస్తుంది. తెలుగు మాట్లాడే ముస్లింలు తెలుగు వారు కారా? అనే ప్రశ్న వస్తుంది. అలాగే, దేవుడు భాష బట్టి ఉండడు, మతం బట్టి ఉంటాడు. 'తెలుగోళ్ళ దేవుడు' అనే పేరు కూడా కొంత అన్వయక్లిష్టంగా ఉంటుంది. దేవుళ్ళు ఎవరైనా, వారు వేరైనా, ఒక భాషీయులకు ఎందరో దేవుళ్ళు ఉండవచ్చు, అన్న సూత్రం మీద కథ నడిస్తే, ప్రయోజనకరంగా ఉండేది.

షరీఫ్ ఎదుగుతున్న కథకుడు. 'తియ్యని చదువు' పుస్తకం, తన పెద్ద కథ 'తెలుగు' (రాయలసీమ మాండలికంలో పశువుని కట్టే తాడు) ఏక కథా ప్రచురణగానే కాక, తొలి తెలుగు మైనారిటీ నాటకంగా కూడా రూపొందించిన కృషిలో భాగస్వాము. తన తొలి కథా సంపుటి దాసు కృష్ణమూర్తి గారిచే ఆంగ్లానువాదం జరిగిన కథకుడు. 2017లో 'టోపీ జబ్బార్' పేరిట తన కథల రెండో సంపుటి కూడా తెచ్చిన క్రమానుగత కథాసృజనలో, కొత్త ఇతివృత్తాలు జోడిస్తున్న వాడీ రచయిత. ఈ రెండో సంపుటిలో పిల్లలను దండించే విధానాలపై ఒక అధివాస్తవిక ఎత్తుగడతో నడిచే కథ 'ఒంటిపెయ్యి', నీళ్ళు మోసుకు రావాల్సిన దయనీయ స్థితిలో ముస్లిం ఆడపిల్లల వెతలు చెప్పే 'దారి తప్పిన కల', ఇలా పదకొండు కథల్లో షరీఫ్ సాధన చేస్తున్న నూతన సృజన కోణాలు స్పష్టం అవుతాయి. లోగడ కేంద్ర సాహిత్య అకాడెమీ యువ సాహిత్య పురస్కారం, మొజాయిక్ అక్షర గోదావరి పురస్కారం, మరెన్నో అవార్డులు పొందిన ఈ యువ కథకుడు, ఈ జనవరి 2019లో విజయనగరంలో, చాసో స్ఫూర్తి అవార్డు స్వీకరించనున్న సందర్భంగా అభినందనలు.

– రామతీర్థ
98492 00385

తేడాగా రాయడానికే కలం పట్టాను

● ఇంటర్వ్యూ

- కాళీపట్నం రామారావు

తెలుగు కథకు చిరకీర్తిని తెచ్చిపెట్టి తెలుగు కథతో చిరయశస్సును పొందిన రచయిత కాళీపట్నం రామారావు. కథ కోసం, కథ వలన, కథ కొరకు సాగిన జీవనం ఆయనది. ధన్య జీవనం. సఫలమైన సాహితీ జీవనం. నవంబర్ 9న ఆయన తొంభయ్యవ పుట్టినరోజు. తెలుగు నేలపై కథకు పండగ రోజు. విశాఖలో ఈ సందర్భంగా అనేక కార్యక్రమాలు జరుగుతున్న దరిమిలా కాళీపట్నం రామారావుతో ప్రత్యేక ఇంటర్వ్యూ.

తొలినాళ్లలో మీ జీవితంపై ప్రభావం కలిగించిన వ్యక్తులు ఎవరు?

మా గ్రామం పేరు పెద మురపాక (శ్రీకాకుళం). నిజానికి అది ఏడు గ్రామాలకు కూడలే అయినా చిన్న ఊరే. ఆ ఊరిలో దినపత్రికలు చదివే పెద్దలు ముగ్గురుండేవారు. వారు మా తండ్రి కాళీపట్నపు పేర్రాజుగారు, పాలిశెట్టి అప్పల సూరిగారు, భద్రం సత్యనారాయణా చార్యులుగారు. వీరి మాటలు వింటూ ఉండేవాడిని. నేను ఫోర్త్ ఫామ్‌లో ఉండగా తొలిసారిగా రచన చేయడం జరిగింది. అందులో పదమూడేళ్ల బాలిక భగవద్గీతను విమర్శిస్తూ మాట్లాడినట్టుగా నేను రాసేను. అది మా నాన్న కంటపడింది. ఆయన నువ్వుగానీ నీ చెల్లెలుగానీ భగవద్గీత చదివేరా అని ప్రశ్నించారు. లేదన్నాను. ఇప్పుడు చదువుకోవడం ముఖ్యం. కొంత జ్ఞానం అంటూ వచ్చాక రచనలు చేయవచ్చు అని చెప్పారు. ఆ మాటతో చదవడం మొదలుపెట్టాను. ఏవో ఇతిహాసాలు తప్ప మిగిలిన సాహిత్యం అంతా లైబ్రరీలోనో పుస్తకాలున్నవారి ఇళ్లలోనో చదువుకున్నాను.

19 ఏళ్ల వయసులో మీరు రాసిన తొలి కథ 'ప్లాట్‌ఫారమ్' (1943) నేపథ్యం చెప్పండి

నా తొలి రైలు ప్రయాణం నా పన్నెండేళ్ల వయసులో చేశాను. 1937లో శ్రీకాకుళం స్టేషన్ (ఆముదాలవలస) నుంచి సిగడాం రైలు ప్రయాణం చేశాను. ఆ రోజులలోనే విశాఖపట్నానికి ఒక పెళ్లికి రావడం జరిగింది. ఇది నా మనసులో పడి ఉండవచ్చు. ప్లాట్‌ఫారమ్ కథలో భర్త కోసం ఎదురు చూసే ఒక కొత్త పెళ్లికూతురిని మనుషుల కోసం ఎదురు చూసే ప్లాట్‌ఫారమ్‌తో పోల్చి రాయడం విలక్షణంగా ఉందని కొందరు అన్నారు.

ఇరవై ఏళ్ల రచయిత అంటే ప్రేమ, వసంతం, యువతుల గురించి ఊహలు వంటివి రాస్తారు. కాని మీరు ఆ వయసులో రాబర్ట్ క్లైవ్ గురించి ఒక కథ (అద్దం తిరిగిన చరిత్ర) రాశారు...

ఆ రోజులలో మాకు భారతదేశ చరిత్ర మాత్రమే కాకుండా బ్రిటిష్ చరిత్ర కూడా పాఠ్యాంశంగా ఉండేది. అది బాగా చదివాను. చిన్నప్పుడే తుపాకీ గుండు కాల్చుకుని ఆత్మహత్యా ప్రయత్నం చేసి విఫలమైన రాబర్ట్ క్లైవ్ అప్పుడే కన్ను మూసుంటే భారతదేశ చరిత్ర వేరుగా ఉండేదన్న ఊహతో ఆ కథ పుట్టింది. తేడాగా రాద్దామన్నదే నా ఉద్దేశం. అయితే అందరికన్నా వేరుగా రాస్తున్నానని నేనెప్పుడూ భావించలేదు.

పాతికేళ్ల వయసులో మీరు చేసిన రచనలు గమనిస్తే అవి తాత్త్వికంగా, తార్కికంగా ఉంటాయి. ఏమిటీ లోకం అనే బెంగా, సమస్యలకు పరిష్కారాలుంటాయనే ఆశా రెండూ కనిపిస్తాయి...

నా పద్దెనిమిదేళ్ల వయసులో మానసిక సంక్షోభానికి గురి కావడం ఇంట్లో చెప్పకుండా ఒకటి రెండుసార్లు వెళ్లిపోవడాలు ఆత్మహత్యా ప్రయత్నం వంటివి జరిగాయి. ఇలాంటి ఆందోళనలన్నింటికీ సాహిత్యంలోనూ జీవితంలోనూ పరిష్కారాలు ఉంటాయి అని పెద్దలు చెప్పడం జరిగింది. దాని ఫలితంగానే నా రచనలలో కూడా అలాంటి చింతన కనిపించింది.

కీర్తి కాముడు (1949) కథ రాసే కాలానికి మీకు 25 ఏళ్లు. కీర్తి అనేది ఒక అనవసరమైన బరువు అనే అవగాహన అప్పటికే మీకు ఉంది. ఆ సమయానికే మీకు కీర్తి, గుర్తింపు వచ్చాయా?

లేదు. గుర్తింపు రెండు రకాలు. పాఠకులు గుర్తించడం. తెలిసిన మిత్రులు, సాటి రచయితలు చదివి గుర్తించడం. మొదటిది కొంచెం కష్టం. ఎందుకంటే పాఠకులకు మనం నిజంగా నచ్చితే తప్ప గుర్తించరు. కాని మిత్రులు, సాటి రచయితలు గుర్తించడానికి ఏమి? కాని ఆ రెండో గుర్తింపు కూడా రాలేదు. ఆ కాలంలో విశాఖ రచయితలలో బలివాడ కాంతారావు గారికే చాలా ఎక్కువ గుర్తింపు ఉండేది. అంత పేరు నాకు రాలేదే అని వారి పట్ల నాకు ఆ రోజులలో స్పర్థ కూడా ఉండేది . అది కొంతకాలం కొనసాగింది.

'రాగమయి' (1950) మీ మొదటి నవల. దీని ద్వారా మీకంటూ కొంత పాఠక లోకాన్ని సమకూర్చుకోగలిగారా?

రాగమయి నవలికను ఒక వారం రోజులలో రాయగలిగాను. దానిని మెచ్చుకున్న పాఠకలోకం కూడా ఏర్పడింది. అయితే నాకు అర్థం అయినది ఏమంటే పాఠకులను అర్థం చేసుకోవడం కష్టమని. నేను ఏ పాఠకులను దృష్టిలో పెట్టుకొని రాయాలో వారికి అంతే నచ్చే రచనలు చేయాలంటే ఇంకా చేయాలని అప్పట్లో నేను తెలుసుకున్నాను. కథలకు రంగులు వేయకుండా సహజంగా చెప్పాలనే అవగాహన కూడా అప్పుడే కలిగింది. అందుకే అంటాను 1957 వరకూ నా కథలన్నీ కథలు రాయడానికి అవసరమైన సాధన కొరకే ఉపయోగపడ్డాయని. అసలైన కథలు ఆ తర్వాత రాసినట్టే లెక్క.

తొంభై ఏళ్ల వయసులో ఇంకా మీరు రాయదల్చుకున్నవి ఏవైనా ఉన్నాయా?

'నేటి కథ' శీర్షికను గతంలో నేను ఒక పత్రికలో నిర్వహిస్తున్నప్పుడు ఒక గృహిణి తన జీవితానుభవాలను కథలా రాసి పంపింది. అందులో నాకు మంచి కథాబీజం కనిపించింది. అదొక నవలగా రాయాలన్నది నా తలపు. అన్నీ అనుకూలిస్తే ఆ పని చేస్తాను.

మీ కథలకు అచ్చుకు ముందు తొలి పాఠకుడు ఎవరైనా ఉండేవారా?

ఐ.విగా పేరొందిన ఇవటూరి సాంబశివరావు నా కథలకు తొలి చదువరి. గ్రామీణ విషయాలు రాసేటప్పుడు అవి సరిగానే ఉన్నా పెద మురపాక కరణీకం చేసిన మా తమ్ముడు కాళీపట్నపు కృష్ణారావు మరొక్కసారి సరి చూసేవాడు.

రావిశాస్త్రి గురించి మీ పరిచయం గురించి...

ఆయన ఆనర్స్ చదువుకొని కోర్టులో ప్రాక్టీసు చేస్తున్న లాయర్. ఆయనని మనం కలవవచ్చునా అనే సంశయం నాలో ఉండేది. చివరకు ఒక మీటింగ్‌లో కలిశాం. వారు చాలా స్నేహశీలి అని గ్రహించాను. ఆయన కూడా నాపై శ్రద్ధ పెట్టేవారని గ్రహించాను. సరస్వతీహాల్ టీబల్లల వద్దా లీలామహల్ అరుగులపై దాదాపు రోజూ కలిసేవారం. ఆయన ప్రోద్బలం వల్ల ఇంగ్లిష్ సాహిత్యం చదవడం ఇంగ్లిష్ సినిమాలు చూడటం జరిగింది. వారి పరోక్ష ప్రోత్సాహం నేను కథలు రాయగలననే నమ్మకం పెంచింది.

'యజ్ఞం' కథ రాసే ఆలోచన ఎలా కలిగింది? దీనిని మీరు 1964లో రాస్తే 1966లో కానీ అచ్చు కాలేదు. దీనిని అచ్చుకు ముందే చదివిన వారు ఉన్నారా? అచ్చు తరువాతి స్పందనలు...

విశాలాంధ్ర వారి నవలల పోటీకి రాద్దామనుకున్న ఇతివృత్తం అది. 1964లో ఒక హోటల్లో కాఫీ తాగుతుండగా అప్పల్రాముడు పాత్ర నా కళ్ల ముందు అవుపడింది. అది నాలో కలిగించిన ప్రేరణ ప్రభావంతో ఆము తిన్న పసరంలా తయారయ్యాను. ఆ కథ గురించి ఐ.వి సాంబశివరావుతో చెప్తే ఇది తప్పకుండా రాయాల్సిందే అని రాసే వరకూ ఊరుకోలేదు. అలా రెండు మూడు నెలల్లో యజ్ఞం తయారైంది. తెలుగు కథ ఉన్నంతకాలం ఈ కథ ఉంటుందని శాస్త్రిగారు అన్నట్టు నాకు గుర్తు. రోజూ ఎంత రాస్తూ ఉంటే అంతా చదివినవాడు ఐ.వి. కథ పూర్తి అయినాక ఫెయిర్ కాపీ చదివినవారు రాచకొండ. నా భ్రమో ఏమో తెలీదుకానీ తరువాత్తరువాత అసలు తానా కథ చదవనే లేదని శాస్త్రిగారు అంటూ ఉండేవారు. ఈ కథను నేను ద్రష్టగా, కథకుడిగా, పాఠకుడిగా, విమర్శకుడిగా, రంధ్రాన్వేషిగా అయిదు బాధ్యతలు నిర్వహిస్తూ రాశాను. వచ్చిన స్పందనల్లో వ్యతిరేకమూ అనుకూలమూ అయినవి అప్పుడూ ఇప్పుడూ ఉన్నా ఎక్కువమంది సమర్థింపు కథకు లభించిందనే నా భావన.

ఆత్మకథ రాస్తారా?

సమాజానికి పనికిరాని వ్యక్తిగత విషయాలు గుదిగుచ్చి మన ఘనతలు చెప్పుకోవడం కన్నా సమాజ పురోగమనానికి దోహదపడే నాలుగుమాటలు ఏదో రూపేణా చెప్పడమే నా మనసుకు నచ్చిన పద్ధతి.

ఆ ఆలోచనలు సఫలం కావాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలతో... సెలవు..

సెలవు. నమస్కారం.

ఇంటర్వ్యూ: **రామతీర్థ, జగద్ధాత్రి**
9849200385

నవ్య
ప్రజాశక్తి
7 విశాఖపట్నం
సోమవారం 25 -8-2014
సాహిత్యం కళలు చరిత్ర మీడియా

ప్రగతి సాహిత్యానికి 'అనంత'స్ఫూర్తి

" తన జీవితకాలంలో నవ్య సాహిత్యోద్యమానికి బాసటగా నిలిచి, మనుషులను మనుషులుగా చూడలేని ఒక అమానవీయ ఆర్థిక వ్యవస్థ చెలరేగుతున్న కాలంలో, రాబోయే ప్రభుత్వాలు ప్రజలను బెదిరించి, పిరికివారుగా మారుస్తాయి అని చెప్పిన అనంతమూర్తి మన కాలపు సాహిత్య యోధుడు. అసమ్మతికి, ప్రశ్నరూపమైన సాహిత్యానికి, గురుతరమైన సామాజిక బాధ్యతకు ప్రామాణిక వ్యకిత్త్వంగా జీవించినవాడు. వారికి తగు నివాళి 'మానవుడే నా సంగీతం, మానవుడే నా సందేశం' అన్న మహా వాక్యాన్ని విశ్వసించి ఆచరించడమే! "

అక్షర వటవృక్షం అనంతమూర్తి (1932 - 2014)

కర్నాటక రాజధాని బెంగళూరులో ఒక సాహిత్య వటవృక్షం నేలకు ఒరిగింది. ఆ చప్పుడు ప్రపంచమంతా వినిపించింది. ఎనభై ఒక్క ఏళ్ల డాక్టర్ ఉడుపి రాజగోపాలాచార్య అనంతమూర్తి ... భారతదేశం గర్వించదగ్గ సాహితీవేత్త. షిమోగా జిల్లా, తీర్థహళ్లి తాలూకాలోని ఒక మారుమూల గ్రామం మేలెగేలో పుట్టారు. ప్రపంచం గుర్తించిన అభ్యుదయ భావజాల సంపన్నుడిగా, అక్షర సృజనశీలిగా ఆయన చేసిన ప్రయాణం స్ఫూర్తిదాయకమైనది. ఇదే ప్రయాణం గురించి ఒక సందర్భంలో ఇలా అన్నారు ఆయన : 'సోమర్సెట్ మాం ప్రపంచం గురించి ఒక మెరుగైన దృష్టి కోణం సముపార్జించేందుకు ఒక నోట్‌బుక్ చేత పట్టుకుని లోకమంతా తిరిగారు. కాఫ్కా అదే పనిని ఒక గదిలో కూచుని చేసినా, మాం కన్నా మెరుగైన ప్రాపంచిక దృక్కోణాన్ని అలవర్చుకున్నాడు' అని.

అనంతమూర్తి తొలి చదువులు సంస్కృత పాఠశాలలోనే అయినా, మైసూర్ యూనివర్సిటీ నుంచి ఎంఎ డిగ్రీ పొందాక- కామన్వెల్త్ స్కాలర్‌షిప్ ద్వారా ఇంగ్లాండ్‌లో ఉన్నత చదువులు చదివారు. బర్మింగ్‌హామ్ విశ్వవిద్యాలయం ద్వారా 1966లో '1930ల నాటి రాజకీయాలు - సాహిత్యం' అన్న అంశంపై డాక్టరేటు పట్టా పొందాడు. 1970లో మైసూరు విశ్వఃవిద్యాలయంలో ఆంగ్ల భాషాచార్యుడిగా ఉద్యోగ జీవితం మొదలు పెట్టి, 2012లో కర్నాటక సెంట్రల్ యూనివర్సిటీ ఛాన్సలర్ వరకూ ఎదిగారు. కేరళ కొట్టాయంలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీకి ఛాన్సలర్‌గా, నేషనల్ బుక్‌ట్రస్ట్ ఛైర్మన్‌గా, సాహిత్య అకాడెమీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. పలు విశ్వ విద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా దేశవిదేశాల్లో సేవలు అందించారు. పూణేలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్‌కు రెండుసార్లు ఛైర్మన్‌గా పనిచేశారు.

ఎనిమిది కథా సంపుటాలు, అయిదు నవలలు, ఒక నాటకం, మూడు కవిత్వ సంపుటాలు, ఎనిమిది సాహిత్య విమర్శా వ్యాసాల సంకలనాలు... అనంతమూర్తి సాహిత్య సృష్టి. వాటిలో పలు ప్రపంచ భాషల్లోకి అనువాదమైన 'సంస్కార', 'భావ', 'భారతిపుర' మొదలైనవి ఉన్నాయి. ఇవి సినిమాలుగా కూడా వచ్చాయి. 'రుజువతు' (రుజువు లేదా సాక్ష్యం) అనే పత్రికకు సంపాదకునిగా కూడా పనిచేశారు. వివిధ సందర్భాల్లో సమస్యల్లో చిక్కుకున్న పాత్రల మనస్తత్వ చిత్రణ యుఆర్‌ఏ రచనల్లో విశేషంగా కనిపించే ధోరణి. 'బర' అనే నవలలో కన్నడ రాష్ట్రంలోని ఒక కరవు పీడిత ప్రాంతపు వెతలు, అక్కడ అధికారులు ఎదుర్కొనే ప్రతికూల పరిస్థితులపై గొప్ప చిత్రణ చేశారు.

మత దురహంకార రాజకీయ శక్తుల వ్యతిరేకిగా, ప్రగతిశీల స్వరంగా గత అర్ధ శతాబ్దం నుంచి యుఆర్‌ఏ దేశవ్యాప్తమైన గుర్తింపు పొందారు. బిజెపి దక్షిణాదిన అధికారంలోకి వచ్చిన కర్నాటకలో, హిందూమత ఛాందస భావజాల ప్రతినిధులు ఎక్కువగా ఉన్న చోట- ప్రగతిశీలవాదిగా యుఆర్‌ఏ తన వాణిని చాలా గట్టిగా వినిపిస్తూ వచ్చారు. హిందుత్వవాదిగా ముద్ర కలిగి ఉన్న ఎస్.ఎల్.భైరప్ప నవల 'ఆవరణ'ను తీవ్రంగా ఎండగట్టారు. ముస్లిములపై నీలినీడలు ప్రసరించేలా ఈ రచనను చేసిన భైరప్ప, ఇందులో యుఆర్‌ఏ, ఆయన భార్య (శ్రీమతి ఎస్తర్, క్రిస్టియన్)లను పోలిన పాత్రలు లక్ష్మీనాథశాస్త్రి, ఆయన భార్య ఎలిజబెత్‌గా చిత్రించేంతవరకూ వెళ్లింది. 'అతడు వాగ్వాది తప్ప సృజనకర్త కాడు..' అని భైరప్పను యుఆర్‌ఏ గట్టిగా విమర్శించారు. ప్రముఖ కవి, సాహిత్యకారుడు ఏ.కె.రామానుజన్ రచన 'మూడు వందల రామాయణాలు, అయిదు ఉదాహరణలు, అనువాద పరిశీలనలు' పేరిట రాసిన వ్యాసం, పలు సంవత్సరాలుగా తమ పాఠ్య ప్రణాళికలో ఉన్నదాన్ని, ఢిల్లీ విశ్వవిద్యాలయం 2011లో తమ సిలబస్ నుంచి తొలగించినప్పుడు తీవ్ర అభ్యంతర స్వరాన్ని వినిపించాడు యుఆర్‌ఏ.

1994లో జ్ఞానపీఠ పురస్కారం పొందారు అనంతమూర్తి. ఆ పురస్కారం పొందిన ఎనిమిది మంది కన్నడ రచయితల్లో ఆరవ వాడాయన. 1988లో పద్మభూషణ్ అందుకున్నారు. 2008లో నాడోజా పురస్కారాన్ని హంపి కన్నడ విశ్వ విద్యాలయం ప్రదానం చేసింది. వయసు పెద్దదైనాక కూడా గత వత్సరం మాన్ బుకర్ బహుమతికి తన రచన తుది జాబితాలోకి చేరిన చురుకైన రచయిత యుఆర్‌ఏ. ఇంకా ఎన్నో ప్రతిష్టాత్మకమైన అవార్డులను పొందారాయన.

జన్మతః బ్రాహ్మణులైనా తమ కులంలోని మూఢాచారాలను తామే ఎత్తిచూపిన అనేకమంది భారతీయ రచయితలమల్లే, యుఆర్‌ఏ కూడా తన నవల 'సంస్కార'లో ఒక వెలివేయబడ్డ బ్రాహ్మణుడి చావు పట్ల అగ్రహారీకుల మల్లగుల్లాలను చిత్రిస్తాడు. ఈ రచనలోని గ్రామం దూర్వాసాపుర. ఇది ఆయన చిన్ననాడు చదువుకున్న పల్లెటూరు. ముగింపు లేకుండా సమస్యను అలాగే వదిలిన కథనం ఇందులో చూస్తాం. ఎవరూ తేల్చుకోలేని సమస్యకు అగ్రహార బ్రాహ్మణుల పెద్దగా పరిగణించబడే ప్రాణేశ్వరాచార్యులు ఒక పరిష్కారం వెదకాలని వ్యర్థ ప్రయత్నాలు చేస్తాడు. ఆఖరికి వెలి వేయబడ్డ నారనప్పతో సంబంధం గల చంద్రి మోహంలో పడి ఎటూ తేలని ఈ సమస్యకు సమాధానం మాట ఎలా ఉన్నా, రాత్రి ఆమె ఒడిలో మేలుకుంటాడు. అసలు నారనప్ప వెలికి కారణమే చంద్రితో గల సంబంధం. అగ్రహారీకుల సందిగ్ధతతో ఆ రాత్రి తానే ఆ శవాన్ని ఖననం చేసి ఆ ఊరొదిలి వెళ్ళిపోతుంది ఆమె. ఈ సంగతి ఎవరికి చెప్పాలో, కూడదో అన్నది తన మనసులో సమస్యగా వెన్నాడుతుండగా, కొన్నాళ్లు ఊళ్ళు తిరిగి వొచ్చిన ప్రాణేశ్వరాచార్యులు తిరిగి తమ దూర్వాసపురకు వస్తాడు. తనకూ, చంద్రికి ఏర్పడ్డ సంబంధం గురించి తాను చెప్పిందీ లేనిదీ రచయిత స్పష్టం చేయకుండా వదిలేస్తాడు.

దీన్ని యుఆర్‌ఏ 1965లో తాను బర్మింగ్ హామ్ యూనివర్సిటీలో పిహెచ్‌డి చేస్తుండగా రాశాడు. ఇంగ్ మర్ బెర్గ్‌మాన్ ప్రయోగాత్మక సినిమాల ప్రభావం ఈ కథనంపై ఉంది. కన్నడ సినిమారంగంలో గిరీష్ కర్నాడ్ ప్రాణేశ్వరాచార్యులుగా, పి.లంకేష్ నారానప్పగా, ఈ సినిమా నిర్మాత తెలుగులో ప్రఖ్యాత కవి అయిన తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి భార్య స్నేహలతా రెడ్డి చంద్రిగా పాత్రల పోషణతో ఈ నవల సంస్కార పేరుతోనే సినిమాగా వచ్చింది. ఈ సినిమా తొలుత సెన్సారు ఆంక్షలకు గురైనా విడుదలైన తరువాత 1970లో అత్యుత్తమ చిత్రంగా జాతీయ అవార్డుతో సహా ఎన్నో అవార్డులు పొందింది.

కాలం కదిలి వెళ్ళిపోతున్నా మానవ సంబంధాల పునరావృత్త పరంపర గురించి, 'తాతయ్య భుజాల ముడతలు' కవితలో యుఆర్‌ఏ చెప్పింది కవిగా సైతం వారి శక్తి, కవిత్వ పటుత్వానికి ఒక చక్కని సాక్ష్యం. అందులోంచి కొంత భాగం.

'తాతయ్య భుజాల మీది ముడతలు పైనుంచి చూస్తే కొండలూ, లోయల్లా కనిపిస్తాయి/ రాజాలా ఊగవచ్చు సవారీ అయి తాత పిలక పట్టి తారంగం తారంగం/ తనూ నాలాగే ఊగి ఉంటాడు తన తాత వీపు పైకెక్కి/ లాగూ జేబులో కొన్ని రహస్యాలు/ తాతయ్య పిలక పట్టుకు ఊగుతూ తారంగం తారంగం/ సవారీ అయి ఏనుగు అంబారీ పై ' ..... *'మా ముత్తాత కూడా తన తాత భుజాలపై/ ఇలాగే ఊగి ఉంటాడు ఏనుగంబారీ ఎక్కడో అడవుల్లో/ తాత పిలకకళ్ళెం లాగుతూ ....'* నాలుగు భాగాలుగా సాగే ఈ కవిత చివర్లో అంటాడు యుఆర్‌ఏ : 'ఇవే జ్ఞాపకాలు నేనూ మోయదల్చుకున్నాను నా భుజాల ముడతలపై'.

తన జీవితకాలంలో నవ్య సాహిత్యోద్యమానికి బాసటగా నిలిచి, మనుషులను మనుషులుగా చూడలేని ఒక అమానవీయ ఆర్థిక వ్యవస్థ చెలరేగుతున్న కాలంలో, రాబోయే ప్రభుత్వాలు ప్రజలను బెదిరించి, పిరికివారుగా మారుస్తాయి అని చెప్పిన యుఆర్‌ఏ మన కాలపు సాహిత్య యోధుడు. అసమ్మతికి, ప్రశ్నరూపమైన సాహిత్యానికి, గురుతరమైన సామాజిక బాధ్యతకు ప్రామాణిక వ్యకిత్త్వంగా జీవించినవాడు. డాక్టర్ యుఆర్‌ఏ కన్నుమూతతో ఒక సృజన శిఖరాన్ని కోల్పోయాము. వారికి తగు నివాళి 'మానవుడే నా సంగీతం, మానవుడే నా సందేశం' అన్న మహా వాక్యాన్ని విశ్వసించి ఆచరించడమే! వారికి జోహార్లు చెప్తూ వారి చేతి జెండాలను అందుకుందాం.

- రామతీర్థ
98492 00385

తిమిరాన్ని తరిమేస్తాం

మాటనిలా నిలబెట్టుకుంటావనుకోలేదు సుమా!
అనంత సాహితీమూర్తీ ...
మాటనిలా నిలబెట్టుకుంటావని అస్సలనుకోలేదు
నరహంతకులు నరాధిపతులైన నేలపై
మనుగడ సాగించనని
నిర్భీతితో నినదించావు
నిరసన కేతనమయ్యావు
కారుమబ్బులు కమ్ముకొస్తున్నవేళ
కాంతిపుంజమై మెరిశావు
మాటనిలా నిలబెట్టుకున్నావేమో కాని
మాకందరకు తీవ్ర నిరాశ కలిగించావు
అల్పబుద్ధులు అందలం ఎక్కి
అసహనాన్ని హద్దులు దాటిస్తున్న వేళ
మూఢత్వాన్ని పెచ్చరిల్లిస్తూ
భిన్నత్వాన్ని ఛిద్రం చేస్తున్న చోట
సౌభ్రాతృత్వం సంఘటితమవ్వాలని
పరమత సహనం పరిఢవిల్లాలని
లౌకిక భారతం మహోజ్వలంగా మనగలగాలని
మనసా వాచా నమ్మి
ఉన్మాదులను ఎదురిస్తూ
గళమెత్తి కదులుతున్న శక్తులకు
సాహస లౌకిక సంస్కారివై
సాహితీ వెలుగులనందించిన నీవు
అనంత లోకాలకు అందకుండా పోయావు!
నీ ఆశయం మా లక్ష్యం నెరవేరేందుకు శ్రమిస్తాం
నీ సాహిత్యపు వెలుగులో ప్రస్థానం సాగిస్తాం
అలముకున్న తిమిరాన్ని ఆవలకు తరిమేస్తాం!!

- ఎ.వి.రమణారావు
98487 10507

మనకి చార్వాకులూ... వాళ్లకి చార్లీలూ...

మతంలోని జీవామృత సారాన్ని గ్రహించలేని వారి వల్ల ఆ మతానికే చేటు. ఒక పత్రికపై దాడిచేసి ప్రధాన సంపాదకుడిని, కార్టూనిస్టులను చంపగలిగారు. రేపు వందలాది పత్రికలు అవే కార్టూన్లు ప్రచురిస్తే, ఎంత మంది ఉగ్రవాదులు రాగలుగుతారు?

సందర్భం

రామతీర్థ

కార్టూన్లు జగద్గీతలు. తుపాకులు పిచ్చి రబ్బరు గుళ్లు. కొంచెం చెరుపుతాయేమో కానీ పూనికను చెదరగొట్టలేవు. ఎడారి ఇసుక రేణువంత విశ్వాసాన్ని పట్టుకుని, ఒక ఎడారినే మోస్తున్న భావనతో బయలుదేరిన భయపీడితులు వారు. తాము భయపడుతుంటారు కాబట్టే, భయపెడుతుంటారు. అన్ని రూపాలు తానే అయిన వాడికి ఏ రూపం లేకపోవడం ఒక దోషం తప్ప అదొక శాశ్వత లక్షణం కాదని విశాల విశ్వం చెప్తుండగా, చాలా చిన్న భేదాలతో నరమేధం ఒక నాగరికతగా చెలరేగిపోతారు.

వారు యుద్ధంలో లేకున్నా, పాత్రికేయులైనా నరే తలలు మీడియాలలో చూపిస్తూ నరికే తీవ్రత ఒకరిది. తీవ్రవాదం మీద యుద్ధం అంటూ, ఖండాలు ఖండాల ప్రజలను ప్రమాదాల అంచుకు నెడుతున్న ఆర్థిక అభివృద్ధి ఉగ్రవాదం మరొకరిది, ఎవరివల్ల ఎక్కువ నష్టం అన్నదానికన్నా, ఇద్దరివల్లా పలు పార్శ్వాలలో శతాబ్దాలుగా సభ్య సమాజం నష్టపోతూనే ఉన్నదనేది చార్లీ పత్రిక తాత్విక ప్రాతిపదిక. ఆ పత్రిక చేసినదీ, చేస్తున్నదల్లా మందలించడమే. వెక్కిరింతకు వేద పూజ్యత ఉన్న స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాల ఫ్రెంచ్ సమాజం అది.

మేమే గొప్ప, మా భావనలే అధికం, మా దేవుళ్లే అందరికన్నా అధికం అన్నవి ఒక రకంగా ఫాసిస్టు భావనలు. ఎటొచ్చీ ఇవి పిండరూపంలో ఉంటాయి. అదను దొరికితే, ఏ దేశంలోనైనా, ఏ మతంలోనన్నా, ఇవి తలలు పైకెత్తుతాయి. ఈ ఆధిపత్యపు భావనలకు దాసానుదాసులైన అందరికీ, ఈ వితండ చేష్టలంటే లోపల్లోపల ఇష్టమే ఉంటుంది. అదే మత వ్యవస్థతో వచ్చిన వైపరీత్యం. గత శతాబ్దాలన్నీ వీటితోనే నిండి ఉన్నాయి. ప్రతి సమాజం, తాను నమ్ముతున్న నమ్మకాలు నిజంగా ఏ విలువ కలిగి ఉన్నాయో పరిశీలించుకోవడం కోసం, వ్యంగ్య చిత్రం వేపు చూస్తుంది. ప్రతి కార్టూనూ ఒక సూక్ష్మ రూప శాస్త్ర చికిత్స, ఒక మానసిక వైద్యశాల.



మూఢ నమ్మకాలతో గడ్డ కట్టిన ప్రతీ మత వ్యవస్థను ప్రశ్నించిన, వెక్కిరించిన కంచుకాగడా, చార్లీ పత్రిక. క్రీస్తు, పోప్, ప్రవక్త, ఫ్రెంచ్ అధ్యక్షుడు చార్లెస్ డిగాల్, అందరి వ్యంగ్య చిత్రాలు ప్రతీవారం, ఆ ఫ్రెంచ్ పత్రిక సంచలనాల ముఖచిత్రంగా వెలువడుతూ వచ్చాయి. రామాయణం మీద మన తెలుగు సమాజంలోనే ఎన్ని మౌలిక దృక్కోణాలు వెలువడ్డాయో మనకందరకూ తెలుసు. అంతమాత్రాన, రాముడిని దేవుడిగా విశ్వసించే వారికి విశ్వాస భంగం కలుగదు. ఒక ప్రశ్నల సమాహారానికే నిలదొక్కుకోలేని బలహీనులు కారు మత స్థాపకులు, మత దేవతలు. మేము ఒక సమూహం కాబట్టి మా నమ్మకాలను గాయపరచవద్దు అని పిరికి వాళ్లు మాత్రమే అంటారు.

దీనికి ఒకనాటి యూరోప్ కూడా అతీతం ఏమీ కాదు. మన గ్రహ కుటుంబం, భూ కేంద్రం కాదని, సూర్య కేంద్రకం అని చెప్పినందుకు, అప్పటి వారి క్రైస్తవ మత నమ్మకాలు గాయపడే, వారు బ్రూనో వంటి శాస్త్రవేత్తను సూనె గుడ్డలకు కట్టి కాల్చి వేశారు. మనం కూడా రామ మందిరమంటూ, మసీదంటూ అనేక మంది ప్రజలను అనాగరికంగా చంపుకున్నాము. వెరసి ఏ సమాజమూ, ఈ మత ప్రేరిత విద్వేషాలకు దూరంగా లేదు.

దైవ భావన పట్ల చర్చ, అనంత విశ్వం గురించి చీమ తలకాయలతో ఆలోచించినట్టే ఉంటుంది. దౌర్జన్యభాషకు ఏ దేవుడి గ్రంథంలోనూ అనుమతి లేదు. ఏ దేవుడూ, కొందరు ప్రజలకు అనుకూలుడూ, మరికొందరు ప్రజలకు వ్యతిరేకీ కాదు. మత వ్యవస్థలు కట్టు తప్పి, పదే పదే తెంపరితనాలను తెలుపుతున్నప్పుడు మతం తెగబడి నెత్తురు కళ్లజూసినప్పుడు, సమాజంలో పలు విశ్వాసాల మధ్య ముసలం వంటి దోకు పోతున్నప్పుడు, ఏ సూఫీలూ సమర్థించలేదు. ఏ సాధు సంతులూ ఆమోదించలేదు. ఏ ఫాదరీలూ కొమ్ము కాయలేదు.

ప్రతీ మతంలో ఈ జీవామృత సారం ఉన్నది. అది అందుకోలేని వారు ఏ మతంలో ఉన్నా వారి వల్ల ఆ మతానికే చేటు. ఒక్క పత్రికపై దాడి చేశారు. ఒక ప్రధాన సంపాదకుడిని, కొందరు కార్టూనిస్టులను చంపగలిగారు. రేపు వందలాది పత్రికలు అవే కార్టూన్లు ప్రచురిస్తే, ఎంత మంది ఉగ్రవాదులు రాగలుగుతారు? ఎన్ని పత్రికల గొంతులపై దౌర్జన్యాలను సాగిస్తారు?

ఏ మతమూ తన మధ్యయుగాల ఆలోచనలతో, ఆధునిక మహా ప్రవాహాన్ని ఆపలేదు. యుద్ధాలు చేసి బాంబులేయడం. తలలు నిర్దాక్షిణ్యంగా ఉత్తరించడం, పసిపిల్లలను చంపడం, కులం పేరిట కళ్లు పీకడం, కొత్తగా పెళ్లి చేసుకున్నా వారిని పరువు హత్యలు చేయడం... ఆలోచిద్దాం మరి. ఏ దేశ సమాజం ఇటువంటి విపరీత సంఘటనలకు మించిన పరిణతి కలిగి ఉంది?

అలనాడు సోక్రటీస్ లొంగిపోవడాన్ని తిరస్కరించి, తాగిన హైమ్లాక్ విషంలోనే ఉన్నది మూర్ఖ ఆధిపత్యాల పట్ల మానవ నిరసన. మనకి చార్వాకులున్నారు. వాళ్లకి చార్లీలున్నాయి. కళలను ద్వేషించి, కళాకృతులను ద్వేషించి ఒక ఎడారి ఉగ్రవాదం మౌఢ్యపు చీకటిలో మృత్యునృత్యం చేస్తూ ఉంటే, దాని అనుయాయుల దేశాలకు పాశ్చాత్య సమాజం కలిగిస్తున్న కడగండ్లను, తిరస్కరిస్తూనే, మానవ సమాజ పరిణామంలో ప్రశ్నకు రూపంగా నిలిచిన సోక్రటీస్‌ను, నేనే ఎందుకు క్రైస్తవుడ్ని కాను అన్న బెర్ట్రాండ్ రస్సెల్నూ, చనిపోయిన తండ్రికిచ్చిన మాట పక్కన పెట్టి, రాముడిని, చక్కగా రాజ్యం చేసుకోమన్న చార్వాకులను, ప్రేమ తత్వశిఖరాలైన సూఫీలను చూపెట్టి, జవాబు చెప్దాము. అల్లాహూ అక్బర్, భగవాన్ సర్వాగ్రణి, గాడ్ ఈజ్ గ్రేటస్ట్ అంటే భాషలు వేరైనా భావన ఒక్కటే అని. ఈ భాషలన్నీ పలికే భౌతిక అవయవం నాలుక ఒక్కటే అని. తుపాకీ తూటాలు ఏర్పరిచిన ఖాళీలను, పూరించడంలో మానవ సమాజం ఎప్పుడూ నూటికి నూరు మార్కులు సాధిస్తూనే ఉంటుంది.

(వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత)

మొబైల్: 98492 00385

రచనలకు ఆహ్వానం

విశాలాంధ్ర 'సాహితి' పేజీలో ప్రచురణార్థం రచనలను ఆహ్వానిస్తున్నాం. ప్రగతిశీల అంశాలతో కూడిన వ్యాసాలు, విమర్శలు, సమకాలీన సాహిత్య ధోరణులపై విశ్లేషణలు, ప్రముఖుల ఇంటర్వ్యూలు, సమీక్షలు పంపవచ్చు. రచనలను ఈ మెయిల్‌లో కూడా అందజేయవచ్చు. అయితే కాపీలను పేజీమేకర్ ఫైల్‌తో పాటు పిడిఎఫ్‌గా మార్చి పంపాలి. వ్యాసాల నిడివి మరీ పెద్దగా ఉండకూడదు. రచయిత పూర్తి చిరునామా, ఫోన్‌నెంబర్ ఈ-మెయిల్ అడ్రసు జతచేయాలి. **రచనలు పంపాల్సిన చిరునామా:** ఎడిటర్, సాహిత్యానుబంధం, విశాలాంధ్ర దినపత్రిక, చంద్రం బిల్డింగ్స్, చంద్ర రాజేశ్వరరావురోడ్ (చుట్టుగుంట), మాచవరం (పోస్టు), విజయవాడ-520004. ఫోన్: 0866-2430220, ఫాక్స్ : 0866-2431780 email: **sundayvisalaandhra@gmail.com**

చాసో ప్రతి కథ ఓ వజ్రమే!

కాలానికి నిలబడే కథలు నావి అని ఆత్మవిశ్వాసంతో చెప్పారు చాసో. 1942లో ప్రచురితమైన చిన్నాజీ కథతో మొదలు పెట్టి 1979లో కప్ప కథ వరకూ ఆయన రాసిన నలభయి కథల్ని చాసో కథల సంపుటిగా విశాలాంధ్ర ప్రచురణాలయం తెలుగు సాహిత్య లోకానికి అందించింది. ఇంకా పణుకుల వాగు, పెంకు పురుగు వంటి ప్రచురిత కథలు ఒక పది వరకూ కలిపితేనే చాసో సమగ్ర కథా సంపుటి అవుతుందని, అయితే చాసోయే తన జీవిత కాలంలో వీటిని సంపుటీకరించలేదని, అందువల్ల ఇప్పుడు వాటిని కలిపి ప్రచురణకు ఇవ్వడమా వద్దా అన్నది ఒక సంశయంగా ఉందని చాసో కుమార్తె చాగంటి తులసి ఇటీవల ఒక సంభాషణలో అన్నారు. 2014-15 చాసో శతజయంతి వత్సరంగా... చాసో రాసిన మొత్తం కథలు, కొన్ని నాటికలు, పత్రికలకు, రేడియోకు ఇచ్చిన ఇంటర్వ్యూలు, అరుదైన ఫొటోలు, చాసో సప్తతి సంచికలో వచ్చిన వ్యాసాలు అన్నీ కలిపి "చాసో దర్శనం"గా ఒక విలువైన ప్రచురణ తీసుకురావలసిన అవసరం మాత్రం ఉంది.

చాసోకు కేవలం కథా రచయితగానే కాక ఆంధ్రాలో అభ్యుదయ రచయితల సంఘాన్ని (1942) శెట్టి ఈశ్వరరావు, చదలవాడ పిచ్చయ్యలతో కలిసి వ్యవస్థాపించిన, భావ కవిత్వ ధోరణిని వ్యతిరేకించిన వారు. స్వాతంత్ర్యోద్యమ కాలపు భారత దేశంలో అంతర్భాగమైన తెలుగు గ్రామీణ జీవనాన్ని, బడుగు రైతాంగ, దిగువ మధ్య తరగతి జీవితాలలో వస్తున్న మార్పులను గమనించి, వారు తీసుకున్న తెగింపులను కథలకెక్కించిన రచయిత. ఇలా ఆయనకు ఒక సుస్థిర స్థానం ఉంది. చాసో కథలలో పాత్రలు ఏవో సిద్ధాంత చైతన్యాలతో కాక తమ ఎరుక మేరకు, తమ జీవన అవసరాలను తెలుసుకుని, తమకు అందుబాటులో ఉన్న మార్గాలను వెతుక్కుంటాయి. ఇలాంటి పరిస్థితులు ఆ పాత్రలకు ఏర్పడడంలో సమాజ పరిస్థితుల బలవత్తరమైన నేపథ్యం ఉంటే వాటిని పాఠకులు అర్థం చేసుకోవలసిందే తప్ప రచయిత అందుకు ఎట్టి సహాయం చేయడు. ఇది చాసో పద్ధతి. చాసోదే కాదు, ఉత్తమ కథకుల ధోరణి ఇదే. ఇందుకు చాసోకు చెహూవ్ మార్గదర్శి. గోర్కీకి రాసిన ఒక ఉత్తరంలో చెహూవ్, "మీరు వెన్నెలను, అడవిని వేరు వేరుగా వర్ణిస్తున్నారు. అంతకన్నా మంచి పద్ధతి వెన్నెలలో అడవి ఎలా ఉందో చెప్పడం" అని సూచిస్తాడు. చెహూవ్ తన చేతి దీపంగా గురజాడ దారిలో, చాసో విజయనగరాన్ని తెలుగు కథకు ఆద్యసింధువుగా, కదలి తీరంగా మలిచాడు. చాసో కథలలో జీవన వాస్తవికత.. తెలుగు సాహిత్యంలో సామాజిక వాస్తవికత అన్న పదబంధం ప్రాచుర్యాన్ని పొందడానికి దశాబ్దాల ముందరే, అటు జీవితాన్ని, ఇటు సమాజాన్ని కూడా ఒడుపుగా చూపిస్తూ కొత్త తీరాలకు సాగిపోయింది.

చాసో కథలను చూసి సంగీత ప్రియులు వాటిలో సంగీత స్వరలయల ప్రవీణత కనిపిస్తుందన్నారు. చిత్రకారులకు ఆ కథలలో ఎన్నో రంగుల బొమ్మలు కనిపించాయి. నిజానికి ఇంకా ఆ బొమ్మలను మనం వేయాల్సి ఉంది. కథలంటే చెవులు కోసుకునే వారికి విహరించడానికి, వీలయితే నివసించడానికి యాభై కథా ద్వీపాలను ఇచ్చి వెళ్ళిన రాబిన్సన్ క్రూసో, మన విజయనగరం చాసో. "విజయనగరం ప్రాంతం గురించే కథానేపథ్యంగా రాసినా నా కథలలో ప్రపంచం అంతా కనిపిస్తుంది" అన్న చాసో మాటలు అక్షర సత్యాలు.

చాసో స్త్రీ పాత్రలు.. చలం స్త్రీ పాత్రల కన్నా గడసరులు, ఇంగితంతో ప్రవర్తించి, జీవితాన్ని అన్ని విధాలా నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తాయి. అసాధ్యమైన ఉద్వేగాలు నడిపిస్తే నడిచి మనుష్యులు జీవితంలో సుఖం పొందడం అనే లక్ష్యం కోసం సాహసాలు చేయడం చలం పాత్రలలో మనకు కనిపిస్తుంది. చాలా సందర్భాలలో చలం స్త్రీ పాత్రలు ఆ సుఖాన్ని తమ జీవితంలో పొందాయా, నిలబెట్టుకోగలిగేయా అన్న ప్రశ్నలు ఉండనే ఉన్నాయి. చలం కథలను చాసో నచ్చుకోకపోవడానికి వాటిలోని ఊహాంచల సాహసికాంశం ఒక ముఖ్య కారణం కావచ్చు. అవి నేల విడిచి సాము చేశాయి. తమ జీవన అవసరాలకు మించి ఆవేశించి స్పందించాయి, అంటే అది కథకుడి స్వభావంపై కూడా ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే కథకు సూత్రధారుడు రచయితే కాబట్టి.

లేడీ కరుణాకరం, ఏలూరెళ్లాలి, చెప్పకు, బదిలీ కథలలో స్త్రీ పాత్రలు తమ జీవన అవసరాలను ఎరిగి ప్రవర్తిస్తాయి. లేడీ కరుణాకరం కథలో చదువుకోని అందాల శారద, తన భర్త చదువు, అభ్యున్నతి కోసం తన ఆకర్షణను ఉపయోగిస్తుంది. ఏలురెళ్లాలి కథలో మాణిక్యాంబ జీవితానికి ఒక ఆర్థికమైన దన్ను ఏర్పడడం కోసం తన కన్నా బాగా చిన్న వాడైన కాలేజీ కుర్రాడితో వైవాహికేతర సంబంధాన్ని, సంతానం కోసం ఏర్పరచుకుంటుంది. చెప్పకు కథలో తల్లి పాత్ర, భర్త పోయాక, కుటుంబాన్ని పెంచి పోషించాల్సిన దశలో తాను అమ్మకపు వస్తువుగా మారినా, కొడుకు చదువు గురించే, ఉద్యోగం వచ్చి జీవితంలో స్థిరపడ్డం గురించే తాపత్రయ పడుతుంది. ఆ చదువు అబ్బకపోయిన చిన్న కొడుకు, తన లాగే తయారవుతున్న కూతురు పట్ల మళ్ళా ఏ విధమైన అభ్యంతరాలూ ఉండవు. బదిలీ కథలో యువతి కొంతసేపు పరాయి ఆకర్షణకు గురైనా తిరిగి తన కాలు కూడదీసుకోవడం ప్రధానమైన మలుపు.

అప్పుడే స్వాతంత్ర్యం వస్తున్న, పెద్దగా చదువుకోని దిగువ మధ్య తరగతి కుటుంబాలు, జీవితాలలో ఎలా నిలదొక్కుకున్నాయో, విద్య నేర్వడం ఎలా ఒక ముఖ్య అవసరంగా పరిణమించిందో.. ఎందుకు పారేస్తాను నాన్నా, వెలం వెంకడు, ఏకరువు, కుంకుడాకు కథలలో చెప్పాడు చాసో. ఒక రకంగా లేడీ కరుణాకరం కథ కూడా విద్య నేర్వడం, జీవితంలో నిలదొక్కుకోవడానికి చెందినదే. ఎటొచ్చీ దారులు వేరు. రెండో ప్రపంచ యుద్ధ కాలపు ప్రస్తావన భల్లూక స్వప్నం కథలోనూ, పరబ్రహ్మం మొదటి వాక్యాలలోనూ, చేసిన చాసో, ఏకరువు కథలో ఉత్తమపురుషలో కథ చెప్తున్న పాత్రను, థామస్ హుడ్ ఆన్ నోన్ సిటిజెన్ పోలికలో రచిస్తాడు. అది కవిత, చాసో రాసినది కథ కావడం రూపభేదం. రథయాత్ర, దుమ్ములగొండె కథలు చాసో.. మాటలను రంగులలో ముంచి చిత్రించిన పికాసో బొమ్మలు.

తొలినాళ్ళలో రాసిన ఊహా ఊర్వశి (1945) భావ కవిత్వంపై ఒక జాడింపు. ఎంపు (1945) బిచ్చగాళ్ళ జీవితంలో వచ్చిపడే ఒక స్వయంవర సమస్య. మాతృధర్మం (1946) మనిషి పాత్రలు లేని జీవన ప్రాకృతిక ప్రవాహ చిత్రణ. గని నుంచి ముతక వజ్రాలను తీసే, చెక్కి, మనకు ఒక్కొక్క కథ ఒక్కొక్క చాసోగా అందించాడు చాగంటి సోమయాజులు. తన ముప్పయి ఏడేళ్ళ కథా సృజన కాలంలో కూడా ఇరవై ఒక్క ఏళ్ళు చాసో ఏమీ రాయలేదు. అంటే ఈ నలభై కథలను వారు పదహారు వత్సరాలలో రాశారు.

వీటిలో అత్యధికంగా ఏడు కథలు నమోదు చేసిన వత్సరం 1942 తరువాత అయిదు కథలను 1945లో రాశారు. ఇక మిగిలినవన్నీ రెండు, మూడు కథలు అవగా, తన రచనా జీవితంలో చాసో, ఏడాదికి ఒక్క కథ చొప్పున రాసిన వత్సరాలు 1946, 1948, 1968, 1970, 1975. ఒక కథను ముప్పయి సార్లు రాసి చింపేసిన నిక్కచ్చి నాణ్యతా నియమం చాసో తనకు తాను విధించుకున్న సూత్రం (ఎందుకు పారేస్తాను నాన్నా కథ). ఇతరుల కథలను అలానే ఎంచి ఎంచి చూసిన వాడు చాసో. ఒక ప్రాంతపు కథలను సంకలనాలుగా తెచ్చే పద్ధతికి కూడా చాసో ప్రచురించిన సంపుటి కళింగ కథానికలు దారి వేసిందని చెప్పవచ్చు. ఇలా ఒక ప్రాంతపు కథలను సంకలించిన మొదటి ప్రయత్నం చాసో సప్తతికి వెలువడ్డది. వస్తువు, శిల్పం ఈ రెండింటిలో ఏది ఎక్కువ తక్కువ అన్నదానికి, కొందరు వేరు వేరు సమర్థింపులలో ఏదో ఒకదాన్ని ఎక్కువ చేసి చూపినా, కుటుంబరావు గారితో సహా వస్తువు విషయంలో, చాసో అలాంటి దృష్టిని అంగీకరించలేదు. వస్తువూ, శిల్పమూ సమప్రాధాన్యత గలవే అని తేల్చిచెప్పాడు. తన కథల్లో దాన్ని పాటించాడు.

కథలలో కవిత్వం ఉండాలా అన్నదానికి చాసో దృష్టి, మంచి కథ ఎప్పుడూ ఎ లిరిక్ ఇన్ ప్రోజ్ అనే. అయితే ఈ కవిత్వపు పాలు, కథను మించిపోయేంతగా ఉండకూడదన్నది చాసో మతం. నిజానికి వచన కవిత్వం రాయడం కన్నా కూడా లిరికల్‌గా ఉండే కథ రాయడం కష్టం. చాసో ఇటువంటిది సాధించాడు అన్నదానికి, మాతృధర్మం, రథయాత్ర, కుక్కుటేశ్వరము, దుమ్ములగొండె వంటి ఎన్నో కథలు శక్తిమంతమైన ఉదాహరణలు. బీద బ్రాహ్మణ, దిగువ స్థాయి రైతాంగ కుటుంబాలు, 1940ల నాటి సమాజపు పెద్దగా చదువులు ఎరగని ఒక అరకొర విద్యావంత మధ్యతరగతి, చదువులకై తహతహలాడే పిల్లలు, వారికి ఎలాగయినా చదువులు చెప్పించి ప్రయోజకులను చేయాలనే కుటుంబ



సభ్యులు (తల్లిదండ్రులో, భార్యలో), సమాజమో (ఏకరువు కథలో), వీరంతా స్వతంత్ర భారతదేశం పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన చేసి, చదువుకుంటే ఏదో ఒక ఉపాధిని ఏర్పరుస్తుందన్న, ఆనాటి స్థూల విశ్వాసానికి అనుగుణంగానే స్పందించి అందుకై తమ వంతు శ్రమ ఎలా పడ్డారో, చాసో కథలు చెప్తాయి. అప్పుడే తలలెత్తుతున్న రాజకీయ, వ్యాపార రంగాలు ఎలా ఉన్నాయో కూడా చాసో తన కథలలో చెప్పాడు. చిన్నా చితకా వ్యాపారాలు చేసేవారు, ఎలా సాంఘిక ఉన్నతి కోసం, తమకు తెలిసిన రాజకీయ, లేదా బిజినెస్ రంగాలలో మోసానికి (జంక్షనులో బడ్డీ) దిగుతారో, ఎలా తమకు కావలసిన పదవులు చిన్న ఊరి స్థాయిలోనయినా ఎలా పొందుతారో (ప్రెసిడెంట్ లక్ష్మీకాంతం) వంటి కథలలో చిత్రించాడు.

కథలను కళాఖండాలుగా మలచడంలో ఆనాడు గురజాడ తరువాత రాస్తున్న శ్రీపాద, మల్లాది, కొడవటిగంటి, చలం. కవికొండల వేంకటరావు మొదలగు వారిలోని ఒక విలక్షణమైన శైలి, అంతర్జాతీయ కథకులను అధ్యయనం చేసిన నిర్మాణ దక్షతా గల వచన నిర్మాత చాసో. నిమగ్నత నూటికి నూరుపాళు కలిగి కథను రాయడం, తన నిబద్ధతను కథలో అంతఃసూత్రం నిబిడీకృతం చేయడం, చాసో కథకుడిగా నిత్యం పాటించిన విషయాలు. సాహిత్యంలో చాసో స్థానం, తను పాటించిన సంక్షిప్తత, ప్రసాద గుణం, అభివ్యక్తిపై పూర్తి నియంత్రణ, రచనలలోని అభ్యుదయాంశ, బీద సాదలపక్షాన నిలిచే కథలు రాయడం, ఈ అన్నిటిపై ఆధారపడి ఉంది. వజ్రం ఎప్పటికీ నిలిచే ఉంటుంది అన్నట్టు చాసోలు ఎప్పటికీ నిలిచే ఉంటాయి. ఈ ఏభై కథా వజ్రాలను మన కాలపు స్పృహతో అర్థం చేసుకోవడం, అవగాహనను పెంపొందించుకునే క్రమంలో కొత్త కోణాలను ఈ వజ్రాలకు చెక్కడం ఈ శతజయంతి వత్సరంలో మన సాహిత్యలోకం చేయాల్సిన పని.

-రామతీర్థ
98492 00385

ప్రుఫ్రాక్ ప్రేమ గీతానికి నూరేళ్ళు



ఆధునికోద్యమ ఆది గీతానికి సరిగ్గా నూరేళ్ళ సందర్భం. రాసినది ఇరవై మూడేళ్ళ థామస్ స్టెయర్న్స్ ఎలియట్ అనే కొత్త రచయిత. తన పేరును టి.స్టెయర్న్స్ ఎలియట్ అని రాస్తుండే వాడట ఈ యువ రచయిత. ఆ పద్ధతిలోనే 'లవ్ సాంగ్ ఆఫ్ జె. ఆల్ఫ్రెడ్ ప్రుఫ్రాక్' అని కవితకు పేరు పెట్టాడని ఒక పరిశీలన. తన మిత్రుడు ఎజ్రా పౌండ్ చొరవ ద్వారా అచ్చయినది జూన్ 1915 పొయెట్రీ పత్రికలో. ఊగులాట, ఊగిసలాటల మనస్తత్వాల అసంఖ్యాక చిత్రణలు తరువాత ప్రపంచ సాహిత్యంలోనూ, మన తెలుగు సాహిత్యంలోనూ జరిగిన వాటికి, ఒక రకంగా మూల రచన. కవిత్వం క్లిష్టంగా వుండాలని నమ్మిన వారిలో ఒకడు ఎలియట్. ఒక మధ్యతరగతి యువకుడుగా, తన కవితలో, ముప్ఫయిలు దాటుతున్న, కొద్దిగా బట్టతల అవుతున్న ఒక పాత్ర (ప్రుఫ్రాక్) ఎటూ తేల్చుకోలేని మానసిక దశను ఈ కవితలో ఆవిష్కరించిన తీరు, కవిత్వంలో కొత్త పోకడలకు దేశ దేశాలలో దారి తీసింది. 'నేను చూశాను' అంటూ మొదలయ్యే అజంతా కవితలూ, అంతకు ముందరి వచన రచనలలో అల్పజీవులూ, అసమర్థుని జీవ యాత్రలూ, 'చివరకు మిగిలేది' దయానిధిలూ, ఈ సందిగ్ధ మానసిక స్థితినే కలిగి వుండడం, ఒక శతాబ్ద వాస్తవికత. దీనిని రెండు ప్రపంచ యుద్ధాల మధ్య తన రచనలలో అందుకున్న ఎలియట్ ఈ కవితకు మొదట పెట్టాలనుకున్న పేరు 'ఆడవాళ్ళ నడుమన ప్రుఫ్రాక్.

"ప్రుఫ్రాక్"- ఇటువంటి పేరే ఒక విపరీతం. 'ప్రూడిష్ నెస్', క్రిస్టియన్ మతాచార్యులు వేసుకునే పొడవాటి అంగరఖా (ఫ్రాక్)కు మధ్య ఒక కలబోత ఈ కవిత శీర్షిక. తన కోరిక ఆడవారి సాంగత్యమే అయినా, అది పైకి చెప్పలేని, ఆ అనుభవాన్ని పొందడానికి సిద్ధపడలేని, బిడియపు సంచీలో తన వాంఛలను దాచుకునే, ఒక తెగించలేని అతి మర్యాదస్తుడి, లేదా పిరికి వాడి మనో యవనిక. దీనికి ఉపోద్ఘాతాన్ని, డాంటె మహాకవి 'ఇన్ఫెర్నో' లోని నరక వాసం విధించ బడ్డ భగ్న జీవి గైదా డా మాంటెఫెల్ట్రోకు, పోప్ బొనిఫెస్ (ఎయిట్)కు మధ్య సంభాషణ నుంచి ఆ గ్రీక్ భాషలోనే స్వీకరించి తన కవితకు ముందు తోరణం కట్టాడు యువ కవి ఎలియట్. రానున్న ఏళ్లలో ఆయన వెలువరించబోయే ఆధునికోద్యమ (మాడర్నిజమ్) రచనల సార సంకేతాలు ఈ కవితలో కనిపిస్తాయి. ఈ నూరేళ్ళ కాలంలో ఆంగ్లసాహిత్యం చదివే దేశ దేశాలలో ఈ కవిత అత్యంత ప్రసిద్ధం. హేమ్లెట్, హెన్రీ ఫోర్, ఫ్రెంచ్ సింబలిస్టుల ప్రతీక ధోరణులూ, "ద లవ్ సాంగ్ ఆఫ్ హర్ డ్యాల్" అని తన కవితకు పేరు పెట్టిన ఎలియట్ పూర్వ కవి రడ్యార్డ్ కిప్లింగ్ తలపులూ, కవితలోని చరణాలు, కవితాపరిధికి మించి ప్రచారంలోకి రావడం, ఈ కవిత సాధించిన విజయానికి గుర్తులు. అలా ఎలియట్ నవీన ప్రతిభకు తొలి కిటికీ ప్రేమ సాకారం చెందని ఈ ప్రేమ గీతం. నూరేళ్ళలో తొలిసారిగా తెలుగులో ఈ కవితానువాదం కవిత్వ చరిత్రకు, చరిత్రాత్మక కవిత ఆవిర్భావానికి మధ్య అతి తక్కువ తేడా వుంటుందనేలా మన ఎరుక ఎదగడానికి పనికి వస్తుంది. కార్టూన్లుగా, యానిమేషన్లుగా, కవిత్వ పఠనాలుగా, కొత్త తరాలు పడమటి దేశాలలో, ఈ కవిని అందుకుంటున్న తీరు చూస్తే మన సాహిత్యమూ అలాంటి దశకు రావాలని కోరుకుంటాము. ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్‌ను మనలా పూర్తిగా నిర్లక్ష్యం చేయని పాశ్చాత్య దేశాలలో, ఎలియట్ రచనలు ఇప్పటికీ ఎన్నో స్పందనలను పురి కొల్పుతున్న సజీవ సాహిత్యం. ఎలియట్ ను తలచడానికి మరొక విశిష్ట సందర్భం 2015, ఈ మహాకవి యభయ్యో వర్ధంతి సంవత్సరం కూడా.

నూట ముప్ఫయి పంక్తుల ఈ కవిత తొలి తెలుగు అనువాదం నుంచి కొన్ని ముఖ్యభాగాలు ఇవి.

'ఈ నా జవాబు భూమి మీదకు ఎప్పటికైనా తిరిగివచ్చే
వారికి అనుకుంటే, నిలబడుతుందీ జ్వాల ఎటువంటి
కొట్టుకులాట లేకుండా. అయితే ఎవరూ ఈ అగాధం
నుంచి ఎప్పుడూ తిరిగి రాలేదు కాబట్టి, నేను విన్నదే
కనుక నిజమైతే, నీకదే జవాబిస్తాను, భయం,
అపకీర్తి శంకా లేకుండా"

పద పోదామైతే మనమిద్దరం.
ఆసుపత్రి బల్ల మీద మత్తిచ్చిన రోగిలా
సాయంత్రం ఆకాశమ్మీద ఆరబర్చుకున్నప్పుడు;
పోదాం మనం సగం ఖాళీ వీధుల్లోంచి
అవిశ్రాంత రాత్రుల చౌక బారు హోటల్ రాత్రి-బస గదుల
గొణుగుళ్ళ వెనుకంజల లోంచి
రంపపు పొట్టులా మెరిసే ఫలహార శాలల
ఆల్చిప్ప డొల్లల లోంచి;....

* *

గదిలో వచ్చే పోయే మహిళలు
మాట్లాడుతుంటారు మైకేలాంజిలో గురించి.
కిటికీ అద్దాలకు తన వీపు రాపాడించుకునే
పసుపు రంగు పొగమంచు
తన పసుపు రంగు ముట్టె కిటికీ అద్దాలకు
రుద్దుకునే పసుపు పొగ
సాయంత్రపు కొసలను నాకింది నాలుకలతో
కాల్వల్లో నిలవున్న మురుగులో తచ్చాడింది
ఇళ్ల పొగ గొట్టాల నుంచి రాలే చూరు మసిని
తన వీపు మీద పేరుకోనిచ్చింది ఉన్నట్టుండి దుమికింది
అదొక అక్టోబర్ రాత్రని పరికించి గ్రహించి
ఇంటి ముంగిట ముడుచుకుని నిద్దరోయింది.
నువ్వు కలుసుకునే ముఖాలను కలుసుకునేందుకు
తానూ ఒక ముఖం తయారు చేసుకునేందుకు-.....

* *

ఉంటుంది సమయం అబ్బురపడ్డానికి
నేను సాహసిద్దునా, నేను తెగిద్దునా
ఉంటుంది సమయం వెనుతిరిగి మెట్లు దిగిపోవడానికి,
నా తల మీద ఏర్పడ్డ బట్ట తల వృత్తంతో
(వాళ్ళంటారు ఓ! అతని జుట్టు ఎలా పలచబడ్డదో)
పగటి పూట నేను ధరించే కోటూ,
గెడ్డం కింద బిర్ర బిరుసుగా కోటు కాలరూ
వెల గలదే అయినా మామూలుగా కనిపించే
చిన్న పిన్‌తో అదిమి పెట్టిన నా నెక్ టై
(వాళ్ళంటారు, అయినా, అతని కాళ్ళూ, చేతులూ
ఎంత చిక్కి వున్నాయో)
సాహసిద్దునా నేను విశ్వాన్ని భంగ పరచడానికి?
ఒక నిమిషంలో సమయం ఉంటుంది
మరునిమిషంలో మారిపోయే నిర్ణయాలకూ,సవరింపులకూ.
నాకవన్నీ ముందే తెలుసు, అన్నీ ముందే తెలుసు
తెలుసు నాకా సాయంత్రాలు, ఉదయాలు, మధ్యాహ్నాలు
కాఫీ చెంచాలతో కొలుచుకున్నాను నా జీవిత క్షణాలు....

* *

దుస్తుల నుంచి వస్తున్న పరిమళమా అది
నన్ను ఇంతలా పక్కకు మళ్లిస్తున్నది?
చేతులు ఒక బల్ల పొడుగూతా సాగి ఉండేవి
లేదా ఒక శాలువా చుట్టూతా కప్పుకునేవి
ఇప్పుడిక భావించనా నేను ఎలా ముందుకు వెళ్లాలో అని
సంజ వేళల ఇరుకు సందులమ్మట వెళ్లాననీ
పొట్టి చేతుల చొక్కాలు వేసుకున్న,
అంతస్తుల కిటికీలలోంచి తొంగి చూసే
ఒంటరి మొగవాళ్ళ పైపులలోంచి ఎగిసే
పొగలని గమనించానని చెప్పేయనా?
నిశ్శబ్ద సముద్ర శయ్యలపై
పారాడే పీత గోళ్ళ జతయి వుండాల్సింది అసలు నేను.
మరా మధ్యాహ్నాలు, సాయంత్రాలు నిదురిస్తాయి
అంత ప్రశాంతంగా.
పొడవాటి వేళ్ళ లాలనలో మెత్తబడి,
అలసిపోయి, అటూ ఇటూ దొర్లుతూ నీ నా పక్కలనే
గచ్చు పై బద్ధకాలు తీర్చుకుంటూ...........

* *

నేను చూశాను నా గొప్పదైన ఘనత కొట్టుకులాడ్డాన్ని
నేను చూశాను ఆ శాశ్వతమౌ సహాయకుడు
నా కోట్ పుచ్చుకునేందుకు ఆపడాన్ని
ఒక్క మాటలో చెప్పొద్దూ, నేను భయపడ్డాను.
ఇన్ని కప్పుల ఐస్ క్రీములు, మార్మలెడ్, టీల తర్వాత,
నిజంగా అది అంత విలువైనదే అయ్యుంటే
పింగాణీ పాత్రలు, మన కబుర్ల నడుమ
విషయాన్ని చిరునవ్వులతో కానిచ్చేటంత
విశ్వాన్ని ఒక బంతిలా ఒడిసిపట్టుకునేంత
ఒక ఉక్కిరి బిక్కిరి చేసే ప్రశ్న దిశగా దొర్లించుకు పోయేంత
'నేను లాజరస్‌ను మృతుల నుండి వచ్చాను
మీకంతా చెప్పేందుకు వచ్చాను,
అంతా చెప్పేసేటందుకు-'........

* *

కానీ ఒక గారడీ దీపం బిగిసిన నరాలను
చిత్ర విచిత్ర ఆకృతులలో తెరపై చూపినట్టుగా
ఒకరికి, ఒక దిండును సరి చేస్తూనో,
ఒక శాలువా జారవిడుస్తూనో కిటికీ దిశగా తిరిగి
'నేను అనుకున్నది అది కాదు, అసలు కానే కాదు" అని చెప్పడానికి
అది అంత విలువైనదేనా?
లేదు, నేనేమీ యువరాజు హేమ్లెట్ ను కాను,
అయ్యుండే ఉద్దేశం లేదు
అయ్యుంటే నేనొక బంటును,
ఇసుమంత పురోగతికి కారణం కాగలను
ఒకటో, రెండో సంఘటనలు జరిపించగలను,
యువరాజుకి సలహాలివ్వగలను
సందేహం లేదు, ఒక చిన్ని పని ముట్టుని, విధేయుడిని,
ఉపయోగపడగలిగితే సంతోషించే వాడిని..........

* *

ముసలవుతాను నేను, ముసలవుతాను
పంట్లాం దిగువన మడుచుకుంటాను.
జుట్టు వెనుకన పాపిడి తీసుకోనా?
పీచ్ ఒకటి తినడానికి తెగించనా?
తెల్లని ఫ్లానెల్ ట్రౌజర్ లు ధరించి నడుస్తాను బీచ్ లో

వింటానక్కడ సముద్ర కన్యలు
ఒకరి కోసం ఒకరు పాడే పాటలు
అవి నా కోసం అయితే పాడుతాయని అనుకోను
నేను చూసాను అవి అలలపై సవారీ చేస్తూ
అలల నురుగు తలలను నల్లని పాపిడి గా విడదీస్తూ
వీచే గాలి, నీటిని తెలుపు నలుపుగా వేరు చేస్తూ వుంటే
కడలి వేపుకు పోవడాన్ని.
మనం తారాడాము ఇక్కడ సముద్రపు గదులలో
సాగర కన్యలు జేగురు ఎరుపు నాచు హారాలతో
మనల్ని అలంకరించారు
మానవ స్వరాలు మేల్కొలిపిందాక ?
మనం మునిగిపోయామప్పుడు.

ఆంగ్ల మూలం - టి.ఎస్. ఎలియట్
తెలుగు అనువాదం - **రామతీర్థ**
9849200385

● వివాదం

తెలుగువారు చాలా నయం...



సాహిత్యం మీద, జాతీయ బహుళ సంస్కృతి మీద మతతత్వం కన్ను పడుతున్న కాలం ఇది. లేకపోతే పెద్దగా పట్టించుకోవలసిన అవసరం లేని తమిళ నవల- మధోరుబాగన్- మీద ఇంత గొడవ జరిగి ఉండేది కాదు. దీని రచయిత పెరుమాళ్ మురుగన్ అనే సంగతి చదువరులకు తెలిసిందే. మధోరుబాగన్ (తమిళనాడు తిరుచెంగోడ్ ఆలయంలోని అర్ధనారీశ్వరుడికి తమిళ పేరు) నవల గత అయిదేళ్లుగా తమిళనాట కలచువాడు ప్రచురణ సంస్థ ద్వారా ఆ భాష పాఠకులకు అందుబాటులో ఉంది. కానీ వివాదం జరగలేదు. 2013లో ఇది 'ఒన్ పార్ట్ ఉమెన్' పేరుతో ఆస్టిన్‌లోని టెక్సాస్ విశ్వవిద్యాలయ విద్యార్థి అనిరుద్ధన్ వాసుదేవన్ ఆంగ్లానువాదం చేయగా పెంగ్విన్ ద్వారా అందుబాటులోకి వచ్చి వివాదానికి తెర తీసింది. ఈ వివాదంలో ఈ అనువాదానికి కెనడాలో కెనడా లిటరరీ గార్డెన్ అవార్డు వచ్చిందన్న సంగతి కూడా కొట్టుకుపోయింది.

ఇంతకూ ఇందులో ఏముంది? కాముని పున్నమి వంటి ఒక దేవాలయ ఆచారం ఉంది. పన్నెండేళ్లుగా పిల్లలు లేని 'పొన్న' అనే ఒక రైతుభార్య భర్త అంగీకారం వుందని తలుస్తూ ఒక తిరుణాలనాటి రాత్రి అటువంటి కాముని పండుగలో అపరిచితుడి ద్వారా బిడ్డను పొందేందుకు ఇంటి నుంచి బయలుదేరడం ఈ నవలలో ముగింపు సన్నివేశం. తమిళనాడులోని కొంగునాడు ప్రాంతంలో ఉన్నట్టుగా చెబుతున్న ఈ ఆచారం ఇప్పటిది కాదు. స్వతంత్రానికి పూర్వం దాదాపు ఎనిమిది దశాబ్దాల ముందరిది. నవలలో కథాకాలం కూడా అదే. అయితే ఈ అంశం మాత్రమే ఈ నవల కాదు. రచయిత స్వయంగా కొంగునాడు ప్రాంతవాసి కావడాన ఆ ప్రాంత శ్రమజీవుల మాండలిక సామెతలూ నుడికారం కూడా సవిస్తరంగా కనిపిస్తాయి. మురుగన్ రాసిన ముందరి నవలల్లో కూలమధారి (తాడి ఋతువులు - The seasons of the) Pal అనే నవల కూడా ఆంగ్లంలో అందుబాటులో వుంది. ఇదో మేకలు కాసుకునే దళిత కుటుంబాల కథ. ఈ నవల కూడా తమిళ సంస్కృతిని లోతుగా చూపేదే. ఇలాంటి సంస్కృతినీ, తేట తమిళ భాషనూ చూపుతాడనే పెరుమాళ్ మురుగన్‌ను తమిళ పాఠకులు గౌరవిస్తారు.

ఏమైనా ఇంత పెద్ద గొడవ ఏమాత్రం అవసరం లేని ఈ నవలపై-పైగా గత అయిదేళ్ళుగా అందుబాటులో వున్న నవలపై హటాత్తుగా ఆంక్షలూ అభ్యంతరాలూ పుస్తక దహనాలూ చోటు చేసుకోవడం ఒక పథకం ప్రకారం జరిగిన చర్యగా అనిపించడంలో ఆశ్చర్యం లేదు. ఇందులో రచయితకు నష్టం చేయడం కన్నా వేరెవరో లబ్ధి పొందే అంశమే ఉందన్న సంగతీ సత్యదూరం కాదు. వేధింపులూ భయపెట్టడాలూ పెరిగి పోయాక పెరుమాళ్ మురుగన్ తుదకు విసిగిపోయి రచయితగా తాను మరణించాను అనే ప్రకటన ఇస్తూ ఇక నన్ను ఏ సాహిత్య సభలకూ పిలవకండి అని అర్థించారు. ఇది ఏ రచయితకూ పట్టవలసిన గతి కాదు. ఒక రచన తమకు నచ్చక పోతే తాము ఏమైనా చేయవచ్చు అని కొన్ని వర్గాలు అనుకుంటే దానిని అడ్డుకోవలసిన పాలనా వ్యవస్థ ఆ భావనకు మద్దతుగా పని చేయడం అన్యాయం. రాజ్యాంగం కల్పించిన అభివ్యక్తి స్వేచ్ఛకు భంగకరంగా వ్యవహరిస్తే అది నిజంగా ప్రతిఘటించవలసిన విషయం.

ఐతే ఆ నవలలోని అంశం తమిళులకు కొత్త ఏమో కానీ వివాహిత స్త్రీలు పిల్లలను పొందే విషయంలో, భర్త అసమర్థత కారణమైతే ఏం చేస్తూ వచ్చారో, భారతం కాలం నుంచి ఈ సమాజంలో అందరూ ఎరిగినదే. దేవుళ్ళ మహిమలూ, బ్రాహ్మణుల గొప్పతనాలూ వీటిని నిరసిస్తూ 1925లో పెరియార్ ద్రావిడ చైతన్య ఉద్యమాలు (అవి అప్పట్లోనే రాజకీయంగా జస్టిస్ పార్టీ వారిని కలుపుకుని కాంగ్రెస్ వ్యతిరేక కూటమిగా ఎదిగినప్పటికీ) మొదలు పెట్టడానికి ముందే తెలుగు సమాజంలో ఈ లౌకికభావన బలంగా ఉన్నది. ఉదార భావాల ఆదరణలో తెలుగు సమాజం ఎప్పుడూ తమిళ సమాజం కన్నా ముందరే ఉన్నది. వితంతు పునర్వివాహ ఆచరణలో వీరేశలింగం యావత్ దక్షిణ భారతదేశానికే తొలి అడుగు వేసిన క్రాంతదర్శి. ఆయన జరిపిస్తేనే అప్పటి మన రాజధాని అయిన మద్రాసులో కూడా తదుపరి ఈ వివాహాలు జరిగాయి.

ఉదార భావాల ఆదరణలో తెలుగు సమాజం ఎప్పుడూ తమిళ సమాజం కన్నా ముందరే ఉన్నది. వితంతు పునర్వివాహ ఆచరణలో వీరేశలింగం యావత్ దక్షిణ భారతదేశానికే తొలి అడుగు వేసిన క్రాంతదర్శి.

ఇక సాహిత్యంలో గురజాడ 1910లోనే 'ఆ దేవుళ్ళందరూ ఒక్కటే అయితే ఆ పీనుగలందరినీ ఒక్క చోటే తగలేసి ఆ పూజలేవో జరిపించరాదా?' అంటాడు. ఈ కథలు బహుశా తమిళులు ఎరగరు. తాపీ ధర్మారావుగారి దేవాలయాల మీద బూతు బొమ్మలెందుకు కూడా వారు చదువుకుని ఉండరు. ఇందులో కొంగునాడు దేవాలయంలో ఒకప్పుడు జరిగేవంటున్న కాముని పున్నములు, రవికల పండుగల గురించి ఒకనాటి తెలుగు సాహితీ సమాజం విపుల ప్రస్తావనలు చేసింది. ఇవేవీ తమిళ సమాజం ఎరిగినట్టు లేదు. రాముడికి సీత ఏమవుతుంది?, రామాయణ విషవృక్షం వంటి రచనలన్నీ కొత్త ఆలోచనల వేదికలే. వీటిని తెలుగువారు చదివి వాడిగా వేడిగా చర్చించారే తప్ప ఆ రచనలపై రచయితలపై ఆంక్షలు కోరి, దాడులకు దిగలేదు. మధోరుబాగన్‌లో భార్య పొన్న తన సంతానం కోసం ఆలయ తిరునాళ్ళలో అపరిచిత సంగమం కోసం వెళ్లింది అన్నదే అంత సహించలేని విషయంగా నేటి నైతిక ఉద్యమకారులకు ఎందుకు మారింది అన్నది ఒక అజ్ఞాన జనితావేశంగానే కనిపిస్తుంది తప్ప ప్రపంచ సాహిత్యంలో ఇటువంటి విషయాలు ఎప్పుడో చెప్పారు అన్నది వారికి తెలిసి రావడం కష్టం. ఈ సంవత్సరపు శత జయంతి కథకుడు చాసో 'ఏలూరెల్లాలి' కథలో ఒక వివాహిత స్త్రీ ఎలా ఒక పద్దెనిమిదేళ్ల కుర్రవాడితో సంబంధం ద్వారా బిడ్డను పొంది, తన ఆస్తికి చెందిన సంక్రమణ హక్కును కాపాడుకున్నదో రాస్తే ఆ కథలోని పరిస్థితులను పాత్ర నిస్సహాయతను తెలుగు సమాజం సానుభూతితో అర్థం చేసుకుంది. కథను ఆదరించింది. అలాగే చాసో రాసిన 'లేడీ కరుణాకరం' కథలో భర్తకు తెలిసేట్టుగానే మరొకరితో సంబంధం పెట్టుకునే కరుణాకరం భార్యను చూసి సమాజ పోకడలను బేరీజు వేసుకునే ప్రయత్నం చేసింది. అలాగే అస్సామ్ సాహిత్యంలో ఇందిరా గోస్వామి బ్రాహ్మణ వితంతువుల గురించి రాసిన కథలు తమిళులకు తెలియవా?

చెడ్డ ఆలోచనలకు తగిన ఆయుధం మంచి ఆలోచనలే. వివేకం, విజ్ఞానం కలగడానికి ఖచ్చితమైన దారి ఉదార భావనల విద్య మాత్రమే. పెరుమాళ్ మురుగన్‌ను పోగొట్టుకునే ఒక దురదృష్టకర మానవ సమాజం ఒక సొంత గొంతు పలుకుతున్న మానవస్వరాన్ని పోగొట్టుకున్నట్టే. ఇందుకే ఏ రంగు గల సాహిత్య అణచివేతనైనా ఆధునిక సమాజ పౌరులుగా అందరూ వ్యతిరేకించాల్సి ఉంది. అదే ఇవాళ్టి అత్యవసర పరిస్థితి.

- రామతీర్థ 98492 00385

పతంజలి దెయ్యపు పలకరింపు

నేస్తమా మోహనా! స్వర్గమూ నరకమూ కాదిది. త్రిశంకుడికి, ఆడి బాధ పడలేక, తపస్సు ఎక్కువైపోయిన ఒక రాజ ముని (రాజులు మునులవడం ఏటండీ? ఎప్పుడూ ఆళ్ళకి శాంతమూ లేదు, సౌఖ్యమూ లేదు), పాపం విశ్వానికి మిత్రుడంట, బూవికి సొరగానికి మద్దెన ఏర్పాటు సేస్సిన ఒంటరి ఖైదు నాటి, మద్దెంతర నివాసమూ కాదు. నాకేటలాటి బాధ. ఎంచక్కా దెయ్యాల దర్బారు నుంచి మాట్లాడుతున్నా. నానయ్యా కె.ఎన్.వై. దెయ్యాన్ని. ఇక్కడ సవానగుంటదనుకో. దేవుళ్ళ పూజలు, సుప్రభాతాలు, అష్టోత్తరాలు, సహస్ర నామాలూ, గంటలు, మంటలు, పూలు, కొబ్బరి కాయాలూ, ఆ గోలంతా ఏటీ వుండదు. తెల్లారగట్ట లేచీ లేవగానే దెయ్యాలన్నీ, తమ ఆత్మ కథ చెప్పినందుకు, అచ్చంగా మాఫియా లెవెల్లో, నా ముంజేయి ముద్దెట్టుకొని, నోకాల మీద పడి పోతాయి. రాజులంతా సస్తే స్వర్గాలకు పోతారని ఆ బామ్మర్లంతా, వందలేళ్ళుగా అగ్రహారాలకు ఆశపడి, తెగ కతలు కల్పన సేస్సినారు గానీ, అదంతా ఒత్తిదే. తాము ఉట్టి పుణ్యానికి సంపిన జీవాలన్నీ, సేస్సిన సేరీ వేటలన్నీ, తినేసిన అడవి పందులన్నీ, మిగిలిన పెద్దా సిన్నా మెకాలన్నీ, సస్తూ సస్తూ సేసిన పేర్దనలూ, ఎట్టేసిన శాపాలూ, తగిలి తగిలి, ఆ జంతువుల నరకాలూ, సొరగాలూ వేరే వుంటాయి కనుక ఆడికే బోతారు. ఈల్ల సంగతి అక్కడ ఈల్ల సేతుల్లో కీర్తి సేసులైన జంతువులే సూసుకుంతాయి.

అరిజెంటుగా నానెందుకు నీకీ వొర్తమానం అంపు తున్నంటే, దానికీ ఓ సిన్న కత ఉన్నది. బూవి మీద న్నంత కాలమూ కతలే సెప్పినాను కదా. మీరేమో అవన్నీ నిజం అని బెవతలో వుండిపోనారు. నానేమో అచ్చరాల బొమ్మలు గీస్తే, నువ్వేమో బొమ్మల్లో జనాల నిందూ, శివాలూ, జజ్జనకడి జనారే అని బొమ్మల మీన బొమ్మలేయిస్సినావు. నా కతలక్కూడా పొస్తకాలకు అట్టలేసినావు. నన్నెమో దెయ్యం నాగ రూపు కట్టించినావు. పెజలు, పాలించే వోళ్ళతో తలపడి పోతన్నారంటే, ఆల్లు నీవు గీసిన బొమ్మల్ల జెండాలు బట్టుకొని, దేశ దేశాలకి తెలిసి పోనారు. ఎన్టీ వోడిని నువ్వు బొమ్మ గీస్తే పెద్ద పెద్ద రచైతలు ఆ బొమ్మలు తమ పొస్తకాలకు ముందు అట్ట మీద పెట్టుకొని నీ పెతిబకు తమ గౌరవాలు తెలిపినారు.

నానేమో వీర బొబ్బిలి కత సెప్పినానా? కుక్క కతే అనుకునీవోరు కొందరు ఎప్పుడూ వుంతారు. ఆళ్ళనలాగ ఒగ్గిదాము. అందులో ఒక కుక్క రాజుల సావాసం చేసి ఎంత రాజరికానికి అలవడ్డాదో, ఒకటీ కాదు, రెండు కాదు మూడు కతల్లో సూపెట్టినాను. కడాకారికి కుట్ర కేసులో కూడా మనుసులతో సమానంగా బందీ అయినాది కూడా. రాజులెనకాల కుక్కలు తిరగడం మామూలే. బారతంలో ఆ రాజులోరి బిడ్డ ఎవులూ ధర్మరాజు పాండవుడు అనీస్సినారు కానీ, ఆయనే కదా కౌరవుల్లో పెద్దోడు, ఆయన ఎనకాల ఆయన తమ్ముళ్ళు, ఆల్లందరి బార్యా ఎనకాల కుక్క తిరగ లేదా ఆల్లీ ఆళ్ళీ లోకాలు దాటి ఎలిపోతుంటే. ఆ కత సెప్పిన యాసులోరు కూడా రాస పుటకే పుట్టినాడు. తమ కత ముందుగా సెప్పుకున్న రాస కవి ఆ యాసులోరు, ఇన్ని వేల ఏళ్ల తరువాత, రాస బతుకులు ఎట్టాంటివో మళ్ళీ సెప్పినోడ్ని నేనే. నేనో రాస రచయితననుకో. ఆ కతల్లో పెత్రికలోళ్ల గుంజాటాలన్నీ రాని పెంపుడు జంతువులు



నాగ ఎనాగ మచ్చికైపోతారో, సిక్కుముడి పెట్టేసినాను.

శానా బొమ్మలేసినావు గానీ మోహనా, ఒక్క దీవి ఉండిపోనాది. ఆదేటంటే, మనుసుల బొమ్మలు ఎవరైనా ఏస్తారు. కుక్కని కల్పన సేస్సిన రచైత అలనాడు యాసులోరు, మరా తదుపరి ఈర బొబ్బిలిని సుట్టి చేసిన బావాజీని నేనే కదా. బూవి గుండ్రంగున్నదా లేదా కతలో కొంత బొబ్బిలి యుద్ధం కత కూడా కలిపి బుల బులాక్కా సెప్పినానా, ఆ శునక సెమత్కారాలు, పెద్ద ఆనికాలకు తక్కువ కాదు. దాని దర్జా, హోషూ దానికో శిలా విగ్రహం పెట్టించినా తక్కువే మరి. ఆ సంగతి తరువాతా సూసుకుందారి కానీ, ఈ లోగా మోహనా, ఈ కుక్క గురించి గురూ గారు శ్రీశ్రీ గోరు రాసినారు. భైరవ ఘోషలు అంటూ. స్వర్గ భైరవాలగురించి కూడా సెప్పినారు. ఈ కుక్కకు యెయ్యి పేర్ల పూజలు వొద్దు కానే, దీని యెయ్యి మూడ్నులు ఎట్టాగున్నాయో ఒక పొస్తకం నిండా నువ్వు గానీ బొమ్మలు గానీ గీస్తివా, "కనరా వీర బొబ్బిలినీ!", అంటూ, ఆ దరమ రాజు ఎనకాల తిరిగిన కుక్క కన్నా, ఈ కుక్కకు నోకంలో సెరిగిపోని సోటు దక్కించినోడివి అవుతావు.

అందుసేత మోహనా, ఈ మంచి పని సెయ్యి. ఆ ఈర బొబ్బిలి కత సెప్పిన పాపం సేసిన వొడిని నేనయితే, దానికి రూపు కట్టించి, కుక్క యెయ్యి మొక్కట్లు చిత్రించిన మహా పాపం సేయమని నిన్ను కోరతాన్నాను. పాపులూ, మహా పాపులూ, అటు నరకాలకూ, ఇటు సొరగాలకూ కూడా ప్రవేశం లేనోరు కనక ఎట్టి తగువూ లేదు. "యెయ్యి బొమ్మల ఈర బొబ్బిలి" నా అచ్చరాల లోంచి నెగదీసి, నీ కుంచే లోంచి దూసినావంటే, జంతువు పడిపోవాల. ఎంతమంది దివాణాలు అనాగ ఒగ్గినేదు మొఖాసాలకు మొఖాసాలు, మాట పట్టింపు రేగినప్పుడు?

నా పేరిట సత్కారం, పురస్కారం నీ బొమ్మలకు ఇచ్చినారంటే, మా ఈజీనారం పొంతపోళ్ళు ఆలమంద మామిడి తాండ్రంత తియ్యందనాలు సూపెడతన్నారన్నామాటే. అందుకే మోహనా, నా తరపున కూడా, నువ్వే ఆళ్ళ రుణం దీర్సీవయ్యా, ఆ "యెయ్యి బొమ్మల ఈర బొబ్బిలి", బొమ్మ కట్టించీసి రెచ్చిపోయి రంగుల్లో దించీసి, దిగువన సిన్న సిన్న టీకా సూది పొడుపుల్లాంటి మాటలు ఏర్సి కూర్సీవయ్యా. మోహనా. నానూ, ఈర బొబ్బిలీ కలిపి నీకో ఈర తాడు పంపుతున్నాం. అది ఈ మార్చ్ 29న నీ గుండెలపైన ధరించి, జరూరుగా మా గుండెల్లోన ఉండిపోయిన "యెయ్యి బొమ్మల ఈర బొబ్బిలి" దీవి తీర్సీవయ్యా. వుంటా మరి, ఈ దయ్యాల దర్బారులో, పిల్ల దయ్యాలకు దగుల్బాజీ మనుషుల కత సెప్పాల్సిన యాళయినాది.

-సెప్పింది నానే - కె.ఎన్.వై. దెయ్యం

ఉద్యోగం - ఘోస్ట్ మాస్టర్ జెనరల్

■ రామతీర్థ

(నేడు పతంజలి జన్మదినం సందర్భంగా విజయ నగరంలో ఆర్టిస్ట్ మోహన్‌కు 'పతంజలి పురస్కారం' ప్రదానం. మొజాయిక్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో విశాఖలో 'పతంజలి సాహిత్యావలోకనం' సభ, విశాఖ మ్యూజియంలో నేడు, రేపు మోహన్ చిత్రాల ప్రదర్శన)

రన్నింగ్ కామెంటరీ

వాజపాయి కిరీటంలో
అత్యున్నత భారతరత్నం,
రాజకీయ నిర్ణయసారం-
వీపుచరుచుకునే ప్రయత్నం!

వివాదాలు లేని జీవితం
పాలిటిక్సు లోపల కుదరదు,
ఎంత సూటి మనిషైనా
రాజకీయ క్రీడ చెదరదు!!

■ దేవిప్రియ

నవ్య
ప్రజాశక్తి
7 హైదరాబాద్
సోమవారం 4 -5 -2015
సాహిత్యం కళలు చరిత్ర మీడియా

అక్షరాంగి

అర్ధరాత్రి తెలియకుండా వదిలి వెళ్ళిన
సిద్ధార్థుని యశోధర దు:ఖం కాదు ఆమెది
మురిపించి మైమరపించి కొంగు పట్టుకు తిరిగి
సకల సాహిత్య వనాలు తిప్పి
అకస్మాత్తుగా రేపల్లె వీడి వెళ్ళిన
బాలకృష్ణుని యశోదా విలాపం ఆమెది
ఆమె మాటల్లో అర్ధ శతాబ్దపు దాంపత్యం
గూర్చిన మరపు రాని ముచ్చట్లు
ముత్యాల సరాల్లా దొరలిపోతున్నాయ్
మధ్యమధ్యలో ఆగలేని కన్నీటి ముత్యాలూ
చెక్కిళ్ల పై జారి కొంగులో ఇంకిపోతున్నాయి
ఏడు పదుల వయసులోనూ చంటి పిల్లాడికి మల్లే
తన తోడిదే లోకమని తిరిగినవాడు
హఠాత్తుగా ఒంటరిని చేసి వెళ్ళి పోయాడన్న తలపు
ఆమెను నిలవనీయడం లేదు
అయినా జన్మ సంస్కారంతో అందరినీ
ఆత్మీయంగా పలకరిస్తోంది
మీరు లేనిదే వారి అక్షారాలు లేవమ్మా అన్నాం
ఆయనా అలాగే అనేవారు ప్రతి క్షణం
చుట్టుముట్టాయేమో ఆయన స్మృతులు
పెదవులు చిరునవ్వుతో విచ్చుకున్నాయి
కళ్ళు రెండూ నీటి కుండలవుతున్నా ...
అంతటి సాహితీమూర్తికి
కలమూ, కళత్రమూ కాగలిగిన ఆమె ధన్యురాలు
భావాలన్నీ సమ్మిళితమైన ఆమె మాటల్లో
ఎన్నెన్ని అనుభూతుల ఉద్విగ్నతలను దాచిందో
వారి ఇరువురి జ్ఞాపకాల మల్లెల పరిమళాలను
ఆప్యాయంగా పంచుకుంది
అహరహం అక్షరంతోనే సహవాసం చేసినా
సాహిత్యాన్నెప్పుడూ సవతిగా భావించలేదు ఆమె
వారి భౌతిక దాంపత్యానికి కొడుకు ఆనవాలు
వారి అలౌకిక సాహిత్యానురాగానికి
ఆయన రచనలు ప్రత్యక్ష ప్రమాణాలు
చూడటానికి వెళ్లింది ఒక కలం మూగబోయిందని
చూసి వచ్చింది తెగిన వీణ తంత్రులతో
నిరుత్తర అయి విలపిస్తున్న సరస్వతిని
మహాభారత రచన చేస్తున్న వినాయకుడి కలాన్ని
హఠాత్తుగా ఎవరో లాగేసుకున్నట్టు
మూగబోయిన ఆమె కలం చిందిస్తోంది కన్నీరు
సాహితీ లోకాన ఆయన చిరంజీవి
ఆయన భావాలను అక్షరీకరించిన ఆమె
అనునిత్యం స్మరణీయురాలు!

(కీ.శే. యుఎ నరసింహమూర్తి గారి భౌతికకాయాన్ని చూడటానికి వెళ్లినప్పుడు ఆయన భార్య శ్రీమతి రమణమ్మగారితో కాస్త సమయం గడిపాక హృది కదిలి... ఇలా)

– జగద్ధాత్రి

కన్యాశుల్క నాటకానికి ధర్మకాటా తూకరి

'కన్యాశుల్క' దుర్భిణీలోంచి మనకు ప్రపంచాన్ని చూపిన వాడు **గురజాడ**. ఆధునిక తెలుగు సమాజ నిర్మాణంలో భాష ఎటువంటి పాత్ర పోషిస్తుందో గ్రహించి, తన మూడు పదుల వయసులోనే, అప్పటికి ఎవ్వరూ రాయతల పెట్టని, కనీసం సాహిత్య భాషగా ఎవరూ స్ఫురణకు తెచ్చుకొనని, వాడుక భాషను తన నాటకంలో దిగ్విజయంగా ప్రవేశ పెట్టినవాడు గురజాడ. భాష ఆధారితంగా, సాహిత్యాధారితంగా, సామాజిక నిర్మాణంలో పోషించిన పాత్ర 19వ శతాబ్దపు తెలుగు సమాజంలో చాలా ముఖ్యమైనది. దీన్ని దృష్టిలో ఉంచుకుని తమ సవిమర్శక విశ్లేషణలు అందించినవారిలో బంగోరె, కెవిఆర్., సర్దేశాయి తిరుమలరావు, శ్రీశ్రీ, ఆరుద్ర వంటి వారు ఒక ప్రగతిశీల వారసత్వ పరంపరకు చెందినవారు. అటువంటి కోవలోకి వచ్చే బృహత్తర కృషి చేసినవారు డాక్టర్ ఉపాధ్యాయుల అప్పల నరసింహమూర్తి (యు.ఎ.నరసింహమూర్తి). 'గురజాడ స్కాలర్స్' అని పిలువదగిన ఒక విలువైన బృందంలోకి ఇటీవల తన పేరు కూడా సగౌరవంగా, సార్థకంగా జోడించుకున్నవారాయన. తన సాహిత్య జీవితానికి ఆలంబనగా, తెలుగు ఆచార్యుడిగా వృత్తి కూడా కలసి రావడం, ఒక పూర్తిస్థాయి ఔద్యోగిక జీవితం (వృత్తి, ప్రవృత్తి కూడా ఒక్కటిగా) విజయనగరం మహారాజా కళాశాలలో గడిపి, తెలుగు శాఖాధ్యక్షులుగా పదవీ విరమణ చేసిన డాక్టర్ యు.ఎ.నరసింహమూర్తిలో నెలకొని వున్న ఉత్తరాంధ్ర లేదా కళింగాంధ్ర సాంస్కృతిక మూలాలు సహజంగానే బలమైనవి అని తెలియజేస్తాయి.

తన సాహిత్య జీవితంలో యు.ఎ.నరసింహమూర్తి, కాల్పనిక సాహిత్యానికి పెద్దగా ప్రాముఖ్యతను ఇచ్చినవారు కాదు. 'యశోధర' అనే ఆధునిక కావ్యం ఒకటి రాసినా, వారి దృష్టి, సాహిత్య విశ్లేషణ, పరిశీలన, సమాంతర అధ్యయనం వంటి అంశాలపైనే బలంగా ఉంటూ వచ్చింది. కాల్పనిక సాహిత్య శాఖలకు చెందకుండా, ఇటీవలి దశాబ్దాల్లో, ఉత్తరాంధ్రలో, వీరి వలె ఖ్యాతి పొందినవారు లేరు. తన సాహిత్య ఆరంభాల్లో భాగంగా, పింగళి సూరన కవిత్వంలో క్షేమేంద్రుడి సిద్ధాంత ఆధారిత ఔచిత్య ప్రస్థానంపై, ఆచార్య ఎస్వి జోగారావు పర్యవేక్షణలో పొందిన పిహెచ్‌డీ పట్టా, అటుపై నన్నెచోడుని కుమార సంభవంపై పరిశీలన, విశ్వనాథ సౌందర్య దర్శనం వంటి రచనలు యు.ఎ. నరసింహమూర్తి బలమైన సంప్రదాయ మూలాలను తెలియజేస్తాయి. ఆధునిక సాహిత్యంపై వారు వెలువరించిన 'శ్రీరంగం నారాయణబాబు కవితా వైశిష్ట్యం', 'చాసో కథాశిల్పం' లోతైన దృష్టికి తార్కాణాలుగా నిలుస్తాయి. 'చాసో కథాశిల్పం' రచనకు 2003లో యుఎ నరసింహమూర్తి తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ విమర్శన గ్రంథ పురస్కారం పొందారు.

2007లో వీరు పూర్తిచేసిన యుజిసి ప్రాజెక్ట్ 'కన్యాశుల్కం– 19వ శతాబ్ది ఆధునిక భారతీయ నాటకాలు' వీరి సాహిత్య సృజనలోకెల్లా మేలుబంతి వంటి రచన. అప్పటికే కొంత కంటిచూపు మందగించి బాధ పడుతున్న యుఎ నరసింహమూర్తి, తన అర్ధాంగి వెంకట రమణమ్మ లేఖన సహాయంతో, ఒక 700 పేజీల పైబడ్డ బృహత్ రచనను తెలుగు వారికి అందించారు. సమగ్రతకు ఒక ఉత్తమ నమూనాగా, తన తులనాత్మక అధ్యయనాన్ని ప్రచురించి, తెలుగు సాహిత్య లోకమంతా, ఈ పుస్తకాన్ని గమనించేలా, ఒక విశిష్టమయిన, నాణ్యమైన విషయాలను అలుపెరగక గ్రంథస్థం చేసారు. ఈ క్రమంలో వారు వందల పుస్తకాలను సంప్రదించారు. పదుల ప్రదేశాలు, భారత దేశమంతా తిరిగి వచ్చారు. అక్కడి సాహిత్యవేత్తలతో, వారి నాటకాల గురించి, 19వ శతాబ్దిలో అక్కడి సాంస్కృతిక, సాంఘిక విశేషాల గురించి ముచ్చటించి నమోదు చేసుకుని, ఒక తులనాత్మక దృష్టితో, ఏ ఏ అంశాల్లో కన్యాశుల్కం నాటకం ఇతర దేశ భాషల్లోని నాటకాలకన్నా ముందంజ వేసిందో, లేక ఇతర నాటకాల స్వభావాలు ఏమిటో కూడా, వివరంగా అందజేసిన వారి ఓపికకు, పరిశీలన నిష్ఠకు, తెలుగు సాహిత్య లోకం అబ్బురపోయిన సంవత్సరం అది. ఈ రచనే, 'గురజాడ స్కాలర్స్'లో, ఇటీవలి కాలంలో దీటైన, దిట్టమైన కృషి చేసిన వారిగా, యుఎ నరసింహమూర్తికి తిరుగులేని గుర్తింపు తెచ్చింది.

యుఎ నర్సింహమూర్తి (1944 - 2015)

'కన్యాశుల్కం 19వ శతాబ్ది ఆధునిక భారతీయ నాటకాలు' అని పేరు పెట్టినా, నరసింహమూర్తి, ఈ విషయమై ప్రపంచ నాటకాలను కూడా వదిలిపెట్టలేదు. అంటే, అలనాడు బంగోరె కోరినట్టుగా, కన్యాశుల్క నాటకాన్ని, అదే కాలపు ప్రపంచ నాటకాలతో కూడా తూచి చూసే ఒక ప్రయత్నం ఇందులో చేశారు. అయితే, '19వ శతాబ్ది ఆధునిక భారతీయ నాటకాలు' అన్న ప్రాజెక్ట్ పరిధికి పూర్తి న్యాయం చేసేలా వీరి కృషి సాగింది. ఫలితం, అంతవరకూ, బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న భారతదేశంలో, 19వ శతాబ్దిలో భారతీయ నాటకాలు, ఎటువంటి పాత్ర పోషించినదీ, కొత్త అంశాలు వెలుగులోకి వచ్చేలా, నరసింహమూర్తి పరిశోధన సాగింది. ఈ బృహత్ పరిశీలనలో వారు అస్సామీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, తమిళ, కన్నడ, హిందీ భాషలలోని నాటకాలను పరిశీలించి, కథా సంవిధానాన్ని, సంభాషణల తీరును అడుగడుగునా, కన్యాశుల్కంలోని వివిధ పాత్రలతో (ముఖ్యంగా గిరీశం), ఆయా నాటకాల్లో చిత్రించిన సమస్యలను పోలుస్తూ, విస్తృత విషయ ప్రతిపాదన చేసిన తీరు సాహిత్య ప్రియుల, మేధావుల మన్ననకు పాత్రమైంది.

'నీల్ దర్పణ్' రాసిన దీనబంధు మిత్రా రచనతోనూ, అప్పటి బెంగాలీ నాటక ప్రపంచంలో గిరీశం వంటి ధాటీ అయిన ప్రసంగం, స్త్రీలను నాటకాలకు తర్ఫీదు ఇవ్వడం, వంటి లక్ష్యాలు గల గిరీశ చంద్ర ఘోష్ (ఇక్కడినుంచే గురజాడ, గిరీశం అనే పేరు కూడా తీసుకుని వుండవచ్చు'. ఎందుకంటే, గిరీశం అన్నది, తెలుగు పేరు కాదు, ఇది గతంలో 'చినుకు' పత్రికలో నేను రాసిన ఒక వ్యాసంలో ముఖ్య అంశం) కన్యాశుల్కం నాటకాన్ని ఇతర భాషల ముఖ్యంగా బెంగాలీ నాటకాలతో పోల్చి చూస్తూ, నరసింహమూర్తి అన్న విలువైన మాటలు ఇవి : 'గురజాడ హాస్యంలో అధిక్షేపం కంటే వ్యంగ్యం పాలు ఎక్కువ. అది వ్యక్తిగతమైనదిగా కాక విశ్వజనీనంగా పరవసిస్తుంది. హాస్య కల్పనలో వీరిద్దరికీ ఒక బేధం ఉంది. గిరీశ చంద్ర ఘోష్ నాటకాలలోనూ, గురజాడ కన్యాశుల్కంలోనూ గంభీరమైన వాతావరణమంతా అంతర్గర్భితంగా ఉండి, ప్రేక్షకులు పాద భారాన్ని మోయనవసరం లేకుండా, ఉల్లాసభరితమైన మానసిక స్థితిలో వారిని నిలిపి ఉంచే నవ్వుతాలు సన్నివేశాలతో నిండి ఉంటాయి'.

'మామూలు మాటలతో మహస్సును కొలవలేం' అని శ్రీశ్రీ అన్న మాటలను మొదటిపేజీలో తలుచుకుని ఈ రచన ముద్రించారు నరసింహమూర్తి. పుస్తకాన్ని తన శ్రీమతి రమణమ్మకు అంకితం ఇచ్చారు. 'నీ నెనరు కలుగక యున్న పెదను, కలిగినను నా పదవి వేల్పుల రేనికెక్కడ' అనే గురజాడ మాటలు తలుచుకున్నారు. కన్యాశుల్క నాటకం ఒక మహస్సు అని అందరూ అంగీకరించిన సంగతి మనకు తెలిసినా, దాని మహస్సు గురించి, నరసింహమూర్తి, రమణమ్మ రాత సహాయంతో చేసినది కూడా ఒక మహత్తరమైన రచన అనడంలో సందేహం ఎవరికీ ఉండనక్కరలేదు. నరసింహమూర్తి ఈ బృహత్ రచన, తెలుగు పాఠకులకు తొలిసారిగా సాధికారంగా ఒక నలభై మంది 19వ శతాబ్దపు నాటక కర్తలను, వారు వివిధ భాషల్లో రాసిన నాటకాలను పరిచయం చేసింది. దీనివల్ల, సూక్ష్మబుద్ధి గల పాఠకులు, 19వ శతాబ్ది, ప్రధానంగా సంప్రదాయ దృశ్య మాధ్యమాల శతాబ్దిగా, ప్రదర్శన ప్రధాన సాహిత్యం, నాటకాల రూపంలో ప్రపంచవ్యాప్తంగానూ, మన దేశంలోనూ, వెలువడ్డ వాస్తవాన్ని, చదువులేని వారు అత్యధికంగా వున్న అప్పటి సమాజంలో, వాటి అవసరాన్ని, చారిత్రిక అనివార్యతను గమనిస్తారు. ఈ పుస్తకం ద్వారా నరసింహమూర్తి, భారతీయ నాటక కర్తల ముందుచూపు కూడా, అప్రతిహత ప్రగతి చింతనగా ప్రతిపాదించిన తీరు విశిష్టమైనది.

'జ్యోతి బా ఫూలే నాటకాలను స్పర్శించి వుండవలసింది' అని వారి చిరకాల మిత్రులు, ప్రముఖ కవి ఎండ్లూరి సుధాకర్ అన్నా, 'పొరుగున గల ఒరియా సాహిత్యంలో కన్యాశుల్క విషయమే ప్రధాన అంశం అయిన గురజాడ కాలపు రచన, ఫకీర్ మోహన్ సేనాపతి ఒడియా కథానిక 'మాధా మహంతింకో కన్నా సున్నో' గురించి మీరు ప్రస్తావించి వుండవలసింది' అని నేను, జగద్ధాత్రి; ఈ గ్రంథపు పరిచయ సభలో అన్నా, 'అరరే , అవి నా దృష్టికి రాలేదే, అయినా సరే, దానిదేముంది, మీరు తప్పక వారి గురించి రాయండి' అనే సహృదయుడు, పరిశోధన, పరిశీలన, తులనాత్మక అధ్యయనం అన్ని ఇతర సృజనాత్మక రంగాల లాగే, సాహిత్యంలో కూడా, ఎప్పుడూ కొత్త విషయాలను పైకి తీసుకొస్తూ ఉంటాయని ఎరిగిన వివేక సంపన్నుడు ఆయన.

వారు విశాఖలో బుక్ ఫెస్ట్‌లో ఏప్రిల్ 16న, రామతీర్థ, జగద్ధాత్రి హిందీ నుంచి తెలుగుకి అనువాదం చేసిన సఫ్దర్ హాష్మీ కవిత్వం 'ఈ లోకం అందరిదీ' ఆవిష్కరించి, పుస్తకాలు నిండిన మైదానంలో, 'సాహిత్య తత్వం, తెలుగు భాషపై ఆధునిక అవగాహన' గురించి మాట్లాడినదే, ఉత్తరాంధ్రలో చివరి ప్రసంగం. 23న హైదరబాద్‌లో, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి సమగ్ర రచనల ఆవిష్కరణ సభలో పాల్గొని ప్రసంగించడం వారి చివరి సాహిత్య కార్యాచరణ. వారి టేబుల్ మీద, భారతంపై రాస్తున్న ఒక పరిశీలన, 1958కి ముందరి విజయనగరంలోని సాహిత్య సాంస్కృతిక ప్రముఖుల వ్యాసాల సంకలనం, వారు కన్నుమూసే నాటికి, త్వరలో రూపుదిద్దుకోనున్న ప్రచురణలు. ఇక తెలుగు భాష స్థితిగతులపై వారి సునిశిత పరిశీలనా వ్యాసాలను పత్రికలు, ప్రభుత్వాలు గుర్తించి ప్రజలకు అందేలా వారి హిత వచనాలను ప్రముఖంగా ప్రచురించాయి. వారి కృషికి దీటుగా వచ్చిన గుర్తింపు తక్కువే. శ్రీరంగం నారాయణ బాబు గురించి, మానవల్లి రామకృష్ణ కవి గురించి రాసిన పరిశీలనలు, జయంత మహాపాత్ర కవిత్వానికి అనువాదం, 2011– 2013 మధ్య వెలుగులోకి వచ్చాయి. 2014లో తెలుగు వచన శైలి పేరిట, ఒక సుదీర్ఘ విశ్లేషణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రచురణగా తెలుగువారికి అందింది. ఈ నేపథ్యంలో ఎంతో కృషిబద్ధంగా తన జీవితాన్ని సాహిత్య వికాసానికి అంకితం చేసిన నరసింహమూర్తి కన్నుమూత, తెలుగు సాహిత్యలోకానికి తీరని నష్టం. ఒక పెద్ద దిక్కును కోల్పోయిన వేదన నేడు తెలుగు సాహిత్య లోకంలో చాలా స్పష్టంగా ఉంది. వారి సాహిత్య సేవలను సముచితంగా గౌరవించడం, తెలుగు సాహిత్య లోకపు కనీస బాధ్యత. ఈ నేపథ్యంలో 2015 సాహిత్య అకాడెమీ పురస్కారం, నరసింహమూర్తి పేరిట ప్రకటితం అయేలా, సాహిత్య అకాడెమీ తెలుగు కమిటీ చర్యలు తీసుకొనడం, యావత్ తెలుగు ప్రజల అభినందనలకు పాత్రం అవుతుంది.

– రామతీర్థ
98492 00385

● సందర్భం

"అయితే పోదామా నువ్వూ నేనూ" అని పిలిచిన కవితకు నూరేళ్లు

''అయితే పోదామా నువ్వూ నేనూ, మత్తిచ్చిన రోగిలా సంజ నింగిలో పరుచుకున్నప్పుడు'' అని పిలిచిన కవిత పిలుపునకు నూరేళ్లు. ''ద లవ్ సాంగ్ ఆఫ్ జె.ఆల్ఫ్రెడ్ ప్రుఫ్రాక్'' అంటూ వచన కవిత్వానికి అభివ్యక్తి మంత్రనగరి తలుపులు తీసిన 1915 నాటి కవితకు ఈ నెల శతాబ్ది సందర్భం. కవి టి.ఎస్.ఎలియట్. జూన్ 1915లో 'పొయెట్రీ' సాహిత్య పత్రిక ఈ ప్రేమరహిత ప్రేమ గీతికను అచ్చువేసింది. కవి అనామకుడు. అచ్చు కావడం వెనకాల తన మరో కవి సహచరుడు ఎజ్రా పౌండ్ జోక్యం ఉన్నది. తరువాత వచ్చిన సమీక్షలు ఈ కవితను పెద్దగా పట్టించుకోలేదు. పౌండ్ మాత్రం, ఇది ఈ శతాబ్దంలో నిలబడిపోయే కవిత అన్నాడు, శిఖరాయమాన కవితలకు ఆదిలో ఈ చిన్నచూపు తప్పదేమో! ఇంకో 18 ఏళ్ల తరువాత యువకవి శ్రీరంగం శ్రీనివాసరావు విశాఖపట్నంలోని టర్నరు వారి సత్రంలో కూచుని కేవలం కొద్ది నిమిషాలలో రాసి పంపిన ఒక గీతాన్ని 'భారతి' పత్రిక తిప్పి పంపింది. ఆ గీతమే మహాప్రస్థానం. ఒక శతాబ్ద సంగీతానికి ఆవాహన గీతం.

కానీ ఇవాళ ఈ 'ప్రుఫ్రాక్ ప్రేమ గీతం' ఆధునిక సాహిత్యోద్యమానికి ఆదిగీతంగా ప్రపంచమంతా సంభావిస్తున్న సంరంభ సందర్భం. ఇందులో మొదలైన నిరాశ, అనిశ్చయ మనస్థితి, ఇరవయ్యో శతాబ్దాన్ని ఒక ఊపు ఊపాయి. చైతన్య స్రవంతి ధోరణుల బీజాలు ఈ కవితలో ఉన్నాయి. తెలుగు సాహిత్యంలో ఎన్నో రచనలలోని పాత్రల మానసిక దశలకు ఆది చిత్రణ ఈ కవితలో దర్శనమిస్తుంది.

ప్రపంచంలోని సాహిత్య కళా, మానవ వికాస రంగాలు (ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్) ఈ రచనను పలు రూపాలలో వ్యాఖ్యానిస్తున్నాయి. ''నా జీవితాన్ని కాఫీ స్పూన్లతో కొలుచుకున్నాను'' అన్నది ఈ కవితలో ఒక ప్రఖ్యాత వాక్యం. దానికి ఒక ఆధునిక చిత్రకారిణి వేసిన గమ్మత్తయిన కాఫీ కప్పు ఎలియట్ బొమ్మ, ఈ తరాల పిల్లలు ఎలా ఎలియట్ కవిత్వాన్ని చదువుతున్నారో తెలియజేస్తున్నది.

కారా మాస్టారు తెలిపినట్టు చక్కని కళారూపాలసదగ్గ ఇతివృత్తాలతో శ్రేష్ఠమైన కథలు మూడు వేలకు పైగా తెలుగులో ఉన్నాయన్న మాటలను చెవిన పెడదాము. వెయ్యేళ్ల కవిత్వ సంప్రదాయం లేని ఆంగ్లభాష సాధిస్తున్న సాంకేతిక ప్రగతితో పోల్చుకుని, మన భారతీయ రచయితలకు, ముఖ్యంగా తెలుగు రచయితలలో దిగ్గంతులకు విశ్వ పాఠక/ప్రేక్షక రాజ్య పట్టాభిషేకం ఎలా చేయగలమో ఆలోచిద్దాము.

టి.ఎస్.ఎలియట్

''వర్తమాన కవిత్వమంటే ఏమిటో తెలుసా వరదా, అది భూత భవితవ్యాల మధ్య ట్రాన్స్‌పరెంట్ పరదా'', (కవిత్వానికే కాదు వచనానికీ ఇది వర్తిస్తుంది), ''చూశావా ఆరుద్రా ఒక తమాషా, సంప్రదాయం నిలిచే ఉంటుంది హమేషా'' అన్న శ్రీశ్రీ, ఆరుద్ర, అబ్బూరి వరద రాజేశ్వరరావుల చింతన 'సాహిత్యోపనిషత్'లో నమోదై ఉంటే, ఇదే భావాల సారాన్ని అంతకన్నా ముందరే పాశ్చాత్య సాహిత్యంలో ధ్వనించిన ప్రపంచ ఆధునిక కవిత్వోద్యమ సారధి ఎలియట్. వారి 'ప్రేమ గీతానికి' నూరేళ్లయితే, వారి స్మృతికి ఇది స్వర్ణోత్సవ సంవత్సరం. అలా కూడా మనం ఎలియట్‌ను, శ్రీశ్రీని, రెండు యుద్ధాల మధ్య కాలపు కవులుగా, వారి దేశ, కాల, చైతన్య పరిధుల మేరకు అధ్యయనం చేసేందుకు ఒక అపూర్వ అవకాశం ఇది. అందుకే పిలుస్తున్నది ఎలియట్ కవిత. ఈ కృషి శిఖరాల అధిరోహణకు, ''పోదామా అయితే నువ్వూ నేనూ!''

రామతీర్థ, 9849200385

సాహిత్య విమర్శ

ఆ చైతన్య కలాలు ఏవి?

“ ఒక గురజాడ వలె, శ్రీశ్రీ వలె, వుప్పల లక్ష్మణరావు వలె ఇవాళ రచనలు చేయలేమా? వాటికి ఒక ప్రయోజన స్పష్టతను ఇవాల్టి రచయితలు ఏర్పరచుకోలేరా? కవిత్వంలో కొంత విశాలంగా అల్లుకు పోవడం కనిపించినా, ఈ విశాల దృష్టిని అలవర్చుకోవడంలో కథ, నవల, నాటకం బాగా వెనుకబడి ఉన్నాయి. పలు ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన బాధిత ప్రజలు ఆ రచనలో భాగమై, తమ జీవితానుభవాలు కలబోసుకోవడం, పై రూపాలు వేరైనా సమస్యల ఏకసారాన్ని గ్రహించి, ఈ పరిస్థితులకు కారణం అయినవారిని నిలదీయడం వంటి బలమైన కాన్వాస్ మీద చిత్రణలు గల రచనలు ఎక్కడా రావడం లేదు. ఒక మహీధర, ఒక దాశరథి, ఒక రావిశాస్త్రి ఎలా, ఆ రోజుల్లో రాయగలిగేరా అన్నది ఇవాల్టి రచయితలు వేసుకోని ప్రశ్న. ”



ఏదైనా సమాజంలో ఉత్తమ సాహిత్యం రావడం అనేది, ఆ సమాజంలోని ప్రజల చైతన్యస్థాయిపై ఆధారపడి ఉంటుంది. సమాజ పోకడలలో సంస్కరణలు అవసరం, శాస్త్రీయదృష్టితో మనం ఖగోళ, విశ్వాంతరాళ ఘటనలను అర్థంచేసుకోవాలి అని గురజాడకు అనిపించగానే ఆయన, హేలీ తోకచుక్క రాక గురించి సమాజం అంతా ఏవేవో అపోహలతో నిండి ఉన్నప్పుడు, ‘దూరబంధువు ఇతడు భూమికి, తలతు నేనిది సంఘ సంస్కరణ ప్రయాణ పతాకగాన్’ అని రచన చేశాడు. విద్యారంగాన్ని ఎప్పుడూ ప్రైవేటుపరం చేయరాదని తన లేఖల్లో సూచించాడు. గిడుగు రామమూర్తితో పాటుగా, గ్రాంధిక తెలుగు స్థానంలో, అందరికీ అర్థమయ్యే సరళమైన తెలుగుకు మనం ప్రాధాన్యత ఇవ్వాలని తన పోరాటం చేశాడు. తీరా, ఇవాళ, ఏ వ్యవహారిక తెలుగుకోసం గురజాడ ప్రభృతులు శ్రమించి, సంఘర్షించారో, ఆ తెలుగులో మనం విద్యా బోధన మానేసి, ఎన్నో దశాబ్దాలు అయింది. తద్వారా, ప్రస్తుతం ముప్ఫయ్యేళ్ళ లోపు వారు మాట్లాడే తెలుగు, పూర్తిగా కృతకమైపోయి, సినిమా సంభాషణలుగా, వచ్చీ రాని తెలుగు – ఆంగ్లభాషల సంకర అస్తిత్వంగా కనిపిస్తోంది. ఇది గురజాడ మరణించిన నూరో వత్సరం కూడా. భాష పట్ల మన నిర్వాకం ఇంత గొప్పగా ఉంది. ఒకసారి తిరిగి చూసుకుంటే, ఆయన మరణం నాటికి మనం విదేశీపాలనలో ఉన్నాం. ఈ నూరేళ్ళలో 28 స్వదేశీ పాలనలో ఉన్నాం.

సాధించిన అభివృద్ధిలో సాహిత్యం పాత్ర ఎంత అనేదానికి ఇంత బరువు, ఇంత పరిమాణంలో సాహిత్యం సహకరించింది అని చెప్పడానికి ఏ సమాజంలోనూ కుదరదు. సామాన్యుల అభివృద్ధి కోసమై వ్యవస్థాగతమైన మార్పులను కోరిన సాహిత్యం ఎప్పుడూ అభ్యుదయతత్వాన్నే కలిగి ఉంటుంది. ఆ విషయంలో కళింగాంధ్ర ఒక పురిటిగడ్డ. గురజాడ, ఆచంట సాంఖ్యాయన శర్మ, శ్రీశ్రీ, రోణంకి, శ్రీరంగం నారాయణబాబు, చాసో, ఆరుద్ర, వుప్పల లక్ష్మణరావు, పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి, ఆయల సోమయాజుల నరసింహశర్మ, భూషణం మాస్టారు, సుబ్బారావు పాణిగ్రాహి, పూసపాటి కృష్ణంరాజు, అంగర వెంకట కృష్ణారావు, మసూనా, అల్లం శేషగిరిరావు, జ్యేష్ఠ, రాచకొండ విశ్వనాథశాస్త్రి, బలివాడ కాంతారావు, ఘండికోట బ్రహ్మాజీరావు, కాళీపట్నం రామారావు, భమిడిపాటి రామగోపాలం, త్రిపుర, కె.ఎన్.వై.పతంజలి, అర్నాద్, సావిత్రి, ఆదూరి సత్యవతీదేవి, ఆదూరి వెంకట సీతారామమూర్తి, వాకాటి పాండురంగరావు, ద్విభాష్యం రాజేశ్వరరావు, కవనశర్మ, వివినమూర్తి, ఏవి రెడ్డి శాస్త్రి, యుఏ నరసింహమూర్తి, చాగంటి తులసి, పంతుల జోగారావు, బులుసు జీ ప్రకాష్, వెలుగు రామినాయుడు, దేవరకొండ సహదేవరావు, రొక్కం కామేశ్వరరావు, దాసరి రామచంద్రరావు, చింతా అప్పలనాయుడు, మంజరి, తుర్లపాటి రాజేశ్వరి, సీరఃపాణి, గుడిమెట్ల గోపాలకృష్ణ, ఎల్ఆర్ స్వామి, ఏఎన్ జగన్నాథశర్మ, కవి అల, విజయచంద్ర, డా.తలతోటి పృథ్వీరాజ్, మాధవీ సనారా, వెంపలి శివప్రసాద్, గంటేడ గౌరునాయుడు, అట్టాడ అప్పలనాయుడు, రెడ్డి రామకృష్ణ, పి.లక్ష్మణరావు, అరుణ్ బవేరా, పి.అనంతరావు, ఎవిఆర్ మూర్తి, బండి సత్యనారాయణ, అడపా రామకృష్ణ, గరిమెళ్ళ నాగేశ్వరరావు, చింతకింది శ్రీనివాసరావు, పేరి రవికుమార్, బమ్మిడి జగదీశ్వరరావు, మల్లిపురం జగదీష్, మానపురం రాజా చంద్రశేఖర్, కెఎన్.మల్లేశ్వరి, ఏ. సీతారత్నం, జగద్ధాత్రి, డా.మాటూరి శ్రీనివాస్, అలాగే ఈ వ్యాసకర్త ... ఇంకా స్థలాభావం వల్ల పేర్కొనలేని అనేకమంది ఇతరులూ, పలు ప్రధాన స్రవంతులకు ప్రతినిధులై, ప్రజల తరపున సాహిత్యాన్ని నమోదు చేశారు.

ఇప్పుడు 30, 40 ఏళ్ల మధ్య గల తరం, సాహిత్యం వైపు తక్కువగా వస్తోంది. దీనికి కొంత కారణం, 24 గంటలూ పనివేళలే అయిన ప్రయివేటీకరణ. ఇంకొంత ముఖ్యకారణం 24 × 7 విరామం లేకుండా చానెళ్ల ద్వారా వచ్చే దృశ్యాల వరద. చూడడం అనేది అలవాటైన సమాజం చదవడం అనే ఆరోగ్యకర ధోరణికి రానురానూ ఎడమై పోతుంది. వారు చదవలేరు. రాయలేరు. ఫల స్వరూపంగా ఆలోచించలేరు. తమ కొద్దిపాటి వ్యక్తిగత ప్రయోజనాలను మించిన, సమిష్టికి చెందిన, పరమ కర్తవ్యాలు అనేవి ఏవీ వారికి ఉండవు. పత్రికలతో పని లేదు. అలాంటి పరిమితుల గల ఈ తరం వారు, రాస్తున్నది కొద్దిమందే అయినా, వారు సృష్టిస్తున్న సాహిత్యం మీద ఈ లోపాల ప్రభావం కూడా ఉంది. ముందుగా వీరు, వారి ముందరితరం వారిని చూసి ఇరుక్కునే ప్రమాదం ఏమిటీ అంటే, తమకంటూ ఒక గొడుగు వేసుకుని, ఆ అస్తిత్వం దృష్టి నుంచే లోక పరిణామాలను చూడడం. దీనివల్ల పరిమిత దృష్టిలో కొంత ప్రయోజనం కనిపించినా, విశాల దృష్టికి ఈ ఆలోచన తగు రూపేణా సాయం చేయదు. ఆ మాటకు వస్తే, అన్నీ అస్తిత్వ చైతన్యాలూ మంచివే! ఆహ్వానించ దగ్గవే! కానీ, అవి విశాల పరిధిలో, ఇతరేతర చైతన్య శక్తులతో కలిసే ఆలోచనలు చేయలేకపోతే, రాసే వస్తువు పదే పదే రాయబడి, అభివ్యక్తిలో కొత్తదనం అనేది మూలనపడి పోయి, ఆ రచయితను అందరూ మర్చిపోతారు. అందువల్ల తక్కువ కళా ప్రమాణాలు గల రచనలు, లేదా అసలు ఏ ప్రమాణాలు లేనివీ, సాహిత్యం పేరిట దురాక్రమణ చేస్తాయి. వీటికి వ్యాపార పోకడలు సహకరించి, తాము గొప్పవారం అనే భావనలు పెంచుతాయి. ఇవాళ ఏ పాతికేళ్ళ యువతకైనా కొంత రాసే ఉద్దేశం ఉంటే సినిమా పాటలు రాయడం, సినిమాకు కథలు చెప్పడం, స్టోరీబోర్డ్ మీటింగులంటూ ఆ సినిమాలు తీసే ఊర్లలో తిరగడం ప్రధాన వ్యాసంగంగా ఉంది. ఇదే గొప్ప సాహిత్య జీవితం అనుకునే భ్రమల్లో ఉన్నారు.

ఒక గురజాడ వలె, శ్రీశ్రీ వలె, వుప్పల లక్ష్మణరావు వలె ఇవాళ రచనలు చేయలేమా? వాటికి ఒక ప్రయోజన స్పష్టతను ఇవాల్టి రచయితలు ఏర్పరచుకోలేరా? కవిత్వంలో కొంత విశాలంగా అల్లుకు పోవడం కనిపించినా, ఈ విశాల దృష్టిని అలవర్చుకోవడంలో కథ, నవల, నాటకం బాగా వెనుకబడి ఉన్నాయి. పలు ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన బాధిత ప్రజలు ఆ రచనలో భాగమై, తమ జీవితానుభవాలు కలబోసుకోవడం, పై రూపాలు వేరైనా సమస్యల ఏకసారాన్ని గ్రహించాలి. అలాగే ఈ పరిస్థితులకు కారణమైన వారిని నిలదీయడం వంటి బలమైన కాన్వాస్ మీద చిత్రణలు గల రచనలు ఎక్కడా రావడం లేదు. ఒక మహీధర, ఒక దాశరథి, ఒక రావిశాస్త్రి ఎలా, ఆ రోజుల్లో రాయగలిగేరా అన్నది ఇవాల్టి రచయితలు వేసుకోని ప్రశ్న. దానికి తోడు అలాంటి ప్రశ్నలను ఇష్టపడని మనస్తత్వం ఒకటి తోడైంది కొత్తగా. మధ్యతరగతి చైతన్యం కేవలం, చదువులూ, అర్హతలూ, అమెరికా ఉద్యోగాలూ వీటివైపు తిరుగుతూ ఉంది. ప్రపంచ ప్రయివేటీకరణలో ఈ యువ ప్రతిభావంతుల పాత్ర ఏమిటన్నది మనం ఆలోచించాలి. అలాకాకుండా డాలర్లు సంపాదించే అమెరికా ఉద్యోగాల గురించి మనం సమాజంలో ఒక ముగ్ధత్వాన్ని (మురిసిపోవడం) నాగరికతగా ఏర్పరచుకుని పెంచి పోషిస్తున్నాం. అక్కడి డాలర్ల బలంతో వారిక్కడ మంచినీటి బావులు తవ్వించి, వారి పల్లెల్లో స్కూళ్ళు ఏర్పాటు చేసేవారు కొందరే. ఆ డబ్బు తెచ్చి ఇక్కడి సినిమా జూదంలో పెట్టేవారు మాత్రం కొల్లలుగా కనిపిస్తున్నారు. అదీ వారికి గల సామాజిక చైతన్యం. ప్రజలను ఒక శక్తివంతమైన వనరుగా గుర్తించి వారి భౌతిక, మానసిక వికాసానికి పూచీపడాల్సిన సంక్షేమ బాధ్యత ప్రభుత్వాలదే. ఏ పార్టీ వారు పాలించినా, విద్యా, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, భూమి, నీరు చెట్టు అన్నీ ప్రైవేటుపరం చేసే ఒక ప్రక్రియను, 80 కోట్ల మంది మీద, ఈ విశాలదేశం పైన, సాగిస్తూన్నారు. దీన్ని అంతో ఇంతో చదువుకున్న 20 కోట్ల మందిమీ వినోదం చూస్తున్నాం.

ఈ అలసత్వాన్ని ప్రజల తరపున సాహిత్యం ప్రశ్నించాలి. కాకరపల్లి, కొవ్వాడ, బీల భూములూ, భోగాపురం, ఫార్మా కంపెనీల వల్ల వచ్చే వ్యర్థాలూ, బాక్సైటు ఖనిజ సంపద తవ్వి తీసి వ్యాపారాలు చేయడాలూ... ఇవన్నీ ఏవో అక్కడి స్థానిక ప్రజల సమస్యలు కాదు. అలా ఉత్తరాంధ్రలోని చదువుకున్న పట్టణ సమాజం తలపోస్తూ ఉండడంలోనే, అలవిగాని ప్రైవేటీకరణను చూస్తూ ఊరుకోవడంలోనే, అసలు ప్రమాదాలు కాచుక్కూచున్నాయి. కోటిమంది పైగా ప్రజలకూ, ఎన్నో నదులకూ, అటవీ సంపదకూ, సాగర తీరానికీ, కొండల ఆధారిత పర్యావరణానికీ ఎంతో అవినాభావ సంబంధం ఉంది. ఎక్కడ నష్టం జరిగినా అది ఒకదానితో ఒకటి కలిసిపోయి ఉన్న, పొరుగు వ్యవస్థలపై కూడా తీవ్రంగా తన ప్రభావాన్ని చూపుతుంది. ఈ చైతన్యం ఒక సమరశీల అవగాహనగా పెంపొందేందుకు సాహిత్య రచన చేయాల్సిన బాధ్యతలు ఇవాళ పిలుస్తున్నాయి. కథా, నవలా కల్పనా సంపన్నతతో పాటుగా, వీధి నాటికలుగా, రూపకాలుగా, పిల్లల ప్రదర్శనలుగా ఈ సమస్యలు ఇతివృత్తాలుగా తమ కల్పనలు జోడించాలి. అలాంటి సాహిత్యలోకం, ఏ అస్థిత్వ బరువుల కింద కూచుని, ఏం చేస్తున్నదా అన్నదే నేటి ప్రశ్న. ఇందుకు సానుకూల విధానాలు గల పత్రికలు సైతం, కళారూపాల పోటీల ద్వారా, ప్రచురణలు, ప్రదర్శనల ద్వారా, ప్రజా శ్రేణులను సచేతనం చేయాల్సిన ఒక సంక్లిష్ట సందర్భం ఇది. అలా మేలుకొని, జాతి అవసరాలను గుర్తించి రచనలు చేయగలవారే, భవిష్యత్తరాల భద్రతకు, రక్ష రేకులవుతారు. మహాకవి శ్రీశ్రీ మాటల్లో స్వాగతిద్దాం- వారిని నిండు గొంతుకులతో, రెండు చేతులా. ‘కొంతమంది కుర్రవాళ్ళు ముందుయుగం దూతలు/ పావన, నవజీవన బృందావన నిర్మాతలు.’ వారికి మా ఆహ్వానం. వారికి మా లాల్‌సలాం.

– రామతీర్థ
98482 00385

పోరాటశీల సాహితీ స్వరం

చలసాని ప్రసాద్

1932 - 2015

విశాఖ సాహితీ లోకంలో ఒక చిరపరిచిత వ్యక్తిత్వం చలసాని. రాష్ట్రవ్యాప్తంగా విరసం నాయకులలో ఒకరు. వామపక్ష సామాజిక చింతనను పతాకగా చేతబట్టి, అరుణ తార సంపాదక బాధ్యతలు కూడా దశాబ్దాలుగా నిర్వహించి ఎన్నో ప్రామాణికమైన రచనలు వెలుగులోకి రావడానికి కారణభూతుడైనవాడు. ఇరవయ్యో శతాబ్దపు ప్రజల పోరాటశీలత గురించి చెప్పగల ఒక సాధికార స్వరం.

తరలిపోయిన ఎర్ర పుస్తకం

ఇరవయ్యో శతాబ్దపు తెలుగు సాహిత్యంతో రక్త సంబంధంగలవాడు... ఉద్యమాలకూ, అక్షరోద్యమాలకూ తేడా లేనివాడు... ఎక్కడ ఏ ఎదురుకాల్పుల్లో ప్రజలు, ప్రజాసంఘర్షణ ఆచరణశీలురు అమరులైనా అక్కడ ప్రత్యక్షం అయినవాడు... ఎనభై మూడేళ్ళ వయస్సులో కూడా ఈ నెల 25న జరగాల్సిన విరసం సభ కోసం కరపత్రాలు పంచిపెడుతూ విశాఖపట్నం సభలలో మొన్నమొన్ననే కదలాడినవాడు... ఆయనే చలసాని ప్రసాద్. చదువుతూ చదువుతూ పుస్తకాన్ని కాసేపు మడిచినట్టు... మాట్లాడుతూ మాట్లాడుతూ కాసేపు పక్కకి తిరిగినట్టు... సులువుగా అందరినీ విడిచి వెళ్ళిపోయాడు. గురజాడ కన్యాశుల్కాన్ని క్షుణ్ణంగా చదవడం అంటే ఎంత లాగా, ఆ నాటకంలో రంగస్థలం పైకి రాని పాత్రలు దాదాపు నలభై ఉన్నాయని చెప్పగలిగినవాడు, తన ఇంటిలోని సొంత లైబ్రరీలో నడుస్తున్న పుస్తకం చలసాని. ఉత్తరాంధ్రలో ఏ పుస్తకం కావాలన్నా చలసాని ఒక అక్షరాల నిధి, పుస్తకాల గని.

శ్రీశ్రీ కైకగా ఆయనకి అత్యంత సన్నిహితుడు. శ్రీశ్రీ సమగ్ర రచనలను సంకలనం చేస్తున్నాము కానీ వీటిని చదివి నిగ్గుతేల్చుకోవలసింది రాబోయే తరాలే అని చెప్పగలిగిన సంయమనం గల సాధుస్వభావి. విశ్వనాథ వేయి పడగలలో ఆనాటి సమాజ చిత్రణ కనబడుతుంది, అందుకోసం అది తప్పక చదువదగ్గ పుస్తకంగా పేర్కొనే ప్రజాస్వామికుడు. విశాఖలో మొజాయిక్ సాహిత్య సంస్థ నిర్వహించిన శ్రీశ్రీ శత జయంతి కార్యక్రమాలలో పలుమార్లు ముఖ్య ఉపన్యాసాలు ఇచ్చి, చిన్న సభ, పెద్ద సభ అని చూడకుండా తన సాహిత్య సమాజ జ్ఞానాన్ని నలుగురితో పంచుకునే ఉబలాటంలో చిన్నపిల్లలను మించిపోయిన వాడు చలసాని ప్రసాద్. భావ కవిత, అభ్యుదయ కవిత, విప్లవ కవిత, దళిత కవిత, స్త్రీవాద కవిత్వ ఉద్యమాల స్వభావం, తెలుగు కథ, నవల వీటి క్రమ పరిణామ వికాసాలను, ప్రయోగ వైచిత్రి, ప్రయోగశీలత ఎరిగి, తన ప్రసంగాలలో విడమర్చి చెప్పగల వక్త. విశాఖ సాహితీ లోకంలో ఒక చిరపరిచిత వ్యక్తిత్వం చలసాని. రాష్ట్రవ్యాప్తంగా విరసం నాయకులలో ఒకరు. వామపక్ష సామాజిక చింతనను పతాకగా చేతబట్టి, అరుణ తార సంపాదక బాధ్యతలు కూడా దశాబ్దాలుగా నిర్వహించి ఎన్నో ప్రామాణికమైన రచనలు వెలుగులోకి రావడానికి కారణభూతుడైనవాడు చలసాని. ఇరవయ్యో శతాబ్దపు ప్రజల పోరాట శీలత గురించి చెప్పగల ఒక సాధికార స్వరం. ఎక్కడ ప్రజలు పోరాడుతూ ఉంటే అక్కడకు వెళ్ళి సంఘీభావం ప్రకటించడం, ఎనభై మూడేళ్ల వయసులోకూడా అలుపెరుగని పట్టుదల గల వ్యక్తి.

శ్రీశ్రీ శత జయంతి (2010లో) సందర్భంలో శ్రీశ్రీకి నూరు, విరసానికి నలభై అని గుర్తుచేసుకుంటూ, రాజ్యపు అణచివేత గురించి చాలా ప్రాక్టికల్‌గా మాట్లాడే మనిషి. ఎప్పుడూ ఒక దీర్ఘకాల సంఘర్షణకు సిద్ధపడ్డ వ్యక్తి ఉండే పరిపక్వత ఆయనలో నిరంతరం కనిపించేది. ఒక శ్రద్ధాళువుగా తన సాహిత్య సాంగత్యాలు అలవరిచిన అభ్యుదయాత్మకమైన విప్లవాంశను ఎప్పుడూ ధ్వనిస్తూ ఉండేవారు. విరసం ఆవిర్భావంతో ప్రత్యక్ష సంబంధం గల కీలక వ్యక్తిని ఇవాళ తెలుగు సాహిత్యం కోల్పోయింది. నిరసన ఒక ప్రజాస్వామిక సంస్కృతిగా జీవించిన అసమ్మతిదారు, ఒక డిస్సెంటర్. మార్కెట్ శక్తులు రాను రానూ బలపడుతూ, మతం, అధికారం, ఐశ్వర్యం, ఆయుధ సంపత్తి, రాజకీయం, అన్నీ తమతమ అస్తిత్వ వాదాలతో ఒకదానితో ఒకటి కుమ్మక్కు అవుతున్న కాలంలో చలసాని వంటి వివేకవంతుల అవసరం సమాజానికి చాలా ఉన్నది. తనవంటివారు నలుగురు తయారుకావాలన్న ఒక సార్వత్రిక ఆకాంక్షతో అందరినీ ప్రోత్సహిస్తూ, తన గొప్పదనం ఏమిటో అసలు ఎరుగకుండానే జీవించిన నిరాడంబరుడు చలసాని ప్రసాద్. ఆయన మన సామూహిక, ప్రజాగ్రహాల వనరు. ఏ సాహిత్యం నుంచైనా ప్రగతిశీల అంశను స్వీకరించగల ఉదారవాది. తనకు ఏదైనా సందేహం వస్తే, ఆ వక్తను సభ తరువాత, నేరుగా కలసి అడిగి తెలుసుకునే ఓపిక కల మంచి శ్రోత. వీరి సభలు, వారి సభలు అని గీతలు గీసుకోకుండా, హాజరై విని, అవసరం అయితే తన అభిప్రాయాన్ని పంచుకునే ఉత్తమ క్రమశిక్షణా శీలి. భీమిలిలో చలం జయంతి సభలకు వచ్చి సౌరిస్ ఆశ్రమంలో చలంగారి గురించి ఎన్నో విషయాలను చలసాని చెప్పిన సభలో నేనూ సహవక్తను. ఆయన, ఆ భీమిలీ సభలు నాకు ఇప్పటికీ వెచ్చని జ్ఞాపకాలే.

ఈతరం రచయితలు నేర్చుకోవలసిన ఎన్నో ఉత్తమ లక్షణాలకు జీవిత కాల గురువు. పాఠాలు బోధించింది విశాఖలోని ఏ.వి.ఎన్. కళాశాలలో రాజనీతి శాస్త్రంలోనైనా తన జీవితం అంతా, సాహిత్య మాధ్యమం ద్వారా, పాలకులు - యంత్రాంగం మధ్య నలిగిపోయే ప్రజల గురించి మానవ నాగరికతలో తనకు అందిన శతాబ్దాన్ని అధ్యయనం చేసిన నిత్య విద్యార్థి.

ప్రజలను ప్రేమించాడు కాబట్టే విరసంలో ఉన్నాడు. పేదల పక్షం వహించాడు కాబట్టే కమ్యూనిస్టుగా బతికాడు. తాను రాసిన దానికన్నా, మహారచయితల సహవాసి. అంతేవాసిగా ఎక్కువ నేర్చుకుని, అది అందరికీ తెలియచేసిన మన చలసాని అక్షరాలా అందరి నేస్తం. ఎంత తక్కువ రాశాడో అంత ఎక్కువ చదివాడు. ఎంత ఎక్కువ చదివాడో, అంతకన్న ఎక్కువగా ప్రజల మనిషిగా కలసిపోయాడు. చలసాని లేని విశాఖ - నిండుగా పలకరించే నవ్వుని కోల్పోయింది. సందడి చేసే సముద్ర కెరటం తక్కువై కళ తగ్గిపోయింది. సాహితీ సభలు ఒక నిప్పుల నిమ్మగ జాడ లేక కొంత మసకబారిపోతాయా అనిపిస్తోంది. భుజం మీద చరుపూ, వెంటనే పెద్దగా నవ్వూ, ఎవరిని పలకరించడానికి, ఎవరికి పంచడానికి వెళ్లాడో చలసానీ?

- రామతీర్థ, 9849200385

సంక్షోభంలో తెలుగు భాష

ఒక అ.భా.స - ఒక రసాభాసా

రామతీర్థ
9849200385

గ్లోబల్ సందర్భంలో, దేశీయ భాషల పరిస్థితి ఏమిటి. పెద్దల మాటలను పెద్దగా పట్టించుకునే అలవాటు మనకు లేదు. విద్యను ప్రైవేటు పరం చేయవద్దు అన్నారు గురజాడ. మనం ఆయననే పక్కన పెట్టాము. గ్రామాల స్వయంపోషకత్వం పైనే దేశం బలమైన పునాదులు ఏర్పరచుకుం టుంది. స్మాల్ ఈజ్ బ్యూటీఫుల్ అన్న దృష్టి పెంపొందించుకోవాలని హితవు పలికారు గాంధీజి. పత్తిచెరుకు, టమాటా, వరి, బంగాళాదుంప వగైరా పంటల రైతులకు, మగ్గం బతుకులకు, పదిహే నేళ్ళలో, మూడు లక్షల ఆత్మహత్యలు మిగిల్చి, వారికి బేంక్‌ల దనున్నను దూరంచేస్తూ, అట్టహాసంగా నగరాల నిర్మాణ ప్రనాళికలతో ముందుకు పోతున్నది మన భారత రిపబ్లిక్.

భాష పట్ల మన పరిపాలకులకు గల ఆలోచనలు చూస్తే, వీరేం చేసినా ప్రజలు పట్టించుకోరు అనే ఒక ధీమా పాలకులలో, వారి సలహాదార్లలో, బాగా బలపడినట్టుగా తెలుస్తుంది. ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ (కళలు, సృజన రంగాలు) ఏరకంగా చూసినా, విజ్ఞాన శాస్త్రాల కన్నా, వేలాది ఏళ్ళు ముందరే మొదలైన వికాస శాస్త్రాలు. నూతన విజ్ఞాన యుగంగా ప్రపంచంలో భౌతిక, రసాయన, సాంకేతిక శాస్త్రవిద్యలు మొదలై మూడువందల ఏళ్ళు కన్నా కాలేదు. వీటితో బాటుగా సమాన ప్రాముఖ్యతతో బలపడవలసిన కళలు, సృజన రంగాలను ఒక అర్ధ శతాబ్దంగా బాగా చిన్న చూపు చూస్తున్నాము. తద్వారా విభిన్న భాషలు వాడుక ప్రమాదంలో పడింది. ప్రపంచ వ్యాప్తంగా గల 18 కోట్ల మందికి చెందిన తెలుగు భాష, దాదాపు రెస్త్రండు రాష్ట్రాలలో తొమ్మిది కోట్ల మంది ప్రజల సామాజిక అస్తిత్వం అయిన తెలుగు, ఇవాళ వరుస గ్రహణాలను ఎదుర్కొంటున్నది. దీనికి రాష్ట్రాల విడిపోత లక్ష్యంగా, కొందరు తెలంగాణ వాదులు, మా భాష వేరు అంటూ మొదలుపెట్టిన ఒక వితండ వాదనా, సమర్థించిన పత్రికలు, అశాస్త్రీయమూ, సంకుచితమూ అయిన తమ ఆలోచనలను ఇదే అదనుగా బయటపెట్టిన కొందరు ప్రస్తుత పొరుగు రాష్ట్ర, వేర్పాటు ఉద్యమ ఆవేశాల విద్యావంతులూ, కారణంగా అనవసరమైన సంధిగ్ధత ఏర్పడింది. పోనీ ఇది తెలుగు వారు తమలో తాము తేల్చుకోవలసిన సంగతి అనుకుందాము.

అయితే ఒకనాటి జాతీయ విద్యా విధానం ఏమి చెప్పిందో, ఇప్పుడు తిరిగి, కేంద్రం , రాష్ట్రాలు ఈ విద్యా విధానం ఎంత సమగ్రంగా ఉన్నదో, సమీక్ష జరిపి, కొన్ని దేశ వ్యాప్తం విధాన సవరింతలు, వాటిని అమలు చేయవలసిన బాధ్యత రాష్ట్రాలకు తప్పనిసరి చేయడం, జరగక పోతే, ఏ రాష్ట్రం, తనకు నచ్చిన బాట తొక్కి, పొరుగు భాషల ప్రజలు, తమ సరిహద్దు జిల్లాలలో ఉన్నారు అన్న స్పృహను విడనాడి, ఈ బహుళ భాషా విద్యావిధానాన్ని, ఒక చిరిగిన విస్తరి చేస్తుందన్నది, ఒక సార్వత్రిక సత్యం. ఉదాహరణకు, దేశంలో అన్ని ప్రాంతాలలో త్రిభాషా విధానం పాఠశాలల్లో అమలులో ఉండగా, అందుకు విరుద్ధంగా , పిల్లల్లో మౌలిక అధ్యయన శక్తులు చురుకుగా ఉంటాయన్న విషయాన్ని మరిచి, వారు తమ రాష్ట్రంలో, తమిళం, ఆంగ్లం మాత్రం చదివితే చాలు అంటూ, ద్విభాషా విధానంతో, తమిళ బాలురు, బాలికలను, ఒక జాతీయ భాష నేర్చుకునే సౌలభ్యానికి దూరం చేస్తున్నది పొరుగున ఉన్న తమిళనాడు రాష్ట్రం.

ఇంతటితో ఆగక, ఈ ద్విభాషా విధానం మార్చకుండా , తమ రాష్ట్రంలో (ఎందుకంటే ఒకప్పుడు మద్రాసు స్టేట్గఆ ఇక్కడ మలయాళ, కన్నడ, తెలుగు, ఉర్దూ, భాషల చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉన్నారు. అన్నది ఒక చారిత్రక వాస్తవం కాగా, వారి విద్యా వికాసాలు వారి భాషలో జరిగేలా చూడడం తమ రాజ్యాంగ బద్ధ కర్తవ్యం అని కూడా మరిచి తమిళ భాషను కంపల్సరీ చేస్తూ తమ రాష్ట్రంలో లోగడ డీఎంకే ప్రస్తుతం 2006లో జారీ చేసిన ఒక జీవోను ఈ ఏడాది అమలులోకి తెచ్చింది ప్రస్తుత అన్నాడీఎంకే సర్కారు. అక్కడి పాలకులు, దీనివల్ల, అక్కడి విద్యార్థులలో, తమిళం మాతృభాష కాని వారు, తమ మాతృ భాషను ఎంచుకునే వీలు లేకుండా చేస్తున్నారు. అక్కడి తెలుగు విద్యా బోధన (ఇంకా మలయాళం, ఉర్దూ, కన్నడ, హిందీ భాషలలో బోధన కూడా)

వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఆగిపోతున్నది, కనుక రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల వారూ ఈ విషయమై ఆలోచించాలి అన్నది. అక్కడి తెలుగు విద్యా బోధనకై ఉద్యమం చేస్తున్న జగదీశ్వర రెడ్డి గారి తపన. దీనికి ఎటువంటి నివారణ ఆలోచించడానికైనా మనం తెలుగు భాష విషయంలో ఎంత సమర్థులం అన్నది కూడా ఇక్కడ పరిగణనలోకి తీసుకోవాలసిన ఒక ముఖ్య అంవం. రెండేళ్ల కిందట కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న రోజులలో, శైలజానాథ్ గారు, విద్యా మంత్రిగా, ఉండగా, తెలంగాణలోని తెలుగు మీడియం బోధిస్తున్న ప్రైవేటు స్కూళ్ళు అన్నీ (15,000పైగానే) తాము, ఇంగ్లీష్ మీడియమ్ లోకి విద్యా బోధన మార్చేందుకు అనుమతి కావాలని కోరడం జరిగింది. దానివల్ల తెలుగు భాషకు నష్టం అని అప్పటి మంత్రి దాన్ని పక్కన పెట్టారు. ఇవాళ ఆంధ్రప్రదేశ్ విద్యా మంత్రి గంటా శ్రీనివాసరావు గారే, స్వయంగా, ప్రభుత్వ స్కూళ్ళలో సైతం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశ పెట్టే ఆలోచనలు చేస్తున్నట్టుగా ప్రకటించారు. ఇది తెలుగు భాష ఎదుర్కొంటున్న సంక్షభానాకి అద్దం పడుతున్నది. తెలుగు భాష ఒక్క ఏడాదీ చదువకుండా, విద్యార్థులు డిగ్రీ పాస్ అయ్యే సదుపాయం, కల్పించిన ఒకే ఒక్క దక్షిణాది రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. అప్పుడు ఒక రాష్ట్రంగా, ఇప్పుడు రెండు రాష్ట్రాలుగా కూడా అదే పరిస్థితి. దీనికి ఏ సందేహమూ అవసరం లేకుండా బాధ్యత ప్రైవేటు విద్యాసంస్థలు, ప్రభుత్వ వర్గాలలో చక్రం తిప్పుతూ, తెలుగు బదులుగా స్కోరింగ్ సబ్జెక్ట్ అంటూ, గొప్ప భాష సంస్కృతాన్ని ఒక దిక్కుమాలిన స్థాయికి తీసుకు వచ్చిన వారిదే. (దిక్కుమాలిన అని ఎందుకు అనడం అంటే, సంస్కృతం నిజంగా విద్యార్థులు నేర్చుకోరు, సంస్కృతం పరీక్షా ఆ భాషలో రాయరు. అయినా తొంభై పైగా మార్కుల వస్తాయి అదే మన విద్యా సంస్థలు, ప్రభుత్వాలు సంస్కృతానికి ఇచ్చిన గౌరవం. ఆ విద్యార్థికి ఇంటెర్మీడియట్‌లో చదివిన సంస్కృతం పట్ల తనకు ఏ అభిమానమూ, ఏర్పడదు. ఆసక్తి ఉండదు, మన స్కోరింగ్ మార్కులకోసం, ఒక గొప్ప భాష పట్ల ఇంతటి అవకాశ వాద నీచానికి పాల్పడవచ్చునా? ఇది శాస్త్రీయమైన భాషా బోధనేనా?

అగౌరవం మాట ఎలా ఉన్నా గత మూడు దశాబ్దాలుగా, సంస్కృతం , స్పెషల్ ఆంగ్లం, మొదలగునని తెలుగు భాషకు బదులుగా ప్రవేశపెట్టి, తెలుగును కంపల్సరీ చేయవలసిన రాష్ట్రాలు, ఆప్షనల్‌గా ప్రాధాన్యత దించి, తెలుగు ఇంతగా బలహీన పడడానికి, చేజేతులారా కారణమయ్యాయి. ఉన్న కాస్త తెలుగుకు భవిష్యత్తులో ఎటువంటి అస్తిత్వం లేకుండా చేసిన పాపం ప్రైవేటు విద్యా సంస్థలదీ, వారి ఇచ్చకాల మాటలు విన్న తల్లి దండ్రులదీ, చూస్తూ ఊరుకున్న మేధావి సమాజానిదీ, పాలించిన ప్రభుత్వాలదీ అని చెప్తే, కొంత కష్టంగా ఉన్నా, ఇది ఒక చేదు నిజం. మనమే మన తెలుగు విషయంలో ఇరవై మూడు జిల్లాల్లో ఈ పరిస్థితిలో ఉంటే ఇంక తమిళనాడులో గల తెలుగు వారికి నిజంగా చిత్త శుద్ధితో సాయం చేయగలమా? అక్కడి ప్రభుత్వానికి మంచి మాటలతో మైనారిటీ భాషల వారికి మేలు జరిగేలా వ్యవహరించమని చెప్పగలమా?

అందుకే ఇవాళ జాతీయ విద్యా విధానంలో తగు మార్పుల ద్వారా ఔద్యోగిక అంతర్జాతీయ భాషగా ఇంగ్లీష్ అవసరమో, సమాజిక అస్తిత్వ భాషగా మాతృభాష కూడా అంటే అవసరం అన్న ఎరుక తెచ్చుకుని, కనీసం మన రాష్ట్రాలలో, తెలుగును ఒకటో తరగతి నుంచి డిగ్రీ వరకూ, కంపల్సరీగా సిలబస్‌లో ఉంచకపోతే, ఇంకో ఇరవై ఏళ్లలో (తెలుగు రాని మూడు తరాల వారు తాత తండ్రి, బిడ్డ వల్ల) తెలుగు ఇంటింటా చచ్చిపోతుంది. ఈ నేపథ్యంలో ఎంతో బాధ్యతతో ప్రవర్తించవలసిన రెండు తెలుగు రాష్ట్రాల ప్రస్తుత పని తీరు అభాస, రసాభాసగా ఉన్న పద్ధతి చూస్తే ఆందోళన పెరుగుతుంది.

వెరసి జరూరైన వాస్తవం ఏమిటంటే, గుజరాడ సాక్షిగా, గిడుగు సాక్షిగా, సురవరం ప్రతాపపరెడ్డి సాక్షిగా, కాళోజీ సాక్షిగా, తెలుగుభాషా విషయాలు, కేవలం రాజకీయ వర్గాలకు మాత్రమే వదిలిపెట్టడం ఇంక ఎంత మాత్రమూ మంచిది కాదు. తెలుగు భాషకు పట్టిన దశాబ్దాల నాటి వరస గ్రహణాలు, ఇంతలా శాశ్వత కాల అరిష్టాలు కావడానికి కారణం అయిన మేధావులు, ప్రజలు, ఊరూరా, వాడ వాడలా, చెప్పుకోవలసిన ఉద్బోధ, మళ్ళీ మన మహాకవి శ్రీశ్రీ చెప్పిందే చెప్తున్నదీ రీడింగ్ రూమ్ తెలుగువీర లేవరా, దీక్ష బూని సాగరా, తెలుగు తల్లి వర్థిల్లే బాలోన కదలరా!

నూరేళ్ళ 'ఆంధ్ర పత్రిక'
తెలుగు పత్రికా రంగానికి నిత్య స్ఫూర్తి

రామతీర్థ
9849200385

తెలుగు వారి తొలి దిన పత్రిక ఆంధ్ర పత్రికకు 2014లోనే శత వత్సర సందర్భం. అయితే ఇవాల్టి తెలుగు పత్రికలు ఈ ముఖ్యమైన ఘట్టాన్ని, సముచితంగా పట్టించుకోలేదు. కారణాలు ఏవైనా, తొలి తెలుగు దినపత్రిక ఏప్రిల్ 1914లో మదరాసులో మొదలు అయిందన్నది తెలుగు జర్నలిజపు రంగానికి సంబంధించిన ఒక చరిత్రకు శ్రీకారం. 1908 నుంచి బొంబాయి కేంద్రంగా ఆంధ్రపత్రిక వారపత్రికను నడుపుతూ వచ్చిన కాశీనాథుని నాగేశ్వరరావు, తన పత్రిక ముద్రణా కార్యాలయాన్ని, అప్పటికి తెలుగు వారి ప్రధాన నగరం అయిన మదరాసుకు మార్చి మనకూ ఒక పత్రిక ఉందని చాటి చెప్పారు.

దీనికి వారిని ప్రేరిపించినది ఒకప్పటి మార్కెట్ పరిస్థితులే అంటే సకల జనులు అధికారులు" యెలకర్రు కృష్ణా జిల్లాలో 1867లో జన్మించిన కాశీనాథుని నాగేశ్వరరావు, గురజాడ కన్నా, అయిదేళ్లు చిన్నవారు. వారి పుట్టుక ఒక మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలో తల్లిదండ్రులు బుచ్చయ్య, శ్యామలాంబ. వ్యాపార కార్యకలాపాల్లో చిన్నప్పటి నుంచి ఈ కుర్రవాడికి ఆసక్తి ఎక్కువగా ఉండేది. తొలి చదువులు మచిలీపట్నంలో చదివి మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో డిగ్రి పొంది జీవనోపాధి వేటలో కలకత్తా, బొంబాయి వంటి నగరాలకు వెళ్లారు. బెంగాల్‌కు చెందిన దేశీయ ఔషధ తయారీ కంపెనీలో కొన్నాళ్లు అటుపై బొంబాయిలోని విలియం అఇండ్ కంపెనీలో పని చేస్తూ ఆ కంపెనీనే తను కొనుగోలు చేయగలిగారు. అటువంటి వ్యాపార ప్రతిభాశాలి కాశీనాథుని నాగేశ్వరరావు. ఇరవై ఆరేళ్ళ కాశీనాథుని నాగేశ్వరరావు, 1893లో తయారు చేసిన 'అమృతాంజన్'ను బొంబాయి ఆదరించింది. దానితో ఆయన దశ తిరిగింది. ఆ కారణంగానే ఆయన 1908లో ఒక ప్రకటన పత్రికకు ఇచ్చేందుకు వచ్చి ఏకంగా ఒక పత్రికనే స్థాపించగలిగారు.

తెచ్చిన వారు కాశీనాథుని నాగేశ్వరరావు. అలాగే 'యెంకి పాటలు' విషయంలో గ్రాంధిక వాదులు సర్వత్రా హేళన చేస్తూ ఉండగా నండూరి సుబ్బారావు కవిత్వం అయిన 'యెంకి పాటల'ను ప్రముఖంగా ప్రచురించినది ఆంధ్ర పత్రికే. విజయవాడకు చెందిన యువకులు వామపక్ష భావజాల కార్యాచరణ ప్రచారంలో భాగంగా తమకు కమ్యూనిస్టు మేనిఫెస్టో ప్రతులు అవసరం అని కోరిన కాలంలో పార్టీ భావజాలంపై ఆంక్షలు, నిషేధం ఉన్న రోజుల్లోనే మూడు వేల కాపీలు ప్రచురించి ఇచ్చిన సాహసి కాశీనాథుని నాగేశ్వరరావు. వీరి సేవలు గుర్తించి సెప్టెంబర్ 1929లో విజయవాడలో ఘన సన్మానం చేసి గౌరవించారు పుర జనులు. 'దేశోద్ధారక' బిరుదం ప్రదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. 1935లో వీరికి ఆంధ్ర

మనం ఆశ్చర్యపోతాము. తాము సిద్ధౌషధంగా తయారు చేస్తున్న 'అమృతాంజన్' ప్రకటనలు బొంబాయి పేపర్లలో ఇద్దామని అక్కడి పత్రికలను సంప్రదించిన యువకుడు కాశీనాథుని నాగేశ్వరరావు అవాక్కయ్యారు. ఆ ప్రకటనల ధరలు కొండంత ఎత్తులో ఉన్నాయి. అప్పుడు ఆయనకు తోచింది వేరే ఎవరిపత్రికలలోనో ప్రకటనలు ఇచ్చే కన్నా మనమే ఒక పత్రిక పెడితే ఉభయ తారకం అవుతుంది కదా అని. దానికి ఆచరణ రూపమే 1908లో బొంబాయిలోని 'తత్వ వివేచక ప్రెస్సు'లో ఆంధ్రపత్రిక వార పత్రికగా అవతరణ. ఆ పత్రికలో తొలి ప్రకటనా అమృతాంజన్ గురించే.

వార పత్రికగా మొదలైన రెండు ఏళ్లకే 1910లో సాధారణ నామ సంవత్సరంలో తొలి ఉగాది ప్రత్యేక సంచికను అసాధారణంగా, ఆంధ్రులకు గర్వ కారణంగా ఆంధ్ర పత్రిక తీసుకువచ్చింది. రెండు వందల నలభై ఎనిమిది పేజీల వ్యాసాలు, నూట ఇరవై ఆరు చిత్ర పటాలతో వెలువరించారు పత్రికను. మొదలై ఇంకా రెండేళ్లే అయిన వార పత్రిక గరించి తన సంపాదకీయంలో ఇలా రాస్తారు కాశీనాధుని. 'ఆంధ్రపత్రిక విజయమునకు ఆంధ్రులు గారకులు. ఈ బాల పత్రికం తమ పుత్రికా రత్నమువలె పెంచి పోషించుటకు ఆంధ్ర లోకాలంకారులైన నర నారీమణులు బ్రార్థితులు. సాధారణ సంవత్సరమున బరమేశ్వరుడందరికినీ శాంతి సౌఖ్యములను ప్రసాదించును గాక".

తాను గురజాడ అప్పారావు గారికి మొదట్లో రాసిన లేఖలలో ఆయన వాడుక భాషతో పాటుగా అవసరం అయిన చోట్ల గ్రాంధిక భాషను కూడా ఉపయోగిస్తే బాగుంటుందని ఒక అభిప్రాయం వెలిపుచ్చుతారు కాశీనాధుని. 1938లో తన ఆఖరు రచన ఆ యేడాది ఉగాది సంచికలో వెలువరించి అందులో గురజాడ ఆశించిన వాడుక భాష నిలదొక్కుకున్నదని సంతోషం వెలిపుచ్చుతారు. 'ఆంధ్రుల సాహిత్య, కళా, మత, సాంఘిక రంగములందు చిరకాలాగతములైన పూర్వచారములను, నిర్బంధ నిర్మాణములను విసర్జించి నవీన మార్గములను అవలంబించిన విధమును కావ్యములు, గీతములు, విమర్శనములు, పరిశోధనములు, చరిత్రాంశములు విశదము చేయుచున్నవి. సాహిత్యమునందు కలిగిన అపారమైన వికాసమును, ప్రచురితమైన కావ్యములు, గీతమూ విశదము చేయుచున్నవి. నవీన రచనలు ప్రజాదరణను బడయుచున్నవి. ముప్పదేండ్లకు పూర్వము, పరిహార పాత్రములైన అప్పారావు గారి ముత్యాల సరములు నేడు ప్రజాదరణకు పాత్రములగుచున్నవి. ప్రాత పద్ధతులను, కొత్త రీతులను

కన్యాశుల్కం నాటకంలో గురజాడ ఎందరో ఆనాడు సాంఘిక ప్రముఖుల పేర్లు కూడా తన నాటకంలో పేర్కొంటారు. వారిలో రెంటాల వెంకట సుబ్బారావు ఒకరు. గిరీశం, వెంకటేశానికి మొదటి అంకంలో డిక్టేషన్ ఇచ్చిన పుస్తకాల్లో 'రెంటాల వెంకట సుబ్బారావు మేడ్ ఈజీ' అని ఒక పుస్తకం పేరు వస్తుంది. ఈ రెంటాల వెంకటసుబ్బారావు నిజంగానే మదరాసులో ఆనాటి గైడ్లుగా చలామణి అయ్యే పుస్తకాలను "మేడ్ ఈజీ"లుగా ప్రచురిస్తూ మంచి స్థితిలో ఉన్నారు. వారికి ఆ కాలంలో మదరాసులో ఒక అధునాతమైన ఫొటో స్టూడియో కూడా ఉండేది. వీరి మేనకోడలు అయిన రామాబాయమ్మను, కాశీనాథుని నాగేశ్వరరావు వివాహం చేసుకున్నారు.

తెలుగు ప్రాంతం కాని చోటి నుంచి తెలుగు పత్రిక ప్రచురించడం రాన్రానూ కష్టసాధ్యం అవుతున్నదని తలంచి తన పత్రికా సంస్థను మదరాసుకు మార్చి వార పత్రిక మొదలుపెట్టిన ఆరేళ్లలోనే కాశీనాథుని నాగేశ్వరరావు దినపత్రికను కూడా మొదలుపెట్టారు. ఈ దినపత్రికకు, తొలి సంపాదకులుగా స్వాతంత్ర్య సమరయోధులు గాడిచర్ల హరి సర్వోత్తమ రావుగారిని ఎంచుకుని తన మద్దతును స్వాతంత్ర్య పోరాటానికి తెలియచెప్పారు. 1924లో మొదలై తెలుగు వారి అగ్రగామి సాహిత్య పత్రికగా వెలుగొందిన భారతి కూడా ఆంధ్ర పత్రిక సంస్థ నుంచే వచ్చింది. కాశీనాథుని నాగేశ్వరరావు తన జీవిత కాలం 'ఆంధ్ర హరిజన సేవా సంఘాని'కి అధ్యక్ష హోదా లో సంఘ సంస్కరణకు మొదటి వరుసలో నిలిచారు. 'ఆంధ్ర గ్రంథ మాల' ప్రచురణల ద్వారా ఎన్నో ప్రాచీన, నవీన రచనలను వెలుగు లోకి తెచ్చారు. గాంధీజీ భారత స్వాతంత్ర్య సంగ్రామంలో తనవాణి వినిపించడానికి ముందరే 1914లోనే అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్‌కు భారత స్వాతంత్ర్యం నిమిత్తమై ఎస్.సుబ్రహ్మణ్య అయ్యర్ ద్వారా పంపిన ఒక సామూహిక వినతిపత్రంపై మదరాసు ప్రముఖులతో పాటుగా తనూ సంతకాన్ని చేసిన స్వాతంత్ర్య అభిలాషి కాశీనాథుని నాగేశ్వరరావు. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా జైలుకు వెళ్లి ఆ జైలు నిర్బంధఇం కాలంలో భగవద్గీతను తెలుగు అనువాదం చేసిన స్థిమిత మనస్కుడు ఈయన.

ఆంధ్ర పత్రిక సంస్థ తన పత్రికలలో సదా ప్రగతిశీల, సంస్కరణ భావ రచనలను ప్రోత్సహిస్తూ ఉండేది. ఆ రచయితలలో బ్రాహ్మణ ఆధిక్యానికి విరుద్ధమైన చింతన గల కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి రచనలు

విశ్వ కళా పరిషత్ 'కళా ప్రపూర్ణ' సమర్పించి గౌరవించింది.

గురజాడ జీవితులై ఉన్న కాలంలోనే గిడుగు రామమూరిత (1913లో), తాపీ ధర్మారావు (1911లో) వాడుక భాష అవసరం గురించి ఆంధ్ర పత్రికలో స్పష్టంగా తమ అభిప్రాయాలను తెలియపరిచారు. ఆంధ్ర పత్రిక ప్రచురణలలో ఆది నుంచీ తమ సాహిత్య ప్రాధాన్యత గల సంస్కరణ వాద, ప్రభోదాత్మక, సామాజిక చింతనాశీల రచనలు పంపి తమ సమకాలీన వాణిని వినిపించిన వారిలో అలనాటి ప్రముఖులు ఎందరో ఉన్నారు. వారిలో కొందరు కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, చెళ్ళపిళ్ల వెంకటశాస్త్రి, గిడుగు రామమూర్తి, కొక్కండ వెంకటరత్నంపంతులు, ఆదిభట్ల నారాయణదాసు, జలసూత్రం రుక్మిణినాధశాస్త్రి, తాపీ ధర్మారావు, మామిడన్న కామేశ్వరమ్మ, బసవరాజు అప్పారావు, దువ్వూరి రామిరెడ్డి, ఉన్నవ లక్ష్మీనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, చింతా దీక్షితులు, శ్రీశ్రీ, వేలూరి శివరామశాస్త్రి పానుగంటి లక్ష్మి నరసింహరావు మున్నగువారు ఉన్నారు.

ఇవాల్టి డిజిటల్ కంపోజింగ్ లేజర్ టైప్ సెట్టింగ్ రోజుల్లో చాలా నెమ్మది అయిన వందేళ్ళకు ముందరి ముద్రణా సాంకేతిక సౌకర్యాలతో తెలుగు వారి తొలి పత్రికగా నిలబడ్డ ఇరవయ్యో శతాబ్దపు ఆధునికతకు నిలువెత్తు రూపం మన ఆంధ్ర పత్రిక. అప్పటి గాల్లీలూ, ప్రూఫులూ, అచ్చు కేసులూ, జింకో బ్లాకులూ వగైరాలతో తయారై తెలుగు వారిని పలకరించిన ఆంధ్ర పత్రిక ఏ పాత సంచిక చేతిలోకి తీసుకున్నా ఒకసారి అప్పటి సంచిక డిజిటల్ ప్రతి చూసినా మన తాతల కాలం వారి ఫొటో ఏదో చూసిన చేతిలోకి తీసుకున్న భావన కలుగుతుంది. కనుమరుగు అయినంత మాత్రాన మన తాతలను ఎలా గౌరవించడం, సంస్మరించడం మానుకోమో అలానే కాశీనాథుని నాగేశ్వరరావు గారు తెలుగు వారికి ఇచ్చిన మహా చైతన్య భూమిక ఆంధ్ర పత్రిక జ్ఞాపకాలు కూడా. వందేళ్ల జర్నలిజం ప్రగతి యాత్ర ఇదిగో ఇక్కడ మొదలు అయింది అని మనం గుర్తు చేసుకోడానికి భావితరాల వారికి తెలియచెప్పడానికి ఆంధ పత్రిక 1914 ఈ ప్రయాణంలో మొదటి మైలు రాయి. అలా పత్రికలకు శంకుస్థాపన చేసిన దార్శనికుడు, సామాజిక శుభాన్ని అందులో పత్రికల పాత్రను వాస్తవం చేసిన ఆధునికుడు దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు. ఒకప్పటి జర్నలిజపు వైభవాల ఆంధ్రపత్రిక ఎప్పటికీ తెలుగు సమాజంలో నిలిచి

కాల్పనికేతర కథనానికి తొలిసారి నోబెల్

జోసెఫ్ బ్రాడ్ స్కీ (1987) తరువాత తిరిగి రష్యన్ భాషలో రాసే ఒక సాహిత్య కారిణిగా నోబెల్ బహుమతి అందుకున్న రచయిత్రి స్వెత్లానా అలెక్సేవిచ్. ఈ సాహిత్య బహుమతి పొందిన పద్నాలుగో మహిళ కావడం ఒక సాధారణ గణాంకమే అయినా, ఈ బహుమతి ప్రదానంలో నోబెల్ సాహిత్య పురస్కార కమిటీ ఒక కొత్త ఒరవడిని మొదలు పెట్టింది. అది పాత్రికేయ రచనలకు, సాహిత్యం విభాగంలో నోబెల్ బహుమానాలు ఇవ్వడం. "పాత్రికేయ రచయిత్రి స్వెత్లానా అలెక్సేవిచ్" అనే ప్రపంచ దేశాల పత్రికలు ఈమె గురించి రాస్తున్నాయి.

1950లో పాశ్చాత్య తత్వవేత్త బెర్ట్రాండ్ రస్సెల్, 1953లో తన రెండో ప్రపంచ యుద్ధ అనుభవ సంచయ రచనా సమాహారం "ద గేదరింగ్ స్టార్మ్"కు విన్ స్టన్ చర్చిల్, ఈ ఇద్దరు మాత్రమే, కాల్పనికేతర రచనలకు గాను ఈ బహుమతి గతంలో పొందిన వారు. ఈ రెండు సందర్భాలు తప్పిస్తే కల్పనా సంపన్నత లేని రచనలను ఈ శతాబ్దాధిక చరిత్రలో, ఏ నోబెల్ సాహిత్య బహుమతి పురస్కార సంఘమూ, పరిగణనలోనికి తీసుకొనలేదు. బహుమతికి నామినేట్ చేసిన రచయితల పేర్ల లోంచే ఎంపిక చేస్తారు కనుక, కాల్పనికేతర రచనలు చేసేవారి పేర్లు, ఈ వంద పైచిలుకు వత్సరాలలోనూ ఈ సాహిత్య నోబెల్‌కై ప్రతిపాదించబడలేదు అన్నది కూడా తేటతెల్లంగా తెలుస్తున్నది.

జర్నలిస్ట్ స్వెత్లానా అలెక్సేవిచ్ అంటూ ఒక పక్కనుంచి అంటూనే ఈమెను సాహిత్య సృజన శీల రచయిత్రిగా పరిగణించడంలోనే, ఈ ఏడాది నోబెల్ కమిటీ, సాహిత్య నోబెల్‌కై అర్హులైన వారిని ఎంపిక చేసే కొలమానాలను, సాహిత్య రచనల పరిధి (కవిత్వం, కథ, నవల, నాటకం) నుంచి పెంచి, కాల్పనికేతర, పాత్రికేయ రచనలకూ విస్తరించడం వల్లనే, ఈ ఎంపిక సాధ్యమైంది. పాత్రికేయ స్వభావం గల ఉన్నత స్థాయి, ఉత్తమ కథనాలకు, మనకు తెలిసి, ప్రసిద్ధమైన అంతర్జాతీయమైన బహుమతులుండనే ఉన్నాయి.

అయినా ఒక్కో పుస్తకానికి అయిదు వందల నుంచి, ఏడు వందల మందిని ఇంటర్వ్యూ చేస్తానని, వారి కథనాలకు అక్షర రూపం ఇచ్చి రచనగా నిలబెడతానని తన మాటల్లో చెప్పిన ఈమె, కావాలనే, ఎంచుకున్న సామాజిక విషయాన్ని, కల్పనా శిల్పంలో ఇమడ్చకుండా, ఇలా జనాభిప్రాయాలుగా, జనానుభవాలుగా సంకలనం చేసే కథన రీతిని ఎంచుకున్నది. ఇది పత్రికా రంగ తక్షణ కథనాలకు అమరినట్టుగా, సాహిత్య రచనలకు అమరదు. ఉత్తమ చిత్రణ, అనుకూల, ప్రతికూల పాత్రలు, భావావేశాల ఘర్షణ, సామాజిక సన్నివేశంలోని తీవ్రతల పట్ల ఒడుపైన రచయిత వ్యాఖ్యాన నైపుణ్యంగా, ఎక్కడా కనిపించకుండానే స్వెత్లానా అలెక్సేవిచ్ రచనలుంటాయి.

సాహిత్య స్వభావం లేని కథనాలకు, పాత్రికేయ గరిమ ఉన్నంత మాత్రాన, ఒక అంతర్జాతీయ ప్రఖ్యాతి గల సాహిత్య బహుమతి ప్రకటించవచ్చునా అన్న ప్రశ్న ఇక్కడ వేయాల్సి వస్తుంది. అయితే 1917లో సోవియట్ విప్లవం నుంచి, వర్తమానం దాకా, ఇరవయ్యో శతాబ్దంలో, బహు జటిలమైన సాంఘిక, రాజకీయ పరిణామాలను ఎదుర్కున్న రష్యా దేశపు పౌరురాలిగా స్వెత్లానా తన నిరుపమాన నిరసన స్వభావాన్ని, రాజ్యమూ, పౌరుల మధ్య రచయిత్రిగా నిలబడి నమోదు చేసింది. ఈ రచనల్లో మొదటి రచన నుంచే ఆమె వలసలు పోతున్న, నిర్వాసితులవుతున్న ప్రజల పక్షాన నిలబడ్డది. "మేం పల్లెనొదిలేసాం" అన్న తొలి బహు స్వరాత్మక రచనలో, గ్రామీ

గొప్ప ఆదర్శాల పునాదులపై మొదలయిన సోవియట్ రాజ్య వ్యవస్థ, దశాబ్దాలు గడుస్తున్న కొద్దీ, కఠిన చట్రంగా మారిపోయి, ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిన దశను కళ్ళారా చూసిన తరాలకు చెందిన రచయిత్రి స్వెత్లానా అలెక్సేవిచ్. ఎర్ర రాజ్యంపై అయిదు పాత్రికేయ కథనాల రచనలు తన ముప్పయి అయిదేళ్ళ రచనా జీవితంలో చేసినందుకు, తగు గుర్తింపుతో బాటు దూషణ, తిరస్కారాలను పొందింది. ఈ రచనలన్నిటిలో ప్రధాన లక్షణం, డాక్యుమెంటరీ చిత్రణ, న్యూస్ రీల్ పని, వార్తా స్రవంతి వలె విషయాన్ని అమర్చడం.

ణులు ఇలాంటి నిర్ణయాలు తీసుకునేలా దారి తీసిన పరిస్థితులను వివరించింది. "అన్ వుమన్లీ ఫేస్ ఆఫ్ ఎ వార్" అన్న ఆమె 1985 నాటి రచన, రెండో ప్రపంచ యుద్ధంలో, యుద్ధ రంగాల్లో పాల్గొన్న అప్పటి పదిహేను- ముప్పై ఏళ్ల వయస్కులైన రష్యన్ వనితలను ఇంటర్వ్యూలు చేసి, వారి జీవన కథనాలను, వారి మాటల్లోనే ఒక్కచోట చేర్చిన రచన. అప్పట్లోనే, "యుద్ధం స్త్రీ ప్రకృతికి విరుద్ధం" పేరిట దీనికి తెలుగు అనువాదం కూడా వెలువడింది. ప్రపంచ భాషల్లోకి అనువాదం జరిగాక, ఈ రచన రెండు మిలియన్ల ప్రతులు అమ్ముడు పోయింది.

గొప్ప ఆదర్శాల పునాదులపై మొదలయిన సోవియట్ రాజ్య వ్యవస్థ, దశాబ్దాలు గడుస్తున్న కొద్దీ, కఠిన చట్రంగా మారిపోయి, ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోయిన దశను కళ్ళారా చూసిన తరాలకు చెందిన రచయిత్రి ఈమె. ఎర్ర రాజ్యంపై అయిదు పాత్రికేయ కథనాల రచనలు, తన ముప్పయి అయిదేళ్ళ రచనా జీవితంలో చేసినందుకు, తగు గుర్తింపుతో బాటు దూషణ, తిరస్కారాలను పొందింది. ఆ అయిదు పుస్తకాలు ఇవి. 1. ద లాస్ట్ విట్నెసెస్ - ద బుక్ ఆఫ్ అన్ చైల్డ్ లైక్ స్టోరీస్. 2. జింకీ బాయ్స్ - సోవియట్ వాయిసెస్ ఫ్రమ్ ద అఫ్ఘానిస్థాన్ వార్, 3. ఎంఛాంటెడ్ విత్ డెత్, 4. ద చెర్నోబిల్ ప్రేయర్ - ఎ క్రానికల్ ఆఫ్ ఫ్యూచర్, 5. ఎ సెకండ్ హేండ్ టైమ్. ఈ రచనలన్నిటిలో ప్రధాన లక్షణం, డాక్యుమెంటరీ చిత్రణ, న్యూస్ రీల్ పని, వార్తా స్రవంతి వలె విషయాన్ని అమర్చడం.

ఇది ఉత్తమ సాహిత్య లక్షణం కాదని చెప్పిన విమర్శకులున్నారు. ఈ విషయాల సామాజిక ప్రాముఖ్యత, గంభీరత, పత్రికా కథనాల రూపంలో తేలిపోవడం, సాహిత్య శిల్ప పద్ధతుల్లోకి రాదు, తద్వారా, ఒక పాఠక లోకపు మర్యాదలను పొందే దీర్ఘ కాలిక విలువను పొందదు, చదివించే లక్షణాన్నీ సంతరించుకోదు అన్న విమర్శనాత్మక అభిప్రాయాలున్నాయి. చెర్నోబిల్ పై పాత్రికేయ కథనాలు అక్కడి విషాదాన్ని తెలుపగలిగినా, అవి సాహిత్య స్థాయికి ఎదగవు. నిజానికి 1988లోనే, చెర్నోబిల్ అణు ప్రమాదం జరిగిన రెండేళ్లకే, వొలాదిమిర్ యావొరివ్ స్కీ, నవలిక "మేరియా అండ్ ద వర్మ్ వుడ్ ఎట్ ద ఎండ్ ఆఫ్ ద సెంచురీ" ఆంగ్లానువాదం, సోవియట్ లిటరేచర్‌లో వెలువడ్డది.

ఇక యుద్ధం గురించిన నవలలు రష్యన్ సాహిత్యంలో, సాహిత్య విలువలతో రాజీ పడకుండా చాలా వచ్చాయి. వాటిలో భాగంగా, నికోలాయి ఆస్ట్రోవ్ స్కీ నవల "హౌ ద స్టీల్ వజ్ టెంపర్డ్" వెలువడ్డది. సోవియట్ యుద్ధ కవిత్వంలో సైతం మహిళలు కవిత్వ రచన చేసారు. రెండో ప్రపంచ యుద్ధ కాలపు స్త్రీల, పిల్లల జ్ఞాపకాలూ, అనుభవాలుగా, స్వెత్లానా అలెక్సేవిచ్ నమోదు చేసిన యుద్ధ బీభత్సం కూడా సాహిత్య స్థాయిని సంతరించుకోకుండానే ఆగిపోతుంది.

మానవ నాగరికతలో మనం ఎరిగిన రెండు వేల ఏళ్లలో మొదటి సారిగా, శ్రామికుల శ్రేయోదాయక రాజ్యం, సమ సమాజం నిర్మాణం పేరిట, ఇరవయ్యో శతాబ్దంలో రష్యాలో పరిపాలనకు వచ్చింది. ఇతర దేశాలలోని, అంతకు ముందరి పాలక వ్యవస్థలతో (మతం, పెట్టుబడి, ఆధిపత్య రాజ్య నమూనాలతో) పోటీ పడింది. ఈ క్రమంలో ప్రపంచ వ్యాప్త వామపక్షాల పరిణామ క్రమం పలు కుదుపులకు లోనై, యూరప్‌లో రాజ్యాధికారాన్ని పోగొట్టుకున్న చరిత్ర, రష్యన్ ప్రజలకు స్వంతమైన సంక్షోభ ఘట్టం. ఈ నేపథ్యంలో ప్రజల పక్షాన నిలబడిన వ్యక్తిగా, రాజ్యపు ఆధిపత్య ధోరణులకు నిరసనగా, బహుస్వరాత్మక కథనాలను పుంఖానుపుంఖాలుగా వెలువరిస్తూ వచ్చిన స్వెత్లానా అలెక్సేవిచ్, సృజన అక్కరలేని పాత్రికేయ స్వభావమున్న తన రచనలతో, సృజనకు పట్టం కట్టే సాహిత్యవిభాగంలోకి నోబెల్ గ్రహీతగా చొచ్చుకురావడం లేవదీసే ముఖ్యమైన ప్రశ్నల్లో ఇదొక్కటి. వర్తమాన రచయితలు, సాహిత్య సృజన సంపన్నతను క్రమేపీ కోల్పోతున్నారా?

ఇక పడమటి దేశాల నిర్వహణలో ఉన్న నోబెల్ సంఘం, ఈ బహుమతిని ముఖ్యంగా సాహిత్య నోబెల్‌ను వామపక్ష వ్యతిరేకులూ, అసమ్మతి వాదులకు ఇవ్వడం సర్వ సాధారణం. ఈ ఏడాది నోబెల్ బహుమతీ అందుకు భిన్నంగా లేదు.

n రామతీర్థ

నవ చైతన్య నక్షత్ర రేవతి

ఇరవై ఒక్క ఏళ్లకే పెళ్లి అవడం, 1930ల్లో పెద్ద విశేషం కాదు కానీ, అలా పెళ్లి అయిన సగటు మధ్యతరగతి యువ దంపతులు ఏవో తమకున్న జ్ఞానంలో, కొన్ని ప్రేమ పలుకులు పలుక్కోవడం ఎవరైనా ఊహించే విషయం. వీటినే స్వీట్ నథింగ్స్ అని కూడా అనుకోవచ్చు. అయితే, తన 19వ ఏటనే ఒక అచ్చయ్యే కథ రాయగల వ్యక్తి, ఈ భర్త అయితే, ఈ కొత్త కాపురం ఎలా ఉంటుంది? దానికి తోడు ఆయన అప్పటికే, ఎక్కువ జీతం వచ్చే రాయల్ ఇంజనీర్స్ ఆఫీసులో గుమాస్తా ఉద్యోగాన్ని వదులుకుని, తక్కువ జీతానికి బతకడానికి సిద్ధపడుతున్న బడి పంతులు కావడం కోసం తండ్రికి ఇష్ట ం

లేక పోయినా, సెకండరీ గ్రేడ్ టీచర్ ట్రైనింగ్‌లో చేరిన మొండివాడు కూడా. అయితే, ఇదేదో మామూలు దాంపత్యం వలె ఉండే అవకాశాలు ఇంకా తక్కువ. తరుణ వయస్సులో వేదాలు చదువుకుందామని కొన్ని విఫల యత్నాలూ, ఆత్మహత్య చేసుకుందామని తీవ్ర ఆలోచనలూ చేసినవాడు అయితే, ఆంధ్ర దేశపు ఒక కొసన, పల్లెల్లో, చిన్న టౌన్‌లలో తన ఇరవయ్యేళ్ళ జీవితం గడిపిన యువకుడైన ఈ భర్త, అప్పుడే స్వాతంత్ర్యం దిశగా అడుగులేస్తున్న దేశంలో ఒక పౌరుడిగా ఇతను చెప్పిందే ఎందుకు గమనార్హం అవుతుంది? ఎంతమంది యువతీ యువకులు భార్యభర్తలుగా ఆ కాలంలో లేరు? ఆ యువకుడు కథల బలరామారావు అయితే, ఆయన ఒక కలం వంటి నాగలి, నాగలి వంటి కలం పుచ్చుకు బయలుదేరితే, ఇంట గెలిచి రచ్చ గెలవడం ఒక సహజ పరిణామం అవుతుంది. ఆయన రామారావు, ఆయన భార్య సీతా మహాలక్ష్మి కావడం ఎంత కాకతాళీయమో, అంతే కాకతాళీయం, ఆయన కాళీపట్నం రామారావు కావడం, ఆయన జన్మ నక్షత్రం రేవతి కావడం.

1946 మార్చి 19న మాస్టారి వివాహం సీతామహాలక్ష్మితో అయింది. అయితే, మార్చి నెల చిత్రాంగి పత్రికలో, కాళీపట్నం రామారావు రాసిన 'రేవతి నుంచి' అనే కథ అచ్చు అయింది. రేవతి, సీతకు రాస్తున్న ఉత్తరాలు ప్రధాన విషయమైన ఆ నాలుగు కథలు రేవతి నుంచి (మార్చి, 1946), రేవతి నుంచి దూరదృష్టి (1946 అక్టోబర్), రేవతి నుంచి నవ చైతన్యం (1947

ఇవాళ కారా మాస్టారి 92వ ఏట, ఆ పల్లెలు అలా లేవు. రేవతి రాసిన ఉత్తరాలు అందుకున్న సీత లేదు. అయినా కథల బలరాముడి 'రేవతీ', ఆయనకు ఎన్నో కారా కిల్లీలు బాధ్యతగా తెచ్చివ్వడంతో బాటు కుటుంబ బాధ్యతను నడిపిన గృహిణి 'సీతా' కారాక్షరాల సరస్వతిలో శాశ్వత ప్రాణప్రతిష్ఠ పొందాయి. 92 ఏళ్ల కాలగవాక్షంగా తన జీవితం ప్రజల పక్షం అయిన మనకాలపు ధీరుడు, మన సాహిత్య యోధుడు, కారాకు జన్మదిన శుభాకాంక్షలు.

మే), రేవతి నుంచి తల్లుల ప్రేమ (1948 ఏప్రిల్) చిత్రాంగి పత్రికలో ముద్రితాలు. కారా గారిని ఇంటర్వ్యూలో ఈ విషయం అడగగా ... 'పెళ్లి కూతురు సీత పెళ్ళికి ముందరే తెలుసా' అని, 1946 మార్చిలో వివాహం కాగా, అదే నెల పత్రికలో, మీరు రేవతి నుంచి, అంటూ సీతకు ఒక కథాత్మక లేఖా సంఘటన, రచనగా రాసారు. అంటే 1946 మార్చికి ముందరే మీరు ఆ పత్రికకు పంపి ఉండాలి కదా (అంటే సీతా మహాలక్ష్మిగారు మీకు పెళ్ళి అయిన మార్చికి ముందరే పరిచయం, పెళ్లి మాటలు అవుతూ ఉండి ఉంటాయి) అన్న పరిశీలనకు, జవాబు స్పష్టం చేయకుండా ఒక మాస్టారు మార్కు నవ్వు నవ్వారు. ఇలా ఈ సీతారాముల సమాజ ముచ్చట్లు కారా యవ్వన జీవితంలో ఒక భాగం. అయితే ప్రశ్న అంతా రేవతి పేరుతో ఎందుకు రాశారు అని అడిగినప్పుడు మొదలయ్యింది. ఎందుకంటే, రేవతి పేరుతో అప్పటికి 1890లో ఒడియా భాషలో తొలి కథగా గుర్తించబడి 'రేబతి' కథను, మన గురజాడతో సమాన గౌరవాలు ఒరియా సాహిత్యంలో కలిగిన ఫకీర్ మోహన్ సేనాపతి రాశారు. ఆ విషయం ఏమైనా తెలిసి ఉండి, యువకుడైన కాళీపట్నం, 'రేవతి నుంచి', అనే శీర్షికను ఎంచుకున్నారా అని అడగగా, అప్పటికా కథ సంగతి నాకు తెలియదు. అలా 'రేవతి నుంచి' అని రాయడానికి, కారణం రేవతి నా జన్మ నక్షత్రం అని కారా తెలిపారు.

నిరలంకార వచనం ద్వారా నిజాన్ని సహజంగా కథ చెప్పడం, యువకుడైన కాళీపట్నం అలవర్చుకున్న రచనా సంస్కారంగా ఆ కథలు తెలియ చెప్తాయి. నిజానికి ఈ నాలుగే కాదు, తన తొలి దశలో రాసిన కథల్లో, కారాగా ఎదగబోయే ఈ పల్లెటూరి యువకుడిలో, ఒక ఆలోచనాపరుడు, నిగర్వి, తన పనేదోతాను చూసుకుంటూ, ఈ సమాజం ఇలా ఎందుకు ఉంది అని తర్కించి చూసుకునే లక్షణశీలి కనిపిస్తారు. ఈ తర్క సహాయంతో జీవితాన్ని అర్థం చేసుకోవడానికి కారా తన జీవితం అంతా సాధన చేస్తూనే ఉన్నారు.

'ప్లాట్ ఫారమో' అన్న (1943)నాటి కథతో మొదలై, 'జన నిష్ఠురులు' (1948) దాకా ఈ యువ రచయిత రాసిన 23 కథలు, ప్రత్యేకంగా పరిశీలిస్తే, ఈయన అంతరంగానికి కొన్ని తాళం చెవులు దొరుకుతాయి. ఆ మట్టిలోని తాత్విక దృక్కోణాల బీజాలు తరచి చూస్తే, 'ఏమిటీదంతా' అద్దం తిరిగిన చరిత్ర ' 'ఇంతా చేస్తే' వంటి లఘు రచనల్లో దాగిన బ్రహ్మాండ రూపాలుగా గోచరిస్తాయి. 'రేవతి నుంచి' అనే మాటకి కళింగాంధ్ర ప్రాంతపు ఒరియా, తెలుగు సాహిత్యంలో, అది కారా మాస్టారి జన్మనక్షత్రం కావడం కన్నా విశేష ప్రాసంగికత, ప్రాధాన్యత ఉన్నాయి. అది ఇద్దరు రచయితలు అటు ఫకీర్ మోహన్, ఇటు యువకుడైన కారా ఇద్దరూ స్త్రీ చైతన్యస్ఫోరకంగా, ఈ పేరు ఉపయోగించి రచనలు చేయడం. 'రేవతి నుంచి తల్లుల ప్రేమ' అనే కథ ఈ పరంపరలో ఆఖరుది ఆ కథలో ఆఖరు వాక్యాలు ఇవీ - 'దేశం ఎప్పుడు మారుతుందో తెలియదు. స్వతంత్రం వచ్చేసిందని ఉత్సవాలయితే చేసేసుకున్నాం కానీ - మన విజ్ఞానం అభివృద్ధి అయి మానసిక వికాసం ఆరంభమయ్యే వరకు, ఏమి వచ్చినా లాభం లేదు, వుంటాను'. ఇవాళ కారా మాస్టారి 92వ ఏట, ఆ పల్లెలు అలా లేవు. రేవతి రాసిన ఉత్తరాలు అందుకున్న సీత లేదు. అయినా కథల బలరాముడి 'రేవతీ', ఆయనకు ఎన్నో కారా కిల్లీలు బాధ్యతగా తెచ్చివ్వడంతో బాటు కుటుంబ బాధ్యతను నడిపిన గృహిణి 'సీతా' కారాక్షరాల సరస్వతిలో శాశ్వత ప్రాణప్రతిష్ఠ పొందాయి. 92 ఏళ్ల కాల గవాక్షంగా తన జీవితం ప్రజల పక్షం అయిన మనకాలపు ధీరుడు, మన సాహిత్య యోధుడు, కారాకు జన్మదిన శుభాకాంక్షలు.

n **రామతీర్థ**

(రేపు కాళీపట్నం రామారావు 92వ పుట్టినరోజు)

మానవ వికాస నవలా రచయిత్రి హార్పర్ లీ

నివాళి

రాసింది జీవితకాలంలో ఒక నవల, అది యాభై ఆరేళ్ల కిందట. నెమ్మదిగా ప్రాచుర్యంలోకొచ్చిన ఈ నవల 'టు కిల్ ఎ మాకింగ్ బర్డ్' ప్రపంచ భాషల్లో నలభై మిలియన్ల ప్రతులకుపైగా అమ్ముడు అయింది. నైతికవిద్యలో భాగంగా పాశ్చాత్య బాలబాలికలు బైబిల్‌తోపాటు ఈ నవలను కూడా చదవాలని బ్రిటిష్ లైబ్రేరియన్లు సూచించారు. అమెరికాలో రంగు తేడాతో మనుషులను నీచంగా చూడడం ఒక కఠోర వాస్తవం.

అలాంటి వర్ణ వివక్షల దక్షిణ ప్రాంత అమెరికాలో, ఒక ఊహాగ్రామం, మెకోంబ్‌లో ఈ కథ నడుస్తుంది. పెద్దగా నలుగురిలో తిరగడం, పేరు ప్రఖ్యాతులకై పాటుపడటం ఈమె స్వభావానికి సరిపడవు. 1960లో ఈ నవల రాసినప్పుడు రచయిత్రి వయసు ఇరవై ఆరేళ్లే. తరువాత ఎన్నో అవార్డులు అందుకున్నా, తాను ఏమీ మాట్లాడనన్న షరతుపైనే ఆమె ఆ సభలకు వెళ్లేది. తాను చెప్పిందల్లా ఒక్క థాంక్యూ మాత్రమే! అచ్చు అయ్యాక ఏకంగా 81 వారాలపాటు బెస్ట్ సెల్లర్‌గా ఈ నవల పుస్తకాల షాపుల్లో అమ్ముడుపోయింది. వెంటనే పులిట్జర్ బహుమతి కూడా ప్రకటించారు. 1962లోని సినిమాగా వచ్చి, కథానాయిక పాత్రలో గ్రిగరీ పెక్, నటనకు లోకం జేజేలు పలికింది.

1964 వరకూ ఈ ముఖాముఖీ కార్యక్రమాలు, గౌరవాలు స్వీకరించిన రచయిత్రి ఆ తరువాత ఇటువంటి ప్రజా సంబంధ కార్యక్రమాలకు దూరంగా వెళ్లింది. 1995లో తన ధోరణి గురించి వివరించిందిలా : 'పుస్తక పరిచయ సభలు, ఉన్న సరదా కాస్తా చెడగొడతాయి. ఏముందో పుస్తకంలో అనే కుతూహలాన్ని చంపేస్తాయి. ఉత్కంఠను దెబ్బ తీస్తాయి. ఈ పరిచయ సభల వల్ల ఉపయోగం ఏమన్నా ఉందంటే పుస్తకానికి లభించే స్పందన ఘాటును కొన్నిసార్లు ఆలస్యపరుస్తాయంతే! మాకింగ్ బర్డ్ నవల ఏం చెప్పాలో ఇప్పటికింకా చెప్తూనే ఉంది, పెద్దగా పరిచయ హడావిడి లేకుండానే. ఆ పుస్తకం ఇన్నాళ్లూ మనగలిగింది.'

ఈ రచయిత్రిని ఎక్కువగా సంతోషపరచిన గౌరవాలు ఏమిటంటే, 2001లో షికాగో నగర మేయర్, నగర సన్మానంగా ఒన్ సిటీ, ఒన్ బుక్ గౌరవానికి 'టు కిల్ ఎ మాకింగ్ బర్డ్' పుస్తకాన్ని ఎంపిక చేయడం. నోట్రేడేమ్ విశ్వవిద్యాలయం ఆమెకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయడం. ఆ విశ్వవిద్యాలయ విద్యార్థులందరూ, ఆ పుస్తక ప్రతులని తమ చేతుల్లో పట్టుకుని, ఆమెకు లేచి నిలబడి అభివాదం చేశారు. 2007లో 'ప్రెసిడెంట్ మెడల్ ఆఫ్ ఫ్రీడం' ఈ నవలకుగాను, హార్పర్ లీ, జార్జ్ బుష్ చేతులమీదుగా అందుకుంది. ఇది క్లుప్తంగా గౌరవాల జాబితా. ఈ రచయిత్రి ఈ ఏడాది ఫిబ్రవరి 19న కన్ను మూసినప్పుడు, సాహిత్య ప్రపంచం నివాళులు వెల్లువెత్తాయి.



'టు కిల్ ఎ మాకింగ్ బర్డ్' కథ చాలా సున్నితమైనది. సరళమైనది. ఆ దక్షిణ అమెరికా వర్ణ వివక్షల గ్రామంలో 1933–35 ప్రాంతాల కథగా నడుస్తుంది. ఇద్దరు పిల్లలు జెమ్, స్కౌట్‌లతో ఆ పెద్ద గ్రామం/ టౌన్‌లో నివసిస్తుంటాడు. భార్యను కోల్పోయిన అట్టికస్ ఫించ్ పిల్లల ఆటపాటలు, వారికి కనిపించకుండా బహుమతిలిచ్చే ఎప్పుడూ ఇతరులకు కనిపించకుండా ఇంటిపట్టునే ఉండే విదూరమైన జీవితం గల మరొక నల్ల జాతీయుడు బూ రెడ్లి. పిల్లలకు ఎయిర్ గన్‌లు ఆటవస్తువులుగా ఇచ్చి, వాటితో మాకింగ్ బర్డ్ వంటి అమాయక పక్షులను చంపరాదు మీ ఆటల్లో అని చెప్పే తండ్రి అట్టికస్. ఇలా ప్రారంభ కథనాలనుంచి, కథ నిజమైన మలుపుకొచ్చేది న్యాయమూర్తి టేలర్, తెల్లజాతి అమ్మాయి మానభంగం కేసులో ముద్దాయి అయిన టామ్ రాబిన్సన్ తరఫున న్యాయవాదిగా వ్యవహరించమని అట్టికస్‌కు ఆ కేసు అప్పగించడం దగ్గర. తెల్లజాతీయుల సంఖ్య అధికంగా ఉన్నా ఆ ఊళ్లో ఎవరికీ అట్టికస్ ఒక నల్లవాడి తరఫున న్యాయవాదిగా కేసు పుచ్చుకోవడం గిట్టదు. ఇందువల్ల అట్టికస్ కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటుంది. కొత్త సంవత్సరం వేడుకలకు సైతం తెల్లవాళ్ల చర్చిలోకి వీరిని రానివ్వమన్న సంకేతాలుండగా అట్టికస్ అతని పిల్లలు, వారి స్నేహితుడు డిల్ అందరూ, నల్లవాళ్ల చర్చిలో ఎంతో ఆదరాన్ని పొంది తమ వేడుకలను అక్కడ జరుపుకుంటారు.

తీరా కేసు విచారణ అయ్యేలోపే తెల్లజాతి యువకులు, నిందితుడిపై దాడి చేయయత్నిస్తారు. అట్టికస్ పిల్లలు, స్నేహితుడు కలిసి విచారణ సమయంలో మానభంగ నేరం మోపిన తండ్రి, కూతుళ్లు బాబ్‌ఎవెల్, మయెల్లా అంత రుజువర్తనులు ఏమీ కారని, తండ్రి ఊరంతా ఎరిగిన తాగుబోతు అని, నిజానికి ఆమె టామ్ రాబిన్సన్‌ను లొంగదీసుకోవాలని ప్రయత్నించిందని, అట్టికస్ నడి కోర్టులో వారి బండారం బయటపెట్టి సాక్ష్యాలు సమర్పిస్తారు. తెల్లవారు జ్యూరీగా ఉన్న కోర్ట్ రాబిన్సన్‌కు శిక్ష విధిస్తుంది. తానా శిక్షనుంచి తప్పించుకుపోయే ప్రయత్నంలో కాల్చివేయబడతాడు. రాబిన్సన్‌కు దొరికిన న్యాయాన్ని చూసి, అందరికీ అలాంటి న్యాయం అంటే విముఖత కలుగుతుంది. తండ్రి బాబ్ ఎవెల్, తమ పరువు నలుగురిలో పోగొట్టిన లాయర్ అట్టికస్ మొగాన ఉమ్మి, టామ్ రాబిన్సన్ భార్యను భయపెట్టి జడ్జి ఇంటిపై దాడిచేసి, చివరికి అట్టికస్ పిల్లలపై దాడిచేయగా దెబ్బలు తిన్న వారిని మొదట్నుంచీ వారికి బహుమతులిచ్చి కాపు కాస్తున్న బూరేడ్లీ కాపాడి ఇల్లు చేరుస్తాడు. ఈ దాడిలో తాగుబోతు బాబ్‌ఎవెల్ చనిపోతాడు. అప్పుడు వచ్చిన పోలీసు అధికారి ఈ హత్య విషయం కేసు అయితే, అది అట్టికస్ కొడుకు పైకి రావచ్చు అని లేదా బూరేడ్లీ కూడా ఇరుక్కుంటాడని, ఈ విషయాన్ని ఇక్కడతో వదిలేయడం మంచిది అంటాడు. అట్టికస్ ఆమోదిస్తాడు. జెమ్‌ను తమ ఇంటిదాకా దిగబెట్టమంటాడు బూ రెడ్లీ. మళ్లీ తన లోకంలోకి తాను వెళ్లిపోయి తలుపులు మూసుకుంటాడు.

సమాజంలో ఏర్పడ్డ మూఢ నమ్మకాలు, పద్ధతులు, విశ్వాసాల వల్ల, ప్రతి ఒక్కరూ పంతాలకు పోతే పెరుగుతాయని, పేదసాదలు, బలహీనులు పట్ల తాము స్తోమతు గల సమాజ వర్గాలుగా, ఆటువంటి కార్పణ్య వైఖరి కలిగి ఉండొచ్చా అన్నది నవల వేసే ప్రశ్న తప్ప రచయిత్రి ఆ విషయాలను వాద్యం చేయదు. నవలలో అట్టికస్ పాత్ర, ఉన్నత మానవ ధర్మాలు పాటించే మంచి వ్యక్తిగా అమెరికా తరతరాల పాఠకుల్లో చెరగని ముద్ర వేశాడు. ఆ రహస్యమే ఈ పుస్తక దిగ్విజయానికి ముఖ్య కారణాలు. మంచిని పాటించని సమాజం అమాయకులను పొట్టన పెట్టుకోవడం 'టు కిల్ ఎ మాకింగ్ బర్డ్' అంటే అదే! నవలలో పాత్రలు, నల్లవాడు రాబిన్సన్, అట్టికస్, బూరెడ్లీ ఆటువంటి విలువల సమాజపు గుర్తులే!

'కరుణ ఒక్కటే గొప్పది' అన్న భవభూతి మాటలు, 'పత అడగించుటింతయు శుభంబది లెస్స' అన్న ఉద్యోగపర్వంలోని ధర్మరాజు మాటలు, మన సాహిత్యంలో ఎప్పట్నుంచో ఉన్నవే! హార్పర్ లీ రాసిన ఈ నవల, ప్రజలకు అర్థమయ్యే సాహిత్యానికి, సమాజానికి అనర్థం కాని రచనకు, కాలంతోపాటు విలువ పెరుగుతుంది అనే దానికి, బలమైన మన కాలపు ఉదాహరణ.

– రామతీర్థ

98492 00385



పరామర్శ

విలువైన కవిత్వపు ఉత్తరం 'అమ్ముల పొది'

పోస్ట్‌మాన్‌గా సేవలు దశాబ్దాలుగా అందజేస్తూ, మోకా రత్నరాజు, ఉత్తరాలు చేరవెయ్యడమే కాక, తన మనసులోని ఉత్తరాలు బయటకు తీయడం కూడా సాధన చేశాడు. ఆ సాధన ఫలితమే 1989 నుంచి 2012 లోపల ఆరు పుస్తకాలు వెలువరించి సాహిత్యలోకంలో సుపరిచితుడయ్యాడు. నీవూ- నీ స్థానం, పొద్దు పొడుపు, సాగర స్పర్శ, గుండె కొలిమి, ట్రంకు పెట్టె కవితా సంపుటాలుగా, రూపాయిల చొక్కా, చిన్న కథల సంపుటి ... తెలుగు పాఠకులకు అందజేశాడు. ఈ క్రమంలో చెప్పుకోదగ్గ అవార్డులు, ప్రశంసలు, విమర్శలు, పురస్కారాలు స్వీకరించాడు. ఇప్పుడు అందిస్తున్న 'అమ్ములపొది' ఒక విలువైన కవిత్వపు ఉత్తరం. ఉత్తరం అంటే ఏమిటి? ఉత్తరం అంటే జవాబు. ఉత్తరోత్తరా అంటే భవిష్యత్తు. ఉత్తరం అంటే మనిషి లోకానికి రాసే సమాచారం. ఉత్తరం అంటే ఉత్తర దిక్కు కూడా. ఈ అన్ని వివరణలు ఈ రచనకు, ఈ కవికి సరిపోతాయి.

సందిగ్ధ దశలో ఉన్న సమాజానికి ఒక కవిత్వపు ఉత్తరం (సమాధానం) కావాలి. భవిత గురించి ప్రయాస పుస్తకం నిండా కనిపిస్తుంది. ఉత్తరం అంటే, ఒక సమాచార లేఖ. ఉత్తరం అంటే, కవి తాను నిలబడి, తెలుగు సాహిత్యంలోకి అమ్ములు సంధిస్తున్న ఈ ఉత్తరాంధ్ర నేల. ఒక ఉత్తరంలో ఇన్ని ఉత్తరాలు ఉత్తుంగ భావావేశంతో కలిసి ఉన్నాయి. అమ్ముల పొది ఎవరికోసం కవి తయారుచేస్తున్నాడు? ఏమున్నాయి ఈ పొదిలో?

అమ్ముల పొది కవిత్వ సంపుటి అంతటిలోకీ, కవికున్న లోక జ్ఞానం, శ్లోక జ్ఞానం దీక్షాబద్ధంగా దర్శనమిస్తాయి, ఈ పంక్తుల్లో. తాను కవిత్వం కోసం చేసే ప్రయాసను చెప్పిన తీరు ఇది. 'కాగితమ్ముక్క గాల్లోకి కొట్టుకుపోయేంత తేలిగ్గా కొట్టి పారేయలేన్నేను/ ప్రతిష్ట పురోగతి కోసం అంతరిక్షంలోకి వదిలే క్షిపణులు/ ప్రయోగ వికటంలో ఒక్కోసారి కుప్పకూలినా/ అకుంఠిత దీక్షతో మరో నూతన నిర్మాణంలో నిమగ్నమయ్యే శాస్త్రజ్ఞులల్లే/ సాలు దున్ని/ నాలుగు అక్షర విత్తుల్ని చల్లిన ఆ కాగిత క్షేత్రంలో/ పదపంక్తి కంకుల రాశుల్ని పండించడానికి అన్వేషణ చేసే కవి రైతునవుతుంటాను/ దైవ సమాన ఆ కాగితమాత ప్రత్యక్షమైతే చాలు/ ఆ అక్షర పాదాలను కళ్ల కద్దుకుని సాష్టాంగ పడుదును కదా!' ఇందులో కవి ఎరుక కవిత్వం తేలిగ్గా సిద్ధించదనీ, అది ప్రయత్న సాధన అని, ఒకవేళ తాను మంచి కవిత్వం రాయలేక పోయినా, లోపాలు ఎరిగి తిరిగి మళ్లా రాసేందుకు ఉద్యుక్తుడను అవుతాను అనీ. రోదసీ విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల ఐఎస్ఆర్ఓ (ఇస్రో) రాకెట్ ప్రయోగాలతో కవిత్వాన్ని పోల్చడం, కవి చేసిన ఒక

ఉత్తమ ప్రతీక.

తాను ఇలా రాస్తున్నానని ఒక మెలకువ లేకుండానే, రత్న రాజు, తనకు కవిత్వం ఏమిటో చెప్పడానికి, మనసు ఆ విద్యలో లగ్నమైన ఒక తీవ్రతత్పరతకు లోనయ్యాడు. అందుకే ఆ పంక్తులు ప్రఖ్యాత కవుల కవిత్వ దర్శన వాక్యాల కోవలోకి చేరుకున్నాయి. శ్రీశ్రీ, తిలక్‌ల మానసిక దశలోకి రత్నరాజు సాధన చేసి తన అమ్ముల పొదిలోంచి ఒక అమ్మును అక్కడ ప్రవేశపెట్టాడు కవి. ఇంకా రూపు కట్టని ఊహలతో నిత్య గర్భిణీ అంటూ ఉంటాను నేను అదే దశకు మరో అభివ్యక్తి ఇక్కడ మనకు రత్నరాజు చరణాల్లో లభిస్తుంది. 'పొడిచిన పొద్దు కుంకే దాకా/ పనిలో మునిగిన నిమగ్నాన్ని భగ్నం చేస్తూ-పొలం గట్టునే.../ మొదలైన పురిటి నొప్పుల్ని పంటి బిగువున ఇంటి దాకా మోసుకొచ్చి/ గంపెడు కండల్ని ధారపోసి కనుక్కున్న కన్నబిడ్డతో సమానం - నాకు నా కవిత్వమంటే!'

ఆధునిక కవిత్వం చక్కని భావావతరణం జరిగే ప్రయోగశాల. గోదావరి జిల్లాల నుంచి వచ్చిన కవితా స్వరంగా, ఇవాళ కన్న కొడుకులు అమెరికాలకు వెళ్లిపోతున్న వేళ, ముసలి వారికి ఓల్డేజ్ హోమ్‌లు చివరి గమ్యాలుగా మారిపోతున్న సమాజంలో, 'కొబ్బరిచెట్టే నా కన్న కొడుకు' అని కొబ్బరిచెట్టు ఇచ్చే క్రమం తప్పని ఆర్థిక భరోసా చాలు, గ్రామంలోనే కాలం వెళ్లబుచ్చుతాను అన్న నిర్ధారణ ధ్వనిస్తాడు. ఆవు - పులి కథను కొత్తగా చెప్పే ప్రయత్నంలో ఇవాళ ఆవు పాలిట పులి ఏది, అంటే, ఆకలే ఇవాళ ఆవుని తినేసే పులి అంటూ స్పష్టం చేస్తాడు.

గో గోడు కవితలో ఒక కీలకాంశాన్ని లేవనెత్తాడు కవి. గోవులను రక్షిస్తామంటూ ఉద్యమాలు చేస్తూ, ఆ హోరులో తగుల బెట్టేందుకు గడ్డితో దిష్టిబొమ్మలను చేసి ఆ గడ్డి కాల్చేస్తూ ఉంటే, ఇంకా గోవులకు గడ్డి ఎక్కడ మిగుల్తుంది అంటూ, గోవు నోటి ముందరి ఆహారాన్ని మంటల పాలు చేసే వారు ఏ పాటి గోరక్షకులో, మనలను ఆలోచించాలంటాడు.

తలలో ఒకప్పుడు పేలన్నా బతికి ఉండేవి, ఇప్పుడు ఈసు, అసూయ, ద్వేషం, అధికార దాహం వంటి రోగాల పుట్టయిన మనిషి తలపై పేలే కాదు ఏ ప్రాణీ బతకలేదు అన్నది, మనిషి ప్రకృతిపట్ల చూపే బాధ్యతా రాహిత్యాన్ని పరోక్షంగా చెప్పిన అగ్నిగుండం కవిత, ప్రముఖ ఆంగ్ల కవి ఏకె రామానుజన్ ఎలా అలవోకగా తన కవితలను ఎత్తుకుంటాడో ఆ తీరును గుర్తు చేస్తుంది. 'కరి మింగిన వెలగలు' కవితలో సాగర సంకేతాలను విస్తరించి 'విషమ వలల్లో చిక్కుకున్న బతుకు నావలు అప్పుల తీరం దాటేదెన్నడో' అని అల్లుకుపోగలడు కవి రత్నరాజు. కిలో వంద రూపాయలైన ఉల్లి, పేద ప్రజల తరపున మాట్లాడే విషాద చమత్కారం 'ఉల్లాక్రోశం'గా 'నన్ను కోస్తేనే కాదు చూస్తేనే కన్నీరెట్టుకునే వాళ్ల తరపున నిలబడి అక్రమ దోపిడీ దళారుల దారుల్లో చేతిబాంబునై దద్దరిల్లాలని ఉంది', అంటూ ఉల్లి ఆగ్రహం అక్షరాలకు ఎత్తగలడు. వ్యాపార, వినోద, విలాసాల ఆటబొమ్మలుగా స్త్రీలను చూస్తున్న సామాజిక విపరీత ధోరణికి వ్యతిరేకంగా అతివలకు, ఈ తెగబడే శక్తులతో నిత్య జాగరూకతతో ఉండడానికి కవి రత్నరాజు సమర్పిస్తున్న అస్త్ర శస్త్రాలు, ఆత్మ స్థయిర్యం, సంకల్ప బలంతో బాటుగా 'అత్తరు సీసాల్లో ఆమ్ల రసాన్ని/ తిలకం బుడ్డిలో గొడ్డు కారాన్ని నింపుకుని/ చంకసంచిని అమ్ములపొదిగా మలుచుకోవాలేమో/ నేటి జనారణ్యంలో/ నిర్భయంగా సంచరించాలంటే/ ప్రతి ఆడబిడ్డ చంకనా/ ఇప్పుడొక అమ్ములపొది అత్యవసరమేమో!'

తిలక్ ప్రఖ్యాత కవితలోని 'పోస్ట్‌మాన్'లా తెలుగు కవిత్వంలోకి వచ్చాడు కవి రత్నరాజు. జాతీయ వ్యవస్థ అయిన పోస్టల్ వ్యవస్థపై ఒక దీర్ఘ కవిత రాయగల అనుభవం, అవకాశం, ఆవేదన, అభిమానం, అభివ్యక్తీ గల మన 'విన్నపాల' (ఇంకా పూర్తికాని తన ఆశు శతక పద్యాల పేరు విన్నపాలు) కవి, 'ఉత్తరా'యణ పుణ్యకాలంగా (ఉత్తరం నడిచివెళ్లిన దారి) ప్రపంచ కవిత్వ రత్నాకరానికి కొత్త నిధులను, తన రచనల ద్వారా సంతరించగల శక్తి గల వినయ సంపన్నుడు. అమ్ముల పొది అందజేసిన కవి రేపటికి, పోస్టల్ వ్యవస్థకు అక్షర శిల్పంగా 'అలలగుడి' కూడా కడతాడని ఆశిద్దాం.

- రామతీర్థ
98482 00385

సాహితీ వైజ్ఞానికుని సప్తతి

తెనాలి కళల కాలువలు తమ రక్తంలో పారుతున్న సాహితీవేత్తల్లో చందు సుబ్బారావు ఒకరు. అక్కడికి దగ్గరలోని చదలవాడలో ఒక దిగువ మధ్య తరగతి రైతు కుటుంబంలో పెద్ద కుమారుడుగా జన్మించి, తండ్రి, మేన మామలూ ఒజ్జలై, నలుగురికీ విద్యలు ఒనగూడుస్తుండగా చూసి తాను సైతం ఆర్ట్స్‌లో చదువులు చదివి, సాహిత్య సాంస్కృతిక రంగోపజీవి గానే ఉండిపోవడానికి, యువకుడైన చందు చేసిన సకల ప్రయత్నాలను ఆపింది వారి తండ్రి వెంకట కృష్ణయ్య. సైన్సు చదువుల వల్ల మంచి భవిష్యత్తు ఉంటుంది, భిన్న రంగంలో అభివృద్ధి ఇప్పుడు దేశానికి అవసరం కూడా, మీ యువకులు అటు వైపు వెళ్ళాలి, అని సైన్సు విద్యా సముపార్జన వైపు కుమారుడిని పంపిన ఉపాధ్యాయుడాయన. అలా విజయవాడ ఆంధ్రా లయోలా కళాశాలలో పెద్దిభొట్ల పాఠాలు చెప్పడానికి చేరిన కొత్తలో, చందు మరో తరగతిలో విద్యార్థి. చదివింది భూభౌతిక శాస్త్రం. పట్టభద్రుడై విశాఖలో అడుగుపెట్టి, ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జియోఫిజిక్స్ ఎమ్మెస్సీ చేసి, రీసెర్చ్ స్కాలర్‌గా, అటుపై పీహెచ్‌డీతో అదే యూనివర్సిటీలో ఆచార్య విధులలోకి ప్రవేశించారు. ముప్పై ఏడేళ్ల సేవల్లో, జియోఫిజిక్స్ విభాగాధిపతిగా కూడా పని చేశారు. అలా ఒక చదలవాడ కుర్రవాడు, చదువుల ఉన్నతిలో, ఎక్కడ భూభౌతిక శాస్త్రం చదివాడో, అక్కడే ఆ విభాగాధిపతిగా సైతం ఎదిగాడు.

విశాఖ కేంద్రంగా, చందు తన ఉద్యోగ విధులతో బాటుగా, తన చిన్ననాటి

> **ఆంధ్ర యూనివర్సిటీకి ఒక గీతం రాసిన ఘనత చందుదే. 1998లో 'ఆంధ్ర విశ్వ కళామతల్లికి వందనం' అని ఆయన రాసిన పాటను విని అప్పటి వీసీ మద్ది గోపాలకృష్ణా రెడ్డి ఆ గీతం ఇక ముందు ఏయూ అధికారిక గీతంగా ఉండాలని, ప్రతి స్నాతకోత్సవంలో ప్రారంభగీతంగా గవర్నర్ రాబోతుండగా, గానం చేయాలని సెనేట్ చేత తీర్మానం చేయించి, చందు రాసిన పాటకు పట్టం కట్టారు.**

తెనాలి రక్త నిష్ఠతో, శ్రీశ్రీ, ఆరుద్ర, రావిశాస్త్రి, చాసో, పురిపండా, కాళీపట్నం, బలివాడ కాంతారావు వంటి పెద్దలను కలవగలిగాడు. అత్తలూరి, అబ్బూరి, వివిన మూర్తి, కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ, తంబు, పతంజలి, డా.కె.ఎస్.చలం, కృష్ణాబాయి, చలసాని ప్రసాద్, వేణు గోపాలరావు వంటి సమకాలికులతో సాహిత్య గాఢత పెంపొందించుకున్నాడు. తన కృషిని కథ, నవల, విమర్శ, అనువాద రంగాలలో కొనసాగించాడు. దిట్టమైన గొంతుతో సాహిత్య ప్రసంగాలు చేసే ఈ యువకుడెవరా అని తెలుగు సాహిత్యం తన వైపు చూసేట్టు ఒక ముద్ర వైపు ప్రయాణం మొదలు పెట్టాడు.

ముఖ్యంగా రూపమూ, సారమూ గురించి జరిగిన సాహిత్య చర్చాస్పర్థలో ఒక చురుకైన స్వరంగా ఎదిగాడు. కవికి (ఆ మాటకొస్తే రచయితకు కూడా) విమర్శకుడు శత్రువు కాదు, అని చెప్తూ, రచయిత కన్నా, విమర్శకుడి కన్నా, వారి చుట్టూ ఉన్న సమాజం గొప్పది అన్న స్పృహకు దారి తీశాడు చందు. రచన ఒక అపూర్వ సృజన, విమర్శకు అతీతం అన్న దంతపు మేడ నుంచి, సాంఘిక మహాప్రభావ యుగ సంధ్యలో నిలబడి "దిగి రాను దిగి రాను దివి నుండి భువికి" అనే చరణం ఎంత బాగున్నా, ఆ ధోరణి ఈ కాలానికి పనికి రాదు, అని పేరు చెప్పకుండా, కవి చక్రవర్తిత్వాలకిది కాలం కాదు అని స్పష్టం చేసిన, సంప్రదాయ పంథాలో వెయ్యేళ్లు వెనక్కి వెళ్లలేము అన్న ఎరుకతో నడుచుకున్న వామపక్ష శాస్త్రీయ చింతనల, సామాజిక హేతుబద్ధ దృష్టికి వారసుడు చందు. అతి వక్తృత్వ ధోరణులు చక్కని వచన కవిత్వం కావు అని చెప్పినా, పద్యంలో గల శక్తిని గ్రహించండి, అని కొత్త కాంతులు వెదజల్లినా, చందు సాహిత్య సమన్వయకర్తగా మతం, రాజ్యం, సిద్ధాంతం పెడ ధోరణులకు తెగబడ్డప్పుడు, కలాన్ని కత్తి చేసి అభ్యంతర వాణి వినిపించాల్సింది, కవులూ, రచయితలే అన్నది బలంగా నమ్మాడు. కవిత్వంలో అతిశయోక్తి తప్పదని, దాని ప్రయోగం, ప్రయోజనం ఎందుకా అతిశయోక్తిని సహజాభరణంగా మలుస్తాయో చెప్పాలని తన 'రెండు సత్యాలు' వంటి వ్యాసాలలో ప్రయత్నించాడు. యజ్ఞానికి ఒక చిన్న సీక్వెల్ రాశాడు, రావి శాస్త్రి అంటే ఉపన్యాస ఉష్ణోగ్రత పెరిగిపోయేలా విజృంభిస్తాడు. "తన హృదయంలో అధిష్ఠాన రూపం శ్రీశ్రీ కవిత్వం" అని ప్రకటించాడు. అల్పజీవుల అండ రాచకొండ రేడియో రూపకంలో అల్పజీవి సుబ్బయ్యకు, రావిశాస్త్రి మాటలకు గొంతునిచ్చాడు. అప్పుడప్పుడూ ప్రసంగ ఝరిలో దారితప్పి విస్మృత పథాల పయనించినా, ఆవిష్కరించిన పుస్తకానికే అభ్యంతర మంగళ హారతులు పట్టినా, చందు నిజాయితీ అయిన స్పందనలకు "హాల్ మార్క్" వంటి వాడని అందరూ భావిస్తారు.

అరిస్టాటిల్ వంటి వాడు "పొయెటిక్స్" రాస్తే, ఆయన గురువైన ప్లేటో, తన రిపబ్లిక్‌లో ఇచ్చకాల కవులకు, వారి తిక్క తిక్క కల్పనకు స్థానమే లేదు పొమ్మన్నాడు. ఆ కాలానికి ఇక్కడ ఇతిహాసాలు వెలిసి, మహాకావ్యాలు అవతరిస్తున్నాయి. వేదాలలో ఉన్నవన్నీ సామాన్య సత్యాలే అయినా, అవి ఎందుకలా భాసిస్తున్నాయి అంటే, "సత్యాన్ని విరచిస్తున్న వారు కవి భావుకులు" కనుక, సామాన్య కాల్పనిక సత్యం "దొర వేషం"లో కన్పిస్తుంది అంటారు చందు సుబ్బారావు. సంప్రదాయ సాహిత్య విమర్శకులు అయిన కట్టమంచి, రాళ్ళపల్లి; ఆధునిక కవితకి తొలి స్వరాలు అయిన రాచమల్లు, కొడవటిగంటి, తరువాత కె.వి.ఆర్, సొదుం రామ్మోహన్, చేరా, వీరితో బాటు నేటి కాలపు కవిత్వం అని కడిగి ఆరబోసిన అక్కిరాజు ఉమాకాంత విద్యా శేఖరులను ఇష్టంగా తలుస్తారు చందు. సైన్సు సాహిత్యం రెండూ సత్యాన్ని వెతుకుతున్నాయి అనేదాన్ని, కవుల కల్పనా స్వేచ్ఛ అనే దాన్ని ఒకే వాక్యంలో చెప్తారు చందు. "పాముపడగలో మణులుండడం కవి సమయం. ఈ మణుల ప్రస్తావన చెయ్యని కవీ లేడూ ఉన్నట్టు అంగీకరించిన శాస్త్రవేత్తా లేడు". అభ్యుదయ రచయితల సంఘం ఉత్తరాంధ్రలో దశాబ్దాలుగా చేస్తున్న కృషిలో భాగంగా చందు సుబ్బారావు పలు పదవులలో నిర్వాహక ముఖ్యుడిగా ఉంటూ, వీరేశలింగం అవార్డ్, పురిపండా అవార్డ్, విరియాల లక్ష్మీపతి పురస్కారం వార్షిక ప్రదాన ప్రణాళికలను అమలు పరుస్తున్నారు. సైన్సు ఆచార్యుడిగా జల నాణ్యత సంరక్షణ, అభివృద్ధిపై, వాటర్ షెడ్ డెవెలప్మెంట్, గ్రౌండ్ వాటర్ క్వాలిటీ మొదలగు అంశాలపై దేశ దేశాల్లో పరిశోధన పత్రాలు సమర్పించి, అలా దేశాలుతిరిగిన క్రమంలో తాను విన్నవి, కన్నవి, హిమపుత్రి, ఎరికా వంటి తొమ్మిది నవలికలను ఒక పుస్తకంగా వెలువరించారు చందు. అయిదు విమర్శా గ్రంథాలు రాశారు. సోమసుందర్ కవితని "సీకింగ్ ద బ్రోకెన్ వింగ్"గా, "అంబేద్కర్ జీవితం", ఎండ్లూరి సుధాకర్ కవిత "గోసంగి", ఉప్పల అప్పలరాజు కవిత "రోడ్ ఆక్సిడెంట్"లకు ఆంగ్లానువాదాలు చేశారు. ఈ సాధనలో తాపీ ధర్మారావు అవార్డ్, కొండేపూడి శ్రీనివాసరావు అవార్డ్, తుమ్మల వెంకటరామయ్య పురస్కారం, ఆవంత్స సోమసుందర్ పురస్కారం అందుకున్నారు. సలీం వంటి సాహిత్యకారులకు శాస్త్రపాఠాలు చెప్పిన ఆచార్యుడు చందు. సైన్సు నేపథ్యంతో తెలుగు సాహిత్యంలో వచ్చిన కొద్దిమంది రచయితల్లో ఒకరిగా, జీవితంలో, సాహిత్యంలో లౌకికవాదిగా నిరాడంబరుడు.

ఆంధ్ర యూనివర్సిటీకి ఒక గీతం రాసిన ఘనత చందుదే. 1998లో "ఆంధ్ర విశ్వ కళామతల్లికి వందనం" అని ఆయన రాసిన పాటను అప్పటి వీసీ మద్ది గోపాలకృష్ణా రెడ్డి గారు విని, ఆ గీతం, ఇక ముందు ఏయూ అధికారిక గీతంగా ఉండాలని, ప్రతి స్నాతకోత్సవంలో ప్రారంభగీతంగా గవర్నర్ రాబోతుండగా గానం చేయాలని సెనేట్ చేత తీర్మానం చేయించి, చందు పాటకు పట్టం కట్టారు. ప్రముఖ సంగీతవేత్త నేదునూరి కృష్ణమూర్తి దీన్ని స్వర పరచారు. ఉద్వేగ వంతమైన స్పందన, మానవ ప్రగతిలో సాహిత్యం పాత్రపై నిత్యం పెంచుకునే అవగాహన ఆచార్య చందు సెవెంటీ సందర్భంలో, వర్తమాన సమాజంలో వారు మరింత క్రియాశీలక బాధ్యత పోషించేలా, కర్తవ్యాలను ఇతోధికం చేస్తున్నాయి సాహిత్య సమాజం వారిని అభినందిస్తున్నది, సప్తతి చందు జిందాబాద్!

■ రామతీర్థ

(నేడు విశాఖపట్నంలో చందు సుబ్బారావు సప్తతి సాహిత్యోత్సవం)

'రత్తాలు రాంబాబు'లో కన్యాశుల్క కల్పనలు

అమాయకపు పల్లె పిల్లను అసిరమ్మ లాంటి టవున్‌లో బహుబాగా జీవిద్దామని మాయమాటలు చెప్పి తీసుకువచ్చే వాడు ఎవరు? ఇంకెవరు, గురజాడ వారి గిరీశం! నూటయిరవై సంవత్సరాల కిందటి వీడే కాదు, నలభై ఏళ్ల కిందటి సింవాచెలం కూడా ఇదే పని చేసేడు. వీడు రావిశాస్త్రి గారి సింవాచెలం. అయ్యవారు ఫకీరుముండని లేవదీసుకు పోయేడని చెప్పి అగ్నిహోత్రావధాన్లు లబ లబలాడినట్లు, ఇక్కడ శృంగవరపు కోటకి దగ్గర్లోని పల్లె పిల్లని పట్నానికి బలిచ్చేడానికి తీసుకొస్తాడు సింవాచెలం. బుచ్చమ్మ కన్యాశుల్కం నాటకంలో కొండ లాంటి గిరీశం మాటలకి పడిపోయే, ఆ బండి ఎక్కింది. అలాగే రత్తాలు కూడా కొండ లాంటి సింవాచెలం మాటలని నమ్మే ఆ జట్కా ఎక్కింది. రావిశాస్త్రి గారే 'సొమ్ములు పోనాయండి'లో మొదలుపెట్టినట్టు, అవునండి, అదారాంబవండి, 'రత్తాలు రాంబాబు' నవలకు.

'కన్యాశుల్కం'లో బుచ్చమ్మ జట్కాఎక్కిన తర్వాత మరి నాటకంలో కనిపించదు. 'రత్తాలు రాంబాబు'లో రత్తాలు జట్కా ఎక్కడం తోనే ఆమె కథ మొదలు. జూన్ 25, 1975న దేశంలో ఎమర్జెన్సీ మొదలు అయింది. మార్చ్ 5, 1976 ఆంధ్రజ్యోతి వారపత్రిక సంచికలో మొదలై, నవంబరు 18, 1977 సంచిక దాకా పంధొమ్మిది నెలలు, ఎనభై వారాల పైచిలుకు ఈ నవల ధారావాహికగా, "రావిశాస్త్రి జైలు నుంచి రాస్తున్న నవల" గా ఒక ఉపశీర్షికతో కూడా ప్రముఖంగా పాఠకుల ఆదరణ పొందినది. ఫిబ్రవరి 4, 1976న శాస్త్రిగారు జైలు నుంచి విడుదలయ్యారు. నవల ముద్రణ మరొక 9 నెలలు సాగింది.

జైలు కటకటాల్లోంచి సరిగ్గా, ఎమర్జెన్సీ ఏర్పడిన తొమ్మిది నెలలకు పుట్టిన కథ 'రత్తాలు - రాంబాబు'. రావిశాస్త్రి రచనా పరిధి ఈ నవలలో, రత్తాలు జీవితంలో ఎమర్జన్సీ ఏర్పడినది మొదలుకుని, ఆ ఎమర్జన్సీ తొలగిపోయినదాకా. ఆ పల్లెపిల్ల సింవాచెలంగాడ్ని నమ్మి జట్కా ఎక్కినప్పుడు, ఆ అత్యయికస్థితి మొదలైంది. మూడు వందల పైచిలు ఫుల్‌స్కాపు పేజీల కథ నడిచాక, ఆమె నిరాశ్రయగా ఒక వేకువలోకి నడుస్తుండగా, కథ ఆగింది. ఒక దేశంలో ఎమర్జెన్సీ అమల్లో ఉండగా, ఆ నిరంకుశ శాసనం కింద నిర్బంధంలో ఉన్న ఒక జాగృత రచయిత, తన యాభై ఏళ్ల వయసులో రాసిన, ఒక యువతి జీవితంలోకి చొచ్చుకు వచ్చిన ఎమర్జెన్సీ చిత్రణ ఈ కథా వృత్తం.

వారిద్దరూ హీరోయిన్, హీరో అనుకున్న వారికి ఇంకా ఇబ్బందిగా ఉంటుంది. ఈ కథ నిజానికి రత్నాలు, ముత్యాలు వంటి ఈ దేశపు విలువైన ఆడపిల్లల కథ. మర్యాద సీతమ్మలయిన వసంత, రాధ వంటి మధ్యతరగతి సంశయాల, భద్రలోగ్ మనస్తత్వాల కథ. పోలీసు సోషలిస్టుల కథ. పల్లె పిల్లలను తెచ్చి, వారిని ముండపాపలను చేసే కంపినీ నరసమ్మల కథ. రత్తాలు లాంటి కుందేలు చిక్కుకున్న తోడేళ్ళ అడవీ, నక్కల బొరియ, రత్తాళ్లు వచ్చి చిక్కుకునే ఈ అసిరమ్మ లాంటి టవున్– రావిశాస్త్రి బ్రూతద్దం, భూతద్దం కింద చిక్కితే, ఏం జరుగుతుందో అదే జరిగింది. శుభం కార్డులు లేని ఒక జీవితనాటకం కళ్ళకు కట్టించాడు రచయిత. 'రత్తాలు రాంబాబు' బాయ్ మీట్స్ గర్ల్ కథ కాదు. రత్తాలు ప్రధాన పాత్ర. రాంబాబు, ఒక సహాయశూరుడు మాత్రమే.

ఎటొచ్చీ ఇన్ని వందల పేజీల కథ రాసాక, ఆయన ఇది అసంపూర్ణం అన్నాడు. సీరియస్‌గా అన్నాడో, లేక ఇక రాయనవసరం లేదు అని, అలా వదిలేసాడో, ఆయన అన్నాడు కదా అని మనం కూడా, ఈ నలభై ఏళ్ల బట్టీ, అదే అనుకుంటున్నాం. అసంపూర్ణ రచనపై ఏం రాస్తాం అని పెద్దగా రాయని వాళ్ళూ, పట్టించుకోని వాళ్లూ విమర్శకులుగా ఉన్నారు తెలుగు సాహిత్యంలో. గురజాడ తన నాటకాన్ని ఎక్కడ ఎలా విడిచిపెట్టాడో, అలాగే రావిశాస్త్రి కూడా, ఈ నవలను వదిలేశారు. ఒకసారి రావిశాస్త్రి గారే 'కన్యాశుల్కం' నాటకం మనుషులు రాసింది కాదు, ఏ దేవతలో రాసి ఉండాలన్నారు. వారికి ఆ నాటక రచన అంటే అంత గురి.

పాత్రలకు పెళ్లిళ్లు, తరువాత వారు కలకాలం సుఖంగా జీవించడాలూ గురజాడకు పట్టిన విషయం కాదు, అలాగే శాస్త్రిగారికి కూడా. కన్యాశుల్కం ఎంత అసంపూర్ణమో, 'రత్తాలు -రాంబాబు' కూడా అంతే అసంపూర్ణం. నిజానికి శాస్త్రిగారు చెప్పదలుచుకున్న కథ పూర్తి అయిపోయిందని మనం గ్రహించలేకపోవడం ఏం చెపుతుందీ అంటే, ఈ రచన పట్ల, మన అవగాహన అసంపూర్ణం అని. పాత్రలను వాటి మానాన వాటిని ఒక దశ తరువాత వదిలేయడమనే ఓపెన్ ఎండెడ్ పద్ధతిని పాటించిన తొలి ఆధునికుడు గురజాడ, ఆయన వారసుడే రాచకొండ. ఎమర్జన్సీ పీడన తన జీవితంలో తొలగిపోయాక నిరాశ్రయగా వేకువలోకి వస్తుంది రత్తాలు. ఎందుకు? రాధమ్మ అనే ఒక మధ్యతరగతి మర్యాదామణి ఈమె ఉంటే తన ఇంటి పరువు పోతుందని బయటకు పొమ్మన్నందు వల్ల. విశాల లోకం ఉంది ఆమె ముందర, సాయపడే ఎందరో ముత్యాళ్లు, రాంబాబులు ఉంటారు.

1910లో గురజాడ పాత్ర సౌజన్యారావు బయటకుపొమ్మన్నది ఒక చెడ్డ పాత్రను. వాడు గిరీశం, చీకట్లోకి నడుస్తాడు. నూట ఇరవై ఏళ్ల కిందట, ఒక మంచి పాత్ర గెటౌట్ అంటూ చెడుకు బయటకి దారి చూపి, బాగుపడతానంటే, సాయం చేస్తానని భరోసా ఇస్తుంది. కాలం మారి, మనకు స్వాతంత్ర్యం వచ్చాక, మన సంస్కారాలు కుదింపబడి, బాగుపడతాను అంటున్నా, ఒక పల్లె పిల్లను ఆమె కొంత కాలం దురదృష్టం వల్ల దుర్మార్గ వ్యవస్థలో కాలం గడిపినందువల్ల నా యింట నీకు నీడ లేదు బయటకు పొమ్మంటుంది రాధమ్మ. చదువుకున్న వారి ఆసరా, సహాయం, ధైర్యం, మార్గదర్శకత్వం కావలసిన ఈ దేశపు పేద ప్రజానీకపు ప్రతినిధి అయిన రత్తాలును, మిడి మిడి చదువుల కుహనావిలువల మిడిల్‌క్లాస్ మెంటాలిటీ బయటకు పొమ్మంది. ఇదీ కాలభ్రమణంలో వచ్చిన మార్పు. వెరసి, కన్యాశుల్కం ముగింపుకు, రత్తాలురాంబాబు ముగింపుకు పోలికలు సుస్పష్టం.

వేశ్యల గురించి రాయడం, మన సాహిత్యంలో ఎప్పటినుంచీ ఉంది? దేవ వేశ్యలతో సంసారం వల్లే మన పురాణాలు నడిచాయి. వాటిని అల్లా ఉంచితే, రెండువేల అయిదు వందల ఏళ్ల వెనుక భాస మహాకవి తన నాటకం 'దరిద్ర చారుదత్తం'లో, వసంత సేన తొలి మానవ వేశ్య. ఈమెకు దైవత్వ లక్షణాలు ఏమీ లేవు. ఆమెను పెంపొందించాడు శూద్రక మహాకవి అదే ఇతివృత్తంపై తాను రాసి పూర్తి చేసిన 'మృచ్ఛకటికం'లో. ఇది బహుశా దేవ వేశ్యలతో సంబంధం లేకుండా తొట్టతొలిగా చిత్రితమైన మానవ వేశ్య వృత్తాంతం. గురజాడ ఒక వేశ్యను మంచికీ మానవత్వానికీ ప్రతినిధిని చేసి తన నాటకంలో ప్రధాన పాత్రగా సాహిత్య ప్రవేశం చేయించారు. రావిశాస్త్రి 'రత్తాలు రాంబాబు'లో ఏకంగా ఒక వేశ్యల కంపినీనే సాహిత్య ప్రవేశం చేయించారు. తమ కంపినీ, పరిశ్రమలు నడిపే బడా పెట్టుబడిదార్ల కంపినీ చేసే పనీ ఒకటేననీ, వారికి ప్రొటెక్షన్ ఉన్నది మాకు లేదనీ వాపోయే కంపినీ ప్రొప్రయిట్రెస్ నరసమ్మ "నానూ కేపిటలిస్టునే" అంటుంది తన భాషలో. ఆమె మానవ సమాజపు అతి పురాతనమైన ఒక ప్రొఫెషన్‌లో ఉన్నాది. సానికొంపల శివతాండవాలు, చుట్టూ తిరిగే చిల్లర వృత్తుల రిక్షాజోగుళ్లు, అడ్డబుర్రలు, రాకెట్, స్పుత్నిక్ వంటి చోటా రౌడీలు, వచ్చేపోయే విటవర్గాలు, పోలీసులూ వ్యాపారస్తులతో ఆ కంపినీలకు ఉండే కనెక్షన్లు, ఇవన్నీ ఒక అసిరమ్మ లాటి టవున్‌లో ఎలాగుంటాయో చెప్పిన తీరు రావిశాస్త్రిని 'స్లమ్ డాగ్స్ క్రానిక్లర్'గా శిఖరంపై నిలబెడుతుంది.

గిరీశం నాలుగు గంటలు లెక్చరిచ్చాక, అంతా విన్న బండివాడు, అయితే, మావూరి హెడ్డుకు ఎప్పుడు బదిలీ అవుతుంది అని అడుగుతాడు, వాడి పాలిటి వేదనా కారణం (టార్మెంటార్) వాడు. అదే హెడ్డు, ఆ కన్యాశుల్కం లోంచి, ఇంకా పది (తలలతో) హెడ్లతో, పేద్ద బెమ్మరాచ్చసుడై, గంగరాజు హెడ్డుగా శాస్త్రిగారి కథలో ప్రవేశిస్తాడు, ఒకటో అధ్యాయం మూడో విభాగంలో. ఇక్కడ గంగరాజు హెడ్డు ప్రవేశం, గొప్ప నాటకీయత గల ఒక పాత్ర ప్రవేశ రచన. ఇతనికో శిష్యుడు ఉంటాడు. వీడూ కన్యాశుల్కంలోని శిష్యుడి వంటి వాడే. కరటక శాస్త్రి శిష్యరికంలో కన్యాశుల్కం నాటకంలో కొంత ఘనత సాధించిన శిష్యుడు, ఈ నాటకంలో ఫోర్ నాట్ సిక్స్ పోలీసు శిష్యుగా, గంగరాజు హెడ్డును ఫాలో అవుతూ ఉంటాడు. గంగరాజు హెడ్డు అడుగుతూ ఉంటాడు 'డు యూ ఫాలో ఫాలో ఫాలో మి' అని. అది రావిశాస్త్రి విస్ఫోటక ప్రతిభ. పెద్దోళ్లకి అప్పుడప్పుడూ పోలీసు పద్ధతిలో వసూలు జుల్మానాలు వేసి నడపక పోతే దేశం సక్రమంగా నడవదు అంటూ, "దేశానికి పోలీసులే పెదమ సోషలిస్టులు" అంటాడు గంగరాజు హెడ్డు.

ఒక పౌరాణిక కథన లక్షణం గల ఆధునిక సామాజికుడు రావిశాస్త్రి. ఆ మహాకథన కౌశలం ఈ నవల అంతటా విరజిమ్ముకుపోయి కనిపిస్తుంది. సానికొంపల చిత్రణ అధోజగత్ జీవన అఖాతప్రాయ వాస్తవికత తో మనల్ని ముంచేస్తుంది. గంగరాజు హెడ్డు రెండోసారి ఊరిలో బీట్‌డ్యూటీపై బయలుదేరే ఘట్టాన్ని శాస్త్రిగారు చెఖోవ్ కథ కెమిలీయాన్ తీరులో ఒక రసవత్తరఘట్టంగా మలిచారు. దేశపు ఎమర్జన్సీలో సామాన్యుడి గోడు ఎలా అరణ్య రోదన అవుతుందో చెప్పడానికి రచయిత ఈ ఘట్టాన్ని మలిచిన తీరు ఒక మేలైన పనివాడి లక్షణం. ఈ ఘట్టాన్ని తీసేయవద్దని పురాణంవారికి లేఖ కూడా రాశారు. మధురవాణి తాను ఎరగని సుబ్బి పెళ్లి తప్పించడానికి శాయశక్తులా శ్రమిస్తుంది, చివరికి మారు వేషాలు వేసి కూడా. అలా ఈ నవలలో రత్తాలు ఆ కూపం నుంచి బయట పడడానికి సాయపడేది ముత్యాలు. వ్యూహరచనలో ఈమె మధురవాణికి తీసిపోదు.

మంచంపైన గంగరాజుహెడ్డును ఒక పవళింపుసేవ ముగిసే అంతవరకూ మంచం మీద నరసమ్మ తోనూ, అదే మంచం కింద సింవాచెలంను తేలుకుట్టుడు బాధలో ఒక అర్జున విషాదయోగంలా ఉంచి, గిరీశం మంచం కింద రామప్ప పంతులుతో ఉండగా, సింవాచెలానికి తేలుతో సహవాసం తప్పని ఒక దృశ్యం, కన్యాశుల్కంలోని మంచం కింద దృశ్య రచనకు ఒక శ్రేష్ఠమైన పొడిగింపు.

రాంబాబు చదువుకున్న యువకుడు. కలెక్టర్ అవుతాడు. రత్తాలు ఏ చదువూ లేని పల్లెపిల్ల. తెలుగు సినిమాలో తప్ప వీరి మధ్య పెళ్లి జరిగే విషయం కాదు. అందుకే రాంబాబును నవల పేరులోనే, పేరుకే, ఆమె పక్కన నిలబెట్టారు రావిశాస్త్రి. సానికొంపలపాలు కావడం ఆమె బతుకులో వచ్చిన ఎమర్జెన్సీ. అయినా దేశమంతటా అన్యాయమే ఉండదు కాబట్టి ముత్యాలు, రాంబాబు, ఇంకా చదువుకున్న మిత్రులు ఆమెని ఆ మురికి కూపం నుంచి తప్పించే ప్రయత్నం చేస్తారు. ఈతచెట్టు వంటి వేశ్యల కంపినీలో చిక్కుకున్నందుకు, లోకం ఆమెపై కల్లు తాగిన నేరం ఆపాదించి నిరాశ్రయను చేసింది. తన జీవితంలో ఎమర్జన్సీ తొలగి, ఒక వేకువ వేళ, లోకంలోకి వచ్చింది రత్తాలు.

'రత్తాలు-రాంబాబు' ఒక సోషల్ డాక్యుమెంట్. ప్రేమ, పెళ్లిళ్ల కథ కాదు. రత్తాలు అలాంటి మురికికూపంలో చిక్కుకుని కూడా క్షేమంగా ఎలా బయటపడిందని అడిగే వారూ ఉన్నారు. వారికి అభినందనలు. ఎందుకంటే, రత్తాలు మనం అనుకుంటే ఒక మనిషే, లేదా ఎమర్జెన్సీకి గురైన దేశం. రత్తాలుకు, లేదా దేశానికి కష్టాలూ కడగండ్లు వస్తాయి, కానీ దేశం చెడిపోదు, రచయిత చెడగొట్టడు, ప్రమాదం అంచు మీద నుంచి లాఘవంగా ఆమెను తప్పిస్తాడు. ఎందుకంటే రత్తాలు కేవలం రత్తాలు కాదు, ఆమె భారతత్తాలు. ఆమె క్షేమం దేశ పౌరులందరి బాధ్యత. ఇంతటి నవల అసంపూర్ణమా? దేశంలో ఎమర్జన్సీ మీద ఇంత పెద్దచిత్రణ, ఎమర్జన్సీ కాలంలోనే, భారత దేశంలోనే వచ్చి ఉండదు. అందుకే, రావిశాస్త్రి వంటి సాహిత్య విశ్వవిద్యాలయాన్ని చదవడానికి కొత్త చూపు అవసరం.

'రత్తాలు-రాంబాబు' ఒక సోషల్ డాక్యుమెంట్. ప్రేమ, పెళ్లిళ్ల కథ కాదు. రత్తాలు మురికికూపంలో చిక్కుకుని కూడా క్షేమంగా ఎలా బయటపడిందని అడిగే వారూ ఉన్నారు. వారికి అభినందనలు. ఎందుకంటే, రత్తాలు మనం అనుకుంటే ఒక మనిషే, లేదా ఎమర్జెన్సీకి గురైన దేశం. దేశానికి కష్టాలూ కడగండ్లు వస్తాయి, కానీ దేశం చెడిపోదు. ఇంతటి నవల అసంపూర్ణమా?

■ రామతీర్థ
98492 00385

(జూలై 30న రావి శాస్త్రి 95వ జయంతి)

పాటకు నోబెల్ పట్టం



పాశ్చాత్య సమాజాలలో ప్రజల సమస్యలు, శాంతి ప్రియత్వం, యుద్ధ వ్యతిరేకత, సామాజిక న్యాయంకై జనజాగృతి ఒక అర్ధ శతాబ్దంగా ప్రకటిస్తూ వచ్చిన ఒక సంస్కార స్వరానికి, సాహిత్య సంగీతాలు ఒక సమాహార కళగా నిలిపిన సంపన్న రూపానికి, ఈ గౌరవం అందినందుకు సంఘీభావం ప్రకటిద్దాం.

మనలో ఎంతమందికి చుండూరు, కారంచేడు బాధితుల వేదన అర్థమవుతుంది? వారి న్యాయ పోరాటాలు, దేశవ్యాప్తంగా ఎలా నీరు కారిపోతుంటాయో, బడుగు ప్రజలపై జరిగే అసంఖ్యాక నేరాలలో, సామాజిక దౌష్ట్యాలలో, ఎలా కొంతమంది మాత్రమే విచారణ వరకూ వచ్చి, చాలా తేలికపాటి శిక్షలతో బయటపడుతూ ఉంటారో, చూస్తే, మనం ఒక అసమ సమాజంలో ఉన్నామని అర్థమవుతుంది. అయితే మన రాజ్యాంగం ఇలా అసమ విలువలను అంగీకరించలేదు. 'ఒక మనిషికి ఒకే విలువ ఏ విషయంలో అయినా' అని రాజ్యాంగం మనకు హక్కులు ఇచ్చింది కానీ వాస్తవంలో ధనవంతులు, అగ్రకులాలవారు పొందే మర్యాదలు, వెసులుబాట్లు, పేదలు, నిమ్నకులాలవారు పొందడం కష్టం అన్న సామాజిక వాస్తవం అయితే మనం కనుల ముందర బలంగానే ఉన్నది. స్త్రీలు, యువత విషయంలో, పల్లెలో ఉండే తక్కువ కులాల ప్రజల పట్ల నిర్దయతో వ్యవహరించే ఖాప్ పంచాయతీలు కానివ్వండి, విశ్వవిద్యాలయాల్లో వివక్ష కానివ్వండి, ఇది కనిపించని కులం మీద, ఆ కుల దురహంకారం మీద ఆధారపడి మన సమాజంలో సంఘటనలుగా జరుగుతూ ఉంటుంది. దీనిపై మనకు కొంత సాహిత్యం, కళా రూపాలు ఉన్నాయి. ఇవి ఉండకూడదు అని చెప్పే ప్రభుత్వ ప్రబోధాత్మక కళారూపాలు, సాంస్కృతిక రూపాలు, పలు రచయితల రచనలు ఉన్నాయి. ఇది మన దేశం ఎరిగిన సాంస్కృతిక వాతావరణం.

అమెరికాలో ఇంకా క్రూరమైన వివక్ష, తెల్లవారు, నల్లవారు పేరిట 1960ల వరకూ అమలవుతూనే ఉండేది. ముఖ్యంగా దక్షిణ అమెరికాలో. దీనిపై మనుషులందరూ ఒక్కటే అన్న వాస్తవం ఎరిగినవారు, అబ్రహం లింకన్ కాలంనుంచీ అక్కడ పోరాటం చేస్తూనే ఉన్నారు. ఇప్పటికీ, ఆ వివక్ష నేరమని ప్రకటించినా, కొన్ని హేట్ క్రైమ్స్ (ద్వేషపూరిత నేర చర్యలు) ఆ సమాజంలో జరుగుతూనే ఉన్నాయి. 1960 నాటి అమెరికన్ సమాజం అర్ధ శతాబ్దం కిందట వర్ణ వివక్ష విధానాలు ఇంకా బలంగా ఉన్న ఒక సాంఘిక వాస్తవం. ఆ రోజులనుంచీ పౌర హక్కుల కోసం పాటలు రాస్తూ, ప్రజలలో ఒక చైతన్య స్ఫూర్తి, న్యాయవర్తనం పట్ల స్పృహ కలిగించినవాడు బాబ్ డిలాన్. అలా యాభయ్యేళ్ల అమెరికా ఎన్ని ఒడుదుడుకులు ఎప్పుడెప్పుడు ఎదుర్కొన్నదో, అప్పుడల్లా, తమ సామాజిక ఇంగితంతో, యుద్ధ వ్యతిరేకత ప్రకటిస్తూ, మారుతున్న కాలంలో ప్రజలూ, ప్రభుత్వాలు కూడా మారాల్సిన అవసరం గుర్తు చేస్తూ వచ్చిన ఒక వివేక స్వరం బాబ్ డిలాన్.

ఈయన రాసిన పాటలకు నోబెల్ బహుమతా అన్న ఆశ్చర్యం ఇంకా ప్రపంచ సాహిత్య రంగంలో ఉండనే ఉన్నది. ఉంటుంది కూడా. ఎందుకంటే, ఇవాళ ఆహా, బాబ్ డిలాన్‌కు సాహిత్య నోబెల్ వచ్చింది, ఆయనది ఏదైనా పుస్తకం కొందాం అని ప్రయత్నిస్తే, మనకు ఒక్క పుస్తకం కూడా దొరకదు. ఆయన విడుదల చేసిన పాటలన్నీ అల్బంల రూపేణా, ఆంగ్లంలో, అమెరికన్ యాసలో ఉన్నాయి. అవి ఇతర దేశాల వారికి ఎంతవరకు పాటలుగా అర్థమవుతాయి అన్నది కూడా ఒక ప్రశ్నగానే మిగిలివుంటుంది. అవి మన పాటల వలె ఉండవు. మనకి రెండే రకాల పాటలు తెలుసు. సంప్రదాయ పద్ధతిలో పాడే కీర్తనలు, కృతులు, అష్టపదులు, పదాలు, కొన్ని జానపదాలు. ఇవి సంగీతవేత్తలు, కాయకష్టం చేసుకునే ప్రజలు పాడుతారు. లేదా, అన్నిటినీ మింగేసే సినిమా పాటగా, మనకు పాటలు అంటే తెలుసు. కానీ అమెరికాలో అలా కాదు.

పాట అక్కడ ఒక ప్రజా సాంస్కృతిక రూపం. సినిమాలలో పాటలు, మన భారతీయ సినిమాలలో తప్ప ఎక్కడా ఉండవు. పాటగాళ్ళు, తమ పాటల ద్వారా రికార్డుల ద్వారా, తమ ప్రత్యక్ష ప్రదర్శనల వల్ల వచ్చే ఆదాయం ద్వారా స్టార్ హోదాతో బతికే అవకాశాలు అక్కడి సమాజాలు కల్పించాయి. అలాంటి సమాజంలో ఈ గేయ రచయితలూ, సంగీత కళాకారులు, వీరి బృందాలూ, ప్రభుత్వంతో విభేదిస్తూ కూడా, తమ గీతాలను ప్రజలకు వినిపిస్తారు. అలా బడుగు, బలహీన అమెరికన్ ప్రజలకు, తన మద్దతు ఇచ్చిన వాడిగా బాబ్ డిలాన్‌కు అర్ధ శతాబ్దపు కీర్తి ఉన్నది. అది ఆయన బలం. 'రాక్ ఎన్ రోల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో ఆయనకు శాశ్వత స్థానం ఉన్నది. ఆయన సంగీత ఆల్బమ్‌లు పాశ్చాత్య దేశాలలో నూరు మిలియన్లకు పైగా అమ్ముడయ్యాయి. వాటి సంగీత విలువలు, మన అభిరుచులతో చూస్తే హాయిగా పల్లవి, చరణాలుగా ఉండవు. పైగా అమెరికన్ యాసలో, వారి ఇంగ్లీష్ ఉచ్చారణలో పాడుతారు కనుక, మనకు ఎంతవరకు అర్థమవుతాయి అన్నది కూడా, ఒక ఇబ్బందే. ఇన్ని ఇబ్బందుల ముందర ఎప్పుడూ మనం సాహిత్య నోబెల్‌తో ఎదుర్కోలేదు. నోబెల్ పొందిన సాహితీవేత్త వెలువరించిన పుస్తకాలు ఉండేవి. వాటిలో ముఖ్యమైన వాటిద్వారా, ఏం చెప్పారు, ఏ ప్రక్రియ, ఏ శిల్పం, ఏం సంవిధానం, ఇటువంటి విషయాలపై పాఠకులు, విమర్శకులు, విశ్లేషకులు సాముదాయక చర్చలో పాల్గొనే ఒక వాతావరణం ఉండేది. ఇప్పుడు బాబ్ డిలాన్ విషయంలో మనకు అలా పుస్తకాలు దొరికే సౌలభ్యం ఏమీ లేదు. రాసిన పాటలను 'లిరిక్'లు అంటారు తప్ప, వాటిలో కొన్ని ఏర్చి కూర్చి, కవిత్వం అంటూ ప్రత్యేకంగా సంపుటాలు వెలువడలేదు. అయినా నోబెల్ సాహిత్య సంఘం ఈసారి బాబ్ డిలాన్ తమ ఎంపిక అని తెలిపింది. మళ్లీ ఇలాంటి కళాకారుడికి నోబెల్ ఇవ్వడానికి చాలా కాలం పట్టవచ్చు.

అయితే, పాటలలోని పౌర హక్కుల సమస్యలు, అమెరికా ప్రపంచ ఆధిపత్యం కోసం చేసే యుద్ధాలు వీటిపట్ల నిరసన, తమ బిడ్డలను కోల్పోయే అమెరికన్ తల్లులతో సంఘీభావం, స్త్రీలకు, పేద పిల్లలకు మద్దతు, బాబ్ డిలాన్‌ను అమెరికాలో ఒక ప్రియమైన సాంస్కృతిక కార్యకర్తగా మలిచాయి. ఈ పాటలు కొన్ని చిన్నవిగా ఉన్నా, చాలావాటిలో నాలుగు వందల నుంచి ఐదువందల మాటల దాకా ఉంటాయి. అవి పల్లవి, చరణాలుగా కన్నా, గేయ కథలుగా ఉంటాయి. ఇదే బాబ్ డిలాన్ సాహిత్య సేవ. అవి కవితలైతే, ఒక పుస్తకంలో ఉండిపోయేవి.

బహుశా, గీతాలు కావడం వలన, ఆల్బమ్‌లుగా విడుదల కావడం వలన పదేపదే అమెరికన్ సమాజంలో రెండు తరాల ప్రజలు విని ఉత్తేజం పొందిన ఒక సంగీత వాతావరణంలో అమెరికాలో బాబ్ డిలాన్ లేని ఇరవయ్యో శతాబ్దపు సంగీత వాతావరణం ఊహించలేము. అదీ ఆయన ప్రాధాన్యత. సంగీత ప్రపంచం ఆయనకు ఇవ్వవలసిన అన్ని గౌరవాలు ఇచ్చింది. ఇవాళ సాహిత్య రంగం కూడా ఆయనకు అగ్రాసనం అందించి గౌరవించింది.

1960ల్లో ఒక నల్లజాతి స్త్రీ వర్ణవివక్ష అమలులో ఉన్న చార్లెస్ కంట్రీలో చావుకు గురైన దురంతంపై యువకుడైన బాబ్ డిలాన్ పాట, ఒక అఘాయిత్యంపై నిరసన స్వరం. యుద్ధోన్మాదాల అమెరికాను కూడా ఆయన క్షమించలేదు. ఇది అవధులకు దాటిన ప్రత్యేక నోబెల్ అయినప్పటికీ, పాశ్చాత్య సమాజాలలో ప్రజల సమస్యలు, శాంతి ప్రియత్వం, యుద్ధ వ్యతిరేకత, సామాజిక న్యాయంకై జనజాగృతి ఒక అర్ధ శతాబ్దంగా ప్రకటిస్తూ వచ్చిన ఒక సంస్కార స్వరానికి, సాహిత్య సంగీతాలు ఒక సమాహార కళగా నిలిపిన సంపన్న రూపానికి, ఈ గౌరవం అందినందుకు సంఘీభావం ప్రకటిద్దాం.

- రామతీర్థ, 9849200385

సరికొత్త వేదన

ఆ అడవి కోడిపుంజు కూతలు
ఇంకా నీ దరికి చేరలేదా?
రోడ్డుకు అడ్డంగా కుందేలు గంతులు వేస్తోంది
వంతెన కింద నది పరవళ్ళు తొక్కుతోంది
ఈ నీలాకాశం నీడలో
నీ నవ్వుల వెలుగును చూడటం సంబరంగా ఉంది
ఈ తొలి వేకువ సమయాన, వేకువ వేళన
ఈ కొత్త ఉదయాన్ని
నీతో కలిసి చూడటం సమ్మోహనంగా ఉంది.

ఆ మోటారు వాహనం సవ్వడి
నీకు వినిపించడం లేదా?
పల్లెకు దారితీసే రోడ్డుకు ఒకట్రెండు మైళ్ళ దూరాన
ఆ వాహనం వయ్యారంగా రావడం నిన్నాకర్షించలేదా?
అయితేనేం, ఈ నీలాకాశం ఛాయలో
నీ నవ్వుల మెరుపును చూడటం ఆనందంగా ఉంది
ఈ కొత్త ఉదయాన, ఉదయ కిరణాలలోన
ఈ తొలి వేకువను
నీ కళ్ళలోంచి చూడటం మహదానందంగా ఉంది...

ఎప్పుడూ సుదీర్ఘంగా నిట్టూర్చే రాత్రి
ఇప్పుడేమో క్షణాల్లో కరిగిపోయింది
నువ్వు నాతో ఉన్న ప్రతిసారీ జరిగే సహజ అద్భుతం కదా ఇది

ఇంకా నీకు సూర్యుడి ఎండ పొడ తగలలేదా?
ఊరి పక్కన కాలువ గట్టు అంతటా
Ground hog సూచనలే
ఖచ్చితంగా నా కలలన్నీ నిజమయ్యే రోజు ఇదే కదా
అందుకే, ఈ నీలాకాశం దిగువన
సజీవంగా ఉన్నందుకు సంతోషంగా ఉంది
ఈ నవకాంతి సమయాన, నవ్య వెలుగులలోన
ఈ నవనవోన్మేష ఉదయాన్ని
నీతో పంచుకోవడం వేడుకలా ఉంది.

ఈ నీలాకాశం కౌగిట్లో
ఇంకా సచేతనంగా ఉన్నందుకు గొప్పగా అనిపిస్తోంది
ఈ తొలి కిరణాల సమయాన, తెలి కాంతులలోన
ఈ తొలి పొద్దును
నీతో కలిసి పంచుకోవడం మహా గొప్పగా ఉంది
ఈ కొత్త పొద్దున...

మూలం: బాబ్ డిలాన్ 'New Morning'
స్వేచ్ఛానువాదం : మామిడి హరికృష్ణ
9908844222

> కాలం వంతెనపై కత్తుల దారులపై
> కవిత్వం అల్లేవాడే కవి.. మారే కాలం కోసం
> మార్చే మనుషుల కోసం అక్షరాలను
> కూర్చేవాడే కవి..
>
> \- మహాకవి శ్రీశ్రీ

సవ్వడి

ప్రజాశక్తి
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti
విజయవాడ
ఆదివారం 16 అక్టోబరు 2016

పురస్కారం

పాటకు నోబెల్ సాహిత్య అట్టహాసాభిషేకం

కన్యాశుల్కం నాటకంలో గిరీశం అంటాడు : 'టు బి ఆర్ నాట్ టు బి' షేక్స్పియర్ పడ్డ అవస్థలో పడ్డాం అని. ఈ ఏడాది నోబెల్ కమిటీ సాహిత్య పురస్కారమూ అటువంటి విచికిత్సనే కలుగజేస్తున్నది. పాత్రికేయులకు విస్తరించడం గత ఏడాది మొదలయింది. పాటగాళ్ళకు ఈ ఏడాది ప్రదానం చేసారు. హాస్యగాళ్ళకు ముందు ముందు ఇస్తారేమో! ఈ రచనలు పాటలు అంటే- పాడబడే ప్రక్రియలో సంగీతానికి దోహదపడేవీ తప్ప, చదువుకునే కవిత్వమూ, వచన రచనలూ కావు. సంగీతయుద్ధం కాకపోతే వీటికి వేరే చదువుకునే అస్తిత్వం లేదు. అయితే వీటివల్ల ఒనగూడిన సామాజిక ప్రయోజనం ఉంది. సంగీత లోకాన బాబ్ డిలాన్ ఇప్పటికే సుప్రసిద్ధుడు. 'రాక్ ఎండిరోల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో ఉన్నాడు. ఇది చదువరుల లోకపు సాహిత్యమవుతుందా అంటే కాదు. కానీ, అది అమెరికన్ పెట్టుబడిదారీ యుద్ధోన్మాద సమాజ పోకడలపై నిశితమయిన సంగీత స్వరం.

ఈ నోబెల్ బహుమతి పట్ల ఎటువంటి దృక్కోణం మనం కలిగి ఉండాలి? అమెరికన్ రాక్ పాటగాడికి తన రంగంలో రావాల్సిన గుర్తింపులన్నీ వచ్చాక, ఇలా నోబెల్ సాహిత్య సంఘం కూడా పిలిచి పెద్దపీట వేయడంలో గల ఔచిత్యం తక్కువ అని మనం చెప్తే అందరికీ ఆమోదయోగ్యం కాకపోవచ్చు. ఆచితూచి నోబెల్ సంఘం తీసుకున్న ఈ నిర్ణయంపై అమెరికాలోని ప్రముఖ దినపత్రిక 'న్యూయార్క్ టైమ్స్'- 'నోబెల్ సాహిత్య బహుమతికి అనర్హుడు బాబ్ డిలాన్' అన్న శీర్షికన ఇలా విశ్లేషణ ఇచ్చింది.

'ఆయనకు ఎన్నో గ్రామీ అవార్డులు వచ్చాయి. 1991లో ఒక జీవన కాల సాఫల్య పురస్కారం కూడా. 'రాక్ ఎండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేమ్'లో, 1988లో ఇతర బృందాల గాయకులు సుప్రీమ్స్, బీటిల్స్, బీచ్ బాయ్స్‌తో బాటుగా ఆయన్ని చేర్చడం తగినదే. ఆయనొక అద్భుతమైన సంగీత కళాకారుడు. ప్రపంచ స్థాయి గేయ రచయిత, ఆమెరికన్ సంస్కృతిపై హెచ్చు ప్రభావం గలిగిన ప్రముఖ వ్యక్తిత్వం ఆయనది. కానీ, ఆయనకు నోబెల్ సాహిత్య బహుమతి ప్రకటించడం ద్వారా నోబెల్ సాహిత్య సంఘం చేస్తున్నదేమిటంటే- రచన ప్రధానమైన రచయితలను, ఈ పురస్కారానికి ఎంపిక చేయకపోవడం. ఇదీ ఇక్కడ నిరాశ కలిగించే విషయం.'

అవును. డిలాన్ ప్రతిభావంతమైన గేయకర్త. ఓ పుస్తకం వచన రచనలు, ఓ ఆత్మకథా రాశారు. అవును.. ఆయన గేయాలను కవిత్వంగా ఎంచి విశ్లేషించడం సాధ్యమే! అయితే వారి పాటలు సంగీతంలో అంతర్భాగం. గొప్ప సంగీతజ్ఞుడైన కారణంగానే ఆయన ప్రఖ్యాతుడయ్యాడు. మరి నోబెల్ సాహిత్య సంఘం తన సాహిత్య నోబెల్‌ను ఒక సంగీత కళాకారుడికిచ్చి, ఒక రచయితను గౌరవించే అవకాశాన్ని పోగొట్టుకుంటున్నది.

ప్రపంచవ్యాప్తంగా చదవడమనే అలవాటు తగ్గిపోతున్న కాలంలో సాహిత్య రంగంలో బహుమతులు ఇపుడు ఇంకా ముఖ్యమైనవి అయ్యాయి. ప్రఖ్యాత పురస్కారం వచ్చిందీ అంటే ఆ రచయత రచనలకు పాఠకుల పెరుగుతారు. అంతేగాక రచయిత సృజనాత్మక

రచనకు నోబెల్ ఇవ్వడం అంటే కవిత్వమూ, కథారచనా ఇప్పటికీ మానవాళికి ఉపయుక్తమైన రచనారీతులుగా గుర్తించి వాటికి దన్నుగా నిలబడ్డం కూడా. ఎందుకంటే మానవ కృషిలో ఈ ధోరణులు అంతర్జాతీయ గుర్తింపునకు దారులుగా, ఇంకా వాటిని గౌరవించడంగా కూడా సంకేతాలు వెలువడతాయి.

ప్రజానురంజక సంగీతం కూడా అటువంటి రంగమే! అయితే కేవలం చదువరులకు పరిమితమయ్యే సాహిత్యం కన్నా, శ్రోతల, ప్రేక్షకుల ప్రపంచంలో సంగీతం, గేయాలు, వాటి ప్రదర్శనలు పొందాల్సిన గౌరవాలు, గుర్తింపులు పొందే ఉంటాయి ముందుగానే. ఏదో పాటల రచయితలుగా, సంగీత ప్రపంచం రచయితలను, కవులను గుర్తించవచ్చేమో కానీ రచనా రంగ ప్రఖ్యాతులయిన జేడీ స్మిత్, మేరీ గేట్ స్కిల్ వంటి వారికి కేవలం వారి రచనలకే, సంగీత కళాకారులకు ఇచ్చినట్టుగా 'రాక్ ఎండ్ రోల్ హాల్ ఆఫ్ ఫేం'లో స్థానం కల్పిస్తుందా అంటే కల్పించదు అని మనందరికీ తెలుసు.

ఈ ఏడాది నోబెల్ సాహిత్య సంఘం, తన ఎంపిక ద్వారా కవిత్వ రచనను చిన్నపుచ్చదల్చుకుందా? అంటే బహుశా అలాంటిదేమీ లేదనే చెప్పాలి. సంగీత ప్రపంచపు ప్రఖ్యాత వ్యక్తిని, సాహిత్య కృషికి గాను గుర్తించడం ద్వారా బహుశా నోబెల్ సాహిత్య బహుమతికి కొత్తదీ, విశాలమైనదీ అయిన చలామణీని కల్పిస్తూ, ఈ పురస్కార ప్రక్రియను యువ, నవతరాలకు దగ్గరగా తీసుకురావాలన్నది వారి ఉద్దేశం కావచ్చు!

అయినా, ఆ ఉద్దేశాన్ని అచరణలోకి తేవాలన్నా, ఒక రచయితను తగు సాహిత్య కృషికై నోబెల్ సాహిత్య బహుమతితో గౌరవిస్తూ కూడా, అదే సమయంలో వారు ఇందుకు అర్హులయిన జెన్నీఫర్ ఎగాన్, తేజుకోల్ లేదా ఆన్నెకార్సన్‌లను తమ ఎంపికకు పరిగణించి ఉండొచ్చు. నోబెల్ సాహిత్య విజేతలుగా బొత్తిగా తక్కువగా సంఖ్యలో ఉన్న తృతీయ ప్రపంచ దేశాల నుంచి, అర్హుడయిన రచయితను ఎంపిక చేసి ఉండవచ్చు. లేదూ సాంకేతికంగా ప్రపంచ వ్యాప్త పాఠకులను ఆన్‌లైన్‌లో సాధించిన వాడు, 2014లో లండన్‌లో యువ పోయిట్ లారేట్‌గా ఎంపికయిన వార్సన్‌షెర్‌ను ఎంపికలోకి తీసుకొని ఉండొచ్చు. ఇవన్నీ పక్కకు నెట్టి నోబెల్ సాహిత్య సంఘం ఇంకో రంగంలో ఇప్పటికే ఎన్నో ఏళ్ళుగా ప్రపంచ ప్రఖ్యాతి గల వ్యక్తికి, ఆ సంగీత రంగంలో పలు గౌరవాలు పొందిన కళాకారుడికి ఈ నోబెల్ సాహిత్య బహుమతి ప్రకటించింది. బాబ్‌డిలాన్‌కు నోబెల్ సాహిత్య బహుమతి అవసరం లేదు కానీ సాహిత్యానికి ఒక నోబెల్ బహుమతి కావాలి. ఈ ఏడాది సాహిత్యానికి నోబెల్ దక్కలేదు."

సాహిత్యం అంటే ముఖ్యంగా చదువుకోదగ్గది. అది ఈ ఏట విజేత విషయంలో చాలా తక్కువ. ఆల్బంలున్నంతగా అక్షరాల సంపుటాల్లేవు. సాంస్కృతికానుభవాన్ని శ్రోతలుగా మాత్రమే ఈయన రచనలు సుసంపన్నం చేస్తాయి. పాత్రికేయులు, పాటగాళ్ళూ, హాస్యగాళ్ళూ, తమ జనరంజక సృజన, పాత్రికేయ కథనాల ద్వారా పొందడానికి ఎన్నో పాత్రికేయరంగ పురస్కారాలూ, సంగీత ప్రపంచ గౌరవాలూ ఉన్నాయి. మరి వీరిని ఏ కేటగిరీలో సృజన ప్రధాన, చదువరుల ప్రధాన, సాహిత్య మాధ్యమంలో చేరుస్తున్నారు? ఈ విధమైన చేర్చివేత - టు బి యాక్సెప్టెడ్ (అంగీకార యోగ్యమా), నాట్ టు బి యాక్సెప్టెడ్ (అంగీకరించ రాదా) అనేదే ఈ ఏడాది నోబెల్ సాహిత్య పురస్కార ప్రకటన తర్వాత ఏర్పడిన సందిగ్ధత!

వీరిని సాహిత్య రంగం గుర్తించదలుచుకుంటే స్పెషల్ కేటగిరీ అవార్డుగా ఈ కళలను గుర్తించి గౌరవించడం సముచితమైన పని. కానీ, ఇలా వీరికోసం నోబెల్ సాహిత్య బహుమతిని కేటాయించి ప్రకటించిన ప్రతీ ఏటా, అన్ని అర్హతలు, విస్తార రచన, జీవన తాత్వికత గల సృజనాత్మక రచయిత ఆ అవార్డుకు దూరం అవుతున్నాడన్నది వాస్తవం.

ఇక బాబ్ డిలాన్ గురించి... ప్రజాపక్ష చైతన్యం గల వాడిగా, పాట ఒక సామాజిక అభివ్యక్తిగా దశాబ్దాల కృషి సంపన్నుడు డిలాన్. 1960-62 నాటి శీతల యుద్ధ భయాల రష్యా అమెరికాల మధ్య 'క్యూబన్ క్షిపణి సంక్షోభం' కారణంగా అమెరికాపై దట్టమైన యుద్ధ మేఘాలుండగా - యుద్ధ వ్యతిరేకత గల ఆగ్రహస్వరంగా - డిలాన్ గీతం 'మాస్టర్స్ ఆఫ్ వార్' సుప్రసిద్ధం. ఆయన 'ద ఫ్రీ వీలింగ్ బాబ్ డిలాన్' ఆల్బంలో 1963 వసంతంలో విడుదలయింది.

పాశ్చాత్యులకు పాట అంటే సినిమా పాట కాదు. భక్తి సంగీతాలు, క్రిస్టియన్ కెరోల్ పాటలు, నైట్‌క్లబ్బుల పాటలూ కాదు. పాట వ్యక్తులు, బృందాలుగా ఏర్పడి తాము రాసుకుని, పాడి, ఆడి, ప్రదర్శించి, ఆల్బమ్‌లుగా చలామణీ అయ్యే ఒక ప్రధాన లౌకిక కళ. ఇందులో సమాజమే కన్పిస్తుంది. డిలాన్‌లో అభ్యుదయ వాదానికి కొదవ లేదు. ఆయన యుద్ధ ప్రతికూలత, శాంతికాముకతకు ఒక నిండు స్వరం. (ఆయన రచించిన గీతం మాస్టర్స్ ఆఫ్ వార్ (యుద్ధ గురువులు) తెలుగులో అందిస్తున్నాం.)

\- రామతీర్థ
9849200385

కవిత

యుద్ధ గురువులు

రండిరా మీరు యుద్ధాల గురువులారా
తుపాకీల తయారీదారులారా
మరణఘోష విమాన నిర్మాతలారా
బాంబులు పేల్చే కలహ సంతోషులారా
నక్కి నక్కి గోడ వెనుక దాగువారలారా
ఇది మీ రెరుగాలని రాసానీ గీతం
చూడగలను నేను మీ ముసుగుల గుండా

ఏం చేసారు ఏం చేసారు అదనంగా మీరు
విచ్చలవిడి విధ్వంస నిర్మాణం మినహా
ఆటలాడినారు మీరు నా లోకంతో
తలచారది మీ తుంటరి ఆటల బొమ్మగా
నా చేతికి అందిచేసారొక తుపాకీ
లాగారు మీరు నాకు కనపడకుండా
పరుగులు పరుగులె మీరు తీసినారు
తూటాలటు ఇటు దూసుకు పోతుండగా

అలనాటి జుడాస్ లక్షణాల మీరు
కల్లలు, నయవంచనలు మరిగినారు
గెలుస్తామని ప్రపంచ యుద్ధం మీ ప్రచారం
నమ్మమందురు నన్ను కూడా మీ ప్రకారం
నా కనుల సాక్షిగానే చూపిన దృశ్యాలివి
నా బుద్ధి నాదిగా చెలరేగిన తలపులివి
కాలువల పారే మురికి జనాలకు
అడుగున ఉన్నది అందినది నా కనులకు

తుపాకి మాటలు సరిచేస్తారు మీరు
అది పేల్చాల్సిందెవరో ఎవరో ఇంకొకరు
చొరబడి కూచొని గమనిస్తారది మీరు
చావుల లెక్కలు పెరుగుతున్న తీరు

దాక్కుంటారు మీ ఎత్తరి
భవనాలలో
యువకుల దేహాల చిమ్ము
కర్తం
పారి ఏరులై పారి ధారలై
బురద పాలు,
బుగ్గిపాలవుతుండగా

లోకాలకు బెదురు కలిగి మీ వలన
ఏనాటికి దాన్ని దాటి పోలేరు జనులు
పిల్లా పాపలకు ఈ తగువుల లోకానికి
కని ఇవ్వడమా అన్నదే ఆ శంకముల్లు
ఇంకా పుట్టని పాపలకు రూపురేఖలేనివారికి
మీ దయ వలన మిగిలాయి బెదిరింపులే
మీ నరాల పాకే నెత్తురు చెలమలంత
విలువలేని వ్యర్థులు, అధములు మీరు

అడగవచ్చు మీరెదురడగవచ్చు నన్ను
ఇన్ని ప్రశ్న లేయ నీకు ఏమి ఎరుకగలదని
ఇంకా పైలా పచ్చీసు యువకుడివే
అయినా నేనిది ఎరుగుదును మేలుగా
రావచ్చు మీ ఉన్న వయసున నేను చిన్న
అయినా ఏసు సైతం క్షమించదు
మీ దురాగతాల దుమారాలను

అడుగనీయండి నన్నొక ప్రశ్న మిమ్మల్ని
అంత ఉత్తమమా మీ ఐశ్వర్యాలన్నీ
మీకవి క్షమను కొని పెడతాయా
అలా గనుక అదే గనుక మీ తలపోతైతే
మీకు మీకు మీకే తెలిసొస్తుంది బాగా
మీ చావు మీరు చచ్చినపుడా మీకు
నిలువెత్తు ధనం పోసినా తిరిగి రాదు
అందరాదు కొనుగోలుకు మీ అంతరాత్మ

ఆశిస్తున్నా నేను మీరందరు చావాలని
త్వరలోనే వస్తుందా మరణ ఘడియ
నేను మా శవపేటికలెమ్మడే నడుస్తాను
ఆ పాతిన మధ్యాహ్నాల నీరెండల గుండా
చూస్తాను మిమ్ములను గోతిలో పెట్టడాన్ని
మీ చావు పడకలపై తుదిగా చేర్చడాన్ని
నేను నిలబడతా మీ సమాధుల మీద
మీరు చచ్చారని నాకు రూఢి అయినాక!

ఆంగ్ల గేయం : బాబ్‌డిలాన్
తెలుగుసేత : రామతీర్థ

డొక్కా సీతమ్మ నాటకం - కళా బ్రహ్మ స్వరూపం

రామతీర్థ
9849200385

అన్నం పరబ్రహ్మ స్వరూపం అయితే, డొక్కా సీతమ్మ నాటకం కళా బ్రహ్మ స్వరూపం. పెద కాకాని వారిచే విశాఖ పట్నంలో రైటర్స్ అకాడెమీ సారథి లీడర్ రమణమూర్తి గారి ద్వారా సమరితం అయిన ఈ నాటకం ఒక మంచి ప్రదర్శన. ప్రదర్శితం అయిన నాటకం రచయిత రామకృష్ణ. కథన భాగాలను, క్రమేపీ ఉన్నతీకరిస్తూ, పిల్లనాటి చేష్టలనుంచి పెద్ద కాలపు వితరణల దాకా చక్కగా కథా ఉన్నతిని రంగస్థల ప్రదర్శనగా రచించుకున్నా తీరు ప్రశంసనీయం.

తూర్పు గోదావరి జిల్లాలో ఒక కుగ్రామంలో జన్మించి లంకల గన్నవరం గ్రామానికి డొక్కా జోగన్న గారి భార్యగా మెట్టినింటికి వెళ్ళిన అలనాటి మహిళా చైతన్యం డొక్కా సీతమ్మ. ఈ వూరు లంకల మధ్య ప్రయాణికుల మధ్య మజిలీగా ఉండడం వలన, లంకల గన్నవరం గాను, డెల్టా గన్నవరం గాను పిలవబడేది. ఇక్కడ మార్గ మధ్య ప్రయాణికులు ఆకలి తీరేందుకు ఎటువంటి సదుపాయాలు ఉండేవి కావు. పైపెచ్చు మధ్య మధ్యలో గోదావరి వరదలు కూడా వచ్చి ఉప్పొంగి రాకపోకలు సాగించే ప్రజలు,పడవలు తప్ప వేరే ప్రయాణ సాధనాలు గ్రామాల మధ్య లేకపోవడం వలన, చాలా ఇబ్బందులు పడే వారు. ఇక్కడ వీరికి, ఆకొన్న వారికి నిరతం అన్న దాన సదుపాయం వలన, డొక్కా సీతమ్మ అన్న దాన వ్రతం పలు ప్రాంతాలకు పాకి, ఆమెకు, డొక్కా వారి కుటుంబానికి విశేష ఖ్యాతి తీసుకువచ్చింది. ఆమె భర్త డొక్కా జోగన్న పంతులు వేద పండితుడే కాక, మంచి హృదయం గల గృహస్థు. తన మూడో కలత్రంగా వచ్చిన డొక్కా సీతమ్మను అనురాగంతో చూసుకోవడమే కాక, ఆమె తలపెట్టిన పనులకు మద్దతు ఇచ్చే వాడు. ఇది కారణంగా, ఇద్దరి మధ్య వయసు అంతరం ఉన్నా, అతని ఆదర్శ వంతమైన పత్నిగా డొక్కా సీతమ్మ తన సంకల్పం అయిన అన్న దానాన్ని కొన సాగించగలిగింది.

డొక్కా సీతమ్మ నాటకంలోని ఓ సన్నివేశం

నాటకం ఆరంభంలో, లండన్ మ్యూజియంలో గల డొక్కా సీతమ్మ వర్ణ చిత్రం చూసిన తెలుగు వారు, మన రాష్ట్రం వారు, భారత దేశ స్పీకర్‌గా ఎదిగిన జి.ఎం.సి. బాల యోగి, తమ ప్రాంతానికి చెందిన, ఆ మహిళా మణి ఛాయా చిత్రం, లండన్ మ్యూజియంలో గౌరవ స్థానం పొందడం పట్ల తమ ఆనందం వ్యక్తం చేస్తూ, ఆమె కథ తెలుసుకోవాలని, వారు ఆ డెల్టా గన్నవరం ప్రాంతనికి వస్తారు. అక్కడ డొక్కా వారి కుటుంబం వారి ప్రతినిధి, వారికి, సీతమ్మగారి జీవిత కథ చెప్పడం అనే పద్ధతిలో ఈ నాటకం మొదలు అవుతుంది. చిన్న పిల్లగా తండ్రి ఇంట ఉన్నప్పట్నించీ, ఒక సీత, ప్రౌఢ వయసు మహిళగా మరొక నటి, నడి వయసు నుంచి, వృద్ధాప్యం వరకూ మరొక నటిగా, ముగ్గురు సీతమ్మలు మనకు ఈ నాటకంలో కనిపిస్తారు. ఒకటో కృష్ణుడు, రెండో కృష్ణుడు అనే వారు నటులు వేరు అయినా ఒకే వయసులో ఉంటారు. కానీ, ఇందులో ముగ్గురు సీతమ్మలు, మూడు వేరు వయో దశలకు చెందిన వారుగా కథను నడపడం విశేషం.

కథానుసారంగా అల్లుకున్న ఘట్టాలుగా పని వారి మోసగింపు మనస్తత్వంలో మార్పు తీసుకురావడంలో నవ వధువుగా డొక్కా సీతమ్మ హృదయ వైశాల్యం, ఇంటికి వచ్చిన వారు పరుషంగా మాట్లాడినా, వారిని అతిధి దేవోభవ అన్నట్టుగా గౌరవించి, మంచిగా పూలూ, బట్టలూ, పళ్ళూ, తమ పొలాల పంట దినుసులూ అన్నీ ఇచ్చి సత్కరించడం, అలాగే, ఆకొన్న వారికి నిత్యం అన్నం పెట్టేలా, డొక్కా జోగన్న పంతులుకు సూచించి, నచ్చచెప్పి, తాను ఆ అన్న దాన వ్రతాన్ని ఆచరించ పూనుకోవడం, కరువులు,వరదలు ఎలా గోదావరి కరుణ లేదా ఆగ్రహము ఉన్నా దానికి అనుగుణంగా, తమ అన్న దాన ఆచరణ చేయడం, వరదలో చిక్కుకున్న మనిషికి అన్నంతో పాటుగా, ఆ చలిలో కాల్చుకునేందుకు చుట్టలు కూడా అవసరం అని గ్రహించి, ఆ హోరు వానలో వెళ్ల డానికి ఇష్టపడని తన భర్తను బలవంత పెట్టి, నన్ను బలవంతం చేయడం కాదు, నీవు వెళ్ళి వస్తే తెలిసొస్తుంది, అని భర్త విసుక్కుంటే "ఆ మాట ఎప్పుడు అంటారా అని చూస్తున్నాను, అవశ్యం నేనే వెళ్తాను" అని ఆ తుఫాను లో ఆమె ప్రయాణం కట్టబోగా,

ఆమెను అతను వారించి, తానే వెళ్ళి రావడం, ఇలా పలు ఉదాత్తమైన, స్ఫూర్తి దాయకమైన చిన్న చిన్న సంఘటనలతో కథలో పెద్దగా మలుపూ,మెలికలు లేక పోయినా, ఇలా నడవడం వలన, సరళంగా ప్రేక్షకులకు నాటకం అడుగడుగునా అర్థం అవుతూ, రచయిత, దర్శకుడు నాయుడు గోపి కూడా, ప్రేక్షకులను తమతో పాటు తీసుకువెళ్లగలిగారు. ఇది ఈ నాటక విజయానికి ముఖ్య కారణం.

కథలో రచయిత తెచ్చిన ఒక చక్కని సన్నివేశం, గోదావరి నదిపై వారధులు కట్టిన బ్రిటిష్ మిలిటరీ అధికారి సర్ ఆర్థర్ కాటన్, ఇక్కడ డెల్టా గన్నవరం వద్ద అక్విడక్ట్ కూడా నిర్మాణం చేశారు. వారి మరణం 1893, సీతమ్మ గారి మరణం 1909. ఈ అక్విడక్ట్ నిర్మాణం 1873 ప్రాంతం. ఇక్కడే ఈ మహా నిర్మాణం జరుపుతున్న ఎందరో కూలీలకు అన్నదానం చేసి, ఆ అక్విడక్ట్ నిర్మాణం వేగవంతంగా జరిగేందుకు, సీతమ్మ గారి అన్న వితరణశీలత, ఎంతగానో, ఈ బ్రిటిష్ వారి ఆనకట్ట నిర్మాణ వ్యయాన్ని తగ్గించడమే కాక, వారి పని చాలా సులభం చేసిందని కూడా ఈమే వద్దకు వచ్చి, సాక్షాత్తూ ఆర్థర్ కాటన్ తెలపడం, కథ లో ఒక జేగీయమాన దృశ్యం. ఆయన కొంత డబ్బులు ఇవ్వబోగా, అవి వద్దని నిరాకరించి, వారికి తన ఇంట్ భోజనం పెట్టి, తెలుగు ప్రజల పట్ల వారిని సమ్మానించుకునే అవకాశం తనకు కలగడం, చాలా సుకృతంగా భావించి, వేదిక పై, తెలుగు వారికి అన్నదాత సీతమ్మ, జల సేతు నిర్మాత కాటన్ దొర నిలబడ్డం, మన తెలుగు నాట రమారమి ఒక శతాబ్దం ముందర జరిగిన, లేదా అలా వారు కలవకున్నా ఒక వేళ, ఒక ఉదాత్త సన్నివేశాన్ని కల్పించిన రచయిత రామకృష్ణ, ఆ దృశ్యాన్ని రంగస్థలం పై రక్తి కట్టించిన దర్శకుడు నాయుడు గోపి, ఎంతగానో అభినందనీయులు. నిజానికి 1852లో గన్నవరం అక్విడక్ట్ నిర్మాణ కాలానికి సీతమ్మ గారికి పదకొండేళ్ళ వయసు మాత్రమే. అప్పటికి, ఆమెకు పెళ్లి అయిందో లేదో తెలియదు. అయినా అంతా చిన్న వయసులో ఆమె అన్నదానం మొదలు పెట్టె అవకాశంలేదు. అందువల్ల ఇది కేవలం రచయిత కల్పనా అయినా ఒక మనోహరమైన కల్పన. ఆకలికి కులం ఉంటుందా అని ప్రశ్నించిన డొక్కా సీతమ్మ, దక్షిణ భారత దేశంలో ఇటువంటి ఆన్నదాన వ్రతం గల మహిళామణి అనడం కన్నా కొంత స్థాయి పెంచి, దక్షిణ ఆసియా లోనే ఇటువంటి నిరతాన్నదాన వ్రతం చేసిన స్త్రీ మూర్తి ఇంకొకరు లేరు అనడం చాలా సమంజసం గా ఉంటుంది. ఈ నాటకంలో నేపథ్య సంగీతం, హర్మనీ కళాకారులు చక్కని సమన్వయంతో సంభాషణలు దెబ్బ తినేంత శబ్దం లేకుండా పొందు పరచడం వలన, కూడా ఆద్యంతం చాలా హృద్యంగా నడిచింది.

రైటర్స్ అకాడెమీ సమర్పణగా, విశాఖ వాసులకు, మన తెలుగు వారి కీర్తి పతాక అయిన డొక్కా సీతమ్మ జీవిత గాధను, సందరోచిత కాల్పనికత మేళవించి చెప్పడం రచయిత శృతి మించకుండా చేశారు. అందుకు వారు ఎంతైనా అభినందనీయులు. ఈ లంకల గన్నవరం లేదా డెల్టా గన్నవరం అక్విడక్ట్‌ను ప్రస్తుతం డొక్కా సీతమ్మ అక్విడక్ట్ గా పిలుస్తారు. ఆంధ్ర భూమి జనవరి, 1942 లో ఒక రేడియో నాటిక డొక్కా సీతమ్మ జీవనగాథ గా ప్రసారితం అయింది ప్రచురణ జరిగింది. అందులో ఆ పరగణా జమీందారు, ఆమె దీక్ష ను పరీక్షించి, ఆమె అన్న దాన సంకల్పానికి మెచ్చి, ఆ గ్రామాన్ని డొక్కా సీతమ్మ అగ్రహారంగా ప్రకటించి, ఆమె వదాన్యతను మెచ్చుకుంటాడు.

"సీతమ్మ తల్లి కి చేయెత్తి మొక్కేము ఆ తల్లి సాక్షాత్తు అన్నపూర్ణ, ఆకలమ్మ అన్నమంటే, ఏ కులము వారలైన గాని సకల భక్ష్య భోజ్యమ్ములతో సాకి రక్షించు తల్లి" అని ఇప్పటికీ ఆ గోదావరి జిల్లా గ్రామాలలో దాసరులు పాడుకుంటారట. ఇక కాటన్ దొర గురించి **నిత్య గోదావరీ స్నాన పుణ్యదోయో మహామతిః స్మరామ్యాంగ్లేయ దేశీయం కాటనుంతం భగీరథం (మాకు గోదావరి నదీ స్నాన పుణ్యాన్ని కలిగించిన అపర భగీరథుడు, ఆంగ్ల దేశీయుడైన కాటన్ దొరగారిని ప్రతినిత్యం స్మరించి తరిస్తున్నాము అని ఈ శ్లోకానికి తాత్పర్యం) తెలుగు వారి సాంస్కృతిక విశిష్టతా, సమాజోపకార పరాయణతా, ఈ నాటకం ద్వారా వెల్లి విరిసాయి. ఇలాంటిదే ఒక మంచి కథను, ఎల్. ఆర్. స్వామి గారు "దొర" పేరిట రాశారు. చాలా కాలం గుర్తుండే నాటకంగా డొక్కా సీతమ్మ ప్రేక్షకులకు గుర్తుండి పోతుంది.**

అజోవిభో కళల సంక్రాంతి పండుగ

రామతీర్థ
9849200385

అప్పాజోస్యుల విష్ణుభొట్ల - కందాళం ఫౌండేషన్ తెలుగు నాట ఇరవై నాలుగేళ్ళగా సాహిత్య సాంస్కృతిక రంగాలలో ప్రతి ఏటా ఏదో ఒక నగరంలో జనవరి మొదటి వారంలో కళల పెద్ద పండుగ నిర్వహిస్తున్నది. మూడు రోజుల నాటికల పోటీలు నిర్వహణ, ప్రతి ఏటా ఒక విశిష్ట వ్యక్తికి జీవిత కాల సాఫల్య పురస్కార గౌరవం, పేరిట లక్ష రూపాయల బహుమానం, మొదలైన ఇరవై నాలుగేళ్ల కిందట పెద్ద పురస్కారం గానే లెక్క. 2001 నుంచీ, అజో విభొ ఫౌండేషన్, ఈ లైఫ్‌టైమ్ ఎచీవ్మెంట్ అవార్డ్ తో బాటుగా, మరో రెండు అవార్డ్ లు ప్రతి ఏటా ఇవ్వడం మొదలు పెట్టారు. అవి ఒకటి సాహిత్య రంగానికి,మరొకటి సాంస్కృతిక రంగానికి ప్రకటిస్తూ, ఈ రెండు రంగాలకు చెందిన పలువురు ప్రముఖులను, సేవా స్ఫూర్తి, రచనా ప్రతిభా, నటనా కౌశ లం గల వారిని వరుస తప్పకుండా ప్రతి ఏడాది గౌరవిస్తూ వస్తున్నది. దీనితో బాటుగా అజో విభొ ఫౌండేషన్ ప్రతి ఏటా గత ఇరవై నాలుగేళ్ళగా తెలుగు కథలల్లో ఎంపిక చేసిన కథలను నాటికలుగా చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టి, వార్షికోత్సవం సందర్భంగా, రోజూ మూడు నాటికలు చొప్పున ప్రదర్శనకూ అవకాశం ఇస్తూ, వీటిలో ఉత్తమ నాటికలకు చివరి రోజు సభలో అవార్డ్ ప్రదానం చేస్తున్నారు. ఇలా ఈ ఇరవై నాలుగేళ్లలో, దాదాపు నూట యాభైపైగా తెలుగు కథానికలను నాటికీకరించి ప్రదర్శించ చేసిన ఘనత అజో విభొ ఫౌండేషన్ వారికి దక్కుతుంది.

అలాగే, గత రెండున్నర దశాబ్దాల సేవల్లో భాగంగా, అజో విభొ ఫౌండేషన్ వందకు పైగా పుస్తకాలు ప్రచురణచేసి, పలు ప్రాచీన సాహిత్య విమర్శనాత్మక, విశ్లేషణాత్మక గ్రంధాల ప్రచురణ చేశారు. అంటే కాక ప్రతి వార్షికోత్సవ సందర్భంలో, వీరు ఆ యేడాది గౌరవించిన విశిష్ట వ్యక్తుల సాహిత్య, నాటకరంగ కృషికి సంబంధించి, "ప్రతిభా వైజయంతి", పేరిట విలువైన సమాచారం గలిగిన సావనీర్ల ప్రచురణ చేస్తూ వస్తున్నారు. ఈ ప్రతి రోజూ నాటక రంగ సేవలకు గాను నాటికల ప్రదర్శన జరిగే మూడు రోజుల్లో ఒక విశిష్ట వ్యక్తి కి రంగస్థల సేవ పురస్కారం పేరిట, ఎవరికి ప్రదానం చేస్తున్నారో, వారికికూడా తెలీకుండా, ఈ పురస్కారమ్ అంద చేయడం ఒక విశేష ఆకర్షణ గా కొనసాగిస్తున్నారు. ఆయా వివిధ నాటక విభాగాలకు చెందిన సేవలు అందించిన వారు కూడా, ఈ సర్ప్రైజ్ ప్రకటనకు అనుకూలంగా స్పందిస్తూ ఈ గౌరవాలు స్వీకరిస్తూ వస్తున్నారు. ఈ నాటికల ప్రదర్శన, తెలుగు నాట ప్రత్యేక ప్రోత్సా హకాలు కరువు అయిపోతున్న కాలంలో రెండున్నర దశాబ్దాలు దశాబ్దాలుగా అజో విభొ ఫౌండేషన్ చేస్తున్న కీలకమైన సాంస్కృతిక సేవగా గుర్తించవలసి ఉన్నది. ఈ నాటికల ప్రదర్శనలో, ప్రయోగ్మకమూ, ప్రయోజనాత్మకమూ అయిన నాటికల ప్రదర్శన, ప్రోత్సాహం, తగు ఎంపిక జరగడం ఇంకా ముందు ముందు ఈ కథల నాటికీకరణ వలన ఇతోధిక ప్రయోజనం భవిష్యత్తులో జరుగుతుందని ఆశించవచ్చు. నాటికలలో కూడా, ఒక మూస విధానంలో నాయక, నాయిక, ప్రతినాయిక మొదలగు పాత్రలకు ఎక్కువ ప్రాధా న్యత ఇస్తూ, అవార్డ్లు వచ్చేలా ఈ ప్రదర్శనలు, అన్ని పరిషత్‌ల్లో ఉన్నట్టే, తెలుగు నాటక వర్తమాన దృశ్యంగా కనిపిస్తున్నది. 1950లు, 60ల నాటి కథలు వర్తమాన ప్రదర్శనలుగా మలిచేటప్పుడు, ఆ కాలపు సాంకేతిక ఉపకరణాలను, కాల పరిమితులను దాటి, సెల్ ఫోన్లు వాడుతూ పాత్రలు ప్రవర్తించడం, కొంత ఎబ్బెట్టుగా, కథకు ప్రతికూలంగా ఉన్నా అవి ఈ నాటికలలో ఒక సాధారణ లక్షణంగా ఉండడం గమనించాము. అటువంటి కృతక పద్ధతుల వల్ల, మూల కథలు తమ బలాన్ని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. తెలుగు నాటక రంగం ఇటువంటి ధోరణులను ఒకసారి తిరిగి సమీక్షించుకోవలసి ఉన్నది.

2017 సంవత్సరానికి ఈ అజో విభొ ఫౌండేషన్ పాయక రావు పేట, ప్రకాష్ విద్యా నికేతన్‌లో జనవరి 5-8 వరకూ నాలుగు రోజుల పాటు నిర్వహించిన సాహిత్య, సాంస్కృతిక ఉత్సవం, మన విశాఖకు చెందిన ప్రముఖ కవయిత్రి, కథయిత్రి, అనువాదకురాలు జగద్ధాత్రి, పేరొందిన రంగస్థల కళాకారుడు, దర్శకుడు లంక సత్యానంద్‌కు, సారి లేరు నీకేవ్వరూ పురస్కారాలు, అలాగే జీవిత కాల సాఫల్య పురస్కారం ఆంధ్ర భూమి సంపాదకులు మూర్తి వెంకట రామ శాస్త్రి గారికి (ఏం.వి.ఆర్. శాస్త్రి) అందచేసి, మన సమీప ప్రాంతంలో, ఉత్తమ విలువలు గలిగి, చక్కని సమయ పాలనతో అటు సాహిత్య, ఇటు నాటిక రంగానికి చెందిన ఎందరో పెద్దలు, నాలుగు రోజుల పాటు, సాంస్కృతిక విలువలతో కూడిన సమయం గడిపేలా చేసిన కృషి ఎంతైనా అభినందనీయం. ఈ స్ఫూర్తి దాత, ఆచరణ శీలి, అప్పాజోస్యుల సత్యనారాయణగారు, వారి బృందం తెలుగు ప్రజలకు ఆదర్శ ప్రాయులు.

> గత రెండున్నర దశాబ్దాల సేవల్లో భాగంగా, అజో విభొ ఫౌండేషన్ వందకు పైగా పుస్తకాలు ప్రచురణచేసి, పలు ప్రాచీన సాహిత్య విమర్శనాత్మక, విశ్లేషణాత్మక గ్రంధాల ప్రచురణ చేశారు. అంటే కాక ప్రతి వార్షికోత్సవ సందరరేలో, వీరు ఆ యేడాది గౌరవించిన విశిష్ట వ్యక్తుల సాహిత్య, నాటక రంగా కృషికి సంబంధించి, "ప్రతిభా వైజయంతి", పేరిట విలువైన సమాచారం గలిగిన సావనీర్ల ప్రచురణ చేస్తూ వస్తున్నారు. ఈ ప్రతి రోజూ నాటక రంగ సేవలకుగాను నాటికల ప్రదర్శన జరిగే మూడు రోజుల్లో ఒక విశిష్ట వ్యక్తికి రంగస్థల సేవ పురస్కారం పేరిట, ఎవరికి ప్రదానం చేస్తున్నారో, వారికికూడా తెలీకుండా, ఈ పురస్కారమ్ అంద చేయడం ఒక విశేష ఆకర్షణగా కొనసాగిస్తున్నారు. ఆయా వివిధ నాటక విభాగాలకు చెందిన సేవలు అందించిన వారు కూడా, ఈ సర్ప్రైజ్ ప్రకటనకు అనుకూలంగా స్పందిస్తూ ఈ గౌరవాలు స్వీకరిస్తూ వస్తున్నారు. ఈ నాటికల ప్రదర్శన, తెలుగు నాట ప్రత్యేక ప్రోత్సాహకాలు కరువు అయిపోతున్న కాలంలో రెండున్నర దశాబ్దాలు దశాబ్దాలుగా అజో విభొ ఫౌండేషన్ చేస్తున్న కీలకమైన సాంస్కృతిక సేవగా గుర్తించవలసి ఉన్నది.

అప్పాజోస్యుల సత్యనారాయణ

జగద్ధాత్రి

సత్యానంద్

ఎంవీఆర్ శాస్త్రి

కథల కోహినూర్ చాసో

అర్థోక్తి, అర్థయుక్తి గల శీర్షికలు తమ కథలకు పెట్టడంలో తెలుగు రచయితలు విలక్షణ ప్రతిభ కలిగి ఉన్నారు. గురజాడ, శ్రీపాద వంటి వారికి ఈ శక్తి ఉన్నది. తన తొలి తెలుగు కథకు 'దిద్దుబాటు' అని పేరు పెట్టిన గురజాడ, ఆ ఎనిమిది వందల మాటలలోపు చిన్న రచనలో చేసిన దిద్దుబాట్లు కథన రీతిలోనూ, అలాగే కథ ద్వారానూ కూడా. తన భాషకు గ్రాంథిక ఛాయలు ఉంటే, ఆధునిక కథకు అవి సరిపోవు అన్న ఎరుకతో, తాను కథను వ్యవహారిక భాషలోకి మారుస్తూ చేసిన దిద్దుబాట్లు, గురజాడ, రెండు సార్లు రాసిన ఈ కథలో కనిపిస్తాయి. అలాగే, కమలిని, పై తిరుగుళ్ళకు తరలుతున్న భర్త గోపాలరావు ప్రవర్తనలో తెచ్చిన కోర్స్ కరెక్షన్ కూడా ఒక దిద్దుబాటు. ఇలాగే, శ్రీపాద తన కథకు 'తాపీ మేస్త్రీ రామదీక్షితులు బి.య్యే' అని పేరు పెట్టడంలో ఒక సమాజ స్థితిగతులను క్లుప్తీకరించి ఒక పేరుగా మార్చారు. అవటానికి అగ్ర కులస్తుడు, ఛాందస ఆచారపరుడు కాదు, చదువుకున్నవాడు. అయినా ఉద్యోగం లేదు. అందువల్ల, తాపీ మేస్త్రీ పనిచేస్తున్నాడు అన్న సామాజిక దశ అంతా ఒక్క శీర్షికలో వచ్చేలా కథకు పేరుపెట్టడం శ్రీపాదవారి ప్రతిభ. తెలుగు కథలకు బెంగాలీ పేర్లు కూడా 'శుభకే శిర్ అరోహ' వంటివి శ్రీపాద స్థిరపరిచారు. వారి కథ 'గులాబీ అత్తరు' వాసన, ఇప్పటికీ పెద్దాపురం కోట దరిదాపుల్లో, గుప్పుమంటూ ఉంటుంది అని అత్తరు సాయిబు ఎంతకీ ప్రభువు దర్శనం దొరకక, తాను వారికి సమర్పిద్దామని తెచ్చిన శ్రేష్ఠమైన అత్తరు బుడ్డీ, ఆ కోట గోడలకు వేసి కొట్టి తన నిరసన తెలిపిన సంగతి, ఒకనాటి సుమతీ శతకకారుడి సుప్రసిద్ధ చరణ శాసనం 'అధికార బధిరాంధిక శవములు' అన్న నిరసనను సమానంగా గుర్తుచేస్తుంది.

జనవరి 17న 102వ పుట్టినరోజు, విజయనగరంలో, తన కుమార్తె, సాహితీవేత్త డా. చాగంటి తులసి, రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చిన 11 లక్షల మ్యాచింగ్ గ్రాంట్‌తో, మొత్తం ముప్పై మూడు లక్షల ఖర్చుతో కొత్తగా, జిల్లా గ్రంథాలయం మొదటి అంతస్తులో సుమారు రెండు వేల చదరపు అడుగుల మీటింగ్ హాల్‌లో జరుగుతోంది. ఈ కీర్తికాయుడు చాసో తన కథలను వజ్ర సమానంగా చెక్కాడు. వజ్రాలు ఎప్పటికీ నిలిచే ఉంటాయి. ఈ వజ్రపు పనివాడు అమర్చిన, జీవస్పందనలు కలిగిన కహానీల కోహినూర్లు పదుల సంఖ్యలో ఉన్నాయి. ప్రతి కథా ఒక డిజైనర్ ప్రొడక్ట్. మళ్లీ అటు వంటిది దొరకదు. ఒక్కటే నేస్తారు మరి. చాసో కూడా, తన కథలలోని సంభాషణా శకలాలను తన కథలకు పేర్లుగా ఉంచాడు. ఇది తన కాలానికి లేని ఒక కొత్తదనం. ఈ కథా శీర్షికలు, కథను తమ గుప్పిట్లో మూసి ఉంచుతాయి. ఆ కథ చదవడం అంటే ఆ గుప్పిట్లోకి మనం వెళ్లడమే చాసో కథలు లోగొంతులో పిలిచే రసాల గూళ్ళు.

చాసో రాసిన దాదాపు అర వంద కథలు, ఒక జీవిత కాలపు ఉత్పత్తి. దాదాపు నలభై ఏళ్ళ సాహిత్య జీవితంలో చాసో యాభై కథలు మాత్రమే రాసిన వాస్తవం చూస్తే, నాణ్యత, నవ్యత, క్లుప్తత వంటి విషయాల్లో రాజీ పడని వర్క్‌షాప్ ఈయన మనఃకార్మిక శాల. 1943 మేలో రాసిన ఒక కథ పేరు - 'ఏలూరెళ్లాలి'. ఇది ఆ కథలో ఒక పాత్ర స్వగతం. ఎక్కడ ఈ పాత్ర ఇలా తలపోస్తుంది అంటే ఏలూరు స్టేషన్‌లోనే. ఏలూరు స్టేషన్‌లో నిలబడి, ఏలూరెళ్లాలి అనుకోవడం ఏమిటి? తెలియాలంటే, మనం ఈ కథ చదవాలి. చదివితేనే, అదీ జాగ్రత్తగా చదివితేనే, కథ, నిడదవోలు జంక్షన్‌లో ఒక రైలు బోగీలో మొదలైందనీ, కథ ఏలూరు స్టేషన్‌కు బండి రాగానే ముగిసిందనీ తెలుస్తుంది. బహుశా చాసో రాసిన కథల్లో తక్కువ కథా కాలం గల కథ ఇదే. సంభాషణలు కూడా కత్తిపదును (రేజర్ షార్ప్ అంటారు ఆంగ్లంలో)తో ఉంటాయి. పరిచయమైన రెండు పాత్ర లు ఒకరు స్త్రీ, మరొకరు మగవాడు. ఆమె ప్రశ్న- ఎంద రు పిల్లలు? ఇద్దరు అంటాడు తాను. మీ ఆవిడకు ఇద్ద రు, నీకు ముగ్గురు అంటుంది స్త్రీ పాత్ర. ఎలా ఈ కథ చదవకుండా వదలగలం? అందుకే అది చాసో కథ.



'చెప్పకు చెప్పకు' (సెప్టెంబర్ 1978లో రాసినది) మరో కథకు చాసో పెట్టిన పేరు. ఇదొక నీతిమంతుడి ఆక్రోశం. అవినీతిగా, అవకాశాల దారిలో సుఖ భోగాలిచ్చే జీవితాలకు అలవాటుపడ్డ, తన కుటుంబ సభ్యులు ఎవరో కాదు, తల్లీ, తమ్ముడూ, చెల్లీ, తాము నడుస్తున్న దారి మానుకోమని ఈ పెద్ద కొడుకు ఎంత చెప్పినా వినకుండా, తమ దారిన పయనిస్తూ, ఒక ఐశ్వర్యం నుంచి మరొక ఐశ్వర్యానికి, ముందర తల్లీ, ఇప్పుడు చెల్లీ, ఒకే మగవానితో ఉంటూ పొందుతున్న సంపదల గురించి, తాము కొత్తగా మారిన ఇల్లు చిరునామా ఆ తమ్ముడు చెప్పబోగా, అవుతున్న అన్నయ్య ఆక్రోశం ఇది 'చెప్పకు, చెప్పకు'. కథకుడు ఎవరి పక్షాన ఈ కథ చెప్తున్నదీ మనకు స్పష్టమే.

1944 మేలో చాసో రాసిన కథకు పేరుకు 'ఎందుకు పారేస్తాను నాన్నా', ఇది మరొక లీడింగ్ శీర్షిక. చదువుల్లో మంచి మార్కులు వస్తున్న ఎనిమిదో తరగతి కొడుకును ఇకపై చదువులకు తాము తూగలేము అని చదువు మాన్పించి చుట్టలు కొనుక్కు రమ్మని తండ్రి కొంత డబ్బు ఇచ్చి పంపిస్తాడు. ఆ పిల్లవాడు, ఆ బడ్డీ షాపుకు వెళ్లకుండా, స్కూల్ ఎదుట నిలబడి ఉంటాడు. పరీక్ష పాస్ అయి, కొత్త సంవత్సరం చదువులకు స్కూల్ కు పోతున్న తన నేస్తాలయిన పిల్లలతో మాటా మంతీ కలిపి, కొత్త పుస్తకాలలో ఏం ఉన్నదీ తెలుసుకుం టూ ఉంటాడు. తాను స్కూల్‌కు రాలేనని, తండ్రి చదువులు మాన్పిస్తున్నాడని చెప్పలేక, అక్కడే గుడ్ల నీరు కుక్కుకుని నిలబడతాడు. ఎంతకీ రాని ఈ కొడుకు ఎక్కడికి పోయాడో అని వెతుక్కుంటూ వచ్చిన తండ్రికి స్కూల్ ముందర కనిపిస్తాడు కొడుకు. చదువులంటే వాడికి గల ఇష్టం, శ్రద్ధ గమనించిన తండ్రి, తాను చుట్టలు మానేస్తే, పిల్లవాడిని చదివించవచ్చు గదా, అని తలిచి, ఎలాగైనా స్కూల్‌కు వెళ్తాను అంటున్న వాడిని బుజ్జగిస్తూ అడుగుతాడు. ఇందాక చుట్టలకని ఇచ్చిన డబ్బులు ఉన్నాయా? అని. అప్పుడు కొడుకు జవాబు 'ఎందుకు పారేస్తాను నాన్నా?'.

పైన చెప్పినవే కాక బబ్బుబ్బా (1943), పోనీ తిను (తేదీ లేదు, అచ్చైంది ప్రభవలో), లేడీ కరుణాకరం (1945), ఆ హా హా (1969), ఊళ్ళో వాన లేదు (1978) - ఈ కథల పేర్లన్నీ, కథలలో వచ్చిన మాటల దొంతరలే. తన కథల మీద సరైన విమర్శ రాలేదు అన్నారు చాసో. స్త్రీలు కట్టుబాట్లు దాటి స్వేచ్ఛగా ప్రవర్తించిన కథలు రాసిన చాసోను ఆ కథలలో గల స్త్రీ విశృంఖలత గురించి అడగగా, ఆ కథలు ఆ ఉద్దేశంతో రాయలేదు అని జవాబిచ్చారు. తనకు నచ్చిన కథకుల పేర్లు చెప్పమన్నప్పుడు చాసో చేసిన ఎంపిక, ఆయన ఎంత తీక్షైన కథల కాపరో మనకు తెలుపుతుంది. ఆయన 1985లో ఒక ముఖాముఖిలో చెప్పినవి ఇవి. చాసో టక్కున చెప్పిన ఓ డజను గొప్ప తెలుగు కథలు - 'గురజాడవి మూడు, శ్రీపాదవి రెండు, చలానివి నాలుగు, కుటుంబరావు, కరుణకుమార రెండేసి, పద్మరాజు, బుచ్చిబాబు, రావిశాస్త్రి, కాళీపట్నం, సి.రామచంద్రరావు, పూసపాటి కృష్ణంరాజు, ఒక్కొక్కటి." రచయితగా తన మీద తన అంచనా. "నాకు నేనే విమర్శకుడ్ని. నచ్చకపోతే చించి పారేయటం ఈనాటికీ అలవాటు. సంపూర్ణమైన ఆత్మవిశ్వాసం గల రచయితని'. అందుకే ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కథావికాసంలో చాసో ఒక గంట స్తంభం. తెలుగు కథ గౌరవార్థం విజయనగరంలో చాసో సాహితీ వేదిక వద్ద, కోట కూడలిలో రాష్ట్ర ప్రభుత్వం చాసో విగ్రహం ఏర్పాటుచేయడం సముచితం.

సుమారు యాభైఏళ్ల ముందర చాసో కథలు రెండవ కూర్పుకు 1968 ఆగస్టులో ముందుమాట రాసిన సుశర్మ ఇలా అన్నారు. 'చాసోకి కీర్తి కాంక్ష లేదు. తనని, తన కథలని పొగడాలనే కోరికా లేదు. ఈ విడ్డూరమైన పరిస్థితి సాహితీపరులలో ఉండనే ఉండదు. అనేక పత్రికలలో ప్రచురించిన కథలు ఆయా పత్రికలలో విడిచిపెట్టి, పుస్తక రూపంలో ప్రజల ముందు పెట్టక ఉదాసీనతతో విడిచిపెట్టేశారు. వారిదగ్గర వ్రాత ప్రతులు లేవు. ఏ కథ ఏ పత్రికలో ఎన్నడు అచ్చు అయిందో ఆయనకే తెలియదు. అందుకు వారు క్షంతవ్యులు కారు. అదీకాక పుష్కరమై రచనా ఆపుచేశారు. అది కూడా క్షమింపదగ్గ పని కాదు". ఇంకా ఒక పరిశీలన వెలిబుచ్చారు చివరన. అష్టోత్తర శత కథానికా రచయితలలో చాసో సమానులు ముగ్గురుండటం దుర్లభం. ఈ సుశర్మ ఎవరో కాదు, ప్రఖ్యాత కథా రచయిత, విఖ్యాత సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్య శర్మ.

చాసోకి గల విశాల ప్రతిభలో ఇక్కడ మనం ప్రస్తావించుకున్న వారి నూతన సంవిధాన కథా శీర్షికలు, ముందరి తరాల కథా సృజనకారులకు మార్గశీర్షికలు.

- రామతీర్థ, 9849200385

వంగపండు ప్రసాదరావు. ఉత్తరాంధ్ర జానపదానికి ఆయన కేరాఫ్ అడ్రస్. ఏం పిల్లో ఎల్లమొస్తవా అని ప్రపంచంలో ఏ మూల ఎక్కడ నుంచి వినిపించిన నిస్సందేహంగా అది వంగపండు గానమేనని ఇట్టే చెప్పేయవచ్చు. చిన్నతనం నుంచే భూస్వాముల పెత్తందారి పోకడలను పసిగట్టి ఎదిరించి నినదించిన గళం ఆయనది. ఆంధ్ర, తెలంగాణ, రాయసీమ ప్రాంతమేదైనా అతని పాట సామాన్య మానవుడి గుండె చప్పుడు. ఆయన పాట కార్మికుల వీరుల కన్నుల్లో, కర్షకుల వీరుల్లో గుండెల్లో ఉప్పొంగే ఉత్తుంగ తరంగం. వంగపండు పాటకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం..

–విశాఖ కల్చరల్

పాటకు స్వర్ణోత్సవం

జనం పాట.. ఆయన నోట

పాండిత్యం లేదు. శిక్షణ అసలే లేదు. ప్రకృతి ఒడే ..అతని బడి. పీడే గాలే అతని వీణ..ప్రజల అడుగులే ఆయన సరిగమలు....జనం మాటే ఆయన పాట.. ఉత్తరాంధ్ర యాసతో పెన్నిధి మించిన గీతాలను ప్రపంచం చేత పాడించిన ఘనత ఆయనది. ఎన్నో ఉద్యమాల్లో జానపద ఉత్తేజాన్నిచ్చిన పాటలమాంత్రికుడు వంగపండు ప్రసాదరావు. ప్రజా వాగ్గేయకారుడుగా, శ్రీకాకుళం శ్రీశ్రీగా జానపద కవి కేసరిగా ప్రజల మనస్సుల్లో నిలిచారాయన. ఆయన పాట రాస్తే అది పీడిత ప్రజల గుండెల్లో తుల్లింది పుడుతుంది. ఆయన గొంతెత్తి పాడితే అది ప్రజాగర్జన అవుతుంది. ఆయన గజ్జెకట్టి ఆడిపాడితే అది ఉరిమేమువ్వై అవుతుంది. కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాదు యావత్ ప్రపంచానికి వంగపండుగా ఆయన సుపరిచితం. నక్సల్బరీ ఉద్యమంలో మెరుపులా మెరిసిన ఉద్యమాల పాటల కెరటం కలం నుంచి జాలువారిన పాటలు ఎందరినో చైతన్యవంతులను చేశాయి.

బాల్యం...

వంగపండు ప్రసాదరావు విజయనగరం జిల్లా పార్వతీపురం దగ్గర పెదబొండపల్లిలో జగన్నాథం, చినతల్లి దంపతులకు 1943లో జన్మించారు. ఎస్ఎండీ తరగతి చదువుతుండగానే (1967)నుంచి ఉద్యమ గేయాల రాయడం, పల్లె వీధుల్లో భజన పాటలు పాడుతూ, తన గానాన్ని ప్రజలకు వినిపించారు. శ్రీకాకుళం గిరిజన రైతాంగ పోరాటం నేపథ్యం నుంచి ప్రజాపాట పుట్టింది. ఆయన మొదటి పాట జజ్జనకరి జానరే-ఝునకు ఝనునా ఝుణారే..తర్వాత మాడిగుడ్డలేని.. మాలినాలోల్లా.....తుప్పాలి కొడవలి కొక్కులు..యంత్రమెట్లా నడుస్తున్నాదంటే... ఏం పిల్లో ఎల్లమొస్తవో....., తెలుగు సీమ నేలలో అన్నా మాలన్నా... వంటి అన్ని వర్గాల వారి స్థితిగతులు స్పృశిస్తూ.. వేలాది గీతాలను జనంలోకి తీసుకెళ్లిన వంగపండు జానపదం నేటికీ జనం హృదయాల్లో పదిలంగానే ఉంది. ఐదు దశాబ్దాల కాలం నుంచి సుమారు నాలుగు వందలకుపైగా పాటలు పుస్తకాలు, కథలు రాశారు. ఇందులో పన్నెండుకుపైగా ప్రపంచవ్యాప్తంగా 16 ఇతర భాషల్లోకి తర్జుమా అయ్యాయి. ఆయన శ్రామిక కార్మికులపై రాసిన యంత్రమెట్లా నడుస్తున్నాదంటే పాట ఆంగ్లంలోకి అనువాదమై అమెరికా, ఇంగ్లండ్‌లోని కార్మికలోకానికి చేరువైంది. దేశవ్యాప్తంగా ఇప్పటికీ మూడు వేలకుపైగా ప్రదర్శనలిచ్చిన వంగపండు అచ్చమైన ఉత్తరాంధ్ర యాసలో మాట్లాడతారు. ఎటువంటి వేషభాషలు పోకుండా సాదాసీదాగా జీవిస్తున్నారు. తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్రా, ఉత్తరాంధ్రలో కొన్ని వేలమందికి ఆటపాట నేర్పిన వారసులెందరో ఉన్నారు. శ్రీకాకుళం సాయుధ రైతు పోరాటం నుంచి నేటి వరకూ పాటలు రాస్తూనే ఉన్నారు. ఉత్తరాంధ్రకు అన్యాయం జరుగుతోందంటూ పన్నెండు పాటలు రాసి ఊరూరా తిరిగి ప్రజలను చైతన్యం చేశారు. ఇప్పుడు తెలుగు భాషా సంస్కృతి, జానపద పరిరక్షణకు ప్రాధాన్యతను వివరిస్తూ మరికొన్ని పాటలు, కథలు రాస్తున్నారు.

జానపద చైతన్య దీపిక

అగ్రవర్ణాల దోపిడీ, ప్రభుత్వాల దమనకాండను, కార్మికుల శ్రమదోపిడీని ప్రశ్నిస్తూ అక్షర కలంతో యుద్ధం చేసిన ఈ ఉద్యమకారుడు కంజరికథ పాటలు జనాన్ని చైతన్య పరిచాయి. ఆయన పాటల బాణీలు పెను ప్రకంపనలే సృష్టించాయి. జనం నుంచే వచ్చిన పదాలే జానపదాలని అంటారు. అటువంటి పాటకే జీవం ఉంటుందని నమ్మే వంగపండు.. ఉత్తరాంధ్రాలో తన తర్వాత జనంపాటకు వారసులు రావాలని ఆయన కోరుతున్నారు. ప్రస్తుతానికి తన కూతురు ఉషశ్రీ ప్రజాచైతన్యగీతాలు జానపద రూపంలో ప్రదర్శిస్తూ ప్రజలను చైతన్యవంతుల్ని చేస్తున్నారు. ప్రజలకు మరింత జానపద ఉత్తేజాన్ని నింపాలంటే పాటను మించిన ఆయుధం లేదు. అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేది పాట మాత్రమే! అందుకే పాటనే నమ్ముకున్నాను..అంటారు వంగపండు.

జనాన్ని కదిలించే కంజరి కథ..

శ్రీకాకుళం రైతాంగ సాయుధ పోరాటంలో నాడు ఉన్న మనుసులు, కరణం వ్యవస్థల్లో రైతులు పడే అవస్థలు, బాధలను జానపద నృత్యరూపకంగా రాసి రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చారు. దానికి ప్రజల్లో గొప్ప స్పందన వచ్చింది. ఈ రూపాన్ని సుమారుగా వేల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారు. ఈ ప్రదర్శనలు చూసి పులివెందుల అప్పలస్వామి, తొలి జానపద సాంఘిక భూ భాగోతంగా అభినందించారని వంగపండు వివరించారు.

- వంగపండు పాటకు 50ఏళ్లు
- అతని పాట సామాన్య మానవుడి గుండె చప్పుడు
- కర్షక గుండెల్లో ఉప్పొంగే ఉత్తుంగ తరంగం

సినిమాల్లో వంగపండు పాటలు

జననాట్యమండలి ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో పాటలు పాడి ప్రజల్ని చైతన్యవంతులను చేశారు. వంగపండు రాసిన కొన్ని పాటలు సినిమాల్లో ఆయన బాణీలోనే సంగీతాన్ని సమకూర్చి ప్రదర్శించారు. విప్లవ శంఖం, అర్ధరాత్రి స్వతంత్రం, కర్తవ్యం, విముక్తి కోసం, దేవత పోరులు, చీమల దండు, అడవి దివిటీలు వంటి సుమారు 20 సినిమాల్లో వంగపండు పాటలను ఆయన అంగీకారంతో తీసుకున్నారు.

అంతేకాదు ఈ ప్రదర్శనకు అడుగడుగునా అడ్డంకులు, బెదిరింపులు వచ్చాయి. వంగపండు రాసిన 'అడవిదివిటీలు' గడులు గిరిజన జాతికి చెందిన సాంఘిక నాటిక, సిక్కోలు గిరిజన రైతాంగ భూపోరాటంపై 'కంజరి కథ'ను పాడి, ప్రజల్లోకి తీసుకెళ్లారు. త్వరలో 'పుట్నా భూభాగోతం' అనే నృత్యరూపకాన్ని ప్రదర్శించబోతున్నట్టు వంగపండు వివరించారు. శ్రీశ్రీ వంటి మహాకవి భుజం తట్టి ప్రోత్సహించారు. గద్దర్, బి. నరసింగరావుతో కలిసి జననాట్యమండలిని స్థాపించారు.

ఎన్నో అవార్డులు-పురస్కారాలు

ప్రజాగాయకుడు వంగపండు ప్రసాదరావు పాటలకే పరిమితం కాకుండా సాహితీకారుడుగా అనేక కవితలు, పదివరకు కథలు రాశారు. ఆయనకు ప్రముఖ సాహితీవేత్తలు, సినీ రచయితలైన రసమయి కొనరాజు, బొల్లిముంత శివరామకృష్ణ, విశ్వనాథ సత్యనారాయణ, సంత్ రవిదాసు వంటి సాహిత్య అవార్డులు అందుకున్న అభ్యుదయ సాహితీకారుడు కూడా. 2016 అక్టోబరు 14న 'సుద్దాల హనుమంతు-జానకమ్మ' జాతీయ పురస్కారం వంగపండుకు ప్రముఖ కవి, సినీ రచయిత సుద్దాల అశోక్ తేజ, తెలంగాణ రాష్ట్ర ప్రజాశిక్షా సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, ప్రజా గాయకుడు గద్దర్, ప్రముఖ సినీ దర్శకుడు ఆర్. నారాయణమూర్తి వంటి ప్రముఖులు అందజేశారు. ఉత్తరాంధ్రలో వంగపండుకు శ్రీకాకుళం శ్రీశ్రీ అనే బిరుదునిచ్చారు. గత ఏడాది తెలుగు భాషా సంస్కృతిక, జానపద సంఘాలకు గౌరవ అధ్యక్షుడిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది.

హైదరాబాద్‌లో జాతీయ పురస్కారాన్ని అందుకుంటున్న వంగపండు

వంగపండు రచనలు

- భూమిభాగోతం
- ఏం పిల్లో ఎల్లమొస్తవ
- తరమెళ్లిపోతున్నది ఆనాటి స్వరమాగిపోతున్నది
- జజ్జనకరి జానరే-ఝునకు ఝునునా ఝుణారే
- పులితెర
- ఏరువాక
- సిక్కోలి యుద్ధం
- అడవి దివిటీలు నాటకం
- పాటలు : 400
- కథలు : 10

పాటద్వారా తెలుగు భాష పరిరక్షణ

ప్రస్తుతం ఆంధ్రవిశ్వకళాపరిషత్ ఆర్ట్స్ ఆఫ్ థియేటర్ శాఖలో గౌరవ అధ్యాపకులుగా పని చేస్తున్నాను. తెలుగు భాష, సంస్కృతిని పాటద్వారా కాపాడాలి. జానపదాన్ని పోషించాలి. ప్రజా బాహుళ్యాన్ని ప్రతిబింబించే పాటలు, ఉత్తరాంధ్రయాసలో పాటలు రాస్తున్నాను. జాతి, సంస్కృతిని కాపాడే విధంగా కళారూపాలను తయారు చేస్తూ భాషా సంస్కృతి అభివృద్ధికి దోహదపడుతున్నాను.

–వంగపండు ప్రసాదరావు,
జానపద వాగ్గేయకారుడు

కళింగాంధ్ర వాగ్గేయకారుడు

జానపద బాణీలతో ప్రజల్ని చైతన్యవంతులను చేసి ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచిన కళింగాంధ్ర వాగ్గేయుడు వంగపండు ప్రసాదరావు. పాండిత్యం లేదు, శిక్షణ లేదు. తన గొంతుని గాలిలోకి విసృజం, ప్రకృతి ఒడే అతని బడిగా భావించారు. ప్రజలే అతని పాఠాలు, పీడే గాలే అతని వీణతో ప్రజల అడుగులే ఆయన సరిగమలతో జానపదాలు మధురమైన గళంతో ఆలపించి ఉద్యమ స్ఫూర్తిగా నిలిచిన నిత్య కృషీవలుడు వంగపండు. ఆయన పాటకు 50 వసంతాలు నిండటం ఎంతో ఆనందదాయకం.

–ఆచార్య వంగ సుబ్బారావు,
అరసం అధ్యక్షుడు

పల్లె జీవితాన్ని ప్రతిబింబించే బాణి

1975లో విశాఖ రచయితల సంఘం ఏర్పడిన తర్వాత నుంచి వంగపండు బాగా తెలుసు. రావిశాస్త్రి, కోటప్పం రామారావు, బెజవాడ కాంతారావు, అంగర సూర్యారావు, అనంతం, చలసాని ప్రసాద్ కలిసి వంగపండును ఎంతో ప్రోత్సహించాం. ఆయన షిప్‌యార్డ్‌లో ఉద్యోగిగా ఉన్న సమయంలో శ్రామిక కార్మికులను ఉద్దేశించి పాడిన యంత్రమెట్లా నడుస్తున్నాదంటే...పాట కార్మికులను ఎంతో ప్రభావితులను చేసింది.

–ప్రొఫెసర్ కె.ఎస్. చలం,
విశ్రాంత వైస్‌చాన్సలర్

హృదయాలను కదలించేది జానపదం

జానపద కళలను ఇష్టపడని మనిషి ఉండరు. జానపద సాహిత్యాన్ని వంగపండు నరనరాన నిబిడీకృతం చేసుకొని సందర్భానుసారంగా ఎప్పటికప్పుడు పాటలు రచించి వీధుల్లో గానం చేస్తూ సామాన్యులే కాక, మేధావుల హృదయాలను కదలించినట్టి చక్కని, చిక్కని పాటల జానపదాలు మేటి వంగపండుకే సొంతం. ఆయన పాటకు 50 ఏళ్ల వసంతం నిండినసస్పూతో ఆశీర్వదిస్తూ అభినందిస్తున్నా...!

–డాక్టర్ మీగడ రామలింగ స్వామి, రంగస్థల దర్శకుడు, నటుడు

ఆయన పాట వారసత్వ సంపద

వంగపండు ప్రసాదరావు ప్రజా సాంస్కృతిక వారసత్వాన్ని కొనసాగించాలని ఉత్తరాంధ్ర ఆశిస్తోంది. శ్రీకాకుళ పోరాట ప్రభావంతో సాంస్కృతిక వారసత్వ సంపదగా కొనసాగిన కవి కళాకారుడూ వంగపండు. తన జీవితాంతం అదే బాటలో ఆయన నడవలేకపోయినా ఉద్యమంగా ప్రవహించిన ఆయన పాట మాత్రం సందేహంలేకుండా ప్రజా ఉద్యమాల్లో ఆలాపనై వినిపిస్తూనే ఉంటుంది. –నల్లిశెట్టి రాజశేఖర్, ఉత్తరాంధ్ర రచయితలు, కళాకారుల వేదిక (ఉరకవే) ప్రధాన కార్యదర్శి

సందర్భం

నిరంకుశత్వంపై అక్షరాస్త్రం

ఒక దేశం మీద రుద్దిన యుద్ధం ఎంతకాలం కొనసాగింది అని కాదు, ఎప్పుడు ముగిసిందని కాదు, యుద్ధ నేరస్తులు మాజీ అధ్యక్షులై, అట్లాంటిక్‌కి ఇటూఅటూ క్షేమంగా ఉండగా, ఒక దేశం చూసేది కాలంలో మిగిలిపోయే మందలింపు కోసం మాత్రమే! ఆ మందలింపు కవిత్వం రూపంలో తక్షణంగా వస్తే, ఇతర సాహిత్య రూపాలు కొంత సమయం తీసుకుని చిత్రిస్తాయి. ఆధిపత్య అహంకారాలకు, కాలంలో దక్కే నిలదీత, అక్షరాలకే సాధ్యం. యుద్ధంలో ఒక పల్లెపై జరిగిన విమాన బాంబుల దాడికి నిరసనగా చీపురుకట్టలతో, పికాసో వేసిన పెద్ద మ్యూరల్ 'గుయెర్నికా' వలె ఒక యుద్ధ భీభత్సాన్ని నానా వర్ణ సంక్షోభంగా పట్టుకోగలగాలి. అలెన్ గిన్స్బర్గ్ 'ద హౌల్' వలె ఏకవాక్య సునామీ పేజీలకు పేజీలు రాయగలగాలి.

ఐక్య రాజ్య సమితి ప్రకటించిన మార్చి 21 ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ఒక ఇరాకీ కవి మొహ్సిన్ అల్ రమ్లీ గురించి తెలుసుకుందాం. ఈయన సోదరుడు 1999లోనే సద్దాం హుసేన్ ప్రభుత్వంపై తిరుగుబాటులో పాల్గొన్నందుకు ఉరి తీయబడ్డాడు. అటుపై ఈ కవి దేశం విడిచి వెళ్ళాడు. అయినా యుద్ధం ముగిశాక, సాధారణ పౌరులకు ఏ గొంతూ లేని, ఆ విధ్వంసకర యుద్ధంలో ఇరాక్ సంస్కృతి, విలువైన వారసత్వ సంపద, కట్టడాలు, అన్నీ అటు నియంత అయిన అధ్యక్షుడి బలగాల వలనా, ఇటు అమెరికన్ సైన్యాల వలనా నాశనం అవుతూ ఉంటే చూసిన తరంలో కవి, రచయిత, మొహ్సిన్ అల్ రమ్లీ 2003 లోనే 'నేను ఇరాక్‌ని' అంటూ ఒక కవిత రాశాడు.

ఇది తన దేశపు అంతర్యుద్ధాలతో బాధపడుతూ, డ్రగ్స్ మాఫియా గుప్పిట చిక్కి, విలవిలలాడుతున్న కొలంబియా, ఈ దుండగాలకు ఒక ప్రతిఘటనగా కవిత్వం జవాబు చెబుతుంది అని తలచి, ఐక్య రాజ్య సమితి పిలుపు 1999లో రావడానికి ఎనిమిదేళ్ళ ముందరగానే, మెడెలిన్ కవితోత్సవాలు నిర్వహిస్తూ 1991 నుంచి దేశదేశాల కవులను ఈ కవిత్వోత్సవాలకు పిలుస్తున్న నేపథ్యంలో తాను లాటిన్ అమెరికా దేశం అయిన కొలంబియాలోని రెండో ప్రధాన నగరం మెడెలిన్ వెళ్ళి, అక్కడకు వచ్చిన డెబ్బై మంది భిన్న దేశాల కవుల్లో తన కవిత ద్వారా, ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. 'యో సొ ఇరాక్' (నేను ఇరాక్‌ను) అని అందరూ కవులూ, ప్రజా సందోహం తనతో గొంతు కలిపి పలికారు. అమెరికా, బ్రిటన్ కలిసి చేసిన ఇరాక్ వినాశకర యుద్ధంపై రమ్లీ రాసిన లఘు కవితలు ఆయన వ్యతిరేకత ఎంత లోతైనదో చెప్తాయి.

కవి, అనువాదకుడూ, కథా, నవలా రచయితా అయిన రమ్లీ 1967లో ఉత్తర ఇరాక్‌లో సుడారా అనే పల్లెటూళ్ళో పుట్టాడు. 1995 నుంచి మాడ్రిడ్‌లో నివాసం. అక్కడి యూనివర్సిటీ నుంచే సాహిత్యం, తత్వశాస్త్రంలో డాక్టరేట్ పొంది సాహిత్యరంగంలో అరబిక్, స్పానిష్ భాషల్లో రచనా చేస్తాడు. పత్రికా విలేకరిగా సైతం అరబిక్, సానిష్, లాటిన్ అమెరికన్ పత్రికలకు రచనలు చేస్తూ ఉంటాడు. ఇరవై పుస్తకాలకు పైగా, అరబిక్, స్పానిష్ భాషల మధ్య అనువాదాలు చేశాడు. తన నవల స్కాటెరెడ్ క్రాంబ్స్‌కు అమెరికన్ ట్రాన్స్లేషన్ అవార్డ్ వచ్చింది. అతని పుస్తకాల్లో బాగా పేరొందినవి ప్రెసిడెంట్స్ గార్డెన్, డేట్స్ ఆన్ మై ఫింగర్స్. మాడ్రిడ్‌లోని సెయింట్ లూయీ యూనివర్సిటీ, అమెరికన్ యూనివర్సిటీల్లో సంబంధిత విభాగాల్లో పనిచేస్తున్నాడు.

సృష్టి

పుట్టిన రోజు
సృష్టించింది నువ్వే
నిన్నే మించి పోయిందది
అందుకే ఆగు ఓ నిమిషం
ఒకింత సమయం విశ్రాంతి పొందు
నిశ్శబ్ద జలాల్లో నిన్ను నువ్వు శుభ్ర పర్చుకో
తదుపరి నడిచిపో
వేరొక దారిన

నా దేశం ఓ కేకు

మిస్సైళ్ళు నిలిపిన కొవ్వొత్తులు
ఎందరో అతిథులు
అందరికీ అందించారు కప్పుల నిండా నా రక్తాన్ని
ఇల్లు నాది - కుటుంబం హతమైంది
ఎవరి పుట్టిన రోజిది
నా పుట్టుక ముందరే వారు నన్ను చంపేసినప్పుడు?

ఇరాక్‌ను నానుండి విడదీయకండి

మీ కాగితాల మీద ఒలికిన సిరా
నా దేశపు రక్తం
మీ ఎల్‌సీడి తెరల మీంచి వచ్చే
వెలుతురు
బస్రా నగరపు కనుల కాంతి
తన ప్రవాసంలో చీకట్లో అక్కడ
ఏడుస్తున్నది
అది నేను
టైగ్రిస్, యుఫ్రటీస్‌లైన మా అమ్మా
నాన్నలను చంపేశాక
అనాథగా మిగిలాను
మీరు నా ఆత్మసఖి ఇరాక్‌ను
శిలువేసినాక
భార్య లేని వాడినీ అయ్యాను
నీ కోసమే స్వదేశమా



వీరి కోర్కెల శిలువలపై నీవు మేకు బందీవైనందుకు

యుద్ధాల పెద్దలూ, వినండి నామాట
నా ఇంటి కప్పులపై కాపలా సైనికులొద్దు
మీరు ప్రతిపాదించిన, ప్రతిపాదించబోయే
ఉరితీతగాళ్ళొద్దు
స్వాతంత్ర్యం పేరిట మా దేశ జనాలపై
మీరు ప్రయోగించే బాంబులొద్దు
నన్ను ఇరాక్ నుంచీ, ఇరాక్‌ను నా నుంచీ
మీరు విముక్తం చేయనక్కర్లేదు
నేను ఇరాక్‌ని.

నా రాత కోతల్లోనే ఉంది నా చికిత్స మలాం
తెలుసు నాకు అదేమిటో
సముద్రాల ఆవలి మీ సిన్మాలకు వెళ్లి పొండి
వదిలిపెట్టండి నాకోసం నన్ను నా సమక్షంలో
మీ పరోక్షంలో
ఏది మిగిలిందో దానికై నన్నొదిలిపెట్టండి
మీనార్లు, పూర్వీకుల సమాధి శయ్యలు,
మా బంధువుల గోరీలు
ఏవి మిగిలాయో వాటికై నన్నొదిలి పెట్టండి
తాగండి మీ దాహాలు తీరేదాకా
కప్పుల కప్పుల పెట్రోల్
గంధకం నుంచి దాని తేనెలు
ఎడారి నుంచి దాని ఇసుకలూ దొంగిలించండి
వచ్చిన బేరగాళ్లను మీతోనే తీసుకుపొండి
ఏవేవి కావాలో తీసుకుపొండి
నియంత వద్దకు మీరేవేవి నా రక్తంతో కొన్నారో
అవన్నీ తీసుకుపొండి
ఒదిలేయండి నన్ను ఒంటరిగా
ఆదాటుగా కాల్పుల్లో ఆగిపోయిన మా చెల్లెలి కలల్లో-
మెసపోటేమియా తీరాల
మంటల్లో మాడిన ఖర్జూర బూడిదల్లో
మా నాన్న ఎముకల ముందు
నా మధ్యాహ్నపు తేనీటి ముందు
'వదిలేయండి నన్ను ఒంటరిగా
దక్షిణ దిక్కు దిగులు పాటల్లోనో
ఉత్తరపు ఉత్తరించబడ్డ గొంతుల్లోనో
యాజీదీ నెమళ్ళ మధ్యనో
వదిలేయండి నన్ను ఒంటరిగా'

'ఒంటిచేత్తో ఒంటరిగా నా ఇరాక్‌కు అయిన
గాయాలను మాన్పుకునేందుకు
ఏకాంతంలో మేరీలా, ఏకాంతంతో ఏకాంతంగా'
'నా దేశాన్ని మీ కోర్కెల శిలువల పై ఎక్కించారు
నాకు తెలుసు ఎలా పునరుత్థానించాలో
ఈ దేశానికీ తెలుసు ఎలా బూడిద నించి లేవాలో
మీరు మర్చి ఉంటారు
ఇరాక్ ఫీనిక్స్ ను కనుగొన్నదని
అలాగే అగ్ని బిలాలను కూడా ...

'ఓ యుద్ధాల పెద్దలూ, వినండి నా మాటలు
మీ విమానాల రొదలతో
ఇరాక్ మబ్బులను భయ పెట్టకండి
మా ఉద్యానవనాల్లో మీ సైన్యాలను నాటకండి
నా తల్లి గౌరవాన్ని తీసేయకండి
అరిచి అరిచి చెప్తున్నా
ఇరాక్‌ను నా నుంచి విడదీయకండి
నేను ఇరాక్‌ను

నా దుస్తుల పటాటోపంపై
పల్లెలు వెల్లి విరిసాయి
నాకేం కావాలో నాకు తెలుసు
నన్ను నామానాన వదిలిపెట్టండి
నాకోసం, నా కుటుంబం కోసం
మీ విముఖత్వాల మధ్య పెద్దగా పట్టించుకోకుండా
నన్ను వదిలిపెట్టండి!

పరిచయం, కవితల అనువాదం : రామతీర్థ
98492 00385

పుస్తకం

'దేవిప్రియా'త్మ కవిత్వం

ఆత్మ కథలున్నట్టే, ఆత్మ కవితలూ ఉంటాయి. 'నేను అనంత శోక భీకరలోక తిమిరైక పతిని' అని కృష్ణశాస్త్రి ప్రకటించినా, 'భూతాన్ని, యజ్ఞోపవీతాన్ని, వైప్లవ్య గీతాన్ని' అని శ్రీశ్రీ నినదించినా, వాటిలో కవిత్వానికి స్పందించే ఆత్మలున్నాయి. 'ఆత్మకవిత' అని పేరు పెట్టి కవిత రాసినది దేవిప్రియ. తిరిగి రాని లోకాలకు చేరుకున్న నెచ్చెలి గురించిన బాధాసప్తశతి, శత సహస్ర స్వరాలుగా కవిని చుట్టుముట్టడిలో ఉంచినపుడు, కవిత్వంలోకి కోల్పోయినతనపు పదును ప్రవేశిస్తుంది. ఒక సామాజిక నాగరికుడిగా ఉంటూనే, తనకు ఉద్దీపన, ఉత్తేజ కారకమూ అయిన జీవన భాగస్వామి గురించి, ఇంకొకప్పటి (అది గడిచిపోయినదీ, రాబోయేదీ కూడా) బహుముఖీన జీవితం గురించి, ఇటీవల దేవిప్రియ వెలువరించిన కవిత్వ సంపుటి 'ఇం..కొకప్పుడు'.

వచన కవిత్వ మర్యాద, అది రూపం దాల్చే నిసర్గ నిర్మాణంలో ఉంది. భావం పరాకాష్ఠకు చేరినపుడు, ఆ ప్రయాణంలో తక్కుంగల ఆహార్యాలన్నీ, దారిలో లుప్తమైపోయినట్టు రాలి పోతాయి. ఆ కడ కొమ్మున, కవి వెలిగించిన భావ దీపం, అనేక హొరుగాలులూ, తుపానులకోర్చి వెలుగుతూ ఉంటుంది. ఇదొక నిశిత ప్రయాస. లోలోపలి వెలితి మహాస్వరూపం అయినప్పుడు, కవి విచలించి పోతాడు. 'వెలిగే తన బతుకు దీపపు కాంతులు ఇంకొందరికి ఆలోచనలకు దారులు చూపాలి' అనుకున్న సామరస్యం కుదిరినప్పుడు, అగ్రశ్రేణి నిరసనలు తలకెత్తుకుంటాడు. 'బాధ కవిత్వానికి పర్యాయపదం' అని చలం అన్నది, ఆ బాధ తనకు దగ్గరివారు దూరం అయిన కఠోర వాస్తవం గురించి అయినా, సమాజ వైపరీత్యాలు, వైరుధ్యాల గురించి అయినా- బాధలను బందూకులు చేస్తాడు కవి. దగ్గరి వారి కోసం బాధలో అయితే, ఆ బందూకు తన గెడ్డం కిందనే ఉంచుకుంటాడు. సమాజ గతి కోసం ఆగ్రహ ప్రకటన అయినప్పుడు మాత్రం, కవి బందూకు చాలా స్పష్టంగా, సూటిగా లక్ష్యాల వేపు గురి పెట్టబడి ఉంటుంది. 'ఇం..కొకప్పుడు' కవిత్వ సంపుటిలో ఇటువంటి సందర్భాలు మిన్నగా ఉన్నాయి.

సహచరి స్మరణంలో అగాధ సముద్రమూ తానే. సమాజం గురించి ధ్యానంలో జ్వాలానంతాకాశమూ తానే. రెండు మెలకువల్లో, ఈ కవితలు మనకు పరిచయం అవుతాయి. 'కీర్తి' అనే కవిత. సమాజ స్తరంలో రాయబడినది. కర్ణపర్వం నుంచి ఒక వ్యాఖ్యను ఉటంకిస్తాడు కవి. 'మరణించిన వాడికి కీర్తి వలన ఉపయోగం ఏముంది? అది శవం మీద వేసిన పూలదండ వంటిది'. చరిత్ర ఒక నిస్సంగ భీకరత్వంలో తన మానాన తాను పోతూ ఉండడం చూసిన కవి, ఈ కవితలో పలు చారిత్రిక వ్యక్తుల, ఐతిహాసిక ప్రఖ్యాతుల పేర్లు చెప్పి, ఇలా అంటాడు: 'చరిత్ర విజయాలూ, వైఫల్యాలూ సృష్టించిన వారూ, అనుభవించినవారూ, కాల ధూమంలో కలిసిపోయారు'. ప్రగతి యాత్ర మనిషి ముందు గల ఏకైక కర్తవ్యం అని స్పష్టం చేస్తూ 'చరిత్ర సారాంశ దీపికలు పైకెత్తి, నవేతిహాసాల నిర్మాణానికి తల ఎత్తి ముందుకు నడిచి పోవలసింది మనమే'. దేవిప్రియకు ఇష్టమైన రచయితల్లో చలం ఒకరు. ఆయన రచన 'సుధ'లోని ఒక కవిత భావనతో, భావ సారూప్యత కనిపిస్తుంది ఈ 'కీర్తి' కవితలో. 'ఇంతసేపూ తెర మీద దెబ్బలాడిన కర్ణార్జునులు కాలపేటికలో కావలించుకు పడుకున్నారు/ ఆశా జనిత పవనోద్భూత మనోతరంగ పరంపర శమిస్తేనే కాని నిర్మల తేజోమండిత చిదాకాశం/ మనో పారావారం పై ప్రతిఫలించదు..'. 'కాల ధూమం' అన్నాడు దేవిప్రియ. యాభై ఏళ్లకు ముందరే అది చలం గారి 'సుధ'లో కాల పేటిక.

నియంతలను నిరసించడం, నిరుపేదలను ప్రేమించడం కవికి జీవ లక్షణం. రెండింటికీ ఒక టెక్నిక్ కావాలి, ఒక సంవిధానం ఉండాలి. అది కవి సహజసంపదగా భాసిల్లాలి. 'ఆకులందున అణిగి మణిగీ కవిత కోయిల పలుకవలెనోయి, ఆ పలుకులను విని దేశమందభిమానములు మొలకెత్తవలెనోయి' అన్నది గురజాడ గురువాణి. పురోగమన శీలం అయిన ప్రపంచం గురించి చెప్పే కవి, ఒక్కో కాలంలో ఒక్కో టెక్నిక్‌తో రంగరించి చెప్తాడు. ఇవాల్టి పద్ధతి ఒక సరళ గాఢత. దీనిని ప్రపంచమే ఇప్పటికే సంక్లిష్టం చేసింది. ఈ సంక్లిష్టతలను సరళీకరించి, మానవుడికి ముందు దారి చూపడం, ఆ చర్య చేయడం, కవిత్వం ఇవాళ చేయవల్సిన పని. దీన్ని శ్రద్ధతో, తత్పరతతో చేసే కవులు వారి మాటలు విడివిడి అక్షరాలు కాకుండా వాటికి అర్ధ పరిపూర్ణత కల్పిస్తారు. ఆ ఆత్మ విశ్వాసంతోనే దేవిప్రియ 'నీ విడి అక్షరాలలో లేనిది, నా పంక్తులలో ఏదో ఉంది' అంటాడు ('నా పంక్తులు' కవితలో). అక్షరాలు ఒంటరి మనుషులు, పంక్తులు సమష్టి స్ఫూర్తి పొందిన సమాజాలు అని కవి చెప్పడు. కవిత తరువాతి ఒక మౌనంలో ఒక శంఖ ఘోష వినిపిస్తూ ఉంటుంది.

ఎంత పెద్ద చెట్టయినా బతికేది 'చిగురంత ఆశ'తోనే. మనిషి ఆశ కూడా నిత్యం చిగురిస్తుంది, కొత్త చిగురేస్తుంది, తన హైదారాబాద్ అపార్ట్‌మెంట్‌కు 'అమ్మ చెట్టు' అని పేరు పెట్టుకున్న కవి, చిగురంత ఆశల ఆహ్వాన పత్రికలే కదా ప్రపంచం అంతటికీ పంపిస్తాడు. అందుకే దేవిప్రియ 'చిగురాశ' కవితలో, మానవ మహా

ప్రయాణంలో మనిషికి తోడు ఏదో, తాత్విక సుందరంగా చెప్తాడు. 'చిగురాశ ఒక్కటే నీకు చివరి భరోసా, నేల మీద పాకడానికైనా, నీటి మీద తేలడానికైనా, గాలిలో ఎగరడానికైనా అదే నీకు మిగిలిన ఆఖరి ఆసరా'. ప్రతికూల పరిస్థితుల విలయ నత్యంలో ఆశ కోల్పోయిన కవిగా శ్రీశ్రీ - 'నిజంగానే నిజంగానే నిఖిల లోకం నిండు హర్షం వహిస్తుందా, సుడులు విచ్చి జడలు రెచ్చే కడలి నత్యం శమిస్తుందా? పాడు కాలం లయిస్తుందా నిజంగానే నిజంగానే' అని వ్యాకుల పడతాడు. 'నాకొంచెం నమ్మకమివ్వు' అసాధ్యాలు సుసాధ్యం చేసేస్తాను అంటాడు బైరాగి. 'ఆశా దూతలు' అనే మరొక కవితలో శ్రీశ్రీ- నాలుగు దిక్కులకు 'మానవ కోటి సామ్రాజ్యదూతలు, కళా యజ్ఞాశ్వముల్ గాలులై, తరగలై, తావులై, పుప్పొళ్ళ కుంకుమల్ పొగలై సాగిరి' అని ఆశాయానాలు అభ్యుదయానికి ప్రాణ వాయువులని తేలుస్తారు.

విశాల మానవ అస్తిత్వానికే తన విపుల స్పందనలు ఇచ్చే కవి దేవిప్రియ. ప్రాంతీయ పరాకాష్ఠలు ఈ కవిత్వంలో కనిపించవు. వెతుకులాట కూడా అనవసరం. ప్రపంచమే తన మానదండం (స్కేల్) అయినప్పుడు, 'గోడలు', 'అనాయక' వంటి బహుళ స్వరాల (పోలీఫోనిక్) కవితలు రాస్తారు. అటువంటి ప్రపంచ సంస్కార స్వరం దేవిప్రియ. ఆయన వేదన, సాధన, ఆనంద శోధన హద్దులెరుగని కృషి. ఒక్కో కవిత గురించి ఒక ప్రపంచ పరిణామ వ్యాఖ్యగా రూపొందిస్తూ ఒక పుస్తకమే రాయవచ్చు. అనాయకత్వంలోకి జారిపోతున్న విదూషక వ్యవస్థ పట్ల ఆగ్రహ ప్రకటన చేయడంలో చక్కని సంయమనం పాటిస్తాడు ఆయన. విలువల పతనంలో సాంకేతికత ఒక ఐచ్ఛిక భాగస్వామి. అయిన వాళ్ళ ఇంటి మర బానిస. దీన్ని 1965లో విలయ లయలో చూసిన అమెరికా కవి అలెన్ గిన్స్బర్గ్, తన కవితలో 'ద హౌల్' అంటూ నక్క 'ఊళ' తన నిరసన స్వరంగా 'నేను చూశాను నా తరపు అత్యుత్తమ మేధలు విధ్వంసమై పోవడాన్ని' అంటూ మొదలు పెట్టి ఆగని 11 పేజీల ఒక దీర్ఘ వాక్యం రాస్తాడు. ఆ కవిత తీవ్రతరం అవుతున్న ఇరవయ్యొక్క శతాబ్దపు యాంత్రికతపై ఎక్కుపెట్టిన నిరసన. కవి దేవిప్రియ 'అనాయక' అనే కవితలో రాసిన పంక్తులు ఈ దిగజారుడు తనాలకు బర్నింగ్ కామెంటరీ.

కవిత్వం మణిపద్మం వంటిది. ఒక్కోసారి మణి వలె దృఢత్వం బయటా, మదుత్వం లోపలా కలిగి ఉంటుంది. ఇంకొన్నిసార్లు పైన మెత్తగా, లోపల గట్టిగా ఉండే ఒక మనో రసాయనం. 'నేను నా షరతుల మీదనే జీవించాను' అని 'ఒక ఎండ కథ'లో తెగేసి చెప్పే ప్రజాస్వామిక చైతన్యం ఈ కవి. కాలానికి నిలబడ్డం ఎలాగో తెలిపిన జీవన సాగర బుద్ధుడు.

ఆప్తులను కోల్పోయే వెలితిని వైయక్తిక స్థాయిలో ఒక పూడ్చలేని లోటుగా స్వీకరిస్తూ, 'విరహ వీణా తరళ తరళ తంత్రీ గతుల' శబ్దఛాయలకూ, తాను ఈ మూడో సహస్రంలో ధ్వనిస్తున్న వ్యక్తిగత, సమాజగత ఆర్తి సంగీతానికీ గల భిన్న నాణ్యతా ప్రమాణాలను పదే పదే నిలబెట్టగల దిట్ట దేవిప్రియ. అందుకే ఈ కవిత్వ సంపుటిలో గతంలోని 'అప్పుడు', వర్తమానంలోని 'ఇప్పుడు', అటు గతంలోనూ, ఇటు భవిష్యత్తులోనూ కూడా ఉండగలిగిన 'ఇం..కొకప్పుడు' ఉండడం, కవి వాంఛిత నిర్దేశం. ప్రతి మనిషికీ, సమాజానికీ కూడా ఈ 'ఇం..కొకప్పుడు' అనే దశ ఉంటుంది. దాన్ని ఇంత లోక జ్ఞానంతో అందుకున్న వాడు ఎవడో వాడికే నిన్న, నేడూ, రేపు గురించిన త్రికాల దర్శనం సాధ్యమవుతుంది. అది ఆయన కవిత్వం నిండా కనిపిస్తుంది.

– రామతీర్థ
98492 00385

(ఈనెల 4వ తేదీన హైదరాబాద్‌లో ఆవిష్కరణ జరిగిన ఈ పుస్తక ప్రతులకోసం 09866111874 నెంబరులో సమతా బుక్స్

వేసవి కవితలు



"ఎసగు కట్టావిక్రియ నావిరెగయ బగటి
ఎండ యుడుకారకుండ భూమండలమునం
బొలిచె మాపట బండువెన్నెల చకోర
పోత వితతికి జావట్టు పోసినట్టు"

"రాత్రి వేళ్లై భూమి నుండి ఆవిరి లేచుచునే యుండుటయు ఎండ వేడి ఇంకను ఆరకున్నట్టి భూమండలమందం

"కంచు వృషభముల అగ్ని శ్వాసల కక్కే గ్రీష్మం కదలాడీ" అని రాసిన మహాకవి శ్రీ శ్రీ, విశాఖపట్నం ఎండల గురించి రాసి ఉండరు. ఆయన కాలంలో ఒక వందేళ్ల కిందట, విశా ఖపట్నం చల్లగానే ఉండేది. అయితే వేసవి, మన తూరుపు దేశాల్లో, నలభైలు, యాభై డిగ్రీలు మధ్య భయ పెడుతూ ఉంటే, ఆటు పడమటి దేశాల్లో, ఇరవై అయిదు డిగ్రీల నులి వెచ్చని సమ్మర్‌గా, అక్కడి ప్రజలకు, ఆటవిడుపు. ఎక్కువ కాలం శీతల రుతువులో జీవిస్తారు కనుక, ఎంతో ఆహ్లాద కారకం. మన వేసవి గురించి ఎంత చెప్పినా తక్కువే. అలా అని కొత్త పోలికలతో చెప్పడం, కవిత్వం కాగా, ఒక మంచి పద్యం, చిన్న పద్యంలో అయిదు వందలేళ్ళ కిందట, కృష్ణ దేవ రాయ కవి రాజు చెప్పినది, ఆయన తన యుద్ధ యాత్ర లకై దేశ సంచారంలో ఎంతలా ప్రకృతి అందాలను చూశా డో, తెలియచెప్తుంది. రాయల వారి ఆముక్త మాల్యద వర్ణల నలకు ప్రసిద్ధం. రాయల వారి కాలంలో పేపర్ దోశలు ఉన్నాయా? దోశలకు మన తెలుగు మాట అట్టు. రాయలు ఈ మాటనే వాడి, ఆరోజుల్లో, పేపర్ దోశా?, అదేనండీ అట్టు, అంత పెద్దదైతే ఏమని పిలవ వచ్చో, చక్కగా ఒక పేరు కూడా పెట్టాడు. దేశాన్ని పాలించే రాజు గారు ఏమిటీ, పేపర్ దోశ గురించి చెప్పడం ఏమిటీ, అంటే అదే మరి కవిత్వాన్ని వందల ఏళ్ళు చిరంజీవిగా ఉంచే జీవలక్షణం.

ఎండకాలం..మండే సూరీడు

ఇదే ఎండ ఇక పడమటి దేశాల్లో అయితే, వారికి ఆటల, పాటల కాలం. నదీ తీరాల, సముద్రాల ఒడ్డున, వారు ఎండలో గంటల తరబడి సరదాగా గడుపుతారు. అలాంటి ఒక మంచి కవిత రాసిన వారు స్కాట్లాండ్ కవి రాబర్ట్ లూయీ స్టీవెన్సన్.

అనేక మంది దేశ దేశాల కవుల వేసవి కవితలు ఉన్నాయి. తెలుగు కవి గుంటూరు శేషేంద్ర శర్మ, ఎకీకీతు ఘోష పేరిట, రాసిన పద్యాల్లో, ఈ వేసంగి గురించిన పద్యాలు మనలను పలకరిస్తాయి. ఇంచు మించు రాయల కాలపు కవి, నాటక రచయిత అయిన విలియం షేక్స్పియర్, నాటకాలే కాక, సానెట్ పేరిట, నూటికి పైగా పద్నాలుగు లైన్ల కవితలు రాశారు. పద్నాలుగు లైన్ల కవితల్నే సానేట్లు అని

"సూరీడమ్మ సూరీడు బోలెడంత సూరీడు
అదే పోత పోతున్నాడు ఎగువ లోకాల గుండా
నీలాల గుండా నిప్పువెలుగు దినాలగుండా
వాన కన్నా వాటంగా వేడి సూదులు గుచ్చుతూ

ఎంత గట్టిగా మనం పరదాలను లాగినా
ఇల్లు కాస్త చల్లగా ఉంచాలని చూసినా
చొరబడతాడేదో ఒక వార లోంచి చప్పునా
మిల మిల బంగరు వేళ్ళతో గక్కున

సాలె గూళ్ళ పొగుల్లో దుమ్మట్టిన అటకకు
తాళపు చెవి సందున వెచ్చని కితకితలే పంపును

పగిలిన పాలరాయి గచ్చు వలకల గుండా
పంపును ఎండు గడ్డి కుప్పలకు నవ్వు దుబ్బులు .

ఈలోగా చుట్టూ అంతా వెలుగుల ముంచుతూ
తోట తోపులన్నీ నలుగురికీ చూపును
ఆ చెట్ల దట్టంపు కొమ్మల చీకట్ల నడుమా
వెలుగు పలకరింపులే చిలకరించును

కొండల మీదుగా,నీలాల వారగా
నులి వెచ్చగాలుల పాదాల హెూరునా పోతున్నాడు
పాపకు సందడి గొంతుగా,పూలకు రంగుల పంటగా
ఈ లోకపు తోటమాలి నింగి నిండుగా"

తటను తరిపి (పండు) వెన్నెల పరచు కుని యుండుటయు నెట్లుండెను అనగా, కాలుచున్న పెనము మీద అట్ల పిండి పోసి కట్టావిరి ఎగయుచుండగా, వెన్నెల చకోరాలకు, పావురాలకు, ఎక్కడివి అక్కడనే తినుటకు అనుకూలముగా విశాలమైన చావ అట్టును పోసినట్టుగా ఉన్నది" అని కృష్ణదేవ రాయలు తన ఆముక్తమాల్యదలో రాశారు. ఆయన గ్రీష్మంపై చెప్పిన చాలా పద్యాల్లో ఇది అతి చిన్నది. వేసవికి మని ఉన్న మంచి తెలుగు మాట వెట్ట.

చావ అట్టు, అంటే పేపర్ దోశ. ఆ కాలంలో ఈ ఐటం లేకున్నా, ఉంటే దానిని పెద్దది కనుక, విశాలమైనది కనుక, "చాప అట్టు" అన్న కవి రాయలు.

వెన్నెల భూమి అనే వేడెక్కిన పెనం మీద పోసిన అట్లా పిండిలా ఉన్నది అని ఊహించడానికి, ఒక ఉత్ప్రేక్ష అలంకారంగా తన కవిత్వంలో నిలవడానికి, కవికి ఉండాల్సిన లోక పరిశీలన, నిండుగా ఉన్న కవిరాజుగా రాయలవారు మనకు దర్శనమిస్తారు.

పిలుస్తారు. వాటిలో చాలా ప్రసిద్ధం సోనెట్ పద్దెనిమిది. ఇందులో, "మానవుడి యవ్వనమే నిజమైన సూర్య రశ్మి" అంటూ, తన కాలపు ఒక యువ మిత్రుడికి, తను ఉద్దేశించిన కవిత, వేసవి గురించే, ఈ ప్రపంచ ప్రసిద్ధ ఆంగ్ల మహాకవి రాసినది, ఇంకొక కోణంలో కావడం, చాలా ఆసక్తి కరంగా, దీనిని ప్రపంచ సాహిత్యంలో నిలిపి ఉంచింది.

"పోల్చనా నిను నేనొక వేసవి రోజుతో
అంతకన్నా అందం నీది నిలిచి ఉండేది
వైశాఖ విరులను వడగాడ్పులు కమిలిస్తాయి
వేసవి కొలువు తీరేది బహు కొద్ది కాలమే
కొన్నాళ్లు మరీ ఎర్రగా ఆ ఆకాశనేత్రం వెలిగినా
కొన్నాళ్లు మసకబారుతుంది తన బంగారు చాయ
ప్రతి తెల్లని తేటా, మాపు కావి చాయకొస్తుంది
కాలవశంలో లయల్లో పాతగిల్లుతుంది
కానీ నీ యవ్వన వేసవి నిత్య కాంతి వంతం

శేట తెలుపు మాసిపోదు నిన్నొదిలి పోదు
చావు దప్పు కొట్టుకోదు తన నీడనే నీవున్నావని
కాలరేఖల్లో సాగుతుందినీ ఎదుగుదల
మనుషుల కనుల చూస్తూ, ఊపిరి తీసినంత కాలం,
నిలుస్తుందిది అంతకాలం నీకు ప్రాణ దాయినిగా".

ఎండలు మండి పోవడం, నీళ్ళు ఎండి పోవడం ఒక జనజీవన దృశ్యంగా, రాయలసీమలో కనిపిస్తుంది, అక్కడి పల్లెల్లో పాడే ఒక ఎండాకాలపు పల్లె పదం ఇలా సాగుతుంది,

నలుగురు పిల్లలు నలు వైపులా నిలబడి, నూతిలో అడుగున్న నీళ్ళు ప్రయాస పడి తోడుతున్నట్టుగా ఈ పాట పాడుతారు.

"సేదే బాయి సెంగన్నా బాయి/మా తాత తొగిచ్చిన మంచి నీళ్ళ బాయి /మా నాయన కట్టిచ్చిన నందన్న బాయి / తాగేకి నీల్లు లేవు తందన్న బాయి"

జీవన ప్రదాత అయిన సూర్యుడు కవితా వస్తువు కానీ ప్రపంచ కవిత్వం లేదు. వేసవి ఎంతలా ఇబ్బంది పెట్టినా, మిగతా మూడు రుతువులను నడిపించే ఒక మహా ఇంధనం. అందుకే ఈ మండే కారు ("కారు" అన్న తెనుగులో రుతువే) కు, ప్రజల దృష్టిలో ఎప్పుడూ శాశ్వతం, సమున్నత సింహాసనం.

-ప్రేమ్ చంద్

ప్రతి సోమవారం

రైటర్స్ అకాడమీ

వారం వారం విపుల సాహిత్య విహారం

జల స్వరంగిణి

సముద్రం సృష్టి అందించిన
ఉప్పు సుదుల వడిసెల
అలాక్షరాలుగా విసురుతుంది
పద ప్రవాహాలుగా పారిస్తుంది తీరానికి
లోతూ, వెడల్పూ , ఎత్తూ
తెలిసిన లవణ రాశి అది
నా ఉప్పు తిన్నావు కదా
అంటే ప్రతి మనిషీ తలాడించాల్సిందే
తోడుకొమ్మని పిలుస్తుంటుంది
యుగయుగాలుగా మానవులని
తీరాన కళ్ళప్పగించి చూసే వారే ఎక్కువ
కొందరే దిగేది సముద్రం లోనికి
పారే నీటి గూళ్ళు కట్టడానికి
ఉప్పుకి సరిపడా
మమతల తియ్యదనాలు నింపడానికి
నేలపై ఇంకిపోవడానికి
అందుకే ఎక్కడ తవ్వండి నేల పై
కమ్మని కవిత్వ గంగలే
నీళ్లై బతుకుని నిలబెడతాయి

-పి. అనంతరావు,
81255 10181

సూర్యుడి మరణం

మరణం యింత నిర్దయగా
మంచి వాళ్ళనే ఎందుకు వరిస్తుంది అర్థంకాదు
మరణం యింత కర్కశంగా
యువకులనే ఎందుకు పలకరిస్తుందో తెలీనే తెలీదు.

మరణం అతని కిటికీ
దగ్గర పక్షిలా వాలి
గుస గుసగా సంభాషిస్తూ లోబరుచుకుంది
మరణం నెచ్చెలిలా
అతన్ని హత్తుకుని కబళించింది

నాయనా ఎంత పని చేసావురా
అని గుండెలు బాదుకోవాలన్పిస్తోంది
వాడి చేతుల్ని నా చేతుల్లోకి తీసుకుని
తండ్రీ నా కళ్ళల్లోంచి చూడు
నీ బలహీన క్షణాల్లో
నీ పోరాటాల్లో
నీ ఆదర్శాల్లో తోడుగా వుంటానని
చెప్పలేక పోయినందుకు నా మీద నాకు కంపరం పుడుతోంది

రేపటి ఆశలకి పల్లకీలెత్తిన వాడు
అణగారిన వారికి సేవలు చేసిన వాడు
మరణం కన్నా మహెూన్నతుడు
చీకట్లని తరిమికొట్టిన సూర్యుడు
సూర్యుడు సూర్యుడు సూర్యుడు
సూర్యుడు మరణించినపుడు
ఉదయాలన్నీ నల్లచీర కట్టుకుని
మన అందర్నీ శపించినట్టుంది.

ఇపుడు
కవులంతా
కరుణ గురించి
కవిత్వ గురించి
ఎంత రాసిన ఏం లాభం?
(పాడేరు ఏఎస్‌పిగా
పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్న
యువ ఐపిఎస్
కె.శశికుమార్‌కు)

- ఆకెళ్ల రవిప్రకాష్

శ్రీశ్రీ గారి భాషా చమత్కారాలు

" మహాకవి శ్రీశ్రీ మద్రాసులో ఓ చిన్న హెూటల్‌కెళ్ళాడు. 'టిఫినేముంది?" అనడిగాడు. "దోసై" అన్నాడు హెూటల్ వాడు. "సరే వేసై" అన్నాడు శ్రీశ్రీ.

మరోసారి వైజాగ్‌లో ఓ హెూటల్‌కి వెళ్లి టిఫినేముంది అని అడిగాడు. 'అట్లు' తప్ప మరేం లేవు సర్ అన్నాడు వాడు. 'సరే అట్లే కానీ ' అన్నాడు శ్రీశ్రీ

ఇంకోసారి ఓ మిత్రుడు ఊరెళ్తాంటే వీడ్కోలివ్వటానికి మద్రాస్ సెంట్రల్ స్టేషన్ కెళ్ళాడు. ప్లాట్ ఫాం పై ఓ పరిచయస్తుడు కనిపించి. "ఊరికేనా? అనడిగాడు. "లేదు ఊరికే" అని బదులిచ్చాడు శ్రీశ్రీ.

ఒక ఊరిలో ఒక చోట ఒక బోర్డ్‌పై "ఇక్కడ వేడి తేనీరు దొరుకును" అని వ్రాసి ఉండటంతో "అరే! ఇక్కడ వేడితేకాని నీరు దొరకదా? అనడిగాడు.

ఓ హరిదాసు విశ్వనాథ సత్యనారాయణ గార్ని కలిసి ఓ హరికథ ఏర్పాటు చేయటానికి సహకరించమని అడిగాడు. మీ ఊరిలోని చెప్ప కూడదటయ్యా" అనన్నాడు శాస్త్రి "మా ఊరి వారు చెప్పిచ్చుకోరండి" అనన్నాడా హరిదాసు "మా ఊరి వారు చెప్పుచ్చుకుంటారే" అనన్నాడు శాస్త్రి"

త్యాగరాజ "నగుమోము" దర్శనం

త్యాగరాజ 250వ జయంతి ప్రత్యేకం

దూరాన ఉన్న తంజావూరు, గత నాలుగు వందల ఏళ్ళుగా, నాయక రాజులు, మరాఠా రాజుల కాలంలో, మరాఠా భాషతో బాటుగా, తెలుగు కూడా, అధికార భాషగా, పాలకులు సమాదరించిన భాష. అప్పట్లో, ఈ భాషా సరిహద్దులు, రాష్ట్రాలను నిర్ణయించేవి కావు కనుక, దక్షిణాదిన ఎక్కడైనా సరే, ఈ నాలుగు భాషల ప్రజలు తమ సౌకర్యం, పెద్దలు తరాల ముందర తరలి వచ్చి అక్క డ జీవిక ఏర్పరచుకున్న దరిమిలా అక్కడ జీవించే వారు. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలీ అంటే, అక్కడ రెండు వందల యాభై ఏళ్ల కిందట మొదలైన ఒక తెలుగు ఉద్యమం, త్యాగరాజస్వామి వ్యక్తిగా జన్మించి, ఒక సంగీత వ్యవస్థ ఎదిగిన, ఏకవ్యక్తి స్ఫూర్తితో, ఇన్నేళ్లూ కొనసాగుతూ వస్తున్నది. అదే తిరువాయూరు అనే ఊరిలో ఒకే కాలంలో పుట్టిన ముగ్గురు సంగీత సాహిత్య వేత్తలు, శ్యామ శాస్త్రి , త్యాగరాజు,తెలుగు, సంస్కృతాల్లో, కృతులు రాయగా, ముత్తుస్వామి దీక్షితులు సంస్కృతంలో తన కృతులు రచించారు.

వీరిలో కర్ణాట సంగీత సంప్రదాయంలో తన జీవితం ఒక సాధన వేదికగా, త్యాగ రాజస్వామి, తను రాసి, స్వర పరచి, గానం చేసిన కృతులు తెలుగు భాషలో ఏడు వందలు దాకా ఉంగ

దాయం అయిన, హిందూస్తానీ, కర్ణాట పద్ధతుల్లో, కర్ణాట పద్ధతికి ఆద్య కృతులుగా నిలబడ్డాయి. వీటి సాహిత్య విశేషాలు, పట్టించుకుని, విడ మరచి చెప్పవలసినది, ఆ భాష మాతృభాషయిన తెలుగు వారు మాత్రమే. ఈ బాధ్యత మనం సరిగా నిర్వర్తించలేదు.

ఉదాహరణకు "నగుమోము గనలేని" కృతి ఎన్నో కచేరీల్లో విన్నాము. ఆ పల్లవి వాడుకున్నఎన్నో సినిమాల వలన కూడా, ఎక్కువగా ప్రచారం లభించిన మాట వాస్తవం. కనీసం అప్పుడైనా సరే, ఏమిటీ, ఈ రచనలో ఉన్నది అని పట్టించుకోవల్సిన బాధ్యత ,తెలుగు సాహిత్య వేత్తలది. దీన్ని మన తర తరాల సాహిత్య వేత్తలు, సాహిత్య ప్రాధాన్య విషయంగా పట్టించుకోకపోవడమే, ఇంతవరకూ జరిగింది. ఈ మే 21న, విశాఖలో ఉదయం నుంచి సాయంకాలం దాకా, త్యాగరాజ సంగీత సభలు, కళాభారతిలో జరుగుతు న్నాయి. వందల సంఖ్యలో సంగీత సాధకులు, యువతరం, ప్రఖ్యాతులు వచ్చి, త్యాగ రాజ మూర్తిమత్వానికి సంగీత నీరా

అయితే ఈ కృతి సాహిత్య అర్థం అన్వయం, ఏమిటి? ఇది ఈ రెండు వందలేళ్ళుగా ప్రస్తావనకు రాని అంశం. ఈ కృతి రామ భక్తిలో ఎన్నో కృతులు రాసిన త్యాగ రాజు, రాముల వారిని ఉద్దేశించి రాయలేదు.

చిక్కడి పోయి, ఎంతగానో విడిపించుకుందామని ప్రయత్నించి విఫలుడై, ఆ దిక్కు లేని స్థితిలో, ఆ ఏనుగుల రాజు ఎన్నో పద్యాల ద్వారా, తన సర్వస్వ శరణాగతి నివేదన చేస్తాడు పోతన రచనలో. అక్కడ పోతన గారికి ఎన్నో పద్యాలు రాయానికి అవకాశం ఉన్నది. అలానే రాశారు కూడానూ. వాటిలో ప్రధాన నివేదన ఈ కృతికి ప్రేరణ " లావొక్కింతయు లేదు, ధైర్యము విలోలంబయ్యే" అనే పోతన పద్యం అని తెలుస్తుంది. కానీ దాదాపు మూడు వందల ఏళ్ళు తర్వాత, పోతన గారి లాగే, రామ భక్తుడైన త్యాగరాజు, భాగవతం క్షుణ్ణంగా ఎరిగిన కవిగా, వాగ్గేయ కారుడిగా, తానూ ఒక చిన్న కృతి సమర్పణ చేశారు, అదే ఈ "నగుమోము గనలేని నా జాలి తెలిసీ". పోతన చూపని కొత్త మలుపు తన ఈ చిన్న రచనలోనే తెచ్చారు త్యాగరాజస్వామి. "మీ పరివార గణాలు నా దుస్థితి గురించి చెప్పలేదా, ఒక వేళ విష్ణుమూర్తి రమ్మన్నా, ఇంకా గరుత్మంతుడు రాలేదా? లేదా వచ్చినా, ఇలా ఉన్న పళాన వెళ్ళాలీ అంటే , గగనానికి, , ఇలకూ బహు దూరం అని సణుగుతు న్నాడా?" అన్న సందేహం తీవ్ర బాధలో ఉన్న ఏనుగుల రాజుకు

అంటే "నా దురవస్థ తెలిసి" అన్న కొత్త అర్థాన్ని, ఈ మాటను ఇలా ప్రయోగించడం వలన సాధించిన ప్రయోగశీల కవి త్యాగరాజస్వామి.

త్యాగరాజు కాలానికి మనం ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనలో ఉన్నాము. దేశం చిన్న చిన్న రాజ్యాలు, సంస్థానాలుగా ఉన్నా, వాటి నేపథ్యంలో ఒక కంపెనీ పాలన, జోక్యం, వంటివి భారత దేశం అంతా చోటు చేసుకుంటున్నాయి. వాటి వలన, కొత్త యంత్రాంగం, మాట వినని సిబ్బంది, వంటి ప్రభుత్వ అవలక్షణాలు అప్పటికే, మన సమాజంలో మొదలయ్యాయి. ఈ అవస్థను, అంటే యంత్రాంగ ఆలస్యాన్ని రెడ్ టేప్ అంటారు. విష్ణుమూర్తి మాట వినకుండా, గరుత్మంతుడు కూడా సిబ్బందిగా, ఈ రెడ్ టేప్ ఎస్టాబ్లిష్మెంట్ లక్షణాలను సంక్రమింపచేసుకున్నాడా, అనేది త్యాగరాజ స్వామి చిత్రణలో ఉన్నా ఒక గూఢాంశం. ఎస్టాబ్లిష్మెంట్ లో ఏర్పడే రెడ్ టేప్ గురించి రెండువందలేళ్ళ ముందర ఆలోచన చేయగల ఆధునికుడు త్యాగరాజస్వామి. ఈ రెండు వందల యాభైవ జయంతి దక్షిణాది రాష్ట్రాల్లో వైభవంగా చేస్తున్నారు. ఇంతకు ముందు ఎన్నడూ ఎవరూ చేయని జమిలి కృషి ద్వారా, తెలుగు భాషకు సంగీత సామ్రాజ్య పట్టాభిషేకం చేసిన మహానీయుడు, ఇప్పటికీ తెలుగు ఈ నాలుగు భాషల రాష్ట్రాల్లో సంగీత సాహిత్య భాషగా నిలబడ్డానికి ప్రధాన కారకుడు, అయిన త్యాగరాజ సాహిత్యంలో ఇటువంటి విశేషాలను

సాహిత్య విజయ ధ్వానాల ద్వానా

ప్రతి సోమవారం

రైటర్స్ అకాడమీ

వారం వారం విపుల సాహిత్య విహారం

గురజాడ, మారేపల్లి రామ చంద్ర శాస్త్రి, నడింపల్లి రామభద్ర రాజు, కుసుమ ధర్మన్న, పురిపండా అప్పలస్వామి, జాషువా, నారాయణరెడ్డి, గోపి, ఇంకా ప్రాచీన కవి శేఖరుల జీవితం, రచనల పై ద్వానా పుస్తక పరంపర నిరంతరంగా సాగుతున్నది. విమర్శ పై పద్దెనిమిది పుస్తకాలు వెలువరించిన ఈ అక్షర ద్వాదశి సాహిత్య రోదసీ యాత్ర దిగ్విజయంగా సాగాలని, మొజాయిక్ సాహిత్య సంస్థ, సాహిత్య సురభి, ఋత్విక్ ఫౌండేషన్ కోరుకుంటూ, సౌహార్దం, సమ భావం, పునాదులుగా, నారుమళ్లుగా, సస్య శ్యామలంగా, జీవిత సాహిత్యాల మాగాణి మారాజుగా, ద్వానా శాస్త్రి కృషికి ఒక వడ్ల గింజగా అందిస్తున్నాము ఈ చిరు సమ్మానాన్ని విశాఖ సాగర తరంగ ధ్వానాల మధ్య మా ద్వానాకు. అక్షరమస్తు అంటున్నది అలల అంతరంగం. సై అంటున్నాము సహృదయ సాహితీ మిత్రులమందరం.

పి. అనంత రావు

కన్నడంలో ఒక అనంత మూర్తి ఉన్నట్టే, మనకు కూడా ఉన్నారు అనంత మూర్తి ద్వయం, ఇద్దరు కవులు. వీరు అభ్యుదయ భావ జాలం కలిగిన యువకులు, కవిత్వ ప్రేమికులు, సామ్యవాద చింతన తో వెలువడే సాహిత్యం చదవడం, రాయడం, జాతీయ, ప్రపంచ సాహిత్యం పట్ల శ్రద్ధ కలిగి, నిత్య విద్యార్థులుగా మెలగడమూ, ఇవన్నీ మనం అనంతరావు, ఎ.వి.ఆర్. మూర్తి వీరిద్దరిలో చూస్తాము. అదే వీరిద్దరినీ వేరు చేయకుండా, ఒకే వేదిక పైన గౌరవించడానికి ప్రధాన కారణం, కవిత్వ మహత్వ పటుత్వ సంపదల్ తమ ఊపిరిగా, అక్షరాలతో నాలుగు దశాబ్దాలకు పైబడ్డ వీరి సాహిత్య సహ జీవనం, రచనా, ఆచరణ, విశ్వాసం ఏవీ వేరు కావు. అందుకే అక్షర గోదావరి 2017 కవిత్వ పుర స్కారం ఇద్దరికీ జంటగా అంద చేస్తున్నాము మళ్ళీ ఇటు వంటి సందర్భమే ఎప్పుడు వస్తుందో తెలీదు అన్నప్పుడు, ఈ జమిలి పురస్కార ప్రదాన విశేషం ఏమిటో మనకు అవగాహన కొస్తుంది.

శ్రామిక జన జీవిత చిత్రణ, చేస్తూ అనంత్ జన కేతనం, శ్రామిక ధరిత్రి, పొగ జెండా కవితా సంపుటాలు ప్రచురించగా, మూర్తి కవితావాహిని అనే కవిత్వ సంపుటి తీసుకొచ్చాడు. "మూడు చిరు నామాలు"లో తమ చిరునామాలు కలిపి, కొంపెల్ల తో కలిపి ముగ్గురి మినీ కవిత్వం ఒక ముచ్చటగా వెలువరించారు. అరసం విశాఖ నిర్మాణాత్మక సభ్యులుగా దశాబ్దాలుగా సేవలు అందిస్తున్నారు. తొలి నాళ్ళ నుంచీ, విరియాల లక్ష్మీపతి గారి సన్నిహితులుగా , ఆచార్య చందు సహచరులుగా, కవి అద్దేపల్లి అంతేవాసులుగా, వజ్రాయుధ ధారి సోమసుందర్ మెచ్చిన యువకవులుగా, అరసం చేసిన ఎన్నో ముఖ్య కార్యక్రమాల్లో సేవలు అందించిన క్రమశిక్షణ వీరి సొంతం. కవిత్వాన్ని కార్మిక జగత్తు కళ్యాణానికి లక్ష్యిస్తాడు అనంత్, నగర జీవితం పట్ల కూడా నిశితమైన అభ్యంతర స్వరంగా మూర్తి నిలుస్తాడు . నాస్తికోద్యమం, హేతు వాద సమాజం వంటివి వీరిలో వైజ్ఞానిక దృష్టి సంపన్నమవడానికి కారణం కాగా, పలు సాహిత్య సంస్థలతో ప్రగాఢ స్నేహం, రచనా భాగ స్వామ్యం, వీరి సాహిత్య సంస్కారానికి నిదర్శనాలు.

ఎంతో మంది సాహిత్య వేత్తలతో స్నేహం, గౌరవం తో మెలిగి , ఎంతో విషయ పరిజ్ఞానం పొందిన కవులు వీళ్ళిద్దరూ. విశాఖ, ఉత్తరాంధ్ర, నేటి తెలుగు సాహిత్యం గర్వ పడేలా, అభ్యుదయ మార్గాన, ప్రజల శ్రేయోదాయక భావనలతో, సృజన నైపుణ్యం తో వీరి రచనలు ముందు ముందు కూడా వెలువడాలని, ఆశిస్తూ, సాహిత్య అధ్యయనం ఒక జీవన కాల వ్యాసంగంగా చేసుకున్నా ఈ అనంత మూర్తి ద్వయన్ని అభినందిస్తూ, కవిత్వ ప్రక్రియలో అక్షర గోదావరి 2017 పురస్కారాన్ని అందచేస్తున్నాము. అనంతమూర్తిమత్వంతో వీరి ఆశయాల ఆకాశాల నిండా, అక్షరాల వెలుగుల రవ్వల జడులు సదా శోభాయమానం చేయాలని సస్నేహంగా ఆకాంక్షిస్తున్నాము. ఇద్దరికీ రెండు ప్రతులుగా ఈ సమ్మాన పత్రిక అందచేస్తున్నాము.

సాహిత్య విజయధ్వానాల ద్వానా

ద్వాదశి నాగేశ్వర శాస్త్రి ద్వానా శాస్త్రిగా సాహిత్యంలో లెటర్ వర్డ్. ఎన్నో ముఖ్యమైన మాటల వలె, ఇది కూడా నాలుగక్షరముల మాటే. ద్వానా అంటే సాహిత్య సందడి. ద్వానా అంటే ఏడాదికో పుస్తకం. వందేళ్లు బతికి, వందలేళ్ళు తన సరళమైన పుస్తకాల ద్వారా, తెలుగు పాఠకలో కానికి గుర్తుండదగిన కోలాహల కేంద్రం. సాహిత్యం చుట్టాలతో నిండిన ఇల్లు లా ఉంటుంది ద్వానా ఎక్కడ ఉంటే ఉంటే. తెలుగు పోటీ పరీక్షల్లో ఉన్నత పదవులకు, ఉత్తమ సేవలకు, వీలుగా నిలుస్తుందని, యువతరంలో ఆత్మ విశ్వాసం కలిగించిన చదువుల రంగపు పనివాడి తనం ద్వానా మార్క్ తో తెలుగు నాట ముఖ్య పట్నాలలో ప్రకాశిస్తుండడం విశేషం.

కవిత్వమూ, వ్యక్తిత్వమూ వేరు కావని, అటు ప్రాచీన సాహిత్యం తో మొదలు పెట్టి, తంద్రులను తలంచుకునే ఒక సంకలనం చేసి, రికార్డులంటే నేనే ముందు అని పరిగెత్తే సాహిత్య క్రీడా స్పూర్తి సంపన్నుడు ద్వానా శాస్త్రి. కొత్త సాహిత్య రూపాలను ఆదరించినా, కాలానికి నిలబడిన సాహిత్య సంపదను ఈ తరానికి తేట మాటల్లో చెప్పే ఓపిక ఉన్న నిపుణుడు, విమర్శ రంగంలో రచయిత ప్రతిభ మరింత రాణించేలా, ఆశావాద ప్రకటనలు, హెచ్చరికలతో, నడిపే అప్యాయతల ఆచార్యుడు. 1980 నుంచి మొదలు పెట్టి, నేటికీ 77 పుస్తకాలుగా తన భావనా బలాన్ని, వైదుష్యాన్ని, పోటీ పరీక్షలకు మార్గ దర్శకత్వాన్ని పుస్తకాలకెత్తిన నిత్య ముక్కారు పంటల గోదావరి తెలుగు రైతు ద్వానా శాస్త్రి.

గురజాడ, మారేపల్లి రామ చంద్ర శాస్త్రి, నడింపల్లి రామభద్ర రాజు, కుసుమ ధర్మన్న, పురిపండా అప్పలస్వామి, జాషువా , నారాయణరెడ్డి, గోపి, ఇంకా ప్రాచీన కవి శేఖరుల జీవితం, రచనల పై ద్వానా పుస్తక పరంపర నిరంతరంగా సాగుతున్నది. విమర్శ పై పద్దెనిమిది పుస్తకాలు వెలువరించిన ఈ అక్షర ద్వాదశి సాహిత్య రోదసీ యాత్ర దిగ్విజయంగా సాగాలని, మొజాయిక్ సాహిత్య సంస్థ, సాహిత్య సురభి, ఋత్విక్ ఫౌండేషన్ కోరుకుంటూ, సౌహార్దం, సమ భావం, పునాదులుగా, నారు మళ్ళుగా, సస్య శ్యామలంగా, జీవిత సాహిత్యాల మాగాణి మారాజుగా, ద్వానా శాస్త్రి కృషికి ఒక వడ్ల గింజ గా అందిస్తున్నాము ఈ చిరు సమ్మానాన్ని విశాఖ సాగర తరంగ ధ్వానాల మధ్య మా ద్వానా కు. అక్షరమస్తు అంటున్నది అలల అంతరంగం. సై అంటున్నాము సహృదయ సాహితీ మిత్రులమందరం.

వేంపల్లి షరీఫ్ మనకు అక్షరాలు అందించిన ఒక ఆకుపచ్చ ముగ్గు, మనిషిలో కళలు మతాతీతంగా ప్రేమ, అభిమానం, నైపుణ్యం, శ్రద్ధ రగిలిస్తాయని, తన తొలి కథా సంపుటిలోనే చెప్పిన, మానవత్వ మండపంలో చదువుకునే, బతుకు బడి పిల్లవాడు, ఈ యువకుడు. కొన్నేళ్ళ కిందట ఇదే విశాఖలో, విశాలాంధ్ర పుస్తక మహోత్సవ ఆవరణలో, షరీఫ్ కథలను చిలికి, ఎంత వెన్న ఉన్నదో అందరమూ చూసాము. అటుపైనే, కేంద్ర సాహిత్య అకాడెమీ యువ పురస్కారం, తన తొలి కథా సంపుటి జుమ్మాకు ప్రకటించింది. షరీఫ్ కథల సీమలో కొత్త గాలి. ఇతని కథల పై దిన పత్రికల్లో ఆంగ్లంలో రాసిన ఒక వ్యాసం, అమెరికా లో ఉండే దాసుకృష్ణమూర్తి గారిని ఆకర్షించి, వారు ఈ కథా సంపుటి మొత్తం ఇంగ్లీష్ అనువాదం చేశారు. జీవితంలో హింసకు, ఆధిపత్య ప్రవర్తనకు గల కారణాలను కథాత్మకంగా సరళంగా పరిశీలించే ఓపిక గల యువ రచయిత ఇతను. చాలా మంది కి మల్లే, కథను తనకు ఎంత గొప్ప సిద్ధాంతం ఉన్నా, దానికి చెందిన ఉపన్యాసం గానో, లేక ప్రచారం గానో మార్చ కూడదు అనే ఒక మెలకువ, ఈ యువ రచయిత చాలా జాగ్రత్తగా పాటించే ఒక నియమం. ఇది కథ ఆరోగ్యానికి మంచిది.

రాయల సీమ మాండలికం కథకు ఒదిగి పలుకుతుంది ఈ కథకుడి కలంలో. అది కథకు సహజ పరిమళం తెస్తుంది. సాహిత్యంలో జీవదాషేలు మనకు గురజాడ కాలం నుంచే కాదు, శూద్రక మహాకవి కూడా తన మృచ్ఛకటికంలో ఆ నాటి మాండలికాలు విస్తృతంగా తన పాత్రలకు వాడిన నిపుణుడు. నాటకం ప్రజల భాషలో ఉండా లన్న ఇంగితం గల రాజ కవి. వాటికి పాలక వ్యవస్థలే కారణం, అలాగే, తమ వ్యవస్థలో జీవన ఆధునికత ఎంత మాత్రమూ రాకూడదొ అని అడ్డు పడే చాంధస వర్గాలూ కారణమే. ఈ వర్గాల పెనుగులాటలో ఒక తృతీయ సహస్రపు మానవుడు లేదా మానవి, ఏ మేరకు మానవ పరిణామం, అభివృద్ధి వీటికి అడ్డుగా నిలిచే వాటిని, మనిషి మంచి కోరే తోరణులు గా స్వీకరిం చగలరు అన్నదే షరీఫ్ కథల్లోని తాత్విక ప్రశ్న. కలిసి కూచుని చదువుకోగల "గోస" నిండిన కథలు ఇవి.

తెలుగు మాండలిక పద జాలం ఎంత సొగసైనదో, షరీఫ్ లాంటి కథకుల పల్లె యాస చిత్రణ నిరూపిస్తున్నది. తన కథలను తనకు తెలిసిన జీవన వాతావరణంలో ప్రతిష్ఠ చేసి, అక్కడి నుంచి, తనకు తెరుచుకున్న కిటికీల లోంచి జీవన వీక్షణం చేస్తున్నా చురుకైన కథా కళా కారుడు వేంపల్లి షరీఫ్. అస్తిత్వ వాదాల ఆరంభాలు ఎంత సహజమో, అక్కడే తిరుగాడే తీరు అంత రొటీన్‌గా మారి పోయే ప్రమాదం సృజనను ఎప్పుడూ వెంటాడుతూ ఉంటుంది. ఆ ప్రమాదం నుంచి తనను తన సృజనను, తన పాత్రలను కాపాడుకోగల ఎరుక, బాధ్యత నిర్వహించగల సత్తా గల యువ కథకులలో షరీఫ్ ఒకడు. అందుకే, అతని కథల్లో ఇవాల్టి సంశయాలు, అవి తీరితే

వేంపల్లి షరీఫ్

రాబోయే రేపటి మంచి కనిపిస్తుంటాయి. అలా రేపటి పౌరుల కోసం, ఒక భద్రమైన జీవన వాతావరణాన్ని తయారు చేస్తున్నామా లేదా ఏవో ఆవేశాలలో పది కొట్టుకుపోతున్నామా అని ప్రశ్నలు వేసే గొంతులే షరీఫ్ కథలు. ఈ ఎరుక, మంచి పంటల కోసం ఎత్తే ఏరువాక కావాలని, ముక్కారు పంటలుగా కథల సాగు చేయాలని బలంగా ఆశిస్తూ, కథా ప్రక్రియకు గాను వేంపల్లి షరీఫ్ కు అక్షర గోదావరి 2017 పురస్కారం అంద చేస్తున్నాము.

ఎ.వి.వి.ఆర్.మూర్తి

అక్షర గోదావరి సాహిత్య రంగంలో ప్రతిభా, పరిణతి, వికాసాలను గుర్తించి ప్రతీ ఏడూ సముచిత పురస్కా రాలను ప్రకటించడానికి, ప్రదాన కార్యక్రమ నిర్వహణ కోసం ఏర్పాటు అయిన ఒక అవార్డ్ విధానం. తెలుగు సాహిత్యంలో క్రియాశీలక, సృజ నాత్మక పాత్ర పోషిస్తూ ఉన్న మొజాయిక్ సాహిత్య సంస్థ, ప్రతి నెలా విశేష సాహిత్య ప్రసంగ కార్యక్రమం ఏర్పాటులో గత పదిహే నేళ్లుగా విశాఖలో విలక్షణ పాత్ర నిర్వహిస్తున్న సాహిత్య సురభి, వర్ధమాన వితరణ వేదిక ఫౌండేషన్ కలిసి, ప్రతీ జూలై పదిహేడున, ఈ మూడు పురస్కారాలను ప్రదానం చేస్తున్నాయి. ప్రో త్సాహక వాతావరణాన్ని పెంచి పోషించడం, వర్తమా నా సాహిత్య రంగపు మేలు పరిణామాలను ఆకళింపు చేసుకోవడమూ, కూడా ఈ అవార్డ్ ప్రదానాల ద్వారా జరిగే మంచి పనులు. ప్రముఖ రచయితలు, ఎల్.ఆర్. స్వామి, రామ తీర్థ, జగద్ధాత్రి , మొజాయిక్ తరపున, వి. కళ్యాణ రామారావు సాహిత్య సురభి తరపున, పి. జయశీలరావు ఫౌండేషన్ తరపున, ప్రతినిధులుగా ఈ అవార్డ్ సభలు జరుగుతున్నాయి.

కవితలు మనవెంటే – మన వెన్నంటే!!

కవితలు

ఆశలుంటే ఆశయాలుంటే
అవి సాధించే కృషి యే ఉంటే
కవితలు మనవెంటే మన వెన్నంటే!

వెతలుంటే వ్యధలుంటే
ఎదలోతుల గాధలుంటే
కవితలు మనవెంటే మన వెన్నంటే!

హితులుంటే స్నేహితులుంటే
మనల ప్రేరేపిస్తుంటే
కవితలు మనవెంటే మన వెన్నంటే!

మనసుంటే అది స్పందిస్తే
అనుభూతులు అందిస్తే
కవితలు మనవెంటే మన వెన్నంటే!!

లాంతరు

పాపా! పొద్దు గ్రుంకక మున్నె
దీపాలు సరిచేయవమ్మా!!
ఆనతి, ఆప్యాయత కలగలుపు
అమ్మ గొంతులో?....
శిరోధార్యం అమ్మ మాట

దీపం బుడ్డీలు, లాంతర్లు
మురికిగుడ్డా, ముగ్గుపిండీ
చుట్టూ పేర్చుకుని కూర్చున్నా.....

మసిబారిన చిమ్నీలున్నాయి
జీవంపై ఆశొదిలిన ముదుసల్లాగా

మరకల్లేకుండా ముగ్గుతో తుడిచా...
మెరిసిపోతున్నాయిజి

అందమైన అమ్మాయి
అద్దంలో ప్రతిబింబంలా.....

మూతలు తీసి అడుగంటిన
టాంకుల్లో నింపా..... కిరోసిన్

నిరుద్యోగి చెవినడద్యోగపు ఊసులా....
నిండుగా.. నిశ్చింతగా. కూర్చుంది

కొడిగట్టిన వత్తి
ఆశ వదులుకున్న రైతులాగా
కమిలిన వదనంతో చూస్తోంది

నిరాశను తరిమేయి....అంటూ
వత్తిని వేలి కొసలతో చిదిమా
నిత్యం ఇంట దీపకాంతులే!

మసిబారిన చిమ్నీ- మకిలి పట్టిన భావజాలాన్ని
తుడిచేసుకోమనీ

తైలమింకిన టాంకు- మదినిండా
ప్రేమను పెంచుకొమ్మనీ

కొడిగట్టిన వత్తి – నిరాశను
దరిచేరనీయకనీజి

ఆనాడు అనుకోలేదు
జీవితపాఠాన్ని నేర్చుకుంటున్నానని

ఈనాడు అమ్మా లేదు-లాంతరూ లేదు
నేర్పిన పాఠమొకటే
తోడై నన్ను నడిపిస్తోంది.

-శ్రీలక్ష్మి చివుకుల
విజయనగరం
ఫోన్:9441957325
మెయిల్:srilak1710@gmail.com

కన్యాశుల్కం @125

జాతీయ ఉత్సవాలు

నూట పాతికేళ్ళ ముందర ఇదే ఆగస్ట్ నెలలో ఈ నాటకం తొలి కూర్పు, తొలిసారిగా, విజయ నగరంలో ప్రదర్శన జరిగింది. తరువాత మలి కూర్పు, అబ్బూరి రామకృష్ణారావు నటాలి సంస్థ ద్వారా, జె.వి.రమణ మూర్తి ట్రూప్ ద్వారా వందలాది ప్రదర్శనలు ఆంధ్ర దేశంలో, ఇంతర ప్రాంతాలలో, కూడా జరిగాయి. విశ్వనాథ సత్యనారాయణ, చాట్ల శ్రీరాములు, కాకరాల వంటి వారు నాటక పాత్రలు పోషించారు. టి.వి. సీరియల్‌గా కూడా వచ్చింది.

నాటకం ఒక రాత్రి అంతా సాగే లక్షణం గలది. ఎనిమిదిన్నర గంటల పాటు సాగే ప్రదర్శన. అసలు ఇది ప్రదర్శన యోగ్యం అవునా కాదా అన్న చర్చ, పూర్వ పక్షం

(1915 -2015) సభలో రూపొందించారు. ఈ నాటక రూపకం, పూర్తి సందేశం, అర్థంతో, నిడివిలో తగ్గింపు తో ప్రదర్శనకు సిద్ధంగా ఉన్నది. కన్యాశుల్కం ఏ 125 ఉత్సవాలను ఆంధ్ర ప్రదేశ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, 26,27 ఆగస్ట్ 2017. రెండు రోజుల ఉత్సవాలుగా ప్రకటించింది. మొజాయిక్ సాహిత్య సంస్థ వీటికి నిర్వహణా సహకార బాధ్యతలను నిర్వర్తిస్తున్నది.

కార్యక్రమం

1. మొదటి రోజు ఉదయం, గురజాడ ఇంట్లో, దీపోద్దీపన చేసి, నూటపాతికేళ్ళ ఏకైక సజీవ

(ఆగస్ట్ 1892 - ఆగస్ట్ 2017)

సాహిత్య సాంస్కృతిక సమారోహం

చేసి ఎలా ప్రదర్శన యోగ్యమో కాకరాల వంటి వారు చేసి చూపించారు. ఈ నాటకాన్ని గుర జాడ ఆలోచన మేరకు కాకుండా, మధ్యలోనే ఆపేసే కొత్త పద్ధతిలో జె.వి.రమణమూర్తి వంటి వారు ప్రద ర్శించారు. తీసిన సినిమాకూడా నాటకం కలిగిస్తున్న దర్శనం కన్నా, సినిమా దర్శకుని విజ్ఞతలో మార్పు కావాలని అలాగే చేశారు.

ఈ నేపథ్యంలో, నూట పాతికేళ్ళ సజీవ ఆధునిక భారతీయనాటకం, దేశంలోనే ఇంకొకటి లేదు. దీన్ని యు.ఎ.నరసింహమూర్తి గారి విస్తృత పరిశోధన గ్రంథం "19వ శతాబ్దపు భారతీయ నాటకాల్లో కన్యాశుల్కం" స్పష్టంగా పేర్కొన్నది. గురజాడ వారి ముహాయ్యో ఏట 1892 ఆగస్ట్ లో తొలి ప్రదర్శన జరిగి, ఇప్పుడీ కన్యాశుల్కం నాటకం, నూట పాతికేళ్ళ ఉత్సవ సందర్భంలో ఉన్నది. ఈ నాటకాన్ని వర్తమాన పరిస్థితులకు అనుగుణంగా, కన్యాశుల్కనాటక రూపకంగా మార్చి, రెండున్నర గంటల్లో వచ్చేలా నిడివిని, నాటక స్ఫూర్తి, కథకు దెబ్బ లేకుండా రామతీర్థ సవరించి, చాట్ల శ్రీరాములు ముందు మాటతో, కన్యాశుల్క నాటక రూపకం పేరిట , నాటకం 123 ఏళ్ల సందర్భంలో గురజాడ శత వర్ధంతి

భారతీయ ఆధునిక నాటకం గా ఒక రజత ఫలకం గురజాడ ఇంట్లో రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పడం.

2. విశాఖపట్నంలో ప్రముఖ ఆడిటోరియంలో, రెండు రోజుల పాటు గురజాడ కన్యాశుల్కం జాతీయ సదస్సు - పన్నెండు/పదహారు మంది సాహిత్య వేత్తలు రోజుకు ఎనమండుగురు చొప్పున (ఉదయం నలుగురు, మధ్యాహ్నం నలుగురుగా) విశేష ప్రసంగాలు అందచేస్తారు.

3. మొదటి రోజు సాయంత్రం లఘు సంస్కృతిక ప్రదర్శనలతో బాటుగా, "జెండా పై గురజాడ", 125 ఏళ్ల నాటకమొలిని పాత్రలే, తమ సృష్టికర్తకు నివాళి తెలిపే ఒక ప్రయోగాత్మక నాటిక. ప్రదర్శన.

4. రెండవ రోజు సాయంత్రం కన్యాశుల్కనాటక రూపకం (మూడున్నర గంటల నిడివిలో పూర్తి కన్యాశుల్క నాటకం, తగ్గింపు రూపంలోచారిత్రాత్మక మొదటి ప్రదర్శన).

5. కన్యాశుల్క నాటకం సమాజం పై ప్రభావం (నూట పాతికేళ్ళ నాటకంపై దాదాపు రెండు వందల మంది సాహిత్య, సాంస్కృతిక, భాషా శాస్త్ర వేత్తల, సాంఘిక ప్రముఖుల అభిప్రాయావిష్కరణం)

6. ఈ సందర్భంగా పుస్తకాల తెలుగు, ఆంగ్ల భాషల్లో, పుస్తకాల ప్రచురణలు.

7. ఇంతవరకూ తెలుగులోకి రాని గురజాడ ఆంగ్ల లఘు రచనలు my own thoughts, On His Highness Ananda Gajapathi Maharajah - తెలుగు, ఇంగ్లీష్ భాషలో.

8. విజయవాడ, విజయనగరం, శ్రీకాకుళంలో, నూట పాతికేళ్ళ కన్యాశుల్కం జాతీయ ఇత్సవాలలో భాగంగా, ప్రారంభ సభలు, నిర్వహణ - జెండాపై గురజాడ నాటిక ప్రతుల ఆవిష్కరణ సభలు, కన్యాశుల్కంపై ప్రసంగాలు ఆగస్ట్ నెలలో ఏర్పాటు చేయడం .

9. విజయనగరంలో గురజాడ వారి ఇల్లు, పరిసర ప్రాంతాలు, అలాగే విశాఖలో ఆర్ టీ సీ కాంప్లెక్స్ దగ్గరి గురజాడ విగ్రహం, గురజాడ కళాక్షేత్రంలో ఉన్న బస్ట్ అలంకరణ చేసి, ఆగస్ట్ నెలలో ఈ నగరాల ప్రజల గౌరవ ప్రతిపత్తులను ప్రకటించే విధంగా, మునిసిపల్ కార్పొరేషన్‌కు సూచనలు చేసి ఆ పనులు జరిగేలా చూడడడం.

-రామతీర్థ (కన్వీనర్)
91 98492 00385

రచనలు పంపించాల్సిన ఇ-మెయిల్
sahityaleader@gmail.com

నాటకం

125 ఏళ్ల కన్యాశుల్కం.. కళాత్మక భవిత

నార్వేలో 50 ఏళ్లుగా ప్రదర్శితమౌతున్న నాటకం; హాజరైన ప్రేక్షకులు (ఇన్‌సెట్ లో హెన్రిక్ ఇబ్సెన్)

ఆధునిక భారతీయ సజీవ నాటకంగా, తెలుగు సాహిత్యంలో ఆధునిక రచనకు ఆదిగా ఈ ఏడాది ఆగస్టులో మూడు రోజుల కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాలు జరిగి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విజయనగరం గురజాడ మందిరంలో, భారతీయ సాహిత్యంలోనే తొలిసారిగా, ఒక నాటకానికి గౌరవ రజత ఫలక ప్రతిష్టాపన చేసింది. ఈ నూట పాతికేళ్లలో అయిదు తరాల రచయితలు, పరిశోధకులు, నాటక ప్రయోక్తలు, నటులు వందలాదిగా, భిన్న కోణాల నుంచి ఈ నాటకాన్ని అధ్యయనం, అభినయం, తమ నటనా వ్యాఖ్యానం చేశారు. బంగోరెతో మొదలైన తొలి కన్యాశుల్కం ప్రతి దొరికేందుకు తాను చెన్నపురిలో 1950ల్లో పడ్డ ప్రయాస (అప్పట్లో జెరాక్స్ యంత్రాలు లేవు కనుక, ప్రతి పేజీ ఓపికతో నకలు రాసుకున్న వైనం) కెవి రమణారెడ్డి (గురజాడ వారి కుమారుడు రామదాసు గారితో మాట్లాడి విలువైన విషయ సేకరణ చేసి), రాసిన గురజాడ జీవిత చరిత్ర 'మహోదయం'.. ఇంకా పలు వాద వివాదాలు నాటకంలో ఆసక్తిని నిరంతరం సజీవంగా ఉంచాయి. అయితే, ఈ నూట పాతికేళ్లలో, దేశ రాజధాని నుంచి తెలుగునాట మారుమూల చోట్ల కూడా జరిగిన ఉత్సవాలు, కార్యక్రమాల తీరు ఒక సమీక్ష సమయంగా దీనిని ముందరకు తెస్తోంది. ఇక ముందర ఏ దారి తొక్కాలి? ఇది ఇవాళ నిజాయితీతో కూడిన ప్రశ్న.

మొదటిది గురజాడపై తెలుగులో వచ్చిన ముఖ్యమైన రచనలు, పరిశీలనలు, కొత్త విషయాలను చెప్పే పరిశోధనలు, దాదాపు తెలుగులోనే ఉండిపోయాయి. గురజాడ శత జయంతి, నాటకం నూరేళ్ళప్పుడు, అలాగే, మహాకవి నూట యాభయ్యో జయంతి (1862-2012) సందర్భంగా వచ్చిన రచనల పరంపర నుంచి ఎంపిక చేసిన విశ్లేషణలు, ఆంగ్లంలో ఒక సంపుటి తీసుకురావడం ఇవాళ ఒక జాతీయ అవసరం. అంతర్జాతీయ భాషలో, మన కన్యాశుల్క సంబంధిత ఆలోచనలు పలు భారతీయ భాషల వారికి, ఇతర దేశాలవారికీ తెలియాలన్నా, ఏ స్థాయిలో, ఏ తత్పరతతో తెలుగునాట ఈ చర్చోపచర్చలు జరుగుతున్నాయి అన్నది విశదంగా దేశవ్యాప్తంగా పాఠక, పండిత, పరిశోధక వర్గాలకు, అందుబాటులోకి రావడానికి, ఈ ఏడాది, ఈ లోతైన రచనల ఆంగ్లానువాద సంపుటి వెలువరించడం మనకు చాలా ఆవశ్యకం.

ఇది రచనల సంగతి కాగా, సమస్త టీకా, టిప్పణి, ఏర్పాటుతో, వీలైతే, సచిత్ర, వ్యాఖ్యాన ప్రతిగా (వేరియోరం ఎడిషన్) ఒక సమగ్ర కన్యాశుల్క ప్రతి తీసుకురావడం కూడా ఇంతవరకూ జరుగలేదు. ఈ ప్రతి రావాలన్న అభిలాష, గురజాడ కన్యాశుల్కం విషయంలో, షేక్స్పియర్ నాటకాలకు, ఇతర ప్రముఖ పాశ్చాత్య నాటకాలకు ఉన్నట్టే తీరాలని, 1950ల్లోనే వ్యక్తం చేసినవారు బండి గోపాలరెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ పూనిక, సంకల్పంతో, కన్యాశుల్కం 125 వార్షిక ఉత్సవాలు వచ్చే ఆగస్టు వరకూ జరుగుతాయి కనుక, ఈ కీలక సమయంలో, ఈ ప్రతి తగు క షితో వెలువరించడం కూడా జరగాల్సి ఉంది.

రజత ఫలక ప్రతిష్టాపన సందర్భ ప్రసంగంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, ఉన్నత విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు, ప్రత్యేక శ్రద్ధతో, గురజాడ స్మారక మందిరాన్ని అంతర్జాతీయ స్థాయికి అభివద్ధి చేస్తామని ప్రకటన చేశారు. ఇందుకు అనుగుణంగా, రాష్ట్ర ప్రభుత్వం, ముందుగా, గురజాడ ఇంటి వెనుక ఖాళీ స్థలాన్నీ, ఒక ఆరుబయలు సమావేశస్థలంగా నిర్మాణం చేపట్టాలి. ఇంటిపక్కన గల ఖాళీ స్థలం నుంచి ప్రవేశం కల్పిస్తూ, ఈ సమావేశ వేదిక, తగుమాత్ర రుసుముతో, సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలకు వీలు కల్పించాలి. ఇలా అయితే, వచ్చేపోయే వారి అలికిడి, సందడితో, స్మారక కేంద్రం లక్ష్యశుద్ధి ఆచరణలో వీలుకాగలదు. ఇక్కడ, ప్రతిరోజూ ఉదయం రెండుసార్లు, సాయంత్రం రెండుసార్లు ప్రదర్శితమయ్యే, గురజాడ 'సౌండ్ అండ్ లైట్' ప్రదర్శన నిర్ణీత సమయంలో జరగాలి. గురజాడ ఇంటిని హెరిటేజ్ మాన్యుమెంట్‌గా గుర్తించిన భారత ప్రభుత్వం తగు నిధులు దీని అభివద్ధి నిర్వహణకోసం విడుదల చేసేలా, రాష్ట్ర ప్రభుత్వం శ్రద్ధ వహించాలి. గురజాడ మందిరం మొత్తం ఏర్ కండిషన్ చేయాలి. అప్పుడు దుమ్ము, ధూళి బారిన పడ్డం బాగా తగ్గుతుంది. గురజాడ వాడిన వస్తువుల శాశ్వత ప్రదర్శన కోసం తగు చర్యలు తీసుకోవాలి. వారి వాడిన వస్తువులను ప్రదర్శనకే ఉంచాలి తప్ప, వాటిని తాకడం, తెరవడం చేయకూడదు, అలా అయితే అవి పాడై పోతాయి అన్నది వచ్చే సందర్శకులకు తెలియచెప్పేలా సూచనలు ప్రదర్శనలో ఉంచాలి. ప్రస్తుతం ఒక శాస్త్రీయ దష్టి, సాంకేతిక సమర్థత లేకుండా, ఈ మందిరం, చాలా అసంతప్తి అయిన పరిస్థితిలో ఉంది.

ఈ పరిస్థితిలో మార్పు, రాష్ట్రంలో ఇతర పరిరక్షిత కేంద్రాలకు కూడా వర్తించేలా, ప్రభుత్వం, విజయనగరంలో, గురజాడ మందిరంలో ఒక క్యూరేటర్‌ను, సహాయక సిబ్బందిని నియమించాలి. ఇది కాంట్రాక్ట్ పద్ధతి మీదైనా సరే వెంటనే జరగాలి. గురజాడపై వచ్చిన రచనలు అన్నీ ఇక్కడ ప్రతులు భద్రపరచబడాలి. అంతర్జాతీయంగా మార్చి 27, ప్రపంచ నాటక దినోత్సవంగా ఇక్కడ పొరుగు ఊళ్లలో ప్రధాన నిర్వహణ కావాలి.

ఒక నాటకం పేరిట సాంస్కృతిక చైతన్యాన్ని బతికించుకోవడం, ప్రపంచ దేశాల్లో కొత్త కాదు. నాటకం ఎప్పుడూ కొత్త తరాల ప్రతిభలకు పుట్టినిల్లు. బాగా నటించే ఒక నటుడు, లేదా నటిని చూసి, బాలబాలికలు తామూ కూడా అలాగే చేయ ఉత్సాహపడ్డం, వారు కూడా గొప్ప అభినయశక్తిని క్రమేపీ పొందడం జరుగుతూ ఉన్నదే! భారతదేశానికి సంబంధించి ఒక నాటకానికి ఇలా సాంస్కృతిక పెద్దపీట వేయడం తొలిసారిగా తెలుగు సాహిత్యంలో జరిగింది. అయితే నార్వే దేశంలో, ప్రతి ఏటా ఆ దేశపు జాతీయ రచయిత, బహు నాటకకర్త, హెన్రిక్ ఇబ్సెన్, మన గురజాడకు అయిదేళ్లప్పుడు,1867లో డేనిష్ భాషలో రాసిన 'పీర్ జింట్' జానపద నాటకం పేరిట, 'పీర్ జింట్ ఫెస్టివల్' అన్నది నాటకం శతజయంతి వత్సరం 1967 నుంచి నిర్వహిస్తున్నారు. ఇది కూడా కన్యాశుల్కం అంతా పెద్దదే! నలభై సీన్లతో అంతకుమించిన నటీ నటబృందం నలభై ఏడు మంది తో కూడిన ప్రదర్శన ఇది. నార్వే దేశంలో అయిదు దశాబ్దాలుగా ఇదొక జాతీయ కోలాహలం. పీర్ జింట్ ఆ నాటక ప్రధానపాత్ర. నాటకం పేరు కూడానూ. నది తీరాన ఈ ప్రదర్శన నార్వేలో ఒక సాంస్కతిక పండుగ తరతరాలుగా.

'పీర్ జింట్ అవార్డ్' పేరిట వారు సాహిత్య సాంస్కృతిక, సామాజిక రంగ ప్రముఖులను ప్రతి ఏటా గౌరవిస్తున్నారు. ఈ అవార్డ్ పొందిన అనేక మంది లో, ఒక సమ్మానితుడిగా ఎయిన్ర్ గెర్ హార్డ్ సెన్ (1897-1987), ఆ దేశపు ఒకప్పటి ప్రధానమంత్రి కూడా ఉన్నారు అంటే, ఇబ్సెన్ నాటకానికి నార్వీజియన్ సమాజంలో గల గౌరవం, అభిమానం, ఆదరణ మనకు కాస్తయినా అర్థం అవుతాయి. ఇలా మనం కూడా ప్రతి ఏటా ఆగస్టు నెలలో (వీలైతే 13న; ఎందుకంటే ఆ రోజున 1892 లో ఈ నాటక తొలి ప్రదర్శన జరిగింది కనుక) తగు ఉత్సవాలు జరపడానికి ప్రణాళికలు తయారు చేయవచ్చు. కవులు రచయితలు, సాంస్కృతిక సంపద స ష్టించేవారు. జాతి గుర్తింపు తన సాంస్కృతిక వైవిధ్యం మీదనే ఆధారపడి, ప్రపంచ సమాజాలు దేశాలను అంచనా వేస్తాయి. ఈ దిశలో కన్యాశుల్కం కళాత్మక భవిత ఇవాళ ఒక భారీ ప్రణాళిక వలె అనిపించవచ్చు, కానీ మరో శతాబ్ది తరువాతా, మనం మన కాలంలో, ఈ మాత్రమైనా చేయలేకపోయిన వారసత్వ హీనత, ముందుతరాల వారు ఎదుర్కోకూడదు. అంటే, ఈ సమిష్టి కళాత్మక భవిష్యత్ కోసం, ఒక్క గురజాడతో ముందు మొదలుపెట్టినా, ఇలా ఎందరో సాంస్కృతిక నిర్మాతల విషయంలో ఒక జాతిగా, మన మెలకువతో నిలుపుకోవల్సిన, పెంపొందించుకోవల్సిన సంపదగా, మన కార్య కుశలత, కుశాగ్ర బుద్ధి అవసరం. మనం పాటించదలచాలే కానీ, ప్రపంచం అంతటా, సాహిత్య సాంస్క తిక రంగాల్లో ఇలాంటి ఉజ్వలమైన నమూనాలు ఎన్నో ఉన్నాయి.

- ప్రేమ్‌చంద్

కవిత్వాన్ని శ్వాసించిన కాలాత్మ

''సంప్రదాయం, వైయక్తిక ప్రతిభ'' అనేది ఎలా కాల ప్రవాహంలో కవులు నడిచే దారో, అది ఎలా 20వ శతాబ్దంలో 1940–50ల నాటికే, ఎప్పటికన్నా ప్రజల పక్షాన ఉన్నదో చెప్పిన రొమాంటిక్ ఉద్యమ పారంగతుడు కృష్ణశాస్త్రి.

సందర్భం

రామతీర్థ

కళింగ కడలి యాన గాలి పాటగా, ''ఆకులందున అణిగి మణిగి కవిత కోయిల పలకవ లెనోయి'' అని గురజాడ రాసిన పుష్కర కాలానికే, ''ఆకులో ఆకునై, పూవులో పూవునై, ఈ అడవి దాగి పోనా, ఎటులైన ఇచట నేనాగి పోనా'' అంటూ, అడవులను అనుమతులు అడుగుతూ, తన తృష్ణానంత కృష్ణ పక్షపు ఒక్క రెక్క తోనే పిట్టగా ఎగిరి వస్తానని కబుర్లు పంపుతూ, గురజాడకు గురువందనం చేసి, ఈ కవిత్వ మంత్ర దండం అందుకున్న ''అనంతాంబరపు నీలి నీడ'' పేరు కృష్ణశాస్త్రి. ఉద్యోగం భావకవి. ఊహాలోకంలో ఊరు దేవులపల్లి అనే దేవతల పల్లె. పుట్టింది పిఠాపురం దరి సంస్థాన ఏలుబడిలోని చంద్రం పాలెం. తాను రాసిన వంద కవితల లోపున 3 సంపుటాల అక్షర రమ్యతా, అభివ్యక్తి సంపన్న లలితత్వం, ప్రతి రచనలో పొదిగిన తన ముద్రా, ఇవీ ఒక వ్యక్తిని ఒక కవి చేసిన సామగ్రి.

''నా నివాసమ్ము తొలుత మధుర సుషమా సుధాగాన మంజు వాటి, ఏనొక వియోగ గీతిక'' అంటూ, వెల్లెత్తిన ప్రేమ గంగలా చిందులేసి, గండ భేరుండంలా ఎదిగే లక్షణాలున్న శ్రీరంగం శ్రీనివాసరావు అనే కుర్రవాడిని, తన ప్రభావంలోకి లాక్కున్న కవిత్వ కృష్ణ బిలం కృష్ణశాస్త్రి. కవి అజేయత్వాన్ని విశ్వసించిన కాలాత్మ కృష్ణశాస్త్రి. కవిత్వ చిరాయుష్షు రహస్యం మనకు ఈ మూడు సంపుటాల కవితల్లో స్పష్టం కాదు. తన కవితల్లో ఆకు పచ్చ గుబురులు, పొగ మంచులు, పూల తివాచీలూ, మబ్బు జలతారుల మధ్య ఉండే ఒక కవి, దేవులపల్లి కృష్ణ శాస్త్రి, బైరన్ వలె గిరజాలు పెంచుకు తిరిగే యువ కవిత్వోల్లాసి, 1925కు ముందరే ఈయన ''కృష్ణపక్షము'' రచన పూర్తయింది. 1924లో రాసినది, (అప్పట్లో ''సఖి'' పత్రిక రుధిరోద్గారి సంచిక 1923–24 లో ప్రచురితం అన్న వివరణతో ఉన్న వ్యాసం) ''మా ప్రణయ లేఖల కథ'' ఏ యువ కవి కూడా తన తొలి సంపుటికి ఇవ్వని విశేష వివరణ. ఇక ముందర రాబోయే రచనలు ప్రవాసమూ, ఊర్వశి, వీటి ప్రస్తావనలు కూడా ఈ వ్యాసంలో ఉన్నాయి. 1956లో కృష్ణశాస్త్రి మదరాసు రేడియోలో ప్రొడ్యూసర్‌గా ఉద్యోగంలో చేరారు. చేసిన ప్రసంగ వ్యాసాల్లో ఒక చోట, ఊహాశక్తి కవిత్వ పింఛంగా విప్పారాలి, వర్ధిల్లాలి అంటే సాంస్కృతికత, కాల్పనికత, వాస్తవికత, పోటాపోటీగా సమతూకంలో రాణించాలని సూత్రీకరించారు.

1922 సేక్రెడ్ వుడ్ వ్యాసాల్లో టి.ఎస్. ఇలియట్ ''ట్రెడిషన్ అండ్ ఇండివిడ్యుయల్ టాలెంట్'' అని రాసింది ఒక కవిపై పూర్వ కవుల ప్రభావాల గురించిన ఒక ప్రామాణిక పరిశీలన. ఇరవయ్యో శతాబ్దపు పాశ్చాత్య సాహిత్య రచనల్లో చాలా ముఖ్యమైనదితను రాసిన వంద లోపు కవితలు రాయడానికి కృష్ణశాస్త్రి ఎంత చదువుకుని ఉండాలో, అటుపై తాను ఎలా తన దృష్టి దృఢత్వాన్ని పెంపొందించుకుంటూ వెళ్లారో చెప్పేదీ, ''కవి- ప్రజ'' అన్న వ్యాసం. ప్రజలదే ఉమ్మడి బహుళ వారసత్వం, ఇది కవుల ద్వారా దఖలు పడుతుంది, అన్న అవగాహన ఏర్పడ్డ శాస్త్రి గారు ఆధునికతకు గుండె చప్పుడు అని తెలుపుతుంది. ఆంగ్లంలో దీన్ని అందిస్తే, ఇలియట్ కన్నా ఒక కోణం ముందుకు వెళ్ళి, ''సంప్రదాయం, వైయక్తిక ప్రతిభ'' అనేది ఎలా కాల ప్రవాహంలో కవులు నడిచే దారో, అది ఎలా ఈ ఇరవయ్యో శతాబ్దంలో 1940–50ల నాటికే, ఎప్పటికన్నా ప్రజల పక్షాన ఉన్నదో చెప్పిన రొమాంటిక్ ఉద్యమ పారంగతుడు కృష్ణశాస్త్రి. ''ఏ అసంఖ్యాక ప్రజలతో ఈ రోజుల్లో మనకి మరీ సన్నిహిత సంబంధం ఏర్పడుతుందో, ఆ ప్రజలలో నిలిచి ఉన్న సంప్రదాయాలతో కవికి పరిచయం లేకపోతే, అతని కంఠ స్వరం ప్రజలు ఆప్తమైనదిగా పోల్చుకోలేరు. అతని మాటలు పరాయి భాష లాగా ఉంటాయి. కనుక ప్రజలతో సన్నిహిత సంబంధం కవికి ఉండాలంటే, వాళ్ళ కలిమి లేములూ, కష్టనిష్ఠూరాలే కాక వాళ్ళు నిలబడి ఉన్న జాతి సంప్రదాయాలు కూడా అతగాడు వివేచనతో, చనువుతో, గౌరవంతో ఎరిగి ఉండాలి'' అన్నారు 1948లో కృష్ణశాస్త్రి. అప్పటికి ఇంకా మహాప్రస్థానం అచ్చుకాలేదు. (అచ్చయింది 1950లో).

ఆయన స్థిర పడలేదు, స్థిమిత పడలేదు., పైపెచ్చు ఆ రెండూ అంటే తనకు వెగటు అని చెప్పిన కాలుండబట్టని, మనసు ఊరుకోని కళ, జీవితాల అద్వైతి కృష్ణశాస్త్రి. వీరేశలింగం గురించి రాసినా, రావి చెట్టు గురించి రాసినా, ఒక ప్రాచీన ప్రసంగావేశం వారి మాటల్లో, రాతల్లో.. తూరుపు, పడమర తేడా లేకుండా సమస్త కవిగణాల విషయమై, వారు కీర్తించిన ప్రకృతి, ప్రజల విషయంలో, మంచి మాటలే చెప్పిన కవి శిరోమణి, మానవేతిహాసంలో, అన్వేషణలో దుఃఖాలు మీదు కట్టి , ఒక అమూర్త ఊర్వశిని అవతరింపచేసుకున్న అరుదైన కవి. కవి అన్న మాటకు పర్యాయపదం లేదని చెప్పిన ద్రష్ట, సత్యం జ్ఞానులది కాగా, శివం కార్యోత్సాహులది కాగా, సుందరం మాత్రం కవుల కరతలామలక కళ అని ఉద్ఘోషించిన కాలాత్మ కృష్ణశాస్త్రి గారిని ఇంకా మనం పూర్తిగా తెలుసుకోవడం మొదలు పెట్టలేదు. వారి రచనల అయిదో సంపుటి, కృష్ణశాస్త్రి వ్యాసాలకు ముందు మాటలో ''ఇది ఇక్షుసముద్రం, ఆస్వాదిద్దాము రండి'' అని ఆహ్వానించారు శ్రీ శ్రీ. ఈ నూట ఇరవయ్యో జయంతి నుంచి ఆ పని చేద్దాము.

(రేపు కృష్ణశాస్త్రి 120వ జయంతి)

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత
మొబైల్ : 98492 00385

ఉపఖండ స్ఫూర్తికి జ్ఞానపీఠ కీర్తి

''రచయితకన్నా రచన గొప్పది, అందులోనూ ఆ రచనకన్నా ఎప్పుడూ గొప్పవి, ఎన్ని అడ్డంకులెదురైనా నిలబెట్టవలసిన మానవీయ విలువలు'' అనే కృష్ణ సొబ్తి సాహిత్యం జ్ఞానపీఠానికి ఒక ఉపఖండ పరిమళం.

సందర్భం

రామతీర్థ

అనగా అనగా అమెరికాలో ఉన్న ఒక భారతీయ పెద్దమనిషి సంత్ సింగ్ చత్వాల్, హోటల్ వ్యాపారంలో స్థితిమంతుడు. తనపై నాలుగు క్రిమినల్ కేసులు ఉన్న వ్యక్తి కొన్నేళ్ళ కిందట, తానెలా పద్మభూషణ్ పురస్కారానికి అర్హుడో, అది తనకు రాకుండా ఎలా ఆటంక పరుస్తున్నారో, టీవీలో చెప్పి చెప్పి బాధ పడుతున్నాడు. అదే ఏడాది ప్రముఖ రచయితలు కృష్ణ సొబ్తి, బాదల్ సర్కార్, తమకు ప్రకటితం అయిన పద్మభూషణ్ పురస్కారాలను తిరస్కరించారు. అప్పుడీ చత్వాల్ అవార్డ్ యావ టీవీలో చూసి తీరాల్సిందే అని చమత్కరించుకున్నారు కూడా. తరువాత కొన్నేళ్లకు అవార్డ్ వాపసీ చేస్తున్న రచయితలతో బాటుగా తన సాహిత్య అకాడమీ అవార్డ్ వాపస్ చేశారు కృష్ణ సొబ్తి. దేశ స్వాతంత్ర్య కాలానికే, 22 ఏళ్ల వయసు గల తరంగా, వీరి రచనల్లో దేశ విభజన బలంగా పలికింది. స్త్రీ లైంగికత, శారీరక అవసరాల గురించి ''మిత్రో మోర్జని'' నవలలో రాశారు కృష్ణ సొబ్తి. ''టు హెల్ విత్ యు మిత్రో'' పేరిట ఈ రచన ఆంగ్ల అనువాదం అయ్యింది కూడా. తన తొలినాళ్ళ కథానిక, ''సిక్కా బదల్గయా'' (నోట్లు మారిపోయాయి) ఉపఖండం రెండు దేశాలుగా చీలిపోతున్న విషాద చిత్రణ చేసిన ముఖ్య రచనల్లో ఒకటి. ఈ రచన అచ్చు వేసింది అజ్ఞేయ్ పేరుతో ప్రసిద్ధమైన హిందీ సాహిత్యవేత్త. ఒక్క అక్షరం కూడా మార్చకుండా ఈ యువ రచయిత్రి కథానికను అచ్చు వేశారు. అప్పట్లో ఈమెకి అదొక పెద్ద సంబరం.

ప్రతి పదంలో, భావన పలకడంలో ప్రసూతి వేదన నిజమైన రచయితలు అనుభవిస్తారు అంటారు కృష్ణ సొబ్తి. ''సృజనాత్మక రచన, రచయిత చేతిలో ఆట

బొమ్మ కాదు. ఆ రచయిత మానసిక, తాత్విక, భాషాపరమైన ఆవరణపు ఫల స్వరూపం అది. మాటలు రాయడంలో ఒక రచయిత వాటి ద్వారా, తాను సృష్టి చేస్తున్న సమాజాన్ని నేస్తాడు. నేను నా ప్రతి రచనలో నా భాషను మార్చేస్తానని అంటారు. ఇది నేను కావాలని చేసేది కాదు. జరిగే సృష్టి, వాటికి అవసరం అయిన పరిస్థితులను విధిస్తుంది సృష్టికర్త పైన. నేను రాసేటప్పుడు, నా రచనతో కొంత దూరాన్ని ఉంచుకుంటాను. తగు దూరం ఉండేలా (ఈక్విడిస్టెన్స్) అన్ని దిశలనుంచి చెరో వేపు లాగుతున్న దశ ఇది'' అని వివరిస్తారు.

''జిందగీనామా'' రచన ఈమెకు పేరు తెచ్చిపెట్టిన ఒక బృహత్ నవల. ఇందులో 500ల పాత్రలు ఉన్నాయి. ఈ కథ అంతా రాశాక, దాన్ని పైకి చదువుకోవడం ఈమెకు అలవాటు. రాసేది, రాత్రి సాయంత్రం మొదలు పెట్టి, రాత్రి తెల్లారే దాకా. ఇక అప్పుడు పడుకోవడం. అలా ఈ జిందగీనామా పూర్తి అయ్యాక, పైకి చదువుకోవడం మొదలు పెడితే ఇది ఏకంగా మరునాడు రాత్రి దాటి పోయి, మూడో రోజు ఉదయంలోకి కొనసాగిన ఒక పఠన ధారావాహిక. అంతా అయ్యాక, అప్పుడు ఆరంభం బిగితో రాలేదు అనిపించి, తిరిగి, దాన్ని రాసేందుకు కూచున్న పనిమంతురాలు కృష్ణ సొబ్తి.

ఇంగ్లిష్‌లో చదువుకున్నారు కదా, మరి హిందీ ఎలా మీ సాహిత్య భాష అయింది అన్న ప్రశ్నకు కృష్ణ సొబ్తి స్పందిస్తూ ''అనేకమంది భారతీయ రచయితలు హిందువులైనా, ముస్లింలైనా హిందీలో రాశారు. వారిలో మాలిక్ మహ్మద్ జయసి, తులసీదాస్, కబీర్ మొదలగు వారున్నారు. హిందీ భాషకు ప్రత్యేకమైన ధ్వని ప్రపంచం ఉన్నది. ఈ ధ్వని లోకంలోని పలు భాషల నుంచి వచ్చింది. ప్రతీ మాటకు ఒక తనదైన ధ్వని ముద్ర ఉన్నది. పంజాబీ నుంచి వచ్చిన మాటలు ముతకగా, మొరటుగా శబ్దం చేస్తాయి, రాజస్తాన్ నుంచి వచ్చి చేరినవి, చాలా క్లుప్తంగా, పొందికగా ఉంటాయి. నా సృజన ప్రపంచంలో ఎన్నో హిందీ పలుకుబళ్ళు, ఉర్దూ, సంస్కృతం కూడా ఉంటాయి. నేను నా మొదటి నవల రాస్తుండగా, ప్రఖ్యాత హిందీ రచయిత అమృత్‌లాల్ నగర్, ఇలాంటి పంజాబీ కలిసిన హిందీ నిలబడదు అని అన్నారు. నేను ఒక్క పదేళ్ళు ఆగి చూడండి అని బదులిచ్చాను. మేము హిందీ రాయడం మొదలు పెట్టిన కాలంలో అది కాయగూరల భాష అని అందరూ వెక్కిరించే వారు, కానీ ఒక దశాబ్దిలోనే నిర్మల్ వర్మా, ఫణీశ్వర్ నాథ్ రేణు వంటి రచయితలు, ప్రజల, పాఠకుల దృష్టి తమవేపు ఆకట్టుకున్నారు'' అని వివరిస్తారు.

అలాగే స్త్రీలకు ప్రత్యేకంగా సాహిత్య దృక్కోణాలు ఉండగలవు అని నేను అనుకోను. సిద్ధాంతకర్తలు ఇలా ఇరుకు దృష్టితో చూడవచ్చునేమో కానీ, గొప్ప రచనలు వాటిలో సహజంగానే, స్త్రీ, పురుష పార్శ్వాల సంబంధిత అంశాలతో కూడి ఉంటాయని నేను భావిస్తాను. మగవాడు రాసినంత మాత్రాన ఆ రచనలో స్త్రీల జీవితం చిత్రణ కాకూడదు అని లేదు. ఉదాహరణకు నేను ''హష్మత్'' అనే మగ పేరుతో రాసేదాన్ని. ఆలా రాసేటప్పుడు నా భాష, నా చేతి రాత కూడా మారిపోయేవి. ఇవి కృష్ణ సొబ్తి రాసిన వాక్యాలేనా అని నేను చకితనయ్యేదాన్ని, అదే కళకు గల సంక్లిష్టత, ప్రత్యేకత అని స్పష్టం చేస్తారు. తన తొంభైరెండేళ్ల జీవితంలో ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు పొంది, ప్రజలే చరిత్ర నిర్మాతలు అని నమ్మి ఆచరించే ప్రగతి శీల సాహిత్యవేత్త కృష్ణ సొబ్తి. ''రచయితకన్నా రచన గొప్పది, అందులో కూడా ఆ రచన కన్నా ఎప్పుడూ గొప్పవి, ఎన్ని అడ్డంకులెదురైనా నిలబెట్టవలసిన మానవీయ విలువలు'' అనే ఈమె సాహిత్యం జ్ఞానపీఠానికి ఒక ఉపఖండ పరిమళం, కావ్యం విశ్వ శ్రేయస్సు కోసమే అనే సనాతన వివేకానికి ఒక నవీన నిరూపణం.

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత
మొబైల్ : 98492 00385

సాక్షి
Wed, 08 November 2017
epaper.sakshi.com//c/23537458

ప్రపంచ తెలుగు మహాసభలు
2017

విభిన్న రూపాల తెలుగు యుగంలో

శతాబ్ది దర్శన 'కారా'

-రామతీర్థ
9849200385

ఒక శతాబ్దపు పూర్తి వృత్తాన్ని చూసిన వ్యక్తి అదృష్టవంతుడు. ఆ వ్యక్తి రచయిత కూడా అయితే, దాని నిండుదనం వేరు. ఆ మనిషి నిండుకుండ వంటి నింపాది స్వభావి అయితే, ఆ సందర్భం ఉత్కృష్ట శీలమైనది అవుతుంది. తన రచనలేవో, తను చూసుకోకుండా, వాటి ప్రచురణలనే పరిమితం కాకుండా, తనకు బాగా తెలిసిన పనిలో తన మేలు మాత్రమే కాకుండా, పరుల మేలు కూడా ఉండాలని, లోక హితం కోసం ఒక సంస్థ నిర్మాణం చేసే పట్టుదల గల వారు ఇన్‌స్టిట్యూషన్ బిల్డర్స్ (సంస్థా నిర్మాతలు) అవుతారు. తన రచనా జీవితాన్ని పారదర్శకంగా వదిలి పెట్టినవారు ఎందరు సమాజానికి ప్రయోజనకారులుగా పరిణమిస్తూ జీవించగలిగారు అంటే అటువంటి వారిని మనం కొద్ది మందినే చూస్తాము. వారే కారా మాస్టారు. వారి కథలు సాహిత్య పాఠకుల విద్యార్థి లోకానికి పాఠ్యాంశాలు. తాను రాయలేక పోయిన విషయాలే ఎక్కువ, తనది పరిమితమైన జ్ఞానం అంటూనే, ఒక శతాబ్దపు ప్రజా స్వభావ దర్శనంలో, మంచి వస్థాన నిలబడిన రచయిత కారా మాస్టారు. నేను, జగద్ధాత్రి, సాయంత్రవేళ వేళ కలిశాం కారాగారిని. ఇంటి ముందర కొంత తంగేడు పూలు విరిసిన పసుపుపచ్చ పిడికిళ్లలా స్వాగతాలు పలుకుతున్నాయి. నవంబర్ యానగాలి వీస్తూ పలకరిస్తున్నది.

తొమ్మిది పదులు దాటి మరో నాలుగేళ్లు. అయినా, ఇప్పటికీ రోజూ ఆరేడు గంటలపాటు చదవడం, చిన్న బల్లపై తాజాగా వచ్చి చేరిన పుస్తకాలు, చేతికందే దూరంలో, ఫొటోఫ్రేమ్‌లో తన సాహిత్య గురువులు కొడవటిగంటి కుటుంబరావు, రావిశాస్త్రి, మెత్తని కారా కిక్లీలు. వంద అడుగుల దూరంలో తాను, ఇరవై ఏళ్ల ముందర మిత్ర బృందంతో, కలిసి ఏర్పాటు చేసిన కథానిలయం. శ్రీకాకుళాన్ని 'శ్రీకథాకుళమ్'గా మార్చిన కథా యజ్ఞపు సాంకేతిక సౌలభ్య సృష్టి సూత్రధారుడు, కార్యకర్త, ప్రపంచ సాహిత్య పటంలో 'కథలూరు'గా శ్రీకాకుళాన్ని నిలబెట్టిన దీక్షాపరుడు మా ఎదురుగా కూర్చున్న మన తొంభై నాలుగేళ్ల కాళీపట్నం రామారావు మాస్టారు.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా, నేటి భిన్న రూపాల తెలుగు విషయమే ముందుకు ప్రస్తావించాము. తెలుగు చదవడం, రాయడం అనే పద్ధతులకు క్రమేపీ దూరం అవుతున్న తరాల సమాజం మన కనుల ముందర కనిపిస్తున్నదని, వీరికి తెలుగు శ్రవ్య రూపంగా మాత్రం అందుబాటులో ఉన్నది అని, ప్రస్తుతం, ఎలా తెలుగు ఆడియో ఫార్మాట్‌లో ఇతర దేశాలలోని తెలుగు వారికి ఒక అనుకూల మాధ్యమంగా ఉన్నదో చెప్తూ, చదివే పద్ధతి నుంచి వినే పద్ధతికి తెలుగు రచనలు రూపాంతరం చెందడం స్వాగతించదగ్గ పరిణామమేనా అని అడగ్గా, కారా మాస్టారు, కాల మహాప్రవాహంలో వచ్చే మార్పులు వరద వంటివి, మనం స్వాగతించడం, లేదా స్వాగతించక పోవడంతో సంబంధం లేకుండా అవి జరుగుతూ ఉంటాయి. వీటికి ఎన్నో సామాజిక కారణాలు దశాబ్దాలుగా ఏర్పడిన నేపథ్యంలో ఉండగా, తెలుగు ఆడియో వినడం అనేది ఏ కారణాల వల్ల పెరిగినా, మనకు చెబుతున్నది ఇదే. ప్రస్తుతం, మనం విభిన్న రూపాల తెలుగు యుగంలో ఉన్నాము. చదవడం, వినడం, చూస్తూ వినడం, ఇవన్నీ పరిణామం చెందే భాషా వినియోగం. భావాలను పంచుకోవడంలో వచ్చి చేరే అనివార్యమైన మార్పులు తప్ప ఏ మార్పు కూడా పునాదులు లేకుండా ఏర్పడదు. ఆ పునాదుల స్వభావం, వాటి స్థితిగతులు గమనించగలగడం, మంచి పరిశీలకుల పని అని చెప్పారు.

సంక్షిప్త శైలిలోను కథలు రాశారు. సుదీర్ఘ విరామాలతో కూడిన సృజనాత్మక రచన మీ స్వభావ విశేషం. అలాంటి మీ రచనల్లో వెంటనే అడగ్గానే, మీకు జ్ఞాపకం వచ్చేది ఏది? అని అడిగి ఒక ఉపప్రశ్న కూడా జోడించాము. కొడవటిగంటి, రావిశాస్త్రి, నగర పేదలు, దిగువ మధ్యతరగతి, జీవితాలు చిత్రణ చెప్పారు. మీరూ మొదట అలా రాసినవారే. కానీ-

కారా మాస్టారు వెంటనే నిశితమైన దృష్టితో, సున్నితమైన స్పందన ఇస్తూ, నా గురుతుల్యులైన కొడవటిగంటి, రావి శాస్త్రి, మధ్యతరగతి, నగర పేదల, బడుగు బతుకుల కథలు చెప్పున్నారు. మరి నేనేం చెప్పాలి అన్న ప్రశ్న నాకు ఉండేది. ఆ వెతుకులాట ఫలితమే, గ్రామీణ జీవిత కథలు, ఇప్పుడు నాకు నా బాల్యం అంతా బాగా జ్ఞాపకం ఉన్నది. అప్పటి మిత్రులు, స్కూళ్లు, తోటలు, అల్లర్లు, తొలి రచనలు, అప్పటి కష్టాలు, అన్నీ వారి ముఖాలతో సైతం. చిన్నప్పుడు నన్ను హరిజనులు స్కూలికి తీసుకువెళ్లడం, తీసుకురావడం చేస్తూ ఉండేవారు. అలా కూడా వారి వాడల్లో తిరిగిన, వారి జీవిత పరిసరాల గురించిన కొన్ని జ్ఞాపకాలు నాకు బలంగా ఉన్నాయి. ఈ కారణాల వలన వార్ధక్యంలో కాలంలో కలిసిపోయినా, వారి ముఖాలు, మాటలు, నా బాల్య మిత్రుల చేష్టలు, అన్నీ ఇప్పుడు నాకు ఈ 94 ఏళ్ల వయసులో బలమైన జ్ఞాపకాలుగా ఉన్నాయి. ఆ మాటకొస్తే కొంత వయసు వచ్చినప్పటి సంగతులు కొన్ని మర్చిపోయాను. ఎంత ప్రయత్నించినా జ్ఞాపకం రావు. అలా వెంటనే నాకే విపులంగా జ్ఞాపకం వచ్చే కథ 'చావు.' అందులో హరిజనుల జీవన కష్టాలు రాయడానికి ప్రయత్నం చేశాను. ఆర్తి కథలో కూడా గ్రామీణ పేదల జీవితం రాశాను.

మరి మీ కథల్లో విలక్షణంగా కనిపించే కథ ఏదైనా మీకు తోస్తుందా - నా కథల్లో 'నో రూమ్' అనే కథ ఉంది. సాహిత్య అకాడెమీ ప్రాంతీయ భారతీయ భాషల నుంచి కె.ఎం.జార్జ్ సంపాదకత్వంలో ఎర్పి కూర్చిన సంకలనంలో కూడా 'మోడర్న్ ఫిక్షన్ విభాగం'లో ప్రచురణ చాలా ఏళ్ల కిందట జరిగింది. 'యజ్ఞం'తో తొమ్మిది సాహిత్య అకాడెమీ ప్రచురణగా ఆంగ్లంలో వెలువడింది. యజ్ఞం, చావు కథలు నాటకాలు వేసి ప్రదర్శన చేశారు కూడా.

> **ప్రస్తుతం, మనం విభిన్న రూపాల తెలుగు యుగంలో ఉన్నాము. చదవడం, వినడం, చూస్తూ వినడం, ఇవన్నీ పరిణామం చెందే భాషా వినియోగం. భావాలను పంచుకోవడంలో వచ్చి చేరే అనివార్యమైన మార్పులు తప్ప ఏ మార్పు కూడా పునాదులు లేకుండా ఏర్పడదు. ఆ పునాదుల స్వభావం, వాటి స్థితిగతులు గమనించగలగడం, మంచి పరిశీలకుల పని .**

గురుదేవులతో కథల మాస్టారు

మాస్టారూ - ఈ రెండు కథలు, 'చావు' కథలో మీరు తెలిపిన గ్రామీణ జీవితం, ఉర్దూలో రాసిన హిందీ సాహితీవేత్త (1880-1936) కథలను గుర్తు చేస్తుంది. తను కూడా గ్రామీణ భారతీయ జీవితాన్ని పలు కోణాల నుంచి రాసిన వారు. అలాగే 'నో రూమ్'లో మీరు తెలిపిన ఇతివృత్తం కూడా - ఉర్దూ రచయిత సాదత్ హసన్ మాంటో (1912 - 1955) కథతో పోలి ఉన్నది. పేదరికం వల్ల అన్యోన్యతకు చాటులేని ఒక పేదల వాడలో తన భార్యతో కొత్త సంసారం అలా పబ్లిక్‌గా చేయలేక, చివరికి పిచ్చివాడయ్యే వ్యక్తి కథ (నంగి ఆవాజ్ - నేకెడ్ వాయిసెస్) మాంటో కలం నుంచి వెలువడ్డది.

ప్రేంచంద్, మాంటో వీరిని నేను చదవలేదు బాబూ - శరత్ సాహిత్యం అంతా చదివాను.

మీరు చదివారని కాదు మాస్టారూ, గ్రామీణ భారతదేశం, పేదల భారతదేశం ఎలా సమర్థులైన రచయితల చేతిలో చిత్రణ జరిగిందో, ఆ చిత్రణతో మీ కథ లకు గల సారూప్యతల కోసం ఈ వివరణ. మీకు మాంటో కథల పుస్తకం 'నేకెడ్ వాయిసెస్' ఇస్తాను - రోజూ ఆరేడు గంటలు చదువుతున్నారు కనుక ఈ పుస్తకం చదువుతారా?

తప్పకుండా చదువుతాను బాబూ! ఇవ్వండి.

'కుట్ర' కథ ఇంకోలా రాయలేక అలా రాశానని మీరన్నా, తృతీయ ప్రపంచ దేశాల్లో ఎక్కడైనా, ఏమి జరుగుతున్నదో, ఇరవయ్యో శతాబ్దంలో పాలకుల పద్ధతులు, వారు ప్రాతినిధ్యం వహించే ప్రాబల్య శక్తులు, ఎన్నో సిద్ధాంతాల ద్వారా కష్టపడి తెలుసుకోవచ్చు. కానీ అదే ఫలితం అంతర్జాతీయ స్వభావం గల ఒక్క కుట్ర కథ ద్వారా, ఈ తృతీయ ప్రపంచ దేశాల్లో ఎక్కడైనా సాధించవచ్చు. అంతే ఫలితం ఇస్తుంది అని నా భావన. మాస్టారూ - కుట్ర కథ గురించి చెప్తారా?

(ఒక చిరునవ్వుతో) చాలామంది ఈ కథ గురించి బాగా రాశానని చెప్పిన వారున్నారు కానీ, ఇప్పుడు మీరొక్కరే కథను ఇలా అంచనా కట్టి కచ్చితంగా చెప్పారు. అసలు పాత్రలు లేకుండా కథ రాయాలన్నది నాకు ఒక ఆలోచన. ఆ ఆలోచనల రూపం 'కుట్ర' కథలో అలా వచ్చింది. కథ బాగోగుల విషయం, చదివిన వారు, కాలమూ చెప్పాలి. 'కుట్ర' కథ రచయితకు ఉండాల్సిన లోక జ్ఞానపు విస్తృతి, అవగాహన గురించిన రచన.

కారా మాస్టారుతో కాసేపు...

ప్రపంచ తెలుగు మహాసభల గురించి..

ఏ భాష రచనలైనా ఆ భాష అభివృద్ధికి గుర్తులు. ఏ కాలంలోనైనా వచ్చే మార్పులకు అనుగుణంగా, సంస్కృతికి జోడింపుగా వచ్చే సాంకేతిక సౌకర్యాలను ఉపయోగించుకోవడం, తద్వారా, ఇంకా విస్తృత ప్రజానీకానికి, విభిన్న రూపాల్లో చేరువ కావడం ప్రగతి సూచిక. కనుక ఇటువంటి ముఖ్యమైన సభల ద్వారా, ఒక జాతి, తమ భాష, సంస్కృతి, సాహిత్యం వీటికి సంబంధించిన తక్షణ లక్ష్యాల సాధన కోసం ఆచరణకు దిగడం, దీర్ఘకాలిక ప్రణాళికలు ఆలోచించడం, బేరీజు వేసుకోవడం జరుగుతాయి. స్థూలంగా అందరికీ సంబరాలుగా, సంతోషం, ఆనందం, ఒక భాష వారము అన్న సంతృప్తి, ఆత్మగౌరవం ఇనుమడించడం కోసం ఇటువంటి సభల అవశ్యకత ఉందని భావిస్తున్నాను. సభల విజయం కోరుతూ శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ●

ఆంధ్రభూమి
సాహితి
ప్రపంచ తెలుగు మహాసభలు 2017
సోమవారం, 18 డిసెంబర్ 2017
email: sahiti@andhrabhoomi.net

చాళుక్య, కాకతీయ స్ఫూర్తి..

తెలుగు ఇతిహాస దీప్తి

వెయ్యేళ్ల తెలుగు సాహిత్య నేపథ్యంలో మన వర్తమానం ఉన్నది. ఇవాల్టి ప్రాంతీయ పరిమితులు ఆనాటివారికి వర్తించవు. అలా వర్తింపచేసి సాహిత్యాన్ని దర్శిస్తే, మంచి ఫలితాలను రాబట్టలేము. క్రీ.శ. ఆరేడు శతాబ్దాలనుంచి, శాసన భాషగా తెలుగు ఉన్న దాఖలాలు రాయలసీమ శాసనాల్లో ఉన్నాయి. శాసన భాష అంటే రాజ వ్యవహారిక భాష. ఒక రకంగా గెజిట్ నోటిఫికేషన్‌లో వాడే భాష వంటిది. ఇందులో ఆనాటి పలుకుబళ్ళు, ఇవాళ మనం గుర్తించగలిగే తెలుగు మాటలు కొన్ని ఉండటం శాసన భాషగా తెలుగు పదాల వాడుకను ఖరారు చేస్తుంది. ఎనిమిది - తొమ్మిదో శతాబ్దం వరకూ కన్నడ - తెలుగు లిపి కలిసి ఉండటం వలన రచనలు ప్రత్యేకంగా తెలుగులోకి వచ్చే పరిస్థితి లేదు. పైపెచ్చు స్వతంత్ర రచన లేదు. చాళుక్య, కాకతీయ స్ఫూర్తి దర్పణం మన మహాభారత రచన, తూర్పు చాళుక్య వేంగి రాజు ఆజ్ఞ మేరకు, ఆయన ఆస్థాన కవి నన్నయ మొదలుపెట్టిన మహాభారత రచన - కాకతీయ కాలంలో ఆ రాజ్య సందర్శనం చేసిన, తమ నెల్లూరు రాజ్య సుస్థిరతను తమ పదవీచ్యుత రాజు మనుమసిద్ధి కోసం, కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని సౌజన్యంతో సంపాదించుకున్న కవి తిక్కన కాలంలో భారత రచన ఇంచుమించు ముగిసింది. రాజరాజు అంతరంగం ఎలా నన్నయ రచనలో ప్రతిష్టాపితం అయిందో, అలాగే, కాకతీయుల కాలం నాటి శాంతిభద్రతలు, హరిహరాత్మక సామరస్యం, తిక్కన భారత రచనలో దీటుగా నిలబడ్డది.

ఆ శతాబ్దాల్లో ఏది రాసినా, అది రాజు సమర్థించిన, రాజు అప్పగించిన కావ్య కార్య భారమై ఉండాలి. కవి రాజమార్గం రచనలో కావేరి నుంచి గోదావరి వరకూ మా రాజ్యం ఉన్నది అని రాష్ట్రకూట పాలకులు చెప్పిన తీరున, ఒకే రాజ్యం కావడం మూలాన కావేరీ తీరప్రాంతాల కన్నడ దేశానికి తెలుగు ప్రాంతాలనుంచి వెళ్లి అక్కడ కవులుగా నిలదొక్కుకున్న పంప, భారతం లోంచి ఒక 'విక్రమార్జున విజయం' రాయగా, తరువాతి కవి రణ్ణ భీమ ఘట్టం అంతా 'గదాయుద్ధం'గాను, అక్కడి తమ పాలకులైన జైన మతావలంబికులైన రాజుల కోసం, మార్చి రాశారు. పంప, రణ్ణ, పొన్న, వీరిని కన్నడ భాషలో రత్నత్రయంగా పిలుస్తారు. పంపని, రణ్ణని భారతాధారిత రచనలు అర్జున విజయం, గదాయుద్ధం, జైన విశ్వాసాలకు అనుగుణంగా మార్చి రాశారు. జైన, బౌద్ధ మతాల్లో ప్రబలంగా ఉన్న సన్యాస పద్ధతికి ప్రతిగా, గృహస్థాశ్రమ ధర్మానికి బలమైన ప్రతిపాదన చేయడం కూడా రాజరాజు ఆలోచనే. వైదిక ధర్మావలంబీకుడైన తూర్పు చాళుక్యరాజు, రాజరాజ చోళుడి (1022-1061 పాలనా కాలం) వద్ద గోదావరికి ఈ దరిన, జైన, వీరశైవ మతావేశాల కన్నడ ప్రాంతానికి దూరాన, నన్నయను మహాభారత రచన చేయమన్నప్పుడు రాజాదేశం, ఒక వైదిక గృహస్థాశ్రమ ధర్మ ప్రశస్త రచన తెనుగులో రూపం దాల్చాలి అన్నదే ఆంతర్యం. రాజరాజు కోరినది చిన్నదేమీ కాదు - అప్పటికే లక్ష శ్లోకాలకు ఎదిగిన మహాభారతానికి తెలుగు రచన కావాలన్నది ఆయన అభిమతం.

ఇతిహాసం అని పేరున్నది మహాభారతానికి. 'ఇట్లు చెప్పబడింది' అని నివేదన పూర్వక వ్రత కథ వలె, నిర్దేశ లక్ష్యాలతో చేస్తే ఇతిహాసం తెలుగులోకి వస్తుంది. కానీ, అలా నిస్సార నివేదిక వలె కాక, నన్నయ ఈ రచనను కావ్యేతిహాసంగా మలిచి రస పోషణ చేస్తూ, పాత్రలను సజీవం చేశాడు. ఇది పద్యం, గద్యం కలిపి చంపూ పద్ధతిలో తెలుగు మహాభారత రచనకు నన్నయ సమకూర్చిన ఆకర్షణ. దీన్నే పదమూడో శతాబ్దంలో తిక్కన నాటకీయత, తెనుగుదనం పెంచి, తెనుగుల పూలతోటగా మార్చాడు. కల్పనాచాతురికి పేరెన్నికగన్న ప్రబంధ పరమేశ్వరుడు ఎఱ్ఱాప్రగడ, పద్నాలుగో శతాబ్దంలో మిగిలిన సగం అరణ్యపర్వం శేషోన్నయం చేసి, తానూ కవిత్రయంలో ఒక్కడు అయ్యాడు. ఈ సమష్టి కృషికి పదకొండో శతాబ్ది నుంచి పద్నాలుగో శతాబ్ది వరకూ మూడు ప్రాంతాల సాహితీమూర్తుల కృషి, రమారమి మూడు వందల ఏళ్లు పట్టింది. అలా సంపూర్ణ మహాభారత రచన మొదలై పూర్తయ్యే కాలానికి, సాహిత్య స్వరూపంలో మార్పులు వచ్చాయి. ప్రబలంగా ఏర్పడ్డది నన్నయ ఏర్పరచిన చంపూ పద్యగద్య మిళిత కావ్యేతిహాస పద్ధతి. నిర్వచన రచనలు (పూర్తి ద్విపదల వంటివి మొదలైనా - వాటికి కవిత పండిత లోకంలో ఆదరణ పెరగలేదు. పాల్కురికి, గోన బుద్ధారెడ్డి తరువాత ద్విపదలో పెద్దగా రాసినవారు లేరు). నన్నయ మహాభారత రచన 'వస్తుధ్వని' లేదా ధ్వని ప్రధాన సాహిత్య సిద్ధాంతాలకు అనుగుణంగా సాగిన తీరు తదుపరి అనేకమంది కవుల ఆదరణ పెరిగింది.

నన్నయ కాలం తరువాతి తక్షణ సామాజిక మార్పులకు, మతావేశ చోదన తన సాధనగా - పాల్కురికి సోమనాథుడు, అప్పటికే నన్నెచోడుడు చెప్పిన వస్తుకవితా పద్ధతిలో, మత ధార్మిక సామాజికావేశాల శైవీయ ఇతివృత్తాన్ని మతావసరాలకు అనుగుణంగా మలుచుకుంటూ, తెనుగు సాహిత్య ద్విపదకు ఆదికవిగా వీర శైవ గాథలను చెప్పినది బసవపురాణంగా వచ్చింది. దీనికి మూలమైన గాథలు, నయన రగడ, నామ శివయ్య రగడ మొదలైనవి కన్నడ రగడల్లో ఉన్నాయి. పండితారాధ్య చరిత్ర ద్వారా కూడా తెలుగు ప్రాంత వీరశైవుడైన మల్లికార్జున పండితారాధ్యుని చరిత్ర చెప్పే ద్విపద రచన. మహాభారతం నేరుగా మత ప్రబోధం చేయదు. కానీ వీరశైవ కవిత్వ గాథలు అందుకోసమే రాయబడ్డాయి. బసవ పురాణం అన్న పేరు కూడా పలు జైన పురాణములు అప్పటికే ఉన్న కన్నడ సాహిత్యము నుంచే తీసుకున్నది. వీటిలో పంచ కళ్యాణములు మున్నగు జైన పురాణ రచనా సంప్రదాయాలను, పాల్కురికి కూడా పాటించి ఈ బసవ పురాణాన్ని మనకు అందించాడు. ఇవి తెలుగు కన్నడ ప్రాంతాలకు చెందిన దేశి పురాణాలుగా శాశ్వతంగా పాల్కురికి రచనల్లో నిలిచాయి. ఈ ద్విపద పద్ధతి, కన్నడ సాహిత్య పద్ధతులకు ప్రియమైనది. అందుకు, కుమార సంభవం ద్వారా నన్నెచోడుడు, మల్లికార్జునుడు కూడా తమ రచనల ద్వారా ఈ శైవ భక్తి సాహిత్యకర్తలుగా నిలుస్తారు. నన్నయ ధ్వని సిద్ధాంతాన్ని తన రచనల్లో అనుసరించి రాయగా, పాల్కురికి రస సిద్ధాంత పోషక కర్తగా పరిశీలకులు భావిస్తారు.

నన్నయ మరణంతో ఆగిన భారతం మరలా తన ద్వితీయకర్తను వెతుక్కున్నది. అలా లభించాడు తిక్కన నెల్లూరి సీమలో. రాజ్యభ్రష్టతతో ఉన్న ఒక స్థానిక చోళరాజు, మనుమసిద్ధికి తిరిగి రాజ్యప్రాప్తిలో కాకతీయ పాలకుడు గణపతి దేవుని వద్దకు సహాయం కోసం రాయబారాలు వెళ్లిన మంత్రాంగం నడిపిన ధీశాలిగా గుర్తింపు గలవాడు తిక్కన. తన భారత రచనలో నింపిన తెలుగు సొబగులు, నన్నయ, పాల్కురికి వీరి దారికి ఒక మధ్యమార్గాన్ని వేసుకుంటూ, తాను ఉభయ కవి మిత్రుడు అనిపించుకునేలా, 'ఆంధ్రావళి మోదంబొరయ' చేసిన భారత రచన ఈ సామరస్యతకు పూర్తి ఉదాహరణగా నిలిచింది. రసాభ్యుచితబంధముగా, రసధ్వని మేళవింపుగా రచిస్తూ అదనపు జీవధాతువులు, సహజమైన పలుకుబడులు, కదలికలు, పాత్రలకు తెచ్చిపెట్టి, వాటిని నాటకీయ లక్షణ సమన్వితం చేసిన అక్షర భానుడు తిక్కన. భారతంలో స్క్రీన్‌ప్లే అంతా వారిదే - తిక్కన మేధోశాల ఒక రంగస్థలం. పాత్రలకు రక్తమాంస పరిపుష్టిల్ సౌందర్య సౌష్టవం, త్రితలాల (త్రీ డైమెన్షనల్) లోతు ఇవన్నీ పదిహేను పర్వాల భారత రచనలో తిక్కన తీర్చిదిద్దిన అందాలు, చేసిన ఎగుమతులు. తిక్కనకు నాట్యశాస్త్రముతో పరిచయం, పలు ఘట్టాల మహాభారత చిత్రణ నుంచి నిరూపణకు అందుతుంది. కృష్ణాతీరవాసి, కాకతీయ కొలువులో ఉన్న సేనానీ, కళా కౌశలం గల జాయప సేనాని రచన 'నృత్త రత్నావళి' తిక్కనకు ఎరుకలో ఉన్నదే. 'ధర్మాద్వైత స్థితిలో, మహా కవిత్వ దీక్షా విధిలో, తానీ మహాభారత రచన చేశాను' అని చెప్పుకున్న తిక్కన అటు కావ్యరచనా, ఇటు శాస్త్ర రచనా కూడా చేసిన ఉభయ కవి మిత్రుడుగా కూడా తన శక్తి ఏమిటో చెప్పాడు. తిక్కన హరిహరనాథ తత్వం, శివ కేశవ అభేదం చెప్పినా తన భారత కృతి హరిహరులకు అంకితమిచ్చినా, భారత రచనలో ఎక్కడా ఆయన మత ధోరణి కనిపించదు. తన రచనను రచన పరిధిలో ఉంచి మత విశ్వాసాల ప్రచార వేదిక చేయకపోవడం లౌకిక దృష్టి అయితే, అది తిక్కన మహాభారత రచనలో మొదలు.

ధ్వని/రస/రసధ్వని మిళిత స్వభావ ధోరణుల ఊయలగా కాలం, తెలుగు అక్షరం ఈ శతాబ్దాల్లో నడిచాయి. కాకతీయ సామంతరాజుగా కందూరులో నియమిత గోన బుద్ధారెడ్డి, పదమూడో శతాబ్దిలో పాల్కురికి పద్ధతిన, ద్విపదలో రాసిన రామాయణం ప్రసిద్ధమైనది. ఇది ఒక ప్రధాన పాత్ర చుట్టూ తిరిగే కావ్య పద్ధతిలో సాగే రచన. గోన బుద్ధారెడ్డి రామాయణ 'త్రిజట స్వప్నం' మన పాఠ్యపుస్తకాల్లో చదువుకున్నాము. పాల్కురికి సరసన గోన బుద్ధారెడ్డి ఆసీనుడు కాగా, భాస్కర రామాయణ కర్తలది వేరే దారి.

ఇదే కావ్య పద్ధతిలోనే అయినా, పద్నాలుగో శతాబ్దిలో పద్య-గద్య మిళిత చంపూ శైలిలో ముగ్గురు కవులు కలిసి రాసిన భాస్కర రామాయణం, ప్రధానంగా హుళక్కి భాస్కరుడి పేరునే ఉన్నా మిగిలిన కవులు మల్లికార్జున భట్టు, రుద్రదేవుడు కూడా ఈ రామాయణ సహకవులు. ఈ రామాయణం మరలా, కవిత్రయం పద్ధతిలోనే ధ్వని రస మిళిత పద్ధతిలో సాగడం ఈ కవుల ఎంపిక. ఇందులో కల్పనా స్వాతంత్ర్యం ఉన్నది. వాల్మీకి రామాయణంలో లేని చిత్రణలు, రామ పాత్ర ఔచిత్య ఉద్దీపన జరిగేలా ఈ కవులు చేయడం విశేషం. యుద్ధకాండలో శత్రువు అయిన విభీషణుడ్ని కూడా క్షమించి తనకు లంకా రాజ్యం ఇచ్చేస్తాను అని చెప్తున్నావు కదా - ఏ యుద్ధం కోసం అయితే వచ్చామో ఆ రావణుడే వచ్చి శరణాగతి కోరితే ఏమి చేస్తావు అని సుగ్రీవుని ప్రశ్న. దానికి రాముని సమాధానం, నా అయోధ్యా రాజ్యమే ఇచ్చేస్తాను. రావణుడే క్షమించమని కోరితే అని. ఇది వాల్మీకంలో లేదు. ఇదే తరువాత పద్దెనిమిదో శతాబ్దిలో త్యాగరాజస్వామి వారికి తన కృతిలో ఒక సుందర చరణం అయింది. (సరస సామ దాన భేద దండ చతుర సాటి దైవమె వరె బ్రోవవే - పరమశాంభవాగ్రేసరుడననుచు బలుకు రావణుడు దెలియలేకపోయె - హితవు మాటలెన్నో బల్కితివి సతముగా సయోధ్యనిచ్చేనంటివి). దీని అర్థం - కాకతీయ కాలాంతర కృతి అయిన హుళక్కి భాస్కరుని నవీన చిత్రణల రామాయణ జ్ఞానం త్యాగరాజుకి ఉన్నదని. ఇది భాస్కర రామాయణ ప్రాముఖ్యత. పోతన పద్య చరణాల ప్రభావం కూడా త్యాగరాజు కృతుల్లో కనిపిస్తుంది.

రామాయణం కావ్య పద్ధతి రచన కాగా, మహాభారతం ఇతిహాస పరమైన రచన కాగా, భాగవతం మహా పురాణ పద్ధతి రచన. ఈ మూడు మనకు చాళుక్య కాకతీయ కాలాంతరంలోనే రావడం విశేషం. క్రీ.శ. 1030 ప్రాంతాల్లో మొదలైన తెలుగు రచనలో ఇతిహాస పరంపర అవిచ్ఛిన్నంగా సాగి పోతన (1450-1510) భాగవత పురాణ అనుసృజన - ఆంధ్ర మహాభాగవతము పేరిట రాసిన మహాపురాణ సృష్టితో ఆది కావ్యాలుగా చెప్పుకునే రామాయణ భారత భాగవతాలు చంపూ పద్ధతిలో కవిత్రయం, భాస్కర రామాయణ త్రయం, పోతన నాయకత్వంలోని భాగవత కవి బృందం ద్వారా సమష్టి కృషిగానే తెలుగు సాహిత్యంలో విలసిల్లుతున్నాయి. నాలుగు వందల ఏళ్ల కాలం పట్టింది వీటి ఆవిర్భావానికి. వీటి వెనుక గల రాజ్య నేపథ్యాలు చాళుక్యులు, కాకతీయులు, వారి ఉప పాలక రెడ్డిరాజులు ప్రధానం కాగా, భాగవత రచన నాటికి వెలమ రాజుల పాలనలో ఉన్నాము. మహాభారత సందర్భంలో రాజాదేశంతో మొదలైన ఇతిహాసాల ఆంధ్ర రచన పరంపరలో, హరిహరాంకితాలు, రంగనాథాంకితాలు, సాహిణీ మార అనే పాలకునికి అంకితాలుగా సాగి, పోతన కాలానికి రాజ ప్రభావాలకు లొంగని ఆత్మశక్తి గల కవి రచనగా, పలికించిన రామభద్రునకు అంకితంగా మహాభాగవతం నిలిచింది. ఇలా ఒక అర్థ సహస్ర కాలంలో తెలుగువారికి దఖలు పడిన ఈ ఇతిహాస త్రయం - ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షర రమ్యత, నానా రుచిరార్థ సూక్తినిధిగా తమ రచనలను, సారమతులుగా ఈ కవీంద్రులు నన్నయ బాటలోనిలిచి ద్విపదను కొండకొచో స్వీకరించి, శాశ్వతంగా నిలబెట్టిన వేలస్తంభాల మండపాలు ఈ తెనుగు ఇతిహాసాలు. అందుకే చాళుక్య, కాకతీయ స్ఫూర్తిలో పది-పదిహేను శతాబ్దుల కాలపు ఈ తొలి అయిదువందల ఏళ్ల ఇతిహాస సృజన దీప్తికి వందనం చేద్దాం.

- రామతీర్థ, 98492 00385

పద్నాలుగో శతాబ్దిలో పద్య-గద్య మిళిత చంపూ శైలిలో ముగ్గురు కవులు కలిసి రాసిన భాస్కర రామాయణం, ప్రధానంగా హుళక్కి భాస్కరుడి పేరునే ఉన్నా మిగిలిన కవులు మల్లికార్జున భట్టు, రుద్రదేవుడు కూడా ఈ రామాయణ సహకవులు. ఈ రామాయణం మరలా, కవిత్రయం పద్ధతిలోనే ధ్వని రస మిళిత పద్ధతిలో సాగడం ఈ కవుల ఎంపిక. ఇందులో కల్పనా స్వాతంత్ర్యం ఉన్నది.

జెండాపై 'కపిరాజు'లు

'అదిగో ద్వారక', 'అలుగుటయే ఎరుంగని', 'జెండాపై కపిరాజు', 'అతడనేక యుద్ధముల' ఇలా తిక్కన పద్యాలతో సమానంగా తమ పద్యాలను గుబాళింపచేసిన మహాభారత నాటక శిల్పులు తిరుపతి వేంకట కవులు.

సందర్భం

రామతీర్థ

గత శతాబ్దికి కొంచెం అటూ ఇటూగా వచ్చిన గయోపాఖ్యానం, కన్యాశుల్కం, పాండవోద్యోగ విజయాలు, సాంస్కృతిక పరిపూర్ణత గల సృజన సంపదలు. కల్పిత కథకు బిగి గల పద్యాలు, సంభాషణలతో చిలకమర్తి వారి 1880 రచన, ''గయోపాఖ్యానం'' ''అల్లుడా రమ్మని ఆదరమ్మునపిలు''స్తూ, తెలుగు పల్లెలను, పట్నాలను చుట్టుముట్టింది. 1909 నాటికి కన్యాశుల్కం పూర్తిగా సవరణకు గురై, విస్తరణలో పూర్తి వ్యావహారిక సంభాషణల నాటకంగా పేరు పొందినా, ఈ నాటకంలో దాదాపు 70 పద్యాల దాకా, కొన్ని పూర్తిగా, కొన్ని చరణాలుగా, కొన్ని సంభాషణాల్లో కలిసిపోయి ఉన్నాయి. ఇది గురజాడ చేసిన కనికట్టు.

ఇక 1910 లో మొదలై, 1917 వరకూ సాగిన బృహత్తర నాటక ప్రయోగం, పాండవ పరంగా, మహాభారతాన్ని ఆరు నాటకాలుగా చెప్పిన తిరుపతి వేంకట కవుల అద్వితీయ రచన. ఇలా లక్ష శ్లోకాల మహా భారత కథను, మన కవిత్రయం 300ల పైచిలుకు ఏళ్లలో పది - పద్నాలుగు శతాబ్దుల మధ్య, పాతిక వేల పద్య, గద్య చంపూ పద్ధతిలో పునఃసృజన చేసి అందించగా, దాన్ని, 500 ఏళ్ల తరువాత, కొత్త రూపంలో, ప్రదర్శన యోగ్యంగా, దాదాపు 400ల కొత్త పద్యాలతో, స్క్రిప్ట్‌గా మార్చారు తిరుపతి వేంకట కవులు. ఆ రకంగా, 20వ శతాబ్దంలో మహాభారత పద్య నాటక రచన చేసిన భారతీయ కవులు మరొకరు లేరు.



పద్య రచనలో, వీరు రాబోయే దృశ్యాలను సూచించడం అనే ఒక సంప్రదాయానికి బద్ధులుగా, ఈ కథను నడిపిన తీరు అనన్య సాధ్యం. ఈ నాటకాలను పాండవ జననము, పాండవ ప్రవాసము, పాండవ రాజసూయము, పాండవ ఉద్యోగము, పాండవ విజయము, పాండవ అశ్వమేధము అని ప్రదర్శనోచితంగా రాసినా, మనం రెండు నాటకాలు మాత్రమే చూస్తున్నాం. అవి పాండవ ఉద్యోగము, పాండవ విజయము.

కవిత్రయ భారతం, పోతన మహాభాగవతాంతర్గత భారత కథ తరువాత, తెలుగువారికి సమీప శతాబ్దంలో, మహాభారత కథ, నాటక రూపంలో ఇన్ని వందల పద్యాలతో ఆరు నాటకాలుగా చెప్పిన వారు ఈ మహాకవులు మాత్రమే. తిక్కన, పోతన వాడిన వాడుక భాష మాటలకు మించి తమ పద్య రచనలో స్థానం కల్పించి, వాడుక భాషా పద్యానికి ప్రాచుర్యం కల్పిస్తూ, పండితుల, చదువరుల కోసం చేసిన రచన కాకుండా, శ్రోతల, ప్రేక్షకుల సమూహాలకు ఉద్దేశించిన సృజనగా, మహాభారత కథకు వీరిచ్చిన ట్రీట్మెంట్ పరిశోధనకు అర్హమైన ఉత్తమ విషయం. ''బావా'' అన్న మాట కవిత్రయం, ముఖ్యంగా వాడితే తిక్కన వాడాలి–కానీ అటువంటి మాట తన 15 పర్వాల రచనలోనూ ఎక్కడా ఉపయోగించలేదు. పోతన సరే సరి.

అందువలన, నాటక పద్యంగా, తిరుపతి వేంకట కవుల ముద్రగా, రాగాల మోతలో ''బావా ఎప్పుడు వచ్చితీవు'' రెక్కలు కట్టుకు మరీ పల్లెలు, పట్నాలు ఊరేగింది. నూరేళ్లలో తెలుగు నాట, వందల నటుల కంఠాల్లో మారుమ్రోగి, పశువుల కాపరుల నుంచి, పండిత వర్గం దాకా, తన సహజ శైలిలో ఆకట్టుకున్నది. తెనుగు భారతం ప్రదర్శనకు అనుగుణమైన తీరు తెన్ను ఏర్పడి, దృశ్యమానం అయింది ఇరవయ్యో శతాబ్దిలోనే. ఈ నాటకాల్లో పాండవ ఉద్యోగము, పాండవ విజ యము ఎక్కువగా ప్రదర్శన జరిగాయి. అందుకే, 'పాండవోద్యోగ విజయాలు' అని ఈ రెండు నాటకాలను కలిపి మాట్లాడ్డం ఒక అలవాటు తెలుగు సమాజంలో.

'అదిగో ద్వారక ఆలమందలవిగో', 'అలుగుటయే ఎరుంగని అజాత శత్రువే అలిగిన నాడు', 'జెండాపై కపిరాజు ముందు సితవాజి శ్రేణియున్ గూర్చి', 'అతడనేక యుద్ధముల నారియు తేరిన వృద్ధమూర్తి' ఇలా తిక్కన పద్యాలతో సమానంగా తమ పద్యాలను గుబాళింపచేశారు వీరు. సుమారు 400 నాటక సమాజాలకు జీవిక కల్పించిన కళా ప్రవాహాలు వీరి నాటకాలు. 1910 నుంచి 1917 వరకూ రచన సాగిన ఈ నాటక పరంపరకు, ప్రస్తుతం శత వత్సర సందర్భం. వర్తమాన నాటక సాహిత్యంపై విస్తార దృష్టి పెట్టాలన్న సంకల్పంతో, మొజాయిక్ సాహిత్య సంస్థ, సాహిత్య సురభి సంస్థలు 28 డిసెంబర్ సాయంత్రం విశాఖపట్నంలో ''పాండవోద్యోగ విజయాల నూరేళ్ల పండుగ'', ప్రత్యేక సభలో, ప్రసంగాలు, 'రాయబారం' నాటక వీడియో ప్రదర్శన నిర్వహిస్తున్నాయి.

ఇరవయ్యో శతాబ్దంలోనే, జాతీయ భాషల్లో, మహాభారతంపై ఇలా నాటక ప్రయోగం చేసిన వారు లేరు, ఆధునిక భాస ద్వయం వంటి ఈ జంటకవుల ఈ కృషికి దీటైనది గత శతాబ్దిలో మరో భాషలో రాలేదు. అలా భారతదేశం అంతటా మనం చాటి చెప్పవలసిన మహాభారత నాటక శిల్పులు తిరుపతి వేంకటకవులు. దివాకర్ల తిరుపతి శాస్త్రి(1872–1920), చెళ్ళపిళ్ల వేంకట శాస్త్రి (1870–1950) అని రెండు పేర్లకన్నా, తమ జీవితంలోనూ, ఎడబాటులోనూ కూడా, 'తిరుపతి వేంకట కవులు'గానే రచన చేసిన వీరి కీర్తి పండిత పామర జనరంజకంగా 'జెండాపై శుభ తార' తీరున వెలుగులీనుతూనే ఉంటుంది ఒక నూరు కాదు, పదుల నూర్లు గడిచినా. ఎక్కడ తెర లేచినా, ఎక్కడ రంగస్థలి మీంచి 'బావా!' అన్న పిలుపు వినిపించినా.

(తిరుపతి వేంకట కవులు రచించిన 'పాండవోద్యోగ విజయాల' నూరేళ్ల పండుగ సందర్భంగా)

వ్యాసకర్త కవి, విమర్శకుడు । 98492 00385

కొంగ్రొత్త వెలుగులతో తెలుగు ప్రసరించేలా...

కొత్త ఏడాది మళ్లా ముస్నూటరవై అయిదు వేకువలను తీసుకురాబోతున్నది. వెయ్యేళ్ళ ముందర శాసన హోదా గల భాషగా, ఒక సహస్రం నుంచి సృజన సంపదగా, నన్నయ, పాల్కురికి రెండు తీరులుగా అందించిన రచనలుగా వేల పదాలు మన ముందర కుప్పలుగా పడివున్నాయి. అవి ప్రతి శతాబ్దంలో విస్తృతమవుతూ వచ్చాయి. గత వెయ్యేళ్లుగా నిర్విరామ సాహిత్య రచన భిన్న రూపాల్లో జరుగుతూనే ఉన్నది. తొలి సహస్రం మనకు అందీ అందని చరిత్ర నీడల్లో ఉన్నా, రెండో సహస్రం తెలుగు సారస్వతంలో చిరంజీవిగా ఉన్నది. ఆనాటి రాత పద్ధతులు, భద్రపరిచే పద్ధతులు, రాజులకు, కొద్దిమంది పండితులకు పరిమితం అయిన కాలం నుంచీ, అక్షరాలు అచ్చు పుస్తకాలుగా లభ్యత పెరిగి, చదువరుల సంఖ్య పెరిగి, సాంకేతిక దోహదం పెరిగి, మూడో సహస్రారంభ దశాబ్దాల్లో, వేగంగా పోయే విశ్వభాషల సరసన, తెలుగు మన అస్తిత్వంగా నిలబడి ఉన్నాము.

ఈ రెండో సహస్రంలో భాషలు విశాలం అయ్యాయి. భారత ఉపఖండం విషయానికి పరిమితం అయినా, ఆసియా పొత్తికడుపు నుంచి వచ్చి, ముందు దాడులు, దోపిడీలే చేసినా, ఆరువందల ఏళ్లుగా పాలించిన మహమ్మదీయుల భాష, ఇక్కడి వ్యవహార పరిభాష పదాలుగా సమస్త జీవన రంగాలను ప్రభావితం చేస్తూ కలగలిసి పోయింది. తరువాత పెనుగులాడిన మూడు వందలేళ్ళ పాశ్చాత్య ఆంగ్ల పాలన సైతం, పారిశ్రామిక నాగరికతలను, వాటితో బాటే వచ్చిన మార్పులను, కొత్త పదాలను జన సంపర్కంలో వదిలి, ప్రపంచ పోకడలు మన దేశీయులకు ఆకళింపు అయ్యేలా, విస్తృత వాడుక గల భాషను ఇచ్చింది. విదేశీ పాలకులు అంతరించారు. సాంస్కృతిక పలుకుబడులు మిగిలిపోయాయి. లోకానికి కిటికీలు తెరుచుకున్నాయి. ఇదీ స్థూలంగా గత సహస్రం ఒనర్చిన మేలు. నన్నయ లోకం కన్నా మన లోకం నేడు వెయ్యేళ్ళ తరువాత చాలా పెద్దది. కానీ, ఆయన ఏర్పరచిన లక్ష్యమే నేటికీ సాహిత్యానికి గొప్పది. అంతకుమించి మనం ఏమీ కొత్తగా చెప్పలేకపోయాము. 'విశ్వశ్రేయం కావ్యం' అన్నాడాయన ఒక వ్యాకరణ పుస్తకంలో. 'ఏ భాష వారైనా, భాష క్షుణ్ణంగా ఎరిగి లోకోపకారి అయిన కావ్యం రాయాలి' అన్నది ఆయన సూచన. సామాజిక నిబద్ధత ఉండాలా అంటే, మనం నన్నయను ఉదహరిస్తే చాలు. అభివ్యక్తి మార్పులను పూర్వ తరాలపై తిరుగుబాటుగా చూడటం పాత పద్ధతి. అప్పటివారు అభివ్యక్తిలో, ఇతివృత్త శక్తిలో వేసిన దారులు మరింత విస్తరింప చేయడమే ఏ కొత్త తరంలోనైనా జరిగేది. ఇది ఎంత మహత్తరంగా జరిగింది అన్నదే కలుపుగోలు దృష్టి. ఇన్‌క్లూసివ్ దృష్టి అంటారు. ప్రపంచంలో ఏదీ దానంతట అదే, మరే దానితో సంబంధం లేకుండా జరగదు. సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోనూ అంతే. మన లాక్షణికుల నుంచీ, గురజాడ, టి.ఎస్.ఇలియట్ దాకా ఇది పాత కొత్తల మేలు కలయిక అనే చెప్పారు వారి వారి భాషల్లో.

నన్నయ తెనుగు భారత రచన మొదలు తరువాత దాదాపు ఒక వెయ్యేళ్ల కాలచక్రం తిరిగి, మూడోకొత్త సహస్రం మొదట్లో ఉన్న మన ముందున్న బరువు బాధ్యతలు నన్నయ, పాల్కురికి ముందర ఉన్నవాటికన్నా తక్కువేమీ కావు. తెలుగును మరో సహస్రం బతికించి 3018కి మనం అందివ్వగలమా? ఇదీ ప్రశ్న. తొమ్మిది వందల ఏళ్ల గ్రాంథికం ఆనాటి అవసరాలకు, నెమ్మది సహజ జీవనానికి సరిపోయినా, ముందు ముందు ఇది చాలదు అని ఎరిగిన వైతాళికులు భారతదేశం అంతటా తమ అభ్యుదయ వాణి వినిపిస్తూ, 'రాబోయే శతాబ్దాలు ప్రజలవే కనుక, ప్రజల భాష రాయండి, ప్రజలకు తెలిసేలా విజ్ఞాన విషయ వినిమయం జరగాలి' అని కోరారు. ఇది ఒక శతాబ్ది ముందర, జటిల గ్రాంథికంతో జరిగిన పేచీ కాగా, తెలుగు నాట 1927 ప్రాంతాలకు గానీ నవ్యసాహిత్య పరిషత్తు, వ్యవహారిక భాషను అంగీకరించలేదు. విశ్వవిద్యాలయాలు అంగీకరించేటప్పటికి మరికొన్ని దశాబ్దాలు గడిచాయి. ఆ నేపథ్యం స్వరూపం మారి ఇప్పుడు జటిల గ్రాంథికంతో వ్యవహారిక భాష ఎలా నెగ్గుకుని వస్తుందా అని కాక, విద్యతో ఇంగ్లీష్ దాడి, ప్రభావం పెరిగిపోయిన వర్తమానంలో అసలు తెలుగు ఉండాలా, ఉంటే ఏ మేరకు ఉండాలి అన్న కీలక అంశం శాస్త్రీయ దృష్టి లేని రాజకీయ వర్గాల, విద్యావ్యాపార వర్గాల పాలైంది. చదువరులు లేకపోతే, సాహిత్యం ఎవరికోసం ఎన్నాళ్లు బతుకుతుంది? అదే ఇప్పుడు దేశి భాషల ముందున్న ప్రశ్న. 2018లో తెలుగు సమాజం, తెలుగు సాహిత్యం, సాంస్కృతికతను ఎలా నిలబెట్టుకుంటుంది?

నిఘంటు విస్తృతీకరణ

గత యాభై ఏళ్లుగా మన తెలుగులో (ఇతర భారతీయ భాషల వలెనే) కొన్ని వేల పాశ్చాత్య పదాలు కలిసిపోయి, ప్రజల వాడుకలో ఉన్నాయి. వీటికి అనుగుణంగా, మన పదకోశాల, శబ్ద సంకలనాల విస్తృతి జరగాలి. శబ్ద రత్నాకరం అంటేనే అర్థం, నిత్యం కొత్త అలలు (పదాలు) పుడుతూ ఉంటాయని. ఈ కొత్త పదాల పట్ల మన వైఖరి ఏమిటి? నైఘంటు అవసరాల మేరకు ఒక మాట నిఘంటువులోకి ఎక్కాలి అంటే, అది సమాజ ప్రజల వాడుకలో విస్తృతంగా ఉండాలి. అలాగే సాహిత్య వాడకం, ప్రయోగం జరిగి ఉండాలి. ఇది రెండూ కూడా నిండుగా ఉన్న వేల అన్య పదాల పట్ల ఏమిటి మన వైఖరి? నిఘంటువులు మనం సమీక్ష జరిపి అరవై డెబ్బై ఏళ్లు దాటింది. ఆమధ్య పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నిఘంటు ప్రచురణ చేసినా, అది ఆధునికతకు దూరంగానే ఉన్నదని కొంచెం పరిశీలిస్తే తెలుస్తుంది. ఇతర ప్రపంచ భాషలు, మనకన్నా తక్కువ సంఖ్య గల ఫ్రెంచ్, జపనీస్, ఇటాలియన్, జర్మన్ నిఘంటువులెలా నిర్మాణం చేస్తున్నారు అన్నది శాస్త్రీయంగా ఆకళింపు తెలుసుకుని, ప్రపంచ వ్యవహార భాష అయిన ఇంగ్లీష్ భాషావేత్తలెలా తమ మాటల లోకవ్యాప్త పునాదులు విస్తరిస్తున్నదీ కూడా చర్చకి వచ్చే సెమినార్లు జరిపి, ఎంత ఖర్చు అయినా సరే, ఈ పనికి పూనుకోవడం తెలుగు ప్రభుత్వాల స్థాయిలో చాలా అవసరం.

తెలుగు ఆధునీకరణ సాధ్యమేనా?

సాధ్యమే! ముందుగా ఏది సంప్రదాయ తెలుగు, ఏది ఉపయుక్త/ఆధునిక తెలుగు అన్నది తేలాక, ప్రపంచ జ్ఞాన విస్తారత అంతా పలు విషయాల గురించి ఉన్నది, నిత్యం జమవుతుండేది, ఎప్పటికప్పుడు మనం తెలుగులోకి మార్చగలిగే ప్రక్రియలో వేలాదిమంది సాంకేతిక సహాయాలతో పనిచేస్తే అందుకు అనుగుణంగా ఆర్ట్స్ అండ్ హ్యూమానిటీస్ (కళా, మానవీయ రంగాలు) బలోపేతం చేస్తే ఇది సాధ్యపడుతుంది. వీటిలో వ్యవహార విషయ అనువాదం, సాహిత్య అనువాదం (ఇది అటునుంచి, ఇటునుంచి కూడా) రెండు శాఖలుగా ఉండాలి. వెయ్యేళ్ల సారస్వత సంపద, ప్రస్తుత తెలుగువారికి అస్తిత్వమూలం గనుక, విద్యార్థులకు ఎంత ఉన్నత విద్యలోనైనా, ఆ విద్యాస్థాయి తీరుకు అనుసారంగా ఒక తెలుగు రచన నిర్బంధ అంశంగా ఉండాలి. దీనిలో వారు సాధించే మార్కులు, వారికి కెరీర్‌లో ఉన్నతి, ప్రాధాన్యత కోసం పరిగణించబడతాయి అన్నది పొందుపరుస్తూ, తెలుగు ఒకటో తరగతి నుంచి ఉన్నత చదువుల్లో ఒక భాగంగా ఉండేలా చూడాలి. (ఒక వెయ్యేళ్ల దూరదృష్టి ఉంటే తప్ప ప్రభుత్వాలకు ఇది అమలుచేయడం సాధ్యం కాదు). ఇలా అమలు అవుతుంటే, చదువుకున్నది మర్చిపోలేరు కనుక, తెలుగుపై ఒక పరిచయం, వీలైతే ఇంకా ఎక్కువ ఆసక్తి ఎవరికైనా కలిగే అవకాశం, సృజనకారులుగా మారే వెసులుబాటు, ఇలా తెలుగు అన్ని స్థాయిల్లో కొత్త తరాలకు విద్యాబోధన అంశంగా ఉన్నప్పుడే సాధ్యం. దీనికి అనుగుణంగా మన విద్యావ్యవస్థలో సవరింపులు చేస్తే, అప్పుడు తెలుగు చదివేవారు సమాజంలో సంఖ్యాపరంగా పెరుగుతారు. మాకు తెలుగు రాదు అని చెప్పుకునే దశలో ఉండరు. ఇది కనీసం రెండు తరాల కాలం పట్టే ప్రక్రియ.

నన్నయ లోకం కన్నా మన లోకం నేడు వెయ్యేళ్ళ తరువాత చాలా పెద్దది. కానీ, ఆయన ఏర్పరచిన లక్ష్యమే నేటికీ సాహిత్యానికి గొప్పది. అంతకు మించి మనం ఏమీ కొత్తగా చెప్పలేకపోయాము. 'విశ్వశ్రేయం కావ్యం' అన్నాడాయన ఒక వ్యాకరణ పుస్తకంలో. 'ఏ భాష వారైనా, భాష క్షుణ్ణంగా ఎరిగి లోకోపకారి అయిన కావ్యం రాయాలి' అన్నది ఆయన సూచన. సామాజిక నిబద్ధత ఉండాలా అంటే, మనం నన్నయను ఉదహరిస్తే చాలు. అభివ్యక్తి మార్పులను పూర్వ తరాలపై తిరుగుబాటుగా చూడటం పాత పద్ధతి. అప్పటివారు అభివ్యక్తిలో, ఇతివృత్త శక్తిలో వేసిన దారులు మరింత విస్తరింప చేయడమే ఏ కొత్త తరంలోనైనా జరిగేది. ఇది ఎంత మహత్తరంగా జరిగింది అన్నదే కలుపుగోలు దృష్టి.

చదువరులు పెరగాలంటే ఎలాంటి సాహిత్యం రావాలి?

సాహిత్యం సమాజంలో పలు వర్గాలవారు పాల్గొనే ఒక మాధ్యమం అవుతుంది. అత్యధిక ప్రజల జీవన న్యాయాన్ని కోరడం ద్వారా, నేటి రాజకీయ వ్యాపార నియంతలు కడుతున్న ఆధిపత్య, అణుబాంబుల వంతెనలు దాటి మానవుడి ముందర ఉన్న ఎన్నో సహస్రాల జీవన ధ్యాసను తెలుగు రచయితలు సజీవంగా ఉంచగలరు. వేర్వేరు జీవన రంగ నైపుణ్యాలు, ఆయా రంగాలకు చెందిన వారైతే బాగా చెప్పగలరు. అటువంటి స్వీయ స్వరాలు నమోదు చేయవలసిన ఇరవయ్యో శతాబ్దపు ఎన్నో వృత్తిపరమైన రంగాల గురించి తెలుగు రచయితలు సృజనాంశాలుగా రాయవలసిన విశ్వశ్రేయస్సే. మనమే కాదు ప్రపంచంలోనే ఇవాళ ఎక్కువగా రాస్తున్న విషయాలివి. ఇప్పుడు రాయవలసినంత విశాలంగా రావడం లేదు అన్నది ఒక స్థితి. జీవన సంక్లిష్టతలను కావ్యాలు చేయలేని అసహాయత ఎక్కడుందో ఆలోచించడం కూడా మన బాధ్యతే.

నాటక దర్శనం

మన నాటక ప్రక్రియ ఎంతలా ఇరవయ్యో శతాబ్దంలో వికాసం చెందింది, ఇవాళ మనం క్షుణ్ణంగా పట్టించుకోవలసి ఉన్నది. వాడుక భాషలో కథలు, కవితల రచనకు ముందరే మన నాటక రచనను చిలకమర్తి, గురజాడ, తిరుపతి వేంకట కవులు, బలిజేపల్లి వంటివారు రంగస్థలాన్ని దృశ్యప్రబంధ వేదికలుగా మలిచారు. ఈ దారిలో తరువాతి దశాబ్దాల్లో తెలుగు నాటకం ఇంకొందరు నాటక శిల్పుల ద్వారా ఎంత దూరం నడిచిందో చూడడం కూడా 2018లో మన పరిశీలనకు సిద్ధంగా ఉన్న సజీవ సమాచార వాహిని.

నవలకు పునరుజ్జీవం

నవల నానాటికీ చిన్నదై కేవలం నూట ముప్పై పేజీలే అని ప్రచురణకర్తలు చెప్పడం, అవున్లే అని రచయితలు అనుకునే పరిస్థితి ఒక్క తెలుగు నవలా సాహిత్యంలోనే ఉన్నది. ఈ పరిస్థితి బాగుపడేందుకు కూడా మనం దారులు వెతకాలి. వట్టికోట, మహీధర, వుప్పల వంటి విలక్షణ నవలాకారుల కోసమని రంగం ఏర్పాటుచేయాలి.

విమర్శ జీవద్వంతం కావడం ఎలా?

ఒక సిద్ధాంతం నేపథ్యం నుంచి చెప్పడం ఎంత ముఖ్యమో, ఒక రచన కళాత్మ బాధ్యతలను ముతకగా నిర్వహించినప్పుడు ఆ మాటలు స్పష్టంగా చెప్పలేని మొగమాటాల్లో ఉన్న తెలుగు విమర్శ, కొత్త అవలక్షణాలుగా, మితిమీరిన ప్రాంతీయదనాలు, సామాజిక పరిష్కార కోణాలను పరిగణించని అస్తిత్వ ప్రాధాన్యతా ధోరణులు, వీటిలో ఎప్పుడూ ఒక లోముట్టడిలో బతుకుతున్నది. దీన్నుంచి విడుదల కావాలంటే, విశ్వభాషల సాహిత్య విస్తృత అధ్యయనం విమర్శకుడికి రచయిత కన్నా ఎక్కువ అవసరం. ఎందుకంటే సమాంతర, తులనాత్మక చిత్రం గీసి, రచయితలు ఎక్కడ వెలిగారో, ఎక్కడ మలిగారో చెప్పాలంటే, తెలుగుకు ఉన్న విమర్శ దీపకాంతులు, చిన్నవిగా కాక పెద్దవి కావాల్సిన అవసరం ఉన్నది.

బాలసాహిత్యం

తెలుగు, ఆంగ్ల, ఉర్దూ భాషల్లో ఈ త్రి-భాషా పత్రిక నడపడం ప్రభుత్వానికి గల దూరదృష్టికి మంచి ఉదాహరణ కావచ్చు. ఐక్యరాజ్య సమితి కూడా ఆనందించి ఈ కృషిలో మనకు సహాయపడవచ్చు. ఈ ప్రోత్సాహక విధానం భాషలో రచనా సామర్థ్యాలను చిన్నప్పట్నుంచీ అభివృద్ధి చేయడమే కాక, నేటి బాలలే రేపటి పౌరులు, కళాకారులు, రచయితలు అని చాటిచెప్తుంది. ప్రతిదీ లాభనష్టాలతో నడవదు. లక్షల సంఖ్యలో ఉన్న ప్రైవేటు స్కూళ్లకు వివిధ స్థాయిల్లో అనుమతులిచ్చిన ప్రభుత్వం ఒక అనుబంధ ఆదేశంగా, ప్రతి స్కూల్ కనీస ధరకు, ఒక యాభై పత్రికలు కొనాలని ప్రభుత్వ ఆదేశాలు ఉంటే, ఈ పత్రిక కొన్ని వేల కాపీలు పిల్లలకు, లైబ్రరీలకు అందుబాటులో ఉంటుంది.

విశ్వభాషగా తెలుగెలా?

దేశ భాషలందు తెలుగు లెస్స అనుకుంటున్న, చెప్పుకుంటున్న స్థాయినుంచి విశ్వభాషలందు తెలుగు లెస్స అనేలా, ప్రభుత్వాలే ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయాల్లో కొన్నింటిలోనైనా తెలుగు పీఠాలు ఏర్పటుచేయాలి. తద్వారా అక్కడి ఆ దేశ విద్యార్థులకు తెలుగు ఒక బోధనాంశంగా డిగ్రీ, పీజీలో పరిశోధనలు ఉండేలా, వారికి అక్కడే మనం తిరిగి ఉద్యోగావకాశాలు ఇచ్చేలా ప్రభుత్వ స్థాయి ఒప్పందాలు, భాషా, సాహిత్య, సాంస్కృతిక స్థాయి సంయుక్త కృషికి బాటలు వేయాలి. అన్నీ 2018లో చేసేస్తామని కాదు - భాష, ఆ భాషలో సాహిత్యం, అది ప్రతిఫలించే సాంస్కృతికత కుంటుపడ్డ దశలో మనం ఉన్నాం. అందుకే ఆలోచనలు పెద్దగా చేయాలి. ఇవి నెరవేర్చడం ఒక ఎరుకగల సమాజ పౌరులు, వారెన్నుకున్న ప్రభుత్వాల బాధ్యత. విశ్వభాషగా ఎదగాలంటే ప్రయాణం పెద్దదే. మరి కృషిబద్ధులమౌదామా?

- రామతీర్థ, 9849200385

అభ్యుదయ ఉత్తరాల గుత్తి

చరిత్ర

కలిసి కూచుని మాట్లాడుకుని, దేశదేశాల కవిత్వాలు చదువుకుని, తమ రచనలు కూడా ఒకరికి ఒకరు వినిపించుకుంటూ, ఒక రచయితల కూటమి తయారు కావడం, ఏ దేశంలోనైనా విశేషమైన సంగతి. అటువంటిది మన తెలుగు సాహిత్యంలో, విజయనగరంలో ఒక ఏడెనిమిది దశాబ్దాల కిందట జరగడం, ఆధునిక తెలుగు సాహిత్య నిర్మాణ దశాబ్దాల్లో , ఇరవయ్యో శతాబ్దంలో ఒక ముఖ్య సంఘటన. వీరు ఆరుగురూ సాహిత్యరంగంలో పేరు పొందారు. అందరిలోకీ పెద్ద పురిపండా అప్పలస్వామి, ఆలా వయసులో పెద్ద కావడం మూలాన చూస్తే, రోణంకి అప్పలస్వామి, శ్రీరంగం నారాయణబాబు, శ్రీరంగం శ్రీనివాసరావు, చాసో, ఆరుద్ర ... ఈ క్రమంలో వీరి పేర్లు వస్తాయి.

అరసం తొలిసభలు తెనాలిలో జరిగినా, ఆ సభల తీరుతెన్నులు, రచయితల సంఘ స్వరూప స్వభావాలు, తెనాలి నుంచి వచ్చిన చదలవాడ పిచ్చయ్య, విజయనగరంలోనే చాగంటి సోమయాజులు, సెట్టి ఈశ్వరరావులతో కలిసి సమాలోచన చేశారు. ఇది 1942 సంవత్సరం కాగా, అప్పటికే, తమ ఉద్యోగాల వెతుకులాట, జీవికకై కొత్త అవకాశాల కోసం, నారాయణ బాబు, శ్రీశ్రీ, ఆరుద్ర వేరే ఊళ్ళకు వెళ్ళడం తటస్థించింది. పిఠాపురం నుంచి నారాయణ బాబు, ఢిల్లీ నుంచి శ్రీశ్రీ, నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్‌లోని రిసాల్పూర్, ఒక ఏర్‌ఫోర్స్ శిబిరం నుంచి ఆరుద్ర, 'చాగంటి సోమయాజులు, కస్బా, విజయనగరం' అని రాసిన తొలి ఉత్తరాలు 1940 నుంచే ఉన్నాయి. దాదాపు 1934-40 మధ్య విజయనగరం మిత్రబృందం, తమ విలువైన ఆదాన ప్రదానంలో పాల్గొంది. ఫ్రెంచ్, జర్మన్, ఇంగ్లీష్, బెంగాలీ తెలుగుభాషల గీతాలు ఇక్కడ ఘూర్ణిల్లుతున్నాయి. ఇక్కడినుంచే రోణంకి రాసిన సాంగ్ అండ్ లిరిక్స్, నారాయణబాబు రుధిరజ్యోతి, శ్రీశ్రీ మహాప్రస్థానం, చాగంటి సోమయాజులు కథలు రాగా, ఆరుద్ర చిన్న చిన్న గీతాలు రాస్తున్నాడు. తరువాత పురిపండా కవిత్వం 'పులిపంజా' కూడా రావడానికి జీవస్థానం విజయనగరం, అందులో చిన్నపల్లి వారి వీధిలోని చాగంటి వారి మేడ లేదా చాసో హవేలీ. వీరి ఉత్తరాలు, వీరి జీవనగతి సంకేతాలు, సాహిత్య సృజన విశేషాలకు అదనపు ఆధారాలు. కొన్ని వివాదాల్లో ఒకరిని ఒకరు అనుకున్న మాటలకు మౌలిక ఆధారాలు.

1940 నుంచి 1987దాకా రాయబడి, తరువాత ఒక మూడు దశాబ్దాలుగా ఇవి ఉన్నాయి. ఆ ఉత్తరాలు ఇప్పుడు చాసో కుమార్తె, చాగంటి తులసి పూనిక, కృషి వల్ల, మంచి ముద్రణా ప్రమాణాలు గల ఉత్తరాల దొంతిగా, సర్వ ఆధారాలతో బయటికి వచ్చాయి. వీటిని తెలుగు సాహిత్య లోకానికి, అశేష చదువరులకు అందచేస్తూ తులసి 'చాసో కాగితాల్లో దొరికిన ఈ ఉత్తరాలు చాసో, ఆయన మిత్రులు సాహిత్య సృజనకు చేసిన కృషీ, తపన, పరస్పర సహాయ సహకారాలూ, ప్రేమా, గౌరవాభిమానాలు, ప్రోత్సాహ ప్రోద్బలాలు, సమాజం పట్లా తమ రచనల పట్ల నిబద్ధత, దాని బాగోగుల చింతనా, రచనల ప్రచురణకు పడిన తంటాలు. మంచి దారులంట ప్రయాణించిన తీరుతెన్నులు, ఆనాటి వారి భాషా పలుకుబడులు, సరదా చమత్కారాలు, వెటకారాలు వారు సృష్టించిన తెలుగు సాహిత్య చరిత్రకు సాక్ష్యాలు. ఈనాటి యువ రచయితలకు మార్గ దర్శకాలు' అంటూ వారు 'కలిసి నడిచారు' అని చెప్పారు.

వీటిలో చాసోకి ఆరుద్ర రాసిన 14 ఉత్తరాలు, శ్రీశ్రీ రాసిన 12 ఉత్తరాలు, నారాయణ బాబు రాసిన 7 ఉత్తరాలు, కృష్ణశాస్త్రి రాసిన రెండు ఉత్తరాలు, జరుక్‌శాస్త్రి రాసిన నాలుగు ఉత్తరాలు, సోమసుందర్ రాసిన అయిదు ఉత్తరాలు ఉన్నాయి. ఇంకా ఇతర పెద్దలు, చాసోకి రాసిన వాటితో కలిపి, ఈ 330 పైచిలుకు పేజీలతో పుస్తకం తయారైంది. వీటిలో చాసో రాసిన స్పందనలు, కొన్ని ఉత్తరాలు కలిపి తొమ్మిది ఉన్నాయి. ఉత్తరాల ఒరిజినల్ స్కాన్ చేసి, తిరిగి మళ్ళా డిటిపిలో ఆ ఉత్తరాల్లోని విషయాన్ని అందిస్తూ, ఉత్తరాల్లో ప్రస్తావితం అయ్యే వ్యక్తులు, ప్రదేశాల పేర్లు, వేరే టిప్పణిగా అందించిన తులసి శ్రమ, ఈ సమగ్ర పుస్తకం చూస్తే మనకు తెలుస్తుంది.

ఈ ఉత్తరాలు ఒకరకంగా కొన్ని ప్రశ్నలు, కొన్ని జవాబులు, వీరి మధ్య ఏమి నడిచి ఉంటుందా, అనుకునే అనేకమంది సాహిత్యాభిమానులకు ఈ ఉత్తరాల ద్వారా, అప్పట్లోనే వీరి ప్రయోగశీలత బయటికి వస్తుంది. జాతీయ భావావేశ సంకేతాలు వాడుతూ అభ్యుదయ కవిత్వం రాయడం పట్ల ఏర్పడ్డ ఆలోచనలను మరొకసారి సమీక్షించుకోవల్సిన అవసరమూ కనిపిస్తుంది. నారాయణబాబు కవిత్వ వ్యక్తిత్వం, తన మరణానంతర కవితల సంపుటి 'రుధిర జ్యోతి' పట్ల సరికొత్త చూపు అవసరం అని కూడా తోస్తుంది. ఈ ఆరుగురూ, అలాగే సాహిత్యరంగంలో ఇతర హేమాహేమీల మధ్య ఉండే ఒక భావావేశ బంధుత్వం కళ్ళకు కట్టేలా కొన్ని ఉత్తరాలు ఉన్నాయి.

ఇప్పటికే దశాబ్దాల కిందటి పత్రికల్లో వివరణలూ, విసుర్లూ, వాదవివాదాలపై తమ దృష్టికోణాలు తెలిపినవారే అందరూ. అయినా, ఈ ఉత్తరాల్లో ఉన్న కొత్త కాంతులు, మన అవగాహన సమగ్రం కావడంలో తోడ్పడుతాయి. తన కథల గురించిన అభిప్రాయ పరంపరలో చాసో కూడా చురుగ్గా పాల్గొనడం చూస్తాం. అటువంటి భిన్నాభిప్రాయ పరంపరని ఆహ్వానించేవాడు కనుకనే, చాసో, 'మీ కథలపై సరైన విమర్శ వచ్చిందా' అన్న ప్రశ్నకు, 'లేదు సరైన విమర్శ రాలేదు' అని జవాబు చెప్పాడు. ముఖ్యంగా ఈ పుస్తకం సాహిత్య తీరుతెన్నులపై, వ్యక్తుల ప్రాధాన్యతలపై జరిగిన భిన్నాభిప్రాయ ప్రకటనకు ఎంత మౌలికమో, అలాగే, ఇదొక దస్తూరి భోషాణం కూడా. నారాయణబాబు, శ్రీ శ్రీ, ఆరుద్ర, చాసో, జరుక్ శాస్త్రి, తల్లావఝుల శివశంకర శాస్త్రి, కృష్ణశాస్త్రి, మునిమాణిక్యం నరసింహారావు, కెవి రమణారెడ్డి, కొడవటిగంటి కుటుంబరావు, పురాణం సుబ్రహ్మణ్య శర్మ చదలవాడ పిచ్చయ్య, అవసరాల సూర్యారావు, సి.నారాయణరెడ్డి, వఝుల చిన సీతారామ స్వామి శాస్త్రి, ఎం.రామకోటి, జ్వాలాముఖి, ఎస్.ఎస్. ప్రకాశరావు, తంగిరాల వెంకట సుబ్బారావు, మానేపల్లి సత్యనారాయణ.. ఇలా సాహిత్య లబ్ధ ప్రతిష్ఠులైన ఎందరివో చేతి రాతలు ఈ ఉత్తరాల పుస్తకం ద్వారా శాశ్వతంగా నిలిచిపోయాయి.

– రామతీర్థ

98492 00385

మన సాహితి

కథా కళింగానికి 'చాసో స్ఫూర్తి' కీర్తి

తాను సంపాదకత్వం వహించి అచ్చు వేసిన కథలకు సుప్రసిద్ధ కథకుడు, విజయనగరం కథల సంతకం చాసో, దశాబ్దాల కిందట, 'కళింగ కథానికలు' అని పేరు పెట్టారు. అందులో అన్నీ తెలుగు కథలే అయినా, ఈ ప్రాంతం ఉమ్మడి సంస్కృతికి చెందిన కళింగాంధ్రగా, చాసోకి గల అవగాహన, భావితరాలతో పంచుకునే పని ఇది. విశాఖకు చెందిన ప్రముఖ కథకులు, విశాఖ సాహితి అధ్యక్షులుగా సేవలు అందించిన అచ్యుత రామరాజు కూడా, ఇది కళింగాంధ్ర ప్రాంతం అని తరచూ గుర్తుచేస్తూండే వారు. గోదావరిదరి పిఠాపురం వరకూ, కళింగ రాజ్యం అని తెనాలి రామకృష్ణుడు, తన భక్తి ప్రబంధం పాండురంగ మహాత్మ్యంలో పక్కాగా వందల ఏళ్ల కిందటే రాశారు. గురజాడ, కన్యాశుల్కంలో, కరటక శాస్త్రి చేత, 'నీలాంటి కాంతామణి లేకపోతే, ఈ కళింగ రాజ్యానికి ఎంత లోటు వచ్చి ఉండేది' అనిపిస్తారు మధురవాణితో మాట్లాడుతున్నప్పుడు. కన్యాశుల్కం తొలి ప్రదర్శన 1892లో విజయనగరంలో ఇచ్చినది జగన్నాథ విలాసినీ నాటక సమాజం. దీనికి మహారాజు ఆనంద గజపతి ప్రోత్సాహముండేది. ఒడియా, తెలుగు భాషలు మాట్లాడేవారు, మహానది, గోదావరి మధ్య ప్రాంతాల్లో ఉన్నారు అన్నది ఒక చారిత్రిక వాస్తవం. తెలుగు సాహిత్య అవార్డులన్నీ తెలుగు వారి చుట్టూ బొంగరాల్లా, ప్రాంత ప్రేమ, వాదాల ప్రేమ, కుల సమీకరణాలు కూడా జోడై తిరుగాడ్డం చూస్తూ ఉన్నాము. ఇరుగు పొరుగు భాషల వేపు చూసే అలవాటు పెద్దగా తెలుగు వారికి లేదు. ఒక ఎన్టీఆర్ పురస్కారం పేరిట మాత్రమే తెలుగు నేల మీంచి కొందరు భారతీయ స్థాయి రచయితలకు కొన్ని సాహిత్య గౌరవ పురస్కార ప్రదానాలు జరుగుతున్నాయి. ఇటువంటి నేపథ్యంలో, ఇరవై మూడవ చాసో స్ఫూర్తి అవార్డ్, ప్రముఖ ఒడియా కథా రచయిత గౌర హరి దాస్‌కు ఈ నెల పదిహేడున, విజయనగరంలో ప్రదానం జరగిన సంఘటన బహుధా స్వాగతనీయం.

1981 నుంచీ కథలు రాస్తూ నేటికీ పదిహేడు కథా సంపుటాలు ప్రచురించిన గౌరహరి దాస్, ఒడియా సాహిత్యంలో సుప్రసిద్ధ సాహితీవేత్త. పత్రికా రంగంలో అత్యధిక జనాదరణ గల 'సంబాద్' దినపత్రికకు ఫీచర్స్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ముప్పై ఎనిమిదేళ్ళ సాహిత్య జీవితంలో, పలు అవార్డులు,(రాష్ట్ర సాహిత్య అకాడెమీ, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డ్‌లతో బాటుగా) పొందారు. ఆరు నవలలు, కవిత్వం, నాటకం, యాత్రాసాహిత్యం, సంకలనాల సంపాదకత్వ నిర్వహణ, కాలమ్ నిర్వహణ, ఇలా పలు సాహిత్య రూపాలలో తన రచనా ప్రతిభ కన్పరుస్తున్నారు. పలు దేశాలలో పర్యటించి, ప్రపంచ సాహిత్య స్వరాల్లో తన తూర్పు భారత, ఒడియా సాహిత్య స్వరాన్ని కూడా వినిపించారు. గౌరహరి రచయిత, జర్నలిస్ట్ కూడా, ఒడియా రాష్ట్ర స్థాయి అవార్డ్‌లు ఎన్నో స్వీకరించారు. ఇలా సాహిత్య రంగంలో పలు మాధ్యమాల్లో పాత్రలు పోషిస్తూ వస్తున్న ఈయన భద్రక్ సమీపంలో ఒక పల్లెటూరులో పుట్టారు. ప్రస్తుతం పాత్రికేయత్తి దృష్ట్యా భువనేశ్వర్‌లో నివాసం. 'జ్వరాభాట' (1981) వీరి తొలి కథా సంపుటి కాగా, 'ఛాయా సొధర అబశేష'(1996) వీరి తొలి నవలా రచన.

వీరి కథా సంపుటాలు కొరాపుట్, లిటిల్ మంక్ అండ్ అదర్ స్టోరీస్, ద నెయిల్ అండ్ అదర్ స్టోరీస్, షేడ్స్ ఆఫ్ లైఫ్ (నవలిక) ఇంగ్లీష్‌లోకి అనువాదం అయ్యాయి. తెలుగు ఒడియా సాహిత్య రంగాల మధ్య మరింత సహకారపూర్వక ఉమ్మడి సాహిత్య కార్యక్రమాలు, అదాన ప్రదానాలు జరగడానికి ఇటువంటి ఉమ్మడి గుర్తింపులు చాలా అవసరం. ఇందుకు చాసో కువార్తె, చాగంటి తులసి అభినందనీయురాలు. మరొకందుకు కూడా ఆమెకు సాహిత్యలోకం రుణపడి ఉన్నది. చాసో సభావేదిక పేరిట, విజయనగరంలో సాహిత్య సభలు జరగడానికి వీలుగా, గురజాడ జిల్లా గ్రంథాలయం మొదటి అంతస్తులో, ఒక సమావేశ భవన నిర్మాణానికి ఆమె స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి మేచింగ్ గ్రాంట్ అందచేసి, గతవత్సరమే, ఈ సభావేదిక నిర్మాణం పూర్తయి, అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకున్నారు. అందువల్ల, ఈ ఇరవైమూడవ చాసో స్ఫూర్తి పురస్కారం తొలిసారిగా, ఘనంగా, చాసో సభా వేదికపై జరిగింది.

చాసో రాసిన 'పరబ్రహ్మం' కథలో, అన్నం కోసం, ఒక పిచ్చివాడు, అంగలార్చి, మిలిటరీ భోజన హోటల్ లోంచి పెరట్లోకి గిరాటేసే ఎంగిలి విస్తరి కోసం రెండు చేతులను చాచి నిలబడతాడు ఆ విస్తరి వచ్చి వాడి చేతిలో పడుతుంది. ఇది ఒక బిగిగల కథకు ముగింపు. 'అన్నమే పరబ్రహ్మం' ఆకొన్నవారికి, పేదవారికి, రోజుల తరబడి అన్నార్తులకు అని చాసో చెప్పే ఈ కథ, లోకం తీరుపైన ఒక కలం చిత్రం. అన్నం దొరక్క అంగలార్చే పిచ్చివాడు ఈ కథలో కనిపిస్తే, గౌరహరి రాసిన 'సుదామ్ జెనా ఎక్కడికెళ్ళాడు?' కథలో విస్తరి నిండా (అదే లంచ్ ప్లేట్ లో) ఒక కార్పొరేట్ వర్కింగ్ లంచ్ సమయంలో నాజూకు లంచ్ పద్ధతులు ఎరగక,, తమ కంపెనీ యజమాని, ఇక్కడికి వచ్చి ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ కుదుర్చుకుంటున్న అమెరికన్ వ్యాపార బృందం, ఆకలితో ఉంటారని, వీరికి ప్లేట్ నిండా ఆహారం వడ్డించినందుకు సుదామ్ జెనా, తన ఉద్యోగం పోగొట్టుకుంటాడు. ఆ వడ్డింపు సరిదిద్ది, తగు మాత్రం ఆహారంతో సరిపెట్టిన తరువాత, ఒప్పందం కుదిరి, వెళ్లిపోతున్న అమెరికన్లలో ఒకరు, సుదామ్ చేతిలో ఒక పది డాలర్లు ఉంచి వెళ్తాడు. అప్పుడు ఏమీ ఆనకపోయినా, కంపెనీ విదేశీ అగ్రిమెంట్ కుదిరి, కంపెనీ విస్తరణ జరిగాక, అక్కరలేని ఎన్నో ఉద్యోగాలను కంపెనీ తొలగించేస్తుంది. వారిలో సుదామ్ జెనా కూడా ఒకడు. తమ అగ్రిమెంట్ ప్రకారం పెట్టుబడులిచ్చి ఎలా కంపెనీ పని చేస్తున్నదో చూసేందుకు కొద్దికాలం తర్వాత వచ్చిన ఆ అమెరికన్ యువకుడు, సుదామ్ జెనా కోసం ప్రశ్నిస్తాడు. ఎవరూ మాట్లాడరు. అతనికి తల్లి అమెరికాలో ఒక భారతీయ వనిత. తన చిన్నప్పుడు ఆమె ఇలాగే ప్లేట్‌లో నిండా అన్నం పెట్టేది. అదీ ఆ యువకుడికి సుదామ్ జెనా పట్ల గల సాధు హృదయం. చాసో కథలో పిచ్చివాడు, మనకందరికీ తెలుస్తూనే ఉంటుంది పేదవాడు. ఈ కథలో ప్లేట్ నిండా అన్నం వడ్డించి, 'అయ్యో ఎంత ఆకలితో ఉన్నారో కంపెనీ బాగుకోసం పని చేస్తున్నఈ పెద్దల'ని భావించిన సుధాముడు (కుచేలుడ్ని సుధాముడు అని కూడా పిలుస్తారు) కూడా పేదవాడే. ఇలా గౌరహరి కథల్లో ఉన్నత జీవన సంస్కార దర్శన ప్రయాస, మనకు సహజకల్పనగా, సమకాలీన ఒడియా సమాజం అంతా కనిపిస్తుంది.

'మేకు' అనే వీరి కథలో 'ఏకు మేకయ్యాడు' అనే సామెతకు అన్వయంలాగా, కన్యాశుల్కంలో మన రామప్పంతులు వలె తోచే కయ్యాలకోరు (లిటిగంట్) నకుల్ నాయక్ పాత్రను చిత్రిస్తాడు. ఈ పాత్ర ఉన్నదానికీ, లేని దానికీ అందరిపై క్రిమినల్ కేసులు బనాయించి, సాక్ష్యాలు పుట్టించి, వారి జీవితాలు అస్తవ్యస్తమయ్యేలా చేసి, అందులో పైశాచికానందాన్ని పొందే పాత్ర. ఊరిజనం మీద ఇలా అన్యాయాలకు, తప్పుడు కేసులకు తండ్రి పాల్పడ్డం చూడలేక, కొడుకు, తండ్రిపై కేసు బనాయిస్తాడు. జాతీయ భద్రతకు కీలకమైన చండిపూర్ ఆయుధ పరీక్ష కేంద్రం డిజైన్లను తండ్రి కేంద్రపారాలోని బంగ్లా దేశీయులకు అమ్మ చూపుతున్నాడని కేసుపెట్టి, సెక్షన్ 120 కింద ఫిర్యాదు చేస్తాడు. దీనితో, నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్న చందాన, ఈసారి పోలీసులు, నకుల్ నాయక్‌పై బెయిల్ కూడా పొందలేని దేశద్రోహ నేరం కింద, అదుపులోకి తీసుకుంటారు. అందరికీ కోర్ట్ కేసుల మేకులు కొట్టే నకుల్ నాయక్‌కి కూడా, అలానే ఒక స్వానుభవం ఎదురుపడటమే ఈ 'మేకు' కథ.

మనకి తెలుగులో, కథలు గురజాడకి ముందర రాసిన వారు ఉత్తరాంధ్రలో కూడా ఉన్నందువల్ల, ఏది మొదటి కథ అనే చర్చ ఉన్నా, ఒడియా సాహిత్యంలో తొలి కథ రాసినది ఫకీర్ మోహన్ సేనాపతి. 1898లో వీరు రాసిన కథ పేరు 'రేబతి'. ఆడపిల్లలు చదువులు చదువుకోవచ్చా అన్నదీ, అలా 'ఇంగ్లీష్ చదువులు చదువుకుంటే అరిష్టం ఇంటికి, ఊరికి' అన్న మూఢ విశ్వాసం, ఆ రోజుల్లో ఉండేది. దీన్నే 1892లోనే తన కన్యాశుల్కం నాటకం రాస్తున్నప్పుడు, ఇదే కళింగాంధ్ర నుంచి, గురజాడ మొదటి అంకంలో కృష్ణరాయపురం సీన్‌లో ఇంగ్లీష్ చదువుల వల్ల అంటువ్యాధులు వస్తాయన్న మాట అగ్నిహోత్రావధాన్లు చేత అనిపిస్తాడు. ('మనకి ఇంగ్లీష్ అచ్చిరాదని పోరిపోరి మొదటే చెప్పాను. మా పెత్తండ్రి దిబ్బావధాన్లు కొడుకుని ఇంగ్లీషు చదువుకి పార్వతీపురం పంపించేప్పటికి వూష్ణం వచ్చి మూడు రోజుల్లో కొట్టివేసింది. బుచ్చబ్బి కొడుక్కి ఇంగ్లీషు చెపిద్దామనుకుంటుండగానే పెద్ద ఖాయిలా పెట్టి చచ్చినంత పనైంది').

ఫకీర్ మోహన్ కథలో 'రేబతి' పదేళ్ళ పిల్ల. చదువుకుంటూ ఉన్నది. ఇంటికి వచ్చి యువకుడైన మాస్టారు పాఠాలు చెప్తూ ఉంటాడు. ఇది ఆ పిల్ల నానమ్మ కి ఇష్టం ఉండదు. తండ్రికి కూతురు చదువు ఇష్టమే. గ్రామస్తులు సరేసరి. 'ఆడపిల్లకు చదువేమిటి, అరిష్ట దాయకం కాకపోతేనూ' అని మాట్లాడుకుంటూ ఉంటారు. ఊరిలో అంటువ్యాధి కలరా వస్తుంది, మొదట తండ్రి, తల్లి చనిపోతారు. తరువాత కొందరు గ్రామస్తులు బలవుతారు. నానమ్మ తన అభిప్రాయం మార్చుకోదు. వ్యాధి వ్యాపించి కొన్నాళ్ళకి మాస్టారు, ఈ బాలిక కూడా మరణిస్తారు. ఇది 1890ల నాటి ఆధునికత కోసం పెనుగులాడుతున్న భారతీయ గ్రామీణ ముఖచిత్రంగా ఫకీర్ మొహన్ శక్తిమంతంగా చెప్తారు. అయితే, ఆ రేబతి కథ అలా ఉండగా, మన గౌరహరి కూడా ఒక రేబతి కథ, అదే పేరుతో రాశారు. వీరి కథలో రేబతి, అట్టడుగు కులాలలు చెందిన పిల్లగా చదువు విషయంలో వివక్షకు, అవమానానికి గురి అయినా, తట్టుకుని నిలబడి, ఆమె, చదువు పూర్తి చేసి, పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ అవుతుంది. తనకు ఆనాడు హాని చేయబోయిన వారే, పెద్ద కులాల వారే, ఒక ప్రమాదం కేసులో ఇరుక్కుని ప్రాణాపాయంలో ఉండగా, వారిని కాపాడి, తనకు చదువు వల్ల కలిగిన వివేకం, విజ్ఞత, వికాసం ఎంతటివో నిరూపణ చేస్తుంది.అదే యువతి పొందుతుంది. ఈమె ఈనాటి రేబతి. కళింగ కథానికలకు ఈ 23వ పురస్కార ప్రదాన సభ, జరగడం కళింగాంధ్రకు గర్వకారణం. ఒక తూర్పు ప్రాంత భాష నుంచే పురస్కారానికి అర్హమైన రచయితకు, ఈ గౌరవం అందచేస్తున్న సంస్థకు తెలుగు సాహిత్య లోకం అభినందనలతో బాటు ఈ పురస్కార ప్రదానం,మరింత బలమైన తెలుగు ఒడియా భాషాసాహిత్య బంధాలకు దారులుతీస్తుందని ఆకాంక్షిస్తూ, తగు బాటలు వేస్తున్న చాగంటి తులసి కృషి, తపన, సాఫల్య తీరాలను చేరాలని ఆశిస్తున్నది.



◆ రామతీర్థ
98492 00385

కథా కణ్వుడు మునిపల్లె

జాతీయ స్థాయి కథ రాయగల తక్కువమంది తెలుగు కథకుల్లో మునిపల్లె రాజు ఒకరు. సైనికోద్యోగి దృష్టి నుంచి, తాను కథ చెప్తున్న రీతిన సాగే "బిచ్చగాళ్ల జెండా" - ఒక కరవు కాలానికి చెందిన చిత్రణ. కణ్వాశ్రమ శకుంతలలుగా సౌమ్యకథా మూర్తులే కాదు రాజుగారి కథలు, అవి భరతమాతలు కూడా - ఇతిహాస త్రయంలో ఎందరో ఋషులున్నా తనను కణ్వుడితో పోల్చుకున్నారు. ఈ కథాపుత్ర పరిష్వంగం కోసం మనకి తన పక్షిగానాలను వదిలి వెళ్లిన కణ్వ సమానుడు మునిపల్లె రాజు. కొందరు మరణించరు. స్వర్గాలను చేరరు. సదా స్మరణంలో ఉంటారు.

1925 - 2018

అక్షరాంజలి

కథలను బిడ్డల వలె పెంచిన కణ్వాశ్రమం ఆయనది. కథలకు రాయబార బాధ్యతలు ఇచ్చి, దుష్ట దుష్యంతుల లోకంలోకి సువార్త ప్రచారకులుగా వాటిని పంపించిన "మునిపల్లె రాజ్యాధికారం" వారిది. వీరి కథలన్నీ ఆశాదూతలు. వీరికి తన పెద్దల యెడ గౌరవం సమకాలికులపైన అపార ప్రేమ, ముందు తరాల వారిపై జననీ జనక ఆప్యాయత, ఇవన్నీ తన కథల రాజ్య వైభవంలో మనకు మిగిల్చి వెళ్లారు మునిపల్లె రాజు. నిండు తొంభై మూడేళ్ల జీవితం. అందులో 1942 డిసెంబర్‌లో, "కథాంజలి" పత్రికలో ప్రచురితమైన తొలి కథ "దరిద్రుడు'తో ఈ 2018 వరకూ కథకుడిగా డెబ్బై అయిదు వీళ్ల జీవితం. తెనాలి సీమ అంటే అమిత ఇష్టం ఆయనకి. రాజుగారి మాటల్లో సంస్కార గంగ, వర్తనలో ఒక సంపన్న భారతీయ చైతన్య ప్రవాహం.

సైన్యంలో ఉద్యోగం వలన, భారతదేశ భిన్న భాషలు, జీవన స్థితిగతులు, సైన్య స్వభావం, చిన్ననాడే ఎరిగిన విశాల భారతదేశ దృఢమైన ఆనవాళ్లు మునిపల్లె రాజు కథల్లో ఉంటాయి. 1934 జూన్‌లో శ్రీశ్రీ రాసిన 'ఆశాదూతలు'లో ఒక కవిత - "మానవ కోటి సామ్రాజ్య దూతలు, కళాయజ్ఞాశ్వముల్ గాలులై, తరగలై, తావులై, పుప్పొళ్ళు, కుంకుమలు, పొగలై సాగిరి" అని ముగుస్తుంది. మానవజాతి రాయబారులు/దూతల "కళా యజ్ఞాశ్వములే" అని శ్రీశ్రీ తెలిపినట్టే, రాజుగారి కథల్లో కూడా మానవ జీవన చిత్రణ గాలులై, తరగలై, తావులై, పుప్పొళ్ళు, కుంకుమలు, పొగలై సాగిన కోలాహలం కనిపిస్తుంది. ఆయనది సనాతన చింతనతో కూడిన ఆధునిక సంవేదన. కథానిక అనే పాశ్చాత్య ప్రక్రియ, అంతకు వేల ఏళ్ల ముందరే సంస్కృతంలో, తెలుగులో, భిన్న భాషలలో చెప్పబడిన కథన మర్యాదలను ఆకళింపు చేసుకున్న ఒక నిండుదనం, మునిపల్లె కథల్లో ప్రస్ఫుటంగా ఉంటుంది.

తాతగారు బక్కరాజు పేరు, తన పేరుగా, జమ్మలమడుగు మాధవరామశర్మ తన బాల్య స్నేహితునిగా, తెనాలి కథకుడు శారద (ఎస్.నటరాజన్) రచనల పట్ల శ్రద్ధా పూర్వక నిష్ఠతో, అభ్యుదయ ఉద్యమాలను ఎరిగిన కాలానికి, రెండు ప్రపంచ యుద్ధాల మధ్య కాలంలో కన్ను తెరవడమేకాదు, తన తొలికథ "దరిద్రుడు" కూడా అప్పుడే 1942లో తన పదిహేడేళ్లకే రాసిన సీనియర్ కథకులు మునిపల్లె రాజు. భారతి వంటి పత్రికల్లో తొలినాళ్ల కథలు అచ్చు అయినా, అరవై, డెబ్బై దశకాల్లో కొంత తక్కువ రాయడం వల్ల, ఎనభయ్యో దశకంలో కథల లోకం బలంగా మునిపల్లె రాజు పేరు తలుస్తూ ఉంటే, కొత్త తరం కథకులు, సాహిత్యానురక్తులు వెరగు చెందారు. కానీ ఒకసారి వారి కథలతో పరిచయం అయ్యాక, ఈయన ప్రాతినిధ్యం వహించే భారతీయ కథ, రక్తమాంస పరిపుష్టమని తెలుసుకుని, ఆసక్తి సహజంగానే పెంచుకోవడం జరిగింది.

సైనిక జీవితాలు, దేశ స్వాతంత్ర్యోద్యమం, రాయలసీమ కరవు కడగండ్ల చిత్రణ, దిగువ మధ్య తరగతి కుటుంబాల్లో మహిళల జీవన సమస్యలు, ఇలా రాజుగారి కథల్లో ఒక స్వప్నం, ఒక సత్యం, ఒక ఆందోళన, ఒక ఆకాంక్ష కలిసి ప్రవహిస్తూ ఉంటాయి. తన కాలానికి విస్తృతంగా వస్తున్న ప్రపంచ సాహిత్యం కూడా రాజుగారు యువకుడిగా బాగా చదివిన దాఖలాలు, వీరి కథా సంపుటికి "పుష్పాలు - ప్రేమికులు - పశువులు" అని పేరు పెట్టడంలో కనిపిస్తుంది. ఇదే ప్రశ్న వారిని ఒకసారి నేను, జగద్ధాత్రిగారు అడగగా, వారు, ఈ పరిశీలన సరైనదే అంటూ ఆ పేరు తాను ఎలా పెట్టానో చెప్పారు. ఆ రోజుల్లో వచ్చే "ద క్రైటీరియన్" పత్రికలో ప్రముఖ కథా నవలా రచయిత డి.హెచ్.లారెన్స్ కవితలు కూడా రాశారని చదివి, ఆ పేరులోని కొత్తదనం తన మనసులో ఉన్నదని తెలిపారు. 1923లో వెలువడిన ఈ కవిత్వ సంపుటి పేరు "బర్డ్స్, బీస్ట్స్ అండ్ ఫ్లవర్స్" అని లారెన్స్ పెట్టడం తనను ఆకర్షించిందంటూ, తాను ఆ పేరులో కొంత మార్పుతో ఒక కథ "పుష్పాలు - ప్రేమికులు - పశువులు" రాయడమే కాకుండా, తన కథల సంపుటికి కూడా అదే పేరు పెట్టాను అని చెప్పారు. ఇలా చురుగ్గా తన కథలను పట్టించుకుని ప్రశ్నలు అడిగినందుకు మెచ్చుకున్నారు కూడా.

జాతీయ స్థాయి కథ రాయగల తక్కువమంది తెలుగు కథకుల్లో మునిపల్లె రాజు ఒకరు. సైనికోద్యోగి దృష్టి నుంచి, తాను కథ చెప్తున్న రీతిన సాగే "బిచ్చగాళ్ల జెండా" - ఒక కరవు కాలానికి చెందిన చిత్రణ, కథా స్థలం పూనా. అక్కడకు చేరే కరవు బాధిత ప్రజల, బిచ్చగాళ్ల సాధికారమైన కథానిక ఇది. కరవు కాలపు భారతదేశం ఎలా ఉంటుందో, వారి దినదిన జీవన సంఘర్షణ క్లుప్తంగా, గుండెకోత కోసే రీతిలో చెప్పిన రచనలో అణచివేతదారుల తరపున ఉండే భద్రతా దళాల వారి జులుం తాళలేక, తిండి గింజలకు, తమకు మధ్య అడ్డుగోడగా ఉన్నా ఒక భద్రతా సిబ్బందిని ఉతికి ఆవలకు నెట్టి, వాడి గాయాల నెత్తుటితో తడిచిన గుడ్డను కర్రకు జెండా చుట్టి, బిచ్చగాళ్లు ఒక జెండా ఎగురేస్తారు. ఆ జెండా పట్టుకుని, తమకు కావలసిన బియ్యం నల్లబజారులో నిలవ ఉంచిన గుజరాతీ సేఠ్ భోగాలాల్ గిడ్డంగి నుంచి తమ వశం చేసుకుంటారు. ఈ కథలో ప్రేమ్‌చంద్ చూపే వాస్తవికత, మాంటో కథల్లో దాగిన పదునూ కలబోతగా ఉంటాయి. ఇలా నడుస్తుంది చిత్రణ 'హైదరాబాద్ స్టేట్ భారత విలీన కాలపు రచన' అయిన ఈ కథలో.

"వెలిసిపోయి, మురికి బారిన రంగు రంగుల పాత తుంపుల గుడ్డలతో మా ఇంటి ముందు బిచ్చగాళ్ల డేరాల శిబిరం వెలిసింది. వికలాంగులు, వృద్ధులు, రజాకార్ నరకాన్నుంచి తప్పించుకు వచ్చిన శరణార్థులు, క్షామపీడితులు, ఈ డేరా కాంపులోని పౌరులు. దక్షిణాది భాషలన్నీ అన్ని బాధలనూ, అన్ని ఆశలను, అన్ని నిరాశలనూ భరించి నిశ్శబ్దతనిచ్చే కాళరాత్రుల్లో ఈ నగరంలో, ఈ తమస్సులో కలగాపులగంగా సజీవంగా వినపడుతుంటే. సృష్టి, ప్రకృతీ, లోకమూ, మానవులూ, తిరిగి ప్రాణం పొందే ఉషాకాంతుల్లోనే ఈ అనాథ నగరం నిర్జీవమై పోతుంది. ఈ దృశ్యాలకు నేను బాగా అలవాటు పడిపోయాను. యుద్ధంలో ప్రతి క్షణమూ, ప్రతి వస్తువులో, ప్రాణిలో, జీవిలో ఆత్మలో, మృత్యువూ, అపనమ్మకమూ దర్శించిన నాకు, ఈ బిచ్చగాళ్ల సన్నిధి ఏమంత కష్టమనిపిస్తుంది?"

"వీరకుంకుమ" కథలో, తమ యజమానికి జరిగిన అన్యాయానికి, పాడి పశువు తెగబడి, గాయపడ్డ యజమాని దేహాన్ని తిరిగి ఇంటికి చేరుస్తుంది. పశువులో కనిపించే ఈ నైసర్గిక జ్ఞానం కథే, మరింత విస్తృతించి పశువు పగ తీర్చుకునే కథగా తరువాతి తెలుగు రచయితలు రాశారు కూడా. కరవు కుటుంబాలను అల్లకల్లోలం చేసినప్పుడు, తన శరీరంతో ధనం సంపాయించి భర్త, బిడ్డల ఆకలి తీర్చే ఒక కుటుంబిని గురించి రాజుగారి చిత్రణ, హృదయ విదారకమే కాక, ఆ భర్త చూపే కృతజ్ఞత కూడా, కథను వింధ్య పర్వత శ్రేణి దాటించి, మంచుకొండల ఎత్తుకు తీసుకువెళ్తుంది.

"జర్నలిజంలో సృజన రాగాలు" వంటి పుస్తకం, బహుశా, తన జ్ఞాపకాల ధారగా, ఇటీవల దశాబ్దాల్లో ఇలా వెలువరించిన తెలుగు రచయిత లేరు. విశాఖ కవయిత్రి, రాజుగారికి ఇష్టురాలు కీ.శే. ఆదూరి సత్యవతీదేవితో మొదలుపెట్టి, తనకు ప్రాణప్రదమైన వారిని, నచ్చిన రచనల ధోరణులను స్మృతిపథం నుంచి, సృజనరాగంగా మలిచి, మునిపల్లె రాజుగారి వలె రాసిన వారు లేరనే చెప్పవచ్చు. ఎందరి గూర్చో జ్ఞాపకాలు, తనకు నచ్చిన విశేషాలూ నమోదు చేసిన ఈ రచన గురించి చెప్తూ, "మీ గురించి రాశాను రామతీర్థ గారూ" అంటూ చెప్పిన సమ్మోహన శైశవ శిఖరం రాజుగారు. జగద్ధాత్రి కవిత్వ సంపుటి "సహచరణం"కు తన ముందు మాటలో, మొదటి వాక్యంగా రాజుగారు ఎంతో ప్రేమాభిమానాలతో కవిత్వ పరీక్ష చేసి చెప్పారిలా- "సహచరణం, జగద్ధాత్రి వేద యుగం నాటి గంభీర శబ్ద ద్వయం వినిపిస్తున్నది ఈ కవితా సంపుటిని స్పర్శించినంతనే"

వారి విచికిత్సలో భారతీయ గవేషణ ఒక స్పష్ట మూర్తిమత్వంతో నిలబడి ఉంటుంది. "అస్తిత్వ నదం ఆవలి తీరాన" అనే కథల్లో మేజికల్ రియలిజం ఉందని రాజుగారు అన్నారు. అది భారతీయ చింతనలో, ఆధునిక కాలంలో, మేళవిస్తే, ఎటువంటి కథలు వస్తాయో, ఆ కథలను కేవలం ఒక భాషీయులో, ప్రాంతీయులో కాక భారతీయత మూర్తీభవించిన వారే ఎలా రాయగలరో, మంచి ఉదాహరణ, అదే పేరిట ఉన్న కథానిక.

ఈ కథలో, "నేను ఎవరిని?" అనే ప్రశ్న ఎలా భారతీయ జ్ఞాన స్రోతస్వినిలో, మరల మరల లేచే ఒక అల వంటిదో, అది బహుళ సంస్కృతీభరితమైన భిన్న మతాల దర్శనంలోంచి ఆవిష్కరించే మునిపల్లె రాజు, మరొక మహిమాన్విత వచనం రాసిన జ్ఞాని కుర్రతులైన్ హైదర్ రచన "అగ్నిధార" (ఆగ్ కి దరియా)లో కనిపించే విచికిత్సకు ఒక సూక్ష్మ రూపం ఇస్తారు. రాజుగారు ఇవాళ అస్తిత్వ నదాన్ని దాటి ఆవలి తీరాన నిల్చున్నారు. కణ్వస ప్రచురణలు అని వారి పుస్తకాలు ప్రచురించేవారు. కథానికల మెరుగు, మెరుపు, నాణ్యత, బహుళార్థ సాధిక ప్రయోజనశీలత ఎలా వారి కథల్లో భాసిస్తున్నదో విపుల పరిశీలనకు ముందు ముందు సందర్భాలు వస్తాయి. కానీ ఈ కథలో వారి వచనం మళ్లా- ఒక కాస్మోపాలిటన్, విద్యా విజ్ఞాన విస్తృతితో భారత ఉపఖండ ప్రమాణాలతో విలసిల్లుతుంది - ఇలా-

"ఇంకేదో వాక్యం వినిపిస్తున్నది. ఈ అవధూతలు, అద్వైతులు, కమండల ధారులు, కౌపీన మాత్రులు, అర్ధనగ్నులు, విభూతి భస్మీ కాంతులు, ఊర్ధ్వపుండ్ర భూషితులు, భౌతిక విసర్జితులు, నిస్సంగులు, నిరాడంబరులు, ఈ నిరంతర పథకుల మధ్య తనకేమైనా అర్హత ఉన్నదా? వీరినే చారిత్రక పవనాలూ అంటావు కాబోలు, వీరి పరమ గమ్యంలో ఏ మలినమైన గత జీవిత పశ్చాత్తాపాల పంకిల వాయు పవనాలు అడ్డురావు కాబోలు. ఏ సంవేదనల ఊబినీ ఈ జ్ఞాన ధనులు తొక్కరు కాబోలు". వేలాది జీవన విశ్వాసాల విశ్వేశ్వర అవగాహన స్పష్టపరచుకోవడంలో ఈ అస్తిత్వ నాదం ఏమిటో తెలుసుకుందామని చేసే నిరంతర ప్రయత్నం. ఈ కథలో వేద ఘోష, కబీర్ పంత్, వీరబ్రహ్మంగారి కాలజ్ఞానం, నిరంకారీ ఎరుక, జైన దర్శన ఫలాలు, షిర్డీ బైరాగులు, గురుదత్త శిష్య పరంపర, గోసాయిలు, మృణ్మయమ్ నుంచి చిన్మయమ్ దాకా మానవ అస్తిత్వ నద ప్రయాణ ప్రవాహ ప్రయాస - ఆవలి తీరం కోసం - ఇటువంటి కథలకి మునిపల్లె రాజుగారు పెట్టిన పేరు - ఐంద్రజాలిక వాస్తవికతా ధోరణి కథలని.

కణ్వాశ్రమ శకుంతలలుగా సౌమ్యకథా మూర్తులే కాదు రాజుగారి కథలు, అవి భరతమాతలు కూడా - ఇతిహాస త్రయంలో ఎందరో ఋషులున్నా తనను కణ్వుడితో పోల్చుకున్నారు ఈ మునిపల్లె రాజు. మునిపల్లె అనేమాటను, నన్నయభట్టు తన ఆదిపర్వం, చతుర్థ అశ్వాసం యాభై నాలుగో పద్యంలో వాడారు. మునిపల్లె రాజు కథలు, భరత పుత్రుల వంటివి - మనకి ఏ కాలంలోనైనా అవి బిడ్డల వంటివి- తీరైన కొడుకుల వలె అవి బాధ్యతాభరితాలు. వాటిని ఆలింగనం చేసుకుంటే ఏ ప్రభావం కలుగుతుందో, అది అతి ప్రాచీనం. శకుంతల ముఖతా, దుష్ట దుష్యంతుడితో ఆయన చెప్పించిన ఒక పద్యంలో, కొడుకుని దగ్గరకు తీసుకున్నప్పుడు కలిగే హాయి, చల్లదనాన్ని ఇంకేవీ అంటే "ముత్యాల హారాలు, పచ్చకర్పూరపు దట్టమైన పొడి ప్రసారం, మంచి గంధమూ, వెన్నెలయూ, జీవులకు పుత్రుని కౌగిలి వలె మనసుకు సుఖాన్నీ, మంచి చల్లదనాన్ని కలిగించలేవు". రాజుగారి ఆస్తి, మన సంపద అయిన బిడ్డల వంటి కథలను చేరదీయడం అంటే ఇదే.

ఈ కథాపుత్ర పరిష్వంగం కోసం మనకి తన పక్షిగానాలను వదిలి వెళ్లిన కణ్వ సమానుడు మునిపల్లె రాజు. కొందరు మరణించరు. స్వర్గాలను చేరరు. సదా స్మరణంలో ఉంటారు. (ఇదే మాట సరిగా పలకలేక ఉత్తర భారతంలో "స్మిమస్" అంటూ ఉంటారు). మునిపల్లె రాజు అలా స్వయంప్రకాశంగా వెలిసే సృజన చింతామణి. వారు ఇక్కడ వెలుగుతూనే, మరెక్కడో కూడా వెలుగులను పంచేందుకు వెళ్లారు. వారి విహంగ యాత్రలో, మానవుడి హృదయమే వారికి ఇష్టమైన గూడు, మునిపల్లెలు, మునివాకిళ్లు, ముగ్ధ మందారాలు, సమ్మోహన శకుంతలలు, దిటమైన భరత పుత్ర పౌత్ర సంతతి, ఒక భరత దేశం, వారి విహార భూమి. ఆవలి తీరాన కూడా అస్తిత్వ యాత్ర విస్తరించి సలిపే రాజరికం ఆయనది. మృగయా వినోదం వలె రాజుగారు ఖగయా వినోదానికి బయలుదేరారు. ఎక్కడికి వెళ్లినా వారందించిన కథల చిటికెన వేలు ఇక్కడే ఉన్నది ఆ వేలు పట్టుకుని మనమూ మన స్థూల సూక్ష్మ యాత్రలు చేసేందుకు, మృణ్మయ యాత్ర ఇంతసేపూ చేశారు మీరు- ఇప్పుడిక చిన్మయ యాత్ర- రాజుగారూ! ఆవలి తీరపు సంతులెపుడు చెప్తారు?

- రామతీర్థ, 98492 00385

ప్రపంచం

అలవిమాలిన ప్రైవేటీకరణ పేరిట అక్కడి అధ్యక్షుడు జాకబ్ జుమా, భారతీయ సంతతికి చెంది, 1993 నుంచీ ఆ దేశ పౌరసత్వం గల గుప్తా సోదరత్రయంతో కలిసి చేసిన ఆర్థిక అక్రమాల చిట్టా పెరిగిపోతూ ఉండడంతో, సమాజ బాధ్యత గల మేధావులు, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న పబ్లిక్ ప్రొటెక్టర్, ఒక మహిళ తులి మెదన్ సేలా, అలాగే ఈ అవినీతి ప్రభుత్వంపై వందలాది కార్టూన్లు వేసిన ఆ దేశ కార్టూనిస్ట్‌గా అంతర్జాతీయ ఖ్యాతి గల జాపిరో, వీరి ప్రయాస మేరకు, దేశంలో ప్రకంపనలు మొదలై, చివరికి ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ కలగచేసుకుని ఆయ్యగారిని పదవి నించి కిందకి దింపింది .

మన దేశపు బాంక్ బాంక్ ఆఫ్ బరోడా జోహాన్నెస్బర్గ్ శాఖ అనుమానాస్పద పాత్ర పోషించిన ఈ పీడకల, అవధుల్లేని కాపిటలిజపు వెర్రి పోకడలకు, ప్రజలచ్చే తీర్పు మారింది. అయితే, మేధావులు, పత్రికల జగవద్గీతలైన కార్టూన్ల ద్వారా ప్రకంపనలు పుట్టించే సమాజంగా ఇంకా దక్షిణాఫ్రికా సమాజం పచ్చిగా, వెచ్చగా ఉంది. మన దేశంలో కూడా ఇటువంటి అన్యాయాలే జరుగుతున్నాయి. దేశ మేధావి వర్గం తగు స్పందనలు ఈ దేశంలో బాకీ పడుతున్నారు. అప్పుడు ఈ మహిళా అధికారి, ఆ కార్టూనిస్ట్ వంటి వారి సామాజిక పాత్ర మన దేశంలోనూ ఇంకా ఎంతలా పెరగలా అన్న ప్రశ్నతో. ఇటీవలి ఆ దేశ దురవస్థలో కూడా ఆశ చూసిన ప్రజాస్వరాలు రెండు కింద పొందుపరుస్తున్నాను. ఇవి పెన్ ఆఫ్రికా సంస్థ అడిగి మరీ ఎంపిక చేసిన కవితలు. పెన్ ఆఫ్రికా మోటో 'రాయి ఆఫ్రికా రాయి'.



పోరుహోరులో దక్షిణాఫ్రికా కవిత్వం

మనమూ అంటున్నాము మన దేశంలో స్మార్ట్ ఫోన్ కంపెనీల ఊపిరి సలపనివ్వని పకటనల్లో 'మాట్లాడు ఇండియా మాట్లాడు' అని! సరైన మాటలు తిండి, బట్టా, గూడూ వీటి కోసం తప్ప అన్నీ మాట్లాడుతున్న మన దేశంలో, ఒకప్పటి గాంధీ మెట్టిన దేశంలో వచ్చిన పౌర ప్రతిఘటన వల్ల రెండు వారాల కిందట జాకబ్ జుమా పదవి దిగిపోయాడు. గుప్తాల వ్యాపారం పలు ప్రశ్నలను ఎదుర్కొంటోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా జోహాన్నెస్బర్గ్ శాఖ మూసి వేశారు. ఇద్దరు గుప్తా సోదరులు, జుమా కొడుకు, ప్రస్తుతం ఆర్థిక నేరస్తులుగా పరారీలో ఉన్నారు. ఈ కథ పది లక్షల కోట్లు నిరర్థక అప్పులు సంపన్న వర్గాలకు ఇచ్చి ఏం చేయాలో తెలీని దశలో ఉన్న మన బ్యాంకులు, ప్రభుత్వాలు వీటికి కూడా వర్తిస్తుందేమో ఆలోచిద్దామా- ఆ ఆలోచనకి దారి తీసేవే ఈ రెండు కవితలు.

ఆశ ఒక ప్రార్థన

బరువుగా నింగిలో నల్లబారిన సూరీడు
రోదిస్తున్నాడు విషాద కిరణాలతో రెక్కలు విరిగిన పక్షి
ఎగిరే ప్రయాసలో యాతన గమనిస్తూ
ఒక దాని తర్వాత ఒకటిగా సత్యాలు రంగు వెలిసిపోతున్నాయి
వాగ్దాన స్వర్గాలన్నీ పవిత్ర పుటల నించి రాలిపోతున్నాయి
మన జాతీయ సంకల్పాలన్నీ
ప్రోటీ తేనె పూల పొదల మంచులో విదళిస్తూ, గోధుమ కంకుల్లా
పురుగుపట్టి నష్టపోతూ
విషపు గాలుల్లో ఉక్కిరి బిక్కిరవుతున్నది
ఆలోచనల ఘన స్వరాలను మనం అనుసరిస్తున్నాము కానీ
ఏనుగు దంతాల వంటి మన వారసత్వ ఘనత వేటాడబడుతున్నది
ఐక్యత వంకరలు పోయిన బంగరు కవచంలా మిగిలింది
స్వేచ్ఛా విహంగం రెక్కలు ఈకలు రాలిపోతూ ఉన్మాదాలకు గురవుతోంది
అయినా ఆశా దేవతలను మనం ప్రార్థిస్తూనే ఉన్నాము
'ఇవాళ మేం కోల్పోయిన ఆశలను రేపు మాకు ప్రసాదించు."

జోరుగా సైకిల్ ....

ఒక రంగు వెలిసిన నడకలో ఉన్నట్టుండి ఆగి పోయాను
మంచు రేకులు కట్టెదుట ఉన్నదాన్ని కమ్మేస్తూంటే
ఎదుట ఉందొక డొక్కు సైకిల్, నెత్తురోడుతూ
నల్లని దీప స్తంభానికి గొలుసుతో కట్టబడి
దాని ఎముకల్లాంటి పార్టులింకా తుప్పు పట్టలేదు
కానీ అది త్వరలోనే జరుగుతుంది
దాని భారీ శరీరం ఏ తొడుగులూ లేక దిశమొలగా ఉంది
రాబందులు పీక్కు తిన్న మాంస అవశేషాలు
హైనాల గుంపు ఖరాబు చేసిన ప్లాస్టిక్ సీటూ
చక్రాలూ, ఊత ఊచలూ పూర్తిగా బయటనే
రబ్బర్ టైర్లా ఒకప్పుడు దేవతల ఊపిరితో నిండుగా ఉండేవి
చక్రాలు జోరుగా పరుగులు పెట్టేవి ఫుల్ జోష్‌లో
ఇప్పుడవి ఆరగింపులకు బలై, అదృశ్యమై పోయాయి
ఎప్పటికీ, ఎప్పటికీ, ఇంకెప్పటికీ
పునరావృతం కాకూడని దశలో మనం
'మండేలా మనల్ని మధ్య పెట్టాడా?
ఇక్కడున్నాము మనం ఒకరికి అన్నీ అమిరి,
మరొకరు దిక్కులను కప్పుకుని ఇతరులచే అణచివేతకు గురవుతూ
తల్లుల కన్నీళ్లతో చెరువులన్నీ ఉప్పనవుతున్నాయి
మనం సాధిస్తాం.. మనం సాధిస్తాం...
మనమీ స్వేచ్ఛల ఢంకా మోగించ సమర్థులమే కానీ కావాలిప్పుడు
డప్పు చప్పుళ్లా కొట్టుకులాడే గుండె ఒకటి -
ఇది కావాలి మళ్ళా మన కొత్త 1994 -
సైకిల్ పెడళ్లూ, వేగం పెంచే అదనపు ఫ్లై వీల్, చైనూ, ఇంకా తొక్కే ఆశా -
ఈ డొక్కు సైకిల్ కు అమర్చాలి ఉన్నతంగా ఉండే ఒక సీటు
మన వేడి ఊపిర్లు నిండి నిండుగా ఉన్న టైర్లా
ఎముకల్లా పార్టులు దేలిన సైకిల్ కు
మరమ్మత్తులు చేసే మాంస కండరాల దట్టింపు
మన కలలకు మరమ్మతులు,
పైన పడే హైనాల గుంపులను పారదోలడానికి
అన్ని గుండెల చప్పుళ్ల చురుకుదనం పెంచడానికి
ఎప్పటికీ, ఎప్పటికీ, ఇకెప్పటికీ ఈ దశ
పునరావృతం కాకూడదన్నదే మన జన రణఘోష
వీధి స్తంభపు కట్టడి నుంచి సైకిల్‌ను విడుదల చేసి
ఎప్పటికీ అస్తమించని సూర్య పరంపరను
సైకిల్ సీటు పై కూచోబెట్టుకు
ముందుకు ముమ్ముందుకు తొక్కుకుంటూ వెళ్లడానికి
అయితే ఈసారి మాత్రం అమాండ్లా
ప్రజలకే అధికారం అంటూ
అందరమూ కలిసి గట్టిగా పెడల్ తొక్కాలి!

మూల రచన : అతోల్ విలియమ్స్
వ్యాఖ్యానం, అనువాదం : రామతీర్థ
98492 00385



తిరుమల సమాచారం

వసతి గదులు: రూ.500 : జూన్ 10 నుంచి 30 వరకు ఉన్నాయి.
రూ.100 : జూన్ 10 నుంచి 30 వరకు ఉన్నాయి.
శ్రీనివాసమ్ : జూన్ 10 నుంచి 30 వరకు ఉన్నాయి.
రూ.300 దర్శనం : ఏప్రిల్1 నుంచి 30 వరకు ఉన్నాయి
ఆర్జిత సేవలు : మే 23న ఉన్నాయి.
టీటీడీ కల్యాణ మండపం : మార్చి 25, 26, 27, 29, 31 తేదీల్లో ఖాళీ ఉంది.

-ఎంవీపీకాలనీ

సిటీ వెదర్ ఉష్ణోగ్రత

	గరిష్ఠం	కనిష్ఠం
వాల్తేరు	32.1	26.6
విమానాశ్రయం	35.4	25.8

శనివారం ఆకాశం నిర్మలంగా ఉంటుందని విశాఖ తుఫాన్ హెచ్చరికల కేంద్రం తెలిపింది. వాల్తేర్‌లో గాలిలో తేమ శుక్రవారం ఉదయం 7.30కు వాల్తేరులో 77, ఎయిర్‌పోర్టులో 76, సాయంత్రం ఐదు గంటలకు వాల్తేర్‌లో 82, ఎయిర్ పోర్టులో 75 శాతంగా నమోదైంది.

105వ జయంతి సందర్భంగా శ్రీశ్రీకి నివాళులు అర్పిస్తున్న సంస్థ ప్రతినిధులు రామతీర్థ, జగద్ధాత్రి, ఎల్ఆర్ స్వామి తదితరులు

'విశ్వశ్రేయః కావ్యం...' అన్న నన్నయ్య మాటలకు పరమార్థం చేకూరేలా 'మొజాయిక్ సాహిత్య సంస్థ' పదిహేనేళ్లుగా సాహితీ సేవలు అందిస్తున్నది. సాహిత్యం ద్వారా సాంస్కృతిక నిర్మాణం జరిగేలా నిరంతరాయంగా వివిధ కార్యక్రమాల ద్వారా పాటుపడుతున్నది. సమాజ ప్రగతిపై నిరంతరం చర్చిస్తూ భవిష్య కార్యాచరణను రూపొందిస్తూ భావితరాలకు సాహిత్యాన్ని చేరువ చేస్తున్నది. 24, 25 తేదీల్లో 15వ వార్షికోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ప్రత్యేక కథనం..

'మొజాయిక్' సంస్థ ప్రతినిధులు

సమాజ శ్రేయస్సుకు సాహితీ సేవ

- సాహితీ పరిమళాలు వెదజల్లుతున్న మొజాయిక్ సాహిత్య సంస్థ
- ఆంగ్ల, మళయాళ భాషల్లోకి పలు తెలుగు రచనల అనువాదం
- ప్రత్యేక కార్యక్రమాలతో యువతకు దిశానిర్దేశం
- నేటి నుంచి రెండు రోజుల పాటు సంస్థ 15వ వార్షికోత్సవం

విశాఖపట్నం, మార్చి 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ ప్రధాన కేంద్రంగా నిత్యం సాహితీ రంగంలో ప్రధానంగా పేరు వినిపించే సంస్థ మొజాయిక్. కవులు, రచయితల జయంతులు, వర్ధంతులు, ప్రఖ్యాత కావ్యాల, రచనల ఉత్సవాలు జరపడంలో ముందుంటున్నది. ప్రపంచ సాహిత్య పరిచయ సభలు, విశ్లేషణలు, విమర్శలు, సాహిత్య పరంగా ప్రముఖులకు తగిన సత్కారాలు నిర్వహిస్తూ ఉత్తరాంధ్రలో చురుకైన పాత్ర పోషిస్తోంది. పత్రికల్లో తెలుగు, ఆంగ్ల భాషల్లో సాహిత్య, సాంస్కృతిక, సామాజిక వ్యాసాలు వందల సంఖ్యలో వెలువరించిన ఘనత కూడా ఈ సంస్థకు దక్కుతుంది.

వివిధ విశ్వవిద్యాలయాల్లో, అనేక రాష్ట్రాల్లో పలు సాహిత్య వేదికలపై పాల్గొన్న అనుభవం ఉన్న రచయితలంతా మొజాయిక్‌లో సభ్యులుగా ఉండడంతో వారు చేపట్టే ప్రతి కార్యక్రమంలోనూ సాహిత్య గుబాళింపు సమాజానికి స్వాగతం పలుకుతూ ఉంటుంది. ఈ సంస్థలోని రచయితలు ప్రాంతీయ, జాతీయ పురస్కారాలు దక్కించుకున్నారు. గత మూడేళ్లుగా ఒకే వేదికపై అక్షర గోదావరి పేరిట కవి, కథకుడు, విమర్శకుడు ఇలా ముగ్గురినీ గౌరవిస్తూ వస్తోంది. అందుకు స్థానిక సాహిత్య వేదికలు సాహిత్య సురభి, రుత్విక్ ఫౌండేషన్ సహకారం అందిస్తున్నాయి.

తెలుగు సాహిత్యాన్ని విస్తృతం చేస్తూ...

తెలుగు సాహిత్యాన్ని విస్తృతం చేయడంతో పాటు మలయాళం, ఆంగ్లంలోకి అనువాదం చేయడంలో మొజాయిక్ తనదైన పాత్ర పోషిస్తోంది. ప్రముఖ మలయాళ రచయితలు అక్కితమ్ అచ్యుతన్ నంబూద్రి, కె.సచ్చిదానంద, సేతు, కేపీ రామన్ ఉన్ని, కమలాదాస్ తదితరులు ఉండగా, గురజాడ, శ్రీశ్రీ, చాసో, రావిశాస్త్రి కేతు విశ్వనాథరెడ్డి, కె.శివారెడ్డి, డా.ఎన్.గోపి, దేవీప్రియ, పాపినేని శివశంకర్... ఇలా వందకు పైగా తెలుగు రచయితల రచనలను ప్రధానంగా ఆంగ్లభాష, ఇతర భాషల్లోకి మొజాయిక్ బృందం అనువాదం చేస్తోంది.

ఘన చరిత ఉన్న సభ్యులు..

మొజాయిక్ సంస్థ సాహిత్య రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు వారు చేస్తున్న కార్యక్రమాలతో పాటు అందులోని సభ్యులు కీలకంగా చెప్పవచ్చు. ఆ రంగంలో విశేష అనుభవం వారి సొంతం. అధ్యక్షుడు ఎల్.ఆర్.స్వామి ముప్పైకి పైగా పుస్తక ప్రచురణలు చేశారు. ఉపాధ్యక్షుడు రామతీర్థ పదికి పైగా రచనలు, భావ ప్రయాగ పేరం జయశీలరావు, సహచరణం జగద్ధాత్రి, గరిమెళ్ల నాగేశ్వరరావు, డా.మాటూరి శ్రీనివాస్, పేరి రవికుమార్ తదితరులు సాహిత్య సేద్యం చేస్తున్నారు. రచయితలు, కవులు, అనువాదకులు, విమర్శకులు, వక్తలు, సాహిత్య శాస్త్ర పరిజ్ఞానులు కలయికగా ఈ సంస్థ పనిచేయడం ప్రత్యేకం.

వార్షికోత్సవం సందర్భంగా...

సమాజం నుంచి తమకు లభించిన గుర్తింపు, గౌరవం, సాహిత్య ప్రతిష్ఠ, సాహిత్య రంగ ప్రముఖులకు తిరిగి అందజేసే లక్ష్యంతో సాహిత్య పురస్కారాన్ని ఏర్పాటు చేసి తొలిసారిగా అందిస్తోంది. సమకాలీన జీవితానికి సాహిత్య రూపం ఇచ్చే నిపుణుడు సయ్యద్ సలీంకు అవార్డును అందజేయనున్నారు. పౌర గ్రంథాలయంలో 24న జరగనున్న ఈ కార్యక్రమానికి ప్రభుత్వ కమ్యూనికేషన్స్ సలహాదారు పరకాల ప్రభాకర్, ఏయూ వీసీ జి.నాగేశ్వరరావుతో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ సంస్థ సాహితీ కార్యక్రమాలు అంటే నగరవాసులు ఎంతో ఆసక్తి చూపుతుంటారు.

కన్యాశుల్కం 125 జాతీయోత్సవాలు..

ఆధునిక తెలుగు సాహిత్య ఆవిర్భావ క్షేత్రంగా గురజాడకు ఆయన సాహిత్యానికి సంబంధించి ఎన్నో సందర్భాలను 'మొజాయిక్' సమాజం ముందుంచింది. గురజాడ 150, కన్యాశుల్కం 125 జాతీయోత్సవాలు, దేశంలో తొలిసారిగా జనగణమన నూరేళ్ల పండుగ, శ్రీశ్రీ శతజయంతి, రావిశాస్త్రి ఇరవయ్యో వర్ధంతి, కారా 90, షేక్స్పియర్ 450, దిగంబర కవిత్వ అర్ధ శతాబ్ది వంటి కార్యక్రమాలను ఎంతో ఘనంగా నిర్వహించింది. అలాగే.. వాల్మీకీ, వ్యాసప్రణీత మహా కావ్యాల పరిశీలనాత్మక ప్రసంగాలు, 'తెనుగు త్రిజట' పేరిట పలు తెలుగు రామాయణాల్లోని త్రిజట పాత్ర గురించి తొలి తులనాత్మక ప్రసంగం చేసిన ఘనతను దక్కించుకుంది. ఆరుద్ర 'త్వమేవాహం' కవిత్వానికి పవర్‌పాయింట్ ప్రజంటేషన్, చాసో సాహిత్య కృషిపై, శ్రీశ్రీ 'కవితా ఓ కవితా..'పై, చలం సుధ కవిత్వంపై, ఆర్కే లక్ష్మణ్ కార్టూన్లపై, హిరోషిమా-నాగసాకి ఆటంబాంబు దాడికి వ్యతిరేక చిత్ర ప్రదర్శనలు ఏర్పాటు చేసింది. ఎందరో ప్రపంచ రచయితల రచనలను ఎరుక పరుస్తూ సమాచార సాంకేతిక యుగం అందిస్తున్న డిజిటల్ టెక్నాలజీ సాయంతో సభలు నిర్వహించే సంస్థగా మొజాయిక్‌కు గుర్తింపు ఉంది. రేడియో, టీవీ చానెళ్లలో కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

Regd.No:1533/2003
మొజాయిక్ సాహిత్య సంస్థ

ప్ర'పంచ తంత్ర' కథా నిపుణులు

పర పీడనం మానేస్తే పుణ్యం వస్తుందనేది పెద్దల మాట. సమాజ జీవనంలో రుజువర్తనం అధిక సంఖ్యాకుల జీవన రీతి. కొందరు కథా నైపుణ్యాత్ములు, ప్రపంచ ప్రజలకు జంతువుల మీద కీటకాల మీద పెట్టి నడవడిక కథలు చెప్పారు. వారిలో ఆద్యుడు విష్ణుశర్మ మాస్టారు. పంచతంత్రం జంతువుల పాత్రలకు మానవ స్వభావాలు అంటగట్టి, మొద్దులైన రాజకుమారులకు, కొద్దినెలల్లో లోక వ్యవహారం, పాలనా వివేకం కలిగించేందుకు, అప్పటికే వయసు ముదిరిన రాచ కుమారులూ, రేపటి రాజులూ అయిన వారికి విష్ణుశర్మ వేల ఏళ్లకిందట నేర్పిన అనియత విద్యాపద్ధతి బోధన. ఇది విజయం సాధించింది. అలాగే సాహిత్యం అనియత విద్య. కథానైపుణ్యాలు ప్రతి కాలంలో, మౌఖికంగా సంచార గాయక బృందాలనుంచి మొదలై, వాల్మీకి శాసనంగా 'కంఠేచ గేయేచ పాఠ్యేచ మధురం'గా నిలుస్తాయి. ఇరవయ్యో శతాబ్దంలో అలాంటి ఆధునిక కథా నైపుణ్యాత్ములు రావిశాస్త్రి, కొలకలూరి ఇనాక్.

విశాఖలో శాస్త్రిగారి సోదరులు రాచకొండ నరసింహాశర్మగారు, కుమారులు, కుటుంబ సభ్యులు, కొందరు రచయితలు కలిసి ఏర్పాటు చేసిన రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ నిర్వహిస్తున్న రావిశాస్త్రి అవార్డ్, 2018 సంవత్సరానికి కొలకలూరి ఇనాక్‌గారికి జూలై 30న, రావిశాస్త్రిగారి 97వ జయంతి వత్సర సందర్భంలో ప్రదానం చేస్తున్నారు. ఆ నేపథ్యంలో వీరిరువురూ నిర్వహించిన కథా నైపుణ్యాలపై కొంత కాంతి ప్రసారం, ఈ కథానుశీలనం.

ప్రతి కథా నీతి కథే- జీవన నీతి, రీతి కథ, ఒక సమాజాన్ని, అందులో జీవితాన్ని, అక్కడి ప్రజల ఎరుకని, వారి ముందున్న ఎంపికలను పరిచయం చేస్తుంది. ఉపాయం మీద ఆధారపడ్డ పంచతంత్ర కథల్లో, ఒక సమస్య, దానికో పరిష్కారం లేకుండా ఆ కథలు కనిపించవు. అలాంటి కథలకు, గడిచిన శతాబ్దాల్లో ఏర్పడ్డ జీవన సంప్రదాయ స్ఫూర్తి బలంగా ఉంటుంది.

సంప్రదాయ సారవంత భూమినుంచి 'ప్రతిభా నవ నవోన్మేష శాలినీ' అంటూ వికసిస్తుందని మన పెద్దలు, పాశ్చాత్య పెద్దలు కూడా ('ట్రెడిషన్ అండ్ ఇండివిడ్యువల్ టాలెంట్' అంటూ టి.ఎస్.ఎలియట్ వంటివారు) ముక్త స్వరాలతో చెప్పారు. దీనికి లక్ష్య లక్షణాలుగా నిలిచే రెండు కథలను చూద్దాము. ఒకటి రావిశాస్త్రి రాసిన పిపీలికం. రెండోది ఇనాక్ రాసిన నల్లులు. రెండు కథలమధ్య దాదాపు మూడు దశాబ్దాల తేడా ఉన్నది.

పిపీలికాది బ్రహ్మపర్యంతం- శాస్త్రిగారి కథ నడుస్తుంది, ఒక చీమ తానెవరో తెలుసుకోవాలనుకుంటుంది. కోహం అనే ఈ విస్తార చర్చలో అందరూ దానికి పలు వేదాంత విషయాలు చెప్పారు, తప్పు జీవితం భౌతికం అని చెప్పారు. తనలోని భగవత్పదార్థాన్ని వెతుక్కుంటూ విచికిత్సలో, సదసత్సంశయంలో దేశాలు తిరిగి, తనలోతానే వాదులాడుకుంటూ, సంతృప్తిచెందక తన ఇంటికి వచ్చేసరికి, ఒక పెద్ద ఆకారం తమ చీమల పుట్టని ఆక్రమించుకుని హాయిగా పడుకుని ఉంటుంది. అప్పుడు చీమ వినయంగా అడిగిన ప్రశ్నకి ఆ పాము చెప్తుంది, "నువ్వు చీమ వెధవ్వి, యుగయుగాలుగా మీకు నిర్మాణ కౌశలమున్నది, అందుకు మెచ్చుకుంటాను కానీ మీరు కట్టిన ఈ పుట్టలన్నీ మావే. అందుకే నువ్వు ఎవరు అంటే కష్టజీవివి, పో ఇక్కడనుంచి" అని గద్దించి నిశ్చింతగా ఉంటుంది.

ఇన్ని దేశాలూ తిరిగి, బ్రహ్మజ్ఞానం కూడా పొందిన చీమ, ఇలా బతుకు ఎరుకని పొంది, ఎందరెందరో నేను ఫలానా, ఫలానా అని చెప్పారు కానీ, ఎవరూ కష్టజీవివి అని గుర్తుచేయలేదు. అందుకు నీకు ఋణపడి ఉన్నాను, అంటూ కొంత కాలానికి, సుమతీ శతక పద్య

ప్రతి కథా నీతి కథే- జీవన నీతి, రీతి కథ. ఒక సమాజాన్ని, అందులో జీవితాన్ని, అక్కడి ప్రజల ఎరుకని, వారి ముందున్న ఎంపికలను పరిచయం చేస్తుంది. ఉపాయం మీద ఆధారపడ్డ పంచతంత్ర కథల్లో, ఒక సమస్య, దానికో పరిష్కారం లేకుండా ఆ కథలు కనిపించవు. అలాంటి కథలకు, గడిచిన శతాబ్దాల్లో ఏర్పడ్డ జీవన సంప్రదాయస్ఫూర్తి బలంగా ఉంటుంది.

భాగంగా తన కర్తవ్యం నిర్వహిస్తుంది "బలవంతమైన సర్పము చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ" ఇదీ శాస్త్రిగారికి ఈ కథ రాస్తున్నప్పుడు మనసులోని ఎరుక. "చీమలు పెట్టిన పుట్టలు పాముల కిరవైనయట్లు" అన్నది లోకోక్తి అయినా, లోకంలో సామాన్యులు చీమల వంటివారు, అయినా వారు చరిత్ర తిరగరాసిన ఉత్పాతాలు, రాజులను మందలించిన ఉదంతాలు, అందుకు తమ ప్రాణాలను ఎరగాపెట్టిన అనేకానేక ఘట్టాలతో చరిత్ర ఘూర్ణిల్లుతున్నది. అలా వేదాంత వీధుల్లో తన చీమ కథ మొదలుపెట్టి, దానికి జ్ఞానం అనే శిఖదాళ్ల అయ్యాక, ఏం చేస్తుందో, ఎందుకు చేస్తుందో, ఎందుకు కుడుతుందో, ప్రజాపక్ష చైతన్యంతో, రావిశాస్త్రి, బద్దెన రాసిన నాలుగు పంక్తుల పద్యాన్ని పెద్ద కథగా విస్తరించి చెప్పారు. పిపీలికం కథల పద్ధతి చెప్పి ఒక మంచి పాఠ్యాంశం కూడా.

ఇక ఇనాక్ 1997లో నల్లుల గురించి కథ చెప్పారు. సమాజం నల్లులు నిండిన మంచంలా ఉన్నది. దాన్ని గిరాటేస్తారు, ఎగిసి తన్ని దులుపుతారు. కథ నల్లుల మంచానికి జరిగే చికిత్సతో మొదలు. ఇది ఘాత వైద్యం. ఈ వైద్యం చేసే పల్లె మొద్దు, మొరటూ, సుబ్బాడు. రావిశాస్త్రి వాక్యం అలంకారాల సోపాన పంక్తి మీదుగా పైకి, పైపైకి లేస్తుంది, ఇనాక్ మాటలు, చిన్న వాక్యాలై, "షార్ట్ బర్స్ట్స్ ఆఫ్ ఎ రైఫిల్"లాగా పేలుతాయి. ఎటుబడితే అటు తుపాకీ తిప్పి కాల్చగలరు ఇనాక్. నల్లుల మంచం ఇతివృత్తం, నయవంచన చేసే మునసబు కథ కలిపి చెప్పి, ఎగిసి మంచాన్ని తన్నిన సుబ్బాడు, కథలో చివరికి తనను చేయని నేరాలకు దొంగగా పోలీసులకు పట్టించే మునసబూ, అతని రౌడీ అనుచరులు, ఈసారి ఏకంగా ఎవర్నో చంపి, ఆ హత్యానేరంలో తనని ఇరికించదలిచారని తెలిసాక, ఇంట్లో బంధించి పిల్లిని కొడితే, ఏంచేస్తుందో, ఎలా కళ్ళుపీకుతుందో, అదే చేస్తాడు. సుబ్బాడికి కలిగిన జ్ఞానమూ, చీమకి కలిగిన జ్ఞానమూ, చరిత్రలో కీలకం అయినవి. అవి విప్లవాలను సృష్టిచేశాయి. అణచివేత, పీడన, ఎలా ప్రజాగ్రహంచేత రద్దుచేయబడతాయో, చుట్టుముట్టే వాక్యాలతో చెప్తారు ఇనాక్. కథ, ఒకే స్థల, కాల, స్వభావ నిర్దిష్టతలో ఎలా మూలవిరాట్‌లా సుబ్బాడి ప్రవర్తన, దాన్ని గ్రహించే తాత అవగాహన, దుష్టశిక్షణ చేసిన అవతార మూర్తి వలె సుబ్బాడు సేద తీరడం- "నరసింహమూర్తిని, నిన్ను నంజుకు తింటునురా" అనే కొండ పాట ప్రస్తావితం కాకపోయినా, ఎక్కడో నేపథ్యంలో, పల్లెగాలిలా వేస్తూ ఉంటుంది. నల్లుల బాధ లేకుండా మంచాన్ని, మునసబు బాధలేకుండా పల్లెని, తీర్చగలిగిన ప్రజాదేవతల సైన్యాధ్యక్షుడు సుబ్బాడు - (సుబ్రహ్మణ్యస్వామి లేదా కుమారస్వామి పురాణాల ప్రకారం దేవతల సేనాని). ఇనాక్ రచనా పాటవంలో కథల బడి పాఠం ఇది.

ఈ కథల్లో జరిగిన దుష్టశిక్షణ ప్రపంచం ఎరగనిది కాదు. అయినా ఆధునిక కథారూపాలుగా, నైపుణ్యాత్ములైన రావిశాస్త్రి, ఇనాక్‌గార్ల చేతుల్లో ఎలా సామాజిక న్యాయం జరుగుతుందో చిత్రితమైన లఘు కథారూపాలు ఈ రెండు కథలు. బడుగు, బలహీన, అణగారిన, ప్రజల తరఫున మాట్లాడే శతాబ్దంలో తెలుగు కథ సామాజిక నిష్ఠకు, నినాద ప్రాయం కాకుండా జరిగే గాఢ శిల్పానికి, తీసుకున్న జీవన కాన్వాస్ పైన విస్తార రచనోద్యోగానికి నిలువెత్తు నిదర్శనాలు వీరిద్దరూ. అలంకార జలపాతం రావిశాస్త్రి సాహిత్యంకాగా, నిరలంకార సలిలం ఇనాక్ అక్షరం. వీరి పలు రచనల్లో పెనవేసుకున్న సామాజిక ఇంగితం, ఇంకా విస్తారంగా చెప్పే అవసరం ఉందని గుర్తిస్తూ, మంది బతుకుకోసం, వివేక భ్రష్టత్వం లేకుండా జీవితంలో నిలబడిన మహనీయులు రావిశాస్త్రి పేరిట వ్యవస్థాపితమైన అవార్డ్, ఇనాక్ గారికి ప్రదానం అవుతున్న సందర్భంలో అభినందన చందన లేపనం ఇది.

- రామతీర్థ, 9849200385

అక్షరం

ప్రజాశక్తి

www.prajasakti.com

facebook/prajasakti, twitter/prajasakti

4 విజయవాడ

సోమవారం 30 జులై 2018

రచయిత ప్రతివాడూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో, ఏ చెడ్డకు ఉపకారం చేస్తుందో అని ఆలోచించాల్సిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని, చెడ్డకు సహాయమూ చెయ్యకూడదని నేను భావిస్తాను. - రావిశాస్త్రి

సందర్భం

రావి శాస్త్రి రచనా దర్శనంలో 20వ శతాబ్దం

ఇరవయ్యో శతాబ్దం ప్రజల శతాబ్దం. వలస పాలనలు వెనకంజ వేశాయి. ఖండఖండాంతరాల్లో డజన్ల సంఖ్యలో దేశాలు పరాయి పాలన నుంచి విముక్తమయ్యాయి. భిన్న దేశాల ప్రజల స్వాతంత్ర్యాకాంక్షలు ప్రపంచం నలుమూలలా పెల్లుబికాయి. 1945- 1960 మధ్య 36 దేశాలు స్వాతంత్ర్యం పొందాయి. ఇరవయ్యో శతాబ్దం, జాతీయ పునరుజ్జీవన సమాజం. వామపక్ష ఆర్థిక చింతన సమాజ భౌతిక అవసరాలకు కీలకం అని గ్రహించిన సమాజాల ప్రజలు, తమ దేశపు ఆర్థిక నమూనాలను మార్చడానికి

విప్లవాల రూపేణా ప్రయత్నాలు చేశారు. కేవలం స్వాతంత్ర్య పోరాటాలే కాకుండా, రాజకీయ చింతనలో నూతన ఆర్థిక దర్శనాలు కూడా, ఈ శతాబ్దంలో రాజ్యాన్ని ఏలుబడి చేసే స్థాయికి ఎదిగాయి. వెరసి, ఇరవయ్యో శతాబ్దం, ప్రజల చైతన్య చోదకమైన తొలి పూర్తి శతాబ్దం. రాజరికాలు వెనక్కి వెళ్ళి, వ్యాపార సామ్రాజ్యాలు, మరొక రూపంలో ప్రపంచ ఆధిపత్యానికి, వచ్చిన శతాబ్దం కూడా. ఈ శతాబ్దంలో సాహిత్యం విలక్షణమైనది. ఎక్కువ బరువులు ప్రజల తరపున మోసిన రచయితలు ఈ శతాబ్దంలో కనిపిస్తారు.

ఇలా సమాజ పాలనా వ్యవస్థలు సామాన్యుల పరం కావాలని, వారికి సంపన్న వర్గాల ప్రకృతి, ప్రజాజీవన దోపిడీ పద్ధతుల వల్ల నష్టం వాటిల్లుతున్నదని ఎరిగిన రచనలో విశాల వామపక్ష చింతన కనిపిస్తుంది. 'లోకమందలి మంచి చెడ్డలు లోకులెరుగుదురా' అన్న ప్రశ్న గురజాడ వేసినది లోకస్తుల తరఫున, 'లోకస్సమస్తా సుఖినోభవంతు' అనగలిగే దార్శనికులెవరు

అన్నదే. 'ఇతిహాసపు చీకటి కోణపు అట్టడుగున పడి కాన్పించని కథలన్నీ కావాలిప్పుడు' అని శ్రీశ్రీ అన్నప్పుడు తెలుగు సాహిత్యంలో ప్రజల అతీ గతీ ఇతర కాలక్షేప రచనలు, సాహిత్య వ్యాయామ చిత్ర కవిత్వాలు, బంధ కవిత్వాలు దాటి, ముందుకొచ్చాయి చిత్రనీయాంశాలుగా. అందుకే 'అవి ధరా గర్భమున మానవాస్థికా పరంపరలు, సుప్త నిశ్శబ్ద సంపుటములు' అనే శ్రీశ్రీ గీతం సుప్తాస్థికలు, కేవలం ఒక శ్మశాన వాటికపై గీతమే కాక, రెండువేల ఏళ్ల చరిత్రలో ఏ ప్రస్తావనా లేకుండా ముగిసిపోయిన ఉత్పత్తి వర్గాల ప్రజల జీవన ఘోషకు, ముందుమాట వంటిది. అటు, కలగూర గంప వంటి ప్రభవ కవితా సంపుటానికి, ఇటు 1933 నుంచి వస్తున్న మహాప్రస్థాన గీతాలకు నడుమ వచ్చిన ఈ సుప్తాస్థికలు గీతం, శ్రీశ్రీలో నూతన సాహిత్య పరిణామానికి సంకేతం.

అలాగే పదిహేడేళ్ళ కుర్రవాడు రాచకొండ విశ్వనాథ శాస్త్రి ఏవన్నా రాయొచ్చు. కానీ 'మీరే ఆలోచించండి' అని ఒక కథ రాసి, 'ప్రేయసీ ప్రణయమా, లేక సమాజ సత్సంగమా, కృష్ణమూర్తి తేల్చుకోలేక పోతున్నాడు.. మీరే ఆలోచించండి' అని తన కథను ముగిస్తున్నాడు అంటే, సమాజ జీవన దుస్సహ దృశ్యం పదిహేడేళ్లకే, ఎలా ఈ యువకుడిలో ఎలా నాటుకుని ఉన్నదో చెప్పేదే, సామాజిక చింతన. ఇందులో ఇరవయ్యో శతాబ్దపు ప్రధాన సామాజిక, ఆర్థిక, రాజకీయ చింతనలైన పెట్టుబడిదారీ విధానం, సంఘవాదం (అంటే కమ్యూనిజమేనండోయి.. ఇటువంటి మాట మనం బాగా ప్రాచుర్యంలోకి తేవాలి). రెండిటి నడుమా ఒక ప్రగతిశీల సమన్వయం సాధించడం నేటి అవసరం. పెట్టుబడి ఏ సమాజంలోనైనా కావాలి. దాని భూమిక ఉత్పత్తి వర్గాల పరంగా వారి జీవన అభ్యున్నతికి ఉపయోగపడడం, సాంఘిక వనరుగా, సంఘ పురోగతిలో తన సముదాయిక పాత్ర పోషించడం, ఇవన్నీ జరగాలి.

అలా జరగనీయని వ్యవస్థ మారాలి. అందుకు ప్రజలు చోదక శక్తులు కావాలన్నదే, సామాజిక చలన సూత్రాల తర్కం. దీనికి కార్మికులా, శ్రామికులా అన్న తేడా లేకుండా, ఉత్పత్తి వర్గాలన్నీ, సమాజం అందరి సంపద, దీన్ని అందరి క్షేమం, అందరి లాభంగా

నడిపే పాలనకోసం, ఇరవయ్యో శతాబ్దంలో ఇంకా మానవాళి ఎదురుచూస్తున్న, అందుకై, కొన్ని రూపాల్లో సంఘర్షిస్తున్న కాలంలో, తొలుత గురజాడ, తరువాత శ్రీశ్రీ, తరువాత రాచకొండ విశ్వనాథ శాస్త్రి వంటి వారి రచనలు తెలుగు సాహిత్యంలో ఈ కళాత్మక చర్చ చేశాయి.

అథోజగత్సహోదరుల కథా సరిత్సాగరం, రాచకొండవారి రచనలన్నీ. అవి కొన్ని సార్లు, పెద్దగా ఆర్థిక స్తోమతు లేని దిగువ మధ్యతరగతి పాత్రలతో కథలు చెప్పినా, కటిక పేదల మాండలికంలో కొత్త కావ్య భాష సృష్టించినా, దీనికి శ్రమ సంస్కృతి చైతన్యం మూలం. సంపన్నుల సమాజం ఆకలిని, వ్యభిచారాన్ని నేరాలు అంటూ, అవి ఏర్పడే క్రమాన్ని తానే అమలు చేస్తూ ఉంటుంది.

చిన్న చితకా నేరగాళ్ళు సంఘం చెక్కిన శిల్పాలే అన్న ఎరుక, మార్క్సియ సాంఘిక భావనలతోనే సాధ్యం. దీనికి మార్క్సు గారి కాపిటల్ అంతా చదివారా, అందులో ఉన్నదంతా ఈ రచన నిండా ప్రతిబింబించారా అన్నది అర్థం లేని ప్రశ్న. సిద్ధాంత బలం, స్పష్ట ఆచరణ, నినాద నిర్మాణం రాజకీయవేత్తకు ఎంత అవసరమో, అలాగే, సిద్ధాంత అవగాహన, దాన్ని కప్పి ఉంచి కళాత్మకంగా చెప్పడంలో ఒక జీవన పరిచయం, నినాదాలు రాయకుండా ఉండడం, రచయితకు చాలా అవసరం. తమను అణచివేసే శక్తులపై స్వాతంత్ర్య పోరాటాలన్నీ, ముఖ్యంగా ప్రగతిశీల పరిణామాలే. ఈ ఎరుక రావి శాస్త్రి రచనల్లో గట్టిగా కన్పిస్తుంది. 'ఆఖరి దశ' అనే కథలో, ఎలా అన్నిసార్లు మానవ సమాజం ఇక ఆఖరి

దశకి వచ్చేసింది అని అనుకున్నా, తిరిగి, ఎలా సమాజం మరొక మలుపు తీసుకున్నదో, ఒక తర్కబద్ధమైన కథలో చెప్తారు రావిశాస్త్రి. కొంగల దేముడు కథలో, ప్రతీకాత్మకంగా కొట్టేవాడే ప్రభువు, మొత్తే వాడే రాజు, దెబ్బకి దెయ్యం దడుస్తుంది అని పాలకుల పట్ల ప్రజలకుండే మానవాతీత ఆరాధన, భక్తి, భయం అన్నీ ఎలా ఏర్పడతాయో చెప్పేరు.

చిల్లర నేరగాళ్ళు, పెద్ద రాజకీయ ప్రముఖులుగా ఎదగడం, ధనార్జన ఎలా జరిగినా, అది చివరికి, పవరు మరింత పవరు కోసం, డబ్బు మరింత డబ్బుగా పెంచడం, నేరమయ సమాజ స్వభావంగా గుర్తించి, క్రిమినలైజెడ్ సొసైటీ ఏర్పడ్డమే, ఇరవ-య్యో శతాబ్దపు పెట్టుబడిదారీ, లాభార్జన వృత్తంలో, చివరికి జరిగే పరిణామంగా, రావిశాస్త్రి సృష్టించిన చిల్లర నేరగాళ్ల అభివృద్ధి క్రమం చెప్తుంది. దీన్ని 'సొమ్ములు పోనాయండి' అనే ఒక క్లాసిక్ రచనలో, పూర్తి మాండలికంలో, ఆ ఊరి పెసినెంటు గురించి బోడి గాడు చెప్పిన దాంట్లో, సూక్ష్మ రమ్యంగా చెప్పారు రచయిత. అది నేరమయ సమాజం ఎదిగే తీరు దీన్ని సంఘవాద దృష్టి గల రచయితలే చెప్పగలరు. కళాత్మకంగా మార్క్సియ స్ఫూర్తితో తన చుట్టూ ఉన్నా పెట్టుబడిదారీ సమాజపు వికృత పోకడలను వెక్కిరించిన సీరియస్ కళాకారుడు రావిశాస్త్రి. 'బాగ్గెమంతుడి పల్లకీ బగమంతుడే మోస్తుంటే మరి నాను నువ్వు ఏటి సేయగలం?' బోడి గాడి జగీలీడి (తోడల్లుడి) ప్రశ్న. పౌరాణిక ప్రతీకలను శ్రీశ్రీ విస్తృతంగా కవిత్వంలో వాడగా, వారిని ఎంతగానో ఇష్టపడే రావిశాస్త్రి, ఆ నమూనాలను తన వచనానికి ప్రాణశక్తి పెంచే అలంకార సంపదగా వాడుకున్న తీరు తెలుగు వచనానికి కొత్త అనుభవం.

ఉన్నతమైన పేదపాత్రలుగా 'నిజం' నాటకంలో సుశీల, 'సొమ్ములు పోనాయండి'లో బోడిగాడు; రత్తాలు - రాంబాబులో రత్తాలు, రాజు మహిషిలో గేదెల రాజమ్మ, ఇవన్నీ మహాభారతంలో పాత్రల వంటివి. వీటికి శాశ్వత ప్రాచుర్యం లభించింది. అందుకు

రావిశాస్త్రి వీరికిచ్చిన ట్రీట్మెంట్ చాలా ప్రధానం. లుముంబా హత్య 1961 సమయంలో 'ఊహురు' (అంటే స్వాతంత్ర్యం) పేరిట నివాళి రాసినా, ఎమర్జెన్సీ దురాచారాలను ఖండించినా, జైల్లో ఉండి రచనలు చేసినా, పులి పవర్లు (ఫుల్ పవర్స్) ఉండే రాజ్యపు భాగోతాన్ని, మతపు మాయని దానికి సంపన్నులకు, ఉండే బంధుత్వాన్ని చెప్పడంలో ఇరవయ్యో శతాబ్దపు తర్కం తన పెన్ను నిండా బంగాళాఖాతంలా నిండినవారు రావిశాస్త్రి. ఇరవయ్యో శతాబ్దంలో , ప్రజలకు అనుకూల సమాజాల గురించి చింతన భిన్న దేశాల్లో ఆచరణకు వచ్చిన కాలంగా, సాహిత్యంలో సాంస్కృతిక జీవ ప్రవాహగతి మేళవించి, ఒక పౌరాణిక కోలాహలంతో ఆధునిక జీవనేతిహాసాలను తెలుగులో అందించిన ద్రష్ట, స్రష్ట రావి శాస్త్రి. మంచికీ హానీ, చెడుకు సాయమూ చేయని నాణ్య సాహిత్య నిర్మాత ఆయన.

మూడేళ్లలో వారి శతజయంతికి దారులు తీస్తున్న తెలుగు సమాజం, రావి శాస్త్రి లిటరరీ ట్రస్ట్, 97వ జయంతి జులై 30 నాడు విశాఖలో, సాహితీవేత్త కొలకలూరి ఇనాక్ గారికి, రావిశాస్త్రి అవార్డు 2018 ప్రదానోత్సవ సభ నిర్వహిస్తోంది. ప్రజాశక్తి సంపాదకులు ఎంఎస్ శర్మ అవార్డు ప్రదానం చేసి, కీలక ప్రసంగం చేస్తారు. ఈ శతాబ్ది కౌంట్‌డౌన్ (అథో గణనంలో) మూడేళ్ళ పాటు పలు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రచురణలు తెలుగు ప్రాంతాల్లో జరుగుతాయి.

- రామతీర్థ
98492 00385

కథావిశిష్టుడు రావి శాస్త్రి

> 'నేనొక ఫెయిల్ పొయెట్' అని రావి శాస్త్రి గారు చెప్పుకున్నా, వారి రచనా సాగరంలో రసవత్తర ఘట్టాలన్నీ అటు క్షీర సాగర మధనాలు - కాలకూట ప్రభంజనాలు, ఇటు అమృతంపు సోనలు... నవరసాలకూ వచన పట్టాభిషేకం చేసిన చాణక్యుడు ఈయన... స్వేద సముద్రమే నిజమైన సముద్రమని నమ్మి, చెమట చుక్కలకు సిరా చుక్కల స్వరాలను కవచంలా కట్టిన శ్రామిక విశ్వ యోధుడు ఈ విశ్వనాధుడు... అభిషేక ప్రియుడైన విశ్వనాథుడికి జనా భిషేకం జరుగుతూనే ఉంటుంది. అదీ వారి విశిష్టత.

ఇరవయ్యో శతాబ్దపు తెలుగువచనం రావి శాస్త్రీయ మాండలికంగా నిలబడింది. మనం జ్ఞానం అనుకునే దాని మీద, వ్యవస్థీకృత విశ్వాసాల మీద, రాజ్యం మీద వాక్యాల సైన్యాలు నడిపించిన రచనాగ్రహ బంగాళాఖాతం రాచకొండ వారు. పుట్టిన శ్రీకాకుళం (కొఠీ వారి వీధి, ఇప్పటి కృష్ణా పార్క్, వీధిలో ఉన్న అమ్మ వేపు వారైనా తెన్నేటి వారి ఇంట). ఆ శ్రీకాకుళం మాట విసురు, పెరిగిన తుమ్మపాల (తుంపాల) ఇటుకల గట్టితనం, కథల్లో, నవలల్లో దట్టించిన కళాకౌశలం చదువరులను నిలబెట్టి చదివిస్తుంది. తన రచనల నిండా ఉపమాలంకారాల తోటలు. పోలికలు తొడిగి పాత్రను పరిచయం చేసే పద్ధతి నిర్వహణలో, రావిశాస్త్రి జగజ్జెట్టి. 1970 ల తర్వాతి సినిమా రంగపు మేటి విలన్ పాత్రలన్నీ, మాట్లాడింది రాచకొండ వారి శైలిలోనే. 'ఆలో ఆలో ఆలో' రావు గోపాలరావు పాత్ర జన్యుచిత్రణలు, వారి రాజు మహిషిలో ఉన్నాయి. 'ఇంద్రుడు చంద్రుడు' కమల్ హాసన్ కూడా, ఈ నవల్లో ఛైర్మన్ భీమసేనారావు పాత్రకి విశాల ప్రతిఫలనమే. యాభై కేజీల బంగారాలు, ఇలాంటి విలక్షణమైనా మాటలేవైనా వస్తే, ముందుగా రావిశాస్త్రి పదకోశంలో వెతుక్కోవాలి మూలం ఉందేమో అని. అందుకే మదరాసు సినిమా సంభాషణలు రాయడానికి వెళ్లిన రావిశాస్త్రి, వారి తరహాకీ, డాబు దర్పాలకీ విసిగెత్తి పోయి, విశాఖ తిరిగొచ్చాక 'మన మందు మనని తాగ నివ్వరు, మన డైలాగు మనల్ని రాయనివ్వరు' అని పెదవి విరిచారట.

తెలుగు సినిమాలో రావిశాస్త్రి మార్క్ కొలగొట్టి, వాడుకున్న నిపుణులెందరో ఉండగా, అది వారి ప్రతిభే అని అనుకుంటూ ఉంటాము, వాటికి జీవశయ్య వంటి రావిశాస్త్రి వచనం ఒకటుందని తెలీక, మనకు ఎవరూ చెప్పక. 'నేనొక ఫెయిల్ పొయెట్' అని రావి శాస్త్రి గారు చెప్పుకున్నా, వారి రచనా సాగరంలో రసవత్తర ఘట్టాలన్నీ అటు క్షీర సాగర మధనాలు - కాలకూట ప్రభంజనాలు, ఇటు అమృతంపు సోనలు. కథల్లో, నవలల్లో ఇలా విరుచుకుపడిన రావిశాస్త్రి కవిత్వ నయాగరాని , అభిమానులు ఆయన కవిత్వంగా భావించి, 'ఎన్నెలో ఎన్నెల'గా పుస్తకం తెస్తే, అది రావిశాస్త్రి గారి కవిత్వంగా, వారు కవిత్వం కూడా రాశారు అని కొందరు అనుకుంటారు కానీ, నిజానికి అవన్నీ, వారి వచన సాహిత్యంలోంచి ఎంపిక చేసి సంకలనం చేసినవే. తన మిత్రుడు, ఫాక్టరీ ప్రమాదంలో చనిపోయిన ఎన్నెస్ ప్రకాశరావు కోసం మాత్రం రావిశాస్త్రి కవిత్వం రాశారు నివాళిగా

నవరసాలకూ వచన పట్టాభిషేకం చేసిన చాణక్యుడు ఈయన. జరీ అంచు తెల్లచీరలో, విశాలాక్షి దుఃఖం చెప్పే తొలినాళ్ళ మూడు పదుల రచయితలోనే, రచనా ఘట్టాల పరాకాష్టలో, రస ప్లావితం చేసే కళ, ఈ విశ్వనాథుడి వెనుక పడగ విప్పి ఆడుతున్న సౌందర్య సర్పంగా మనకు కనిపిస్తుంది. చిన్నపుడే చెహోవ్ మిజరీ కథ 'దౌర్భాగ్యం' పేరిట అనువాదం చేశారు ఇది 1939 చిత్రగుప్తలో అచ్చు అయిందిగా చెప్తున్నారు కానీ ఇది దొరకలేదు. ''మీరే ఆలోచించండి' అనే మరో కథానిక, అముద్రితం అని, మనసు ఫౌండేషన్ వారు అచ్చువేసిన రావిశాస్త్రి సమస్త లభ్య రచనల 'రచనాసాగరం'లో కథానిక చివర్న తెలిపారు కానీ, ఈ రచన 1939 లో 'కథాంజలి' అనే పత్రికలో అచ్చు అయింది. తొలి కథల్లో ప్రేయసి పరిష్వంగమా, సమాజ రణరంగమా అన్న సంశయపు ప్రశ్న ఇలా అడుగుతారు ఈ రాచకొండ కుర్రవాడు తన పదిహేడో ఏట రాసిన ఈ కథలో. సుందరిని వివాహమాడి నిర్విచారంగా, సంతతానందంగా, ప్రేమోపాసకుడై జీవితం గడపడమా, లేక కష్టపు బతుకు బతికి తిండికి లేక అల్లాడే రైతుల కష్టాల్ని నిర్మూలించడానికి జీవితం ధార పొయ్యడమా? ఏం చేయడం? కృష్ణమూర్తి ఆలోచిస్తూనే ఉన్నాడు. కానీ ఇంకా ఒక నిర్ధారణకి రాలేకపోయాడు. కానీ కె.కె. రంగనాథాచార్యులు, సాహిత్య అకాడెమీ ప్రచురిత రావిశాస్త్రి మోనోగ్రాఫ్‌లో చెప్పినట్టు, ఇంట్లో విశ్వం, సాహిత్య లోకంలో రావిశాస్త్రి, ఊళ్ళో శాస్త్రి గారు, బార్‌లో ఆర్వీయెస్, క్లయింట్లకి ఛాత్రిబాబు ఇన్ని పేర్లతో పిలవబడే భవిష్యత్తుకు రూపొందుతున్న ఈ తరుణ వయస్కునికి, ఈ సందేహం జీవితంలో ఎప్పుడూ కలుగలేదు. ఆయన దృఢంగా పేదల పక్కనే నిల్చున్నాడు. నడి వయసులో ప్రఖ్యాత భారతీయ ఉపఖండ కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ ముఝ్‌సే మేరీ పెహ్లీసి మొహబ్బత్ నా మాంగ్ మేరే మెహబూబ్ (ఆనాటి ఆపాత ఆపాత మధురిమలు అడగబోకే నా చెలీ) అని తేల్చి చెప్పినట్టే, రావిశాస్త్రి సాహిత్యకాశంలో వెలిగిన సామాన్యుడి సూర్యుడు.

గురజాడ, శ్రీశ్రీలు తనకిష్టమైన రచయితలుగా చెప్పిన రావిశాస్త్రి, గురజాడ నించి సామాజిక నిష్ఠ, హాస్య చతురత, వ్యంగ్య విస్ఫోటం... అలాగే శ్రీశ్రీ నుంచి కవిత్వ భాషా హయ హేష నేర్చి విశాఖ మాండలికంలో కథల్ని కవిత్వ సంపన్నం చేసిన శక్తిశాలి, పాత నమూనాల విధ్వంసకుడు. మాకు గోడలు లేవు, గోడలు పగులకొట్టడమే మా పని అని శ్రీశ్రీ అన్నది, ఎల్ల లోకము ఒక్క ఇల్లై, వర్ణ బేధములెల్ల కల్లై (ఇక్కడ వర్ణం రంగు, కులమూ కూడా) అని అంతకుముందు గురజాడ నిర్దేశించినదీ, రక్తంలోకి ఇంకించుకున్న రచనా సాగరుడు రావిశాస్త్రి. సగరుడు భూమికి తెస్తే సాగరమైనట్టు, రావిశాస్త్రి రాసిన విశాఖ కడలి పేరు రావాఖాతం కూడా. స్వేద సముద్రమే నిజమైన సముద్రమని నమ్మి, చెమట చుక్కలకు



సిరా చుక్కల స్వరాలను కవచంలా కట్టిన శ్రామిక విశ్వ యోధుడు ఈ విశ్వనాధుడు. ఇటీవల ఒకరి మాటల్లో, రావిశాస్త్రి, చితికిన బతుకు గురించి, వారి అవినీతి, దురలవాట్లు, నగర జీవితపు చిల్లర నేరగాళ్ల, నేరగత్తెల గురించి, పోలీసులు, కోర్టుల గురించి రాశారు తప్ప, కార్మిక జీవితం రాయలేదే - వీరెలా మార్క్స్ చింతన ఎరిగిన వామపక్ష రచయిత అవుతారని అడిగారు. సమాధానం ఉంది. పరిశ్రమలు ఏర్పడ్డంతో వచ్చిన కార్మిక జీవనం ఒక నూట యాభై ఏళ్ళ వాస్తవ పరిణామం కాగా, అంతకుముందు నుంచి సమాజంలో ఉన్నది కాయకష్టపు శ్రామిక జీవనం. దీన్నుంచి మూలాలు తీసుకుంటే, రావిశాస్త్రి గారి రచనలో శ్రామిక వర్గం ఎలా కనిపిస్తుందో అర్థం అవుతుంది. శ్రామికులందరూ కార్మికులే స్వభావ రీత్యా, కానీ కార్మికుల్లా నిర్ణీత పనిగంటలు, సంఘాలు ఏవీ ఉండని సహస్ర వృత్తుల కోట్లాది శ్రామికుల శ్రమ, ఈ ప్రపంచాన్ని నడిపే ఇంధనం. ప్రపంచాన్ని శ్రామికుల కళ్ళతో చూసి నిరసించాడు రావిశాస్త్రి గారు. వారి దుఃఖానికి, కడగండ్లకు, జీవితంలో వచ్చి పడిపోయే ఆపదలకు, కొద్ది మంది సంపన్నుల సమాజమే, దాని పాలక వర్గమే, దాని రక్షక భట యంత్రాంగమే కారణం అని ప్రతి జాగృత రచనలోనూ స్పష్టం చేసిన వాడీయన.

సంప్రదాయాన్ని ఎరిగి దాన్ని విస్తరించడంలో సిద్ధహస్తుడు. గురజాడ కన్యాశుల్కంలో భారతీయ, పాశ్చాత్య సాహిత్య సంప్రదాయాల చర్చ ఎంత అర్థవంతంగా చేయవచ్చో, అటువంటి కళా నైపుణ్యంతో రాసిన కథల్లో 'పిపీలికం' ఒకటి. నాటికగా కూడా విజయంతమైన ప్రదర్శనలు పడ్డాయి ఈ కథానిక ఆధారంగా. బలవంతమైన సర్పము చలి చీమల చేత చిక్కి చావదె సుమతీ అన్న ఒక్క వాక్యాన్ని విస్తరిస్తే, ఇంత పదునుగా రావిశాస్త్రి బ్రాండ్ ట్రీట్మెంట్ తో కొత్త కథగా వర్తమాన యుగాల పాఠక లోకాన్ని అలరిస్తుది. ఎంత కాలిక స్పృహతో, పేదలు, శక్తిహీనులు ఎరగాల్సిన నిష్ఠుర సత్యం, తమ దుస్థితికి ఎవరు కారకులో గ్రహిస్తే ఏమి జరుగుతుందో చెప్పిన దార్శనికత ఈ కథానికలో ఉన్నది. దానికి మృచ్ఛకటికంలో అసంతృప్తులైన ప్రజలు సమాంతరంగా నడిపిన రాజద్రోహం, విప్లవ పరిణామం తెలుసు, ఫ్రెంచ్ రష్యన్ చైనా విప్లవాలు తెలుసు-తెలుసుకుంటుంది ఈ పేర్లు ప్రస్తావించకుండాను కాగల కార్యం కండ చీమలే తీర్చాలని. ఒక్క కథలో సాంస్కృతిక వాతావరణం ఎంత పుష్కలం అంటే, చీమల తలకాయల్లోంచే ప్రపంచ విప్లవాలు పుడతాయని, చెప్పే ఒక చారిత్రక ఘోష ఈ కథ. కథలను ఒక చిన్నబీజం నుంచి విస్తరించడంలో రావిశాస్త్రి గారికి తగని ఇష్టం ఉన్నది. ప్రపంచ మేలిమి కథల్లో ఒకటి అయినది, కేవలం పద్నాలుగు వందల మాటల చెహోవ్ కథానిక కేమీలియన్ (ఊసరవెల్లి) రావిశాస్త్రి గారికి ఎంత ఇష్టం అంటే, దాన్ని విస్తార చిత్రణగా ముందు వెనుకలు జోడించి, తన 'రత్తాలూ - రాంబాబు' నవలలో గంగరాజు హెడ్‌కి అన్వయించి, రెండో అధ్యాయపు ఆఖరి విభాగం మొత్తం పదివేల మాటలకు మించి రాశారు. ఇది నవలకు సంబంధం లేకున్నా తీసేయవద్దని, అప్పటి సీరియల్ వేస్తున్న పత్రిక సంపాదకులు పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారికి ఉత్తరం కూడా రాశారు. ఇదే, తరువాత, ఆంధ్ర విశ్వ విద్యాలయం థియేటర్ ఆఫ్ ఆరట్స్ ప్రయోక్త అత్తిలి కృష్ణారావు టామీ టామీ టామీగా నాటికీకరణ చేసినది, వారి బృందం, ఇతర నాటక సమాజాలు, వందలాది ప్రదర్శనాలు ఇచ్చారు. సంస్కృతం బళ్ళో చదువుకున్నాను, తెలుగు, జనంలో తిరిగి నేర్చుకున్నాను, విన్నదెప్పుడూ యథాతథంగా రాయలేదు, దాని ఆధారంగా, నా పాత్రల మాటలను రూపొందించాను అని చెప్పిన రావిశాస్త్రి శ్రీశ్రీ ఋుక్కులకు ఎనిమిది కథలు, ఒక నవలికగా రూపం ఇచ్చిన కల్పనా శిల్పజ్ఞుడు.

చిన్నప్పుడెప్పుడో ఒక కథ చదివిన జ్ఞాపకం శాస్త్రి గారిని వెన్నాడుతూ ఉండేది. అది ఆధారంగానే, యాభై ఏళ్ళ కిందట వెన్నెల అనే కథ రాశారు. దీనిని కవిత్వ కథానిక అనవచ్చు. అయితే రచయితగా వారి నిజాయితీ ఎంతటిది అంటే, దీనికి ఒక బీజ ప్రాయ రచన, ఎప్పుడో తన చిన్నప్పుడు తొమ్మిదేళ్ల వయసులో చదివినది గుర్తుచేసుకునే వారు, రచయిత పేరు తెలీకపోయినా, ఆ చిన్న కథ తనకి స్ఫూర్తి, ఈ కథ రాయడానికి అని చెప్పేవారు మిత్రులతో. ఒకసారి మిత్రబృందంలో వారు ముద్దా విశ్వనాథం, ప్రొఫెసర్ కోలవెన్ను మలయవాసిని గార్లు ఈ కథని సాధించి తెచ్చి శాస్త్రిగారికి ఇచ్చారు. ఆ కథ రాసినది శ్రీమతి యు.సత్యబాలా సుశీలా దేవి, ప్రచురితం గృహలక్ష్మి మాసపత్రిక, 1931 నవంబరు సంచికలో. (వీరే ఆ కథానిక తేగలగడానికి కారణం. మలయవాసిని గారి తండ్రి ఆంద్ర శేషగిరిరావు చాలాకాలం గృహలక్ష్మి సంపాదకులు కావడం కూడా కావచ్చును). కథ దొరికిన రావిశాస్త్రి గారి ఉత్సాహం చెప్పనలవి కానిది. జీవిత కాలంలో పేరెన్నిక గన్న అరవై నాలుగు కథలు, నవలలు, నాటకాలు రాసిన పీపుల్స్ ఆర్టిస్ట్, అండ్ అడ్వొకేట్ రావిశాస్త్రి గారు. గెలిచిన కేసులకు వారికి జనం నుంచి డబ్బు కాకుండా, పళ్ళు, పంటలు, చేపలు, ఇంకా విశేషమైన నివేదనలు అందేవి. ఫీజు తీసుకోవాలి అంటే సిగ్గుపడుతూ తీసుకునేవారు ఈ లాయర్. అభిషేక ప్రియుడైన విశ్వనాథుడికి జనాభిషేకం జరుగుతూనే ఉంటుంది. అదీ వారి విశిష్టత. రావిశాస్త్రి 97వ జయంతి వత్సర సందర్భంలో విశాఖపట్నంలో జులై 30న ఆచార్య కొలకలూరి ఇనాక్ గారికి, రావిశాస్త్రి అవార్డ్ ప్రదానోత్సవ సభలో టామీ టామీ టామీ నాటిక. ప్రదర్శిస్తున్నారు. ఈ వ్యాసంలో ప్రస్తావిత కథలు 'వెన్నెల' - (1967) అలాగే 'ఆ గదిలోనే' (1931). రావి శాస్త్రి జయంతి ప్రత్యేక సమర్పణగా మనం పాఠక లోకానికి అందిస్తున్నాము.

◆ రామతీర్థ
98492 00385

(నేడు కొలకలూరి ఇనాక్‌కు రావిశాస్త్రి అవార్డు ప్రదానం)

'మన సాహితి'కి వ్యాసాలు, లేఖలు
పీడీఎఫ్, ఓపెన్ ఫైల్ ఫార్మాట్‌లలో
హామీపత్రం జతచేసి పంపగలరు.
e-mail: manamsahiti@gmail.com

'సమన్వయ' పుస్తకావిష్కరణ

డాక్టర్ ఎస్.రఘు సాహిత్య వ్యాస సంపుటి 'సమన్వయ' పుస్తకావిష్కరణ సభ జూలై 30 సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం మినీ హాల్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథిగా డాక్టర్ నందిని సిధారెడ్డి, ఆచార్య ఎన్.గోపి, జూలూరి గౌరీశంకర్, ఎం.వేదకుమార్, ఆచార్య సూర్య ధనంజయ, డాక్టర్ సితారాం తదితరులు పాల్గొంటారు.

- హైదరాబాద్ బుక్ ఫెయిర్

కథా హృదయ నిపుణుడు వేదగిరి రాంబాబు



హృదయం అనేది ఒక బిందువు కాదు. అదొక వ్యవస్థ. కేవలం ఓ బల్ల దగ్గర కూచుని కొన్ని గొప్ప కథలు మాత్రమే రాసి ఉంటే, వేదగిరి రాంబాబు ఇంతలా మనకు లోటు మిగిల్చి ఉండేవాడు కాదు. తెలుగు కథని గొప్పగా పట్టించుకున్న వ్యక్తుల్లో ఒకడు. కథామూలాలు సమాజ స్థితిగతులని, మనిషికి ఉండే అంతర్ బహిర్ లోకాల మధ్య కథ కదులుతూ ఉంటుందని తన ప్రయాణంలో గ్రహించినవాడు. కథతో తన ప్రేమ కథ సముద్రం కథ ఆంధ్రపత్రికలో బహుమతి పొందిన 1974 నుంచీ, అంటే తన ఇరవై రెండేళ్ల నుంచీ మొదలైనా, నలభై నాలుగేళ్ల పాటు కథతో, గొప్ప కథా శిల్పులతో తన యాత్రలో కొత్త ఆలోచనలతో ఈ వ్యవస్థను సంపన్నం, సమృద్ధం చేయుదల చినవాడు వేదగిరి రాంబాబు.

రెండు తేదీల మధ్య వేదగిరి రాంబాబుని ఇమిడ్చి, రాసిన కథల జాబితా ఇచ్చి, పొందిన పురస్కారాల జాబితా జోడించి, చేసిన మంచి పనుల గురించి చెప్పినా ఎంతో ఇంకా మిగిలే ఉంటుంది. దీనికి ప్రధాన కారణం, తెలుగు కథకి 1990 దశకంలో లభించిన నవోత్తేజం. ఈ కొత్త ఉత్సాహపు చరిత్రలో మూడు ముఖ్య ఘట్టాలు చోటు చేసుకున్నాయి. అవి 1990 నుంచే 'కథావార్షిక'గా వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్, ఆ ఏడాది తెలుగు కథల నుంచి ఎంపిక చేసి ఒక రెండు పదుల కథల వరకూ సంపుటిగా తీసుకురావడం. రెండు, 'కొత్త కథ' పేరిట, వేదగిరి రాంబాబు, 1994 నుంచీ వరసగా మూడేళ్లు (కొత్త కథ, సరికొత్త కథ, వినూత్న కథ) పేరిట, పేరొందిన కథకుల చేత ఈ సంకలనం కోసం కథలు రాయించి పుస్తకాలు వెలువరించడం. వీటిలో మొదటిది వేదగిరి రాంబాబు, కాళీపట్నం రామారావుగారికి అంకితం ఇచ్చారు. 1994లోనే సాధన సాహితీ స్రవంతి, రచన పత్రిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1994లో 'తెలుగు కథా సదస్సు' అంటూ, అరవై మంది కథా రచయితలు, పాఠకులు పాల్గొన్న సదస్సు జరిగింది. ఇందులో వేదగిరి రాంబాబు, మిత్రులు చురుకైన పాత్ర పోషించారు. ఈ ఏడాది ముగిసాక 1994 కథాసమీక్ష అంటూ (ఒక వార్షిక కథా కరదీపిక లాంటిది) వేదగిరి రాంబాబు రూపొందించారు. 1994లో 'కొత్త కథ' సంకలనం అంకితం పుచ్చుకున్న కారా మాస్టారు, 1997లో ఆ దశకపు ముఖ్య ఘట్టానికి తెరతీశారు. అది తెలుగు కథకి ఒక కథాశ్రమం, "కథానిలయం" పేరిట ఏర్పాటు చేయడం.

వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్, ఎంపిక చేసిన తెలుగు కథల ప్రచురణకు పరిమితం అయి, స్థిరంగా ఈ పని ప్రతి ఏటా చేస్తూ వచ్చారు. 1994లో కథాసదస్సు, కొత్త కథ సంకలనం ప్రచురణ, అలాగే ఏడాది చివరకు కథాసమీక్ష వెలువరించిన వేదగిరి రాంబాబు, అతి ముఖ్యమైన అలాగే విశాల ప్రాతిపదిక గల విషయాన్ని జోడించడంలో మునుపెన్నటి కన్నా ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. నవీన్, శివశంకర్ వెలువరిస్తూ వచ్చిన కథావార్షికలు, వారి ఎంపికకు తగిన కథలసంపుటి వార్షిక ప్రచురణలుగా వెలువడ్డాయి. ప్రత్యేకించి రచనలు చెయ్యి తిరిగిన / కొత్త రచయితల నుంచి ఆహ్వానించి, ఆ కథల పుస్తకాలు మూడుసార్లు ప్రచురించిన వేదగిరి రాంబాబు, ఇతర మిత్రుల కృషి ఇక్కడ ఆగింది.

అయితే సముద్రం, వయసు కథలు, ఈ కాలం కథలు, పేజీ పేచీ కథలు, అలవాట్లో పొరపాట్లు, బాలల కథలు, ఇలా కథల సంపుటాలు అందించిన ఘనతకా, లేక, గురజాడ, గిడుగు, శ్రీపాద అంటూ వారి జీవితపు మైలురాళ్లు, వారి సాహిత్య సేవకు సంబంధించిన ప్రధాన అంశాలు అందరికీ జ్ఞాపకం చేస్తూ తానొక నిత్య సంచలనంగా బతికినందుకా, తెలుగు వారపత్రికలు- రచనా ధోరణులు అంటూ ఒక పరిశీలన వెలువరించినందుకా, హైదరాబాద్ నాలుగు వందల ఏళ్ల సంచిక రూపశిల్ప సమర్థతకా, వేమూరి బలరాం గారి స్వాతి పత్రిక కోసం జైలుగోడల మధ్య అంటూ, ఖైదీల జీవనశైలీ పరిచయ రచనలు అరవై-డెబ్బై వారాల పాటు వెలువరించినందుకా, ఇవన్నిటితో బాటు, కథని ఉద్యమం స్థాయికి నడిపించే ఉద్యోగ విజయాలు తన సాహిత్య జీవితంలో సాధిస్తూ, కథ, తానూ వేరు కాదు అంటూ కథావ్యవస్థ కోసం బతికిన వారి పేరు చెప్పాలంటే ముందుగా వేదగిరి రాంబాబు పేరే చెప్పాలి. నెల జీతం చెక్కు అలా పట్టికెళ్లి ఒక వారపత్రిక సంపాదకునికి ఇచ్చి, కథల పోటీ పెట్టమనే పట్టుదల పేరు వేదగిరి రాంబాబు. విజయనగరంలో 'తెలుగు కథకు వందేళ్లు' అంటూ బెలూన్లు ఎగురేసిన పసితనాల పండుగ పేరు వేదగిరి రాంబాబు. గురజాడ దేశభక్తి గీతం పలు భారతీయ భాషల్లో అచ్చు వేసిన ముద్రణోత్సాహం పేరు వేదగిరి రాంబాబు.

కథలు రాసినందుకు, శ్రీపాద విగ్రహం పెట్టించేదాకా ప్రయాణించి, ఆ విగ్రహానికి ఒక గొడుగు కూడా ఏర్పాటు చేసే దూరదృష్టి ఉన్నందుకూ, వేదగిరి కమ్యూనికేషన్స్ ద్వారా ఎక్కడ కథ కదిలినా, నేనూ కదులుతాను అంటూ, కథల ఆలనా, పాలనా కోసం గోవర్ధన గిరిని ఎత్తిన సంకల్ప శుద్ధుడి పేరు వేదగిరి రాంబాబు. ఏప్రిల్ 1994లో 'కథాసదస్సు' సంకలనానికి తన మాట రాస్తూ -'కథలో పుట్టకపోయినా, కథలో పెరిగిన నాలో తెలుగు కథకి ఏమి చేయగలను అనే ఆలోచన రోజురోజుకీ పెరగసాగింది. కాలేజీలో ఉన్నప్పటి నుంచే కథలు రాస్తున్న నాకు ఆ తర్వాత కథలు రాస్తాడన్న అర్హతతోనే ఉద్యోగం వచ్చింది. ఇంతవరకూ పెరిగాను, సాహిత్యమే నా జీవితం అయ్యింది.

అందుకని తెలుగు సాహిత్యంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రమేయం ఉన్న నలుగురినీ ఒక చోటకు చేర్చి కొంత ఆలోచన చేయాలనే అభిప్రాయం కలిగింది" అని దాన్ని ఆచరణలోకి సాధన సాహితీ స్రవంతి, రచన పత్రిక, విహారి వంటి మిత్రుల తోడ్పాటుతో ముందుకు నడిపారు వేదగిరి రాంబాబు. వాకాటి పాండురంగరావు వంటి కథారంగ ఉద్దండులు 'కొత్తకథ" అంటూ ఒక సంకలనం రావడానికి వేదగిరి రాంబాబు చేసిన ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు. ఇంకా వాకాటి వారే, కథా సమీక్షలో భాగంగా, తన మిత్రవాక్యంలో, 1994 గురించి నాలుగు మంచి మాటలు నవీన్, రాంబాబులను ప్రస్తావిస్తూ- ఇలా చెప్పారు. "గోష్ఠులూ, సదస్సులూ, సంకలనాలు, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు, రావిశాస్త్రి పురస్కారాలు, ఈ జనవరి 17న ఉద్భవిస్తూన్న చాసో స్ఫూర్తి వంటి సంస్థలూ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హవుసూ, ఇట్లా తెలుగు కథ అందరి కళ్లూ జిగేల్మనేలా పరుగులు తీస్తోంది". ఈ జిగేల్మనే లక్షణానికి వేదగిరి రాంబాబు కూడా ఒక ముఖ్య కారకుడు. ఇంతలా కథా వ్యవస్థ పెంపొందడంలో తనేదో ఒకచోట కూచుని కథలు రాసుకునేవాడిగా కాక, వ్యవస్థగా కథా నిర్మాణంలో పాలుపంచుకున్న నిపుణుడు వేదగిరి రాంబాబు. ఎలా నిపుణుడు అంటాము? అంటే ముందే చెప్పుకున్నట్టుగా 1990 దశకం, తెలుగు కథకు, ఒక సమీకృత పరిణామాల దశాబ్దం అనుకుంటే, వాసిరెడ్డి నవీన్, పాపినేని శివశంకర్, కథ పేరిట వార్షికలు తీసుకురావడం ఆగలేదు. అలాగే, కారా మాస్టారు తన మిత్రులతో కలిసి ట్రస్ట్‌గా ఏర్పడి నిర్మాణం చేసిన కథా నిలయం కూడా నేటికీ ఇరవై ఒక్కేళ్లుగా క్రమక్రమ ప్రవర్ధమానమవుతూ వస్తున్నది. వీటి పరిమితులూ, ప్రయోజనాలూ వీటికి ఉండగా, 1994లో 'కథాసమీక్ష' అంటూ వేదగిరి రాంబాబు మొదలుపెట్టినది. మధ్యలో ఆగినా, బహుశా, కథను ఒక వ్యవస్థగా, సంప్రదింపు వనరుగా నిర్మాణం చేసే దిశలో జరిగిన విలువైన కృషి.

ఇటువంటి సమగ్ర పద్ధతిలో తెలుగు కథ గురించి మళ్లీ ఏ ప్రయత్నమూ జరగలేదు. వార్షిక కథా విషయ కరదీపిక (యాన్యువల్ షార్ట్‌స్టోరీ హేండ్ బుక్) అని పిలువదగ్గ పరిపూర్ణత ఈ ప్రయత్నంలో ఉండడం, వేదగిరి రాంబాబు కుశలత, ప్రయోజన దృష్టికి ఒక తార్కాణం. ప్రతి పత్రికలో వచ్చిన కథలను ఒక్కో నిపుణ పరిశీలకునికి కేటాయించి, భిన్న పత్రికల్లో వచ్చిన వార్షిక కథారాశి పై వ్యాసాలు, అలాగే, ఆ ఏడాది పరిశోధనలు, గైడ్‌ల వివరాలూ, వెరసి 1994 సంవత్సరంలో తెలుగు కథ దశ-దిశ ఎరగాలి అంటే, ఈ క్రోడీకరణ కన్నా విలువైన, రక్షణ సంప్రదింపు వనరు మరొకటి ఉండదు.

ఇంత విశాల పరిశ్రమ, విలువైన సంకలనం, కథల విషయంలో ప్రతి ఏటా జరిగితే చాలా ఉత్తమంగా ఉంటుంది. అందువల్ల కథావ్యవస్థ ఏర్పాటులో, అంతకు ముందు లేనిది, దురదృష్టవశాత్తూ అటుపై రానిది, పరిశీలక బుద్ధి కుశలతతో ఈ వార్షిక కథా కరదీపికగా, తెలుగు కథా చరిత్ర వనరుగా అందివ్వడంలో వేదగిరి రాంబాబు గారిది ఎనలేని పాత్ర, చాలామంది వ్యక్తిగత స్థాయిలో మంచి కథకులు, వారివి గొప్ప కథలు ఉన్నా, కథాక్రమ చరిత్ర నిర్మాతలు అరుదు, అటువంటి కథా హృదయం ఎరిగి, ఆధునిక ప్రమాణాలు గల కథా చరిత్ర నిర్మాతల్లో ముఖ్యుడు. నిపుణుడు, వేదగిరి రాంబాబు. ఇదీ వారిచ్చిన వారసత్వం.

ఇటువంటి స్టోరీ హేండ్‌బుక్ తయారీ ప్రయత్నం పాతికేళ్ల ముందరే తెలుగు సాహిత్యంలో జరగడం మన కాలంలో జరిగిన విశిష్ట ఆరంభాలను తెలుపుతుంది. ఇప్పుడు సైతం, కథని ఒక ఇన్‌స్టిట్యూషన్‌గా తలిచి, ఒక ఇన్‌స్టిట్యూషన్ బిల్డర్‌గా వేదగిరి రాంబాబు చేసిన అయిదు దశాబ్దాల కృషికి తగు విలువ మనం ఇవ్వాలి అనుకుంటే, చేయాల్సింది, ఈ వార్షిక కథా కరదీపికను వారు ఏర్పాటు చేసిన పద్ధతుల ఆధారంగా ప్రతి ఏటా తయారుచేయగలగడం, శాశ్వతంగా ఈ స్టోరీ హేండ్‌బుక్‌కి "వేదగిరి వార్షిక కథా కరదీపిక" అని పేరు పెట్టి, ఏ ఏడాదికి ఆ ఏడాది, విషయాన్ని వీలైనంత సమగ్రంగా తీసుకురావడం, ఒక సాహిత్య సమాజం కోసం జరిగే సామూహిక కృషి ఇలా ఉండాలి అని రూపొందించిన వేదగిరి రాంబాబుకి అదీ నిజమైన నివాళి.

కొన్ని కథలకో, కొన్ని విశ్వాసాలకో, ఒక మంచి రచయితను ఎప్పుడూ గుర్తు ఉంచుకోవడం సహజం. కానీ తెలుగు కథకు ఇరవయ్యో శతాబ్దంలో వేలుబంతి కొలువులు పెట్టిన వారు కొందరు, కథకు ఇల్లుకట్టి, కథారుణం తీర్చుకున్నవారు కొందరు, కథకు చరిత్ర నిర్మాతలుగా వార్షిక కరదీపికలు తయారుచేసినవారు కొందరు. అలా ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కథాకీర్తి మండపంలో, వేదగిరి రాంబాబు శాశ్వతుడు. ఆయన మనకిచ్చిన వార్షిక కథా కరదీపిక ఆలోచన, ప్రణాళిక, ఏటేటా ఆచరణలో మనం సజీవం చేస్తే, ఎప్పుడూ ఆ వెలుగుల లాభం పొందేది తెలుగు సమాజమే. వెలుగులు పంచే రాంబాబు వేదగిరి ఎప్పుడూ కొండెక్కని దీపమే.

- రామతీర్థ

9849200385

రీడింగ్ రూమ్



రామతీర్థ
9849200385

ఆకెళ్ళ రవి ప్రకాష్‌కు విశాఖ వీడ్కోలు

ప్రముఖ కవి, గిరిజన కొ ఆపరేటివ్ కార్పొరేషన్ లిమిటెడ్ వైస్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ గా విశాఖలో నాలుగు సంవత్సరాల పాటు సేవలు అందించిన ఆకెళ్ళ రవి ప్రకాష్, కొద్ది కాలం క్రితం వరకూ తన ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా, అరకు కాఫీ ఉత్పత్తులకు మంచి బ్రాండ్ ఇమేజ్, జాతీయ, అంతర్జా తీయ మార్కెట్, ఏర్పరచే విధంగా చేసిన కృషి విశాఖ ప్రజలు ఎప్పటికీ గుర్తు పెట్టుకుంటారు. అరకు లోయ కాఫీకి ఘన చరిత్ర ఉన్న ది. తూర్పు కనుమల్లో బ్రిటిష్ వారు 1980ల్లో పమెలూరు లోయ వద్ద కాఫీ పంట ప్రవేశ పెట్టారు. పంధొమ్మిదో శతాబ్దంలో కాఫీ పంట అరకు లోయకి విస్తరించింది. స్వాతంత్ర్యం తరు వాత ఆంధ్రప్రదేశ్ అటవీ శాఖ, కాఫీ తోటలను పెంపొందించింది. కాఫీ బోర్డ్, ఆంధ్రప్రదేశ్ గిరిజన శాఖకు ఈ కాఫీ తోటల పెంపకం, వాణిజ్య ప్రాధాన్యత పెరిగేలా, బాధ్యతలు అప్పగించింది. ఆలా ప్రత్యేక కాఫీ ప్లాంటేషన్ డెవెలప్మెంట్ శాఖ ఏర్పడి, విస్తరంగా అభివృద్ధి చేసిన కాఫీ తోటలను, ఒక్కో గిరిజన కుటుంబానికి రెండెకరాల చొప్పున కేటాయిస్తారు. వీరు కాఫీ గింజలను తెచ్చి కాఫీ గింజల సేకరణ కేంద్రాల్లో అందచేస్తారు. ఇది ప్రాథమిక సేకరణగా, పలు దశలు దాటి, నాణ్యతా పరీక్షల అనంతరం, అరకు కాఫీ, మన రాష్ట్ర ప్రతిష్ఠాత్మక ఉత్పత్తి గా వెలువడుతున్నది. రవి ప్రకాష్ గిరిజన కార్పొరేషన్ పదవీ బాధ్యతలు స్వీకరించాక, ఈ ఉత్పత్తి పై దృష్టి పెట్టి, తన పదవీ కాలంలో తమ మంత్రిత్వ శాఖ ద్వారా, ముఖ్య మంత్రి ప్రత్యేక శ్రద్ధ వల్లా, అరకు కాఫీ, విశాఖ అంతర్జాతీయ నగరంలో, ఒక కమర్షియల్ బ్రాండ్‌గా నిలబడింది.

రవి ప్రకాష్ ఒకసారి తన అభిప్రా యంలో ఆంధ్రుల లేపాక్షి, ఏటి కొప్పాక బొమ్మలూ, బొబ్బిలి వీణా, వలె అరకు కాఫీ కూడా, మంచి స్థాయి బహుమతిగా ఏడుగుతుందని, ఆవకాయ అయినా తినని వారుండవచ్చును కాని అరకు కాఫీ తాగని వారు భవిష్యత్తు లో ఉండరు అని, విశాఖ మన్యంలో పదకొండు వందల మీటర్ల ఎత్తున, లక్ష ఎకరాల పైగా పండుతున్న ఈ పంట, అనేక గిరిజన కుటుంబాలకు ఎలా ఒక ఆలంబన, జీవన ఆధారంగా ఉన్నదో తెలిపారు. 2015 -16లో పద్నాలుగు వందల టన్నుల కాఫీ ఉత్పత్తి జరిగి, కాఫీ గిరిజన రైతులు, దళారీల బారిన పడకుండా, నేరుగా, గిరిజన సేకరణ కేంద్రాల్లో తమ పంట తీసుకొచ్చి ఇవ్వడం ఎలా ఒక పెద్ద నెట్ వర్కో కూడా ఒకసారి చెప్పారు. ఒక కేజీ తెచ్చిచ్చే చిన్న రైతు నుంచి కూడా, గింజలు సేకరించడం ఒక సామాజిక బాధ్యత అని, కాఫీ పంట తోటల పెంపకం, ఎలా గిరిజన స్థానిక అభివృద్ధికి ఉపకరి స్తున్నదో, కూడా, వివరించారు

గిరిజన ఉత్పత్తుల్లో మంచి వేసవి కాలపు పానీ యంగా నన్నారి ఉత్పత్తి కూడా, రవి ప్రకాష్ పదవీ కాలంలో, ప్రజలకు అందిన మరొక విశేషం. రసా యనిక పానీయాలకు గట్టి పోటీగా, ఆరోగ్య హేతు వుగా, మన విశాఖ మన్యం ఉత్పత్తిగా, ఈ వాణిజ్య ముందంజలను, మనం కొనుగోలు చేసి దేశీయ మార్కెట్‌ను ప్రోత్సహించవలసిన అవసరం ఉన్నది. గిరిజన కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ సమన్వయంతో రవి ప్రకాష్ దిశా దర్శకత్వంలో, విశా ఖపట్నం, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల్లో ఇరవై ఏడు విదేశీ నగరాలకు చేరే ప్రయాణి కులకు, పర్యాటక శాఖ తరపున ప్రచారక పానీ యంగా అందచేయడం జరుగుతున్నది. గిరిజన కాఫీ ఉత్పత్తుల్లో తొంభై శాతం పైగా, స్వీడన్, ఇటలీ, ఎమిరేట్స్, స్విట్జర్లాండ్ దేశాలకు ఎగుమ తి అవుతున్నది. ఆకెళ్ళ రవి ప్రకాష్ ఉత్తమ అధికారే కాకుండా, మంచి కవి కూడా. కవిత్వం తన మొదటి ప్రాధాన్యత అని స్పష్టంగా చెప్పే, ఈ కవిత్వ ప్రేమికుడు, ఏ అధికారిక పదవి కన్నా కూడా, మంచి కవిత రాసిన రోజు తనకు ఎక్కువ ఆనందం కలిగిస్తుందని అంటారు. కవిత్వం మనం మాటాడుకున్నంత సరళంగా, సహజంగా, జీవన వేగంతో ఉండాలన్నది, వారి మాట. పాండిచేరి, యానాం, విశాఖ నగరాలపై కవితలు రాసిన కవి రవి ప్రకాష్, ఇసుకగుడి, ప్రేమ ప్రతిపాదన, భూమి పుట్టిన రోజు మొదలైన కవిత్వ సంపుటాలు వెలువరించి, కథలూ, వ్యాసాలూ, భిన్న సాహిత్య విషయాలపై సృజనగా గల వారు.

విశాఖలో పలు సాహిత్య సభలలో పాల్గొని,, సాహిత్య అకాడెమీ గిరిజన సాహిత్య సంస్కృతి కార్యక్రమాలకు తోడ్పాటు అందచేసిన స్ఫూర్తి వారిది. విశాఖలో మొజాయిక్. సాహిత్య సురభి, ఋత్విక్ ఫౌండేషన్ ప్రదానం చేసే వార్షిక పురస్కారాలైన, 'అక్షర గోదావరి' కవిత్వానికి గాను 2018లో వారికి అందచేయడం జరిగింది. వారు ఆంధ్రప్రదేశ్ లో తమ పదవీ బాధ్యతలు పూర్తి చేసుకుని, పాండిచేరి ప్రభుత్వ అధికారిగా వెళు _న్నారు. విశాఖ సాహిత్య, సాంస్కృతిక సమాజం వారికి అభినందనలు, శుభాకాంక్షలూ తెలుపుతున్నది. రవిప్రకాశ్ బాగా ఇష్టపడే కవిత్వం అంటే, తనకి గల శ్రద్ధ, తత్పరత తెలిపే ఒక కవిత వారి స్వభావాన్ని తెలిపేది, దిగువ పొందుపరుస్తున్నాను.

చిన్నప్పటి బడి

నలభై ఏళ్ల తరువాత
మళ్ళీ ఇక్కడికి వస్తాను
ఎప్పటిలానే నది ఒడ్డు మీద
నిలబడ్డ ఊడల మర్రి.

పియానో నుంచి రాలి పడ్డ స్వరాల్లా
దీర్ఘ వృత్తాకార పత్రాల గుసగుసలు

శలవ రోజు కాబోలు
ఖాళీ అయిపోయిన
వాద్యనిలయంలా ఉంది బడి

అదే దృశ్యం
ద్వీప సమూహంలా నిలబడ్డ చెట్లు
చెట్ల కొమ్మల గ్రంథాలయాల నిండా
కొత్తగా ప్రచురింపబడ్డ ఆకులు
నా బాల్యపు ప్రాంగణం ముందు
వణుకుతూ నిలబడ్డ హల్లులా నేను

మాసిన గెడ్డం లాంటి పచ్చిక మీద
వరి కంకుల జడలు వేసుకుని
ఆటలు ఆడిన ఆడపిల్లలు
అతకని సంధిలా జారిపోయే నిక్కర్లని
పైకి లక్కుంటూ మగ పిల్లలు
రూపకాలన్నీ బహిష్కరించినా
ఎంతకూ వదలని బాల్యపు జ్వరం

ఈ బడి ఆవరణ నుంచి మొదలై
సముద్రమంతా వ్యాపించిన జిల్లాలా
ఆకాశమంత వ్యాపించిన రాష్ట్రంలా
కవిత్వంగా రూపాంతరం చెందిన నా బాల్యం

గత ఋతువు పంటను
ఇప్పుడు నూరుతున్న రైతులా
ఆకులకన్నా ఎక్కువ కాలం
బతికిన ఒక్కో గాయాన్నీ
బయటకు తీసి పేర్చుకోవడం కన్నా శిక్ష ఏముంటుంది

ఇసక లంకల్లో
కాలపు మలుపుల్లో
ఆడుకుంటున్న అచ్చులన్నింటినీ
కవిత్వంగా రాయడం కన్నా
పెద్ద పరీక్ష ఏముంటుంది?

లీడర్ సంచలన వార్తా పత్రిక

సాహిత్యం

ఆధునిక మహిళ భారతదేశ చరిత్రను పునర్లిఖిస్తుంది..
గురజాడ అప్పారావు

విశాఖపట్నం సోమవారం 24-9-2018

కందుకూరి వారి 'సత్యవతి చరిత్రము'

(శతవర్ధంతి వత్సర ప్రత్యేక రచన)

"అలనాడు కందుకూరి వారే స్త్రీ విద్యా కోసం పరిశ్రమించక పోతే నేడు ఇక్కడ మేము ఈ వేదిక పై మాట్లాడే ఉండే వాళ్లమే కాదు" అని కందుకూరి వీరేశలింగం 100వ వర్ధంతి సభలో పేర్కొన్నారు ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత తెలుగు ఆచార్యులు శ్రీమతి మలయవాసిని గారు. అంతకు పూర్వం కందుకూరి పురస్కారం అరసం నుండి స్వీకరిస్తూ ప్రఖ్యాత స్త్రీవాద రచయిత్రి వోల్గా కూడా ఇదే మాటన్నారు. తెలుగు లో తొలి స్త్రీవాది మీరేనా అని అడిగినప్పుడు "కాదు మొదటి వారు కందుకూరి వారు, రెండవ వారు గురజాడ, నేను మూడవ వాడిని" అని సవినయంగా చెప్పారు చలం గారు. సతీ సహగమనం, బాల్య వివాహాలు నివారణ కోసం, స్త్రీవిద్య, బాల వితంతువుల పునర్వివాహాల కోసం అహర్నిశలూ శ్రమించి సాధించిన కర్తవ్య పరాయణుడు కందుకూరి. వందకు పైగా పుస్తకాలు, అనువాదాలు, కథలూ, సామాజిక అంశాలపై సందేశాలను అందించే రచనలూ ఎన్నెన్నో చేసిన కందుకూరి వారు 1883 ప్రాంతానికే స్త్రీలకోసం కొన్ని కథల రూపంలో చేసిన రచనల్లో ముఖ్యమైనది ఈ 'సత్యవతీ చరిత్రము'.

80పేజీల ఈ కథలో మనకు అనగా పాఠకులకు.ముఖ్యంగా స్త్రీలకు నుడివిన సందేశాన్ని గ్రహించాలి. అప్పటివరకూ సాహిత్యంలో ప్రబంధ నాయికల సౌందర్య వర్ణన తోనే ఉన్నాయని, స్త్రీని కేవలం సౌందర్య ప్రతీకగానే తప్ప ఆత్మ ఉన్న, వ్యక్తిత్వం గల వ్యక్తిగా గుర్తెరుగ లేదని మొదటి ప్రకరణం లోనే బాధపడతారు కందుకూరి. అందుకు భిన్నంగా ఒక విద్యావంతురాలు, గుణవంతురాలు అయిన సత్యవతిని నాయిక గా చేసి ఈ సాంఘిక కథను, తేట తెలుగులో మనకు అందిస్తారు. స్త్రీ విద్యావంతురాలైతే ఏమి చేయగలుగుతుంది అన్నది ఒక కథా రూపంలో చెప్తూ, వివిధ సందర్భాలలో గుణవతి అయిన స్త్రీ ఎలా మసులుకుంటుందో చూపి మనకు ఎలా మసులుకోవాలో అనే సందేశాన్ని అందిస్తారు.

సత్యవతీ చరిత్రము కథ క్లుప్తంగా: సత్యవతి ముంగొండ అగ్రహారం లోని లక్ష్మీ నారాయణ మూర్తి, యశోదమ్మల రెండవ సుపుత్రుడు నారాయణ మూర్తి భార్య, ఆ అయింటికి రెండవ కోడలు. లక్ష్మీ, నారాయణ మూర్తి దంపతులకు నలుగురు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళు. అందులో రెండవ వాడు నారాయణ మూర్తి. సత్యవతి చదువుకున్న అమ్మాయి. ఆమె పుట్టింటివారు విద్యావంతులు, సంపదగలిగిన వారు కూడా. అందుకే ఆమె స్వేచ్ఛగా చదువుకుంది. విద్య వివేకాన్నిస్తుంది, విచక్షణను మేల్కొలుపుతుంది, మానవత్వాన్ని పెంపొందిస్తుంది. లోక జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. సత్యవతి లో ఈ లక్షణాలన్నీ ఉన్నాయి. సతీ సహగమనం (సొగుమానం) గురించి ఒక అవ్వ మాటల్లో విని చాలించి పోతుంది సత్యవతి. అశుభం శుభం తెలియని అమాయకపు చిన్నారిని ఎలా భర్త చితి మీద బలవంతంగా కూర్చోబెట్టి దహనం చేశారో అవ్వ నోట విని, ఈ దాష్టీకాలకు అంతే లేదా అని విచారిస్తుంది సత్యవతి. స్త్రీ విద్య అవశ్యకతను తన కుటుంబం లోనూ, చుట్టూ పక్కలవారికీ కూడా బోధ పడేట్లు చేస్తుంది. వారికి విద్య గూడ నేర్పుతుంది.

ఇంట్లో జరిగే ఛాందసపు ఆచారాలను అడ్డుకుం టుంది. ముఖ్యంగా పురిటి గదికి గాలి సోకనీయక పోవడం అందువలన, క్రిమి కీటకాదులు పేరుకొని ఆ బాలింతకు, బిడ్డకు కు చేటు చెయ్యడం, ఈ దురాచారాన్ని అడ్డుకుంటుంది.(దీన్నే బాలింతను బిడ్డని బాధించే ఎన్నెమ్మ అమ్మవారిగా, ఎన్నో గ్రామీణ పాటలు ఉన్నాయి) ఆ ఎన్నెమ్మ బారిన పడి మాతా శిశువులు చని పోకూడదు అన్నది కందుకూరి తపన. తన పుట్టింట్లో వెలుగు గాలి ఆడుతున్న గదిలోనే ఆరోగ్యంగా ప్రసవిస్తుంది మగ పిల్లాడ్ని. రెండవ సారి గర్భం దాల్చి ఆడపిల్లను ప్రసవిస్తుంది. అయితే ఆమె ఆరోగ్యం క్షీణిస్తుంది. అందుకు కారణం ఆమె ఎంతో ప్రేమించే తన ఇంటి ఆడపడుచు చిన్న పిల్ల సీత, అకాలంలో వైధవ్యానికి గురి కావడం. ఎంతో ప్రేమగా కూతురిలా పెంచుకున్న సీత బతుకు అన్యాయం కావడం సత్యవతిని క్రుంగదీస్తుంది. అయిననూ ఆమె ఆ విషాదం నుంచి తాను తేరుకుని, ఘోరుమని విలపించకుండా గుండెల్లోనే ఆవేదన దాచుకుని, సీతను తనతోనే ఉంచుకుని ఆమెకు మంచి కథలు, విషయాలు చెప్తూ సీతను ధు:ఖం నుండి బయటపడేలా చేస్తుంది. అనుకూల దాంపత్యం వలన ఆమె భర్త నారాయణమూర్తి మంచి చదువులు చదివి ప్లీడర్ గా బాగా స్థిరపడతాడు. అతనికి అనారోగ్యం చేసినప్పుడు కూడా సత్యవతి తన నగలు అమ్మివేసి అతని ఆరోగ్యం చక్కపడేట్టు చేస్తుంది. సీత, చిన్న మరిది ఇద్దరూ విద్యావంతులౌతారు. ఆర్థిక సహాయం కోసం సీత ఇన్నీసు పేట (రాజమండ్రి) లో ని బాలికల పాఠశాలలో ఉపాధ్యాయిని గా పనిచేస్తుంది. మరొక మరిది రామస్వామి, మహాలక్ష్మిల జీవితం కూడా ఒక కొలిక్కి తీస్తుంది. సత్యవతి మహాలక్ష్మికి నేర్పిన సహనం, సమర్థత తోనే ఆమె జీవితాన్ని చక్క బరచుకుంటుంది. అర్ధాంగి సహనాన్ని సంయమనాన్ని చూసిన రామస్వామి తన తప్పిదం తెలుసుకుని కాపురం చక్కబరుచుకుంటాడు.

కేవలం ఎనభై పేజీల ఇంత చిన్న కథలో ఎన్నెన్నో ఆర్థిక, దైహిక, మానసిక, సామాజిక సమస్యలను చర్చించారు కందుకూరి వారు. విపరీతమైన చాదస్తం తో పిచ్చి పూజలూ, వ్రతాలూ చేస్తూ భర్తకు దూరమయ్యే సూరమ్మ వలన ఎలా ఆమె భర్త బాధ పడుతున్నాడో అటువంటి చాదస్త్రాలతో శరీరాన్ని శుష్కింప చేసుకోకూడదు అన్న విషయం కూడా మనకు అవగతమౌతుంది. దానివలన దంపతుల నడుమ ఏర్పడే దూరం అందువలన కలతలు అన్నీ ఆ రోజుల్లోనే రాసిన తొలి తరం స్త్రీవాది కందుకూరి. వాడుక భాష మాటలు, నుడికారం, జాతీయాలు, ఈ చిన్న పుస్తకంలో విరివిగా ఉదహరించదగ్గ సంపన్నంగా ఉన్నాయి.

'సత్యవతి చరిత్రము' స్త్రీలు తప్పక చదవాల్సిన పుస్తకం. చలం 'స్త్రీ' కి ఇది పునాది అనిపిస్తుంది. స్త్రీల దైహిక ఆరోగ్యం, విద్యా, మానసిక వికాసము, సామాజిక స్పృహ, స్వయం నిర్ణయం, మానసిక సమతౌల్యం ఇవన్నీ చర్చించారు రచయితగా కందుకూరి. .'ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది' అన్న గురజాడ మాటలకు ఉదాహరణ ఈ 'సత్యవతీ చరిత్రము'. అప్పుడప్పుడే ప్రపంచం లో ఆధునిక మహిళ అనగా ఒక నిర్వచనం ఏర్పడుతున్న సమయమది. ఈ విషయాన్నే సారా గ్రాండ్ అనే ఒక మహిళా విలేఖరి ఒక ప్రసంగం లో 'న్యూ వుమన్' అని 1894 లో ప్రస్తావించింది. అంతకన్నా ముందరే కందుకూరి, ఆధునిక మహిళా ఎలా ఉండాలో, ఈ నవలికలో చిత్రించడం విశేషం.

అప్పటినుండి ఈ ఆధునిక మహిళ అనే అంశం ఎందరెందరో గొప్ప రచయితలూ, నాటక రచయితలూ ఇబ్సెన్, బెర్నార్డ్ షా ఇలా ఎందరెందరి రచనల్లోనో ఇటువంటి సమర్థమైన స్త్రీ పాత్రలు చోటుచేసుకున్నాయి. అటువంటి స్త్రీల పాత్రల నడుమ మన సత్యవతికి కూడా సముచిత గౌరవం లభిస్తుంది. 1880 ల్లో ఇటువంటి మహిళభ్యుదయమే కుటుంబాపు అలాగే సంఘపు అభ్యుదయం అనే కల్పన చేయడం సాహసోపేతమనే చెప్పాలి. కందుకూరి వారు కేవలం సాహిత్య వేత్త మాత్రమే కాదు, సాంఘిక రంగంలో ఆచరణ లక్ష్యం గల అకుంఠిత దీక్షాపరులు, కార్యవాది కూడా. నాటి తరంలో విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం లేని బాల వితంతువులకు పునర్వివాహం చేయడమే పరిష్కారమని నమ్మారు, ఆచరించారు.

సత్యవతి అనాడే చెప్పిన ప్రసూతి సంక్షేమ విషయం నేడు కూడా "మాతా శిశు సంరక్షణ పథకాలు" గా ప్రభుత్వాలు ఎంతో శ్రద్ధ తీసుకుని అమలు పరుస్తూ, ప్రజల్లో చైతన్యం కోసం ప్రచారం చేస్తున్న ఆరోగ్య రక్షణ విషయాన్ని, నాడే తాను అజెండాగా తీసుకుని సత్యవతి ద్వారా చెప్పించారు కందుకూరి. పురిటి గదిలోనికి గాలి, వెలుతురు సోకనివ్వకుండా చేసే ఛాందసవాదులకి అది హానికరమని, గాలి వెలుతురు సోకిన, పరిశుభ్రతతో కూడిన గదిలోనే బాలింత, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని చెప్పిస్తారు. అలాగే గ్రహణం నాడు గర్భవతి చంద్రుని చూస్తే పుట్టే బిడ్డకు అవకరం కలుగునన్న మూఢ నమ్మకాన్ని కూడా సత్యవతి చేత అటువంటిది ఉండదని, నిజం కాదని నిరూపిస్తారు. సత్యవతి గర్భవతిగా ఉండి గ్రహణం చంద్రున్ని చూస్తుంది. ఆమె ప్రసవించేటప్పుడు ఆ బిడ్డ ఎలా పుట్టాడా అని చుట్టూ పక్కల వారందరూ వచ్చి అందంగా ఆరోగ్యంగా పుట్టిన బిడ్డను చూసి ఆశ్చర్యపోతారు.

అందరికీ మంచిని నుడివే సత్యవతి ఆ వూరివారందరికీ ఆత్మీయురాలౌతుంది. ఎవరైనా ఏదైనా కొత్త వస్తువు కొనుక్కున్నా, ఒక కొత్త ఆలోచన చేసినా ముందుగా ఆమెకే చెప్పేవారు. అలాగే ఎవరైనా ఇంటిలోని ఆలుమగల నడుమ, లేదా కుటుంబ సభ్యుల నడుమ కలహాలు ఏర్పడినా సత్యవతి వద్దకు వచ్చి ఆమె సలహా తీసుకుని నడుచుకునేవారు. 1883లో కందుకూరి ఈ నావలికలో సత్యవతి, నారాయణమూర్తి దంపతులు సీతకు పునర్వివాహం చేయాలని తలుస్తారు కానీ జరుగుతుందా లేదా అన్నది కాలానికి వదిలేస్తారు. అప్పటికే శంకరాచార్యుల నిషేధ పత్రిక ప్రభావం సంఘం మీద ఉందని ప్రస్తావన చేస్తారు. కానీ 1881లో డిసెంబర్ లో, నిజ జీవితంలో కందుకూరి అప్పటికే దక్షిణ భారత దేశంలో తొలి వివాహాన్ని జరిపించారు. అది మొదలుగా వరుసగా కందుకూరి వారు మాత్రం చాలా వివాహాలు చేసారు.

సత్యవతి, నారాయణమూర్తిల దాంపత్యం మనకు కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మమ్మల దాంపత్యాన్ని పోలి ఉంటుంది. స్త్రీల పట్లనే కాదు పురుషుల పట్ల కూడా సానుభూతి కలిగి ఉంటారు కందుకూరి. సంసారం చక్కగా సాగవలెనన్న స్త్రీ పురుషులిరువురు బాధ్యతాయుతంగా అర్థం చేసుకుని ఒకరికి ఒకరుగా సాగుతూ సమాజానికి ఉపయోగ పడాలి అన్నది ఆయన సదుద్దేశ్యం. తన మెట్టినింటి సమస్యలు తనవిగా భావించి అందుకు పరిష్కారములు చూపించేందుకు ప్రయత్నిస్తుంది సత్యవతి.

అంతే కాదు తన చుట్టు పక్కల వారి సమస్యలకు కూడా సహానుభూతితో తగు పరిష్కారాలు సూచిస్తుంది. ఎంత ధు:ఖ, ము కష్టము కలిగినా మానసిక సంయమనం కోల్పోకుండా అంతటి ధు:ఖాన్నీ బాధనీ దాచుకుని బయటికి చిరునవ్వుతోనే అగుపడుతుంది. నేడు మనం వ్యక్తిత్వ వికాసం, మూర్తిమత్వ వికాసం అంటూ నేర్చుకుంటున్న ఈ విషయాలన్నీ నాడే కందుకూరి వారు పొందు పరిచారు ఈ కథలో. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఈ రచన ప్రాముఖ్యతను బాగా పరిశీలన చేయవలసి ఉన్నది. వాస్తవికత ఆధారంగా సత్యవతి చరిత్ర రచన - గురజాడ వారి కన్యాశుల్కం నాటకం (1892) కన్నా ముందరే కందుకూరివారు 1883లో ఈ నవలికలో వాడినది వ్యవహారిక భాష అని ఈ సత్యవతి చరిత్రము తెలియచేస్తుంది.

"ఈ కథ యందేవో చిత్రవిచిత్రములుండునని భ్రమపడబోకుడు. మన పురాణముల యందు వలె పది తలలు గల వారును, వేయి చేతులున్న వారును, సముద్రమునంతను పానము చేయగలవారును, భూమి చాప చుట్టువారును, ఇందెవ్వరును రారు. అట్టి యద్భుతములు పుట్టెడు కాలము నను పుట్టినవన్నను, నమ్మెడు కాలమును బహు సంవత్సరముల ముందే దాటి పోయినవి. శృంగార ప్రబంధముల యందు వలె, దీని యందు దీర్ఘ సమాసములతోనూ, గూఢ పదములతోనూ, వనవిహారము, జలక్రీడ, వధూవరుల యన్యోన్య వరణము, మొదలైన వర్ణనలు సహితమెక్కడను కనపడవు. స్త్రీలు స్వతంత్రించి వెలికత్తెలతో కలిసి వన విహారము చేసెడు వార్తలిపుడు కలలోని వార్తలైనవి. జలక్రీ డలు పుస్తకములలో మాత్రమున్నవి. యావజ్జీవమును సుఖ దుఃఖములకు పాలికాపులయి ఉండవలసిన కన్యావరుల ఇష్టమునసనుసరించి వివాహములు జరిగెడి యుత్తమకాలమదు గంటి తమ వినోదార్థముగా తల్లిదండ్రులు నోరెరుగని శిశువులను పల్లకులలో పెట్టి, యూరేగించి, యిల్లకాలమును వారిని బద్ధులను గావించెడు బొమ్మల పెండ్లిండ్లు చేసెడి కాలము సంప్రాప్తమైనది.

కాబట్టి ఈ నిజమైన చరిత్రము నందు తేటతెలుగుమాటలతో మీరీ కాలమున సర్వసాధారణముగా, కుటుంబములందు చూచుచుందునట్టియు, అనుభవించుచుందునట్టియు సామాన్య విషయములే కనబడును కాని, ఇంద్రజాలములేవియును కనపడవు(సత్య వతీ చరిత్రము రచనాకాలము1883 అక్కిరాజు రమాపతి రావు గారి పరిష్కరణ)

-(సత్యవతి చరిత్రము నవలిక - పేజీ 1 -2 నుంచి)

కందుకూరి రచనలు అనగానే అందరూ రాజశే ఖర చరిత్రము గురించే ఎక్కువగా మాట్లాడుతారు కానీ 'సత్య వతీ చరిత్రము' ను గురించి ఎక్కువగా చర్చించరు. ఈ పుస్తకానికి రావాల్సిన గుర్తింపు రాలేదు. నాడే కాదు నేటికీ ఎంతో ఉపయుక్తమైన ఈ పుస్తకాన్ని పుస్తక ప్రచురణకర్తలు కానీ, సాహితీ సంస్థలు కానీ మరలా ముద్రించాలని కోరుకుంటున్నాను.

సత్యవతి పాత్ర నేటికీ స్త్రీలకి ఆదర్శంగా నిలిచే పాత్ర. ఆధునిక మహిళ అని గురజాడ, ఆదర్శ స్త్రీ అని చలం పేర్కొన్న స్త్రీ మూర్తి ప్రాగ్రూపం ఈ సత్యవతి. ఆధునిక తెలుగుసాహిత్య చరిత్రలో విద్యావంతురాలు, వివేకవంతు రాలు,కందుకూరి ఊహ చేసిన నవ యుగాల తెలుగు యువతిగా, కుటుంబ నిర్మాతగా, సత్యవతి పాత్రకు ముందర మరెవరూ లేరు. ఆమె ప్రథమ తెలుగు ఆధునిక సాహిత్య పాత్ర. నేటికి 135 ఏళ్ల ముందర తెలుగు సాహిత్య చరిత్ర లో ప్రత్యక్షమైన సత్యవతి చరిత్రము నవలిక చిరస్థాయిగా, సత్యవతి పాత్ర చిరాయువుగా నిలిచి ఉం టాయి అనడం సుస్పష్టమైన వాస్తవం.

-జగద్ధాత్రి
87122 93994

కందుకూరి వీరేశలింగం గారు, భార్య రాజ్యలక్ష్మమ్మ గారు

ప్రతి సోమవారం
రైటర్స్ అకాడమీ
వారం వారం విపుల సాహిత్య విహారం

ప్రయత్నే ఫలీ !

నన్ను కాలం కాటేసింది
కాలపు పడగ నీడ నుండి
బయటకు రావాలని ప్రయత్నం చేస్తున్నా
సాహితీ సౌగంధిక పరిమళాలు
వెదజల్లే ఉద్యానవనంలో నడుస్తూ
దారి తప్పి పోయాను
ముళ్ళ పొదల బాటల వెంట
నడుస్తూ అలిసిపోయాను
అయినా గతకాలపు పూల వాసనలు
నన్ను వెన్నంటుతూనే ఉన్నాయి
వెన్ను తడుతూనే ఉన్నాయి
సాహితీ ఉన్యానవనానికి చేరి
గతకాలపు వైభవాలను స్మరిస్తూ,
సాహితీ పరిమళాలను ఆస్వాదించాలని
ప్రయత్నిస్తున్నాను
నేను నేను కాను
నా చుట్టూ అనేక అనుబంధాల బంధాలు
నన్ను బందీని చేసిన స్వయంకృత
స్వయంనిర్మిత ఇనుప కట్టడాలు
నాకు సంకెళ్ళు వెయ్యబడ్డాయి
స్వప్నాలను సాకారం చేసుకుని
సంకెళ్ళను తెంచుకునే ప్రయత్నంలో ఉన్నా
అందుకు నిరంతరం శ్రమిస్తున్నా
వయసు లుప్తమై పోతోంది
మనసును మార్మికత ఆశ్రయిస్తోంది
ఎలా ఈ పడగ నీడ నుండి బయటకు రావాలో
అర్థం కాని సందిగ్ధతలో
కొట్టుమిట్టాడుతున్నాను,

-పేరం జయశీలరావు
63009 90640

(గురజాడ స్ఫూర్తి మూర్తులు పవర్ పాయింట్ ప్రదర్శన స్థాయి, సమాచార గరిష్టత చూసి రాసిన స్పందన కవిత)

నీటిమీద రాతలు

బాబా నీకు నువ్వే సాటి నీది అపర చాణ్య నీతి
జాబు రావాలంటే బాబు రావాలని
ఊదరగొట్టిన కీర్తి కండూతి
దాబు రావాలంటే బాబు రావాలి
న్యాయ విచారణకు సరికొత్త భాష్యం చెప్పి
నీ చెప్పుతో నువ్వే కొట్టుకో... అని తత్వం బోధించిన
కాల జ్ఞానివి నువ్వు
కోట్లాది ప్రజాధనం మంచినీళ్ల ప్రాయం
దుబారా ఖర్చు చేసి ఉత్తి పున్నానికి
ప్రచారం పొందంలో నీకు నువ్వే సాటి
పుష్కారాల ముసుగులో అమాయక ప్రాణాలు
బలితీసుకున్న ఓ రాక్షస బల్లీ..
దెయ్యాలు వేదాలు వల్లించినట్టు
ఎందుకీ న్యాయ విచారణ లొల్లి
పిచ్చి ముదిరింది తలకి రోకలి చుట్టండహో
అంటూ పోలోమని జనాన్ని కిర్రెక్కించి
ప్ర(సా)చారమాధ్యమాల్లో ఊదరగొట్టిందెవరో..
దుమ్మెత్తి పోసే ప్రతిపక్షాలపై విరుచుకుపడింది
చాల్లేదు కాబోలు
పచ్చబొట్టు పొడిపించుకున్న సోమయాజిది
సా(న్యా)యం
జనానికి మూఢనమ్మకం పుష్కర స్నానం
ఓ మూఢ భక్తి అని శ్లో(క్రమంలో మీ ఇంటిల్లిపాదీ
చేసిన పుష్కర స్నానమూ ఉందన్న ఇంగిత జ్ఞానమూ
ఆ నివేదికలో దాగుంది సుమీ
ప్రతిపక్షాలు, మీడియా, పాపాల భైరవులైతే
మృతుల కుటుంబాలకు న్యాయం చేస్తామన్న
చిలకపలుకు మాటేంది?
ఏ గూటి చిలక ఆ గూటి పలుకులే పలుకుతుంది.
తొక్కిసలాటలో అసువులు బాసిన
ఆ ఇరవై తొమ్మందుగురి
ఆత్మలూ (అ)పవిత్ర గోదావరి జలాలపై
సంచరిస్తున్నాయి
ఈ పాపమెవరిది బాబూ?
అని సూటిగా ప్రశ్నిస్తున్నాయి
నీటిమీద రాతల్ని చూసి దూషిస్తున్నాయి
పంచ భూతాల సాక్షిగా వాళ్ల ఆత్మలు ఘోషిస్తున్నాయి
ఆత్మ విమర్శ చేసుకోమని సూచిస్తున్నాయి

- రతన్ రాజు బందిలి
94902 63115

గురజాడ స్ఫూర్తి మూర్తులు

అంతకు ముందు తెలుగులో ఏమీ రాయని ఒక పాతిక ముప్పై ఏళ్ల యువకుడు, అంతకు ముందు తెలుగు సాహిత్యంలో రాస్తూ వచ్చిన పద్ధతుల్లో కాక కొత్తగా రాయడం కన్యాశుల్కంతో మొదలయింది. పాశ్చాత్య సాహిత్యంలో ఆధునిక యుగ ప్రామాణిక రచన అయిన "సంప్రదాయము, వైయక్తిక ప్రతిభ" అనే 1922 టి. ఎస్.ఇలియట్ వ్యాసానికి ముందరే, ఈ రెండింటి కలయిక, లక్ష్య లక్షణ సంపన్నంగా గురజాడ అప్పారావు 1892లో చేసిన తొలి ప్రయత్నమే, విజయనగరం పరీక్షనాళికలో, తెలుగు సమాజ ప్రయోగ శాలలో, మానవ జీవన రసాయన సపరస నిష్పత్తిలో ఆనందం, ఆలోచన, ఆచరణ అనే సత్ఫలితాలను ఇచ్చింది. కన్యాశుల్కం ఒక ప్రయోగమే కనుక శాస్త్రజ్ఞుడు గురజాడ, మళ్ళీ పరిశోధనలు చేసి, పదిహేడేళ్ళ తరువాత ప్రయోగ పద్ధతిని 1909 కూర్పులో సాన పెట్టాడు. కన్యాశుల్కం పాత కాలపు పుట్టమట్టి పూసుకున్న నవీన నాగ సంగీతం. రంగస్థలాన చెలరేగి చూపరులను, చేతిలో గర్వ కారణమై చదువరులను సమ్మోహితులను చేస్తున్న నాగఫణి ఈ నాటకం. నాటకంలో ముందరి వలె, నాందీ ప్రస్తావనలు ఉండవు కానీ, మొదటి ప్రదర్శనకు,ప్రేమ పూర్వకంగా, విజయనగర కవిపండితులు ముదుంబై వరాహ నరసింహాచార్యులు, వీటిని యథావిధిగా, సంస్కృతంలో కూర్చారు. యువ గురజాడకు ఉన్నత భవితను ఆకాంక్షించారు. ఇక సాధారణంగా పాత నాటకాల్లో అయితే, సూత్రధారులు ఆడ, మగా జనం ముందుకొచ్చి ఏమిటీ నాటకమో, ఏమిటి కథో ప్రేక్షకులకు చెప్తారు. సూత్రధారులు లేనట్టే కనిపిస్తుంది కన్యాశుల్కం నాటకం.

కానీ గిరీశం బొంకుల దిబ్బ దగ్గర మాట్లాడే మాటల్లో, తొలి కూర్పులో అయితే, అమెరికా, ఇంగ్లాండ్, స్కాట్లాండ్ ప్రాంతాల కవులు ఈ పని చేస్తారు. బెంజమిన్ ఫ్రాంక్లిన్, ఆలివర్ గోల్డ్ స్మిత్, జాన్ గే, రాబర్ట్ బర్న్స్, ఈ పని చేస్తారు. ఎలా? వారి రచనల / పద్యాల ప్రస్తావన గిరీశం చేసినప్పుడు, అది కేవలం గిరీశం చేత ఇంగ్లీష్ పేలించడమో, లేక తాను మన కోసం చేస్తున్న దాబో, కాదు. ఓపిక ఉండాలంటాడు పూర్ రిచర్డ్ పాత్ర ద్వారా బెంజమిన్ ఫ్రాంక్లిన్. "వెన్ లవ్లీ వుమన్ స్టూప్స్ టు ఫాలీ" అంటూ ఆలివర్ గోల్డ్ స్మిత్, అటు బుచ్చమ్మ, ఇంకా నాటక కారుడు యువ గురజాడకే స్పష్టం కాని మరో స్త్రీపాత్ర గురించి నాట్లు వేస్తాడు. జాన్ గే, "విల్ కుపిడ్ అవర్ మదర్స్ ఒకే" అంటూ, పాలీ అనే యువతి పాత్ర, తన బెగ్గర్స్ ఒపెరా లో తన తల్లి తండ్రులతో మాట్లాడుతున్న గీతంగా, అలాగే "ఇట్ ఈజ్ ద వుమన్ దట్ సెడ్యూస్ ఆల్ ది మేన్ కైండ్" అంటూ అదే ఒపెరా లో రెండో గీతం కూడా తన స్వభావనుగుణంగా గిరీశం కోట్ చేసినాటకంలో రాబోయే ప్రేమ తుఫానులకు కావలసిన అల్ప పీడనాన్ని సృష్టిస్తాడు. ఈ గీతాల పూర్తి పాటల్లో, గురజాడ సూత్రధార ప్రకటనలున్నాయి. ఇక రాబర్ట్ బర్న్స్ (ఓహ్ విజిల్ టు మి అండ్ ఐ విల్ కమ్ ఎవే) " నువ్వు విజిలేస్తే వచ్చేస్తాను నేను" అని రాసింది నాటకంలో ఎలా ఎప్పుడు జరిగిందో గిరీశం, బుచ్చమ్మల మధ్య మనందరికీ బాగా తెలుసు. (నువ్ విజిలేస్తే ఆంధ్రా సోదా బుడ్డీ అని పాట ఇటీవలి సినిమాల్లో రావడానికి వందేళ్ల ముందర ఈ ఇంద్రజాలం జరిగింది). జయదేవ కవి, శామ్యూల్ టేలర్ కోల్ రిడ్జ్ వర్డ్స్ వర్త్, యూక్లిడ్, ఆదిదం సూరకవి ఇంకెందరో భావ ప్రేరకులుగా, అర్థ స్ఫోరకులుగా ఉన్న సామాన్య ప్రపంచపు అసామాన్య గర్భగుడి కన్యాశుల్కం నాటకం.

ఎటొచ్చీ ఇవే సరస్వతీ ప్రార్థనలుగా, నాటక రాజు షేక్స్పియర్ ని స్మరిస్తూ గురజాడ తొలి కూర్పులో అద్భుత ఆరంభాన్ని ఇచ్చినా, దానికి ఎంత బంగారపు పళ్ళెం అయినా గోడ చేర్పు ఉండాలని, పునాది దిట్టం కావాలని రెండో కూర్పులో శాస్త్రజ్ఞుడు గురజాడ, మంచం కింద సీను ప్రవేశ పెట్టారు. ఆ సీను లేకపోతే, నాటకం మొదట్లో, గిరీశం. మధురవాణి కలిసే అవకాశం లేదు. ఇది తొలి కూర్పులో ఒక బీజ స్వాగతం అంత్రమే మహాలక్ష్మి కి పార్టింగ్ విజిట్ ఇవ్వాలి అంటాడు కానీ ఆ దృశ్యం నాటకంలో ఉండదు. ఎవరికి వారుగా, గిరీశం కృష్ణరాయపురంలో కనిపించగా, మహాలక్ష్మి రామచంద్ర పురంలో రామప్పంతులు ఇంట కనిపిస్తారు. తన నాటకంలో ఒక లింక్ సరిగా ఏర్పడలేదు అన్నది గమనించిన గురజాడ దాదాపు "శతాబ్దపు తొలి రోజులు" అంటూ ఆంగ్లంలో రాసిన తన ఒకే ఒక్క కథ "స్టూపింగ్ టు రైజ్" రాస్తున్న కాలం నుంచి మథన పడుతూ ఆలోచనలు చేస్తున్నారని తెలుస్తుంది. అక్కడి సరళ పాత్రే, రెండో కూర్పు నాటకంలో విస్తృతమైన మధురవాణి. కన్యాశుల్క నాటకం గురజాడ స్ఫూర్తి మూర్తుల కొలువు. తన నాటక కళలో తూర్పు పడమరల సాంస్కృతిక విలసనాన్ని మేళవించిన ఈ ముప్పై ఏళ్ల యువకుడు, తను 1910లో ముత్యాల సరాలు ఛందస్సు లో రాసిన "పాత కొత్తల మేలు కలయిక క్రొమ్మెరుంగులు చిమ్మగా" అన్నది కవిత్వ చరణంగా మాత్రమేకాక, తన సాహిత్య ఆచరణంగా 1892 నుంచే, ఈ కన్యాశుల్క నాటక రచన నుంచే పాటిస్తూ వచ్చారు, ఈ సంస్కార వైశాల్యం, విశాల ప్రపంచం నుంచి నేర్చుకున్న తన సృజనశీలత, స్ఫూర్తి మూర్తుల చైతన్యం, లౌకిక ఉదార దృష్టి తన కళ లోనికి ఇంకిం చుకోవడం వల్లనే సాధ్యం చేసుకున్నారు.గురజాడ మేధో మాపనంగా (ఇంటలెక్చుయల్ మాపింగ్) తన జీవిత సాహిత్యాల నిండా భాసించిన దాదాపు డెబ్బై మంది ప్రాచ్య, పాశ్చాత్య అక్షర దీప్తులను గురజాడ స్ఫూర్తి మూర్తుల బొమ్మల కొలువు పవర్ పాయింట్ ప్రదర్శన సభగా వారి 156వ జయంతి 21 సెప్టెంబర్ సాయం త్రం, విశాఖలో, మొజాయిక్ సాహిత్య సంస్థ సమర్పిస్తున్నది.

-రామతీర్థ (98492 00385)

పంచాంగం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వీజమాసం, బహుళపక్షం

చతుర్దశి రా 10-27 వరకు
చిత్త రా 7-44 వరకు
వర్జ్యం రా. 1-16 నుండి 2-51 వరకు
దు.ము.ప. 8-15 నుండి 9-11 వరకు
పు.దు.ము.రా. 10-21 నుండి 11-20 వరకు
రా.కా.మ.2-26 నుండి 3-56 వరకు

మంగళవారం 6-11-2018

రీడింగ్ రూమ్

మాధవపెద్ది కళాజ్యోతి కూచిపూడి మూర్తి

రామతీర్థ
9849200385

సిద్ధేంద్ర యోగి సృష్టిగా ఒక నృత్తాభినయ రూపం తెలుగు నాట, కూచిపూడిగా విశేష ఖ్యాతి గాంచింది. కూచి పూడి భాగవతులు సామాజిక సేవగా కూడా సీమలో, మండల పాలకుడు, సంబెట గురవ రాజు ప్రజ లను, పన్నుల కోసం ఎలా పీడిస్తున్నదీ, రాజు వద్ద తమ కళా

ప్రదర్శనలో చూపడం వల్ల, ఇది ఏమిటి అని తెలుసుకున్నా కృష్ణదేవ రాయలు, సంబెట గురవరాజు దుష్కృత్యాలను ఆపేందుకు, తన సైనికా ధికారులను పంపి, తగు చర్యలు తీసుకోవడం జరి గింది. కూచిపూడి అభినయ సహజత్వం, ముఖంలో పలికే హావ భావ విన్యాసాలకు ప్రాధాన్యత ఇచ్చే కళా రూపం. కొన్ని దక్షిణాది అభినయ పద్ధతులు, భర తనాట్యం వంటివి ముద్రాలకు, పద నర్తనలకు అధిక ప్రాధాన్యత కలిగి ఉంటాయి.

కూచి పూడిలో భామ కలాపం, ముఖ్యంగా మగవారే, నృత్య కళలో నిష్ణాతులుగా కీర్తి పొందడం తెనాలి కళా విలసనంలో స్థానం నరసింహారావు, రాజారెడ్డి రాధా రెడ్డి, వేదాంతం రాఘవయ్య, వెం పటి చినసత్యం వంటి జగద్విఖ్యాతులైన కళా సాధకుల వలె మాధవపెద్ది సత్యం గారి కుమారుడు, మాధవ పెద్ది మూర్తి నేటి తరంలో, వెంపటి వారి శిష్యుల్లో ఒకరుగా, ఈ కళా రూపంలో సాధన చేస్తున్నారు. గత మూడున్నర దశాబ్దాలుగా వీరిని ఈ సాధన, హేమమాలిని తో నూపుర్ టి.వి, ధారావాహికలో, ఆమె పార్వతీ, వీరు శివునిగా ఆ సీరియల్ లో ప్రధాన ఆకర్షణ గా నిలిచింది. ఆమె తో కలిపి దేశదేశాల్లో ప్రదర్శనలు, అలాగే, తాము శివం అనే తమ బృందం ద్వారా, కూడా ఖండ ఖండాంతరాల పలు దేశాల్లో ప్రదర్శనలు ఇచ్చారు మాధవపెద్ది మూర్తి బృందం. వీరిని తమిళ నాడు ప్రభుత్వం, కలైమామణి బిరు దంతో గౌరవించింది.

తెనాలి కళా లాస్య రెండు రోజుల ఉత్సవా ల్లో భాగంగా, మాధవపెద్ది మూర్తి బృందం, రామ కృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రదర్శనలు ఇచ్చారు. ప్రద ర్శనలు ఉన్నత స్థాయిలో ఉన్నాయి. ఆరంభంలో చేసే వినాయక స్తుతి కోసం, వీరు సాధారణంగా మన కళాకారులు పాడే కృతులు కాక, తులసి దాసు భజ న్ "గాయే గణేశ" కు కూచిపూడిలో రూపకల్పన చేసిన తీరు, ఈ దక్షిణాది కళా రూపంలో, ఒక ఉత్తర భారత కీర్తన ఎలా మిశ్రమం చేశా రో చూస్తే, కళల భిన్న స్వర సాం స్కృతికత ఎలా ఒకే ఐక్యతా ప్రవా హంగా ఉంటుందో చెప్తుంది. శంకర విరచిత భజగో విందం కొన్ని చరణాలకు తిల్లానా , జోడించి రం గస్థలి పై సహ కళాకారులతో, స్టిల్ అండ్ మూవ్ టెక్నిక్‌లో నాట్య రచన చేసిన పద్ధతి ఆసక్తికరంగా ఉన్నది. హేమమాలిని తో శివునిగా, మాధవపెద్ది మూర్తి, తెలుగు వారికి ఖ్యాతి కలిగేలా నటన, నృత్తం జత కలిపిన కళాకారులు. గజల్స్ కు కూచిపూడి అభినయ కూర్పు, సైన్యం కోసం కోసం తాము ఒక కళా రూపం చేస్తాము అన్న సంకల్పం గల ఈ నేటి తరం కూచిపూడి ప్రతిభావంతుడు. సంగీత నాట్య అకాడెమీ తెలుగు నాట పని చేయడం మానేసి మూడున్నర దశాబ్దాలు కావ స్తోంది. మూర్తి గారిని తమిళ్ నాడు ప్రభుత్వం సంగీత అకాడెమీలో సభ్యులు గా

ఉన్న తెలుగు వ్యక్తి. హరిదాస్ సంగీత్ సమారోహ్, తాజ్ మహోత్సవ్, పూరీ బీచ్ ఫెస్టివల్, మలబార్ మహోత్సవ్, హంపి మహిత్సవ్, పురూష్ ఫెస్టివల్, విశాఖ ఉత్సవ్, ఎల్లోరా ఫెస్టివల్, తారామతి బారాదరి ఫెస్టివల్, నిమడి ఫెస్టివల్, బిత్తూర్ గంగా మహోత్సవ్, ముద్రా ఫెస్టివల్ , కడప ఉత్సవం, కూచిపూడి మహోత్సవ్ వగైరాల్లో భర ఆ దేశంలోనూ, దేశ దేశాల్లోనూ పాల్గొన్నారు.

కళా రూపాల ప్రదర్శనలో, ఉత్తర భారత, దక్షిణ సంప్రదాయాల మేళవింపు, చేయడంలో ఆసక్తి గల ఆచార్యులు మూర్తి. వీరి పెదనాన్న మాధవ పెద్ది గోఖలే మహాప్రస్థాన గీతాల సంపుటికి ముఖ చిత్రం వేసిన కళాకారులు, అభ్యుదయ రచయితల సంఘంలో పని చేసిన కార్యకర్త, వీరి తండ్రి ప్రముఖ చలన చిత్ర గాయకులు మాధవపెద్ది సత్యం గారు.

కొత్త ఆంధ్ర రాష్ట్రంలో మాధవపెద్ది మూర్తి గారి వంటి సమన్వయ కళాకారుల ప్రాధాన్యత ఎంతో ఉన్నది. ఆ బాధ్యతలు మనం గుర్తించి చేయాల్సిన కృషికి ఇదొక మంచి ఆరంభంగా స్వీక రిచి మనం కలిసికట్టుగా ముందుకడుగే వేయాల్సిన సందర్భం ఇది. మూర్తిగారి చైతన్య స్ఫూర్తికి అభినందనలు.

కళా లాస్యోత్సవ తెనాలి

కళా లాస్య వేదిక, నవంబర్ 3,4 తేదీల్లో తెనాలి సంస్కృతిక విలసనాన్ని నగరోత్సవంగా ఇస్తున్నది. శాసనసభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గారి నిర్వహణా పర్యవేక్షణలో జరుగుతున్న ఈ తెనాలి కోలాహలం, సంస్కృతి విలువ తెలిసిన ప్రజా రంగ నాయకులే పూనుకుంటే, జరిగే నాణ్యతకొక మేలిమి చిహ్నంగా మిగులుతుందనడంలో సంశయం లేదు. జల వనరుల వల్ల ఆంధ్ర పారిస్ గా గణుతికెక్కిన ఈ పెద్ద పల్లెటూరులో, జీవన సంపన్నత నవనవోన్మేశంగా, సృజనకి గల వైవిధ్య విశ్వరూపం ఎంతటిదో చూపింది. "తెరవలి" అనే పేరు కాల క్రమంలో తెనాలిగా మారింది అని చెప్పే పరిశోధకుల నుంచి, తీన్ నాలి (మూడు కాలువలు ప్రవహించే ఊరి కనుక) తెనాలి అయిందని, ఒక పుర ప్రముఖులు చెప్పారు.

తెనాలి మునిసిపాలిటీ లోగోలో కూడా కవి ఆసీనుడై ఉన్నాడు. బహుశా, ఎన్ని నగర పాలికల అధికారిక చిహ్నంలో, ఇలా కవి అగ్ర భాగాన ఉన్నారో చూస్తే, కొద్ది నగరాలే లెక్కలో మిగుల్తాయి. కవిగా అప్రతిహత ప్రజా స్వరం రామలింగ కవి. ఈయన పేరున ఉన్నన్ని రాజధిక్కార చేష్టలు, పద్యాలు, సహసా కృత్యాలు మరొక తెలుగు కవి పేరున లేవు. ఇక్కడి రామలింగేశ్వరాలయంలో తెనాలి రామలింగ కవి కూడా పూజలు కెఃశారని చెప్తారు. బాగా నవీకరించబడిన ఈ పాత కాలపు గుడిలో, ఏవో శాసనాలు కూడా ఉన్నాయని మునిపల్లె రాజు జ్ఞాపకం చేసుకునే వారు. తెనాలి సాహితీ సాంస్కృతిక ఉద్దండులు సమన్వయ వీరులు. ఆ లక్షణం, సమన్వయ ధాతువు, పాండురంగ మహాత్మ్యంలో నిగమ శర్మ కథకు స్థానం కల్పించిన రామలింగ కవి బెచిత్య వైశాల్యంలో ఉన్నది. కొడవటిగంటి 1941 అంచనాలో తెనాలి నాడి ఉన్నది.

కవిత్వం, కథలు, నవలలు, జిజ్ఞాశా వితానాల వెచ్చదనాలు, చిత్రాలు, వర్ణాలు, అవధానాలు, నటనా వైభవాలు, సినిమా శిఖరాలకు చేరిన ప్రతిభా మూర్తులు, స్వాతంత్ర్య పోరాట కేంద్రంగా వీరోచిత ప్రతిఘటనలు, తెనాలి ఒక ప్రశ్నభూమి, ఒక రంగ భూమి. తరతరాల కళా వికసనానికి అమ్మ ఒడి. మారిస్ పేట్, రణ రంగ చౌక్, తుమ్మపూడి, తప్పుల్లేకుండా పుస్తక ప్రచురణలు చేసే అలనాటి సుందర్రామా అండ్ కొ, రావు బ్రదర్స్ (రిజిస్టర్డ్). వెంకట్రామ అండ్ కొ, ఇక్కడే స్కూళ్ళ ఇన్స్పెక్టర్ ఉద్యోగం చేసిన చలం, చింతా దీక్షితులు, కాలంలో కదలాడిన రంగవల్లికలు చార్వాక పుస్తక విక్రయ శాల, త్రిపురనేని వారి సూతాశ్రమం, సాధన సమితి వారి ఆశ్రమం, కాంచన మాలకి ఇక్కడే ఇల్లు ఉండేదని చెప్పుకునే అయితానగరం, ఏ. ఎస్ రాయి గారి ప్రభావం గల నవ్య మానవ సమితి, తెనాలి, ఇరవయ్యో శతాబ్దపు ప్రతి పరిణామానికి, తరగలెత్తి ఉప్పొంగింది. తెనాలి రక్తంలో నాటక కళా ఎర్ర రక్త కణాలు పుష్కలం. ఆబాల గోపాలానికి, పెద్దా పిన్నా ప్రజానీకానికి, తెనాలి ఒక సకల కళా మహామహోపాధ్యాయిని., ఇక్కడే రంగోత్తుంగభద్రులయ్యారు స్థానంనరసింహారావు, డాక్టర్ గోవిందరాజుల సుబ్బారావు గారి యుగంధర పాత్రా, పెద్దిభొట్ల చలపతిరావు గారి చాకలి పేరిగాడి పాత్ర, ముంజులూరి కృష్ణారావు గారి పిచ్చి యుగంధరుని పాత్ర, ఇవన్నీ కాల యవనిక ముందర నటనాతిశయ ప్రదర్శనలు చేసిన ప్రతిభా సంపన్నతకు నిదర్శనాలు. దశాబ్దాల క్రితం, చలం, జి.వి కృష్ణరావు, గోపీ చంద్, శారద నటరాజన్, మునిపల్లె రాజు, అక్షర శిల్పుల బడి ఈ తెనాలి.

తెనాలి కవిత్వానికి ప్రధాన ఆకర్షణగా నిలిచిన తెనాలి రామ కృష్ణ కవి పేరిట తెనాలి రామకృష్ణ కవి కళా క్షేత్రం ఏర్పాటు చేసి, తమ సాంస్కృతిక అవసరాలకు తగు భవనాన్ని రంగ స్థలాన్ని తగు హంగులలో, మంచి ధ్వని యంత్రాలతో, ఎరపాటు చేసుకున్నారు తెనాలి వాసులు.ఇక్కడే ఈ రెండు రోజుల సభలు జరుగుతున్నాయి. కొలకలూరి ఇనాక్ అధ్యక్షతన, ప్రముఖ సాహితీవేతలు విహారి, రామతీర్థ, సంగీత రంగ నిపుణులు ములుకుట్ల బ్రహ్మానంద శాస్త్రులు ఉదయం ప్రధాన ప్రసంగాలు చేశారు. మునిపల్లె రాజుగారి సతీమణి సులోచన గారిని, తెనాలి సభలు ఈ సందర్భంగా సమ్మానించాయి మధ్యాహ్నం సభల్లో వి. ఎస్. ఆర్. మూర్తి, సనాతన భావన హేతు వాదం, - డా. సంజీవ దేవ్ పై రావెల సాంబశివ రావు, ఆయుర్వేద వైద్య విధానాల రాణింపులో తెనాలి ప్రాముఖ్యత పై సామల రమేశ్ బాబు, ప్రసంగాలు చేశారు. ఆదివారం, శివారెడ్డి, దేవీప్రియ, ఓల్గా, శ్రీ రమణ తదితరులు ఈ సభల్లో ప్రసంగించారు. సభల్లో తెనాలి నేపథ్య భూమిక గల సాహిత్య, విద్యా, సంస్కృతిక రంగాల ప్రముఖులను రెండు రోజులూ సత్కరించి సభలు, తెలుగు వారి సాంస్కృతిక వికాసంలో తెనాలి భవిష్యదుజ్వల భార్గా యుగలకు దారులు తీయాలని ఆకాంక్షించారు.

తెనాలి నల్లరేగడి మట్టిలో, నటశేఖర కృష్ణ . ఊర్వశి బిరుదాంకిత సతీమణి శారద, అక్షరాలే కాకుండా బొమ్మల కొలువుల రేడులైన మా గోఖలే, సంజీవ దేవ్ , తెనాలి ఆర్ట్స్ అండ్ హ్యూమనిటీస్ కి ఒక రాజధాని. రెండు రోజుల సభలుగా, బహుళ ప్రసంగ సంపన్నంగా, కళా సమన్వితంగా జరగడం, తెనాలి , కొత్త రాష్ట్రంలో మరింత సాహిత్య సంగీత, సాంస్కృతిక ప్రధాన పాత్ర పోషించేలా జరుగుతున్న ఒక ప్రతిజ్ఞ అని భావిస్తే మూడు కాలువల తెనాలిలో గతం, వర్తమాన, భవిష్యత్తు కలిసే చోట, ఈ సమాలోచన జరగడం శుభ పరిణామం. నాలుగు దిక్కులా ఆశాదూతలు కళా యజ్ఞాశ్వములపై గాలులై, ధూళులై తరగలై సాగడానికి, ఇదొక మంచి అవకాశం.

-రామతీర్థ
98492 00385

లింగ శబ్దం యతి ప్రాసల్లో వచ్చేలా వేలూరి శివరామశాస్త్రి చెప్పిన *1910* తెనాలి శతావధాన పద్యం

ఒక సారి 1910 లో వేలూరి శివ రామశాస్త్రి అనే పంధోమ్మిదేళ్ళ యువ పండితులు శతావధానం చేశారు తెనాలిలో. వారి గురువులు చెళ్ళపిళ్ల వారి సమక్షంలో. ఇచ్చిన సమస్య లింగ శబ్దం ప్రాస స్థానంలో, యతి స్థానంలో ఉంచి కవిత చెప్పాలని. ఇదీ ఆ యువ వేలూరి వైజయంతిక

లింగడు సర్వ దేశములలింగని
చక్కని తెల్గు కైత శై
లింగడు సై తెనాలి సరలింగనె
దివ్య యశః పురంధ్రికా
లింగన శాలి యౌచు నవలింగములన్
గైకొంచు మేటి
పుల్లింగములన్ ఘటించి
కవిలింగములన్నియు నూదగొట్టుచున్"

తుంగభద్రపై రామలింగ కవి ప్రఖ్యాత పద్యం

తెనాలి రామలింగ కవి స్ఫూర్తిదాయక కవిత్వ రచనలో దిట్ట. దక్షిణ భారత దేశ కవి కథానాయకుల్లో మొదటి వాడు. భోజుడు, కాళిదాసు, అక్బర్, బీర్బల్, రాజు - కవి ద్వయం వలె రాయలు , రామలింగ కవి జగత్ప్రసిద్ధులు. తెనాలి రామలింగని కథలు చెప్పని అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు, వినని తెలుగు బిడ్డలు ఎవరూ తెలుగు నాట ఉండరు అంటే -అదీ తెనాలి ప్రఖ్యాతి. దేశంలో అన్ని నదులూ సముద్రంలో కలుస్తాయి. అలా కలవని నది ఒక్కటే - అది తుంగభద్ర. అందుకా నది చిన్నబుచ్చు కుంటుందా - మరి ఎలా స్ఫూర్తి కలిగించాలి - ఇవే మోటివేషనల్ లెక్చర్స్ అంటే - ఒక పద్యంలో చెప్పారు ఇవి మనం రామలింగ కవి వద్ద నేర్చుకోవచ్చును - పాండురంగ మహాత్మ్యంలో ఈ పద్యరచన చేస్యారు రామలింగ కవి.

"గంగా సంగమమిచ్చగించునె? మదిన్ గావేరి దేవేరిగా
నంగీకారమొనర్చునే? యమునతోనానందమున్ బొందునే?
రంగత్తుంగ తరంగ హస్తములతో రత్నాకరేంద్రుండు నీ
యంగంబంటి సుఖించునేని గుణభద్రా తుంగభద్రానదీ!"

ఏమంటున్నారు రామలింగ కవి ఈ పద్యంలో నీతో సుఖం పొందితే ఆ సముద్రుడు గంగను కోరుకుంటాడా ? కావేరీ తన దేవేరిగా ఒప్పుకుంటాడా?" అమ్మా తుంగభద్రా - నీవు అంతటి గొప్పదానివి అని మేలిమి పలుకులు పలికి ఆమె చిన్నబోకుండా చూస్తున్నాడు. అదీ తెనాలి జీవజలాల శక్తి. అనేక పద్యాలకు, అయిదు అశ్వాసాల పాండురంగ మహత్మ్యం భక్తి ప్రబంధానికి రామలింగని పేరు లోక ప్రశస్తం. తెనాలి గర్వ పడాల్సిన కవిత్వ దీపావళి ఈయన కవిత్వం.

ప్రతి సోమవారం రైటర్స్ అకాడమీ

వారం వారం విపుల సాహిత్య విహారం

చితిమీద ఒక కవి

చర్చిగంటలు
మ్రోగడం లేదు.
బజార్లు రద్దీగానే
ఉన్నాయి
ఆఫీసులు
మూతపడలేదు
సంతాప దినాలు ప్రకటింపబడలేదు
వాహన సంచారం యధాప్రకారం
అస్తవ్యస్తంగానే ఉంది

సినిమాహాళ్ళు ఎప్పటిలాగే కిక్కిరిసి
ఉన్నాయి
శవయాత్ర సాగుతోంది అయితే
ముందు బేండు మేళాలు మోగటమూ
లేదు
వెనుక గుర్రపు సవారీలు
అనుసరించడమూ లేదు.
పాడె మీద కవి ఏం పట్టనట్టు పరున్నాడు
శవవాహకులు నలుగురూ పిడికిళ్లు
బిగించి నడుస్తున్నారు.

జండాలు అవనతం కాలేదు.
కొందరు ఇరుగు పొరుగు వాళ్ళూ,
తోటి కవులు మరికొందరూకనిపిస్తున్నారు.
అతని ప్రచురణ కర్తలు కనపడటం లేదు

ఫొటోగ్రాఫరు జాడలేదు
కాకపోతే ఒకరిద్దరు విమర్శకులూ
బాధ్యత మరువని ఓ విలేఖరీ
వెంటనడుస్తున్నారు.
శ్మశానంలో పాడె క్రిందకి దింపారు
మృతునిగురించి ప్రసంగం చెయ్యవలసి
ఉంది
వక్తకి కళ్ళు చెమరుస్తున్నాయి
అతని మాటలు శాంతగంభీరంగా
ఉన్నాయి.
కాని, కాల్చడానికి కట్టెలూ,
వెలిగించడానికి ఇంధనం ఏవీ?
కవి ఆత్మకి శాంతి కూర్చేదెలా?
కొన్ని నిముషాలు దొర్లిపోయాయి
చందాలు వసూలు చెయ్యడానికి టోపీ
కలదిరిగింది
కానీ, అందులో చేరుకున్న నాణేలు కొన్నే.
అరె ! ఎవరది ఓ డొక్కు రిక్షాలోంచి
శ్మశానద్వారం దగ్గర దిగుతున్నది?
అతని వితంతువు అతని వ్రాతప్రతులన్నీ
కట్టగట్టి తీసుకు వచ్చింది.
ఇక మనం చితిముట్టిద్దాం రండి
మరి ఎంతమాత్రం ఆలస్యం చెయ్యలేం!

-మునిపల్లె రాజు

మత్తు వదలరా

ఎవరేశారీ మత్తుమందు
ఎన్నాళ్ళదాకాను, ఈ మొద్దునిద్దర ఎవరే...
నల్లమందైతేను, నాలుగ్గడియలవరకె
కల్లు మత్తైతే పది గడియలవరకేను ఎవరే...
తాచు విషము కూడ తగ్గేను మంత్రముతో
ఏదివ్యమంత్రముతో యీమత్తు తగ్గేనో ఎవరే...

గాంధీమహాత్ముడు కనిపెట్టినట్టి యీ
సత్యాగ్రహమంత్రముతో మత్తు వదిలేనేమో
ఎవరేశారీ మత్తుమందు
ఎన్నాళ్ళదాకాను, ఈ మొద్దునిద్దర

-బసవరాజు అప్పారావు

తిరగబడాలి మీరే

అందాలు పిందాలు కాగానే
ఆడపిల్లలని ఆయువుతీసే
అంట్లకాకులు ఇంకా ఆరోగ్యంగానే ఉన్నాయి

పురుడుపోసుకున్నాకా
ఆడపిల్లను కన్నావని కట్టుకున్నదానిపై
కస్సుబుస్సులాడే పాములు
ఇంకా ప్రాణాలతోనే బుసకొడుతున్నాయి

ఎదుగుతున్న ఆడపిల్లను ఆడా పిల్లని అలుసుగా
చూస్తూ అన్నపానీయల్లో తేడాలు సృష్టించే
చెదపురుగులు ఇంకా చల్లగా చక్కర్లు
కొడుతూనే ఉన్నాయి

వయసుకొచ్చిన పిల్లను పడకగదికి పనికొచ్చె
పరుపని నీటిలో పాచులా తీసిపారేస్తూ

తొలుస్పర్శ సుఖముకై ఆ మనసును తోడేసే
తోడేళ్ళు తోపుల్లా సమాజంలో ఇంకా
తిరుగుతూనే ఉన్నాయి

అయినా కాముపు కోరలుకలిగిన ఆ కుక్కలకు
ఏం అర్థమవుతుంది
సున్నితమైన ఆ పువ్వు పరిమళ స్వభావం

ఇక ఆ పువ్వులే తిరగబడాలి
తమ బ్రతుకులను బరోసా నింపుకునే కత్తులై
సువర్ణమైనా రక్షణ మార్గాన్ని నిర్మించుకునే
సుత్తులై

-అభిరామ్
9704153642

రావి రంగారావు సాహిత్య పీఠం

101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్, 5వ లైను తూర్పు, గోరంట్ల, గుంటూరు- 522034 , ఫోన్ 9247581825

జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు 2018

స్పష్టంగా, సూటిగా, నిరాడంబరంగా, భావ యుక్తంగా, శక్తివంతంగా ఉండే జన సంక్షేమ కవిత్వం రాసే కవులు "జన రంజక కవి ప్రతిభా పురస్కారాల కోసం" తమ కవితల సంపుటాలు పంపించవలసినదిగా కోరుతున్నాం. వచన కవితలు/పద్యాలు/గేయాలు /లఘు కవితలు/బాలగేయాల సంపుటాలు ఏవైనా ఒక పుస్తకం పంపితే చాలు. 2014 నుండి 2018 వరకు ప్రచురించిన పుస్తకాలు పంప వచ్చు. ఎంపికైన పుస్తకాల కవులకు ఒక్కొక్కరికి 2000 రూ. నగదు, శాలువా, జ్ఞాపికతో రావి రంగారావు సాహిత్య పీఠం పక్షాన 2019 ఫిబ్ర వరి 11న సాయంత్రం 6 గం.కు గుంటూరులో బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అన్నమయ్య కళావేదిక మీద జరిగే సభలో ప్రముఖుల సమక్షంలో సత్కరించటం జరుగుతుంది. 2018 డిసెంబరు 31 లోగా పుస్తకాలు పంపించవలసిన చిరునామా:

డా. రావి రంగారావు, 101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్ తూర్పు, గోరంట్ల, గుంటూరు- 522034, ఫోన్ - 9247581825

ప్రజా కళల్లో చైతన్య మోహన గాంధీ

తెలుగు వారు తమ సామాజిక భావనలను తెలియపర్చడంలో ప్రజా కళలను శక్తివంతంగా ఉపయోగించే వారు. ఈ స్వభావం, గాంధీజీ భారత దేశం రావడానికి ముందు నుంచే, మనం గమనిస్తాము. బెంగాల్ విభజన కాలంలో, మన ప్రాంతంలో పర్యటించిన బిపిన్ చంద్ర పాల్ 1907 సంవత్సరం 19 - 24 ఏప్రిల్ తేదేల్లో రాజమండ్రిలో ఉన్నారు. అప్పట్లో కాంగ్రెస్ లో అతి వాదుల్లో ఒకరైన పాల్ ఈ అయిదు రోజులూ ప్రజలనుద్దేశించి రాజమండ్రిలో దేశభక్తిపూరిత ప్రసంగాలు చేశారు. ఆ ప్రసంగాలకు తెలుగు అనువాదకుడు, చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు. వీరు ఈ ప్రసంగ ధార చివరి రోజైన 4, ఏప్రిల్, 1907 న . పాల్ గారి ప్రసంగము తెలుగులో తన అనువాదం చెప్తూ, ముగింపులో, తాను రాసిన పద్యం చదివారు. పత్రికల్లో ఈ పద్యం గురించి ప్రముఖంగా వచ్చింది. ఆ పద్యమే

"భరతఖండము చక్కని పాడి యావు
హిందువులు లేగ దూడలై ఏడ్చుచుండ
తెల్లవారను గడసరి గొల్లవారు
పితుకుచున్నారు మూతుల బిగియగట్టి"

ఒక్క నాలుగు పంక్తులతో, ఏమిటి మన దేశంలో జరుగుతున్నదీ చెప్పిన ఈ పద్యం నలుదిక్కులా ప్రసిద్ధం. ఇలగే 1919 తరువాత గాంధీజీ అవలంబించిన పద్ధతుల్లో స్వాతంత్ర్య పోరాటం జరిగినప్పుడు కూడా మోహన దాస్ గాంధీ పేరు, తీరు, తెలుగు వారి పాట, పద్యం, శతకంలో ఇలా ఇంటింటా మారు మోగిన ఉజ్వల చరిత్ర మనకున్నది.

శ్రీగాంధి నామం - మరువాం మరువాం
సిద్ధము జైలుకు - వెరువాం వెరువాం
కూడి భారతమాత - గొలుతాం గొలుతాం
నేడే స్వరాజ్యాన్ని - తెస్తాం తెస్తాం
దేశభక్తులు మాకు - సారాం సారాం
దేశద్రోహులు మాకు - దూరాం దూరాం
వర గాంధి మార్గాన్ని - వదలాం వదలాం
వేరే మార్గాలన్నీ - వదిలాం వదిలాం
లాటీ దెబ్బలకేము - బెదరాం బెదరాం
మేటి తుపాకీకి - చెదరాం చెదరాం
శ్రీగాంధి నామం - మరువాం మరువాం

ఉప్పు సత్యాగ్రహపు ఉప్పెన బ్రిటిష్ వారిని ముంచెత్తింది. మన శ్రీకాకుళ వాసి, ప్రియాగ్రహార నివాసి గరిమెళ్ళ సత్యనారాయణ ఇలా రాశారు.

"మాకొద్దీ తెల్ల దొరతనము దేవ మాకొద్దీ తెల్ల దొరతనము
మా ప్రాణాలపై పొంచి మానాలు హరియించే
పన్నెండు దేశాలు పండుచున్నాగాని పట్టెడన్నమె లోపమండిం
ఉప్పు ముట్టుకొంటే దోషమండి నోట మట్టికొట్టి పోతాదండి
అయ్యో కుక్కలతో పోరాడి కూడు తింటామండి"

మంగిపూడి పురుషోత్తమ శర్మ వంటి వారు ప్రజలను ఉత్తేజపరిచే రీతిలో దేశ ప్రసిద్ధ రచనలు చేశారు.

ఉప్పు కొనందయ్యా స్వరాజ్యపు
ఉప్పు కొనందయ్యా
ఉప్పు చట్టమును ధిక్కరించితే
తప్పక మనకు స్వరాజ్యము
వచ్చు
బానిసతనము బాపే మందిది
భారతీయుల భాగ్యఫలంబిది
పేదలపాలిటి పెన్నిధాన మిది
సాధులు చేసిన సంజీవిని యిది
శాంతి సైన్యములు చేసిన ఉప్పిది
శాంతి శుభమ్ములు జగతి
కిచ్చునది
గాంధి మహాత్ముడు కనిపెట్టిన
దిది బంధనంబుల బారదోలు నిది

గవర్నమెంటుకు కను విప్పంగా కాంగ్రెసు యోధులు కలసి చేసినది ప్రజల ఉచ్ఛ్వాస నిశ్వాసాల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిల్చిన ఇటువంటి ఎన్నో గీతాలకు, భారతీయ భాషల్లో పలు ప్రాంతాలలో జనం తమ సొంతం చేస్తున్న ఆత్మగౌరవ పోరాటాన్ని నేర్పిన మన సారధి గాంధీజీ.

మా నాన్నే మాకు నిరంతర ప్రేరణ

సందర్భం

రామతీర్థ

జమాల్ ఖషోగ్గి జటిలమైన వ్యక్తి. కానీ ఆయన కుమార్తెలమైన మాకు ఆయన సింపుల్ 'డాడ్' మాత్రమే. మా కుటుంబానికి ఆయన చేసే పనంటే గౌరవం. ఆయన పాస్‌పోర్ట్ నిండా ఎన్నో దేశాల ముద్రలు, తిరిగి వచ్చిన ప్రదేశాల ఆనవాళ్లూ ఉండేవి. తెచ్చిన అనేక పత్రికలు, పుస్తకాలు, ముతక వాసన వేస్తూ, ఆయన టేబుల్ చుట్టూ క్లిప్పింగులుగా అమర్చి ఉండేవి నిత్యమూ. తిరిగి వచ్చేటప్పుడు, ఆయన మాకెన్నో బహుమతులను తేవడమే కాక, ఉత్కంఠ కలిగించే దూరదేశాల కథలెన్నో చెప్పే వాడు.

మేం అమ్మా నాన్నల జ్ఞాన సముపార్జన ప్రేమ వలయంలో పెరిగాం. వాళ్ళు మమ్మల్ని ఎన్నో మ్యూజియంలకు, చారిత్రిక ప్రదేశాలకు తీసుకువెళ్లి, అవన్నీ విపులంగా చెప్పేవారు. జెడ్డా నుంచి మెదీనా దాక కార్‌లో ప్రయాణం చేసేటప్పుడు చుట్టూ వున్న ప్రదేశాల చారిత్రిక ప్రాధాన్యత మాకు చెప్పేవారు. ఎప్పుడూ ఆయన తన చుట్టూ పుస్తకాలతో ఉన్నా, ఇంకా పుస్తకాలు కావాలనే వారు. చదివిన విస్తార గ్రంథాలలో, ఎప్పుడూ ఇవే కావాలి అనో, అవి వద్దు అనో ఆయనకు ఎంపికలు ఉండేవి కావు. ఆ పుస్తకాల్లోని భిన్న వాదనలు, అభిప్రాయాలను ఆకళింపు చేసుకునేవారు.

ఆయన జీవితం నిండా ఎన్నో అనూహ్యమైన మలుపులు, మెలికలు. అవి మా కుటుంబాన్నంతటినీ ప్రభావితం చేసేవి. కొద్ది సంవత్సరాల వ్యవధిలో, ఎవరైనా రెండుసార్లు ఉద్యోగం నుంచి



కుమార్తెతో జమాల్ ఖషోగ్గి

తొలగించబడి ఉండరు. 'అల్ వతన్' పత్రిక ప్రధాన సంపాదకులుగా ఉండగా నాన్నకి ఈ అనుభవం ఎదురయింది. ఏం జరిగినా సరే, నాన్న ఒక ఆశావాది. ప్రతి సవాలులో ఒక కొత్త అవకాశాన్ని చూడడం నాన్న తత్వం. అభిప్రాయాలు వ్యక్తపర్చడం, తన భావాలను పంచుకోవడం నాన్నకి చాలా ముఖ్యమైన అంశం. అలాగే ఆయనకి రచన కేవలం పని కాదు. అదొక తప్పనిసరి కర్తవ్యం.

రంజాన్ పండుగ రోజుల్లో మేం వర్జీనియాలో ఉండగా, ఏడాదిగా తన కోసం నిర్మించుకున్న చిన్న లోకాన్ని చూపించాడు. మమ్మల్ని తన స్నేహితులకు పరిచయం చేశాడు. తను తరచుగా వెళ్లే ప్రదేశాలు చూపెట్టాడు. అక్కడ అమెరికాలో ఎలా తన కోసం ఒక చిన్న లోకం ఏర్పాటు చేసుకున్నాడో, అలాగే, తన స్వదేశం సౌదీ చూసేందుకు, తన కుటుంబాన్ని, తన ప్రియ సహచరులను కలిసేందుకు తపన పడేవాడు.

సౌదీ అరేబియా వదిలి వెళ్లవలసిన రోజున తన గుమ్మంలో నిలబడి తను తిరిగి వస్తానా మళ్ళీ, అన్న అబ్బురపాటుకి గురయ్యాను అని చెప్పాడు. తన జీవితంలో ఎదుర్కొన్న కష్టాలు, చేసిన ప్రయా[ణా]లు, వీటివల్ల ఎంత తలమునకలుగా ఉన్నా తాను తిరిగి స్వదేశం వస్తాను అన్న ఆశతోనే నా... బతికారు. ఎందుకంటే, నిజానికి, నాన్న అసమ్మ... దారు కాదు.

అక్టోబర్ రెండు తరువాత, మా కుటుం... వర్జీనియాలో నాన్న ఇంటికి వెళ్లాం. అక్కడ ... గుండెలు కలచి వేసింది, నాన్న కూచునే ఖాళీ కు... ఆయన లేని శూన్యం మా చెవుల్లో హోరెత్తిం... మాకు అక్కడ కూచుని ఉన్న నాన్న కనిపిస్తున్నా... తలపైకి పెట్టుకున్న కళ్ళద్దాలు, ఏదో చదువుత... తీరిక లేకుండా. ఆయన రచనలు చూస్తూ ఉం... తాను సౌదీ తిరిగి వచ్చే నాటికి, తనకు, ఇతర సౌ... పౌరులకు, ఆ దేశం మరింత జీవన భద్రత... కూడిన మెరుగైన ప్రాంతంగా మారాలన్న ... కనిపిస్తుంది.

ఇది నాన్నకి నివాళి కాదు. ఎందుకు కా... అంటే నివాళి అయితే, అక్కడితో ఈ విషయం ... పోతుంది. అంతకన్నా ముఖ్యంగా ఇదొక వాగ్దాన... ఆయన వెలార్చిన కాంతి ఎప్పటికీ వెలిసి పోదు అ... ఆయనకు జ్ఞానం, సత్యం అంటే ఉన్న గౌరవ... ప్రేమ మాకు నిరంతర ప్రేరణ.

వచ్చే జన్మలో మేము ఆయనను కలిసే దాకా...

– నోహా ఖషోగ్గి, రజన్ జమాల్ ఖష...

(అక్టోబర్ రెండున టర్కీ లోని సౌదీ అరేబియా రాయబార కార్యాలయంలో, సౌదీ రాజ్య ఆదే... దంతో 58 ఏళ్ల జమాల్ ఖషోగ్గి హత్యకు గుర... య్యారు. ఆయన కుమార్తెలు నిండైన ఆత్మ గౌర... వంతో చేసిన రచనకు తెలుగు అనువాదం)

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయి...

మొబైల్ : 98492 003...

...వా, లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేసున్న యెడల

సాక్షి SAKSHI TELUGU DAILY
Wed, 28 November 2018
epaper.sakshi.com/c/34383837

వ్యాసానికి శ్వాస ఇనాక్

వ్యాసం - ఈ ఏడాది తెలుగులో సాహిత్య అకాడెమీ మన్నన పొందిన ప్రక్రియ. విమర్శ ఒక రచన పైన కానీ, ఒక ధోరణి పైన కానీ, ఒక కాలం పైన కానీ ఒక ఉద్యమం విషయమై కానీ ఒక రచయిత సంపూర్ణ కృషి గురించి విరివిగా విశాలంగా, సాకల్యంగా రాయబడ్డప్పుడు, అది వ్యాస రూపంలోనే ఉంటుంది. విమర్శకు కాదు, వ్యాసాలకు వచ్చింది ఈ అవార్డ్ అని కొందరు అంటున్న పరిస్థితి ఉన్నది. అకాడెమీ కూడా వ్యాసాలు, విమర్శ అని రెండు వేరుగా గుర్తించి అవార్డులు ఇవ్వడం కూడా ఈ గందరగోళానికి కారణం.

తెలుగులో విమర్శకులు లేరు అనేది ఒక హ్రస్వ దృష్టి గల పరిశీలన. విమర్శ అనే మాటకే బాగా పట్టించుకోవడం అని అర్థం. వ్యాసం వచనంలో ఉండడం, తెలుగులో రాసిన స్థానిక కైఫీయత్తుల్లో మొదలైంది. వీటికి మూడు వందలేళ్ళ చరిత్ర పైబడి ఉన్నది. విమర్శ అంటే పూర్వ రచనలను బాగా పట్టించుకోవడం, వాటిపై పలు వ్యాఖ్యలు, ఉల్లాసాలు, మంజరీ వ్యాఖ్యలు క్రిటికల్‌గానే చేశారు ఆనాటి పండితులు. క్రిటికల్ ట్రెడిషన్ అంటే ఒక రచనను తూర్పార బట్టడం మాత్రమే కాదు - దాని మేలుబంతి లక్షణాలను, రానున్న కాలాల వారికి సుబోధకంగా తమ పరిజ్ఞాన సంపన్నం చేసి సారస్వత విస్తృతం చేయడమే. సంస్కృత సాహిత్యంలో విశిష్ట కావ్యాలకు హృదయోల్లాసిని వ్యాఖ్యలు, బాల సుబోధక వ్యాఖ్యలు ఇలా ఎన్నో రావడం జరిగింది. ఆ కావ్యాల గాఢతకు ఈ వ్యాఖ్యలు అవసరం అయ్యాయి అనుకుంటే, అప్పట్లో, వచన రచన లేదు కనుక, ఈ వ్యాఖ్యాన రచనలన్నీ, అలంకారిక దృష్టి గల పరిశీలనలే, పరిగణనకు నిల్చిన విమర్శలే. వావిళ్ల వారి ప్రచురణాల్లో, మనకు తొలిగా తెలుగు ప్రబంధాలు, ఇతర కావ్యాలు, సుబోధక వ్యాఖ్యతో రావడం, అంటే ఆ పద్యం గురించి, వచనంలో అర్థ విస్తృతిపై చర్చ, కవి నైపుణ్యంపై విమర్శ చోటుచేసుకున్నాయి. కైఫీయత్తుల / స్థానిక చరిత్ర రచనలు కవిలె కట్టలుగా, అక్కడి కరణాలు, గ్రామ పంచాయతీ మండలి పెద్దలు, రాయడం జరిగి, కనీసం తెలుగు, కన్నడ, తమిళ భాషా ప్రాంతాల ఈ వచన పద్ధతి, వ్యాస రూపేణా తొలి రచనలకు దారితీసింది. "వ్యాసము" అంటే "ఏదేని విషయంపై విరివిగా వ్రాయుట" అని శబ్ద రత్నాకరము చెప్తున్నది.

తెలుగులో కాల్పనిక వచన రచనకు ముందరే వ్యాసం ఏర్పడి ఉన్నది. హిందె రాజాస్, అనంతరం, తొలి వచన రచన (1790-1800) కాగా, అనువాద వచన రచనలో విశాఖపట్నం నుంచే 1818లో బైబిల్ అనువాదం వెలుగులోకొచ్చింది. ఇది గురజాడ వాడుక భాష రాయడానికి దాదాపు ఎనభై ఏళ్ళ కిందటి మాట. 1836 సరికి, నాలుగు వందల పేజీల పైబడిన కాశీ యాత్రా చరిత్ర పూర్తి వచన రచనగా, ఏనుగుల వీరాస్వామయ్య రాశారు. ఇవన్నీ అంటే - కైఫీయత్తులు స్థానిక చరిత్ర వ్యాసాలు, బైబిల్ అనువాద వచన మతగ్రంథము. కాశీయాత్ర చరిత్ర, యాత్రా వ్యాస రూప చరిత్ర, ఇవన్నీ సాహిత్య / సామాజిక / భాషా ఆధునికీకరణ ప్రక్రియలో తొలి అడుగులే. సామినేని ముద్దు నరసింహనాయుడు 'హిత సూచని' వచన రచన 1862లో అచ్చు పడినా, రచన అంతకుముందే జరిగింది. 1861 చిన్నయసూరి మరణం, గురజాడ జననం కూడా. వచనలో తెలుగు కథలు, నవలలు పాశ్చాత్య సమాజ సాహిత్య సంప్రదాయం నుంచి రావడానికి ముందరే, ఆంగ్ల సమాజ ప్రభావంతో, మన వ్యాస రచనా ప్రయాస కొన్ని అడుగులేసింది.

1900కి ముందరే, కందుకూరి పత్రికా రచనలో వ్యాసం తన ఆధునికతను బలమైన పరిచయం చేసింది. 1910 ప్రాంతానికే, ఆంధ్ర భారతి వంటి పత్రికల్లో, భోగరాజు పట్టాభి సీతారామయ్యగారి వ్యాసాలుగా కనిపించ సాగింది. ఇంకా తెలుగు వారి తొలి డైలీ ఆంధ్ర పత్రిక ఏర్పడక ముందరే వ్యాసాలు వివేక వర్ధినిలో, ఆంధ్రభారతిలో, ఏదన్నా విషయం పై విరివిగా రాయడం అనే పనిచేస్తూనే ఉన్నాయి. వ్యాసం రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, కట్టమంచి రామలింగారెడ్డి, గురజాడ (మాటా - మంతి వ్యాసాలు) కొమర్రాజు లక్ష్మణరావుగారి చరిత్ర వ్యాసాలు, ఇవన్నీ 1910 నాటికే వస్తున్నాయి. గురజాడ తొలి కథ 1910 సంవత్సరంలో అనుకుంటే, అదే ఏడాది "ఏబది వేల బేరము" క. రామానుజ రావు గారి కథానిక (అంటే కొమర్రాజు లక్ష్మణ రావు గారే) 1910 ఆంధ్రపత్రికలో వెలువడింది.

వ్యాసం - సాహిత్య విమర్శా వ్యాసం కావడం ఒక సహజ పరిణామం. తెలుగు సాహిత్యంలో విమర్శ లేదు అన్నది నన్నయ నుంచి కందుకూరి కాలం దాకా వర్తిస్తుంది. కందుకూరి కవుల చరిత్రలో చెప్పినది కూడా కవి వివరాలతో కూడిన అతని రచనల విమర్శే. సమగ్రాంధ్ర సాహిత్యంలో కూడా, ఆరుద్ర కవులు, యుగాలపై సాహిత్య విమర్శ చేశారని తెలుస్తుంది. ఇప్పుడు తెలుగు సాహిత్యంలో విమర్శ లేదు అన్న అభిప్రాయం చెప్పేవారు మన పద్య సాహిత్యం గురించి మాట్లాడ్డం లేదు. సంస్కృత కవుల కావ్యాలపై మూల కావ్యాలై వచ్చిన కొన్ని వందలేళ్ళ వ్యవధిలోనే తమ జీవిత కాల కృషిగా ఎందరో వెలువరించిన సెకండరీ వ్యాఖ్యాల గ్రంథాల వలె (మల్లినాథ సూరి, ఇంకా ఎందరో చేసిన వ్యాఖ్యల వలె) తెలుగులో లేవు. అంటే - తెలుగులో నన్నయ మొదలుకుని, పద్దెనిమిదో శతాబ్దం దాకా, ఎవరి రచనలు వారివే తప్ప, ఒకరి మౌలిక రచనను తరువాతి కాలంలో వ్యాఖ్యా సంపన్నం చేసే పని మన తెలుగు కవులు చేసినట్లు కనపడదు. ఆ అర్థంలో విమర్శ లేదు అనేది పద్య యుగానికి చెందిన ఒక సాహిత్య చారిత్రక వాస్తవం.

కానీ ఆధునిక కాలంలో, తెలుగులో దాదాపుగా యాభై మందికి పైగా ప్రసిద్ధ సాహిత్యవేత్తలు, వ్యాఖ్యలు, ప్రైమరీ రైటింగ్ పై సెకండరీ రైటింగ్స్ చేసిన శతాబ్దాధిక కాల నేపథ్యం ఉండగా, ఆధునిక సాహిత్యంలో ఈ మాట అనే వారు, వారి దృష్టిలో విమర్శ అంటే ఏమిటో ముందు తేల్చి చెప్పాల్సి ఉంటుంది. అది సాహిత్యం గురించే ఉండాలా - ఒక సామాజిక ధోరణి, సంఘటన, సాంస్కృతిక ప్రక్రియ, వీటి గురించి విరివిగా రాస్తే- మంచి చెడు చెప్తే, అది ప్రపంచ సమాజాలకు క్రిటికల్ ఎస్సే అవుతున్నది కానీ, మన తెలుగు వారికి మాత్రం విమర్శ కాదా? అంటే కావడం లేదనే వీరి అభిప్రాయం. విమర్శ అంటే, వీరి పడికట్టు రాళ్ళు ఏమిటో ఆధునిక సాహిత్యం నెలకొని నూరేళ్ళు పైబడినా, ఇప్పటికీ చెప్పలేకపోతున్నారు.

ఈ సందర్భంలో, ఇనాక్ గారి వ్యాసాలకు, సాహిత్య అకాడెమీ అవార్డ్ - అంటే నిజానికి వారి ఈ వ్యాస ప్రక్రియా సంపన్న కృషిలో ఈ గౌరవం పొందిన "విమర్శిని" ఒక్కటే పుస్తకం కాదు. వారి డాక్టరేట్ పట్టా పరిశ్రమ "వ్యాస పరిణామం" పై 1968లోనే సాగింది. తరువాత కూడా క్రమం తప్పకుండా వారు నేటివరకూ పదమూడు పుస్తకాలుగా సాహిత్య విమర్శ, ఇతర ప్రత్యేక దృష్టి గల వ్యాస సంకలనాలను వెలువరించారు. తెలుగు వ్యాసాలు, సాహిత్యదర్శిని, సాహిత్య సందర్శనం, సమీక్షణం, సమీక్షా సాహిత్యం, పీఠికా సాహిత్యం, తెలుగు కథానికా పరిణామం, చిన్ని కథల వెన్నెల, తెలుగు నవలా వికాసం, సాహిత్య ప్రయోజనం, శూద్రకవి శుభమూర్తి వసుచరిత్ర వైశిష్ట్యం, జానపద సాహిత్య విమర్శ, మరియు ఆంగ్లంలో 'ది ప్రిన్సిపల్స్ ఆఫ్ మాడ్రన్ లిటరేచర్' వగైరా వెలువడ్డాయి. ఇప్పుడు "విమర్శిని"కి సాహిత్య అకాడెమీ అవార్డు రావడం ఈ క్రమానుగత వ్యాస సృజనలో ఒక ఘట్టం మాత్రమే. తన డాక్టరేట్ సిద్ధాంత గ్రంథంలో, వ్యాసాన్ని సాహిత్య వ్యాసం గానే కాక, సృజన వ్యాసం, స్త్రీ వ్యాసం, పత్రికా వ్యాసం, వివాద వ్యాసం, విమర్శనా వ్యాసం అంటూ విభజన చేసి, విశ్లేషించి, తెలుగు వ్యాస శైలి ఎలా ఉన్నదో ఈ పరిశోధనలో విస్తృత చర్చ చేశారు కొలకలూరి ఇనాక్. వారు పలు ప్రక్రియలు రాసినా, కథలు, నవలలు, అనువాదాలు, నాటకాలు, వ్యాసం విషయంలో వారి కృషి ఇరవయ్యో శతాబ్దపు ఉత్తరార్థంలో ఎన్నదగ్గది. కాల్పనిక సాహిత్యం మిన్నగా ఉన్నప్పటికీ, వారికి వ్యాస ప్రక్రియకు, ఈ అకాడెమీ అవార్డ్ రావడం వెనుక ఒక కవితాత్మక న్యాయం ఉన్నది.

నవలల్లో కూడా వ్యాసాలు ఉండే అవకాశం ఉంది అనే నిశిత పరిశీలన తన చిన్నప్పుడే చేసారు ఇనాక్. దానికి రంగరాజ చరిత్రము, విశ్వనాథ వేయిపడగలు ఉదహరిస్తారు ఇనాక్. ప్రమేయము, సంగ్రహము, గా తొలుదొల్త వెలువడినది, 1880ల నాటికి కందుకూరి మాటలాడితే ఉపన్యాసము, అదే రచన చేస్తే వ్యాసంగానూ ఏర్పడి, కందుకూరి కాలానికి నిలదొక్కుకున్న పరిణామ క్రమ వికాసం చెప్పిన చారిత్రక దృష్టి గల ఇనాక్, తెలుగు ఆధునిక వచన సాహిత్యంలో తొలి ప్రక్రియ వ్యాసమే అని అప్పట్లో ప్రతిపాదించక పోయినా, ఇప్పుడు చాలా స్పష్టమైన అంశం అది. ఆంగ్ల సమాజంలో వ్యాసం ముద్రిత రూపం కాగా, తెలుగు నాట ఉపన్యాసంగా కందుకూరి సృష్టిగా నిలిచిందని చెప్తారు. ఆధునిక తెలుగు వ్యాసం ఎందరో రాసినా, వ్యాసం పుట్టుక గురించి తన పరిశోధన తో మొదలైన ఒక నిరంతర సాహిత్య కారుడు, ఆ కోవలో, పదమూడు పుస్తకాలు గూడా భిన్న సాహిత్యాంశ సంబంధితమైన, విరివిగా విషయ రచన చేయడం ఒక సహజ ప్రతిభా లక్షణంగా భావిస్తే, ఈ వ్యాస రూప జిజ్ఞాసాత్మక ప్రయాస, దశాబ్దాల ముందర ఇనాక్ గారికి డాక్టరేట్ పట్టా అందించగా, నేడు, అదే వ్యాస రూప సాహిత్యం వారికి కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డ్ కూడా తెచ్చి పెట్టింది. ఈ క్రమంలో వ్యాసం , లేదా ఉత్తమ సాహిత్యం ఏం చేస్తుంది అంటే, పదకొండో శతాబ్దం వాడైన మమ్మటుని మాటల్లోనే చెప్పుకుందాము.

"కావ్యం యశసే అర్థకృతే వ్యవహార విదే శివేతర క్షతయే
సద్యః పర నిర్వృతయే కాంతసమ్మిత తయోపదేశయుజే"

(కావ్యప్రకాశం, 1-2).

కీర్తి, ధనం, వ్యవహార జ్ఞానం, అమంగళ నాశం, ఉత్కృష్టమైన ఆహ్లాదము కాంతా అమ్మితమైన ఉపదేశము అను ఆరు కావ్య ప్రయోజనాలను ఈ ధ్వని వాద ప్రవర్తకుడు గుర్తించగా, చాలా మంది వీటిని సాహిత్య ప్రయోజనాలుగా అంగీకరించారు. వ్యాసం ప్రపంచ సమాజాల్లో, తెలుగులో కూడా, సాహిత్య గౌరవం పొందాకా ఇవన్నీ కూడా సాధించింది అనేది నిర్వివాదాంశం. ఆధునిక తెలుగు సాహిత్య తొలి ప్రక్రియగా వ్యాసం విశిష్టత, ఇనాక్ చేతుల మీదుగా పెరిగిన ఈ మొక్క, ఇన్నేళ్లకు, నేడు వారికే జాతీయ స్థాయిలో ఫల ప్రదాన సందర్భంగా పరిణమించడం, ఒక ఉన్నత సందర్భం. విమర్శకు వ్యాస ప్రక్రియలోనే అస్తిత్వం, అంతే కాక, సామాజిక, రాజకీయ, మనోవైజ్ఞానిక సిద్ధాంతాల పై ఆధార పడి ఒక రచనపై పడే విస్తృత దృష్టిని , విమర్శ, అనుకుంటే, అలా జరిగిన మంచి సందర్భాలు కూడా ఈ ఆధునిక సాహిత్యంలో ఎన్నో ఉన్నాయి.

తెలుగులో విమర్శ లేదు అనేవారు సామాజిక, రాజకీయ, మనో వైజ్ఞానిక సిద్ధాంతాల పై ఆధార పడి ఒక రచన పై పడే విస్తృత దృష్టినివిమర్శ అనుకుంటున్నారు. అది ప్రత్యేకం అని ఎలా భావిస్తున్నారో మరి. ఏ భాషలో అయినా, విమర్శ వ్యాస మహా స్వరూపంలో ఒక భాగం కావచ్చు తప్ప, విమర్శ అంటూ వేరే రూప విభాగం, ఉండదు అని, ప్రస్తుతం తెలుగులో విమర్శ లేదు అంటున్న వారు, తమకు స్పష్టత లేని ఈ ప్రతిపాదన గురించి మరొక సారి పునరాలోచించుకోవలసిన అవసరం, ఈ విషయమై విశాల ప్రాతిపదికన చర్చ జరగవలసిన అవసరం కూడా ఈ అవార్డ్ కల్పిస్తున్నది. ఆచార్య కొలకలూరి ఇనాక్ గారి సాహిత్య ప్రజ్ఞా పాటవాలు ముందరి తరాలు అలవర్చుకోదగ్గవి.

- రామతీర్థ, 9849200385

భారతీయాంగ్ల సాహిత్యానికి తొలి జ్ఞానపీఠం

పురస్కారం

తారా శంకర్ బందోపాధ్యాయ్ (1966), బిష్ణు డే (1971), ఆశాపూర్ణా దేవి (1976), సుభాష్ ముఖోపాధ్యాయ్ (1991), మహాశ్వేతా దేవి (1996), శంఖా ఘోష్ (2016), తరువాత ఇప్పుడు వంగ దేశ ఏడవ రచయితగా అమితావ్ ఘోష్ జ్ఞాన పీఠ పురస్కారాన్ని అందుకోబోతున్నారు. దేశవ్యాప్త సాహితీవేత్తలకు ఇది యాభై నాలుగో జ్ఞానపీఠ గౌరవం. ఈసారి పురస్కారానికి ఒక ప్రత్యేకత ఉంది. ఇంతవరకూ పదమూడు భారతీయ భాషలకు- మలయాళం, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, ఒడియా, తెలుగు, తమిళ, హిందీ, ఉర్దూ, అస్సామీస్, పంజాబీ, కశ్మీరీ, కొంకణి సాహిత్యవేత్తలకు ఈ గౌరవం దక్కింది. కానీ, ఇదే తొలిసారిగా భారతీయాంగ్ల రచయితకు ఈ గౌరవ ప్రదానం జరుగుతోంది. భారతీయ రాజ్యాంగం ఎనిమిదో అధికరణంలో గల భారతీయ భాషలకు, ఇంగ్లిష్‌కు ఈ అవార్డు ఇస్తామని 1965లోనే చెప్పినా, యాభై నాలుగేళ్లకు కానీ భారతీయాంగ్ల సాహిత్యానికి ఈ పురస్కారం రావడానికి సాధ్యం కాలేదు. బెంగాల్‌కు చెందిన అమితావ్ ఘోష్ భారతీయాంగ్ల రచయిత. ఆంగ్ల భాష భారతీయ భాషగా మనకు సాహిత్యం చాలా కాలంగా ఉంది.

భారతీయాంగ్ల సాహిత్య చరిత్ర కూడా బెంగాల్ నుంచే మొదలవుతుంది. స్వతంత్ర పూర్వకాలంలో కూడా దేశ సాహిత్య మూలాల్లో, ఇంగ్లీష్ భాష కూడా ఒకటి. కలకత్తా 1910 వరకూ భారతదేశ రాజధానిగా ఉండడం కూడా జాగ్రత్తగా గమనించాల్సిన విషయం. టాగూర్ ఆంగ్లంలో రాయడానికి ముందే బంకిమ్ చంద్ర బందోపాధ్యాయ్ ఆంగ్లంలో ఒక నవల రాశారు. నూటా యాభై అయిదు ఏళ్ల ముందర ఇది 1864లో ఇండియన్ ఫీల్డ్ అనే ఒక పత్రికలో ధారావాహికగా ప్రచురితం అయింది. వంగ సాహిత్యంలో 1860ల్లో ఆంగ్లభాషలోకి రచనలు వెళ్లడం, కొన్ని మూల రచనలు ఉన్నాయి. అలా ఆంగ్లంలోకి 1861లో వెళ్ళినది, ఇంగ్లాండు చేరి అక్కడి పౌర సమాజంలో, ఈస్టిండియా కంపెనీ దురాగతాలను బయటపెట్టిన రచనగా తొలి భారతీయ సామాజిక నాటకం నీల్‌దర్పణ్. రచయిత దీనబంధు మిత్రా. ఆంగ్ల అనువాదకులు మైకేల్ మధుసూధన్ దత్. ఈయన ఫ్రీవెర్స్‌లో 'మేఘనాథ్ వధ' కావ్యకర్త.

అలా భారతీయాంగ్ల సాహిత్యం శతాబ్దంన్నరగా రాయబడుతూ ఉన్నా, దేశంలో ఒక ప్రఖ్యాత సాహిత్య గౌరవం ఇప్పుడు దక్కింది. అమితావ్ ఘోష్ తండ్రి ఉద్యోగరీత్యా భారతదేశం, ఇరాన్‌లలో పెరిగారు. 1989లోనే తన తొలి నవల 'సర్కిల్ ఆఫ్ రీజన్'కి సాహిత్య అకాడెమీ అవార్డు పొందిన యువకుడు ఘోష్. 1986 నుంచి 2017లోగా పద్నాలుగు ప్రముఖ కాల్పనిక రచనలు, సామాజిక వ్యాసాలు రాసిన ఘోష్ 1989 నుంచి 2011 లోపల పన్నెండు జాతీయ, అంతర్జాతీయ సాహిత్య పురస్కారాలు పొందిన విశిష్ఠ సాహితీవేత్త. ఇప్పుడు జ్ఞానపీఠ పురస్కారం ఆయనకు యావత్ సాహిత్య కృషికిగానూ ప్రకటించారు.

ఘోష్ రచనల్లో భిన్న ప్రాంతాల ప్రజాజీవితం, వాతావరణం, భౌగోళిక మార్పులకు దారితీస్తున్న సాంకేతిక, పారిశ్రామిక, సాయుధీకరణ సమాజాలు కనిపిస్తాయి. హంగ్రీ టైడ్ నవలలో ఒక అరుదైన ఒరసెల్లో డాల్ఫిన్‌ను చూడడానికి, నాలుగు వందల మైళ్ళ బంగాళాఖాతంలో ప్రయాణం అసాధారణమైన కథ. కాల్పనిక నైపుణ్యం కన్నా సమాచార విస్తృతి, ఆసియా దేశాల్లో వలస పాలన కాల మార్పులు, ఓపికతో వివరిస్తాడు అమితావ్ ఘోష్. సీ ఆఫ్ పాప్పీస్ అటువంటి నల్లమందు వ్యాపారం, యుద్ధాల కథ. షాడో లైన్స్, గ్లాస్ పాలస్ వంటివి కథలుగా కాక, మనమే వాటిలో కథని వెతుక్కోవల్సిన పద్ధతిలో ఉంటాయి. ప్రపంచ దేశాల పర్యావరణ చైతన్య రాహిత్యం పట్ల, ముఖ్యంగా బంగాళాఖాతం తరపున ఒక సంక్షుభిత స్వరం వినిపించిన రచయితల్లో అమితావ్ ఘోష్ ముఖ్యుడు. ఒకప్పుడు గొప్ప నాగరికతలైన ఈజిప్ట్, ఇండియా దేశాల ప్రస్తుత పరిస్థితి, 'యాంటిక్ లాండ్'లో వివరిస్తాడు. కలకత్తా క్రోమోజోమ్' అనే నవలకు, ఆర్థర్ సి క్లార్క్ సైన్స్ ఫిక్షన్ బహుమతి పొందిన భిన్న ఇతివృత్తాల రచయితగా గుర్తింపు పొందాడు. 1997లో ఈ సైన్స్ ఫిక్షన్ అవార్డు పొందిన తొలి భారతీయ రచయిత అమితావ్ ఘోష్. ఇంతవరకూ మరెవరికీ మన దేశంలో ఈ అవార్డు రాలేదు!

సామాజిక చరిత్ర, వలసలు, వలస వెళ్ళిన భారత, ఇతర ఆసియా ప్రజల జీవితాల మార్పులు, నదీనదాల పట్ల మనకు గల అశ్రద్ధ, మన అణ్వాయుధీకరణ పట్ల అసంతృప్తి... ఇలా అమితావ్ ఘోష్ రచనలకు పునాది మానవ వర్తమాన సమాజమే కావడం ఒక బలం. అలాగే విస్తార చిత్రణ ద్వారా పెద్దగా చదివించే లక్షణం కలిగి ఉండడం ఇతని కొన్ని రచనల్లో కనిపించదు. వాటి ఇతివృత్త వైశాల్యం మాత్రం, ఒక ప్రపంచ స్థాయిలో ఉండడం ఘోష్ ముద్ర. సామాజిక వ్యాసాలుగా వెలువరించిన ఇమామ్, ఇండియన్ ... తను ఇరాన్లో గడిపిన కాలం, అక్కడి వ్యక్తులు, ఇప్పటి సమాజం... ఇలా పద్దెనిమిది వ్యాసాలుగా, వర్తమాన విషమ పరిస్థితులను తెలిపిన రచన. ఇండియా, ఇరాన్ రెండూ ప్రాచీన నాగరికతలు, పాశ్చాత్య దేశాలతో హింసలో పోటీ పడుతున్నాయా అన్నది ఒక ఛాందస ముస్లిం మతగురువు ఇమామ్‌తో ఒక భారతీయునిగా చేసే వాదనలు, రచయితను ఒక సామాజిక మానవ పరిణామ క్రమం (సోషల్ ఆంత్రోపాలజీ) దిశగా తన ఆలోచనలు, రాతలు వెలువడుతున్న సందర్భంగా తోస్తుంది. ఇంతకుముందర కూడా తన జీవిత అనుభవంలో ఉన్న ఈజిప్టులో జీవనం గురించి 'యాంటిక్ లాండ్' వ్యాసాల సంపుటిలో విశదంగా ప్రస్తావనలు చేశారు.

ఉపఖండ ఇతివృత్తాలపై మనకు రెండు వైపుల్నుంచి కూడా సాహిత్యం తక్కువే. అటువంటి కాలంలో 1998 నాటి భారత్, పాక్ అణుబాంబు ప్రయోగాల గురించి, తాను 'న్యూయార్కర్' పత్రికకు రాసిన ఒక రచనకు విస్తరణ రూపంగా, రెండు దేశాల పరిస్థితులు, పాలకులు, ఈ బాంబులు నిజంగా అవసరమా అన్న అంశాలపై ఒక నిశితదృష్టి గల విశ్లేషణ చేశాడు ఘోష్ 'ఇది కేవలం ఆసియా రంగస్థలిలో, తమ తమ ఆధిపత్య నిలుపుదల, పెంపుదల ప్రయత్నమే తప్ప, ఈ బాంబులు షాంపేన్ బాటిల్స్ వంటివి. ఎప్పుడూ అవసరం రావు. అలా మూలాన పడి ఉంటాయి అంతే!' అని ప్రముఖ ప్రస్తావన చేశాడు. వీటిని పూర్తి స్థాయి కల్పనగా రాయాలి అన్నా కూడా, ఈ బాంబులు ఏర్పాటు చేసుకుని ఇరవై ఏళ్ళు అవుతున్న సందర్భంగా, అమితావ్ ఘోష్ తెలిపే ప్రామాణిక సమాచారం మనం తెలుగులో కూడా చదువుకునే వీలు పాఠకులకు కల్పించాలి. ఈ రెండు దేశాలు ఒకప్పుడు ఒకే ఉపఖండం అన్నది మరిచి, వీరు తయారు చేసే బాంబులు తమ ప్రజల మీద ప్రయోగానికే అన్నదే, ఘోష్ ఒక విచారకర దశగా రాజకీయ వర్గాలు మరిచిపోవడాన్ని ప్రధానంగా చెప్తారు. అణుబాంబుల ప్రయోగ తర్కం ఎంత అవాస్తవికమో తెలియాలంటే, ఈ యుద్ధాలకు ఎంతమాత్రమూ ఎదుర్కొనేలా లేదా, సన్నద్ధతలు, సన్నాహక సౌకర్యాలు లేని రెండు భారత్, పాక్ సమాజాలు ఎంతలా నష్టపోతాయో వివరిస్తారు. జీవితులై ఉన్న అణుబాంబు బాధితులకు కనీస ప్రత్యేక చికిత్స ఆసుపత్రులు కూడా లేని దేశాల్లో అసలీ హడావిడి అవసరమా అన్నది ఘోష్ సూటి ప్రశ్న.

దేశాల సరిహద్దులు, ఖండాల కొసలు, సముద్రాల ఊహ విభాగాలు, ఇవేవీ తన రచనకు అడ్డు రావు. తనది ఒక భౌగోళికుడి సాధన, వేదన, యాతన, అక్షర ప్రయాస. పర్యావరణం దెబ్బ తింటే, హిందూ మహాసాగర్ దేశాల్లో, రెండొందల యాభై మిలియన్ల ప్రజలు తీవ్ర నష్టానికి గురవుతారని చెప్తూ, పర్యావరణ బాధ్యతారాహిత్యం ఎలా మన రచనల్లో సహజ వస్తువుగా స్థానాన్ని కోల్పోతున్నాడో చెప్పే మేధావి రచయిత అమితావ్ ఘోష్. తన రచనలు కల్పన, సామాజిక వ్యాసాలు ఇరవై భాషల్లోకి అనువాదం అయిన భారతీయ సాహితీవేత్త. తన చదువుల్లో సోషల్ ఆంత్రోపాలజీలో ఆక్స్‌ఫర్డ్ నుంచి డాక్టరేట్ పొందినవారు. ఈ డాక్టరేట్ పొందాకా 1986లో రాసిన తొలి నవల 'సర్కిల్ ఆఫ్ రీజన్'కు 1989లో సాహిత్య అకాడెమీ అవార్డు పొందడమే కాక, ఫ్రెంచ్ సాహిత్య సమాజంలో 'ప్రిక్స్ మేడిక్స్ ఎత్రెంజర్' అనే అవార్డు కూడా పొందారు. ఇటలీలో గ్రుజెన్ ప్రైజ్ పొందిన ఏడాదే, 2007లోనే భారత ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించింది. సామాజిక మానవ పరిణామం, కళలు పెనవేసుకొని రచనలో ఒక అల్లిక కనిపించడం ఘోష్ పద్ధతి. 'నేను చెప్పాను, చెప్పిన దానిలో ఉన్న కథ ఏదో మీరే గ్రహించండి' అని పాఠకులను కూడా, సగం రచయితలను చేసే బరువు మోయమని పిలుస్తాడు ఘోష్. మూడు భాగాలుగా రాసిన ఓపియం యుద్ధాల పూర్వరంగ ఆసియా చిత్రణ చేసిన ఇబిస్ ట్రయలజీలో మొదటిది సీ ఆఫ్ పాప్పీస్ ఇందులో పాత్రలే, భిన్న దేశాలకు చెందినవారుగా ఉంటారు. ఘోష్ కల్పనల కాన్వాస్ చాలా పెద్దది. ఇందులో పాత్రలు, వచ్చీరాని ఇంగ్లీష్ (పిడ్గిన్), భోజ్పురి, యాసతో ఫ్రెంచ్ ఆంగ్లం మాట్లాడతారు. ఈ తొలిభాగం మాన్ ఆసియా ప్రైజ్ గెల్చుకొంది. బిహార్‌లో మొదలై కలకత్తా, చైనా, హాంగ్‌కాంగ్‌లలో తిరిగే ఈ కథను ఘోష్, గోవాలో కూచుని రాశారు కొంత, మరికొంత అమెరికాలోని బ్రూక్లీన్‌లో రాశారు. అంతకుముందర 'గ్లాస్ పేలస్'లో బర్మాలో భారతీయుల గురించి రాస్తారు ఘోష్. తన సాహిత్యంలో కథా ప్రదేశాలుగా ఇండియా, బర్మా ఈజిప్ట్, బంగ్లాదేశ్, కంబోడియా, బ్రిటన్, అమెరికాల్లోని ప్రాంతాలను చిత్రించే భౌగోళికుడు అమితావ్ ఘోష్. రాయల్ సొసైటీ ఆఫ్ లిటరేచర్ వీరితో టాగోర్ మెమోరియల్ మీటింగ్ పేరిట సాహిత్య

ఇష్టాగోష్ఠి జరిపి, ప్రముఖ సాహిత్యవేత్తగా 2011లో పేర్కొంది. సాహిత్యం అంతా మానవ కేంద్రితమేనా అన్న ప్రశ్నకు కాదు అని చెప్తాడు తన సాహిత్యంలోనూ, ఇంటర్వ్యూల్లోనూ కూడా అమితావ్ ఘోష్. పర్యావరణ సవాళ్లు మన స్వయంకృతంగా పెద్దవి చేసుకున్నవాటిపై, 'ది గ్రేట్ డిరేంజ్మెంట్' తన సామాజిక వ్యాసాల సంపుటి గురించి జరిగిన ముఖాముఖిలో తాను చెప్పినది, తన సాహిత్య సృజన తత్వంగా నిలుస్తుంది. ఈ భావన విస్తృతం చేయడానికి, దీని నిర్లక్ష్యం వల్ల పర్యావరణపరంగా పెను మూల్యం

చెల్లించాల్సిన దశకు మానవాళి వెళ్తున్నదని చేస్తున్న ప్రకటన, అమితావ్ ఘోష్ పలు రచనల్లో గల సృజన అంతరాత్మ

'సమకాలీన సాహిత్యంలో మానవ కేంద్రితంగా వచ్చిన ఈ మార్పు ఏదో ఒక కారణం వల్ల కాక, విశాలమైన సాంస్కృతిక బదలాయింపు లక్షణంగా నాకు తోస్తోంది. ఇలా మానవ కేంద్రితం కావడానికి, మనం ఇప్పుడు అభివృద్ధి, లేదా ఆధునికత అని పిలుస్తున్నవే కారణం. మెల్విలే రాసిన 'మాబీ డిక్' ఎన్నో నవలలకు మల్లే మనిషి కేంద్రంగా రాసినది కాదు. వ్యవసాయం, వేట, చేపలవేట వంటి ప్రాచీన ఉపాధులపై ఆధారపడి జీవిస్తున్న వారు, ఇవాళ కూడా, పట్నవాసుల కన్నా, తమ చుట్టుపక్కల ఉండే మానవేతర వాతావరణ, ప్రకృతి అంశాలపై ఆధారపడి, జీవిస్తున్నవారే! మరోవిధంగా చెప్తే, పారిశ్రామిక ప్రక్రియలు వాతావరణంలోకి గ్రీన్‌హౌస్ వాయువులు వదిలి పెట్టే పద్ధతుల్లో నడుస్తున్నవి, తమ కార్యక్రమ సరళివల్ల ఉత్పన్నమయ్యే దుష్పరిణామాలను లెక్కలోకి తీసుకోకుండా, ఇంకా ఎక్కువగా మనిషి కేంద్రంగానే నడుస్తున్నాయి.' సాంకేతిక జంతువులుగా మారుతూ, ఇతర ప్రాణికోటికి ముప్పు కలిగిస్తూ, ఉత్పత్తి వ్యవస్థల్లో, ప్రకృతి రక్షితంగా, మానవ సమాజ శ్రేయస్సు అంతర్నిర్మితం కాకుండా, ప్రపంచవ్యాప్తంగా కొన్ని సంపన్నవర్గాల లాభాల వ్యవస్థ ఏర్పడ్డ చారిత్రిక క్రమం, స్పష్టాస్పష్టంగా తన రచనల్లో నమోదు చేస్తూ, బంగాళాఖాతం తరపున ఆందోళనాస్వరం ఎత్తిన పర్యావరణ చైతన్యరూపం అయిన ప్రపంచ నాగరికుడు అమితావ్ ఘోష్, నేడు మొదటిసారిగా బృహత్తర రచనా పాటవానికి, భారతీయాంగ్ల సాహిత్య శాఖకి, జ్ఞానపీఠ్ గౌరవం సంపాదించిన సాహిత్యోన్నతుడు. అమితాబ్ అంటే అమిత కాంతివంతుడు అని అర్థం. ఆ అమిత కాంతిఘోషకు అభినందన.

జ్ఞానపీఠ పురస్కార రచయిత
అమితాబ్ ఘోష్

– రామతీర్థ
98492 00385

ఉత్తరాంధ్రకూ మరో కవిత్రయం

ఒక ప్రఖ్యాత కవిత్రయం ఉండగా.. వారి రచనగా మహాభారతం, దక్షిణ భారతదేశంలోనే తొలి సంపూర్ణ భారత అనుసృజనగా వెలువడిన చరిత్ర ఉండగా... ఈ ఉత్తరాంధ్ర కవిత్రయం ఎవరు? అన్న ప్రశ్న వస్తుంది. వీరు కూడా ఆ కాలంలో ఒకరినొకరు ఎరుగరు. కానీ వేర్వేరు రాజుల కొలువులో ఒకే రాజాస్థానంలో పనిచేశారు. ఆ రాజ్యం విజయనగర సంస్థానం. ఆ రాజులు పెద విజయ రామరాజు, చిన విజయరామరాజు, ఆనంద గజపతి మహారాజు. ఆ కవులు గోగులపాటి కూర్మనాథ కవి, అడిదం సూర కవి, గురజాడ అప్పారావు. 18, 19 శతాబ్దాలు వీరి కాలం. విజయనగరం ఒక ప్రాంతీయ రాజ్యంగా ఆవిర్భావం, విస్తరణ, విస్తరణ రణాలు, ఫ్రెంచ్, ఇంగ్లీష్ వారితో సైనిక ఒప్పందాలు, బొబ్బిలి యుద్ధం, పద్మనాభ యుద్ధం జరిగిన కాలం ఇది.

విజయనగరం కోట ఎప్పుడూ రక్తసిక్తం కాలేదు. యుద్ధాలు ఈ కోట దరిదాపుల్లో జరగలేదు. పాలక మహారాజుల మరణం, దూరాన 1757లో బొబ్బిలి యుద్ధ మైదానాలలోనూ (పెద విజయరామరాజు), అలాగే 1794లో పద్మనాభం దరిలోనూ (చిన విజయ రామరాజు) మరణం జరిగింది. కోట బ్రిటిష్ అధీనంలోకి వెళ్లడం, చిన విజయరామరాజు మరణం తరువాతే జరిగింది. పెద విజయరామరాజు కాలంలో గోగులపాటి కూర్మనాథ కవి, చిన విజయరామరాజు కాలంలో అడిదం సూరకవి, ఆనంద గజపతి మహారాజ కాలంలో గురజాడ అప్పారావు కవిత్రయంగా వెలుగొందారు.

1712లో మొదలైన కోట నిర్మాణం, పెద విజయరామరాజు కాలంలో జరిగింది. అంతకుముందు పూసపాటి రేగ, కుంబిళాపురం (ఇప్పుడు కుమిలి) నుంచి మట్టికోట ఉన్న ఒక చిన్న రాజ్యంగా ఉండేది వీరి జమీందారీ. 1712లోనే ఈ రాతి కోట నిర్మాణం మొదలయింది. కోట కట్టడం పూర్తి అయ్యాక, పెద విజయ రామరాజు పేరిటే, విజయనగరం ఊరు క్రమేపీ ఏర్పడింది. ఈ రాజు పాలనలో దేవాదాయ ధర్మాధికారిగా గోగులపాటి కూర్మనాథ కవి పనిచేసేవారు. జననం 1872 ప్రాంతం అని అంచనా ఉంది. వీరు అప్పట్లో రామతీర్థం, శ్రీకూర్మం, అరసవిల్లి, సింహాచలం తదితర ఆలయాలకు పర్యవేక్షకులుగా ఉండేవారు. ప్రసిద్ధ కవి కూడా. కూర్మనాథ కవి కాలానికి నవాబుల పాలనలు కూడా చూసిన ప్రాంతం ఉత్తరాంధ్ర. వారి దేశ భాషలు, వేష వ్యవహారాలు కూడా జన సామాన్యంలో నిలదొక్కుకుని ఉన్నాయి. అయితే తురుష్క దండుల దాడులు పాలన కోసం కాక, కేవలం దోచుకోవడం కోసం జరిగేవి. అటువంటి దాడి, సింహాచలం క్షేత్రంపై 1750 కాలంలో జరిగింది. సింహాచల నరసింహమూర్తిని, ఈ దౌష్ట్య నిర్మూలన చేయమని, దాడికొచ్చిన తురుష్క దండులు కొండ ఎక్కి వస్తుండగా, ఆలయ గర్భగుడి తలుపులు మూసి, కూర్మనాథ కవి చెప్పిన రోషాత్మక శతకం 'వైరిహర రంహ సింహాద్రి నారసింహ' శతకం. ఇందులో సింహాద్రి స్వామిపై నిందాస్తుతితో పాటు ఆ రోజుల్లో మహమ్మదీయ నవాబుల పాలనలో జరిగే దురాగతాలను కూడా కూర్మనాథ కవి విపులంగా ప్రస్తావిస్తారు. మొదటి పద్యంలోనే తుమ్మెదల పేరిట ('సరస చిత్తాబ్జ బంభర' అని స్వామిని సంబోధిస్తారు) ప్రస్తావన చేస్తారు. అరవై ఎనిమిది పద్యాలు పూర్తికాగానే కంచు ముక్కులు గల తుమ్మెదల దండులు బయలుదేరి, ఆ తురుష్కుల గుంపులను వెంట దరిమి దాదాపు విశాఖ వైపుగా పన్నెండు మైళ్ల దూరానికి తరిమికొట్టాయి. అక్కడ ఒక బిలంలో దూరి అదృశ్యమయ్యాయి. ఆ మెట్టకే తుమ్మెదల మెట్ట అని పేరు అప్పట్లో. ప్రస్తుత పేరు చావుల మదుం. మొదటి పద్యం ఇది.

సీ॥ శ్రీమద్రమారమణీ మణీరమణీయ / సరస చిత్తాబ్జ బంభర పరాకు / శంఖ చక్రగదాసి శార్ఙ్గ చాపాది భా / సుర దివ్య సాధనకర! పరాకు / ప్రహ్లాద నారద వ్యాస శుకాదిక / భక్త సంరక్షణ పర! పరాకు / బహుతర బ్రహ్మాండ భాండ పరం పరాకు / భరణ లీలాధురంధర! పరాకు

పద్యాలలో అన్య దేశ్యాలను వాడి శక్తివంతంగా పద్యం చెప్పడం కూర్మనాథ కవి 18వ శతాబ్దంలోనే ప్రవేశపెట్టిన ఒరవడి. బహుశా కూర్మనాథ కవి క్రీ.శ. 1030 కాలపు సోమనాథ దేవాలయంపై మహమ్మద్ గజనీ దాడి నుంచి మొదలుకుని అసంఖ్యాకంగా పలు శతాబ్దాలలో భారతీయ ఆరాధనా మందిరాలపై జరిగిన మహమ్మదీయ దాడుల్లో, ఒక కవి ఎదిరించి నిలబడి, చండ ప్రచండ కవిత్వం చెప్పిన సంఘటన ఒక్క సింహాచల క్షేత్రంలోనే జరిగింది. ఆ విధంగా కూర్మనాథ కవి జాతీయ కవి. సింహాద్రి నరసింహ శతకం పరాక్రమ కవిత్వం. ఇక జరిగే దురాగతాలను చెప్పిన తీరులో చేసిన పద ప్రయోగాలు విలక్షణమైనవి.

'బేగి ఆరే అరబ్బీ పడోరేయని / బోడి సన్యాసుల బొదుచువారు / మత్ రఖో మూకెపర్మాటీ యను వైష్ణ / వుల బొట్లు దుడువగా బోవు వారు / పత్తర్ కాయకు బందేయరే బోడు / దే యని శైవుల దిట్టువారు / క్యా బొమ్మన్ జన్నిద్ నికాల్దేయటంచు స్మా / ర్తుల ప్రల్లద ములాడి త్రోయువారు నగుచు యవనులు / వయనులు మమునిట్లు లడలజేయ / నట్టివాండ్రకు ద్విజులెంతయొగద గుడి / మ్రింగువానికి లింగమూర్భండి వడెము / వైరి/

ఈ శతకమే కాక కూర్మనాథ కవి 'ఏకాంత సేవ' అనే గేయ ప్రబంధము, పద్య సంక్షిప్తత నుంచి యక్షగాన ప్రబంధం 'మృత్యుంజయ విలాసము', 'లక్ష్మీనారాయణ సంవాదం' మొదలైనవి కూడా రచించారు. కళింగ ప్రాంత దేవతల అభేదం, సాన్నిహిత్యం తెలిసేలా జగన్నాథస్వామి రాయబారంగా కూడా వ్యవహరిస్తారు. 1720లో జన్మించిన వీరు చివరి రోజుల్లో గజపతినగరం దరి దేవులపల్లిలో జీవించారు అని చెప్తారు. వీరి రూపురేఖల గురించి ఏ వివరాలూ లేవు. కేవలం ఊహామూర్తిగా మానవాకృతి అయినా లేకున్నా మిగిలివున్న తన అక్షరాల్లో బృహద్రూప పరివ్యాప్తుడు గోగులపాటి కూర్మనాథ కవి.

వీరి తరువాతి కవి అడిదం సూర కవి. వీరు కూర్మనాథ కవి శతాబ్దంలోనే ఉన్నారు కానీ ఎక్కువగా చిన విజయ రామరాజు కాలంలో వీరి ప్రస్తావన వస్తుంది. 'సూరకవి తిట్టు కంసాలి సుత్తిపెట్టు' లాగా శాపానుగ్రహ సమర్థత గల తెలుగు కవుల్లో వేములవాడ భీమ కవి తరువాత అటువంటి కవి అడిదం సూర కవి. 'ఇదం బ్రహ్మమ్, ఇది క్షాత్రమ్' అన్న చందాన, వీరి పూర్వీకులు తొమ్మిది తరాల పూర్వం, వందలేళ్ల కిందట, రాజుల తరపున యుద్ధాల్లో పాల్గొని విజయాలకు కారకులైనందున వీరికి ఒక కత్తి బహూకరించారు. అడిదం అంటే కత్తి. అంతకుముందరున్న ఇంటి పేరు అడిదం వారిగా మారింది అంటారు. ఈయన నల్లని మనిషి. ఎత్తరి. బొడ్లో ఒకవేపు గంటం, మరొకవేపు బాకు పెట్టుకుని ఆరోజుల్లో ఊళ్లు తిరిగేవారట. ఊర్ల మధ్య అటవీ ప్రాంతం కనుక దోపిడీ దొంగల బారిన పడకుండా ధైర్యంగా కుటుంబ పోషణ కోసం ఇలా పలు రాజులను, జమీందారులను దర్శించేవారని చెప్తారు. ఆత్మాభిమానంలో, ఆత్మ విశ్వాసంలో సూర కవి సాహసకృత్యాలు కథలుగా ఉత్తరాంధ్రలో బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఈ శతాబ్దపు కవుల కన్నా ముందరే 'గడియకు నూరు పద్యములు రచింతు గంటము లేకుండ రచింతు దిట్టగా' అని చెప్పిన కవి ఎవరని అడిగితే తన గురించి పరిచయం ఇలా చెప్తారు.

'ఊరెయ్యది చీపురుపలి / పేరో సూరకవి ఇంటి పేరు అడిదమువార్ / మీ రాజు విజయరామ / హారా జితదేమి నరసుడా భోజుడయా' - చిన విజయ రామరాజు కాలంలో, తాను చిన్నవాడు కావడం వల్ల సీతారామరాజు అనే రాజ వంశీకుడి దివాన్‌గిరీ నడిచేది. తాను సూరకవి అంటే కిట్టనివాడు. ఒకసారి రాజు కొలువులో, ఒక పద్యం రాజ ప్రశంసగా సూరకవి చెప్పగా, రాజుగారు సంతోషించగా, దివాన్ సీతారామ రాజు మాత్రం సూరకవిని ఇరుకున పెట్టాలని 'అందులో రాజుని పట్టుకుని నువు అని ఏకవచన ప్రయోగం చేశావు. ఇది ఉచితమేనా? అని అడిగాడు. అప్పుడు విద్వాన్, మనీషా సంపన్నుడు అయిన సూరకవి ఈ పద్యం నిండు సభలో చెప్పి అందరి మెప్పు పొందాడు.

"చిన్నప్పుడు రతికేళిని / నున్నప్పుడు కవితలోన యుద్ధములోనన్ / వన్నె సుమీ'రా' కొట్టుట / చెన్నగునో పూసపాటి సీతారామా"

శతాబ్దపు పద్యం అని 18వ శతాబ్దంలో చెప్పాలి అంటే ఒకసారి పెద్దాపురం సంస్థానంలో రాజప్రశంస చేస్తూ తమ రాజైన విజయరామరాజుతో సహా ఎందరో రాజులుండగా ఈ పద్యం చెప్పారు సూర కవి. ప్రమాదకరమైన పద్యం ఇది. కవి సాహసిక ప్రవృత్తికి ఇది ఎంతగానో నిదర్శనం.

'రాజు కళంకమూర్తి, రతి రాజు శరీర విహీనుడంబికా / రాజు దిగంబరుడు మృగరాజు గుహాంతర సీమవర్తివి / భ్రాజిత పూసపాడ్విజయ రామ / నృపాలుడు రాజుగాక యీ / రాజుల్ రాజులే పెనుతరాజులు గాక ధరాతలంబునన్'

ఆ సభలో కొలువుదీరిన మిగతా రాజులకు తెగని కోపాలు వచ్చి యుద్ధాలకు దారితీసే పరిస్థితిలో ఆ పద్యానికి మరొక అర్థం చెప్పి శాంతింపజేసినవాడు సూరకవి. 1794లో చిన విజయరామరాజు మరణానికి తొమ్మిదేళ్ళ ముందర ఈయన చనిపోయారు అని చెప్తారు. వీరి రూపురేఖల గురించి కూడా ఏ ఆధారాలు లేవు. ఇంగ్లిష్ వారి 'తెజారస్' కన్నా తెలుగులోనే ముందర, పైడిపాటి లక్ష్మణ కవి ద్వారా సమానార్థక పదకోశం 'ఆంధ్ర నామ సంగ్రహం' వెలువడింది. ఈయన దానికి అనుబంధంగా 'ఆంధ్ర నామశేషం' జోడించిన భాషాశాస్త్ర పరిజ్ఞాని కూడా. కొన్ని ఇతర గ్రంథాలు కూడా రాశారు.

ఈ ముగ్గురిలో మనకి బాగా పరిచయం ఉన్నవారు గురజాడ (1862-1915) కవిత్వం, నాటకం, కథ, వ్యాసాలుగా వీరి రచనలు సాగాయి. తన నాటకంలో గురజాడ, తన పూర్వకవి సూరకవి పద్యం వాడుకున్నారు. అది కన్యాశుల్కం నాటకంలో మూడో అంకంలో గిరీశం స్వగతంలో వస్తుంది. 'చుక్కల వలె కర్పూరపు ముక్కల వలె నీదు కీర్తి ముల్లోకములన్ దిక్కు, దిక్కుల పిక్కటిల్లున్' అన్నది ఆ పాత్ర స్వోత్కర్ష. కానీ సూరకవి పద్యమే. తనకు భూరి సహాయకారైన శృంగవరపు కోట దివాన్ పానుగుపాటి వెంకన్న మంత్రి గురించి సూరకవి చెప్పిన పద్యరత్నమే గురజాడ ఇక్కడ పొదిగింది.

'చుక్కల వలె గర్పూరపు ముక్కల / వలె నీదు కీర్తి ముల్లోకములన్ / గ్రిక్కిరిసి పిక్కటిల్లెను / వెక్కసముగ బొఙ్కుపాటి వేంకట మంత్రి'

ఆధునిక కాలంలో కూడా, "ఎవరు బతికేరు మూడు యాభైలు" అన్నది ప్రఖ్యాతమైన శ్రీశ్రీ కవితాత్మక వ్యాఖ్య. కానీ ఇది కూడా మరొక సందర్భంలో పాలకొండలో, పేరుగల పెద్దలు పట్టించుకోకపోతే, అయ్యన్న అనే బట్టల నేతగాడైన బత్తుల కుల భూషణుడు తనకు చేసిన సాదర సమ్మానానికి సంతసించి సూరకవి చెప్పిన కంద పద్యమే - 'మూడేబదులెవరుండరు మూఢులునది గానలేరు ముల్లోకములన్, వాడుక పడవలె మనుజుడు వేడుకతో బత్తులయ్య వినగదవయ్యా'.

గురజాడ కవిత్వం ఎంత ప్రసిద్ధమో, తమ కాలంలో తమ సమాజంపై వారు చెప్పిన కవిత్వ ధారకు, ఉత్తరాంధ్ర కవిత్రయంలో మొదటి ఇరువురుగా అంతటి పేరు రావలసిన వీరు, మనకు గురజాడ ముందరి కాలంలో కళింగాంధ్ర కవిత్వ తేజాలు కూర్మనాథ కవి, అడిదం సూరకవి.

- రామతీర్థ, 9849200385

ఒక ప్రఖ్యాత కవిత్రయం ఉండగా.. వారి రచనగా మహాభారతం, దక్షిణ భారత దేశంలోనే తొలి సంపూర్ణ భారత అనుసృజనగా వెలువడిన చరిత్ర ఉండగా... ఈ ఉత్తరాంధ్ర కవిత్రయం ఎవరు? అన్న ప్రశ్న వస్తుంది. వీరు కూడా ఆ కాలంలో ఒకరినొకరు ఎరుగరు. కానీ వేర్వేరు రాజుల కొలువులో ఒకే రాజాస్థానంలో పనిచేశారు. ఆ రాజ్యం విజయనగర సంస్థానం. ఆ రాజులు పెద విజయ రామరాజు, చిన విజయరామరాజు, ఆనంద గజపతి మహారాజు. ఆ కవులు గోగులపాటి కూర్మనాథ కవి, అడిదం సూరకవి, గురజాడ అప్పారావు. 18, 19 శతాబ్దాలు వీరి కాలం.

ప్రజాశక్తి 11
విజయవాడ
గురువారం 10 జనవరి 2019
www.prajasakti.com
facebook/prajasakti, twitter/prajasakti

సంగమం

సంస్కృతి, కళలపై రచనలకు ఆహ్వానం!

ఇది కళలు, సంస్కృతి, రంగస్థలం తదితర అంశాలపై ప్రత్యేక పేజీ. మీ ప్రాంత సంస్కృతి, జానపద కళలు, వాటి ప్రత్యేక విశేషాలు; నాటకం, చిత్రకళా ప్రదర్శనలపై మీరు కూడా వ్యాసాలూ, నివేదికలూ రాసి పంపవచ్చు. సాంస్కృతికరంగంలో వస్తున్న మార్పుల మంచిచెడ్డలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాయవచ్చు. మా చిరునామా : సంగమం, ప్రజాశక్తి, ఎంబి విజ్ఞానకేంద్రం, గవర్నరుపేట, విజయవాడ- 2.

రంగస్థలం

వర్తమానాన్ని కళ్ళకు కట్టిన కథా నాటికలు

సంక్రాంతి పండగకి ముందే నాలుగు రోజుల సాంస్కృతిక కోలాహలం ఇది. 'అజోవిభో-కందాళం' ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న నాటికోత్సవం సాంస్కృతిక అభిమానులకు ఓ పర్వదినం. ఈ ఏడాది ఫౌండేషన్ 26వ వార్షికోత్సవాల వేదిక తెనాలి. కథానాటికలు అనే కొత్త ప్రాతిపదికకు పాతికేళ్ళ ముందరే దారులు వేసిన అభినందనీయమైన ఈ పూనిక. నేటి వరకూ, 187 కథలను నాటికలుగా మార్చిన రూపాలను తన ఉత్సవాల్లో భాగంగా ప్రదర్శించింది. వాటిలో ఉత్తమమైన మూడింటికి ప్రతి ఏటా గుర్తింపు ఇస్తూ వస్తోంది. అప్పాజోశ్యుల సత్యనారాయణ - కందాళం రామానుజాచారి మిత్రుత్వ సాహార్దత పునాదులై 'ఇళ్ళు లేచి జనావళికి శుభం పూచి' అన్న చందాన జరుగుతున్న ఈ క్రమాభివృద్ధి, ఏ విశ్వవిద్యాలయాలో జరపాల్సిన స్థాయిలో, ఈ సంస్థ వారు నిర్వహించడం ఒక పరివర్తన కోసం జరిగే ఆచరణ.

అజోవిభో - కందాళం ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు తొలిదశలో నలభై వరకూ కథానాటికలు వస్తున్నాయి. అందులో నుంచి పలు వడపోతల తరువాత తొమ్మిది ఎంపిక చేసి, రోజుకు మూడు నాటికల చొప్పున ప్రదర్శితం అవుతున్నాయి. ఈ సంవత్సరం తొమ్మిది నాటికల ఉత్తమస్థాయి నిర్ణయం న్యాయ నిర్ణేతలది కాగా, నాటికల ప్రదర్శనం, ఒక ప్రేక్షకుడిగా, సాహిత్య, నాటికా ప్రదర్శనల నాణ్యతా దిశగా ప్రయాణం జరగాలని కోరుకునే సామాజిక దృష్టి గల వారిగా ఏమనిపిస్తుంది? అజోవిభో- కందాళం ఫౌండేషన్ ఇచ్చే కథా నాటికల పోటీ ప్రకటన, పోటీలో పాల్గొనే కథా నాటకకర్తలు ఎలా అవగాహన చేసుకుంటున్నారు? అన్నది పరిశీలనాంశంగా చూస్తే కొన్ని అంశాలు ఆలోచనార్హంగా నిలుస్తాయి. కథలో నాటకీయత (మెలోడ్రామా) ఇతివృత్తాన్ని దాటిన అతివృత్తంగా మారడం. సంభాషణల్లో పాత్రలు, తప్పులు పలకడం. (ఉదాహరణకు 'హర్షరుతువు'. ఇది సింహప్రసాద్ కథకి నాటకీకరణ) లో పెద్ద కొడుకు పాత్ర 'మేము ఎక్కువయ్యామా ఈ పరాయి దానికన్న' అంటాడు - నిజానికి తాము తక్కువ అయ్యామన్నది చెప్పాలని ఉద్దేశం). ఇలాంటివి రెండు మూడు ఉన్నాయి ఈ ప్రదర్శనలో. రెండో నాటకం 'కిస్సా కుర్సీకా' (మంత్రవాది మహేశ్వర్ కథకి నాటికీకరణ) నటరాజ ప్రార్థనలో కొత్తదనం కోసం పాడిన చరణంలో 'కళాస్పదా' అని నటరాజ సంబోధన ఉంది. ఆస్పదుడు/ ఆస్పదురాలు అంటే అర్హమైన వారు అని అర్థం. భారతీయ సంప్రదాయం ప్రకారం, కళలకు మూలమే నటరాజు కాగా, నటరాజుని కళలకు అర్హమైన వాడు అని సంబోధించడం అసంగతం. ఇలా మొదలైన ఈ నాటిక వై.ఎస్.కృష్ణేశ్వరరావు దర్శకత్వం, నేపథ్య వ్యాఖ్యానంలో, మరీ భారత రాజకీయాలు అంటే ఒక కుటుంబంలో ఎంపీ పదవి కోసం జరిగే అధికార దాహపు సర్దుబాట్లు, మల్లగుల్లాలుగా చెప్పాలనే ప్రయత్నం. రంగస్థలిపైకి శవాన్ని తీసుకురావడం వంటి దృశ్యాలకు తగు సార్థకత లేదు. తండ్రి, కూతురు, అల్లుడు, ఈ పాత్రలతో అల్లిన ఒక లాగుడు వ్యవహారంలో కనీసం బిడ్డ ఊయల తొలి సీన్లలో, అంటే అల్లుడు ఎంపీగా ఉన్న కాలంలో అన్న మాట రంగస్థలిపై ఉన్నది, అతను ఆ పదవి ఊడిపోయి, కింగ్ మేకర్ జగపతి అంటే తన మామగారి మంత్రాంగం వల్ల ఇతని భార్య పద్మజా నిర్మల ఎంపీగా ఎన్నికై, ఐదేళ్ళ పదవీ కాలం నిర్వహించాకా, చివరన ఐదేళ్ళ కాలం కదిలి, మరో ఎన్నికలు వచ్చాకా, రంగస్థలిపై ఆ బిడ్డ ఊయల కనిపిస్తూనే ఉంటుంది. అంటే ఆ బిడ్డ ఎదుగుదల, ఈ నాటకకర్తకు పట్టని విషయంగా ఉంది. దివంగత భర్త సాక్షిగా అంటూ ఇలా ఏదో ఒక పేరిట పదవీ ప్రమాణాలు ఉండవు. భారత రాజ్యాంగం ప్రకారం, భగవంతుడు, లేదా అంతరాత్మ సాక్షిగా మాత్రమే ఉంటాయి. తండ్రి, వివాహిత అయిన కూతురికి, భర్త హత్యకి గురయ్యాక, తెల్లచీర చుట్టడం/ కట్టడం వాస్తవ దూరం. ఒక తెల్లచీర ఆమె ముందు పడేస్తే చాలు. కానీ దృశ్యం, మన అసహనాల కొస వరకూ సాగుతుంది. మంచి దర్శకుడైన కృష్ణేశ్వరరావు ఈ నాటికతో నిరాశపరిచారు. ప్రార్థన నుంచి, ముగింపు దాకా, అసహజత్వం, మధ్య మధ్యలో మీడియా అంటూ వార్తలు చదివిన తీరు, నాటికను ప్రజల దాకా చేర్చలేకపోయాయి. పాత్రల కృతకత్వం కొట్టొచ్చినట్టు కనిపించింది. మూడో నాటిక 'కలుపుమొక్కలు' (శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి ప్రఖ్యాత కథకి, అదే పేరుతో నాటికీకరణ) నాటకీకరణ చేసినవారు తీసుకున్న స్వాతంత్ర్యాల మేరకు ప్రదర్శన బలహీనపడినా, శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి గారు, దశాబ్దాల కిందట రాసిన కథలో చూపిన బలం వల్ల ప్రదర్శనలో కాస్త నిలదొక్కుకొంది. తాము రాసే పొడిగింపులు కాలానుసారంగా, కథా విధేయంగా ఉండాలని ఈ నాటకీకరణ చేసేవారు గుర్తించి, పాటించక పోవడం ఎలాంటిదో.. ఈ నాటికలో బలమైన నిదర్శనలుగా ఉన్నాయి. ఆటో, మెగాస్టార్ చిరంజీవి వంటి మాటలు, శ్రీపాద వారి కథా కాలంలోకి వెళ్ళి వాడడం, కథా విధేయతకి దూరంగా జరగడమే! లంచగొండుల మీద పోరుని లంచం మీద పోరుగా నాటకీకర్త మలచడం కూడా విచారకరం. శ్రీపాద కథకి గల అంతరాత్మ అక్కడక్కడా పలికి, బ్రాహ్మణ, వేశ్య ఆ రెండు పాత్రల వల్ల చూడదగ్గదిగా నిలిచింది. మొదట్లో వేశ్య కృష్ణభక్తి నాట్యం దృశ్యం, అక్కడ ఒక నపుంసక పాత్రగా చేసిన జోడింపు, ఇంకా మంచిగా మొదలు కావల్సిన నాటకాన్ని, ప్రారంభంలో నీరు కార్చాయి.

రెండోరోజు నాటికల్లో 'కొత్త దేహం' (జంధ్యం వెంకటేష్ బాబు కథకు డాక్టర్ జివికె మూర్తి నాటికీకరణ) నాటిక, సొంత ఇల్లు లేని ఒకపల్లె / ఊళ్ళో అంత్యక్రియలు చేయాలి అంటే, మనిషి మరణించాక, ఆ శవాన్ని ఎవరూ తమ ఇంటికి తీసుకురానివ్వరు అన్న నమ్మకంపైన నడిచిన కథా నాటిక. పల్లెలోని తమ ఇంటికి వెళ్దాం అనే తండ్రి నటనలో, మెలోడ్రామా ఎక్కువగానే ఉంది. అలా వచ్చే సవలకు, ఒకప్పటి అతని ఇల్లు కొనుక్కున్న మిత్రుడు, తన భార్య అనారోగ్య రీత్యా ఆర్థిక అవసరాలకు ఆ ఇల్లు తిరిగి వీరికే అమ్మేద్దాం అనే ప్రయత్నం చేయగా, డబ్బు ప్రధానం అని భావించే ఆ స్నేహితుని కొడుకు అడ్డు తగలడం వల్ల, తన భార్యని కోల్పోతాడు. తీరా ఆ పట్నవాస స్నేహితుడి మరణం తరువాత, ఆ పల్లెలో తన భార్య పక్కనే ఖననం చేయాలన్న చివరి కోరిక తీర్చేందుకు అతని కొడుకు, పల్లెటూరికి వస్తాడు. కొంత వాదన తరువాత తాను అలా వచ్చే శవాలకు, ఊళ్ళో తన ఇల్లు ఆఖరి మజిలీగా తాను, తన ఇంట అవకాశం ఇస్తానని పల్లెలోని తండ్రి స్నేహితుడు చెప్పడం చనిపోయిన వ్యక్తి కొడుకు, కోడలు కూడా ఒకనాటి తమ పట్టుదలలు తగ్గి, తామూ ఈ పనిలో పాల్గొంటామని చెప్పడం ముగింపు. ఈ మూడు పాత్రలూ ఒకరికొకరు టిఫిన్లు తినిపించుకోవడాలు వంటి అధిక నాటకీయత ప్రేక్షకుల సహనానికి పరీక్ష అనిపిస్తుంది. వారి ఆప్యాయతని చెప్పే లేదా చూపే మరో మార్గం లేదా అని ప్రశ్న లేస్తుంది. 'ట్రోఫీ' (కొలకలూరి ఇనాక్ కథకు రావినూతల ప్రేమ్‌కిషోర్ నాటికీకరణ) నాటికలో ఒక క్రీడాకారిణి అయిన యువతి, ఈ ఆటల వల్ల శారీరకంగా బలవంతురాలని ఒక పక్క ఎస్టాబ్లిష్ చేస్తూనే, ఆమె ఒకసారి రేప్‌కు గురైతే ఆ గర్భాన్ని తన ట్రోఫీగా నిలుపుకుంటానని చెప్పే సెంటిమెంట్ కథ. లాయర్ పాత్రల్లో పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిఫెన్స్ న్యాయవాది కూడా డైలాగుల్లో విరివిగా తడబడ్డారు. కథకు నాటికీకరణ సగటు స్థాయిలోనే ఉంది. 'మృగవేశ్య' నాటిక (రిషి శ్రీనివాస్ కథకు యల్లాప్రగడ భాస్కరరావు నాటికీకరణ) చూడలేదు.

మూడోరోజు ప్రదర్శితమైన 'దయ్యం' (పివి సునీల్‌కుమార్ కథకు శిష్టా చంద్రశేఖర్ నాటికీకరణ) మొదటి నుంచి మంచి టెంపోతో, పదునైన సంభాషణలతో నడిచింది. మనిషికి తోటి మనుషులు సాయపడని సమాజంలో ఒక బాధిత రైతు యువకునిగా, పాత్ర చెప్పిన డైలాగుల్లో విసురు ప్రేక్షకులను తాకింది. ఒక దయ్యం సెంటిమెంట్ తిరగవేసి చెప్పి, రైతు ఆత్మహత్యల గురించి కథ ఒక మలుపు తిరిగి నడుస్తుంది. మంచి ప్రదర్శనగా గుర్తుండిపోతుంది. 'నిర్జీవ నినాదం', (మూలకథ, నాటికీకరణ అడపా సూరిబాబు) నాటిక సాయుధ పంథా ద్వారా సమాజాన్ని మార్చే లక్ష్యం గల యువత, కుటుంబంలో ఉంటే, ఆ కుటుంబం పరిస్థితి ఏమిటి అనే దానిపై, అటువంటి వాడైన చదువుకున్న కొడుకు, కొంత విద్యావంతమైన అతని భార్య వారిలో భర్తకి తండ్రి, భార్యకి తాతా అయిన పాత్ర ప్రధానంగా, ఒక పోలీసు పాత్రతో కూడా కలిపి వేగంగానే నడిచిన నాటకం ఇది. సాయుధ పోరాట క్రమంలో మంచివారు ఎలా ఆహుతి అవుతున్నారో, ఆ నేపథ్య చర్చ, తండ్రి, కొడుకు, పోలీసు పాత్రల ద్వారా ఈ నాటిక సజీవంగా ఉంచింది. ఆఖరి నాటిక 'అతీతం' (రామా చంద్రమౌళి కథకి శిష్టా చంద్రశేఖర్ నాటికీకరణ), చదువులు చదివిన బిడ్డలు కార్పొరేట్ కొడుకులుగా మారి, విదేశీ ఉద్యోగాల్లో, అక్కడి పౌరసత్వాలే తీసుకుని, స్థిరపడిపోతే, ఇక్కడి తల్లిదండ్రులు అల్లాడే వేదన చెప్పే నాటిక. రంగాలంకరణ సంపన్నంగా చేసిన నాటిక ఇది. కొడుకు దూరమైన మానసిక యాతనలో, ప్రపంచీకరణ వ్యతిరేకి అయిన తండ్రి అల్జీమర్స్‌కి గురికావడం, ఆస్ట్రేలియా పౌరసత్వం గల కొడుకుకి, అతని కొడుకు, 'నువ్వు వదిలేస్తే తాతయ్య పరిస్థితి ఏమైందో, రేపు నేను అమెరికాలో ఉండిపోతే, నీ పరిస్థితి కూడా ఇలాగే కావచ్చు. కనుక నేను భారతదేశంలోనే ఉండిపోతాను' అని చెప్పడం, ఇవాళ తాను గొప్ప మేధావి, కవి, అయి ఉండి కూడా ఏమీ గుర్తుపట్టలేని దశకు చేరుకున్న తండ్రి చుట్టూ, ఈ పాత్రలు మూడూ సంరక్షణ వలయంగా నిలవడం నాటికలో చివరి దృశ్యం. అల్జీమర్స్ చాలామటుకు వంశ పారంపర్యంగా వస్తుంది. అయితే, ప్రపంచీకరణ కారణంవల్ల అని ఈ నాటిక చెప్తుంది. వచ్చిన తొమ్మిది నాటికల్లో మూడు అమెరికాలో పిల్లలున్న కుటుంబాల తల్లిదండ్రులు, ఇక్కడ ఈ దేశంలో ఎదుర్కొంటున్న విషయాల మీదనే ఉన్నాయి. రైతు జీవితం ఫోకస్‌గా ఒక నాటిక, కుటుంబాలపై వామపక్ష అతివాద రాజకీయాల ప్రభావం షార్ప్‌గా ఫోకస్‌లోకి తెచ్చిన నాటిక కూడా ఉండడం విశేషమే. నిర్వాహకులు ఈ పాతికేళ్లుగా, ఉత్సవాల్లో తుది జాబితాలో నిలిచి, ప్రదర్శితమైన తొమ్మిది నాటికలను ప్రతి ఏటా సంచికగా వెలువరిస్తున్నారు. ఇప్పుడు, ఈ నూట ఎనభైకి మించిన నాటికల్లో ఉత్తమోత్తమ స్థాయికి చెందినవని భావించే వాటిని, నేటి తరాలకు, ఒక తక్షణ సంప్రదింపు, స్ఫూర్తి కోసం తక్కువ ధర ప్రచురణగా కనీసం ఒక ఇరవై నాటికలను, ప్రచురించడం వారి బాధ్యత. మొదటి రోజు ప్రదర్శించిన తెనాలి భారతీయం, గిరిధర్ గౌడ్ చిత్రాలపై మంచి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సాంకేతికంగా ఉత్సవాలకు అదనపు శక్తి, ఆకర్షణ ఇచ్చాయి. రజతోత్సవ కాలం దాటిన అజోవిభో సాహిత్య నాటికోత్సవాలు, దాదాపు తెలుగునాట ఒక లిటరరీ కల్చరల్ ఫెస్టివల్ స్థాయికి చేరుకున్నాయి. ముందు ముందు జాతీయ స్థాయిలో కొద్దిమంది సాహిత్య, నాటక రంగ నిపుణులు పాల్గొనేలా, వారి ప్రసంగాలు ఉండేలా సమన్వయం చేస్తే, ఇవి ఇంకా ప్రతిష్టాత్మకం అవుతాయి. కొందరు ఏవేవో కారణాలవల్ల ప్రసిద్ధులైతే- అప్పాజోశ్యుల సత్యనారాయణ సంకల్ప సిద్ధులు, ఆచరణ శుద్ధులు, సాహిత్య సాంస్కృతిక వికాస నిబద్ధులు. అజోవిభొ కందాళం ఫౌడేషన్ వారి మార్గదర్శక కృషి, వారికి తోడైన సన్నిహితుల సహకార శీలత, తెలుగు సమాజంలో సదా సంక్రాంతివంతంగా నిలవాలని ఆశించడం మనందరి బాధ్యత.

(2019 జనవరి 3, 4, 5 తేదీల్లో తెనాలిలోని తెనాలి రామకృష్ణ కళాపీఠం వేదికగా జరిగిన పోటీ నాటికలపై విశ్లేషణ)

- రామతీర్థ
98492 00385

'మహీధర' స్వరాజ్య శంఖం

'కొల్లాయిగట్టితేనేమి?'

1921 ఏప్రిల్‌లో గాంధీజీ ముంగండ అగ్రహారంలో ఒక పది నిమిషాలు గడిపితే, తన పదేళ్ళ వయసులో ఆ అపురూప దృశ్యాన్ని చూసి, రాబోయే కాలంలో, ఈ స్మృతి వైభవాన్ని సమృద్ధ నవలారాజంగా రూపొందించిన ఘనత మన మహీధర వారిది. సాంఘిక, రాజకీయ, చారిత్రక నేపథ్యంలో స్వాతంత్ర్య భావన, గాంధీజీ నాయకత్వం పట్ల తెలుగు ప్రజల స్పందనను, పది నిమిషాల గాంధీజీ సమయం, తను పదేళ్ళప్పుడు చూసిన దృశ్యం, పది కాలాలు నిలబడే నవలగా రూపొందించడమే మహీధరవారి ప్రగతిశీల, ప్రజావిధేయ కళాకౌశలం.

అనగా అనగా ఒక ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ. మూడున్నర దశాబ్దాల కిందటి వరకూ పనిచేస్తూ ఉండేది. ఆ పనిలో భాగంగానే 1968లో తెలుగునాట స్వాతంత్ర్యోద్యమ చిత్రణ చేసిన నవలల్లో ఒకటైన 'కొల్లాయిగట్టితేనేమి' నవలకు ఉత్తమ నవలగా, ఈ రాష్ట్ర సాహిత్య అకాడెమీ పురస్కారం ప్రకటించింది. ఆ నవలా రచయిత మహీధర రామమోహనరావుగారు. నేటికీ, ఈ నవలకు పురస్కార గౌరవం లభించి యాభై ఏళ్లు. ఈ జనవరి 26, డెబ్బయ్యో రిపబ్లిక్ దినోత్సవం, మన దేశానికి అరవై తొమ్మిదేళ్ల గణతంత్ర జీవితం పూర్తయి డెబ్బయ్యో ఏటికి తెర తీస్తున్నాము. ఈ విశేష సందర్భంలో తెలుగుజాతి, సాంఘిక పరిస్థితి, గాంధీజీ చింతన, స్వరాజ్య కాంక్ష, ఇవన్నీ సముచితంగా, వాస్తవిక దృష్టితో చిత్రించిన నవల 'కొల్లాయిగట్టితేనేమి'. రచయిత 1960ల్లో రాసినా, అది 1920ల నాటి తెలుగు సమాజపు కథ. 2011లో వేగుంట మోహనప్రసాద్‌గారి అనువాదంలో "స్వరాజ్యం" పేరిట, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌వారి ప్రచురణగా ఇంగ్లీష్ భాషలో కూడా వచ్చింది.

రాస్తున్న కాలానికి మహీధరవారు కూడా పరిణత నడివయస్కులు. 1909లో పుట్టిన మహీధర రామమోహనరావుగారికి 1960ల నాటికి యాభైల వయసు. అప్పటికే అంతకుముందర వారి రచనలు అగ్నిగుండం, కత్తుల వంతెన వంటివి వెలువడ్డాయి. రామమోహనరావుగారి తండ్రి బ్రహ్మసమాజ అవలంబికులు. వారి పూర్వుల ఊరు, తాను పుట్టిన ఊరు ముంగండ అగ్రహార గ్రామం, ఎక్కువగా బ్రాహ్మణ పల్లె. గోదావరి లంకల్లో ఉన్నది. అక్కడికి పడవ ప్రయాణాలు తప్ప మరో దారి లేని 1920ల కాలం, అప్పటికి పదకొండేళ్ళవాడు అయిన ఈ బాలుడికి ఈ పడవ ప్రయాణాలు అనుభవంలో ఉన్నవే. ఆ కారణంగా, నవల మొదటి అధ్యాయాల్లో చిత్రించిన గోదారి లంకల పడవ ప్రయాణం, సహజంగానే చదువరులను ఆకట్టుకుంటుంది. స్వాతంత్ర్యోద్యమ కార్యకర్త కావడానికి, తన కాలేజీ చదువు మానుకుని, విదేశీ వస్త్ర బహిష్కరణలో భాగంగా తన దుస్తులను కూడా తగులపెట్టి, పల్లెకి ప్రయాణం అయిన రామనాథానికి, ఆ పడవ ప్రయాణంలో పరిచయం అయిన నాయుళ్ళ యువతి స్వరాజ్యం. సాంస్కృతిక చరిత్ర తెలీకుండా భారతీయ విప్లవాలు జరగవు అని గ్రహించి, ఏ దేశానికైనా తనదైన సాంస్కృతిక చరిత్రనుంచే జాతీయావేశంతో కూడిన సంస్కరణ, పరిణామ వేగంతో కూడిన రాజకీయ సాంఘిక సంఘటనలు జరుగుతాయి అని తన నవల ద్వారా చిత్రించాలన్నది ఒక లక్ష్యంగా మహీధరవారు ఈ నవల రాశానని చెప్పారు. అందుకు కారణం, "అమృతాంజన్ అమ్ముకోవడానికే ఆంధ్రపత్రిక పెట్టారు, అల్లూరిని సమర్థించడానికి కాదు" అన్న ఒక విమర్శ ఒకసారి వామపక్షీయులే రాసినది, విశాలాంధ్ర పత్రికలో చదివి, నొచ్చుకుని, చరిత్ర, సంస్కృతి సక్రమంగా అర్థం చేసుకోవడం, జాతీయోద్యమం, సంస్కరణల బీజాల పట్ల అవగాహన ఏర్పరచుకోవడం మార్పుకోరే వారి మౌలిక బాధ్యతగా తెలియచెప్పాలి అంటే కావలసిన ఒక బలమైన దృష్టిని రచన రూపేణా చెప్పడం అవసరం అని తాను తలపెట్టిన నవలగా వారు విశదపరిచారు.

రామమోహనరావుగారు నవలలో పాత్రల విషయమై అన్నీ కల్పితాలే అని చెప్పారు. పాత్రల స్వరూప స్వభావాల్లో, తాను చూసిన, ఎరిగిన బ్రహ్మ సమాజ చింతన ప్రభావం, స్వతహాగా సంఘ మనస్థితిలో సాధారణ పరిస్థితుల్లో ఉండే స్వల్పబుద్ధి, అనాలోచితంగా ఆచార వ్యవహారాల పాటింపు, వీటి పాత పద్ధతులకు, చదువువల్ల వస్తున్న కొత్త ఆలోచనల అమలువల్ల ఎంత గ్రామీణ సమాజమైనా అక్కడ తలెత్తుతున్న ఘర్షణ వాతావరణం, ఎంత స్వాతంత్ర్యం కోసం అయినా, తమ పద్ధతులను మార్చుకోవడం ఇష్టం లేని పాత సమాజ చట్రం, అందులో ఇరుక్కుని ఉన్న తన బంధువులు, అయినవారు, ఇతర శ్రేణుల ప్రజలు, వీరి మానసిక దశలో ఒక గుణాత్మక పరిణామం, క్రమేపీ మాత్రమే ఎలాసాధ్యమో, చిన్న చిన్న మాటలతో, నింపాదిగా చెప్పిన నవలా చిత్రణ, మనకి 'కొల్లాయిగట్టితేనేమి'లో కనిపిస్తుంది.

ప్రధాన పాత్రల పేర్లు రామనాథం, స్వరాజ్యం. రామనాథం, స్వరాజ్యం స్వాతంత్ర్య పోరాట క్రమంలో ఒకరికి ఒకరు చేరువవుతారు. ఈ పేర్లు, ముఖ్యంగా 'స్వరాజ్యం' అనే పేరు ఆలోచించి పెట్టినదే అని తెలుస్తుంది. రామనాథంలో మహీధరవారు జీవితంలో ఎదుర్కొన్న అనేక ఘట్టాల కళాత్మక ప్రసక్తి కనిపిస్తుంది. ముంగండలో వాళ్ళ చావడిలోనే ఊరి గ్రంథాలయం ఉండేది. అందులోనే ఏడేళ్ళ వయసుకే వావిలకొలను సుబ్బారావు, సెట్టి లక్ష్మీనరసింహం, చిలకమర్తి లక్ష్మీనరసింహం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు లాంటి ప్రముఖులు రచించిన పలు పుస్తకాలు చదవడం అలవాటు అయ్యింది. పధ్నాలుగేళ్ళ వయసులో ఆయనకు వివాహమైంది. అది కూడా ఆ ఎదురింటి పిల్ల చక్కదనాలు చూసే పెళ్ళాడేశాను సుమా అనే మహీధర ఇలా చెప్పారు. "నేను 13 ఏళ్ళ వయస్సులో వుండగా మా వీధిలో, మా యింటికెదురుగా ఇల్లు కొనుక్కుని పొరుగూరునుంచి ఒక కొత్త కుటుంబం కాపురం వచ్చింది. మర్నాడు ఉదయం మా ఇంటి గుమ్మంలో కొత్త అమ్మాయి 10 ఏళ్ళది- పచ్చని ఛాయ, నవ్వు ముఖం, నల్లని మస్లిన్ దుస్తులతో హాజరయింది. ఆనాటి ఆ విగ్రహం 70 ఏళ్ళ తర్వాత కూడా నా కళ్ళముందు కనిపిస్తూంది. దానికి ప్రేమా, దోమా అని పేరు వద్దు. ఆడ-మగ మధ్య వుండే ఆకర్షణ. అప్పటినుంచి ఆమె మా యింటికే ఒక విధంగా అతుక్కుపోయింది. ఓ ఏడాదిపోయాక ఆమెతో పెళ్ళి అన్నారు. నేను వీరేశలింగంగారి హితబోధ మరచిపోయేను. ఎగతాళి చేసి లాభం లేదు. వ్యక్తులు ఏర్పరచుకొనే నియమాలు సమాజగత సంస్కారంగా మారే లోపున వ్యవధి తీసుకుంటుంది."

ఆంధ్రపత్రిక అల్లూరి విషయంలో తీసుకున్న స్టాండ్ చూసి ఏదో అన్నారని నొచ్చుకున్న మహీధర, నిజానికి చిన్నతనంలోనే కాశీనాథుని నాగేశ్వరరావుగారి కృషిని ఎరుగుదురు. అది కారణంగా జాతీయోద్యమ మూలాలు సమాజంలో ఎక్కడ ఉన్నాయో చూపడం, వాటిని భారతీయ విప్లవకారులు అవగాహన చేసుకోవలసిన అవసరం ఉండగా, తానీ రచన చేశాను అన్న చారిత్రక దృష్టి రచయితలో, పేరు దగ్గరనుంచీ కనిపిస్తుంది. 'కొల్లాయిగట్టితేనేమి?' అన్నది నిజానికి మన తెలుగు నాట ప్రభవించిన గాంధీజీ ప్రభావిత సాహిత్యంలో ఒక ప్రముఖ గీతపు పల్లవి. తెలుగునాట బహుళ ప్రచారంలో ఉన్నా ఈ పాట రాసినది బసవరాజు అప్పారావుగారు. 1933లో వారి అకాల మరణానంతరం, బసవరాజు మెమోరియల్ కమిటీ, 1934లో ప్రచురించిన బసవరాజు అప్పారావు గీతాలులో 'మా గాంధీ' పేరిట ఈ గీతం కనిపిస్తుంది. 1938లో తీసిన 'మాలపిల్ల' సినిమాలో సూరిబాబుగారు దీనిని పాడారు. ఇదీ మహీధర వారి 'కొల్లాయిగట్టితేనేమి' నవలా శీర్షిక చరిత్ర. అయితే మహీధరవారు చరిత్ర దృష్టిగల రచయిత గనుక, కథాకాలం అయిన 1920-21 నాటికి, నిజానికి గాంధీజీ కొల్లాయి కట్టడం మొదలుకాలేదని, తరువాత కొన్నాళ్ళకు ఈ వస్త్రధారణ ప్రారంభించారని కూడా సూక్ష్మ వివరణ ఇవ్వడం అవసరం అని పాటించిన జాగ్రత్తగల రచయిత. సెప్టెంబర్ 1921 ముందరే, ఈ కథాకాలం ముగుస్తుందని మనం చరిత్ర ఆధారంగానే గ్రహించాలి. ఎందుకంటే, సెప్టెంబర్ 1921లో మదురైలో గాంధీజీ తన దుస్తుల విషయంలో ఈ ప్రధాన నిర్ణయం తీసుకుని అమలుపరిచారు. అలా మదురై, గాంధీజీని కొల్లాయికి, భారతీయ వస్త్రధారణకి మార్చిన మహత్తర స్థలం.

నవలా కథాకాలం 1920-21లో కొద్దినెలలు మాత్రమే అన్నది ఎంత ఖచ్చితమో గ్రహిస్తే ఆశ్చర్యపోతాము. కథాకాలానికి రామనాథానికి డిగ్రీ చదువుల వయసు, అంటే పందొమ్మిది - ఇరవై ఏళ్ల వయసు. విదేశీ వస్త్ర దహనంలో తన బట్టలు, స్వాతంత్ర్యోద్యమ లక్ష్యానికి తన చదువు సమర్పించి పల్లెదారి పట్టాడు. అప్పటికే ఈ యువకునికి పెళ్లి అయింది. బాగా చదివి అధికారి అవుతాడని, మామగారు పోలీసు సూపరింటెండెంట్ అయిన నారాయణమూర్తిగారు ఇతనికి పిల్లనిచ్చారు. తల్లిదండ్రులు చిన్నప్పుడే పోగా, దత్తు తీసుకుని పెంచిన పెత్తండ్రి, పెత్తల్లి ఉన్నారు. వారికి ఆ గ్రామంలో ఇతరులకు, రామనాథం భవిష్యత్తు పట్ల ఇటువంటి ఆశలే ఉన్నాయి. వాటిని వమ్ముచేస్తూ, రామనాథం ముంగండ తిరిగి వస్తున్న కాలం డిసెంబర్ 1920 తరువాత. ఎందుకంటే, 1920 డిసెంబర్‌లోనే జరిగిన జాతీయ కాంగ్రెస్ సభల్లో సి.ఆర్.దాస్ ప్రవేశపెట్టిన సహాయ నిరాకరణ తీర్మానం అనుసరమే, ఈ యువకుని ప్రవర్తన ఉన్నది. ఆ ప్రధాన తీర్మానంలో ఉద్యమ కార్యక్రమాల్లో భాగంగా ప్రభుత్వ అనుబంధ పాఠశాలలు, కళాశాలలు, న్యాయస్థానాలు, విదేశీ వస్త్రాలను బహిష్కరించాలని నిర్ణయించారు. ప్రభుత్వం ఇచ్చిన బిరుదులు, గౌరవ పదవులను వదులుకోవడంతోపాటు ప్రభుత్వ సర్వీసులనుంచి వైదొలగడం వరకు సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని విస్తరించాలని నిర్ణయించారు.

ఈ నవల ఇలా డిసెంబర్ 1920 కాలంలో మొదలై, ఏప్రిల్ 1921 మొదటి వారంలో ముగుస్తుంది. అంటే నాలుగునెలల కథాకాలం నవలలో ఉన్నది. రాజోలునుంచి పాత గన్నవరం మీదుగా అమలాపురం రావడానికి వీలుంటే, ముంగండ గ్రామానికి గాంధీజీ రాక, అక్కడ ఖద్దరు ఉత్పత్తి కేంద్రం ప్రారంభించడం జరగాలని నవలలో రామనాథం, ఇతర గ్రామస్థుల ఆలోచన. గ్రామ ప్రజలందరూ కులాలకు అతీతంగా, గాంధీజీ సందర్శన కోసం ఉత్సాహంగా ఎదురుచూడడం, శ్రోత్రియ బ్రాహ్మణ ప్రతినిధి అయిన శంకరశాస్త్రి, రామనాథం బాబాయి సైతం తమ గ్రామానికి గాంధీజీ రాగానే సమర్పించడానికి గీత శ్లోకాన్ని తాటాకు మీద రాసి తెచ్చి అందిస్తాడు రామనాథానికి. (ఇవీ మహీధరవారి మాటలు నవల చివర్లో).

"చక్కని గుండ్రని అక్షరాలతో దానిమీద భగవద్గీతనుంచి ఒక్క శ్లోకం వ్రాసి వుంది. అక్షరాలు స్ఫుటంగా కనిపించేటందుకు కాకరాకు పసరు రుద్ది వుంది.

'యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత!
అభ్యుత్థానమధర్మస్య సంభవామి యుగే యుగే'

ఆ తాళపత్రం గాంధీగారికి విరాళంతోపాటు ఇవ్వడానికి తయారుచేశాడు ప్రత్యేకంగా శాస్త్రి. ముంగండ తరఫున గాంధీజీకి అది జ్ఞాపిక, ఆయన యెడ వారి విశ్వాసానికది గుర్తు. ఆయన సందేశం యెడ వారికి గల శక్తి భావానికది సూచిక. ముంగండే కాదు, తెలుగుదేశమే ఆ విశ్వాసంతో ప్రతిబింబించింది. గాంధీజీ సందర్శనం కోసం గ్రామం ముస్తాబు అయింది. గ్రామస్తులు సంబరంగా ఎదురుచూస్తున్నారు. ఇదీ నవల ముగింపు. ఒకామె తరువాత అడిగింది, అయితే నిజంగా గాంధీజీ ముంగండ వచ్చారా? అని దానికి మహీధరవారు రికార్డ్‌లో ఇచ్చిన జవాబు. నవల చదివిన ఒక అమ్మాయి, 'గాంధీగారు నిజంగా ముంగండ వచ్చారా'? అని రాసింది. రావడమే కాదు. ఆయనకు "యదా యదాహి ధర్మస్య' శ్లోకం తాటాకుమీద రాసి, పసరుపూసి కనబడేలాచేసి ఇవ్వడం కూడా నిజమే. కాని, తరువాత నవలలో కనిపించే 'సుందరమైన రాట్నమే' పాట అబద్ధం. నిజానికి ఆ క్షణంలో నేను అక్కడే వున్నాను." తన బాల్య జీవన బలమైన ఛాయలతో కథ చెప్పి, దాన్ని 1920-21 కాలంలో నాలుగు నెలలపాట కథాకాలంగా క్రమశిక్షణతో చెప్పిన మహీధర, గాంధీజీ కొల్లాయి గట్టే నిర్ణయం, ఈ విజయవాడ/ ముంగండ యాత్ర జరిగిన కొద్ది నెలల తరువాత మాత్రమే (మదురైలో సెప్టెంబర్ 1921లో) తీసుకున్నారు అని చెప్పడంలోగల అంతరార్థం, చరిత్ర కల్పనలో కలిపి చెప్పేటప్పుడు రచయితకి ఉండవలసిన అపారమైన బాధ్యత, క్రమశిక్షణ పట్ల తనకుగల విధేయత గురించి వివరించడమే.

1921 ఏప్రిల్‌లో గాంధీజీ ముంగండ అగ్రహారంలో ఒక పది నిమిషాలు గడిపితే, తన పదేళ్ళ వయసులో ఆ అపురూప దృశ్యాన్ని చూసి, రాబోయే కాలంలో, ఈ స్మృతి వైభవాన్ని సమృద్ధ నవలారాజంగా రూపొందించిన ఘనత మన మహీధర వారిది. సాంఘిక, రాజకీయ, చారిత్రక నేపథ్యంలో స్వాతంత్ర్య భావన, గాంధీజీ నాయకత్వం పట్ల తెలుగు ప్రజల స్పందనను, పది నిమిషాల గాంధీజీ సమయం, తను పదేళ్ళప్పుడు చూసిన దృశ్యం, పది కాలాలు నిలబడే నవలగా రూపొందించడమే మహీధరవారి ప్రగతిశీల, ప్రజావిధేయ కళాకౌశలం. 1960ల్లో తను రాసిన 1920-21 కాలపు నవలకి పేరుగా నిలిచే సంఘటన, ఆ నవలలో చిత్రితమైన కాలం తరువాత జరిగిందని చెప్పడం సాహిత్యానికి చరిత్ర సూత్రాలను అనువర్తింప చేసేటప్పుడు రచయిత తీసుకోవలసిన జాగ్రత్తకూడా. ఇలా ప్రస్తుతపు ఏడుపదుల భారత గణతంత్ర సందర్భంలో, స్వాతంత్ర్యోద్యమ ప్రభంజనానికి తెలుగునాట సూత్రధారిగా నిలిచిన ఒక సాంఘిక కల్పన చేసిన రచయిత, నిజంగా, సాహిత్య క్షేత్రంలో మహీధరమే.

- రామతీర్థ, 9849200385

ముద్దుకృష్ణ 'నై'తాళికుల బండారమిది!

తెలుగులో పలువురి కవితల సంకలనంగా వచ్చి ఎక్కువ ముద్రణలు పొందిన కవిత్వ సంకలనం, బహుశా ముద్దుకృష్ణ 1935లో ప్రచురించిన వైతాళికులు. 1899 ఫిబ్రవరి 7న జన్మించిన ఆయనకు ఇది నూట ఇరవయ్యో జయంతి సందర్భం కూడా. తన కాలానికి ప్రతిబింబంగా, ప్రాతినిధ్య స్వరంగా ఒక సంకలనం ఉన్నప్పుడే, దాని చారిత్రక విలువ పది కాలాలు నిలబడుతుంది. 1875లో ఫ్రాన్సిస్ టి.పాల్ గ్రేవ్ సంకలనం చేసిన 'గోల్డెన్ ట్రెజరీ' పద్ధతిలో తాను 'వైతాళికులు' తెచ్చానని ముద్దుకృష్ణ చెప్పేవారని వరద రాజేశ్వరరావు నమోదుచేశారు. కానీ, ఆ ఆంగ్ల కవిత్వ సంకలనం, తనకంటూ ఒక పరిధి పెట్టుకున్నది. 'ది గోల్డెన్ ట్రెజరీ ఆఫ్ బెస్ట్ సాంగ్స్ అండ్ లిరికల్ పోయెమ్స్ ఇన్ ద ఇంగ్లీష్ లాంగ్వేజ్' అని దండ గుచ్చుతూ, షేక్స్‌పియర్ కాలంనుంచీ కూడా రచనలను నాలుగు వందల తొంభై పేజీల బృహత్సంకలనంగా ఒకచోట చేర్చింది. పోనీ అలా, తెలుగు కవిత్వంలో పూర్వ శతాబ్దాల మేలు రచనలను ఏమైనా 'వైతాళికులు'లో చేర్చారా అంటే అదీ లేదు. ఆమేరకు 'గోల్డెన్ ట్రెజరీ' పుస్తకంతో పోలిక కుదరదు.

ఇక 'వైతాళికులు' సంకలనం జరిగిన కాలం గురించి. తెలుగు ప్రాంతాల కవిత్వమే అయినా, ఇది స్వాతంత్ర్య పోరాట కాలం. 1920ల తరువాత, జాతీయ చైతన్యం, స్వాతంత్ర్య సిద్ధికై కార్యాచరణ, గాంధీజీ ప్రభావం, ఇతర జాతీయ స్వాతంత్ర్యోద్యమ సంఘటనల ప్రస్తావన (జలియన్‌వాలా బాగ్, భగత్‌సింగ్ ప్రభృతుల ఉరితీత, సహాయ నిరాకరణోద్యమం, విదేశీ వస్త్ర దహనాలు, ఉప్పు సత్యాగ్రహం). ఇందులో భాగంగా తెలుగు కవుల శక్తివంతమైన స్పందనలు నమోదుఅవుతున్న కాలం. ముద్దుకృష్ణ 'వైతాళికులు'లో, సామాజిక, రాజకీయ వైతాళికుల ప్రసక్తి లేదు. గాంధీజీ గురించి, తన ముందుమాటలో ఒక పేరుగా మాత్రమే ప్రస్తావన చేశారు. ఇక ఇందులోని కవుల రచనలు చూస్తే- కవిత్వ వైతాళికులా వీరు? అన్న ప్రశ్న కలుగుతుంది. ఇందులో తమ కవితలు సంకలితం చేయబడిన ఇరవై తొమ్మిది మంది కవుల (అందులో ముగ్గురు కవయిత్రులు) నూట తొంభై ఒక్క కవితలు చూస్తే మనకి నిరాశ కలుగుతుంది. ఈ పుస్తకానికి ఇన్ని దశాబ్దాలుగా ఇంత పేరు, ఆదరణ అనవసరమా అనిపిస్తుంది. 1935లో తొలి ముద్రణ జరిగి, 2002కల్లా పన్నెండో ముద్రణగా ప్రచురణ జరిగిన సంకలనం ఇది.

దీనికి పేరులేని ఒక ముందుమాట రాస్తూ, ముందరి పేరాలలో పురాణ యుగం, ప్రబంధయుగం, అంధయుగం అంటూ తంజావూరు సాహిత్య దశ దాకా లఘుమాత్రంగా వివరించి, తరువాత 'నవయుగం' అంటూ చివరి పేరాల్లో వీరేశలింగం, గురజాడ, గిడుగులను, 'భావ సంచలనం తీవ్రంగా కలిగించి, సంఘానికి నూతన సంచలనం కలిగించి, సంఘానికి నూతన లక్ష్యాలు నిర్దేశించిన వారిగా పేర్కొంటూ ఇలా చెప్తారు ముద్దుకృష్ణ. 'దేశ కాల పరిస్థితుల్లో ఇంకొక మార్పువచ్చింది. వెనుకటి ఏ యుగంలోనూ లేని కొత్త సమస్యలు అనేకం ప్రతి దేశంలోనూ ఈనాటి కవులను కలవరపెడుతూ ఉన్నవి. ఆర్థికంగా, రాజకీయంగా, నైతికంగా, సాంఘికంగా, వ్యుత్పన్నతాపరంగా తీవ్రమైన మార్పులు ప్రపంచము తటా జరుగుతూ ఉన్నవి'. ఇంతలా ముందుమాటలోనే చెప్పిన సంకలనకర్త, 'ఆర్థికంగా, రాజకీయంగా, నైతికంగా, సాంఘికంగా, వ్యుత్పన్నతాపరంగా' ఎటువంటి తీవ్రమైన మార్పులకు స్వరాలైన కవితలను తన సంకలనంలోనికి ఎంచారో అని చూస్తే, అక్కడే మొదలవుతుంది ఆశాభంగం,. ఈ చైతన్యపు మెలకువ ఇంతటితోసరి.

దేశకాల పరిస్థితులు, స్వాతంత్ర్య పోరాటం చుట్టూ తిరుగుతూ ఉండగా, ఆ ప్రస్తావన లేకుండా కవితలను పేర్చారు. మొదట్లోనే ఎవరి నుంచి మొదలై ఎవరిదాకా వెళ్లింది అనిచూస్తే అది గురజాడతో మొదలు కావడం ఒక సమంజసమైన ఆరంభం. కానీ ఆయనకన్నా ఒక తరం తరువాతివాడు, ముప్పై ఏళ్లు చిన్నవాడు, తొలి కవితల వయసువాడు, కేవల జాతీయావేశి అయిన రాయప్రోలు సుబ్బారావుగారి గీతం 'ఏ దేశమేగినా- ఎందుకాలిడినా' (ఇది ఆంధ్రావళి సంపుటిలోని రచన)తో ఈ 'వైతాళికులు' మొదలు. 1913లోనే వెలువడ్డ 'దేశమును ప్రేమించుమన్నా' గురజాడ గీతం తరువాత స్థానంలోనే. ఇక్కడే, సంకలనకర్తగా ముద్దుకృష్ణ ఇష్టాయిష్టాలు, అభిరుచులు అంచనా అందుతుంది. కవితల కూర్పులో కాలక్రమాన్ని పాటించారు అనడానికి, సంకలనంలో అటువంటి పద్ధతి ఏదీలేదు. పుస్తకంలో విషయ సూచిక లేదు, కవితలకు ముద్రణ వివరాలు, రచనాకాలం వంటివేవీ లేవు.

భావ కవిత్వ ఫక్కీ రచనల ప్రతిబింబంగా మిగిలిపోయే సంకలనం ఇది. స్వాతంత్ర్య విషయమై ఏదీ స్పష్టంచేయని గీతం ఒకటి (స్వాతంత్ర్య రథము) దువ్వూరి రామిరెడ్డిగారి రచన తప్పిస్తే, నలుదిక్కులా పుష్కలంగా, మిక్కుటంగా వినిపిస్తున్న స్వాతంత్ర్య పోరాట భావనల తెలుగు కవిత్వ శంఖారావాలు ఇందులో ఒక్కటి కూడా లేవు. 1927 ప్రాంతంలో దువ్వూరి రాసిన 'జాతీయత' గీతంలోగల (ఓసి జాతీయతా! నీ బలోజ్జ్వలత్వ మెంత నీ శక్తిసామర్థ్యమెంత! నీదు శంబరమునగల ఇంద్రజాలమెంత! అస్థిపంజరములు సైతము నాడునౌర!) ఈ శక్తికోసమన్నా ఈ రచనను చేర్చవలసి ఉండగా- అలా జరుగలేదు. 1920 తరువాత గాంధీజీ తానే అంతటాఅయి నడుస్తున్న భారత స్వాతంత్ర్య పోరాటాన్ని తెలుగు కవులెలా చెప్పారో ఆ ప్రసక్తే ఉండదు.

1920-21 సహాయ నిరాకరణోద్యమం, 1930 ఉప్పు సత్యాగ్రహం, ఏవీ ఈ గీతాల్లో కనిపించవు. ప్రేమలు, ఆరాధనలు, విరహాలు, ఋతువులు, మూగ బాధలు, ప్రణయ మూర్ఛనలు, నేలా, నింగీ తప్ప, 'దేశమంటే మట్టికాని మనుషుల' సంగతులు ఈ వైతాళిక గీతాల్లో లేవు. ఈ సంకలనం తీరు ఇలాగే ఉండబోతున్నదని, దీనికి తమ కవితలు ఇవ్వని వారు చాసో (అప్పటికీ ఆయనకూడా కొన్ని కవితలు రాశారు). శ్రీరంగం



ఈ సంకలనం ముద్దుకృష్ణ ఒంటరిగా ఊగిన ఉయ్యాలల ఊహావైనంగానూ తెలుస్తుంది. ఎలాచూసినా, ముద్దుకృష్ణ బండారంగా మనం గుర్తించ వలసిన 'నైతాళిక' కవిత్వ రచనలే అతి మిక్కుటంగా ఈ సంకలనంలో ఉన్నాయి.

నారాయణబాబు, కాగా, తొలుత ఇవ్వను అన్న శ్రీశ్రీ, ఏకంగా తన కవితలు ఎనిమిది ఈ సంకలనానికి ఇచ్చారు. (1935కి పదేళ్ళవాడైన ఆరుద్ర, ఈ విషయం పురిపండా అప్పలస్వామి చెప్పినట్టుగా సమగ్రాంధ్ర సాహిత్యం 13వ సంపుటి, 145వ పేజీలో ఉంది). జాషువా కవిత్వం చేర్చ లేదు అన్నది నిత్యం ముద్దుకృష్ణ ధోరణికి అపఖ్యాతి తెస్తూనే ఉంటుంది. అయితే ఈ వివక్ష ఇంకా విస్తృతమైనది.

ఈ ముద్దుకృష్ణగారి వైతాళికులులోని కవితల ప్రకారమే అయితే, తెలుగునాట గురజాడ- రాయప్రోలుతో 1910 ప్రాంతంలో మొదలై, 1934లో శ్రీశ్రీ గీతం 'మహాప్రస్థానం'తో ముగిసే నూట తొంభై ఒక్క కవితల్లో తెలుగునాట స్వాతంత్ర్య పోరాటమే లేదు. గీతాలు వేస్తున్నప్పుడు కూడా తను ప్రచురించిన కవులవి, ఏ గీతాలు ఎంపిక చేశారన్నది ఇంకా బలంగా సంకలనకర్తగా ముద్దుకృష్ణ ధోరణిని పట్టి ఇస్తుంది. వర్తమాన కాల ప్రతిబింబం కాని తెలుగు కవిత్వ సంకలనంగా ఇలా ఏర్పు, కూర్పు జరగడంలో ఉన్న పాక్షిక ధోరణి, తెలుగునాట స్వాతంత్ర్య పోరాటాన్నే పక్కకు పెట్టి, ఆ కవితలను, అంటరానితనం పోవాలని బలంగా రాస్తున్న కవితలను మొత్తంగా విస్మరించే సాహసం చేసింది.

గాంధీజీ నూటయాభై వత్సరాల ప్రస్తుత సందర్భంలో, అప్పట్లో తెలుగు సమాజంలో స్వాతంత్ర్య పోరాటాన్ని నమోదుచేయకుండా ఈ సంకలనం చేసిన నష్టం దృష్ట్యాకూడా ఈ పరిశీలన అవసరం. దీనివెనుక ఉన్నది ఒక్క ముద్దుకృష్ణ మాత్రమేకాదు, తమ తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు ఇలా చెప్పారని, శ్రీకాంతశర్మ నమోదుచేశారు. దీని వెనుక ఉన్నది ఒక్క ముద్దుకృష్ణ మాత్రమే కాదు, తమ తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రిగారు ఇలా చెప్పారని, శ్రీకాంతశర్మ నమోదు చేశారు. నా తండ్రి ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి నవ్య సాహిత్య పరిషత్తు సభ్యులు, నవ్య సాహిత్య వ్యాపకులలో, ప్రచారకులలో ఒకరు. ఆయన నా చిన్నతనాన 'వైతాళికులు' సంకలనం ప్రస్తావన వచ్చిన సందర్భాలలో "సంకలనం ముద్దుకృష్ణ చేశాడు కాని, రచనల ఎంపికలో సాహితీ సమితి వాళ్లందరి చేతులూ వున్నాయి" అనడం నాకు గుర్తుంది. సాహితీ సమితి అంటే 1919లో తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రిగారు సభాపతిగా ఏర్పడినది.

ఇంకా కొట్టొచ్చే వాస్తవం ఏమిటి అంటే, తీవ్ర సామాజిక ఉద్వేగ్రత స్వాతంత్ర్య పోరాట కవిత్వం, 1935నాటి తెలుగు సీమలో అప్పటికే గత రెండు దశాబ్దాలుగా ఉండగా, తాము ఎంపిక చేసుకున్న కవుల సృజనలో కూడా భాగమై ఉన్న తీక్షణ రచనలను, కనీసం కవిత్వ సమగ్రతకోసమైనా కూడా సంకలనంలో చేర్చని పాక్షిక దృష్టితో ఈ ఏర్పు, కూర్పు జరగడం. 1920లనాటికే గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన సామాజిక గీతం 'మాకొద్దీ తెల్లదొరతనము' ఈ సంకలనంలోనికి చేరకపోవడం, ఒక కాల దర్పణం కావల్సిన సంకలన ధర్మానికి తీరని మచ్చ.

సామాజిక అంశని పరిహరించి, వైయక్తిక పరవశాలు, ధార్మిక ఆవేశాలు, గత వైభవాల పులకరింతలతో నిండిన ఈ కవితలకు 1930-40ల కాలానికి ప్రాతినిధ్య హోదాలేదు. బసవరాజు అప్పారావు గీతాలుగా, గాంధీజీ గురించిన 'కొల్లాయి గట్టితేనేమి మా గాంధి' (గాంధీజీ కొల్లాయి గట్టడం ఆరంభించిన సెప్టెంబర్ 1921 తరువాత కవి రాసినది). అలాగే ఉప్పు సత్యాగ్రహం 1930 తరువాత తనే రాసిన కవిత, 'ఉప్పే తలంత్రాలు' అని పోల్చిన గొప్ప కవితను పక్కన పెట్టి, భారతీయ స్వాతంత్ర్యోద్యమ కవిత్వంలోనే విలక్షణమైన అభివ్యక్తిగల కవితలకు, ఆ కాలానికి చోటుఇవ్వని, సమకాలీన సమదర్శనం లేని సంకలనానికి వైతాళిక స్థాయి ఉంటుందా? గురజాడ తరువాత శ్రీశ్రీ అని సాహిత్య చరిత్రను అతి సరళీకరణ చేయడం మనకి ఒక అలవాటుగా ముందరితరాలవారు పాటించి ఉండవచ్చు. కానీ, గురజాడ తరువాతి మంగిపూడి వెంకటశర్మ, గరిమెళ్ళ సత్యనారాయణ (1921) రచనల సామాజిక చైతన్య అంశను, పూర్తిగా విస్మరించి, బసవరాజు అప్పారావుగారిని (అటు స్వాతంత్ర్యోద్యమ కవిత్వంలోనూ, ఇటు హిందూ ముస్లిం చైతన్యప్రేరకంగానూ, వివక్షకి గురయ్యే సామాజిక వర్గాల అభ్యున్నతి పరంగానూ రాసిన కవి, 1933లోనే చనిపోయారు) కేవలం భావ కవిత్వ శబలుడిగా చూపే కవితలు వేయడం ముద్దుకృష్ణ విపరీత ధోరణి.

ఇంకా అంతుపట్టని విషయం- ఒకటి 1935లో అచ్చుఅయిన చరిత్రగల ఈ సంకలనంలోనికి, శ్రీశ్రీ 1935 తరువాత రాసిన కవితలు ఎలా వచ్చాయి అన్నది? 1936(?)లో రాసిన అద్వైతం, 1940లో రాసిన 'జగన్నాథ రథచక్రాలు', 1941లో రాసిన 'నిజంగానే', కవితలు 1935కే ఎలా వచ్చి చేరాయో ఊహించలేము. మహాప్రస్థానం సంపుటిగా 1950లో అచ్చు అయినప్పుడు శ్రీశ్రీ స్వయానా ఉంచిన సంవత్సరాలు/ తేదీలు ఇవి. పై మూడు కవితలు 1936, 1940, 1941లో రాసినట్టు మహాప్రస్థానం సంపుటి చెప్తున్నది. కానీ ఇవి, 1935 ముద్దుకృష్ణ సంకలనంలో శ్రీశ్రీ రాసిన మరో అయిదు కవితలతో బాటుగా కనిపిస్తున్నాయి.

ఎంత ఇతరుల ప్రమేయం ఉన్నప్పటికీ, సంకలనకర్తగా ముద్దుకృష్ణకి ఈ క్రెడిట్ ఉన్నది. ఇందులోకి రాని ఆ కాలపు స్వాతంత్ర్య పోరాట సామాజిక అంశగల కవితల తీవ్రతను, అసలు సంకలనంలో కనిపించకుండా ఉన్న కవులకు సమాజంలోగల విస్తార ప్రభావశీలతను చూస్తే, ఎందుకీ సంకలనాన్ని ఇంత ఎక్కువగా పరిగణిస్తున్నామన్నది ప్రశ్న. అత్యధికంగా కృష్ణశాస్త్రివి ఇరవై కవితలుండగా, శ్రీశ్రీ కవితలు ఎనిమిది ఉన్నప్పటికీ, అందులో రెండోమూడో మినహాయిస్తే, మొత్తం కవితలన్నీ భావ కవిత్వ పలవరింతలు తప్ప, ఎవరివి ఇందులో వైతాళిక రచనలు అన్న ప్రశ్న కూడా వస్తుంది.

ఈ సంకలనం ఆఖరున, బసవరాజు అప్పారావుగారి సామాజిక అంశగల గీతాలు స్వీకరించకుండా తన స్వీయాభీష్ట ధోరణికి మారుపేరుగా నిలిచిన ముద్దుకృష్ణ వేసిన బసవరాజుగారి గీతం ఒకటున్నది. 'ఒంటిగా ఉయ్యాలలూగితివా నా ముద్దుకృష్ణా' అని సాగుతుంది. దీని పేరు 'వటపత్రశాయి'. కొంచెం తీరుమారి, మనకి, ఈ సంకలనకర్త ఒక 'హాలపత్రశాయి'గానూ, ఈ సంకలనం ఆయన ఒంటరిగా ఊగిన ఉయ్యాలల ఊహావైనంగానూ తెలుస్తుంది. ఎలాచూసినా, ముద్దుకృష్ణ బండారంగా మనం గుర్తించవలసిన 'నైతాళిక' కవిత్వ రచనలే అతి మిక్కుటంగా ఈ సంకలనంలో ఉన్నాయి. ఆయన ముందుమాటలో సూచించిన సామాజిక అంశ, లోపలి కవిత్వంలో ప్రతిఫలించకుండా ఎవరెంత శాయశక్తులా సహకరించినా ఆయనే అడ్డుపడ్డాడు. 1910-35 మధ్య తెలుగు కవిత్వ ఝుంఝు భావ కవులదికాదు. వారిదొక పాయ మాత్రమే. సమాజ చైతన్య పతాకలుగా, స్వాతంత్ర్యాకాంక్షలుగా ఎగిరిన తెలుగుజాతి గుండె చప్పుళ్ళ సమష్టి ప్రేరేపక కవిత్వనాదమే నిజమైన ఘోష. ఆ గుండెలను, ఆ చప్పుళ్ళను, కావాలని గుర్తించని వక్రదృష్టి ముద్దుకృష్ణది. అలా నవయుగ ప్రస్తావనలు, ముందుమాటకే పరిమితం చేసిన ఈ సంకలనం, వైతాళికులు కాదు 'వైయక్తికులు'!

- రామతీర్థ, 9849200385

సందర్భం

పఠాభి అక్షరం మన చేతి ఆయుధం

వర్ణనావర్ణాలూ, శబ్ద సౌందర్యాలూ, ప్రయోగ విచిత్రాలూ తన కవిత్వ లక్షణాలుగా తిక్కవరపు పట్టాభి రామిరెడ్డి, తాను పఠాభిగా మారి మనలను పలకరించిన కవి.. ఆయన శత జయంతి ఫిబ్రవరి 19న. ఇరవయ్యేళ్ళ వయసుకే కవిత్వ ప్రతిభ కనపరచిన కట్టమంచి రామలింగారెడ్డికి 'ముసలమ్మ మరణం' ప్రతిభ గల యువకవిగా గుర్తింపు తెచ్చిపెట్టింది. ఇది 1899లో చెన్నపురి క్రైస్తవ కళాశాల విద్యార్థిగా, ఆంధ్ర భాషాభిరంజనీ వారి పోటీల్లో బహుమతి పొందింది. 1900లో తొలి ముద్రణ జరిగింది. విషయం రాయలసీమ స్థానిక గాథ, దీని బ్రౌన్ గారి 'రాజాస్ ఆఫ్ హండే అనంతపురం' నుంచి ఆధారంగా తీసుకుని కట్టమంచి రామలింగారెడ్డి, పాశ్చాత్య ధోరణిలో రాశారు.

ఆధునిక యుగారంభ కవితగా చెప్పదగ్గ 'ముసలమ్మ మరణం' రాసిన తరువాతే, ఇరవయ్యో శతాబ్దపు ఆధునిక స్వభావ సూచకమైన తొలి తెలుగు కవితలు రాసాగాయి. 1910లో గురజాడ దేశభక్తి గీతం, కొద్ది ఏళ్ళకు రాయప్రోలు 'ఏ దేశమేగినా ఎందు కాలిడినా' రెండు భిన్న పాయల్లో దేశంలో, తెలుగు ప్రాంతంలో చోటు చేసుకుంటున్న జాతీయ సాంఘిక చైతన్యానికి దారులేశాయి. ఈ దశ 1920-30ల్లో భావకవుల పరమైంది. బసవరాజు అప్పారావు, నండూరి సుబ్బారావు, దేవులపల్లి కృష్ణశాస్త్రి మొదలగు భావకవుల రచనలు ఎక్కువ గుర్తింపులోకి వచ్చాయి. శ్రీశ్రీ వంటి యువకవులప్పుడు కృష్ణశాస్త్రి ప్రభావంలో ఉన్నారు. కట్టమంచి 1939లో రాసిన నాలుగు దశాబ్దాలకు, తన ఇరవయ్యేళ్ళ వయసుకే 'ఫిడేలు రాగాల డజను' పేరిట, పన్నెండు కవితలతో, ప్రయోగ ఫిరంగులు మోగిస్తూ వచ్చిన 'తోపు' (ఫిరంగి / శతఘ్ని అనే అర్థం హిందూస్తానీలో) తన పేరు వత్తు 'ఠా'తో తిరగ రాసుకున్న పఠాభి. దాదాపు ఈయన రచనల్లో భావ కవిత్వానికి అంత్యక్రియలు జరిగాయి.

పఠాభి విలక్షణతను, మనసా వాచా అంతకుముందరే స్వీకరించిన కవుల్లో శ్రీరంగం నారాయణ బాబు కూడా ఒకరు. శ్రీశ్రీ భావకవుల పట్ల ఒకింత సామరస్య ధోరణిలో మాట్లాడినా, నారాయణ బాబు మాత్రం, మదరాసులోనే కృష్ణశాస్త్రి సమక్షంలోనే, వారిని గౌరవిస్తూనే, వారి భావ కవిత్వాన్ని తూర్పారబట్టేవాడు. ఈ నిర్మొగమాటం మనకి నారాయణబాబు కన్నా దశాబ్దాలు చిన్నవాడైన పఠాభిలో కూడా కనిపిస్తుంది. వస్తూనే, ఇరవయ్యేళ్ళ ఈ కుర్రవాడు, 'ఆత్మకథ' అంటూ మొదలు పెట్టి చెప్పిన కవితలో అహంభావం కన్నా ఆత్మవిశ్వాసం ప్రశస్తంగా కనిపిస్తుంది. ఇరవై ఏళ్లకే 'ఆత్మకథ' అంటూ పఠాభి రాసినది, కృష్ణశాస్త్రి కవిత 'ఎవ్వరని యోచింతురో నన్ను నేను శోక భీకర లోక తిమిరైక పతిని' అన్న కవితకు వెక్కిరింత. 'ఆమె కన్నులలో అనంతాంబరపు నీలి నీడలు కలవు' అన్న ప్రఖ్యాత చరణం కూడా పఠాభి మార్క్ ట్రీట్మెంటకి గురైంది. కవిత్వంలో

తానేమిటో చెప్పుకోవడం, అప్పటికే ఒక ఫాషన్ అనుకుంటే, శ్రీశ్రీ కూడా 1934లో 'ఐ' అంటూ మహా ప్రస్థాన గీతాల్లో, తననీ, సంప్రదాయ సృజన బాహుళ్యతను మేళవిస్తూ చెప్పిన కవిత ఉంది. బఫూనరీ అంటే వికటకవి లక్షణం అయితే, ఏమిటి పఠాభి సేకరించిన ఆయుధ సామగ్రి ఆయనే డిసెంబర్ 5, 1972లో తన ఫిడేలు రాగాల డజన్, బంగోరె కార్యదర్శిగా గల నెల్లూరు వర్ధమాన సమాజంవారు ముద్రిస్తున్న సమయంలో రాసిన 'థర్టీ ఫోర్ ఈయర్స్ ఎగో' అన్న ముందుమాటలో 'బఫూనరీ, ఇగోయిజం, అండ్ సెక్స్ వర్ ఆల్ మై ఆర్సెనల్' అంటారు. ఈ యువకవి మాట రాసే గుణింతాన్ని భంగపరచి, రాసిన కొన్ని కవితలు, చరణాలు ఈ సంపుటిలో ఉన్నాయి. ఈ ఆయుధాలను ప్రయోగ వైచిత్రితో వాడిన కవి పఠాభి. ఆయన రాసిన దాదాపు మూడు దశాబ్దాలకు, కవులు కొందరు ఒక బృందంగా ఏర్పడి, ఉద్యమ కవులుగా రావడం మొదలైంది. తన కాలానికి పఠాభి తానొక్కడే అటువంటి ఉద్యమం. వేశ్యావృత్తి పట్ల మన దృష్టి మారాలి, మరింత వాస్తవికం కావాలన్నది గురజాడ ఆశయం. ఈ ఆదర్శం వారి ప్రముఖ నాటకంలో, కథానికల్లో కనిపిస్తుంది. వేశ్యావృత్తి నిర్మూలన, అంటే వేశ్యలను చంపి వేయడమే అన్న ముతక ఆలోచన కూడా, కన్యాశుల్కం నాటకంలోనే ఒక పాత్ర మాటల్లోనే వస్తుంది. కందుకూరి వారి రచనల్లో వేశ్యావృత్తిపై చేసిన ఆలోచనలు, గురజాడ ఉదార భావనలు, శ్రీపాద రాసిన వారకాంతలోని చర్చ వగైరా పఠాభి పంక్తుల్లో కూడా విశేషించి చర్చకి వచ్చాయి.

'నిన్ను గవురవిస్తున్నా నేను/ నీలోనే నాకు జీవితం నిజంగా/ సరిగ్గా ప్రతిఫలిస్తున్నది/ ఇతర స్థలాలలోన/ అంతా బూటకం/ అంతా నాటకం/ గొప్ప అబద్ధం/ పూజారి యబద్ధం/ పురుషుని జూచి తలవాల్చే/ పతివ్రత సతీత్వ మబద్ధం/ యోగు లబద్ధం, అందరూ అబద్ధం/ సర్వ మబద్ధం/ కానీ నీవు/ మసుగులేని నిష్ఠురమగు నిజానివి/ నీడ పడనటువంటి నిర్మలమగు నిజానివి' తెలుగు గుణింతాన్ని భంగపరచి రాసిన కవిత ఫిడేలు- రాగం' ఈ డజన్ కవితల్లో ఆఖరుది. ఫిడేలు, రాగా (మగవాడు) మధ్య ప్రేమ

అంకురించడం, వారి పెళ్లి, సంతాన ప్రాప్తి, ఈ కవితలో అంశం. మాట రాసే తీరుని మార్చేసిన ప్రయోగం ఈ కవిత మొత్తంలో జరిగింది. ఆంగ్లం, తెలుగు కలిసిన మాటలు 'హైహీల్ యాన', 'హంగ్రీ కనులు', 'ప్రభాత రేజర్' కవిత్వంలో తొలిసారిగా ప్రయోగ నిష్ఠతో వాడిన కవి పఠాభి. తొలి సంపుటి వెలువడిన నలభై ఏళ్ల దాకా రెండో సంపుటి 'కయిత నా దయిత' తీసుకు రాక పోయినా, ఏకవ్యక్తి ఉద్యమంగా పఠాభి మార్క్, బ్రాండ్, తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

సామాజికంగా ఆధునికుడు, రాజకీయంగా ఎమర్జెన్సీ వ్యతిరేక చైతన్యం గల భార్యాభర్తలుగా స్నేహలత, పఠాభి ఇద్దరూ ప్రముఖులు. జార్జ్ ఫెర్నాండెజ్ అజ్ఞాతంలో ఉన్న కాలంలో, ఆయన స్నేహితురాలైన స్నేహలత, తిహార్ జైల్లో బందీగా ఉన్నారు. ఆస్మా వ్యాధి గల ఈమెకు జైలు పరిస్థితులు పడకపోవడం, వారి నిర్లక్ష్యం కారణంగా, జైలు నుంచి విడుదలైన అయిదో రోజునే స్నేహలత కన్నుమూశారు. చలన చిత్ర నిర్మాతగా కూడా ప్రగతిశీల సినిమాలు తీసిన వారు పఠాభి. తొలుత వచ్చిన 'పెళ్లి నాటి ప్రమాణాలు' అటుపై స్నేహలత నటించిన సంస్కార, చండ మారుత వంటివి భారతీయ చలనచిత్ర రంగంలో పేరు పొందిన సినిమాలు, సత్యజిత్ రే పథేర్ పాంచాలి పోటీకి వెళ్లిన ఏడాదే, సంస్కార కూడా వెళ్ళడం, గౌరవం పొందడం విశేషం. అయితే, వెనక్కి చూసే వ్యాకరణాలూ, భావ కవిత్వాలూ వీటిపై 'సింగిల్ మాన్ మూమెంట్' ఏక వ్యక్తి ఉద్యమంగా రంగ ప్రవేశం చేసిన పఠాభి, నిజానికి సామాజిక రంగంలో ఎంత తీక్షణత తరువాత ఏళ్లలో కనపరచాడో అటువంటి తీక్షణత కవిత్వ రంగంలో నమోదు చేయలేదు. దీనికి వారి అంతరాంతరాల్లో గల శిష్ట భాషా ప్రియత్వం, శృంగార బాధితమైన పదబంధాలు, ఆ కవి సమయాలు కారణం కావచ్చు. దీనికి ఉదాహరణ 1978లో వచ్చిన వీరి కవితల రెండో సంపుటం 'కయిత నా దయిత'.

ఇందులో బహుశా వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలోనే మొదటిసారిగా, అష్ట విధ నాయికల గురించిన సంప్రదాయ వర్ణనలు, పఠాభి వంటి కవి చేయడం, ఆ ఎనిమిది విధాల నాయికల గురించి ఎనిమిది కవితలు చెప్పడం, మనం ఊహించని ఒక ధోరణి. ప్రయోగ వైచిత్రికి తన మొదటి సంపుటిలో పేరు బడ్డ పఠాభి సంప్రదాయ విధేయత, సమర్థమైన కవిత్వ శక్తి, ఈ ఎనిమిది కవితల్లోనూ ఉంది.

సామాజికంగా పఠాభి బహుశా, తన రచన 'పఠాభి పన్‌చాంగం'లో చేసిన చమత్కారాలు, విసిరిన విసుర్లూ, సామాజిక చైతన్యంతో చేసినవే! 1979లో వీటిని 'ప్రవాసాంధ్ర భారతి' మైసూరు నుంచి ఆర్‌వీఎస్.సుందరం సంపాదకత్వంలో ప్రచురించింది. వీటిలో కొన్ని - 'కులకాంత రంకుల కాంత మధ్య బేధం వర్ణ బేధం మటుకేను', 'రాజాజీ సామరస్యానికి మొనగాడు. ఆద్యంతములే అందుకు సాక్షి' 'ఆపోజిషన్ పార్టీలకు పడకుండా ఉండడమే పతనానికి కారణం', 'వెలయాలు చాలా ప్రియము ఆలు చాలా సరసము'. ఇక చాలాకాలం శ్రీ శ్రీ చెప్పినదిగా చలామణీ అయిన ఒక విసురు (ఫన్) నిజానికి పఠాభిది. ఇది శ్రీశ్రీ యే ఈ ఎడా పెడా విసుర్ల అమ్ముల పొదికి ముందుమాటలో అంగీకరించారు. అది ఇదీ 'సినిమా వ్యాపారం బ్రహ్మాండమైన లాటరీ. అదృష్టం ఉన్నవాడు వాసన్. లేనివాడు ఉపవాసన్'. 'ఈనాడు వ్యాకరణంలోనే కాదు రాజకీయంలో కూడా సంధులు పాటించబడడం లేదు' అనగలిగిన చతుర వచోనిధి పఠాభి. ఆధునిక తెలుగు కవిత్వ రంగంలో విద్యుద్ఘాత చికిత్సకుల్లో మొదటివాడు. మన కాలపు వికటకవి. దుర్మార్గం, దురన్యాయం భాషలో ఉన్నా సంఘంలో ఉన్నా కోలలు (అమ్ములు) గుప్పించిన కోలాహలాల తుఫాను పిట్ట. కవితగా, సినిమాగా, విసురుగా, పఠాభి మనం పదిల పరుచుకుని, పదును పెట్టుకోవల్సిన ప్రతిభ, మనకి ఆయుధాలుగా ఇచ్చి వెళ్ళాడు. అందుకే 'ఏకుడు - ప్రత్యేకుడు కూడా!'.

(ఫిబ్రవరి 19న నెల్లూరు టౌన్‌హాల్లో సాహిత్య అకాడెమీ ఆధ్వర్యాన పఠాభి శత జయంతి సదస్సు జరగనుంది.)

- రామతీర్థ
98492 00385

ఎల్‌ఆర్ స్వామికి తమిళ రాష్ట్ర పురస్కారం

ప్రముఖ రచయిత, అనువాదకులు, కేంద్ర సాహిత్య అకాడెమీ అనువాద అవార్డు స్వీకర్త ఎల్‌ఆర్ స్వామికి తమిళనాడు రాష్ట్ర పురస్కారం లభించింది. ఈనెల 19వ తేదీ ఉదయం 9.30 గంటలకు ద్రావిడ భాషా అనువాదకులకు అవార్డుల ప్రదానం జరగనుంది. తెలుగు భాషలోకి అనువాదాలకు గాను లక్ష రూపాయల నగదు, జ్ఞాపిక, శాలువా ప్రదానం చేస్తున్నారు.

19న బ్లాక్ వాయిస్ పరిచయ సభ

నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో తంగిరాల సోని కవితా సంపుటి 'బ్లాక్ వాయిస్ ' పుస్తక పరిచయ సభ ఈనెల 19న నందిగామలో జరగనుంది. సాయంత్రం 5 గంటలకు ఈ సభ జరుగుతుంది. డా. ఘంటా విజయ కుమార్, ప్రొఫెసర్ చల్లపలి స్వరూపరాణి, అరసవల్లి కృష్ణ, కలిమిశ్రీ తదితరులు పాల్గొంటారు.

సంపుటికోసం కథల ఆహ్వానం

2018లో ప్రకాశం జిల్లా కథా రచయితలు రాసిన కథలతో 'కథా ప్రకాశం' పేరుతో ఒక సంకలనం ప్రచురించాలని గుండ్లకమ్మ రచయితల వేదిక సంకల్పించింది. జిల్లాలో పుట్టి పెరిగి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన రచయితలు, వివిధ ప్రాంతాల నించి వచ్చి జిల్లాలో ఉంటున్న రచయితలు తమ ప్రచురిత కథల్ని పంపించాల్సిందిగా కోరుతున్నాం. మరిన్ని వివరాలకు 99892 24280 నెంబరును సంప్రదించవచ్చు.

వెల్చేరు నారాయణ రావు అనువాద లోటు పాట్లు

కళాపూర్ణోదయము - పింగళి సూరన

A case of classic inefficiency - 3

కళా పూర్ణోదయము లో పతాక స్థాయి పద్యాలు ఇవి. ఈ పోలిక విని నారదుడు మరొక మంచి పద్యం చెప్తాడు .ఇది పింగళి సూరన భౌగోళిక పరిజ్ఞానానికి ఉదాహరణ.గంధర్వుని ఈ పద్యంలో గల ఊహా శక్తికి మెచ్చి నారదుల వారు జవాబుగా మరొక పద్యం చెప్తారు.

"బళిరా సత్కవివౌదు నిక్కము తగన్ భావించి నీవన్న యా
యెలప్రాయంబు మిటారి కత్తెల బెడంగే నెందునుం గాన వా
రలడోలాచలనోచ్చల చరణముల్ త్రైవిష్టప స్త్రీల యా
దలదన్నం జనునట్లు మించెననినం దప్పేమి యొప్పు యగున్"

దీనికి వెల్చేరు ఆంగ్ల రూపం -

"yes. You speak like a true poet. I've never seen
Such beauty. Your thoughtful description
Is just right. Pumping and stretching their legs
On the swing, they might just kick the heads
Of women in the sky."

నేను చేసిన కొత్త అనువాదం

Great, you will make a good poet, true it is
That the grace of these teens is nowhere else
And saying that their swinging swaying feet seem to touch
the heads of Traivishtapa women is apt and no misfit

ఈ పద్యం పింగళి సూరన భౌగోళిక పరిజ్ఞానానికి మంచి ఉదాహరణ. హిమాలయ పర్వత శ్రేణి గూర్చి పెద్దన పద్యం "అటజని గాంచె భూసురుడు" లో తాను చూడని హిమాలయ వర్ణన చేశారు. దీని నిజానిజాలు ఎలా ఉన్నా తెలుగు సాహిత్యంలో ఊహా వైచిత్రికి ఇదొక నిరుపమానమైన పద్యం. అటువంటిదే ఇక్కడ సూరన ప్రస్తావించే "త్రైవిష్టప" ప్రసక్తి కూడా. మణికంధరుడు వారి ఊయల ఆటల్లో పైకి ఊగే కాళ్లు దేవ కాంతలను పోటీకి పిలుస్తున్నాయా అన్న ఊహ చేస్తే- అది విన్న నారదుడు , నీకు మంచి ఊహా శక్తి ఉన్నదే అంటూ నిజమే సుమా – ఈ తరుణ వయస్కుల పొలుపు (అందం - బెడంగు) "త్రైవిష్టప స్త్రీల యౌదల దన్నంజనునట్లు మించెను" అన్నారు. త్రైవిష్టప ప్రస్తావన ఎందుకు వచ్చింది? సూరన చెప్తున్నది ఏమిటి? ఇవన్నీ వెల్చేరు వారి అనువాదంలో తెలుసుకోలేము. వారికి ఆ దృష్టి లేదు కనుక. వెల్చేరు కి పరిజ్ఞానం ఉందా లేదా అన్నదానికన్నా ఇక్కడ సూరన పరిజ్ఞానం ఏమిటి, ఆ త్రైవిష్టప పద ప్రయోగం ద్వారా?

త్రైవిష్టప అంటే టిబెట్ పీఠభూమి ప్రదేశం. టిబెట్ ప్రపంచంలోకెల్లా ఎత్తైన ప్రదేశం. ఐదువేల అడుగుల ఎత్తున ఉంటుంది. అందుకే దీని రూఫ్ ఆఫ్ ద వరల్డ్ అని కూడా అంటారు. ఈ విషయం ఇప్పుడు మనకి తెలీడం కాదు, పదహారో శతాబ్దంలోనే పింగళి సూరన కి తెలుసు. స్వర్గలోక కాంతలను ఊయలాటల పోటీలకు పిలిచే యువతులు, భూమిపై ఎక్కడ ఉండాలి ? ఏ లోతైన లోయ లోనో, దక్షిణాంత కన్యాకుమారి అగ్రం లోనో ఉంటే, వీరి ఊయలాట స్వర్గం వరకూ ఊగలేరు. భూమి పై ఎత్తైన ప్రాంతం త్రైవిష్టపము కనుక అక్కడి స్త్రీల తలలు దన్నేలా ఈ ఆడపిల్లల ఆటలు ఉన్నాయి అని చెప్పడానికి, నారదుడు, లోక సంచారి కనుక, ఆ త్రైవిష్టప పోలిక తీసుకువచ్చి, గంధర్వుడు చెప్పినది మరొక వైపు నుంచి బలపర్చాడు. రూఫ్ ఆఫ్ ద వరల్డ్ – ప్రపంచపు పై కప్పు అయిన ఎత్తు, పీఠభూమి ప్రాంతంలో ఉండే ఆడ వారి తల దన్నే యువతులని వీరిని పోల్చడం తగినదే అని మద్దతు పలికాడు. ఇదీ సూరన కి గల ఉత్తరభారత భౌగోళిక పరిజ్ఞానం.

ఇదేమీ వెల్చేరు పరిజ్ఞానంలో లేదు కనుక – వీరి అనువాదం – సూరన పరిజ్ఞానాన్ని కూడా మసక బార్చేలా సాగింది. ఇదీ సమర్థవంత అనువాదం అని ఎవరూ అనుకోలేరు. అలా టిబెట్ కి చెందిన మహిళలు "women in the sky" గా వీరి అనువాదంలో సరి పెట్టారు.
పద్య మర్యాదలు, వాటి పటిష్ట నిర్మాణ కట్టుబాటు, మనం వివరంగా, కొంచెం చెప్పినా, ఇతర భాషల్లో చదివే వారికి, ఆ మూల రచన ఆ భాష పట్ల సాంస్కృతిక అవగాహన తో కూడిన గౌరవ మర్యాదలు పెరుగుతాయి. అలా ఇనుమడించడమే నిజానికి మంచి అనువాదం బాధ్యత. లక్షణం, కర్తవ్యం కూడా.
అలా కాకుండా తనకి తోచిన మేరకు, భాష మార్చి, అది అనువాదం అని, ఆ క్లాసిక్ సంగతే ముందెప్పుడూ ఎరుగని టార్గెట్ సమాజంలో చెలామణీ చేయడాన్ని శక్తివంతమైన సాంస్కృతిక ప్రాతినిధ్యం అని ఎవరూ అనరు.
ఇలాంటి లోప భూయిష్ట ఆంగ్ల తర్జుమాల ద్వారా మన సాహిత్యం సంస్కృతికి జరిగే నష్టం ఎక్కువ. ఆ దిశగా ఆలోచిస్తే వెల్చేరు అనువాద వైఫల్యాల వల్ల జరిగే ప్రమాదం మనకి తెలుస్తుంది. అందుకే వారి అనువాదాల పరిశీలన, ఈ సార్వత్రిక ఖండన.

రామతీర్థ -98492 00385

‘గీతాంజలి’కి యేట్స్ తూకపు రాళ్ళు

క్రొన్నాళ్ళ కిందట వైద్యానికి ప్రసిద్ధుడైన ఒక బెంగాలీ డాక్టర్‌తో అన్నాను "చూడండి నాకు జర్మన్ భాష తెలీదు, కానీ ఒక జర్మన్ కవి రచన అనువాదం నన్ను కదిలిస్తే, నేను బ్రిటీష్ మ్యూజియంకి వెళ్లి అక్కడ ఆయన జీవితం, ఆయన ఆలోచనల చరిత్ర తెలిపే పుస్తకాలు ఏమున్నా ఉన్నాయా అని వెదుకుతాను. అయితే, రవీంద్రనాథ్ టాగూర్ కవిత్వనువాదాలు చాలా ఏళ్లుగా నాలో రక్తస్పందనలు కలిగిస్తున్నా అతని జీవితం గురించి గానీ, అతని రచనలను సాధ్యం చేసిన ఆలోచనల్రకమాన్ని గానీ ఎవరో ఒక భారతీయ యాత్రికుడు కనుక చెప్పకపోతే నాకేమీ తెలిసే అవకాశం లేదు".

నేనిలా స్పందించడం సహజమే అని తోచి ఉంటుంది అతనికి. "నేను రవీంద్రనాథ్‌ను ఒక పంక్తిఅయినా ప్రతిరోజూ చదువుతాను. ప్రపంచంలో ఉండే సమస్యలు మరిచిపోవడానికి" అని జవాబిచ్చాడు. "లండన్‌లో, రెండో రిచర్డ్ (1367-1400) కాలంలో నివసించే ఒక ఇంగ్లీష్ వ్యక్తికి, పెట్రార్క్, లేదా దాంటే రచనల అనువాదాలు చూపిస్తే, తనకి ఏర్పడే ప్రశ్నలకు సమాధానాలుగా ఏ పుస్తకాలూ దొరికి ఉండే అవకాశం లేదు. తాను ఏ ఫ్లోరెంటైన్ బాంకర్‌నో లేదా లొంబార్డ్ వర్తకుడినో, నేను మిమ్మల్ని ప్రశ్నించినట్లు ప్రశ్నించి ఉండేవాడు. నాకు తెలిసినంతవరకూ, ఈ కవిత్వం, చాలా నిండుగా, నిరాడంబరంగా ఉంది. మీ దేశంలో కొత్త పునరుజ్జీవ దశ కన్ను విప్పినట్టే ఉంది కానీ ఎవరో చెప్తే తప్ప నాకు తెలీసే తెలీదు". తను జవాబిచ్చాడు. "మాకు ఇంకా ఇతర కవులున్నారు కానీ తనకి సమానులు కారు. దీనిని మేము రవీంద్ర శకం అని పిలుస్తున్నాము. యూరప్‌లో ప్రస్తుతం ఏ కవికి, మా సమాజంలో తనకిగల పేరు ప్రఖ్యాతులు లేవు. తను సంగీతంలోనూ, కవిత్వంలోనూ కూడా గొప్పవాడు. తన సంగీతం భారతదేశంలోనూ, బర్మాలో కూడా ఎక్కడెక్కడ బెంగాలీ మాట్లాడుతారో, అక్కడంతా ప్రసిద్ధం. పందొమ్మిదేళ్ళకే పేరు పొందిన తాను, అప్పటికే తొలి నవల కూడా రాశాడు. మరికొద్ది ఏళ్లకే తను నాటకాలు కూడా రాశాడు. ఇప్పటికీ ఆ నాటకాలు కలకత్తాలో ప్రదర్శింపబడుతూనే ఉన్నాయి. తన జీవితపు సంపూర్ణత్వాన్ని చూసి నేను అబ్బుర పడుతుంటాను. ఇంకా చిన్నప్పుడే, తను తన చుట్టూ వుండే ప్రకృతి గూర్చి రచనలు చేశాడు. ఎక్కువ సమయం తమ తోటలోనే గడుపుతుండేవాడు. పాతికేళ్ళ వయసు నుండీ ఒక పదేళ్ళ కాలం తన జీవితంలో పెను విషాదాలు జరిగినప్పుడు, తను బెంగాలీ భాషలోకెల్లా విశిష్టమైన ప్రేమ కవిత్వం రాశాడు. అపుడు టాగూర్ అన్నాడు భావావేశపూర్ణంగా- "నేను ప్రేమ కవిత్వానికి ఎంత రుణపడి ఉన్నాను అన్నది మాటలు వ్యక్తం చేయలేవు". "అటుపై తన కళాసృష్టి ఇంకా గాఢమైంది. ధార్మిక చింతన, తాత్విక సంపన్నత తన కవిత్వంలో ప్రధానమయ్యాయి. మానవాళికి అవసరమయ్యే ప్రతి ప్రేరణా కూడా మనకి తన కవిత్వంలో లభిస్తుంది. జీవితాన్ని నిరాకరించని సాధు సంతల్లో తను మొదటివాడు, నేరుగా జీవితాన్నుంచే తను మాట్లాడాడు. అందుకే మేము తనని అంతగా ప్రేమిస్తాము"- ఆ వ్యక్తి నాకు చెప్పిన దానిలో మాటలేమన్నా మారాయేమో కానీ, వాటి సారాంశం మాత్రం ఇదే. "కాసేపటిముందు, తను ఒక ప్రార్థన మందిరంలో ఆరాధనా సేవలో ఉన్నాడు. "మేము బ్రహ్మసమాజీకులం, ఇంగ్లీషులో మా ప్రార్థనా మందిరాలకు చర్చ్ అని మీ మాటే వాడుతాము". కలకత్తాలోనే బహు రద్దీ అయిన ప్రాంతంలో వున్న పెద్ద చర్చ్ అది. పెద్ద ఎత్తున ప్రజలు ఉంటారు రోజూ. చాలా మంది భారతీయులు నన్ను చూడటానికి వచ్చారు. వారిలో టాగూర్ పట్ల గౌరవ ప్రతిపత్తులు, మన దేశంలో అయితే చాలా కొత్తగా అనిపిస్తాయి. మనం చిన్నా పెద్ద విషయాలను ఒకే ముసుగు వేసి హాస్య చతుర్త గానో, లేదా తెచ్చిపెట్టుకున్న గాంభీర్యతతో వెక్కిరింతగానో తీసి పడేసే స్వభావంగలవారం. మన కేథడ్రల్‌ల నిర్మాణం జరిగేటప్పుడు మనం మన పెద్దలకు ఇటువంటి గౌరవం ఇచ్చామా? ఒకాయన చెప్పాడు నాతో- "ప్రతిరోజూ ఉదయం మూడు గంటలకి", "నాకు తెలుసు, ఎందుకంటే నేను చూశాను కనుక" తను దాదాపు రెండు గంటల సేపు ధ్యానంలో కూచుంటాడు. అతని తండ్రి, మహర్షి, ఆ మరునాడు, ఒక్కోసారి రోజల్లా ధ్యానంలోనే ఉంటారు. ఓసారి ఒక నదిపై ప్రయాణిస్తూ, తాను అక్కడ ప్రకృతి నిసర్గ సౌందర్యం చూసి, ధ్యానంలోనికి వెళ్లిపోగా, పడవ సరంగులు, ఎనిమిది గంటలసేపు అక్కడ ఉండిపోవలసి వచ్చింది అతనికి భంగం కలుగుతుంది".

అపుడు తను నాతో చెప్పాడు, ఎలా టాగూర్ల కుటుంబంలో తరతరాలుగా గొప్ప వ్యక్తులు జన్మిస్తూ వచ్చారో, ఇవాళ గగనేంద్రనాథ టాగూర్, అబనీంద్రనాథ టాగూర్, ఇద్దరు చిత్రకారులు. రవీంద్రనాథ్ సోదరులు ద్విజేంద్రనాథ్ గొప్ప తత్వవేత్త. ఉడుతలు కొమ్మలమీంచి వచ్చి తన ఒంటిమీద ఆడుకుంటాయి. పక్షులొచ్చి తన చేతులమీద వాలుతాయి". చూస్తూ ఉంటే, వీళ్ళ మాటల్లో తాత్వికుడు నీషే చెప్పినటువంటి భౌతికమైన వాటిలో ప్రతిఫలించని ఏ నైతిక ఉన్నతి, ఏ సౌందర్య గరిమ ఎందుకూ కొరగావు అన్న ఎరుక సార్థకంగా గోచరిస్తూ ఉంటుంది. నేను నాతో ఈ పాటల రాతప్రతి తోడుగా ఉంచుకుని చాలా రోజులుగా, రైల్వే స్టేషన్‌లలోనూ, బస్ ప్రయాణాలలోనూ, హోటళ్లలోనూ చదువుతూనే ఉన్నాను, ఒక్కోసారి మూసేయాల్సిన పరిస్థితి కూడా. ఎందుకంటే, ఈ పుస్తకం నన్ను ఎంతలా కదిల్చింది అనేది ఇతరులెవరన్నా గమనిస్తారేమోనని. ఈ గీతాలు మూల భాషలో సున్నిత లయబద్ధంగా, అనువాదాలకు అందని పదాల రంగులతో, ఛందస్సుల అమరికతో ఉంటాయని వాటివలన నేనెప్పుడూ చూడనిదీ, చూడాలని కలలుగనే కొత్త ప్రపంచం వారి మనసుల్లో ఆవిష్కృతం అవుతుంటుందని నా భారతీయ మిత్రులు చెప్తుంటారు.

మే 7న విశ్వకవి టాగూర్
158వ జయంతి సందర్భంగా...

స్విట్జర్లాండ్ సుందర సరస్సుల అందాలను ఎక్కడ చూడడంలో పడిపోతానో, లేక బుక్ ఆఫ్ రెవెలేషన్స్‌లో ఉన్నట్టువంటి హింసాత్మక వచో ధాటికి లోబడిపోతానో అని కనులు మూసుకున్న సెయింట్ బెర్నార్డ్‌తో మనకి వున్న పోలికేమిటి? ఈ పుస్తకంలో అటువంటి గౌరవ వచనాలు కనిపిస్తాయి మనకి. "నాకు సెలవైంది. వీడ్కోలివ్వండి సోదరులారా, మీ అందరికీ నమస్కరించి ప్రయాణమౌతున్నాను. ఇదిగో నా ద్వారపు తాళపు చెవులు. నా ఇంటిపై నాకే హక్కులున్నా అవన్నీ వదులుకుంటున్నాను. నాకు మీ నుంచి కావలసిందల్లా దయతో కూడిన పలుకులు. మనం చాలాకాలం ఇరుగుపొరుగువారం. నేను ఇవ్వగలిగినదానికన్నా ప్రతిఫలాన్ని ఎక్కువే పొందాను. వేకువైంది, నా కుటీరాన్ని వెలిగించిన దివ్వె మలిగింది. పిలుపొచ్చి వచ్చింది, నేను సిద్ధం ప్రయాణానికి". ఇక మన మనోస్థితి బట్టీ- కేంపిస్‌కో, శిలువపై జాన్‌కో దూరంగా ఉన్నపుడు రోదిస్తాము.. "జీవితాన్ని బహుగా ప్రేమించాము కాబట్టి, మాకు తెలుసు మృత్యువుని కూడా అంతలా ప్రేమిస్తాము" అని.

అలా అని కేవలం మన వీడ్కోలు గూర్చిన ఆలోచనలకు మాత్రమే సంబంధించింది కాదు ఈ పుస్తకం. మనం దైవాన్ని ప్రేమించము అని మనకి తెలిసిరాలేదు, మహా అయితే, మనకి తనలో విశ్వాసం ఉందన్న వరకూ తెలుసును. కానీ ఒకసారి వెనక్కి తిరిగి చూసుకుంటే, జీవితంలో మనం కనుగొనేవన్నీ ఆ అటవీ ప్రాంతాల మన వెదుకులాటలో, మన ఆనందాల గిరి సానువుల ఏకాంతాలలో, మనం ఆమెపై ప్రేమ విషయమై చేసిన నిగూఢమైన ఎరుక ప్రకటనలో, ఇంతటి మాధుర్యాన్ని కలిగించిన ఆ భావావేశంలో తోస్తాయి ఇటువంటి పంక్తులు. "సామాన్యుల గుంపులోకెల్ల సామాన్యుడైన నా హృదయంలోనికి పిలవకుండానే ప్రవేశించిన, నేనెరుగని ఓ ప్రభూ- నువ్వేకదా శాశ్వతత్వపుటుంగరపు ముద్రను ముద్రిస్తావు తరలిపోయే అసంఖ్యాక క్షణోపక్షణాలపై"!

ఏ పేజీ రాస్తున్నప్పుడూ, రాయడం అనే ఆనందాన్ని పొందలేకుండా మనం పెద్ద పెద్ద పుస్తకాలు రాసి, ఏదో ఒక వ్యూహం ఉంది కదా అన్న ధీమాతో, వాదులాటల ద్వారా ధనార్జన చేస్తూ మన తలల నిండా రాజకీయాలను నింపుకుని ఉండే వేళల్లో, టాగూర్ భారతీయ సంస్కృతిలాగే, ఆత్మను కనుగొని, ఆ స్వచ్ఛంద లోస్వరానికి తనని సమర్పించుకోవడంలో సంతృప్తిని పొందుతున్నాడు. మన పద్ధతుల్లో ఎవరైతే ప్రేమ పేరిట ఎక్కువ ఆర్భాటం చేస్తారో, ఎక్కువ పలుకుబడి ప్రపంచంలో కలిగి ఉంటారో, వాటిపట్ల తనకేమీ ఆకర్షణ లేకుండా, చాలా వినయంగా ఇది నా తీరు అని తన సంగతి ఏదో స్పష్టపరచుకున్న వ్యక్తివలె కనిపిస్తాడు. "ఇంటికిపోతున్న మనుషులు నన్ను చూసి నవ్వుతుంటే, నాకెందుకో తగని అవమానం కలుగుతుంది. నేనొక భిక్షుకివలె కూచొని ఉంటాను నా చెంగు మొగాన వేసుకొని. వారు గనుక అడిగితే ఏం కావాలి నీకని, నేను కనులు వాల్చి ఏ జవాబూ ఇవ్వకుండా ఉంటానలా". మరొకసారి ఎలా తన జీవితం వేరే రకంగా ఉందో జ్ఞాపకం చేసుకుంటూ- "ఎన్నో గంటలు ఈ మంచి చెడు ఘర్షణలో గడిపాను. ఇప్పుడిక నా శూన్య దినాల చెలికాని వంతు, ఆనందమయ రీతుల్లో నా హృదయాన్ని తన వశం చేసుకోవడం, నాకు తెలీదు ఎందుకీ హఠాత్ ఆహ్వానం ఏ పనికిరాని నిష్ప్రయోజనం కోసమో!"

సాహిత్యంలో మరెక్కడా కనిపించని ఒక అమాయకత్వం, ఒక నిరాడంబరత, పిట్టల్నీ, ఆకులనీ అతనికి పిల్లలను దగ్గర చేసినంతగా చేస్తుంది. ఋతువుల మార్పులు ఆలోచనల ఎగుడుదిగుడు మళ్లే సంఘటనా సమ్మర్దమౌతాయి. ఒక్కోసారి నాకు ఆశ్చర్యం కలుగుతుంది. బెంగాల్ సాహిత్యంనుంచా, లేక అక్కడి ధార్మికావేశం నుంచా ఎక్కడ్నుంచి తెచ్చుకున్నాడు ఇవన్నీ- లేదా తన అన్న చేతుల మీద వాలి పరవశాలు పోయే పక్షిగణాల వలె, నాకు ఆనంద దాయకంగా తోస్తుంది, ఇదంతా అనువంశికమేమోనని. మనకి తెలిసినదీ, శతాబ్దాలగుండా క్రమాభివృద్ధిగా సంభవిస్తున్న ఒక ట్రిస్టాన్ ఒక పేలనోర్‌ల ఘర్షణామయ హృదయ ఔదార్యంలాగా. నిజంగా తను చిన్నపిల్లల గురించి మాట్లాడుతున్నపుడు ఈ లక్షణాలన్నీ ప్రస్ఫుటమవుతాయి. సాధువర్యుల గురించి కూడా అదే సమయంలో మాట్లాడటం లేదు అని చెప్పలేము. "వాళ్ళు ఇసుక గూళ్ళు కట్టుకుంటారు. గవ్వ గుల్లలతో ఆడుకుంటారు. ఎండుటాకులతో తమ పడవలను అల్లిక చేసుకుంటారు, వాటిని నవ్వుతూ కడలి అనంతాలలోనికి వదలి వేస్తారు. ప్రపంచ తీరాల్లో పిల్లలు ఆడుకుంటారు. ఎలా ఈదాలో తెలీదు, ఎలా వలలు విసరాలో తెలీదు. ముత్యపు చిప్పల వేటగాళ్ళు ముత్యాలకోసమని సముద్రపు లోతుల్లోనికి దూకుతుంటే, వర్తకులు తమ నావల్లో సముద్రాలపై వ్యాపార యాత్రలకు వెళ్తుంటే, పిల్లలు గులకరాళ్ళు పోగుచేసుకుని మళ్లా జల్లేసుకుంటూ ఉంటారు. వారికి దాచిన నిధులతో పనిలేదు, వారికి వలలు విసరడమూ రాదు".

- డబ్ల్యూ.బి.యేట్స్ (సెప్టెంబర్ 1912)

తెలుగు సేత: రామతీర్థ

(రవీంద్రనాథ్ టాగూర్‌కు నోబెల్ బహుమతి రావడానికి ముందే 1913లో 'గీతాంజలి' ఆంగ్లానువాదానికి ఆంగ్ల కవి వరేణ్యుడు డబ్ల్యూ.బి.యేట్స్ రాసిన ముందుమాటకు మొదటిసారిగా తెలుగు అనువాదం ఇది.)



'గీతాంజలి'లోని 'ప్రార్థన' గీతానికి రవీంద్రుడు స్వయముగా చేసిన ఇంగ్లీషు రచన స్వహస్తలిపి ఇది...


Where the mind is without fear
and the head is held high;
Where knowledge is free;
Where the world has not been broken
up into fragments by narrow domestic
walls;
Where words come out from the
depth of truth;
Where tireless striving
stretches its arms towards
perfection;
Where the clear stream of reason
has not lost its way into the
dreary desert sand of dead habit;
Where the mind is led forward
by thee into ever-widening
perfection;
Where the clear stream of reason
has not lost its way into the
dreary desert sand of dead habit;
Where the mind is led forward
by thee into ever-widening
thought and action—
into that heaven of freedom,
my Father,
let my country awake.
Rabindranath Tagore
Santiniketan





తెలుగు సాహిత్యంలో 'చలంస్థాన్'

చలం ఒక కోలాహల హాలాహల జ్వాలాచలం. కందుకూరి శతవర్ధంతి వత్సరంలోనే చలంగారి నూట పాతికో జయంతి వచ్చింది. స్త్రీ వాదుల్లో మీరు మొదటి వారా? అంటే కాదు కందుకూరి మొదటి వారు, తరువాత గురజాడ, ఆ తరువాతే నేను అనే వినయ మేరువు పుట్టుక చలం. బాధితుల్లో మొదటి సమూహం, ఏ సామాజిక వర్గంలోనైనా స్త్రీలే అన్న చలం అవగాహనకు దీటుగా, ఆ బాధిత స్వర ప్రస్తారమే చలం ప్రధాన రచనల్లో ఉండే ప్రశ్న.

చలం రచనల్లో ఒకే ఒక పాత్ర, రాజేశ్వరారుణ లాలస. ఎటొచ్చీ మూడు నవలికల్లో మూడు పేర్లతోకనిపిస్తుంది. రాజేశ్వరిగా తన ఇంటి నుంచి వెళ్లిపోతుంది. అరుణగా, ఎవరింటిలోకో కామోత్కంఠతతో వస్తుంది. లాలస అలిసిపోయే యాత్రలు చేసి ఒక ఆంతరిక శాంతి తీర్థంలో స్థిర చిత్తం పొందుతుంది. మైదానంలో రాజేశ్వరి శ్రీవారు లాయరుకు పేరు ఉండదు–అరుణలో ఆయన పేరు జయరావు కానీ అరుణ చేతిలో పరాజయరావు. ఇక సహజీవనంలో లాలస పేరుకి తగ్గ తృష్ణాతురతలో మనసు నిలకడ లేక తిరుగుతుంది. ఇక నవల పేరు జీవితాదర్శం – చలం గారి నవలల్లో భావ పూర్ణమూ, మార్గదర్శకమూ, శాంతి గమ్యమూ అయిన నవల. భిన్న వాంఛల జీవనాందోళనలో ఏది గమ్యమో లాలస తేల్చుకునే స్పష్టమైన రచన. చలం బ్రహ్మసమాజిక స్వరంతో రాజేశ్వరి హిందూ మత మూఢ ఆచార వ్యవహారాలను వెక్కిరిస్తుంది. అరుణ ఒక ఉటోపియా పతాక ఎగురవేస్తుంది. లాలస అస్థిమిత భవ సాగరాలు దాటి 'శాంతి వాటిక'కి వస్తుంది.



మే 19న చలం 125వ జయంతి సందర్భంగా, స్త్రీ పాత్రా స్వభావాల మేరకు చలం త్రియాలజీ అని దర్శించదగ్గ రాజేశ్వరి, అరుణ, జీవితాదర్శం ఈ రచనల ప్రధాన పాత్రల అంతరంగ ఆవిష్కరణలుగా చలం కథా పాత్రాభినయాలు జగద్ధాత్రి, కత్తి పద్మ, పాలడుగు లక్ష్మి అందిస్తున్నారు. మహాప్రస్థానం ముందుమాట 'యోగ్యతా పత్రం' డా. కె.జి. వేణు, చలం స్వరంతో అభినయ సహితంగా సమర్పిస్తున్నారు. బంగార్రాజు, రజిత్ చలం గారి వర్తమానానికి సరిపోయేలా అప్పుడే రాసిన ఒక స్కిట్ 'దబ్బు' ప్రదర్శిస్తున్నారు. ఈ కొత్తదనాలన్నీ ఇప్పుడు, ఇకముందు చోటు చేసుకునే వేదికగా మహిళలందరూ కలిసి 'చలంస్థాన్' ఆవిష్కరిస్తున్నారు. విశాఖపట్నంలో 20.5.2019 సాయంత్రం అయిదున్నరకు, రాష్ట్రం నలుమూలనుంచీ వచ్చే చలం గారి అభిమానుల సమక్షంలో ఈ విశేష కార్యక్రమంలో, భీమిలిలో చలం గారి కుమార్తె సౌరిస్ స్నేహకుటి, అలాగే చలంగారి కార్య నిర్వాహకులు పాలడుగు రాజశేఖర్, 'చలం స్థాన్' వార్షిక లక్ష్యంగా, చలం కథల ఆంగ్లానువాదమూ, అటుపై ఇతర యూరోపియన్ భాషలలోనికి అనువాదాల ప్రణాళిక ప్రకటన చేస్తారు.

(నేడు చలం 125వ జయంతి సందర్భంగా)

రామతీర్థ, కవి, విమర్శకులు
మొబైల్: 98492 00385

సాక్షి
SAKSHI TELUGU DAILY
Sun, 19 May 2019
https://epaper.sakshi.com/c/39534699

రాలుగాయి రాతలూ.. రాజ్యలక్ష్మమ్మ వాతలు

భేషు భేష్.. ఉమామహేషూ.. ఏ తరం మనవడివో గుర్తు లేదు కానీ మొత్తానికి ముత్త ముత్తాత గుర్తు పెట్టుకుని ఉత్తరం రాసావు. తాతకి దగ్గులు నేర్పే ప్రయత్నం చేశావు కానీ దేవభాష, దేవ సమాజంలో మీ ముత్తాత తాను చేసే పనుల్లో తీరిక లేకుండా ఉన్నారు. తాతమ్మ పేరే ఎత్త లేదు నువ్వు... నేనేరా కందుకూరి రాజ్యలక్ష్మమ్మని. కాస్త తీరిక చేసుకుని ఈ నాలుగు మాటలు చెప్తున్నా. ముత్త ముత్తాత గారి కాలం, పరిస్థితులు, కుర్రకుంకవి నీకేం తెలుస్తాయి? ఇక్కడెవరూ ముఖ్యమైనా చిట్లించకుండా మురిసిపోయారు నీ అరకొర మాటల విసుర్లు చూసి. చరిత్ర తొక్కుడు బిళ్ళాట కాదురా.. అందులో అయినా ఆడపిల్లలు సరిగా గెంతుతారు, పంట పండాలి అంటే. ఆమాత్రం కూడా తెలీని నీదే చారిత్రక దృష్టి నాయనా! తాతగారెందుకురా నీ చొప్పదంటు ప్రశ్నలకు జవాబివ్వడానికి. బాలవితంతువుకు జడ అల్లినంత కాలం

పట్టలేదు నాకు నీ రాతలు అర్థం చేసుకోవడానికి.

తాతగారు నెహ్రూ కాలర్ కోటు వేసుకోవడం ఏమిట్రా? నువ్వు చెప్పే నెహ్రూ నాన్నే అదే మోతీలాల్ కూడా 1861 దాకా పుట్టలేదు. ఇంకా 1889కి పుట్టే పసికందు, ఎప్పుడో 1900 తర్వాత వేసుకునే కోటు, మీ తాతగారు వేసుకోవడమేమిట్రా, మొత్తానికి ఒక మంచి సంగతి చెప్పావురా ఉమామహేషూ! కోట్లు వేసుకోవడంలో కూడా తాతగారే మొదటివారని. వారు వేసుకున్న కోటుకే, తరువాత నెహ్రూ వేసుకుంటే నెహ్రూ కాలరు కోటు అని పేరొచ్చిందని. ఇది వింటే, తాతగారు సంతోషిస్తార్రా నాయనా. చూసావా వారిని ఏదో అందామన్న నీ హడావిడిలో ముత్త ముత్తాతగారికి నువ్వే కొత్త కీర్తి కల్పించావు. పది కాలాలు బతుకుతావురా తండ్రీ. కానీ ఇంత అజ్ఞానంతో ఎలా ఈదుకొస్తావయ్యా అన్నదే నా బాధ!

అచ్చు అందుబాటులో లేని ఆ రోజుల్లో, ఇంటి నిండా కప్పుకి తాళ్ళు కట్టి వేలాడదీసిన మూటల్లోంచి తాటాకు గ్రంథాలన్నీ చదివేశారు తాను. అందుకే ఎవరో ఒకరు 'కవుల చరిత్రలు' రాయాలి కదా తానే చేస్తే పోలా అని, అన్నీ వందల మంది కవుల తుట్టె కదిల్చి, ఆ అక్షర నిర్మాతల పేర్లు, తీర్లు అన్నీ ఎంతో కష్టం మీద నమోదు చేశారు. ఇప్పుడు మీలా మీట నొక్కితే సమాచార ప్రవాహం ముంచెత్తే ఏ సౌకర్యాలూ లేవు వారికి. అంత కష్టపడి వారు 'ఆంధ్ర కవుల చరిత్రము' ఒకచోట చేర్చి పుస్తకం చేస్తే, 'చదవనైనా చదువలేదు' అని చెప్పే నీ తరాన్ని చూస్తే, వారి దాకా ఎందుకు నాకు కూడా జాలి! చదవకుండా ఎలా ఒక అభిప్రాయం ఏర్పరచుకుంటారు? ఇక అలా ఏర్పడే అభిప్రాయాలను ఏమంటారు అని? మీ ముత్తాత గారు ప్రబంధాలను సమర్థించిన మనిషి కారు. నీవు పెద్ద నేరంగా చెప్తున్న రసిక జనరంజనం రాసే నాటికి వారికి ఇరవై రెండేళ్ళు. నూరు రచనలు దాటి చేసిన వారి సృజనలో అది రెండోదో, మూడోదో– అంతే! ఆ పద్ధతి మానుకునే క్రమంలో వచ్చిన ఒక రచన అది. దానిని కొక్కొండ వెంకటరత్నం పంతులు (తరువాత వారి సంస్కరణ దృష్టితో విబేధించి పోటీ రచనలు చేసినవారు) వంటి వారే, వారి ప్రపంచ దృష్టికి అనుగుణంగా ఉన్నది కనుక, అర్జునుడు, చిత్రాంగదల ఈ కథ, పాత్రలు పాత ప్రబంధాల పోలికలతో ఉన్నా కూడా, అచ్చు తెనుగులో రాసిన వారిలో కూచిమంచి తిమ్మన, పొన్నగంటి తెలగన, కందుకూరి లింగన (అంటే ఎవరో కాదురా మీ ముత్తాత గారే) స్వీయ భాషాభిమానులని పొగిడారు. ఆ రచనలో 'అతి వేలంగా శృంగారం నేను రాసింది, తరువాత పరిహరించాను' అని తన స్వీయచరిత్రలో మీ ముత్తాత గారే చెప్పుకున్నారు. ఇప్పుడింక నువ్వు కొత్తగా బయట పెట్టిందేమున్నది కంచు మోగినట్టు మోగడం తప్ప..! శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నైషధం, రసిక జనరంజనం వంటి రచనల వల్ల పద్య పక్కీలో పేరు తెచ్చుకున్నా అప్పటికి ఇరవై రెండేళ్ల ఏళ్ల మీ ముత్తాత ఆలా ఒక రచనకు, ఒక పద్ధతికి పరిమితమై ఆ వెలుగులోనే బతుకు వెళ్ళబుచ్చే రకం కాదు. అందుకే మొత్తం ప్రబంధ సాహిత్య ధోరణుల్నే వెక్కిరిస్తూ 'అభాగ్యోపాఖ్యానం' 1876లో రాసి ప్రబంధ సౌందర్య సూత్రాలను తలకిందు చేశారు. సాహిత్యం, సంగీతం అనేక కృత్రిమ బంధనాల్లో ఉన్నాయి అవి బయట పడాలి అన్న రచన 'సరస్వతీ నారద విలాపము' 1895లోనే చేశారు. గురజాడ కన్నా ముందరే తేటమాటల రచన అవసరం, అక్కర్లేని అలంకరణల బరువులు శవానికి తొడిగిన నగలు అని కూడా చెప్పారు. వ్యాకరణాన్ని సంకెల అని శ్రీశ్రీ కన్నా నలభై ఏళ్ల ముందరే ఆయన పుట్టక ముందరే అన్నారు. దీని సంగతి కూడా నీకు తెలిసినట్టు లేదు. ఇంత ప్రబంధ వ్యతిరేకిగా మారిన జగజ్జెట్టి మీ ముత్తాత యావత్ ప్రబంధ కవులతోనే తగువేసుకున్నాక, ఒక క్షీణ ప్రబంధం రాసినది ఆడామగా అని చూసి, ఆగి, గడుసుగా రాసే ప్రశ్నే అసలు తలెత్తదు. నీ కడుపుమంట కాస్త నిగ్రహించుకుని నువ్వు ఇక్కడికి చేరాలి. మొదటిది రాధికాసాంత్వనం అనే ప్రబంధం విషయం.. ప్రబంధ వ్యతిరేకి అయిన మీ ముత్తాత, ఈ రచనను సమర్థించే ప్రసక్తి లేదు.

ఆడిదం సూరకవి రచనలను అచ్చు వేసి వెలుగులోకి తెచ్చినా, వాటిలో హరిశ్చంద్రోపాఖ్యానం పిల్ల వసుచరిత్ర అని పేర్కొన్న సూటిమాటల మనిషి మీ ముత్తాత. రాధికా సాంత్వనములో ఉన్న కథ కొత్తదీ

కాదు, అంతకు ముందరి ప్రబంధాల్లో లేనిదీ కాదు. ముద్దుపళని రచనలో మొదట వేశ్యావృత్తిలో ఉన్న తల్లి, తరువాత తన పెంపుడు కూతుర్ని ఆమె తానే తన ప్రియుడితో కన్నెరికపు శృంగారానికి సిద్ధం చేయడం వంటి ఇతివృత్తంతో, కేవలం అయిదు శాతం కన్నా తక్కువ అక్షరాస్యతతో కొత్తగా చదువులకొస్తున్న తరాలకు, అచ్చులో ఇటువంటి రచన ధారాళంగా అందుబాటులోనికివస్తే, కొత్త సమస్యలకు దారి తీస్తుంది అన్నది వారి ఆలోచన అప్పటికి ఎంత సమంజసంగా తోచిందో, ఇప్పుడు మీకు అలా అనిపించదు కానీ ముద్దుపళని రచన, బెంగళూరు నాగరత్నమ్మ పట్టుదల, మీ ముత్తాత విబేధం... ఇవేవీ ఇప్పుడు నువ్వే బయట పెట్టినవీ, కొత్తవీ కావు. ఆలనాడు వారి సమ్యక్ కృషిని మెచ్చుకున్న విదుషీమణులు కనుపర్తి వరలక్ష్మమ్మ, నాళం సుశీలమ్మ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, కొటికెలపూడి సీతమ్మ, కొండపల్లి కోటేశ్వరమ్మ, భాస్కరమ్మ, సరోజినీ నాయుడు, ఇంకా ఎందరో మహిళలు ఎవరైనా సరే, మీ ముత్త ముత్తాతకి నివాళ్ళు అర్పించారే తప్ప, 'ఒక రచన పట్ల తన దృష్టి' అన్న సంకుచిత పరిమితిలో వారిని గురించి అపప్రథలను ప్రచారం చేయలేదు. సామాన్య జనం దృష్టిలో వేశ్యలు కుటుంబాలకు చేటు చేస్తారు అనే భావనా, వారి పట్ల కరుకుతనం కలిగి ఉండడం, ఎలా ఈ సమస్యను పరిష్కరించాలో ఆ నాటి సమాజానికే పూర్తిగా తెలీదు కాబట్టి. 'సానివాండ్లను హతమార్చడవే ఒక రాజ మార్గం' అని గిరీశం అంటాడు ఎన్నో ఏళ్ల తరువాత కూడా – 1909లో గురజాడ గారి కన్యాశుల్కం రెండో కూర్పులో. చింతామణి నాటకంలో తెలిసొచ్చే వేశ్యల స్వభావాలతో నిండి ఉంది సమాజం. మీ ముత్తాతకు, గురజాడకు, ఈ వేశ్యా సమస్య పట్ల గల పరిమితులేమన్నా ఉంటే, అవి నూట యాభై ఏళ్ల కిందట ప్రగతిశీల ఆలోచనలకు గల పరిమితులుగా చూడకుండా– ఇవాళ మీ కాలంలోంచి చూస్తూ, కేవలం ఈ ఒక్క సంగతినే పట్టుకుని దాని వర్తులంలో, వారి మొత్తం కృషిని అంచనా వేయడం, మనవడా, ఇది తొట్టిని, తొట్టిలో బిడ్డని కూడా పారవేసుకోవడమే! 'కవుల చరిత్రము'లో ఎందరు కవుల గురించో తొలిసారిగా వచనంలో అంచనాలు ఇచ్చిన కృషి మీ ముత్తాతది. అది సమగ్రమూ, సంపూర్ణమూ కాదు అని తానే చెప్పుకున్నారు. నిర్మొగమాటమైన మాటలు ఎన్నో ఉన్నాయి. ప్రాచీన సాహిత్యంలో ఎన్నో పద్యాలతో పోలికలున్న రాధికా సాంత్వనము రచనకు భాగవతం, పారిజాతాపహరణం, శశాంక విజయం, సారంగధర, వంటి కావ్యాలతో గల ప్రభావం ఎరుగకుండా మీ తరంలో ఇదొక ప్రత్యేక విలక్షణ రచనగా నిరూపణ చేయదలిస్తే, అందుకు తప్పనిసరిగా, నీవు ఎంచుకున్నది సరైన మార్గం కాదు. చదువే అయిదు శాతం కన్నా తక్కువగా ఉన్న వలసపాలనలో బతుకుతూ, రాసే వర్గాలే కొద్దిపాటి కాగా, అందులో మీ ముత్తాత తన కులానికే రాసుకున్నారన్నది, నీ వదరుబోతుతనం తప్ప మరేమీ కాదు. తన జంధ్యం తెంపేసిన బ్రహ్మ సమాజీకుడు, తానే స్వయానా పెళ్లి మంత్రాలు రాసి పెళ్లిళ్లు చేసిన సాహసి మీ ముత్తాత.

ఒక నవల రాసి అది అచ్చు కావడం వల్ల మీ ముత్తాత రచన ఆ పేరు కొట్టేసింది అనో, లేదా ఒక నవలల పోటీకి ఒకరు రాసిన శ్రీరంగరాజ చరిత్రముకి మీ ముత్తాత రచన కాపీ అనో, ఇంకా ఆంగ్ల నవల వికార్ ఆఫ్ ద వేక్ ఫీల్డ్‌కి మక్కికి మక్కీ దించారని, ఇలా మీ ముత్తాత రాసిన వాటికన్నా, వాటిపై వచ్చిన తేలికపాటి మాటలే నీ దృష్టిలో గొప్ప కావడం విచారకరం. ఏ ఒక ప్రక్రియలోనైనా ఎవరో ఒకరు ముందు రాసి ఉంటారు– అంతకు మించిన సాంఘిక కార్యాచరణ, సాహిత్య నిరంతర ధ్యాస, స్త్రీల ఆరోగ్యం, తల్లీ బిడ్డల ఆరోగ్యం, గ్రామీణ సమాజంలో శుచి, శుభ్రత, ఇవన్నీ మీ ముత్తాతకు ఒక అర్ధ శతాబ్ద కాలం పాటు దైనందిన కార్య క్రమాలు. ఇంకొకటి తెలుసుకో ఉమా మహేషూ... మీ ముత్తాత రాసిన రాజశేఖర చరిత్ర, దేనికీ నకలు కాదు అని (he eventually decided on writing a tale of Hindu domestic life, in which the scene is laid in his own district, and little or nothing is borrowed from Goldsmith beyond the general idea of a family in easy circumstances reduced to poverty) ఆ నవల ఆంగ్లానువాదానికి అచ్చుకి ముందుమాట రాసిన ఆనాటి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్పెక్షన్ రాబర్ట్ మెకంజీ తెలిపారు. లండన్ సమాజంలో పత్రికలు రెండు వందలేళ్ళ నాటి గోదావరి జిల్లాల దక్షిణ భారత జీవితం పరిచయం కావాలి అంటే, ఈ నవల చదవాలి అని ఆంగ్లంలోనే రాశాయి. గోల్డ్ స్మిత్ నవల, రాజశేఖర చరిత్రము (ఫార్చ్యూన్స్ వీల్ పేరిట ఆంగ్లానువాదంలో) వారికి ఎవరికీ నీలా మక్కీ కి మక్కీ దించినట్టుగా తోచలేదయ్యా..! అంత ఆంగ్లం వస్తే పోయి చదువుకో. ఆ ముందు మాటలు, ఆ నవల ఆంగ్లంలో, ఆ పత్రికల మాటలు 1888 కాలం నాటివి. మీ ముత్తాత రాసిన ఈ నవల, శుభం పలుకుతూ మీ హృదంతరాళం గర్జిస్తే, ఆంగ్లానువాదం జరిగిన తొలి భారతీయ నవలగా దేశీయ, ప్రపంచ సమాజానికి తెలియ చెప్పే మంచి పనులు మీలాంటి మంకెన్నలు చేస్తే సంతోషం. లేదు అంటే, అలనాడు ఎందరో మహిళలు ఎందుకు మీ ముత్తాతను కీర్తించారో, పలు రంగాల ప్రముఖులు, రాజకీయ, సామాజిక, సాహిత్య, సాంస్కృతిక, శాస్త్రీయ తర్క సంపన్న, ప్రగతిశీల స్వభావం గల వారు వందేళ్ళుగా వారి గురించి చెప్తున్న వారు కొల్లలు. వారిలో ఎవరికీ లేని పలుకాకి లక్షణం నీలో ఉన్నది. అందుకే పొంతన లేని విషయాల పేర్పు ద్వారా, నీ తరాల చైతన్యానికి అవమానకరమైన రీతిలో, ముత్తాత కీర్తి మేరువుకి ముప్పు తలపెట్టావు.

రక్తసంబంధాలతోనే తాతలు, మనవలు ఏర్పడరు. నువ్వే వరస మనవడివైనా, నాకు ప్రేమే కానీ వీరేశలింగం అదేనయా నా జీవన భాగస్వామి, సమాజ జీవనసంక్షేమ ధ్యాని. చుట్టూ ఒక సైన్యం ఉంటుందని నిజమే చెప్పావు. చిలకమర్తి నుంచి జాషువా దాకా మీ ముత్తాతకి ఇచ్చిన కవులు, మేధావులు, స్త్రీ బాల వృద్ధులు, వందేళ్ల యువతరాలు ఇచ్చిన నివాళులు ఆంధ్ర దేశమంతటా మార్మోగుతున్నాయి. వారిలో కూడా నీకు కులం కనిపిస్తూ ఉంటే, మానసిక చికిత్స నీకు అవసరం. అటువంటి వారు నిన్ను పట్టించుకోవలసిన గట్టి మాటలు ఏమీ నువు రాయలేదు కానీ, శ్రీశ్రీ అన్నట్టు ఈ ఉదయమే ఈ ఉత్తరాన్ని చి.కా.బు.లో వేస్తున్నాను. ఈ చి.కా.బుకి కూడా అప్పటికి ఎరగని పరిశోధనాత్మక పత్రికా రచనలో (ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం అని మీరు అంటున్నది అది కూడా మీ ముత్తాతగారి కృషే!) ఒక పాత్ర కల్పించిన భిన్న రంగాల క్రియాశీలిగా, మూడొందల అరవై డిగ్రీల వ్యక్తిత్వం మీ ముత్తాతది. ఉమా మహేషూ, ముత్తాత గారి చి.కా.బు.లా మిగిలి పోయావన్నదే, నాకు మిగిలిన బాధ. శుభాకాంక్షలు.

రాజ్యలక్ష్మమ్మ ఆజ్ఞానుసార లేఖరి- శత వర్ధంతి సైనికుడు

– రామతీర్థ
98492 00385

శ్రీశ్రీ స్మృతి కార్యాచరణ



జ్ఞానపీఠం అవార్డు వచ్చిన సందర్భంలో విశ్వనాథ.. మహాకవి శ్రీశ్రీని భారతరత్న పురస్కారం మీరందుకోవాలి అన్నారు. భారతరత్న అనటం కన్న నాకు 'విశాఖ రత్న' అంటేనే చాలా సంతోషంగా ఉంటుంది అని శ్రీశ్రీ సమాధానమిచ్చారు. తాను పుట్టినగడ్డ విశాఖ అంటే ఆయనకెంత అభిమానమో తెలియటానికి ఈ ఒక్క మాట చాలు. విశాఖలోని శ్రీశ్రీ జన్మించిన ఇంటిని ఒక స్మారక మందిరంగా మారుస్తామని ముఖ్యమంత్రి మే1న ప్రకటించారు. అది ఇంకా కార్య రూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో ఆయన సాహిత్యాభిమానుల శ్రీశ్రీ స్మృతి కార్యాచరణ ఇది..

ఆధునిక తెలుగు కవిత్వ వికాసానికి ఆద్యుడు మహాకవి శ్రీశ్రీ. నన్నయ ఎలా ఆదికవిగా మహాభారత రచనకు ఉపక్రమించి తెలుగు సాహిత్యపు వెయ్యేళ్ల చరిత్రకు శ్రీకారం చుట్టాడో, అలా గురజాడ నుంచి అందుకున్న అభ్యుదయ భావజాలానికి దీటైన వారసుడిగా శ్రీశ్రీ విశాఖ నుంచి సాహిత్య ఆధునిక యుగానికి దారులు తీశారు. విశాఖలో వన్‌టౌన్‌లోని విప్పర్తి వారి వీధిలో శ్రీశ్రీ జన్మించిన ఇల్లు ఉంది. ఇది ప్రైవేటు వ్యక్తుల నివాసంగానే ఉంది. అమ్మకాలు, కొనుగోళ్లు జరిగి ఎన్నోసార్లు చేతులు మారినా ఈ ఇంటి గోడపై జీవీఎంసీ కనీసం ఇది మహాకవి శ్రీశ్రీ జన్మగృహం అని లిఖించి ప్రపంచ ప్రఖ్యాత కవుల ఇళ్లకు ఆయా దేశాలలో ఎలా తామ్ర ఫలకాలు అమరుస్తున్నారో ఆ విధంగా చేయవచ్చునని సాహిత్యవేత్తల ఆలోచన. మే1న ముఖ్యమంత్రి, విశాఖలోని శ్రీశ్రీ జన్మించిన ఇంటిని ఒక స్మారక మందిరంగా మారుస్తామని ప్రకటించిన నేపథ్యంలో ఒక సందులో ఉన్న ఈ ఇంటిని శ్రీశ్రీకి సంబంధించిన ముఖ్యస్థలంగా గుర్తించడం చాలా అవసరమని సాహితీలోకం స్వాగతిస్తోంది. 1930ల నాటి విశాఖపట్నాన్ని తన కార్యక్షేత్రంగా మలచుకున్న ఒక యుగకవికి సముచితమైన స్మృతి చిహ్నం ఇప్పుడు ఆంధ్ర రాష్ట్రంలోని అతి పెద్ద నగరంగా ఎదిగిన విశాఖలో సమున్నత నిర్మాణంగా జరగవలసిన చారిత్రక అవసరం ఎంతైనా ఉంది.

- **మహాకవి గురుతుల్ని భద్రపరచాలి**
- **అంతర్జాతీయ సాహిత్య అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయాలి**
- **సామాజిక, సాహిత్య, సాంస్కృతిక వికాసానికి దోహద పడాలి**

శిలావిగ్రహం ఒక్కటే ఉంది

నగరంలోని సాగరతీరంలో ఉన్న శిలా విగ్రహం తప్ప మహాకవికి తాను పుట్టిన ఊరిలో ఏ రకమైన స్మృతి చిహ్నాలు లేవు. ఈ కొరతను ఇప్పటి ప్రభుత్వ శ్రద్ధ వహించి తీరాలి. విశాఖ బీచ్, ఏయూ లైబ్రరీ, ఇప్పటి మునిసిపల్ కార్పొరేషన్ ఉన్నచోట ఒకప్పుడు ఉన్న కటకం వారి చెరువు, చావుల మదుం, డాల్ఫిన్స్‌నోస్, వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ, రీడింగు రూమ్ ఇవన్నీ కూడా శ్రీశ్రీ కవిత్వంలో ప్రస్తావితాలు, లేదా ఆయా చోట్ల ఆయన ప్రఖ్యాతమైన రచనలు చేశారు. ఈ నేపథ్యంలో ఆంధ్రాయూనివర్సిటీ ప్రాంగణంలో శ్రీశ్రీ అధ్యయన కేంద్రం ఏర్పాటు చేయటం, భావి తరాలకు ఉపయోగపడేలా దానిని తీర్చిదిద్దటం, నవ్యాంధ్రకు స్ఫూర్తిగా కవితా రంగ చోదక శక్తి అయిన శ్రీశ్రీ పేరిట ఇంటర్నేషనల్ లిటరేచర్ స్టడీ సెంటరు ఏర్పాటు అవసరం. ఇది ఉత్తరాంధ్రలో సామాజిక, సాంస్కృతిక వికాసానికి దోహదపడుతుందన్నది నిస్సందేహం. ఈ సాహిత్య అధ్యయన కేంద్రం శ్రీశ్రీ కాలానికి సంబంధించిన ఎన్నో విశేషాలను భద్రపరిచే ప్రదర్శనశాలగా, ఒక సభామందిరంతో పాటు, అధునాతన హంగులతో ఒక లైబ్రరీని కూడా ఏర్పాటు చేస్తే శ్రీశ్రీ తన జ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రపంచ పుస్తకాలపై ఎలా ఆధారపడి అంతటివారుగా ఎదిగారో తెలుసు కునేందుకు భావితరాలకు వీలు కలుగుతుంది. దీన్ని ఏర్పాటు చేయటం సర్కారు ముఖ్యబాధ్యతగా భావించాలి. ఆయన ఇంటిని ఒక మ్యూజియంగా మార్చటం, లేదా తామ్ర ఫలకం తాపడం చేయాలి. ముఖ్యకూడళ్లలో (టర్నర్ చౌల్ట్రీ ఎదురుగా ఉన్న కూడలి వద్ద ఉన్న సత్రంలోనే ఆయన కొద్ది నిమిషాల కాలంలోనే స్ఫూర్తిదాయకమైన మహాప్రస్థాన గీతాన్ని రచించారు. అడివి బాపిరాజుగారికి చదివి వినిపించారు.) స్మృతి ఫలకాలు ఏర్పాటు చేయాలి.

– సిటీడెస్క్

ఉపయుక్తంగా మలచుకోవాలి



ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కేవలం బొమ్మలు, పురావస్తుశాలలుగా కాకుండా నిత్యం ఉపయుక్తంగా ఉండేలా మలచుకోవడం చాలా అవసరం. ఈ దిశగా శ్రీశ్రీ పుట్టిన ఊరిలో తగు చర్యలు చేపట్టగలరని సాహిత్య లోకం ఆశిస్తోంది. శ్రీశ్రీ కవిత్వం పలు భాషల్లోకి తర్జుమా కావలసి ఉంది. వారి రచనలు దృశ్యరూపాలుగా సాంకేతిక యుగంలో కొత్త రూపాలతో దర్శన ఇవ్వడానికి అనేక సానుకూలతలు కలిగి ఉన్నాయి. అరవై మందికి పైగా ప్రపంచ రచయితల రచనలను ఆయన తెలుగులోకి అనువాదం చేశారు. ఆయన కాలంలో వారిలా తెలుగు సాహిత్యానికి ప్రపంచ సాహిత్యాన్ని తెలుగులో పరిచయం చేసినవారు లేరు. సాహిత్య, సినిమా,రాజకీయ రంగాలలో ప్రభావం చూపిన విశాఖబిడ్డ శ్రీశ్రీకి సముచిత స్మృతి కార్యాచరణ అంటే ఇలా విశాల ప్రాతిపదికపై ఉండాలని సాహిత్య లోకం ఆశిస్తోంది.

–రామతీర్థ, కవి, సాహితీ వేత్త

రామతీర్థ
9849200385

మహాకవి స్ఫూర్తిలో మొజాయిక్ ప్రయాణం

మహాకవి స్ఫూర్తి లో మొజాయిక్ ప్రయాణం. మొజాయిక్ అంటే అనేకత్వం ఏకత్వం. ఏకత్వంలో అనేకత్వం. ఎన్నో అంతర్భాగ రాళ్ళు, దేనికదే, స్వతంత్ర వ్యక్తిత్వం కలిగి ఉండి, అన్నీ కలగలిసినప్పుడు, ఒక సమగ్ర సంపూర్ణ శిల్పం కనిపించడం, అదే మొజాయిక్ లక్షణం. కళలు ఇంతలా భిన్నమైనవి. సాహిత్యం దేనికైనా మూలం కనుక, ఈ వైవిధ్యం అనంతం. ఈ అనంత వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడంలో కవుల కృషి మనకు తోడ్పడుతుంది. ఆధునిక సాహిత్యపు తల్లి వేరు కళింగాంధ్రలో ఉన్నది. ముఖ్యంగా ఆదిలం సూరవరి(?), గురజాడ, విజయనగరం సంస్థాన సాహిత్య

ఖమ్మంలో ఏర్పాటు చేశారు శ్రీ శ్రీ సాహిత్యాన్ని మాకులు(?). శ్రీ శ్రీ సాహిత్య నిధి పేరిట చిన్న చిన్న పుస్తకాలుగా సింగం పల్లి అశోక్ కుమార్, విజయవాడ నుంచి వంద పుస్తకాలు తెచ్చే ఒక ప్రణాళిక మొదలు పెట్టారు. ఎవరో ఒకసారి విజయవాడ సభలో మహాకవి శతజయంతి విజయవాడలోనే మొదటగా మొదలైంది అంటే, దాన్ని సవరిస్తూ, మొజాయిక్ సాహిత్య సంస్థ శ్రీ శ్రీ శతజయంతి కార్యక్రమాలను తొలుత మొదలు పెట్టింది విశాఖలో, మహాప్రస్థానం పై చిత్రకారుడు టి. సూర్యారావు చిత్రాల ప్రదర్శన ద్వారా, దానికి తానే ఆహ్వానం(?) పెట్టానని, మిత్రుడు అశోక్ కుమార్ తెలియకుండా మాట్లాడే వారికి ఈ శ్రీశ్రీ శతాబ్ది ఉత్సవ చరిత్రను వివరించారు. అలా 2006 లో, అంటే శ్రీశ్రీ శతజయంతి కార్యక్రమాలను ఐదు ఏళ్ళ ముందుగా కౌంట్ డౌన్ ఇప్పు(?) విశాఖలో, రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా మొదలు పెట్టిన సంస్థ మొజాయిక్.

సమన్వయం వలన, కొత్త తరాల కోసం, ఎలా ఉత్తమ రచనలను కొత్త రూపాల్లో పరిచయం చేయగలమో, నిరూపించారు.

శ్రీశ్రీ శత వత్సర ప్రసంగ ధారగా మొజాయిక్ ఏడాది పొడుగునా ప్రతి నెలా రాష్ట్రం నలు మూలల్లోని సాహితీ ప్రముఖులచే విశేష ప్రసంగాలను ఏర్పాటు చేసింది. కె.కె. రంగనాథాచార్యులు, రాళ్ళబండి కవితా ప్రసాద్, అంగలకుర్తి విద్యాసాగర్, కడియాల రామమోహన రాయ్, ఉదితర(?) ప్రముఖులు, ఈ ప్రసంగ ధార లో పాల్గొన్నారు.

సాహిత్య అకాడెమీ కోసం, తెలుగులో బూదరాజు రాధాకృష్ణ రచన, శ్రీ శ్రీ మోనోగ్రాఫ్, ఎల్.ఆర్ స్వామి, ప్రముఖ రచయిత, అనువాదకులు, మొజాయిక్ అధ్యక్షులు, మలయాళం లోనికి అనువాదం చేశారు.

శ్రీ శ్రీ చేసిన ప్రపంచ కవిత్వ అనువాదాల పై ప్రత్యేక శ్రద్ధతో, వాటి మూలాలతో, శ్రీ శ్రీ చేసిన అనువాద రూపాలు, వాటి విధేయతెలుగు అనువా

గీతాలు ఎనిమిది వా లం వ లో న వత్సరంగా, "అక్షర విధ కవితలకు జోతి వందనం" అలా రామ తీర్థ, శ్రీ శ్రీ సాహిత్యపు మైలురాళ్లను సాహిత్యంలో సమీపం చేస్తూ వస్తున్నారు.

శ్రీ శ్రీ ప్రతిజ్ఞ గీతానికి, ఇతర రచనల జ్ఞాపకానికి ఆధార వేదిక అయిన ఆంధ్ర విశ్వ విద్యాలయ లైబ్రరీకి, శ్రీ శ్రీ గారి ఫోటోను జ్ఞాపికగా, ఆ ప్రాంగణంలో ఒక సభ నిర్వహించి అందచేసిన ఘనత మొజాయిక్ దే.

ఇక ఈ ఏడాది, శ్రీ శ్రీ విశాఖలోనే, 1937లో ఒక్క ఊపులో రాసిన ఆరు పంక్తుల మహా"మాటల "కవితా! ఓ కవితా!" కు ఈ 2017లో, ఎనభయ్యేళ్ళ సందర్భమే ఈ విషయంగా, ఈ జూన్ 15న, శ్రీ శ్రీ

మొజాయిక్ సాహిత్య సంస్థ

కాలముగా చేసిన కృషి గణనీయం అయినది. గురజాడ కొద్ది పాటి రచనల్లో వెలిగించిన ఆధునికత దీపం, శ్రీ శ్రీ లోకం అంతా వెలిగేలా, తన రచనల ద్వారా ప్రదీప్తం చేశారు. ఆయన విశాఖ వాసి కావడం, మనకు గర్వ కారణం.తన కవిత్వ ప్రాముఖ్యత, వైశాల్యత పై గణనీయమైన ఆత్మవిశ్వాసం, సాహిత్య కంఠీరవ్యాసమే(?)లో "అప్పారావు అంత వాణ్ని, ఆంధ్ర వృత్తమ్(?) నా శాపం" అని రాసుకున్నారు ఒక కవితలో.

2010లో శ్రీ శ్రీ శతజయంతి సందర్భమే ఒక శతాబ్దపు సాహిత్య ధోరణులపై విపుల విశ్లేషణ జరగాలి, అలాగే జరిగి ఉండేది. నాడు వచ్చి చింతన అంటేనే భయం, వైమనస్యంగల ప్రభుత్వాల విధానాల కారణంగా, 2010లో శ్రీ శ్రీ శత జయంతి, ఆ వత్సరంలో కానీ, ఆతర్వాత కానీ తెలుగు ప్రజలు చేసుకున్న శతాబ్ది ఉత్సవంగా మిగిలింది. కానీ శ్రీశ్రీ ని అర్థం చేసుకోకుండా, ఇరవయ్యో శతాబ్దపు సాహిత్య పోకడలు అవగాహన చేసుకోవడం అసాధ్యం. ఈ దిశగా జరిగిన కృషిలో అప్పటి అల్లర్లలో శ్రీ శ్రీ విగ్రహం, టాంక్ బండ్ పైన కూల దోస్తే, తిరిగి,

2006 నుంచి 2010 వరకూ, శ్రీ శ్రీ జయంతి ఏప్రిల్ 30న, ఆయన వర్ధంతి జూన్ 15 న, క్రమం తప్పక జరుపుతూ వచ్చిన కార్యక్రమాల ద్వారా, ఈ మహాకవి సూరీళ్ళ పండుగ, తెలుగు సాహిత్య వికాసంలో ఒక విశేషంగా నిర్వహణలో ముందు నిలిచింది ఈ సాహిత్య వేదిక. ఈ ఐదేళ్లలో విశాఖలో మొజాయిక్ సంస్థ ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ సాహిత్య పరంగా జరిగిన సభలన్నీ కొత్తదనాలను ఆవిష్కరించాయి. వాటి వివరాలు.

రామతీర్థ రచన, కవిత్వ సమన్వయంతో, "మహాప్రస్థానం కోసం మీ జీవితంలో ఒక గంట" పేరిట, కథా నేపథ్య వ్యాఖ్యతో, కొర్లపాటి సంగీతంతో, సాహిత్య ధర్మం చెప్పి తినకుండా, ఒక గంట ప్రెజంటేషన్ గా మొత్తం మహాప్రస్థానం కావ్యాన్ని, జగద్ధాత్రి, గనిమెళ్ళ నాగేశ్వర రావు, ముగ్గురూ నిర్వహించారు.

"బాలల మహాప్రస్థానం" పేరిట, గనిమెళ్ళ నాగేశ్వరరావు, మహాప్రస్థానంపై చిత్రాల పవర్ పాయింట్ ప్రదర్శన రూపొందించి, సాంకేతికత తో సాహిత్య

దాలు, వాటి మధ్య గల అందించే స్పెషలిస్ట్ కృషి, రామతీర్థ, శ్రీశ్రీ మనకు పరిచయం చేసిన ప్రఖ్యాత కవితలు, అర్థాలు, గంటలు, ఏవి తప్పి, జోన్ ముస్సు(?) రచనల మూల, అనువాద, సమన్వయ, సమాంతర అధ్యయనంతో ప్రత్యేక రచనలు అంద చేశారు. జోన్ కవిత పై ప్రత్యేక అధ్యయన ప్రతి వెలువరించారు.

పత్రికల్లో తెలుగు ఇంగ్లీష్ సాహిత్య వ్యాసాలుగా, "జయభేరికి 75 ఏళ్ళు", శ్రీ శ్రీ వర్గాలుగు(?) కవితలు రాసిన 1934 గురించి "చతుర్దశ భువనాలు చతుర్దశ కవనాలు", శ్రీ శ్రీ "ఆ" కవితపై ప్రత్యేక విశ్లేషణ, ఆఫ్సర్ హాస్టల్లో వారు రాసిన మహాప్రస్థానం గీతం పై వ్యాసాలు, మహాత్మా గాంధీ హత్య తరువాత, ఆ జాతీయ విషాదానికి శ్రీ శ్రీ స్పందనగా కేవలం రెండు రోజుల్లోనే, మద్రాసు ఆకాశ వాణి నుంచి ప్రసారితం అయిన వారి రేడియో నాటిక "సుప్తాస్థికలు" పై ఈ ఏడాది రేడియో ద్వారా, లీడర్ పత్రిక ప్రారంభ సాహిత్య పేజీ ద్వారా ఫోకస్, వారి "ప్రభవ" తొలి కవిత్వ సంపుటికి తొంభై ఏళ్ళు నిండిన సందర్భంగా విపుల ప్రస్తావన, 1937లో వారి మహాప్రస్థాన

34వ వర్ధంతి నాడు, ఎనభయ్యేళ్ళ కవితా! ఓ కవితా! పై ప్రత్యేక సభ, అలాగే ఈ సభలో, ఇరవయ్యో శతాబ్దపు ఈ అత్యంత ప్రధాన రచనకు ఆంధ్ర, ఉర్దూ, మలయాళ అనువాదాల సమన్వయం కూడా ఉంటుంది.

పెద్ద పత్రికలు ఇవాళ్టి రెండు రాష్ట్రాల సాహిత్య రాజకీయాల వల్ల, అన్నీ హైదరాబాద్ నుంచే వస్తున్న కారణంగా, శ్రీ శ్రీ ని సాహిత్య పేజీ నుంచి వక్రం పెరుగుతున్న మాట నేడు వాస్తవం. ఈ నేపథ్యంలో సాహిత్య రాజధాని, విశాఖలో జరుగుతున్న ఈ కృషి చాలా ప్రాధాన్యత సంతరించుకుంటున్నది. పందొమ్మిది, ఇరవయ్యో శతాబ్దపు మలుపులో, గురజాడ, శ్రీశ్రీ వీరి వంటి మరొక సాహిత్య వేత్త ఆ కాలంలో, ఆ తరువాత లేరు. వారి ప్రాపంచిక దృష్టి అందు కోవడం, ఏ కాలంలోనైనా, ప్రపంచ మానవులుగా ఎదిగేందుకు దోహదం చేసే వర్గం. ఇది దాటేస్తే దాగని సత్యం.

శ్రీశ్రీ అలభ్య అనువాద రచన (యక్షగానం)

భాగ్యలక్ష్మి

మే 30న శ్రీశ్రీ జయంతి

[illegible]

రామతీర్థ

[illegible]

Rudyard Kipling రాసిన The Masque of Plenty కి ఏడాది క్రితం నేను చేసిన యథాశక్తి తర్జుమా.

-శ్రీశ్రీ

రడ్యార్డ్ కిప్లింగ్

సందర్భం: సమరాహ్వానం నుంచి స్వర్గ భైరవం దాకా ...

తొలుదొలుత కవిత్వం రాస్తున్న ఆరంభ రోజుల్లో ఆ కుర్రాడు, ధృతరాష్ట్రుడు కోరినట్టుగా 'దివ్యలోచనములు ప్రసాదింపుమయ్య' అన్నది పద్యంలో నాలుగో పంక్తిగా రాసిన కవిత, తమ పత్రిక 'స్వశక్తి'లో అచ్చు వేసినవారు పురిపండా అప్పలస్వామి. ఈ కారణం వల్లే తాను శ్రీశ్రీ డిస్కవరర్ అని చెప్పేవారు పురిపండా. 'అది నిజమే! నా కవిత మొదట అచ్చు వేసింది ఆయనే' అని జవాబు చెప్పేవారు శ్రీశ్రీ. భారత ఇతివృత్తాలు అందరూ కవుల్లాగే శ్రీశ్రీగా ఎదుగుతున్న ఆ బాలకవికి కూడా బాగా ఇష్టమే! అందుకే 'దివ్యలోచనములు' కవిత కేవలం జ్ఞాపకం కాగా, తన పదిహేనో ఏట శ్రీరంగం శ్రీనివాసరావు రాసిన 'సమరాహ్వనము' కవిత, అప్పటి మేటి పత్రిక భారతిలో నవంబర్ 1926 సంచికలో అచ్చయింది. ఇది నిజంగా శ్రీశ్రీగా ఎదగడానికి ఆ కుర్రాడికి మొదట్లోనే దొరికిన యోగ్యతాపత్రంగా భావించవచ్చు.

పురిపండా కేవలం శ్రీశ్రీ తొలి పద్యం అచ్చు వేసిన సంపాదక మిత్రులే కాదు, శ్రీశ్రీ కవితల తొలి సంపుటి 'ప్రభవ' ప్రచురణకర్త కూడా. 1928లో ఈ సంపుటి తెచ్చిన సమయానికి శ్రీశ్రీ పద్దెనిమిదేళ్ళ తరుణ వయస్కుడైతే- అచ్చు వేసిన పురిపండాకు ఇరవై నాలుగేళ్లు. ప్రభవలో మొదటి కవిత 'సమరాహ్వనము'. తెలుగు సంవత్సరాల్లో మొదటిదైన ప్రభవ పేరిట వెలువడ్డ ఆ అరవైఏళ్ల కాలచక్రంలో శ్రీశ్రీ తిరుగులేని ప్రపంచస్థాయి కవిగా నిలిచిపోయే ప్రయాణం చేశాడు అంటే, ఇందులో పచ్చజెండా ఊపిన పురిపండా పాత్ర కూడా ప్రముఖమే! 1927 – 28 తెలుగు కాలమానం ప్రకారం 'ప్రభవ' నామ సంవత్సరమే! శ్రీశ్రీ తొలి సంపుటి పేరును వీళ్ళు ఎంత జాగ్రత్తగా పెట్టారో ఈ అమరిక చూస్తే తెలుస్తుంది. అలా ఒక ప్రభవలో రాయగా, విభవ చైత్రంలో (ఏప్రిల్, 1928) అచ్చులో కవితా సంపుటి గల కవిగా మొదలైన జీవితం- నిరంతర కవిత్వ వ్యాసంగంతో నడిచింది, 1983-1984 రుధిరోద్గారి నామ సంవత్సరంలో 1983 జూన్ 15న ఒక సూర్యాస్తమయ వేళ శాశ్వత విశ్రాంతి వరకూ. భారతి 1926 సంచికలో సమరాహ్వానం అచ్చయిన సంవత్సరం అక్షయ. అక్షయమైన కవిత్వ రాశిని వదిలి వెళ్ళే విలువైన అవకాశాన్ని, కాలంతో పాటు పరుగులు తీస్తూ.. రెండు చేతులా సద్వినియోగం చేసుకున్న ధూమకేతువు శ్రీశ్రీ.

భారతాంతర్గత పద్యాలుగా, పురాణ ఇతివృత్తాలతో 'ప్రభవ'లో ఉత్తర కుమారుడు, మృత్యువు, ప్రేమ, కృష్ణరాయలు, పెద్దన, విశాఖ సముద్ర పడమర ఆకాశ సాయంకుంకుమ, తేటగీతాల పట్ల తనకు గల దిట్టమైన ప్రేమ... ఇలా ప్రభవ, శ్రీశ్రీ కవితలే కాక, రెండు అనువాదాలతో కూడా వెలువడింది. షేక్స్పియర్ గీతం, ఇనోనీ పేరిట ఆంగ్ల మహాకవి టెన్నిసన్ గ్రీకు సుందరి ఇనోనీ తన ప్రియుడు పారిస్ జీవితంలో సంభవించే ఘట్టాలకు సాక్షిగా రాసిన ప్రేమ విషయ కవితకు శ్రీశ్రీ అనువాదం ప్రభవలో మనలను పలకరిస్తాయి. ప్రభవలో ఉన్న లలిత భావ కళా వియద్వాహిని ఒక మలుపు తిరిగిన కవిత సుప్తాస్థికలు. జీవన కటు మురళీ రవళి కూడా తన ఊహల రెక్కలపై బరువుగా నిలుస్తుందని శ్రీశ్రీ తన ఇరవయ్యో ఏట చెప్పిన కవిత ఇది. 1930– 31 ప్రమోదూత సంవత్సరాది సంచికలో సమదర్శిని పత్రికలో ఇది అచ్చయింది.

'నాకుగాదులు లేవు నాకుషస్సులు లేవు' అన్న భావ శబలత పదేళ్ళ ముందర కృష్ణశాస్త్రికి అలంకారమైనది, కేవలం దశాబ్దం కాలంలోనే శ్రీశ్రీ స్వరంలో ఒక ఉగాది జీవన సమదర్శన పునాది అయింది. రాజాస్థానాల నుంచి విడివడిన కవిత్వం, దేశి రూపాలెత్తి భక్తి పేరిట శృంగారంలో గంగవెర్రులెత్తిపోయి, అక్కడ నుంచి శతకకర్తలు ఎంత మందలిస్తున్నా, స్త్రీ శరీరంపై కచాకచి, బాహాబాహీ భావ ప్రకటనల జీవనోపాధుల వక్రగతిలో పూర్తిగా పతనం అయి, క్షీణ ప్రబంధదశలో ఉండగా, వచ్చిన తొలి స్వరధార కందుకూరి వీరేశలింగం దూసిన సరస్వతీ నారద విలాపము. ఆ రాజాస్థానాల నుంచి జీవన మహా ప్రస్థానాల దాకా కవిత్వ ప్రక్షాళిత యాత్రలో, ఆ కొమ్ము బోయీ శ్రీరంగం శ్రీనివాసరావు. సుప్తాస్థికలు కవిత, ఆయన కవిత్వ విస్ఫోటం ముందు వచ్చిన పెనుగాలి హెచ్చరిక.

1932 ఉగాది అంగీరస సంవత్సరం. శ్రీశ్రీ ఇక్కడి తేటగీతి దివ్యానుభూతి. 1933 అంటే, శ్రీశ్రీ మహాప్రస్థాన తొలిగీతం జయభేరి రాసిన మరుసటి సంవత్సరం. ఈ అంగీరస ఆరంభంలో మహాప్రస్థాన సంకల్పం చెప్పుకున్నాడా యువ విరాట్టు. అవును.. ఇదిగో ఆంధ్ర పత్రిక సంవత్సరాది సంచికలో అచ్చయిన ఆ తేటగీతి ఇలా ముగుస్తుంది.

'ఇపుడు మేఘములు
విచ్చిపోయినవి నాకు
గగనమందె కలదు తారకావ్రజమ్ము
ఇంకా నే రాకా శశాంక మూర్తి
నై నభోరాజ్య పాళికలావరింతు'

శ్రీముఖ సంవత్సరం వచ్చిన వచ్చిన మూడు నెలలకు 2.6.1933న 'జయభేరి' కవిత రాశాడు శ్రీశ్రీ. ఇదే నిజానికి మహాప్రస్థాన గీతాల్లో తొలి రచన. అయితే, ఏప్రిల్ 1934లో (మళ్ళీ ఉగాది గొడవ తప్పదు) భావ నామ సంవత్సరంలో, తెలుగు సాహిత్యం నుంచి ప్రపంచ సమాజానికి ఒక శ్రీముఖం పంపించాడు శ్రీశ్రీ.. అదే మహాప్రస్థానం గీతం. మరో ప్రపంచం, మహా ప్రపంచం పిలుస్తున్న పిడుగుపాట. నిజానికి 1933 జూన్, 1934 ఏప్రిల్ మధ్య కాలంలో శ్రీముఖ ఏడాదిలోనే (జయభేరి, మహాప్రస్థానం) గీతాలు రాసిన తొమ్మిది నెలల కాలంలోనే మరికొన్ని కవితా శిశువులు కూడా వెలువడ్డాయి. వాటిలో ముఖ్యమైనది, మహాప్రస్థానం కవితా సంపుటిలోకి రానిది 'బాల్యం'. అది కల్యాణి పత్రికలో అక్టోబర్, 1933లో అచ్చయింది. ఏప్రిల్ 1934 కాలానికి యువ శ్రీశ్రీ విస్తృతంగా రాస్తున్నాడు. 'గంటలు' అనేది అనువాదం కాదు అంటూనే ఎడ్గార్ ఎలెన్ పో పేరు చెప్తూ అతని కవిత 'ది బెల్స్' తెలుగులో పరిచయం చేశాడు. ఆకాశ దీపం, మార్చి 1934లో, ఋక్కులు, అవతారం రెండు కవితలూ ఒకే రోజు ఏప్రిల్ 14నే రాశాడు. 'కవితా ఓ కవితా!' గీతం వెలువడ్డ 1937 ఈశ్వర నామ సంవత్సరం. శ్రీశ్రీ దర్శించి, విశాల లోకానికి దర్శింపచేసిన కవితేశ్వర తత్వం ఈ గీతంలో ప్రత్యక్షం అవుతుంది. ఈ సంవత్సరంలో ఏకంగా ప్రఖ్యాతమైన ఎనిమిది మహాప్రస్థాన గీతాలు శ్రీశ్రీ రాశాడు. (కవితా ఓ కవితా, మిథ్యావాది, వాడు, అభ్యుదయం, వ్యత్యాసం, ప్రతిజ్ఞ చేదుపాట, నవకవిత).

శ్రీశ్రీ మహాప్రస్థాన సంపుటి అచ్చయిన 1950 వికృతి నామ సంవత్సరం. అచ్చు కావడానికి దశాబ్దంన్నర ముందునుంచే ప్రఖ్యాతి పొందినా, 1950 వరకూ, మహాప్రస్థానం సంపుటిగా వెలుగులోకి రాలేదు. ఈలోగా, శ్రీశ్రీ తెలుగు కవుల్లోనే ప్రపంచ సాహిత్యం నుంచి అత్యధిక అనువాదాలు చేసి, తెలుగు సాహిత్యలోకానికి లోకపు వెలుగుల కిటికీలు తెరిచాడు. అందుకు ప్రధాన ఆధారం, ఆయన మూడో కవితా సంపుటి ఖడ్గసృష్టి. 1966 ఫిబ్రవరి అంటే విశ్వావసు నామ సంవత్సరంలో వచ్చింది. 'మైలమ భీమన ఖడ్గసృష్టికిన్' అని అంకితం ఇచ్చారు శ్రీశ్రీ. అటు అనువాదం, ఇటు ఆధునిక వచన కవిత్వం రెండంచుల పదును గల సంపుటి ఇది.

శ్రీశ్రీకి ఉగాది కవితలు అంటే ఇష్టమా? అంటే ఒక ప్రభవ ఉగాది నాడు తెలుగు కవిగా బొడ్డుకోత జరిగి ప్రవేశించిన అక్షరధీరుని ప్రస్థానంలో ఎక్కువ ఉగాది ప్రస్తావనలు, వారి మరణానంతర సంపుటిగా వెలువడ్డ మరో ప్రస్థానంలో కనిపిస్తాయి. ఉగాది పేరిట కవితల్లో వారు సమకాలీన రాజకీయ ప్రస్తావనలు చేశారు తన సహజ స్వభావానికి అనుగుణంగా. సాధారణ ఉగాది పచ్చడి, ఉగాది స్వగతాలు, రాక్షస ఉగాది, మట్టిపులి, పంచరత్నాలు, ఉగాది గీతం... ఇలా భిన్న ఉగాదులకు సాధారణ, కాళయుక్తి, నల, దుంధుభి, రాక్షస సంవత్సరాల్లో స్పందిస్తూ శ్రీశ్రీ రాసిన ఉగాది గీతాల కోటా మరో ప్రస్థానంలో ఎక్కువే కనిపిస్తుంది.

సినిమా పాటల విషయంలో కూడా మరో ప్రపంచం పాట – 1940లో విక్రమ నామ వత్సరంలో బందా కనకలింగేశ్వరరావు కోరస్ పాడిన గీతం కాగా, 1950లోనే శ్రీశ్రీ పాట డబ్బింగ్ 'హంస వలె నా పడవా' ఆహుతి సినిమాతో మొదలు శ్రీశ్రీ సినీకవితా ప్రస్థానం కూడా. సినీ కవిగా తన ఇన్నింగ్స్ మొదలైన ఏడాది అది వికృతి నామ వత్సరం. ఒక ప్రభవలో కవిగా మొదలై, అరవై ఏళ్ల సృజన కాలచక్రంలో 1983 దాకా విజయదుంధుభులు మోగించి, 1983 రుధిరోద్గారి నామ సంవత్సరంలో జూన్ 15, 1983న విశ్రాంతి తీసుకున్న కవిత్వ గండ భేరుండం, కవిత్వ గంధ మాదనం, ఎరుపు వన్నెలో కవిత కవితకో ఛాయ చూపిన సిందూర మందార తూర్పు పడమరల ఆకాశం- శ్రీశ్రీ. వారి మొదటి గీతం సమరాహ్వానం కాగా, చిన్న చిన్న రచనలు వదిలిపెడితే, ఆఖరుగా రాసిన పెద్ద రచన స్వర్గ భైరవం. 'నరకలోకపు జాగిలమ్ములు' అన్న 1934 నుంచి అవతారం దాల్చి 1893లో ఫ్రాన్సిస్ థాంప్సన్ రాసిన 'హౌండ్ ఆఫ్ హెవెన్' (గూటాల కృష్ణమూర్తి గారి కోరిక మేరకు) 'స్వర్గ భైరవం' పేరిట చేసిన అనువాదం దాకా, అటు పై ఓటో రెని కాస్టిల్లో అనే లాటిన్ అమెరికన్ గాటెమాలా కవి రచనలు రెండు చేసినా, క్షణమైనా ఆగని ఒక యాభై అయిదేళ్ళ అక్షర వ్యోమయాత్ర శ్రీశ్రీది. అక్షయ భావ నిధులు మనకి ఆస్తిగా వదిలి వెళ్లిన మహత్వ కవిత్వ పటుత్వ సంపదల సమృద్ధ ఖని శ్రీశ్రీ. శ్రీశ్రీ ఉగాదులు సమాజ ఉషస్సులు.

(ఏప్రిల్ 30 : శ్రీశ్రీ జయంతి)

– రామతీర్థ
98492 00385

సాహితీ వనంలో
ఆణిముత్యం శ్రీరంగం
శ్రీనివాసరావు
- నవయవ్వన కవిత్వాన్ని
ప్రతిఫలింపజేసిన కవి

అక్షర శ్రామికుడు

- శ్రామిక లోకానికి అక్షరం...
- కార్మికుల కష్టాన్ని కలంతో కళ్లకు కట్టిన ఘనుడు
- విప్లవ భావాలే ఆయన కలానికి బలం
- చలంతోబద్ధ కవిత్వాన్ని బంధ కోసి దాటిన వ్యక్తి
- శ్రీశ్రీ జీవితం తెరిచిన పుస్తకం
- అత్యున్నత శిఖరాలు, ఒడిదుడుకులు ఆయనతో పెనవేసి

నేడు శ్రీశ్రీ జయంతి

(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

శ్రీశ్రీ...సాహితీలోకానికి పరిచయం అక్కర్లేని పేరు. [illegible]

విలక్షణమైన భావాలు, విచిత్రమైన సంఘర్షణలు కలిగిన బహుముఖుడు శ్రీశ్రీ. ఒక్కోసారి చిన్నపిల్లాడిలా మారిపోయే ఆయనే కొన్ని సందర్భాల్లో ఘనాపాటీలను గుర్తుకు తెచ్చేవారంటారు సహచరులు. సిద్ధాంతాలు, సహచరుల విషయంలో ఆయన అభిప్రాయాలు వెంటవెంటనే మారిపోతుండేవని ఆయనను దగ్గర నుంచి గమనించిన వారు చెబుతారు. తన పెరా చక్రితో అందరాన్ని చుంబించిన ఆయన ఎన్నో ఒడిదుడుకులను కూడా తన జీవిత కాలంలో చవిచూశారు. 'కొన్ని స్వయం కృతం, మరికొన్ని సైద్ధాంతిక ప్రభావం, ఇంకొన్ని సాహితీ సంఘాలతో వచ్చిన విబేధాల వల్ల ఎదురైనవే' అని ఆయన అభిమానులు చెబుతుంటారు. పరిస్థితుల ప్రభావం ఎలావున్నా ఆయన కలానికి కాదు. మాటకూ పదును తగ్గేది కాదు. సాహితీ లోకంలో శ్రీశ్రీ అత్యున్నత శిఖరాలను చేరుకునేందుకు కారణం కూడా ఇదే అంటారు వారు.

శ్రీశ్రీ జీవిత ప్రస్థానం

శ్రీశ్రీ 1910 ఏప్రిల్ 30న మాధవపెద్ది వెంకటరమణయ్య, అప్పలకొండ దంపతులకు విశాఖలో జన్మించారు. [illegible]

'ప్రభవ'తో ప్రారంభం

[illegible]

ప్రముఖుల కలయిక...

[illegible]

గొప్ప రచనలు అనువాదం

[illegible]



'అహుతి'తో సినీ రంగంలోకి...

[illegible]

అవార్డులెన్నో...

[illegible]

గుర్తింపు ఏదీ..?

[illegible]

ప్రభావితమైనవారే..

[illegible]

విశాఖలో శ్రీశ్రీ నివాసం ఉన్న ప్రాంతం

శ్రీశ్రీ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

[illegible]

- రామతీర్థ, విశాఖ సాహితీ సంస్థ అధ్యక్షుడు

గురజాడ 'సొంత' ఇంటిని కూల్చేశారు

'కన్యాశుల్కం' నాటకంలో ఆఖర్న గిరీశాన్ని బయటకు నడవమంటాడు సౌజన్యారావు. ఆ మహామహుడి నూటయాభైవ జయంతి ఏదో అయిందంటే అయిందన్పించింది రాష్ట్ర ప్రభుత్వం. పనిలోపనిగా గురజాడకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణకు 4.88 కోట్లు (నాలుగు కోట్ల ఎనభై ఎనిమిది లక్షల రూపాయలు) గ్రాంటు చేస్తున్నట్టు ప్రకటించారు కూడా. ఇందులో ఒక పాతిక లక్షల వరకూ 21 సెప్టెంబరు 2012న అటు రవీంద్రభారతిలో జరిపిన పురస్కార మేళాలోనూ, కొంత రాష్ట్రంలోని యితర పట్నాలలో చేసిన కార్యక్రమాలకూ ఖర్చయి వుండచ్చు. మిగిలిన నాలుగున్నర కోట్ల సొమ్ము, ప్రభుత్వం గురజాడ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా వారి స్మృతిని సుసంపన్నం చేసుకునేందుకు కేటాయింపు చేసింది.

మరి ఎలా సుసంపన్నం చేసుకున్నాం? రెండు నెలల క్రితం, గురజాడ స్వయానా 1913-15 మధ్యకాలంలో కట్టుకుని, గృహప్రవేశం కూడా చేసిన యింటిని, ఆర్థిక యిబ్బందులవల్ల గురజాడకు నాలుగో తరం వారసులు అమ్మకానికి పెట్టగా, ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసి ఆ యిల్లు నేలమట్టం చేసారు. ఇల్లు అమ్మకం అయింది ఎనభై ఎనిమిది లక్షలకు. ఇదిలా జరగనున్నదని తెలిసే 2013 మేలో విశాఖపట్నంలో పత్రికా విలేఖరుల సమావేశంలో, ఆ కుటుంబ సభ్యుల ఆర్థిక అవసరాలను గుర్తిస్తూ, ఆ ఇల్లు గురజాడకు చెందింది కనుక, ప్రస్తుత స్మారక మందిరం అనే యిరుకు యిల్లుని ఆనుకుని వుంది కనుక, ప్రభుత్వమే తగు వెల చెల్లించి, ఈ జాతి సారస్వత మూర్తి స్మారక కేంద్రంగా మలిచేందుకు, తమ అధీనంలో వుంచుకోవాలని సాహిత్య సంఘాలన్నీ ముక్త కంఠంతో కోరాయి.

ఒక ప్రముఖ టీ.వి. ఛానల్ నిర్వహించిన చర్చావేదికలో, ఆ యిల్లు అసలు గురజాడ వారిది కాదనీ, వారిల్లు ఎప్పుడో స్మారక మందిరంగా మార్చామనీ జిల్లాకు చెందిన మంత్రివర్యులు, రాష్ట్ర పి.సి.సి. అధ్యక్షులు బొత్స సత్యనారాయణ అభిప్రాయపడగా, అది గురజాడవారు స్వయానా కట్టుకున్న యిల్లు అనీ, ఇంతకుముందు రాష్ట్ర ప్రభుత్వం, స్మారక మందిరంగా మార్చింది, వారు 1893నుంచీ నివసిస్తున్న పాత యిల్లు, ఒకప్పటి గుర్రాలశాల అనీ, వారికి అదే చర్చవేదికలో వివరించి చెప్పి, ఈ గురజాడ స్మృతి భవన పరిరక్షణకై సత్వర చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది. అందుకు వారు, అదే నిజమైతే, తప్పక రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇది ఆరునెలల కిందటి సంగతి.

ఈ ఏడాది నవంబరు వచ్చేసరికి అక్కడ ఖాళీ జాగా మాత్రంవుంది. ఆ ఇల్లు అమ్మకమై పోవడమూ, ప్రైవేటు వ్యక్తులు అర్జంటుగా నేలమట్టం చేయించడమూ జరిగిపోయాయి. పరిరక్షిస్తామన్న హామీలు, వాగ్దానాలు ఏమయ్యాయో తెలీదు. నాలుగున్నర కోట్ల రూపాయల నిధిని గురజాడ 150వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆయన స్మృతిని సుసంపన్నం చేసే లక్ష్యంతో వినియోగిస్తామన్న సొమ్మూ, కేటాయింపులు వాస్తవంగా జరిగాయో లేదో తెలీదు. అటు రాజధాని స్థాయిలో, ఇటు జిల్లా స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం గురజాడవారి ఇల్లుని పరిక్షించలేకపోయింది. పైపెచ్చు అది గురజాడ వారిల్లే కాదు పొమ్మనే వితండవాదాన్ని విన్పిస్తూ, పత్రికా, దృశ్యమాధ్యమాల వారికీ, ఆ దిశగానే వార్తా ప్రచారం జరుగుతోంది. ఇది పూర్తిగా అసత్యం. వారి డైరీలు, జాబులు- జవాబులు ప్రకారం, ప్రస్తుతం తాను వుంటున్న యిల్లు ఎంతటి యిరుకైనదో, గురజాడ వారే యిల్లు, పక్క స్థలం తన పేరున కొనుగోలుకు సమ్మతించమని, 7 ఫిబ్రవరి 1913న లేఖ రాసారు. ఆ యింటికి ప్రతి నెలా అయిదు రూపాయల అద్దె. గురజాడ ప్రతి సంవత్సరానికి రెండు మాసాల అద్దెను చెల్లించాలి.

''ఇల్లు చాలా పాతది. సదుపాయంగా వుండదు. ఇంటి నేల ఎత్తు, వీధి నేల ఎత్తుతో సమానంగా వుంటుంది. ఇంటి నేల ఎత్తు, రోడ్డు ఎత్తు, ఇంటి నేల ఎత్తుతో సమానంగా వుంచరాదని ప్రతి సంవత్సరం పురపాలక సంఘం కంట్రాక్టరుతో పోరాడవలసి వస్తుంది. పెరడు ఎత్తు రోడ్డు ఎత్తు కంటే తక్కువ. గదులు మూడే మూడు వున్నాయి. ఒకటి నేలమీద వున్న అంతస్తులోను, రెండోది మొదటి అంతస్తులోను వున్నాయి. నేను మొదటి అంతస్తులో వుంటున్నాను. నా అల్మారా, పుస్తకాల అరలు, రికార్డు పెట్టెలు బోల్డంత స్థలాన్ని ఆక్రమించుకున్నాయి. అందువల్ల కద

1914లో గురజాడ నిర్మించుకున్న సొంత ఇంటిని కూల్చివేసిన దృశ్యం.

స్మారక కేంద్రంగా కొనసాగుతున్న గురజాడ అద్దెకు ఉన్న ఇల్లు (పక్క చిత్రం)

లడానికి, మెదలడానికి స్థలం వుండడం లేదు. మా కుటుంబం ఒకరినొకరు దగ్గరగా వుండి నిద్రపోవాల్సి వస్తుంది. నేల మీద వున్న అంతస్తు పరిశుభ్రత లేని పరిస్థితిలో వుంది. ఇదికాక, వంట గది, భోజనాల గది, కొట్టు గది వున్నాయి'' - అని ఆ యింటి దుస్థితిని వివరిస్తూ, ఈ యింటిని తనకు అమ్మేయమని, అందుకు విజయనగరం సంస్థానంపై వేసిన పెద్ద దావాను విజయవంతంగా ఒడ్డెక్కించడంలో తన పాత్రకు గాను, తనకు సంస్థానం యివ్వ సంకల్పించిన సొమ్ములోంచి పదిహేను వందలు లేదా రెండువేలు, ఈ ఇల్లు పక్కనున్న స్థలం వెలగా మినహాయించుకోవలసిందిగా గురజాడ విజ్ఞప్తి చేశారు.

దీన్ని ఆలకనారాయణ గజపతి భార్య లలిత్‌కుమార్ సాహెబా (ఎవరి పెళ్లి జరపడంలో గురజాడ పెళ్లి పెద్ద పాత్ర పోషించాడో) తగు సిఫారసు చేయగా ఇక్కడ 1913 జూలై ప్రాంతంలో నిర్మాణాలు మొదలుపెట్టారు గురజాడ. ఈ ఇల్లు కట్టడపు పనులకు సంబంధించిన వివరాలు దినచర్యలో భాగంగా 17-7-1913 (దూలాల గురించి), 11-2-1914న (కొత్త నుయ్యి తవ్వింపు, అనకాపల్లిలో ఇటుకలు వగైరా), 26-5-1914 (మా ఇంటి దగ్గర వాచ్‌మన్) అంటూ నమోదు చేశారు. భాషా వివాదాలు, 1911 నుంచి మద్రాసు యూనివర్శిటీ బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో తెలుగు విభాగ సభ్యులలో ఒకరిగా, ఆరోగ్య సమస్యలు వారి సమయాన్ని ఆక్రమిస్తున్న కాలంలో, ఇంతకన్నా ఎక్కువ ఎంట్రీలు వారు తన ఇంటి కట్టడం గురించి రాయలేదు. కానీ, ఇల్లు పూర్తయింది. 1915లో గృహప్రవేశం చేశారు. అయితే అప్పటికే ఆయన ఆరోగ్యం చెడిపోయి వుండటంవల్ల, ఎక్కడ కొత్త ఇంట్లో కాలం చేస్తానో అన్న భయంతో, వారు పొరుగున వున్న పాత ఇంట్లో కొద్ది నెలలు జీవించి, 30 నవంబర్ 1915న కన్నుమూశారు.

ఈ నేపథ్యంలో గురజాడ స్మారక మందిరంగా మలిచామని రాష్ట్ర ప్రభుత్వం వారు చెపుతున్నది 1893నుండి అద్దెకు ఉంటున్న ఇల్లు. నివాసయోగ్యంగా మలచబడ్డ గుర్రాలశాల మాత్రమే. గురజాడ స్వయానా ఎంతో సాహిత్యాసక్తులతో కట్టుకున్న ఇల్లు కూడా పాతదానికి తోడుగా, విశాల స్మారక కేంద్రంగా మలచాల్సిన బాధ్యతను తుంగలో తొక్కి, అసలది గురజాడ వారిల్లే కాదనే వార్తా ప్రచారానికి, ప్రయోజనం పొందుతున్న వర్గాలు పాల్పడుతుంటే, ప్రభుత్వ యంత్రాంగం ఏమీ తెలియనట్టు వ్యవహరించడం శోచనీయం.

ఒక మహాకవి 150వ జయంతి తరుణంలో, వారు స్వయానా కట్టుకున్న ఇల్లు నేలమట్టం చేసిన ఖ్యాతి, ప్రపంచంలో ఒక్క తెలుగు జాతికే దక్కుతుంది. ఇరుగు పొరుగు జాతులవారూ, ప్రపంచంలోని ఎన్నో భాషా కుటుంబాలవారూ వారివారి ఉత్తమ రచయితల వారసత్వ చిహ్నాలను జాతి సంపదగా కాపాడుకుంటున్నారు. తెలుగువారి తీరూ, తెలుగు ప్రజల ప్రభుత్వాల తీరే ఇందుకు పూర్తిగా విరుద్ధంగా వుంది.

ఇప్పుడా ఇల్లు నేలమట్టం చేసిన ప్రైవేటు వ్యక్తులు, మనం కన్నుమూసి తెరిచేలోగా అక్కడ కమర్షియల్ కాంప్లెక్సులు నిర్మాణాలు మొదలుపెడతారు. గురజాడ స్మారక మందిరంగా, బిక్కు బిక్కుమంటూ పక్కనున్న పాత కట్టడం వారి లేఖ కాలం నాటికే అరవై ఏళ్ల కిందటిదంటే, ప్రస్తుతం నూట అరవై ఏళ్లుగా అప్పటి కట్టడపు పద్ధతైన రాతికట్టు పునాది కింది, బలహీనమయిన నిర్మాణం కొన్ని అడుగుల దూరంలో, ఆధునిక పద్ధతులలో లోతులకు తవ్వుతూ, పిల్లర్లు వేస్తూ, బోర్‌లు వేస్తూ, మల్టీప్లెక్స్‌లు నిర్మిస్తే, వీటి తాకిడికి అది ఆగుతుందా?

అసలు జాతి స్మారక చిహ్నంగా ప్రకటితమైన ఒక ప్రాచీన కట్టడాన్ని కొన్ని అడుగుల దూరంలోనే, ఎవరయినా వ్యాపార నిర్మాణాలు అనుమతిస్తారా? వీటి తాకిడికి, రేపు ఆ బలహీనమయిన ఇల్లు, గురజాడ స్మారక భవనంగా, ఏదో తూతూ మంత్రంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నది, దానంతటదే నేలకూలిపోతే ఎవరు బాధ్యులు? అలా జరగకుండా సత్వరమే నిరోధక చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ శాఖలు ఏం చేస్తున్నాయి?

ఈ ఒక్క చిహ్నమూ కూడా కూలిపోతే, యిక గురజాడకు చెందిన అన్ని స్మృతి చిహ్నాలూ అంతరించిపోయినట్టే. మన ప్రభుత్వ యంత్రాంగపు నిర్వ్యాపారతతో, ప్రజల ఉదాసీనతతో అటువేపే అడుగులు వేస్తామా? లేక గురజాడ కట్టుకున్న యింటి స్థలాన్నీ, వారు ఎక్కువ కాలం అద్దెకున్న, ఆఖరు వత్సరాలలో వారి స్వంతమయిన పాత యింటినీ, పోగొట్టుకుని సాంస్కృతికంగా పేదవారమౌతామా? ఇలా చూస్తూ ఊరుకుంటే, రేపు కొన్నాళ్ళలో, భారీ కట్టడాల తాకిడికి కూలిపోబోయే గురజాడ వారిల్లు వేస్తున్న ప్రశ్నలివి!!

ప్రైవేటు వ్యక్తులనుంచి, అర్జంటుగా ఆ స్థలాన్ని, తగు మార్కెట్ విలువలు చెల్లించి, గురజాడవారు స్వయానా కట్టుకున్న యిల్లు, స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో పరిరక్షించాలి. ఈ విపత్తునొక సాంస్కృతిక అత్యయిక దశగా గుర్తిస్తూ, జాతి వారసత్వ సంపదను కాపాడడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూనికతో చర్యలు తీసుకోవాల్సిందిగా, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమాజం ఒక్క గొంతుతో కోరుతున్నది.

- రామతీర్థ, 9849200385

శత వర్ధంతి వైతాళికుడు గురజాడకు నివాళిగా ప్రపంచంలోనే "తొలి కథా స్తూపం"

రామతీర్థ
9849200385

"తలుపు, తలుపు" అంటూ ఫిబ్రవరి 1910లో తొలి తెలుగు ఆధునిక కథ, మన సాహిత్యంలోకపు తలుపులు తట్టి లోపలికి వచ్చింది. ఈ నూటా అయిదు ఏళ్లలో వేలాది కథలు, వందలాది రచయితలు, కథా లోక పౌరసత్వం తీసుకున్నారు. కథలకు ప్రపంచ స్థాయి గౌరవాలు తీసుకు వచ్చారు. అయినా గురజాడ వారి తొలి తెలుగు ఆధునిక కథ, కథకులకు, తెలుగు కథా లోకానికి ఎన్ని విశాలమైన శుభాకాంక్షలు తీసుకు వచ్చిందో గానీ, ఇరవయో శతాబ్దం, కథల శతాబ్ధంగా తెలుగు సాహిత్యంలో నిలబడ్డది. ఆధునిక తెలుగు కథా రూప శిల్పుల్లో ఒకరైన కారా మాస్టారు, గురజాడ వారసత్వ వికాసంలో భాగంగా శ్రీకాకుళంలో పద్దెనిమేళ్ల ముందరే "కథా నిలయం" ఏర్పాటు చేశారు. లక్షకు పైగా కథలు సేకరించారు. గురజాడ నూట యాభైవ జయంతి సందర్భంగా, అంతకు ముందర కొన్నేళ్ల నుంచీ, తొలి తెలుగు కథినిక, భండారు అచ్చమాంబ గారు రాసిన "ధన త్రయోదశి" గానూ, ఇంకొన్ని కథలలో, ఆచంట సాంఖ్యయన శర్మ రాసిన "లలిత" వగైరాలపై కొంత నూతన దృష్టి కోణాలు వెలుగుచూశాయి. ఈ ఆలోచనలకు ఒక నిండు రూపంగా ఇటీవల వివిన మూర్తి, వాసిరెడ్డి నవీన్ ప్రభృతులు కలిసి, దిద్దుబాటుకు ముందర 91 కథలను ఒక చోట చేర్చి, "దిద్దుబాటలు" పేరిట, తానా ప్రచురణగా తీసుకు వచ్చి, ఆ పుస్తకంలో, కూడా ఈ 91 కథా ప్రయత్నాలూ కూడా, వివిధ దశల్లో కథ రాసేందుకు 1880 నుంచీ జరిగిన ప్రయత్నాలని చెప్తూ, ఈ కథలు తేల్చేదేమంటే, గురజాడ కథ వీటన్నిటి కన్నా, సంపూర్ణంగా కథానిక లక్షణాలు కలిసి ఉందని తీర్మానించారు. ఈ "దిద్దుబాబు" కథ, తమ కొత్త కాపురంలో ఒక తెలివైన భార్య, తన భర్త, కొంచెం దారి తప్పి వేశ్యావాటికలకు వారి నృత్యాలు చూసేందుకు ఆకర్షితుడై వెళ్లడానికి అలవాటు పడ్డ వ్యక్తిని, చాకచక్యంగా తిరిగి తన దారికి తెచ్చుకోవడం, ఇతివృత్తంగా, కేవలం ఏడు వందల పదాల పైచిలు గల పరిమితిలో రాసిన కథ. గురజాడ ప్రధాన ఆలోచన అయిన స్త్రీ విద్యా వికాసాలు, గురజాడకు ముందరి రచనలు అయిన ఈ 92 కథల్లో ఎక్కువగా కనిపించడం ఒక విశేషం. ఈ "దిద్దుబాటు" కథను గురజాడ మొదట కొంత గ్రాంధికంలో రాసినా, దానితో తానే తృప్తి చెందక, తిరిగి రెండోసారి కూడా ఈ కథను రాశారు. వ్యవహారిక భాషలో రాయడం ఎంత కష్టసాధ్యంగా, ఆనాడు ఒక రూపాన్నితీసుకుందో, దానికై, తన నాటకాన్ని, తన కథానికను తిరిగి రాసి ఆ వ్యవహారిక భాష ఒక సాహిత్య భాషగా, భేషుగ్గా పనికి వస్తుంది అని నిరూపించడం కూడా, గురజాడ వారి సాధనా, తన కథానికను తిరిగి రాసి ఆ వ్యవహారిక భాష ఒక సాహిత్య భాషగా, భేషుగ్గా పనికి వస్తుంది అని నిరూపించడం కూడా, గురజాడ వారి సాధనా, ఏర్పర్చుకున్న లక్ష్యాల్ల ఒకటిగా మనం అర్థం చేసుకోవచ్చు. ఈ తొలి తెలుగు కథానిక దూరదర్శన్ వారి లఘు చిత్రం అయ్యింది. అట్టాడ సృజన్ చేతిలో ఒక బడ్జెట్ కథానికా చిత్రంగా రూపొందింది. రేడియో నాటికగా "సావిరహే తవధీరా" అంటూ ప్రసారం జరిగింది. ఇంకా ఎక్కడెక్కడో నాటికగా మలచబడి ప్రదర్శనల ద్వారా పలు ప్రాంతాల ప్రజలకు అందింది. ఇప్పుడు, ఈ శత వర్ధంతి కాలంలో, ఇంకొక కొత్త అడుగుగా, ఎస్. రాయవరం నుంచి ఒక కథా స్తూపంగా నిలబడి, తెలుగువారికి గర్వ కారణం అయిన ఒక సాహిత్య పర్యాటక ప్రాముఖ్యతను సంతరించుకోనున్నది.

గురజాడ వారి శత వర్ధంతి ఈ నవంబర్ 30న జరగబోతున్నది. గురజాడ జన్మించి, జీవించి, కార్య క్షేత్రంలో పనిచేసి, రచయితగా కొత్తదారులు వేసి, విజయనగరం సంస్థానానికి విలువైన సేవలు అందించి, వెళ్లిపోయింది ఈ విశాఖపట్నం జిల్లాలోనే. వారి జన్మస్థలం సర్వసిద్ధి రాయవరం (ఎస్. రాయవరం), వారు కన్ను మూసినది విజయనగరం, రెండూ 1915 నాటికి విశాఖపట్నం జిల్లాలోనే ఉన్నాయి. తరువాత ఏర్పడ్డవే, తొలుతగా శ్రీకాకుళం, తదుపరి విజయనగరం జిల్లాలు. అలాగే విశాఖపట్నం జిల్లా వారి జీవితపు భౌతిక అస్తిత్వానికి ఒక చిరునామా. ఆ కారణంగా గురజాడ వారి స్మృతి మరింత అజరామరం కావడానికి, రానున్న తరాలకు ఒక స్ఫూర్తిగా భాసించడానికి, కృషి చేయవలసిన బాధ్యత మన విశాఖలోని సాంస్కృతిక సాహిత్య రంగాలకు అందరికన్నా ఎక్కువగా ఉన్నది.

అందులో భాగంగానే, ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా "తొలి తెలుగు ఆధునిక కథానికా స్తూపం" ఏర్పాటును ఈ శత వర్ధంతి సందర్భంగా ఎస్. రాయవరంలో, గురజాడ పుట్టిన చోట ఏర్పాటు చేసేందుకు సంకల్పించడం జరిగింది. ఈ ప్రణాళికలో భాగంగా ఒక నమూనా నిర్మాణం ఈ నవంబర్ 30న ఎస్ రాయవరంలో ఏర్పాటు చేసేందుకు సకల సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఆ వూరికి దగ్గరిలోని ఎలమంచిలిలో, ఇవాళ సాహితీ స్రవంతి, అనేక సంస్థలతో కూడి ఏర్పడ్డ "గురజాడ శత వర్ధంతి సంఘం" సారధ్యంలో ఒక పూర్వ రంగ సభా కార్యక్రమం కూడా జరుగుతున్నది. ఈ కథానికలో ఉన్నవి రమారమి ఏడు వందల మాటలే కనుక, ఈ మొత్తం కథానికను గ్రానైట్ ఫలకాలపై చెక్కించి, నలు పలకల స్థపంపై నిలబెట్టి, కథా స్థూపాన్ని ఏర్పాటు చేయాలన్నది ఖరారు అయిన ఆలోచన.

ఏ రచయిత రచనకూ ఇలా స్థూప నిర్మాణ గౌరవం, ఇంతవరకూ ప్రపంచంలో లేదు. తన జీవిత కాలంలో కేవలం నాలుగు కథలు తెలుగులో, ఒక కథానిక 1902 నాటికే ఆంగ్లంలో రాసిన, గురజాడకు, వారి ఆలోచనలకు ఇదొక సముచిత, సమున్నత నివాళి, ఈ నవంబర్ 29, 30 తేదీలలో, విశాఖపట్నంలో 29న, శతవర్ధంతి ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ సభలు, పుస్తక ఆవిష్కరణలుగా సభ నిర్వహిస్తూ, వారి శత వర్ధంతి అయిన 30.11.2015 ఉదయం 11 గంటలకు, దేశ భక్తి గీతాలాపన రాష్ట్ర వ్యాప్తంగా ఒక సామూహిక స్వరాభివందనంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి సమన్వయానికి నడుం కట్టింది.

ఏ రచయిత రచనకూ ఇలా స్థూప నిర్మాణ గౌరవం, ఇంతవరకూ ప్రపంచంలో లేదు. తన జీవిత కాలంలో కేవలం నాలుగు కథలు తెలుగులో, ఒక కథానిక 1902 నాటికే ఆంగ్లంలో రాసిన, గురజాడకు, వారి ఆలోచనలకు ఇదొక సముచిత, సమున్నత నివాళి, ఈ నవంబర్ 29, 30 తేదీలలో, విశాఖపట్నంలో 29న, శతవర్ధంతి ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ సభలు, పుస్తక ఆవిష్కరణలుగా సభ నిర్వహిస్తూ, వారి శత వర్ధంతి అయిన 30.11.2015 ఉదయం 11 గంటలకు, దేశ భక్తి గీతాలాపన రాష్ట్ర వ్యాప్తంగా ఒక సామూహిక స్వరాభివందనంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి సమన్వయానికి నడుం కట్టింది. అదే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు మొదలయ్యే సభో రాయగడ, భిలాయ్, హైదరాబాద్ వంటి పొరుగు రాష్ట్రాల నగరాల నుంచి వచ్చే సాహిత్య వేత్తలతో గురజాడ నేటి అవసరం గా చర్చా గోష్టి, దానితో బాటు నూటా ఇరవై మూడేళ్లలో తొలిసరిగా కేవలం మూడు గంటల నాటకంగా సంక్షిప్తీకరించిన చాట్ల శ్రీరాములు ముందు మాటతో వెలువడుతున్న కన్యాశుల్క నాటక రూపకం ఆవిష్కరణ, చోటు చేసుకుంటాయి. విశాఖపట్నానికి చెందిన సాంస్కృతిక రంగపు కళాకారులు, దర్శకులచే ప్రముఖ ప్రయోక్త భళ్ళమూడి రామమూర్తి దర్శకత్వంలో ఈ వ్యాసకర్త రచించిన సాంస్కృతికాంజలి జెండాపై గురజాడ సమర్పణ, ఈ సభలో ముఖ్య ఆకర్షణ. ఈ సందర్భంలోనే మనం తెలుసుకోవలసిన మరొక ముఖ్య వార్త, ఏడు వందల పేజీలకు మించిన కన్యాశుల్క నాటకం 19వ శతాబ్దపు భారతీయ భాషా నాటకాలు పైడా, యు.ఏ.నరసింహమూర్తి గారి రచన హిందీ అనువాదం కూడా ఈతరుణంలో తయారై ఆవిష్కరణకి సిద్ధంగా ఉన్నది. దీని ఆవిష్కరణ సభ సమీప భవిష్యత్‌లో జరుగబోతున్నది. ఇది వెలుగు చూడడానికి పూర్తి సహాయం అందించి బాసటగా నిలిచిన వారు విజయ్ నిర్మాణ్ సంస్థ అధ్యక్షులు ఎస్.విజయకుమార్ గారు కావడం ఒక విశేషం.



ఈ కార్యక్రమాలను నవంబర్ 2016 వరకూ కొనసాగించడం, వాటిలో భాగంగా గురజాడ కథా స్థూపం దీటుగా ఆయన పుట్టిన ఊరు ఆయన ఎస్.రాయవరంలో వచ్చే నవంబర్‌లోగా ప్రతిష్టాపించడం విజయనగరంలో వారి స్మృతి భవనాన్ని పూర్తి స్థాయి హంగులతో ప్రభుత్వం అందుకై ప్రకటించిన నిధులను సద్వినియోగం సకాలంలో జరిగేలా తగు చర్యలు తీసుకోవడం కూడా వచ్చే నవంబర్‌లోగా గురజాడ స్మృతిని మరింత పర్యాప్తం చేయడంలో జరగవలసిన ముఖ్యాంశాలు. లోకమందలి మంచి చెడ్డలు లోకులెరుగుదురా? అని ప్రశ్నించి, ఆ ప్రశ్నకు తన జీవితమే జవాబుగా లోకమండలి మంచి చెడ్డలు లోకులకు రచయితలు, కళాకారులే చెప్పాలన్న ఒక సువిశాల బాధ్యతను తాను పాటించి, తన ముందు తరాలకు విడిచి వెళ్ళిన గురజాడ, లౌకిక దర్శన శక్తి పుష్కలంగా గల ఒక లోక ప్రేమికుడు. దేశమును ప్రేమించుమన్నా అంటూ ఒక మహోపదేశం చేసిన ఒక ప్రజా పక్ష ఆచార్యుడు. మంచి గతమున కొంచమెనోయి అని హెచ్చరిస్తూ మంచి అన్నది పెంచుమన్నా, అనే ప్రబోధం వెనకాల, కాగల కార్యాలు ఏ గంధర్వులూ తీర్చరు. మానవులే ఆకార్యాలు నిర్వహించుకోవాలి అని చెప్పడం ద్వారా, మూడు యాభైలు దాటి, అనంత కాలంలోకి జీవిస్తున్న చిరంజీవి గురజాడ, మహోన్నత మానవ మహాయుగాలకు మార్గ దర్శకుడు. అందుకే, ఆయనకు ఈ గౌరవాలు.

రుగ్మతలను రూపుమాపిన గురజాడ

విశాఖపట్నం, నవంబర్ 30, (ఆంధ్రజ్యోతి): సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు గురజాడ అప్పారావు చక్కని రచనలు చేశారని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. విశాఖలోని సాహితీ సంస్థల ఆధ్వర్యంలో సోమవారం ఏయూ అసెంబ్లీ హాలులో నిర్వహించిన గురజాడ శత వర్ధంతి కార్యక్రమంలో 'గురజాడ-నేటి అవసరం' చర్చాగోష్ఠిలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంతకుముందు ఆయన కన్యాశుల్కం సంక్షిప్తీకరణ నాటక రూపాన్ని, శ్రీరాములు రచించిన 'శ్రీరాములు సాహిత్య వ్యాసాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచనలు చాలా తక్కువ చేసినప్పటికీ వందేళ్ల తరువాత కూడా గురజాడ గురించి చర్చించుకుంటున్నామంటే నేటి సమాజానికి ఆయన అవసరం ఎంతుందో తెలుస్తుందన్నారు. సమాజ అవసరాల దృష్ట్యా అప్పటి కంటే ఇప్పుడే గురజాడ ఆవశ్యకత వుందన్నారు. మనుషులంతా సమష్టిగా ఉండాలన్న ఆయన మనోభావం గొప్పదని సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. కన్యాశుల్కం నాటకాన్ని తొమ్మిది గంటలపాటు కాకుండా కేవలం మూడు గంటల్లోనే ప్రదర్శించేలా రామతీర్థ సంక్షిప్తీకరించడం హర్షణీయమన్నారు.

సభాధ్యక్షుడు, ప్రముఖ అనువాదకుడు ఎల్.ఆర్.స్వామి మాట్లాడుతూ నాటికి...నేటికీ బాహ్యమైన మార్పులే వచ్చాయని, మనిషులు అంతర్గతంగా అప్పటి మాదిరిగానే వున్నారన్నారు. అందుకే నేటికీ గురజాడ రచనలు అవసరమన్నారు. గురజాడ తన రచనల్లో తనకున్న అసంతృప్తిని వ్యక్తం చేశారని, మనుషులు మారడం లేదనే అసంతృప్తిని పాత్రల్లో కూడా చూపించారన్నారు. నేటికీ ఆయన చూపిన 'గిరీశం'లు ప్రతి చోటా కనిపిస్తారన్నారు. దిద్దుబాటులో సర్వజ్ఞతో గోపాలరావు అన్నమాటలు 'నీ కూతురు బడికి వెళుతుంది కదా.. నీకు చదువు విలువ తెలుస్తుంది' అనే మాటలు.. మదం విమదం లోని 'దేవుళ్ళకు ఏ పాట్లు లేవు.. మనకే సాపాట్లు' అనే మాటలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. అంతకుముందు గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ప్రముఖులు నివాళులు అర్పించారు.

అనంతరం 'పేరం జయశీలరావు అధ్యక్షతన ఆత్మీయ స్పందనలు, 'జెండాపై గురజాడ' ప్రత్యేక సంచిక విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే జగద్ధాత్రి అధ్యక్షతన 'కన్యాశుల్క నాటక రూపక చర్చాగోష్ఠి'ని చేపట్టారు. చివరిగా విజయనగరం గురజాడ విద్యాసంస్థల ఆధ్వర్యంలో 'వందేళ్ళ గురజాడ' అనే నృత్యరూపకం, భళ్లమూడి సారథ్యంలోని శత వర్ధంతి వైతాళిక మూర్తి గురజాడకు నిత్య నూతన సాంస్కృతికాంజలి 'జెండాపై గురజాడ' వంటి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో రమణమూర్తి, మాటూరి శ్రీనివాసరావు, ఏవీఆర్ మూర్తి, చలసాని కృష్ణప్రసాద్, సీఎస్‌రావు, రామరాజు విశాలాక్షి, మల్లీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అప్పటికంటే ఇప్పుడే ఆయన అవసరం ఎక్కువ

వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

పుస్తకావిష్కరణ చేస్తున్న జేవీ సత్యనారాయణమూర్తి, రామతీర్థ, శ్రీరాములు తదితరులు

మహా.. అనేది చాలా విస్తృతమైన పదం

మహాకవి అనేది చాలా విస్తృతమైన పదం. మహాకవి కాళిదాసు, మహాత్మాగాంధీ, మహాకవి గురజాడ అని పిలుస్తాం.. గతాన్ని మూల్యాంకరణ చేసి వర్తమానాన్ని పరిశీలించి భవిష్యత్తుకు బాటలు వేసేవారు వారే.. వారే దార్శనికులు. వారినే మహా అని సంబోధిస్తాం.. గురజాడ కళాశాలలో బాగా సం స్కృతం చదువుకున్న గొప్ప పండితుడు.. చరిత్ర కూడా అంతే బాగా చదివారు.. తత్వశాస్త్రాన్ని బాగా అధ్యయనం చేశారు. నాలుగోది ఆంగ్ల సాహిత్యాన్ని ఆకలింపు చేసుకున్నారు. ఈ నాలుగు అంశాలు కలిసి ఆయన పాండిత్యానికి పునాది. 'మంచి గతమున కొంచెమేనోయ్' అన్నారు. గతంలో అసమానత్వం, అర్థం పర్థం లేని పరిమితులు విధించారు. మహా భారతంలో శకుంతల.. దుష్యంతుడి సభకు వెళ్లి చెబుతోంది.. నీవు అసత్యవాదివి.. నన్ను మోసం చేశారు. నా బిడ్డను విడిచిపెట్టావు.. కాబట్టి నీలాంటి వాడితో వుండడం యుక్తం కాదని చెప్పి వెళ్ళిపోతుంది.. అది మంచి. అటువంటి మంచి గతంలో కొంతే వుందని గురజాడ అభిప్రాయం.. అంత స్వేచ్ఛగా మహిళ నిర్ణయాలు తీసుకున్న సందర్భాలు మన గతంలో చాలా తక్కువ.

-కె.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఏయూ ప్రొఫెసర్

గురజాడకు దొరలూ స్నేహితులే..

గురజాడకు దొరల్లో కూడా చాలా మంది స్నేహితులున్నారు. దొరలంతా దుర్మార్గులు కాదు.. నియంతలు కాదు.. అందులో చాలామంది మంచివారున్నారు. అందరూ సమానమనే వారున్నారు. స్వేచ్ఛనిచ్చేవారున్నారు. అటువంటి వారే గురజాడ స్నేహితులు. ఎన్ని యుద్ధాలు చేసిన వారున్నా.. ఎన్ని పోరాటాలు చేసిన యోధులున్నా, ఎన్ని రాజ్యాలు ఎంత గొప్పమంది ఏలినా..కూడా మనకు తెలిసిన రెండువేల ఏళ్ల చరిత్రలో మనం ఆదర్శంగా తీసుకోగలిగింది కేవలం రెండువందలు మందినే. అందులో గురజాడ ఒకరు. 'దేవుళ్లారా మీ పేరేమిటి'లో ఆయన తన అసహనాన్ని వ్యక్తం చేస్తారు.. అందరూ దేవుళ్లు ఒకటైతే వారందరికీ ఒకే దగ్గర పూజా పునస్కారాలు తగలెట్టండని. ఈ రోజు ఒక దినపత్రిలో చదివాను.. ఓ అమ్మాయి గుడిలోకి వెళ్లి పూజలు చేసి వస్తే .. ఆ విగ్రహాన్ని అభిషేకాల ద్వారా శుద్ధి చేశారట.. గురజాడ నాటి కాలంలోనే కాదు.. నేడు కూడా ఇటువంటివి వుండడమే గురజాడ అవసరం నేటి సమాజానికి వుందనేందుకు నిదర్శనం. ఎక్కువ.. తక్కువ భేదాలకు గురజాడ వ్యతిరేకి.. ఆయనకు కమ్యూనిజం ఏమీ నేర్పలేదు.. కమ్యూనిజానికే గురజాడ చాలా నేర్పారు.

-రామతీర్థ, రచయిత

గురజాడ కృషిని మరువలేం..

-ఆనందరావు పట్నాయక్,
రాయఘడ రచయితల సంఘం అధ్యక్షులు

గురజాడ అప్పారావు చేసిన కృషి వల్లే ఇప్పుడర మనం వ్యవహారిక భాషలో హాయిగా చదువుకునే అవకాశమొచ్చింది. వేరే భాషా రాష్ట్రంలో వున్నప్పటికీ మా పిల్లలను తెలుగు మీడియంలోనే చదివించాను. అందుకే నాకు, మా పిల్లలకు ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్... గురించి తెలియడం లేదు. పర్లాకిమిడిలో రాజులతో వివాదంతో గిడుగువారు విజయనగరం వచ్చి చాలారోజులు మహాకవి ఇంట్లో వున్నారు.

రాజుగారి అబ్బాయి కి చదువు చెప్పేవారు. వీరిరువురితో పాటు కందుకూరి కలిసి వ్యవహారిక భాషపై ఉద్యమించారు. మేము రాయగడలో రారస (రాయఘడ రచయితల సంఘం) నడుపుతున్నాం. ఏటా గురజాడ జయంతిని నిర్వహిస్తాం.. పిల్లలకు పలు అంశాలపై పోటీలు పెడతాం. గురజాడపై పెట్టిన ఓ పరీక్షా సమయంలో ఓ విద్యార్థిని ఒక సందేహాన్ని వ్యక్తం చేసింది. సార్.. దేశం అంటున్నారు. ప్రేమ అంటున్నారు. ఇలా ప్రేమ అనే వాటిపై రాస్తే మా తల్లిదండ్రులు ఒప్పుకోరని చెప్పింది. అంటే ప్రేమ అనే పదాన్ని అశ్లీలంతో కూడినదిగా అర్థం చేసుకుంటున్నారు పిల్లలు. వారిలో పరివర్తన తీసుకురావాల్సింది తల్లిదండ్రులే.

మహాకవి ప్రతిభకు కొలమానం లేదు

గురజాడ ప్రతిభకు కొలమానం లేదు. దేనితోనూ ఆయన ప్రతిభా పాటవాలను కొలవలేం. ఆయన రచనలను ఎంతోమంది క్రిటికల్ రియలిజమ్ అన్నారు. మరికొందరు రియలిస్ట్‌లో రియలిస్ట్ అన్నారు. ఆయన ను పొగిడేందుకు మనకేం అర్హత ఉంది. ఆయన రచనలను విశ్లేషించండి.. మతతత్వం పెరిగి, కులతత్వం పెరిగి, పరాయిపాలనలో నలిగిపోతున్న సమయంలో వేగుచుక్కలా ఉదయించారు గురజాడ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, భారతప్రభుత్వానికి గురజాడ గురించి పట్టకపోవడం బాధాకరం. బిలాయ్‌లో మేము 30 ఏళ్లుగా గురజాడ వర్ధంతి నిర్వహిస్తున్నాం.. ఆయనలో రచనల్లో నేనో అంశాన్ని ఎత్తి చూపాలనుకుంటున్నాను. శ్రీకాకుళం పల్లెల్లోకి వెళితే.. ఎంతో చక్కటి మాండలికాలు.. ఆయన మాండలికాలు ఇంకా బాగా చెప్పలేదు. దానికి కారణం ఆయన ఎంచుకున్న ఇతివృత్తమే..

-గూడ శ్రీరాములు (బిలాయ్), రచయిత

రచనల్లో వాస్తవికత ఎక్కువ

గురజాడ రచనలు తక్కువ.. అందులో వాస్తవికత ఎక్కువ. కన్యాశుల్కం రెండు బ్రాహ్మణ కుటుంబాల కథ. ఒకరు చాందసవాది అయితే. మరొకరు లుబ్ధి. కన్యాశుల్కానికి సమానమైన రచన మరొకటి లేదు. అది సార్వజననీయమైనది. అందులో చాలా సామాజిక అంశాలున్నాయి.. గిరీశం అంటే కేవలం ప్రేమించి మోసం చేసిన వాడనే కాదు.. మోసానికి ఆ పాత్ర రూపం.. ఇప్పుడు కూడా చాలామంది గిరీశంలు కనిపిస్తుంటారు. మనుషులు కులాలు, మతాలుగా విడిపోకూడదన్నది గురజాడ అభిమతం. సమష్టిగా వుండాలనే గురజాడ కోరుకున్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను కూడా విశ్లేషించారాయ న. రాబోయే కాలంలో మహిళలు ఎలా ఉండాలో చెప్పారు. కందుకూరి కార్యవాది అయితే ఈయన ఆదర్శవాది..

-డి.వి.సూర్యారావు, రచయిత

నాటకం

సంక్షిప్త సుందరంగా 'కన్యాశుల్కం'

కొండను అద్దంలో చూపించవచ్చు. ఐతే అది అద్దం యొక్క పరిమాణం, కొండకీ అద్దానికీ మధ్యగల దూరం మీద ఆధారపడి ఉంటుంది. తెలుగు నాటక సాహిత్యంలో గురజాడ అప్పారావు గారి కన్యాశుల్కం ఒక బంగారుకొండ అని నాటక లాక్షణికులు చెప్పి ఒప్పించారు.

ఎన్నో గంటలపాటు సాగే ఆ నాటకాన్ని కొన్ని గంటల్లో కచ్చితంగా అంటే రెండున్నర, మూడు గంటల్లో ప్రదర్శించేందుకు సంక్షిప్తీకరించారు రామతీర్థ. ఇదే కొండను అద్దంలో చూపించడం అంటే! అద్దం పరిమాణం ఎంతంటే ... ప్రస్తుత కాలపు నాటకం నిడివంత. కొండకీ అద్దానికీ మధ్యగల దూరం ఎంతంటే.. ప్రస్తుత సామాజికుడు నాటక వీక్షణకి వెచ్చించగల సమయమంత. ఎక్కడైనా నాటకం గురించి చర్చ వచ్చిన సందర్భంలో కన్యాశుల్కం ప్రస్తావన వచ్చి తీరుతుంది. ఎందుకంటే సమగ్రమైన నాటక రచనకి అదో తిరుగులేని ఉదాహరణ. వందేళ్ళ క్రితం సమాజం పోకడ చూసి విసుగొచ్చిన గురజాడ సమాజపు మొహాన వెలిసిపోని రంగుతో రుద్దిన వెటకారం ఆ నాటకం.

కాలం గడిచింది. జనం వాళ్ళ భావనలో ఆధునికులయ్యారు. వాళ్ళ ఆలోచనలు, జీవనం వాళ్ళ ఉద్దేశంలో ప్రగతిశీలకం అయ్యాయి. వృత్తుల్లోనే కాదు ప్రవృత్తుల్లో సైతం పైకెదిగాం అనుకొంటుంటారు. అలా ప్రవర్తిస్తుంటారు. కానీ మార్పు వచ్చిందా లేదా అన్నది తెల్సుకోవాలంటే, అప్పటి చిత్తవృత్తుల్ని ఎత్తిచూపే కన్యాశ్కులం చూడాలి. అప్పటిలా కాకుండా ప్రస్తుతం ఉన్నామా లేమా అన్నది బేరీజు వేసుకోవాలి. కానీ ప్రస్తుత జీవన వ్యవస్థలో నాటకానికి ఎంత సమయం కేటాయించగలడు మనిషి? ఓ రెండున్నర గంటలు. ఆ రెండున్నర గంటలలోపే కన్యాశుల్కాన్ని ప్రదర్శించేలా సంక్షిప్తీకరించాలి. ఆ పనిని విజయవంతంగా పూర్తి చేశారు రామతీర్థ. తన సమర్థతని ఒక గొప్ప ప్రయోజనం కోసం వినియోగించాడు. గురజాడను ప్రేమించే మనమంతా రుణపడిపోయేలా చేసాడు. దాంతో బాటే తనకో ఆస్తిత్వాన్నిచ్చిన తెలుగుతల్లి రుణం తీర్చుకున్నాడు.



ఇకపోతే ... 'జెండాపై' పద్యం లేకుండా 'రాయబారం' లేదు. 'ఇచ్చోటనే' లేకుండా 'హరిశ్చంద్ర' లేదు. ఇలా చెప్పుకొంటూపోతే ప్రతి ప్రసిద్ధ నాటకంలోనూ విశేషంగా ప్రజాదరణ పొందిన సన్నివేశాలు, సంభాషణలు ఉంటాయి. ఇక్కడ గ్రీకు కోరస్ గురించి ప్రస్తావించాలి. గ్రీకు నాటకంలో మొదట్లో 50 మంది బృందగాయకులు ఉండేవారు. తర్వాత అది 15 మందికి కుదించడం జరిగింది. తర్వాత ఐదుగురికి కుదించడం జరిగింది. ఇప్పుడు అనే Jean Anouilh అనే ఫ్రెంచి రచయిత 'one man chorus'గా గ్రీకులో 'Sophocles' యొక్క 'Antigone' నాటకాన్ని ఆధునీకరించి నాటకంగా రాసి మన్ననలు పొందాడు. గ్రీకు సంప్రదాయ పద్ధతి ప్రకారం ఈ కోరస్ చేసే పని నాటకంలో భావోద్వేగాన్ని ప్రక్షేపించడం ప్రధానాంశం. 'లింక్'గా వాడటానికి ఉపయోగించే పద్ధతి కాదు. ఆ పద్ధతిని ఈ నాటకంలో రచయిత ప్రవేశింపచేసి నాటకానికి వన్నె తెచ్చాడు. ఇక్కడ నాటకాల్లో విశేషంగా ప్రజాదరణ పొందిన సన్నివేశాల్ని, సంభాషణల్నీ మళ్ళీ మళ్ళీ చూడాలనీ, వినాలనీ జనం ఉర్రూతలూగుతుంటారు. పెద్ద తరంలోని ఈ ఉత్సాహం చిన్న తరంలో వారికి, వాటి పట్ల గౌరవాన్ని ఆపాదించి పెడుతుంది. కొత్తవారిలో నాటకాభిమానాన్ని పెంచుతుంది.

కన్యాశుల్కంలో అత్యంత ప్రజాదరణనీ, ప్రశంసనీ అందుకొన్న సన్నివేశాలను, సంభాషణలను చెదరనీయకుండా చాకచక్యంగా సంక్షిప్తీకరణతో సైతం నిలిపి ఉంచారు. ఆ విధంగా ఇది సాహిత్య విన్యాసంలా మాత్రమే చెయ్యకుండా నాటక పేక్షకులను దృష్టిలో ఉంచుకోవడం; ఇది సంక్షిప్త నాటక ప్రతిగా మాత్రమే మిగలకుండా నాటక ప్రదర్శనగా కూడా నిలించేందుకు ప్రయత్నించడం అభినందనీయం. సంక్షిప్త పరిచినా, కన్యాశుల్కం నాటక రచన ఆరంభంలో గురజాడవారి మస్తిష్కంలోని ఇతివృత్త నిర్మాణ సంగ్రహం బహుశా ఇలానే ఉండేదేమో అనిపిస్తుంది. ఎందుకంటే కురచబరిచినా రసాస్వాదనకి కొరత లేకుండా జాగ్రత్త పడటం వల్ల! శంకర్ పిళ్లై అనే జాతీయ స్థాయి పేరొందిన మలయాళ ప్రొఫెసర్ ఒక ప్రఖ్యాత దర్శకుడు environmental theatre pattern లో చెకోవ్ రాసిన 'cherryorchard' అనే నాటకాన్ని ప్రయోగించి, బ్రహ్మాండమైన 'showman ship' ని ప్రదర్శించగా చూశాడు. ఆ నాటకంపైన శంకర్ పిళ్లై గారి అభిప్రాయాన్ని అడిగితే- 'ఇందులో నాటక రచయిత చెకోవ్ మినహాయించి అంతా ఉంది' అన్నాడు. అంటే అతని అంతరార్థం నాటకం తాలూకు 'Kernel' ని విస్మరించి ప్రదర్శించాడని! అలా కాకుండా... 'చక్కనమ్మ చిక్కినా అందమే' అన్న సామెతకి తగ్గట్టు ఇక్కడ చిక్కింది రచన యొక్క పరిమాణమే గానీ పరిమళం గాదు. కోతకి గురైనా కొత్తగా ఉంది. కారణం కచ్చితంగా గురజాడ వారి అజరామరమైన సృజనాత్మకతే!

తెలుగు నాటక సాహిత్యంలో ఇంత పెద్ద నాటక రచన మరోటి చేసినట్టుగానీ, ఇంత ప్రముఖమైనట్టు గానీ, ఇంత సంక్షిప్తీకరించినట్టు గానీ దాఖలా లేదు. భారతగాథ అనే మహాకావ్యాన్ని పీటర్ బ్రూక్, అంతర్జాతీయ ఖ్యాతినొందిన నటుల్ని, వివిధ పాత్రల్లో ఉపయోగించి మహాభారతాన్ని 7 గంటల నాటకంగా కుదించారు. ప్రపంచ ప్రఖ్యాతి పొందిందీ నాటకం. అలా ఎంత కుదించినా, ఎంత మథించినా తరగని రసానుభూతికి నెలవు కన్యాశుల్కం అన్నది ఆవిష్కృతమైంది రామతీర్థ గారి ప్రయత్నంలో. ఆయన కత్తెరకే కాదు, కాలానికీ పని చెప్పారు. ఎంచుకొన్న అంకాలకీ, రంగాలకీ లంగరందించడానికి పాటని, వచన కవిత్వాన్నీ ఆశ్రయించారు. ఇది సమర్థనీయమైన చేర్పుగానే భావించాలి. ఇది వరకెప్పుడూ కన్యాశుల్కం నాటకాన్ని చూడని ప్రేక్షకుల కథాగ్రాహ్యతకి ఇది ఆవశ్యకం. ఐతే ఈ చేర్పు కవితాత్మకంగా, పాట రూపంలో ఉంది. పొత్యంగా ఉన్న పసిగుడ్డులాంటిది. బాణీ చేకూరితే నడకలు, పరుగులు పెడుతుంది. గాయక, నటీ నట, వాద్య సహకారాలతో దృశ్యమానమైతే గాల్లో తేలియాడుతుంది. నోళ్ళల్లో నానుతుంది. ఆ యోగం ఈ పాటకి కలగాలని మనసారా కోరుకుందాం.

భగవద్గీతకెన్నో భాష్యాలున్నాయ్ - గీతాంజలికెన్నో అనువాదాలున్నాయ్. మన తెలుగు కన్యాశుల్కం సైతం అంతగొప్పది. అందుకే యోగ్యులైన ఔత్సాహికులు, అనుభవజ్ఞులు, ప్రసిద్ధులు సైతం ఇంకా ఆ రచనపై పరిశ్రమిస్తున్నారు. గురజాడ వారి కీర్తిని ఇనుమడిస్తున్నారు. వారిని స్వాగతించాలి. వారికి ఆశీస్సులందించాల్సిన బాధ్యత మనది. షేక్స్పియర్ రచనల పరిమాణం కంటే ఎన్నో వందల రెట్లుగా విశ్వవ్యాప్తంగా విశ్లేషణలొచ్చాయి. అదీ... అఖండ గౌరవం అంటే!

మన మాతృభాషలో నానుడులుగా స్థిరపడే ఎన్నో వాక్యాల్ని తన సంభాషణల ద్వారా అందించిన మన కవి, మహాకవి గురజాడ అప్పారావు పట్ల మనం ప్రకటించేది అనంత గౌరవం! నూరేళ్ళ కన్యాశుల్కం ఒక తరగని ఖని. అది ఇంకా ఎన్నో తరాల్ని ప్రభావితం చెయ్యాలి. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం జెయ్యాలి - అజరామరంగా నిలవాలి.

- చాట్ల శ్రీరాములు

సందర్భం

ప్రశ్న, ప్రజ్ఞ, ప్రగతి : కన్యాశుల్కం త్రినేత్రాలు

కాలాన్ని తట్టుకు నిలబడే ఒక కళారూపం ఎప్పుడూ శ్రద్ధతో నిర్మితం అయిన భావనాలయం. ఇక్కడ భావనలే సమస్త రూపాలూ దాలుస్తాయి. వాటి వాస్తవ ఆధారాలు లోకంలో ఉంటాయి. నాటకానికి మొదటి దర్శకుడు రచయితే. తానే ఈ కథన స్వరం పలు పాత్రలకు ఇచ్చి, వర్ణనలను మినహాయించుకుని, చెప్పదలుచుకున్న వాతావరణాన్ని తన ఊహా రంగస్థలిపై సష్టి చేస్తాడు. సంభాషణలు, కదలికలు, సంగీతం మాత్రమే కథను నడిపిస్తాయి. సాహిత్యంలో మిగతా ఏ ప్రక్రియలైనా ఒక్క రచయితే నిర్వహించవచ్చు కానీ, నాటకం అనేది ఒక సమాహార కళ. అక్షరంగా మొదలై అభినయంగా ముగిసే, ఒక పరిణామ ప్రక్రియ. ఈ నాటక ప్రక్రియతో ఆధునిక తెలుగు సాహిత్యం ప్రారంభం కావడం, ఒక పరిణతిని సూచిస్తుంది. అలాగే కొన్ని ప్రశ్నలకు కూడా దారి తీస్తుంది.

కన్యాశుల్కం నాటకం ఈ ఏడాది ఆగస్టులో నూట పాతికేళ్ల ఉత్సవ సందర్భంగా మన ముందర ఉన్నది. ఈ నాటకం ప్రశ్నలకు పురిటి గది. 'పొగ తాగనివాడు దున్నపోతై పుట్టున్' అని గిరీశం ద్వారా మహాకవి హాస్య మహాశాసనం జారీ చేసినట్టే, మనమూ గ్రహించవలసింది 'ప్రశ్న అడగని వాడు ఎద్దు మొద్దై పుట్టున్' అని. నాటకం గురించి ప్రశ్నలా? అన్నీ అడిగేసాము కదా అనుకునే వారికి, దారి చూపినది గురజాడ వారే. నవీన కావ్య కళ తనది అని చెప్పారు. సంస్కృతిపరులు అర్థం చేసుకుని హర్షించేందుకు ప్రశ్నలు అవసరం. నాటకాన్ని ఇలా మొదలయింది, ఇది ఇంతే అనుకునే వారికి ఏమీ చెప్పలేము కానీ మొదటి ప్రశ్న, ఆరంభ దశ్యం గురించే.

గురజాడ వారి నాటకం గిరీశం స్వగతంతో బొంకుల దిబ్బ మీదనే ఎందుకు మొదలవ్వాలి? విజయనగరంలో ఇంకేవీ ప్రముఖ స్థలాలు లేవా? ఎందుకీ ఎంపిక చేశారు గురజాడ? అది నాటక రచయిత ఇష్టం, మనం ఎవరం అడగడానికి అనడం ఒక కొత్త ప్రశ్నకు ఒక మూస జవాబు. ఇంకో విధంగా ఆలోచించడం అక్కర లేదు అనుకునే అజ్ఞానంతో కూడిన దబాయింపు కూడా. బొంకుల దిబ్బ అన్నది ఉంటుందా, అసలు అక్కడ నిలబడి ఎవరైనా బొంకులే పలుకుతారా, పలికితే, వినేవారికి అవి బొంకులని తెలిసిపోవా, ఇంకప్పుడు బొంకుల దిబ్బ విశేష లక్షణం ఏమున్నది?

కోట ఎదురుగా ఉండే ఎత్తైన మిట్ట ప్రాంతం బొంకుల దిబ్బ. ఇవి బొంకులు కావు బంకులు. ఇంగ్లీష్‌లో బంక్ (bunk). పెద విజయరామరాజు కాలంలో, తరువాత సీతారామరాజు కాలంలో కూడా, కోట ఎదురుగా నిలబెట్టిన చిన్న జైలు గదులు ఈ బంక్‌లు. వీటిలో, అప్పట్లో శ్రీకాకుళం నుంచి, దాదాపు రాజమహేంద్రవరం దాకా ఉన్న తమ రాజ్యంలో, తమను ఎదిరించిన వారిని, పన్నులు కట్టడంలో ఎగవేతదారులను, చిన్నా చితకా నేరస్తులను తెచ్చి ఈ బంక్‌లో బందీలుగా ఉంచేవారు. వారి తిండి, నిద్రా అక్కడే. ఈ బంక్‌ల వల్ల ఈ దిబ్బ బంకుల దిబ్బగా గుర్తింపు చెంది, కాలగతిలో అలా జనం నోళ్లల్లో మార్పు చెంది బొంకుల దిబ్బగా మారింది. ఇదంతా గురజాడ వారికి తెలుసు. ఆ కారణంగానే, బొంకుల దిబ్బ ఒక నేర నేపథ్యం గల ప్రదేశం. జైలుకి వెళ్లేంత పెద్ద నేరాలు కాకపోయినా చిన్నా చితకా నేరాలు, మీద పడి తన్నడాలు, అప్పులు ఎగ్గొట్టడాలు, స్త్రీలతో విచ్చలవిడి శంగార సంబంధాల యావ, వివాహితలైన యువతులకు లవ్ లెటర్లు రాయడాలు, ఆధునికత ముసుగులో, ఒక నేరపూరిత, దగుల్బాజీ మనస్తత్వం

గల వ్యక్తిని తెలుగు సాహిత్యంలో మొదటిసారిగా, నాటక పాత్రగా పరిచయం చేస్తున్నారు గురజాడ. ఆ పాత్ర సాహిత్య ప్రవేశం, నాటక కథరీత్యా కూడా ఎంతో ప్రతీకాత్మకం. నేరమయ చరిత్ర గల బొంకుల దిబ్బ, గురజాడ వారి దష్టిలో, గిరీశం వంటి నేర బుద్ధి గల కుటిలుడి కథా ప్రవేశానికి అనువైన ప్రదేశం. ఈ బొంకుల దిబ్బ నాటక ఆరంభ స్థలంగా ఎంపిక చేశారు.

ఈ నాటకం, రెండు అగ్రహారాలలోని బడుగు బాపనయ్యల ఇళ్ల బాగోతాల మీదుగా నడిచి, ఒకసారి మఠం సీనులో, మంది నోళ్లలో పడి చివరికి, ఉన్నదల్లా పీల్చుకు తినేసే ప్లీడర్ల వ్యవస్థ అయిన కోర్టుల పాలు అవుతుంది. వ్యక్తురాలైన బుచ్చమ్మ ఎవరితోనో ఇల్లు వదిలి వెళ్లిపోవడం కోర్టు దష్టిలో నేరం కాదు. అది ఒక ఇంటి వ్యవహారం. ఇక పెళ్లి కూతురి చావు కేసు, అటు శవమూ లేక, ఇటు సాక్షులూ లేక, చతికిలబడి పోతుంది. నాటకం మొదలు బంకుల దిబ్బ కాగా, ఇక నాటకం ముగింపు స్థలం కూడా గురజాడ వారి జాగ్రత్తైన ఎంపికే. కరటక శాస్త్రి, శిష్యుడి బతుకులు బాగు చేసి పంపిస్తుంది మధురవాణి తన ఇంటినుంచే.

ఇక మిగిలిన దశ్యం, న్యాయం దొరకని కోర్టుల కన్నా, ఈ దురదష్టవంతులకు న్యాయం చేద్దామని పరితపించే సౌజన్యారావు ఇల్లు. అగ్నిహోత్రావధాన్లుకి ఆఖరున బుచ్చమ్మకి న్యాయం చెయ్యమన్న హితబోధ, లేదా ఆయనపై కేసులు సవ్యమైన కారణాల కోసం నడుస్తాయి అన్న హెచ్చరిక చేస్తాడు ఈ న్యాయవాది. లుబ్ధావధాన్లుకు మంచి బుద్ధులు చెప్పి, మీనాక్షి బతుకు బాగు చేయవలసిన బాధ్యత తనదే అని గుర్తు చేసింది కూడా సౌజన్యారావు గారే. ఇక బుచ్చమ్మ విషయంలో గిరీశం మాట కాసేపు నమ్మిన ఈ న్యాయవాది, చేసిన నిజమైన న్యాయం, మధురవాణి చెప్పినది విని, బుచ్చమ్మ చుట్టూ రక్షణ ఛత్రం వేసి, కపటి అయిన గిరీశాన్ని 'గెట్ అవుట్' అంటూ బయటకు పొమ్మనడం. న్యాయవర్తనం పట్ల వారికి విశ్వాసం ఎక్కువ కనుక, దుష్టబుద్ధి గల గిరీశానికి సైతం 'చదువుకుంటివా, నీకూ్కడా సహాయం దొరుకుతుంది' అని భరోసా ఇస్తారు. 'ఒరులేయవి యొనరించిన నరవర, యప్రియంబు తన మనంబునకగు, తానొరులకు యవి సేయకుండుటునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్' అనే భారత పద్యానికి ప్రతిరూపం అయిన అచ్చమైన ఆచ్చాణీ సౌజన్యారావు. ఆయనా యువకుడే!

ఆచ్చాణీ అంటేనే ఎలిజిబుల్ బాచిలర్ (పెళ్లి కాదగ్గ బ్రహ్మచారి అని అర్థం). అందుకే ముద్దు కోరుతుంది మధురవాణి, న్యాయవాదిని ధర్మ సంకటంలో పడవేస్తుంది. ఇది తెలీక సౌజన్యారావు పాత్రను నడివయసు వాడిగా చూపుతున్నారు మన దర్శకులు. నిజానికి ఈ నాటకంలో గురజాడ ఇద్దరు యువకులను చూపెట్టారు, ఒకడు వచ్చీరాని చదువులతో మోసాలు మరిగిన కపటి గిరీశం, రెండోవారు బాగా చదువుకుని, ఆ చదువు ద్వారా, సమాజంలోని వారికి మేలు చేసేందుకు పాటుపడే వారుగా సౌజన్యారావు. ఇంగ్లీష్ చదువులే ఇద్దరివీ - వానాకాలం చదువు గిరీశానిది, శ్రద్ధగా చదువుకున్న వారు సౌజన్యారావు, ఇద్దరూ యువకులే. తన వెర్రి వేషాల వల్ల గిరీశం ఎక్కువ యువకుడు గానూ, తన నింపాదితనం వలన సౌజన్యారావు నడి వయసు వ్యక్తిగా మనకు తోస్తారు. ఇది నిజానికి నిజం కాదు. అసలు గిరీశం వంటి అరకొర చదువుల అయ్యవార్ల వల్లనే విద్య భ్రష్టు పట్టుతున్నది అందుకే, 'నీ ఇంగ్లీష్ చదువులే కొంపముంచాయి' అని వెంకటేశాన్ని తండ్రి రామచంద్రపురం చెరువు గట్టున కొట్టేది కూడా గిరీశం నిర్వాకాల వల్లనే.

చూసారా, రచనా ప్రణాళిక - మొదటి ద శ్యం ఒక నేరమయ చరిత్ర గల బొంకుల దిబ్బ, గిరీశం వంటి అప్రతిష్ట పాలైన వారుండే చోటు, అక్కడ మొదలు పెట్టడానికీ గురజాడ వారికి ఒక సమంజసత ఉన్నది. అలాగే ఆఖర్న ఈ కథల కొండవాగు ఒరిసొరిసి పారి చివరికి చేరేది, సౌజన్యారావు ఇల్లు, అది న్యాయానికి పుట్టినిల్లు, నాటకంలో న్యాయమే జరగాలని కదా, ఇంత కథా రాశారు గురజాడ.

ఇక నాటకంలో మొదటి స్వగతపు మాటలు మోనోలాగ్ - 'సాయంకాలమైంది'. గిరీశం ప్రాతినిధ్యం వహించే, అటువంటి సమాజ వ్యవహర్తలు ఆచరించే కుటిలత్వం, మోసం, దగా, ఆధునికత పేరిట ప్రజా వ్యతిరేక ధోరణులను చలామణీ చేయడం, తనకు తెలియని జ్ఞానాన్ని నటించడం, ఇవన్నీ పిండప్రాయంలో, ఆనాటి సమాజంలో ఉన్న దుర్లక్షణాలు. వీటన్నిటికీ పొద్దు వాలిపోవాలి. అదీ సాయంకాలం అవడం అంటే. కేవలం ఒకరోజు ముగియడం కాదు, ఒక దుర్జనతల శకం ముగియాలని గురజాడ నాటిన శబ్ద బీజం ఇది. చూడండి ఇది మొదలు విజయనగరం నుంచి బయటకు నడిచిన గిరీశం ఈ కథాక్రమంలో ఎన్నో ప్రయత్నాలు చేసి అన్నింటా విఫలుడై, చివరికి, నాటకంలోంచి కూడా రాత్రివేళ బయటకు పంపించబడతాడు. ఎవరి చేత? ఉత్తమ మానవులైన మధురవాణి, సౌజన్యారావుల చేత. అలా వాడికి పొద్దు వాలి పోయి, అది రాత్రిలా ఘనీభవిస్తుంది. అదే 'డామిట్! కథ అడ్డంగా తిరిగింది!' అంటే. 'సాయంకాలమైంది' అనేది ఈ పాత్ర నాటకారంభంలో చెప్పిన స్వగతం ఐతే, ఆఖరుది కూడా అర్ధ స్వగతమే. ఇది నాటకంలో గురజాడ పాటించిన కళల తూకం. గిరీశం అనే అల్పుడు, సౌజన్యారావు అనే సజ్జనుడు అనే కాంట్రాస్ట్ సష్టించాడు. ఆడంబరపు పల్కుల గిరీశం, మంచికి నిలిచే సౌజన్యారావు ముందు ఎందుకూ కొరగాకుండా పోతాడు. ఒక గ్రామీణ సమాజాన్ని తాను మోసం చేయగలడు, పిల్లలను బురిడీ కొట్టించగలడు, చదువుకోని ఆడపిల్లలకు అచ్చి బుచ్చి కబుర్లు చెప్పగలడు. కానీ నిజమైన విద్యావంతుల దగ్గర వాడు దమ్మిడీకి కూడా కొరగాడు.

ఈ నాటకంలో ఏ మాటా తీసేసి, మరొక మాట పెట్టలేము అని పెద్దలు అన్నారంటే, ఇంత విశేషమైన సార్థకత ఆ మాటలకు, సందర్భాలకు ఉన్నది. బహుళార్థ సాధక కళా రూపాలు ఎప్పుడూ అరుదుగానే సంభవిస్తాయి. వాటిలో మనకు సమీప కాలంలో వచ్చిన కన్యాశుల్కం నాటకం, తన జవసత్వాల వల్ల ఒక అయిదు పాతికలు పూర్తి చేసుకుని మరో పాతిక దిశగా ప్రయాణం ఆరంభించిన ఈ ఘట్టం సాహిత్య చరిత్రకు మనలను సాక్షులు చేస్తున్న మహత్తర సందర్భం.

- రామతీర్థ
98492 00385

(ఆగస్టు 25-27, కన్యాశుల్కం 125 ఏళ్ల జాతీయ ఉత్సవాలు విజయనగరం, విశాఖపట్నం వేదికల్లో)

గురజాడ 'దేశభక్తి గీతం' పునాది ఇదీ!

దేశమును ప్రేమించుమన్నా, మంచి అన్నది పెంచుమన్నా" అన్న విశ్వమానవ సౌభ్రాతృత్వ గీతం ఒక్కటి మిగిలినా, గురజాడ ప్రపంచ మహాకవి అవుతారు అని శ్రీశ్రీ ఒక సందర్భంలో అన్నారు. అలాంటి దేశభక్తి గీతానికి పునాదులు వందేళ్ల ముందరి 1795 నాటి రాబర్ట్ బర్న్స్ స్కాటిష్ మహాకవి గేయాల్లో దేశభక్తి గీతం పునాదులున్నాయి. గురజాడ, బర్న్స్ కవిని చదువుకున్న, ఇష్టపడిన, ఉటంకించిన ఆధారాలు 1910 తరువాతి గురజాడ వ్యాసాల్లో గమనిస్తాము. వీటిలో "మాటా - మంతి" పేరిట అచ్చులో ఒక పన్నెండుపైగా వ్యాసాలు లభ్యమవుతున్నాయి. నన్నయ గురించి చర్చ, తెలుగు కన్నడ భాషల మూలాలు, కొన్ని విమర్శలకు సమాధానాలు, ఒక బెంగాలీ నవల బంకిమ్ చంద్రుడి రచనకు తెలుగు అనువాదం పుస్తక సమీక్ష, వర్డ్స్‌వర్త్ నూతన యుగకారకునిగా సామాన్యులకు సాహిత్య ప్రాధాన్యత, ఇలా ఈ వ్యాసాల విషయ పరిశీలన చేస్తే.. సమయం ఉంటే, గురజాడ, ఇంకొన్ని వ్యాసాలద్వారా తప్పక కొత్త ఆలోచనలకు మరింత బలమైన ప్రాతిపదికలపై దారులు వేసుండేవారనిపిస్తుంది. ఈ సమయంలోనే 1910లో గురజాడ రాసి ఉంటారని భావిస్తున్న దేశభక్తి గీతం 1913 ఆగస్టు 9న కృష్ణాపత్రికలో అచ్చు అయింది. 1909 డిసెంబర్ తరువాత గురజాడ కన్యాశుల్కం సవరింపు పనులనుంచి బయటపడ్డారు. నాటకం రెండో ముద్రణగా విస్తృత రచనగా అందుబాటులోకి వచ్చింది. ఈ వ్యాసాలు నవంబర్ 1910లో మొదలై, 1915 మార్చి వరకు కొనసాగిన ఆధారాలున్నాయి. వీటిలో రెండు వ్యాసాల్లో గురజాడ, రాబర్ట్ బర్న్స్ కవి చరణాలు ప్రస్తావన చేస్తారు. మొదటిది తనపై ఒక ఆకాశరామన్న ఉత్తరంలో చేసిన అభ్యంతరాలకు సమాధానం వ్యాసం. రెండో చోట, ఈ ప్రస్తావన వర్డ్స్‌వర్త్ కవిత్వం గురించిన చిన్న రచనలో వస్తుంది. రాబర్ట్ బర్న్స్ (1759-1796) స్కాట్‌లాండ్ దేశపు మహాకవి. తన ముప్పైఆరేళ్ళ జీవితంలోనే వందలాదిగా స్కాటిష్ మాండలికంలో పాటలు, కవితలు రాశాడు. ఆ దేశపు జాతీయ కవిగా కీర్తివంతుడు. చాలా దశాబ్దాలుగా ఈయన జయంతి స్కాట్లాండ్‌లో జాతీయోత్సవాల సందర్భంలో గురజాడ ఉటంకింపులు ఇవి.

"O would some powers the gift give us
to see ourselves as others see us
(from the poem To a Louse, 1786)

"The rank is but the guinea stamp
Man is the gold for all that
(from the poem / song A man's a Man for A' that (1795)

బర్న్స్ కవిని గురజాడ చదవడమేకాక, తన వ్యాసాల్లో ప్రస్తావించారు. 1910లో మొదలుపెట్టిన ముత్యాల సరాలు రాస్తున్న కాలం కూడా ఇదే. కవిత్వ సరళత ముత్యాల సరాలలోని సహజాభరణం, టిట పోకడ, అంతర్జాతీయ సాహిత్య పరిణామంగా, అలాగే అలాంటి అలి పదాలతో, పల్లీయ స్కాటిష్ పదాలతో, బర్న్స్‌రాసిన వందలాది పాటలు కూడా గురజాడ దృష్టిలో ఉన్నాయి. ఇతరులపట్ల సహనంతో ఉండాలని మనకు భారత కాలపు నీతి ఉన్నది. "ఒరులేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబునకగు తా నొరులకవి సేయకునికియె పరాయణము పరమ ధర్మ పథముల కెల్లన్". బర్న్స్ కవి ఒక అడుగు ముందుకెళ్లి "మనలను ఇతరులు ఎలా చూస్తారో అలా మనమే చూసుకోగల ఏ శక్తి అయినా ప్రసాదిస్తే బాగుణ్ణు" అన్నాడు. ఇది గురజాడ మొదట ఉటంకించి, తన వ్యాసం మొదలుపెట్టాడు.

రెండో కవిత 'ఎ మేన్ ఈజ్ మేన్ ఫర్ ఆల్ దట్'- అనేది 'ఆల్ దట్ అండ్ ఆల్ దట్' అనే వరుసలో పెడతారు. ఇదొక సుప్రసిద్ధ గేయం. స్కాట్లాండ్ పార్లమెంట్ మొదలుకుని, వివిధ కళాకారులు బృందాలుగా, గానం చేయడం, సంగీత పరికరాలపై వాదనం, చివరికి రాప్ సంగీతంగా కూడా యూరప్ అంతా బహుళ ప్రజాదరణ పొందిన రచన ఇది. ఒకసారి 1999లో స్కాట్‌లాండ్ పార్లమెంట్‌లో ఒక మహిళా సభ్యురాలు పాడగా, మొత్తం పార్లమెంట్ సభ్యులందరూ గొంతు కలిపి పాడినది ఒక ఉత్తేజకరమూ, స్ఫూర్తిదాయకమూ అయిన సన్నివేశం. ఇపుడు మనం సామాజిక మాధ్యమాల్లో చూడొచ్చు. బర్న్స్ కవి రాసిన ఈ గేయం "మనిషి ఉత్కృష్టత తన సత్యసాధనలో, నిజాయితీలో ఉన్నది తప్ప వేరే అధికారాలు, పదవులూ ఆర్భాటాల్లో లేదు" అని తెలిపే ప్రపంచ విశాలత్వ గీతం. ఈయన కూడా ఎక్కడా, ఒక దేశం, ఒక ప్రాంతం మాట ఈ రచనలో ప్రస్తావన చేయలేదు. ఇది గురజాడకు కూడా స్ఫూర్తి.

మానవుల ప్రగతి, నూతన సమాన విలువలూ, సంఘంలో ఉన్నతంగా భాసించే సర్వసామాన్య ప్రజానీకపు పాత్రను గుర్తిస్తూ, పాటలు కట్టి పాడినవారు రాబర్ట్ బర్న్స్ వంటి తొలితరాల కవి పుంగవులు. అటు తరువాత వర్డ్స్‌వర్త్ (1770-1850) కూడా ఒక గొల్లపిల్లవాడి జీవితం (మైఖేల్ రచనాకాలం 1800) ఒక కావ్యంగా రాశారు. వర్డ్స్ వర్త్ గురించి తన చిన్న వ్యాసంలో గురజాడ ప్రస్తావించిన ఇతివృత్త ప్రజాస్వామికత అదే. ఈ 'ఎ మేన్ ఈజ్ ఎ మేన్ ఫర్ ఆల్ దట్' అనే కవిత స్కాట్‌లాండ్ సాహిత్యంలో సుప్రసిద్ధ ప్రజాస్వామిక రాజకీయ గీతంగా ప్రఖ్యాతి పొందింది.

ప్రజాస్వామ్యవాదులకు శిరోధార్యంగా, ఈ రెండు వందలేళ్లుగా, ఆ సమాజంలో స్వేచ్ఛా మానవ చైతన్య సంగీత జ్వాల, ఈ గీతం. సామాన్యుడి కోసం మాట్లాడుతూ, హోదాలు, అధికారాలను ప్రశ్నిస్తూ, విశ్వసోదరత్వ భావనకు ఈ రచనలో బర్న్స్ దారులు వేశాడు. ఈ రచన గురించి చెప్తూ బర్న్స్, ఒకటి రెండు ఆలోచనలు వచన రూపంలో ఉన్నవి, పాటగా మలిచాను అని తెలిపాడు. అలెగ్జాండర్ పోప్ (1688-1744) తన రచనల్లో "నిజాయితీపరుడైన మనిషి, భగవంతుడి ఉత్తమ సృష్టి" అని రాసి వెళ్లిపోయాడు అప్పటికే. 1791-92 కాలంలో థామస్ పైన్ (1737-1809) ఫ్రెంచ్ విప్లవం తర్వాత (1789-1799) సైనిక దర్పాల నీతి రిబ్బన్లు, మోడళ్ల హోదాల గురించి మాట్లాడే పసితనం వెళ్లిపోయింది. ఫ్రాన్స్ ఈ ఆర్భాటాలను పక్కకు తోసేసి, పరిణతి మానవ దశకు ఎదిగింది. కౌంట్‌లు, డ్యూక్‌ల కాలం చెల్లింది. ఇక మరుగుజ్జులను పక్కనపెట్టి, నిండు మానవుడికి ఫ్రాన్స్ వేదికగా మారింది. మనకు కనిపిస్తున్న యూరప్ అంతా ఒక రిపబ్లిక్ అవుతుంది. మనుషులు స్వతంత్రులౌతారు అని ఆశాభావన వ్యక్తపరిచాడు. 1795కు తన పాటల్లో 'మనిషే అన్నింటా' అని బర్న్స్ కవి మాట్లాడుతున్న స్వేచ్ఛా సమాజ మానవుడు ఈ నేపథ్యం నుంచే వచ్చాడు. పద్దెనిమిదో శతాబ్దం మధ్యకాలం నుంచి ఈ గీతం యూరప్ దేశాల్లో ప్రఖ్యాతంగా పాడుతున్నారు. ఈ గీతంతో గురజాడకు పరిచయం ఉన్నది. తన వ్యాసాల్లో బర్న్స్ కవిని రెండుసార్లు ఉటంకించిన గురజాడ, సరిగ్గా 'ఏ మేన్ ఈజ్ మేన్ ఫర్ ఆల్ దట్' గీతం నుంచే. మానవ ఉత్కృష్టత గురించి బర్న్స్ రాసిన చరణం రెండో ఉటంకింపు చేస్తూ, గురజాడ, తెలుగు అనువాదం కూడా చెప్పారు ఈ లఘు వ్యాస రచనలో.

'దేశభక్తి గీతం'లో గురజాడ చెప్పిన మన పంటల సత్తువతో తిండి, కండ కలగడం, దుస్తులలో స్వదేశీయత, పరుల కలిమిని చూసి పొర్లి ఏడ్వడం పట్ల నిరసన, శ్రమ మీద నిర్మాణం అయ్యే సమాజం, వాణిజ్య ఉధృతి, వీటికి మూలకందమైన మానవుడు, బర్న్స్ గీతం 'ఏ మేన్ ఈజ్ ఎ మేన్ ఫర్ ఆల్ దట్' (మనిషే అన్నింటా)లో స్పష్టంగా కనిపిస్తాడు. బర్న్స్ గీతంలో కూడా ఎక్కడా, నదులు, పర్వతాలు, ప్రాంతాలు, జాతుల గొప్పతనాలు లేవు. గురజాడ గీతం కూడా ఇదే ధర్మాన్ని పాటించడం చూస్తాము. "జాతమన్నది లేచి పెరిగిన లోకమున రాణించునోయి" అని దేశభక్తి గీతం పన్నెండో చరణంలో అన్నపుడు *"The rank is but the guinea stamp- Man is the gold for All that" (from the poem / song A Man's A Man for A' that (1795)* అన్నది చాలా బలంగా కవిత్వీకరించాడు. గురజాడ, తాను ఈ గీతాన్ని నూరేళ్ళ తరువాత రాస్తున్న 1910 దశకపు వర్తమానంలో బలంగా ప్రతిష్ఠాపిస్తూ, బర్న్స్ కవి భావనలపై ఈ గీతపు భవంతి నిర్మించాడు. దేశభక్తి గీతం పదకొండో చరణంలో "చెట్టాపట్టాల్ పట్టుకుని దేశస్థులంతా నడవవలెనోయి అన్నదమ్ముల వలెను జాతులు మతములన్నీ మెలగవలెనోయి" అని రాస్తున్నపుడు గురజాడ మనసులో, బర్న్స్ కవి 1796లో రాసిన గీతపు ముగింపు పంక్తుల చరణం- *"That Man to Man, the world o'er, Shall brothers be for all that"* ఉన్నదనేది పరిశీలనకు అందుతుంది. గురజాడ తన రచనలకు ఆధారాలు ఎక్కడ ఉన్నాయో చెప్పారు. యోగవాశిష్టంలోని లవణరాజు కల వృత్తాంతం, అమన్ పితియస్ ఒక గ్రీక్ కథ కన్యక, పశ్చిమ గోదావరి ప్రాంత పెనుగొండలో జరిగిన ఐతిహ్యం, పూర్ణమ్మ బాల్య వివాహాల చెడు పరిణామాల గురించిన ఒక కవితాత్మక నివేదిక. ముత్యాల సారాలు పేరు గల గురజాడ తొలి గెటమే- తన బరంపురం (సహపంక్తి) బంతి భోజనాలకు, ఇంకా అక్కడ సభల్లో చోటుచేసుకున్న వైజ్ఞానిక సాహిత్య విషయాల చర్చలకు వెళ్లి వస్తూ, రోదసీ బంధువైన హేలీ తోకచుక్క గూర్చి శాస్త్రీయ హేతుబుద్ధితో కవిత చెప్పిన ఒక వాస్తవ ఆధారిత సృజన.

గురజాడ, యూరప్ పాశ్చాత్య సాహిత్య లోకాన్ని తన స్వేచ్ఛా గానంతో ఒక ఊపు ఊపిన రాబర్ట్ బర్న్స్ కవిని చదువుకున్న ఆధారాలు, తన రచనల్లో ఉండటం, వారి రచనా పద్ధతులు, ఆలోచనలపట్ల గురజాడ ఆదరణ, గౌరవం ఉండటం, అటువంటి విశ్వమానవ సౌభ్రాతృత్వ భావనలను తాను కూడా, ఇతరులెవరూ తెలుగు సాహిత్యంలో చెప్పని విధంగా చెప్పేందుకు పూనుకుని సఫలీకృతుడు కావడం, వీటికి గురజాడ రచనకు వందేళ్లకు ముందరే వెలువడ్డ గీతం నుంచి తాను ప్రభావితుడు కావడం, ఇవన్నీ వ్యాసాల్లో బర్న్స్ కవి గురించి గురజాడ ఇచ్చిన ఆధారాలను గ్రహిస్తే విశదమవుతాయి.

వెరసి గురజాడ 1910 దేశభక్తి గీతం సారంలో 'ఎ మేన్ ఈజ్ ఎ మేన్ ఫర్ ఆల్ దట్' అన్న రాబర్ట్ బర్న్స్ కవి 1795 గీతంతో స్ఫూర్తిదాయక సమధర్మాన్ని కలిగి ఉన్నది. తన కాలానికి, ఇంతగా అంతర్జాతీయ రచయితలను, మేలిమి రచనలను గురజాడలా చదువుకున్న ఎరుకతో సార్థక రచన చేసినవారు, తన కన్నా పెద్దవారైన వీరేశలింగం, సమకాలికుడైన గిడుగు రామమూర్తి ఉండటం కూడా తెలుగువారి అదృష్టం. అందుకే, ఈ రచనల స్వభావం, వేరువేరు స్వరూపాల్లో మానవ శ్రేష్ఠత కోరే సారభూత సంపదలుగా తరువాత దశాబ్దాల్లో శ్రీశ్రీ 'మానవుడా' గీతం రాసినా, 'నయాగరా' కవుల జలపాత హోరు ముంచెత్తినా, తమ 'త్వమేవాహం'లో మానవుడ్ని సమాజ నిర్మాతగా ఆరుద్ర ఒక విప్లవకర సన్నివేశంలో పాదిగినా, విప్లవ భావన అనేది మానవుల చేతిలో 'వజ్రాయుధం'గా తెలంగాణ విముక్తి పోరాట నేపథ్యంలో వచ్చిన కావ్యంలో సోమసుందర్ చెప్పినా, ఇదే కాలంలో హైదరాబాద్ స్టేట్‌లో పలు కడగండ్లు ఎదుర్కొన్న దాశరథి 'అగ్నివీణ'గా వివిధ గీతాల్లో పలికినా, 'కులమతాల గోడలకు కట్టుపడను నేను, నేను విశ్వనరుడిని' అని జాషువా ఖండకావ్యాల్లో ప్రకటించినా, 'విశ్వంభర'లో మానవ ప్రస్తావన, విజయ ప్రశస్తి నారాయణరెడ్డి చేసినా, 'మానవుడే మహనీయుడు' అని ఆరుద్ర ఒక సినీ గేయ సందర్భంలో రాసినా, 'నేనంతా పిడికెడు మట్టే కావచ్చు, కానీ తల ఎత్తితే ఒక దేశపు జెండాకున్నంత పొగరుంది' అంటూ అభివ్యక్తికి అజంతా చిత్రమైనవాడూ, జ్ఞానసంపన్నుడు శేషేంద్ర శర్మ రాసినా, వీటి వేళ్లు బలంగా, ఖండాంతర వాహినులుగా, శతాబ్దాల పురాతన స్రోతస్వినులుగా రాబర్ట్ బర్న్స్‌ను అందుకున్న గురజాడ మీదుగా, తెలుగు నాట అక్షర సాక్షాత్కారమయ్యాయి. అందుకే వీరు సమాజ సంపదగా, ఏ దేశం వారైనా, లోకానికంతటికీ ప్రాతః స్మరణీయులు. రేపటి మానవ సమానత్వ సమాజపు ఆశల కాగడాలు.

- రామతీర్థ, 9849200385

మనిషే అన్నింటా..

సత్యశీలికి తలబరువు కాగల లేమి ఉన్నదా
అన్నింటా, ఆ అన్నింటా
దాటిపోతాము పిరికి బానిసలను
వీరికన్నా లేమియే మిన్న
అన్నింటా ఆ అన్నింటా
మన పాటుకేమి విలువ
పదవిదేమున్నది ఒక నాణేన ముద్దర
మనిషి అన్నింట బంగారము

ఇంటి తిండి తింటేనేమి మనం
ముతక బట్టలు కడితేనేమీ
ఇవ్వండి దద్దమ్మలకు పట్టుబట్టలు
యోధులకు వారి మదిర
అన్నింటా ఆ అన్నింటా మనిషే మేలు కొలత
వారి దాబుసరి వేషాలన్నింటా
నిజాయితీపరుడు నిరుపేదయితేనేమీ
తానే మనుషుల్లో మిన్న

ఉన్నాడదుగో దూరాన ఒక లోభి, దైవంగా
ఇటు అటు కాస్తూ, చూస్తూ
అనేకులకు తన మాట దివ్య శాసనం
కావడానికి తానో వెర్రి అయినా
అన్నింటా ఆ అన్నింటా
తన పతకాలూ, తారలూ, హోదాలూ
తన తెలివితో నడిచే లోక జ్ఞానికి
వీటిని చూస్తే నవ్వులే, అన్నింటా ఆ అన్నింటా

రాజు తలిస్తే చేయగలదు జోదును
రాజ వంశీకుడు, ఉప పాలకుడు
కానీ ఉత్తముడెన్నడూ మిన్న ఆర్భాటాల కన్నా
చిన్న వాటిపై ఉండదెన్నడూ తన విశ్వాసం
అన్నింటా అన్నింటా ఆ మర్యాదలన్నింటా
ఇంగితం, విలువ ఎరిగిన వర్తనకే
అన్నింటా మించిన ఉన్నత స్థానం

జోతలు చేద్దాం వచ్చేదేమైనా
వస్తుందెలాగూ కనుక
ఇంగితం, విలువ ఇల ఎల్లెడలా
వెల్లివిరియగా అన్నింటా అన్నింటా
వస్తున్నదో వేళ అన్నింటా
లోకమెల్లెడలా మనుషులెల్లరూ
అన్నదమ్ములై ఉండాలన్నింటా

- రాబర్ట్ బర్న్స్
(A man's man for all that) 1795
ఆంగ్ల మూలానికి తెలుగు అనువాదం

అవలోకనం

ముత్యాల సరం అభ్యుదయ ఛందస్సు

అభ్యుదయోద్యమం ఒక జాతీయ పరిణామం. రాజుల, రాజ్యాల గాథలు ముగిసి, సమాజంలో, సాహిత్యంలో సామాన్యుల జీవిత గాథలు, వారి సామాజిక పరిణామాలు, ఫలితాలను శాసించేలా ఉండే ప్రజల శతాబ్దాలు ఇక వస్తున్నాయని ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో మేధావులు, రచయితలు చెప్పడం మొదలైన కాలం. లండన్, లక్నోలలో జరిగిన సామాజిక చింతనా ప్రధానమైన రచయితల సభల వల్ల, దేశవ్యాప్తంగా ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్, లక్నోలో 1933లో ఏర్పడగా- యువ రాజకీయ నాయకుడు, అప్పటికి స్వాతంత్ర్య పోరాట నాయకుడు మాత్రమే అయిన జవహర్ లాల్ నెహ్రూ కూడా ఈ సభలకు వెళ్ళారు. 1943లో తెలుగునాట, విజయనగరంలో పూర్వ చర్యలుగా చాగంటి సోమయాజులు, చదలవాడ పిచ్చయ్య శెట్టి ఈశ్వరరావు కీలక భూమికతో తెనాలిలో అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భవించింది. అభ్యుదయ రచయితల సంఘం ఆవిర్భావానికి ముప్ఫై మూడేళ్ళ ముందరే, ఇరవయ్యో శతాబ్దంలో వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య ఛందోరూప విశేష పరిణామంగా, అభ్యుదయ ఛందస్సు పుట్టింది. అంతకుముందరి కవులు ఎవరూ ఛందో లక్షణ సృష్టి చేయలేదు. పద్యాలు రాశారు అంతే! కావ్యాలుగా ప్రయోగాలుగా వెలువడ్డ రచనల ఆధారంగా అంటే, ఇదీ ఈ పద్యపు ఛందస్సు అని చెప్పడం, లక్షణకర్తల పని. వాళ్ళు అంతకుముందరే రచింపబడి ఉన్న కావ్య రాశిలోని భిన్న పద్యాల ఆధారంగా, ఈ వర్గీకరణలు చేస్తారు. అంటే ముందు కవి రాస్తాడు, తరువాత లక్షణకారులు, లాక్షణిక వర్గీకరణ దృష్టితో, ఆ పద్యాల స్వరూప సంబంధ వివరణలు, పట్టికలు, నిర్మాణ పరిశోధనలు, వ్యాకరణ పరీక్షలు చేస్తారు. వీరెవరూ పద్యాలు రాయరు సాధారణంగా. కానీ వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలో, తొలిసారిగా తానే ఒక లక్షణం చెప్పి, ఆ ఛందస్సుకు పేరు పెట్టి, తానే ఆ ఛందస్సులో మూడు వందలకు పైగా పద్యాలు రాసిన తొలి లక్ష్య, లక్షణకర్త గురజాడ అప్పారావు. ఆ ఛందస్సు ముత్యాలసరము. 1910 అక్టోబరులో తను ఈ ముత్యాలసరము ఛందస్సులో, అదే పేరుగల గేయం రాశాడు. రచనలో గేయం, ఒక కొత్త ఛందస్సులో ఉంది. అంతేకాక కొత్త ఆలోచనలకు సత్యాల స్వరంలా వెలుగుతోంది.

ముత్యాలసరం అభ్యుదయ ఛందస్సు. తెలుగు కన్నడ హరిణ గతి రగడలు, వసు చరిత్రలో ఉన్న ఒక పద్యం,

'గుమ్మడేడే గోపీ తల్లీ, గుమ్మడేడే ముద్దుగుమ్మా గుమ్మడేడే కన్నతల్లీ గుమ్మడేడమ్మా' ఇవన్నిటినీ, ఒక పార్శీ ఛందస్సుని కూడా దృష్టిలో పెట్టుకుని తన పద్నాలుగు మాత్రల మూడు లైన్లు, ఆఖరిది తొమ్మిది నుంచి పద్నాలుగు అంటూ గురజాడ, చేసిన పాత కొత్తల మేలు కలయిక ఈ ఛందస్సు. అందుకే ముత్యాలసరం తొలి చరణమే ఈ ఉదార లౌకిక సరళ నిర్మాణానికి శ్రీకారం.

'గుత్తునా ముత్యాల సరములు
కూర్చుకుని తేటైన మాటల
కొత్త పాతల మేలు కలయిక
క్రొమ్మెరుంగులు జిమ్మగా'

సాంఘిక పరిణామములో కొత్త ఆలోచనలు కలిగి ఉండి, వైజ్ఞానిక స్ఫూర్తితో, తర్క వివేచనతో, సమాజ అసమానతలకు ఏవి కారణం అని తలుస్తున్నామో వాటితో బౌద్ధిక సంఘర్షణ నమోదు చేస్తూ, అదే సమయంలో ఆ రచనలు, నిర్మాణ మెలకువలో చక్కగా తరతరాలు గానం చేయగలిగే గేయాలుగా ఉండడం, ముత్యాలసరం ద్వారా గురజాడ తలపెట్టిన మార్పు. ఇది దైవాశ్రితంగా ఉన్న అందాల, బంధాల, ప్రబంధాల మేడల్లో ఉన్న తెలుగు కవిత్వానికి సామాన్య పట్టాభిషేకం చేసిన కవి తిరుగుబాటు. ముత్యాలసరంలో ఒక్క దైవ స్తుతి కూడా గురజాడ చేయలేదు. ఒక్క చౌకబారు అభిరుచుల పద్యం కూడా రాయలేదు. ఆయనకు ముత్యాలసరం జన ప్రయోజన మహాయాత్రలో పరమం, పవిత్రం, ప్రశాంత ప్రతాప సన్నిభం అయిన ఒక పనిముట్టు. ముత్యాలసరాలు, కవి భావుకత వ్యక్తం చేసే ప్రకృతి, మానవ స్వభావ ఆరాధన, ఆవేదనలతో నిండిన ఖండ కావ్యాలు కావు. అవి పూర్తి కావ్యాలు. చాలామటుకు గేయ కథానికలు. కథానుసార కవిత్వమే తప్ప, ఊహాలోకాల్లో రాసే కవిత్వాల హంగామా కాదు. ఇరవయ్యో శతాబ్దానికి, అనంతర కాలానికీ, మానవ జీవనానికీ, సరళ ఛందస్సుకి సంబంధం ఉండాలి అంటే, ముత్యాలసరం, ఒక మేలిమి ఉదాహరణ. ఏదో ఒక ప్రయోగంగా చెప్పిన నాలుగు పద్యాలుగా కాక, ప్రసిద్ధమూ, విజయవంతమూ అయిన జనరంజక కావ్యాలు లవణరాజు కల, డామన్ పితియస్, కన్యక, దేశభక్తి, పూర్ణమ్మ ... ఇంకా కొన్ని గురజాడ ఈ ఛందస్సులోనే రాశారు.

ఏడు మాత్రలకు ఒకసారి విరామంతో పద్నాలుగు మాత్రల మూడు పంక్తులూ, నాలుగో లైన్‌లో, అయితే తొమ్మిది, లేదా పద్నాలుగు వరకూ ఎన్నయినా మాత్రలు ఉండవచ్చు అని గురజాడ కవులకు, సృజన స్వాతంత్ర్యం ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. గణ విభజనలు చేయలేదు. ప్రాస విషయంలో కొంత సడలింపు కలిగించారు. ఎందుకంటే, తెలుగులో ఇంతగా పట్టించుకునే ప్రాస, సంస్కృత కవిత్వంలో ఉండదు. అందుకే గురజాడ 'నేను ఎరిగియే యతి ప్రాసములను, అలంకారములను ముత్యాలసరములో ప్రయోగించితిని. నియమముగా ఉంచిన ఎడల యతి ప్రాసములకు గాను తెచ్చిపెట్టుకున్న శబ్దములు, అర్థ పటుత్వమును చెరిచి, సందర్భమును తప్పించి ఈడ్చుకు పోవును' అని వివరించారు. గురజాడ ముత్యాలసరములో రచనలు మొదలు పెట్టిన నాటికి దాదాపు ఐదో పడికి దగ్గరవుతున్నారు. బతికిన యాభై ఐదేళ్లలోనూ, చివరి ఐదేళ్లలో మాత్రమే గురజాడ, ఈ పద్ధతిలో తన కవితలు రాశారు. ఈ సరళ అభ్యుదయ ఛందస్సుని ఆయన ఎంత రాశారు, అందులో లోపాలు ఏమి ఉన్నాయి అన్న శుష్క చర్చగా కాక, ఇంకా సంపన్నం చేస్తూ, ప్రజానురంజకం చేసి నేటి తరాలు కూడా నాలుగు పంక్తుల ముత్యాల సరం రాసేలా ప్రేరణ, పూనిక, ప్రోత్సాహం కలిగించాల్సిన బాధ్యత మన మీద ఉంది. గురజాడ వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంలోనే లక్ష్య లక్షణ కర్తగా మొదటివాడు. వారి ఛందస్సు

గురించి శ్రీశ్రీ ఇలా అన్నారు, ముత్యాలసరము - ఒక కృషి అనే వ్యాసంలో : 'ముత్యాలసరము అంటే మనకు గురజాడ అప్పారావు గారి పేరే జ్ఞాపకం వస్తుంది. అతడా గేయం పలికి దానిని ముత్యాల సరము అని నామకరణం చేశాడు. ఒక నూత్నావేశానికి వాహనంగా చేసుకుని ఒక స్వతంత్ర కవిత్వాన్ని విడుదల చేశాడు. గురజాడ అప్పారావుదే ఈ ఛందస్సు'. 'ఏ కవికైనా సరే అతని చుట్టూ ఒక సమాజం, ఆ సమాజానికొక చరిత్రా, ఆ చరిత్రకొక సాహిత్య స్థానం నిర్ణీతమవుతుంది. కవి ప్రగతిశీలీ, ప్రతిభాశాలీ అయితే ఆ గమనాన్ని అతడు వేగవంతం చేస్తాడు. సామాజిక పరిణామానికి విప్లవపంథాలో వేగం సాధించిన మహాకవిగా గురజాడ అప్పారావుకి నేను నమస్కరిస్తున్నాను'.

ఈ ఛందస్సులో దేవులపల్లి కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు, శ్రీశ్రీ, విశ్వనాథ, రాంభట్ల కృష్ణమూర్తి, ఇంకా ఎందరో ప్రసిద్ధ కవులు తమ రచనలు చేశారు. లక్షణ నిర్వచనమే కాక, కావ్య వైశాల్యం కూడా సిద్ధించిన ముత్యాలసరం, ఇరవయ్యో శతాబ్దపు ఆధునిక అభ్యుదయ ఛందస్సుగా, నేటి లాక్షణిక వర్గం మాత్రం గుర్తించడానికి సిద్ధంగా లేదు. పలు కావ్య ప్రయోగాలు జరిగి, శతాబ్దంగా తెలుగు ఛందస్సుల్లో అది నిలబడి ఉండగా, కేవలం లక్షణ క్రమ పరిణామం, సాహిత్య భాషా చరిత్రలో భాగంగా నమోదు చేయవల్సిన బాధ్యత మాత్రమే గల చరిత్రకారులు దీనిని గుర్తించకపోగా, ఆధునిక వికృతి అంటున్నారు. దీన్ని ఏ మేరకు ఇలా పిలిచి, ఒక శతాబ్ది సృజనను, నిరాకరిస్తున్నారో చెప్పవల్సిన బాధ్యత వీరికి ఉంది. ఇరవయ్యో శతాబ్దపు ఆధునిక తెలుగు పద్య/ గేయ ఛందస్సుల్లో ముత్యాలసరం స్థానాన్ని గుర్తించి, సాహిత్యాభిమానులు, నేటితరాల పిల్లలు, ఈ నాలుగు పంక్తుల ముత్యాలసరం రాసేలా ప్రోత్సహించడం, అభ్యుదయ ఛందస్సు అభివృద్ధికీ, ఉత్తరాంధ్ర/ కళింగాంధ్ర ప్రాంతపు సాహిత్య చరిత్రకు చాలా అవసరమైన కార్యాచరణ.

- రామతీర్థ
98492 00385

A peoples' prosody

RAMA TEERTHA

> 'Mutyala Saralu', penned by legendary Gurajada Apparao in 1910, heralded the beginning of modern poetry in Telugu language. In this compilation of poems, the traditional metre is replaced by a new lyrical and four beat balladic rhythm and they reflected the general social transformation in India

Gathering pearls, from the ocean of time, Gurajada Apparao, strung them to suit the times of the vox populi, which needed a simple expression of robust experiences of life, and a stupendous optimism about the future centuries. In the year 1910, Gurajada, nearing fifties, returned from an all caste-feast at Berhampur, the Haley Comet spectacular, accompanying him in the sky, and reeled out to his half-asleep wife, the events in the social space, and as well as the spatial scale. Thus, born was his string of pearls – in Telugu, Mutyala Saramu, a prosody of the modern times full of scientific temper and social consciousness.

The year 1910 is also significant for his few poems in this prosodic pattern started to appear in the periodicals. From July to August, three poems Mutyala Saramu, Kasulu, Damon and Pythias, and in the month of November, the same year Lavana Raju Kala, (The dream of Lavana Raju) were printed in Andhra Bharathi, edited by Ayyanki Venkata Ramanayya, published from Machilipatnam.

In arranging Mutyala Saramu, Gurajada had drawn from the Matra and Desi Chandhassu (Prosodic styles of Harina Jaathi and Vrishabha Jaathi Ragadas, common in Kannada and Telugu), and from the folk songs of women like Gummadede Gopi Devee (Where is the kid o, Gopi Devi?). Though the prosodic pattern coming closer to this is styled as Vrushabha Ragada was used sparingly by different medieval era poets, Ramaraja Bhushana, Nandi Timmana, and Gopnathamu Venkata Kavi, in Vasu Charitra, Parijathapaharanamu, Gopinatha Ramayanamu, and works by other poets, Chandrika Parinayamu, Talaka Nandinee Parinayamu, etc.

No poet named them as Mutyala Saramu. Making his style of 14 matras (Matra can be called as syllable that can be pronounced in one effort) of three lines and the fourth and last one to range between 9 and 14 matras, Gurajada, also stated that while fixing the matra requirements of this prosody, he had in mind even one Parsi Ghajal pattern also. In such steady blend of the old and new, the bard made his style and in the first verse, he wrote in this fashion said– "Shall I knit the pearl strings gathering the lucid words, with the blend of the old and new shining anew". True to the stanza, his efforts to define this style, from the old and new, augured well, to suit the modern times.



Gurajada Apparao

Gurajada in all his handful of lyrical stories produced more than three hundred verses of Mutyala Saramu, and the output is entirely secular and reflects the social and philosophical mindset of the poet, who aspires to the emergence of model societies based on egalitarian outlook and social space for all. No single verse of this prosody was written in praise of the almighty or lost in the charming wilderness of waxing eloquent about the female body.

No earlier poet in the last millennium ranging from Nannaya, considered to be the first Telugu poet called any prosodic style, to be his own making. Many poets, in the flow of centuries, have written their works in the prosodic styles existing. Thus, the place of Gurajada is distinct and unique, since he is the only one poet, who defined a simple metre and produced artistic works in that style and the major poets who followed him in time, also have produced their famous works in this prosodic style.

Truly termed to be Abhyudaya Chandhasssu, (progressive prosody) this Mutyala Saramu, is simple and as of right adherents and followers of the legacy of Gurajada, by this time, measures to popularise and propagate, the simple and effective style of writing Mutyala Saramu, should have been tried among the younger generations. After all writing four-line stanza of prescribed verse will be a matter of interest and challenge to the young minds as well. Such implementation will attract the attention of literati to write, and draws ordinary folks, to sing and perform to the appealing lines. Planning a great connection to the simple style of writing, through Mutyala Saramu, now it will be an important step to inspire the society, young minds, and also to conserve and develop the democratic tradition ushered in by the great bard Gurajada. Hence it is our earnest priority to promote the Mutyala Saramu as the peoples' prosody, which looks beyond any barriers, to make the whole world, a home, the quality policy pronounced by Gurajada about hundred and eight years ago.

- The writer is a bi-lingual poet, translator, critic, columnist and an orator.

‘మట్టిబండి’లో కన్యాశుల్క జైత్రయాత్ర

అలనాటి భాగీరథి సగరుడి పూర్వీకులను పునీతమొనర్చినట్టే, ‘కన్యాశుల్క’ పావన జలాలు మానవాళి అడియాసలకు తిరిగి పొంగెత్తే ఆశల రంగులిస్తాయి. పాతకొత్తల మేలు కలయికగా గతాన్ని దట్టించి, వర్తమానాన్ని ముట్టించి, భవితను రెట్టింపుగా సుసాధ్యం చేస్తాయి. అందుకే ఇవాళ నూట పాతికో మైలురాయి దగ్గర ఆ నాటకం, మన కన్నా ముందు నిలబడి, “నాతో రాగల ధీరులెవ్వరో తెల్పుడీ” అంటూ తెలుగు వారిని పేరు పేరునా పలకరిస్తున్నది.

పురాణ ఇతిహాసాల పరికల్పనలు కేవలం పండిత లోకం ప్రజలకు చెప్పే గాథలుగానే ఉండే కాలం రెండువేల అయిదు వందల ఏళ్ల కిందటిది. ఇవి దృశ్యమానం అయితే ఎలా ఉంటాయి; ఆ రాముడు, ఆ కృష్ణుడు, ఆ రావణుడు, ఆ కౌరవ పాండవులు, ఎలా వీరిని శ్రవ్య గాథల లోంచి దృశ్యకోణంలోకి తీసుకు రావడం? భాస మహాకవి తొలిసారిగా రంగస్థలం అనేదాన్ని భారతీయ సాహిత్యంలో ఊహ చేశాడు. పెద్ద పెద్ద రచనల నుంచి చిన్న ఇతివృత్తాలను ప్రదర్శన యోగ్యంగా మలిచాడు. జన కోలాహలం ఉండే తీర్థాలు, క్షేత్రాలు, వారాంతపు సంతలు, ఇవన్నీ ఈ ప్రదర్శనలకు అనువైన ప్రదేశాలు. భాస నాటక చక్రం పేరిట- రామాయణంపై మూడు, భారతంపై ఏడు, తాను స్వయంగా చెప్పిన నాటక కథలు మూడు. ఈ మూడింటిలో రెండు- ‘ప్రతిజ్ఞా యౌగంధరాయణం’, ‘స్వప్న వాసవదత్తం’ కాగా, ఆఖరుది- సాదా సీదా ప్రజలకు చెందిన నాటకం. అదే ‘దరిద్ర చారుదత్తం’. అయిదు అంకాలుగా ఈ కథ చెప్పాడు భాస మహాకవి. అయితే ఇది అసంపూర్ణంగా ఉన్న కారణం చేత, తరువాతి శతాబ్దాల్లో శూద్రక మహాకవి ఈ నాటకాన్ని పది అంకాలుగా పూర్తిచేసి, దీనికి ‘మృచ్ఛకటికం’ (మట్టిబండి)అని పేరుపెట్టాడు. పేరు దగ్గరి నుంచీ శూద్రకుని ఈ నాటకం భాసుడి కొత్తదనాలకు మరింత సంపన్నత తెచ్చి పెట్టింది. వెరసి రెండువేల ఏళ్ల కిందటే, సామాన్య పౌరులు, కన్నం దొంగలు, జూద గాళ్ళు, వేశ్యలు, అధికారం చెలాయించే రాజుగారి బావమరుదులు, విప్లవ కారులు, అందరూ భారతీయ నాటకంలోకి కదిలి వచ్చారు.

శూద్రక కవి ‘మట్టి బండి’ నాటకం పేరు పెట్టడంలోనే, నాయికానాయకుల పేర్లు ఏవీ లేకుండా, కథలో ఒక కీలక అంశమైన ‘మట్టి బండి’ పేరు పెట్టి దీన్ని బతుకు మట్టి బండిగా చెక్కాడు. ఇద్దరు స్రష్టల నవ్య ప్రియత్వ భూమిక అయిన ఈ నాటకం ప్రభావంలోనే, తెలుగు వారి ఆధునిక నాటకం 1892లో మూడు పదుల యువకుడైన గురజాడ అప్పారావు కలం నుంచి రూపు దిద్దుకున్నది.

19వ శతాబ్దంలో, వాడుక వచన భాషలో గురజాడ ఎలా ఒక పూర్తి నాటకాన్ని నిర్మించాడో, ఈ నిర్మాణం కోసం ఎలా పాత్రలకు తగిన మాట తీరు, వ్యవహారిక తెనుగు వాడాడో చూస్తే, తెలుగు మాట స్పెల్లింగ్ కూడా, గురజాడ రాసినంత కొత్తగా, తరువాతి ఆధునిక రచయితలు రాయలేక పోయారని గ్రహిస్తాము. ఈ ధైర్యం ఆయనకు కలగడానికి కారణం వేలఏళ్ల కిందటి ‘మట్టి బండి’లోనే ఉన్నది. "కొన్ని మాటలు పలికినవి పలికినట్టు రాయడానికి, నాకు తెలుగులో అక్షరాలు సరిపోవడం లేదు, అటువంటి కొత్త అక్షరాలు కావాలి" అని తన కన్యాశుల్కం రెండో పీఠికలో కోరిన అసాధ్యుడు గురజాడ. ఇదే పాత్రలకు తగిన మాట తీరు అలనాడు శూద్రకుడు ‘మట్టిబండి’లో వాడాడు. అప్పటికే, దేవనాగరి ఉత్తర భారత దేశంలో ఎన్నో పలుకుబళ్లలో ఉన్నది. ప్రజలే పాత్రలు అయిన ఈ నాటకంలో, శూద్రక కవి నాటకం పేరు నాయికా నాయకుల పేర్లను విస్మరించి, కొత్తగా పెట్టడం, నాటక ప్రదర్శన నియమావళి పాటించక పోవడం, జనసామాన్య కథను కళాత్మక బిగింపుతో ప్రదర్శన యోగ్య నాటకంగా మలచడం, హాస్య రీతిలో కథన పద్ధతిని ఎంచుకోవడం, తన పాత్రలచే భిన్న ప్రాంతీయ పలుకుబడులను మాట్లాడించడం, ఆట ఎక్కడచూసినా, అక్కడి ప్రజలు నాటకంతో మమేకమయ్యేలా జాగ్రత్తలు తీసుకోవడం, ఇవన్నీ చేశాడు. పాత్రల పలుకుబళ్ళు ఆయా ప్రాంతాల పరిమళాలతో ఉండడం శూద్రక కవి చూపిన విశేషం.

ఈ ప్రత్యేకతలను మనం కన్యాశుల్కం నాటకంలో కూడా చూస్తాము. ఒక్క గిరీశం మాత్రమే పట్టణీకరణ చెందిన తెలుగులో ఇంగ్లిష్ మాటలు కలిపి మాట్లాడతాడు. మిగతా పాత్రల మాటతీరు గురజాడ ఎంత జాగ్రత్తగా ఎంపికచేశారంటే, వైదిక బ్రాహ్మణుల మాట తీరు, మఠం శీనులో కలగలిసే భిన్నస్వరాలు చూస్తాము. నాటకం మొదటి దృశ్యాలలోనే, నాజూకు మాటలాడే నాగరికత లేనివాడు పొటిగరాప్పంతులు నౌకరు. ఇలా మాట్లాడేది ఎవరు? ఆ నౌకరే! అతని యజమాని కూడా కొంచెం నాగరికంగానే మాట్లాడుతాడు, ఎందుకంటే ఫోటో స్టుడియో నడుపుతున్నాడు కనుక. ఫోటోగ్రాఫ్లు తీస్తున్నాడు కనుక. –నౌకరు పలికేది పొటిగరాపులు అనే. ఈ మాటల్లోనే ఆ పాత్రను పరిచయం చేశారు రచయిత. ఇది శూద్రక మహాకవి తీసుకున్న జాగ్రత్తలకు తీసిపోని విధానం.

మృచ్ఛకటికంలో పాచికలాట ఉంటుంది, కన్యాశుల్కంలో పేకాట. శృంగారం రెండు వేల ఏళ్ల కిందట ఎలా జనులకు ఒక శక్తివంతమైన ధ్యాసో, పరిమితుల సరళత కూడా ఆ సమాజంలో ఎంతగా ఉన్నదో, శూద్రక కవి చూపుతాడు. ఆ నాటకంలో రక్షకభటులు ఉన్నారు, ఇక్కడా పోలీసు హెడ్, కనిపించని ఎస్.ఐ ఉన్నారు. శకారుడు, తన దురుసు ప్రవర్తనలో, మాటలను డాబుసరిగా లేనివి ఉన్నట్టుగా పలకడం అనే లక్షణం ఉన్నవాడు. కన్యాశుల్కంలో గిరీశం ఈ శకారుడి పోలికల్లో ఉంటాడు. శకారుడు పొరపాటున ఇతిహాసాల్లోని, పురాణాల్లోని పాత్రలను కలగాపులగంచేసి మాట్లాడేస్తూ ఉంటాడు. ఇదే, చాలా శతాబ్దాల తర్వాత ఇంగ్లిష్ నాటకల్లో కూడా ‘మాలప్రాపిజమ్’గా మిసెస్ మాలప్రాప్ అనే పాత్ర ఇలా కలగాపులగంగా మాట్లాడడం వలన ఏర్పడ్డది. శ్రీమతి ‘మాలాప్రోప్’ అనే పాత్ర 1755లో రిచర్డ్ షెరిడన్ రాసిన ‘ది రైవల్స్’ నాటకంలో దర్శనం ఇస్తుంది. ఇది భారతీయ నాటక రంగం దాదాపు పదిహేను వందల ఏళ్ల కిందటే, శూద్రక కవి రచనలో, శకారుడి ఒక సాకార లక్షణంగా చూపెట్టి, భారతీయ నాటక రంగ శక్తి ఏమిటో కాలానికి నిరూపణ వదిలిపెట్టింది.

పాత గాథల పాత్రలను కలగాపులగం చేయకపోయినా, అడ్డమైన కోతలరాయుడిగా గిరీశం స్వభావ చిత్రణలో ఒక ప్రత్యేకతను చొప్పించారు గురజాడ. ఇందులో వేల ఏళ్ల కిందటి ఒక శకారుడు, తనకు నూట యాభై ఏళ్ల కాలం కిందటి ఒక ‘శ్రీమతి మాలప్రాప్’ కూడా కనిపిస్తారు. తన నాటక రచనా ప్రక్రియలో భాగంగా గురజాడ షెరిడన్ నాటకం ‘ది రైవల్స్’ చదివారు కూడా. ఈ దృష్టాంతాలు గురజాడ వారి లైబ్రరీలోని ఈ పుస్తకంలోనే ఉన్నాయి.

శూద్రక కవి రచనలో ఎక్కడా నేరం ఉండదు. ఆర్యకుడి పరివారం అయిన విప్లవకారులు రాజుని చంపి వేసి, తామే రాజ్యాధికారం చేపట్టారన్న వార్త ఊరేగింపుగావచ్చే ఆర్యకుడి కోలాహలం ద్వారా తెలియడం తప్ప ఇంకో సంఘటన ఉండదు. ఇది నాటకంలో దృశ్యమానం కాదు. గురజాడ కన్యాశుల్కంలోనూ నేరం జరగదు, నేరం జరిగిందన్న భావన మాత్రమే రామచంద్రపురం వాసుల మూర్ఖత్వాలకు మంగళ గీతం పాడుతుంది. వారెవరూ కోర్టుకు రారు. బుచ్చమ్మ విషయంలో గిరీశం ఎవరో ఏమీ చెప్పలేక పోతాడు కోపం తప్ప మరో తెలివి లేని అగ్నిహోత్రావధాన్లు, కేసు రాసుకోండి అంటూ ఎద్దేవాచేసి మూసేస్తాడు డిప్టీ కలెక్టర్. కోర్టులకు అందని గిరీశం మోసాన్ని మధురవాణి సాయంతో నిలుపుదల చేస్తాడు, తానూ ఒక ప్లీడరే అయిన సౌజన్యారావు.

కన్యాశుల్కం నాటకం నేడు నూట పాతికేళ్ళ ఏకైక ఆధునిక భారతీయ సజీవ నాటకంగా నిలిచిందీ అంటే, మనం చెప్పే ఎన్నో సహేతుకమైన కారణాలతో బాటు, ప్రజలే పాత్రలైన ప్రదర్శన రూపొందిద్దాం అన్న వేలఏళ్ల నాటి భాసుని జేగీయమాన జన చింతన తలకెత్తుకుని శూద్రక మహాకవి స్పర్శవేదిగా నిర్మించిన మృచ్ఛకటికం ప్రాణ తేజం అయిన పట్టిందల్లా బంగారం అయ్యే శక్తిని గురజాడ పొందటమూ ఒక కారణం. అందుకే, కన్యాశుల్క కోలాహలంలో దాగిఉన్న మహానది మృచ్ఛకటికం కూడా. నదులను కలపగలిగిన వారిని భగీరథులు అంటాము. ఆ కోవలో గురజాడ కూడా ఆధునిక మహాప్రవాహానికి దారులుతీసిన అక్షర భగీరథుడే. అలనాటి భాగీరథి సగరుడి పూర్వీకులను పునీతమొనర్చినట్టే, కన్యాశుల్క పావన జలాలు మానవాళి అడియాసలకు తిరిగి పొంగెత్తే ఆశల రంగులిస్తాయి. పాతకొత్తల మేలు కలయికగా గతాన్ని దట్టించి, వర్తమానాన్ని ముట్టించి, భవితను రెట్టింపుగా సుసాధ్యం చేస్తాయి.

అందుకే సాగుతున్నది మట్టి బండిలో, మట్టి గుండెల కన్యాశుల్క ధ్వన్యాలోక జైత్ర యాత్ర. ఇది జీవన పాత్రోచిత ఆకాంక్షా కేతనాలెత్తి నడిచే దరిద్ర చారుదత్తుల, ప్రేమ స్వరూపిణులైన వసంతసేన, మధుర వాణుల, పిచ్చి బుచ్చమ్మల, రదనికల, మీనాక్షుల, శర్విలకుల, వెర్రి వెంకటేశాల సౌజన్య చైతన్య ఉత్తుంగ కోలాహలం. దీనికే గురజాడ పెట్టిన పేరు, పాత కొత్తల మేలు కలయిక. 1910లో ముత్యాల సరాలలో ఈ లక్ష్యం తనది అని వాచ్యం చేశాడు కానీ, మహారాజా ఆనంద గజపతి ప్రేరణతో తాను యువకుడిగా రాసిన 1892 నాటి నాటక రచనలోనే, ఈ కళా ప్రమాణాల కోసమని వ్యవహారిక గంగావతరణానికి నడుం కట్టి, వ్యవహారికం అంటే కేవలం భాష కాదు అనీ మొత్తం జీవన వ్యవహారమే ప్రజానుకూల పథాల పయనించాలనీ అందుకై సాహిత్య దీపాలు తాను వెలిగిస్తాననీ ముందుకొచ్చిన సృజన దీపక రాగం గురజాడ అప్పారావు. అందుకే ఇవాళ నూట పాతికో మైలు రాయి దగ్గర ఆయన నాటకం, మన కన్నా ముందు నిలబడి, "నేనింకా ముందుకు పోతాను, నాతో రాగల ధీరులెవ్వరో తెల్పుడీ" అంటూ తెలుగు వారిని పేరు పేరునా పలకరిస్తున్నది.

మహాకవి మనకిచ్చిన మహత్తర కానుక పట్ల కృతజ్ఞతా భారంతో మరిన్ని ఆచరణల దారులుతీస్తూ, నవీన సృజనతో ఎదురెళ్లడమే వర్తమానతరాలుగా మనం చేయవలసిన పని.

■ రామతీర్థ
98492 00385

(గురజాడ ‘కన్యాశుల్కం’ తొలి ప్రదర్శన జరిగి 125 ఏళ్లయిన సందర్భంగా ఆగస్ట్ 25 నుంచి 27 వరకు విజయనగరం, విశాఖపట్నం వేదికల్లో జాతీయ ఉత్సవాలు జరుగుతాయి.)

పీకే అంటే పవర్ ఆఫ్ నాలెడ్జ్

చిన్న చిన్న ప్రశ్నలతో పెద్ద పెద్ద మూఢ విశ్వాసాలను ప్రశ్నించిన సినిమా పీకే. గ్రహాంతరవాసి ప్రధానపాత్ర కావడం వల్ల, ఈ భూగోళం మీది పెద్ద వింత అయిన విభిన్న ఆరాధనల దేవుడిపై, ఒక పసివాడి తర్కాన్ని ప్రవేశపెట్టిన కళారూపం. మతాలన్నీ ఉలిక్కి పడతాయి అనేది సహజం. గ్రహాంతరవాసులపై సినిమాలు భారతీయ సినిమాలో కొత్తవి కావు. కోయి మిల్ గయా సినిమాలోనూ ప్రధానపాత్ర గ్రహాంతర వాసి. ఆ సినిమా కేవలం వినోదాత్మకం తప్ప మతమౌఢ్యంపై ఎక్కుపెట్టిన చలనచిత్రం కాదు.

23 కిందటే 1982లో వచ్చిన ఇటి, స్టీవెన్ స్పీల్బర్గ్ సినిమా, మెల్లిస్సా మాంథిసన్ రచన. ఇందులో ఒక గ్రహాంతరవాసి ఇటి పేరిట (ఎక్స్ ట్రా టెర్రెస్ట్రియల్) పరిశోధనకు వచ్చి భూగోళంపై దారి తప్పిన ఒక గ్రహాంతర ప్రొఫెసర్. ఒక పసిపిల్లవాడి స్నేహంతో ఎలా తిరిగి తమ గ్రహం చేరుకుంటాడు అన్నది సినిమా. చక్కని దృశ్యాలతో, ఈ భూగోళంపై మిలిటరీ, సైంటిస్టులూ, ఆ గ్రహాంతరవాసిని పట్టుకుని శాస్త్రీయ పరిశోధనలకు గురిచేసి విశ్వాంతరాళ రహస్యాలను తెలుసుకోవడానికి తీవ్రంగా తనకై వెదుకుతుండగా, ఉత్కంఠ పతాక స్థాయికి వెళ్ళి, ఆ గ్రహాంతరవాసి, ఈ గోళంపై పసివారి సహాయంతో తమ స్పేస్‌షిప్‌ను చేరుకుంటాడు.

ఈ సినిమా పాశ్చాత్య హాలీవుడ్‌లో, 1982లో రావడానికి ముందు దీనికి భారతీయ మూలాలు ఉన్నాయి. 1967లో మన ప్రముఖ దర్శకుడు, నిర్మాత సత్యజిత్ రే 'ది ఎలియెన్' పేరిట ఒక స్క్రిప్ట్ రాసి దాదాపు ఇటువంటి సినిమానే, పాశ్చాత్య సినిమారంగంలో నిర్మించేందుకు ప్రయత్నాలు చేశాడు. ఈ సినిమా మిమియో గ్రాఫులు అమెరికాలోనే ఉండిపోయాయి. 1982లో స్పీల్ బెర్గ్ సినిమాలో అదే కథ, సత్యజిత్ రేను ఆశ్చర్యపరచింది. స్పీల్‌బెర్గ్, సత్యజిత్ రే కథను ప్లాగియారైజ్ చేశాడని హాలీవుడ్‌లో దుమారం రేగింది. తాను ఆ సినిమా మిమియో గ్రాఫులు చూడనే లేదని స్పీల్ బెర్గ్ అనగా, అటువంటి అవకాశం లేదని ప్రముఖ సినిమా నిర్మాతలు మార్టిన్ స్కోర్సెసె, రిచర్డ్ అటెంబరో అభిప్రాయపడ్డారు. సత్యజిత్ రే, 'బంకు బాబూర్ బంధు' పేరిట కథగా రాసి, తరువాత స్క్రిప్ట్‌గా తయారు చేసిన గ్రహాంతరవాసి కథలో, వారి పల్లెటూరి చెరువులో ఒక అంతరిక్ష నౌక దిగి, ఆ ఊరి పసివాడు, మూగవాడైన హబా సహాయంతో, వారి ఊరి పొలిమేరలో ఆ నౌకలోని ఒక గ్రహాంతర ప్రొఫెసర్ చేసే వింత పనులు ఈ కథలో ప్రధాన విషయం.

కథాసూత్రం అలానే ఉండగా, దానికి హాలీవుడ్ మెరుగులు దిద్ది, సాంకేతికంగా ఉన్నత విలువలతో స్పీల్‌బెర్గ్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమాకు, పీకేకు గల పోలికలు, స్నేహశీలురైన గ్రహాంతరవాసులను ఈ సినిమాలు చిత్రించాయి. హాలీవుడ్‌లో నిర్మాణమయ్యే అమెరికన్ సినిమాలన్నీ గ్రహాంతరవాసులు మనకు శత్రువులు అన్న థీమ్‌నే రకరకాలుగా చూపాయి. స్టార్‌వార్స్, క్లోజ్ ఎన్‌కౌంటర్స్ ఆఫ్ ద థర్డ్ కైండ్, అలియెన్, అంగారక గ్రహం గురించిన స్వార్జ్‌నెగర్ సినిమాలు ఇవన్నీ వారికీ, మనకీ మధ్య ఊహాజనిత శతృత్వాలనూ, యుద్ధాలనే చూపాయి. ఒక భయపూరిత మనస్తత్వం బహుశా ఇటువంటి సినిమాలు తీయిస్తుందేమో!

ఇలాంటి నేపథ్యంలో గ్రహాంతరవాసులతో స్నేహశీలవర్తనం అతి కొద్ది సినిమాల్లోనే చూస్తాము. 'బంకు బాబూర్ బంధు', ఇటి., కోయి మిల్ గయా వంటి చలనచిత్రాల్లో, కథ సరళంగా, ప్రేమకథ గానో, లేక ఆ గ్రహాంతర వాసి, తిరిగి తన గోళానికి చేరేందుకు మన భూవాసులు (ముఖ్యంగా పిల్లలు) సాయపడడం గురించో అయి ఉంటున్న పరిమితులను, ఒక సామాజిక వ్యంగ్య చిత్రీకరణగా పీకే సినిమా అభివృద్ధి పరిచింది. ఇదీ ఈ సినిమాలో గల విశేషం.

ఒక గ్రహాంతరవాసికి, మన భూగోళం మీది అతి పాత వ్యవస్థ అయిన మతం లేదా మతాలు ఎట్లా కనిపిస్తాయన్న పాయింట్ మీద డెవలప్ చేసిన సినిమా. అలాగని ఏ మతాన్నీ తీవ్రంగా అపహాస్యం చేయకుండా, వారి విశ్వాసాలకు గల పునాదులు, ఒకే ఒక్క దైవం అన్న భావనకు ఎలా విరుద్ధమో చెప్పిన సినిమా. దేవుడు లేడు అని ఈ సినిమా చెప్పడం లేదు.. ఇంతమంది దేవుళ్ళు లేరు అని మాత్రమే చెప్తోంది. తద్వారా, ఈ మతాల ప్రవర్తకులను, కంపెనీ మేనేజర్లుగా చిత్రిస్తూ, వీరు నిజంగా దేవుడితో మాట్లాడడమూ, మొరపెట్టుకోవడమూ చేయగలిగితే, మేలు జరగడంలో ఇంత ఆలస్యం ఎందుకని ప్రశ్నించే గ్రహాంతర వాసి, ముందు ఈ భిన్న భిన్న మతాల పెద్దలు, దేవుడితో సంభాషించే లైన్లు రాంగ్ నెంబర్‌కి వెళు తున్నాయని భావిస్తాడు. తదుపరి, ఈ గోళంపై రెండురకాల దేవుళ్ళు ఉన్నారని, ఒకరు ఈ చరాచర విశ్వాన్ని తయారు చేసినవారు కాగా; రెండోరకం, ఈ భూమిపై నివాసుల తరపున మతాలు తయారుచేసిన దేవుళ్ళు అని ఈ గ్రహాంతర వాసి తెలుసుకుంటాడు. మతాలు మూఢ భక్తులను తయారు చేశాయనీ, సొంత ఆలోచన గల మనుషులను తయారు చేయలేదనీ ఒక చర్చలో ఒక మతానికి చెందిన తపస్వీ అనే బాబాకి స్పష్టం చేస్తాడు.

పీకేలో కథ కన్నా కథనం సినిమా విజయానికి కారణం. చురుకైన అభ్యంతరాలను, ప్రతి మతపు ఆచార వ్యవహారాలపై ఒక గ్రహాంతరవాసి దృష్టితో ప్రవేశపెట్టి, సినిమాలో ప్రధానపాత్ర పీకే, కథకు కేంద్ర బిందువుగా నిలుస్తాడు. మాట్లాడే భోజ్‌పురి యాస గల హిందీ, సినిమాకు బలమైన ఆకర్షణ. ఒక పల్లెటూరి మాండలికం ద్వారా, మన మత కేంద్రిత నాగరికతలు, మేము వేరు, మీరు వేరు అని చెప్పే వేర్పాటు విధానాలు, ఎలా తర్కానికి నిలబడవో చెప్పే ఈ కథలో దుష్ట పాత్రలు లేకపోవడం విశేషం. దేవుడి పేరిట, మనిషిని భయస్థుడిని చేసే మతంకన్నా, దేవుడి పేరిట, మనిషిని ధైర్యవంతుడిని చేసే విధానం ఏదైనా మంచిది కాదా అన్న ప్రశ్న సినిమాలో చివరికి మిగిలే ఆలోచన. దేవుళ్ళకోసం ముఠాలుగా చీలిపోయి, హింసాత్మకంగా మారిపోయిన ప్రపంచ తీరు తెన్నులు ఎంత బలహీనమైన పునాదులపై నిలబడి, మానవాళిని నాశనం చేస్తున్నాయో, ప్రశ్నలుగా నిలిపిన సినిమా పీకే.

గ్రహాంతరవాసులకు సంబంధించిన (తప్పిపోవడం, తిరిగి దారి కనుక్కోవడం వంటి) మూస హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ కథల కన్నా, ఒక మెట్టు పైకి ఎదిగి, ఒక సమాజ పరిశీలనకు గ్రహాంతర వాసిని, ఉపయుక్తంగా వాడుకున్న ప్రతిభ ప్రశంసనీయం. ఇది సత్యజిత్ రే 'ఎలియెన్' చిత్రపు ఆలోచనల వలె, భారతదేశం నుంచే రావడం గమనార్హం. బహు విశ్వాసాలున్న మనదేశం వంటి ఉపఖండ వైవిధ్యం నుంచే ఇటువంటి బహుళ స్వరాలలో అమరిన, పైకి సరళంగా కనిపించే, ఒక జటిలమైన సినిమా రావడం సాధ్యపడుతుంది. సామాజిక సేవలో భారతీయ సినిమా అన్న కోవకు చెందిన చిత్రాల గురించి చెప్పేటప్పుడు, ఈ సినిమా గురించి చెప్పి తీరాలి.

ఇటువంటి విమర్శను ఎక్కుపెట్టడానికి కథాంతర్గతంగా అమర్చుకున్న సౌలభ్యాలు ఏమిటంటే, ప్రధాన పాత్రను ఏ పేరూ లేని (అంటే ఏ మతమూ లేని) ఒక గ్రహాంతరవాసిని చేయడం. ముఖ్యంగా అశాస్త్రీయంగా ఎటువంటి సన్నివేశాలూ లేకపోవడం. పీకే పాత్ర భూమి మీదకి వచ్చినప్పుడు, తన మెడలో వేలాడే రిమోట్ కంట్రోల్ పోగొట్టుకుని, అది తన వద్ద నుంచి గుంజుకుని పారిపోయిన వాడి వద్ద నుంచి తాను దొరక బుచ్చుకున్న ఒక టేప్ రికార్డర్ ఒక్కటే తిరిగి తాను వెళ్ళేటప్పుడు, తన రిమోట్ కంట్రోల్‌తో బాటుగా, తనతో తీసుకువెళ్లే వస్తువు. అదీ తనకు ఎంతో ఇష్టమైన కథానాయిక స్వరాన్ని, తమ గ్రహంపై వినడానికి. నిజానికి, చివర్లో ఆ కథా నాయిక 'ఏమిటి ఇది?' అని అడిగినప్పుడు కూడా, 'భూమి మీది ఎన్నో ధ్వనులను, నాతో తీసుకు వెడుతున్నాను, అక్కడ మా గోళం మీంచి వింటాను' అని చెప్తాడు. అలా వినడం కోసం రెండు పెట్టెలనిండా బేటరీలు కూడా తీసుకు వెళ్తాడు. ఆమె చూడగా అవన్నీ తన స్వరంలో వున్న కేసెట్లే అయి వుంటాయి. సత్యం చెప్పడం తప్ప మరొకటి ఎరగని పీకే, ఈ భూమి మీదకు వచ్చాక అబద్ధాలు చెప్పడం నేర్చుకున్నాడని కథానాయిక వ్యాఖ్యానం చేస్తుంది. శాస్త్రీయంగా సైతం, ఇంకొక గ్రహానికి మనం తీసుకు వెళ్లగలిగేది ధ్వని సముదాయం మాత్రమే! పాకిస్తానీ యువకుడిని భారతీయురాలైన కథానాయిక, బెల్జియంలో ప్రేమించిన ప్రేమికుడిగా మొదట్లో పరిచయం చేసి, పెళ్లి చేసుకుందామనుకున్న వేళలో, తనేదో ఆ చర్చికి రాకుండా, ఒక అనామక ఉత్తరం పంపించి, ఆమెను మోసం చేశాడు అన్న భావన ఒక మబ్బులా కలిగించినా, కథ చివర్లో, ఆ భావన కూడా తప్పు అన్న సౌజన్య కాంతి. పీకే విశ్లేషణతో వెలుగుతుండగా, వెనుకడుగు వేసేది, కేవలం తమకు లేని జ్ఞానం గురించి పెద్దగా మాట్లాడే మతాలే, ఆ మతాల ప్రతినిధులే తప్ప, మనిషిలో విశ్వాసం ఉన్న మానవాళి కాదు. ఈ విధంగా ఇది మేధా క్రమశిక్షణ ఉన్న కళారూపం.

దేవుళ్ళ పేరిట యుద్ధాలు, నరికివేతలు, బాంబులు పేల్చి పౌరులను పొట్టన పెట్టుకోవడాలు, కనుక మనం మనల్ని నిగ్రహించుకుని, ఆపకపోతే, మనుషులు మరణించి, వారి కాలిజోళ్ళు మాత్రమే మిగిలే ఒక సమాజం ఏర్పడుతుందని, ఒక సూఫీ సత్యంలా ఈ సినిమా ప్రబోధిస్తుంది. ఈశ్వరాన్వేషకులెవరూ ఏ మతంలోనున్నా, అభ్యంతర పెట్టలేని విధంగా, ఉపరితల ఆరాధనలేవీ, ఆ పరమమైన శక్తిని చేరడంలో పెద్దగా ఉపకరించవు, మహా అయితే, ఆ ఆచారాలు పాటించిన ఒక ఉపశాంతిని, కొంత సంతృప్తిని మాత్రం ఆ మతావలంబకులకు కలిగించవచ్చు అన్నది సినిమా చెప్పే సత్యం. 'మనుషులు చేసిన దేవుళ్ళారా, మీ పేరేమిటి?' అని వందేళ్లకు ముందు మహాకవి గురజాడ రాసిన కథ, ఇదే ఇంగితాన్ని, శాస్త్రీయ చింతనను చిత్రించింది. మతాల రంగుటద్దాలను, అవి చూపే కపట దృశ్యాలను మించిన ఈ సినిమా కథ, 'ఎవ్వనిచే జనించు' భావనకు ఒక నవీన కల్పన. ఈశ్వరుడిని భావించడంలో, జ్ఞాన రూపేణా అనుభూతం చేసుకోవడంలో కదిలే బొమ్మల కల్పనగా, 'పీకే' సినిమా ఆధునిక కాలపు ఒక శక్తివంతమైన సందేశం.

– రామతీర్థ
98492 00385

రీడింగ్ రూమ్

అభినయం, అభ్యుదయం రెండు కళ్లయిన చిదంబరం

రామతీర్థ
9849200385

విశాఖపట్నం నుంచి నింగికెగిరిన ఒక నటనా పతాక నేడు అవనతం అయింది. నేను కళాకారుడిని కాను కళా ప్రేమికుడిని అని చెప్పుకున్న కొల్లూరు చిదంబరం, తొలి సినిమా 'కళ్ళు'తోనే, అతి కొద్ది మంది నటీ నటులకు సాధ్యమైన రీతిలో, ఆ సినిమా పేరు, తన పేరుకు ముందు నిలబడి పోయేంత ఖ్యాతిని తెచ్చుకున్నారు. తనకు ముఖంలో గల తేడా అయిన కళ్ళు, తన పుట్టుకతో వచ్చిన లక్షణం కాదని, నిద్ర ఆహారం పట్టించుకోకుండా, కళలు, కళాకారులు అంటూ తీవ్రంగా తిరుగుతూ ఉంటే, తన ముప్పయి ఆరో ఏట, వచ్చిన ఎడమకంటి నరాల లాగివేత వల్ల, తన ముఖం అలా రెండు కళ్ళు, రెండు వేపులకు చూస్తున్నట్టుగా తయారు అయిందని ఆయన చెప్పేవారు, ఆ అవకరం వస్తే వచ్చింది గానీ, దానివల్ల సినిమాల్లో నటనకు అవకాశాలు పెరిగాయని, అందువల్లే, తనకంటూ సినిమా రంగంలో ఎవరూ మద్దతు ఇచ్చే వారు లేకున్నా, దాదాపు మూడు వందల సినిమాలల్లో నటించగలిగానని, చిదంబరం చెప్పేవారు. కథలో గల అవసరం బట్టి అవన్నీ దర్శకులు ఇచ్చిన అవకాశాలే తప్ప, తనకు ఏ పెద్ద హీరోల, నిర్మాతల పెట్టుబడిదారుల సపోర్టు లేదని ఆయన నిర్మొహమాటంగా తెలిపేవారు. 1945లో విజయనగరంలోనే పుట్టి, విశాఖపట్నం పోర్ట్ ట్రస్టులో ఉద్యోగం చేస్తూ అసిస్టెంట్ వారు సభలకు వస్తున్నారు అంటే, వారితో పాటే ఒక ఆక్సిజన్ సిలిండర్, దానికొక పొడుగాటి పైపుతో సహా వీపు వెనుక బ్రీథింగ్ కిట్‌తో సహా ఒక ఆరోగ్య వ్యవస్థ తరలి వచ్చేది. వారిని చూసి ఇతరులు కంగారు పడే వారు కానీ, తాను సభలో స్థిరంగా కూచునే వారు. ఆపరిస్థితుల్లో కూడా తనకు ఇష్టమైన విషయం అయితే, ఆసభలకు రాకుండా ఉండే వారు కాదు. మొజాయిక్ సాహిత్య సంస్థ సభల్లో ఎన్నో మార్లు వారు పాల్గొని, తన ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయకుండా, ప్రోత్సాహం అందించిన ఉజ్వల ఘట్టాలను గౌరవంతో గుర్తు చేసుకుంటున్నాను. గురజాడ, శ్రీశ్రీ చాసో, రావిశాస్త్రి, వంటి సాహితీ ఉద్దండుల గురించిన సభల్లో, ప్రసక్తమైన విషయాలను శ్రద్ధగా ఆకళింపు చేసుకుని, తిరిగి వారు చర్చలో పాల్గొనడం, లేదా యువతరం వారితో కులాసాగా నవ్వుతూ, ఉత్సాహంగా కలగలసిపోవడం చేసేవారు. ఒకసారి మా సభలో పాల్గొనవడానికి, ఎక్కడో షూటింగ్ కని హైదరాబాద్‌లో ఉన్నా, మధ్య ఒక రోజు విరామం వస్తే, అక్కడ ఖాళీగా ఉండడం ఇష్టం లేక విశాఖ వచ్చి మొజాయిక్ సభలో పాల్గొని తన జీవితానికి సంబంధించిన ఎన్నో సంగతులు చెప్పారు చిదంబరం. అసలు మొదటి నాటకంలో ఈ దొంగ గుడ్డివాడి పాత్ర లేదనీ, దీన్ని సినిమా కోసమే తామే సృష్టించామని, యువ దర్శకుడు ఎల్.సత్యానంద్ చెప్పారు. కళ్ళు సినిమాలో చిదంబరం మాటలు రాసినది నడిమింటి నరసింగరావు. ఈ పాత్ర అభినయానికే చిదంబరాన్ని నంది అవార్డు వరించింది. తనకు కళ్ళు లేకున్నా మనో నేత్రాలునాయని ఈ పాత్ర సినిమాలో అంటూ ఉంటుంది. హైదరాబాద్‌లో వీరు షూటింగులకు వెళ్ళినప్పుడల్లా దిగే హొటల్‌కు దగ్గరలో నివసించే వారి, వీరి స్థానిక రెండు వేల దాకా ధన సహాయం చేసే ఒక పద్ధతిని కూడా చిదంబరం మొదలు పెట్టారు. ప్రస్తుతం నగరానికి నడి బొడ్డున ఉన్న, పాత జైలు మైదానంలో, మంచి రంగస్థలం ప్రభుత్వం ఏర్పాటు చేయాలని, దాని ద్వారా, నాటక రంగానికి, వర్ధమాన నటులకూ ప్రోత్సాహ వాతావరణం నగరంలో, ఉత్తరాంధ్రలో ఏర్పడుతుందని, కొంత కార్యాచరణను వి.వి. రామారావు, సి.ఎస్.రావు, వంటి వారితో కలిసి చేసిన ముందు చూపు గల అంకిత భావనల ఆచరణ శీలి చిదంబరం గారు. తను ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కూడా, ఇటీవలే, గురు రాఘవేంద్ర, నాటకాన్ని, కళా భారతిలో విజయవంతంగా ప్రదర్శన చేయించి, శ్రీపాద వెంకన్న గారిని సముచితంగా సత్కరించి సహాయం అందించిన మంచి ఆర్గనైజరు ఆయన. వారి నిర్మాణ దక్షత, వారి సాంస్కృతిక జీవితం అంతా ప్రతిఫలించింది. కళలో మితి మీరిన వ్యాపార పోకడలను నిశితంగా ఖండించే వ్యక్తి ఆయన. సినిమా అనారోగ్యకరం అయిన భావాల మార్కెట్‌గా తయారు అయిందన్న భావన వారిలో బలంగా ఉండేది. ఇందుకు ప్రత్నామ్నాయంగా మనం నాటకాన్ని, ప్రజల కళారూపంగా బతికించుకోవాలని వారి బలమైన తపన. దీని అనుగుణంగా విశాఖలో బాదంగీర్ సాయి వంటి నాటకోద్యమకారుల కృషిలో, తన మద్దతుని కూడా అందించిన సీనియర్ కళాకారుడు చిదంబరం. మంచి చదువరిగా ఇంజనీర్‌గా పదవిలో పైకి ఎదిగినా నటనావకాశాలు ఎక్కువయ్యాక ఉద్యోగం నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని, తన నివాసం ఎక్కడికీ మార్చకుండా, నటనకై పిలుపుల వచ్చినప్పుడల్లా ఆ షూటింగులకు ఎక్కడికైనా వెళ్ళి వచ్చేసే విశాఖ ప్రేమికుడు ఆయన. సినిమా భాషలో చెప్పాలంటే, మంచి రైజ్‌లో ఉండగానే మూడు వందల సినిమాలలో నటించినప్పటికీ, గాజు మేడలతో నిండి ఉండే సినిమా రంగంపై నిష్కర్షగా తన అభిప్రాయాలను చెప్పిన నిష్కపలి కళ్ళు చిదంబరం, అలా ఒక టి.వి.ఛానెల్‌కు తాను నిజంగా ప్రస్తుత సినిమా రంగం గురించి ఏమనుకుంటున్నదీ చెప్పాక అసలే ముఖస్తుతి ఆత్మ స్తుతి, లౌక్యపు మాటల రంగులు పూసుకునే వ్యాపార రంగం అయిన సినిమా వాళ్ళు, సహజంగానే చిదంబరాన్ని కొంత పక్కకు ఉంచారు. తన అనారోగ్యంతో పాటుగా, అది కూడా వారు విశాఖలో ఎక్కువ కాలం గడపడానికి ఒక కారణం అయింది. మొదటి సినిమా కళ్ళుకే, నంది అవార్డు, కళా సాగర్ అవార్డు పొందిన ప్రతిభ గల ఈ నటుడికి, సాహిత్యం, ఇతర కళాలు అంటే ప్రేమ గౌరవం, తోటి కళాకారులు అంటే విపరతం అయిన అభిమానం. ఆ అభిమానం వారి చేత సకల కళాకారుల సమాఖ్య విశాఖలో ఏర్పాటు చేసేలా, కార్యాచరణకి దారులు తీసింది. వారికి సామాజిక జీవితంలో కళాకారులు అన్న గుర్తింపు ద్వారా, ఎంతో కొంత లబ్ధి, కొన్ని రాయితీలు లభ్యమయ్యేలా చూద్దామని చిదంబరం జీవితకాలం తపన పడ్డారు. ఈ సమాఖ్యలో పదకొండువందల అరవై మంది కళాకారులు సభ్యులుగా ఉండడం, చిదంబరం గారి కార్య కుశలతను, అంకిత భావాన్ని తెలుపుతుంది. విశాఖపట్నంలో కళా భారతిలో జరిగే నాటక ప్రదర్శనలకు, అలాగే విశాఖపట్నం పౌర గ్రంథాలయంలో జరిగే సాహిత్య సభలకు విశేషించి, చిదంబరం ఆరోగ్యం బాగున్నప్పుడూ, కొంత నలతగా ఉన్నా కూడా శ్రద్ధగా వచ్చేవారు. మరీ ఇటీవలి నెలల్లో, ప్రయాణాలను చూసే రామకృష్ణ అనే సాఫ్ట్ వేర్ ఇంజనీర్, చిదంబరం వేసిన వేషాలకు పారితోషికం కూడా నిర్మాతల నుంచి తీసుకోకుండా విశాఖకు మరలి వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేసుకున్నారు. ఒకసారి పార్టీకి వెళ్ళినప్పుడు, కొంటామని యువత ఆటోగ్రాఫులకై దగ్గరికొస్తే, చిదంబరం, వారికి ఆటో గ్రాపుల నిస్తూ, తన మాటగా లవ్ ద సొసైటీ అని రాశారట. ఈ సాఫ్ట్ వేర్ కుర్రాడికి ఈ మాట ఏమీ అర్థం కాక, సొసైటీని ఎలా ప్రేమిస్తాము, ఏ వ్యక్తినో, ఆదర్శాన్నో ప్రేమించమని చెపుతారు కానీ, ఇదేమిటి ఇలా అని ప్రశ్నిస్తే, అసలు సొసైటీ అంటే ఏమిటి అని కూడా కొంత వాదిస్తే, చిదంబరం నీ చుట్టూ నీకు ఏది కనిపిస్తున్నదో, అదే సంఘం, దాని మంచి చెడ్డలతో బాటుగా దాన్ని ప్రేమించ గలగడమే, మనిషి బాధ్యత అని నివారించారట చిదంబరం. ఇది నిజంగా ఉత్తరాంధ్ర నేల పెంచుకున్న సంస్కారం. అలనాడు గురజాడ అన్న మాటలే కదా, ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును. ప్రేమ కలుగక బ్రతుకు చీకటి మన చిదంబరం కూడా అన్నారు. లవ్ ద సొసైటీ అని. దీనర్థం దేశమును ప్రేమించుమన్నా అనే. అదీ చిదంబరం గారి సామాజిక చైతన్యం.

కళాకారులకు సంఘంలో గౌరవం, వారి ప్రతిభ పట్ల గుర్తింపు, కేవలం ఏదో సభా మర్యాదలు గానే ఉండిపోవడం కాకుండా, వారి జీవితంలో ఒక ప్రయోజనంగా ఒనగూరాలని చిదంబరం పడిన తపన అంతా, సకల కళాకారుల సమాఖ్య అనే ఒక సంస్థను ప్రారంభించి నిర్వహించడంలో మన చూడగలము. కళాకారులకు, నిత్యావసరాల బజార్లలో, పెద్ద పెద్ద బట్టల షాపుల్లో, మందుల షాపుల్లో, నగర వ్యాపార వర్గాలు కొంత శాతం రాయితీలు ఇచ్చేలా, చిదంబరం ఏర్పాటు చేయగలిగారు అంటే చిన్న విషయం కాదు. కళాకారులకు కొంత భృతి ఉండాలన్న విషయమై కృషి చేస్తూ, వారి మరణ సమయంలో కుటుంబాలకు తమ సమాఖ్య తరపున

వారి పట్ల గల గౌరవం చేత, కన్యాశుల్కం నాటకం గురించి రూపాంతర చర్చల్లో వారిని కూడా భాగస్వామ్యులను చేసి, నాటక ప్రదర్శన విషయమై, కొన్ని కీలక పరిణామాలను ఈ గురజాడ శతవర్ధంతి లోగా ప్రకటించబోయే వర్తమానంలో మేం ఉండగా, చిదంబరం గారు ఇలా మన మధ్య మంచి వెళ్ళిపోవడం, అభినయం, అభ్యుదయం రెండుకళ్ళుగా భావించే వారికి అందరికీ, తీరని లోటు, విశాఖ కళా సాగరం నేడు, ఒక ఉత్తుంగ తరంగాన్ని పోగొట్టుకున్నది. తెల్లారింది లెగండో అంటూ ఒక వేకువ పాటకు స్వరమై, పదమై, అభినయమై, సంపూర్ణ స్పందనలతో, ఎక్కడకు వెళ్ళాడో అని ఊరి కన్న బిడ్డయిన చిదంబరం కోసం, ఒళ్ళంతా కళ్లై విశాఖ వెదుక్కుంటున్నది. ఉత్తరాంధ్ర దుఖాన్ని ఉగ్గ బట్టుకుంటున్నది. చిదంబరం గారికి ఇష్టమైన శ్రీశ్రీ కవిత బాటసారిలో వలె కళామతల్లికి ఎక్కడో పాడుకలలో పేగు కదిలింది. మీ భౌతిక మూర్తికి వీడ్కోలు పలకక తప్పదు, అదే క్షణాల మీ కళా మూర్తిని రెండు కళ్ళలో నిత్యం నిలుపుకుంటుంది. సకల కళా జగతి, చిదంబరంగారూ , ఆల్విదా...

ఆంక్షలు, అడ్డంకులపై గట్టి ప్రశ్న 'కంచె' సినిమా



రామతీర్థ
9849200385

తెలుగు సినిమా అంటే హీరోల కోసం వండి, వార్చి, వడ్డించే, ఒక తక్కువ స్తాయి రంగుల హంగామా. పాటలూ, ఫైట్లూ, పంచ్ డైలాగులూ, కామెడీ ట్రాకులూ అంటూ, ఎక్కడో దారి మధ్యలో కథ కనిపించకుండా పోతుంది. తెలుగు సినిమా ఇవాళ దారి తప్పిపోయిన కళ.కొన్ని వర్గాలు, కుటుంబాలకే పరిమితమైపోయిన వ్యాపారాల బజారు. ఇక్కడ కొత్త గాలులు వీయడం కష్టం. ఎందుకు అభిమానిస్తున్నారో తెలియని సినిమా అనే ప్రపంచ వ్యాప్తం ఆధునిక కళ గురించి కనీస పరిజ్ఞానం లేని, అభిమాన సంఘాలు, థియేటర్ల వద్దా, సాంఘిక మాధ్యమాలలోనూ చేసే ఒక శృతి మించిన ఆర్భాటం. దీన్ని కుల కోణంలో కూడా చూసి తరిస్తున్న వారిలో ఇక్కడి వారే కాక అమెరికా స్థాయిలో కూడా, కులాల వారీగా విడిపోయిన ప్రేక్షకులు ఉన్నారు అంటే, ఈ వ్యర్ధ మైన మీడియం (ప్రేక్షకులుగా మనం పొందిన జ్ఞానం, కలిగిన వినోదం, లభ్యమైన కొత్త సమాచారం దృష్ట్యా చూస్తే,) వందల కోట్ల ధనం చలామణీలో ఉంటూ, యావత్తు సినిమాకు కావలసిన ప్రదర్శన వసతులు, పంపిణీ, థియేటర్లు, కొద్ది మంది చేతలో కేంద్రీకృతమై, వారికే ధనలాభాలు, దానితో పాటే వచ్చే చౌకబారు పేరు ఊదర గొట్టే చానెళ్ల ద్వారా, కంపు రివ్యూలు రాసే లాలూచీ సమీక్షకులు, నిర్మాతలిచ్చే ప్రకటనలపై ఆధార పద్ద పత్రికలూ, ఇదొక పెద్ద విషవలయంగా కొంచెం ఆలోచిస్తే, ఎవరికైనా అర్థం అవుతుంది. తాము లాభాలు పొంది బాగు పడుతూ, తాము చూపే చెడు ద్వారా, ప్రేక్షకులను, అంటే విశాల సమాజంలో గల వివిధ వయస్కులను చెడగొట్టడం తగునా అని ఏ రకంగానూ రెండో ఆలోచన చేయకుండా, తమ సినిమాల వల్ల కలుగుతున్న దుష్పరిణామాలను కనీసం గ్రహించనట్టు నటిస్తూ, నడుస్తున్న ఒక ఆధిపత్య బజారు ఇవాళ సినిమా అంటే, వెరసి మంచి సినిమా రావడానికి చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయి. ఇటువంటి తరుణంలో, పూర్తిగా దర్శకుడి నియంత్రణలో ఉన్న చిత్రంగా, పూర్తి సామాజిక బాధ్యతతో, కావలసినంత చారిత్రక అవగాహనతో, ఇటీవల మన ముందుకొచ్చిని సినమా 'కంచె' దీనికే తోక వివరణలూ (టాగ్ లైన్లు) లేవు. కంచెలు నేల మీద ఉండవు, అవి మనసుల్లో ఉంటాయి, పల్లెటూళ్లలో అయినా, ప్రపంచ స్థాయిలో అయినా, వాటిని దాటి చూడగలగడం, బతకగలగడం, సమాజంలో, ఇటు లోకల్‌గా (స్థానికంగా) అటూ గ్లోబల్‌గా (అంతర్జాతీయంగా) ఎప్పటికీ, ఏ తరానికి ఆ తరం అలవర్చుకోవలసిన సంస్కారమే. దీన్నే చెప్పాలని శక్తివంతంగా ప్రయత్నంచేసి సఫలీకృతుడయ్యాడు. జాగర్లమూడి రాధాకృష్ణ, ఈ రచన తానే తయారు చేసుకుని, దర్శకత్వం కూడా వహించిన 'క్రిష్'

'ఆకాశం నీ హద్దురా, అవకాశం వదలొద్దు రా' అంటూ సాగిపోతుంది ఒక అలనాటి సినిమా పాట. అలా ఈ సినిమాకు ఒక పల్లెటూరి ప్రేమ కథకు తోడుగా, సమాంతర చిత్రణకు, రెండో ప్రపంచ యుద్ధపు కాన్వాసును తీసుకుని, ఈ యువ దర్శకుడు, చాల మంది దర్శకుల్లో కనిపించని, ఒక నూతనత్వాన్ని, తెగువనూ, ప్రపంచ జ్ఞానాన్ని ప్రదర్శించాడు. ఇలా ఏదో ఒకటో రెండో సీనుల్లో కనిపించే యుద్ధపు దృశ్యాలతో మన వాళ్ళు ఇంతకుముందే, గొప్పగొప్ప సినిమాలు తీసేశారు. ఆ దృశ్యాలన్నీ చాలా పేలవంగా ఉంటాయని వేరే చెప్పనక్కరలేదు. దానికి కారణం, దర్శకుడికి సరైన హోం వర్క్ లేకపోవడం, స్టార్ వేల్యూపై సినిమా నడిచిపోతుందన్న కొంత శృతి మించిన విశ్వాసం కూడా కావచ్చు. క్రిష్, కంచె సినిమాలో ఇందుకు భిన్నంగా సినిమా విలువలను పైకెత్తే ప్రయత్నంలో, కథ, కథనం, చిత్రీకరణ విషయాల్లో కంట్రోల్ గలవాడిగా ప్రేక్షకుల్లో అంచనాలు పెంచాడు. అందుకే చక్కని ఇంగ్లీషు సినిమా చూస్తున్న భావన కలిగింది. తొలి సరిగా తెలుగు సినిమాలో రెండవ ప్రపంచ యుద్ధ దృశ్యాలకు విశ్వసనీయత కల్పించాడు దర్శకుడు.

స్థిరంగా కూచుని మనం చదువుకునే కథ వేరు. దానికి హద్దులు లేవు. అదే కథను కదిలే బొమ్మల ద్వారా చెప్పేటప్పుడు ఆ మాధ్యమం సినిమా మాధ్యమం అవుతుంది. దానికి తప్పక కొన్ని పరిమితులు ఉంటాయి. అదే సమయంలో ఎక్కువ వర్ణనలు అవసరంలేని బలమైన దృశ్యం, దర్శకుడికి ప్రధానమైన సౌకర్యం. ఈ వెసులుబాట్లను ప్రపంచ సినిమా మంచి విజ్ఞతతో ఉపయోగించుకుంటుంది. అందుకే, ఆ కళ ద్వారా, ప్రపంచ, మానవ జీవన వ్యాఖ్యానం చేయడమే సినిమాగా, ప్రపంచ స్థాయి బహుమతులు కూడా ఆ సినిమాలకే వస్తాయి అంటే, వారికి ఆ కళ పట్ల గల నిష్ణాతత, అంకితభావం, కారణం, హీరోలబట్టి కథలు రాసుకునే ఒక నిర్బంధ దశ ఉండదు అక్కడ. అలాంటి నిర్బంధాన్ని, ఆసినిమా రంగమూ నమ్మదు, ఆ నటులూ నమ్మరు. అలాగే అక్కడి దర్శకులూ, ప్రేక్షకులూ కూడా. అందుకే తెలుగు సినిమా గురించి చెప్పాలంటే, వ్యాపారం మాట ఎలా ఉన్నా కళాత్మకమైన వివేకం (ఇది చాలా మంది సినిమా వాళ్ళకు అర్థం కాదు. కొంత ఆ రంగపు పెద్దవాళ్ళకు అర్థం అయినా వారు ఏమీ చేయలేరు) లోపించిన సినిమాలు మనకు ఎక్కువ.

దీన్ని ప్రతి ఫ్రేమ్ లోనూ అధిగమించే ప్రయత్నం చేశాడు క్రిష్. ఈ రెండు గంటల సనిమాలో, ప్రేమ అంటే, ఒక అమ్మాయి, ఒక అబ్బాయి ప్రేమించుకోవడమే కాదని, ప్రేమకు గల బహుముఖీన కోణాలను తన చిన్న కళారూపంలో సమర్థవంతంగా ఇమిడ్చాడు. ఒక రకంగా ఈ కథలో పాత్రలు 1936 నాటికి యువతరం. అంటే ఒక ఇరవై, పాతికేళ్ల ముందర పుట్టి ఉంటారు. అది శ్రీరంగం శ్రీనివాసరావు పుట్టిన కాలం కూడా, అంటే మహాకవి శ్రీశ్రీ కాబోయే ఒక యువకుడి కాలం. అతని సమకాలికులు ఏ కథలో పాత్రలు. అప్పటికింకా పూర్తిస్థాయిలో ఈయన శ్రీశ్రీగా కీర్తి పొందలేదు. అయితే 1933 నుంచీ మహాప్రస్థాన గీతాలు రాస్తూనే ఉన్నాడు. అవి వివిధ పత్రికల్లో అచ్చు అవుతున్నాయి. రెండో ప్రపంచ యుద్ధ కాలం 1939-1945. అందుకే సినిమాలో, శ్రీశ్రీ కవితలు ఉటంకించే పాత్రలు, శ్రీనివాసరావు అనే సంభోదిస్తాయి. ఇది దర్శకుడి శ్రద్ధకు ఒక నిదర్శనం. ప్రధాన మైన నాయక, నాయిక పాత్రలు చౌక బారు అశ్లీల సంభాషణలు కాక, వారి చదువుకు అనుగుణంగా ఆంగ్ల సాహిత్యం నుంచి షేక్‌స్పియర్‌ను కోట్ చేస్తూ మాట్లాడుకోవడం, ఒక సందర్భానుసరమయిన సంపన్నత. చదువు వల్ల వచ్చే జ్ఞానం ఎలా వార కులాలతో సంబంధం లేకుండా, మనుషులు వివేక వంతులను చేస్తున్నంది, ఈ సినిమా ముందు నుంచీ ప్రతిపాదిస్తున్న ఒక నాగరిక చిత్రణ. ఇందుకు దర్శకుడికి సంబంధం లేకుండా, మనుషలను వివేక వంతులను చేస్తుదన్నది, ఈ సినిమా ముందు నుంచీ ప్రతిపాదిస్తున్న ఒక నాగరిక చిత్రణ. ఇందుకు దర్శకుడికి గల నిబద్ధత మంచి మార్కులు పడతాయి. "ఎల్ల లోకములొక్క ఇల్లయి, వర్ణ బేధములెల్ల కల్లై" అన్నది ప్రతిఫలించేలా కథలో నాయకుడినిసర్గ సుందర సమగ్ర వ్యక్తిత్వ ప్రేక్షకులకు అందడానికి తగిన జాగ్రత్తలు దర్శకుడు తీసుకున్నందుకు అభినందనీ యుడు. అది గ్రామంలో స్థాయిలో ఎలా నిజం కావాలని తపన పడతాడో, ప్రపంచ స్థాయిలో కూడా, సైనికుడిగా తన ప్రవర్తన, విశ్వాసాల ఆచ రణలో ఎక్కడా వైరుధ్యం లేకుండా ఒక మంచి మనిషిని చిత్రించాలన్న దర్శకుడి ఆకాంక్ష మెచ్చ దగ్గది.

"కంచె" సినిమా గొప్పతనం అంతా, ఒక వైయుక్తకమైన పా ర్శ్వంలో, ఒక రొటీన్ ప్రేమ కథతో, దానికి వచ్చే ఆంక్షలూ, అడ్డంకులతో, చివర్న ప్రేమికులు తమ ప్రాణాలు బలిపెట్టె కథలతో, మనం ఎన్నో సినిమాలు చూసినా, జాతి, పుట్టుక, ద్వేషాలపై దేశాలను యుద్ధాల ప్రపంచంలో చిన్న స్థాయిలోనైనా, పెద్ద స్థాయిలోనైనా, మనుషులను వేరు చేసే అంతరాలకు అర్థమూ, తర్కమూ, వివేకమూ ఏవీ ఉండవని వాటి విధ్వంసక స్థాయి మాత్రమే వేరుగా ఉంటుందని చెప్పాలని, ఈ కథనంలో నిజాయితీ అయిన ప్రయత్నం చేశాడు దర్శకుడు క్రిష్. ఈ ప్రయత్నంలో, అసలు రెండో ప్రంచ యుద్ధపు విశ్వాసాలు ఏమిటో, ఇప్పటి తరం ప్రేక్షకులలో ఒక జాగరూకత, చైతన్యం కలిగించేలా సినిమా సాగడం, దర్శకుడి క్రమశిక్షణ వల్లే సాధ్య మైంది. పది కోట్ల మంది పైగా ప్రజలు ప్రత్యక్షంగా ప్రభావితమై, కేవలం భారతీయులే, విభిన్న సైన్యాల్లో, పాతిక లక్షల మందికి పైగా దేశ విదేశాల్లో, పోరాడిన నేపథ్యం గల రెండవ ప్రపంచ యుద్ధంలో ఇక్కడి స్థానిక ప్రేమలు, ద్వేషాలు ఎలా చిన్నగా కుంచించుకు పోతాయో అక్కడి విరోచిత పోరాటాలే, ఎలా రేపటి సూర్యుడిని చూస్తామా లేదా అన్న ప్రశ్న లను లక్షలాది ప్రజల ముందర నిలబెడతాయో, ఇలాంటి ఒక పెను కోట్లట లో, భారతీయుఉ, ముఖ్యంగా తెలుగు వారు ఎక్కడో ఇటలీలో, ఆ దేశ రక్షణకై సైనిక చర్యల్లో పాల్గొంటున్న కథలో వచ్చే సవాళ్లు బహుశా తొలిసారి మనం ఒక తెలుగు

సినిమాలు చూస్తాము. స్టార్లు కాక కథే హీరో అయితే, ఇలాంటి మంచి సినిమాలు వస్తాయి. జర్మన్ యుద్ధ భూతపు నిజ రూపాన్ని కూడా పరిచయం చేసుకుంటాము. బిగువైన ఎడిటింగ్‌తో బల మైన సంభాష ణలతో, సినిమా నిజంగా ఒక అంతర్జాతీయ స్వభావాన్ని, స్థానిక సహజ త్వాన్ని కలబోసి చూసే వారికి కొత్త అనుభూతి మిగులు స్తుంది. "యుద్ధం మనమే కాదు, ఆ పసిపాప కూడా చేస్తోంది. తన ప్రాణా ల కోసం పోరాడుతుంది. "ఈ ప్రజల్లో నా గ్రామమే కనిపిస్తుంది" అంటూ అక్కడ ఇటలీలో తన గ్రామ ప్రజలను, తాము ప్రాణాలకు తెగించి కాపా డుతున్న యూదుపౌరుల్లో కథానాయకుడు దూపాటి హరిబాబు చూడడం, కథకు ఒక సార్వజనీనతను తెచ్చిపెట్టింది. వీరి ప్రాణాలను చుట్టుముట్టిన జన్మన్ పటాలం నుంచి కాపాడటంలో ఒక యూదు బాలిక, తాను స్నానాల గదిలో దిగంబరి అయి, లోపల సైనికులను దాచిపెట్టి, జర్మన్ సైనికులను మభ్య పెట్టిన చోట, మానవత్వం, ఒక జెండాగా యెగిరింది. ఆ జెండా పట్టుకునే, నడిచాడు, 1940ల నాటి రెండో ప్రపంచ యుద్ధ భారతీయ సైనికుడు, దూపాటి హరిబాబు, అతని కథ, ఒక గ్రామం కథ, ఒక ప్రపంచ సంగ్రామం కథ, అదే సమయంలో మనుషులుగా మన మనసుల్లో దేశ దేశాల్లో పెంచుకున్న ఆంక్షలు, అడ్డంకులు, 'కంచె"ల మీద ఒక సమర్థవంతమైన సెల్యులాయిడ్ చిత్రణ. మాకూ ఆలోచించే ఆవేశపరిచే, మంచి తెలుగు సినిమా ఉందని, మనం చెప్పుకోవడానికి వీలుగా, ఒక విలువైన కళారూపం అందజేసిన దర్శకుడు క్రిష్. తెలుగు సినిమా "కంచె"లు దాటి ముందుకు, మున్ముందుకు నడిచేందుకు అవసరమైన ఇవాల్టి ఆచరణ, రేపటి ఆశ, మనం చూసి, నలుగురికీ, చూడమని చెప్పాల్సిన సినిమా, ఆహారం, ఆలోచనలూ, రచనలూ, విశ్వాసాలూ, అలవాట్లూ, వీటిపై అడ్డంకులూ, ఆంక్షలు, కంచెలూ ఎందుకు నిలబడవో, ఈ సంక్షోభ కాలంలో సమాజాన్ని ఎలా ప్రజలు ఉన్నతీకరించుకోవాలో, కొంతైనా ఈ సినిమా ద్వార చెప్పారు ఈ సినిమా బృందం అంతా, వారికి అభినందనలు.

'బాహుబలి' కి బలైన ప్రయోజన సినిమా

రామతీర్థ
9849200385

కొన్ని సందర్భాలు నిజంగానే మనల్ని స్పందన లేని వారిగా, నిరుత్తరులుగా చేస్తాయి. అలాంటిదే "బాహుబలి" సినిమాకు జాతీయ ఉత్తమ చిత్రం అవార్డు లభించడం. తెలుగు సినిమాకు ఇంతవరకూ రాలేదు అని విచారించాలో, లేక ఈ కోవలోని సినిమాకు వచ్చినందుకు మన అభిప్రాయాలను స్పష్ట పరచాలో తెలీని పరిస్థితి ఇది. ఏది ఏమైనా ముందుగా సినిమా యూనిట్ అందరికీ, నిర్మాతలకు, దర్శకునికి, సాంకేతిక నిపుణులకు, నటీ నటులకు మన అభినందనలు తెలుపుదాము. 63 ఏళ్లుగా తెలుగు లో ఉత్తమ విలువలున్న ఎన్నో చలన చిత్రాలకు దక్కని గౌరవం ఈ సినిమా ద్వారా దక్షిణాదిన పెద్ద చలన చిత్ర పరిశ్రమ అయిన తెలుగు సినీ రంగానికి ఆలస్యంగానే దక్కింది.

ఎంత ఆలస్యంగా అంటే, ఇరవై రెండు సార్లు బెంగాలీ సినిమాలకు,, పదమూడు సార్లు హిందీ సినిమాలకు, పదకొండు సార్లు మలయాళం సినిమాలకు,, ఆరు సార్లు కన్నడ సినిమాలకు, నాలుగు సార్లు మరాఠీ సినిమాలకు, రెండుసార్లు సంస్కృత, తమిళ సినిమాలకు, అస్సామిస్ సినిమాకు, బ్యారి భాషా సినిమాకు ఒక్కోసారి దక్కాక, మన వంతు వచ్చింది అన్న మాట. 1979లో ఈ అవార్డ్ ప్రకటించలేదు. 1954లో ఈ అవార్డ్ ఏర్పాటు అయింది కనుక, అంతకు ముందరి సినిమాలకు ఈ అవార్డ్ పొందే అవకాశం లేదు. కళాత్మక విలువలున్న చిత్రాలకు ఈ అవార్డ్ ఏళ్ల తరబడి ఇస్తూ వస్తున్నారు. వ్యాపార సినిమాలకు కాదు. కేవలం నిర్మాతకు ఇరవై వేలు పారితోషికం, రాష్ట్ర పతి అభినందన , దర్శకుడికి అయిదువేలు పారితోషికంతో 1954లో బహు సాదాగా మొదలైన ఈ అవార్డులు ఏనాడూ కమర్షియల్ సినిమాను సీరియస్‌గా పరిగణించ లేదు. అందుకే జాతీయ ఉత్తమ చిత్రంగా గౌరవం పొందిన సినిమాల పేర్లు సినిమా చరిత్రలో "బాహుబలి" కన్నా వేల అడుగుల ఎత్తులో ఉన్నాయి. ఆ దర్శకుల స్థాయి కూడా అంతే ఎత్తున ఉన్నది. ప్రహ్లాద్‌కేశవే అత్రే, సోహ్రాబ్ మోడి, సత్యజిత్ రే, వి.శాంతారాం, దేబకీబోస్, మృణాల్‌సేన్, హృ షీకేశ్ ముఖర్జీ, రాము కరియత్, ఆదూర్ గోపాల్‌కృష్ణన్ జి,వి,అయ్య ర్, ఖాజా అహమద్ అబ్బాస్, బి.వి.కారంత్, బాసు భట్టాచార్య, గిరీష్ కాసరవల్లి, రితుపర? ఘోష్, శ్యామ్ బెనెగల్ , బుద్ధదేబ్ దాస్ గుప్తా, షా జీ కరుణ్, జి. అరవిందన్, ఇలా ప్రతి దర్శకుడు ఒక చలనచిత్ర తపస్వి . దాని ద్వారా ఎన్ని డబ్బులు వస్తాయన్నది, ఎన్ని కోట్లు పెట్టుబడి కావాలి అన్నది కాదు , ఏళ్ల తరబడి, ఆ సినిమా పై అంచనాలను పెంచుతూ పోయే మీడియా కథనాలు కాదు, ఇవేవీ వారు ఒక వ్యూహంగా ఆచరించ లేదు. నిజానికి గత వత్సరం ఏ సినిమాకు ఈ జాతీయ ఉత్తమ చిత్రం అవార్డ్ వచ్చిందో కూడా మనకు గుర్తు లేదు, అది మన బుర్రకెక్కలేదు. "కోర్ట్" అనే గుజరాతీ, మరాఠీ, ఇంగ్లిష్, హిందీ భాషల్లో తీసిన సినిమాకు, ఇచ్చారు. గౌతమ్ తంహానే దర్శకుడు. ఆర్ట్ ఫిల్మ్ లు అంటే కళాత్మక చిత్రాలకు ఈ అవార్డ్ లు దాదాపు గత ఏడాది దాకా ఒక పెద్ద గుర్తింపుగా నిలిచాయి.

సినిమా విడుదలైన తొలివారంలోనే కోట్లాది రూపాయలు, దేశ విదేశాల్లో, వసూలు చేసిన సినిమా జనరంజక వినోదం అవుతుందేమో కానీ, ఉత్తమ సందేశం గల సినిమాగా ఎలా అవార్డ్ కు అర్హమవుతుందని, నిజానికి మనము జ్యూరీ ని అడగాలి. అయితే ఈసారి అవార్డ్ కమిటీ అధ్యక్షుడు రమేష్ సిప్పీ కూడా ఒక కమర్షియల్ సినిమా రంగపు వ్యక్తి కావడం చెప్పుకోదగ్గ విషయం. ఈయన కమిటీ ఛైర్మన్ కావడం వల్ల, ఆర్ట్ ఫిల్మ్ లకు గౌరవం దక్కవలసిన చోట్లో, వ్యాపార సినిమా దూరి ఎటువంటి ఘనతలూ తనవి కాక పోయినా, వాటిని ఎలా పొందిందో అన్నది వర్తమాన విలువలకు అద్దం పడుతుంది.

అవకాశాలున్న చోట, మారుతున్న రాజకీయ పరిస్థితిలో, ఆకాశాలకు నిచ్చెనలు వేయడమే, సినిమా వ్యాపార వర్గాలు కూడా చేసేపని. పైన పేర్కొన్న ఉత్తమ దర్శకుల పక్కన మన వ్యాపార సినిమా నిలబడలేదు. ఈగ, బాహుబలి వంటి సినిమాలు పాపులర్ సినిమా కావచ్చునేమో కానీ, సమాజం గురించి చర్చించే ప్రోగ్రెసివ్ సినిమా కాలేవు. సాంకేతిక ప్రతిభ ఉన్నతంగా ఉన్న సినిమా అయినా, ఆ మాటకొస్తే, ఏ కళ అయినప్పటికీ, తాను సమాజం గురించి ఎంత పట్టించుకుని, సమాజానికేమి చెప్పింది అన్నదాని పైనే పది కాలాలు బతుకుతుంది. మంచి వ్యాపారం చేసినందుకు, సినిమాలకు వేరే అవార్డులు ఫిల్మ్ ఫేర్ అవార్డ్ , జీ ఫిల్మ్ అవార్డ్ వంటివి ఉన్నాయి. నటన తక్కువ, విజువల్ ఎఫెక్టులు ఎక్కువ, ఉన్న ఇలాంటి సినిమాలు ఆ సందరాన్నీ అనుసరించి రాణిస్తాయి. కానీ సినిమాలో సెకండ్ హాఫ్ అంతా ఫైట్లే ఉన్న ఒక కథ లేని తన్నులాట, ఇంగితం గల ప్రేక్షకులను మెప్పించడం కష్టం. చూడబోతే సగం పూర్తి అయిన సినిమా- సినిమా, కథలో ఒక్క బిగువైన సంభాషణ లేదు. కథ ముగియదు. యుద్ధ దృశ్యాలు చాలా తెలివిగా తీసాము అనుకునే సినిమా టీం, దాదాపు ఒక వెయ్యేళ్ళ నాటి కథలోకి, స్ప్రింగు గదలు (రాణా ఉపయోగించినది) ఎలా ప్రవేశ పెట్టారో ఊహకందదు . నూనెలో తడిపిన గుడారాల గుడ్డలు ఎగిరి మీద పడుతుంటే, శత్రు సైన్యాలు అలా చూస్తూ ఊర్కుంటాయా అన్నది పెద్ద ప్రశ్న. అవన్నీ పాతకాలపు యుద్ధాలు అనుకోవడం ఇంకా వెర్రి. రాజమౌళి వంటి దర్శకులు, యుద్ధాలే కావలిసి వస్తే, హాలీవుడ్ సినిమాలు చూడడం కన్నా, యుద్ధకాండ రెండు భాగాలుగా రాసిన, యుద్ధ వర్ణనలు అంటే బాగా ఇష్టమున్న ఆదికవి, వాల్మీకి రామాయణం చదివితే, ఇంకా మంచిగా తమ విజువల్ ఎఫెక్ట్స్ విభాగాన్ని ఉపయోగించుకోగలరు. అల్లాగే గుంపు మిస్సైల్ల లాగా బాణాల బల్ల (స్ప్రింగ్ బోర్డ్) లో బాణాలకు దూసుకెళ్లే బలం ఎలా వచ్చిందో కూడా ఊహాతీతం. ఇదొక చందమామ కథ, బొమ్మలుగా చదువుకుంటే పోయేదాన్ని, కష్టపడి సినిమా చేసినవారి మేధస్సు, ప్రపంచ సినిమా ఎత్తులకు చాలా తక్కువలో ఉన్నది. సినిమా చూసిన ఒక రెండుపదుల యువకుడు అడిగినట్టు, అంతలా మంచు ప్రాంతాలకు దగ్గరలో ఉండే వారు, వేసుకునే కాస్ట్యూమ్స్ అంతా పలుచగా ఉంటాయా? సినిమా తీసే వారికి ఏ వాతావరణాన్ని చూపిస్తున్నాము కథలో, పాత్రల వేషభాషలు ఏమిటి అన్న స్పృహ ఉన్నదా? గ్రీక్‌ల, పర్షియన్ల థెర్మోపైల్ యుద్ధ ఆధారిత "300", "300 రైజ్ ఆఫ్ ఎన్ అంపైర్" యుద్ధ సినిమాల నుంచి యుద్ధ దృశ్యాలు, కట్టప్ప (దరయూస్ పర్షియా రాజు ఇలాగే ఉంటాడు సినిమాలో), ఇతర ప్రధాన నటుల ఆహార్యం అనుకరించారు. వెరసి, ఆర్ట్ ఫిల్మ్‌లకు ఉండే సామాజిక గంభీరత ఎప్పటికీ ఈ వ్యాపార సినిమాలకు రాదు. "మసాన్" వంటి సినిమాలకు రావలసిన నిజమైన గుర్తింపుని పక్కన పెట్టి, సమాజం గురించి ఏమీ చెప్పకుండానే , ఒక వీడియో గేమ్‌లాగా సినిమా తీసి , దీనికి వందలకోట్లు ఖర్చు అయ్యాయని చెప్పడం, ఒక జోక్. ఇలాంటి వీడియో ఆటలు ఫోర్జ్ ఆఫ్ ఎంపైర్స్, క్లాష్ ఆఫ్ కింగ్స్ వంటివి ఇంటర్నెట్లో సుపరిచితమే. . మసాన్ సినిమా, సినిమాకు మక్కా అని చెప్పుకునే కేన్స్ చిత్రోత్సవంలో "బెస్ట్ క్రిటిక్స్ అవార్డ్ - ఆన్సర్టెన్ రెకార్డ్ కేటగిరీ" లో పొందిన సినిమా, తన స్వంత దేశంలో ఇంకా ఎక్కువ ఖ్యాతి పొందుతుంది అని భావిస్తే, ఆ ఆశలను వమ్ము చేసింది "బాహుబలి" అనే ఫాంటసీ కోవకు చెందిన సగం కథ గల చిత్రం. విజువల్ ఎఫెక్ట్స్ చేసిన శ్రీనివాస్ ఎనిమి ది వందలమందితో పని చేసి సిన్మా విజయానికి కారణమైన ఒక కీలకమైన పాత్ర పోషిస్తే, ఆయనను విజువల్ ఎఫెక్ట్స్ సూపర్వైజర్ అనగల సంస్కారం రాజమౌళిగారిది. వి ఎఫ్ ఎక్స్ సాంకేతికత సహాయంతో హైదరాబాద్ లోని "మకుట" స్టూడియోస్ రూపొందించిన ఈ రాజమౌళి కలలో తొంభై శాతం పైగా, కంప్యూటర్ ఇమాజినరీ గ్రాఫిక్స్, నాలుగున్నర వేల దాకా విజువల్ ఎఫెక్ట్స్ ఉన్నాయి. నటులకు ప్రాధాన్యతే లేదు కండలు చూపడానికి తప్ప. మాహిష్మతీ నగరం ఒక బొమ్మల కొలువు, సైన్యాలు, జంతువులు యుద్ధాలు అన్నీ వీడియో గేమ్‌లకు మించినవి కావు.ఎటొచ్చీ తేలికగా ప్రభావితం అయ్యే ప్రేక్షకులపై విఎఫ్ ఎక్స్ సాంకేతికత చూపే ప్రభావం ఎటువంటిది, ఎంత కాలం ఉంటుంది అనేదాన్నిఅధ్యయనం చేసేందుకు, ఈ రంగపు విద్యార్థులకు ఒక పాఠ్యాంశం గాను ఈ సినిమా తన స్థానాన్ని నిలబెట్టుకుంటుంది. పైపెచ్చు, ఒక సామాజిక వర్గం తమ విజయంగా ఈ సినిమా విజయాన్ని రచించడంలో ముందంజ వేయడం, తెలుగు సమాజంలో, ఒక నివారింపదగ్గ తీవ్ర అపశృతి. ఇవన్నీ ఆలోచిస్తూ ఉంటే, వేరే మంచి సినిమాలు దేశ భాషల్లో ఉండగా, ఈ వ్యాపార సినిమాకు " జాతీయ ఉత్తమ చిత్రం" అవార్డ్ , రాక రాక తెలుగులో ఇటువంటి సినిమాకే రావాలా అన్న ప్రశ్న, ఎప్పటికీ బతికే ఉంటుంది.

ఈగ, బాహుబలి వంటి సినిమాలు పాపులర్ సినిమా కావచ్చునేమో కానీ, సమాజం గురించి చర్చించే ప్రోగ్రెసివ్ సినిమా కాలేవు. సాంకేతిక ప్రతిభ ఉన్నతంగా ఉన్న సినిమా అయినా, ఆ మాటకొస్తే, ఏ కళ అయినప్పటికీ, తాను సమాజం గురించి ఎంత పట్టించుకుని, సమాజానికేమి చెప్పింది అన్నదాని పైనే పది కాలాలు బతుకుతుంది. మంచి వ్యాపారం చేసినందుకు, సినిమాలకు వేరే అవార్డులు ఫిల్మ్ ఫేర్ అవార్డ్, జీ ఫిల్మ్ అవార్డ్ వంటివి ఉన్నాయి. నటన తక్కువ, విజువల్ ఎఫెక్టులు ఎక్కువ, ఉన్న ఇలాంటి సినిమాలు ఆ సందర్భాన్ని అనుసరించి రాణిస్తాయి. కానీ సినిమాలో సెకండ్ హాఫ్ అంతా ఫైట్లే ఉన్న ఒక కథ లేని తన్నులాట, ఇంగితం గల ప్రేక్షకులను మెప్పించడం కష్టం. చూడబోతే సగం పూర్తి అయిన సినిమా సినిమా కథలో ఒక్క బిగువైన సంభాషణ లేదు. కథ ముగియదు. యుద్ధ దృశ్యాలు చాలా తెలివిగా తీసాము అనుకునే సినిమా టీం, దాదాపు ఒక వెయ్యేళ్ళ నాటి కథలోకి, స్ప్రింగు గదలు (రాణా ఉపయోగించినది) ఎలా ప్రవేశ పెట్టారో ఊహకందదు.

పద్నాలుగు నిమిషాల ప్రశ్నల కొడవలి

సాల్ట్ అండ్ పెప్పర్

చిన్న సినిమా

క్షణం



Weekend Special

రామతీర్థ

మన దేశంలో రెండు దేశాలున్నాయి. ఒకటి అత్యధిక సంఖ్యాకులున్న భారత్. రెండోది చదువుకున్న నగర వాసుల ఇండియా. పల్లెల్లో బతుకు గడవక, నగరాలకు ప్రవాసం (పర వాసం) వచ్చిన వారందరూ, నగర జీవన సౌలభ్యాలను అంది పుచ్చుకునే ప్రజలు కాలేరు. వారి పల్లెటూరిదనం, వారి జీవితాల్లో ఎప్పుడూ ప్రస్ఫుటితం అవుతూనే ఉంటుంది. మనం తెలుగు వారం, సినిమా విషయంలో, బాగా వ్యాపార ధోరణులు నేర్చి, తెలివి, తెలుగు రెండూ మీరి పోయాము. అందరమూ కలిసి, సినిమా ద్వారా లాభాలు, పేరు, హోదా, సామాజిక గుర్తింపు, తద్వారా రాజకీయాల్లోకి వచ్చే అవకాశలూ, ఇవన్నీ, కేవలం కొన్ని సినిమాల్లో నటించిన వారికి అప్ప చెప్పేసి, వారి రాజకీయ విజ్ఞత మీద మన అంతు లేని విశ్వాసం ప్రకటించిన రోజులు ఉన్నాయి.

ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ లలో. ఈ రెండు రాష్ట్రాలలో, అటుపై మహారాష్ట్ర లో సినిమా అంటే ఉన్న పిచ్చి, మిగతా భారత దేశంలో కనపడదు. బీహార్, బెంగాల్, ఒడిశా వంటి రాష్ట్రాల్లో, సినిమా పెద్ద పిచ్చి కి ఆధారం కాదు. ఏదో సినిమా విడుదల అయిందీ అంటే, సాయంకాలం ఆటకు వెళ్ళి, మామూలు గా చూసొచ్చే స్థాయి లోనే ఎక్కువ శాతం ప్రజలు ఇంకా ఉన్నారు. వారేమీ నటులుకు, అతి గురవాలు ఇవ్వరు. వారి సామాజిక ఆరోగ్యాలు తప్పకుండా మన సమాజాల కన్నా మెరుగ్గా ఉన్నాయి. ఇలాంటి గ్రామీణుల భారత దేశం, ఒకసారి ఇండియాని కలిస్తే. అది "సాల్ట్ అండ్ పెప్పర్" సినిమా అవుతుంది.

ఇంతకు ముందర కూడా ఇలాంటి కథాంశాన్ని వేరే పాయింట్ చెప్పడానికి సినిమా గా తీసి ఉండవచ్చు. అయితే కేవలం పద్నాలుగు నిమిషాల్లో, ఈ తేడాను గుండెకు హత్తుకునేలా, జీవితానికి సంబంధించిన కీలకాంశాలను జోడిస్తూ చెప్పడంలో, ఈ సినిమా దర్శకుడు సాధించిన ఫలితం గమనించ దగ్గది. ఈనాటి ముప్పయ్యేళ్ళ వయసులో ఉన్న చదువుకున్న తరానికి, తమ సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు,పని గంటలు ఇవీ అని లేని రాత్రీ , పగలు చాకిరీలూ, వచ్చే రెండు జీతాలూ, అసంతృప్తులూ, ప్రేమలూ, వాటి వైఫల్యాలూ, డాలర్లూ, అమెరికా ఉద్యోగాలూ, ఇదొక జీవితంగా ఒక ఇరవై కోట్ల మంది అనుకుంటున్నారు, ఈ సౌకర్యాలు పొందిన వారు, ఒక అయిదు కోట్ల మంది కన్నా ఉండరు. సినిమా ఆరంభంలో తన భాగ స్వామి తనను సరిగా పట్టించుకోని, జీవితపు కనీస సౌకర్యాలన్నీ ఉన్న ఒక చదువుకున్న యువతి ఆ రాత్రివేళ విసిగి వేసారి ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుంది. అది సరిగా కుదరక తాను కింద పడుతుంది. అప్పుడొక పెద్ద శబ్దం పైనుంచి వినిపిస్తుంది. ఒక ఆగంతకుడు ఇంట్లోకి దూరాడు. అక్కడమొదలవుతుంది కథ.

Salt 'N' Pepper - Short Film
Ft. Nawazuddin Siddiqui & Tejaswini Kolhapure

ఏం.పి.ఎస్.ఇమేజెస్ పేరిట రిచాసింఘ్ నిర్మాత గా టేసిన ఈ సినిమా మోహిందర్ ప్రతాప్ సింగ్ దర్శకత్వంలో రూపొందించారు. ఈ యువతిగా తేజస్వినీ కొల్హాపూర్, ఆ ఆగంతకుడిగా, నౌవాజుద్దీన్ సిద్దికీ నటించారు. సినిమాలో రెండే పాత్రలు. (రెండే పాత్రలతో మన తెలుగు వారొక సినిమా ఎంత ఎబ్బెట్టుగా తీశారో చెప్పగలరా). వచ్చిన వాడు, ఒక పేదవాడు ఆకలి వల్ల ఇంట్లోకి వచ్చాడు. ఆ ఇంట్లో తినడానికి ఏమీ లేదు. చచ్చి పోబోయే అమ్మాయి ఏం వంట చేసుకుంటుంది? నేను దొంగతనానికి గానీ, లేదా ఇంకేదో ఉద్దేశంతోనో గానీ రాలేదు అని, ఆకలివల్ల ఇంట్లోకి వచ్చానని, ఆ యువకుడు చెప్తాడు. అయ్యో, వంటింట్లో ఏమనా ఉందేమో తినలేక పోయావా, అని తన వయసులోనే ఉన్న ఆ యువకుడిని అడుగుతుంది . చూశాను కానీ అక్కడ తినడానికి ఏమీ లేదు అని బదులిస్తాడు. ఆ అమ్మాయి కుర్చీలో కూచుని ఉండగా, ఏ చదువు లేని ఆ పేదవాడు, నేల మీదనే చతికిల పడతాడు. ఆ ఇంట్లో ప్రవేశించినప్పుడు, ఆమె చేస్తున్న ఆత్మహత్యాప్రయత్నాన్ని చూసిన ఆ యువకుడు, అవును గానీ, మీరెందుకు ఇన్ని సౌకర్యాలు ఉండి కూడా, ఆత్మహత్య ప్రయత్నం చేస్తున్నారు అని ప్రశ్నిస్తాడు. తన ప్రేమ సంగతి చెప్తుంది ఆత్మహత్య చేసుకోవడానికి ఇదో కారణమా, అన్న ప్రశ్న వస్తుంది ఆ యువకుడి నోటి నుంచి.

మానవ సంబంధాలకు పెద్ద పీట వేసే ప్రయత్నంలో యువతరం పై మన ఆశలు సజీవంగా ఉంటాయి అన్నదానికి సాక్ష్యంగా, అయ్యో నీకు ఆకలి వేస్తోంది, ఇంట్లోనా తినడానికి ఏమీ లేదు, ఉండు నీ కోసం పిజ్జా ఆర్డర్ చేస్తాను అని, ఆమె పిజ్జా కోసం ఫోన్ లో ఆర్డర్ చేస్తుంది. ఒక అరగంటలో వచ్చేస్తుంది, తిందు గానీ, అని మానవ సహజమైన కరుణ నే చూపుతుంది. ఈలోగా తాము గ్రామీణ రైతులమని, తమ ప్రాంతంలో పంటకు ఏ విధమైన నీటి సదుపాయం కానీ, ప్రభుత్వ మద్దతు కానే లేక, జీవిక సాగక, ఇలా పట్నాలమ్మట బతుకు తెరువు వెతుక్కుంటూ వచ్చామని, తన అన్నలకు ఎక్కడో నగర రోజువారీ కూలీలుగా ఏదో సర్దుబాటు అయిందనీ, కానీ తనకు మాత్రం రెండు రోజులుగా ఏదీ కుదరలేదని,అందుకే ఆకలి తట్టుకోలేక ఇలామీ ఇంట్లోకి వచ్చానని చెప్తాడు , ఆ నిరుపేద భారతీయుడు.

ఈలోగా పిజ్జా వస్తుంది, ఆమె చక్కగా తెరిచి టేబుల్ పైన పెట్టి, ఇదిగో తినేటప్పుడు, ఈ ఉప్పు, మిరియం పొడి కూడా వేసుకోవాలి అప్పుడే రుచిగా ఉంటుంది, అని కాస్త ఉప్పు తో బాటు గా మిరియపు పొడి కూడా చల్లుతుంది. వెంటనే ఆ కుర్రాడు, "మేమ్ సాబ్, ఈ పిజ్జా నేను తినలేను. ఈ మిరియం మనది కాదు, పై దేశాలనుంచి దిగుమతి చేసుకుంటూ, మన దేశపు మిరియపు పంటలను పనికి రాకుండా చేశారు. ఆ మిరియపు పంట రైతులమేమేము, మామిరియపు పంటకు గిట్టుబాటు ధర లేకుండాపోవడానికి, ఈ మిరియాలు దిగుమతి చేసుకోవాలనే ప్రభుత్వ నిర్ణయమే కారణం. మా పొట్ట కొట్టిన ఈ మిరియం పొడి వేసిన దానితో, నేను పొట్ట నింపుకోలేను, అంటూ ఆకలితో ఉన్నా, ఆత్మగౌరవం , ఆకలి కన్నా గొప్పది అని చెప్పకుండా చెప్పే, ఈ దేశపు సగటు గ్రామీణ భారతీయుడిగా లేచి పోతాడు. అమ్మాయి తో మరో మాట లేకుండా బయటకు వెళ్ళి పోతాడు. సినిమా అక్కడ ముగుస్తుంది. రైతులకు మద్దతు ధర లేకుండా, గిట్టుబాటు అయ్యేలా జాగ్రత్త చర్యలు తీసుకోకుండా, మన ప్రభుత్వాలు, ఎంత రైతు సహాయకారి గా ఉన్నాయో కటువైన విమర్శ చేసే సినిమా, ముగింపులో, ఉన్న మలుపు, కథా పరంగా , సమాజ సమస్యల పరంగా చాలా శక్తివంతమైనది.

అదే సమయంలో ఏం కొంపలు మించి పోయాయని, నగర యువత, అన్ని సౌకర్యాలూ ఉండగా, ఏవో తెచ్చి పెట్టుకున్నా కారణాలతో ఎందుకు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారు అన్న, ప్రశ్న వేస్తూ, రైతుల ఆత్మహత్యలకు గల నిజమైన కారణాలూ, ఈ నగర యువత ఆవేశంలో చేసుకునే ఆత్మహత్యల కన్నా, ఎన్నో రెట్లు బలమైన కారణాల గలవి, వాటి మనం పట్టించుకోవాలి, ఆలోచించాలి,అన్న విషయం, దర్శకుడు, కథలో సూటిగా చెప్పడంలో పాటించిన క్రమశిక్షణ, "క్లుప్తత కళ యొక్క ఆత్మ" అన్న పెద్దల మాటకు పూర్తి గౌరవాన్ని ఇస్తాయి. కెమెరా కథ చెప్తుంది అనడంలో గల శక్తివంతమైన అన్వయం తెలిసిన వారి చేతిలో, చదివిన మంచి కథ వలె, చూసిన మంచి సినిమా కూడా చాలా కాలం ప్రజల మనసులో, ఒక కళారూపంగా, సమాజం పై తాను చేసిన పదునైన వ్యాఖ్యకు గుర్తుండి పోతుంది. రైతాంగ వ్యతిరేక, వ్యవసాయ రంగ వ్యతిరేక వర్తమాన పాలక విధానాలు ఎవరికి మేలు చేస్తున్నాయి అని ప్రశ్నలు, ఆకలితో అయినా సరే ఆత్మగౌరవంతో నడిచి వెళ్లిపోతున్నా ఆ యువకుడి అడుగుల్లో మనకు వినిపిస్తాయి. అందుకే "సాల్ట్ అండ్ పెప్పర్" ఈ కాలపు పదునైన కెమెరా కథ.

వచ్చే వారం, మనం భారతదేశం, పాకిస్తాన్ అంటూ చేసే హంగామా, రెచ్చగొట్టుకునే శత్రు భావనలు, సరిహద్దులకు ఇరువైపులా ఎంత నిరర్ధకమైనవో, చెప్పే ఒక మంచి సినిమా 'తోబా తేక్ సింగ్'' గురించి మాట్లాడుకుందాము.

తోబా తేక్ సింగ్-
భారత ఉపఖండపు గుండె కోత

Weekend Special

చూడాల్సిన మంచి సినిమాలలో "తోబా తేక్ సింగ్" ఒకటి. ఇది కథానిలయానికి చిరునామా అయిన శ్రీకాకుళం గర్వపడే సినిమా. ఎందుకంటే, ఇది ఒక కథానిక పై ఆధారపడ్డ చిత్రం. ఈ కథా రచయిత, సాదత్ హసన్ మాంటో 1955లో రాసారు. అప్పటికే బొంబాయిలో నివసిస్తూ ఎన్నో కథలు రాసిన, సినిమా రంగానికి చెందిన ఆయన, భారత దేశం నుంచి పాకిస్తాన్ వెళ్ళి స్థిరపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చిన రెండు మూడేళ్లకు జరిగినట్టుగా కథాకాలం సూచితం అవుతూ ఉంటుంది. దేశ విభజన కథా వస్తువుగా మాంటో విసిరిన వ్యంగ్యపు ఫిరంగి పేలుడు ఈ కథ.

కథ మొదలు కావడమే లాహోర్ లోని పిచ్చివారి ఆశ్రమంలో మొదలు అవుతుంది. దేశం రెండు ముక్కలు చేసుకుంటున్న మనం, మన ప్రభుత్వాలు ఎటువంటి మానసిక దశలో ఉన్నాయో చెప్తూ, లోపలున్న పిచ్చి వారికి, పైనున్న ప్రజలకు పెద్దగా తేడా లేదు అని, కథ బలంగా చెప్తుంది. అన్నిట్లో పంచుకున్నట్టే, పిచ్చి వాళ్ళను కూడా, ఏ దేశం వారిని ఆ దేశానికి పంపేయడానికి ఏర్పాట్లు జరుగుతాయి. దేశంలో సరిహద్దు రాష్ట్రాలలో ప్రజలు ఒకరినొకరు మతం పేరిట ఊచకోత కోసుకుంటున్నారు. ఈ రక్తసిక్త నేపథ్యంలో మాంటో ఈ వ్యంగ్య కళా రూపాన్ని అందించాడు. అలా పిచ్చివాళ్లను పంచుకోవడానికి జరిగిన ప్రయత్నంలో ఏం జరిగింది అన్నదే "తోబా తేక్ సింగ్" కథ.

oOo

నిజానికి మొదట్లోనే మనం పప్పులో కాలు వేస్తాము. ఎందుకంటే "తోబా తేక్ సింగ్" అనేది ఒక మనిషి పేరు కాదు, అదొక ఊరి పేరు. పంజాబ్ ప్రాంతంలోని ఒక తహసీల్ కేంద్రం (మండలం అన్నమాట) (ఈ తహసీల్ అన్న మాట నుంచే, మనం రెవెన్యూ పరిభాషలో వాడుతున్న తహశీల్దార్ అన్న మాట వచ్చింది). బిషన్ సింగ్ అన్న పిచ్చి వాడు ఆ పిచ్చి వాళ్ళ ఆశ్రమంలో, నిరంతరం నిలబడే ఉంటాడు, అదీ దిష్టి బొమ్మలా. కాళ్లు వాచి. అందర్నీ, "తోబా తేక్ సింగ్" ఎక్కడ? ఎలా వెళ్లాలి? అని అడుగుతుంటాడు. "తోబా తేక్ సింగ్" అతని స్వగ్రామం. పైనుంచి వచ్చిన అధికారులు కొందరు "తోబా తేక్ సింగ్" భారత్ లో ఉంది అంటే, మరికొందరు లేదు లేదు "తోబా తేక్ సింగ్" పాకిస్తాన్ లో ఉంది అంటూ ఉంటే, తాను మరింత కలవర పడుతుంటాడు.

oOo

కాసేపు భారత్ లోనూ, కాసేపు పాకిస్తాన్ లోనూ ఉండడానికి ఆదేమన్నా మనిషా ? ఊరు కదా, ఎలా కదిలి వెళ్తుంది అంటాడింకొక పిచ్చి వాడు. మాట్లాడుతున్న వ్యక్తి, అది సాధ్యమే, ఎందుకంటే, ఈ పిచ్చి వాళ్ళ శరణాలయమే శీయుజ్, మొన్నటిదాకా భారత్ లో ఉంది, ఇప్పుడిది పాకిస్తాన్ లో ఉంది అని చెప్తే ఆ పిచ్చివాళ్లు వెక్కిరిస్తారు. మేం కదా ఇక్కడ ఉన్న పిచ్చి వాళ్ళము, మేము ఎక్కడికీ వెళ్లలేదే, మరి మేం కదలకుండానే భారత్ నుంచి పాకిస్తాన్లోకి వచ్చేశామా? అని పడి పడి నవ్వుతారు. నేపథ్యం నుంచి కైఫీ అజ్మీ పాట వినవస్తుంది. "ఎవరైనా తెలివిలో ఎలా ఉంటారు గుండె ముక్కలవుతుంటే, మేమా, లేక లోకమా ఎవరికీ పిచ్చి, కాస్త ఎవరైనా చెప్తారా" (హిందూస్తానీమూలం హెరాన్ హై కోయీ కైసే రహే జబ్ దిల్ టుకడే హోజాయే, హం పాగల్ యా దునియా పాగల్ కోయి హమే సమ్‌ఝాయే).

వచ్చే వారం ఇదే అంశాన్ని కంటిన్యూ చేద్దాము. ఈ లోగా మీరు చూడగలిగితే, "క్యా ఢిల్లీ క్యా లాహోర్" అన్న సినిమా చూడండి. వచ్చే వారం, ఆ సినిమా మీదేనండోయి మన ముచ్చట్లు.

వీక్షణం

రామతీర్థ

బుల్లి తెర బంగారు కాలంలో దూర్ దర్శన్ 1988లో ఈ సినిమా సమర్పించింది. శక్తి ప్రభ నిర్మాత, దర్శకత్వ బాధ్యతలు నిర్వహించారు. పంచూ ఫిల్మ్స్ ద్వారా నిర్మితం అయిన ఈ చరిత్రాత్మక కథలు బిమల్ దత్ స్క్రీన్ ప్లే రాశారు. మహాభారత్ సీరియల్ కు మాటలు రాసిన రహి మాసూమ్ రజా, ఈ సినిమా సంభాషణలు రాయగా, ప్రఖ్యాతకవి కైఫీ అజ్మీ, గీతాలను రాశారు, జాబీ అమర్ ఛాయాచిత్ర నిపుణుడిగా సేవలు అందించారు. సినిమా ఆరంభంలో కుష్వంత్ సింగ్, మాంటో ఎంతటి శక్తివంతమైన కళాకారుడో కొద్ది నిమిషాలు వివరిస్తారు. దేశ విభజన పై వచ్చిన సాహిత్యంలో కుష్వంత్ రాసిన "ఏ ట్రైన్ టు పాకిస్తాన్" కూడా పేరొందిన రచన.

oOo

మాంటో రాసిన మూడు పేజీల కథను చక్కని సినిమాగా మలిచేటప్పుడు, బిషన్ సింగ్కు ఒక కుటుంబ నేపథ్యం, కలహించుకునే తన అన్నదమ్ములను చూసి, తాను పిచ్చివాడు అయ్యే సంఘటన కల్పించి, నేను మన తాత తండ్రుల వారసత్వమైన భూమిని అన్నదమ్ముల మధ్య పంపకాలు కానివ్వను, కావాలంటే, ఈ భూమికి చీద పీద సోకకుండా, దిష్టి బొమ్మలా నిలబడి కాపలా కాస్తాను, అని ఇల్లు వదిలి వచ్చేసి, పొలంలో చేతులు రెండూ బార చాపి ఒక దిష్టి బొమ్మలా నిలబడిపోతాడు. సోదరులు వచ్చి నచ్చచెప్పినా తన మానసిక స్థితిలో మెరుగు కనిపించదు. అలా పిచ్చాసుపత్రికి చేరాడు బిషన్ సింగ్ అన్నది, సినిమా యూనిట్ కల్పించుకున్న ఒక అర్థవంతమైన పూర్వ కథానిక. అతనికొక కుటుంబం, ఒక కూతురు, స్నేహితుడు పాత్రలు గా సినిమాలో అమరుతాయి. ఒక మూడు పేజీల కథానికా బీజాన్ని ఎలా దృశ్య కావ్యంగా 75 నిమిషాల సేపు ఆసక్తి చెడకుండా పొడిగించ గలిగారు అన్నదానికి ఒక మంచి ఉదాహరణగా కూడా ఈ సినిమా నిలుస్తుంది.

పిచ్చివాళ్ళ ఆశ్రమంలో జరిగే సన్నివేశాలు తో పాటుగా మాంటో రాసిన మరొక కథ కూడా దేశ విభజన అల్లర్ల నేపథ్యంలో వచ్చినదే అయిన "ఖోల్ దో" ఉదంతాన్ని కూడా సినిమాలో చతురంగా కలిపి కథగా మలిచారు, బిషన్ సింగ్ అందరినీ "తోబా తేక్ సింగ్" ఎక్కడ ఎక్కడని అడిగి విసిగి వేసారి, చివరికి పిచ్చివాళ్ళ పంపకంలో భారత్ కు చెందిన వారిలో ఒకరిగా గుర్తింపబడి సరిహద్దుకు తీసుకు రాబడతాడు . భారత్ కూడా తమ సరిహద్దు వద్ద పాకిస్తాన్ దేశపు వారిగా గుర్తించిన పిచ్చి వారిని తీసుకొచ్చి, ఇరు దేశాలు అటూ ఇటూ పిచ్చి వాళ్ళని మార్చుకుంటూ ఉన్న దృశ్యం సినిమాకు పతాక సన్నివేశం. తాను భారత్ సరిహద్దు దాటి లోపలికి నడుస్తూ ఉండగా, ఎవరో, "తోబా తేక్ సింగ్" ఉన్నది ఇటు కాదు అటూ అంటారు. దానితో గుబుక్కున వెనక్కి పరిగెడతాడు. స్వగ్రామం ఎక్కడ ఉన్నదో తెలిసిన విపరీతమైన ఆవేశం, ఆనందంలో ఆ పరుగులోనే, సరిహద్దు గీతకు నడిమిన, అటు పాకిస్తాన్, ఇటు భారత దేశం ఉన్న చోట నేలపై కుప్పకూలి ప్రాణాలు విడుస్తాడు. ఈ అభాగ్యుడికి సొంత ఊరు దొరికిందా అన్నది వినవాల పాటలో ఒక ప్రశ్నలా తల ఎత్తి ప్రేక్షకులని బాధిస్తుంది.

మన దేశాల మధ్య సరిహద్దు కాపలా అంటూ రోజుకు ఒక కోటి రూపాయలు రెండు దేశాలు ఖర్చు చేస్తున్నాయి. . ఇప్పటికీ, భారత ప్రజలు పాక్ లోని నగరాల్లో బంధువులను కలిగి ఉన్నారు, అలాగే పాకిస్తాన్ లోని వారు కూడా. అరవై ఏళ్ల ముందర మనం అందరం ఒకే దేశం, ఈ తేడాలు, పగలు, ప్రతీకారాలు, యుద్ధాలు, చేసుకునే పిచ్చిలో ఎలా పడ్డాము అని ప్రశ్నించే మంచి కథ, ఒక శక్తివంతమైన సినిమా అయితే, కథలు రాయడంలో రచయితలకు గల పాత్ర సినిమా రంగం గుర్తించే మంచి రోజులు వస్తాయి.విడిపోయిన దేశాలు కలిసిపోయిన చరిత్ర ప్రపంచంలో ఉన్నది, ఉదాహరణ జర్మనీ దేశమే. లేదా మసాలా కథలు ఆరు పాటలు, అర డజన్ ఫైట్లు, వెకిలి మాటలు, మకిలి చేష్టల సినిమాలను తీస్తూ మేం గొప్ప అంటే మేం గొప్ప అనుకునే సినిమా వ్యాపారులే మనకు ఆరాధ్య దేవతలు అయిన ప్రస్తుత ప్రమాదం ఇంకా శృతి మించి పోతుంది.

వెండి తెర

అప్పటి సినిమాల్లో మంచి కథలు ఉండేవి



అలనాటి కథానాయకుడు నరసింహరాజు

యమదొంగ 2 ప్లానింగ్ లో ఎన్టీఆర్ రాజమౌళి ?

యంగ్ టైగర్ ఎన్టీఆర్ కెరీర్ గ్రాఫ్ ఇప్పుడు ఈ రేంజ్ లో ఉండటానికి సింహాద్రి సినిమా అని చెప్పొచ్చు. ఆ సినిమాతో టాలీవుడ్ లో స్టార్ డైరెక్టర్ గా ఎదిగాడు ఎస్.ఎస్.రాజమౌళి. ఎన్టీఆర్-రాజమౌళి కాంబోలో వచ్చిన మూడు సినిమాలు బాక్స్ ఆఫీస్ ను చెడుగుడు ఆడేసుకుని సూపర్ హిట్ గా నిలిచాయి. అందుకే ఎప్పుడెప్పుడు వీరి కలయికలో కొత్త సినిమా వస్తుందని ఎదురుచూస్తున్నారు ఫాన్స్.

కాగా రాజమౌళి కూడా ఎన్టీఆర్ తో బాహుబలి తరువాత గరుడ ప్రాజెక్ట్ చేయాలనుకున్నాడు కానీ అది ఎప్పుడు పట్టాలు ఎక్కుతుందో తెలియదు. ఇంతలో ఎన్టీఆర్ బాహుబలి 2 లో ఓ ముఖ్యమైన రోల్ చేస్తున్నట్టు వార్తలు వచ్చాయి కానీ అవి ఉట్టివే అని తెలిసిపోయాయి. కాగా ఇప్పుడు వినిపిస్తున్న కొత్త వార్త యమదొంగ కి సీక్వెల్ చేయబోతున్నారని.సోషియో ఫాంటసీ సినిమాల్లో బిగ్గెస్ట్ హిట్ గా నిలిచిన ఈ యముడు-నరుడు కాన్సెప్ట్ కి సీక్వెల్ గా యమదొంగ 2 ని ఎన్టీఆర్ తో తీయాలని జక్కన్న భావిస్తున్నాడట. అందుకు తగ్గ స్క్రిప్ట్ వర్క్ కూడా మొదలుపెట్టినట్లు టాక్ వస్తుంది. ఈ వార్త అయినా నిజం అయితే చాలు అని ఫాన్స్ అనుకుంటున్నారు.

అలనాటి వెండితెర రాకుమారుడు...జానపద జగన్మోహనుడు. నలుపు తెలుపు నుంచి రంగుల తెర పై మహేంద్రజాలం చేసిన మాంత్రికుడు విఠలాచార్యుడి చేతిలో కత్తి లాంటి హీరో. నిలువెత్తు నట కౌశలానికి నిదర్శనంగా తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న 'నట'రాజు నరసింహా రాజు. శతాధిక చిత్రాల్లో నటించి నేడు బుల్లితెరపై బిజీగా ఉన్నారు. నగరంలో ఓ చిత్రం షూటింగ్‌కు వచ్చిన సందర్భంగా సాక్షితో ముచ్చటించారు. ఈ మధ్యకాలంలో వెండితెరపై గాడ్(గ్రాండ్) ఫాదర్‌గా కనిపిస్తూ నేటి ట్రెండ్‌కు సరిపడేలా తన నటనా ట్రెండ్‌ను సెట్ చేసుకున్నానని చెబుతున్న నరసింహారాజు ముచ్చట్లు ఆయన మాటల్లోనే...

ట్రెండీ దాటేలకే నేటి తరం కనెక్ట్ అవుతారు...

మారుతున్న ట్రెండ్ కి అనుగుణంగా మన నటనా ట్రెండ్ సెట్ చేసుకోవాలి. నేటి ఆటా పాటా తీరుతెన్నులు అన్నీ పూర్తిగా మారిపోయాయి. నాటి నటన ఒక తీరుంటే నేటి యాక్టింగ్‌కి ఒక ట్రెండ్ ఉంది. నాటి డైలాగ్‌లు మీనింగ్‌ఫుల్‌గా ఉంటే... నేటి మాటలకు పాటలకు చాలా మీనింగ్‌లు ఉంటున్నాయి. ఇప్పటి చిత్రాలన్నింటినీ మ్యాజిక్ డామినేట్ చేస్తున్నది. హోరెత్తించే బ్రాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌లో మీనింగ్‌లు, డైలాగ్‌లకు అంతగా ప్రాముఖ్యం లేకుండా పోయింది. చాలా ట్రెండీ డాటేలకే నేటి తరం బాగా కనెక్ట్ అవుతున్నారు. చిత్ర పరిశ్రమలో కొనసాగాలంటే మనమే మారాలి అంతే..

అనుకోకుండా హీరోను అయ్యాను..

డ్రామా లాంటి అనుభవం ఏమీ లేకుండానే నేను అనుకోకుండా హీరోనయ్యాను. అప్పటి దర్శకుడు ఏం చెబితే చాలా చేయడం. వారు చెప్పిన డైలాగ్‌లను చెప్పడమే మావంతు. ఫైట్‌లు, డ్యాన్స్‌లు పూర్తిగా రావు, అన్నీ పూర్తిగా వచ్చిన తరువాత అవకాశాలు లేకుండా పోయాయి. అందువల్లనే మా చిత్రాలు బాగా ఆడాయని చెప్పలేము, లేదని చెప్పలేం. అనాటి రోజులు చాలా మంచికథ...అందులోనూ కుటుంబ కథాచిత్రాలంటే బాగా ఆదరించేవారు.

అభిమాన నటీనటులంటూ ఎవరూ లేరు...

నాకు ప్రత్యేకంగా అభిమాన నటులు, నటీమణులంటూ ఎవరూ లేరు. నా పాత్ర వరకు వారితో కలిసి నటించడం తప్ప ఎలాంటి సంబంధాలుండేవి కావు. ఓ షూటింగ్ తరువాత మరో షూటింగ్‌లో మరొకరితో నటించడం..అంతే తప్ప ఫలానా వారంటే ప్రత్యేకంగా ఇష్టమనేది లేదు. అలాగే ఆనాటి నటీమణులు కూడా సహనటులతో వారి పాత్రల వరకే పరిమితమయ్యేవారు. జయమాలిని గురించి చెప్పాలంటే షూటింగ్‌లో ఆమె ఎవరితో మాట్లాడాల్సి వచ్చినా తలదించుకుని మాట్లాడేది. ఎవరితో అంత చనువుగా ఉన్నట్లు చూడలేదు. చివరికి ఆమె షూటింగ్‌ల నుంచి బయటకు వచ్చిన తరువాత మీడియా సైతం ఆమెతో మాట్లాడడానికి ఎంతో కష్టపడి ఉంటారు.

వెరైటీ పాత్రతో కొత్త చిత్రం

షూటింగ్ ప్రస్తుతం విశాఖలో కొత్త చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. ఇందులో నా పాత్ర హీరోయిన్‌ల తండ్రి పాత్ర. ఇది పూర్తి వెరైటీ పాత్ర. ఇది నేటి తరానికి బాగా కనెక్ట్ అవుతుందని భావిస్తున్నాను. ఇంత వరకూ నేను హైహీండ్, చందమామ కథలు వంటి చిత్రాల్లో నటించాను. ఇక బుల్లి తెరపై చాలా సీరియల్స్‌లో నటిస్తున్నాను.

హీరో కంటే పాత్రకే ప్రాముఖ్యత...

నాతో చిరంజీవి కలిసి నటించిన చిత్రం పునాదిరాళ్లు. ఆ చిత్రంలో నేను హీరో కాగా, మరో నలుగురు యువకుల్లో చిరంజీవి ఒకరు. ఆ తరువాత మేమిద్దరం కలిసి నటించిన చిత్రం 'పున్నమి నాగు'. అందులో చిరంజీవిది యంగ్ రోల్. ఆ చిత్రంలో నేను హీరో అయినప్పటికీ యాంటీ రోల్ చేసిన చిరంజీవే పాపులర్ అయ్యారు. జగన్మోహిని చిత్రంలో అసలు హీరోయిన్ ప్రభ. అయితే జయమాలినే హీరోయిన్ అని అందరూ అనుకుంటారు. అలాగే పున్నమినాగులో చిరంజీవినే హీరోగా అనుకోవచ్చు. ఎవరి పాత్రకు ప్రాముఖ్యం ఉంటుందో వారే హీరో అవుతారు. ఆ చిత్రం తరువాత చిరంజీవితో ఎలాంటి సంబంధాలు లేవు.

Interviews-A Concept of Mutuality

జయదేవ్ ఇంజరాపు

లైఫ్‌స్కిల్స్ ట్రైనర్

ITAC, Australia

CSST, B.I.P.D, UK

96668 15653

PURPOSE OF AN INTERVIEW

1. It seems clear from the definition and objectives given above that the purpose of an interview is to create an opportunity for people to meet and converse with each other on a matter of mutual benefit.
2. The participants include an interview or interviewers who pose questions relating to the objective of the interview and an interview who answers them.
3. This does not exclude the interview from asking questions too and there in lays the concept of mutuality where both parties benefit.
4. A successful interview cannot be an occasion for discussion in which questions and answers are posed by both sides.
5. Most of us fear being interview because we approach the interview as one-sided affairs. Since we are concerned with job interviewer in this book.
6. Let's see how the organization, interviewer and interviewee are all stake holders in an interview and have something to gain from it.

WAY OF ANSWERING:

1. Regardless of what type of question you are asked, you will find it easier to respond effectively if you keep in mind some basic question answering strategies.
2. The interview is an opportunity for you to sell yourself. Don't be afraid to 'blow your own horn.' As long as you can back up what you are saying with examples which demonstrate that what you are saying is true, you are not bragging. Third party observations can also be mentioned.
3. You can never predict every question that you will en counter, so approach the inter view with an inventory of im portant points. Make a list of the points about yourself that you want the interviewer to know.

లగాన్‌ను మించిన బోస్నియా సినిమా నో మేన్స్ లాండ్

Weekend Special

2001లో మనం ఒక మంచి సినిమా చూసాము. అది అమీర్ ఖాన్ తీసిన "లగాన్" సినిమా. లగాన్ అంటే శిస్తు. రైతులు తమ భూముల పై ఏటేటా కట్టవలసిన పన్ను. ఆ ఏడాది, అంతకు ముందర కొన్నేళ్లు పంటలు సరిగాపండక పోవడం వల్ల తాము శిస్తులు కట్టలేమని గ్రామస్తులు చెప్తారు. తాము క్రికెట్ ఆడుకుంటూ, సరదాగా తమ పాలన కొనసాగిస్తూ ఉన్న బ్రిటీష్ యువ అధికారి తో మాటా మాటా పెరిగి, భారతీయులు పల్లెటూరి మోటు వారు, ఎందుకూ పనికిరారు అన్న వెటకారం ధ్వనిస్తుంది ఆ అధికారి మాటల్లో. అయితే మేం ఈ ఆటే ఆడి , మీతో గెలిస్తే మా పన్ను మాఫీ చేస్తారా అన్న సవాలు చేస్తారు గ్రామ యువత. వారు ఎన్నటికీ ఆంగ్లేయుల ఆట అయిన క్రికెట్ ను నేర్వలేరని, ఎలాగా ఓడి పోవడం ఖాయం కనుక, ఆ పందేనికి ఒప్పుకుంటాడు ఆ బ్రిటీష్ అధికారి. ఆ సినిమాలో ఏమి జరుగుతుందో మనకు తెలుసు. ఎంతో శ్రమతో ఆ పల్లె యువకులు అందరూ ఆ ఆట నేర్చుకుని, మొత్తానికి చావు తప్పికన్ను లొట్టపోయి అన్న చందాన , తెల్లవారిపై గెలుస్తారు. ఒక ఆట నేపథ్యంలో భారతీయ ప్రజల, వారి పాలకుల మనస్తత్వాలు, పట్టుదలలు, చూపిన మంచి సినిమాగా మనం అందరమూ గుర్తించాము. ఈ సినిమా ఆస్కార్ బహుమతుల పోటీకి వెళ్లింది. ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలో పోటీకి నిలిచింది. అయితే ఈ సినిమాని కాదని, ఆస్కార్ కమిటీ, బోస్నియన్ సినిమా అయిన "నో మేన్స్ లాండ్" ను ఆ ఏడాది ఉత్తమ విదేశీ చిత్రం గా గౌరవించి, బహుమతిని పకటించింది. అలా లగాన్ చిత్ర ప్రతిష్టకు అడ్డం పడ్డ నో మేన్స్ లాండ్ గురించి, ఈ వారం మన ముచ్చట్లు.

~~~ ~~~ ~~~

అప్పటికి 1993 నుంచి యూరప్ లో యుగోస్లావియా విఛిన్నం తర్వాత జాతుల అంతర్యుద్ధంగా బోస్నియా, సెర్బియాల మధ్య భీకర పోరు కొనసాగుతూ జన జీవనాన్ని, ఛిన్నాభిన్నం చేసింది. ఈ హింసను ఆపడానికి ఐక్యరాజ్య సమితి సైన్యాలు రంగ ప్రవేశం చేశాయి. నగరాలపై

బాంబుల దాడులు, సైనికుల సంకుల సమరాలు, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం ఈ రెండు ప్రాంతాలలో విపరీతంగా జరిగింది. యుద్ధం ఎప్పుడూ ఏ సమస్యకు పరిష్కారం కాదు. అది ఒక పరిష్కారం వేపు దారి తీస్తుంది అనుకోవడం, కేవలం యుద్ధోన్మాదుల భ్రమ మాత్రమే అని సాధారణ జనుల ద ృష్టి కోణం నుంచి సినిమా కథ చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు దానిస్ తానొవిక్. ఈ సినిమా కథలో గల బలమైన మానవీయ కోణం, యుద్ధం పట్ల గల నిరసన, మానవ ప్రాణాల పట్ల యుద్ధ మ ృగానికి ఏ రకమైన బాధ్యత లేక పోవడం, ఈ సినిమాలో చిత్రితమయిన తీరు ఈ సినిమాను ఉత్తమ విదేశీ చిత్రం గా బహుమతికి అర్హమైనదిగా నిలబెట్టింది.

~~~ ~~~ ~~~

రెండు దేశాల మధ్య అంతరాన్ని కేవలం ఒక ఆట ద్వారా ఉత్తేజితంగా చూపెట్టిన లగాన్ కన్నా, గంభీరమైన జీన్మరణ సమస్యను సమకాలీన జీవితం నుంచి సినిమా గా చిత్రీకరించినందుకు, ఆస్కార్ కమిటీ, ఈ పోటీలో తమ ఎంపిక "నో మేన్స్ లాండ్" అని ప్రకటన చేసింది. గత వారం మనం మాట్లాడుకున్న "క్యా డిల్లీ క్యా లాహోర్" లో కూడా ఇటువంటి కథే కనిపిస్తుంది స్తూలంగా. అది రెండు వైరి పక్షాలకు చెందిన శత్రు సైనికులు సేనాధికారుల హోదాల్లో కాక, మామూలు సైనికులు గా ఎదురు పడితే, జరిగే మాటా మంతీ, పోరూ గురించి చెప్పే ప్రయత్నం చేసిన సినిమా. ఈ తరహా కథను 2001లోనే ప్రపంచ సినిమా "నో మేన్స్ లాండ్" ద్వారా తెరకెక్కించింది.

~~~ ~~~ ~~~

రెండు తలపడుతున్న దేశాలు బోస్నియా, సెర్బియాలకు చెందిన చెరొక గాయ పడ్డ సైనికులు, ఒక "నో మేన్స్ లాండ్" (అధీనాతీత భూమి)లో గల ఒక నేల గోతిలో (ట్రెంచ్) ఉంటారు. సెకి, నినో వీరి పేర్లు. ఒకరి



పై పట్టు సాధించడానికి మరొకరుగా, పరస్పర నింద, తమ శత్రు దేశాల వైఖరులను ఎద్దేవా చేయడం, వంటివి చేస్తూ, చీకటి పడితే, ఎలాగైనా, అవతలి వ్యక్తిని తాము అదుపులోకే తెచ్చుకోగలమన్న పద్ధతి మనసులో పెట్టుకుని వ్యవహరిస్తూ ఉంటారు. యుద్ధ భూతం ఇంకా వీరి మనసుల్లోంచి పోలేదు, ఇటువంటి దారుణమైన పరిస్థితుల్లో కూడా. అదే చోట, మరొక గాయపడ్డ సైనికుడు సెరా , స్ప ృహ తప్పి ఒక మందుపాతర పై పడి ఉంటాడు. తాను కదిలాడా ఆ లాండ్ మైన్ పేలుతుంది. అతనికి స్ప ృహ వచ్చాక తాను ఉన్న ప్రాణాంతక దశ తెలిసి వస్తుంది. వీరి పట్టుదలల పద్మవ్యూహం లోకి ఆ ప్రాంతాలలో మానవీయ సహాయం అందిస్తూ, యుద్ధానికి దూరంగా ఉండాలన్న ఆదేశాలు స్పష్టం గా కలిగి ఉన్న, ఐక్యరాజ్యసమితి రక్షణ బలగాలకు చెందిన ఒక ఫ్రెంచ్ సైనికుడు వస్తాడు. అతను వీరిని వదిలి వెళ్ళి పోవచ్చు, కానీ వారిని కాపాడాలని నిశ్చయించుకుంటాడు.

~~~ ~~~ ~~~

ఈ లోగా యుద్ధ రంగం నుంచి వార్తలు అందచేస్తున్న ఒక ఆంగ్లేయ పాత్రికేయుడు ఈ సీన్ లోకి వచ్చి, తను కూడా, చిక్కుకున్న సైనికుల దురవస్థ గురించి, పత్రికలకు తెలుపుతాడు. దీనితో విషయం నలుదిశలా పాకి, ప్రపంచ ద ృష్టికి చేరుతుంది. తమను రక్షించే ప్రయత్నం చేసిన శాంతి సేన ప్రయాస సఫలం అయినా, ఒకరిని ఒకరు రెచ్చ గొట్టుకునేలా ప్రవర్తించే సెకి, నినో తమ వాగ్వాదాన్ని ఆ ట్రెంచ్ నుంచి బయటకి వచ్చాక కూడా కొనసాగిస్తారు. ఒక ఉద్రేక క్షణం లో బోస్నియన్ సైనికుడు సెకి, సెర్బియా సైనికుడు నినో ను కాల్చేస్తాడు. అతన్ని నిరోధించే ప్రయత్నంలో ఒక శాంతి సేన సైనికుడు సెకి ని కాల్చి చంపేస్తాడు. ఇక మిగి లిందల్లా, ట్రెంచ్ లో లాండ్ మైన్ పై పడున్న, గాయపడ్డ ఎటూ కదల లేని బోస్నియన్ సైనికుడు

సెరా. ఈ రక్షణ ప్రయ్రటన్నం ఇలా ఫైణమించిందన్న విషయం, అక్కడ ఐక్యరాజ్యసమితి రక్షణ బలగాల అధిపతికి తెలియ వస్తుంది. తను, ట్రెంచ్ లోని మందు పాతర పై పడున్న సెరా ను కాపాడామని, అసత్యాన్ని ప్రసారం చేయించి, అందరూ, అక్కడ నుంచి వెళ్ళి పోయేలా చేస్తాడు.

~~~ ~~~ ~~~



రామతీర్థ

ఈ లోగా ఆ నేల గోతి ప్రదేశాన్ని పరస్పరం తమ వశం చేసుకోవడానికి, అవతలి సైన్యం ప్రయత్నం చేస్తున్నాదనే కట్టుకథను ప్రచారంలో ఉంచుతాడు, దీని పర్యవసానం ఏమవుతుందంటే, రాత్రి అయ్యాక, ఇరు పక్షాలూ, అవతలి వారి కన్నా ముందుగా తామే ఆ ప్రయత్నం చేయాలని, ఆ ట్రెంచ్ పై ఫిరంగి గుళ్ళ వర్షం కురిపిస్తారు, ఆ కారణంగా, అక్కడ పడి ఉన్న నిరాగ్యే సైనికుడు ఏ సాక్ష్యమూ లేకుండా చనిపోయే అవకాశాలు బలంగా ఉన్నాయి. అలా యుద్ధ నీతి, గాయ పడ్డ సైనికుల పట్ల ఒక్కో సారి ఎంత పట్టనట్టుగా ఉంటుందో కూడా దర్శకుడు చెప్తాడు. ఒంటరి గాయపడ్డ సైనికుడిని, వదుల్చుకుని చేతులు దులుపుకుని వచ్చే యుద్ధ రీతి అసలు రంగు ఏమిటో, బయట పెడతాడు దర్శకుడు. యూరప్ గుండెని కదల్చిన ఈ "నో మేన్స్ లాండ్" సినిమాకు ఆస్కార్ తో బాటు నలభయి రెండు అవార్డులు దక్కాయంటే, ఈ సినిమా ఎంత శక్తివంతంగా తీశారో, ఎలా విజయాన్ని సాధించిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ గౌరవాన్ని పొందే క్రమంలో ఈ సినిమా మన లగాన్ నే కాక ఫ్రెంచ్ సినిమా "ఏమీల్యే"ను వెనక్కు నెట్టి తన విశిష్ట ప్రయోజనాన్ని నిరూపించుకున్నది.

వచ్చే వారం నగర జీవితంలో ఒక ప్రధానమైన వాస్తవం పై ఆధారపడ్డ హిందీ సినిమా "ట్రాఫిక్ సిగ్నల్" గురించి మాట్లాడుకుందాము.
~~~

"ట్రాఫిక్ సిగ్నల్" దీపానికి అల్లుకున్న జీవితాల కథ

Weekend Special

నగరం, జీవితం పుస్తకంలోకి తెచ్చి పెట్టిన కొత్త విరామ చిహ్నాం ట్రాఫిక్ సిగ్నల్. రద్దీ గా ఉండే రోడ్లు, నాలుగు రోడ్ల కూడలి లో నలు వైపులా ఎప్పుడు సిగ్నల్ దీపం ఎరుపు నుంచి మారి ఆకుపచ్చకు వస్తుందా అని బ్రేకుల మీద చేతులు, కాళ్ళతో ఉగ్గ బట్టి ఉన్న వాహన సమ్మర్దం, ఈ ఆగిన రెండు నిమిషాల వ్యవధిలోనే, తమ జీవిక కోసం ఆ వాహనాల చుట్టూ కమ్ముకునే చిన్నా చితకా వ్యాపారస్తులూ,ఇది అందరికీ సుపరిచితమైన దృశ్యమే. ఈ నేపథ్యమే 2007 లో మధుర్ భండార్కర్ తీసిన "ట్రాఫిక్ సిగ్నల్" సినిమా కు మూలం. ఈ సిగ్నల్ ఎరుపు నుంచి ఆకుపచ్చకు ఒక రోజులోకొన్ని వందల సార్లు మారుతుంది. రోజులో ఏ సమయంలో ఉండే రద్దీ ఆ సమయంలో ఉంటుంది.

ఈ సిగ్నల్ వద్ద మనం చూసే మనుషులు కొందరు ముసలి వారు, కొందరు వయసులో ఉన్న వికలాంగులు, మరికొందరు ఆడవారి వలె దుస్తులు ధరించిన నపుంసకులు, ఇంకొందరు రకరకాల వస్తువులు అమ్మే వారు, కొందరు కన్ను మూసి మోసం చేసే దొంగలు, ఇంకొందరు చంకలో బిడ్డలను చూపి, వారి ఆలనా పాలన కోసం ధన సహాయం కోరే వారు, కొందరు తార్పుడు గాళ్ళు, కొందరు వయసులో ఉన్న దేహ వ్యాపారం చేసే వారు, ఇంకొందరు వారి ప్రేమికులు, ఇంకొందరు రోడ్ పై దేవుళ్ళ, మహాత్ముల బొమ్మలు గీసే, డబ్బు సంపాయించే వారు,ఇదొక గందర గోళపు లోకం. ఇక్కడ ఎవరూ స్వతంత్రులు కారు. విచ్చలవిడిగా ఉన్నట్టు కనిపించినా, ఎవరు పడితే వారి ఇష్టం మేరకు, ఏ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద పడితే, ఆ సిగ్నల్ వద్ద తమ భిక్షుక వృత్తి, తమ వ్యాపారాలు సాగించవీలు లేదు. ప్రతీ ట్రాఫిక్ సిగ్నల్ వద్ద ఒక లీడర్ ఉంటాడు. అతన్ని నియంత్రించే మాఫియా ఇంకా పెద్ద స్థాయిలో పని చేస్తూ ఉంటుంది. ఈ లీడర్, సిగ్నల్ వద్ద బిచ్చ గాళ్ళు,ఇతర వ్యాపారుల నుంచి వారం వారం "హప్తా" వసూల్ చేస్తూ ఉంటాడు. ఇందులో చాలా భాగం ఆ ఏరియా "భాయి", ప్రతినిధి గా మాఫియా కు చెల్లిస్తారు. అలా సిగ్నల్ వద్ద జీవిక కోసం తాపత్రయ పడే వారికి ఒక రక్షణ ఉంటుంది. ఎవరి ఏరియా వారికి స్థిరమై ఉంటుంది. పైపెచ్చు కథా స్థలం, ముంబై మహా నగరంలోని ఒక కీలకమైన కూడలి లో గల సిగ్నల్. సమస్తమూ దొరుకుతుందక్కడ, మృత్యువు తో సహా.

దేశం నలు మూలాల నుంచి వచ్చిన బహు భాషల పేద భారత ప్రజానీకం, ముక్కు పచ్చలారని శ్రీలంక తమిళ బాలుడు వేద్ గిరి, మొదలుకుని గుజరాత్ నుంచి వచ్చి రెడీ మేడ్ దుస్తులు అమ్మే యువతులు, శిలాజిత్ అమ్మే వారి దాకా, ఒకే అవసరం కోసం ఇక్కడ ఒక్కటై ఉంటారు. అది తమ జీవికను సంపాదించుకోవడం. ఒక యువకుడైతే, సిగ్నల్ దాకా శుభ్రంగా బట్టలు వేసుకు వచ్చి, పబ్లిక్ టాయ్లెట్ లోకి వెళ్ళి ఆ దుస్తులు విప్పి,కేవలం అండర్ వేర్ తో ఒక పిచ్చి వాడివలె ఆ సిగ్నల్ వద్ద అడుక్కుంటూ ఉంటాడు. చెత్త ఏరుకునే శ్రీలంక తమిళ అనాధ బాలుడు, కాసిన్ని డబ్బులు పోగు చేసి ఆ సొమ్ముతో, శరణార్థుల శిబిరానికి ఎస్.టీ. డి బూత్ ద్వారా ఫోన్ చేయిస్తూ ఉంటాడు తన రిజిస్ట్రేషన్ నంబర్ చెప్పి, తమ తల్లి తండ్రుల ఆచూకీ కోసం. వారు ఎప్పుడో చనిపోయారన్న సంగతి చెప్పడు ఆ శిబిరం అధికారి. ఇంకొక కుర్రాడు, ఫెయిర్ నెస్ క్రీంల ఆకర్షణలో, నల్లగా ఉన్న తాను ఎప్పటికైనా తెల్లగా అవనా, అని ఆ క్రీములన్నీ కొని రాసుకుంటూ ఉంటాడు. వ్యభిచారం చేసే బాలికలు, స్వలింగ సంపర్కులూ, ఇలా ట్రాఫిక్ సిగ్నల్ మనకి కేవలం రెండు నిమిషాల పాటు ఆగే తాత్కాలిక విరామం మాత్రమే అయినా, ఎన్నో జీవితాల వెతలు చెప్పే, అధో జగత్ సహోదరుల కథా సరిత్సాగరం.



రామతీర్థ

నదరైన మోగ్రా గర్జర్ దుస్తులు అమ్మే పిల్లగా నీతూ చంద్ర, సిగ్నల్ వద్ద లోకల్ గుండా గా కునాల్ ఖేము, సెక్స్ వర్కర్ గా కొంకణ సేన్ శర్మా,ఆమెని ప్రేమించిన వాడిగా రణవీర్ షోరే, మాఫియా భాయి గా సుధీర్ మిశ్రా, ఇంకా పైన పేర్కొన్న పిల్లల పాత్రలు, బికారులు, ముసలీ, ముతకా, మొదటి సగంలో కథ కన్నా పాత్రల పరిచయమే ఎక్కువ ఉంటుంది. రెండో సగంలో అక్కడ రాబోతున్న పై వంతెన (ఫ్లై ఓవర్) ఇంకొంచెం ముందుకు జరిపితే, తమ అపార్ట్మెంట్లకు మంచి గిరాకీ ఏర్పడుతుందని, అలా జరిపించమని కోరే బిల్డర్స్ లాబీ ఒత్తిళ్లకు లొంగని చీఫ్ ఇంజనీర్ ను ఎలాగైనా అడ్డు తప్పించాలని, ఆ సిగ్నల్ వద్దనే, కేవలం కిడ్నాప్ చేస్తాము అని చెప్పి, హత్య చేస్తారు. ఇది ఘాతుకం అని తెలిసిన సిల్సిలా (కునాల్ ఖేమూ) తను అప్రూవర్ గామారి పోయి, పోలీసులకు జరిగిన దురంతం అంతా, ఎవరెవరు ఇందులో పాత్రలో సహా వివరిస్తాడు. దానితో అందరూ జైలుకి వెళ్తారు.

నగర ఆధునికీకరణ లో భాగంగా అక్కడ ఒక పై వంతెన వస్తుంది. దాని మూలాన, ఆ ట్రాఫిక్ సిగ్నల్ అవసరం లేక పోవడంతో అక్కడ నుంచి దాన్ని తొలగిస్తారు. అయితే అప్రూవర్ గామారిన సిల్ సిలా , తాను కేసు తేలే దాకా జైలులో ఉండవలసి రావడం వలన, పోలీసు వాహనంలో జైలుకి తీసుకు పోబడుతూ ఉంటాడు. ఆ వాహనం ఒక సిగ్నల్ వద్ద ఆగుతుంది. ఒక సిగ్నల్ వద్ద ఎన్నో జీవితాలను ఆజమాయిషీ చేసిన తాను ఇంకొక సిగ్నల్ వద్ద మళ్ళా గుమి కూడుతున్న జీవితాలను, జీవిక కై వారి తాపత్రయాలను, తాను అంతా ఎరిగి ఉన్న వాడి నిగూఢత తో చూస్తూ ఉంటాడు. ఇది సినిమాముగింపు. ఈ సినిమాకు నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ బెస్ట్ డైరెక్షన్, నేషనల్ ఫిల్మ్ అవార్డ్ ఫర్ బెస్ట్ మేక్ అప్ అవార్డ్ లభించాయి. పేదల బతుకు కథలు ఎలా ఉంటాయో చెప్పిన మీరా నాయర్ "సలాం బొంబే" తరువాత, అంత శక్తివంతంగా చెప్పిన సినిమాగా మన్ననలు పొందింది. మధుర్ భండార్కర్ తీసిన ట్రయాలజీలో "పేజ్ త్రీ ,"కార్పొరేట్" తరువాతది, ఆఖరుదీ, ఈ సినిమా.

వచ్చే వారం మన కథకుడు మల్లిపురం జగదీష్, కథ సమకూర్చగా, యువతరం దర్శకుడు, అట్టాడ సృజన్, మన శ్రీకాకుళం, పార్వతీపురం రచయితలు, కవులు, పాత్రలుగా తీసిన సినిమా "సన్నాయి" గురించి మాట్లాడుకుందాము.

ఉత్కంఠల జలపాతం "సైకో" సినిమా



Weekend Special వీక్షణం

మనసు ఒక మంత్ర నగిరి. ఏ ఆనందాలు, ఆందోళనలు, ఆవేశాలు, భయాలు, ద్వేషాలు, విపరీత ప్రవర్తనలు ఆ లోపల బుసలు కొట్టే సముద్రాలై, కనిపించకుండా ప్రవహిస్తూ, అదృశ్య నర్తనం చేస్తుంటాయో చెప్పలేము. "కదిలించకు సుప్త భుజంగాలను" అని మహాప్రస్థాన కావ్యంలో ఒక గీతం రాశారు. శ్రీశ్రీ. "అంతరాళ భయంకర ప్రాంతరలానా నీ సంచారం" అని ప్రశ్నించారు కూడా. ఈ కవి పేరు "సాహసి". ఈ అంతరాళ భయంకర ప్రాంతరాల గురించి ఆల్ప్రెడ్ హిచ్ కాక్ తీసిన సినిమా సైకో. నేటికీ 55 ఏళ్లు పూర్తి చేసుకున్నది. 1960లో కేవలం ఎనభై వేల డాలర్లతో ఈ సినిమా తీశారు. పదుల రెట్ల లాభాలు, వందల రెట్ల కీర్తి, గుర్తింపు ఈ సినిమాకు దక్కాయి. కథను తెరకు ఎక్కించడం అంటే కెమెరా కన్నులోంచి దర్శకుడు ఈ సినిమాను చూడడం. తాను చూసింది మనకు చూపించడం. అందుకోసం హిచ్ కాక్ ఒక సాలెగూడు వంటి కథను పటుత్వంతో చెప్పాడు. సినిమా పట్ల తనకు ఎంత నమ్మకం వున్నది అంటే, సినిమా ఆట మొదలయ్యాక వచ్చిన వారిని, సినిమా హాళ్లలోకి అనుమతించవద్దు అని చెప్పి, హాల్ యాజమాన్యాలచే దాన్ని పాటింపచేసిన వాడు ఈ దర్శకుడు. చూసేవారు కూడా హిచ్‌కాక్ పట్ల గౌరవంతో సినిమా మొదలుకు ముందరే వచ్చి, ఏ ఉత్కంఠను దర్శకుడు తమతో పంచుకుంటున్నాడో. దాన్ని అందుకోవడానికి సిద్ధంగా వుండడం సినిమా చరిత్రలోనే అప్పటికి ఒక పెద్ద విశేషం.

రామతీర్థ

ఫీనిక్స్, ఆరిజోనాలో ఒక రియల్ ఎస్టేట్ కంపెనీ ఉద్యోగినిగా ఉన్న మరియన్ క్రేన్, తనకు దొరికిన ఖాళీ సమయంలో తన ప్రియుడితో హొటల్లో శృంగారంలో వుంటుంది. అతనికి గల అప్పులు, విడాకుల కేసు తేలకపోవడం వల్ల వారిద్దరూ బయట తిరగ వీలు లేదు. ఎంతకాలమిలా, అంటే కేసు తేలాలన్నా, అప్పులు తీరాలన్నా డబ్బులు కావాలి. ఆ మధ్యాహ్నం ఆఫీసులో ఆమె చేతికి నలభై వేల డాలర్ల డబ్బు వస్తుంది. దాన్ని ఆమె బ్యాంకులో వేయాలి. బ్యాంకు దూరం కాబట్టి డబ్బు వేసేసి అలా మధ్యాహ్నం తాను ఇంటికి వెళ్లిపోవచ్చా అని ఆమె తన బాస్‌ను అడుగుతుంది. తను అంగీకరిస్తాడు.

అయితే మరియన్ ఆ డబ్బును దొంగిలించ నిశ్చయించుకున్నది. డబ్బు తీసుకువెళ్లి తన ప్రియుడు, ఫైర్‌వేల్‌లో ఉంటున్న సంకు ఇవ్వాలని ఆమె ఆలోచన. అయితే నేరం చేయడం తెలియనిది కనుక ఊరి నుంచి బయటకు వెళ్లే క్రమంలో తన బాస్ కంట పడుతుంది. దానితో భయపడిపోయి హైవేపై కారును పక్కకు తీసి తన ఆలోచనల వల్ల, శ్రమ వల్ల అలిసిపోయి అలాగే నిదరలోకి వెళ్లిపోతుంది. కన్ని గంటలు గడిచాక తీరా ఆమెని లేపేది ఆ రహదారిపై పెట్రోలింగ్ చేస్తున్న పోలీసు అధికారి. తాను ఆమె ఒంటరిగా కార్లో అలా హైవేపై నిద్ర పోవడం పట్ల



ఆశ్చర్యం ప్రకటించి దారి పక్కన హొటల్ (అక్కడ వీటిని మోటెల్ అంటారు) వుంటాయి. మీరు అక్కడ విశ్రాంతి తీసుకొని మరలా బయలు దేరవచ్చు అని చెప్పి తన లైసెన్స్ వగైరా పరిశీలించి వెళ్లిపోతాడు. కానీ ఆమెని అనుసరిస్తాడు. ఈలోగా మరియన్, ఈ కార్‌లో వెళితే ప్రమాదం అని, ఒక పెట్రోల్ బంక్ వద్ద ఆగి తన కారును మరొక కారుతో మార్చుకుంటుంది. ఈ కారు మార్పిడి వ్యవహారం కూడా దూరం నుంచే పోలీసు అధికారి గమనిస్తాడు. ఇక ఈ డబ్బుతో దొంగతనం చేసి తాను బయట పడలేను అని గ్రహించి రాత్రి ఏదైనా ఒక మోటెల్‌లో గడిపి ఉదయాన్నే తిరిగి ఫీనిక్స్‌కు వెళ్లిపోవాలని ఆమె అనుకుంటుంది. ఆ రాత్రి గడపడానికి ఆమె చేరిన చోటే బేట్స్ మోటెల్.

దీని సొంతదారు నార్మన్ బేట్స్ (నటుడు ఆంథోనీ పెర్కిన్స్). ఆమెకు వుండడానికి గది ఇచ్చి ఆమెను రాత్రి భోజనానికి ఆహ్వానిస్తాడు. ఆ భోజనానికి వెళ్లినపుడు ఆమె దూరం నుంచి బేట్స్ అతని తల్లి మధ్య వాగ్వాదం వింటుంది. ఇంకొక స్త్రీకి దగ్గర అయినా, సన్నిహితంగాఉన్నా మా అమ్మ ఒప్పుకోదు. ఆమె మానసిక వ్యాధితో బాధ పడుతోంది అని చెప్తాడు బేట్స్. ఎలాగో భోజనం ముగించి గదికి చేరి స్నానం చేసి నిద్ర పోదామని మరియన్ బాత్‌రూమ్‌కు వెళుతుంది. ఈమె గదిలో ఏం చేస్తున్నదీ ఒక రహస్య రంధ్రం ద్వారా బేట్స్ గమనిస్తూ వుంటాడు. స్నానాల గదిలోకి ఒక అగంతక వ్యక్తి వంట గదిలో వాడే కైమా కత్తి వంటి దానితో మరియన్‌ను హత్య చేయడం ఈ సినిమాలో ప్రధాన ఘట్టం. అలా సినిమాలో ప్రధాన పాత్ర సినిమా మొదలైన నలభై నిమిషాలకే హత్య చేయబడుతుంది. కాసేపటికి బేట్స్ వచ్చి అయ్యో అమ్మ ఎంత పని చేసింది అనుకుంటూ ఆ హత్యా ప్రదేశాన్ని శుభ్రం చేస్తాడు. ఆ కార్లో ఆమె శరీరం, వస్తువులు, చివరికి డబ్బు కత్తి వుంచిన పేపర్లలో ఏమి వుందో కనీసం చూడకుండా అది కూడా ఆ కార్‌లో పడేసి దాన్ని సమీపంలోని ఒక ఊబిలోముంచేస్తాడు.

" వచ్చే వారం ఇలాంటి స్ప్లిట్ పెర్సనాలిటీల గురించిన మొదటి రచన, రాబర్ట్ లూయి స్టీవెన్సన్ 1886లో రాసిన నవలికపై 1931లో వచ్చిన "డాక్టర్ జెకిల్ అండ్ మిస్టర్ హైడ్" సినిమా గురించి మాట్లాడుకుందాము. "

ఈ సినిమాలో "షవర్ సీన్"గా ప్రసిద్ధి కెక్కింది ఈ బాత్ రూమ్‌లోని హత్య చిత్రీకరించిన విధానం. డబ్బై ఏడు కెమెరా కోణాల లోంచి, మూడు నిమషాల కాలం తెరపై కనిపించే ఈ సీన్‌లో యాభై కట్స్ చేశారు. ఎక్కడ కత్తి శరీరాన్ని తాకిన సీన్ లేకుండా, మొదటిసారిగా హత్యను తెరపై చూపాడు హిచ్‌కాక్. వెనుక సంగీతం కోసం వయోలిన్, వీఓల అనే సంగీత పరికరం, సెల్లో అనే ధ్వని పరికరం వాడారు. కత్తి శరీరంలోకి దిగుతున్న ఎఫెక్ట్‌ను పుచ్చకాయలోకి కత్తి గుచ్చి వచ్చే కస కస్ మన్న శబ్దాన్ని సౌండ్ ట్రాక్‌లో కలిపారు. సినిమాలో చూపిన బేట్స్ ఇల్లుగా ఉన్న సెట్టింగ్ యూనివర్సల్ స్టూడియోలో వేశారు. ద హౌస్ బై ద రైల్ రోడ్ అన్న ఎడ్వర్డ్ హాపర్ పెయింటింగ్ ఆధారంగా ఈ ఇల్లు రూపొందించారు.

పరిశోధన కొనసాగం, ఆ పరిశోధకుడిదే మరొక హత్య కూడా జరగడం, బేట్స్ తల్లి రహస్యం బయటపడ్డం కథ ముగింపులో తల్లిని ఆమె ప్రియుడిని ఎప్పుడో చంపిన బేట్స్, ఆమె శవాన్ని వెలికి తీసి ఇంట్లోనే వుంచాడని, తానే తల్లిగా, తానే కొడుకుగా రెండు భిన్న మనస్తత్వాలు కలిగి ఉన్న మనిషి. కొడుకుగా ప్రేమించి తల్లిగా ద్వేషించి ఈ హత్యలు చేసినది బేట్స్ కాదు. తనలో నిద్రణంగా ఉన్న బేట్స్ తల్లి అని మానసిక శాస్త్రవేత్త వివరిస్తాడు. సైకో ఆధారంగా ఎన్నో పొడిగింపులు, కొత్త కథలు ఆంగ్లంలోనే కాక పలు భాషల్లో కూడా వచ్చాయి. ఎడ్గర్ ఎలాన్ పో అవార్డ్ బెస్ట్ మోషన్ పిక్చర్‌గా, ఇంటర్నేషనల్ బోర్డ్ ఆఫ్ మోషన్ పిక్చర్స్ వారి బెస్ట్ యాక్టర్ అవార్డు ఆంథోనీ పెర్కిన్స్‌కు ఉత్తమ సహాయ నటిగా, మరియన్ పాత్ర పోషించిన జీనిఫర్‌లేకు పురస్కారాలు వచ్చినా దర్శకుడిగా హిచ్‌కాక్‌కి ఏ అవార్డు రాలేదు. ఆస్కార్ బహుమతి వంటి వాటికి నామినేట్ అయినప్పటికీ అదొక విడ్డూరమే. అయితే 1992లో ఈ సినిమా సాంస్కృతికంగా, చరిత్రకంగా, కళాత్మకంగా గణనీయమైనదిగా గుర్తిస్తూ యునైటెడ్ స్టేట్స్ లైబ్రరీ ఆఫ్ కాంగ్రెస్ ఈ సినిమాను నేషనల్ ఫిల్మ్ రిజిస్ట్రీలో చేర్చి సినిమా చరిత్రలో ఒక సిలబస్‌గా వుండ దగ్గ సినిమాగా ప్రస్తుతించింది.

కెమెరా చెప్పిన "గాంధీ" కథ

గాంధీ పుట్టిన నూట పదమూడేళ్లకు, ఆయన పై ఒక ప్రపంచ స్థాయి సినిమా వచ్చింది 1982 లో. రచయిత జాన్ బ్రెయిలీ, , దర్శకుడు రిచర్డ్ అటెంబరో, గాంధీ పాత్ర దారి బెన్ కింగ్ స్లే ముగ్గురూ విదేశీ యులు ఆంగ్లేయులు కావడం విశేషం. గాంధీ పుట్టుక నుంచి కాక, సినిమా 1893 లో, గాంధీ దక్షిణాఫ్రికాలో పీటర్ మెరిట్జ్ బర్గ్ స్టేషన్లో, తెల్లవారు మాత్రమే ప్రయాణం చేయవల్సి న మొదటి తరగతి రైలు పెట్టెలో ప్రయాణం చేస్తున్నందుకు గాను, ఆ బండి నుంచి కింద కు తోసి వేయబడ్డ దృశ్యంతో సినిమా మొదలు అవుతుంది. కారు చీకట్లో కాంతి రేఖలా, మొదటి షాట్, నల్లని నిశిలో చీకట్లను చీల్చుకు పోతున్న రైల్ ఇంజన్ కాంతి తో దర్శకుడు కథను మొదలు పెడతాడు.

పదకొండు విభాగాలలో ఆస్కార్ నామినేషన్లు పొంది, ఈ సినిమా, ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ కథా నాయకుడు రంగాలలో ఆస్కార్ బహుమతుల తో బాటు మరో ఐదు రంగాలలో కూడా ఈ ఆస్కార్లను, ఏకంగా ఎనిమిది విభాగాలలో గెల్చుకున్నది. వాటిలో, వాడిన ఉడుపులకు గాను, భారతీయ డిజైనర్ భాను అత్తయ్య కు కూడా ఈ ప్రత్యేక విభాగంలో ఆస్కార్ లభిం చడం మనం గర్వ పడవలసిన విషయం. జాతీయ, అంతర్జాతీయ ఫిలిం ఫెస్టివల్ లలో, ఇప్పటికే ఈ సినిమా దాదాపు ముప్ఫయి ఉత్తమ అవార్డులను గెల్చుకోవడం విశేషం. 12 ఆగస్టు 2016 న కూడా, 70 ఏళ్ల భారత స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా, మన జాతీయ చలన చిత్రోత్సవం ఈ సినిమా తోనే మొదలు పెట్టారు. సినిమా ఆరంభం లోనే దర్శకుడు, తాము తలపెట్టిన పని ఎంత క్లిష్టమైనదో ఎరిగి, ఈ ముందు మాటలు చెప్తాడు. "ఏ వ్యక్తి జీవితాన్ని ఒక్క కథనంలో చెప్పలేము. ప్రతి ఏడాదిని, జీవితంలో తారసిల్లి న వ్యక్తులను, సంఘటనలను విధేయంగా చిత్రిస్తూ తగు ప్రాము ఖ్యత నిస్తూ చిత్రాలు తీయలేము. మనం చేయగలిగిందల్లా ఏమిటీ అంటే, రాతలో ఉన్న దాని పట్ల నిజాయితీతో ప్రయత్నం చేస్తూ ఆ వ్యక్తి హృదయానికి దగ్గరగా మన చిత్రీకర ణను తీసుకు వెళ్ళేందు కు ప్రయత్నం చేయడ మే."

Weekend Special

అలా తన జీవితంలో ఇరవై మూడేళ్ళ వయసులో అర్ధరాత్రి దేశం కాని దేశంలో, రైలు పెట్టె లొంచి బయటకు తోసి వేయబడ్డ గాంధీ అనే యువకుడు,అర్థ శతాబ్దం తరువాత ఆ తెల్ల పాలకు లనే, ఒక అర్థ రాత్రి, విస్తృత ఉద్యమాల ద్వారా, తన దేశం నుంచి బయటకు పంపించి వేస్తాడు, ఇదీ గాంధీ జీవితం లో జరి గిన మహత్తర సంఘటనల సమా హారం. దీనికి బిగి తగ్గని కథనమే అటెం బరో దర్శకత్వంలో రూపొం దిన సినిమా. సినిమాకు ప్రఖ్యాత భారతీయ సంగీతజ్ఞుడు రవి శంకర్ పాశ్చాత్య సంగీత విద్వాంసుడు జార్జ్ ఫెంటాన్ సంగీతం అంద చేశారు. ఇరవై రెండు మిలియన్లతో తీసిన సినిమా దానికి ఆరు రెట్లకు పైగా లాభాలు ఆర్జించింది.సినిమా చివ రి దృశ్యంలో గాంధీ చితా భస్మం నదీ నిమ జ్జనం చేస్తున్న నేపథ్యంలో గాంధీ స్వరం వినిపిస్తోంది మరొక్క సారి. . "నాకు నిరాశ కలిగినప్పుడల్లా, నేను చరి త్రలో ఎప్పుడూ, ప్రేమ, సత్యం గెలిచా యని గుర్తు చేసుకుంటాను. నియంత లు, హంతకులు ఎప్పుడూ ఉండనే ఉన్నారు. వారు గెలిచినట్టు అని పించినా అది తాత్కాలికమే, వారు చివరకు పతనం అవుతారు, గుర్తు పెట్టుకొంది, ఎల్లప్పుడూ ఇలాగే జరిగింది"., గాంధీ పాత్ర లో రాణించిన బెన్ కింగ్స్లీ, సగం గుజరాతీ కావడం విశేషం. తన భారతీయ నామం కృష్ణ బాంజీ. మూడు లక్షల మంది ఎక్స్ట్రాలను ఈ సినిమా దృశ్యాల చిత్రీకరణలో చూపెట్టారు. వీరందరూ ఒక్క రూ పాయి కూడా తీసుకోకుండా, స్వచ్ఛందంగా, ఈ అంతిమ యాత్ర చిత్రీకరణ లో పాల్గొన్నారు. ఈ దృశ్యాలను 31 జనవరి 1981 న తీశారు. ఆ రోజు గాంధీ ముప్ఫయి మూడవ వర్ధంతి రోజు.



ఈ సినిమా నిర్మాణం, పంపిణీ కోసం అంతర్జాతీయ సినిమా రంగం ముందుకు కదిలి వచ్చి మన జాతి పితకు తగు సమున్నత గౌరవం కల్పించింది. సినిమా ఇండో - బ్రిటిష్ సంయుక్త నిర్మాణం కాగా, అందులో మన నేషనల్ ఫిలిం డెవెలప్మెంట్ కార్పొరేషన్ మూడవ వంతు పెట్టుబడులు ఇచ్చింది. సినిమా, అమెరికన్ పంపిణీ సంస్థ కొలంబియా పిక్చర్స్ ప్రపంచ వ్యాప్తంగా పంపిణీ చేసింది. తన లాభాలలో అత్యధిక భాగం ఈ సినిమా అమెరికా, ఇంగ్లాండ్ లలో సంపాదించింది. దక్షిణాఫ్రికా అహింసాత్మక పోరాటం, బీహార్ లోని చంపారన్ రైతుల ఉద్యమ విజయం, చౌరీ చౌరా, జలియన్ వాలాబాగ్, దండి యాత్ర, క్విట్ ఇండియా, వంటి చారిత్రాత్మక ఘట్టాలు చిత్రీకరణలో, అటెంబరో శ్రద్ధ , ఈ చిత్రాన్నీ విశిష్ట సినిమాగా మలిచింది.

బ్రిటిష్ పాలకుల్లో గల రాక్షసత్వం ఎలా జనరల్ డైయర్ వంటి వారిలో బయటకు వచ్చిందో ఈ సినిమా చాలా శక్తివంతంగా చూపుతుంది. "అంతమందిని కాల్చి వేశావు కదా, వారిలో స్త్రీలు, పిల్లలూ ఉన్నారన్న సంగతి తెలుసా" అని కోర్ట్ న్యాయ విచారణలో జనరల్ డైయర్ ను ప్రశ్నిస్తోంది. "తెలుసు! వారికీ ఒక పాఠం నేర్పడానికి నేను అలా చేసాను" అంటాడు ఆ సైనికాధికారి. "వారిలో గాయ పడ్డ వారికి, ఎవరికైనా సహాయం చేసావా" అన్న ప్రశ్నకు సమాధానంగా, "ఎవరైనా అడిగి ఉంటె తప్పక సహాయం అందచేసి ఉండేవాడిని" అంటాడు ఈ కరడు కట్టిన తెల్ల దొర. అప్పుడు ఆ జడ్జీల కమిటీ లోని ఒక భారతీయ జడ్జి అడుగుతాడు, "జనరల్ దయర్! త్రి నాట్ త్రి రైఫిల్ గుండు దెబ్బ తిని గాయపడ్డ, ఒక ఏడాది పిల్ల ఎలా నిన్ను సహాయం అడుగుతుంది - ఆ సైన్యాధికారి వద్ద సమాధానం ఉండ దు., అదీ తెల్ల సైన్యాలు జలియన్ వాలా బాగ్ లో చేసింది అన్నది, దర్శకుడు శక్తివంతంగా నిరూపిస్తాడు. మన దేశం కథ మనకే తెలియచెప్పిన గాంధీ సినిమా ప్రపంచ చలన చిత్రాలలో ఉన్నతమైన స్థానంలో నిలిచింది.

దానికి కారణం అయిన మహాత్ముడు గాంధీజీ నూట నలభై ఏడో జయంతి సందర్భంగా వారికి నివాళి అర్పిద్దాము.



రామతీర్థ

సమాజంలో స్త్రీస్వేచ్ఛ - ప్రశ్నలడిగిన "పింక్" సినిమా

Weekend Special

ఆధునిక సమాజంలో స్త్రీలు పురుషులు అన్న తేడా లేకుండా అందరూ చదువుల వల్ల, జీవికకై రాత్రీ పగలూ ఉద్యోగాలు చేయవలసి వస్తున్న కాలం ఇది. ఆడవారు ఉద్యోగాలు చేయాలి, డబ్బు సంపాదించాలి, కానీ వారికి సమాజంలో మగవారికి ఉన్నంత స్వేఛ్ఛ, అవకాశాలూ ఉన్నాయా అన్నదే ప్రశ్న. ఇవి ఎప్పటికీ సమస్యాత్మకం గానే ఉండడం, మనం చూస్తూ ఉన్నాము. మహిళలు పనులమీద,తమ కులాసాల కోసం, అర్థరాత్రి ఒంటరిగా బహిరంగ ప్రదేశాలలో తిరగగలగడం,ఒక సామాజిక సంస్కారంపై ఆధార పడి ఉన్నది.

మన యువత చూసే ఎన్నో సినిమాలు, ప్రకటనలూ, ఆడవారు, ఒక సాధించదగిన లక్ష్యంగా మగవారు తమ మనసుల్లో తలిచి అలాంటి ఆధిపత్య ఆలోచనలు పెంచి పోషిస్తున్న ఒక వ్యవస్థతత్వం, ఇవన్నీ వారిలో పేరుకుపోయిన అవలక్షణాలుగా గమనిస్తూ ఉంటాము. ఇది వయసులో ఉన్న ఆడా, మగా ఇద్దరి మధ్య పెరిగిన చనువు, తద్వారా వచ్చి పడుతున్న సమస్యలు విషయం. వీటిని లోతుగా చర్చించిన సినిమా 2016 లో వచ్చిన "పింక్". ఇది విద్యావంతులైన, ఉద్యోగస్తులైన, ముగ్గురు ఒంటరి ఆడవారి కథ.వారు తమ ఉద్యోగాల రీత్యా ఉండేది దేశ రాజధానిలో. వీరి సరదా అయిన జీవితంలో మగవాళ్లూ, వారితో కలిసి షికార్లూ, చనువుగా ఉండడాలూ ఉంటాయి. వీరిలో ఒక అమ్మాయి, ఈశాన్య ప్రాంతంనుంచి వచ్చినామె కూడా ఉంటుంది.

కథ ప్రకారం, ఈ ముగ్గురు అమ్మాయిలు ఒక మంత్రి గారి బంధువు అయిన రాజ్‌వీర్‌తో, మరొక మహిళ ద్వారా పరిచయం అవడం ద్వారా, అతను, అతని మిత్రులతో బాటు, సురజ్కుండ్‌లో ఒక డ్రింక్స్ పార్టీకి వెళ్తారు. డ్రింక్స్, సరదా మాటలు అయ్యాక, ముగ్గురు మగవారు,వీరిని వేరు చేసి,తమ తమ గదుల్లోకి తీసుకువెళ్తారు. అక్కడ వీరితో శారీరిక సాంగత్యం కోరగా, ముగ్గురు మహిళలూ నిరాకరిస్తారు. రాజ్ వీర్ అయితే బలవంతం చేయబోగా మీనల్ అరోరా (తపసీపన్ను) అతన్ని సీసాతో కొట్టి గాయపరిచి, అక్కడనుంచి తన స్నేహితురాళ్లతో బయట పడుతుంది. వీరు తమపై ఇలా అత్యాచార ప్రయత్నం చేశారని ఫిర్యాదు స్వీకరించకుండా.., మంత్రి బంధువు అయిన రాజ్‌వీర్, తదితర యువకుల బృందం ఇచ్చిన ఫిర్యాదును మాత్రం పోలీస్‌స్టేషన్ మహిళా ఎస్.ఐ.,నమోదుచేస్తుంది. అది మీనల్ అరోరా, రాజ్‌వీర్‌ను, శారీరిక సంబంధం కోసం ప్రలోభ పెట్టి, అది సాగకపోతే, ఆమె, తనను హత్యా ప్రయత్నంలో తీవ్రంగా గాయపరిచిందని. ఈ

కేసు వాదనలో ప్రభుత్వ న్యాయవాది, ఆడపిల్లల విచ్చలవిడి జీవితం ఇటువంటి సంఘటనలకు కారణం అని చెప్పబోవడం, అందుకు అనుకూలంగా అక్కడ సాక్ష్యాలు తయారు కావడం, లో ఒక మెరుపు ఏమిటటంటే, ఈ యువతుల తరపున డిఫెన్స్ న్యాయవాది గా , అమితాబ్ బచ్చన్ కేసు వకాల్తా తీసుకుని, తన వాదనలో, ఎలా సమాజం, ఆడవారి పట్ల వివక్ష కలిగి ఉన్నదో, చనువుగా ఉన్నంత మాత్రాన, పబ్లిక్ సొసైటీలో, మగ వారు, వారితోకలిసి రెండు పెగ్గులు మద్యం సేవించినంత మాత్రాన, అదేదో ఆడవారు మగ వారితో సెక్స్ కు సిద్ధంగా ఉన్నట్టు అర్థం కాదు అని బలంగా కోర్ట్ దృష్టి కి తీసుకు వెళ్తాడు. శృంగారానికి, ఆడవారు "నో" అన్నాక, అది "నో" గానే భావించాలి తప్ప బలవంతపు శృంగారానికి పూనుకోవడం, శిక్షార్హమైన నేరం అని కోర్ట్ కు విన్నవిస్తాడు. రాజ్ వీరు ఈ నేరం చేసిన నిందితుడు గా నిరూపిస్తాడు.

ఈ వాదనల క్రమంలో మన న్యాయ వవ్యవస్థ, దానికి మూలమైన సమాజం, అవకాశాలు అన్నిటా ఆడవారు సమానం అన్నది, ఆచరణలో ఎలా నీరు గారి పోతున్నదో డిఫెన్స్ న్యాయ వాది గా, తేటతెల్లం చేస్తాడు. శీలం కోల్పోయావా అని ఆడవారిని అడుగుతాము, శీలం అనేది ఎప్పుడో ఒకప్పుడుమగవారి వల్ల కోల్పోవలసిన వస్తువుగా, మన సమాజంలో కొండంత నమ్మకాలు పేరుకు పోయాయి. "వర్జినిటీ లాస్ట్" అనే ఆడవారిని ఉద్దేశించి అంటాము కాని, ఆ శృంగార క్రియ ద్వారా, "ఫెర్టిలిటీ గైనెడ్" అని ఎందుకు ఆలోచించలేకపోతున్నాము అని అనిపిస్తుంది.

రామతీర్థ

ఇది ఆ సినిమాలో ప్రస్తావితం కాకపోయినా, మనం ఆడవారి గురించి మాట్లాడే భాషను మార్చుకోవలసిన అవసరం ఎంత ఉన్నదో ఈ సినిమా చెప్తుంది. అందుకే ఈ సినిమా చూడాలి. కోర్ట్ వాదనల దృశ్యాలు షార్ప్ గా తీర్చిదిద్ది, సమాజంలో జరుగుతున్న ఘర్షణ ను, కథగా , నైపుణ్యంతో రితేష్ షా రాయగా, రాశ్మీ శర్మా, శూజిత్ సర్కార్ నిర్మాతలు గా, అనిరుద్ధ రాయ్ చౌధరి దర్శకత్వం వహించారు. బాక్స్ ఆఫీసు విజయం కూడా పొంది దాదాపు యాభై కోట్ల రూపాయల వ్యాపారం చేసిన ప్రయోజనకరమైన సినిమా పింక్. ఆ పేరు ఎందుకు పెట్టారూ అంటే, పింక్ కలర్ ఆడవారికి ప్రీతి పాత్రం కావడం,, ఆ రంగు వలెనే, ఆడవారు కూడా ఆకర్షణీయం గా ఉండడం ఒక కారణం కావచ్చు.

ఉత్కంఠల "హేపీ ఇండిపెండెన్స్ డే"

మళ్ళీ ఒక చిన్న సినిమా గురించి ఈ సారి. ఆ సినిమా హేపీ ఇండిపెండెన్స్ డే. తీసినది ఒక యువకుడు దివ్యాంషు పండిత్. ఆయన వైల్డ్ బఫెలోస్ ఎంటర్టైన్మెంట్ సంస్థ స్థాపించాడు. స్పాట్ బాయి, హేపీ జర్నీ, వంటి సినిమాలు, అవీ చిన్నవే తీసాడు. ఈ కథ, స్క్రీన్ ప్లే కూడా తానే రాశాడు. సంగీతం అంకిత్ షా అందించాడు. సర్ఫ్రజ్‌ఖాన్ కెమెరా పని తనంతో, ఈ ఇరవై నిమిషాల సినిమా ఒక కొసమెరుపు కథ. అది బయటకు రాకుండా, ఈ కథ తెరకు ఎక్కించి ప్రేక్షకులలో ఉత్కంఠ కలిగించడంలో ఈ యువ దర్శకుడు, విజయం సాధించాడు.

మిథిలేశ్ చతుర్వేది, ఆదిల్ హుసేన్ జైపురి , అష్మిత జగ్గి, బాల నటుడు వైభవ్ సోలంకి నలుగురు నటులతో, ఈ కథ నడిపాడు. ఆరంభమొక రద్దీ అయిన బస్ స్టాండ్ ప్రాంతం. పని గంటల మొదలు వేళ. కొందరు వేచి ఉన్న బస్ స్టాండ్ కు ఒక యువతి వస్తుంది కొంత సామాను తో. రెండు మూడు టాక్సీలను ఆపె ప్రయత్నం చేస్తుంది. అవి ఆగవు, వయసులో ముసలి వాడు అయిన టాక్సీ డ్రైవర్ తన టాక్సీ ఆపుతాడు. ఈమె సామాను దిక్కీలో పెట్టుకుని టాక్సీ ఎక్కుతుంది. అదే సమయంలో డ్రైవర్ కు ఫోన్ వస్తుంది. అది తన కూతురో, మనుమరాలో ఒంటరిగా ఎక్కడికో వెళ్తాము అంటున్న ఫోన్. "చూడబో లతే పరిస్థితులు బాగులేవు, అలావెళ్ళడం మంచిది కాదు" అంటూ, ఆడవారు జాగ్రత్తగా ఉండాలి అని ఫోన్ లో చెప్తూ ఉంటాడు డ్రైవర్. వెనుక కూచున్న ప్రయాణీకురాలు అయిన యువతి అసహనం గా చూస్తూ ఉంటుంది. "ఏమయ్యా వెళ్తావా, వెళ్ళవా" అని గదమాయిస్తుంది. ఈలోగా ఆమెకు ఫోన్ వ స్తుంది. ఆమె ఫోన్ లో "ఆడవారు వెనుక బడి ఉన్నారని కదా మీరు అంటూ ఉంటారు, చూసారా, నా పని ఎంత చక్క గా పూర్తి చేశానో", అంటూ, మంచి ఆత్మ విశ్వాసంతో మాట్లాడుతుంటుంది. టాక్సీ బయలు దేరుతుంది. కొద్ది సేపటికి వారు గమనిస్తారు ఆ టాక్సీ వెనకాలే ఒక పెద్ద స్కార్పియో వంటి వాహనం వస్తూ ఉంటుంది. వీళ్ళ బండి వెనకాలే అది రావడం గమనించిన టాక్సీ డ్రైవర్, "మీకు తెలిసిన వారు ఎవరైనా ఆ బండిలో ఉన్నారా", అని ఈ పిల్లను ప్రశ్నిస్తాడు.

అవాక్కైన ఆ యువతి,"లేదు, అలాంటి వారు ఎవరూ లేరు, అయినా వాళ్ళు మనలను వెంబడిస్తున్నారని ఏమిటి గారంటీ. కొంచెం వేగంగా పోనివ్వండి, ముందు మలుపు దగ్గర మనం కుడి వేపుకు తిరుగుదాము, తిన్నగా, మెయిన్ రోడ్ పై వెళ్ళే వాహనాలు సాధారణంగా అటు వేపు తిరగవు, ఒక వేళ ఆ బండి కూడా, మనం తిరిగినట్టే, తిరిగితే, అప్పుడు ఆలోచిద్దాము అంటుంది . వేగం పెంచిన ఈ డ్రైవర్, ఎలా బండి టర్న్ తీసుకుంటాడో, అలానే, వెనుక వాహనం కూడా మలుపు తిరుగుతుంది. గాభరా పడ్డ డ్రైవర్, ఈ పిల్లకు ఏం ప్రమాదమో అని "మనం పోలీసులకు 100 నంబర్‌కు ఫోన్ చేదామా" అని సూచిస్తాడు. వద్దు వద్దు అంటుంది ఈ పిల్ల. ఇలా కొంత వెంటాట సాగాక, వెనుక వస్తున్న బండి దగ్గరికి కథ వెళ్తుంది. ఆ బండలో వ్నున్నది ఒక యువకుడు. అవడానికి పెద్ద బండే అయినా, దానికి ఒక డోర్ జామ్ అయి ఉంది .ఆ వేపు నుంచి ది గడం కుదరదు. ఇంతకీ ఈ యు వకుడు ఆ టాక్సీ వెనక వెళ్లడా నికి గల కారణం, ఈమె బస్ స్టాండ్ లో తన హేండ్ బాగ్ మా ర్చి పోయింది. కథ కొంచెం ఫ్లా ష్ బేక్ లోకి తీసుకెళ్లి, టాక్సీ మొదలు కాగానే, అంతవరకూ తన తండ్రి తోమాట్లాడుతూ తన బండి ఎంత ఇబ్బంది పెడుతున్నదీ చెప్తున్న యువకుడు, ఆమె హేండ్ బాగ్ మర్చిపోవడం చూసి, తాను ఆ బేగ్ తీసుకుకుని ఆమెకు తిరిగి ఇద్దామని ఆమె వేపు తిరిగే లోపలే ఆ టాక్సీ ముందుకు వెళ్లిపోయింది. దానితో, ఆ బేగ్ తన కార్ లో పెట్టుకుని, తాను ఆ బండి వెనకాల వెళ్తాడు. ఎంత తాను సిగ్నల్ ఇచ్చినా అది టాక్సీ డ్రైవర్ అర్థం చేసుకోడు. వాళ్ళు తమను ఫాలో అవుతున్న వాహనం నుంచి తప్పించుకోవడానికి, ఒక కడుతూ ఉన్న భవనం ముందర బండి ఆపేస్తారు.

చివరికి ఈ యువకుడు ఒక సందులో ఆ బండి ఆగి ఉండడం, చూస్తాడు. ఆ భవంతి లోనికి వెళ్తాడు. ఎక్కడా ఎవరూ ఉండరు. వెదుకుతూ ఉండగా, అక్కడ ఉన్నా కట్టడపు సామగ్రి లోంచి ఒక ఇనుప ఊచ తీసుకుని ఆ పిల్ల ఈ యువ కుడిని వెనుక నుంచి పొడుస్తుంది. ఆమె కూడా యుద్ధ విద్యల్లో నేర్పరి లాగే, ఈ యువకుడి తో కలబడి ఫైట్ చేస్తుంది. ఈ యువకుడు ఆశ్చర్యంతో తాను గాయ పడి ఉన్నా , ఆమెను అదుపులోనికి తీసుకుని, కింద ఉన్న ఆమె ను అదిమి పట్టుకుని, "అసలు నీకు బుద్ధుందా, నువ్వు మర్చి పోయిన బేగ్ ఇవ్వడానికి వచ్చాను" అంటూ ఆ బేగ్, తన కోపం లో ఆమె మెడకు తగిలిస్తాడు.

ఆమె అతనిని కాలితో తంతూ తన మెడలో గల బేగ్ తీసేయాలని ప్రయత్నం చేస్తుంది. యువకుడు దూరంగా పడతాడు, ఆ బేగ్ ఊడి రాదు. ఇంతలో పెద్ద పేలుడు. అందులో గల బాంబ్ పేలి ఆమె అక్కడే చనిపోతుంది. ఆమె తీవ్రవాది. ఆ బస్ స్టాండ్ లో బేగ్-బాంబ్ పెట్టి వెళ్లింది. అది ఈ సరికి అక్కడ పేలి ఉండేదే. అపార జన నష్టం జరిగి ఉండేదే. కానీ, ఏమీ తెలియని ఈ యువకుడు, ఆ బేగ్ తాను దొరకబుచ్చుకుని, ఆ పిల్లకు ఇవ్వడానికి ఆమె ప్రయాణిస్తున్న టాక్సీ వెనుక ఫాలో అవుతాడు . గాయపడి, షాక్ లో ఉన్న ఆ యువకుడికి అసలు ఏం జరిగినదీ మెల్లగా అర్థం అవుతుంది. బయటకు తాను వచ్చేటప్పుడు ఆమె ప్రయాణం చేసిన టాక్సీ కిటికీలోంచి ఒక నెత్తురు ఓడుతున్న చెయ్యి కనిపిస్తూ ఉంటుంది ప్రేక్షకులకు. అంటే ఆ యువతి ఆ టాక్సీ డ్రైవర్ ను కూడా హతమార్చేదన్న మాట. ఆ గాయం తోనే, తన వాహనంలో తిరిగి, స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు జరుపుకుంటున్న ఊరి లోకి, మెయిన్ రోడ్ లోకి వస్తాడు, ఒక ట్రాఫిక్ సిగ్నల్ వద్ద బండి ఆగుతుంది. ఒక బాలుడు జెండా పట్టుకుని, ఈ యువకుడికి అందిస్తూ, "హేపీ ఇండెపెండెన్స్ డే" అంటాడు.

చక్కని ట్విస్ట్ గల కథగా, దర్శకుడి ప్రతిభ, స్క్రీన్ ప్లే మంచి థ్రిల్ కలిగిస్తాయి.

Weekend Special

క్షణం

రామతీర్థ

వచ్చే వారం నసీరుద్దీన్ షా, స్మితా పాటిల్ నటించిన అలనాటి సినిమా మిర్చి మసాలా గురించిన కబుర్లు.

పద్మంలో బురద భన్సాలీ ప్రత్యేకత!

పద్మావత్- పద్మశ్రీ భన్సాలీకి బహిరంగ లేఖ

పద్మశ్రీ సంజయ్ లీలా భన్సాలీగారూ- నాలుగు నేషనల్ ఫిల్మ్ అవార్డులూ, పది ఫిల్మ్‌ఫేర్ అవార్డులూ, తొమ్మిది ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ పురస్కారాలూ పొందిన దర్శక నిర్మాతలు మీరు. కొన్ని ఆంగ్ల సినిమాల రీమేక్‌లు తీసినా, మీ లార్జర్ దేన్ లైఫ్ సినిమా ట్రీట్‌మెంట్‌తో, భారీ కలలు కనే భారతీయ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. విభిన్న ఆలోచనల సినిమాలుగా, ఒక ఉదాహరణకు మీ 'బ్లాక్' సినిమా, 'ద మిరాకిల్ మాస్' అనేదానికి రీమేక్. ఇలా చాలా ఉన్నాయి. దేవదాసు సినిమా మీరు తీస్తే, అసలు కథలో ఎప్పుడూ కలుసుకోని శరత్‌చంద్రుడి పాత్రలు పార్వతి, చంద్రముఖి కలిసి డాన్స్ చేశారు. అది మీ కల్పనాసంపదే. అలాగే బాజీరావ్ వారసులు ఎంత గోలపెట్టినా, మీ సినిమా ఊహలో, బాజీరావ్ భార్యలు హిందూ కాశీబాయి, ముస్లిం వనిత, యోధురాలు మస్తానీ ఇద్దరూ కలసి డాన్స్ చేశారు. ఇలా జరిగే అవకాశం లేదు అని బాజీరావ్‌కి ప్రస్తుత ఎనిమిదో తరం వారసులు ఉదయ్ సింహ్ పేష్వా పత్రికల్లో వివరించారు. మస్తానీ కుటుంబీకులు సైతం ఎవరూ తమను ఈ సినిమా విషయమై సంప్రదించలేదు అని చెప్పారు పత్రికలకు. అదీ చరిత్ర పట్ల మీకు గల శ్రద్ధ. ఊహకు అందని వినోద కోణం (ఎంటర్‌టైన్‌మెంట్ యాంగిల్) సినిమాలో ఉంటే మీకు చాలు.

బాజీరావ్ తల్లి రాధాబాయి దక్షతగల వనిత. ఆమె వితంతువుగా ఆ రోజుల్లో మహారాష్ట్రుల కట్టు ప్రకారం ధరించేది ఎర్రని చీర. తల బోడిగా కనిపించకుండా వారి ఆహార్యం అప్పటి రివాజు. మీరు చూపినట్టు తెల్లచీరతో వాళ్లు ఉండరు. రాజు / పాలకుడి భార్యలు ఒళ్ళంతా కన్పించేలా దుస్తుల్లో డాన్సులు చేయడం, మీ వంటి మసాలా మేధావులకే సబబుగా తోస్తుంది. 'లవణి' శృంగార ప్రకోపకమైన మహారాష్ట్ర ప్రఖ్యాత జానపదం. 'సింగా' గీతం శ్రావణ మంగళవారాలప్పుడు పాడే పేరంటాల పాట. ఈ రెండూ కలిపి నడిపారు గీతాలను. పాత సినిమాల గీతాలు (1951 వి.శాంతారాం సినిమా 'అమర్‌భూపాలి' నుంచి 'లట్ పట్ లట్ పట్ తుర్‌రూ చలనా', లవణి పాట. అలాగే మరో శాంతారాం సినిమా 'చందనాచి చోలి అంగ్ అంగ్ జలీ' నుంచి 'నాచ్‌గా ఘుమా' పాట) కలిపి వాడిన రీ మిక్స్ వంటకాలు మీరే చేయగలరు. సినిమా తీసి, సృజనాత్మక స్వేచ్ఛ పేరిట, చరిత్ర, స్థానిక సంప్రదాయాలు, వాటి పాటింపు ఇటువంటివి పెద్దగా పట్టించుకోకపోవడం, మీతోనే మొదలుకాలేదు. కానీ మీరూ ఈ సినిమా తీసే వారి హక్కులు, వాస్తవంకన్నా ఎక్కువ విలువైనవి అని నమ్ముతారు. అందుకే భారీ దృశ్యాలు, ఒకింత భిన్న సంస్కృతుల మేళనం, ఒక ప్రేమ ముక్కోణం ఇవే మీ సినిమాలు. దేవదాసు సినిమాకు మీరు వాడిన భారీ సెట్టింగులు, ఆ కథ ప్రాంతానికి, కాలానికి సరిపోయేవి కావు. లేశం అంతా ప్రతిభ ఉన్నా, భారతీయ ప్రేక్షకులు ఆకాశానికి ఎత్తుతారు. మీ సినిమాలపైన దాడులు ఎంత అసమంజసమో, మీరు సినిమాల్లో పట్టించుకోని విషయాలు కూడా అంతే సీరియస్ అయినవి అని ఆలోచించే వారు, మంచి ప్రేక్షకులు సూచనలు చెప్పినా, వారి అభిప్రాయాలతో మీకు పెద్దగా పని లేదు.

ఇక పద్మావత్ సినిమా విష యం- జయసీ సూఫీ పెర్సియస్ భాషలో రాసిన దీర్ఘ అవధ్ మాండలిక హిందీ కావ్యం మీరు, మీ కార్యదర్శులు ఎంతవరకు చదివారో తెలీదు. మీ కథ ముందర సినిమాలో ఎలాగూ 'ఇది అందుబాటులో ఉన్న చరిత్రతో కొంత ఊహ కలిపి తీసినది' అని ముందుగానే మీ డిస్‌క్లైమర్ ఇస్తారు. ఇల్లాంటి విషయాల్లో మీరు బాగా నేర్పరులు. బాజీరావ్ సినిమా విషయంలో కూడా మీరు చేసింది అదే. ఈ పద్మావత్ విషయంలో మీరు పన్నెండో శతాబ్దపు ప్రేక్షకుల కోసం ఈ సినిమా తీయడంలేదు. ఇప్పటి హిందువులు, ముస్లిములూ అప్పటి పరిణామాలకు ఏ రకంగానూ బాధ్యులు, కారకులు కారు. అయితే, చరిత్ర ఇరుకుదారిలో, ఈ తొమ్మిది శతాబ్దాల కాల ప్రవాహంలో ఎవరి ఇబ్బందులు వారికి ఉన్నాయి. వాటిని మీరు పక్కన పెట్టలేదు. ఖిలీజ్ ఒక మతావేశి, యుద్ధోన్మాది, అధికార పిపాసి, ఐశ్వర్య లౌల్యుడు అన్నది చరిత్ర చెప్తుండగా, మీరేం చెప్పదలిచారు? ఇదే చెప్తే, మీ సినిమా, నిజమైన యుద్ధాల ఢిల్లీ సుల్తాన్ బీభత్సం కింద పెనుగులాడిన హిందు రాజుల విషయం చూపాలి. అలా అయినా, నేటి ప్రజానీకంలో అది ఒక మతంపై ఆక్రోశం, ఆవేశం కల్గించకుండా ఉండదు. లేదూ, అల్లాఉద్దీన్ ఒక సమర్థవంతమైన పాలకుడు, ప్రేమ ఎవరిపైనా అయినా కలుగవచ్చు అని చూపితే, చరిత్రలో ఎక్కడా అల్లాఉద్దీన్ ఖిల్జీకి అటువంటి పార్శ్వం ఉన్నట్టుగా, తన సమకాలికులు, సన్నిహితులైన ఖుస్రో వంటి చరిత్రకారులే రాయలేదు. అలా మీరు చూపించే సాహసం చేస్తే ఆశ్చర్యమే. ఇక మీ సినిమా అనే ఈ ఉద్వేగాల కాలక్షేపంవల్ల, వర్తమానంలో ప్రజలు రెండుగా చీలి, ఇంకే సమస్యలూ లేనట్టు, సినిమా గురించి చర్చలే ప్రస్తుత ప్రాముఖ్య విషయాలుగా, చానెళ్లు, సామాజిక మాధ్యమాలూ, వీటితో చాలక ఇంకా స్మార్ట్‌ఫోన్, వాట్సాప్‌ల ద్వారా తమ అభిప్రాయాలు ఏర్పరచుకునేవారో, పదుల కోట్లమంది ఉన్నారు. వారంతా కనెక్ట్ కావడానికి ఈ వివాదం చాలు. డబ్బులు గారంటీ. వారు ఈ సినిమా చూస్తే చాలు. అది మీ ఆలోచన మా రావుగోపాలరావు అన్నట్టు. ఆయన ఇంకోమాట కూడా అన్నాడు, అది నేను రాయడంలేదు.

ఇక రాణి విషయం- పదిహేనో శతాబ్దంలో, చితోడ్ యుద్ధం జరిగాక 250 ఏళ్ల నాటి కవి మహమ్మద్ జయసీ సూఫీ, పెర్షియన్ భాషలో రాసిన అవధ్ మాండలిక హిందీ కవిత్వంలో తప్ప, ఈమె ఉన్నది అనే చరిత్ర ఎక్కడా నమోదు కాలేదు. దాడికొచ్చిన ఢిల్లీ పాలకుడి వెంట చిత్తోడ్ వచ్చిన అమీర్ ఖుస్రో వంటి చరిత్రకారులు అప్పటికప్పుడే రాసిన యుద్ధ చరిత్రలో, చిత్తోడ్ గురించి ఉన్నా, పద్మిని వృత్తాంతం లేదు. చిత్తోడ్‌లో జరిగిన పర మతస్తుల హింస ఉన్నది. ఉపఖండం నాలుగు దిక్కులూ ఉన్న హిందూ రాజుల స్వయంపోషక, చిన్న రాజ్యాల లూటీ, సంపదలను ఢిల్లీ తరలించుకువెళ్ళడం ఈ ఢిల్లీ పాలక దండుల నిత్యకృత్యం. ఆఫ్ఘన్ తెగలకు చెందిన ఈ సైనిక నాయకులు, ఢిల్లీ ప్రాంతంలో మోసం, కుట్ర వంటి ఉపాయాలతో రాజ్యపాలకులయ్యారు. 1296 ఫిబ్రవరిలో దేవగిరి యాదవ రాజుల రాజ్యంపై దాడి చేసి అపార సంపదలు తన కైవసం చేసుకున్న ఈ అల్లుడు, సుల్తాను అయిన తన మామ జలాలుద్దీన్‌కు అంతకుముందు యుద్ధాల్లో దోచుకున్నది ఇచ్చినట్టు ఏమీ ఇవ్వలేదు.

ఆ నిధులతో సైనిక సన్నాహాలు చేశాడు. తనను పెంచినవాడూ, తనకు పిల్లనిచ్చిన మామ, ఢిల్లీ పాలకుడు అయిన జలాలుద్దీన్‌ను ఏవో కుంటి సాకులతో లేఖలు పంపి, ఆయన క్షమించాను అని లేఖ రాసి పంపినా, ఇంకా పరస్పర బంధువుల ద్వారా కబుర్లు పంపి, తాను క్షమాపణ చెప్తాను ఒక్క అవకాశం ఇవ్వమని కోరి, తాను గవర్నర్‌గా ఉన్న కరా (ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో కోశాంబి జిల్లాలో ఉన్నది)కు రమ్మని, తీరా వచ్చాక, 20 జూలై 1296న, సుల్తాన్‌ను, తన మామగారిని గంగ ఒడ్డున మోసపూరితంగా చంపాడు ఈ అల్లాఉద్దీన్ ఖిలీజ్. అలా దక్కింది ఢిల్లీ తఖ్త్ (సింహాసనం). అటుపై 1296 నుంచి 1316లో మరణం దాకా ఎన్నో యుద్ధాలు చేశాడు. ఆఫ్ఘన్ పీఠభూముల్లో నివసించే మంగోల్‌లపై దాడులు, వారి ప్రతిదాడులూ ఢిల్లీదాకా సాగాయి ఇవి. చిన్న చిన్న హిందూ రాజ్యాలను తూర్పు, పడమట, దక్షిణ భారతంలో కూల్చివేయడం, సంపదల లూటీ, దేవాలయాల ధ్వంసం, పెద్దఎత్తున వేల సంఖ్యలో హిందువుల ఊచకోత, ఇవన్నీ తన ఇరవైఏళ్ల పాలనలో చేసిన ఈ ఖిలీజ్, రత్నాంభోర్‌పై దండయాత్ర చేసిన కాలానికి అంటే 1300-1301 కాలానికి ముప్పై నాలుగేళ్ల వయసు అని చెప్తారు. ఆ లెక్కన ఇతను యాభై ఏళ్లకే మరణించాడు (1266-1316). మాల్వా రాజుల పాలిత ప్రాంతం. దేవగిరి యాదవ రాజ్యం, గుజరాత్‌లోని వాఘేలా రాజ్యం, రంతంభోర్ రాజ్యం, కాకతీయుల ఓరుగల్లు, చిత్తోడ్ రాజ్యం, గుజరాత్‌లోని యజ్వపాల రాజ్యం, శివానా రాజ్యం, దక్షిణాది రాజ్యాలైన హోయసల, పాండ్య రాజ్యాలపై దాడి, నిధుల రాశుల వసూలు, దేవాలయాలపై దాడి చేస్తూనే తన రాజరికం సాగించి రక్తదాహంగల వాడు ఈ పాలకుడు. ఇదే విషయాన్ని అప్పటి ఖిలీజ్ సమకాలీన చరిత్రకారుడు వసాఫ్, వీరి 1299 గుజరాత్ దాడులు ఇస్లాం మత వ్యాప్తి పేరిట సాగాయని, వీరు పరమతస్తులను చంపుతూ, వారి ప్రార్థన మందిరాలను ధ్వంసం చేస్తూ తమ యుద్ధాలు చేశారని, ఈ దాడుల్లో ధ్వంసం అయిన ఆలయాల్లో భిల్సా (1292), దేవగిరి (1295), నిజాపూర్ (1298-1310), సోమనాథ (1299), జైన్ (1301), చిదంబరం, మధురై (1311) ఆలయాలు ఉన్నాయని రాశాడు. ఖుస్రో కూడా ఇటువంటి ఇస్లాం ఔన్నత్య వర్ణనలు చేశాడు.

చిత్తోడ్‌పై ముట్టడి విషయంలో రాణి ఎవరు అన్న విషయమే, ఈయనతోబాటే ఉన్న చరిత్రకారుడు అమీర్ ఖుస్రో రాయలేదు సరికదా, విజితుడైన చిత్తోడ్ రాజు తన సమక్షంలో భయంతో ఉండగా, అతన్ని ఏమీ అనకుండా, రాజ్యంలో కన్పించిన హిందువులను అందర్నీ వధించమని ఆదేశాలు ఇచ్చాడు అని రాశాడు ఖుస్రో. అతని లెక్కల్లోనే ఆ రోజున ముప్పై వేలమంది హిందువులను చంపారు అనేది 'ఖజైనుల్ ఫుతుః' అని అల్లాఉద్దీన్ ఖిలీజ్ సైనిక దాడులపై రాసిన యుద్ధ దినచర్యలో రాశాడు. ప్రతాపరుద్రుడి కథ, కాకతీయ రాజ్యంపై దాడులు చేసిన ఒకనాటి హిందువు, ముస్లింగా మారిన మాలిక్ కాఫిర్ వీరి దగ్గరనుంచి పేరుకోసం హిందువులపై చేసిన అకృత్యాలు, జన మారణకాండలు ఈ యుద్ధ చర్యల్లో కన్పిస్తాయి. తానే ఒక ప్రవక్తగా ఇస్లాం తీరుకు భిన్నంగా ఒక మతం స్థాపన చేయడానికి కూడా ఇతను ఆలోచనలు చేశాడని నివేదికలున్నాయి. పాపులర్‌గా ఈ విషయాలను ఏవి ఎంచుకున్నా, ఏవి వదిలెపెట్టినా, బాక్సాఫీస్ వద్ద నాలుగు డబ్బులు చేసుకోవడం కాదు సినిమా అంటే, దానికొక సాంస్కృతిక దర్శనం ఉండాలి. అటువంటప్పుడు మీలాంటి పద్మశ్రీలు తీయవలసిన ఇతివృత్తం ఔరంగజేబ్ సోదరుడు, మత సహనశీలి, ఉపనిషత్తుల అనువాదకుడూ, తాత్వికుడూ, తమ్ముడి రాజ్యకాంక్షకు బలయిన మోఘల్ రాజవంశీకుడు అయిన దారాషుకో కథ. మీ ప్రస్తుత సినిమా వల్ల వినోదం పేరిట సమాజాన్ని ఎంతైనా ఉద్రేకపరచవచ్చు, టిఆర్‌పి సాధించవచ్చు. విజ్ఞానం పేరిట వినోదాన్ని ఇవ్వగల సామాజిక బాధ్యతగల దర్శకుల పని మీరు చేయలేరు. మీకు చేతనైనది ఇంతే.

ఎక్కడా అల్లాఉద్దీన్ ఖిలీజ్‌కు, రాణికి మధ్య ఎటువంటి దృశ్యాలు లేవు అని చెప్పి, మీరు వివరణలు ఇవ్వడం, ప్రముఖ నటులు వంత పాడడం గమనిస్తున్నాం. ఈ సినిమా విడుదల అవడం సరికాదు అనే వారిని చూస్తున్నాం. అలాగే ఎట్టి పరిస్థితుల్లో ఈ సినిమా ఆడనివ్వం అనే సామూహిక ఆవేశాలను కూడా చూస్తున్నాం. ఇక మీరైతే, భారతదేశ ప్రజలకు అల్లాఉద్దీన్ అనే మధ్యయుగాల పాలకుడిని సజ్జనుడిగా, చూపలేరు. ఆ మనిషిలో వున్న క్రూరత్వం, కపటం, వంచన, మాయ, నరహంతక నడవడిక, చరిత్ర నమోదు చేసినవి, ఇవి చూపితే, ఇవాల్టి సమాజంలో ప్రజలు మరింత చీలిపోవడానికి, అల్లర్లకు, ప్రాణ నష్టానికి మీ సినిమా కారణం అవుతుంది. సినిమా చివరిలో అరగంటసేపు రాణి, ఆమె సహచారిణులు మూడు వందలమంది సతీ అగ్నిప్రవేశం దృశ్యం, నేటి సమాజానికి ఏ విధంగా ఆదర్శం అవుతుంది? ఇటువంటి దృశ్యాలను ఉన్నతీకరించడంలో, మీరు, అలనాటి సంఘ సంస్కర్త, రాజా రామ మోహన్‌రాయ్ ప్రగతి చింతన కన్నా వెనక్కు వెళ్లి, అవమానాలకు పాలయ్యే స్త్రీలకు సతీ ఆత్మాహుతి మార్గం తప్ప వేరే దారి లేదు అనే ఆలోచనను బలపరుస్తున్నట్టే కదా. ఆ మేరకు మీ సినిమాను వ్యతిరేకిస్తున్న హిందూ ఛాందస కుటుంబ కట్టడి సమాజాలన్నీ నిజానికి ఎంతో ఆనందించాలి. ఇంత గందరగోళాన్ని కళాసృజన పేరిట మీరు వర్తమాన సమాజంలో రాజెయ్యడం, నిజానికి పద్మావత్‌ను మించిన స్క్రిప్ట్.

ఇపుడు ఇటువంటి విస్ఫోటక స్వభావంగల ఇతివృత్తంపై, చిన్న రంజకంతో పెను పేలుడు జరిగే వాతావరణం ఉన్న నేటి సంఘంలో, ఇంత వివాదాస్పద వ్యక్తులపై సినిమా అవసరమా అన్న ఆలోచన మీకు కలుగనందుకు ప్రజలు చింతించాలి. ఏ రకంగా చూసినా మీ సినిమాలో చిత్రిత అల్లాఉద్దీన్, నేటి సమాజానికి పనికిరాని వ్యక్తి. పాత్రలు డాన్సులాడుకోవడానికి, కత్తియుద్ధాలు చేసుకోవడానికి, మీ ఊహల స్వైరవిహారానికి ఇది కేవల వినోదం కాదు. శతాబ్దాలకిందట, లక్షలాది మంది ప్రజలను వారి మత విశ్వాసాల కోసం కత్తికి ఎరచేసి ఒక నిర్దిష్ట మత వ్యాప్త కాంక్షా నిరంకుశుడి కథ ఇది. చురచుర అంటుకునే ఆవేశాల జానకి తాడుతో ప్రజా సమూహాలను బదాబదలు చేయగల మందుపాతర. భన్సాలీగారూ, మీరు దీన్ని ఒక సినిమాగా తీయడమే తెలివిలేని పని కాగా, దీని అవసరం ఎంత ఉన్నదీ అన్న చర్చ పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో చేయవలసిందిపోయి, ఈ సినిమాలో ఆమెకు, అతనికి దృశ్యాలు ఉన్నాయా లేదా అని వాదించుకోవడమే తమ పని అనుకుంటున్న విద్యావంత సమాజాన్ని, మీ ఈ ప్రయత్నం గురించి లోతుగా ఆలోచించమని కోరుతున్నాను.

-రామతీర్థ

మనం

కందుకూరి కబుర్లు

19వ శతాబ్దంలో తెలుగు సమాజం ఆధునికతకు దూరంగా, స్త్రీలు, బడుగు వర్గాలు, వీరి పట్ల వివక్షతో ఉండేది. ఇలాంటి సమాజంలో కందుకూరి వీరేశలింగం గారి పుట్టుక. వారి స్వీయ చరిత్రలో మనకు ఆ కాలపు స్థితిగతుల గూర్చి ఆసక్తికరమైన విశేషాలు తెలుస్తాయి. వాటిలో కొన్ని.

'వీరి తలపాగా ధారణలో మహారాష్ట్ర కట్టు కనిపిస్తుంది. తమ పూర్వీకులు దేశపాండ్య పదవులు నిర్వహించిన వారని చెప్తారు. నెల్లూరు మండల కందుకూరు ముత్తాతల పూర్వ నివాస స్థలం కాగా, అక్కడ నుంచి ఏలూరు వచ్చి మహమ్మదీయ ప్రభువుల కాలంలో బహాగా బతికిన కుటుంబంగా ప్రస్తావిస్తారు. దేశంలో మహమ్మదీయ పాలన అంతరించి, బ్రిటిష్ పాలన కాలంలో అక్కడి జాగీరు వారి వశం అయి కేవలం కొంత భరణం లభించే కాలంలో, ముత్తాత కందుకూరి వీరేశలింగం రాజమండ్రి వచ్చి అక్కడ దివానుగా పనిలో ఎదిగి, విశాలమైన ఇల్లు కట్టారు. వీరి ఇల్లు ఎంత పెద్దది అంటే, ఎదురుగా అదే స్థలంలో అయిదారు ఇల్లు ఉండేవని చెప్తారు.

'రాజమండ్రిలో తాతగారింట, మనవడు వీరేశలింగం పుట్టిందే కీలక నామ సంవత్సరంలో 1848 చైత్ర శుద్ధ త్రయోదశి భానువారము నాడు, సూర్యోదయానంతరమున మూడు గడియలకు. వీరేశలింగం తాతగారికి ఇద్దరు కొడుకులు పెద్ద వాడు వెంకటరత్నము, చిన్న వాడు సుబ్బారాయుడు ఈయన కుమారుడే మన కందుకూరి వీరేశలింగము.

'తాను పుట్టడానికి ఒక ఏడాది ముందరే, తాతగారి కన్ను మూత. ఆయన తల్లి అక్కమ్మ, భార్య కామమ్మ, ఇద్దరు కుమారులూ ఉన్నారు ఆయన మరణ సమయంలో. వీరిది రాజమండ్రిలో గల మూడు పెద్ద ఇళ్ళలో ఒక్కటి అయినా, సంపదలు తరిగిపోతూ ఉన్న కాలంలో పుట్టిన వాడు ఈ కుర్రవాడు. బాల్యంలో నాన్నమ్మ, అమ్మ, నాన్న, తాను బాబాయి అని పిలిచే పెద తండ్రి, వీరితో గడిపే వాడు. చిన్నప్పుడే ఏడేళ్ళ వయసులో తండ్రి మరణం. ముత్తవ్వ చెప్పిన కథలు వీరేశలింగం ఊహాశక్తికి రేకలు తొడిగాయి.

'తొలి చదువులు చెప్పినది తొర్రి నోటి వాడైన పులిపాక అమ్మిరాజు, గూని నరసరాజు గార్లు. ఈ బాల్యంలోనే పొడుము, పొగచుట్ట అలవాయు అయ్యాయి. స్కూళ్ళు లేవు కనుక చదువుకున్నది ఇంటా, బయటా కూడా, బాల రామాయణము, అమర నిఘంటువు, రుక్మిణీ కళ్యాణము, సుమతీ శతకము, కృష్ణ నామ శతకము, ఆంధ్ర నామ సంగ్రహము ఇవి రోకటి పాటగా వల్లే వేయడం మాత్రమే వీరేశలింగం చదువు పన్నెండో ఏట దాకా. ఈ కాస్తగా తెలుగు చదువను, రాయను వచ్చాక, రాజకీయోద్యోగము కోసం, అప్పటి కొలువుల్లో ఉన్న అధికార్ల దగ్గర పని నేర్చుకోమని విడిచి పెట్టేవారు. అలా వీరేశలింగం వెళ్ళినది తాలూకా కచేరీలో గుమాస్తా గా ఉన్న పోతరాజు రాఘవయ్య గారి వద్దకు. తరువాత కొద్ది కాలం దహారి సోమయాజులు గారి వద్ద రఘువంశం నేర్చుకున్నారు. ఈలోగా 1857 సిపాయి విప్లవం అనంతరం, భారత దేశం ఇంగ్లీష్ రాణి పాలనలోకి వెళ్ళిన కారణంగా, ఇంగ్లీష్ చదువులు కొద్దిగా అందుబాటులోకి వచ్చాయి. అలా వీరేశలింగం ఇంగ్లీష్ చదువు మొదలు పెట్టే సరికి వారి వయసు పన్నెండేళ్లు.

'స్కూల్ బడి చదువుల కాలంలోనే ఇంట్లో తాటాకులపై ఉన్న భారతంలోని ఘట్టాలు చదివే వారు. ఈయనకు ఇష్టమైనవి ఉత్తర గోగ్రహణము, భీష్మ, ద్రోణ, కర్ణ శల్య పర్వములు. అలాగే భాగవతంలో సప్తమ, దశమ స్కంధములు. దేహ బలం తక్కువగా ఉండి, బుద్ధి బలం ఎక్కువగా ఉండేదని చెప్పుకున్నారు వీరేశలింగం.

'ఏకసంథాగ్రాహి కావడంవల్ల, పన్నెండేళ్ళకు ఇంగ్లీష్ చదువులు మొదలైనా, తరగతిలో మొదటి వాడిగా, అన్ని పరీక్షల్లో నిలిచేవాడిని అని రాసుకున్నారు.

'పురాణాలు బాగా చదవడం వల్ల, తపసు చేస్తే, మునీశ్వరుల్లా మహిమలు సాధించవచ్చు అన్న పిచ్చి బాగాముదిరి, తన స్నేహితులు ముగ్గుర్ని ఈ కబుర్లతో ప్రోత్సాహపరిచారు తరుణ వయస్కుడైన వీరేశలింగం. దానితో ఆ వెర్రి తలకెక్కి ఆ ముగ్గురు, ఎప్పుడు ప్రయాణం హిమాలయలకు అంటే ఎప్పుడు అని ఈయన ప్రాణం తీయడం మొదలెట్టారు. ఆరోగ్యం బాగులేక తాను రాలేను అని చెప్పి ఈయన ఊరుకున్నా, ఆ ముగ్గురు విద్యార్థులు మాత్రం, ఈయన మాటల ప్రభావంలో పడి, ఒక నాడు కూల్ కి పోతున్నాము అని చెప్పి ఊరు దాటి వెళ్లారు. ఒకరు ఊరు పొలిమేరల నుంచే వెనక్కి రాగా, మరొకరు విజయనగరం వరకూ వెళ్లి అక్కడ నుంచి ఇంటికొచ్చారు. మూడో అతను మాత్రం తన వెండి మొలతాడు అమ్మి, ఆ డబ్బుతో పూరీ జగన్నాథం దాకా పోయి వచ్చారు. అలా తపసు చేసి మహిమలు సాధిద్దాము అన్న ఉత్సాహం అడుగంటింది.

'ఏడో ఏటనే ఉపనయనం జరగడం, త్రిసంధ్యల్లో గాయత్రీ జపం, పొద్దున్నే ఇంటి చుట్టుపక్కల ఉన్న మార్కండేయ స్వామి ఆలయం, అటుపై వేణుగోపాలస్వామి ఆలయం దర్శనాలు చేయడం, సహస్ర గాయత్రి వంటివి నిష్ఠగా చేయడం, ఇవన్నీ చిన్ననాటి చేష్టలుగా చెప్తారు ఈయన.

'పన్నెండో ఏట వీరేశలింగం పెళ్లి జరిగింది కాతేరు గ్రామములోని అద్దంకి వారి అమ్మాయి బాపమ్మతో. పెళ్లి తరువాత ఆమె పేరు రాజ్యలక్ష్మిగా మార్చారు వీరేశలింగం అమ్మగారు. ఈ పెళ్లి గురించి వీరేశలింగం తన స్వీయచరిత్రలో ఇలా నమోదు చేశారు. పూర్వులాది యందు బాల్యవివాహమన్న పేరే వినియుండరు. వేదములయందు అతి బాల్య వివాహమన్న మాటే మృగ్యము. అస్వాభావికమైన ఈ అతి బాల్య వివాహ పీడ, యాచారపిశాచావేశబలము చేత వచ్చినదే కానీ విధి విహితమైనది కాదు. మావారు వివాహ నిశ్చయము చేయునప్పటికి, పన్నెండేళ్ళ వాడినైన నాకు వివాహోద్దేశమే తిన్నగా తెలియదు. నా కంటెను నాలుగేండ్లు చిన్నదైన నా భార్యకు మొదలే తెలియదని వేరుగా చెప్పవలయునా? నాకు పదమూడవ ఏటను, నా సహధర్మ చారిణికి తొమ్మిదవ ఏటను, బొమ్మల పెండ్లి వలె మా వివాహ మహోత్సవము నడచినది. పిండి వంటలు తినుటయు, వాద్యములు వినుటయు, వేశ్యల నృత్యములు గనుటయు మాకప్పుడు ఆహ్లాదకరముగానే యుండి యుండును.

'ఇప్పట్లో మనం CV (సివి) కరికులం విటే - రాస్తూ ఉంటాము కదా - ఆ రోజుల్లోనే ఒక సీస పద్యంలో తన సివి రాశారు కందుకూరి. అది ఇదీ.

బ్రాహ్మణుండను హూణ భాష నేరిచి యందు
నే బ్రవేశపరీక్షనిచ్చినాడ!
నాంధ్రమున నొకింత యభిరుచి గలవాడ
దేశాభివృద్ధికై లేశమైన
బ్రాలుమాలక పాటుపడనిచ్ఛ గలవాడ
గవితా పటిమ గొంత గలుగువాడ
నోపిక సర్వజనోపయుక్తములైన
విషయములను, నీతి విషయములను
సులభ శైలి నందరకు తెలియునట్లు
కఠిన సంధులు లోనుగా గలవి విడిచి
వ్రాయుదు నొక్కప్పుడన్య దేశీయములను
లోనుగా గలవానిని బూని కూర్తు

వీరేశలింగం 1874 నుంచి వివేకవర్ధని పేరిట పత్రిక నడిపారు. ఆ పత్రిక పేరు దిగువన విదుర నీతి వాక్యం ఉంచడం కూడా కందుకూరి వారే ప్రారంభించారు. ముఖ తిలకముగా భారత నీతి వాక్యం ఉంచాము అని చెప్పారు. ఆ నీతి వాక్యం ఇలా తరువాతి పత్రికల్లో కూడా సంపాదకీయ పేజీలో కనపడేది.

ఒరులేయవి యొనరించిన నరవర, యప్రియము తన
మనమునకగు దా
నొరులకు అవి సేయకునికి పరాయణము
పరమధర్మపదములకెల్లన్

(సరళీకరణ - సంకలనం)

◆ రామతీర్థ
98492 00385

(నేడు కందుకూరి వీరేశలింగం 170వ జయంతి. అలాగే మే 27వ తేదీ నుంచి వారి శత వర్ధంతి సంవత్సర ఆరంభం అవుతున్న సందర్భంగా నేటి తరాల కోసం సరళ భాషలో కందుకూరి వీరేశలింగం గారి జీవితం నుంచి...)

మన సారథి, సచివుడు

> కందుకూరి ఒక కులానికో, ఒక ప్రాంతానికో చెందినట్టు గిరిగీస్తే, అది అధిక తెలివితేటలతో వారి చుట్టూ వారు గీస్కునేదే అవుతుంది. కందుకూరి రచనలు సమగ్రంగా రావడం, ఒక రీడర్ తయారీ, సరళ భాషలో నేటి తరాలకోసం వారి కొన్ని రచనల ముద్రణా ఇవన్నీ జరగవలసినవే. కందుకూరి శత వర్ధంతి ప్రారంభోత్సవం విశాఖలో 2018 మే 27న, మొజాయిక్ సాహిత్య సంస్థ నిర్వహణలో ఆంధ్ర విశ్వ విద్యాలయ సెమినార్ హాల్‌లో సాహిత్య సాంస్కృతికోత్సవంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరుగుతున్నది. రాష్ట్రం నలుమూలలా ఈ శత వర్ధంతి ఏడాది పాటూ భిన్నకార్యక్రమాల సమాహారంగా జరగడం తెలుగు వారికి సమున్నత గర్వ కారణం.

ఆధునికత యుగ స్వభావంగా తెలుగు జాతిని నడిపించిన సారథి, మన అర్థం లేని సంప్రదాయ కట్టుబాట్ల, భూస్వామ్య పద్ధతుల పాతగిల్లిన సమాజానికి మంచీ చెడు ఏమిటో వివరించి చెప్పిన సచివుడు కందుకూరి వీరేశలింగం. అక్షరం ఇంకా ప్రజాస్వామికం కాని ఆ రోజుల్లో, తొలి పత్రికలు నడిపితే తప్ప, చదువు, సమాజ నిర్మాణం, అందరికీ అభివృద్ధి ఇవన్నీ యుగావసరాలుగా గుర్తించి, నవ్యతకు వెల్లువెత్తిన గోదావరి గంగ వీరేశలింగం భావ ప్రవాహం.

సమాజ సంస్కరణ రాజకీయ సంస్కరణ, స్వాతంత్ర్యం కన్నా అవసరమైన విశాల వాస్తవం అని ఎరిగిన ఆనాటి భారతీయ ఉపఖండ పెద్దల్లో ఒకరు కందుకూరి వీరేశలింగం. ఏడు దశాబ్దాల సంఘర్షణాత్మక జీవితం తరువాత 1919లో నా పని ఇంకా ఉన్నది, దీన్ని విజ్ఞులైన నా వారసులు పూర్తి చేస్తారు అని విశ్వాసం ప్రకటించి వారు కన్ను మూశారు. ఏమిటా పని? జరిగిందా అనేది ఇవాళ మనం వేసుకోవాల్సిన ప్రశ్న.

1919లో వారి నిష్క్రమణ అనంతరం నేటికీ వందేళ్ల. వందో ఏటిలో నిలబడి మనం వేసుకోవాల్సిన ప్రశ్న, సామాజికంగా ఆధునికులమైనామా? పరిణతి సాధించి సాంఘిక కార్యకలాపాలను నడుపుకుంటున్నామా? విద్యా, విచక్షణతో పాలకులను ఎంపిక చేసి పాలన బాధ్యతలను ఈ ప్రజాస్వామ్యంలో అందిస్తున్నామా? మహిళలు, పిల్లలు, బడుగు, బలహీన వర్గాలు, వీరి అభ్యున్నతి కోసం సంఘం, దేశం, రాజ్యం దీక్షా దక్షతతో ఉన్నాయా ఇవీ ప్రశ్నలు.

వీరేశలింగం అంటే మొదటి నవల, మొదటి పరిశోధనాత్మక జర్నలిజం, మొదటి ఆత్మకథ, మొదటి సహాయ నిరాకరణ, ఇలా ప్రథమ, ద్వితీయ రికార్డుల కోసం గుర్తుంచుకోవలసిన మనిషి కాదు, ఆ సంగతి ఆయనకు పట్టదు. మనం ఏ స్థానం ఇచ్చినా ఆయనది తిరుగులేని స్థానమే. ఈ సింహాసనాల వేపు ఆయన తన జీవిత కాలంలో కన్నెత్తి చూసుంటే, జస్టిస్ కందుకూరి వీరేశలింగం పంతులు అయి ఉండే వాడు. లేదా పరిపాలనలో ఉన్నత అధికార స్థానంలో కలెక్టర్ స్థాయి, మించిన ఉద్యోగాలు చేసి ఉండే వాడు, ఇవేవీ నాకొద్దని తన పైలా పచ్చీసులోనే వదిలేసుకున్న ఒక సమాజ శ్రేయోభిలాషి, సంస్కరణ హితైషి, సామాజిక న్యాయవాది, ఆచరణసేనాని, ఆధునికతకు ఆగమ శంఖారావంగా నిరంతర ప్రయాసగా ఏడు పదుల జీవితం, తను నమ్మిన భావనల పరివ్యాప్తి, ప్రచారం, ప్రసారానికై నూట ముప్ఫై పుస్తకాల రచన, అదీ కందుకూరి, కోరి జీవించిన పద్ధతి. ఎన్ని పుస్తకాలన్నది ప్రధానం కాదు, అవి తాను ఆనాడు చెప్పదలచుకున్న దానికి అక్షర ఉపకరణాలు. పాత కొత్తల మధ్య అక్షర సేతువులు.

ఎనిమిది వందలేళ్ళ సాహిత్యమే, మనముందరున్న సమాజ గమన సాక్ష్యం. దీని సాంస్కృతిక రూపాలు, ఆయా సమాజాల్లో ఎంత ప్రబలంగానో ఉంటే తప్ప, ఆనాటి ప్రముఖ సాహిత్య ప్రతినిధులుగా మిగిలి ఉండవు. ఒకపక్క ఈ 800 ఏళ్ల సాహిత్య సముద్రంలో, ఆణిముత్యాలను ఏరి, ఒక ప్రామాణిక దృక్కోణం ఏర్పరుస్తూ, నవనవోన్మేషశాలినీ అయిన ప్రతిభ, సృజన వర్తమానంలో కూడా అంతకు దీటుగా, ఇంకా సంపన్నంగా రావాలి అంటే, ఆ రచనల్లో ఉండవలసిన అంశాలేమిటి? ఇదీ వీరేశలింగం ప్రయాస.

17,18 శతాబ్దాల్లో పాశ్చాత్య రాజరిక, భూస్వామ్య సమాజాల్లో అక్కడి గొప్ప రచయితలు వాడుకున్న వ్యంగ్యం, చతుర విమర్శ, లోకాన్నీ, సాహిత్య విస్తృతిని చదువుకున్న కందుకూరి ఇక్కడ, ఈ సమాజంలో కూడా ఉపకరిస్తుందన్న ఆలోచనతో, తన ప్రహసనాల తీవ్రాస్త్ర ప్రయోగాలు చేశారు. ప్రహసనాల సవ్యసాచి లక్షణం, రచనా వేగంలోనూ, అటు పద్యంలోనూ, ఇటు గద్యంలోనూ కూడా తన భావాన్ని శైలీ మర్యాదల అనుసారం చెప్పగల వాడి, వేడి సంతరించుకున్న అక్షర యోద్ధ. ప్రహసనాల్లో ఉండే జంతు పాత్రల కథలు మనకి ఆది కావ్యల్లోనే ఉన్నాయి. రామాయణంలో మాట్లాడే, బుద్ధులు గరపే జంతువుల లెక్కలు తీస్తే, ఒక భిన్న వాల్మీకి, అలాగే అంతకుమించిపోయిన భారతంలో ఒక నూత్న వ్యాసముని కనిపిస్తారు. ఏసప్ ఫేబుల్స్, రోమన్ బానిసల కాలానికి చెందినవి అనుకుంటే, అంతకు ముందరే, మనకు పంచతంత్ర కథలు (మాంటిస్సోరి పద్ధతిలో విద్యాబోధన) ఉన్నాయి. పాత కొత్తల మేలు కలయిక, నిజానికి మనకు, వారిలో ఒకరినొకరు బాగా ఎరిగిన, కలిసి పనిచేసిన మన పంతొమ్మిదో శతాబ్దపు ఆధునిక నిర్మాతృత్రయం కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, మనకు పదే పదే చెప్పి వెళ్లారు. దీని సాధనే మనకు ప్రస్తుతం అలవి మాలిన పని వలె ఉన్నది.

నాటకీయ టెక్నిక్ సైతం కందుకూరి, తన అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనంలో కేవలం ఇరవై పైచిలుకు పేజీల్లో పోషించిన ఉత్కంఠ గమనించదగ్గది. ఇదే ఎలిమెంట్ కీలకంగా కొన్ని దశాబ్దాల ఎడంలో మనకు మిస్సమ్మ, పెళ్లి పుస్తకం సినిమాలు వచ్చాయి. వీటిలో మొదటి చిత్రంలో పెళ్లి కాకపోతే ఉద్యోగాలు ఇవ్వరు, రెండో దానిలో దానికి వ్యతిరేకంగా కథ నడుస్తుంది. దీన్ని 1880ల్లోనే రాశారు కందుకూరి. అంతేకాక మనం కొత్తగా ఉన్నది అని చెప్పుకున్న - జంబలకిడి పంబ చిత్రంలో, మగవారు చేసే పనులన్నీ ఆడవారు చేయడం, అలాగే ఆడవారి వలె మగవారు ఇంటిపట్టున, అణకువగా ఉండడం, ఇదంతా శతాబ్దం కిందటే, సత్యరాజా పూర్వ దేశయాత్రలులో ఆడ మలయాళం పేరిట, చిత్రణ చేశారు వీరేశలింగం.

కుల గుర్తింపు పోవాలని తన జంధ్యం తెంచేసిన సామాజికుడు. తనని తాను నిజమైన ఆస్తికునిగా చెప్పుకుని, ఏకేశ్వరోపాసన ప్రార్థన చేసిన బ్రహ్మ సమాజీకుడు. వితంతు వివాహాలు సైతం బ్రహ్మసమాజ్ పద్ధతుల్లో చేసిన సాహసి. గాంధీ గారు హరిజన విషయ శ్రద్ధపెట్టడానికి ముందరే, కందుకూరి శిష్యుడైన చిలకమర్తి లక్ష్మి నరసింహం హరిజన పిల్లలకు పాఠశాల పెట్టి వారి చదువులు సమాజానికి అవసరం అని నమ్మిన ఆచరణ వాది, ఆధునికుడు.

1887-1892 మధ్య గురజాడ వారికి కన్యాశుల్కం రాసే ప్రోద్బలం ఆనంద గజపతి రాజా వల్ల కలిగితే, అంతకు ముందరే 1881లో ఒక ప్రసంగంలో, ఈ అతి బాల్య వివాహాల విషయమై సునిశిత ప్రసంగం చేసిన వారు కందుకూరి. బ్రాహ్మణ చాంధస వర్గాలను కర్కశంగా విమర్శించిన సాంఘికమే ధావి వీరేశలింగం. 1881లో తన ప్రసంగం అతి బాల్య వివాహంలో మూడు లక్షల బాలికలు, ఈ అతి బాల్యవివాహ దురాచారం వల్ల వితంతువులై ఉన్నారని, ఈ దుష్టకార్యాన్ని మానుకోవలసిందని హెచ్చరించారు. ఇదే తరువాత వారి రచనల్లో బ్రాహ్మ వివాహం కాగా, గురజాడ చేతిలో రెండుసార్లు పనివాడితనానికి గురై, ఒక యుగారంభ రచనగా పరిణామం చెందింది.

ఆధునిక త్రయంలో తొలి భీషణ శంఖం పూరించినది, వీరేశలింగం. వారి శతవర్ధంతి ముందరే రావడం కాలానుగుణంగా సహజం, అయినా మన సంఘ ప్రగతి, సంస్కరణ రంగ భారతదేశ నాయకుల దార్శనికత మేరకు జరగలేదు. దాని ఫలితమే ఇప్పుడు మనం ఒకజాతీయ సంఘంగా స్త్రీలు, పిల్లలు, బడుగువర్గాల పట్ల జరుగుతున్న అన్యాయ పరంపర ఎదుర్కోవాలి అంటే, వీరేశలింగం గారి ప్రమాణాలను సాంఘిక జీవితంలో అమలు చేయవలసిన అవసరం, అన్ని కులాలకు ఉన్నది. సాంఘిక భ్రష్టత్వ వాతావరణంలో, కేవలం సాహిత్య రచనకు ప్రయోజనం సిద్ధించదు.

పత్రికలు, సామాజిక మాధ్యమాలు, సాంస్కృతిక రూపాలు, అన్నీ పెట్టుబడికి, కట్టుకథకు పుట్టిన విషపుత్రికలుగా మారిపోతున్న ఈ దశలో, సామాజిక హింస, బాధిత వర్గాల పెనుగులాట, ఇవన్నీ తక్షణమే పోవాల్సిన రుగ్మతలుగా శతాబ్దం ముందర ఒక దార్శనిక శిఖరమైన వీరేశలింగం, వారి సహయోధులు గురజాడ, గిడుగు కలిసి తెలుగుజాతి ముందర నెలకొల్పిన ప్రణాళిక ఉన్నది. రాజకీయ గడుసుతనాలు నేర్చిన జాతి, సాంఘికంగా రోజురోజూ కుక్క చావు చస్తున్నది. వీరేశలింగంగారు రాసిన ఒక ప్రహసనం పేరు అభాగ్యో పాఖ్యానం. అచ్చం అలాగే నేటి సంఘం కునారిల్లుతున్నది. దీనికి విరుగుళ్లు, కందుకూరి మందుల పెట్టెలోనే ఉన్నాయి. అవి సాహిత్య, సాంస్కృతిక, సాంఘిక రంగాలకు సజీవ మాంస కృత్తులు, ఖనిజ లవణాలు.

అందువల్ల కందుకూరి ఒక కులానికో, ఒక ప్రాంతానికో చెందినట్టు గిరిగీస్తే, అది అధిక తెలివితేటలతో వారి చుట్టూ వారు గీస్కునేదే అవుతుంది. కందుకూరి రచనలు సమగ్రంగా రావడం, ఒక రీడర్ తయారీ, సరళ భాషలో నేటి తరాలకోసం వారి కొన్ని రచనల ముద్రణా ఇవన్నీ జరగవలసినవే. కందుకూరి శత వర్ధంతి ప్రారంభోత్సవం విశాఖలో 2018 మే 27న, మొజాయిక్ సాహిత్య సంస్థ నిర్వహణలో ఆంధ్ర విశ్వ విద్యాలయ సెమినార్ హాల్‌లో సాహిత్య సాంస్కృతికోత్సవంగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ జరుగుతున్నది. రాష్ట్రం నలుమూలలా ఈ శతవర్ధంతి ఏడాది పాటూ భిన్నకార్యక్రమాల సమాహారంగా జరగడం తెలుగు వారికి సమున్నత గర్వ కారణం.

◆ రామతీర్థ
98492 00385

(మే 27న కందుకూరి శత వర్ధంతి ఆరంభం)

కవిత

కందుకూరి కబుర్లు -3

కందుకూరి వీరేశలింగం మొండివాడా అనిపించెంత పట్టుదల గల మనిషి. ఒకసారి స్కూల్ లో హెడ్‌మాస్టర్ తన మిత్రుడిని కొట్టి, ఎప్పుడు క్లాస్ ఫస్ట్ వచ్చే తనని అకారణంగా బుద్ధిహీనుడా అని తిట్టినందుకు తను క్లాసులు బహిష్కరించి, హెడ్‌మాస్టర్ నిరంకుశ ప్రవర్తన పట్ల ఇతర విద్యార్థుల్లో కూడా అసంతృప్తి రాజేసి, ఎవరూ తరగతులకు వెళ్లకుండా ఐక్యత సాధించాడు. ఆ హెడ్‌మాస్టర్ గారికి ఇంగ్లీష్ బాగా రాక పోవడం వల్ల మాకు పాఠాలు సరిగా చెప్పలేక పోతున్నారని తరగతి విద్యార్థుల సామూహిక అభియోగానికి, అర్జీకి ప్రేరేపణ వీరేశలింగం గారిది, అలాగే, ఈ సామూహిక దరఖాస్తు, విద్యా విచారణాధికారికి పంపడానికి వీరు ఏర్పాటుచేసుకున్న విద్యార్థి కనుపర్తి లక్ష్మయ్య. అయితే ఈ సంగతి బయటపడి, ఒకనాడు తరగతిలో హెడ్‌మాస్టర్ వైయాపురి మొదలియార్ ఈ లక్ష్మయ్యను గొడ్డుని బాదినట్టు బాది, ఆ తతంగానికి మూలకారణమైన వీరేశలింగాన్ని కొద్ది రోజుల తర్వాత క్లాస్‌లో అకారణంగా తిట్టాడు. ఈ దురుసు ప్రవర్తన వల్ల, తను క్లాసులు మనుకుని, ఇతరులు కూడా క్లాసుకి వెళ్లకుండా నిరోధించ గలిగారు విద్యార్థి కందుకూరి. దీనితో మొదట కొడతానని, పేర్లు తీసేస్తానని బెదిరించిన హెడ్‌మాస్టర్, చివరికి వీరిని క్లాస్ కి రావలసిందిగా బతిమాలుకోవలసి వచ్చింది. అయినా విద్యార్థుల అర్జీ, కల్నల్ మెక్‌డొనాల్డ్, గ్రిగ్ దొరలకు చేరింది. దీనితో విచారణకు వచ్చిన గ్రిగ్ దొర, నరసాపురానికి ఈ హెడ్‌మాస్టర్ బదిలీ ఆదేశాలు జారీ చేసి, ఆ పాఠశాలకు చెందిన చెంగల్వ కుప్పుస్వామి శాస్త్రుల వారిని, ఈ పాఠశాలకు కొత్త ప్రధానోపాధ్యాయులుగా నియమించారు.

ఇరవయ్యేళ్ళకు ముందరే పెత్తండ్రి మరణం కూడా జరిగింది. కొత్తగా ఆయనకు పెళ్లి అయిన ఆమె, ఆస్తి చెరి పంపకాల తగువుల్లో, కక్షిదారులు, రాజమండ్రి నగరం మధ్యలో గల తమ విశాలమైన వాటాని, మోస పూరితంగా, పోగొట్టుకునే దశ వచ్చినప్పుడు, కందుకూరి తమ కుటుంబపు ఆస్తిగా దాన్ని నిలుపుకునేందుకు, న్యాయం కోరివేసిన కేసులు, సరిగా ఫైల్ చేయకపోవడం వల్ల వీగిపోయాయి. అందువల్ల కోర్ట్ సరిగా వ్యాజ్యం వేసి ఈ ఆస్తి విషయమైన దావా తేవచ్చును అని చెప్పినా, అప్పటికే భార్య నగలు అమ్మి కేసులకు ఖర్చు పెట్టిన కందుకూరి, మరి సాహసం చేయలేదు. ఫలితం, ఎవరైతే మోస పూరితంగా ఆ వాటా రాయించుకున్నారో, ఆయన, రాబోయే పన్నెండేళ్ళ కాలంలో ఎప్పుడైనా కందుకూరి, కోర్ట్‌లో తమపై కేసు తెస్తారేమో అన్న భయంతోనే చని పోయాడు. అతని భార్య ఆ పుష్కర కాలం దాటాక, అక్కడ చిన్నచిన్న ఇళ్ళు కట్టి వాటిని అద్దెలకు ఇచ్చుకున్నది.

ఇలా ఇంటి పెద్దగా ఇరవైరెండేళ్లకే కందుకూరి మిగిలారు. ఆ వయసుకే తెలుగులో కవిత్వం చెప్పడం మొదలు పెట్టారు. 'మార్కండేయా' అనే మకుటంతో మార్కండేయ శతకము, అలాగే '' శ్రీ రాజమహేంద్ర వరపురీ గోపాల'' అనే మకుటంతో ఇంకో శతకం రాశారు. తరువాతి కాలంలో వీరిలో నిర్మాణం చంధస్సు సరిగా లేదు అని వీటిని నిరాకరించి, పక్కకు పెట్టారు. కానీ తన 'అభాగ్యోపాఖ్యానం' అనే పద్య ప్రహసనంలో, మొదట్లో రాసిన గోపాల శతకంలోంచి మొదటి పద్యం తెచ్చి ఇందులో మొదటి పద్యంగా ఉపయోగించారు.

''శ్రీ రమణీ హల్లోలా, కారుణ్యలతాలవాల కాంచన చేలా
ఘోరావహజయశీలా, శ్రీ రాజమహేంద్రవర పూరీ గోపాలా'' అన్నది ఆ తొలి శతకాల్లో మనకు కందుకూరి మిగిల్చిన ఒక శేష పద్యం.

తను చేసే పనులు కేవలం అందరిదీ ఒక దారి అయితే, తనది వేరే దారి అని చెప్పడానికా లేక ఏదన్నా ప్రయోజనం ఉండాలా అన్న దానిపై కందుకూరి యువకుడిగా ఉన్నప్పట్నించీ విమర్శ కల్గి ఉండే వారు. ఈయన తెలివైన విద్యార్థి కావడం చేత, విద్యార్థుల్లోనే కాక, ఉపాధ్యాయుల్లో కూడా వీరికి మిత్రులు ఉండే వారు. రాజమండ్రి శివార్లలో ఊరిలోనికి రెండు దారులుండేవి. ఒకటి విపణి వీధి (బజారు వీధి) గుండా వెళ్తే, మరొకటి, నదిపక్కగా వెళ్తుంది. అందరూ బజారు వీధిగుండా వెళ్దాము అంటే, కందుకూరి రాత్రి పొద్దు పోయి వేళ మించినా తాను నది పక్కగానే వెళ్తాను అని అలా వెళ్లొచ్చారు. మర్నాడు మిత్రులు అలా వెళ్లడంలో ప్రమాదమేమీ లేదని ఈయనతో బాటుగా, నది పక్క మార్గాన్నే ఊరిలోకి వచ్చారు.

కందుకూరి వారి కాలంలో దయ్యాల భయం ఎక్కువగా ఉండేది. చనిపోయిన వారి తప్పక దయ్యాలవుతారన్న నమ్మకం బలంగా ఉండేది. ఒకసారి తనకు దయ్యాన్ని చూపిస్తానన్న ఒక మంత్ర గాడితో, యువకుడైన వీరేశలింగం, శ్మశానందాకా వెళ్లారు. అలాగే ఎప్పుడైనా దయ్యాలు కనిపిస్తాయేమోనని రాజమండ్రి ఊరి శివార్లలోని ఎర్రరాళ్ళ వల్లకాటికి అర్ధరాత్రిళ్ళు కూడా వెళ్ళేవారు ఈయన. పాములు, తేళ్ళు, దొంగల భయం తప్ప, ఒక్క దయ్యం కూడా కనిపించలేదని, అయినా నమ్మకం కలగని విషయాలను ప్రశ్నించడం అవసరం అని చెప్తారు కందుకూరి. దయ్యాలను నమ్మని మనిషి, ఆచారాల దయ్యాలను పాటిస్తాడా? తర్కానికి అందనిది ప్రశ్నించడం, ప్రత్యక్ష అన్యాయం ఎదిరించడం, కందుకూరి వీరేశలింగ నైతిక ద ఢత్వానికి మౌలిక లక్షణం. అయితే ఆత్మ విమర్శ లేని మంకుపట్టు ఆయనకు లేదు. దీన్నే బజారు వీధిలోంచా లేక ఎవరూ నడవని నది పక్క దారి లోనించా ఎలా ఇంటికి చేరడం అన్నదానిలో తన ఎంపిక అయిన నది పక్క దారి విషయంలో తనలో తాను విమర్శించుకుంటూ, ఇలా చెప్తారు కందుకూరి. ''(మిత్రులు) నేనితరులు చెప్పినట్టు వినని వాడను అని పలుకుచు నా మార్గమునను సరించిరి. ఇట్టి పట్టుదలను ధర్మాచరణముతో సంబంధించిన ముఖ్యాంశములలో జూపుట యావశ్యకమును కర్తవ్యమునే యనను, ధర్మభంగములేని యటువంటి యల్పాంశములలో జూపుట యానాదరణీయమును మూర్ఖత్వమును అగును. నీతికి, సత్యమునకును, ధర్మముకును, భంగము కలుగని విషయములలోనెల్లను బహుజన వాక్యముగా భావించి తదనుసారముగా పెద్దలకు లోబడి నడచుట, కర్తవ్యమని తెలుపుటకే దీనినిందు జెప్పితిని గాని, నేను జేసిన పని మంచిదని జెప్పుటకు కాదు''.

ఆచార మహా పిశాచము పాటించే బ్రాహ్మణుల పూర్వ నాగరిక సమాజం విషయమై, సాహిత్య శిల్పంలో పాటించే శ్రద్ధ కన్నా స్పష్టంగా కందుకూరి ''మాలోని విద్యా విభూషితులగు మహానుభావులు వివేకదీపమువంక నైన జూడ నొల్లక కన్నులు మూసికొని పూర్వాచర మహాభూతమునకే సేవ చేయుచు వచ్చుచున్నంత వరకు మనదేశమునకట్టి పుణ్యము కలుగదు. పండిత పామర భేధము లేక మావారెల్లను నాచారమునకు దాసులు. ఆచార పిశాచమావేశించినచో వారికి దయయు, ధర్మమును, సత్యమును, సత్కర్మమును, సర్వమును పరిత్యాజ్యములు''. ఇటువంటిది, కందుకూరి వారు సంప్రదాయ సమాజంపై ఎక్కుపెట్టిన దాడి. ''ఆయుధం చేతబట్టని పోరాట యోధుడు''గా ప్రముఖ వామపక్ష నాయకులు జె.వి. సత్యనారాయణ మూర్తి కందుకూరి జయమాల సమర్పిస్తూ వారికి నివాళి ఘటించారు.

కందుకూరి యువకుడయ్యే వేళకు, మద్రాసు అలనాటి మన దక్షిణ భారత ఉమ్మడి రాష్ట్ర రాజధాని నుంచి బ్రహ్మశ్రీ కొక్కొండ వెంకట రత్నం పంతులు, స్త్రీ విద్యకి విరుద్ధంగా తన పత్రిక 'పురుషార్థప్రదాయిని'లో రాస్తూ ఉండే వారు. దానికి విరుద్ధంగా, ఆయన భావనలు చెల్లవంటూ తాను కూడా పద్యాల్లో బదులిచ్చిన చేవ గల యువకుడు కందుకూరి. అలా వారికి రాసిన పద్య ప్రతిఘటనలో ఒక పద్యం.

''మునుపటి వారు చెప్పినది మొక్కలవున్మది పోనీ సర్వమున్
గానజనదంచు న మతము గూడ లవంబును కాదు కానీ యెం
దును మన బుద్ధి కూడ గదు దూరిచి యారయుంచుట ముఖ్యమై
చనును హితాహితంబుల పసల్ గాని దుష్క తముజ్జగింపగన్''

సరళీకరణ – సంకలనం
◆ రామతీర్థ
98492 00385

సవరణ : ఆదివారం 4వ పేజీలో 'రాతి హృదయం' కవిత రాసిన రచయిత్రి 'వెల్లంకి గీత' పేరు ప్రచురించనందుకు చింతిస్తున్నాం. - సంపాదకులు

సందర్భం

రామతీర్థ

ఆధునికతకు అక్షరాది కందుకూరి

తెలుగు సమాజంలో ఏ ఒక్క వ్యక్తి పుట్టుకతో అయినా ఇదిగో ఆధునికత మొదలు ఇతనితో అని చెప్పగలమా అంటే, అది ఒక్క కందుకూరి వీరేశలింగం విషయంలోనే సాధ్యం. ఆయన శతవర్ధంతి వత్సరం మే, ఇరవై ఏడున ఆరంభం అవుతున్నది. ఏ చదువులు లేకుండా అజ్ఞానంలో, బలైపోతున్న పసి ఆడపిల్లల జీవితాలు, యుక్తవయసు వచ్చేలోపే బాల వితంతువులుగా లక్షలాదిమంది బాలికలు సమాజంలో ఉండటం, వీటిని ఎవరు సహించినా, తాను వ్యతిరేకినంటూ, వీటిని ప్రశ్నించడానికి 1881లో రాజమండ్రి సోషల్ ప్రావిన్షియల్ క్లబ్‌లో కందుకూరి వీరేశలింగం ఒక ప్రసంగం చేశారు. దీనికి ప్రధాన ప్రేరణ, ఈ బాల్య వివాహాల జాడ్యం దేశమంతటా ఉండటం.

1880లో జరిగిన జనాభా లెక్కల ప్రకారం, తొమ్మిదేళ్ల వయసులో భార్య అంటే ఏమో ఎరుగని వయసు బాలురు, పసి భార్యలను పోగొట్టుకున్న వారు దేశంలో 14,773 మంది ఉన్నారు. అదే సంవత్సరం, తొమ్మిదేండ్ల వయసు ఉన్న బాలికలు, తమ భర్తలను పోగొట్టుకున్న వారు, 78,976 మంది లెక్కతేలారు. వీళ్ళు కాకుండా, తరుణ వయసుకొచ్చిన 2,07,388 మంది బాలికలు తమ యవ్వనారంభ జీవితాలను వితంతువులుగా మొదలెడుతున్నారు. ఇవీ సంప్రదాయ భారతదేశపు సంఘం చేస్తున్న దుర్మార్గ పరంపర. ఇది కేవలం తెలుగు ప్రాంతాలకే చెందినదిగా, కొందరు భావించి, గురజాడ (1887–1892 నాటక రచనా కాలం ప్రదర్శన 1892లో) కన్యాశుల్కం నాటకం రాసే నాటికే, ఈ సమస్య లేదు అని చెప్తూ ఉంటారు. అది వాస్తవదూరం. ఈ అగ్రవర్ణ మూర్ఖత్వాన్ని నిరసిస్తూ, గురజాడ వాడిన వాటి కన్నా, కటువైన మాటల్లో, ఈ బాల్య వివాహ దురాచారాన్ని రూపుమాపితే గానీ సమాజం బాగుపడదని విశ్వసించిన నాటికి, వీరేశలింగం వయసుడిగిన ముసలివారు కారు. ఆయన వయసు అప్పుడు కేవలం 33ఏళ్ళు. మనం తరచూ చూసే వృద్ధ కందుకూరి ఫోటోకి, ఈ అతి బాల్య వివాహాలపట్ల నిరసన తెలుపుతూ, తొలి వితంతు వివాహాన్ని 1881లో దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా జరిపించిన వ్యక్తి రూపానికి పోలికే లేదు. దక్షిణ భారత రామ్మోహన్‌రాయ్‌గా గుర్తింపదగ్గ ఆధునికుడు వీరేశలింగం.

కేవలం అక్షరయోధుడే కాదు, ఆచరణసేనాని కందుకూరి. ప్రసంగాలు, రచనలే కాదు – పెళ్లిళ్లు జరగాలి– అదీ కందుకూరి కార్యదీక్ష. ఆయన రచనలన్నీ, సాంఘికమౌఢ్యాన్ని పెల్చివేసే మందుపాతరలు. ఏకబిగిన వితంతు వివాహదీక్షతో, సంఘసంస్కరణలో జాతీయస్థాయి సంస్కర్తగా తన జీవితకాలంలోనే ఎదిగారు కందుకూరి. అప్పటి జాతీయ సంఘ సంస్కర్తలతో కలిసి, తన కార్యాచరణలో ఉన్నారు. ఈ భిన్న ప్రాంతాల ప్రముఖులు, జస్టిస్ మహదేవ్ గోవింద్ రనడె అధ్యక్షతలో, దేశంలోని ప్రధాన నగరాల్లో జాతీయ సామాజిక సంస్కరణ సభలను నిర్వహించేవారు. ఈ మేధావులు సంఘ సంస్కరణ మన రాజకీయాకాంక్షలతోబాటుగా, అంతకన్నా వేగంగా సాగాలని, అప్పుడే భారతీయ సమాజం ఆధునికం కాగలదని విశ్వసించి ఆచరించినవారు. 1898లో మదరాసులో జరిగిన మహాసభలకు కందుకూరిని అధ్యక్షులను చేసి గౌరవించారు. ఇక్కడ అధ్యక్షహోదాలో ఆంగ్లంలో ప్రసంగించారు కందుకూరి. ఇక్కడే జస్టిస్ మహదేవ్ గోవింద్ రనడే 'దక్షిణ భారత విద్యాసాగరునిగా' కందుకూరికి బిరుదునిచ్చారు.

అరుదైన ఈ ఆంగ్ల ప్రసంగ పూర్తిపాఠం, ఇటీవల లభ్యమైంది. దీనిని మే 27న, విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం హాల్‌లో ఒక రోజుపాటు జరిగే శతవర్ధంతి వత్సర ప్రారంభోత్సవంలో విడుదలచేసి ఈ ప్రతిని ప్రదర్శనయోగ్యంగా విజయనగరంలోని గురజాడ స్మారక మందిరానికి, అలాగే, రాజమండ్రిలోని కందుకూరి దంపతుల సమాధి ఉన్న ఆనందాశ్రమానికి, ప్రదర్శన నిమిత్తం జాతికి సమర్పించడం జరుగుతుంది. 'వ్యాకరణాల సంకెల' అని, 1895లోనే ''సరస్వతీ నారద విలాపం''లో రాసిన కందుకూరి, 'కవితా ఓ కవితా'లో 'వ్యాకరణాల సంకెళ్లు, శ్మశానాల వంటి నిఘంటువులు, ఛందస్సర్ప పరిష్వంగం' అన్న శ్రీశ్రీ కన్నా 45 ఏళ్ల ముందరే, సాహిత్య సరస్వతి భాష బరువుల కింద నలిగి రోదిస్తున్నదని చెప్పిన వాస్తవిక వాది. వీరి రచనల సమగ్ర ప్రచురణలు, వీలైతే నేటి తరాల కోసం, కొస్త సరళ భాషలో తీసుకురావడం, అలాగే, పలు తెలుగు నగరాల్లో కందుకూరి శతవర్ధంతి సందర్భంగా 'కందుకూరి జయమాల' సాహిత్య, సాంస్కృతిక సభల నిర్వహణ, ప్రస్తుతం తెలుగు జాతి బాధ్యత.

(మే 27న కందుకూరి శతవర్ధంతి సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విశాఖలోని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మొజాయిక్ సాహిత్య సంస్థ, అరసం సంయుక్తంగా నిర్వహిస్తున్న సందర్భంగా)

వ్యాసకర్త కవి, విమర్శకుడు । 98492 00385

సవరణ : శనివారం సాక్షి (25-05-2018) 6వ పేజీలో ప్రచురించిన వ్యాఖ్య కర్త అమెరికన్ నటి నటాలి పోర్ట్‌మన్‌గా చదువుకోవాలి. ఆమె స్టార్ వార్స్ సినిమాలోని పాడ్మె అమిడాల పాత్రధారి.

కందుకూరి కబుర్లు -5

చిత్రపు కామరాజు, కందుకూరి జీవిత చరిత్రలో ఒకటి రెండుసార్లు తారసిల్లే వ్యక్తి. ఈయన మండల దొరతనం తరపున ప్రభుత్వ న్యాయవాదిగా ఉండేకాలంలో, యువకుడైన కందుకూరి, వీరి వద్ద కొద్ది కాలం ప్లీడర్ గుమాస్తా పనిచేస్తారు. అయితే ఈయన వేశ్యలతో ఇంతకాలం గడపడం, వారితో ఎబ్బెట్టు ప్రవర్తన చూశాక, రోజుకి మూడు గంటలు పనిచేస్తే వచ్చే ఇరవై రూపాయల ఉద్యోగం మానుకుంటాడు. ఈయన కాలక్రమంలో న్యాయవాదిగా రాజమండ్రి ప్రాంతంలో పలుకుబడి, బలగం గల వ్యక్తిగా ఎదుగుతారు. అయితే, వీరి బంధువైన పోలూరి శ్రీరాములు జిల్లా మున్సిఫ్ మేజిస్ట్రేట్‌గా పదవిలోకి వచ్చాక, ఇద్దరూ కలిసి తీర్పులకు ఆయా సెక్షన్ల సంఖ్య చెప్తూ, ఇరుపక్షాల క్షి న్యాయవాదులు, న్యాయం వేలంపాట పాడుకున్నాక, ఏ సెక్షన్ దగ్గర పాట ఆగిందో, ఆ సొమ్ము రాత్రికి తమకు ముట్టాక , చిత్తుప్రతి తీర్పు తొలగించి, దానిస్థానే మార్చి రాసిన తీర్పులను చెప్తూ న్యాయవ్యవస్థకి చేటు తెస్తున్నారని విని, వివేకవర్ధని పత్రికలో ఈ విషయం రాస్తారు వీరేశలింగం గారు.

ఇదే తెలుగు పాత్రికేయ చరిత్రలో 1870–1880 కాలంలోనే బహుశా తొలి ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం అని చెప్పవచ్చు. ఈ కేసులో ఎలాగైనా సాక్ష్యాల సేకరణ కోసం, శ్రమించి, చివరకు, శ్రీరాములుకి సహాయపడుతున్న చిత్రపు కామ రాజు, తాను చిత్తుప్రతులు రాస్తూ, ఏదో ఒకబేరం కుదిరాకా, వాటిని చింపి చిత్తుబుట్టలో పారేస్తున్న సంగతి, ఆ చిత్తుబుట్టలో కాగితమ్ముక్కలు ఎక్కడ పారబోస్తున్నదీ, ఆరా తీస్తారు. వాటిని ఆ చెత్త పారేసే చోటు నుంచి, మెల్లమెల్లగా రెండు మూడుబస్తాలు సేకరించాక, ఆ ముక్కలను జతకూర్చి, కామరాజు రాసిన మొదటి తీర్పుల నమూనాలు తయారు చేసి, వీరిని కోర్టులో ఎదుర్కొంటారు కందుకూరి. ఈ పరిణామం ఊహించని శ్రీరాములు, కామరాజు, పెద్ద ఎత్తున ధనం ఇచ్చి వీరివద్ద ఉన్న ఆ చిత్తుకాగితాల బస్తాలను కొనే యాలని ప్రయత్నం చేస్తారు. అదీచాలక, ఒకసారి చిత్తు కాగి తాలు కొనుక్కునే వాడిని పంపించి, వీరేశలింగం ఇంటలేని సమయంలో, ఆ చిత్తు కాగితాలను కొనేసి, తగులబెట్టిస్తారు.. అయినా, తాను, తన మిత్రులు ఎర్చి కూర్చిన కొన్ని ప్రతుల ద్వారా, సెటిల్ అయిన కేసుల, అసలు తీర్పులు మొదట ఎలా ఉండేవో, తరువాత ఎలా మారేవో, చెప్పడానికి, కొన్ని అందరికీ తెలిసిన సాక్ష్యాలు, అలాగే, చివరికి తనమిత్రులకు సైతం చెప్పకుండా తాను దాచి ఉంచిన తొలితీర్పుల ముక్కలు అన్నీ అంటించిన నకళ్ళు సిద్ధం చేసుకున్నారు కందుకూ రి. కేసు నుంచి వెనక్కు తగ్గిపోమ్మని, ఆ రోజుల్లోనే అయిదు వేల రూపాయలు ఇస్తామని కందుకూరికి రాయబారాలు, వర్తమానాలు వస్తాయి. కొన్ని సందర్భాల్లో వస్తారనుకున్న సాక్షులు రాకపోవడం, కొందరు వారిచ్చిన ధనం తీసుకుని తమ సాక్ష్యం తారుమారు చేయడం, ఇవన్నీ ఓ పక్కనుంచి జరుగుతూనే ఉంటాయి. చివరికి కోర్టుకి సమర్పించబడిన తీర్పుల సాక్ష్యాల కాగితాలు కూడా, ముందుగానే ఏర్పాటు చేసిన పథకం ద్వారా, కోర్టు శిరస్తాదారు రోజారియో దొర కార్యాలయంలో దొంగలు పడి, ఎత్తుకెళ్లడం దాకా వెళ్తుంది. ఈ వ్యవహారంలో చేతులు కలిపిన శిరస్తాదారు రోజారియో దొర, ఉద్యోగం కోల్పోగా, కేసు స్పష్టంగా తనకు వ్యతిరేకం అని ఊహించిన కామరాజు ఆత్మహత్య చేసుకోగా, లంచగొండిగా తీర్పులిచ్చిన శ్రీరాములు కూడా కొన్నినాళ్ళకు చనిపోవడం జరిగింది. ఇది ఆత్మహత్యేనని లోకులమాట. ఇలా తొలి పరిశోధనాత్మక జర్నలిస్టుగా, కోర్టుకు సైతం వెళ్లి, తన పత్రికలో వచ్చిన రిపోర్టు పక్షాన నిలబడి, సంచలనం సృష్టించిన పాత్రికేయుడు కందుకూరి. ఈ సంఘటననే శ్రీశ్రీ, 'వీరేశలింగం చిత్తు కాగితాల బుట్ట సంగతి వినే ఉంటారు' అని ప్రస్తావన చేస్తారు, తాను రాసిన 'అనామిక' అనే కథలో. ఇదే దృ శ్యాన్ని తరువాత కొన్ని మార్పుల తో వాడుకున్న తెలుగు సినిమా లున్నాయి.

చంపారన్ న్యాయస్థానంలో గాంధీ ఎలా తన కేసు తానే వాదించుకుంటూ, జూర్మానా కట్టనిరాకరిస్తాడో, అ లా కందుకూరి కూడా, ఒకవార్త ప్రచురించాక కోర్టుకి సమన్లు వచ్చి వెళ్లవలసివచ్చినప్పుడు, న్యాయస్థానంలో ఈ వార్త మీరే రాశారా అని జడ్జి అడగగా, 'మీకు సమాధానం చెప్పడానికి ముందర, ఏ ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం మీరు నాకీ ఆజ్ఞాపత్రిక పంపారో చెప్పమని' ప్రశ్న వేస్తారు. అది నమో దు చేసి, జడ్జి, 'ఈ పత్రికను మీరే నడుపుతున్నారా?' అని ప్రశ్నవేయగా, 'నేను అడిగిన దానికి మీరు జవాబు చెప్ప లే దు, కనుక ఈ ప్రశ్నకు నేను జవాబు చెప్పడానికి బద్ధుడనా కాదా?' చెప్పమని తిరిగి ప్రశ్నిస్తారు కందుకూరి. జవాబు ఇ వ్వాల్సిన బాధ్యత ఉన్నదని జడ్జి చెప్పారు, 'అలా అయితే, బద్ధుడ్ని కాకపోతే జవాబు చెప్పుట నాకిష్టము లేదు' అని వీరే శలింగం పలుకగా, 'మిమ్మల్ని అట్టేసేపు ఉంచుట నాకిష్టము లేదు' అన్నది జడ్జి వ్యాఖ్య, 'సంతోషము' అని బయట కొస్తారు కందుకూరి. దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత గాంధీ అమలుచేసిన సహాయ నిరాకరణ లాంటిదే, అనంగీ కారంతో కూడిన స్పష్టమైన ధోరణి–కందుకూరి పంథా కూడా. వీరేశలింగం వ్యక్తిత్వం తెలియాలీ అంటే వీటిని సరైన కోణంలో నేటితరాలకు పరిచయం చేయాలి. కందుకూరి నడిపిన వివేకవర్ధిని, ఆ రోజుల్లో సరైన చదువులు లేకుండా, డిగ్రీలు కొనుక్కుని న్యాయవాది పట్టాలు పొందినవారి సంగతి, అలా ధనానికి పట్టాలు ప్రదానం చేసిన వైనం రాస్తే, ఆ కొత్తప్లీడర్లు, ఆ పట్టాలకు దూరమైపోయారు. వేశ్యలకు పెళ్లిళ్లలో చదివింపులు (వసూళ్లు అంటారు) కూడదు అని వివేకవర్ధిని పేర్కొన్నది. ఒకవేశ్యకు ఒక న్యాయవాది కన్నెరికం చేయగా, ఆ విషయం బయటపెట్టిన పత్రిక వివేకవర్ధిని. పత్రిక కోసం పనిచేసే సబ్‌రిపోర్టర్ (ఉపవిలేఖరి) సిబ్బందికి వ్యక్తిగత ఇబ్బందులు కలగకుండా, ఆ ఇబ్బందులు ముందు తనతోనే మొదలు కావాలని ముందు నిలబడిన జర్నలిస్టు, ఎడిటర్, పబ్లిషర్ కందుకూరి. కందుకూరి 'గద్య తిక్కన'గా పేరొందినా, కొంత కవిత్వం కూడా రాశారు, అవి పద్య నాటకాల రూపంలో ఉన్నాయి. అలాగే 1874 ప్రాంతంలో ధవళేశ్వరంలో మిత్రుల కోరిక మీద అష్టావధానం కూడా చేశారు. ఇదిపెద్దగా ప్రచారంలోకి వచ్చి, నలుగురికీ తెలియకుండానే జరిగిపోవడంతో, మరొకసారి చేయవలసిందని మిత్ర మండలి, పెద్దలు కోరగా, కందుకూరి ఒకటి రెండుసార్లు రాజమండ్రిలో అష్టావధానాలు చేశారు. 'బ్రాహ్మవివాహము' అనే నాటకాన్ని కందుకూరి దురాచారాలకు వ్యతిరేకంగా రాశారు. అలుపెరుగని వితంతు కళ్యాణ దీక్షా తరంగంగా, మహిళాభ్యుదయ చేతనాతురంగంగా, ఆచార పర్వతాలను ఢీకొన్న ప్ర బుద్ధ మాతంగంగా వీరేశలింగం ఎదిగిన తీరు నిరుపమానమైనది.

సరళీకరణ–సంకలనం
◆ రామతీర్థ
98492 00385

• కవర్ స్టోరీ

27 మే, 2019
కందుకూరి శతవర్ధంతి సందర్భంగా

తెలుగునాట సంస్కరణలకు ఆద్యులు వీరే..
తొలి వితంతు వివాహాన్ని జరిపించింది వీరే..
తెలుగు సాహిత్యాన్ని వాడుక భాషలోకి తెచ్చింది వీరే..
తెలుగు భాషలో తొలి నవల రాసినది వీరే..
తెలుగులో పరిశోధనాత్మక పాత్రికేయానికి ఆద్యులు వీరే..
తెలుగు జాతికి నవయుగ వైతాళికులు వీరేశలింగమే...

వీరే



కందుకూరి వీరేశలింగం తెలుగు జన జీవన గొదావరిలో లేచి నిలిచిన అభ్యుదయ ఆది శిఖరం. ఏడు కొండలున్న తెలుగు వారికి ఎనిమిదో కొండలా తాను భాసిల్లాడు. పందొమ్మిదో శతాబ్దంలో భూస్వామ్య యుగ లక్షణాల ప్రపంచం, మరింత ప్రజా చైతన్య దాయకం అయిన పారిశ్రామిక యుగం దిశగా అడుగులు వేస్తున్నది. 1852, 1854 ప్రాంతాలలో బ్రిటిష్ పాలిత భారతదేశంలో మొదలైన రవాణా, వార్తా సౌకర్యాలుగా, రైలు బళ్లు, తపాలా శాఖ వంటివి యావద్దేశాన్ని కలుపుతున్నాయి. పూటకూళ్ల ఇళ్లు వెలుస్తున్నాయి. అంతవరకూ గ్రామీణ జీవనంలో ఉన్న యువతకి, ఆంగ్ల చదువులతో మంచి ఉద్యోగాలు దొరుకుతున్నాయి. ఇవన్నీ ఏర్పడడానికి ముందే, ఇంకా కచ్చితంగా చెప్పాలీ అంటే, 1857 మొదటి స్వాతంత్ర్య పోరాటానికి తొమ్మిదేళ్ల ముందే కందుకూరి వీరేశలింగం పుట్టుక. పేరు బాగా స్థితిమంతులైన తమ తాతగారిదే. వారి ఇల్లు ఒక వీధిలో గుమ్మం ఉంటే, మరొక వీధిలో పెరటి గుమ్మం ఉండేంత విశాలం.

బాల్య యవ్వనాలు - తొలి నాళ్ళ జీవితం

తల్లి పున్నమ్మ, తండ్రి సుబ్బారాయుడు. చిన్నతనంలోనే తండ్రి చనిపోగా, పెదతండ్రి పెంపకంలో పెరిగారు. బాల్య వివాహాలను తాను పెద్దయ్యాక వ్యతిరేకించినా, ఆయనకు పదమూడో ఏటనే అద్దంకి వారి తొమ్మిదేళ్ల అమ్మాయి బాపమ్మతో పెళ్లి జరిగింది. వీరేశలింగం గారి తల్లి ఆధునిక స్వభావం, ఎటువంటిది అంటే, బాపమ్మ అనే పేరు కన్నా రాజ్యలక్ష్మి అన్న పేరు తన కోడలికి బాగుంటుందని, అలా పేరు మార్చిన అత్తగారు. వీరేశలింగం చదువు అంతా వీధిబడుల్లోనే నడిచింది. ఇంటినిండా, తాత వీరేశలింగం అప్పట్లో ప్రత్యేకంగా వ్రాయసగాళ్ళచే రాయించి పెట్టిన తాటాకు గ్రంథాలుగా ప్రాచీన సాహిత్యం చూరుకి వేలాడదీసి భద్రంగా దాచిన మూటల్లో ఉండేది. ఇలా తమ ఇంట ప్రాచీన సాహిత్యం ఉండేదని, 1873లో తాను రాసిన 'రాజశేఖర చరిత్రము'లో మూడు పేజీలకు పైగా వర్ణించిన రాజశేఖరుని గృహం, తమ ఇల్లే అని తన 'స్వీయ చరిత్ర'లో చెప్తారు. ఈ పుస్తకాలన్నీ చిన్నప్పుడే తమ ఇంటికి వచ్చే పౌరాణికుల సహాయంతో చదివేసిన బాల కందుకూరి ఏకసంథాగ్రాహి. చదివినది బాగా గుర్తు పెట్టుకుంటారు.

తమ ఇంట ఉన్న గ్రంథాల్లో 'వసుచరిత్ర' లేదని, అది తను చదువుతానని తల్లి పున్నమ్మని అడుగుతారు ఒకసారి. ఆమె తెలివైన మహిళ కావడంతో, కొడుకుని ఒక ప్రశ్న వేస్తుంది. 'నాయనా, ఆ గ్రంథం నీకు పాఠ్య పుస్తకమా?' అని. కాదని చెప్తారు. మరి రెండు రూపాయలు పెట్టి ఇప్పుడా పుస్తకం కొనడం ఎందుకని ఆమె అందుకు అంగీకరించదు. ఆ రోజుల్లో తల్లి, బాల వీరేశలింగానికి నెలకు అర్ధరూపాయి జేబు ఖర్చుగా ఇచ్చేది. ఎలాగైనా 'వసుచరిత్ర' చదవాలి అన్న పట్టుదల గల బాల కందుకూరి, ఆ పుస్తకాల షాపు యజమానితో, తను నెలకు అర్థ రూపాయి ఇస్తాను అని, బదులుగా ఆ పుస్తకాన్ని ఇక్కడే షాపులో కూచుని చదువుకునేందుకు అనుమతించాలని కోరి, ఆ పని చేస్తూ ఉంటారు. ఇలా షాపులో కూచుని 'వసుచరిత్ర' చదువుతున్న సంగతి, తను, తన స్నేహితులు ఇంట్లో తెలీనివ్వరు. కానీ కొన్నాళ్ళకు, కొడుకు స్కూలుకి సరిగా వెళ్ళడం లేదన్న సంగతి తల్లికి తెలిసి, అడిగే సరికి, నిజం చెప్తారు కందుకూరి. తల్లి, అతనికి అప్పుడా పుస్తకం కొని ఇచ్చింది, అలా ఉండేది చదువు విషయంలో కందుకూరి పట్టుదల.

కందుకూరి వారింట, కొన్నేళ్లకు పెదతండ్రి మరణించాక, ఈయనే ఇంటి పెద్ద. ఇంటి వద్ద తమ నాయనమ్మ, అమ్మ, పెద్దమ్మ, తన భార్య నలుగురు స్త్రీలు. నాలుగు భిన్న స్వభావాలు, ఇవన్నీ వీరేశలింగం గారికి చిన్నతనం నుంచే అనుభవంలో ఉన్నాయి. తర్క బుద్ధి, శాస్త్రీయ వివేచన ఏర్పడుతున్న సమాజంలో బాలుడు, యువకుడు కందుకూరి. భూత వైద్యాల మీద తగని గురి వారి తల్లి పున్నమ్మకి. ప్రజారోగ్య వ్యవస్థలు ఏవీ ఇంకా ఏర్పడలేదు, గోసాయి చిట్కా వైద్యాలు, పూతలు, భస్మాలు, రక్షరేకులు, ఇదీ కందుకూరి బతికిన పంధొమ్మిదో శతాబ్దపు సమాజం. ఒకసారి వారి తోటలో అరటిచెట్టు సరిగా బోదె నడుమ గెల వేసింది. అలా వేసిన గెల తింటే ఇంటి యజమానికి అరిష్టం అంటే, వినకుండా, ఆ గెల బాగా ఎదిగాక, రోజూ, ఆ గెల అయిపోయిందాకా, ఆ అరటి కాయలే వండించుకుని తింటూ, పైగా వచ్చే పోయే వారికి అందరికీ, ఈ విషయాన్ని చెప్పి, అటువంటి అరిష్టాలు ఏమీ ఉండవు అన్న శాస్త్రీయ దృష్టిని రోజూ ప్రచారం చేసే వారు. ఇటువంటి సంఘటనల వల్ల తెలిసేదేమిటి అంటే, యువ కందుకూరి వ్యక్తిత్వం, మూఢాచారాల పట్ల ఆయనలో ఏర్పడుతున్న వ్యతిరేకత. తాను కోరంగిలోని ఆంగ్ల పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయునిగా చేరవల్సి వస్తే, సరిగ్గా అమావాస్య రోజునే వెళ్ళి ఉద్యోగంలో చేరుతానని బలవంతం చేసి, అలాగే పంతం నెగ్గించుకున్న యువకుడు కందుకూరి.

ఇవాళ మనం సీవీ రాసి ఉద్యోగాలకు దరఖాస్తుగా పంపుతున్నాము. అలానే అప్పట్లోనే ఒక పద్య రూప సీవీ రాశారు యువ కందుకూరి. వారి ఆత్మవిశ్వాసానికి ఇది ప్రతీక. ''వివేక వర్ధని'' ప్రారంభ సంచికలో ఇది అచ్చు వేశారు పాతికేళ్ళ కందుకూరి. దీనికి అనుగుణంగానే వారి సాహిత్య, సాంఘిక జీవితం గడిచింది.

''బ్రాహ్మణుడను హూణ భాష నేరిచి యందు
నే బ్రవేశ పరీక్షనిచ్చినాడ
నాంధ్రమున నొకింత యభిరుచిగలవాడ
దేశాభివృద్ధికై లేశమైన
బ్రాలుమాలక పాటుపడ నిచ్ఛ గలవాడ
గవితా పటిమ కొంత గలుగువాడ

సంరక్షణ సూత్రాలు, కవుల చరిత్ర, జీవిత చరిత్ర, సాహిత్య విమర్శ, చిన్నయ సూరి రచించిన సంధి, విగ్రహము, వ్యాకరణం సరళ తెలుగు సేత, దేశ చరిత్రలు, తెలుగు వాచకాలు, లక్షణ గ్రంథాలు, శాస్త్రీయ విషయ రచనలు – ఎటు చూసినా కందుకూరి ఆలోచన, ఆధునికత, అభ్యుదయ ముద్రలు కనిపిస్తాయి.

కందుకూరి - గురజాడ

నాటక సాంఘిక వచనానికి ఆద్యులుగా గురజాడని స్వీకరించడం చేయాల్సి ఉంది. వచన నవలా రచనలో కందుకూరి 1883కి రాసిన సత్యవతీ చరిత్రంలోనే చెప్పికోదగ్గ వ్యవహారిక భాష ఉందని, మనం ఇప్పుడు చెప్పాలి. అంతకు పదేళ్ల ముందరే వెలువడిన , కందుకూరి వారి సాంఘిక నాటకాలు అయిన 'బ్రాహ్మ వివాహము లేదా పేరయ్యగారి పెళ్లి'లో గానీ, 'వ్యవహార ధర్మ బోధిని'లోని సాంఘిక నాటక వచనాన్ని, అలాగే సాంఘిక నవలల్లో (ముఖ్యంగా 1883 నాటి సత్యవతీ చరిత్రములో కందుకూరి భాష) వీటిని మనం సక్రమంగా పరిశీలిస్తే, 1940ల నుంచీ మనం ఏర్పరచుకుంటూ వచ్చిన గురజాడ అంటే సాహిత్య ఆధునికత, కందుకూరి అంటే సాంఘిక సంస్కరణ అన్న మూస ఆలోచన పద్ధతులు అంత సరైనవి కావు అని తెలుస్తుంది.

ఇక గురజాడ వారికి కందుకూరి పట్ల గౌరవ భావం ఉన్నది. అందుకే కన్యాశుల్కం నాటకం మొదటి అంకంలోనే వెంకటేశం వేసంగి సెలవుల్లో చదువుకోవడానికి ఉపవాచకంగా 'రాజశేఖర చరిత్రము' గిరీశం డిక్టేషన్ ఇచ్చిన పుస్తకాల జాబితాలో ఉంటుంది. ఇక వీరయ్య గారు, రాజమండ్రంలో వితంతువుల మఠం, వంటి ప్రస్తావనలు కూడా గురజాడ నాటకంలో కనిపిస్తాయి.

1892 కన్యాశుల్కం నాటకం కన్నా ముందరే, కందుకూరి వారి బ్రాహ్మ వివాహము, అలాగే కోర్టు కెళ్లే న్యాయవాదుల వంచనా వ్యవస్థను వ్యవహార ధర్మ బోధిని (1879–80)లో స్పష్టమైన వ్యవహారిక భాషలో చెప్పారు కందుకూరి. నిజానికి, కందుకూరి రాసిన బ్రాహ్మ వివాహము, వ్యవహార ధర్మబోధిని నాటకాలలోని ఘట్టాలే, కొంత కలిసిపోయి గురజాడ సృజనలో కొత్త వెలుగులతో, కన్యాశుల్కం నాటకంలో కనిపిస్తాయి. 'ఆబోరు' వంటి మాటలు ఇద్దరి నాటకాల్లోనూ ఉన్నవి. (ఈ మాటకి అర్థం చాలాకాలం ఎవరూ చెప్పలేక పోయారు. ఇది 'ఆబ్రూ' అనే హిందూస్తానీ మాట, దీని అర్థం ప్రతిష్ట, గౌరవం అని). ఒకప్పుడు నవాబులు పాలించిన దృష్టాంతాలుగా, భారత దేశపు అనేక భాషల్లో మనకు హిందూస్తానీ పదాలు ఇలా కలిసిపోయి కనిపిస్తాయి. గోదావరి జిల్లాలు, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాల్లో ఈ వాడుక ఇప్పటికీ ఉన్నది.

కావ్యవాది - కార్య వాది కందుకూరి

ఈ రచనలు జరుగుతున్న కాలానికే, పసితనంలో ఆడపిల్లల పెళ్లిళ్లు, ముసలి భర్తలు కొద్ది కాలంలో చనిపోవడంవల్ల సమాజంలో ఏర్పడే బాల వితంతువుల సమస్య కందుకూరి వారి మనసులో ఒక పరిష్కారం దిశగా రూపం తీసుకుంటున్న సంగతి తెలుస్తుంది. రచనా రూపంగా సంస్కరణ కోరడం వీరేశలింగం గారి స్వభావంలో ఒక భాగం మాత్రమే. అసలు విషయం కార్యాచరణ. 1879 సంవత్సరంలో ఆగస్ట్ 3, అక్టోబర్ 12 తేదీల్లో, రాజమండ్రిలో గల విజయనగరం మహారాజావారి బాలికా పాఠశాలలో, ''అతి



బాల్య వివాహము'' విషయంపై పిల్లల వయసు రీత్యా ఎందుకు చేయకూడదో చెప్పడమే కాక, అవి శాస్త్ర సమ్మతం అని చెప్పే వారికి, కాదు అంటూ, ఆ శాస్త్రాల నుంచే ఎన్నో ఉదాహరణలు చూపి, ఛాందస సమాజానికి గొంతులో వెలక్కాయ పడ్డ ప్రసంగం చేశారు, ముప్పైఒక్కేళ్ళ కందుకూరి.

ఈయన కేవలం భావ విప్లవం మాత్రమే కాకుండా, ఆచరణ శీలి కూడా కావడం వల్ల సంస్కరణ ప్రణాళిక వేగం పెరిగింది. ఇదే 1881లో కందుకూరి రాజమండ్రి ఇన్నీసు పేటలో బాలికా పాఠశాల స్థాపించారు. ఒక నాటక సమాజం మొదలు పెట్టి, అంతకు ముందు ధార్వాడ నాటక సమాజం వారు ప్రదర్శించిన చోటనే, 'చమత్కార రత్నావళి' రచించి, ప్రదర్శనలు చేయించారు. తెలుగు ప్రాంతాల్లో తొలి నాళ్ల నాటక ప్రదర్శనల్లో ఇవి భాగం. ఇదే ఏడాది డిసెంబర్ 11న కందుకూరి తమ మిత్రులతో కలిసి, దక్షిణ భారత దేశంలోనే తొలి వితంతు వివాహం చేశారు. సానుకూల భావనలున్నా, మదరాసు అంటే ఉమ్మడి మదరాసు రాష్ట్ర రాజధానిలో కూడా, వితంతు వివాహం జరిపించే సాహసం ఎవరికీ లేదు. అటువంటి పరిస్థితుల్లో, సంఘ సంస్కరణ గోదావరిగా రాజమండ్రిని, యావత్ దక్షిణ భారత దేశానికే మార్గదర్శకంగా నిలిపారు కందుకూరి. వారి పట్టుదల, చిన్నప్పుడు తల్లి వీలు కాదన్న పుస్తకం ఎలా అయినా చదివినట్టే, వద్దన్న అరటికాయలు మొత్తం గెల అంతా తానే తిన్నట్టే, ఈ వితంతు వివాహాల విషయంలో కూడా వారిది అంతే మంకు పట్టు.

బాల్య వివాహాలు చేయవచ్చు, వితంతు వివాహాలు చేయరాదు అనే సంప్రదాయ సమాజానికి వాదానికి వాదంతో, వేదాలు, పురాణాలు, స్మృతులు, శ్రుతుల నుంచే ఎలా ఈ బాల్య వివాహాలు కూడదో, వితంతు వివాహాలు సంప్రదాయ సమ్మతమో చెప్పడంలో, కందుకూరి, అక్కడ బెంగాల్ సమాజంలో, మన తెలుగు నాటకన్నా దశాబ్దాల ముందే ఈ వివాహాలు జరిగినప్పుడు, అక్కడ రాజా రామ్‌మోహన్ రాయి, ఈశ్వర చంద్ర విద్యా సాగర్ వంటి వారు ఉదహరించిన భారతీయ ప్రాచీన రచనలైన మనుస్మృతి, పరాశర స్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి నుంచి ఉదాహరణలు ఇచ్చారు.

ఇంత మౌలిక ప్రతిఘటన ఓ పక్క జ్ఞానపరంగానూ, మరోపక్క ఆచరణపరంగానూ ఎదుర్కోవడం, తెలుగు సంప్రదాయ సమాజానికి సాధ్యం కాలేదు. మొదటి వితంతు వివాహం జరిగిన మూడు రోజులకే రెండో వితంతు వివాహం, మూడో వివాహం అక్టోబర్ 1882లో జరిపిన కార్య ధీర శూర వీరేశలింగం, ఏ మహారాజో, సేనానో, యుద్ధ వీరుడో కాదు, కేవలం సామాన్య తెలుగు పండితుడు. అదీ మనం ఇవాళ చూస్తున్న చిత్రంలోని వయసుమళ్లిన మనిషి కారు–తను ముప్పై మూడేళ్ళ నిండు యవ్వనుడు. అక్షర వ్యూహాలు పేర్చి, సమాజ దుష్ట శక్తులను ఎదుర్కొన్న సాంఘిక పోరాట తంత్రజ్ఞుడు.

రాజ్యలక్ష్మమ్మ గారి సహచర్యం

ఈ సాంఘిక పోరాటంలో, భర్తకి తగిన భార్య రాజ్యలక్ష్మమ్మగారు. తన భర్త చేస్తున్నది సమాజ హితం కోసం అని ఎరిగిన ఆమె బంధువుల బెదిరింపులు, బహిష్కారాలు, ఆంక్షలు లక్ష్య పెట్టలేదు. ఆమె పట్ల కందుకూరి వారికి చాలా గౌరవం. జీవితకాల కృషిలో అడుగులో అడుగు వేసి నడిచిన వీరిద్దరికీ పిల్లలు లేరు. ఆయనకి అన్నివిధాలా దన్నుగా నిలిచిన రాజ్యలక్ష్మమ్మ 1910లో కన్ను మూశారు. అది వీరేశలింగం గారికి తీరని నష్టం. ఆమె సమాధి తన సమాధి కన్నా ఎత్తుగా ఉండాలని అలా కట్టించి, అక్కడ ఆమెకి ఇష్టమైన పూల మొక్కలు పెంచిన ప్రేమపూర్ణుడు కందుకూరి. తన స్వీయ చరిత్రను ఆయన ఆమెకే అంకితం ఇచ్చారు. ఆ అంకిత రచన చాలు ఆయన హృదయంలో ఆమె స్థానం ఏమిటో తెలియచెప్పడానికి. (వారి చేతి రాత లోనే దీనిని పొందు పరుస్తున్నాను).

''నేను చేసిన సమస్త ప్రయత్నములలోను
ఛాయ వలె నాతోడ ఉండి నన్ను
ప్రోత్సాహపరచుచు
ధర్మ మార్గానుసరణమునందు నా తోడ గూడ
సకల కష్టములను సంతోషపూర్వకముగా
సహించుచు
సత్యమైన సహధర్మచారిణియయి
తల్లి బిడ్డకు వలె నవ్యాజానురాగము తోడ
సహస్ర హస్తములతో సదా నాకు
సంరక్షణము చేయుచు
ఏబది సంవత్సరముల కాలము
నా ప్రాణమునకు ప్రాణమయి యుండిన
నా యర్ధాంగ లక్ష్మి యైన రాజ్యలక్ష్మికి
దీనిని నేనంకితము చేయుచున్నాడను''

జాతీయ సాంఘిక సంస్కరణ మహాసభలు

1885లో జాతీయ కాంగ్రెస్ ఏర్పడినాక, సాంఘిక సంస్కరణ, రాజకీయ స్వాతంత్ర్యం కన్నా ముందే అవసరం అన్న చైతన్యం దేశం ఎల్లెడలా ఏర్పడసాగింది. ఇలా అఖిల భారత సాంఘిక పరిస్థితులు చర్చించిన జాతీయ సంస్కరణ మహాసభలు 1889లో మొదలై, దేశంలో పలు ముఖ్య నగరాలలో జరుగుతూ వచ్చాయి. జస్టిస్ మహదేవ్ గోవింద్ రనడె, జస్టిస్ కె. టి. తెలాంగ్, బాబు నరేంద్రనాథ్ సేన్, డా. మహేంద్రలాల్ సర్కార్, జి.ఎస్. ఖర్పడే, జస్టిస్ ఎస్. సుబ్రహ్మణ్య అయ్యర్ , ఆర్.జి.భండార్కర్, రావుబహదూర్ వామనరావు ఎం. కోలాత్కర్, రాయ్ బహదూర్ లాలా బైజ్ నాథ్, మన్‌మోహన్ ఘోష్, జస్టిస్ ఎం..జి. చందావర్కర్ వంటి జాతీయ స్థాయి సంస్కరణరంగ

నోపిక సర్వ జనోపయోగములైన
విషయమ్ములను, నీతి విషయములును
సులభ శైలి నందరకు తెలియునట్టు
కఠిన సంధులు లోనుగా గలవి విడిచి
వ్రాయుదు నొక్కప్పుడన్య దేశీయములను
లోనుగా గల వానిని బూని గూర్తు''

తమ ఇంటి దగ్గరి గోపాలకృష్ణ స్వామి ఆలయ విరాట్ పేరిట , వేణుగోపాల శతకము, మార్కండేయ శతకము తన ఇరవై రెండేళ్లకే రాశారు కందుకూరి (ఈ శతకాలు నష్టమై పోయాయి కానీ, వారి 'అభాగ్యోపాఖ్యానం' అనే ఆక్షేప ప్రబంధంలో ఈ శతక పద్యం కొంత భాగాన్ని ఉదహరించారు. కానీ ఇటువంటి రచనల వల్ల ప్రయోజనం ఉండదు అని గ్రహించడానికి ఆయనకు అట్టే కాలం పట్టలేదు. 1873 కాలానికి పాతికేళ్ల కందుకూరి, నవల రాయడానికి పూనుకున్నారు. ఆలివర్ గోల్డ్‌స్మిత్ నవల 'వికార్ ఆఫ్ ద వేక్ ఫీల్డ్' చదివి, దాని అనువాదం చేద్దామనుకుని, చివరికి, కొంత ప్రేరణ ఉన్నా, 1870ల్లో గోదావరి జిల్లాల జీవితం చెప్పే ఒక వాస్తవిక జీవన చిత్రణను రాయడం విశేషం.

కందుకూరి నవల 'రాజశేఖర చరిత్రము'ను ఆయన 1874లో మొదలుపెట్టి నడిపిన ''వివేక వర్ధని'' పత్రికలోనే ధారావాహికగా అచ్చు అయింది. ఆంగ్ల సాహిత్యం బాగా చదువుతున్న కారణంగా, చదివిన పద్ధతుల్లో తానూ రచనా చేయాలన్న అభిలాష సహజంగానే యువ కందుకూరిలో ఏర్పడింది.. దానికి తగిన రచనా ప్రణాళిక, వారి 'రాజశేఖర చరిత్రము'. ఈ నవలలోనే గోదావరి జిల్లాల జీవితం సహజ వర్ణనలతో నడిపారు. తన ప్రవర్ధమాన దశలోనే రాసిన ఈ నవలలో తొలిసారిగా సమాజంలో స్త్రీల దుస్థితి, వారి సమస్యలు, సంప్రదాయ సమాజపు వెనుకచూపు ఇవన్నీ చిత్రిస్తారు. వ్యవహారిక భాషలో 1883లో వారు రాసిన రెండో రచన 'సత్యవతీ చరిత్రము' అనే నవలిక కొంచెం చదువుకున్న అమ్మాయి సత్యవతి రెండో కోడలుగా వస్తే, ఆ గ్రామీణ కుటుంబాలలో వచ్చే మార్పులు, అత్తగార్లు తెచ్చిపెట్టే సమస్యలు చిత్రిస్తూ, ఇలా చిన్న నవలికలో , శాస్త్రీయ దృష్టి, తర్క బుద్ధి చదువుకున్న తరాల వారు స్వీకరించి, ఎలా పాత సమాజంతో సంఘర్షిస్తున్నదీ వ్యవహారిక భాషలో చెప్పిన తొలి కాల్పనిక వచన నవలా రచన.

మన కాలపు ఏ ప్రయాణ సాధనాలు, సమాచార సాధనాలు ఏర్పడని ఒక పాత కాలంలో, ఎంత మన రాజధాని అయినా మదరాసు వెళ్ళి రావడం అంటే, రైలు బళ్లు లేని కాలంలో ఓడ మీద మదరాసు వెళ్లిన పట్టుదల, శ్రమకి ఓర్చుగల స్వభావం గల వాడే అయినా తల్లి చిన్నప్పుడు భూత వైద్యాల పేరిట చేయించిన అనేక స్నానాలు, చిట్కా వైద్యాల వల్ల చిన్నప్పట్నుంచీ అనారోగ్యవంతుడు. మదరాసు వెళ్ళాలి అంటే, పడవ మీద ధవళేశ్వరం నుంచి కాకినాడ వచ్చి, అక్కడ నుంచి మరొక పడవలో కాకినాడ సముద్రం లో ఉండే పెద్ద ఓడ (యాంకరేజి పోర్ట్ అంటారు- అక్కడ సాధారణమైన ఓడ రేవు ఉండదు ఎందుకంటే, కాకినాడ సముద్రం సహజంగా లోతు తక్కువ)లో వెళ్లాలి. మదరాసు వెళ్లడం కోసం తన ప్రయాణ వివరాలు స్వీయచరిత్రలో చెప్తారు. అలాంటి కష్టతరమైన ప్రయాణాల కాలంలోనే విశాల మానవ సంబంధాలు నిర్మించుకున్న బుద్ధి కుశలుడు కందుకూరి.

కందుకూరి వీరేశలింగం, భార్య రాజ్యలక్ష్మమ్మ

రచనా ప్రతిభ - సామాజిక దృష్టి

1900 నుంచి 1917 దాకా మనకు మహా భారత కథను ప్రదర్శన యోగ్య నాటకాలుగా రాయడం ఒక కవిద్వయం వల్ల జరిగింది. వారే తిరుపతి వెంకట కవులు. అంతకు ముందరి తెలుగు మహా భారత ఇతిహాస రచన, చదువుకునే, లేదా చదివి చెప్పే పౌరాణిక పద్ధతికి చెందినది. కవిత్రయం రాసిన చదువుకోదగిన మహా భారత తెలుగు రచన తరువాత, చూసే వారి కోసం మహా భారత నాటక రచనోద్యమం చేసిన కవిద్వయం తిరుపతి వెంకట కవులు, అయితే వీరి ప్రామాణిక కృషికి ముందరే, కందుకూరి, తొలిసారిగా, మహా భారత కథ తీసుకుని ''దక్షిణ గోగ్రహణము'' అన్న నాటకం రాశారు. నాటకాలు రాయడం వీరికి శక్తివంతంగా అలవడ్డది.

గురజాడ, కందుకూరి కన్నా పద్నాలుగేళ్లు చిన్న వారు. పద్నాలుగేళ్ల తరువాత పుట్టి, కందుకూరి కన్నా నాలుగేళ్లు ముందరే కన్ను మూసిన గురజాడ ఆధునిక సాహిత్య వైతాళికత్వానికి ఉదాహరణ అయిన తన 1892 కన్యాశుల్కం నాటకంలో ముందు మాటలోనే కందుకూరి వారి నాటకం (1876-80) బ్రాహ్మ వివాహము లేదా పెద్దయ్యగారి పెళ్లి ని ప్రస్తావించి, ఆ నాటకానికి, తన నాటకానికి పోలికలు లేవు అంటారు. కానీ తొలి కన్యాశుల్కం వరకూ చూస్తే, ఇద్దరికీ సమాన దృష్టి వేశ్యా వ్యతిరేకత. వేశ్యలు ఉండకూడదు అన్నది కందుకూరి జీవితకాల దృష్టి, అయితే వేశ్యలు సంఘంలో ఏర్పడే క్రమాన్ని మార్చే శక్తి వారికి లేదు. ఆ వృత్తిలో స్త్రీలు ఉండరాదు అన్నది వారి దృష్టి కాగా, మొదటి కూర్పు కన్యాశుల్కంలో ఇంచు మించు గురజాడ దృష్టి కూడా అదే.

ప్రసంగాలు, ప్రదర్శన రచనలుగా, నాటకాలు, ప్రహసనాలు, తన సొంత రచనలే కాక ప్రాచీన భారతీయ, పాశ్చాత్య సాహిత్యం నుంచి కూడా అనువాదాలు చేసిన తీరిక లేని రచయిత కందుకూరి. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలం, శ్రీ హర్షుని రత్నావళి, షేక్స్పియర్ నాటకాలు, షేక్స్పియర్ నాటకాలకు చార్లెస్ అండ్ లాంబ్ దంపతులు కథలుగా రాసిన వాటికి తెలుగు అనువాదాలు, ఆర్. బి. షెరిడన్ నాటకాలు, విలియం కౌపర్ కవిత్వం, జొనాథన్ స్విఫ్ట్ గలివర్ ట్రావెల్స్ ఆధారంగా సత్యరాజా పూర్వ దేశ యాత్రలు, జాన్ అక్సేన్ ఫర్డ్, చార్లెస్ షెల్బీ కామెడీ నాటికలకు ప్రహసన రూప తెలుగు అనువాదాలు, సంప్రదాయ ధిక్కారం చేసే అభాగ్యోపాఖ్యానం, సరస్వతీ నారద విలాపము, మహారణ్య పురాధిపత్యము, ఏసప్ కథలు, ఇలా ఇటు భారతీయ, అటు ప్రపంచ సాహిత్య చదువరిగా, రచయితగా కందుకూరి సృజన, ధారణ, పాండిత్యం అపారం. ఆధునిక తెలుగు వచన వికాసానికి పలు రంగాలలో పునాదులు వేసిన కారణంగా, కందుకూరి వారిని, పింగళి లక్ష్మీకాంతం గారు గద్య తిక్కన అని పిలిచారు. పద్యానికి పదమూడో శతాబ్దంలో తిక్కన చేసిన విశేష సేవ పదిహేను పర్వాల మహాభారతంలో వేల పద్యాలుగా ఉన్నది. మళ్లీ అయిదు వందల ఏళ్ల తరువాత, పంతొమ్మిదో శతాబ్దంలో అవసరమైన వచన రచనా (సాహిత్య, సామాజిక, పత్రికా, వ్యవహారిక, నాటక రంగాలలో) వికాసానికి అంతటి కృషి చేసిన వారిగా కందుకూరిని ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గౌరవించి ఇలా సంబోధించారు.

అందుకే, వందకు పైగా వారి సమగ్ర రచనల్లో పద్య కావ్యాలు, అనువాద పద్య కావ్యాలు, నాటకాలు, ప్రహసనాలు, ఆంగ్ల నాటకానువాదాలు, నవలలు, కథా రచన, పత్రికా నిర్వహణ, వ్యాసాలు, ఆరోగ్య

వీరేశలింగం జన్మగృహం

తన పేరుతోనే నిర్మించిన గృహంలో రాజ్యలక్ష్మి స్త్రీలకు గ్రంథాలయం, ప్రార్థనా సమాజం నిర్వహించేవారు.

వీరేశలింగం తొలి వితంతు వివాహం జరిపిన ప్రదేశం.
వరుడు: గోగులపాటి శ్రీరాములు,
వధువు: తిరువూరుకు చెందిన గౌరమ్మ (11-12-1881)

నాయకులు పాల్గొన్నారు. వారితో కలిసి పనిచేశారు కందుకూరి. సోషల్ రిఫార్మ్ కాంగ్రెస్ వార్షిక మహాసభలు 1898లో మద్రాసులో జరిగాయి. ఆ మహాసభలకు అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డ కందుకూరి, మదరాసుకు వచ్చిన తెలుగేతర భిన్న ప్రాంతాల సంస్కరణోద్యమ నాయకులు, ప్రతినిధులను ఉద్దేశించి ఇంగ్లిష్‌లో ప్రసంగం చేశారు. శాస్త్రీయ ఆవిష్కరణల కన్నా, సాంఘిక సంస్కరణ చాలా కష్టమైనది అన్న ప్రధాన అభిప్రాయం ఈ ఆంగ్లోపన్యాసంలో కందుకూరి తెలిపారు. ఇంతవరకూ ఇలా ఒక ఆంగ్ల ప్రసంగం కందుకూరి వారు చేసినది ఒకటి ఉన్నది అన్నది బయటికి రాలేదు. కందుకూరి శతవర్ధంతి కృషిలో భాగంగా, మొజాయిక్ సాహిత్య సంస్థ పరిశోధనలో ఇది లభించింది. ఈ ఏడాదే, కందుకూరి వారి ఈ నూత్న లభ్య రచన, ఆంగ్ల మూలమూ, తెలుగు అనువాదమూ కూడా పత్రికలలో ప్రచురితమయ్యాయి.

సమగ్ర రచనలు - గౌరవాలు

తన యాభై ఏళ్ల వయసుకే, తన సమగ్ర రచనలు, పది సంపుటాలుగా ప్రచురించి, దీని కోసమై మదరాసులో రెండేళ్లు కాలం ఉద్యోగానికి సెలవు పెట్టి గడిపి, ఈ సమగ్ర సంపుటాన్ని ఆ రోజుల్లో పదిహేను రూపాయలకు విక్రయం చేసేవారు ఆయన. తెలుగు పండితుని నెల జీతం ముప్పై రూపాయలు కాగా, తన రచనలు పత్రికల తపాలా ఖర్చులకు అంత సొమ్మూ,



వివేకవర్ధని ముద్రణా యంత్రం

ప్రతి నెలా వారికి ఖర్చు అయ్యేది. 1893కే వారికి రావు బహదూర్ బిరుదు లభించింది. 1898లో 'దక్షిణభారత విద్యాసాగరులు' అని జస్టిస్ రనడె, ఇతర సంఘ సంస్కర్తలు, సోషల్ రిఫార్మ్ జాతీయ మహాసభల్లో కందుకూరి వారికి బిరుద ప్రదానం చేశారు.

తన కాలపు సాహిత్యంలోనే తన ప్రస్తావనలు

1899 నుంచి 1904 వరకూ రాజమండ్రి నుంచి బదిలీ మీద వెళ్లి, మదరాసు ప్రెసిడెన్సీ కళాశాలలో తెలుగు పండితునిగా పని చేశారు. కందుకూరి ప్రస్తావనలు తన కన్యాశుల్కం నాటకంలో గురజాడ వారు చేయగా, తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి, ఏకంగా, కందుకూరి, రాజ్యలక్ష్మమ్మ దంపతులను వారి జీవితకాలంలోనే, సజీవ పాత్రలుగా, తన అసంపూర్తి నవల 'చంద్రిక కథ'లో 1900 ప్రాంతాల్లో రాయడం విశేషం. దీన్ని 1970 ప్రాంతాల్లో తెలుగు సాహిత్య పరిశోధకుడు బంగోరె తన మిత్రులతో కలిసి తెలుగు అనువాదం చేసి అందించారు. ఇలా ఇటు తెలుగు మహాకవి గురజాడ తన కన్యాశుల్కంలోనూ, తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి తన చంద్రిక కథలోనూ వీరేశలింగంగారి ప్రస్తావనలను వారి జీవితకాలంలోనే చేశారు. ఇటువంటి గౌరవం, ప్రపంచ సాహిత్యంలోనే అరుదు.

కడపటి దశ

హితకారిణీ సమాజం ట్రస్ట్ డీడ్ రాయడం, తన యావదాస్తినీ ట్రస్ట్‌కి అప్పగించడం అనారోగ్యం, ముసలితనం, కొన్ని కోర్ట్ కేసులు ఇలా సతమతమవుతూ ఉన్నా, కవుల చరిత్ర ప్రచురణ, వారికి పట్టుదలతో కూడిన లక్ష్యం. ఈ లక్ష్యం కోసం పని చేస్తూనే, వారు వెళ్ళిపోయారు. మదరాసు పరసువాక్కంలో వేదవిలాస్ అని కొమర్రాజు లక్ష్మణరావుగారిల్లు. ఎప్పుడు కందుకూరి వారు మదరాసు వెళ్లినా వారి బస అక్కడే. యువకులైన కొమర్రాజు కూడా తెలుగు సాంఘిక చరిత్రలో చాలా ఆసక్తి గల వారు. కవుల చరిత్ర మూడో భాగం ప్రూఫులు సరి చూస్తూ, కందుకూరి, 27 మే 1919న మదరాసులోనే కన్ను మూశారు. మరణ సమయంలో వారి వద్ద ఉన్నది, మృతి ప్రకటన చేసినది డాక్టర్ అచంట లక్ష్మీపతి. అంత్య క్రియల సమయాన దగ్గర ఉన్నది అప్పటికి యువకులైన కాశీనాథుని నాగేశ్వర రావు, అక్కిరాజు ఉమాకాంత విద్యా శేఖరులు తదితర మదరాసు తెలుగు ప్రముఖులు.

శతవర్ధంతి ఉత్సవాలు

ఇక వర్తమానానికి వస్తే, విశాఖలో మొజాయిక్ సాహిత్య సంస్థ, ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ కల్నల్ ఆచార్య గొల్లపల్లి నాగేశ్వరరావు మద్దతుతో ఈ శతవర్ధంతి ప్రారంభ సభలు గత సంవత్సరం మే 27న పలు రాష్ట్రాల నుంచి వచ్చిన సాహిత్య వేత్తలతో ఒక రోజు సభగా జరిపింది. సాహితీ స్రవంతి రాజమండ్రి, విజయవాడ, విశాఖపట్నం, ఇతర నగరాల్లో కందు

రాజమండ్రిలో కందుకూరి పరిశోధనా కేంద్రం

కూరి వైతాళిక పాత్రకు గుర్తింపుగా శతాధిక సంస్థల సమన్వయంతో భారీ సభలు నిర్వహించారు. చెన్నై తెలుగు వాణి పేరిట, చెన్నైలోని తెలుగు సమాజం ఈ శతవర్ధంతి తమ కర్తవ్యం అని కూడా భావించి, ఈ విశాఖ సభలకు వచ్చిన డా. తూమాటి సంజీవరావు, తమ సంస్థ అధ్యక్షులు తిరునగరి భాస్కర్ తదితర మిత్రులతో కలసి కృషి చేసి, ఈ వర్ధంతి సంవత్సరంలో, పుదుచ్చేరి రాష్ట్ర మంత్రి మల్లాడి కృష్ణారావు, పుదుచ్చేరి ప్రభుత్వం పాక్షిక ప్రోత్సాహంతో, దాదాపు కందుకూరి వారి గురించిన సమాచారం అలభ్యంగా ఉన్న రోజుల్లో, ఏడువందల యాభై పేజీలుగా రెండు పుస్తకాలుగా విస్తృత సమాచారాన్ని అందుబాటులోని తెచ్చారు. వీటిలో మొదటి పుస్తకం చెన్నైలో గత ఏడాది అక్టోబర్‌లో విడుదల కాగా, రెండో పుస్తకం, ఈ ఏడాది మే 25న విడుదలైంది.

ఇక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలకు, లక్ష రూపాయల చొప్పున కందుకూరి శత వర్ధంతి సభలు జరపడానికి నిధులు అందజేసింది. కేంద్ర సాహిత్య అకాడెమీ, విశాఖలో మొజాయిక్ సంస్థ ద్వారా కందుకూరివారి కృషి గురించిన లిటరరీ ఫోరం నిర్వహణకు సహకారం అందించారు. ఈ ఏడాది జూన్ 1న సాయంత్రం ఆంధ్రా యూనివర్సిటీ, మొజాయిక్ సాహిత్య సంస్థ నిర్వహణలో జరిగే శతవర్ధంతి ముగింపు సభలో, విశాఖలో భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారు. రాయన గిరిధర్ గౌడ్ గీసిన చిత్రపట ఆవిష్కరణ, కందుకూరి శతవర్ధంతి చిత్రమాల, సత్యవతీ చరిత్రం ఆంగ్లానువాదం ఆవిష్కరణలు, కందుకూరి ఏకాంకిక 'అపూర్వ బ్రహ్మచర్య ప్రహసనం' ప్రదర్శన ఈ సభలో చోటు చేసుకుంటున్నాయి.

కొత్త అంచనాల అవసరం

స్త్రీల పట్ల తండ్రి ప్రేమతో, తల్లి మనసుతో కందుకూరి తన సమస్త రచనల్లో వారి విద్య, చక్కని పెళ్లి, తల్లి, బిడ్డల భద్రత, సంఘంలో మూఢాచారాల వల్ల వారి అభివృద్ధికి కలిగే అవరోధాల పట్ల ఆగ్రహం, అలాగే భాషకి, భావాలకు శాస్త్రీయత నేర్పిన పునరుజ్జీవన ప్రదాతగా మనం కందుకూరి వీరేశలింగాన్ని దర్శించాలి. కందుకూరి అంటే ఒక సంస్కరణ మూస, గురజాడ అంటే సాహిత్య మూసగా, మనం దాదాపు 1940ల నుంచి ఆలోచనలు చేస్తున్న తీరులో మార్పు అవసరం ఉన్నది. నరహరిసెట్టి గోపాలకృష్ణమ్మగారిలా శ్రీ రంగరాజ చరిత్ర (1872) పేరిట, ఒక నవల రాసిన వారో, కవి జీవితములు (1893) ముందు రాసిన గురజాడ శ్రీరామ మూర్తి గారో, ఏదో ఒక రంగంలో తప్పక కందుకూరి కన్నా ముందుగా అడుగులు వేసి ఉంటారు. ఎందుకంటే, ఇది పలు ప్రతిభలు ఏక కాలంలో పనిచేసే మానవ సమాజం కాబట్టి.

కానీ, కందుకూరి వారిలా, భిన్న రంగాలలో (పద్యం, ప్రహసనం, నవల, అనువాదం, జీవిత చరిత్ర, విద్యాలయాల స్థాపన, మహిళలకు ఆరోగ్య బోధినులు, కవి చరిత్రలు, వ్యాకరణ పరిష్కరణం, తెలుగు, ఆంగ్ల ప్రసంగాలు, పత్రికా రచన, సంపాదక ప్రచురణ కర్త బాధ్యతలు, నాటక ప్రక్రియకు తొలి అడుగులు, తర్క చింతన, శాస్త్రీయ దృష్టి, బ్రహ్మ సామాజికునిగా ఏకేశ్వరోపాసన, భాష ఆధునీకరణ, సాంఘిక సంస్కరణ కార్యాచరణ, తొలి వితంతు వివాహాలు, అంతే కాక ఆంగ్లానువాదం జరిగి లండన్ సమాజం మెచ్చుకున్న తొలి భారతీయనవల 'రాజశేఖర చరిత్రం' (1878లోనే 'ఫార్చ్యూన్స్ వీల్' పేరిట అన్న ఖ్యాతి కూడా వీరిదే) సమాజాన్ని ఇలా సమూలంగా ప్రభావితం చేసిన వ్యక్తులు అరుదు. కందుకూరి వారి సమాజ సంక్షేమకర భావనలకు, ఆచరణకు, వందేళ్ల కాలం గడిచిన సందర్భంలో, నేడు కొన్ని కొత్త సమస్యలు వచ్చినా, అన్ని రంగాలలో వారు ఆశించిన ప్రగతి నెలకొన్నది. అందుకే విజయవంతమైన వారి భావాచరణలకు సమాజం జయమాల సమర్పిస్తున్నది. వారు కన్నుమూసిన ఈ శతాబ్ది కాలంలో, వారికి నివాళి అర్పించని తెలుగు సాహితీవేత్త, సాంఘిక ప్రముఖులు లేరు. అదీ కందుకూరి ప్రజాస్వామిక స్వభావం.

ఆ విధంగా కందుకూరి తన సమూల కార్యాచరణ ద్వారా తెలుగు వారికి పునరుజ్జీవన ప్రదాత. వారి శతవర్ధంతి సందర్భంగా వారు ప్రాతః స్మరణీయులు అని తలచి, రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో వారి అధీకృత (అఫిషియల్) ఛాయాచిత్రాన్ని ఏర్పరచి, విద్యార్థులకు నిరంతర స్ఫూర్తి, అలాగే వారి సర్వ రచనల పునర్ముద్రణ, ఆ రచనలపై జరిగే పరిశోధనలకు తగిన సహాయం అందించే సానుకూల దృక్పథంతో తెలుగు ప్రజలు, ఎన్నికైన ప్రభుత్వాలు పని చేస్తే, ఉత్తమ సామాజిక చైతన్యం నేటి తరాలకు అందడానికి మంచి మార్గం ఏర్పడుతుంది.

- రామతీర్థ

క్లాసికల్ హోదాకు తమిళుల మోకాలడ్డు!

తెలుగు భాషకు ప్రాచీనహోదాపై తమిళ భాషా నిపుణులు పిల్ రూపంలో కుయుక్తితో వేసిన అడ్డుపుల్ల గత ఏడేళ్లుగా కేంద్రం నుంచి మనకు రావలసిన నిధులను అడ్డుకుంటోంది. దీనిపై తెలుగు రాష్ట్రాల తక్షణ స్పందన అవసరం.

సందర్భం

రామతీర్థ



ఏడేళ్ల కిందట తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీన హోదా ప్రకటించింది నాటి కేంద్ర ప్రభుత్వం. దాంతోపాటు, మీకు ఈ హోదా వలన కలిగే లాభాలు అన్నీ, మద్రాస్ హైకోర్టులో విచారణలో ఉన్న ప్రజాహిత వ్యాజ్యం తేలాక మాత్రమే అందుబాటులోకి వస్తాయని షరతులూ తగిలించారు. తమిళులు 2004లోనే తమ భాషకు ప్రాచీన హోదాను ఒక రాజకీయ డిమాండ్‌గా చేసి యూపీఏ–1 ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టి తమ మాట నెగ్గించుకున్నారు. కేంద్రం ఇతర దేశ భాషల విషయంలోనూ ఇలాంటి డిమాండ్లు వస్తాయని గ్రహించి 2014 నవంబర్‌లోనే ఒక భాషా నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. తమిళ భాషకు ప్రాచీన హోదా ప్రకటించే కాలానికి ఆ భాష సాహిత్యానికి వెయ్యేళ్ల ప్రాచీనత ఉంటే సరిపోతుందన్నది ఒక అవగాహనగా ఉండగా, దాన్ని ఇతర భాషల విషయానికి వచ్చేటప్పటికి 1500–2000 సంవత్సరాలు ఉండాలన్న నిబంధన చొప్పించింది కూడా తమిళ సోదరులే. దాంతో మనమందరం కూడా మేము అంత ప్రాచీనులం అంటే ఇంత ప్రాచీనులమని వెదుకులాటలో పడిపోయాం. ఇలా మనల్ని ఒక కృత్రిమ రేసులో దారి తప్పించి, ప్రాచీన భాష హోదా వల్ల తమకు ఉపయోగ పడే అంశాలను సాధించుకునే క్రమాన్ని వారు వేగవంతం చేసుకున్నారు.

నాలుగేళ్ల తర్వాత అంటే 2008 అక్టోబర్‌లో కేంద్రం తెలుగు, కన్నడ భాషలకు కూడా ప్రాచీన హోదా ప్రకటించింది. భాషా నిపుణుల కమిటీలోని తమిళ సభ్యులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ ఈ రెండు భాషలకు ప్రాచీన హోదా ప్రకటనను అడ్డుకోలేము అన్న సంగతి స్పష్టమైపోయి కుయుక్తిపన్నారు. కేంద్రం దీనిపై ప్రకటన చేయడానికి ముందే వారు, తమిళ న్యాయవాది ఆర్.గాంధీ చేత ఒక పిల్‌ని మద్రాస్ హైకోర్టులో దాఖలు చేయించారు. ఆయన ఈ విషయంలో తెలుగు, కన్నడ (2008లో), మలయాళ భాషా (2013లో) సమాజాలకు ప్రాచీన హోదాకు వ్యతిరేకంగా మూడు ప్రజాహిత వ్యాజ్యాలు వేసి ఉంచాడు. ఆయనతో తమకేమీ సంబంధం లేదని తమిళనాడు ప్రభుత్వం తెలివిగా దూరం పాటిస్తోంది కానీ, ఈ చర్య వల్ల ఈ మూడు భాషలూ నేటి వరకూ ఎలాంటి లబ్ధికి నోచుకోలేదు. ప్రాచీన భాష హోదాపై నిబంధనలను ఇతర భాషల విషయంలో కఠినం చేయడంలో కూటనీతికి పాల్పడ్డారు తమిళ సోదరులు. ప్రాచీనతా నిర్ధారణ సంఘంలో తామూ ఉండడం వల్ల తెలుగు, కన్నడ భాషలకు ప్రాచీనహోదాపై కేంద్ర ప్రభుత్వం చేయనున్న ప్రకటనను ముందుగానే గ్రహించి, ఆ ఆంతరంగిక సమాచారాన్ని ముందస్తుగా పిల్ దాఖలు చేసే న్యాయవాదికి అందచేసి ఇతర భాషా సమాజాలకు జరిగే లబ్ధికి అడ్డుపడటం తమిళ సమాజ కుసంస్కారానికి ప్రబల నిదర్శనం. దీనిని తెలుగు, కన్నడ, మలయాళ సోదరులు సమైక్యంగా ఎదుర్కొనగలిగితే వారికి ఒక గుణపాఠం చెప్పిన వారం అవుతాము. లేదా అత్యంత అవమానకరంగా.. కేంద్ర ప్రభుత్వం అందజేసి న ఆర్ట్స్, హ్యూమానిటీస్ రంగానికి సంబంధించిన ఒక ప్రధాన లబ్ధిని సాకారం చేసుకోకుండా ఈ అనవసర వ్యాజ్యంలో ఇప్పటికే ఏడేళ్లుగా ఇరుక్కున్న మనం ఆ లబ్ధిని ఇంకా దూరం చేసుకుంటాం.

కొన్నేళ్ల క్రితం ఈ విషయాన్ని తేల్చమని ఆంధ్ర, కర్ణాటక ప్రభుత్వాలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, నాటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ మద్రాస్ హైకోర్టు ముందున్న పిల్‌లో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ ఈ విషయాన్ని అక్కడే తేల్చుకోవాల్సిందని సూచించారు. అయితే ప్రాచీన హోదా అమలు మాత్రం ఈ కేసు తీర్పుపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఇలా మనం ప్రాచీన హోదా దాని ప్రయోజనాల విషయంలో కోర్టుల వెంబడి తిరుగుతుండగా, తమిళులు తమకు కాగల కార్యాన్ని పూర్తి చేసుకున్నారు. మైసూరులో పనిచేస్తున్న కేంద్ర ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఇండియన్ లాంగ్వేజెస్ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ క్లాసికల్ తమిళ్‌ను 2008లోనే వేరు చేసి తమ రాష్ట్రానికి తీసుకుపోయి ఏటా రూ. 75 కోట్ల ఖర్చుతో కేంద్ర ప్రభుత్వ సంస్థగా నిర్వహించుకుంటున్నారు. మన తెలుగు భాష క్లాసికల్ పరిస్థితి అందరికన్నా ఘోరంగా ఉంది. ఆనాడు పిల్‌పై అప్పీల్ చేసిన అధికార భాషా సంఘం ఇప్పుడు లేదు. రాష్ట్రం కూడా రెండుగా చీలిపోయింది. ఈ పిల్‌కు సంబంధించి అధికార భాషా సంఘం పేరు ఎక్కడా ప్రతివాదుల జాబితాలో లేకపోవడం, దివంగత ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి పేరు నేటికీ ఆ జాబితాలో ఉండటం చూస్తే ఈ కేసులో మన ప్రభుత్వ శాఖల, అధికారుల వైఫల్యం స్పష్టమవుతుంది.

భాషల ప్రాచీనతే ప్రాచీన భాష హోదాకు తప్పనిసరి అనే నిబంధన వెనక్కు వెళ్లాక కూడా ఇంకా మద్రాస్ హైకోర్టులో పిల్స్ పెండింగ్‌లో ఉండటంపై తెలుగు, కన్నడ, మలయాళ భాషా సమాజాల ప్రజలు తమ అభ్యంతరాలు పంపి ఆ వ్యాజ్యాలను రద్దు చేసుకోవాలి. ఈ దిశగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు క్రియాశీలకంగా పనిచేసి తమిళులకు తగు వ్యూహంతో దీటుగా జవాబు ఇవ్వాలి. ఎప్పటికైనా ఫలితం దక్షిణ రాష్ట్రాలకు అనుకూలంగానే వస్తుంది కానీ తమిళ భాషా సమాజం, తోటి దక్షిణ భాషలకు చేసిన ద్రోహం చరిత్రలో నిలిచిపోతుంది. భాషా రాజకీయాలకు తమిళులు పెట్టింది పేరు.

రెండేళ్లకు ఒకసారి తెలుగు మహాసభలు జరుపుకోవడం బాగానే ఉంటుంది కానీ, మన భాషపై పొరుగు వారు అనవసరంగా కాలు పెట్టి తొక్కుతున్న నేపథ్యంలో, తగు స్పందనలు ఇవ్వకపోవడం, ఇందుకోసం ఒక సదస్సు కూడా లేకపోవడం.. ఇవన్నీ మన వైఫల్యాలే. ప్రాచీన భాష అనే మాయాజాలం లోంచి విశిష్ట భాషా చైతన్యంలోకి మనం ఎంత వేగంగా వస్తే అంత మంచిది. జాతి కాలిలో గుచ్చుకున్న ఈ ముల్లును మనం ఎంత వేగంగా తీసివేయగలిగితే అంత వేగంగా మన భాషా ప్రగతి భవ్యపథంలో సాగుతుంది.

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత
మొబైల్ : 9849200385

NEW VISION

Smart Strong వైజాగ్

హరివిల్లులోని ఏడు రంగులు విశాఖలోని పచ్చని కొండలపై ప్రకాశిస్తూ, నగరాన్ని అద్భుతంగా ఆవిష్కరిస్తుంటే అబ్బో అని మురిసిపోయాడు విశాఖ వాసి. హుదూద్ తాకిడితో నివ్వెరపోయాడు. ఇప్పుడు కనిపిస్తున్న వింత ప్రపంచాన్ని చూసి, వినాశనాన్ని చూసి.. చీకట్లలో విశాఖను చూసి కన్నీరు పెట్టుకున్నాడు. ఇప్పటి వరకు విశాఖలో కనిపించిన అభివృద్ధి అత్యంత బలహీనంగా, కూలిపోయేందుకు సిద్ధమైన పేకమేడలా కనిపించింది. దీనిని తనదైన రీతిలో విశ్లేషిస్తున్నారు నగరానికి చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త రామతీర్థ. విశాఖ అభివృద్ధి వెనుక గల అసలు రూపంపై, భవిష్యత్తు విశాఖ నిర్మాణంపై తన ఆలోచనలను ఆయన సిటీప్లస్‌తో పంచుకున్నారు.

ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరమని అంతా చెబుతున్నారు. కానీ పెను తుఫాన్ విశాఖ అభివృద్ధిపై గల భ్రమలను పటాపంచలు చేసింది. అత్యంత బలహీనంగా జరిగిన విశాఖ అభివృద్ధి నిలువునా కూలిపోయింది. అందరి ఆలోచనలను ప్రకృతి ఒక్కసారి తలకిందులు చేసింది. అందమైన విశాఖను ఎన్నో ఏళ్లు వెనక్కు తీసుకుపోయింది. నగరాభివృద్ధి అంటే గాలికి ఆరిపోయే దీపం కాదని, చీకటి గుహలో కాంతులీనే మిణుగురులా ఉండాలని చాటిచెప్పింది. దీనిపై ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది.

ఇదీ పొరపాటు

ప్రజలు, ప్రభుత్వాలు చేస్తున్న ప్రతి పనిలో పొరపాటు ఉంది. అభివృద్ధికి పరుగులు తీస్తూ ఆకాశహర్మ్యాలు నిర్మిస్తున్నారు. పచ్చదనం పేరుతో వేళ్ల బలం, ఒళ్ల బలం లేని చెట్లు పెంచుతున్నారు. బీచ్ పొడవునా అనుమతికి విరుద్ధంగా నిర్మాణాలు కట్టారు. విద్యుత్ స్తంభం పక్కనే వేళ్ల బలం లేని చెట్లు పెంచారు. అందాల కోసం నాణ్యత లేని అద్దాల మేడలు కట్టారు. ఈ అభివృద్ధి విశాఖ వాసులకు అందంగానే కనిపించింది. ఎవరూ ఊహించని విధంగా వచ్చిన విపత్తు విశాఖలో ఇప్పటి వరకున్న అభివృద్ధిని పూర్తిగా తుడిచేసింది. అభివృద్ధిలో కనిపించే లోపాలను అద్దంలా చూపించింది. విపత్తు నేర్పిన పాఠం నుంచి విలువైన నిజాలు తెలుసుకొని బంగారు విశాఖను నిర్మించుకోవాలి.

అందాల విశాఖకు ఇదీ బాట...

విశాఖను తిరిగి నిర్మించుకోవాల్సిన అవసరం ఇప్పుడు ప్రజలు, ప్రభుత్వంపై పడింది. స్మార్ట్‌సిటీకి కచ్చితమైన రూపం ఇచ్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దానికి పునాది బలం, నిర్మాణ బలం, రూప బలం ఉండాలి. విశాఖలో ఇప్పటి వరకు 75 తుఫాన్‌ల వరకు వచ్చాయి. కానీ ఏదీ సిటీపై ఈ స్థాయిలో తన ప్రభావం చూపలేదు. మొదటిసారిగా తుఫాన్ నగరజీవనాన్ని అస్తవ్యస్తం చేసింది. ఇప్పుడు భవిష్యత్తులో స్ట్రాంగ్ విశాఖను నిర్మించుకోవాలి. వీటిలో ముఖ్యంగా చేయడాల్సింది. అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, వేళ్ల బలం కలిగిన మొక్కలు నాటాలి. అదే సమయంలో ఇప్పుడున్న బిల్డింగ్స్ నిర్మాణ సామర్థ్యం మరో మారు పరిశీలించాలి. భవిష్యత్తులో కూడా అతి వేగంగా వీచే తుఫాన్ గాలులను తట్టుకునే విధంగా భవంతుల నిర్మాణం జరగాలి.

అక్షరం

ఇలాగేనా మన స్పందన?

ఆగ్రహించిన అక్షరం రాజ్యాలను తిరగదోసింది. చరిత్ర సునామీలో నిలబడి, తిరగబడిపోయిన రాజ్యాలకు అక్షరం అంత్యక్రియలు పూర్తి చేసింది. ప్రజా కంటక పాలక వర్గాలను శపించింది. మానవ పక్షాన నిలబడి, ఆలోచనల నవ పక్షాలు అందిస్తూ, దైవ శ ంఖలాల నుంచి నిత్యం మానవుడిని విముక్తం చేస్తూ వస్తోంది. ఇదొక రెండు వేల ఏళ్ల నిరంతర ప్రక్రియ. రాజ్యాల చరిత్రలు కాలగర్భంలో కలిసినా, రాసిన మాటలు మిగిలి పోయాయి. అవి మాత్రమే మనం గతాన్ని ఎరిగేందుకు దక్కిన ఆధారాలు. అక్షరం కరిగిపోయిన గతంలోకి ఒక రహదారి. వర్తమానానికి ఒక స్మ తి రూప హెచ్చరిక.

అటువంటి అక్షరాల కర్మాగారం మన కాలపు మల్లేశప్ప మడివాలప్ప కల్బుర్గి. నిండు వయసులో ఒక జ్ఞాన చక్షువు ఆయన. చీకట్లు చూడడం అలవాటు పడ్డ వాళ్ళకు అలాంటి సూర్యరశ్మి బాధిస్తుంది. విశిష్ట పరిశోధకులుగా వారికి కర్నాటకలో 'నాడోజ' అని పేరుండేది. నాడుకు 'ఒజ్జ' అంటే గురువులుగా సంభవించుకునేది కర్నాటక సాంస్క తిక సమాజం. ఆయన కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు పొందిన రచయిత కూడా. రానురానూ వైదికీకరణ చెందుతున్న లింగాయతుల సమాజం పట్ల వారికి ఇటీవలి వత్సరాల్లో ఆందోళన ఉండేదని ప్రొఫెసర్ రహమత్ తరీకెరె చెప్తారు. కల్బుర్గి హంపి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్. ఆయన పదవీ కాలంలో మూడు వందల పుస్తకాలు పైబడి ఆ విశ్వ విద్యాలయం ప్రచురించింది. వారికి పంప ప్రశస్తి పురస్కారం లభించి 'నాడోజ' బిరుదుతోపాటు రూ.5 లక్షల ధనం చేకూరగా, దాన్ని పంప మహాకవి తల్లి గారి ఊరైన ఉణిగేరిలో పంప స్మారక నిర్మాణానికని ఇచ్చారు. 'అన్ సెటిల్ అయిన సమాజం నుంచే మంచి రచనలు వస్తాయని' వారి ఎరుక. వీరి హత్యానంతర దేశవ్యాప్త రచయితల నిరసనలో భాగంగా, ఇటీవల తన అకాడెమీ గౌరవాలను వదులుకున్న ప్రొఫెసర్ రహమత్ తరీకెరె (హంపి విశ్వ విద్యాలయ కన్నడ ప్రొఫెసర్) ఒకసారి వారిని ఇలా ప్రశ్నించారట. 'మీ మీద జనంలో గౌరవం ఉంది. మాట్లాడి మీలో బాధను బయటకు పారదోలొచ్చు కదా'.

'తరీకెరె... లింగాయత సమాజం చన్న బసప్ప, అరటాల రుద్రగౌడ కాలంలో అన్ సెటిల్ అయ్యింది. అలాగైనందునే, అది డైనమిక్‌గా ఉండేది. ఇప్పుడది కుదురుగా (సెటిల్) అయింది. తనలోని చలన శీలతను పోగొట్టుకుంది. బసవ తత్వం నుంచి దూరం వెళ్ళేందుకు మార్గం పట్టింది. సమాజానికి నా మాట అవసరం లేదు. నేనిప్పుడు మాట మాట్లాడేదాన్ని తక్కువ చేశాను.' ఇలాంటి విజ్ఞుడ్ని తూటాలకు బలిచ్చిన ఒక తప్పు దారి పట్టిన, దురహంకార ప్రతినిధులు, సమాజంలో 'భావస్వేచ్ఛకు ప్రాణహాని' తమ తీర్పుగా అమలుపరిచే నేరపూరిత కార్యాచరణకు తెగబడితే, ముందు సాహిత్య సమాజం నివ్వెరపోయింది. చాంధస మౌఢ్యాల ఆవేశంలో హంతకులు చేసిన ఈ తీవ్ర తప్పిదం పట్ల ఎవరు మాట్లాడాలి? దీన్ని ఎవరు ఖండించాలి? ఈ హత్యకు పూర్వరంగంలో, హేతువాదులు, తార్కిక చింతనాశీలురైన దభోల్కర్, పన్సారేల హత్యలు ఒకే తీరున జరిగిన సంగతి సాహిత్య సాంస్క తిక సమాజం మరచిపోలేదు. ఇవి వేర్వేరు సంఘటనలుగా కాక భావ స్వేచ్ఛపై గొలుసు దాడులుగా, దేశవ్యాప్త సాహిత్య సమాజం గుర్తించింది. దేశంలో పలుచోట్ల హేతువాదులు, ప్రగతిశీలురు సభలు ఏర్పాటు చేసి, ఈ హత్యా ఉన్మాదాన్ని ఒక్క గొంతుతో ఖండించారు. అయినా ప్రభుత్వ వ్యవస్థలు, సాహిత్య సంస్థలు కదలలేదు. ఈ మౌనం దేనికి సంకేతం?

ప్రముఖ సాహిత్య వేత్తలు, కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డులు పొందిన రచయితలు తమ గొంతు విప్పారు. ప్రభుత్వ సంస్థలను ప్రశ్నించారు. వారిలో మొదట ఈ నిరసనల స్వరం విప్పినవారు ఆంగ్ల రచయిత్రి నయనతార సెహగల్. అవార్డులను వీడి రచయితలు బయటికి రావడం దేశవ్యాప్తంగా మొదలయింది. ప్రఖ్యాత హిందీ రచయిత అశోక్ వాజ్‌పేయి, ఉర్దూ రచయిత రెహ్మాన్ అబ్బాస్, కన్నడ రచయిత్రి శశి దేశపాండే, మలయాళ రచయితలు కె.సచ్చిదానందన్, సారా జోసెఫ్, ఉదయ ప్రకాష్; బెంగాల్ రచయిత్రి మందాక్రాంత సేన్ ... ఇలా గుజరాత్, కేరళ, పంజాబ్, బెంగాల్, కర్నాటక, మహారాష్ట్ర, గోవా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, కాశ్మీర్ వంటి ప్రాంతాల రచయితలు ఈ నిరసనోద్యమంలో పాల్గొనితమ పదవులు వదులుకోవడమో, తమ అవార్డులను తిరిగి ఇచ్చి వేయడమో చేశారు.

ఈ దేశవ్యాప్త రచయితల నిరసన సాహిత్య అకాడెమీ చరిత్రలో ఇదే మొదటిసారి. దీనికి స్పందనగా ఈ నెల 23న సాహిత్య అకాడెమీ తన కార్యవర్గ సమావేశాన్ని, రెండు నెలలు ముందుకు తెచ్చి నిర్వహిస్తోంది. రచయితలైన కార్యవర్గ సభ్యులు, భిన్న భాషా ప్రతినిధులు, ఈ విషయంలో అకాడెమీ నుంచి క్రియాశీల స్పందనలకు డిమాండ్ చేయడం జరుగుతుంది. అధికార వర్గాలతో సత్యం మాట్లాడుతున్నామని చెప్పారు ప్రముఖ హిందీ సాహితీవేత్త అశోక్ వాజ్‌పేయి. ఆలోచనల కోసం చంపుతున్నారు. ఆహారం కోసం చంపుతున్నారు. ఆచారాల పేరిట జరుగుతున్న ఈ మనుషుల వేట పట్టపగలే జరుగుతోంది. అందుకే రచయితలు సాహిత్య అకాడెమీని 'ఎందుకు అత్యవసర కార్యవర్గ సమావేశం పెట్టి కల్బుర్గి హత్యను ఖండించ లేదు' అని అడుగుతున్నారు. మరోపక్క ఎన్‌బిటి, సాహిత్య అకాడెమీ, ఐసిహెచ్‌ఆర్ వంటి జాతీయ సంస్థలను ఇప్పుడు ప్రభుత్వ అనుకూల ధోరణులు గల పెద్దలు ఛైర్మన్, అధ్యక్ష హోదాల్లో నిర్వహిస్తున్నారు. ఆలస్యాలకు, అసలు ఏ చర్యా తీసుకోకపోవడానికి, వారి బ్యూరోక్రటిక్ కారణాలు వారికి ఉంటాయి.

ఈలోగా పదుల సంఖ్యలో సాహిత్య అకాడెమీ అవార్డులు పొందిన తెలుగు రచయితలు, అనువాదకులు ఏం చేశారు? వీరిలో పదిమందికి పైగా అక్టోబర్ 7న కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, జరిగిన దానిపట్ల సామూహిక అసంత ప్తి తెలిపారు. తమ అవార్డులన్నీ తమ వద్దే భద్రంగా ఉంచుకున్నారు. అకాడెమీ పదవులు కూడా పదిలంగా అట్టే పెట్టుకున్నారు. ఒకపక్క దేశంలో, ఒక సాహిత్య క్షేత్ర

> సాహిత్య అకాడెమీ అవార్డు పొందిన కల్బుర్గి మూఢశక్తుల చేతుల్లో ఏకంగా ప్రాణాలే పోగొట్టుకున్నారు. ఈ అసహనాల ప్రమాదకర స్థాయి దేశంలో రచయితలకు ఒక రకంగా అర్థం అవుతుంటే, మన తెలుగు రచయితల్లో అకాడెమీ అవార్డులు పొందినవారు తాత్సారం చేస్తున్నారు. వీరి పదవులూ, ఈ అవార్డులూ, ఈ ప్రమాద సమయంలో అస్త్రాలుగా మారకపోతే- అవి ఎందుకవి? పౌర సమాజం, ప్రభుత్వాలు రచయితల పక్షాన బలంగా నిలబడాలని, అభిప్రాయ భిన్నత్వాన్ని దేశం గౌరవించాలని ఇందరు రచయితల ముక్తకంఠంగా అకాడెమీ చెప్పేలా దేశవ్యాప్త ఒత్తిడి తేలేకపోతే, ఎందుకీ పదవులు, ఈ పురస్కారాలు? ఇవి ఈ రచయితలు తమ రచనల్లో వెలిబుచ్చిన ప్రజాపక్ష అభిప్రాయాలకు ఉత్తమ కళాకారులుగా భావించి, అకాడెమీ వివిధ దశల్లో ప్రదానం చేసినవి. ఇప్పుడు దేశవ్యాప్త రచయితల నిరసన సాహిత్య అకాడెమీ చరిత్రలో ఇదే మొదటిసారి. దీనికి స్పందనగా ఈ నెల 23న సాహిత్య అకాడెమీ తన కార్యవర్గ సమావేశాన్ని, రెండు నెలలు ముందుకు తెచ్చి నిర్వహిస్తోంది.

అల్పపీడనం మొదలైంది. సాక్షాత్తు సాహిత్య అకాడెమీ అధ్యక్షుడైన విశ్వనాథ్ ప్రసాద్ తివారీ, 'ఒక సుడిగాలి మొదలయ్యింది' ('ఏక్ ఆంధీ చల్పడీ') అని వ్యాఖ్యానించారు.

సాహిత్య అకాడెమీ అవార్డు పొందిన కల్బుర్గి మూఢ శక్తుల చేతుల్లో ఏకంగా ప్రాణాలే పోగొట్టుకున్నారు. ఈ అసహనాల ప్రమాదకర స్థాయి దేశంలో రచయితలకు ఒక రకంగా అర్థం అవుతుంటే, మన తెలుగు రచయితల్లో అకాడెమీ అవార్డులు పొందినవారు తాత్సారం చేస్తున్నారు. వీరి పదవులూ, ఈ అవార్డులూ, ఈ ప్రమాద సమయంలో అస్త్రాలుగా మారకపోతే పౌర సమాజం, పాలిస్తున్న ప్రభుత్వాలు రచయితల పక్షాన బలంగా నిలబడాలని, అభిప్రాయ భిన్నత్వాన్ని దేశం గౌరవించాలని ఇందరు రచయితల ముక్తకంఠంగా అకాడెమీ చెప్పేలా వీరు దేశవ్యాప్త ఒత్తిడి తేలేకపోతే, ఎందుకీ పదవులు, ఈ పురస్కారాలు? అవి గూళ్లలో పెట్టుకోవడానికి కాదు, ఈ రచయితలు తమ రచనల్లో వెలిబుచ్చిన ప్రజాపక్ష అభిప్రాయాలకు ఉత్తమ కళాకారులుగా భావించి, అకాడెమీ వివిధ దశల్లో ప్రదానం చేసినవి. మానవ జీవితమే పెద్ద విపత్తులో ఉన్న విషయంలో ఏమీ పట్టకుండా ఉండడాన్ని చూసే, ఎక్కడో లోతుల్లో ఉన్నది కనుక 'అగాధమీ' అని ఆగ్రహ భార్గవులైన దిగంబరులు, ఒకసారి సరిగానే అన్నారు.

అకాడెమీ అవార్డులు పొందిన మన తెలుగు రచయితలు వ్యవస్థాగత సంస్థలను, తమ భుజకీర్తులు జారిపోకుండా బుజ్జగిస్తున్నారు. రచయితల, పౌరుల ప్రాణాలకే దిక్కు లేనప్పుడు, ఈ భుజకీర్తులు ఎవర్ని కాపాడడానికి, ఎవర్ని ముగ్ధుల్ని చేయడానికి? భిన్న రాష్ట్రాల్లో యాభై మందికి పైగా రచయితలు తప్పును ఎత్తి చూపిస్తూ ఇప్పటికే దేశ సాహిత్య సమాజంలో అగ్ర శ్రేణిలో నిలబడ్డారు. ఈ సంక్షోభ సమయంలో బుజ్జగింపుల వ్యవహారం ఆరంభ శూరత్వంగానే మిగిలిపోతే, జాతీయ సాహిత్య చిత్రపటంలో ఎక్కడుంటారు మన తెలుగు రచయితలు? వీరి రచనల్లో నిండిన ప్రగతిశీల వాదనలకు అర్థం ఏమిటి? సంక్షోభ సమయాల్లో సమాజ పక్షాన స్థిరంగా నిలబడకపోవడం గడుసుతనం అవుతుందేమో కానీ, గంభీర కార్యాచరణ కాదు. వర్తమానంలో ఏం చేయాలో, దేశంలోని ఇంతమంది రచయితలు చూపాక, ఇంకా శషభిషలకు పోతూ, అకాడెమీ అవార్డులు పొందిన మన తెలుగు రచయితలు, 'తాత్సార రత్న'లు గానే ముద్ర వేసుకోవాలా?

– రామతీర్థ
98492 00385

శ్రమ నిష్ఫలమూ, జన నిష్ఠురమీ రాజధాని

అమరావతిలో ఎలాంటి భారీ నిర్మాణాలూ చేయవద్దన్న హిత వచనాలుండగా, వాటిని పెడ చెవిని పెట్టి, నిర్మాణమయ్యే ఒక నగర వైపరీత్యానికి అమరావతి అని పేరు పెట్టుకున్నంత మాత్రాన, ఆంధ్రులకు తమ గత చరిత్ర గుర్తుకు వచ్చి వారి ఒడలు పులకరించి, ఈ ప్రణాళికకు ఎంతో సంతోషిస్తారు అనుకోవడం ఒక ఎండమావి.

సందర్భం

రామతీర్థ

అమరావతి అంటే పుక్కిటి పురాణాలలోని దేవతాధినేత రాజధాని. అదెప్పటికీ భూమి మీదకు దిగిరాదు. ఆ పేరు చెప్పి వచ్చని భూములు రాజ, దాని పేరిట నయానా భయానా ఖాళీ చేయిస్తున్నాము అంటే దీనికి పురాణాలలోనే ఒక దృష్టాంతం ఉన్నది. అది, ఇంద్రప్రస్థ పురం కట్టడానికి, ఖాండవ వన దహనం చేసిన పాండవులు, కృష్ణుడి కథ. ఈ కథ నుంచి ఇప్పటి, ఇక్కడి పాలకులూ, పాలితులూ కూడా చాలా పాఠాలు నేర్చుకోవచ్చు. మరల ఇదేల భారతంబన్న, ఆ నాటి సమస్యలను వేటినీ మనం అధిగమించలేదు కనుక. ఈ ఉదాహరణ ఐదు వేల ఏళ్లైనా ఈనాటికీ సరిగ్గా సరిపోతుంది. ఆనాడు అక్కడి నుంచి నిర్వాసితులైన ప్రజల నాయకుడు తక్షక నాగరాజు, మూడు తరాల తరువాత, తమ వారికి జరిగిన దుర్గతికి అర్జునుడి మనుమడి ప్రాణాలు తీసేంత తీవ్రవాదిగా ఎదిగాడు. పాలకుల అణచివేత వల్లనే, నిరంకుశ ప్రవర్తన వల్లనే తీవ్రవాదులు పుడతారని అప్పుడే భారతం చెప్పింది. ప్రస్తుతం రాజధాని కమిటీ నిపుణుడు శివరామకృష్ణన్ చెవినిల్లు కట్టుకుని పోరుతున్నారు, మేధా పాట్కర్ తన నిరసనను, రైతు సమూహాల తరపున తెలియ చెప్పారు. అన్నా హజారే ఒక లేఖ ద్వారా, తను ఏమి ఆలోచిస్తున్నదీ తెలియ చెప్పారు. మన రాష్ట్రంలో పచ్చని పొలాలు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాయి. ఈలోగా దేశ రాజధానిలోనే బలవంతపు భూసేకరణలకు నిరసనగా, అటువంటివి వద్దంటూ, ఒక రైతు చెట్టుకు ఉరేసుకున్నాడు, పట్టపగలు.. ఒక నిండు సభా మధ్యంలో.

చూస్తే ఏ మౌలిక ఆధునిక వసతులు లేని, యాభై వేల గడప మించని ఒక చిన్న వూరిని పట్టుకుని, అక్కడ వేల ఏళ్లుగా ముక్కారు పంటల పల్లపు మాగాణుల

భూమిని పంటలకు దూరం చేసి, కాంక్రీటు, సిమెంటుగా నగరీకరణ ద్వారా, ఒక నదుల, లోయల, పంట భూముల పర్యావరణం సమతౌల్యాన్ని ఏ మేరకు దెబ్బ తీస్తున్నామో అన్న ఆలోచనకు కూడా ఎక్కడా తావులేకుండా ఉన్నది. రింగ్ రోడ్లూ ఔటర్ రింగ్ రోడ్లూ అంటూ ఒక విధ్వంసదాయక నగరీకరణ, వేల ఏళ్లనాటి ప్రాచీన జీవావరణ విధానాన్ని, ఒక జీవనదిని దెబ్బతీస్తుంది అన్నది ఖాయం. అక్కడ ఎటువంటి భారీ నిర్మాణాలూ చేయవద్దన్న ధ్రువీకృత హిత వచనాలుండగా, వాటిని పెడ చెవిని పెట్టి, నిర్మాణమయ్యే ఒక నగర వైపరీత్యానికి అమరావతి అని పేరు పెట్టుకున్నంత మాత్రాన, ఆంధ్రులు తమ గత చరిత్ర గుర్తుకు వచ్చి వారి ఒడలు పులకరించి, ఈ ప్రణాళికకు ఎంతో సంతోషిస్తారు అనుకోవడం ఒక ఎండమావి.

శాతవాహనుల నాటి రాజధాని అయినా, బౌద్ధ కాలంలో ఒక చైతన్యంగా గుర్తింపు గల నిర్మాణాలు జరిగినా, అమరావతి ప్రస్తుతం ఒక పాత అవశేషాల దిబ్బ తప్ప ఆధునిక రాజధాని స్వరూప స్వభావాలకు వెసులుబాటు కలిగించే ప్రాంతం కాదు. వరదలకూ ముంపులకూ గురయ్యే ప్రాంతం కూడా. మారిన రాష్ట్ర భౌగోళిక చిత్రాన్ని బట్టి కర్నూలు, గుంటూరు, కృష్ణా జిల్లాలు పొరుగున ఉన్న తెలంగాణ రాష్ట్రానికి సరిహద్దు జిల్లాలు. వేరే రాష్ట్ర సరిహద్దుకు ఇంత దగ్గరగా రాజధాని నిర్మాణం వల్ల ఎప్పటికైనా లబ్ధిపొందేది దగ్గరగా ఉన్న వారే కాబట్టి, దూరాన రాయలసీమలో ఉన్న వారికి, ఉత్తరాన శ్రీకాకుళంలో ఉన్న వారికి గానీ, ఈ కొత్త అమరావతి వల్ల ఒరిగే ఏ లాభమూ ఉండదు. పదేళ్ల తరువాత, ఈ కొత్త రాజధాని తెలంగాణకు దగ్గరి సరిహద్దులో ఉండడం వల్ల రాష్ట్ర ప్రజలు ఎంతగా నష్టపోతారో, ఇప్పుడు ఈ ప్లాన్లు వేస్తున్న వారికి తెలియడం లేదు. ఏ రాష్ట్ర రాజధాని అయినా చుట్టూ తమ రాష్ట్రపు ప్రాంతమే కలిగినదిగా ఉంటేనే ఆ అభివృద్ధి ఫలితాలు అన్నీ ఆ రాష్ట్ర ప్రజలకు అందే అవకాశాలు ఉంటాయి.

ఈ అమరావతి, మహా అయితే చరిత్ర గతిలో నిష్కర్షగా చూస్తే, ఒక పుక్కిటి పురాణం, లేదా అంతరించిపోయిన రాజ్యాల ఒక చిన్న రాజధాని, మూలహీనయాన బౌద్ధ తత్వానికి విరుద్ధ కార్యకర్త అయిన నాగార్జునుడి మహాయాన అవశేషాల దిబ్బ. ప్రాంతపు మెరుగులను బట్టి చూస్తే, మంచి మూడు పంటల నేల, కృష్ణా నదీ పరీవాహక ప్రాంతంగా రాష్ట్ర ప్రజలకు అన్నం పెట్టగల తల్లి భూదేవి, ఇక్కడ రాజధాని పేరిట సిమెంట్ సమాధులు కట్టడం, అందుకు సింగపూర్ శిల్పులు కావాల్సి రావడం, ఇవన్నీ రాబోయే ఐదు వందల ఏళ్లకు మించి రాష్ట్రాన్ని ప్రభావితం చేసే అంశాలు. ఐదేళ్లకు మాత్రమే పాలన అవకాశం కలిగిన రాజకీయ పక్షాలు, ఐదు వందల ఏళ్లకు ప్రభావితం చేసే నిర్ణయాలు, ప్రజల ప్రస్తుత, భావి సంక్షేమం దృష్టిలో పెట్టుకోకుండా తీసుకోవచ్చునా? ఇన్ని కారణాల వల్ల, అమరావతిని చరిత్రలో ప్రశస్తి గల ప్రదేశంగా ఉండనియ్యాలి తప్ప, మారిన భౌగోళిక, సాంఘిక పరిస్థితుల్లో, గత వైభవాలు చెప్పి, ఆధునిక ఆంధ్రప్రదేశ్ కొత్త రాజధానిగా చెలామణీ చేయాలనుకోవడం, దూరపు ఆలోచనలు చేసి తీసుకున్న నిర్ణయంగా ప్రజలు తలచడం లేదు. అమరావతి వాస్తవ రూపం, చరిత్రలో దాని పరిమితులు ఏమిటో ఎరిగి, ఆంధ్రులు, ఇది మన పాలిటి భ్రమరావతి కాక ముందే మేల్కొనడం, వికేంద్రీకరణ దిశగా, ప్రభుత్వాలు ఆలోచించాలని, ఒత్తిడి తేవడం జరగవలసిన కర్తవ్యాలు.

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత
మొబైల్ : 9849200385



వినుడు వినుడు మన విశాఖ గాథ

రామతీర్థ
9849200385

బ్రిటిష్ వారి పాలనా కాలంలో భారత దేశంలో సముద్ర ప్రాంత, మైదాన ప్రాంత, గిరిజన ప్రాంత జన సమూహాలు గల అతి పెద్ద జిల్లా విశాఖపట్నం. అటు పాయకరావుపేట నుంచి ఇటు ఒడిశా రాష్ట్రంలో ఉత్తర ప్రాంత భాగాలు అయిన కోరాపుట్, జయపురం, సుంకి ఘాటీ, పర్లాకిమిడి ప్రాంతాల వరకూ విశాఖపట్నం ఒకే జిల్లా. ఇంతలా జీవన వైవిధ్యం గల ప్రజలు భారతదేశంలో ఇంకే జిల్లాలోనూ కనిపించరు. అల్లూరి సీతారామరాజు మన్య విప్లవం, రంప పితూరీలకు ముందరే విశాఖ ఏజెన్సీలోని మన్య ప్రజలు, తెల్ల పాలకులపై తిరుగుబాట్లు చేసిన చరిత్ర, ఉరి శిక్షల పాలు అయిన చరిత్ర, విశాఖపట్నం గజిట్‌లో నమోదు అయి ఉంది. ఆ రకంగా చూస్తే గురజాడ, గిడుగు రామమూర్తి, కోడి రామమూర్తి, ఆదిభట్ల నారాయణదాసు, ద్వారం వెంకటస్వామినాయుడు, రోణంకి అప్పలస్వామి, దాసో వంటి ముందు తరాల రచయితలు అందరూ విశాఖ జిల్లాలో పుట్టిన వారే. అటు జయపురం, బరంపురం దాకా తెలుగు ప్రజలు నివసించిన ప్రధాన ప్రాంతాలే. ఈ ప్రాంతాల ప్రజలు ఎప్పుడూ అటు ఒడియా, ఇటు తెలుగు రెండూ నేర్చి కళింగ ప్రాంత ప్రజలుగానే (ఒఢ్రులు, ఆంధ్రులు) గుర్తింపబడ్డారు.

విశాఖపట్నం పోర్టు గురించి తెల్ల దొరలతో కలిసి తొలి సర్వేలు జరిగినప్పుడు గురజాడ కూడా ఈ సర్వేల్లో పాల్గొన్నానని, వారికి సహాయకుడిగా ఉన్నానని తన డైరీలో రాసుకున్నారు. రవీంద్రనాథ్ టాగోర్ ఇంత అందమైన ఊరు మరొకటి తను చూడలేదని తన పర్యటనల సందర్భంలో విశాఖను స్తుతించారు. బ్రిటిష్ పాలిత ఆంధ్ర దేశంలో విశ్వవిద్యాలయం తొలిసారిగా ఏర్పాటు చేయాల్సిన సందర్భంలో ఎటువంటి ప్రాంతీయ అభిమానాలకు చోటు లేకుండా తాను రాయలసీమ వాసి అయినా కట్టమంచి రామలింగారెడ్డి ఆ విశ్వవిద్యాలయానికి విశాఖపట్నమే అనువైన ప్రదేశం అని వాదించి, మెప్పించి సాధించారు. జయపురం రాజా విక్రమ దేవ వర్మ శైశవ దశలో ఉన్న ఆంధ్ర విశ్వవిద్యాలయ పోషకుడిగా కీలకమైన ఆర్థిక సహాయం అందించారు. ఈ విషయంపై తాను రాసిన కవిత ఆరుద్ర రచనల్లో ఉన్నది. శ్రీశ్రీ మహా ప్రస్థానంలో విశాఖపట్నం సముద్రం, డాల్ఫిన్ నోస్ కొండ, ఒక రాత్రి అనే కవితలో ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. వారి మహా ప్రస్థానం కవిత అయిన ఇరవై నాలుగేళ్ల కుర్రవాడిగా టర్నర్ చౌల్ట్రీలో కూచుని మూడున్నర నిమిషాల లోపే రాశారు. తీరా అచ్చుకు పంపిస్తే 'భారతి' పత్రిక తిప్పి పంపిన ఈ కవిత ఒక యుగపు అభ్యుదయ సాహిత్యోద్యమ ఆరంభ రచనగా ఇవాళ జగద్విఖ్యాతం అయింది. తాను చివరి వరకూ అంటూ ఉన్న మరో విషయం ఎప్పటికైనా 'విశాఖపట్నం' అని పదిహేను అశ్వాసాల మహా కావ్యం రాస్తానని శ్రీశ్రీ చెప్పేవారు. వారి ఆత్మ కథ 'అనంతం'లో ఈ మాట రాశారు కూడా. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో విశాఖపై బాంబులు పడ్డప్పుడు కుర్రవాడైన ఆరుద్ర బుచ్చిరాజుపాలెంలో ఉండేవారు.

ఇక చరిత్రకు అందని కాలంలో ఇక్కడ మహాయాన బౌద్ధం విలసిల్లింది. అందుకు సంబంధించిన ఆధారాలు పురాతన స్థలాలు విశాఖ చుట్టూ ఉన్నాయి. ఇవన్నీ ఆనాటి బౌద్ధ శ్రమణకులు (సన్యాస దీక్షలో గల విద్యార్థులు) ఇక్కడ తొట్లకొండ, రామతీర్థం కొండ, బావి కొండ, బొజ్జన్నకొండ విద్యా కేంద్రాలుగా ప్రసిద్ధాలు. ఎక్కడెక్కడి నుంచో వచ్చి విద్యార్థులు ఇక్కడ విద్యాభ్యాసం చేసిన ఒక కాలం ఉండేది. అలనాటి విషయాలను ప్రస్తావిస్తూ ఆంగర సూర్యారావు తయారు చేసిన 'విశాఖ చరిత్ర' రెండు భాగాలు ఎవరైనా చదివి ఎన్నో సంగతులు తెలుసుకోవచ్చు. భీమునిపట్నం భారతదేశంలోనే వందల ఏళ్ల చరిత్ర గల, రెండో మునిసిపాలిటీ. మొదటిది సూరత్. ఏజెన్సీలో మన్య ప్రజలను నియంత్రణలో ఉంచేందుకే విజయనగరం రాజులకు మన్నె సుల్తాన్ అనే బిరుదు వచ్చింది. ఈ బిరుదు ఇచ్చింది. బ్రిటిష్‌వారు కాదు అంతకు ముందరి శ్రీకాకుళం నవాబు. రాజులు పొరుగు రాజులతో, తెల్లవారితో యుద్ధంలో మరణించినా విజయనగరం కోటపై ఒక్క యుద్ధం కూడా జరగలేదు. మూడు వందల ఏళ్ల పైగా చరిత్ర గల ఈ కోటను విజయనగర రాజ్య వంశీకుడైన పి.వి.జి.రాజు కాలంలో స్వచ్ఛందంగా రాజరికాలు వాడు బడని కోటను విద్యా, వైద్యోగిక సంస్థలకు నగర వారసత్వంగా ఇచ్చేసిన సోషలిస్టు రాజా ఈయన. ఈ సంగతి ఎందుకు చెప్పడం అంటే రాజస్థాన్ మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలో ఇంత చరిత్ర గల కోటలు ఇంకా పాతవి. వ్యాపార హోటళ్లుగా కొత్త అవతారాలు ఎత్తి ఆయా రాజ కుటుంబీకుల ఆధీనంలోనే ఉండగా కోటను ప్రజల సంపదగా వదులుకున్న వారు విజయనగరం రాజులు మన విశాఖ జిల్లా వారే. వీరికి వారసత్వంగా సంతానం లేనప్పుడు దాయాదులైన రాజుల నుంచి బిడ్డలను దత్తత తీసుకునే వారు. అలా కాశ్మీపాలెం రాజ కుటుంబాల నుంచి బిడ్డలు విజయనగరం రాజ కుటుంబాలకు దత్తుగా వచ్చే సంప్రదాయం ఉండేది. అలా దత్తు వచ్చిన రాజే ఈ కాశ్మీపాలెం రాజుల వంశాంకురమే. పద్మనాభ యుద్ధంలో ప్రాణాలు పోగొట్టుకున్న పూసపాటి చినల విజయరామరాజు పద్మనాభం కొండ మీద ఆయన ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ అనేక రాజ కుటుంబాల యోధులతో చేసిన ఆఖరి ప్రసంగం అలనాటి స్వాతంత్ర్యేచ్ఛకు నిలువెత్తు నిదర్శనం. ఈ రాజుల తొలి నాళ్ళ వీరత్వాలకు గాను అలనాటి చక్రవర్తి ఔరంగజేబ్ ప్రదానం చేసిన జుల్ఫికర్ (రెండు అంచుల కత్తి) ఇప్పటికీ విజయనగరం కోట జెండాలో ఒక భాగంగా ఉంటుంది.

ఇక ప్రజాస్వామ్య దేశంలో విశాఖ పలు భాషల ప్రజలకు నివాసస్థలిగా మొత్తం రాష్ట్రంలోనే ఒక విశాల నాగరికత, సంస్కృతి సమాహారంకు పెట్టింది పేరు. శాఖోపశాఖలుగా పారిశ్రామిక విశాఖగా ఎదుగుతున్న ప్రస్తుత స్థితి. కొత్త రాష్ట్రంలో విశాఖకు మొదటి స్థానాన్ని కల్పిస్తున్నది. ప్రభుత్వ రంగ సంస్థల కాణాచిగా తూర్పు నౌకా దళ ప్రధాన కార్యాలయంగా, అంతర్జాతీయ ఓడ రేవుగా ఎదుగుతున్న విమానాశ్రయంగా ప్రపంచం అంతా పేరు పొందిన నగరం విశాఖ అయినా ఈ నూతన రాష్ట్రంలో ఏ ముఖ్యమైన పరిపాలక వ్యవస్థను ఇక్కడ ఏర్పాటు చేసే ఉద్దేశం పాలక వర్గాలకు లేదు. దీనికి విభాగం ఎక్కువ ఆదాయ వనరుగా ఉన్న రైల్వే జోన్ కూడా. సమగ్రంగా మనకు విశాఖ కేంద్రంగా ఏర్పాటు అయ్యే సూచనలు నీరు గారుతూనే ఉన్నాయి. తాగడానికి నీరు పూర్తిగా రావలసిందే. పట్టణీకరణ పెరిగిపోతూ పేదల నివాస ప్రాంతాలు మురికివాడలుగా పరిణమిస్తున్న ఈ దృశ్యం గతం ఎంత గొప్పది అయినా వర్తమాన నగర పరిసరాల ముఖ చిత్రం ఆందోళనకరంగానే ఉన్నది.

ఈ హుదూద్‌కి చాలక స్మార్ట్ సిటీ అని కార్పొరేట్ స్థాయి నుంచి రాష్ట్ర, దేశ స్థాయి ప్రజా ప్రతినిధులు అందరూ ఊదర గొడుతున్నారు. ఊరి వాస్తవ స్థితిగతులను రోజుకో చిత్రం చొప్పున వంద రోజులు ప్రచురించింది కనీస అవసరాలు, ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత మెరుగైన బహిరంగ స్థలాలు సాధించలేని ఈ విశాఖ ఎలా ఎందుకు స్మార్ట్ సిటీ అవుతుందో అడగాల్సిన బాధ్యత, దానికి మీరు పాడా పుడిగా అమలు పరుస్తున్న ప్రమాణాలు ఏమిటో అని పాలక వర్గాలను అడగాల్సిన కర్తవ్యం సాంఘిక మీడియాకు, పత్రికలకు ఉన్నది.

ఇప్పటికే రాష్ట్రంలో ఏకైక గ్రేటర్ హోదా గల నగరంగా ప్రాముఖ్యత సంతరించుకున్న విశాఖ పట్ల పాలకుల దశాబ్దాల నిర్లక్ష్యం, అలసత్వం. ఈ ప్రాంత ప్రయోజనాలకు ఎంతో హానికరంగా ప్రజలు అర్థం చేసుకోవాలి. అభివృద్ధి అంటే ఖాళీ స్థలాల ఆక్రమణ జూ పార్కును తరలించడం, వందలాది



ఎకరాల వ్యవసాయ భూములను, గ్రీన్ ఫీల్డ్ ప్రాజెక్టులంటూ అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఎప్పుడో కాలం చెల్లిన నాసిరకం పరిశ్రమలు ఇక్కడ పెడతామనే వ్యాపార వర్గాలకు కట్టబెట్టడం ఎంతమాత్రం కాదు. పాతిక లక్షల జనాభా ఇక్కడ నివసించడమో లేక రోజూ పలు ఉద్యోగాల రీత్యా వచ్చి వెళ్లడమో జరుగుతున్నా ఈ తెలుగు రాష్ట్ర మహా నగరి సుందర భవిష్యత్ ప్రజల చేతుల్లో ఉన్నది. పాలకుల నిర్ణయాలు ఎంత చక్కగా ఉన్నాయి అంటే దాదాపు పదేళ్ల కిందట అభివృద్ధి అంటూ తొలగించిన జిల్లా గ్రంథాలయ సంస్థ ఇవాళ ఎంత దయనీయ దశలో ఉందో, ఇన్నేళ్లు అయినా అలాగే ఎందుకు ఉంచామో, ఆ గ్రంథాలయం కొత్త భవంతి నిర్మాణం జరిగేలోగా ఎందుకు అదే రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఖాళీగా ఉన్న ఏదో ఒక భవంతిలోకి సకల హంగులతో మార్చారో ఇవన్నీ ప్రజలు పట్టించుకుని అడగాల్సిన అవసరం ఉన్నది.

అలాగే ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గరలోని ఒకప్పటి జైల్ ఉన్నప్పటి ఖాళీ ప్రాంతం ఒక ప్రయోజనకరమైన పర్యావరణ, సంస్కృతిక కూడలిగా మార్చకుండా ఎన్ని ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయో కూడా ప్రజలు అడిగి తెలుసుకోవాలి.

ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ చైతన్య స్థాయికి తగిన పాలనను పొందుతారు. అందాకా ఊరికే 'సిటీ ఆఫ్ డెస్టినీ' అంటే చాలదు. అసలు అందరమూ 'సిటీ ఆఫ్ డెస్టినీ' అనే అంటున్నాము. ఇన్నేళ్లయినా దీనికి తెలుగు మాట ఏర్పరచుకోలేదు. రీడింగ్ రూమ్ సూచిస్తున్నది ఈ సిటీ ఆఫ్ డెస్టినీని 'భాగ్య విధాయక విశాఖ'గా అందరమూ వ్యవహరిద్దాము. ఈ నగర భాగ్య విధాతలు చైతన్యవంతులైన ప్రజలే కనుక ఆ చైతన్యంతోనే ఇప్పటికే రాష్ట్రంలో మొదటి ప్రధాన నగరం అయిన విశాఖను నిజంగా 'తూర్పు తీర మణిహారం'గా మలచుకుందాము.

ఆవులూ-గేదెలూ, పుణ్యాలు-పాపాలూ

రామతీర్థ
9849200385

సంచార జీవితం నుంచి వ్యవసాయ జీవితానికి, మానవ సమాజం పరిణామం చెందిన దశ చాలా సుదీర్ఘమైనది. తొలి శాస్త్రవేత్తలు రైతులే.వీరి పరిశీధన శాలభూమి. దాదాపు నీరు, సూర్యరశ్మి విరివిగా ఉండే ఈ ఉపఖండంలో స్థిర నివాసులుగా, నిలదొక్కుకుంటున్న కాలంలోనే, మానవులకు బహు దగ్గరగా వచ్చిన పశువులు ఆవులూ, గేదెలూ, ఇవి మచ్చికై, పాలిచ్చే పశు గణాలుగా, గణ జీవనంలో, జనపదాలలో, గ్రామ జీవనంలో మనిషికి పాటే విడదీయలేని భాగంగా అయ్యాయి. గ్రామీణ ప్రజల సందలుగా గోవులు ఇంటా, పొలం శ్రమకై ఎడ్లు బయటా, స్త్రీ పురుషులకు దగ్గరవడం ఒక ప్రధాన సాంఘిక పరిణామం. గోవు మాలోఇ్మ అన్నమాట, ఎద్దులా కష్ట పడినా, అన్న జాతీయాలు, ఈ పశు గణాలతో, మానవాళికి గల సన్నిహిత సహ జీవనం నుంచే వచ్చాయి. చదువు కూడా, అమ్మ ఆవు అని అక్షరాలు నేర్చుకున్నాము. చిన్నప్పుడు, అమ్మపాలు, అలాగే ఆవు పాలు తాగి పెరిగాము. ఆవు పాలు, గేదెల పాలు పెద్దయ్యాక కూడా పలు ఆహార పదార్థాలల్లో భాగంగా తీసుకుంటున్నాము వేల ఏళ్ళుగా, బహుశా మచ్చిక అయిన జంతువులలో, ఆవులు, గేదెలు అంత విస్తార ఉపయోగాలు గల జంతువు వేరొకటి లేదేమో. అయితే ఈ క్రమంలోనే, అత్యంత ఉపయుక్తమైన పశువుగా గోవుకున్న ప్రాముఖ్యత ఉండగానే, ఋగ్వేద కాలం నుంచి, ఆ నాటి జానపదలు, తమ దైవారాధ నలు వ్యక్తిగతం ఇళ్ళల్లో చేసే వారు కారు. ఏ పూజైనా సామూహిక ఆరాధనే. అవే యజ్ఞాలు, యాగాలు, వీటిలో, ఈ పశువులను మేలిమి ప్రాణు లుగా తాము భగవంతుడి రూపాలుగా నమ్మే దేవతలకు బలి ఇచ్చేవారు.ఆ జంతువులను భుజించే వారు. కరుణ తప్ప వేరే రసం లేదు అని భావించిన భవభూతి, తన ఉత్తర రామ చరిత్రలో, వశిష్ఠుడు అనే బ్రాహ్మణ ఋషి, చూడి వయసుకొచ్చిన ఆవు మాంసాన్ని ఇష్టంగా వండించుకుని తిన్నట్టుగా చిత్రణ చేసాడు. ఇదే క్రమంలో అనేక ఋగ్వేద కాల ఋషుల పేర్లు చెప్పు వచ్చు. చరక మహర్షి రచనగా చెప్పబడే చరక సంహితలో, ఆవు మాంసం, దాని పలచని జావ, కొన్ని రోగాలకు మందుగా పేర్కొనడం ఉన్నది. వెరసి ఈ ఉదాహరణల ద్వారా, మనం తెలుసుకునేది, కొన్ని వేల ఏళ్ల క్రితం, మిగిలిన అన్నీ పశువుల వలెనే, గోవు మాంసం కూడా, హిందువులలో అన్నీ కులాల వారు తినే వారు అని, ఆనాటి జీవన విధానం ఆవుకు గల ప్రాధాన్యతను గో సూక్తం వంటి వాటిలో గుర్తించినా, గోవుకు వైదిక జానపద సమాజంలో గల విశేష స్థానాన్ని కీర్తించింది తప్ప, దేవతా స్థానం ఈయలేదు. నీ పాలు, పెరుగు, నెయ్యి దేవతలయిన ఇంద్రాదులకు అర్పి స్తాము. అందుకై నీవు సమృద్ధిగా ఉండు, ఏ రోగాల పాలు కాకు, ఇలా సాగుతుంది గో సూక్తం. ఒక ప్రాణి ఉపయోగాన్ని గుర్తించి, గౌవరించే క్రమశిక్షణ ఈ ప్రాచీన రచనలో విశదమవుతుంది. ఇవాళ ఈ విషయాలు పదే పదే చెప్పి గోవధపై ఒక వాస్తవిక అవగాహన కలిగేలా ప్రయోజనం సాధింపగలమా అన్నది ప్రశ్న.

గోవధ అసలు భారత దేశంలో నిషేధంలో ఉందా అన్న ప్రశ్నకు లేదు అనే జవాబు చెప్పాలి. కేవలం పాలిచ్చే గోవులు, దూడలు, గేదెలు తప్ప, ఎడ్లు, ఏనుబోతులు, వట్టిఓయిన ఆవులు మొదలయినవి వధకు యోగ్యం (చంపదగ్గవి అన్న సెర్టిఫికేట్ ఉంటే) అయితే, వాటిని దేశంలోని కబేళాలకు తరలిస్తున్నారు. కేరళ, బెంగాల్ రాష్ట్రాలలో, కొన్ని ఈశాన్య రాష్ట్రాలలో దాదాపు ఎనిమిది రాష్ట్రాలలో గోవధపై కూడా నిషేధాలు ఏమీ లేవు. కోడి మాంసం, మేక మాంసంతో పోలిస్తే, ఈ పశువు మాంసం కేజీ అరవై రూపాయలకే దొరకడం, ఈ దేశంలో పేదవారి మాంస ఆహారంగా మతాలకు సంబంధం లేకుండా ఉన్నది. తినే వారిలో, హిందువులలోని నిమ్న కులాల వారూ, ముస్లింలూ, క్రిస్టియన్లూ ఆహార అవసరంగా తింటూ ఉంటే, నాగరిక సమాసంలో, విస్తృతమైన ఆహారపు అలవాట్లలో భాగంగా కూడా అందరూ తింటున్నారు. స్వామి నాథన్ అంక్లేశరియా అయ్యర్ అనే బ్రాహ్మణ వ్యక్తి, ఎకనామిక్ టైమ్స్ సంపాదక వర్గంలోని వారు, వశిష్టుడి వారసుడిగా నేను తప్పక ఆవు మాంసం తింటాను అని ఇటీవలే పత్రికాముఖంగా ప్రకటించారు కూడా.

అందరూ తింటూ ఉండగా, అన్నీ మతాలలో ఈ ఆహారపు అలవాటు ఉండగా, కేవలం ఒక వర్గాన్ని, అంటే ముస్లిం ప్రజలను దీనికి బాధ్యులను చేస్తూ ఇటీవల దాడులు జరగడం, ఆవును చంపితే, వెయ్యి రూపాయల జుల్మానా, ఆరునెలల జైలుతో సరిపోయే చట్టాలు ఈ దేశంలో ఉండగా,

ఆవును చంపి ఉంటారనే కేవల అనుమానంతో, ఏకంగా, మనిషి ప్రాణాలు పోయేలా దాడి చేసే స్థాయికి మతోన్మాదం చేరుకోవడం, ఇవాళ ఈ దేశంలో చాలా కలవరపెట్టే ఈ అంశం. పెద్దగా చదువులు లేని ఉత్తర భారత దేశం యువతను, ఇంకా ఇతర ప్రాంతాల యువతను, ముస్లిం ప్రజలు విరోధులుగా చిత్రిస్తూ, అపోహలు ప్రచారం చేస్తూ, మనిషి ప్రాణాలు తీయడం హత్యా నేరంగా పోలీసు చట్టాలు పరిగణించి తగు చర్యలు తీసుకుంటాయి అన్న భయం కూడా లేకుండా, మతం, ఆచారం, మనో భావాల పేరిట దొమ్మీకి దిగడం, మనుషులకు భయంకరంగా చంపడం వంటి పనులకు తెగబడ్డం, ఎంతైనా వ్యతిరేకించ దగ్గది.

మహారాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఈ గోవధ చట్టం పరిధిలోకి ఎడ్లు, పెయ్యలను తీసుకు రాక ముందర వాటిని కూడా చంపి ఎగుమతులు చేసే పద్దతి ఉండేది. ఇందులో ఆవులు, ఎడ్లు, గేదెలను చంపడంలో, మన భారత ప్రభుత్వ పాత్ర ఏమిటి? ఆవులు వేరు, గేదెలు వేరు అని భారత ప్రభుత్వం భావిస్తున్నది. అందువల్ల, పాలిచ్చే గేదెలను చంపడం లేదు అని చట్టాలు, దేశంలోని చట్టబద్ధ కబేళాలలో, ఇతర కబేళాల్లో (మొత్తం ముప్పైవేళకు పైగానే ఉంటాయని అంచనా) దేశంలో, పెద్ద యెత్తున మనం ఈ పశువులను (పైన పేర్కొన్న ఎనిమిది రాష్ట్రాలలో చంప యోగం అన్న సెర్టిఫికేట్ గల గోవుతో సహా) వధ్య శాలలకు పంపిస్తోనే ఉన్నాము. ఇందులో భారత దేశం స్థానం ఏమిటో తెలుసుకుంటే, మోడీ గారు గోవధ నిషేధం తెస్తానని ఎలా ఎన్నికల వాగ్దానం, చేశారా అన్నది పెద్ద ప్రశ్నగా ఉద్భవిస్తుంది. పాలిచ్చి మనల్ని పెంచే ఈ జాతి పశువుల (వట్టిపోయిన ఆవులు, ఎడ్లు గేదెలు, పెయ్యలు వగైరా)పై, మన గ్రామీణ వ్యవసాయానికి వెన్నెముక అయిన ఈ రైతు నాలుగు కాళ్ల నేస్తాలపై, మనదేశం సాలీనా (అయిదు వందల కోట్ల డాలర్ల) ముప్పయి వేల కోట్ల రూపాయల పైబడ్డ ఎగుమతుల వ్యాపారం చేస్తున్నది. బ్రజిల్, భారతదేశం కలిపి ప్రపంచ ఎగుమతుల్లో, నలభై మూడు శాతం ఈ పశువుల మాంసాన్ని ఎగుమతి చేస్తున్నాము. (ఆవు, దూడ మాంసం మినహాగా, గేదె, ఏనుబోతు, ఎద్దు అన్నీ వధకు అర్హమే. అంతట్నీ కలిపి బీఫ్ అనే అంటారు. గేదె మాంసాన్ని కరాబీఫ్ అని పిలుస్తారు. ఈ పశువుల మాంసపు ఎగుమతుల విధానాన్ని పింక్ రివల్యూషన్‌గా ప్రభుత్వాలు ప్రచారం చేస్తున్నాము. ఈ ఏడాది మన దేశపు ఎగుమతుల లక్ష్యం ఇరవై నాలుగు లక్షల మెట్రిక్ టన్నులు. అయితే ఆవు మాంసం కన్నా, కొంతనాణ్యత తక్కువదిగా గేదె మాంసాన్ని భావించే యూరప్ వారు మన ఉత్పత్తులకు ప్రధాన కొనుగోలుదార్లు కారు, కానీ, మధ్య ప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా ఆగ్నేయాసియా ప్రాంతాలకు విస్తరించిన ఈ బీఫ్ ఎగుమతి వ్యాపారంలో, ప్రపంచంలోనే మొదటి రెండు స్థానాల్లో భారత దేశం, బ్రజిల్ పోటీలో ఉన్నాయి. మిన్నియాపాలిస్,అమెరికా నుంచి వెలువడే బీఫ్ మాగజీన్ పత్రిక ప్రకారం ఈ గణాంకాలు, వ్యాపార స్థాయి అంచనాలు, ప్రపంచ బీఫ్ మార్కెట్‌కు సంబంధించిన ఈ వివరాలు తెలియ చేస్తున్నాయి. ఇతర ముస్లిం దేశాల ప్రజలు, ప్రభుత్వాలు, హలాల్ చేసిన మాంసం అయితే తప్ప దిగుమతి చేసుకోవు. అందువల్ల నాణ్యత కొంచెం తక్కువ అయినా, హలాల్ చేసిన మాంసం కనుక ఈ దేశాలు భారత్‌కు ముఖ్య కొనుగోలు దార్లు, టైమ్స్ పత్రిక కథనం ప్రకారం, ఈ దేశపు ప్రధాన వ్యవసాయోత్పత్తి అయిన బాస్మతి బియ్యపు ఎగుమతులను కూడా ఈ పశువుల మాంసపు ఎగుమతి మించి పోయిందని, ఈ వ్యాపారస్తుల్లో ఎక్కువ మంది హిందువులు కూడా, పశువుల సప్లై దారులుగా, కబేళాల సహ నిర్వాహకులుగా ఉన్నారనన్నది ఒక బహిరంగ సత్యం. వాస్తవ పరిస్థితి ఇలా ఉండగా, హిందూ సమాజంలోని కొన్ని కులాల వారూ, దళితులూ, గిరిజనులూ, సంచార జీవనులా, ఇతర మతాలయిన ముస్లిం, క్రిస్టియన్ ప్రజలూ, దేశంలోనూ, ఇంకా విదేశాల్లో విస్తార మార్కెట్‌కు ప్రథమ ఎగుమతి దారుగా ఎదుగుతున్నదేశం, ఆచరణలో వేద కాలపు జానపదుల విధానాన్నే పాటిస్తున్నది. ఆ విధానం ఏమిటంటే ఒక సాంగిక ప్రాముఖ్యత గల పశువు పట్ల, దాని ఉనికికి సంబంధించిన ఆర్థిక, ఆహార పరమైన పరిశ్రమలకు చెందిన (తోళ్ళ పరిశ్రమ - మనం వేసుకునే చెప్పులలో అధిక శాతం ఈ పశువుల చర్మాలు చక్కని నాణ్యతతో ఉంటాయని, తోలు పరిశ్రమ నిర్వాహకుల పరిశీలన, అదే మార్కెట్ డిమాండ్ కూడా) అవసరాలకు తీర్చే దిశగా ఆ జంతువును ఉపయోగించుకోవడం. నిజంగా గో వధపై సమూల నిషేధం ప్రభుత్వ విధానం అయితే, వెంటనే ప్రకటించి, ప్రపంచ బీఫ్ మార్కెట్ మొదటి స్థానం నుంచి తప్పుకోవచ్చును గదా. ఇది సాధ్యం కానప్పుడు, మాటి మాటికి గోవధ నిషేధం అంటూ ఆవు కాంపొజిషన్ రాయడం, రాయించడం, మత వర్గాల మధ్య బెదిరింపుల వాతావరణాన్ని ప్రోత్సహించడం తాము మానుకొని, మానునుకోవాలని తమ వర్గాలకు స్పష్టంగా తెలియచెప్పి, ఉల్లంఘించిన వారికి భారతీయ శిక్షా స్మృతిలోని చట్టాల ప్రకారం చర్యలు ఖాయం అన్న నిష్టుర సందేశాన్ని ఈ ప్రభుత్వాలు ఇవ్వగలగాలి. గోవుపై భక్తికి, గోజాతిని సామాజిక ఉపయోగం చేయడానికి సంబంధం లేదని స్పష్ట పరచ గలగాలి. అలా చేయనంత కాలం ఇది ప్రభుత్వాల వైఫల్యమే. లేదంటే ఆవులూ, గేదెలా, పుణ్యాలూ -పాపాలూ, ఈ లెక్క తేలే లోపల ఈవ్యాపారాలన్నీ బలపడుతూనే ఉంటాయి. మనుషులు బలి అవుతూనే ఉంటారు.

ఛానెల్ కంపెనీలే రోజూ కోటీశ్వరులు

రామతీర్థ
9849200385

"మీలో ఎవరు కోటీశ్వరుడు" అంటూ ప్రతి వారాంతపు మూడు రోజుల్లో మనం చూస్తూ ఉన్న గేమ్‌షో, భారతీయ చానెళ్లలో నడిచిన, నడుస్తున్న డబ్బై మూడు గేమ్ షోలలో ఒకటి. వినోదమే వ్యాపారం అన్నది టి.వి మాధ్యమం వచ్చాక బాగా శృతిమించి, రోజువారీగా, ఉత్పత్తి అంటూ ఏమీ లేని ఇరవై నాలుగు గంటల ఊకదంపుడుగా మారింది. ఒకప్పుడు దూరదర్శన్ రోజుల్లో, (నుక్కడ్, బునియాద్ వంటివి) చానెళ్లే నిర్మాతలుగా టివి ధారావాహికలు ప్రొడ్యూస్ చేసి, సృజనాత్మక విలువలు గల గౌరవ ప్రధమైన, సందేశంతో కూడిన కార్యక్రమాలను అందించిన మంచి కాలం వెళ్లిపోయింది. వార్తలు ప్రసారానికి, సామాజిక కథనాలకు, చర్చలకు కొంత సమయం కేటాయించి, తరువాత సినిమాలు, వాటికి సంబంధించిన పలు కార్యక్రమాలు (పాటలు, ఫైట్లు, కామెడీలు, తెర వెనుక కథలు అంటూ ఇలా నడుపుకోవడం) సాధారణంగా చానెళ్లు చేసేవి. "ఈ టీవీ" కూడా ఈ ఫార్మాట్‌లోనే తన కార్యక్రమాలను రూపొందించింది.

ఇవేవీ కాదని, ఒక పక్క "ఈటీవీ" వంటి వేళ్లూనిన సంస్థ ఏళ్ల తరబడిగా వినోద వ్యాపారంలో ఉండగా, పుట్టుకొచ్చిన తెలుగు చానెల్ 'మా టీవీ', అసలు చానెల్‌కు ఉండవలసిన సామాజిక బాధ్యతలు వేటినీ స్వీకరించలేదు, సామాజిక సమయాన్ని కేటాయిం చలేదు. చేసేది అంతా ఎంటర్‌టైన్‌మెంట్ పేరిట వినోదమే వ్యాపారంగా ఇరవై నాలుగు గంటలు, సమాజంతో సంబంధం లేని ఒక చానెల్ తీరుకు ఒరవడి దిద్దింది. వ్యాపార రంగంలో ఈ పెట్టుబడిదారులకు ఈ విధానం ప్రయోజనకారి అయిందేమో కానీ, ప్రజలకు పనికి వచ్చే కార్యక్రమాలు అసలు 'మా టి.వీ' లో లేవు. లేకుండా చూస్తున్నారు. ఎంత సేపూ సినిమాలు, వాటిచెక్కాముక్కలపై ఫోకస్‌లూ, అవార్డుల ఫంక్షన్లూ, ఆడియో విడుదల హడావిడి, విడుదలైన కొత్త సినిమాలపై, ప్రమోషనల్ కంటెంట్ ఇవే ప్రధానంగా, ఈ చలన చిత్ర వినోద ప్రధాన చానెల్ 'మా టి.వి" నడిచింది ఆరేళ్లపాటు. తెలుగు ప్రేక్షకులు ఈ చానెల్‌కు మంచి 'టిఆర్‌పి' రేటింగులు దక్కేలా శాయశక్తులా సాయపడ్డారు.

సినిమా అనేది తేలికగా ప్రజలకు అర్థమయే విషయం, తమ ప్రధాన కేంద్రగా, ఒక కాలక్షేపపు చానెల్‌గా, వరుస సినిమాలు చూపే మాధ్య మంగా, 'మా టి.వి' కార్యక్రమ నిర్మాణ రంగంలో కానీ, సామాజిక విషయాల గురించి సమయం కేటాయించకుండా విసుగు లేకుండా, సినిమా సంగతులను ఎల్లవేళలా చూసే తెలుగు వారికి ముఖ్య ఆధారమైంది. నిమ్మగడ్డ ప్రసాద్ 65 శాతం, సిని నటుడు చిరంజీవి ఇరవై శాతం, నాగార్జున పది శాతం, కొద్ది మంది ఇతరులు అయిదు శాతంగా పెట్టుబడులు పెట్టిన ఈ వినోదపు చానెల్, (అంటే ఒక రెండు వందల యాభై కోట్లు అనుకుంటే-నాగార్జున 25 కోట్లు, చిరంజీవి యాభై కోట్లు, పెట్టగా మిగతాది, నిమ్మగడ్డ ప్రసాద్ పెట్టుబడి దాదాపు 175 కోట్లు అనుకోవచ్చు). ఆరేళ్లు నిర్వహించాక, "టిఆర్‌పీ" రేటింగులు పెంచిన తెలుగు ప్రేక్షకుల పుణ్యమా అని, తమ మార్కెట్ వాల్యు ఎంత ఉందని అంచనాలు వేసారో కానీ, లాభాల దారిలో ఉన్న చానెల్‌ను, దక్షిణ భారత దేశంలో ఒక మంచి ఎంట్రీ కోసం చూస్తున్న అంతర్జాతీయ వినోదల వ్యాపారాల సంస్థ "స్టార్ టి.వి"కి, పైకి చెప్పని ధరకు అమ్మి వేశారు. "మేం నిర్వహించే దశ దాటిపోయాక, మా కన్నా విస్తృతంగా నిర్వహించే శక్తి సామర్థ్యాలు, అనుభవం గల వారికి అప్పజెప్పడమే మంచింది", అన్నారు నిమ్మగడ్డ ప్రసాద్. భాగస్వాములందరూ, కొత్త యాజమాన్యపు సంస్థ సి.ఇ.ఓ ఉదయ్ శంకర్‌తో కలిసి ఫోటోలు దిగారు.

అయిదు వందల మంది ఉద్యోగులతో సహా ఉన్న సాంకేతిక వసతులు, స్థిరాస్తులు, మేదా హక్కుల కిందట లభ్యమైన సమాచారమూ అన్నీ వారికి దక్కగా, వీరు కనీసం 2 వేల కోట్లకు ఈ అమ్మకాన్ని కుదుర్చుకుని ఉంటారు అని పత్రికలు అప్పట్లో రాశాయి. అంటే పెట్టుబడుల నిష్పత్తుల ప్రకారం, నాగార్జునకు 200 కోట్లు, చిరంజీవికి 400 కోట్లు, నిమ్మగడ్డ ప్రసాద్‌కు మిగిలిన 1400 కోట్లు, (కొంత తక్కువ సొమ్ము అయిదు శాతం పెట్టుబడులు పెట్టిన వారికి పోగా), ఈ బేరంలో దక్కి ఉండవచ్చు. "మా" బ్రాండ్‌ను ఆదరించి, ఇంత స్థాయికి తెచ్చిన తెలుగు ప్రేక్షకులు, ఇప్పుడు స్టార్ టీవీ చేతికి చిక్కారు. పేరు మార్చకుండా, ఈ కార్యక్రమాలను దాదాపు గత ఏడాది నుంచి స్టార్ టి.వి పెత్తనంలో ప్రసారమవుతున్న కంటెంట్‌ను మనం చూస్తున్నాం. అంటే ఈ వ్యాపారాన్ని మొదలుపెట్టిన ఆరేళ్లలో, ఎనిమిది వందల శాతం లాభానికి (250 కోట్ల మదుపు, 2000 కోట్లుగా పెరిగింది) అమ్ముకున్నారు. అప్పటి వ్యాపార కొనసాగింపు ఒప్పందాల్లో భాగంగానే, ఈ చానెల్‌కు సంబంధించిన ముఖ్య అంటే పతాక లేదా ఫ్లాగ్ షిప్ ప్రోగ్రాంను తిరిగి చానెల్ టీఆర్‌పి అభివృద్ధికి తోడ్పడేలా, ఉపయోగించాలని నిబంధనలు రాసుకుని ఉంటే, అందులో ఒక భాగమే ఇప్పుడు మనం చూస్తున్న, నాగార్జున ప్రమోట్ చేస్తూ, తానే నిర్వహిస్తున్న ఎంఇకె గేమ్ షో.

ఈయనకో ఇంత ఫీజు అన్నది పక్కన పెట్టేస్తే, ఈ డబ్బు ఎంత వస్తున్నది ఎవరికి వెళ్తున్నది అని చూస్తే, నిర్వహించే కంపెనీలే ప్రతి ఎపిసోడ్‌కూ కోటీశ్వరులు అవుతున్నారు అని తెలుసుకుంటాం. ఈ గేమ్ షో సంగీతంతో సహా, "హూ వాంట్ టు బి ఏ మిలియనీర్" అనే మొదట 1998లో బ్రిటన్, తదుపరి 1999 నుంచీ అమెరికాలో విజయవంతంగా నడుస్తున్న దానికి నకలు. మధ్య మధ్యన చిటికలో వచ్చేస్తాను అంటూ (3, 4, 5 నిమిషాలు గా) వచ్చే కమర్షియల్ బ్రేక్‌లో వారు ప్రస్తుత "తెలుగు ఎంఈకె"లో ప్రతీ ఎపిసోడ్‌లో ఇరవై నిమిషాల వ్యాపార విరామం అమలు పరుస్తున్నారు. ఒక నిమిషం ప్రకటనల ఖరీదు అధమ పక్షం అయిదు లక్షలు అనుకుంటే, ఈ కమర్షియల్ బ్రేక్ వల్ల వారికి ప్రతి ఎపిసోడ్‌కూ కోటి రూపాయలు వస్తున్నాయి. ఇక చూపే కోట్లాది మందికి వేసే ప్రశ్న అంటూ, ప్రతి రోజూ ఒక ప్రశ్న (దాదాపు అందరూ జవాబు చెప్పగలిగేది) చొప్పున మూడు రోజులూ వేస్తున్న మూడు ప్రశ్నలకు, సర్వీస్ ప్రొవైడర్ ఎయిర్‌టెల్ ద్వారా వ్యాపార ఛార్జీలు అమలు అయ్యే కాల్ ద్వారా సమాధానాలను కోరుతున్నారు. గెలిచిన వారికి పదివేలు, ఏ లాటరీ పద్ధతిలోనో ఇస్తారు సరే, కానీ, ఈ ప్రశ్నలకు, రోజూ చూస్తున్న (నాలుగు కోట్ల మంది చూస్తున్నారని అంటున్నారు నాగార్జున) వారిలో ఒక కోటి మంది జవాబులు పంపినా, కాల్‌కు ఆరు రూపాయలు చొప్పున అదే రోజుకు ఆరు కోట్లు. మూడు రోజులకు పద్దెనిమిది కోట్లు. వారు ఇచ్చేదల్లా రోజుకు ఒక కాలర్‌కు పది వేలు. ఎయిర్ టెల్‌కూ, మా టి.వి (అంటే స్టార్ టివికీ మధ్య గల షేరింగ్ ఒప్పందాల ప్రకారం) మనం ఆ ప్రశ్నలకు (ఆరురూపాయలే కదా కాల్ ఛార్జీలు అని) జవాబులు ఇవ్వడం వల్ల, కోట్లు దక్కుతున్నాయి. వెరసి గేమ్ షో ప్రతి ఎపిసోడ్ వల్ల ఎంత లేదన్నా కనీసం రోజుకు అయిదారు కోట్లు సంపాదిస్తూ, వారు తమ సోషల్ రెస్పాన్సిబిలిటీ గురించి మాట్లాడరు. ఛారిటీలో డబ్బులు పెడతామని చెప్పగానే, వచ్చిన పోటీదారులను అడుగుతారు. వివరాలేమిటని, అదేదో గొప్ప విషయం వలె. తేలికగా డబ్బు సంపాదించడమూ, ఒక ప్రముఖ తారతో కలిసి కాసేపు టీవీ తెరపై కనిపించడమూ, అనే పరిమితమైన, బాగా అమాయకమైన లక్ష్యాలతో ప్రజలు వీటిని ప్రోత్సహిస్తూ, అందులో తాము పాల్గొంటూ ఉంటారు. కానీ ఆలోచించండి. ఏ ప్రొడక్టు (ఉత్పత్తి) లేకుండా, కేవలం మాట్లాడితే, రోజూ కోట్లు వచ్చే వ్యాపారం, ఈ బాధ్యత లేని వినోదం కాక ఇంకా ఏమిటో ఉన్నది? మన దేశంలోనే వందలాది చానెళ్లలో 73 ఇలాంటి గేమ్‌షోలు నడుస్తున్నాయంటే, ఇదొక రకం జూదం. మనం పెట్టేది తక్కువ. వస్తే మంచి ఫలితం వస్తుంది. అన్న సామాజిక మనస్తత్వం, విలువైన సాంకేతిక మాధ్యమాలను సమాజ ప్రయోజనాలకు దూరంగా, సంపన్నులు వాడుకునే ఇలాంటి దారులను గొప్పవిగా చూపడమే ఇక్కడ గల వైరుధ్యం. పాశ్చాత్య షోలలో, దీనికి చెందిన వివాదాలు ఎక్కువగానే ఉన్నాయి. ఇంకా మనం అంతగా ఎదగ లేదు. "మీలో ఎవరు కోటీశ్వరుడు" అంటే, చూసేవారు సరదాకి చూస్తారు, పాల్గొనేవారు, వారి చదువు, సాంస్కృతిక నేపథ్యం, ఉద్యోగ రంగానుభవం, ఇలా పలు రంగాలలో, కావాల్సినంత జ్ఞానం ఉన్నా, అన్నీ తెలిసిన వారు కాకపోవచ్చు. కాలేరు. స్టార్ టివి వెనక పత్రికా రంగపు గుత్తాధిపతి, రూపర్ట్ మర్డోక్ ఉన్నారని, వారి వ్యాపారం వెనుక "ట్వెంటీ ఫస్ట్ సెంచురీ ఫాక్స్" అనే అమెరికాకు చెందిన ఇంకో వినోద వ్యాపార సంస్థ" స్టార్ ఇండియా"కి తల్లి అని తెలుసుకుంటూ పోతే, ఈ మహా వినోద సామ్రాజ్యంలో "మా టి.వి" ఎంత చిన్న అస్తిత్వమో మనం తెలుసు కుంటాము. దేశీ, విదేశీ కంపెనీలు కోటీశ్వరులు, కోటి కోటీశ్వరులు అవడానికి, మనం ఇంటింటా రెండు మూడు టి.విలు పెట్టుకుని, వారికి ధన సంపాదనలో మన శక్తివంచన లేకుండా సాయపడుతుంటాం. అలాంటి సామూహిక మనస్తత్వ స్పందనా ప్రక్రియకు ఒక స్థానిక ఉదాహరణ ప్రస్తుతం మన కళ్ల ముందున్న "మీలో ఎవరు కోటీశ్వరుడు?" ఒక వినోద వలస పాలనను మనవారే నెత్తికి ఎత్తుకుంటున్న ఈ వర్తమా నంలో, ఈ వినోద వలస ఆధిపత్యాన్ని అత్యుత్సాహంతో అమలు చేస్తున్నది మన దేశీయులే. ఇది ప్రజలకు తెలియడం కష్టసాధ్యం. అవధులు తప్పిన వినోదం బాధ్యతలు మర్చిపోయేలా చేస్తుంది. విజ్ఞాన దాయిని కాని ఏ మాధ్యమం అయినా, చివరికి ఇలానే పరిణమిస్తాయి అన్నది ఇంతవరకూ మనకు ఇరవయ్యో శతాబ్దం చెప్పిన పాఠం. నేర్చుకుంటామో, లేదో, అన్నది ప్రజల పైననే ఆధారపడి ఉన్నది.

> "మీలో ఎవరు కోటీశ్వరుడు" అంటే, చూసేవారు సరదాకి చూస్తారు, పాల్గొనేవారు, వారి చదువు, సాంస్కృతిక నేపథ్యం, ఉద్యోగ రంగానుభవం, ఇలా పలు రంగాలలో, కావాల్సినంత జ్ఞానం ఉన్నా, అన్నీ తెలిసిన వారు కాకపోవచ్చు. కాలేరు. స్టార్ టివి వెనక పత్రికా రంగపు గుత్తాధిపతి, రూపర్ట్ మర్డోక్ ఉన్నారని, వారి వ్యాపారం వెనుక "ట్వెంటీ ఫస్ట్ సెంచురీ ఫాక్స్" అనే అమెరికాకు చెందిన ఇంకో వినోద వ్యాపార సంస్థ" స్టార్ ఇండియా"కి తల్లి అని తెలుసుకుంటూ పోతే, ఈ మహా వినోద సామ్రాజ్యంలో "మా టి.వి" ఎంత చిన్న అస్తిత్వమో మనం తెలుసు కుంటాము.



ఇజ్రాయెల్ యువతి, పాలస్తీనా యువకుడి మధ్య అమెరికాలో జరిగే ప్రేమ కథతో ఇజ్రాయెలీ రచయిత్రి డోరిట్ రబిన్యాన్ రాసిన నవల 'గదర్ హయా'. దీనిని పాఠ్యాంశంగా నిర్ణయించనందుకు నిరసనలు వెల్లువెత్తడంతో పాటు, ఇప్పుడీ నవల ఇజ్రాయెల్‌లో అధికంగా అమ్ముడవుతూ యువత విస్తృతంగా చదువుతున్నది.

నిప్పుల జడిలో గుప్పుమన్న ప్రేమ!

యుద్ధాలు మనుషులను చంపేస్తాయా? మనుషులు యుద్ధాన్ని చంపేస్తారా? యుద్ధాన్ని చంపడం అంటే ఏమిటి? ఎలాగ? అరబ్ లోకం మధ్యలో ఇజ్రాయెల్ దేశం ఏర్పాటు చేయడం ఇరవయ్యో శతాబ్దంలో ఒక కీలక ఘట్టం. జాతుల కుంపట్లు రగుల్కుంటూనే ఉన్నాయి. పాలస్తీనా ఒక దేశం కోసం ప్రయత్నిస్తూనే ఉన్నది. చిన్న భూమి పీలిక గాజా, పాలస్తీనా ప్రజలదని అంతర్జాతీయ సమాజం అంగీకరించినా అక్కడి ప్రజలపై, నిరంకుశ ఆంక్షలు అమలు చేయడంలో ముందర ఉన్నది ఇజ్రాయెల్. పాలస్తీనా ఇజ్రాయెల్ సరిహద్దుల్లో అరబ్ స్వేచ్ఛావాదులకు, ఇజ్రాయెల్ దళాలకు మధ్య హింస ఆగకుండా కొనసాగుతున్నది. పాలస్తీనాప్రజలపై ఇజ్రాయిల్ వివక్షలను, హింసాత్మక దమన కాండను ఆ ప్రాంతానికి, ఆసియా ఖండానికి చెందని అమెరికా దేశం అన్నివిధాలా సమర్థిస్తూ, మధ్య ప్రాచ్యంలో తమ విధానాలతో శాంతి లేకుండా చేసింది. ఎన్ని యుద్ధాలు జరిగితే ఇక్కడికి శాంతి వస్తుంది?ఒకప్పటి ప్రఖ్యాత కవులు యెహుదా అమిచాయి, మహ్మూద్ దర్వీష్, తాము ఇజ్రాయెల్, పాలస్తీనా దేశీయుల పైనా సహజీవనం అనివార్యమని ప్రకటిస్తూ, తమ నమ్మకాలు, ఆశలన్నీ యుద్ధాలపై కాక ప్రజలపైనే ఉంచారు.

'కవులేం చేస్తారు' అనడిగాడు ప్రముఖ కవి శివారెడ్డి, అదే పేరు గల కవిత రాస్తూ. విపులమైన జవాబులో, కవులు ప్రజలకు ఏవేవి ఇస్తారో వివరించాడు. ఇదొక ప్రఖ్యాత కవిత. అలాగే, ఇజ్రాయెల్ ప్రజలు అందరూ పాలస్తీనా ప్రజలకు శత్రువులు కారు. ఈ సంగతి మనం కాదు వారే చెప్పాలి. అలా చెప్తూ వస్తున్న సాహిత్య ప్రతిభా వంతుల కోవలోకి తాజాగా వచ్చి చేరిన యువ ఇజ్రాయెలీ రచయిత్రి డోరిట్ రబిన్యాన్.

ఈమె తన మూడో నవలగా రాసిన 'గదర్ హయా' ('బార్డర్ లైఫ్' గా ఆంగ్లానువాదం, అసలు హిబ్రూ అర్థం 'కంచె పొదలు' అని) లో, ఇజ్రాయెల్ యువతి, పాలస్తీనా యువకుడి మధ్య అమెరికాలో జరిగే ప్రేమ కథను చిత్రణ చేస్తుంది. ఏమ్ ఒవెద్ ప్రచురణ కర్తలుగా అచ్చయిన ఈ నవలలో లియాత్ అనే ఇజ్రాయెలీ యువ అనువాదకురాలు, తన అమెరికా జీవితంలో, హిల్మి అనే పాలస్తీనా కళాకారుడిని ప్రేమిస్తుంది. ఇద్దరి ప్రేమకు న్యూయార్క్ లో నేపథ్యం. తిరిగి తమ దేశాలకు వచ్చాక, యువతి ఇజ్రాయెల్ లోని టెల్ అవీవ్‌కు, యువకుడు పాలస్తీనా లోని పడమటి గట్టు నగరమైన (వెస్ట్ బాంక్) రమల్లాకు వెళ్తారు. ఇలా ఇజ్రాయెల్, పాలస్తీనా ప్రజల సామరస్యాన్ని గూర్చి చెప్పిన ప్రఖ్యాత రచయితల రచనలు ఇంతకు ముందరే వచ్చాయి. అవి వారి ఆర్ట్స్ అండ్ హ్యూమనిటీస్‌లో భాగంగా, ఇజ్రాయెల్ లోని విద్యార్థులు ఉన్నత పాఠశాలల్లో, కళాశాలల్లో చదువుతున్నారు. హలెమ్ బలీక్, ఇజాక్ బశెవిస్ సింగర్, శ్మువెల్ యోసేఫ్ అగ్నాన్, సమీ మైకేల్ వంటి వారి రచనలు ఇప్పటికీ వారి అకడెమిక్ సిలబస్‌లో భాగంగా ఉన్నాయి.

అధ్యాపక సంఘాలు డోరిట్ రబిన్యాన్ నవలను పాఠ్య ప్రణాళికలో చేర్చమని కోరిన మీదట, 'ఈ నవల ఒకటిన్నర ఏడాది ముందరే విడుదలయినది, పాఠ్యాంశంగా ఉండనవసరం లేదు' అని ఇజ్రాయెల్ హోం మంత్రిత్వ శాఖ నిర్ణయిస్తే, దానికి నిరసనలు వెల్లువెత్తాయి. ఇదంతా డిసెంబర్ 2015లో జరగగా, ఇప్పుడీనవల ఇజ్రాయెల్‌లో అత్యధికంగా అమ్ముడవుతూ యువత విస్తృతంగా చదువుతున్నది. ప్రజలలో ఇలాంటి ప్రేమలు, పెళ్లిళ్లు జరిగితే, తమ జాతి అస్తిత్వాన్ని కోల్పోతామని అధికార వర్గాల అభిప్రాయం. తమకు నచ్చిన రీతిలో జీవించే హక్కు ప్రజలకు ఉందా, లేక ఇది కూడా ప్రభుత్వాలే నిర్ణయిస్తాయా అన్నది అక్కడ చర్చనీయాంశం అయింది. అవటానికి నలభై రెండేళ్ల వయసు కల రచయిత్రే అయినా, ఇజ్రాయెల్ సమాజంలో గల ఉదార విధానాల వల్ల, ఇప్పటికే, ఈమె రచన 'అవర్ వెడ్డింగ్స్' పాఠ్యాంశంగా విద్యా సంస్థల్లో బోధిస్తున్నారు.

ఇజ్రాయెల్ సాంస్కృతిక సమాజంలో డోరిట్ రబిన్యాన్ ఒక చురుకైన సాహిత్య వేత్త. 1972లో పర్షియన్-యూదుగా జన్మించి, తన ఇరవై రెండేళ్లకే తొలి నవల ప్రచురించిన వ్యక్తి. టీవీ ధారా వాహిక 'షలీస్ ఫియాన్స్' కు తెర రచన చేసింది. "యెస్,యెస్,యెస్" అని ఒక కవిత్వ సంపుటి, పెర్సియన్ బ్రైడ్స్, అవర్ వెడ్డింగ్స్, అండ్ వేర్ వాజ్ ఐ (బాల సాహిత్యం) ఇప్పుడీ 'గదర్ హయా' వెలువరించింది. ఈ నలభై రెండేళ్ల వయసుకే 1996లో వెయినర్ బహుమతి, 1997లో జ్యూయిష్ ఫిల్మ్ అకాడెమి నుంచి బెస్ట్ డ్రామా ఆఫ్ ద ఇయర్, 1999లో జ్యూయిష్ వింగేట్ క్వార్టర్లీ అవార్డ్, ద ప్రైమ్ మినిస్టర్స్ ప్రైజ్, లిటరరీ ACUM అవార్డ్, ఈ బార్డర్ లైఫ్ నవలకు 2015 బెర్న్‌స్టీన్ బహుమతి గెల్చుకున్న శక్తివంతమైన రచయిత్రి. 'తెలివి, ఇంగితం కల పరిణత పాఠకుల కోసం రాసిన నవల ఇది. కథానాయకుడు ఒక మైనారిటీవర్గ వ్యక్తిగా ఇజ్రాయెల్ సమాజంలో ఎలా పెరుగుతాడు, తనపై ఉండే ఒత్తిళ్ళు అతన్ని ప్రేమించిన మెజారిటీ వర్గపు అమ్మాయి ఎదుర్కోవలసిన స్థిర ఛాందస భావాలు, వీటిపై కొంత చిత్రణకు, ఈ పరిస్థితులు మారడానికి తగు సన్నాహాలు ఎక్కడినుంచి రావలసింది సూచించడానికి ఈనవలలో ప్రయత్నం చేశాను' అంటున్నదామె.

ప్రభుత్వపు ఈ అతి జోక్యందారీ విధానానికి నిరసన నమోదు చేయ నిశ్చయించిన టెల్ అవీవ్‌కు చెందిన 'టైమ్ అవుట్ టెలివిజన్ చానెల్ ప్రజలను తమ ప్రతికూలతను తెలియచేయ ఆహ్వానించింది. పెద్దపెద్ద చర్చలేమీ ఈ సందర్భంగా జరగలేదు. టాక్ షోలలో ఒకరినొకరు గొంతులు చించుకుని టీవీ రేటింగుల కోసమని నిందించుకోలేదు. ఆయుధాల కన్నా పెద్దగా తమ మాటల ద్వారా ఈర్ష్యా ద్వేషాలను రెచ్చగొట్టలేదు. మరి, ఏం జరిగింది ఆ టీవీ చానెల్‌లో? ఇజ్రాయెలీ, పాలస్తీనా జాతులవారైనప్పటికీ, ఇజ్రాయెల్ పౌరులైన ఆడ, మగ, ప్రేమికులు, సహ జీవనులూ, దంపతులూ, ఇంకా స్వలింగ సంపర్కులూ, ఒకరితో మరొకరికి ముఖ పరిచయం కూడా లేని వారంతా చేరారు అక్కడకు. యుద్ధాలు యుగావసరం అని నమ్ముతున్న యుద్ధపు పిచ్చోళ్ళ నష్టదాయిక విధానాలకు చెల్లుచీటి రాయడం సాహిత్యం వల్లనే సాధ్యమవుతుందని నిరూపించారు. డోరిట్ తన నవలలో ఏం రాసిందో, అది నిజం చేసి చూపించారు. జంటలు జంటలుగా ఆడ, మగా, మగ మగా, ఇజ్రాయెలీ, పాలస్తీనా పౌరులు తమ సహజీవనమే అనివార్యం అని చెప్తూ, టీవీ తెరలపై ఒకరినొకరు ముద్దులు పెట్టుకుంటూ, యుద్ధాలకు ప్రేమనొక సవాలుగా విసిరారు.

బహుశా 'ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును, ప్రేమ కలుగక బతుకు చీకటి' అన్న తెలుగువాడెవడో కానీ, ఈ సంగతి, సుదూర ఆసియా దేశంలో, 2016లో ఇంత అర్థవంతంగా సాక్షాత్కరించడం కన్నా, సాహిత్య సార్వజనీనతకు ప్రయోజనం ఏముంది? నాలుగు పెదవుల కలయిక, నలభై రకాల ద్వేషాలకు మించిన ఆయుధం అయితే, ఆచరణలో ఈ పౌర సమాజపు ప్రతినిధులు అలనాడు కబీర్ ఏమన్నాడో దానికి నిలువెత్తు రూపాలుగా నిలిచారు. (ఢాయి అక్కర్ ప్రేమ్ కె అంటూ) 'రెండున్నర అక్షరాల ప్రేమను ఎరగని వాడు, పండితుడెలా అవుతాడు? అన్న దాన్ని పొడిగిస్తూ, ఈ రెండున్నర అక్షరాల ప్రపంచ ఐక్యతా సూత్రాన్ని ఎరగని వారు, ఆయుధ శాస్త్రాలు, ఆర్థిక శాస్త్రాలు, ఆంక్షల సూత్రాలు, నువ్వు వేరు, నేను వేరు అని చెప్పే వివక్షల తర్కాలు, ప్రజలను నిర్మూలించే నిబంధనలు ఎన్ని రాస్కున్నా, మనుషులు కాగలరా అని ప్రశ్నిస్తున్నారు. ఈ ముద్దుల నిశ్శబ్ద సంస్కారం, సామరస్య అవగాహన ప్రపంచ వ్యాప్తమవుతే, అందులో సామాన్యుల సాహసాలుగా ఇవి అసంఖ్యాకంగా నమోదయితే, వీటి ముందర, వేల ఆటం బాంబులు, లక్షల యుద్ధాహంకారాలు, పెట్టుబడి దారీ సామ్రాజ్య దండయాత్రలు చిన్నబోతాయి, నిష్ప్రయోజనం అవుతాయి. ఒక మహాకవి చెప్పినట్టు ప్రేమ 'కుహూరుత శీకరాలే లోకమంతా జల్లులాడే ఆ ముహూర్తాలాగమిస్తాయి'. ఎలా వస్తాయి అంటే ఆ సమస్త మానవ సన్మంగళ ముహూర్తాలు ఇలానే అవతరిస్తాయి.

n రామతీర్థ

98492 00385

విద్యార్థులతో విశ్వవిద్యాలయాల చావాటలు

రామతీర్థ
9849200385

ప్రాథమిక విద్య నుంచీ, ఉన్నత దశలకు విద్య వెళ్తున్న కొద్దీ, విద్య నేర్చేవారు, ఈ ఉన్నత విద్యల ప్రాంగణాల లోకి, భిన్న భిన్న జీవిత నేపథ్యాల నుంచి వస్తారు. తమ విద్య వల్ల పొందిన జ్ఞానాన్ని తమ జీవన మనుగడలో ఒక దన్నుగా, ఒక అభివృద్ధి సూచికగా ఉపయోగించుకుంటూ సమాజ జీవనాన్ని సంపన్నం గావిస్తారు. విద్యా రంగంలో సామాజిక సమభావన, దేశ సర్వతోముఖ స్వాతంత్ర్యానికి తొలి గుర్తు, దీన్ని సాధించకుండా మనం రాజకీయ స్వాతంత్ర్యాన్ని పొందాక, సామాజికంగా పరిణత పౌరులుగా ప్రవర్తించగలమా? ఈ దిశగా మన సమాజ ప్రవర్తన రోజు రోజుకూ, అభ్యంతర కరంగా తయారవుతున్నదే తప్ప మంచి ఆలో చన, సుహృద్భావ వాతావరణం, ముఖ్యంగా ఉన్నతవిద్యావేదికల్లో ఏర్పడ్డం లేదు. మనం రాజ్యాంగాన్ని ఖరారు చేసుకున్న రోజు 26 జనవరి 1950ని ప్రస్తావిస్తూ, రాజ్యాంగ నిర్మాత బి.ఆర్ అంబేద్కర్ 26 జనవరి 1950 మనం వైరుధ్యాల జీవితంలోకి ప్రవేశిస్తున్నాము. రాజకీయంగా మనం సమానత కలిగి ఉంటాము. కానీ, సాంఘిక, ఆర్ధిక రంగాలల్లో, ఒక అస మాన జీవితానికి గురి అవుతాము. రాజకీయంగా మనం అందరమూ గుర్తిస్తాము, ఒక మనిషికి ఒకే వోటు, ఒకే విలువ అని, కానీ, సాంఘిక, ఆర్ధిక రంగాలల్లో మనం ఇంతకు ముందే ప్రభావితమై ఉన్న సాంఘిక, ఆర్ధిక నిర్మాణాల వల్ల, ఒక మనిషికి ఒకే విలువ అనే సూత్రాన్ని నిరాకరి స్తాము, ఇలా ఎంత కాలం ఒక వైరుధ్యాలతో నిండిన జీవితాలను గడపగ లం? అని ప్రశ్నించారు. జనవరి 17న చాలీ జీవితం అని ఆత్మహత్యకు పాల్పడ్డ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేముల, తన ఆత్మహత్య లేఖలో ప్రస్తావించిన ఒక మనిషికి ఒక విలువ, మనం పాటిస్తున్నామా అన్న ప్రశ్నకు మూలం, ఈ అంబేద్కర్ భావనల లోనిదే. వివక్షకు కేంద్రాలుగా దేశంలో విశ్వవిద్యాలయాలు ఒక ప్రమాద కర స్థాయికి చేరుకున్నాయి అన్నదానికి అక్కడి పలు రకాల ఒత్తిడిని తట్టుకోలేని ఈ పిల్లవాడి మరణం ఒక మహా విపత్తుకు హెచ్చరిక. అసలు ఒత్తిడి ఎందుకు ఉండాలన్నది ఒక మంచి ప్రశ్న. వేళ్లు తన్నుకున్న ఈ కుల మహమ్మారిని అసమానతల విచ్చలవిడి తీరును గర్హిస్తూ, సాక్షాత్తూ యూని వర్శిటీ గ్రాంట్స్ కమిషన్, 2012లోనే ఈ అసమానతలను తొలగించేం దుకు నియమాలను జారీ చేసిందంటే, దీని తీవ్రతను మనం అర్థం చేసుకోవచ్చు. దేశ రాజధానిలో ఒక వైద్య విద్యార్థి, ఒక రిసెర్చ్ స్కాలర్ ఆత్మహత్యలు చేసుకున్నాక (ప్రమోషన్ ఆఫ్ ఈక్విటీ ఇన్ హైయర్ ఎద్యుకకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ రెగ్యులేషన్స్, 2012) పేరిట జారీ అయిన గజెట్ నోటిఫికేషన్, కులం, విశ్వాసం, మతం, భాష, జాతి, లింగభేదం, శరరీ వైకల్యాలు పట్టించుకుంటూ, ఏ రూపంలోనూ వివక్షను, విద్యావ కాశాలు కల్పించడంలో అమలు చేయరాదు అని స్పష్టం చేస్తూ, మానవ జీవన మర్యాదలకు అవమానకరంగా ఉండేలా ఎడం పెట్టిచూడడమూ, ఆ విద్యార్థిపై కానీ, విద్యార్థుల బృందాలపైన కానీ సతాయింపులు, వేధింపులు, చిన్న చూపులు, శిక్షల రూపంలో అమలు జరపరాదు అని కూడా నిర్దేశిం చింది. ఇంతేకాకుండా, ఆ నోటిఫికేషన్, ప్రతీ విశ్వవిద్యాలయ కేంపస్ లోనూ, ఒక వివక్ష వ్యతిరేక అధికారి (యాంటీ డిస్క్రిమినేషన్ ఆఫీసర్)ని నాయామకం చేయాలని, ఇటువంటి కేసులన్నీ తన పరిధిలోకి వస్తాయని కూడా సూచించింది. ఈ పైపై వేధింపుల కన్నా ప్రభుతవ్వం, ఇక ముందు దళిత విద్యార్థులకు ఇచ్చే స్కాలర్ షిప్‌ల గ్రాంటులను దాదాపు రద్దు చేసి, వారిని, బాంక్ రుణాల ద్వారా చదువుకోమని కోరడం అనేక మంది పేద విద్యార్థుల చదువుల భవిష్యత్‌ను గందరగోళానికి గురి చేస్తుంది. చరిత్ర, సంస్కృతి, సాహిత్యం, విజ్ఞాన శాస్త్రం, ఇలా పలు రంగాలలో భిన్న భావాల ప్రతిపాదనల, వాద వివాద ప్రజాస్వామిక స్ఫూర్తికి దర్పణంగా ఉండవలసిన విశ్వ విద్యాలయాలు, అటువంటి కృషి ద్వారా రేపటి సమాజంలో భిన్న ప్రయోజనకరమైన పత్రాలను పోషించే వ్యక్తులను రూపొందించగలవు. భావ జాల సంఘర్షణ సహజం కావచ్చు, కానీ అది భౌతిక దాడులకు, ఒక వర్గాన్ని సమర్థించేలా యూనివర్శిటీ యాజమాన్య పక్షపాత ధోరణికి దారి తీయకూడదు.

రోహిత్ వేముల విషయంలో, విద్యార్థి వర్గాల మధ్య విబేధాలు ఉన్న మాట వాస్తవం, అయినా, మొదటి నిర్ధారణ కమిటీ నివేదిక, విద్యార్థులెవరినీ, శిక్షలకు గురి చేయకుండా సమస్యను సామరస్యంగా పరిష్కరిస్తే, అటుపై ఎ.బి.వి.పి, విద్యార్థుల దృష్టి కోణానికి అనుకూలంగా తాము అధికారంలో ఉన్నాము కదా అని మంత్రులు ఏకంగా కేంద్రస్థాయికే ఆరోపణలను పంపించడం, వాటిపై కేంద్రప్రభుత్వం మానవ వనరుల శాఖ ఉత్తరాల పరంపరకు లొంగి, ఈ విశ్వవిద్యాలయ యజమాన్యం, అంబేద్కర్ స్టూడెంట్స్ సంఘువు సభ్యులైన విద్యార్థులపై పాఠాలు వినడానికి తప్ప ఇతర సంచారాలకు, గురుకుల బహిష్కారం విధించడం, ఒక అంటు పాటించినట్టే అయింది. ఈ రకమైన శిక్ష ఎక్కడా కనీ వినీ ఎరగము. సిద్ధాంతాపరంగా ఉరి శిక్షను నూరు దేశాలు పైగా వ్యతిరేకిస్తున్నాయి. ఆ శిక్షకు తమ దేశంలో స్థానం లేదు అని తేల్చి చెప్పాయి. అవుతుందని, బండారు దత్తాత్రేయ ఎలా భావించారో తెలియదు.తమ పార్టీ విద్యార్థి సంఘ ప్రతినిధుల కోరిక మేరకు ఒక అటానమస్ విశ్వ విద్యాలయపు పరిపాలన వ్యవహారాల్లో జోక్యం చేస్తునే లేఖ ఒకటి రాశారు. దానిలో కుల ఆధిక్యత బాధితులైన దళిత, పేద విద్యార్థులను కులాహంకారులుగా పేర్కొన్నారు. దళితులు కేస్టియస్ట్‌గా ఎలా ఉండగలరో వారికే తెలియాలి.

హైదరాబాద్ విశ్వవిద్యాలయపు ప్రధాన ద్వారం ఎదురుగా గల ఒక మాల్ వద్ద డేరా వేసుకుని దాన్ని వెలివాడగా ప్రకటించుకున్న దళిత విద్యార్థులు, ఇంతకు ముందరే యూనివర్శిటీ యజమాన్యానికి తమ లేఖల్లో ముఖ్యంగా రోహిత్, తమకు ఉరి తాళ్ళు సప్లై చేయమని లేదా సోడియం అజీనైడ్ విషం కేటాయించమని, ఇంతకన్నా, ఈ కేంపస్‌లో తమ విద్యార్థి జీవితాలు కొనసాగే పరిస్థితులే లేవని రాయడం చేశారు. అప్పుడైనా, పిల్మ మానసిక పరిస్థితులను ఎరిగి, ఒక సంబంధిత ఆచార్యుడు,ఒక పరిపాలక సంఘం, ఒక వి.సి. అయినా వారిని కలిసి విషాయన్ని శృతి మించకుండా, పరిపక్వతతో వ్యవహరించి ఉంటే, రోహిత్ మనకు, ఒక విలువైన స్కాలర్‌గా దక్కే వాడు. ఈ విషయంలో హైదరాబాద్ విశ్వవిద్యాలయం, ప్రవర్తన, అతి ధోరణులకు పోయినట్టు, తాము ఏ పక్షాన ఉన్నామో, పూర్తిగా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖతో సహా, వెలివాడ లోని పిల్లలకు మానసిక స్థైర్యం, భరోసా ఇచ్చే వారే లేక పోవడం, ఈ దేశపు విషాదం.

పిల్లవాడు తెగించి తన నిండు ప్రాణాన్ని బలి ఇచ్చాక, చావాట మాత్రం అందరూ చక్కగా ఆడారు. ముందు, తమ కేమీ సంబంధం లేదు అన్నారు మంత్రులూ, అధికారులూ, ఈ లోగా పోలీసులు, ఒక శ్మశానంలో అంత్యక్రియలు అని ప్రకటించి, మరొక చోట గుట్టు చప్పుడుగా ఈ పని ముగించారు. సోషల్ మీడియా అవమానకరమైన వ్యాఖ్యలకు దిగింది. చనిపోయిన పిల్లవాడు అసలు దళిత అనగా ఎస్.సీ వర్గం వాడు కాదని, షెడ్యూల్డ్ జన జాతుల్లోకి వచ్చినా, వెనుక బడ్డ వర్గాలకు చెందిన ఇంకో కులం కనుక, దళిత కోసమే లేదు అని, అతి అన్వయాలకు దిగారు. అదేదో గొప్ప విషయంలాగా తన వివరణలో కేంద్ర మంత్రిణి ఏం చెప్పారో ఆమెకే తెలియాలి. సానుకూల అంశాలుగా, పిల్లలకు సంబంధించిన పరిపాలక (అడ్మినిస్ట్రేటివ్) బాధ్యతల నుంచి, పన్నెండు మంది ఆచార్యులు, ఆమె చెప్పింది సబబుగా లేదు, నిజం కాదు అంటూ తమ అదనపు బాధ్యతలకు రాజీనామాలు చేశారు. జాతీయ స్థాయి రచయిత అశోక్ వాజపేయి, ఈ యూనివర్శిటీ ఇచ్చిన డి.లిట్, తిరిగి ఇచ్చేస్తూ, ఈ విశ్వవిద్యాలయంలో, విద్యా సమానవత్వం లేదు అని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా విశ్వవిద్యాలయాల విద్యార్థులు ఆందోళనలకు దిగారు.మళ్ళీ ఆట విషయానికి వస్తే, రాజకీయ పక్షాలన్నీ అక్కడ చేరాయి. నెలకొని ఉన్న దు:ఖభాజనమైన పరిస్థితులను మార్చాలని ప్రభుత్వం పై వత్తిడి తెచ్చాయి. పది రోజులు ఆలస్యంగా ప్రధానమంత్రి పిల్లవాడి చావు గుండెని కలచి వేసిందని లక్నోలో ప్రకటించారు. వెలివాడకు దరాఇ తీసిన ఉత్తర్వులను హైదరాబాద్ విశ్వవిద్యాలయం వెనక్కు తీసుకున్నది. తన ప్రాణం తీసుకున్న తమ రీసెర్చ్ స్కాలర్ రోహిత్ వేములకు ఎనిమిది లక్షల ఎక్స్ గ్రేషియా ప్రకటించింది. కేంద్ర మానవ వనరుల శాఖ రోహిత్ మృతిపై న్యాయ కమిషన్ నియమించింది. తన ఆత్మ హత్య ఉత్తరంలో నాకు ఎనిమిది నెలలుగా నెల వారీ స్కాలర్ షిప్ విడుదల కాలేదు. అదే ఒక లక్షా యాభై వేలు వస్తుంది. అది మా అమ్మకు అందజేయండి అన్న ఈ పిల్లవాడు, ప్రపంపంచై ఏ నేరం ఆరోపించకుండా గొప్ప ఆత్మ గౌరవంతో, తాను చేసిన పనేదో చేశాడు. అంతకన్న ముందు, తాము పుట్టి పెరిగిన గుంటూరు వచ్చి, అక్కడి దళిత నాయకులతో మాట్లాడి ఉండి ఉండవచ్చు, మేము గనుక కొంత ముందుగా ఈ కేంపస్ కు వస్తే, ఇలా జరిగి ఉండేది కాదేమో అన్నారు మంద కృష్ణ మాదిగ, పిల్లవాడి సంతాప సభలో, ఎవరి పశ్చాత్తాపాలు వారికి ఉంటాయి. కానీ, కుట్టు మిషన్ పని చేసి, కుటుంబ పోషణ చేసి, ఒక తల్లి తన పెద్ద కొడుకుని, ప్రజ్ఞావంతుడిని చేసి, పరిశోధక విద్యార్థిగా, సంఘంపై నమ్మకంతో పెద్ద చదువులకు రాజధానులకు పంపిస్తే, వాళ్లను అన్ని రకాల వివక్షకు గురిచేసిన ఈ రాజధానులను,ఈ డాబు దర్పాల విశ్వవిద్యాలయాలను మేటలేసిన వీరి ఆధిపత్య అహంకారాలను,ఆ పిల్లల చావులతో నెత్తురోడుతున్న మూర్ఖ చాదస్తాల సమాజాన్ని క్షమించగలమా? ఇప్పుడు మాట్లాడకపోవడం ఒక నేరం, మౌనం ఈ నేరంలో భాగస్వామ్యం. చావాటలు ఆగిపోవాలంటే, మనకు అందరి బతుకులపై గౌరవం పెరగాలి. ఈబతుకు అందరికీ ఒక సమానమైన విలువ గా సమాజంలో నెలకొనడానికి మనం ఏం చేయాలో ఆలోచిస్తే అపుడు అదృష్టం వికటించిన, వేముల రోహిత్ అకాల మరణం వ్యర్థం కాదు. పట్టించుకోమా, గుడ్ మార్నింగ్ ఇండియా అండానికేమీ మిగలదు. మిగిలేవన్నీ డెడ్ మార్కింగ్లే.

కేంద్ర మానవ వనరుల శాఖ రోహిత్ మృతిపై న్యాయ కమిషన్ నియమించింది. తన ఆత్మ హత్య ఉత్తరంలో నాకు ఎనిమిది నెలలుగా నెల వారీ స్కాలర్ షిప్ విడుదల కాలేదు. అదే ఒక లక్షా యాభై వేలు వస్తుంది. అది మా అమ్మకు అందజేయండి అన్న ఈ పిల్లవాడు, ప్రపంపంచై ఏ నేరం ఆరోపించకుండా గొప్ప ఆత్మ గౌరవంతో, తాను చేసిన పనేదో చేశాడు. అంతకన్న ముందు, తాము పుట్టి పెరిగిన గుంటూరు వచ్చి, అక్కడి దళిత నాయకులతో మాట్లాడి ఉండి ఉండవచ్చు, మేము గనుక కొంత ముందుగా ఈ కేంపస్ కు వస్తే, ఇలా జరిగి ఉండేది కాదేమో అన్నారు మంద కృష్ణ మాదిగ, పిల్లవాడి సంతాప సభలో, ఎవరి పశ్చాత్తాపాలు వారికి ఉంటాయి.

రామతీర్థ
9849200385

"ప్రతిజ్ఞ" అనే గొప్ప కవితలో మహాకవి శ్రీశ్రీ "నాలో కదిలే నవ్య కవిత్వం కర్షకలోకపు సౌభాగ్యానికి, కార్మిక లోకపు కళ్యాణానికి ఉపయోగిస్తానని ప్రకటిస్తారు. అవి 1930వ దశాబ్దాలు. ప్రపంచం అంతటా, పారిశ్రామిక యుగం తన ప్రభావాన్ని చూపుతున్న వేళ, భారతీయ పెట్టుబడిదారీ వర్గం తమ పరిశ్రమలకు, కావలసిన కార్మిక వర్గాన్ని కర్మాగార ప్రాంతాలకు పెద్ద యెత్తున ఉద్యోగాలు, నివాసిత కాలనీలు, ఆధునిక విద్య, ఆరోగ్యం పేరిట, ఆకర్షిస్తున్న యుగం, కర్మాగారాలు ఆధునిక దేవాలయాలు అని మన ప్రధాన మంత్రి నెహ్రూ దిశా నిర్దేశనం చేసిన రోజులు రాబోతున్నాయి. పంచ వర్ష ప్రణాళికలు దేశాభివృద్ధిని పరిశ్రమలు, వ్యవసాయం, సాంకేతిక రంగాలు, మౌలిక జీవన రంగాలుగా, ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో జాతి ప్రగతి యాత్ర సాగనున్నది. ఆరు దశాబ్దాల తరువాత, ఆ ముచ్చట్లు అన్నీ గత వైభవ రాగ మాలికలు వెలిసి పోతున్నాయి. పదమూడు పంచవర్ష ప్రణాళికలుగా దేశ పురోగతికి చోదక శక్తిగా పాత్ర పోషించిన ప్రణాళిక సంఘం, ఇప్పటి ప్రభుత్వం హయాంలో పాత వ్యవస్థ అయింది. తమకు కావలసిన కావలసిన కొత్త ఏమిటో అందులో పరిపుష్టం చేయడం కాకుండా, ఏకంగా ప్రణాళిక సంఘాన్నే,

కార్మిక శక్తిని కూడా. మనుషులుగా ఉద్యోగులుగా, కుటుంబాలు నడుపకోవలసిన బాధ్యతలు గల వారీగా, ఈ విదేవీ కంపెనీలు ఎంత మాత్రమూ పరిగణించవు. భారత ప్రభుత్వ విధానాలు ఇప్పటికే, కార్మిక వ్యతిరేకతతో నిండి వున్నాయి. దేశంలో కార్మిక రంగ సమస్య ఉన్నదని, అంతర్జాతీయ మార్కెట్ విశ్లేషకులందరూ ఒప్పుకుంటున్న సత్యం.

ఐఎల్ఓ (అంతర్జాతీయ కార్మిక) ఆమోదించిన ఎనిమిది కార్మిక రంగ సంక్షేమ సూత్రాల్లో నాలుగు, భారత దేశం అమలు చేయడానికి అనుకూలంగా లేదు. అవేమిటో తెలుసుకుంటే ఆశ్చర్యపోతాము. సి అంటే కన్వెన్షన్, సి87 - సంఘాలు కట్టే హక్కు, తమని తాము సంఘటితం చేసుకునే అధికారం సి98 సంఘటిత కార్యాచరణ, తమ సంక్షేమ విషయమై చర్చలు జరిపే హక్కు, సి.138 ఉద్యోగాల్లో కనీస వయో నిబంధన అమలు, సి182 ప్రమాదకర పరిశ్రమల్లో బాల కార్మికుల వినియోగం, ఈ రంగాల్లో సరైన ఫలితాలు రాబట్టాలంటే, ముందుగా, ఏళ్ళ్గా నడుస్తున్న భారత ప్రభుత్వాలు, ముందు వీటిపై చట్టాలు, ఇవాల్టి ప్రపంచ స్థాయికి అనుగుణంగా చేయాల్సి ఉన్నది. అవేవీ జరగక పోగా, పెర్మనెంట్ ఉద్యోగాలు అసలే ఉండని ప్రజలకు సంరక్షణగా నిలబడ వలసిన ప్రభుత్వాలే, ప్రజలను ప్రమాదకర జీవన పరిణామల్లోకి నెట్టి వేస్తున్న విధానం అయిన దిన దిన భత్యం - క్షణ క్షణ భయచిత్తం (జీతం రోజుల లెక్కన దొరుకుతుంది. రేపటి రోజు తను ఉద్యోగో తెలియక సంక్షోభంలో ఈ కార్మికులు బతుక్కు రావాలి) దేశ సర్వతోముఖ ప్రగతికి తీవ్ర విఘాతం. దీన్ని నిశితంగా పరిశీలించి ఎండగడుతున్న ప్రపంచ

చేస్తున్న 44 చట్టాలు, రాష్ట్రాలు అమలు చేస్తున్న 100 చట్టాలు కలిపి ఇప్పుడు కేవలం 44 చట్టాలుగా కుదించే ప్రయత్నాలు కూడా ప్రభుత్వం కేంద్ర స్థాయిలో చేస్తున్నది.

కార్మిక రంగ యూనియన్లను కూడా కలుపుకుంటూ, పెట్టుబడిదారీ కంపెనీలు, ప్రభుత్వం, యూనియన్లు మూడు రంగాల ప్రాతినిధ్య మూలాన్నే, త్రిముఖ చర్చలు జరగాలి అని ఐఎల్ఓ నిర్దేశిస్తుండగా చర్చల్లో యూనియన్లకు స్థానం లేకుండా, ఏక పక్ష నిర్ణయాలను దారి తీయడంలో ప్రస్తుతం మన ప్రభుత్వాలు ముందు వరసలో ఉన్నాయి. ఎవరిని సంతృప్తి పరచడానికి, ఇంత లొంగుబాటు? అంతర్జాతీయ ఖర్చు కన్నా చాలా తక్కువ మొత్తానికి, కోట్లాది మంది కార్మికుల వనరు, మన దగ్గర దొరుకుతుండడమే, ఈ దేశానికి, పెట్టుబడిదారులు పెద్ద యెత్తున తరలి రావడానికి పెద్ద కారణం. అలాటప్పుడు ఆ కార్మిక ప్రజల జీవితాలకు, కుటుంబాలకు, తద్వారా సాంఘిక ప్రగతికి ఖచ్చితమైన నిర్ణయాలను పారదర్శకంగా తీసుకుని, వాటిని అమలు జరపలేక పోతే, ఈ పలు ఉత్పత్తులు, మన దేశంలో జరిగితే ఏమిటి? ఇంకే దేశంలో జరిగితే ఏమిటి?

"మేక్ ఇన్ ఇండియా " పేరిట, దేశీయ కార్మిక వర్గాన్ని మేక పిల్లల్లా, ఆ యంత్ర సింహానికి సమర్పించడం, మాత్రమే మనం చూడబోతున్న ప్రగతి.

కార్మికుల నడి నెత్తిన "మేకు" ఇన్ ఇండియా

ఈ మధ్యలో మనకు మేక్ ఇన్ ఇండియా అంటున్న కేంద్ర పాలక వర్గాల పారిశ్రామిక విధానం, అమలు మూలంలో కార్మిక వర్గ అస్థిరత్వానికి ఆందోళన చెందాల్సిన స్థాయిలో దారి తీస్తుందని ఆర్థిక, పారిశ్రామిక, కార్మిక రంగాల నిపుణుల అంచనా, ఉదాహరణకు మనం ధరించే రెడీమేడ్ గార్మెంట్స్, గాప్, హెచ్ & ఎం టోమీ హిల్ఫిగర్, జరా, ఇలా అనేక విదేశీ బ్రాండ్ల చొక్కాలు, ట్రౌజర్లు, పాంట్లు తయారు అయ్యేది బెంగళూరు లోనే. కానీ ఆ కార్మికులు ఎవరూ కూడా ఆ కంపెనీల ఉద్యోగులు కారు. మీకు రెడీమేడ్ బట్టలు కుట్టి ఇచ్చే , మేక్ ఇన్ ఇండియా రెడీ మేడ్ కూలోళ్ళు. ఈ బట్టలు ఈ దేశంలో ఎంత అమ్ముడవుతాయో, అలాగే విదేశాలలో కూడా, ఇక్కడ చౌకగా లభ్యమయే కార్మిక శక్తిని కూడా. మనుషులుగా ఉద్యోగులుగా, కుటుంబాలు నడుపకోవలసిన బాధ్యతలు గల వారీగా, ఈ విదేవీ కంపెనీలు ఎంత మాత్రమూ పరిగణించవు. భారత ప్రభుత్వ విధానాలు ఇప్పటికే, కార్మిక వ్యతిరేకతతో నిండి వున్నాయి. దేశంలో కార్మిక రంగ సమస్య ఉన్నదని, అంతర్జాతీయ మార్కెట్ విశ్లేషకులందరూ ఒప్పుకుంటున్న సత్యం.

రద్దు చేస్తున్న ప్రకటన, అతి విద్యూరంగా ఎర్రకోట నుంచి ప్రధాని తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వత్సరం 2013 లోనే చేయడం జరిగింది. దానికి బదులుగా నీతి ఆయోగ్ పేరిట ఒక వ్యవస్థ ఏర్పాటును ప్రకటించారు. ఇందులో ప్రైవేటు రంగానికి కూడా బలమైన పాత్ర ఉండడం, ఎటువంటి పరిణామాలకు జాతీయ స్థాయిలో దారి తీస్తుందో తెలిసి కూడా, జాతి అభివృద్ధి ప్రైవేటు వర్గాల దిశా నిర్దేశంలో జరగడం ఇష్టపడడం అంటే, పాలక వర్గాల ఎంపిక, ప్రజలకు మేలు చేసేదేనా అన్న ప్రశ్న మిగిలి ఉన్నది. పంచ వర్ష ప్రణాళికలకు బదులుగా సోషల్ అజెండా ప్రకటించి, ఆ మేరకు పలు రంగాల అభివృద్ధిని క్రమబద్ధీకరిస్తామని పాలక వర్గాలు చెప్తున్నాయి.

కార్మిక వర్గ వ్యతిరేకత ఇవాల్టి దేశ విధానాలు అమలులో అతి స్పష్టంగా ఉన్నది. ఉద్యోగ అవకాశాలు ఏర్పాటు, ద్వారా ప్రజలను పనిచేసే, తమ జీవికను సంపాదించుకునే, సాధికార వర్గాలుగా రూపొందించాల్సిన బాధ్యత ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, కార్మిక వర్గ ప్రాధాన్యతను తగ్గించడం, అసంఘటిత కార్మిక సమూహాలను, శాశ్వత ఉద్యోగాలు లేకుండా, కాంట్రాక్టు కార్మికులుగా ఉపయోగించుకోవడం అనే తీవ్ర నష్ట దాయిక విధానాలకు పాల్పడుతున్నాయి. ఈ మధ్యలో మనకు మేక్ ఇన్ ఇండియా అంటున్న కేంద్ర పాలక వర్గాల పారిశ్రామిక విధానం, అమలు మూలంలో కార్మిక వర్గ అస్థిరత్వానికి ఆందోళన చెందాల్సిన స్థాయిలో దారి తీస్తుందని ఆర్థిక, పారిశ్రామిక, కార్మిక రంగాల నిపుణుల అంచనా, ఉదాహరణకు మనం ధరించే రెడీమేడ్ గార్మెంట్స్, గాప్, హెచ్ & ఎం టోమీ హిల్ఫిగర్, జరా, ఇలా అనేక విదేశీ బ్రాండ్ల చొక్కాలు, ట్రౌజర్లు, పాంట్లు తయారు అయ్యేది బెంగళూరు లోనే. కానీ ఆ కార్మికులు ఎవరూ కూడా ఆ కంపెనీల ఉద్యోగులు కారు. మీకు రెడీమేడ్ బట్టలు కుట్టి ఇచ్చే , మేక్ ఇన్ ఇండియా రెడీ మేడ్ కూలోళ్ళు. ఈ బట్టలు ఈ దేశంలో ఎంత అమ్ముడవుతాయో, అలాగే విదేశాలలో కూడా, ఇక్కడ చౌకగా లభ్యమయే

స్థాయి కార్మిక సంస్థా వేదిక "యాన్యుయల్ గ్లోబల్ రైట్స్ ఇండెక్స్"ను ముద్రించిన "ఇంటర్నేషనల్ ట్రేడ్ యూనియస్ కన్ఫెడరేషన్" అంచనాలను 97 రంగాల్లో సర్వే 147 దేశాల కార్మిక రంగ వాస్తవిక స్థితి గతులను పరిశీలించాక, భారత దేశాన్ని "సెకెండ్ వరస్ట్ కేటగిరీ"లో నిలబెట్టింది. అంటే కార్మిక రంగంలో "ఏ హక్కులనూ గారంటీ చేయని దేశం" అని ఆ వర్గీకరణ తెలుపుతున్నది.

అవటానికి భారతదేశంలో 144 కార్మిక రంగ భద్రతకు చెందిన చట్టాటు ఉన్నాయి. అయినా అంతర్జాతీయంగా ఈ అవమానకరమైన పరిస్థితి ఏమిటి? అంటే, ఆయా చట్టాలను దేశీయ కార్మిక రంగంలో 93 శాతం మందికి మనం అన్వయించడమే లేదు. ఇంకా కొత్త పరిశ్రమలను తెచ్చే బహుళ జాతి పెట్టుబడిదారీ వర్గాలు, వారికి కొమ్ముకాసే దేశీయ పెట్టుబడిదారులు కోరేది ఏమిటంటే, ఈ అరకొరగా అమలు అవుతూ, కేవలం 7 శాతం కార్మిక ప్రజలకు సంఘటిత రంగంలో లభ్యమవుతున్న చట్ట రక్షణల్లో కోత విధించి పెట్టుబడుల వర్గాలకు అనుగుణంగా వెసులుబాట్లు కల్పించాలని. ఏ దేశంలో పాలక వర్గం అయినా, కోట్ల ప్రజల జీవితాలకు కార్మిక భద్రత పెంచే క్రమంలో ముందుకు వెళ్లవలసి ఉండగా, క్రమేపీ, ఆయా చట్ట పరిధులను తగ్గించి వర్తమాన, భవిష్యత్తు కార్మిక ప్రజల ప్రయోజనాలను, తద్వారా వారి జీవితాలను బలిపెట్టే ప్రయత్నాలు పాలక వర్గాలు ముమ్మరం చేస్తున్నాయి. తమకు ముద్దొచ్చే వర్గాలు అయిన పెట్టుబడిదారులు కోరిన విధంగా, అటు కేంద్రం అమలు

ఆయా పెట్టుబడిదారులు, తమ దేశాల్లో ఏవి తయారు చేయడం ప్రమాదకరమో, ఎక్కువ ఖర్చుతో కూడినవో, పర్యావరణ హానికారకమో అటువంటి పరిశ్రమల సాంకేతికతను మన దేశానికి తెచ్చి తేవడంతోనే, ఇక్కడ వారిని ఎర్ర తివాచీ పరిచి పిలుస్తున్న ప్రభుత్వం, వారికి భూమి, నీరు, ఇతర సదుపాయాలు, అందిస్తే, చౌకగా కార్మికులను వేరే స్థానిక కంపెనీల కాంట్రాక్టు కార్మికులుగా చూపిస్తూ, వారికి, తమకూ ఎటువంటి సంబంధమూ లేదని బాహాటంగా వ్యాపారం చేసుకునే ఈ లాభాల విదేశీ భూతాలకు, వారి భారతీయ తాబేదార్లకు లేదా స్నేహితులకు, మనం వ్యాపార అవకాశాలు కారు చౌకగా అందజేసి, కార్మిక శక్తిని వారికి నైవేద్యం పెట్టడమే, "మేక్ ఇన్ ఇండియా" పూజారులు చెప్తున్నా దానికి అంతరార్థం.

ఆ వస్తువుల ఉత్పత్తులను, వారు తక్కువ పెట్టుబడులతో ఇక్కడ ఉత్పత్తి చేసి, ప్రపంచ అంతటా తమకు లాభసాటి ధరలకు అమ్ముకోవడం, ఆ ఉత్పత్తికి మూల కారణం అయిన దేశానికి పుర్ర చేతి పొగడ్తలు, కార్మికులంటే "అబ్బే అలాంటి వారెవరూ మనకు తెలియదే, మాకు తెలిసిందల్లా ఔట్‌సోర్సింగ్ కంపెనీలే" అని తప్పుకుపోయే అవకాశాలు పుష్కలంగా లభింపజేయడమే, ఈ నట్లూ, బోల్ట్‌లూ, ముళ్ల చక్రాల సింహం మనకు మిగల్చబోయే, "మేక్ ఇన్ ఇండియా" మిఠాయి. దేశంలోని ఎనిమిది కార్మిక సంఘాల భవిష్యత్, ఎంత సమైక్యంగా కార్మిక రంగానికి ప్రతినిధ్యం వహించగలవు. అన్నదానిపైనా, ఎంత సమగ్ర అవగాహనతో ప్రభుత్వాన్ని, ఈ విషయంలో కోట్లాది మంది కార్మికుల పట్ల ప్రభుత్వానికి బాధ్యత ఉన్నది అన్నవారికి తెలిసేలా నిలదీయగలవు, ఒత్తిడి కార్యాచరణ ఎలా వేగవంతం చేయగలవు. అనాది ఇవాల్టి ముఖ్య సమస్య. పార్టీలు, వాటి సంఘటిత యూనియన్లు, తమ పార్టీ విధానాలకు, కార్మిక ప్రయోజనాలకు మధ్య, నిష్టా గరిష్ట చైతన్యంతో, ఈ దేశంలో సగటు కార్మికుడి ముఖం చూసి "వెలిగించండి మళ్లీ అతని ముఖంలో నవ్వు" అన్న కార్మిక ప్రయోజన మహాసంకల్పాన్ని చెప్పుకోవడమే, ఇప్పటి తక్షణ కర్తవ్యం.

ఆటలోన లచ్చిందేవి అర్ధాంతరపు క్రికెట్టూ....

రామతీర్థ
9849200385



ఎన్ని క్రికెట్ మ్యాచ్‌లు ఇండియా గెలిస్తే మనకు తృప్తి కలుగుతుంది? దీనికి సమాధానం లేదు. ఎన్ని ఏళ్లైనా, ఎన్ని సీజన్లలో అయినా, ఇదిలా సాగుతుండవలసిందే. ఇదొక వ్యాపారం. క్రీడా వ్యాపారం. క్రీడా ఉత్సాహం, కలిసి జట్టుగా ఉండే భావనలు, మెల్లిగా కనమరుగు అవుతూ, ఆటగాళ్లు వ్యక్తిగత హోదాల్లో గెలుపు గుర్రాలుగా వేలం పాటల్లోఅమ్మాకాలు, కొనుగోళ్లు జరిగే, ఒక హైటెక్ ప్రదర్శన. ఆట స్ఫూర్తి తగ్గి, వ్యాపారం అవగానే అవినీతి పెచ్చు పెరిగి, ఐపీఎల్ లలిత్‌మోడీని ఒక పక్క మరోక పక్క మద్రాస్ శ్రీనివాసన్‌ను ఎన్ని వేల కోట్ల స్థాయిలో, వివాదాలకు గురిచేసిందో చూసి కూడా ఇదంతా, ప్రజల ప్రయోజనం కోసం, క్రీడా చైతన్య స్ఫూర్తితో ఆడే, అమాయకమైన, దేశ భక్తి పూరితమైన క్రికెట్ ఆటే, అంటే ఎలా నమ్ముతాము?

పెట్టుబడిదారీ సమాజం, వికృతమైన అలవాట్లను ప్రోత్సహిస్తుంది. వ్యక్తిని, నీ అంత బలవంతుడు ఎవరూ లేరు, అంతా నీకోసమే, అన్నీ నీ గురించే, అనే ఒక భ్రమకు గురిచేస్తుంది. జంతువులను కొనుక్కున్నట్టు, అలనాడు జాత్యహంకార అమెరికాలో నల్లవారిని బహిరంగ వేలంలో తెల్లవారు కొనుఉక్కన్న అలవాట్లు, ఏదో ఒక రూపంలో బతికే ఉంటాయి. వాటి కొత్త రూపాల్లో కాల మాన పరిస్థితులు మారినా, వేలం పాటలు కలిగించే వికృత ఆనందాలు మాత్రం ఒకే మౌలిక స్వభావాన్ని కలిగి ఉంటాయి. లేకపోతే, దేశ దేశాల ఆటగాళ్లను, ఐపీఎల్ వేలం పాటల్లో కొనుగోలు చేయడానికి, సంపన్నులు సినిమా తారలు ముందుకు రావడం, రోమన్ మధ్య యుగాల యజమాని-బానిస సంబంధాల లోని క్రూరత్వాన్ని, ఎంత మర్యాదగా క్రికెట్ ఆట పేరిట మన ముందుకు తెస్తున్నదో చూసి కూడా, దీన్ని మనం గుర్తించలేక పోతే ఎలా? రాజులకు, పాలకులకు, ప్రయోజకులకు, ఆట వల్ల కలిగే వినోదం, థ్రిల్ చాలవని, మధ్య మధ్య సగం గుడ్డలేసుకున్న "చీర్ గాళ్స్"! దేనికి వాళ్లు అంతా సరదా పడిపోతున్నారో తెలియకుండా, సినిమా సాంగ్ వెనుక ఉండే ఎగ్‌స్ట్రా వేషగాళ్ల మల్లే, ఆటల స్టేడియంలోనే తమ అందచందాలను కూడా ఆరబోస్తూ ఉంటారు. క్షణం తప్పకుండా వ్యాపార ప్రకటనలు హోరెత్తి పోతూ ఉంటాయి. ఇదంతా ఆటే, అబ్బో, ఏమి వైభోగం అనుకుందామా? తమ దేశాల తరపున ఆడడం కన్నా, ఇలాంటి కిచిడీ టీంల్లో ఆడేటప్పుడు, ఒకే దేశానికి చెందిన వారైనా వేర్వేరు టీంల్లో రెచ్చిపోయే ఆడే ఆట గాళ్లను చూస్తాము. ఈ ఆటలో దేశ భక్తి కన్నా, ధనభక్తి అన్ని సందర్భాల్లోనూ ముఖ్య చోదక శక్తి అంటే, కాల క్షేపం పేరిట జరిగే వ్యాపారంలో, సినిమాలను మించిపోయిన, రూకాల వర్షాలు కురిపించే గెలుపు గుర్రంగా క్రికెట్ ఆట, ఇవాళ అన్ని రంగాల వలెనే, కార్పొరేట్ స్పోర్ట్ గా మారిపోయింది. కార్పొరేట్ క్రీడా కంపెనీ లాభాల మీద నడుస్తుంది. ఆ లాభాలు వచ్చే దారిలో, ఆటగాళ్లను వేలంలో వస్తువుల్లా అమ్ముడు చేస్తుంది. అదనపు వినోదానికి ఆటకు అవసరం లేకున్నా అమ్మాయిలను ఏర్పాటు చేస్తుంది. ఆట స్వభావంలో ఒక వ్యభిచారాన్ని ప్రవేశపెట్టి, "డబ్బొస్తే ఏదైనా ఒకే" అనే స్వభావాన్ని, జాతి అందరికి అలవాటు చేస్తుంది. మగవాళ్ల ఆటగా, క్రికెట్ ఆటకు పురుషాహంకార లక్షణాలు ఎక్కువ. దశాబ్దాలుగా ఆడుతున్నా ఈ ఆటలో, ఆడవాళ్ల క్రికెట్‌కు ఎప్పుడూ పెద్ద పేరు లేదు, వారి క్రికెట్ ఆటల్లో ఎందుకు, ఈ వేలాలు, ఛీర్‌గాళ్స్ బదులు, ఛీర్ బాయ్స్ లేరో, మనం పట్టించుకోము. ఒళ్లంతా బట్టలు వేసుకు ప్రస్తుతానికి క్రికెట్ ఆడుతున్నారు. కనుక ఛీర్ గాళ్స్ ఆరబోసినట్టుగా మహిళా క్రికెటర్లు ఆ పని చేయలేరు, వారు క్రీడాకారిణులుగా గౌరవనీయులు. ఆ ఆటకొక యూనిఫారం ఉన్నది. అది దైవం రక్షించి, ఇంతవరకూ అలానే కొనసాగుతున్నది. అరకొర దుస్తులను క్రికెట్ ఆట మైదానంలోకి, ఇంతవరకూ మగవారికైనా, ఆడవారికైనా అనుమతించలేదు. ఒక వేళ అటువంటి వస్త్ర ధారణ వల్ల, ఎక్కువ ధనం వస్తుందని, ఈ క్రీడా కంపెనీలకు గనక, వారి మార్కెట్ విశ్లేషకులు (పెద్ద ఉద్యోగాలు ఇవి, మార్కెట్ అనలిస్టులు అంటారు వీళ్లని, ప్రతి కార్పొరేట్ కంపెనీ, తమ సరుకు/లేదా ఉత్పత్తి పట్ల మార్కెట్ స్పందన ఎలా ఉన్నది, ఇంకా ఏమేం చేస్తే, బాగా లాభాలు వస్తాయి అన్నది నిత్యం కనిపెట్టి ఉండేందుకు, వీరిని ఏర్పాటు చేసుకుంటుంది. సూచిస్తే, అది వారికి సజువైన, అమలు చేయదగ్గ మార్పు అనిపిస్తే, రేపు పొద్దున్న ఇదే క్రికెట్ ఆటను, (టెన్నిస్‌లో మిక్స్‌డ్ డబుల్స్ లాగా మిక్స్‌డ్ క్రికెట్ ఆడినా, (ఆడించినా) మగ, ఆడ క్రికెటర్లు, కేవలం ఉడుపులు ధరించి, టూ పీస్ బికినీలతో ఆడినా పెద్దగా ఆశ్చర్య పడనక్కరలేదు. ఇక్కడ ఆడించే వాళ్లు వేరే. ఆడే వాళ్ల ఆర్థిక ప్రయోజనాలు వేరే. ప్రకటనలు గుప్పించే వ్యాపార ప్రపంచం ఆశించే ప్రయోజనాలు వేరే. ఇలా ఎవరికి ప్రయోజనాలు, లాభాలు వారికి ఉండగా, బోలెడు జాతీయ సమయాన్ని వృధా చేస్తూ, దేశ ప్రజలం ఏమి చేస్తున్నాము అన్నదే ప్రశ్న. ఈ ఆటల వారికి, వారి స్పోర్ట్ సీజన్లు, ఆటల తేదీల కాలెండర్లు, చేసుకున్న అగ్రిమెంట్లు, కోట్ల ధనంగా నికారాదాయం తప్ప ఇంకేవీ పట్టవు. అందుకే, విద్యార్థులకు కీలకమైన పరీక్షలప్పుడే, ఈ ఆటలు జరుగుతూ ఉంటాయి. యుద్ధాలప్పుడు మాట్లాడే భాషకన్నా తీవ్రమైన భాషలో ఈ ఆటల తీరు తెన్నులను మీడియా లోని క్రీడా పాత్రికేయ రంగం, బొమ్మలు గుప్పిస్తూ, వర్ణిస్తూ ఉంటుంది. కళ్ల ద్వారా దృశ్యాన్ని తాగించి, చెవులకు దిబ్బెళ్లు వేసేలా, ధ్వని కాలుష్యాన్ని పెంచి, ఈ ఆట, ఒక తూగు, ఒక మత్తు కలగ చేసేలా, బలమైన మాదక ద్రవం (కాక్ టైల్ లా) వలె, సామూహిక మనస్తత్వాన్ని ఆవరిస్తుంది. ఇలా చేయడంలోనే ఈ కార్పొరేట్ క్రీడా వ్యాపార కంపెనీల ప్రయోజనం చేకూరుతుంది.

చైనా, రష్యా, అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, లాటిన్ అమెరికన్ దేశాలు క్రికెట్ ఆడవు. ఒలింపిక్స్‌లో ఈ ఆటకు చోటు లేదు. ఈ దేశాలన్నీ ఫుట్‌బాల్ ఎక్కువగా ఆడతాయి. క్రికెట్ మాత్రం, ఎక్కడెక్కడ బ్రిటిష్ పాలన కొనసాగిందో, అక్కడ వారు వందల ఏళ్ల కిందట తమ కాలక్షేపం కోసం, తమ దేశం నుంచి తెచ్చుకుని ఆడుకున్న ఆట. ఇలాంటివి ఎన్నో కామన్ వెల్త్ అంటూ నిలబెట్టుకున్న ఒక నిరర్థక సంస్కృతి మనకున్నది. మనలను ఒక తెలివైన సమాజంగా గౌరవించి పట్టించుకుని, మన గురించి తాము తెలుసుకుని, మనకు తెలియ చెప్పిన, సౌజన్యవంతులైన బ్రిటిష్ వారు చాలా తక్కువమంది. వారిని మాత్రం గౌరవిస్తూ, ఒక వలస పాలన కాలపు అవశేషంగా ఎన్నో వలస పాలన కాలుపు చట్టాలు పద్ధతుల్తో పాటు, క్రికెట్ ఆటను కూడా, అప్పుడే మర్చిపోవల్సింది పోయి, మనం నెత్తిన పెట్టుకుని, మన దేశపు అత్యంత డబ్బు పోగేసే క్రీడగా, మలుచుకున్నాము. ఈ క్రమంలో, మన దేశపు ఆటలన్నిట్నీ, నిరాదరించి, తెల్ల దొరల ఆట ఆడే, నల్ల దొరల్లో, ముందర ఉన్నాయి. ఈ ఆట ఆడే దేశాలన్నీ బ్రిటీష్ వారి వలస పాలన లోని దేశాలే. పాలకులు వెళ్లిపోయినా, పాలకుల సంస్కృతిక ఇంకా పరిపాలిస్తూనే ఉన్నది అనడానికి, ఈ తెల్ల వారి క్రికెట్ పట్ల, మనకు గల ఈ వేలం వెర్రి ఒక కారణం. సరే, ఆట ఎవరిదైనా ఆటే! ఆట పట్ల జాతీయ వివక్ష ఉండరాదు. కానీ ఈ ఉపఖండంలోని అన్ని ఆటలకన్నా తరువాత వచ్చిన ఆట ఇది. మూడు వందల ఏళ్ల ముందర ఈ ఆట ఇక్కడ లేదు, మనం ఆడడం మొదలుపెట్టి, పట్టమని నూట యాభై ఏళ్లు కూడా కాలేదు. ఇంత జాతీయ బలహీనతగా క్రికెట్ తయారు కావడానికి, ఏవి కారణం, ఎవరెవరు బాధ్యులు, అన్నది లోతుగా జరగవలసిన ఒక సామాజిక మనస్తత్వ పరిశోధన. ఒకప్పుడు అయిదు రోజుల జెంటిల్ మెన్ ఆటగా తెల్ల దుస్తులు వేసుకున్న, రెండు దేశాల బృందాలు, టెస్ట్ మాచ్ సిరీస్ ఆడితే, దానికొక మర్యాద ఉండేది. క్రీడా కారులను సుహృద్భావ రాయబారులుగా, గౌరవించేవి ఆయా దేశాలు. ఆట ఎత్తుగడలతో, కెప్టెన్ చేసే మార్పులతో ఎలా గెలుపును తమ టీం కోసం రచించాడో, ఓడిపోయిన టీం ఎక్కడ పొరపాట్లు చేసిందో, చక్కని విశ్లేషణలు ఉండేవి. మంచి కామెంటరీ ద్వారా, ఆంగ్లం, హిందీ భాషలు శ్రోతల చెవుల తప్పు వదల గొట్టేవి. భాషలు మాట్లాడే మెళకువలు గ్రహించేందుకు ఇప్పటికీ, చాలా దేశాల్లో ఈ కామెంటరీ వింటారు. అవన్నీ కనుమరుగై, మొదటగా కెర్రీ పేకర్ ఆడించిన ఒక రోజు ఆటగా (వన్‌డే ఇంటెర్నేషనల్‌గా) కుదించబడ్డ రూపంలో క్రికెట్, వ్యాపార ఘంటికలు మోగించింది. అక్కడ అంచనాలకు మించిన డబ్బు, ఆటగాళ్లకు, దేశాలకు మించిన ప్రాముఖ్యత కనిపించడం మొదలు కాగా, ప్రస్తుతం ట్వెటీ- ట్వెంటీ కొత్త అవతారపు మాచ్ అంటే, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో క్విక్ లంచ్ రూపేణా ఆకలి తీర్చుకోవడం లాంటిది. బాదుడే తప్ప ఏమి తిన్నాము అన్నది ప్రధానం కాదు, ఎంత వేగంగా ముగిసిందీ అన్నదే ముఖ్యం. ఇక ఈ ఆటగాళ్ల చుట్టూ ఒక ఆకర్షణ, వారి దర్జాలు, హోదాలు, ప్రకటనల అగ్రిమెంట్ల ద్వారా వచ్చే కోట్లాది ధనం, ఇవన్నీ ఆట కన్నా ఎక్కువగా, ఎత్తి ఉబ్బేసే మీడియా, పత్రికలు, మార్కెట్ కల్పించినవే. దేశాల కోసం ఆడడం పెద్దగా పట్టించుకోకుండా, ఒళ్లంతా ఇంచీలు ఇంచీలుగా కార్పొరేట్ లేబెల్ల తగిలించుకుని, నడిచి వస్తున్న వ్యాపార హోర్డింగ్ వలె ఆటగాడు మైదానంలోకి వస్తుంటే, నిజంగా మనకు సిగ్గు వెయ్యాలి. ఆట మీద ప్రేమా, దేశం మీద అభిమానమా, ప్రాయోజిత కంపెనీ పట్ల విధేయతా, తనకొచ్చే లాభం పట్ల శ్రద్ధా, ఏది ఈ ఆటగాడిని, నడిపిస్తున్నది అని. వీళ్లను, ఇలా అంగుళాలు చొప్పున తమ ఒళ్లు (అదే, ఆ ఒంటిపై వేసుకున్న దుస్తులన) అమ్ముకున్న ఆటగాళ్లను నడుస్తున్న దేవతలను కొలిచినట్టు చూస్తున్నామే, వీరికి అన్ని అర్హతలు ఉన్నాయో అన్నది ప్రశ్న? వందల మ్యాచలలో వీరు సాధించిన సెంచరీలు, రికార్డులు, ఈ దేశానికి ఏమన్నా క్రీడా లోక గౌరవాన్ని ఇనుమడింపజేసాయా, అంటే, ఒలింపిక్స్‌లో, ఒక లియాండర్ పేస్, దేశం కోసం సాధించిన పతకం ముందర, ఆ మైదానంలో, ఆ విజేతకు గౌరవ సూచకంగా, మోగిన భారత జాతీయ గీతం ప్రతిష్ట ముందర, అలాంటి ఎన్నో క్రీడల్లో, భారత దేశాన్ని ముందుకు తీసుకు వెళ్లిన, ఒక రాథోడ్, ఒక మేరీ కొమ్, ఒక మల్లేశ్వరి, ఒక అశ్వనీ నాచప్ప, బాక్సింగ్ విజేతలు అయిన వారి ముందర, ఎవరు ఈ క్రికెట్ పూనకాల గణాచార్లు, మన ఉత్తమ క్రీడాభిరుచిని బలి ఇచ్చే క్రీడా తంత్రగాళ్లు, ధనపు సంచులు మోసుకెళ్లే, ధనార్జనా ధనంజయులు? ఈ క్రీడా భారతం, ఒక్క క్రికెట్ ఆటకే చెందదు. ఉత్తమ సినిమా అనుకుంటూ ఎలు ఉచ్చులో పడిపోతామంటే, అమీర్‌ఖాన్ తీసిన లగాన్ చిత్రంలో గల ఒక మౌలిక వైరుధ్యం, మనం పట్టించుకోలేదు. ఇంగ్లీష్ వాడి క్రికెట్ ఆట భారతీయ గ్రామీణులు నేర్చుకుని, ఆడి గెలిస్తే, అయ్యో అంత మంచి సినిమాకు ఆస్కార్ రాలేదే అనుకున్నాము. కానీ, ఆ సినిమాలో నిజానికి జరుగవలసింది, మనం తెల్లవారి ఆట నేర్చుకుని, గెలిచి వారి మెప్పు పొందడం కాదు, వారు మన గోటీ బిళ్లా ఆటలో, మనతో పోటీపడి, ఆ ఆట గొపపదనాలను నేర్వడం. ఇలా స్క్రిప్ట్ రాయాలంటే, ఇంకా లోచూపు కావాలి.ఎంత డబ్బు మదంతో పులిసిపోతే, అంతగా అవినీతి పెచ్చు మీరుతుంది. ప్రస్తుతం క్రికెట్ ఆటకు సంబంధించి, ఆ దశలో ఉన్నాము. యూరప్ లోని బ్రిటన్ చిన్న దేశం కావడం వల్ల, ఈ ఆట అక్కడ సృష్టించలేని మార్కెట్. ఇక్కడ విశాలమైన జన బాహుళ్యం గల భారత దేశం వంటి దేశాల్లో, ఆటలంటే యుద్ధాలకు తక్కువ కాదని భావించే, ఉప ఖండపు ఇండియా -పాకిస్తాన్ పిచ్చోళ్ల వల్ల, కేవలం ఒక పదకొండు దేశాలలో ఆడే అంతర్జాతీయ క్రికెట్ బజారు, ఇక్కడ ఈ ఆటను సొమ్ము చేసుకునేందుకు, అనువైన వాతావరణం ఉందని గ్రహించి, సొమ్ములు చేసుకుంటూ, షోకులు పోతున్నది. అన్ని ఆటలకు అమావస్య చీకటి చేసి, తాను మాత్రం డే అండ్ నైట్ వెలుగుల వరదలో మెరిసిపోయే ఈ క్రిఎట్ ఇప్పుడు కేవలం ఆటేనా, లేక డబ్బుల వేటకు బయలుదేరిన వికృతరూపమా? ఆటల బోర్డ్‌లు, ఆటగాళ్లు, ఆస్తులు, ప్రకటనల ధన వరదలు, ఒక ఇంటెర్నేషనల్ మాచ్ వెనకాల ఉన్న లెక్కలు, ఇదొక క్రీడివఆ భూతమని చెప్తాయి. ఈ వివరాలు వచ్చేవారం, ఇక్కడే.

పాత్రికేయుల ప్రజాయాత్ర

రామతీర్థ
9849200385

ప్రాంతం ఉత్తరాంధ్ర, యాత్రికులు పాత్రికేయులు. ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫోరం అధ్యక్షులు ఎం.ఆర్.ఎన్ వర్మ, కార్యదర్శి, ఎన్. నాగేశ్వర రావు, ఉపాధ్యక్షులు, ఎన్. సత్యనారాయణ, సహాయ కార్యదర్శి కుర్రా విజయకుమార్, కోశాధికారి కె. రాము ఈ ప్రాంతపు సామాజిక చైతన్యం పెరిగేలా, పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రియాశీల స్వభావ సంపన్నులు. ఉత్తరాంధ్రకు చెందిన 114 మండలాలు, ముఖ్యంగా పాత్రికేయుల సామాజిక పాత్ర పెంపుదల లక్ష్యంగా మొదలైన ఈ యాత్ర, సహజంగానే, ఆయా ప్రదేశాల హేతు బద్ధ వికాసానికి ఏవైతే అడ్డంకులుగా ఉన్నాయో వాటిపై కూడా దృష్టి పెట్టడం జరిగింది. దీని ఫలితంగా, మనకు ఉత్తరాంధ్ర జన జీవన స్థిగతులపై ఒక వాస్తవ చిత్రం, మండలాల వారీగా, ఎక్కడ సమస్యలు అభివృద్ధిని పలు రంగాలలో దెబ్బ తీస్తున్నాయో గమనించేలా, ఒక పరిశీలక బృందంగా కూడా,వీరి యాత్ర ప్రయోజనం సాధించడం, సాధ్యపడ్డది. ఫిబ్రవరి 29న మద్దిలపాలెం భూలోకమాత ఆలయం వద్ద మొదలైన ఈ యాత్ర, ఏప్రిల్ ఆరున అదే స్థలంలో ముగిసే ముందర, ముప్పై ఎనిమిది రోజుల పాటు సాగింది. 2941 కిలోమీటర్లు ప్రయాణం జరిగింది. ఎక్కడ ఎటువంటి వసతి ఉంటే, ఈ పాత్రికేయ మిత్రులు,అక్కడే తమ రాత్రి మజిలీలు గడిపారు. స్థానిక సమస్యలను గ్రహించారు. అక్కడి స్థానిక పాత్రికేయ ప్రతినిధులతో విషయాలను చర్చించారు. వెళ్ళిన ప్రతి చోటా ప్రజలు, తమ సమస్యలను పాత్రికేయులతో వివరంగా చెప్పడం ఈ యాత్రలో ఉన్న అయిదుగురు సభ్యులకు ఒక ప్రోత్సాహపూర్వకమైన మర్చిపోలేని అనుభవం. వీరితో కొద్ది రోజులు, ఈనాడు పత్రికకు చెందిన రవి కూడా యాత్రలో పాల్గొన్నారు. ఈ యాత్రా కాలంలో, సాక్షి, ఆంధ్రజ్యోతి వంటి దిన పత్రికలు, ఈ పాత్రికేయుల ప్రజాయాత్రపై ఆయా మండల కేంద్రాలనుంచి, వరుస కథనాలు రాశాయి. ఇలా ప్రజల సహకారం, పత్రికా రంగపు మద్దతుతో ఉత్తరాంధ్రలోని మొత్తం ప్రాంతం అయిదు పార్లమెంటరీ నియోజక వర్గాలు, ముహారేు నాలుగు అసెంబ్లీ నియోజక వర్గాలు, తొమ్మిది రెవెన్యూ డివిజన్లుగా పరిపాలనానుకూలంగా విభాజితం అయి

> **వర్షాధారిత వ్యవసాయం, నదుల నీరు సక్రమ నిల్వ, పంటలకై ఆ నీటి ఉపయోగాలు లేని ఉత్తరాంధ్ర లో, శ్రీకాకుళం జిల్లాలో, మన రాష్ట్ర శివారు గ్రామం అయిన మేలియాపుట్ లో కేవలం అయిదు లక్షల ఖర్చు తో ఒక చెక్ డామ్ నిర్మాణం వల్ల వందల ఎకరాల పంట కాపాడ బడే అవకాశాలు ఉన్నా, నేటికీ పదిహేను ఏళ్లై, ఎటువంటి నిర్మాణ ప్రయత్నాలు జరగలేదు. స్థానిక రాజకీయాల మధ్య విబేధాలు, ప్రజా జీవన నాణ్యత పెంచేందుకు తగు విశాల దృష్టి లేక పోవడం, వంటివి, ఉత్తరాంధ్ర ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలకు కారణాలు. ఎల్లెడలా తాగునీరు, సాగునీరు సమస్యగానే ఉన్నది.**

ఉన్న ప్రాంతంలో, "సమన్వయం 114" పేరిట ఈ యాత్ర కొనసాగింది. సమన్వయం 114 అంటే, 114 మండలాలు గల ఉత్తరాంధ్ర అని అర్ధం. విశాఖ అర్బన్ కలుపుకుంటే, మొత్తం 115 మం డలాలు. దీని వలన ఈ బృంద సభ్యులు, ప్రజలు ఎటువంటి ఇబ్బందు లతో సతమతమవుతున్నారో ప్రత్యక్షంగా తెలుగుకోగలిగారు. చాలా చోట్ల, కొద్ది పాటి అంటే యాభై వేలు నుంచి అయిదు లక్షల ఖర్చు లోపలే ఎన్నో అభివృద్ధులు, ఏళ్ల తరబడి ఆగి పోయాయని, వీటికి మనకు కావలసిందల్లా, గ్రామీణ వ్యవస్థలను బలోపేతం చేసే సంకల్పం, సకాలంలో నిధుల విడుదల, వాటి ఖచ్చితమైన వినియోగం, దీన్ని, తమ సామాజిక చైతన వికాసంలో భాగంగా, నిత్యం ప్రజలతో కలిసి ఉండే పాత్రికేయులు, ఇలా కష్ట నష్టాలకోర్చి ఉత్తరాంధ్ర ప్రాంతమంతా కలయ తిరిగి, తమ అవగాహనను పెంచుకోవడం, ఒక విలక్షణ యాత్ర. పాత్రికేయులుగా ఇటువంటి ప్రజాసంపర్క కార్యక్రమాన్ని పూనికతో సంకల్పించి, పట్టుదల తో సాధించిన జర్నలిస్టుల బృందం, మన ప్రాంతం నుంచే ఆదర్శవంతమైన ఈ పనికి పూనుకోవడం అభినందనీయం. వర్షాధారిత వ్యవసాయం, నదుల నీరు సక్రమ నిల్వ, పంటలకై ఆ నీటి ఉపయోగాలు లేని ఉత్తరాంధ్ర లో, శ్రీకాకుళం జిల్లాలో, మన రాష్ట్ర శివారు గ్రామం అయిన మెలియాపుట్‌లో కేవలం అయిదు లక్షల ఖర్చుతో ఒక చెక్ డామ్ నిర్మాణం వల్ల వందల ఎకరాల పంట కాపాడ బడే అవకాశాలు ఉన్నా, నేటికీ పదిహేను ఏళ్లుగా ఎటువంటి నిర్మాణ ప్రయత్నాలు జరగలేదు. స్థానిక రాజకీయాల మధ్య విబేధాలు, ప్రజాజీవన నాణ్యత పెంచేందుకు తగు విశాల దృష్టి లేక పోవడం వంటివి, ఉత్తరాంధ్ర ప్రజలను పట్టి పీడిస్తున్న సమస్యలకు కారణాలు. ఎల్లెడలా తాగునీరు, సాగు నీరు సమస్యగానే ఉన్నది. సాగు నీటి సమస్య వల్ల, తమ పొలాలు, భూములు వదులుకుని, గ్రామీణులు దాదాపు పదిహేను లక్షల మంది, జీవిక కై పొట్ట చేత బట్టుకుని రోజు కూలీలుగా ఉత్తరాంధ్ర నుంచి వలసలు వెళ్ళిపోయారు. వీరేమీ చదువుకుని, తమ ఉద్యోగ వెతుకులాటలో వెళ్ళిన వారు కారు. అటు గ్రామంలో బతికే అవకాశాలు సన్నగిల్లి పోతుండగా, ఇటు కేవలం రోజుకూలీలుగా మాత్రమే బతికే అవకాశం ఇచ్చే నగరాల వేపు, వేరే దిక్కు లేక, పెద్ద యెత్తున గ్రామాల పేద ప్రజలు తరలి పోతున్నారు. విద్య మాటకొస్తే, స్కూళ్ళు మూసి వేస్తున్నవి మూసి వేయగా, ఉన్న పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉన్నది. ఆసుపత్రులులో వైద్య బృందాల జాడ ఉండడం లేదు. ఆరోగ్యం, పరి శుభ్రత సమర్ధ వంతంగా

నిర్వహిస్తున్న ప్రదేశాలు తక్కువ గా ఉన్నాయి. ఉపాధి కల్పన, అంటే, కేవలం, పనికి ఆహారం పథకం కింద, చదువుకున్న యువత కూడా ఈ రోజు వారీ కూలి పనులకు వెళ్ళి జీవిక సంపాదిస్తున్న ప్రిస్థితి ఉన్నది. ఏర్పాటు చేసిన పరిశ్రమలు కాలుష్య కారకంగా, నదుల సహజ ప్రవాహాలను దెబ్బ తీస్తున్నాయి. ప్రజల నివాస ప్రదేశాలపై కాలుష్య ప్రభావం ఎక్కువగా ఉన్నది. ఈ పరిశ్రమల వల్ల వచ్చిన ఉద్యోగాలు అంతంత మాత్రం కాగా, జరుగుతున్న నష్టం మాత్రం విపరీతంగా ఉన్నది. గ్రామాలు ఖాళీ అవుతున్న వాస్తవం మన చుట్టూ ఉండగా, మన్య ప్రాంతం, మైదాన ప్రాంతం, జాలరులు జీవించే సముద్ర తీరం, భూముల సేకరణ పేరిట మౌలిక సంక్షోభానికి గురౌతూ ఒక సంక్షుభిత చిత్రాన్ని ఈ ప్రజాయాత్రలో, పాత్రికేయులకు దర్శనం చేయించాయి. కొన్ని గ్రామాలకు, ఆర్టీసీ తన రాత్రి బస్ సీర్వీసులను రద్దు చేయడానికి ప్రయాణీకులు లేరు అనే కారణాలు (ఆక్యుపెన్సీ రేషియో) వారికి ఉన్నా, ఆ యా గ్రామాలకు ఇప్పుడు ఏ అత్యవసర పరిస్తితి ఉన్నా, కేవలం ఆటోలే ప్రజలకు ప్రయాణ సాధనాలు. పన్నెండు నదులున్నా, వాటి జల వనరుల వాడుక పై ఒక హేతుబద్ధ దృష్టి ఇన్ని దశాబ్దాల స్వతంత్ర పాలనలోనూ ఏర్పడక పోవడం యొక్క ఫలితం ఇప్పుడు మనం చూస్తున్నాము. కొత్త భారీ పరిశ్రమల పేరిట చేస్తున్న ప్రయత్నాలు, ఉత్తరాంధ్ర లోని మౌలిక జీవన అవకాశాలను తీవ్రంగా నష్ట పరచి, ప్రత్యామ్నాయ పద్ధతుల ఏర్పాటులో వాస్తవిక అవగాహన లేని ధోరణులు అవలంబించి, ప్రజలను అన్ని విధాలా నష్ట పరుస్తున్న ఒక పాలన విధానం ఈ తీవ్ర అసమానతలకు కారణం గా కనిపిస్తున్నది. చాలా సమస్యలకు పరిష్కారాలు తక్కువ ఖర్చులోనే ఆయా స్థానిక వనరులతోనే సాధించగలం. ప్రజల జీవన నాణ్యత, బ్రతుకు భరోసా, అత్యధిక ప్రజలకు అభివ ృద్ధి అవకాశాలు, ఏవీ అమలు కాకుండా, కేవలం ఒక మహా నగరం, కొన్ని భారీ పరిశ్రమలు, ప్రత్యేక ఆర్థిక మండళ్ళు, విమానాశ్రాయాలు, చూపెట్టి, ఉత్తరాంధ్ర ప్రజల మూల సమస్యలు అ యినా పంట భూములు, నీతి పారుదల, పరి శుభ్ర గ్రామాలు, అందుబాటులో విద్యా, ఆరోగ్యం, ప్రజా రవాణా ఈ గుణాత్మక కొలబద్దల మేరకు చూస్తే, చాలా ఆశాభంగం కలిగించే దృశ్యం ఈపాత్రీక్యుల కనుల ముందర నిలిచింది. ఈ పాత్రికేయుల ప్రజా యాత్రపై తగు సమాచార క్రోడీకరణ జరిగిన సంకలనం వెలువడ్డం, దీనిలో ప్రజలు తమ స్థానిక సమస్యలను వివరిచిన దానిపై, పాలనా యంత్రాంగ, హేతుబద్ధంగా, వాస్తవిక ప్రణాళికలతో సత్వర కార్యాచరణ చేయడం, పౌరజీవనంలో ప్రజలు, పాలకులు మధ్యన ప్రయోజన వారధిగా పత్రికలు, పాత్రికేయులు

పోషించవలసిన పాత్రకు, ఒక ఉన్నత ఉదాహరణగా నిలుస్తుంది. ఇటువంటి సమగ్రయాత్ర ద్వారా,ప్రజల జీవితం పై ఒక వాస్తవ అవగాహనకు కృషి చేసిన ఉత్తరాంధ్ర జర్నలిస్టుల ఫోరం నిర్వాహక ముఖ్యులందర్నీ అభినందిస్తున్నాను అనేది ఒక చిన్న మాట. వారి ఈ శ్రమ, చేపట్టిన ప్రణాళిక, ఇతర ప్రాంతాల పాత్రికేయులకు కూడా ఒక ఆదర్శం నిలుస్తుంది. నిలవాలని అందరమూ ఆశిద్దాము.

కొవ్వాడ న్యూక్లియర్ పార్క్ - కొన్ని వాస్తవాలు

రామతీర్థ
9849200385

గుజరాత్ ప్రజలు సాధించిన విజయంగా ఈ అణు విద్యుత్ పరిశ్రమ అక్కడ ఎలా ఆగిందో, ఆయా పద్ధతుల్లో, ఇక్కడి ప్రజలు కూడా, ఈ ప్రమాదకరమైన, భారీ ఎత్తున నష్ట దాయకమైన, ఈ కొవ్వాడ న్యూక్లియర్ పార్క్ ను తమ శాయ శక్తులా ఆపేందుకు, ప్రభుత్వ వర్గాలకు నచ్చచెప్పాలి. మనకు క్షేమ దాయకం అయిన జల విద్యుత్ ఉత్పాదనను అలక్ష్యం చేసి, పన్నెండు జీవ నదులున్నా వాటి ఉమ్మడి జలాల వినియోగం పట్ల ఎటువంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకుండా, భారీకాలుష్యకారకం అయిన బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్రాజెక్టులు అలాగే, మనం జాతీయ ఎనర్జీ ఉత్పత్తిలో కేవలం మూడు శాతం మాత్రమే ఉన్న అణు విద్యుత్ రంగం పట్ల ఎక్కువ మొగ్గు చూపిస్తూ, ఈ అరవై ఏళ్ళ గా భారత పాలక వర్గాలు, ఒక స్పష్టమైన పర్యావరణ హితమైన నేషనల్ ఎనర్జీ పాలిసీ (జాతీయ విద్యుత్ విధానం) ఏర్పాటులో ఘనమైన ప్రగతిని కానీ, లేదా, ఆ విషయంలో ప్రజలను తగు సలహా సంప్రదింపులలో భాగ స్వాములను చేయడం కానీ చేయలేక పోయాయి. ఇకనైనా, ఈ పరిస్థితి మారవలసి ఉన్నది.

కొవ్వాడ కథ మళ్ళీ మొదటికి వచ్చింది. పర్యావరణ ప్రభావ మదింపు లేదా అంచనా సర్వేలు తిరిగి చేస్తామని చెప్తున్నారు. అమెరికాకు చెందిన ఒక కంపెనీ జనరల్ ఎలక్ట్రిక్, ఇంతకు ముందు 1593 మెగావాట్ల సామర్థ్యం గల రియాక్టర్లు ఏర్పాటు చేస్తాము అంటే, సరే అని, కొవ్వాడ అణు విద్యుత్ ప్లాంట్ దాదాపు 9558 మెగావాట్ల సామర్థ్యంతో ఏర్పాటు జరుగుతుందని ప్రకటనలు చేసారు. తీరా ఇప్పుడు ప్రజల వ్యతిరేకత ఎలా ఉన్నప్పటికీ, ఈ కంపెనీ ఏర్పాటు చేయబోయే రియాక్టర్లు ప్రపంచంలో ఎక్కడా పని చెయ్యడం లేదు. అసలు అవి ఇంకా తయారు కాలేదు. అయినా పవర్ ప్లాంట్ ఏర్పాటు, ఉత్పత్తి క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే, దానికి ఈ కంపెనీ వారు చెల్లించవలసిన లయబిలిటీ (నష్టపరిహారం) ఇంత అని ఒప్పందంలో ఉన్నది. అది చాల ఎక్కువ అన్న మిషతో, వీరు కొవ్వాడ అణు విద్యుత్ పరిశ్రమ నుంచి తప్పుకోవడం జరిగింది.

ఈ జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ, జపాన్ కు చెందిన హిటాచి కంపెనీ అనే మూల సంస్థకు చెందిన అమెరికా శాఖ. ఇప్పుడు హిటాచి వారు తప్పుకోగా, తోషిబా వారు రంగంలోకి వచ్చారు. వీరి ఆమెరికా శాఖ పేరు వెస్టింగ్ హౌస్ ఎలెక్ట్రిక్ కంపెనీ ఆమెరికాకు చెందిన కంపెనీల స్థితి గతుల మదింపు సంస్థ స్టాండర్డ్ అండ్ పూర్ వారి రేటింగ్ ప్రకారం, ఈ కంపెనీ నష్టాల్లో ఉన్నది. వీరు తయారీ చేస్తున్న ఎ పి 1000 రియాక్టర్, 1100 మెగావాట్ల సామర్థ్యం కలదిగా చెప్తున్నారు. ఈ అణు రియాక్టర్లు ప్రపంచంలో, చాలా ఏళ్ల తరువాత తయారు అవుతున్నాయి. “జనరేషన్ త్రీ ప్లస్” టైప్ కు చెందినవిగా ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి.

ఇవి కూడా ఇంత వరకూ ప్రపంచంలో ఏ అణువిద్యుత్ ఉత్పత్తి పరిశ్రమలోనూ ఉపయోగించలేదు. ఇప్పుడు ఆరు రియాక్టర్ల ఏర్పాటుకు ప్రారంభాలు చేస్తున్నారు అంటే, 6600 మెగావాట్ల అణు విద్యుత్ ఉత్పత్తి చేసే అంచనాలతో ఉన్నారు.

ఈ 6600 మెగావాట్ల కొవ్వాడ న్యూక్లియర్ పార్క్ ఏర్పాటు క్రమంలో, ఇరవై వేల మంది ప్రజలు నిర్వాసితులు అవుతారని, మొత్తంగా ఆరు లక్షల ఇరవై ఏడువేలమంది ప్రజానీకం ప్రభావితులవుతారని, ఈ అంశం పై అధ్యయనం చేస్తున్న కేంద్ర ఎనర్జీ మంత్రిత్వశాఖ విశ్రాంత సెక్రటరీ ఇ.ఎ.ఎస్. శర్మ చెప్తున్నారు. ముందొక ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అసెస్మెంట్ జరిపి, అటుపై ఒక పబ్లిక్ హియరింగ్ నిర్వహించి, భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తామని, 2016 చివరికల్లా, ఈ ప్రాథమిక విషయాలలో ప్రగతి సాధిస్తామని పాలక వర్గాలు చెప్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ అధీనంలో 389 కోట్ల రూపాయలు జమ చేసామని, అది క్రమేపీ అయిదు వందల కోట్లకు, తరువాత కేటాయించిన మొత్తం అయిన 1000 కోట్లకు విస్తరించి, పునరావాస ప్రణాళిక పూర్తి కావడానికి వినియోగిస్తామని ప్రకటించింది.

కొవ్వాడ కన్నా గుజరాత్‌లోని మిత్విర్డీ, అలాగే మహారాష్ట్ర లోని జతియపూర్‌లలో పెద్ద ఎత్తున ప్రజా చైతన్య సమీకరణ జరిగింది.

గత వత్సరం జనవరిలో గుజరాత్‌లో ఎక్కడ ఈ వెస్టింగ్ హౌస్ కంపెనీ అణు రియాక్టర్లను పెట్టబోతున్నదో, ఆయ గ్రామాల ప్రజలు, తమ వ్యతిరేకతలో భాగంగా ప్రధాని మోడీకి, అమెరికా అధ్యక్షుడు ఒబామాకు, తమ ప్రాంతంలో ఎందుకు ఈ అణు విద్యుత్ పరిశ్రమలు వద్దో వివరంగా లేఖ రాసారు.

ఈ పరిశ్రమలు ఏర్పాటుకు పట్టే కాలం, అవి తాయారు చేసే విద్యుత్ ఒక యునిట్కు అయ్యే ఖర్చు, ఇవేవీ ఆర్థికంగా లాభదాయక ప్రాతిపదికలుగా కనిపించడం లేదు. తీరా నిర్మాణంలోనే పది-పదిహేను ఏళ్ళు కాలం (2032 వరకూ) ఖర్చు అయ్యాక, ఈ పరిశ్రమ పని చేసే కాలం కేవలం నాలుగు దశాబ్దాలు మాత్రమే, తరువాత, ఈ పరిశ్రమ సృష్టి చేసిన వ్యర్థాలను భద్రతతో తొలగించడం, లేదా, ఈ పరిశ్రమలను మూసేయడం, చాలా లక్షల కోట్ల ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.

పైపెచ్చు భారత దేశంలో ఏ కంపెనీ కూడా ఈ ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అసెస్మెంట్ జరిపేందుకు తగు అనుభవం , కానీ అర్హతలు కానీ కలిగి లేదు అని, గుజరాత్ గ్రామాల ప్రజలు భారత, అమెరికా ప్రభుత్వాలకు రాసారు. వారు ప్రధానమంత్రి రాష్ట్రానికి చెందిన వారు అయినప్పటికీ, తమ నిరంతర ప్రతిఘటన వాళ్ళ, ఈ వెస్టింగ్ హౌస్ కంపెనీ అణు రియాక్టర్లను తమ సౌరాష్ట్ర తీరం నుంచి బయటకు తరమగలిగారు.

అక్కడ ప్రతిష్టంభనాలు ఏర్పడ్డ, ఈ కంపెనీ, ఇంకా తాము ఏర్పాటు చేయని ఎ పి1000 అణు రియాక్టర్లను, అవి ఎలా పని చేస్తాయో ఎక్కడా నిరూపితం కాని విద్యుత్ ఉత్పాదన వ్యవస్థలను ఆంధ్రప్రదేశ్ కు తీసుకువస్తుంది. ఎన్నో ఏళ్ళు నుంచి ఏర్పాటు చేస్తామని చెప్తున్న చైనాలో ఇంకా 2017లో వీటి మొదటి బాచ్ ఏర్పాటు చేస్తారని అంచనాలు ఉన్నాయి.

గుజరాత్ అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అక్కడ వారు చేసినఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అసెస్మెంట్ లోప భూయిష్టంగా ఉందని, సాక్షాత్తు కేంద్ర మంత్రిత్వ శాఖే వారిని తప్పు బట్టింది.

అక్కడ చేసిన నిర్వాకం కన్నా, ఇక్కడ శ్రీకాకుళంలో, కొత్తగా ఇప్పుడు న్యూక్లియర్ పవర్ కార్పోరేషన్ ఇండియా లిమిటెడ్ చేయబోయేది ఏమిటో మనం తెలుసుకోవాలి.

గుజరాత్ ప్రజలు సాధించిన విజయంగా ఈ అణు విద్యుత్ పరిశ్రమ అక్కడ ఎలా ఆగిందో, ఆయా పద్ధతుల్లో, ఇక్కడి ప్రజలు కూడా, ఈ ప్రమాదకరమైన, భారీ ఎత్తున నష్టదాయకమైన, ఈ కొవ్వాడ న్యూక్లియర్ పార్క్‌ను తమ శాయ శక్తులా ఆపేందుకు, ప్రభుత్వ వర్గాలకు నచ్చచెప్పాలి.

మనకు క్షేమదాయకం అయిన జల విద్యుత్ ఉత్పాదనను అలక్ష్యం చేసి, పన్నెండు జీవ నదులున్నా వాటి ఉమ్మడి జలాల వినియోగం పట్ల ఎటువంటి దీర్ఘకాలిక ప్రణాళికలు లేకుండా, భారీ కాలుష్యకారకం అయిన బొగ్గు ఆధారిత థర్మల్ పవర్ ప్రాజెక్టులు అలాగే, మనం జాతీయ ఎనర్జీ ఉత్పత్తిలో కేవలం మూడు శాతం మాత్రమే ఉన్న అణు విద్యుత్ రంగం పట్ల ఎక్కువ మొగ్గు చూపిస్తూ, ఈ అరవై ఏళ్ళుగా భారత పాలక వర్గాలు, ఒక స్పష్టమైన పర్యావరణ హితమైన నేషనల్ ఎనర్జీ పాలిసీ (జాతీయ విద్యుత్ విధానం) ఏర్పాటులో ఘనమైన ప్రగతిని కానీ, లేదా, ఆ విషయంలో ప్రజలను తగు సలహా సంప్రదింపులలో భాగ స్వాములను చేయడం కానీ చేయలేక పోయాయి. ఇకనైనా, ఈ పరిస్థితి మారవలసి ఉన్నది.

కర్నాటకలో పత్రికా స్వేచ్ఛ

కర్నాటక శాసన సభ్యులకు జర్నలిస్టులు తమ పార్లమెంటరీ హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ విరుచుకు పడ్డం ఒక ధోరణిగా ఉన్నది. ఈ కోవలో తాజా ఉదాహరణ ఇద్దరు పాత్రికేయులు రవి బెలగేరే , అనిల్ రాజు, ఇద్దరూ రెండు స్థానిక పత్రికల సంపాదకులు. కర్నాటక శాసన సభ స్పీకర్, అలాగే శాసన సభ ప్రివిలేజెస్ సంఘం అధ్యక్షుడు కె.బి. కొలివాడ్ , వీరు ఇరువురికీ శాసన సభ్యుల ప్రివిలేజెస్‌కు భాగం కలిగేలా రాసినందుకు ఒక ఏడాది జైలు, చెరో పది వేల రూపాయల జుర్మానా , విధించారు.

ఇక్కడ గమనించవలసిందేమిటంటే వారు రాసినది, శాసన సభ్యుల గౌరవానికి మచ్చ కలిగించేలా ఉన్నదన్న అభిప్రాయం కోర్ట్‌లో తేల్చుకోవలసింది కాగా, ఇలా శాసన సభ్యులుగా వారి ప్రివిలేజెస్ ను భంగ పరిచారు అంటూ శాసన సభ చర్యలు తీసుకోవడం. స్వాతంత్ర్య పూర్వం నుంచీ వస్తున్న ఈ "పార్లమెంటరీ ప్రివిలిజెస్" అనేది చట్టంగా ఒక వలస పాలన వారసత్వ అవశేషం. శాసన నిర్మాణం చేయవలసిన పనికి ఎన్నికైన సభ్యులు తామే న్యాయమూర్తులుగా ఇలా జర్నలిస్టుల పై జైలు శిక్షలు విధించడం, అసలు ప్రజాస్వామ్యంలో ఉండదగిన అంశమే కాదు.

1980 వరకూ కర్నాటకలో పత్రికా రచన, ఒక సాదా సీదా వ్యవహారం. పాలించే వారి గురించి కూడా, మెతక మాటలతో, రాసే పరిస్థితి ఉండేది. అయితే, "లంకేష్ పత్రికే" రంగంలోకి వచ్చాక, ఈ కుహనా మర్యాదల రచనలకు కాలం చెల్లి, ఎవరు ఏమిటో, నిర్మొ గమాటంగా రాయడం మొదలు అయ్యింది. పి. లంకేష్ నిర్భీతిగా రాసే రాతల్లో ముఖ్యమంత్రి ఆర్ గుండూ రావు "గుం" కాగా, సీనియర్ మంత్రి ఎస్. బంగారప్ప "బం" గా వ్యవహారంలోకి వచ్చారు.

అదే సమయంలో రాష్ట్రంలో రైతులు ఆందోళనలు దిగి తమ పరిస్థితుల్లో బాగు కోరుతున్నారు. దళిత్ ఉద్యమం పెరుగుతున్నది కన్నడ భాషకు ప్రాధాన్యత కోరే గోకక్ ఆందోళన కూడా విస్తరిస్తున్నది. పాలిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై సర్వత్రా చాప కింద నీరులా అశాంతి ఏర్పడ్డది. లంకేష్ పత్రికే, వీటికి గొంతునిచ్చి నిలిచింది. పత్రికలో వచ్చే రచనల ప్రభుత్వ వ్యతిరేకత స్థాయి ఎంతలా పెరిగిందంటే, ముఖ్యమంత్రి గుండూ రావు, జర్నలిస్టు లందర్నీ, అరేబియన్ సముద్రంలోకి విసిరేయ్యాలి" అన్నారు ఒక బహిరంగ సభలో.

అయితే, ఈ పని నిజంగా చేయాలని ప్రయత్నించింది అటు తరువాత అధికారంలోకి వచ్చిన రామకృష్ణ హెగ్డే. ఆయన ఈ శాసన సభ్యుల ప్రత్యేక హక్కుల చట్టం మాట తీసుకొచ్చి పెట్టారు. వ్యకిగతంగా ప్రధాన పత్రికా ప్రవంతిలో తనకు "మిస్టర్ క్లీన్" అని గుర్తింపు ఉన్నా . "కాబోయే ప్రధాని" అని సంబోధనలున్నా, తిరిగి లంకేష్ పత్రికే, వారి జోక్యం ఉన్న , రేవజీత్ హౌసింగ్ కుంభ కోణానికి నేపథ్యం, ఎన్.ఆర్.ఐ.ఎహ్.ఏ. భూమి వివాదం గురించి, సారా బాట్లింగ్ కాంట్రాక్టు ల గురించి రాసి , అసలు విషయం తెలియచేసింది.

పత్రికా స్వేచ్ఛకు కొన్ని మార్గ దర్శక నియమాలు అంటూ పైకి చెప్తూ, నిజానికి, ఆ స్వేచ్ఛకు నిర్బంధాలు ఏర్పరిచే చట్టం ఒకటి కర్నాటక శాసన సభ (అధికారాలు, ప్రత్యేక హక్కులూ, మరియు అతీత స్థాయి (ఇమ్యునిటీ) బిల్, 1988 ప్రవేశపెట్టారు. ఈ బిల్ లో జర్నలిస్ట్ లకు అధిక స్థాయి శిక్షలు ఉండడం మూలానా, రాష్ట్రంలో నలు వేపులా, ఈ బిల్ కు వ్యతిరేకంగా ఆందోళన రేగింది. కొద్ది నెలల తరువాత, ఫోన్ టాప్పింగ్ ఆరోపనలు ఎదుర్కుంటూ, హెగ్డే రాజీనామా చేయవలసి వచ్చింది. ఆయన తరువాత ముఖ్యమంత్రిగా వచ్చిన ఎస్.ఆర్. బొమ్మై, ఈ బిల్ విషయం పట్టించుకోలేదు.

కానీ ఇంకొక ముఖ్య మంత్రి, అదే జనతా పార్టీకి చెందిన జె.హెచ్. పటేల్, కాలంలో శాసనసభలో ఉన్న మహిళా సభ్యులు తమ విధులు సక్రమంగా నిర్వర్తించడం లేదు అన్న మోతాదు మించిన ఘాటు అయిన మాటల ఒక రచనకు ప్రతిగా, పెద్ద ఎత్తున పార్టీలకు అతీతంగా, శాసన సభలో తమ నిరసనలు, రోదనల మధ్య తెలిపారు. సంపాదకుడు లంకేష్ నుంచి సంజాయిషీ కోరారు. ముఖ్యమంత్రి, ఇతర శాసనసభ్యులు కూడా ఈ సభ హక్కులను భంగ పర్చినందుకు ఈ ప్రివిలేజెస్ నోటీసును బలపరిచారు.

ఈ విషయంలో వేరే దారి అనుసరించినది స్వతంత్ర ఏం.ఎల్.యే. వటల్ నాగరాజ్. ఈ నాగరాజ్, ఒకసారి తన గురించి వ్యతిరేకంగా రాసినందుకు సంపాదకుడు లంకేష్ పై భౌతిక దాడి చేసినప్పటికీ, ఈ సందర్భంలో పత్రికలో రచనా, శాసన సభ్యుల ప్రతిష్టకు మచ్చ కలిగించేదే అయినా, అది సభా హక్కుల అతిక్రమణ కాదు అని తన మాటగా చెప్పారు. కర్నాటక అసెంబ్లీలో ఇదొక దుమారంగా కొన్నాళ్లు సాగినా, తదుపరి స్పీకర్ రమేశ్ కుమార్, ఈ వివాదం సద్దు మణిగేలా పట్టనట్టు ఊరుకున్నారు.

కేవలం లంకేష్, మరియు లంకేష్ పత్రికే మాత్రమే కాకుండా ఇతర జర్నలిస్ట్ లకు, పత్రికలకు కూడా ఈ అనుభవాలు ఎదురు అయ్యాయి. ప్రముఖ జర్నలిస్టు అయిన టి.జె.ఎస్. జార్జ్ వంటి వారిని శాసన సభలో నిందల పాలు చేశారు. ఏళ్ళు తరబడి పేరున్న దిన, వార పత్రికల సంపాదకులను, సభా హక్కుల సంఘం ముందుకు రప్పించి మందలింపులు జారీ చేస్తూ ఉన్నారు. ఈ జర్నలిస్ట్‌కు కూడా అలాంటి అనుభవం ఉంది. శాసనసభ్యులని ఏక వచనంతో పిలిచినా, వారి చర్యలను శాసన సభ బయట ఖండించినా, వారి

అధికార దుర్వినియోగం గురించి రాసినా ఇవన్నీ సభా హక్కుల భంగ పాటు చర్యలుగా వస్తాయని , ఎందుకంటే వారు ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధులు కాబట్టి అంటూ, అందువలన వారికి సామాన్యుల కన్నా ఎక్కువ హక్కులు ఉన్నాయి అని భావిస్తూ, ఇలా ప్రవర్తిస్తున్నారు. పత్రికల్లో శాసన సభ్యుల సభా హక్కుల భంగపర్చిన చాలా ఆరోపణల విషయంలో సభ తరఫున ఒక మందలింపు, పాత్రికేయుల నుంచి ఒక యధాలాప క్షమాపణ పత్రంతో సరి.

2012లో బి.జె.పికి చెందిన జగదీష్ షెట్టర్ ముఖ్యమంత్రిగా ఉండగా , ఇద్దరు శాసన సభ్యులు, ఒక ఎడిటర్ చేత, సభలో క్షమాపణ చెప్పించారు. అభయ్ పాటిల్, బి.జె.పి శాసన సభ్యులు, శ్యామ్ బి. ఘటగే కాంగ్రెస్ శాసన సభ్యులు , బెల్గావి నుంచి ప్రచురణ జరిగే "తరుణ్ భారత్" అనే మరాఠీ పత్రిక వారి గురించిన నిరాధారమైన రిపోర్ట్ రాసిందని పేర్కొన్నారు. అప్పటి సభ స్పీకర్ కె.జి. బోపయ్య ఈ ఆరోపణలను సభా హక్కుల సంఘానికి పంపారు. ఈ సంఘం ఆ పత్రిక సంపాదకుడు కిరణ్ ఠాకూర్ ఇటువంటి నేరానికి పాల్పడ్డారని తేల్చగా, తనను, అసెంబ్లీ లో ఏర్పాటు చేసిన ఒక తాత్కాలిక బోనులో నిలబెట్టి " నేను విచారం ప్రకటిస్తున్నాను. మా పత్రికలో, శాసన సభ హక్కులకు భంగం కలిగేలా ఎప్పుడూ ఏ రచనలూ ప్రచురించలేదు" అని చెపుకున్నారు. తోటి ఎడిటర్ కు జరిగిన ఈ అవమానకర సంఘటన గురించి, కన్నడ పత్రికా రంగం నిశ్శబ్దంగా ఉండి పోవడం గమనించదగ్గది.

చివరికి శాసన సభ స్పీకర్ కొలివాడ్ అన్నీ పార్టీల సభ్యులతో ఒక సభా కమిటీని వేస్తామని, వారు మీడియాకు తగు నియమావళి రూపొందిస్తారని ప్రకటన చేశారు. దీనికి సహజంగానే పత్రికా రంగం కరుకుగా స్పందన తెలియచెప్పింది. వినోదకరమైన పార్శ్వం ఏమిటంటే తామే ముందర ఇటువంటి నియమావళి కావాలన్న శాసనసభ్యుల గ్రూప్‌లో ఉన్నప్పటికీ, ఎట్టకేలకు ఎక్కువ మంది బి.జె.పి సభ్యులు "పత్రికల స్వేచ్ఛ పట్ల నియంత్రణలు పెట్టడం తమకు ఇష్టం లేని పని" అని పక్కకు తప్పుకున్నారు. ఇలా తీవ్ర ప్రతిష్టంభన, వ్యతిరేకతల మధ్య ఈ నియమావళి ఏర్పాటు చూడబోతే,, దీర నిద్రలోకి పోయినట్టున్నది. విషయం మళ్ళా మొదటకు వచ్చినట్టుంది బేలెగరే, రాజు, ఇద్దరు పత్రిక సంపాదకులకు విధించిన శిక్షలు చూస్తూ ఉంటే. బేలెగేరే రచనా పద్ధతి అందరికీ ఇష్టం కాకపోవచ్చు రాజు గురించి, అతని పత్రిక "యెలహంక వాయిస్" గురించి పెద్దగా సమాచారం లేదు. అయినప్పటికీ ముఖ్యమైన విషయం ఏమిటంటే, శాసనసభ్యులు జర్నలిస్ట్‌ల పై జడ్జ్ మెంట్‌కు కూచోకూడదు. వారికి గనుక పత్రికల్లో రిపోర్ట్‌ల ద్వారా తమ పరువు, ప్రతిష్టకు మచ్చ వచ్చిందని భావన ఉంటే, సాధారణ పౌరులకు మల్లే వారు కూడా, శిక్షా స్మృతి అనుసారం, న్యాయ పరమైన చర్యలు కోర్ట్‌ల ద్వారా చేపట్టవచ్చు. అదే సరైన పద్ధతి తప్ప, ఒక వలస పాలన వారసత్వ అవశేషం గొడుగు కింద తాము ఉంటామని, తమను విమర్శించే వారిపై శిక్షలు ప్రకటించకూడదు.

(జూన్, 16, 2017న వెలువడ్డ గౌరీ లంకేష్ ఆంగ్ల వ్యాసం రామతీర్థ అనువాదంలో)

గౌరీ లంకేష్‌తో ఇంటర్వ్యూ

రామతీర్థ
9849200385

రీడింగ్ రూమ్

ప్ర- (మీకు పరువు నష్టం కేసులో జైల్ శిక్ష, జుల్మానా విధిస్తున్న) ఈ తీర్పు మీకు ఆశ్చ ర్యం కలిగించిందా?

జ:అవును. నేను స్పష్టంగా కోర్ట్‌కు తెలియచేసాను ఈ కేసు లో పరువు నష్టం కలిగించే అంశం ఏదీ లేదు అని.

(ఈ డిఫమేషన్ కేసు గురించిన వివరాలు జనవరి 23, 2008న "గౌరీ లంకేష్ పత్రిక" దరోదె గిలడ బి జె పి గళు" తమ వీక్లీ లో ప్రచురించారు. అందులో బికెపి ఎంపీ ప్రహ్లాద్ జోషీ, ఇంకా తది తర పార్టీ నాయకులు ఉమేశ్ దోషి, శివానంద్ భట్ అండ్ వెంకటేష్ మేస్త్రి అనే వారి పై ఆరోపణలున్నాయి. ఇది కారణంగా ప్రహ్లాద్ జోషీ, ఉమేశ్ దోషి, వేరు వేరుగా రెండు పరువౌనష్టం దావాలు వేశారు ఆమె పై. నవంబర్ 30, 2016 న జుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్, హుబ్బలి ఆమెను రెండు కేసుల లోనూ దోషిగా నిర్ధారించి, ఆరు నెలల జైలు, పది వేల రూపాయల జుల్మానా విధించి, పైకోర్ట్‌కు అప్పీల్ చేసుకోవలసిందిగా, ఆమె దరఖాస్తు చేస్తుకున్న బెయిల్ అభ్యర్ధనను వెంటనే మంజూరు చేసింది.

ప్ర - కోర్ట్ మీరు రాసిన దానికి సంతృప్తి కరమైన ఆధారాలు చూపలేకపోయారన్నది కదా. ఈ కేసులో మీరు ఎలా ముందుకు వెళ్దామని
అనుకుంటున్నారు?

జ: కోర్ట్ పరిగణనలో ఉన్న కేసు కనుక నేనేమీ వ్యాఖ్యలు చేయలేను. కోర్ట్ నాకు అరవై రోజుల గడు వు ఇచ్చింది, హైకోర్ట్ కు వెళ్లడానికి. నేను సెషన్స్ కోర్ట్ కు కేసు తీసుకు వెళ్తాను.

ప్ర: మిమ్మల్ని బిజెపి వ్యతిరేకులు గానూ, హిందూ వ్యతిరేకి గానూ నరేంద్ర మోడి వ్యతిరేకి గానూ చిత్రిస్తున్నారు. ఏమిటి మీరు వ్యతిరేకిస్తున్నదో స్పష్టంగా చెప్తారా?

జ: భారత దేశ పౌరురాలిగా నేను బిజెపి వారి ఫాసిస్ట్ మరియు మత , కుల ఆధారిత రాజకీయాలకు వ్యతిరేకిని. హిందూ ధర్మ ఆదర్శాల పట్ల వారి తరహా వ్యాఖ్యానాలతో నాకు అసమ్మతి, విరోధం ఉన్నాయి. హిందూ ధర్మ విధానంలో ఉన్న కుల, లింగ పరమైన ఆంక్షలకు నేను వ్యతిరేకిని. ఎల్.కె అద్వానీ రామ మందిర యాత్ర, నరేంద్ర మోడీ గారి పాలనలో 2002 గుజరాత్ లో జరిగిన ఊచకోత వీటికి నేను వ్యతిరేకం. రాజ్యాంగం నన్నొక లౌకిక పౌరురాలిగా ఉండమని చెప్తుంది. మత తత్వాలకు ప్రతినిధిగా కాదు. ఈ మతతత్వ, కుల తత్వ శక్తులకు ప్రతిగా పోరాటం చేయడం దేశ పౌర స్థాయిలో నా విధి. నేను వచ్చిన కర్నాటకలో బసవన్న తన కుల వ్యతిరేక జాగృతి రేకెత్తించాడు. బి. ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ రచన చేసిన దేశం నాడీ. ఆయన మత తత్వాలకు, కుల తత్వాలకు వ్యతిరేకి.నాకున్న స్వల్ప మైన సామర్థ్యంతో నేనీ పోరాటాన్ని ముందుకు తీసుకు పోతున్నాను. నాకు ప్రజాస్వామ్యంలో, అభివ్యక్తి స్వేచ్ఛలో నమ్మకం ఉన్నది. అందువలన విమర్శ అన్నా కూడా స్వాగతి స్తాను. కొందరిలా నన్ను బిజెపి వ్యతిరేకి అనీ మోడీ వ్యతిరేకి అనీ, పిలవడం వారి ఇష్టం. వారి అభిప్రాయాలు వారికున్నట్టే, నా అభిప్రాయాలు నాకుంటాయి.

ప్ర: మీ తండ్రి లంకేష్ గారు పత్రిక నడిపే కాలంలో మీరు లంకేష్ పత్రికకు ఇరవై ఏళ్లలో కేవలం ఒక్కసారే రచన చేశారు, అదేమని అడిగినప్పు డు, ఇంత సూటి, నిర్మొగమాటపు పత్రికకు వీలైనంత దూరంగా ఉంటాను ఎందుకంటే నేను ప్రధాన స్రవంతి ఇంగ్లీష్ పత్రికల్లో పని చేస్తున్నాను అని చెప్పా రు. ఇప్పుడేమో అప్పుడు చెప్పిందానికి, మీరు పూర్తి విరుద్ధంగా ఆచరణ లో ఉన్నారు, చివరికి ఒక కోర్ట్ కేసు కూడా ఎదుర్కుంటున్నారు? ఈ మార్పు అంతా ఎలా జరిగిందంటారు?

జ: అంత సూటిగా, నిర్మొగమా టంగా నేను అప్పట్లో రాయడం అంటే, ఇతర పత్రికా సంస్థలకు పని చేస్తూ ఉండడం వలన కొన్ని పరిమితులుం టాయి కనుక కుదరదు. నేను కొంత సార్థకమైన పని చేసేందుకు ప్రయత్నాలు చేసినా నాకు అప్పగించిన పని కన్నా ఎక్కువ చేయడం కుదిరేది కాదు. దేశం లోని అందరూ మధ్యతరగతి పిల్లల వలెనే, నేను కూడా ఇంగ్లీష్ స్కూళ్లలోనే చదువుకున్నాను, అందువలన ఆ భాషలో రాయడం నాకు సులువుగా ఉండేది. అయితే ఇవాళ మార్పు ఏమిటంటే, ఈ ప్రచురణ నేను నడుపుతున్నాను, అందువల్ల, ఏ రచనలు ఉండాలి అన్న దాని పై నాకు పూర్తి స్వేచ్ఛ ఉన్నది.

ప్ర: మీరు చెప్పిన విధంగా ఇంగ్లీష్ నేపథ్యం ఉన్న మీకు కన్నడలో ఒక పత్రిక నిర్వహణ అంటే కష్టం తో కూడిన పని అనిపించిందా?

జ: మొదట్లో నాకు భాషతో ఇబ్బంది ఉండేది. నిజానికి , "లంకేష్ పత్రికే" సిబ్బందే నన్ను పత్రిక ఎడిటర్‌గా ఎంచుకున్నారు. మా నాన్న అంటూ ఉండేవారు, గుండె లోతుల్లోంచి రాయాలీ అంటే, అది తన అమ్మభాషలోనే సాధ్యమవుతుందని. అందువలన నేను "లంకేష్ పత్రికే" సంపాదక బాధ్యతలు స్వీకరించగానే, కన్నడంలోనే రాయడం మొదలు పెట్టాను అప్పుడు తెలిసివచ్చింది నాన్న చెప్పింది ఎంత సరై నదో. ఇప్పుడు నేను కన్నడంనుంచి ఇంగ్లీష్‌కు, అటు నించి ఇటూ అనువాదాలు చేస్తూ ఉంటాను. అయినా కొన్ని సార్లు సరైన మాట ఏదా అని నేను వెతు క్కున్న సందరాలు ఉన్నాయి. "

ప్ర :బిజెపి. కేంద్రంలో అధికారంలోకి వచ్చాక కర్నాటకలో ఏ విధమైన మార్పులు వచ్చాయంటారు ? కల్బుర్గి హత్య, జర్నలిస్ట్ లపై దాడులూ, మత వాద ధోరణుల గొంతు బలపడ్డం వగైరా -

జ: బిజెపి వారి ప్రభ దేశ స్థాయిలో వెలుగుతుండగా, వేర్పాటు ధోరణుల శక్తులు లాభ పడుతున్నాయి. చెలరేగుతున్నారు ఒక మాటలో చెప్పాలంటే. 2014లో యు. ఆర్, అనంత మూర్తి కన్ను మూసిన తరుణంలో, బజరంగ్ దల్ కార్యకర్తలు బాణసంచా కాల్చారు. తార్కిక దృష్టి గల మేధావి కల్బుర్గి హత్యను కూడా వారు కీర్తించారు. కర్నాటక చూడ్డానికి లౌకిక వాదానికి నిలబడే కాంగ్రెస్ పాలనలో ఉన్నా, కేంద్రంలో బిజెపి పాలన వలనఇక్కడి పరిపాలనా యంత్రాంగం కూడా మత, కుల ప్రాతిపదికల పైన మాత్రమే పని చేస్తున్నది. ఇక్కడ మీకో విషయం చెప్తాను. గురు దత్తాత్రేయ బాబా బుదాన్ స్వామి దర్గా , బాబా బుడాన్ గిరి కొండపై కర్నాటకలోని చిక్కమ గలూరులో ఉన్నది. ఇక్కడికి మాటలకు అతీతంగా, హిందువులు, ముస్లిం లు పెద్ద ఎత్తున అందరూ వస్తూ ఉంటారు. అయితే బిజెపి ఈ ఆధ్యాత్మిక స్థలాన్ని దక్షిణాది అయోధ్యగా మార్చాలని ఆలోచనలో ఉన్నది. ఇక్కడ ఒక గుడి కట్టాలనీ, దానికి ఒక అర్చకుడిని నియమించాలనీ, అంతా బ్రాహ్మణీయం చేయాలన్న వారి ఆలోచనలకు అనుగుణంగా వారికి కలిగిన తలంపు. సుప్రీం కోర్ట్‌లో దీనికి వ్యతిరేకంగా ఒక పిటిషన్ వేశా ము, ఈ అధ్యాత్మిక స్థల లోయికిక స్వభావాన్ని నిలబె ట్టాలని. గత ఏడాది, కోర్ట్, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ విషయమై నిర్ణయం తీసుకోవాలని సూచనలు జారీ చేసింది. అప్పతిను,మ్చి కర్నాటక ప్రభుత్వం ఈ ఫైల్ ను అలాగే ఉంచింది. నేనొక ఐ.ఏ.ఎస్ అధికారిని ఆమెకు ఇంటి పేరులో బ్రాహ్మణ ఇంటిపేరు అయిన రావ్ ఉన్నది లెండి, ఆమెను కలిసి అడిగాను ఈ బాబా బుదన్ దర్గా విషయం ఏం చేశారని. ఆమె ఆ విష యాన్ని తేలిగ్గా పక్కన పెడుతూ, మీకు ఇంతకన్నా వేరే ముఖ్యమైన పనులేవీ ఉండవా అని ఎదురు ప్రశ్న వేసింది. దీంతో మీరు అర్థం చేసుకోవచ్చు, మత, కుల ప్రతిపదికల పైన, కర్నాటక రాజ్యపాలనా యంత్రాం గం ఎలా చీలి పోయి ఉన్నదో. కోర్ట్ నా కేసు విష యంలో శిక్ష తెలుపగానే, అమిత్ మాలవ్యా అనే బి జెపి నాయకుడు, ఒక ట్వీట్ పెట్టారు ఏమని అంటే, ప్రహ్లాద్ జోషి, ధార్వాడ్‌కు చెందిన బిజెపి ఏం.పి గౌరీ లంకేష్ కు జైలు శిక్ష వేయించగలిగారు, దీన్ని బట్టి ఇతర జర్నలిస్ట్‌లు సరిగా నడుచుకుంటారని ఆశిస్తున్నాను" అని. అది పాత్రికేయ సమాజానికి ఒక బాహాట బెదిరింపు, వామ పక్ష, తార్కిక, ప్రగతి శీల పత్రికా రచయితలకు, ఎవరైతే, పాలక పక్ష భావ జాలంతో అంగీకరించరో, వారందరికీ ఒక హెచ్చరిక లా ట్వీట్ చేశారు ఆయన.

ప్ర - "గౌరీ లంకేష్ పత్రికే"లో ఏ ప్రకటనలూ లేకుండా నడపడం అనే మీ సూత్రనికే కట్టుబడి ఉంటారా ఇంకా? పత్రిక నిర్వహణకు మీకు నిధులెలా వస్తాయి?

జ - అవును, ప్రకటనలు లేకుండానే పత్రికను నడపాలన్న సూత్రానికి కట్టుబడి మాత్రమే పత్రిక నిర్వహణ జరుగుతుంది. ఇంతవరకూ మేం ప్రకట నలేవీ వేయలేదు, ముందు కూడా వేసే తలంపు లేదు. మదోక చిన్న టీం, తక్కువ బడ్జెట్‌లో నడిచే పత్రిక. మాతో పాటు పత్రికలు నడుపుతున్న వారు లక్షలు సంపాదన చేస్తూ ఉండగా, నేను కేవలం కొన్ని వేలు మాత్రమే సంపాదిస్తున్నాను. మాకు పని చేసే మాడ్యూల్స్ ఉన్నాయి ఫ్రీ లాన్సర్‌గా పని చేసే వారు ఉన్నారు. ప్రకటనలు వద్దు అని మేము పాటించే నియమం వలన నా ప్రతిష్టకు భంగం కలగలేదు. ఎవరి వద్ద డబ్బు తీసుకునే చరిత్ర నాకు లేదు. నేను డబ్బు కోసం ఏదైనా చేశానని అనేవారిని అది నిరూ పించమని సవాల్ చేస్తాను, మాకు గౌరీ లంకేష్ పత్రికే ,అత్రమే కాక, ఇతర ప్రచురణలున్నాయి. గైడ్ (పోటీ పరీక్షల విషయ పత్రిక) ఉద్యోగ (ఉద్యోగ సూచనల సలహాల పత్రిక), ఇంకా పుస్తక ప్రచురణల విభాగాలు లంకేష్ ప్రకాషన్ , గైడ్ ప్రకాషన్ వంటి ఇతర యూనిట్లు ఉన్నాయి. వాటి నుంచి కొంత నిధు లు అవసరం అయితే ఇటు మళ్లించి మేం "లంకేష్ పత్రికే"ను నడపుతుంటాము.

ప్ర: కర్నాటక రాష్ట్రంలో "సిటిజెన్స్ ఇనిషీయేటివ్ ఫర్ పీస్" వేదిక ఏర్పాటు చేసిన వారికో ఒకరిగా మీరు ఇటీవల నిలంబూర్, కేరళలో జరిగిన మావోయిస్ట్ కాల్చివేతల గురించి ఏమంటారు?

జ: నేను సేకరించిన వార్తలు, చదివిన సమాచారం ప్రకారం నాకు అది ఒక అబద్ధపు ఎన్ కౌంటర్ గా తోస్తున్నది. చనిపోయిన ఇద్దరు మావోయిస్టు నాయకులు అజిత, కుప్పుస్వామి దేవరాజ్ ఇద్దరూ నిరాయుధంగా ఉండగా, కేరళ పోలీస్ బలగాలకు చెందిన థండర్ బోల్ట్ ఫోర్స్, వారిని కాల్చి వేశారు. సుప్రీమ్ కోర్ట్ మార్గ దర్శక నియమావళి అనుసారం పోలీసులు ఎవరి పైనా కాల్పులు జరపరాదు, తమ ప్రాణా లు ప్రమాదంలో ఉంటే తప్ప. ఈ ఇరువురూ ఏ ఆయు ధం లేకుండా ఉన్నారు. అందువలన ఇది కావాలని జరిపిన హత్యల కిందకు వస్తుంది. పోలీసులు ఈ దేశంలో జడ్జీలు కారు, ఆపని కోర్ట్‌లు చేస్తాయి. వారి ని అరెస్ట్ చేసి, కోర్ట్ ముందు హాజరు పరచడమే పోలీ సులు చేయవలసిన విధి.

నాకున్న స్వల్పమైన సామర్థ్యంతో నేనీ పోరాటాన్ని ముందుకు తీసుకు పోతున్నాను. నాకు ప్రజాస్వామ్యంలో, అభివ్యక్తి స్వేచ్ఛలో నమ్మకం ఉన్నది. అందువలన విమర్శ అన్నా కూడా స్వాగతి స్తాను. కొందరిలా నన్ను బిజెపి వ్యతిరేకి అనీ మోడీ వ్యతిరేకి అనీ, పిలవడం వారి ఇష్టం. వారి అభిప్రాయాలు వారికున్నట్టే, నా అభిప్రాయాలు నాకుంటాయి.

ప్ర: సంపాదక బాధ్యతలు నిర్వహిస్తున్న మహిళగా ఈ మగ వారి ఆధిక్య పత్రికా సమాజం లో మీరు ఏవైనా సవాళ్ళు ఎదుర్కున్నారా?

(నవ్వుతూ) నా గొంతు అణచేయడానికి ప్రయత్నాలు జరిగాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో వ్యాఖ్యలు అతి క్రూరంగా ఉంటాయి కొన్ని సార్లు. ఇప్పుడు నాకు యాభై రెండేళ్ళు. సాంఘిక అసమానతల వలన విద్యా రంగంలో ఒత్తిడికి గురి అవుతున్న కన్హయా కుమార్, ఉమర్ ఖాలిద్, అనిర్బన్ భట్టాచార్య వంటి యువకులను, నేను నా ఆదర్శాల ప్రతినిధులైన నా బిడ్డలు భావిస్తాను. ట్విట్టర్‌లో వారి ఫోటోలు నేను పెట్టాను, ఒకరు వ్యాఖ్య చేశారు. "నీకెంతమంది మొగుళ్లున్నారు" అని. తనకంటూ ఒక గొంతు కలిగి ఉన్నది ఒక స్త్రీ అయితే, ఆమెను ఇలా అవమానించడం సరైనదేనా? వారి తెలివి తక్కువ తనం, అజ్ఞానం పట్ల ఒక నవ్వు నవ్వుకుని ఊర్కుంటా .

(ఇంగ్లీష్ ఇంటర్వ్యూ చేసినది నారద పత్రిక కాలం డిసెంబర్ 2016)

తెలుగు అనువాదం - రామతీర్థ

రీడింగ్ రూమ్

రామతీర్థ
9849200385

"పెట్రో ధరలే సౌఖ్యమనే భావన రానీవోయి. ఆ ఎరుకే నిశ్చలానాందమోయి, బ్రహ్మానందమోయి" అనేది దేశ ప్రజలకు అలవాటు చేయడానికి, ప్రభుత్వాలు శాయశక్తులా కృషి చేస్తున్నాయి.సామాజిక మాధ్యమాలు పెట్రో మంటలతో భగ్గు మంటున్నాయి.

పెట్రోధరలే సౌఖ్యమనే భావన రానీవోయి!

దేశంలో ప్రస్తుత ప్రభుత్వం పన్నుల విధానాన్ని మార్చి జి ఎస్ టి అమలు చేసేందుకు ఏర్పాట్లు చేసి, తద్వారా, ప్రజల నుంచి తామేదో గొప్ప విధానం ద్వారా పన్నులు వసూలు చేసే పద్ధతులు రూపొందించామని చెప్పుకుంటున్నారు. పెట్రో రేట్ల విషయంలో వాస్తవం ఏమిటి అంటే, ఎక్కువ పన్ను ప్రజల నుంచి రోజువారీగా నిశ్శబ్దంగా వసూలు చేయడానికి జరిగిన ఆర్థిక పకడ్బందీ తప్ప, మరేమీ కాదు. ప్రపంచంలో ఇరవై ఎనిమిది శాతం పన్ను జి ఎస్ టి గా విధిస్తున్న కొద్ది దేశాల్లో భారత్ కూడా ఒకటి. ఇంత పెద్ద దేశానికి, ఇంత ఎక్కువ పన్ను శ్లాబ్ ఉండాలా అంటే, ఈ ప్రభుత్వ సమర్థకులైన వారు మాట్లాడరు, కానీ , ఎప్పటికైనా ఈ అత్యధిక శ్లాబ్ పన్ను తిరిగి సమీక్ష చేయవలసి వస్తుంది.

దేశంలో ఉత్పత్తులన్నీ కూడా ఈ మూడు శ్లాబ్ పన్నులలో ఏదో ఒక పద్ధతి లో ఉండాలి. అటువంటప్పుడు ముక్కు పిండి పన్నులు వసూలు చేయడం ఒక గొప్ప నైపుణ్యంగా చెప్పుకునే ప్రభుత్వాలు పెట్రోల్ మాట ఏమిటి తేల్చాయి. అంటే ఇక్కడ మనం గుర్తు పెట్టుకోవలసింది, ఏ పార్టీ ప్రభుత్వం అయినా, ఎక్కువ డబ్బు ప్రజల వద్ద నుంచి పొందడం అనే పద్ధతికి విరుద్ధం కాదు. అందువల్ల, తాము గొప్పగా ఇతర సమస్త ఉత్పత్తుల విషయంలో వసూల్ చేస్తున్న పన్ను పరిధి లోకి లోకి పెట్రోల్‌ను తెస్తే - ఇప్పటి ఆదాయ వనరుగా పెట్రోల్ నుంచి డబ్బుల రాబడి తగ్గిపోతుంది కనుక పెట్రోల్ జి ఎస్ టి లోకి అత్యధిక శ్లాబ్ అయిన ఇరవై ఎనిమిది శాతం లోకి తెచ్చినా, వారికి నష్టమే. అందువల్ల పెట్రోల్ జి ఎస్ టి లోకి రాదు, రానివ్వం, అంటూ ప్రజలకు నష్టం అయినా, తమకేమీ లెక్క లేకుండా మాట్లాడుతున్నారు. ప్రజలు ప్రతి ఏటా కట్టే లక్షల కోట్ల పన్నులు ఎక్కడికి పోతున్నాయో కానీ, మళ్ళీ అప్పుల కోసం విదేశాల యాత్రలు, పెట్టుబడుల విజ్ఞప్తులు, తమ శక్తి వంచన లేకుండా, ఇటు రాష్ట్ర, అటు కేంద్ర ప్రభుత్వాలు చేస్తూనే ఉన్నారు. లేదా పోనీ తమ ఇటీవలి జి ఎస్ టి లో అత్యధిక పన్నుశ్లాబ్ అయిన ఇరవై ఎనిమిది శాతానికే వర్గీకరించినా ఇప్పటి ధరల నుంచి, భారత దేశంలో ప్రస్తుతం అమల్లో ఉన్న పన్నుల విధానం ప్రకారమే, పెట్రోల్ ముప్పై రూపాయలు, డీజిల్ 26 రూపాయలు పైగా తగ్గే అవకాశం, ఉన్నది.

అత్యధిక పన్ను అంటూ ఒక పక్క 28 శాతం పన్ను, మరొక పక్క పెట్రోల్ పై అంతకు మించిన పన్నును ద్వంద్వ ప్రమాణాలుగా వసూలు చేస్తున్న ప్రభుత్వాలకు ప్రజా సంక్షేమం ఏమైనా పట్టిందా ? ఎన్నికలు రాగానే ప్రజల కోసమే మాట్లాడే గాలికబుర్ల రాజకీయ నాయకులు, ఎవరూ కూడా జి ఎస్ టి కి పెట్రోల్ ధరలు పరిమితం చేస్తాము అని మాట్లాడ్డం లేదు. దానివల్ల నిత్యావసర ఫస్తువుల ధరలు ఎంతగా తగ్గుముఖం పట్టి, సామాన్యులకు ఊరట లభిస్తుందో తెలిసి కూడా, అలా ప్రజోపయోగ కార్యాలు చేయలేని, లాభాపేక్ష గల ప్రభుత్వాల, పార్టీల చిత్తశుద్ధి ఏమిటో, సామాన్యులు అర్థం చేసుకోవాలి.

పెట్రోల్ మీద నూరు శాతం, అలాగే డీజిల్ పై అరవై ఎనిమిది శాతం పన్ను చెల్లిస్తున్న సంపన్నులమైన సామాన్యులం మనం. ఇంకా ఈ ప్రభుత్వాలకు పన్నుల యావ తగ్గదు. వీరు, ఏ పార్టీ కూడా కొత్త ఉద్యోగాలు సృష్టి చేయలేరు. ఎందుకూ అంటే దేశం భారీ సాంకేతికత దశలో ఉన్న వర్తమానంలో , ఉద్యోగాలకు ఆటోమేషన్ ప్రమాదం నుంచి తప్పించే ఏ కొత్త ఆలోచన్లూ వీళ్ళ వద్ద లేవు. పేదలు, సామాన్యుల పుట్టుక , ఆరోగ్యం, విద్య, వైద్యం, ఉపాధి, ఉద్యోగం, జీవన నైపుణ్యాల పెంపుదల, జీవన భద్రత, ఆహార భద్రత, ధరల నియంత్రణ, రవాణా ఖర్చుల కట్టడి ఏమీ చేయకుండా , ఎలా, ఏ విధమైన పాలన చేస్తున్నారో తెలీని వారు గత నాలుగు దశాబ్దాలుగా పాలిస్తున్నారు.

కేవలం 36.93 పైసలకు చమురు శుద్ధి కర్మాగారం నుంచి వస్తున్న పెట్రోల్ ఎందుకు ఇంత ఎక్కువ ధరగా, ఉన్నదో ప్రజలు విపులంగా తెలుసుకోవాలి. అప్పుడే, ఈ ధరకు మూడు నుంచి ఆరు రూపాయలుండే డీలర్ (పెట్రోల్ బంక్ కమిషన్) అలాగే, మనకు అత్యధిక జి ఎస్ టి ప్రకారం, 28 శాతం పన్ను కలిపినా కూడా పెట్రోల్ యాభై రూపాయల రమారమిలో ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. అలాగే డీజిల్ కూడా, యాభై మూడు రూపాయలకు కొంచెం అటూ ఇటూ గా లభ్యమయ్యే దశ, ప్రభుత్వం ఒక్క నిర్ణయంతో అమలు పరచగలిగి ఉంది కూడా, ఇవాళ ఎనభై ఆరు రూపాయల ధర దాటినా, ఇంకా వేచి చూస్తూ, తమ బొక్కసం నింపుకునే మార్గాన్ని ఎంతమాత్రమూ వదులుకోవడం లేదు.

పెట్రోల్ ధరలు నెలకో సారి, లేదా పదిహేను రోజులకో సారి పెరగడం, ఆవర్తలు పేపర్లలో తాటికాయలంత అక్షరాలతో రావడం, పార్టీల ఆందోళన, ఇవన్నీ ప్రభుత్వాలకు అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రాల్లో కూడా నిత్యం ఒక తలనెప్పిగా ఉండడం వల్ల, ప్రభుత్వం, పెట్రోల్ ధరలను నిర్ణీత కాల వార్తా గాకాక, దైనందిన విషయంగా, కేవలం పెట్రోల్ బంకుల వారికి తెలిసే ధరవరలు గా మార్చేయడమే, మోడీ ప్రభుత్వ ఘన కార్యం. దీనివల్ల రోజువారీ ధరల్లో ఎంత పెరుగుతోందో, ప్రజలకు ప్రతీ రోజూ ఆందోళన చేసే విషయం కాదు కనుక, పెట్రోల్ ధరలు, పతాక శీర్షికల నుంచి తప్పి పోయాయి. అదీ పాలించే ప్రభుత్వాలు తమకోసం తాము చేసుకున్న వెసులుబాటు. ఇక మోడీ ప్రభుత్వం చెప్పే ప్రజాకర్షక విధానాలు ఎంత నిజం అంటే. వీరు 2014 లో అధికారంలోకి రాగానే అదనంగా లీటర్ పెట్రోల్ పై 11.77 పైసలు, లీటర్ డీజిల్ పై 13.47 పైసలు ఎక్సైజు సుంకం విధించారు.

ఒఎంసి అనగా ఆయిల్ మానుఫేక్చరింగ్ కంపెనీల భాగ్యరేఖలు, ప్రభుత్వాల పన్ను వసూలు పన్నుగడలు, తెలుసుకోవడం ప్రజల బాధ్యత. పెట్రోల్ ధరలను సరళంగా ఉంచి, సమస్త వస్తువుల రవాణా ధరలు ఎంత తగ్గిస్తే, అంత ప్రజా పక్ష పార్టీలుగా నిలుస్తాము అనే జ్ఞానం లేకుండా, ప్రజల నడ్డి విరగ్గొట్టి పన్నులు వసూలు, ద్వంద్వ రీతిలో అనగా, జి ఎస్ టి పేరిట ఒక వేపు, జి ఎస్ టి పరిధిఉలోకి రాదు అంటూ పెట్రోల్‌పై సూపర్ పన్నులు నూరు శాతందాకా విధించే పాలకుల సంస్కారాన్ని, ప్రజా హితం కోరేదిగా ఎలా అర్థం చేసుకుంటాము? అదే పాలక వర్గాల పెట్రో పాలిసీ విషయంలో ప్రజల గుండెల్లో భగ్గున మండే ప్రశ్న. ఇప్పుడో సారి నవ్వుకుందాము- సామాజిక మాధ్యమాల్లో జోరుగా ఉంది -" వంద లీటర్ల పెట్రోల్ కొంటె నానో కార్ ఫ్రీ". " దేవుడ్ని అడిగారో వరం - స్వామీ - జీవితానికి సరిపోయే పెట్రోల్ వరంగా అనుగ్రహించమని" - దేవుడి జవాబు -స్థాయి తెలిసి వరం అడగడం నేర్చుకో, నేనే ఇప్పుడు నీ దగ్గరకి నడిచొచ్చాను."

రీడింగ్ రూమ్

అక్బర్లూ, మారుతీ రావులకు బహిరంగ లేఖ

రామతీర్థ
9849200385

పిల్లల గురించి
మీ పిల్లలు మాత్రమే కారు
జీవితం తన మనుగడ కోసం ఆర్తి తో కన్న జీవిత సంతానం
మీ ద్వారా వస్తారు కానీ మీ నుంచి మాత్రం కాదు
వారు మీతో ఉన్నప్పటికీ వారు మీకు చెందరు
వారికి మీ ప్రేమనివ్వగలరు కానీ మీ ఆలోచనలను మాత్రం కాదు
వారి ఆలోచనలు వారికుంటాయి
వారిని మీరు శరీరాలుగా ఇళ్ళల్లో పెంచవచ్చును కానీ వారి ఆత్మలను కాదు
ఎందుకంటే వారి ఆత్మలు మీరు కలల్లో కూడా సందర్శించలేని
రేపు అనే ఇళ్ళలో ఎదుగుతాయి
మీరు వారిలా ఉండాలని తపన పడొచ్చు
కానీ వారు మీలా ఉండాలని మాత్రం తాపత్రయ పడొద్దు
ఎందుకంటే జీవితం వెనక్కి మళ్ళదు
నిన్నతో తంటాలు పడదు
జీవ బాణాల వలె పిల్లల్ని సంధించిన
ధనుస్సులు మీరు
విలుకాడు లక్ష్యాన్ని గురిచూసి
ఒకింత ముందుకు వంగి తదేక ధ్యాసతో
వీళ్ళు లాంటి మిమ్మల్ని వంచి బాణాలను వదులుతాడు
వాడిగా, వడిగా సుదూర అనంతంలోనికి
ఆ విలుకాడి చేతుల్లో విల్లుల వలె ఆనందంతో వంగి ఉండండి
దూసుకెళ్లే ఆ అమ్ముల్ని ఎంతగా ప్రేమిస్తాడో
స్థిరంగా ఉండే విల్లుల్నీ కూడా అంతే ప్రేమిస్తాడు తను.
ఖలీల్ జిబ్రాన్ (1883- 1931) లెబనాన్ దేశపు కవి.

మనం పిల్లలను చంపుకుంటున్న క్రీస్తు పూర్వం లా మనం ప్రేమ పూర్వం కాలంలో ఉన్నాము. పిల్లలను చంపడానికి సిగ్గు లజ్జ లేకుండా, పరువు మాటలు మాట్లాడుతున్నాము. అయిదు వందల ఏళ్ల కిందట ఒక పాదుషా అక్బర్, నేటి ఒక మూర్ఖ తండ్రి మారుతీ రావు ఇతరుల పిల్లలను చంపడానికి పెద్ద మనుషులే. కానీ ఆ ప్రేమలో ఉన్న తన కొడుకు, సలీం ను అక్బర్ గానీ, అలాగే ప్రేమలో ఉన్న పెళ్ళిలో ఉన్న తన కూతురు అమృతను మారుతీ రావు కానీ చంపలేదు. ఇతరుల పిల్లల పై, వారిపై ఇష్టం కలిగిన తమ పిల్లల ఇష్టానికి, వారిని బలి ఇచ్చారు. ఇదొక పెద్ద వైరుధ్యం. నైన్త్ క్లాసు కే ప్రేమలా అని ఓ! ఫేసు బుక్ లలో ఆశ్చర్యపడి పోతున్న తెలుగు మధ్యతరగతి సమాజమా నీకో ప్రశ్న టెన్త్ క్లాస్ అని సినిమా తీస్తే, ఆ సినిమా హిట్ చేసే మీకు - అదేమీ పేరు మార్చమని చెప్పే శక్తి లేని సెన్సారు బోర్డ్ కాలంలోనే, పిల్లలకు ఏం చూపిస్తున్నామో, వారేం చూస్తున్నారో మన చేయి దాటి పోయాక, ఎవరి ప్రాణం అన్న సరే తీయడం, చాలా ఆటవిక నేరపూరిత దారుణ చర్య. చిత్రం అన్న సినిమా లో, ఇలాగే ఇంటర్ స్థాయి ప్రేమ చూపితే, కూడా సినిమాలకు నూరు రోజుల పండుగలూ, నటీ నటులు, పెద్ద ఆకర్షణగా మారే సమాజంలో, మన పిల్లలు, ఎవర్నీ చూడ కూడదు, ప్రేమ పేరు ఎత్త కూడదు అని పోటు కబుర్లు చెప్పే వారికి, ముందుగా ఖలీల్ జీబ్రాన్ రాసిన పై కవిత , రామకోటి లా, ముందు ప్రేమకోటి రాయించాలి.

సలీం కాలంలోనూ, అమృత కాలంలోనూ వీరు ఇద్దరూ బతికి ఉం టే, అన్యాయమై పోయింది, అనార్కలి, ప్రణయ్ లు. వారిద్దరూ పై లోకా ల్లో కలుసుకుంటే, ఈ తల్లి దండ్రులు, తమ

పిల్లలను కాక, ఎదుటి వారి పిల్లలపై ఇంత కసాయి తనం చూపిన సంగతి చరిత్రలో ముందు చర్చకి రావాలని కోరుకుంటారు.

మారుతీ రావు, తండ్రి ప్రేమ పేరిట, దారుణ మారణ కాండ, సామాజిక మాధ్యమల్లో వైరల్ అవుతూ మన అజ్ఞానాన్ని మరింత పెంచుతున్నది. "అంటరానితనాన్ని ఆమోదించినప్పుడు, హిందూ మతం పాపం చేసింది" అని 1921లో మహాత్మా గాంధీ రాశారు.

అక్బర్లూ, మారుతీ రావులూ, సాంఘిక అపరాధులు. తమ కుటుంబ పరువు అనుకుంటూ, ఇతరులను పరువు లేనివారిగా చూసే వ్యాధిగ్ర స్తులు. బాబర్ కి ముందర మూడు తరాల్లో, ఎవరు ఎంత గొప్ప మొఘల్ వంశీకులో, అక్బర్ చెప్పలేదు . అలాగే మారుతీ రావు తాతలు, ముత్తాతలకి ముందర వారి చరిత్ర ఎటువంటిదో, ఈ మారుతీ రావే కూడా చెప్పలేడు . అలాగే మరో మూడు తరాల తరువాత మారుతీ రావే తమ పరువైన వంశం లో ఎటువంటి వారు పుట్టవచ్చో కూడా ఇవాళ ఎవరూ చెప్పలేరు, ఆయన కూడా. మరి ముందు మూడు తరాల ముందర ఎటువం టిదో, రాబోయే మూడు తరాల తరువాత ఎలా ఉంటుందో, తెలీని ఏ పరువుని తాము కాపాడడం కోసం, ప్రేమ అనే దానిలో తమ బిడ్డా, ఇతరుల బిడ్డా ఇద్దరూ కలిసి ఉండగా, ఒక్కరినీ మాత్రమే ఈ పని నేరం అంటూ, తానే మరణ శిక్ష విధించగలడు ? ఒంటెత్తు పోకడ అహంకార దౌర్జన్యకర మనస్తత్వం కాక పోతే,

ఇదే విషయాలను ఇరవై నాలుగు గంటలూ ప్రసారాలు చేసిన చానెల్‌లు చేసిన ఉపకారం ఎంత? బ్రేకింగ్ న్యూస్ అంటూ మానవ విషాదాన్ని, వారి ప్రైవేటు దుఖానికి, వదిలి పెట్టకుండా, ఇరవై నాలుగు గంటలూ ఒక వార్త మీద పడి పీక్కుతినే రాబందుల్లా ప్రవర్తిస్తే, అదేమన్నా గొప్ప సమాచార సంస్కారమా? దీని వెను వెంటనే మరొక అమ్మాయి చేయి నరికి వేయడం, విజయవాడలో హెచ్చరిక ఫ్లెక్సీలుగా ప్రేమ జంట పై చావు దాడి బెదిరింపులు వెలియడం , శెభాష్ ఒక ఉన్మత్త కుల పిచ్చి సమాజానికి ఇప్పుడు ఉన్నట్టుండి పిల్లలు దొరికారు. వారి బాధ్యతగా కలిసి బతుకుతూ, పిల్లల్ని కని,సమాజాన్ని ముందుకు తీసుకెళ్లే సంసార బాధ్యతలో ఉండగా, ఇటువంటి ఘోరం చేసిన మూర్ఖ తల్లి తండ్రుల ఆస్తుల జప్తు, వారిచే జీబ్రాన్ కవిత ప్రేమకోటి లా రాయించడం, ఎవరి బిడ్డనైతే చంపారో, వారి పోషణలో తాము జీవించేలా, చట్టాలను మించిన రచ్చబండ తీర్పులు వస్తే తప్ప, తీవ్ర కుల రోగ గ్రస్త సమాజం మారదు . అందాకా అక్బర్ లూ , మారుతీ రావులూ, ఇంకా ఎందరో, పిల్లల పై కత్తులు దూసే కిరాతక తండ్రులూ, వారిని భరించే తల్లులూ మీకిది సభ్యస మాజ హెచ్చరిక. మీ ఇళ్లకు పాలూ, నీళ్లూ బందు అవుతాయి. సాంఘిక వసతులు తగ్గి పోతాయి. అటువంటి సమాజ బహిష్కరమే వీరికి వెన్నులో భయం పుట్టించే స్పందన. తెలుగు సమాజమా, దీనికి సిద్ధంగా ఉన్నావా? గురజాడ మాటల మాత్రలే ఈ కుల రక్కసికి విరుగుడు చాప కూడు తిన్నంత మాత్రాన కులం పోదు అంటూ, మేధావి భార్య "కలసి మెసగిన యంత మాత్రనే కలుగబోదీ ఐకమత్యము, మాల మాదిగ కన్నెనెవతినో మరులుకొన రాదో" అని (చాప కూడు మాత్రమే కాక కులాలకు అతీతంగా పెళ్లిళ్లు జరిగి కలిసి మెలిసి జీవించినప్పుడే కులాలు పోతాయ్ అని అందేళ్ళ కిందట రాశారు). తన ముత్యాల సరాలు గీతంలో. అలాగే వారి మాటలే అక్బర్లూ, మారుతీ రావుల దుష్టాంగానికి " ప్రేమ ఇచ్చిన ప్రేమ వచ్చును ప్రేమ కలుగక బతుకు చీకటి". ప్రేమో రక్షతి రక్షిత.

• లేఖ

సాహిత్య అకాడమీ తెలుగు కమిటీ రెండుగా విడిపోవాలి...

తెలుగు రాష్ట్రం రెండు ముక్కలయ్యాక సాహిత్య అకాడమీ తెలుగు కమిటీ మాత్రం ఒకటిగా ఎందుకు ఉండాలి? రెండు రాష్ట్రాలకు రెండు కమిటీలు ఎందుకు ఉండకూడదు? దీనికి జవాబు ఏం చెప్తారంటే ఏడు రాష్ట్రాలకు పైగా హిందీ మాట్లాడే ప్రజలకు ఒకే కమిటీ ఉన్నప్పుడు తెలుగుకు మాత్రం ఒకే కమిటీ ఉంటే తప్పేంటి అని. అయితే ఆ ఏడు రాష్ట్రాల పరిస్థితి వేరు. ఈ రెండు రాష్ట్రాల పరిస్థితి వేరు. ఆ ఏడు రాష్ట్రాలలో ప్రేమ్‌చంద్ ఉత్తరప్రదేశ్ వాడనీ కిషన్‌చందర్ రాజస్తాన్‌వాడనీ ఇతర రాష్ట్రాల వారు వారిని తమ పాఠ్యపుస్తకాలలో నుంచి తొలగించలేదు. పరస్పరం అనుమానంతో చూసుకోలేదు. తీవ్రంగా అవమానించుకోలేదు. కాని ఇక్కడ తెలుగు రాష్ట్రం ఎటువంటి ఉద్వేగాల మధ్య ముక్కలయ్యిందో అందరికీ తెలుసు. అయ్యాక కూడా నన్నయ్యను తొలగించాలని ఒక వర్గం వారు, నారాయణరెడ్డి అక్కర్లేదని మరో వర్గం వారు... ఇలాంటి తీవ్ర పరిస్థితులు పొడుకొని ఉన్నాయి. విగ్రహాలను కూల్చడం, ప్యాక్ చేసి పంపుతాం అనడం చూస్తూనే ఉన్నాం. ఈ పరిస్థితుల్లో ప్రతి ఏటా ఈ తెలుగు కమిటీ ప్రకటిస్తున్న మూడు అవార్డులు (ప్రధాన సాహిత్య అవార్డు, అనువాదకులకు అవార్డు, యువ రచయితలకు అవార్డు) పెద్ద పెద్ద అసంతృప్తులకు దారి తీస్తూనే ఉన్నాయి.

ఇప్పుడు ఉన్న కమిటీలో తెలంగాణవారు ప్రాధాన్యంలో ఉన్నారు. పది మంది కమిటీ సభ్యులలో కనీసం ఎనిమిది మంది జంట నగరాలవారు ఉన్నారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌వారికి వారి అభ్యంతరాలు ఉండటం తప్పు కాదు. రాష్ట్రం విడిపోక ముందు ఎవరు కార్యవర్గముఖ్యుడిగా ఉన్నా ఎవరికీ అభ్యంతరం ఉండదు. కాని విడిపోయాక ఈ ప్రాంతం వారు ఆ ప్రాంతం వారిని జడ్జ్ చేసినా ఆ ప్రాంతం వారు ఈ ప్రాంతం వారిని జడ్జ్ చేసినా సబబైన పని అనిపించదు. రాష్ట్రం ముక్కలయ్యాక ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి అకాడమీ కార్యవర్గ ముఖ్యుడిగా ఉండి ఉంటే తెలంగాణ సాహిత్యకారుల భావోద్వేగాలూ స్పందనా ఎలా ఉండేవో తెలియనివి కావు. కనుక సీమాంధ్రుల ఈ స్పందనను వ్యతిరేకదృష్టితో చూడాల్సిన పని లేదు.

మంచో చెడో సీమాంధ్రులకు ఒక రాష్ట్రం ఏర్పడింది. ఇక తమ సాహిత్యాన్ని తాము చూసుకోవడం తమకు ఏది మంచో అది ఎంచుకోవడం తమవారిలో ఎవరికి ఏ అవార్డు ఇవ్వాలో నిర్ణయించుకోవడం వారి తలనొప్పి. బాగా రాశారో పేలవంగా రాశారో, రెండు జిల్లాల భాషలో రాశారో, దోపిడీ భాషను సృష్టించారో... ఇదంతా వారి సొంత విషయం. ఇప్పటికే సీమాంధ్రులు అనేక విధాలుగా నష్టపోయారు. అవమానాలు భరించారు. భరిస్తున్నారు. ఇక చాలు. మా రాష్ట్రం మాకివ్వండి... మమ్మల్ని వదిలేయండి అని తెలంగాణవారు ఎంత గట్టిగా కోరుకున్నారో ఆంధ్రప్రదేశ్‌కు సీమాంధ్రులే సభ్యులుగా ఉన్న సాహిత్య అకాడమీ కమిటీ వేయండి అని ఇటువైపు వారు అంతే బలంగా కోరుకుంటున్నారు. మారిన రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ఈ వెసులుబాటు ఇరు రాష్ట్రాల సాహిత్యరంగాలకూ శ్రేయస్కరం.

• రామతీర్థ - 98492 00385

17న హుద్‌హుద్ నగర కవిత్వం ఆవిష్కరణ

విశాఖ-కల్చరల్ : వర్తమాన విశాఖ నగరానికి అదో బీభత్స, భయానక అనుభవం. మరపురాని దుస్స్వప్నం. తలపులోకి వచ్చిన ప్రతిసారీ ఒళ్లు జలదరింపజేసే, గుండెలు ఝల్లు మనిపింపజేసే విషాద, ఉద్విగ్న విపరిణామం. పది నెలల క్రితం విశాఖను ఊపేసిన, ఇంత మహానగరాన్ని చిగురుటాకులా వణికించిన పెనుతుపాను హుద్‌హుద్ గురించి మనసులో ఆలోచన మెదిలిన ప్రతిసారీ ఇలాటి భావాలు ఎన్నెన్నో మెదులుతాయి. అప్పటి చీకటి రోజులు, ఎదురైన చేదు అనుభవాలు నిద్రలో సైతం వెంటాడుతాయి. అప్పటి చీకటి దినాలు, అడుగడుగునా ఎదురైన అనర్థాలు, పీడ కల వంటి పదిహేను రోజుల అనుభవాలు, ఎండమావుల వంటి ప్రభుత్వ సహాయ సహకారాలు... ఇవన్నీ నగర ప్రజల జ్ఞాపకాల పుటల్లో చిరకాలం నిలిచిపోతాయి. సహజంగానే ఈ సంఘటనలన్నీ ఎక్కడెక్కడి కవులనూ కదిలించాయి. నగరానికి చెందిన ప్రముఖ కవి, అనువాదకుడు, వక్త మొజాయిక్ సాహిత్య సంస్థ కార్యదర్శి రామతీర్థ కవితల్లో హుద్‌హుద్ పదఘట్టనలు ప్రతిధ్వనించాయి. హుద్‌హుద్ విలయానికి పది నెలలైన సందర్భాన్ని పురస్కరించుకుని వివిధ కవితలు ఓ పుస్తకం రూపంలో రాబోతున్నాయి. శుక్రవారం పౌర గ్రంథాలయంలో సాయంత్రం ఆరు గంటలకు 'హుద్‌హుద్ నగర కవిత్వం' పేరిట ఈ కవితా సంపుటిని ఓ సామాన్య వనిత పాలమ్మ పైడమ్మ ఆవిష్కరించనున్నారు. హరిత సంరక్షణకు, కాలుష్య నివారణకు ప్రజలను ప్రేరేపితం చేయాలన్న ధ్యేయంతో దీనిని వెలువరిస్తున్నట్టు రామతీర్థ చెప్పారు.

● స్పందన/ జూలై 5 నాటి రాణి శివశంకర శర్మ వ్యాసం 'సాహిత్యంలో సెక్స్‌, క్రైమూ'పై...

చేటు స్వగతం

రామతీర్థ

ఫోన్: 9849200385

ఒక తరహా ఆలోచనలకు భిన్నమైన ఆలోచనలు సదా సమాజానికి అవసరమే. కానీ వాటికి ఒక క్రమపద్ధతి లేకపోతే, అవి రాణి శివశంకర శర్మ చేసిన ఊక దంపుడులాగే మిగిలిపోతాయి.

ముద్దు పళనినీ, అన్నమయ్యనీ వారి కాలానికి దూరంగా తీసుకొచ్చి వారి ప్రయోజనం, ప్రభావం గురించి మాట్లాడటం ఒక వైపరీత్యం. వారేదో తమ కాలానికి మించిన ప్రగతి శీలురని చెప్పబూనుకోవడం ఒక దుందుడుకు పని. ముద్దు పళని పాతికేళ్లలోపే చనిపోయిన కవయిత్రి. తంజావూరు రాజ్యం మరాఠా రాజుల పాలనలో ఉన్న కాలంలో కూడా అక్కడ తెలుగు విలసిల్లింది అనడానికి ఈమె రచన ఒక సాక్ష్యం. ఆ రాజుకు పన్నెండు మంది భార్యలు. కొందరు ఆయన చనిపోయినప్పుడు సహగమనం కూడా చేశారు. ఇది తల్లీ కూతురూ ఒకే రసికుడితో (కథ ప్రకారం కృష్ణుడు, వాస్తవం ప్రకారం, ఆ రాజ్యపు ఏ సంపన్నుడైనా కావచ్చు లేదా ఆ రాజు కూడా కావచ్చు) జరిపే శృంగార కాలక్షేపపు కథ. ధనానికి పడక సుఖాన్నిచ్చే స్త్రీల వృత్తి 'రూపా జీవ'లుగా కౌటిల్యుడి కాలం నుంచీ ఈ దేశంలో ఉన్నదే. అందువల్ల అది వారికి తప్పుకాకపోవచ్చు. ఆమె రాసినది ఈ కాలపు స్త్రీ స్వేచ్ఛ (సామాజిక, రాజకీయ, ఆర్థిక, దైహిక, వైయక్తిక రంగాలలో) అనే అంశానికి బహు దూరమైనది. రాజులు మత్తులై ఏర్పరుచుకునే శృంగార ప్రాధాన్యత (తల్లినీ, కూతుర్నీ ఇద్దర్నీ కోరుకోవడం) వంటి కథను కృష్ణుడికి, నీల, రాధ అనే స్త్రీలకు అంటగట్టి చెప్పిన ఒక పదిహేడో శతాబ్ది సమాజపు శృంగార ప్రవర్తనకు ఒక కాల్పనిక రూపం.

ప్రతి వాక్యం వివాదాస్పదంగా రాయగలిగిన గందరగోళం శివశంకర శర్మ గజిబిజి ఆలోచనలలో ఉన్నది. ఆయనకు తెల్లవాళ్లంటే కోపం. కమ్యూనిస్టులంటే కోపం. వాళ్లు నెత్తిన పెట్టుకున్నారని వీరేశలింగం, గురజాడ అన్నా కూడా కోపమే. ఫెమినిసులనా్గ కూడా. ఈ ఆగ్రహానికి అరం లేదు. ఎందుకంటే శరు

ఆలోచనలు, ప్రసంగాలు, రాతలు కాల ప్రవాహానికి విరుద్ధం. రాస్తున్నది జయప్రభ అనువాద కవిత గురించో వారి విస్తృత, విఖ్యాత కృషి అయిన అన్నమయ్య రచనల గురించో అయితే, ఈ స్వగతం కొన్ని హద్దుల్లో ఉండాలి. అలా లేకపోవడమే, మనకి విడ్డూరమూ, ఈయనకి ఒక సహజ చింతనా. అందువల్లే, ఆయనకు గల అసంబద్ధ సంవేదన అంతా, ఒక వ్యాసంలో చెప్పేయాలన్న ఒక అసాధ్య ప్రయత్నం చేస్తే అది ఇలాగే ఉంటుంది.

చలాన్ని ఎవరూ వైష్ణవుడా, శైవుడా, బౌద్ధుడా, జైనుడా లేక బైబిలు అనువాదం చేశాడు కాబట్టి క్రైస్తవుడా అనే వ్యర్థ పరిశీలనకు ఇంతవరకూ దిగలేదు. ఆ ఘనత కూడా మూటగట్టుకుని, ఒక్క 'గీతాంజలి' ముందుమాటలో

> **రాణి శివశంకర శర్మకు తెల్లవాళ్లంటే కోపం. కమ్యూనిస్టులంటే కోపం. వాళ్లు నెత్తిన పెట్టుకున్నారని వీరేశలింగం, గురజాడ అన్నా కూడా కోపమే. ఫెమినిస్టులన్నా కూడా. ఈ ఆగ్రహానికి అర్థం లేదు.**

గల ఏవో వాక్యాలను పట్టుకుని 'చలం సనాతన వైష్ణ ద్వైత వేదాంతి' అనగలిగే సాహసం లేదా దుస్సాహసం ఈ శర్మగారికి ఉన్నది. అది ఒక అనువాద పుస్తకానికి రాస్తున్న ముందుమాటగా, మూల రచయిత టాగోర్ స్వభావాన్ని విశదపరిచే ప్రయత్నంలో చలం మాటలే తప్ప, అంతకుమించిన ప్రాధాన్యత లేదని పరిణతులైన పాఠకులు ఇట్టే గ్రహిస్తారు. ఈశ్వరుడు, ఈశ్వరుడు అని ఒక నిరాకార నిరీశ్వర భావన గురించి తనకు గల ప్రయాసను చలం ఎప్పుడూ, ఎక్కడా దాచుకోలేదు. ఆ దైవ భావన శివుడా, విష్ణువా అన్న విగ్రహ పరిమిత మూఢ భక్తిలోనూ చలం ఎక్కడా కనిపించడు.

వీరేశలింగాన్ని, గురజాడని, కె.వి.ఆర్.ను, చలాన్ని ఒక అక్కసుతో చూస్తూ, ఒక తరుణంలో 'అన్నమయ్య వాడినదే గురజాడను తలదన్నిన వాడుక భాష' అని ఒక స్వగత సూత్రీకరణ కూడా పనిలో పనిగా శర్మ చేశారు. అన్నమయ్య కాలం అన్నమయ్యది. ఆయన వాడుక భాషలో కొన్ని భక్తి ప్రేరేపిత కుల రహిత సమాజం గురించి రాసిన రచనలు (పదాలు) ఉన్నా, అన్నమయ్య ప్రధాన రచనా క్షేత్రం వెంకటేశ్వరుడి శృంగార జీవితం (కాదు అందులో జీవాత్మ, పరమాత్మ సంవేదనలు ఉన్నాయి అనే వారికో నమస్కారం). ఎడతెగని శృంగార భావనలు మధ్య యుగాల కాలంలో చెప్పాలి అంటే అవి సామాన్యుడైన మనిషి పరంగా చెప్పే స్వేచ్ఛ గానీ, ఉదారవాద రాజరికాలు కానీ లేని కాలంలో, అన్నమయ్య, క్షేత్రయ్య వంటి పదకవుల రచనలకు శృంగార భావన ఒక ప్రధాన ఆలంబన. ఇందుకు వాడుక భాష అన్నమయ్య వాడటం మంచిదే. కానీ అన్నమయ్య వాడిన వాడుక భాష ప్రయోజనం వేరు. గురజాడ వాడుక భాష ప్రయోజనం వేరు. ఇద్దరి మధ్యా దాదాపు నాలుగు వందల ఏళ్ల కాలం ఎడం ఉన్నది. గురజాడ ఎరిగిన భారతదేశం వేరు, అన్నమయ్య తిరుమల పర్వతాల సీమలో ఒక సంచార భక్తుడిగా, వచ్చిపోయే విస్తార జన బాహుళ్యపు మాటలను మనసున పట్టి, తన పదాలలో వాడిన తీరు వేరు. ఉత్కృష్టత, సామాజిక పాత్ర అన్నవి ఈ రెండు వాడుక భాషలకూ వేర్వేరు అన్న ప్రాథమిక సూత్రం కూడా ఎరగని దశలో, శర్మగారి స్వగతాలు ఉన్నాయి. 'గురజాడ వర్తమానానికి బానిస' అనడంలో వారి అక్కసు తీర్చుకున్నా. అది పూర్తిగా వేరే విస్తార స్పందన అవుతుంది కనుక ఆ అంశం జోలికి ఇప్పుడు పోవడం లేదు.

జయప్రభగారి సామాజిక దార్శనికత, రాబోయే మహాకాలంలో రూపు మారే శృంగార రూపాల గురించి, పరిణామక్రమంలో ఇప్పటి అపెండిక్స్ వలె, లైంగిక అవయవాలు వ్యర్థ అవశేషాలుగా మారడం గురించి, ఇలా అన్ని ఆలోచనలు చేసే హక్కు, స్వాతంత్ర్యమూ, అధికారమూ, అవసరమూ ఎప్పుడూ సాహిత్య, శాస్త్రీయ లోకానికి ఉన్నది (ఆల్విన్ టాఫ్లర్ అనే ఒక సామాజిక దార్శనికుడు కూడా సామాజిక రచనలుగా ఫస్ట్ వేవ్, సెకండ్ వేవ్, థర్డ్ వేవ్ అంటూ కొన్ని దశాబ్దాల ముందర ప్రఖ్యాతమైన పుస్తకాలు రాశాడు).

అయితే ఈ విషయం చెప్పడానికి, పైన పేర్కొన్న రచయితలను తూర్పార పట్టాల్సిన అవసరం లేదు. వారెవరూ అంత తేలికగా శర్మగారి స్వగతపు ధాటికే అస్తమించే నీరస భాస్కరులు కారు. పైపెచ్చు, సెక్స్‌లో 'ఎంత క్రైమ్, ఎంత హింస, ఎంత ఆనందం!' శర్మగారి ఆఖరి వాక్యం తిరగబడ్డ విలోమ ధోరణిలోకి సమాజం జారిపోతున్న కాలంలో, అన్ని రకాల సెక్స్‌లూ, అన్ని వయసుల పిల్లలకూ, సెల్‌ఫోన్ బొమ్మలుగా దిగిపోయిన కాలాన్ని, దాని వక్రగతులను, నేరాలను పట్టించుకోకుండా, సెక్స్‌ను అణచి వేస్తున్నారన్నది ఒక తాత్విక ప్రాతిపదికగా మాట్లాడ్డం, నిజంగా ఇప్పుడు సమాజం పట్టించుకోనవసరం లేని ఒక స్వగతమే. ●

తెలుగు ప్రాచీన హోదాకు వీడిన గ్రహణం

అభిప్రాయం



రామతీర్థ

తెలుగు భాష ఘనతకు పట్టిన వ్యాజ్యపు చెర వీడింది. మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి టి.ఎస్. కౌల్, మరొక న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం, తమిళ భాషా ప్రేమికుడు, న్యాయవాది ఆర్.గాంధీ వేసిన పిటిషన్‌ను ఆగస్టు 8న కొట్టివేస్తూ, కన్నడ, తెలుగు, మలయాళం, ఒడియా భాషలు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తేదీల నుంచి, ప్రాచీన భాషలుగా గుర్తింపు పొందాయని స్పష్టం చేసింది. 2008 నుంచీ ఈ కేసు ద్వారా తమిళ సోదరులు, దక్షిణాదిన మరే ఇతర భాషకూ ప్రాచీన లేదా విశిష్ట హోదా వల్ల వచ్చే ఆర్థిక ప్రయోజనాలు, దీర్ఘకాలిక లబ్ధి ఒనగూరకుండా చేశారు. దాదాపు 2014 వరకూ ఈ కేసు పెద్దగా కదలిక లేకుండా ఉన్నది. అప్పుడు చెన్నై తెలుగు వారు వృత్తి రీత్యా ఉపాధ్యాయుడు అయిన తూమాటి సంజీవరావు ఈ కేసులో తన స్వయం ఆసక్తిపై ఇంప్లీడ్ అయి, కేసులో కొత్త కదలిక తెచ్చారు. అప్పట్నుంచీ కేసు చురుగ్గా కదిలి ఈ రెండేళ్లలో తీర్పు దాకా వచ్చింది. ఇందుకు సంజీవ రావు గారికి అభినందనలు తెలపాలి (98844 46208).

ఈ ప్రాచీన హోదా వెలువడ్డప్పుడు, కోర్టులో వ్యాజ్యం ఫైల్ అయినప్పుడు కూడా ఒకే రాష్ట్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు రెండు రాష్ట్రాలుగా ఉంది. ప్రాచీన భాష హోదా పేరిట రూ.100 కోట్లను భారత ప్రభుత్వం ఆయా భాషల అభివృద్ధి పనులకు, నడిచే కేంద్రాల నిర్వహణ ఖర్చులకు ఇస్తున్నది. ప్రాచీన భాష అభివృద్ధి పేరిట జరగవలసిన పనులలో ఇంకా మనం మొదట్లోనే ఉన్నాం. రెండు తెలుగు భాషా రాష్ట్రాలలోనూ అభివృద్ధి, పరిశోధనా కేంద్రాల ఏర్పాటు, తగు సిబ్బంది, సాంకేతిక సౌకర్యాలు ఇవన్నీ రూపుదిద్దుకుని, మన సన్నాహాలను సమర్థవంతంగా కేంద్ర ప్రభుత్వానికి వివరించ గలిగితే, ఆయా నిధులు సమకూరుతాయి.

మనం మన తెలుగు రాష్ట్రాలకు తెచ్చుకోవలసిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లాసికల్ తెలుగు ప్రస్తుతం మైసూరులో ఉంది. తమిళులు ఎలా తమ భాషా విభాగాన్ని తమిళనాడుకు తీసుకెళ్ళారో అలా ఈ విభాగపు సాంకేతిక బదిలీ, మిగిలి ఉన్న వనరులు రాత ప్రతులైతే వాటి సగం మూల ప్రతులు, సగం నకళ్లు రెండు రాష్ట్రాల మధ్య విభాగాలు జరిగి, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లాసికల్ తెలుగు ఏర్పాటుకు తాము సిద్ధం అన్న సంగతి భారత ప్రభుత్వానికి తెలుపడాన్ని బట్టి నిధుల విడుదల జరిగే అవకాశం ఉంటుంది.

మద్రాస్ హైకోర్ట్, ఆ ప్రాచీన హోదా ప్రకటనను సమానంగా అనువర్తింప చేసినం దున, ఎవరి రాష్ట్రంలో వారు ఈ సంస్థ పనితీరుకు వలసిన భవనాలు, ఇతర సదుపాయాలు, ఏర్పాటు అయ్యేందుకు ఫాస్ట్ ట్రాక్ కమిటీలు నియమించి, అందులో రచయితలు, భాషా రంగ నిపుణులు, విద్యా వేత్తలు, మొదలగువారిని సభ్యులుగా స్వీకరించి, వచ్చే హేవిళంబి ఉగాది కల్లా ఈ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ క్లాసికల్ తెలుగు సంస్థను రెండు తెలుగు రాష్ట్రాలలో పని ప్రారంభించేలా చేయగలరని ఆశిద్దాం. విడిపోవడానికి ముందు నుంచి కూడా ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఉమ్మడి రాష్ట్రంలోనే మొదటగా ఏర్పడిన శాఖ, కాబట్టి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించి, వేగంగా పనులు పూర్తి చేయవచ్చు.

వ్యాసకర్త కవి, విమర్శకులు
మొబైల్ : 98492 00385

సాక్షి SAKSHI TELUGU DAILY
Fri, 12 August 2016
epaper.sakshi.com/c/12427585

ప్రజల చేతి పరమాణు శక్తులు కార్టూన్లు

సందర్భం

రామతీర్థ

''నవ్వులు చేసే దాడి ముందర ఏ శక్తీ నిలవ జాలదు'' అని లోకం ఎరిగిన రచయిత, హాస్యాధిపతి మార్క్ ట్వైన్ అన్నారు. థామస్ నాస్ట్ కార్టూన్లు చూసి, ''పత్రికల్లో ఏరాతలన్నా రాసుకోండి, కానీ బొమ్మలు మాత్రం వేయకండి. మా నియోజకవర్గంలో పెద్దగా ఎవరికీ చదవడం రాదు, కానీ వ్యంగ్య చిత్రాలు చూస్తే, మాకు ప్రతిష్ఠ నష్టం అవుతుంది'' అని బాస్ ట్వీడ్ అనే ఆయన అలనాడు అమెరికన్ పత్రికలకు విన్నవించాడు. ఇంకా అమెరికాలో డెమోక్రాట్లు, కార్టూన్ నచ్చకపోతే, ఆ కార్టూనిస్ట్‌తో మాట్లాడుతారట. అదే రిపబ్లికన్లు అయితే, ఆ పత్రిక పబ్లిషర్‌తో ఆరోపణలు చేస్తారట. ఇప్పుడు నడుస్తున్నది సోషల్ నెట్‌వర్క్ పరిణామాలు కనుక, అంతకన్నా ప్రజామోదం లభించని భిన్నమైన చర్యలు తీసుకుం టున్నాము.

టాం టాం అనే కవితలో, ''ప్రైవేటు జీవితాలు వారి వారి సొంతం, పబ్లిక్‌లోకొస్తే ఏమైనా అంటాం'' అని మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో ఒక లక్ష్మణ రేఖ గీశారు. తన సిరి సిరి మువ్వలు, ప్రాస క్రీడలు, లిమరుక్కులు కూడా పద్య రూపంలో ఉన్నా సామాజిక కార్టూన్ కవిత్వమే. కార్టూన్ కవితలను ఆదరించి ఏళ్ల తరబడి రోజూ అచ్చు వేసిన తెలుగు పత్రికలున్నాయి. దేవిప్రియ, గజ్జెల మల్లారెడ్డి తదితరులు ఈ రంగంలో ఎనలేని కృషి చేశారు. అభివ్యక్తి స్వేచ్ఛ ఎప్పుడూ పాలక వర్గాలను ప్రశ్నించే లక్షణం కలిగి ఉంటుంది. దీన్ని అలా వదిలేసిన ప్రభుత్వాలు ఎంతో గౌరవాన్ని పొందాయి. హెన్రీ కిసింజర్ అధికారం, నిక్సన్ అధ్యక్ష హోదా వెలుగుతూ ఉండగా, 1984లో ఒక అమెరికన్ పత్రిక ది న్యూయార్క్ రివ్యూ ఆఫ్ బుక్స్, తమ కార్టూనిస్ట్ డేవిడ్ లెవీన్‌ను ఒక కార్టూన్ కోరింది. ఆయన గీసిచ్చిన బొమ్మ–పడక మీద ఒక స్త్రీ పై పడుకుని శృంగారంలో ఉంటాడు కిసింజర్. ఆ పడతి తల, భూగోళం. కింద కేప్షన్, 'ప్రపంచాన్ని విషయిస్తూ..' తమకు మరీ మోతాదు మించి పోయిందని ఆ పత్రిక ఈ కార్టూన్ ప్రచురించలేమని తెలపగా, ఈ కార్టూన్‌ని తమ పత్రిక ''ది నేషన్''లో ప్రచురించారు సంపాదకులు విక్టర్ ఎ నవస్కీ. దాని సెక్సిస్ట్ ధోరణులకు, కొన్ని సామాజిక వర్గాలనుంచి ఆ కార్టూన్ విమర్శలు ఎదుర్కొన్నా, దాని లక్ష్యం కిసింజర్ అండ్ కంపెనీ వారి భౌగోళిక దృష్టి గనుక, దాన్ని యథాతథంగా ప్రచురించడం వలన కలిగే ప్రయోజనం దృష్టిలో ఉంచుకునే, ప్రచురించాము అని ఆయన చెప్పారు.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో కూడా, హిట్లర్, స్టాలిన్‌లపై ప్రపంచ పత్రికలు వేసిన కార్టూన్లు, ఎంతో జటిలం అయిన విషయాలను ప్రజలకు తెలియజేయడంలో ప్రధాన పాత్ర పోషించాయి. ''రెండేవూ'' పత్రికలో వెలువడ్డ ఈ 'డేవిడ్ లో' కార్టూన్ ప్రపంచ ప్రఖ్యాతం. ''ప్రపంచపు అధములు మీరే అనుకుంటాను'' అంటుంటాడు హిట్లర్. ''కార్మిక లోకంపై కసాయి మీరే అనుకుంటాను'' అని ఒకరినొకరు పలకరించుకుంటూ ఉంటారు, రెండు దేశాల వారికి ఒకరంటే ఒకరికి పడక పోయినా, రెండో ప్రపంచ యుద్ధ కాలంలో, జర్మనీ, రష్యా ముందు నిర్యుద్ధ సంధి చేసుకున్నాయి. ఈ నిర్యుద్ధ సంధి విరామ కాలాన్ని ఎలాగైనా, తమపై జర్మనీ దాడికి వస్తుందని తెలిసిన రష్యా, తమ యుద్ధ సన్నద్ధత కోసం వాడుకుని, జర్మనీకి దీటుగా జవాబు చెప్పేలా సిద్ధ పడ్డది. ఆ కాలపు కార్టూన్ ఇది.

రెండో ప్రపంచ యుద్ధ కాలంలో డాక్టర్ సెస్స్ వేసిన కార్టూన్ల ధారావాహిక అమెరికాలో ఒక సంచలనాల వేదిక అయింది. రెండో ప్రపంచ యుద్ధ కాలపు వామపక్ష భావజాలపు పత్రిక పి.ఎం.లో ముసోలినీ, హిట్లర్‌లపై వ్యక్తి అరాచకవాదులుగా, యుద్ధ నేపథ్య ఇతివృత్తాలతో, అమెరికన్ జాతీయ దృక్కోణం నుంచి సుమారు 400 కార్టూన్లు వేశారు సెస్స్. ''డాక్టర్ సెస్స్ గోస్ టు వార్'' పేరిట ఈ కార్టూన్లు తర్వాత ప్రచురితం అయ్యాయి.

'మీరు అన్నారిలా' 'యు సెడ్ ఇట్' పేరిట ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధింపు, తొలగింపు, అటుపై కొన్నాళ్లు జనతా ప్రభుత్వం, తదుపరి ఎన్నికల్లో ఆమె గెలుపు విషయంగా ఎమర్జెన్సీ ఫ్రేమ్ కట్టిన అద్దంలో కనిపించే తన ప్రతిబింబంతో అంటుంది ఇందిరాగాంధీ, 'చెప్పానుగా నువ్వు నన్ను ఆపలేవని'. ఈ రాజకీయ నేపథ్యంలో ఆర్‌కే లక్ష్మణ్ వేసిన కార్టూన్లు ఆనాటి సోషల్ మీడియా పత్రికల్లో, బాగా ప్రాచుర్యం పొందాయి. ప్రముఖ రచయిత, సల్మాన్ రష్దీ, అన్నారొకసారి 'ఏమాత్రం మనో భావాలను దెబ్బతీయని కార్టూన్ అంటే ఏమిటి? గౌరవాలు పాటించే కార్టూన్ అసలు ఎలా ఉంటుంది? ఈ వ్యంగ్య చిత్రం అంటేనే, కొంత వెటకారం, కొంత హేళన, ప్రజలు నవ్వుకునేలా వేసే ఒక బాణం. కార్టూన్లు, వ్యంగ్యం ఉండే ప్రపంచం మనకు ఉండాలి అని భావిస్తే, వీటి విఘాత శక్తిని మనం అంగీకరించాలి'.

వేల మాటలు చేయలేని పని ఒక బొమ్మ చేస్తుంది కనుక ఆధునిక ప్రపంచంలో ప్రజల చేతి పరమాణు శక్తులు కార్టూన్లు. హిట్లర్, స్టాలిన్, చర్చిల్, నెహ్రూ, గాంధీజీ వంటి వారికే రేఖాభిషేకాలు తప్పలేదు. తమ లోపాలను సునిశిత హాస్యంతో చూపే కార్టూన్లను చూసి వీరు నొచ్చుకున్నా, అవి ఆగలేదు. అక్షర రూపం దాల్చిన సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అన్నారు కాళోజీ. రేఖాస్త్రమై నిలిచే కార్టూన్ ప్రజల చేతి రామ బాణం. పాలక వర్గాలు వీటిని చూసి విశాల హృదయంతో పక్కన పెట్టాలి తప్ప, పెద్ద ఎత్తున స్పందిస్తే, వాటికి అనవసర ప్రాధాన్యత ఇచ్చిన వారవుతారు.

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత ః 98492 00385

సాక్షి Sun, 21 May 2017
epaper.sakshi.com//c/19205997

తండ్రి బాపూజీతో రామతీర్థ

నా ఎదుగుదలను చూసి మురిసిపోయేవారు

పుత్రోత్సాహం తండ్రికి, పిత్రోత్సాహం కొడుకుకు ఉండడం సహజం. యాబలూరు రాధాకృష్ణారావు మా నాన్న. ఆయనకు మొత్తం ఆరుగురు పిల్లలం. వారిలో నేనే పెద్దవాణ్ణి. మేమంతా నాన్నను బాపూజీ అని పిలవడం అలవాటైంది. నాన్నగారిది నెల్లూరు జిల్లా అలగానిపాడు. మా తాతయ్య సుందర రామయ్య. ఆయన పేరే నాది సుందర రాంబాబు(రామతీర్థ). నాన్నగారు రైల్వేలో ఫార్మసిస్ట్‌గా పనిచేసేవారు. ఖుర్దారోడ్ డివిజన్ ఆసుపత్రిలో నాన్నగారు. ఇక్కడ వాల్తేర్ డివిజన్ ఆసుపత్రిలో మా మేనమామ వడ్డాది శ్రీనివాసరావు పనిచేసేవారు. (రైల్వే సేవానగర్‌లో నివాసం. నేను చిన్నప్పుడు చదువుకున్నది కూడా ప్రస్తుతం అల్లిపురందారిలో ఉన్న స్టేషన్ దరి, రైల్వే హైస్కూల్‌లోనే. నాన్న నన్ను డాక్టర్‌గా చూడాలని ఆకాంక్షించేవారు. కానీ డాక్టర్‌గా కాకున్నా కవిగా, రచయితగా, నా ఎదుగుదల వారు చూశారు. ఎంతో ఆనందంతో ఉప్పొంగిపోయేవారు.

–రామతీర్థ, ప్రముఖ సాహితీ అనువాదికులు,
విశాఖపట్నం.

ఇంగ్లిష్‌కన్నా వందేళ్ల ముందే తెలుగులో తిసారెస్

శ్రీ
ఆంధ్రనామసంగ్రహము
ఆంధ్రనామశేషము
1920
All Rights Reserved.

పైడిపాటి లక్ష్మణకవి 'ఆంధ్రనామ సంగ్రహము', ఆడిదం సూరకవి 'ఆంధ్రనామ శేషము' కలిపిన వావిళ్ల వారి 1920 నాటి ముద్రణ

> ఇంగ్లిష్ thesaurus 1805 ప్రాంతాల నుంచీ తయారీ అని చెప్పినా, ఒక కొలిక్కి వచ్చి అచ్చులోకి వచ్చింది 1852లో! మన తెలుగు భాషా నిర్మాతలు 1750 ప్రాంతాలలోనే తెలుగు మాటల తిసారెస్ తేవడం గమనార్హం. దీన్ని భాషకు సంబంధించి ఆధునికతల తొలి వేకువగా చెప్పవచ్చు.

పద్నాలుగో శతాబ్దానికి ఇంకా చెదురుమదురుగా ఉండి, 1343లో, చాసర్ మహాకవి జననానికి ఇంగ్లండ్‌లో సాహిత్యం ఎదురుచూస్తున్నది. ఇంకా రెండు వందలేళ్ళ తర్వాత కానీ షేక్‌స్పియర్ ఆంగ్ల సాంస్కృతిక సమాజంలో ప్రభవించడు. చాసర్ కాలానికే, భారత అనువాదం పూర్తి కావచ్చి, నన్నెచోడ కవి, పాల్కురికి సోమనల రచనా ధార తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేస్తోంది. తెలుగు మాటల అంటే దేశి మాటల వాడుక పెరిగి, సంస్కృతి అంతా దేశి పదాల్లో విస్తరిస్తున్న సమాజం అది. భాష అభివృద్ధి వల్లనే ఏ భాషలోనైనా పర్యాయపదాలు, నానార్థాలు ఏర్పడతాయి. ఈ పర్యాయ పదాలను ఒక చోట చేర్చడం నామకోశం అని మన దేశంలోనూ, తిసారెస్ అని ఆంగ్లంలోనూ వాడుక.

సంస్కృత 'నామలింగానుశాసనం' పేరిట క్రీస్తు శకం నాలుగో శతాబ్ది నాటికే అమరసింహుని అమరకోశం, సంస్కృత పదాలకు ఇటువంటి ఒక సూచిగా పద్య రూపంలో నిలిచింది. ఇదే పీటర్ మార్క్ రోజెట్ తయారీ అయిన ఇంగ్లిష్ తిసారెస్‌కు మూల ప్రేరణ అని ఆంగ్ల పండితుడు డాక్టర్ జాక్ లించ్ (1917–1999) అభిప్రాయపడ్డారు. రోజెట్ నామకోశం 1805 ప్రాంతాల నుంచీ తయారీ అని చెప్పినా, ఒక కొలిక్కి వచ్చి అచ్చులోకి వచ్చింది 1852లో!

పదమూడు శతాబ్దాలు ముందరే ఇటువంటి నామకోశం సంస్కృత పదాలకు ఏర్పడటంలో ఆశ్చర్యం లేదు. అప్పటికే అది సౌష్ఠవమైన భాష. కానీ మన భాషా నిర్మాతలు ఆంగ్ల తిసారెస్ (thesaurus) కన్నా దాదాపు శతాబ్దం ముందరే తెలుగు మాటల తిసారెస్ తేవడం గమనార్హం. దీన్ని భాషకు సంబంధించి ఆధునికతల తొలి వేకువగా చెప్పవచ్చు. ఈ గణనీయమైన కృషి 1750 ప్రాంతాలలో జరిగింది. దీని పేరు ఆంధ్రనామ సంగ్రహము. కవి, సంకలన కర్త, ఆ నానార్థ పదాలతో పద్యాల నిర్మాత... పైడిపాటి లక్ష్మణకవి. వీరు ఏ ప్రాంతంవారో చెప్పడానికీ, కచ్చితం అయిన కాల నిర్ణయం చేయడానికీ ఆధారాలు లేవు. కానీ వీరి తరువాత, ఈ నామ సంగ్రహానికి ఇంకొన్ని జోడింపులు జరిగితే కానీ సంపూర్ణం కాదని, ఆ పని చేసింది మాత్రం విజయనగర సంస్థాన ఆస్థానకవి ఆడిదం సూరకవి. ఈయన 1780 వరకూ జీవించారు. వీరు జత కూర్చిన మాటలతో 'ఆంధ్ర నామ శేషము' అని దానికి అనుబంధంగా వెలువరించి ఆంధ్ర నామ సంగ్రహకర్తల్లో ఒకరిగా గుర్తింపు పొందారు. ఈ భాషావేత్తల తెలుగు మాటల సేకరణ జరిగిన చాలా దశాబ్దాలకు, చిన్నయ సూరి(1809–1861) ఇంకా ఆరేళ్లలో కన్ను మూస్తారు అనగా, 1855లో బాలవ్యాకరణం వచ్చింది. వ్యాకరణ పద్ధతుల స్థిరీకరణ జరగడానికి వందేళ్ల ముందరే, తెలుగు మాటల నామ సంగ్రహం జరగడం... తెలుగు భాష విషయంలో సరైన క్రమంలోనే జరిగిందని భావించవచ్చు. భారతీయ సాహిత్య లక్షణం అయిన పద్య రూపాల్లో లక్ష్మణకవి, సూరకవి ఈ నామకోశం రచించారు. దేవ వర్గు మొదల్లో శివుడి ఇరవై పేర్లను ఒక సీసపద్యం, ఒక తేటగీతిగా లక్ష్మణకవి పొందుపరచిన తీరు ఒక సుశిక్షిత నిర్మాణానికి మచ్చు తునక.

సీ. ముక్కంటి యరపది మోముల వేలుపు,
మినుసిగ దయ్యంబు, మిత్తి గొంగ
గట్టు విల్తుడు, గరకంఠుడు మిక్కిలి
కంటి దేవర, బేసి కంటి వేల్పు
వలిమలల్లుడు, వాక తాలుపు కొండ,
వీటి జంగము, గుజ్జు వేల్పు తండ్రి
వలరాజసూడు, జక్కుల రేని చెలికాడు
బూచుల ఏకి మీదు పునుక తాల్పు,
తే. వినపు మేతరి, జన్నంపు వేటకాడు
బుడుత నెలతాల్పు, వెలియాల పోతు రౌతు
తోలు దాలుపు, ముమ్మొనవాలుదాల్పు
నాగ భవదాఖ్యలొప్పు అంధక విపక్ష

ఇలా అచ్చ తెలుగులో రెండు వందల పేజీలుగా దీని నిర్మాణ విభాగాలు దేవ వర్గు, మానవ వర్గు, స్థావర వర్గు, జంగమ వర్గు, నానార్థ వర్గు. ఏ పద్ధతి అయితే అమరసింహుడు మొదలు పెట్టాడో అదే యిక్కడ తెలుగులోనే కాక, సముద్రాల కడ నున్న ఇంగ్లిష్ వారికీ 18వ శతాబ్దంలో శిరోధార్యం అయింది. ఈ విభాగ పద్ధతిలోనే ఇంగ్లిష్ తిసారెస్ ప్రతి దశాబ్దమూ అభివృద్ధి చెందుతూ వచ్చింది. ఆంగ్లభాషా ప్రేమికులకు, అధ్యయనశీలురకు ఈ రోజెట్ తిసారెస్ తప్పనిసరి సంప్రదింపు పుస్తకం. దీని మొదటి రూపం, రెండు మూడు వత్సరాలు అటూ ఇటూగా మన బాల వ్యాకరణం వచ్చే కాలానికి పదిహేను వేల మాటలతో వెలువడ్డది. ఇప్పుడు రెండువేల మూడు వందల గ్రూపులుగా పర్యాయపదాలను కలిగి ఉన్నది. ఈ అభివృద్ధి ఆంగ్ల భాషకు సాధ్యం కావడానికి ఎన్నో కారణాలు ఉన్నాయి.

ఇంగ్లిష్ వారికి మన వంటి పద్యం లేదు కనుక వారి తిసారెస్ నిర్మాణం వచనంలోనే జరిగింది. ఇలా తెలుగులో వచన పర్యాయ పదకోశం మనకు తిరుపతి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా పని చేసిన ఆచార్య జి.ఎన్.రెడ్డి రచన తెలుగు పర్యాయపద నిఘంటువు వచ్చేంత వరకూ రాలేదు. ఈ నిఘంటువులో తెలుగు, సంస్కృత పర్యాయపదాలు కలిసే ఉన్నాయి. మొదటి తెలుగు నామ సంగ్రహాలు మాత్రం తెలుగు భాషకే పరిమితం అయ్యాయి. భాష అభివృద్ధిని సూచించే ఒక సూచీ పదకోశాన్ని తెలుగు భాషావేత్తలు పదిహేడో శతాబ్దంలోనే నిర్మించడం, అదీ ఆంగ్లభాష తిసారెస్ కన్నా దాదాపు వందేళ్ల ముందరే రావడం ప్రపంచ భాషా సమాజాల్లో తెలుగుకు ఒక సమున్నతమైన గుర్తింపును అందచేసే పరిణామం! ఇందుకు కారకులైన పైడిపాటి లక్ష్మణకవి, అడిదం సూరకవిని మనం రోజూ తలచుకోవాలి.

❖ రామతీర్థ
9849200385

విశాఖలో 'కన్యాశుల్కం'

జాతీయ ఉత్సవాలు

125 ఏళ్ల సందర్భంగా గోడపత్రిక ఆవిష్కరణ

కన్యాశుల్కం పోస్టర్ విడుదల చేస్తున్న పరకాల ప్రభాకర్, డి.విజయభాస్కర్, రామతీర్థ, జగద్ధాత్రి, మాల్యాద్రి, కమిషనర్ తదితరులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అప్పారావు రచించిన కన్యాశుల్కం నాటకం ప్రదర్శన 125 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జాతీయ ఉత్సవాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. వచ్చే నెల 26, 27 తేదీల్లో నిర్వహించే కన్యాశుల్కం నూట పాతికేళ్ల జాతీయ ఉత్సవాలకు విశాఖపట్నం వేదిక కానుంది. 1892లో తొలిసారి ప్రదర్శించిన కన్యాశుల్కం నాటకం సరిగ్గా ఈ ఏడాది 125 ఏళ్లు పూర్తి చేసుకుంది. కన్యాశుల్కం ఉత్సవాలకు భాషా సాంస్కృతిక శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహ కారం అందిస్తుండగా మొజాయిక్ సాహిత్య సంస్థ సమన్వయం చేయనుంది. ఇందుకు సంబంధించి గోడ పత్రికను శుక్రవారం సచివాలయంలోని ప్రభుత్వ సలహాదారు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆవిష్కరణలో ప్రభుత్వ సలహా దారు డాక్టర్ పరకాల ప్రభాకర్, సమాచార శాఖ కమిషనర్ ఎస్. వెంకటేశ్వర్, భాషా సాంస్కృతిక శాఖ సంచా లకులు విజయ భాస్కర్, మొజాయిక్ సాహిత్య సంస్థ ప్రధాన, సంయుక్త కార్యదర్శులు రామతీర్థ, జగద్ధాత్రి పాల్గొన్నారు. కన్యాశుల్కం జాతీయ ఉత్సవాల ప్రారంభానికి ముందురోజు ఆగస్టు 25న విజయనగరంలోని గురజాడ నివాసంలో రజత ఫలకం ఏర్పాటు చేస్తారు. ఉత్సవాలు జరిగే రెండు రోజులు విశాఖపట్నంలో సదస్సును నిర్వహిస్తారు. సదస్సులో ఒడిషా, బెంగాల్, అసోం నుంచి వక్తలు ఆయా భాషల్లో 'కన్యాశుల్కం' సమకాలీన రచనలపై ప్రసంగి స్తారు. తెలుగు సాహితీప్రముఖులతో కలిసి ఒకే వేదికను పంచుకుంటారు. స్త్రీవిద్య ఆవశ్యకతను వివరిస్తూ, బాల్యవివాహాలను నిరసిస్తూ గురజాడ తన పదునైన కలాన్ని ఆనాడే ఎక్కుపెట్టారు. అప్పటి సాంఘిక దురాచారాలను తరిమికొట్టేందుకు రచనలనే ఆయుధంగా చేసుకుని నవ చైతన్యాన్ని తీసుకు వచ్చారు. తెలుగువారి గుండెల్లో చెరగని ముద్రవేశారు. ఆధునిక భారతీయ నాటకాల్లో తొలి నాటకం, రైతుల కడ గండ్లను చిత్రిస్తూ దీనబంధు మిత్రా బెంగాలీలో రాసిన నీల్ దర్పణ్ కాగా, మన దేశంలో రెండో ఆధునిక నాటకం కన్యాశుల్కం కావడం విశేషం. కన్యాశుల్కం దురాచారం పోయినా ఆ పేరుతో గురజాడ వారి నాటకం మిగిలింది. భారతీయ నాటక రంగంలో ఇన్నేళ్లు మనుగడ సాధించిన, 125 ఏళ్లు చరిత్ర కలిగిన ఏకైన నాటకం కన్యాశుల్కం ఒక్కటే కావడం తెలుగువారిగా మనకు గర్వకారణం. సాధారణంగా తొమ్మిది గంటల నిడివి వుండే కన్యాశుల్కం నాటక రూపకాన్ని మూడున్నర గంటలకు సంక్షిప్తం చేసి తొలిసారిగా విశాఖ వుడా ఆడిటోరి యంలో ప్రదర్శించనున్నారు. కన్యాశుల్కం సావనీర్‌ను ప్రచురిస్తారు. అలాగే లఘు సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు సాహిత్య, నాటకరంగ కృషీ వలురకు గౌరవ సన్మానాలు చేస్తారు.

మితిమీరిన దేశభక్తి ప్రపంచ ప్రమాదకారి

నేడు అంతర్జాతీయ శాంతి దినోత్సవం. 1981 నుంచీ ఐక్యరాజ్యసమితి ప్రకటన ద్వారా నూట తొంభై మూడు దేశాల్లో పాటించే రోజు ఇది. భూమే మాతృదేశంగా తన దేశభక్తి గీతం రాసిన ఏకైక ప్రపంచ కవి గురజాడ పుట్టినరోజు కూడా. మోతాదు మించిన దేశభక్తి చెడుకు దారితీస్తుంది అన్నది చరిత్ర ఎరిగిన సత్యం. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో ఐరోపాలోని జర్మనీ, ఇటలీ దేశాల్లో, ఇటు ఆసియాలో సైనిక జాతీయ మనస్తత్వం గల జపాన్‌లో ఒక్కసారిగా పెల్లుబికిన ఈ దేశభక్తి మహమ్మారి – కోట్లాదిమంది ప్రజల అకాల మృతికి, ప్రపంచ దుస్థితికీ దారితీసింది. అతిగా వాగి, అనర్థాలకు కారణం కావడం దేశభక్తి కన్నా హీనమైన పాపం అని రచయిత చలం అన్నారు. ఒక మోతాదు దాటాక మాతృసీమలూ, పితృసీమలూ మనుషుల్ని చంపే ద్వేషకారకాలు అవుతాయి తప్ప, వాటికి వేరే మార్గం లేదు. ''దేశభక్తి మంచిగా ఉండే అవకాశం లేదు. ఒక దేశం అమితమైన ప్రయోజన కాంక్షతో జరిపేవే యుద్ధాలు. దీన్నే దేశభక్తి అని పిలుస్తారు. యుద్ధాన్ని రద్దు చేయాలీ అంటే, అల విమాలిన దేశభక్తి ప్రమాదకారి అన్న విశ్వాసం మనలో బలంగా ఉండాలి'' అన్నారు లియో టాల్‌స్టాయి.

ఇదే యుద్ధ వాతావరణం బలపడుతున్న కాలాన, 1913లో టాగోర్ రచన ''గీతాంజలి''లో ప్రపంచ ప్రసిద్ధ కవిత 'ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో' అని ప్రకటించింది. 'ప్రపంచం ఎక్కడ సంకుచిత భావాలతో ముక్కలుగా చీలిపోదో' అని కోరుకున్నాడు టాగోర్. దేశభక్తి అవధులు దాటిన సైనిక కార్యకలాపాలకు దారితీస్తుందని బోధించాడు కూడా. ''దేశభక్తి మనకు అంతిమ విశ్రాంతి మందిరం కాలేదు. నేను జీవించి ఉండగా మానవత్వం మీద దేశభక్తిది పైచేయి కానివ్వను'' అంటూ ఈ ముదిరిపోయే దేశభక్తి ఎంత నష్టకారకమో, ఎరిగిన, చూసిన వాడిగా తీవ్రంగా వ్యతిరేకించాడు టాగోర్.

ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుంది అని గురజాడ అంటే గొప్ప దర్శనంగా భావించే మన సమాజం, నిజంగా అలా చరిత్రను తిరగరాసే ఆధునిక మహిళలను బతకనిస్తుందా అంటే, లేదు.. మేం కాల్చి చంపుతాం అనే కాల సందర్భంలో ఇరుక్కుని ఉన్నాం.

దేశభక్తి ఇప్పుడు పశువుల పేరిట, పవిత్రతల పేరిట, సంకుచితమైన గోడల పేరిట, మీటర్ల ఎత్తు విగ్రహాల్లా పెరుగుతానని భయపెడుతూ, కొందరి చేతిలో గాఢగంధకంలా మారి, మనకు కళ్ళ మంటలు పుట్టిస్తూ, ఇతర పేలుడు సామాన్లుచేరి కూరినప్పుడల్లా విస్ఫోటించి మనిషి గురించి ఆలోచించే వారిని పూనకంతో బలి తీసుకుంటున్నది. ప్రపంచం ఎవరి సొంత పెరడూ కాదు. ఆయుధాల నిల్వ కొట్టు కాదు. భూమిని ఒక లాడ్జ్ గది వలె భావిస్తున్న నేటి ఏక ధృవ ప్రపంచ సమర్థక సాంకేతిక సంపన్నవ్యాపార వర్గాలకు తెలియచెప్పడమే అంతర్జాతీయ శాంతి దినాన సామాన్య మానవుల కర్తవ్యం.

(నేడు అంతర్జాతీయ శాంతి దినోత్సవం)

– రామతీర్థ, ప్రముఖ కవి, రచయిత
మొబైల్ : 98492 00385

గమనిక : 'సాక్షి' నాలుగో పేజీలో 20-9-17న ప్రచురించిన 'పోలవరం కాంట్రాక్టర్లకు వరం' వ్యాసానికి వ్యాసకర్త ఈఏఎస్ శర్మ ఆ అంశం మీద కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు, కేంద్ర జల సంఘం చైర్మన్‌కు రాసిన లేఖలు ఆధారం. పాఠకులు గమనించగలరు.

సాక్షి SAKSHI TELUGU DAILY
Thu, 21 September 2017
epaper.sakshi.com//c/22317422

• కొత్త పుస్తకాలు

స్వాతంత్ర్యం కోసం

సుదీర్ఘ పార్లమెంటేరియన్‌గా, కాంగ్రెస్ నాయకుడిగా, రైతుల కోసం కృషి చేసిన దార్శనికుడిగా, రచయితగా, కృషికార్ లోక్ పార్టీ వ్యవస్థాపకుడిగా, రాజాజీతో కలిసి స్వతంత్ర పార్టీ ప్రారంభించినవాడిగా ఎన్.జి.రంగా జీవితం ఎంతో లోతైనదీ, ఎత్తైనదీను. 'ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం విలువ' తెలిసిన రంగా ఆత్మకథ 'ఫైట్ ఫర్ ఫ్రీడమ్'కు జక్కంపూడి సీతారామరావు చేసిన తెలుగు అనువాదం ఇది.

స్వాతంత్ర్యం కోసం (ఆచార్య ఎన్.జి.రంగా ఆత్మకథ); అనువాదం: డాక్టర్ జక్కంపూడి సీతారామరావు; పేజీలు: 434; వెల: 300; ప్రతులకు: అనువాదకుడు, ప్రజ్ఞ రీజెన్సీ, W4/1 అశోక్ నగర్, గుంటూరు-522007. ఫోన్: 98494977...

• పురస్కారం

సాహిత్య శిల్పులకు కబీర్ సమ్మాన్

సంస్కృతం, ఒడియా, మలయాళం, తెలుగు భాషల సాహిత్యవేత్తలకు 2013 నుంచి 2016 వరకూ ప్రకటితం అయిన కబీర్ సమ్మాన్ పురస్కారాలు లభించాయి. రేవా ప్రసాద్ ద్వివేది (సంస్కృతం, 2013), ప్రతిభా శతపతి (ఒడియా, 2014), అత్తూర్ రవివర్మ (మలయాళం, 2015), కె.శివారెడ్డి (తెలుగు, 2016) ఆయా భాషల్లో దశాబ్దాల కృషి కలిగిన సాహిత్యకారులు.

సంస్కృత కవి, కాళిదాస సమగ్ర రచనల సంపాదకులు, 'ఉత్తర సీతా చరితం', 'స్వాతంత్ర్య సంభవం' పేరిట దీర్ఘ రచనలు చేసినవారు, పరమాణు యుద్ధ ప్రమాదంపై కవిత్వం రాసినవారు రేవా ప్రసాద్. ఒడియాలో ప్రసిద్ధ కవయిత్రి, అనువాదకురాలు, సంపాదకురాలిగా 'ఇష్తార్' సాహిత్య త్రైమాసిక పత్రికను పాతికేళ్లు ఒడియాలో ప్రచురించిన విదుషీమణి ప్రతిభా శతపతి. 'ఉద్భాష' కవిత్వ సంచికను కూడా వీరు ప్రచురిస్తున్నారు. తమిళం నుంచి మలయాళంలోకి అనువాదాల ద్వారా పేరు పొందిన, ప్రస్తుతం కంబ రామాయణాన్ని మలయాళంలోకి అనువదిస్తున్న మలయాళ కవి అత్తూర్ రవివర్మ. తెలుగు వచన కవిత్వ రంగంలో ఇరవైకి పైగా సంపుటాలు, ప్రపంచ కవితల అనువాదాలు, వందల సంఖ్యలో సాహిత్య ప్రచురణలకు ముందుమాటలు రాసిన ప్రగతిశీల కవి శివారెడ్డి. ఈ నలుగురూ వైవిధ్యం, వైశాల్యం గల బహు భాషీయ భారతీయ సాహిత్య సృజనకు ప్రతినిధులుగా నిలబడ్డారు.

ఈ పురస్కారాలను ప్రదానం చేసేది మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం. మూడు దశాబ్దాల ముందర 1986–87లో కన్నడ రచయిత గోపాలకృష్ణ ఆడిగకు ప్రదానం చేయడంతో మొదలైన ఈ సమ్మాన పరంపర, నేటికి నలుగురు దక్షిణాది సాహిత్యవేత్తలను వరించింది. వారు కన్నడంలో గోపాలకృష్ణ ఆడిగతోపాటు చంద్రశేఖర్

కె.శివారెడ్డి

రేవా ప్రసాద్ ద్వివేది

అత్తూర్ రవివర్మ

ప్రతిభా శతపతి

> ఈ మూడు దశాబ్దాల కాలంలో ఈ పురస్కారం పొందిన తొలి తెలుగు కవి శివారెడ్డి. ఈ నలుగురి రచనల్లోనూ సామాజిక సంఘటనలపై నిష్ఠ, జాతీయ అంతర్జాతీయ పరిణామాల పట్ల మెలకువ, సాహిత్య సంప్రదాయం పట్ల సృజనాత్మక ఆసక్తితో కూడిన నవీనత, వీరి రచనల్లో చూస్తాము.

కంభార్ కాగా, మలయాళంలో కె.అయ్యప్ప పణిక్కర్, అక్కిత్తమ్ అచ్యుత్తమ్ నంబూదిరి. అక్కిత్తమ్ కవిత్వం 'ఇరవయ్యో శతాబ్దపు ఇతిహాసం' దీర్ఘ కవితకు ఎల్.ఆర్.స్వామి అనువాదం మొజాయిక్ ప్రచురణగా చాలా ఏళ్ల కిందటే వెలువడింది. ఇక ఈ మూడు దశాబ్దాల కాలంలో ఈ పురస్కారం పొందిన తొలి తెలుగు కవి శివారెడ్డి.

తమ రచనల్లో సామాజిక సంఘటనలపై నిష్ఠ, జాతీయ అంతర్జాతీయ పరిణామాల పట్ల మెలకువ, సాహిత్య సంప్రదాయం పట్ల సృజనాత్మక ఆసక్తితో కూడిన నవీనత, వీరి రచనల్లో చూస్తాము. రేవానది(నర్మద) స్తుతి రాసినా, కవిత్వ ధోరణులపై 'శతపత్రం' వెలువరించినా, సంస్కృత సాహిత్య సమాజం రేవా ప్రసాద్‌ను శ్రద్ధతో గౌరవించింది. కవిత్వం లయాత్మకంగా సాగే జీవ లక్షణాన్ని కొనసాగిస్తూనే తన రచనలు చేశారు అత్తూర్ రవివర్మ. 'అత్తూర్ రవి వర్మ కవితగళ్' అంటూ రెండు సంపుటాలు ప్రచురణ జరిగాయి. వీరి రచనలలో కొంత భాగాన్ని అన్వర్ అలీ అనే సాహిత్య సినిమా నిపుణుడు 'మరువిల్లి' (అద్దరి పిలుపు) పేరిట కేరళ సాహిత్యోత్సవాలకు డాక్యుమెంటరీ తీయడం జరిగింది. అత్తూర్ అనే తను పుట్టిన పల్లెను తన పేరుకు కలుపుకొన్న రవివర్మ శ్రీలంకలో తమిళుల ఊచకోత పట్ల 1989లో రాసిన కవిత్వం శక్తిమంతమైనది. అందులో ఒక ప్రారంభం ఇది: 'పోస్ట్ ఆఫీసు రోడ్‌పై నడిచేటప్పుడు ఒక నెత్తుటి మడుగుగా మారిపోతావు'. కవిత్వం ఆలోచనల భాష, మన హృదయానికి చాలా సన్నిహితమైన భాష అంటారు రవివర్మ. ఒడియా కవయిత్రి ప్రతిభ 'నిమిషే అక్షర' సంపుటికి ఆ రాష్ట్ర సాహిత్య అకాడెమీ అవార్డ్ పొందారు. పెర్ల్ ఎస్.బక్, చింఘీజ్ అయిత్మతోవ్ లాంటివారి రచనలను ఒడియాలోకి అనువదించారు. తన అనేక రచనలను తానే హిందీలోకి అనువాదం చేసుకున్నారు. 'తన్మయ ధూళి' కవిత్వానికిగానూ కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం పొందారు. ఇది డాక్టర్ ఎన్.గోపి అనువాదంలో తెలుగులో కూడా లభ్యం.

1973లో 'చర్య' కవిత్వ సంపుటి ద్వారా మొదలైన ఒక సన్నకారు రైతు కుటుంబ కుర్రవాడు, తెనాలి గాలి పీల్చి విశాఖలో ఎం.ఎ. ఆంగ్లం చదివి, జీవికకై భాగ్యనగరి చేరి లెక్చరర్‌గా స్థిరపడి, అదే కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేసి, చిక్కడపల్లి చిరునామాగా కవిత్వ వ్యవసాయం చేసి, నాగరిక యుగ జీవితాన్ని యావత్తూ తన కవిత్వ, ప్రపంచ కవిత్వ అనువాద సంపుటాల ద్వారా పలికించినవాడు శివారెడ్డి. తెలుగునాట ఎక్కడి నుంచి పిలుపు అందుకున్నా ప్రేమతో హాజరయ్యే బాధ్యతను ఒక జీవన ధర్మంగా నిర్వహిస్తున్నవాడు, ఇటీవలే తొలి కవిత రాసిన యువకుడినైనా గోర్కీలా అక్కున చేర్చుకునే తల్లికోడి ప్రేమపూర్ణుడు. ఇరవయ్యో శతాబ్దపు తెలుగు కవిత్వంలో విస్తృత ప్రజా సంబంధాల శిల్పి. "ప్రజలే నా గురువులు, ప్రజలే నా శిష్యులు, ప్రజల కంటిలోని కన్నీటి బొట్టు, నా కలంలోన సిరా చుక్క" అన్న కవియోద్ధ. సాహిత్య గుణాత్మక, ప్రవాహాత్మక లక్షణం నిత్యం ప్రజల వైపే అని తెలిపే శివుడు, మధ్యప్రదేశ్ మహాకాలుడి ఉజ్జయినిలో పురస్కారం పొందడం తెలుగువారికి నిండుదనాన్ని తెచ్చింది.

కబీర్ సమ్మాన్ పొందిన నలుగురూ మొక్కవోని వ్యక్తిత్వాలకు చిరునామాలు కావడం ఈ పురస్కార సందర్భానికి మరింత సమగ్రత తెచ్చింది. కబీర్ కూడా సంస్కరణ ఖడ్గాన్ని చేత బట్టిన మధ్యయుగాల సంకీర్తనాచార్యుడు. ఆ పోరాట పటిమ, ఈ కాలపు సంఘర్షణ కేతనంగా ఈ నలుగురిలో సుసంపన్నంగా ఉన్నది.

❖ రామతీర్థ
9849200385

అకాడమీ సిగలో కొత్త కాంతి

తెలుగు భాషా కమిటీ కార్యవర్గ సభ్యులుగా, కమిటీ కన్వీనర్‌గా ప్రజా కవి, బహు పురస్కృత, బహు కావ్య రచయిత కె. శివారెడ్డి ఎన్నిక కావడం తెలుగు సాహిత్య వికాసానికి మంచి పరిణామం.

సందర్భం

రామతీర్థ

సాహిత్య అకాడమీ కొత్త కార్యవర్గం ఏర్పడగా, అధ్యక్ష హోదా ఈసారి 1998 తరువాత తిరిగి, కన్నడ దేశానికి దక్కింది. 1998లో యు.ఆర్ అనంత మూర్తి తరువాత, ప్రస్తుతం ఫిబ్రవరి పన్నెండున సాహిత్య అకాడమీ అధ్యక్ష పదవికి ప్రముఖ సాహితీ వేత్త, ఎనభయ్యేళ్ళ చంద్రశేఖర కంబర్ ఎంపిక అయ్యారు. 1964 వరకూ జవహర్‌లాల్ నెహ్రూ దేశ ప్రధాని అయినందుకు కాకుండా, ఆయన స్వయానా రచయిత, సాహిత్య వేత్త కావడం మూలాన అకాడెమీ అధ్యక్ష పదవిలో కొనసాగారు.

అటుపై సర్వేపల్లి రాధాకృష్ణన్, జాకీర్ హుస్సేన్, సునీతి కుమార్ చటర్జి, కె.ఆర్ శ్రీనివాస అయ్యంగార్, (రెండు సార్లు) ఉమాశంకర్ జోషి, బీరేంద్ర కుమార్ భట్టాచార్య, యు.ఆర్. అనంత మూర్తి, రమాకాంత్ రథ్, గోపిచంద్ నారంగ్, సునీల్ గంగోపాధ్యాయ్ (పదవిలో మరణం) విశ్వనాథ్ ప్రసాద్ తివారీ నిర్వహించగా, 2018 నుంచి 2022 వరకూ ఈ జాతీయ సంస్థ అధ్యక్ష పదవిలో చంద్రశేఖర్ కంబర్ బాధ్యతలు నిర్వహిస్తారు.





కంబర్ ప్రఖ్యాత రచయిత, జానపద గేయ కర్త, సినిమా దర్శకులు కావడం, బహు కళా రంగాల్లో అనుభవం ఉన్న వ్యక్తి, సాహిత్య అకాడమీకి తగు దిశా దర్శనం చేయగలరు అన్న ఆశాభావం నలుదిశలా వ్యక్తం అవుతున్నది. హంపి లోని కన్నడ విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతిగా, ఉత్తర కన్నడ మాండలికం తన కవితలు, నాటకాలు, ఇతర రచనల్లో సృజనాత్మకంగా ఉపయోగించిన సాహిత్యవేత్తగా మంచి గుర్తింపు ఉన్నవారు. నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకి, కర్ణాటక నాటక అకాడమీకి కూడా వారు ఉన్నత పదవులని నిర్వహించారు. షికాగో విశ్వ విద్యాలయంలో కొంత కాలం బోధన తరువాత, తాను బెంగళూర్ విశ్వ విద్యాలయంలో రెండు దశాబ్దాలకు పైగా ఆచార్య వృత్తిలో ఉన్నారు.

ఇరవై అయిదు నాటకాలు, పదకొండు సంపుటాల కవిత్వం, అయిదు నవలలు, పదహారు పరిశోధనలు వారి నిరంతర సాహిత్య కృషిలో భాగంగా వెలుగు చూశాయి. జానపద కళా రంగం, విద్యా, సాహిత్య అంశాల పైన పలు రచనలు వెలువరించారు. వీరి నాటకాలు భారతీయ భాషలు, అలాగే ఆంగ్లంలోకి కూడా అనువాదం జరిగాయి. కర్ణాటక రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల కోసం వీరు కొన్ని డాక్యుమెంటరీలు కూడా నిర్మించారు.

సాహిత్య అకాడమీ అవార్డులతో పాటు, జ్ఞాన్ పీఠ, కబీర్ సమ్మాన్, కాళిదాస్ సమ్మాన్, మొదలయిన పురస్కారాలు పొందినవారు. ఫుల్‌బ్రైట్ స్కాలర్‌గా, సాహిత్య పరిశోధకులు కూడా. దక్షిణ భారతీయ సాహిత్య రంగం, మరింత ప్రాధాన్యత సంతరించుకుని, తన ప్రతిష్టను పెంపొందించుకోగలదని ఆశిద్దాము.

అలాగే తెలుగు భాషా కమిటీ కార్యవర్గ సభ్యులుగా, కమిటీ కన్వీనర్‌గా ఆధునిక కవిత్వ చేతనతో ఎన్నో సంపుటాలు వెలువరించిన ప్రజల కవి, ప్రముఖ కవి, బహు పురస్కృత కె. శివారెడ్డి ఎన్నిక కావడం మంచి పరిణామం. తెలుగు భాషకు సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు గల నిధులను రెండు రాష్ట్రాలలోనూ సముచితంగా వినియోగించడంలో మేలైన పాత్ర పోషించాలని ఆశిద్దాం.

తెలుగు ప్రాంతాల్లో జరగకుండా పోతున్న ప్రతిష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ సదస్సులు, అలాగే, దక్షిణ భారతీయ సాహిత్య సమ్మేళనం వంటి అనేక ప్రతిపాదికలు పరిశీలనలో ఉండి పోయాయి. ముఖ్యంగా అనువాద ప్రణాళిక విస్తరించి, నిర్ణీతంగా, తెలుగు సాహిత్య రచనలు భారతీయ భాషల్లోకి, ఆంగ్లంలోకి వెళ్ళేలా, కొత్త కమిటీ ఆలోచనలు చేయాలి.

అందుకు తగు పరిణతి, అంతర్జాతీయ దృక్పథం, ప్రగతిశీల స్వభావం, బహుళ సాంస్కృతిక చైతన్యం కలిగిన శివారెడ్డి వంటి కన్వీనర్ వలన తెలుగు సాహిత్య సంఘం, తన ప్రతిష్ఠ, దేశ భాషల్లో పెంపొందేలా, వీరి నేతృత్వంలో పని చేస్తుందని ఆశించవచ్చును. సాహిత్య రంగంలో కొత్త కమిటీ జాతీయంగా, భాషీయంగా ఏర్పాటు అయిన ఈ సందర్భంలో జాతి తరఫున శుభాకాంక్షలు.

వ్యాసకర్త ప్రముఖ కవి, రచయిత
మొబైల్ : 98492 00385

సాక్షి SAKSHI TELUGU DAILY
Fri, 16 February 2018
epaper.sakshi.com//c/26291214

సందర్భం

రామతీర్థ

ఆధునికతకు అక్షరాది కందుకూరి

తెలుగు సమాజంలో ఏ ఒక్క వ్యక్తి పుట్టుకతో అయినా ఇదిగో ఆధునికత మొదలు ఇతనితో అని చెప్పగలమా అంటే, అది ఒక్క కందుకూరి వీరేశలింగం విషయంలోనే సాధ్యం. ఆయన శతవర్ధంతి వత్సరం మే, ఇరవై ఏడున ఆరంభం అవుతున్నది. ఏ చదువులు లేకుండా అజ్ఞానంలో, బలైపోతున్న పసి ఆడపిల్లల జీవితాలు, యుక్తవయసు వచ్చేలోపే బాల వితంతువులుగా లక్షలాదిమంది బాలికలు సమాజంలో ఉండటం, వీటిని ఎవరు సహించినా, తాను వ్యతిరేకినంటూ, వీటిని ప్రశ్నించడానికి 1881లో రాజమండ్రి సోషల్ ప్రావిన్షియల్ క్లబ్‌లో కందుకూరి వీరేశలింగం ఒక ప్రసంగం చేశారు. దీనికి ప్రధాన ప్రేరణ, ఈ బాల్య వివాహాల జాడ్యం దేశమంతటా ఉండటం.

1880లో జరిగిన జనాభా లెక్కల ప్రకారం, తొమ్మిదేళ్ల వయసులో భార్య అంటే ఏమో ఎరుగని వయసు బాలురు, పసి భార్యలను పోగొట్టుకున్న వారు దేశంలో 14,773 మంది ఉన్నారు. అదే సంవత్సరం, తొమ్మిదేండ్ల వయసు ఉన్న బాలికలు, తమ భర్తలను పోగొట్టుకున్న వారు, 78,976 మంది లెక్క తేలారు. వీళ్ళు కాకుండా, తరుణ వయసుకొచ్చిన 2,07,388 మంది బాలికలు తమ యవ్వనారంభ జీవితాలను వితంతువులుగా మొదలెడుతున్నారు. ఇవీ సంప్రదాయ భారతదేశపు సంఘం చేస్తున్న దుర్మార్గ పరంపర. ఇది కేవలం తెలుగు ప్రాంతాలకే చెందినదిగా, కొందరు భావించి, గురజాడ (1887–1892 నాటక రచనా కాలం ప్రదర్శన 1892లో) కన్యాశుల్కం నాటకం రాసే నాటికే, ఈ సమస్య లేదు అని చెప్తూ ఉంటారు. అది వాస్తవదూరం. ఈ అగ్ర వర్ణ మూర్ఖత్వాన్ని నిరసిస్తూ, గురజాడ వాడిన వాటి కన్నా, కటువైన మాటల్లో, ఈ బాల్య వివాహ దురాచారాన్ని రూపుమాపితే గానీ సమాజం బాగుపడదని విశ్వసించిన నాటికి, వీరేశలింగం వయసుడిగిన ముసలివారు కారు. ఆయన వయసు అప్పుడు కేవలం 33ఏళ్ళు. మనం తరచూ చూసే వృద్ధ కందుకూరి ఫోటోకి, ఈ అతి బాల్య వివాహాలపట్ల నిరసన తెలుపుతూ, తొలి వితంతు వివాహాన్ని 1881లో దక్షిణ భారతదేశంలోనే మొదటిసారిగా జరిపించిన వ్యక్తి రూపానికి పోలికే లేదు. దక్షిణ భారత రామ్‌మోహన్‌రాయ్‌గా గుర్తింపదగ్గ ఆధునికుడు వీరేశలింగం.

కేవలం అక్షరయోధుడే కాదు, ఆచరణసేనాని కందుకూరి. ప్రసంగాలు, రచనలే కాదు – పెళ్లిళ్లు జరగాలి– అదీ కందుకూరి కార్యదీక్ష. ఆయన రచనలన్నీ, సాంఘికమౌఢ్యాన్ని పెల్చివేసే మందుపాతరలు. ఏకబిగిన వితంతు వివాహదీక్షతో, సంఘసంస్కరణలో జాతీయస్థాయి సంస్కర్తగా తన జీవితకాలంలోనే ఎదిగారు కందుకూరి. అప్పటి జాతీయ సంఘ సంస్కర్తలతో కలిసి, తన కార్యాచరణలో ఉన్నారు. ఈ భిన్న ప్రాంతాల ప్రముఖులు, జస్టిస్ మహదేవ్ గోవింద్ రనడె అధ్యక్షతలో, దేశంలోని ప్రధాన నగరాల్లో జాతీయ సామాజిక సంస్కరణ సభలను నిర్వహించేవారు. ఈ మేధావులు సంఘ సంస్కరణ మన రాజకీయాకాంక్షలతోబాటుగా, అంతకన్నా వేగంగా సాగాలని, అప్పుడే భారతీయ సమాజం ఆధునికం కాగలదని విశ్వసించి ఆచరించినవారు. 1898లో మదరాసులో జరిగిన మహాసభలకు కందుకూరిని అధ్యక్షులను చేసి గౌరవించారు. ఇక్కడ అధ్యక్షహోదాలో ఆంగ్లంలో ప్రసంగించారు కందుకూరి. ఇక్కడే జస్టిస్ మహదేవ్ గోవింద్ రనడే 'దక్షిణ భారత విద్యాసాగరునిగా' కందుకూరికి బిరుదునిచ్చారు.

అరుదైన ఈ ఆంగ్ల ప్రసంగ పూర్తిపాఠం, ఇటీవల లభ్యమైంది. దీనిని మే 27న, విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం హాల్‌లో ఒక రోజుపాటు జరిగే శతవర్ధంతి వత్సర ప్రారంభోత్సవంలో విడుదలచేసి ఈ ప్రతిని ప్రదర్శనయోగ్యంగా విజయనగరంలోని గురజాడ స్మారక మందిరానికి, అలాగే, రాజమండ్రిలోని కందుకూరి దంపతుల సమాధి ఉన్న ఆనందాశ్రమానికి, ప్రదర్శన నిమిత్తం జాతికి సమర్పించడం జరుగుతుంది. 'వ్యాకరణాల సంకెల' అని, 1895లోనే ''సరస్వతీ నారద విలాపం''లో రాసిన కందుకూరి, 'కవితా ఓ కవితా'లో 'వ్యాకరణాల సంకెళ్లు, శ్మశానాల వంటి నిఘంటువులు, ఛందస్సర్ప పరిష్వంగం' అన్న శ్రీశ్రీ కన్నా 45 ఏళ్ల ముందరే, సాహిత్య సరస్వతి భాష బరువుల కింద నలిగి రోదిస్తున్నదని చెప్పిన వాస్తవిక వాది. వీరి రచనల సమగ్ర ప్రచురణలు, వీలైతే నేటి తరాల కోసం, కొత్త సరళ భాషలో తీసుకురావడం, అలాగే, పలు తెలుగు నగరాల్లో కందుకూరి శతవర్ధంతి సందర్భంగా 'కందుకూరి జయమాల' సాహిత్య, సాంస్కృతిక సభల నిర్వహణ, ప్రస్తుతం తెలుగు జాతి బాధ్యత.

(మే 27న కందుకూరి శతవర్ధంతి సంవత్సరం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విశాఖలోని ఆంధ్రవిశ్వవిద్యాలయంలో మొజాయిక్ సాహిత్య సంస్థ, అరసం సంయుక్తంగా నిర్వహిస్తున్న సందర్భంగా)

వ్యాసకర్త కవి, విమర్శకుడు । 98492 00385

సవరణ : శనివారం సాక్షి (25-05-2018) 6వ పేజీలో ప్రచురించిన వ్యాఖ్య కర్త అమెరికన్ నటి నటాలి పోర్ట్‌మన్‌గా చదువుకోవాలి. ఆమె స్టార్ వార్స్ సినిమాలోని పాడ్మె అమిడాల పాత్రధారి.

సాక్షి SAKSHI TELUGU DAILY Sun, 27 May 2018
epaper.sakshi.com/c/28996609

అలాంతర్గామి గరికిపాటి కలం కడలి హోరు

మన కాలపు మహాబలిపురం రాతి ఏనుగు గరికిపాటి నరసింహారావు గారు. సాహిత్య లలిత కళా పల్లవునిగా వారి అభివ్యక్తి శిల్పారామం వాగ్మానస గోచరంగా ఉంటూనే, ఒక అలౌకికావరణంలోనికి మనలను తీసుకువెళ్తుంది. పద్య ధారగా పటిష్టమై కుప్పించి ఎగసిన భావ తరంగాల హేష వినిపిస్తుంది వారి కందువా అంచుల కడలి కెరటాలుగా, ఒకప్పుడు కృష్ణుడి పేరిట నారాయణ తీర్థుల తరంగాలు నేటి కమనీయమైన తెలుగు పలుకుబళ్ళు. సాగర ఘోషగా గరికిపాటి చేసిన లోకదర్శనం ఈ వెయ్యిన్నూట పదార్ల పద్యాల్లో భిన్న వృత్తాల్లో ఉన్నది. మూలం తెలుగులో వెలుగు చూసి అష్టాదశ వర్షాలు కాగా, నేటికి ఈ రచన, ఇంతకు ముందరే కొన్ని ఆంగ్ల అనువాద రచనలు చేసిన మహతి గారి ఇంగ్లిష్ అనువాదంలో విశాల ప్రపంచానికి పరిచయం అవుతున్నది. ప్రథమాంతరంగం, ద్వితీయ అంటూ పది అంతరంగాలుగా విభజించి, అటు తరంగాలు, ఇటు అంతరంగం ధ్వనించేలా, తెలుగులో ఉన్న తరంగ విభాగాన్ని, ఆంగ్లంలో అధ్యాయాలుగా మార్చారు. ఉప విషయ శీర్షికలు మూలంలో ఉన్నవి తొలగించారు. అంకితం కూడా తీసేశారు. విపులంగా పాద సూచికలు ఇచ్చిన మాటలు చూస్తే, వందల ఏళ్ల కిందటి పాత నార్స్ కాలపు మాటలు అయిన ere, వంటి (before అనేది ఆధునిక వాడుక) మాటలు వాడారు. బడబాగ్నిని "రింగ్ ఆఫ్ ఫైర్" అని వాడాలి సులభంగా అర్థం చేసుకోవడం మన లక్ష్యం అయితే. గుయోట్ అన్న మాట క్రీ.శ. 1870ల ముందు లేదు. పైగా ఇదొక మనిషి పేరు. ఇది మన సంస్కృతిలో ప్రాచీనమైన బడబాగ్నిని సూచించదు.

అయితే కాల మహాప్రవాహాన్ని తరంగాలుగా దర్శిస్తూ, అనేక ప్రాచ్య, పాశ్చాత్య విషయాలు, ఘట్టాలు, చరిత్ర, మహాకవులు, చక్రవర్తులు ఇతివృత్తాలుగా, గరికిపాటి వారు చేసిన ఆసక్తికరమైన, కవితాత్మకమైన సృజన, తెలుగులో ఒక బలమైన ముద్ర వేస్తుంది. ఇది ఆంగ్లంలో ఇంకా సాధన చేస్తే కానీ, ఇంకామూల విధేయత ఉంటేనే కానీ పట్టుబడదు. క్రీస్తు మీద పద్యాల్లో, ఆటవెలది చిన్న పద్యం కేవలం ఇరవై రెండు మాటలుండేది, అనువాదంలో నలభై మాటలు మించి పోవడం, ఎలా అనువాదం అనిపించుకుంటుంది? మూలంలో కవి అనని



మాటలు, భావనలు అనువాదకులు చొప్పించకూడదు. క్రీస్తుని వెస్టర్న్ క్లోన్ అనడం (పద్యం 52, పుట 30) అనువాదకుల జోడింపు. చారిత్రికంగా కూడా సరి కాదు, క్రీస్తు కూడా ఆసియా వాసే. పడమట ప్రచారంలో ఉన్నమతం కదా అని అన్నారేమో అనుకున్నా, అది గరికిపాటి వారి మూల రచనలో లేదు. ఇలా అనువాదకులు, ప్రత్యామ్నాయ పంక్త్యంత్య ప్రాస (ABAB) వాడడం కోసం, తెలుగు పద్యం సొగసు, ఆంగ్లంలో ఇలా verse రాయడం కోసం బలవంతాన ఒదిగించారు. అనువాదంలో మాటలు అమితంగా పెంచారు. మూల విధేయత వారి దృష్టిలో లేదు. ఫ్రీ వెర్స్‌లో రాస్తే, ఒకింత వెసులుబాటు ఉండేది.

చరిత్ర దర్శనంలో, విజ్ఞానం, విప్లవాలు, మానవాళి విజయాలు, తాత్విక గవేషణ నమోదు చేసిన ఒక సహజ సుందర పద్య సౌధం గరికిపాటి వారి రచన. అన్నమయ్య మీద రాసిన రెండు పద్యాలలో కదన కుతూహల రాగం ప్రస్తావన చేస్తారు కవి. అనువాదకులు రెండు సంస్కృతుల మధ్య ఒక జీవ వారధి తప్ప మూల సంస్కృతిలోని విశేషాలను, లక్ష్య భాషా సమాజపు సంస్కృతిలోకి మార్చడం, ఇవాల్టి అనువాద ప్రక్రియ కాదు. కదనకుతూహల రాగం అంటూ మూలంలో కవి అన్నది 'ఎలెగ్రో ఎలెగ్రో' అంటూ పియానో మెట్ల రాగంగా మార్చడం, మనకి గల భిన్న విషయాల పరిజ్ఞానం చెప్తుంది కానీ, అన్నమయ్య ఆలపించిన కదన కుతూహల రాగం, భారతీయ సంగీతంలో ఎటువంటి స్థానం కలిగి ఉన్నదో తెలపదు. ఎన్నో మాటలకు పాద సూచికలు ఇచ్చిన అనువాదకులు, ఇటువంటి సంస్కృతీ విశేషాలకు సైతం, వాటిని రచనలో సాధ్యమైనంత వరకు యథాతథంగా, ఇటాలిక్స్‌లో వాడుక,వాటికి దిగువన తన వివరణ ఇవ్వాలి. అప్పుడే ఒక సంస్కృతీ పరిచయం జరుగుతుంది. ఈ పద్యంలో కూడా అనువాదకుల స్వేచ్ఛ పరిమితి దాటింది. ధూర్జటి గురించిన కవి రాసిన పద్యంలో చివరి రెండు పంక్తులు, అనువాదకులు (పుట 57 , పద్యం 96) అసలు పట్టించుకోలేదు. మనుషుల, ఊర్ల, ప్రాంతాల, సంస్కృతీ పరమైన నామవాచకాలు, కావ్యాల పేర్లు, సంస్కృతీ సంకేతాలు లక్ష్య భాషా సమాజానికి అందచేయడం నేటి అనువాద పద్ధతి. ఈ అనువాదంలో దీన్ని పాటించలేదు.

చివరగా పుస్తకం పేరు 'సాగర ఘోష'. తరిచి చూస్తే, ఇది కాలాబాధితమైన లోకపు భిన్న మానసిక దశల అలల పలకరింపుల కడలి సందడి. విషాద ప్రధానం కాదు. అప్పుడు 'ఓషన్ బ్లూస్' అన్న పేరు సరికాదు. 'బ్లూస్' అనేది విషాద సంకేతం ఆంగ్ల సంస్కృతిలో. మరి ఘోష అన్నారుగా కవి – అవును 'ఓషనిక్ ట్యుముల్ట్' లేదా ట్యుముల్టస్ ఓషన్' అనే పేరు మూల శీర్షికకు దగ్గరగా వస్తుంది. వేల ఏళ్ల కిందటి వేద స్రోతస్వినికి, మూడు వేల ఏళ్ల నాగరిక కాల ప్రవాహానికి గళగళన్మనోజ్ఞ కళాకాహళిగా తెలుగు సంస్కృతి ఘనాపాటి గరికిపాటి. అనువాదంలో ఈ 'సాగర ఘోష' ఇంతకన్నా బలంగా, ఆధునికంగా, సరళ సుందరంగా, మూల విధేయంగా అందాలని ఆశిద్దాము.

–రామతీర్థ, ప్రముఖ కవి, విమర్శకులు
మొబైల్ : 98492 00385

సాక్షి Sun, 12 August 2018
epaper.sakshi.com/c/31155564

వందేళ్ల 'జలియన్‌వాలా బాగ్'

జలియన్‌వాలా బాగ్ ఘటనపై చిత్రాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీతంపేట: జలియన్‌వాలా బాగ్ నూరేళ్ల సందర్భంగా మొజాయిక్ సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శతవత్సర జ్ఞాపక జ్వాల పేరిట కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య కోసం పోరాడుతున్న వారిపై ఉక్కుపాదం మోపేలా 1919లో అమృత్‌సర్‌లో జరిగిన జలియన్‌వాలాబాగ్ మారణ హోమం వందేళ్లు పూర్తయిందని కళా ఆస్పత్రి ఎండీ డాక్టర్ పి.వి.రమణమూర్తి అన్నారు. ఆనాటి మారణహోమాన్ని నేటితరానికి తెలిపే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎందరో ప్రాణత్యాగం చేసి సాధించిన స్వాతంత్ర్యాన్ని నేడు మనమంతా అనుభవిస్తున్నామని గుర్తుంచుకోవాలన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకోవడం మన కర్తవ్యమన్నారు. ఈ సందర్భంగా జలియన్‌వాలా బాగ్ ఘటనపై కొమ్మాది జవహర్ నవోదయ పాఠశాల, రామకృష్ణా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన చిత్ర ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రముఖ గాయకుడు వంగపండు బృందం ఆలపించిన పాటలు దేశభక్తిని ఉప్పొంగించాయి. జాతీయ సంస్కృతిలో జలియన్‌వాలా బాగ్ అను అంశంపై ప్రముఖ రచయిత రామతీర్థ ప్రసంగించారు. కార్యక్రమంలో రచయితలు ఎల్.ఆర్.స్వామి, జగద్ధాత్రి, గరిమెళ్ల నాగేశ్వరరావు, పి.రాజేష్ పాల్గొన్నారు.

సాక్షి
Tue, 14 August 2018
epaper.sakshi.com/c/31221456

స్వేచ్ఛావీరుల రెండు విప్లవ గీతాలు

సర్దార్ భగత్ సింగ్ సినిమా చూసిన వారికి స్వతంత్ర వీరులు ఖైదులో పాడే పాట 'సరఫోషికీ తమన్నా అబ్ హమారే దిల్ మే హై', అలాగే ఉరి కంబానికి వెళ్తున్నప్పుడు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురు పాడే గీతం 'రంగ్ దే బసంతీ' గుర్తుంటాయి. ఈ పాటలు ఒక స్వాతంత్ర్య కవి వీరుడి రచనలు. ఆయన రాంప్రసాద్ బిస్మిల్.

ముప్పయ్యారేళ్ల వయసుకే ఉరికంబం ఎక్కిన వీరుడు. తనతో పాటుగా బ్రిటిష్ ఆధిపత్యంపై పోరాడిన సహచరులు, తానూ, విప్లవకర పరిస్థితులున్న ఉత్తర భారతదేశంలో, పంజాబ్‌లో సాయుధ కార్యాచరణ ద్వారా భారతదేశ స్వాతంత్ర్యం సాధించబూనిన వీరులు. భారతీయ కమ్యూనిస్ట్ పార్టీ ఏర్పాటుకి ముందరే, దేశంలో గల బ్రిటిష్ వ్యతిరేకతకు ఒక రూపం హిందూస్తాన్ రిపబ్లికన్ అసోసియేషన్ (HRA). వీరు తొమ్మిది ఆగస్ట్ 1925న లక్నో వద్ద కాకోరి ఎక్స్‌ప్రెస్ దోపిడీకి పాల్పడ్డారు. దోచిన సొమ్ము బ్రిటిష్ ట్రెజరీకి వెళ్తున్న ఎనిమిది వేల రూపాయలు. సూత్రధారులు రాంప్రసాద్ బిస్మిల్, అషాకుల్లా ఖాన్ కాగా, వీరితో పాల్గొన్న స్వాతంత్ర్య వీరులు రాజేంద్ర లాహిరీ, చంద్రశేఖర ఆజాద్, సచీంద్ర బక్షీ కేషబ్ చక్రవర్తి, మన్మథనాథ గుప్తా, మురారీలాల్ గుప్తా, ముకుంది లాల్, భంవారి లాల్. దోపిడీ చేస్తుండగా, ఒక ప్రయాణికుడు ప్రమాదవశాత్తూ మరణించాడు. రాజద్రోహం నేరం కింద నలభై మందికి పైగా వివిధ రాష్ట్రాల్లో అరెస్ట్ అయిన ఈ కకోరి రైలు దోపిడీ కేసు బ్రిటిష్ పాలనపై దేశ వ్యాప్త అసంతృప్తికి చిహ్నంగా నిలిచింది. ఈ కార్యాచరణతో సంబంధం ఉన్న వారుగా, భిన్న భాషల భారతీయులు, ఆగ్రా, అలహాబాద్, బనారస్, కలకత్తా, ఈటా, హర్దోయి, కాన్పూర్, లాహోర్, లక్ష్మీపూర్, మథుర, పూణే, మీరట్, రాయి బరేలీ, షాజహాన్ పూర్‌లలో ప్రభుత్వంచే అదుపులోకి తీసుకోబడ్డారు. వీరిలో ముఖ్యులు రాంప్రసాద్ బిస్మిల్, అషాకుల్లా ఖాన్, రాజేంద్ర లాహిరీ, ఠాకూర్ రోషన్ సింగ్ ఉరిశిక్షకి గురయ్యారు. 19 డిసెంబర్ 1927న వీరికి ఉరి అమలు జరిగింది. మరికొందరికి అండమాన్ జైలు శిక్ష పడింది. రాంప్రసాద్ బిస్మిల్ వీరిలో కవి. ఆయన రాసిన పాటలే ఇవి. తనకన్నా ముందరే ఉరి తీయబడిన రాంప్రసాద్ బిస్మిల్ పాటలను పాడుతూ, తరువాత ఉరిపై విరిసిన విప్లవ వీరులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్. దేశ స్వాతంత్ర్యంలో ఉజ్జ్వలఘట్టంగా, ఈ వీరులకు నివాళిగా, అమర వీర కవి రాంప్రసాద్ బిస్మిల్ రాసిన ఉత్తేజకర గీతాలు తెలుగులో ప్రత్యేక సమర్పణ.

తిరుగుబాటు తహతహ

గుండె నిండా ఉందిలే తిరుగుబాటు తహ తహ
చూద్దాం శత్రువు సత్తువెంతో నిశ్చయం
ఇంకే మాటలూ లేవు దేశమా నీముంగిట
చూస్తున్నాము అందరిదీ ఒకే పూనిక
సమస్తం నీకంకితం ఓ దేశమా,
నీ సాహస గాథలే ఇక లోకమెల్లెడలా
వేళ రానీ, చెప్తాములే అపుడు ఓ నింగి,
ఏల ఇపుడే మా మనసులోని మాటలు
బలిదానమిచ్చే కోరికేదో గుంజుకొచ్చింది
ప్రాణమంటే లెక్కలేని మా సంఖ్య పెరిగింది
బలి వేదిపై పదేపదే తలారి ప్రశ్న
అమరులయ్యే కోరికుందాఎవరికన్నా
నెత్తుటి పిలుపుల్లేని దేహమొక దేహమేనా?
తుపాసులతో పోరుతుందా రేపుకట్టు పడవా
కత్తికోతలెదిరించే పోరు పొంగు ఎవరికుందో
బెదిరిస్తే లొంగక ఎవరి తల ఎగిసి
నిలుస్తుందో
అలా రగిలే అగ్గి భగ్గుమంటోంది గుండెలో
ఆయుధం గురి పెట్టి ఉన్నాడు శత్రువు అక్కడ
ఇక్కడ మేం గుండెలతో ఎదురొడ్డ సిద్ధం
దేశపు గడ్డు దశ ఇది ఆడుతాం నెత్తుటి హోలీ
ఇంటినుంచి తలపై చావు బట్ట కట్టుకుని వచ్చాం
చేతుల్లో ప్రాణాలతో వేస్తాం ప్రతి అడుగూ ముందుకే
మృత్యు సభా మందిరాన జీవితమే మాకు అతిథి
గుండెలో తుపాసుల దండు, శ్వాసలో దౌడు ఇంక్విలాబ్
శత్రువు మెలకువ పేల్చేస్తామిక ఆపకండి మమ్మల్ని
మాకు దూరం కాగల దమ్ము గమ్యానికెక్కడిది?

స్మరణ

రంగివ్వవే వసంతీ!

ఎర్రా ఎర్రని వసంతీ నీలా
నాకద్దిపోవే నీ కెంపూ వన్నెలూ

కెంపు వన్నె కెంపు వన్నె కెంపు వన్నెలూ
నాకద్ది పోవే, నా దుస్తుల రంగు నీవే
వసంతీ నా దుస్తులకు నీ కెంపునివ్వవే

దేశం కోసం ప్రాణాలిచ్చే కోరిక రగిలిందీ
వసంతీ ఓ వసంతీ రంగివ్వవే వసంతీ నీలా
ఒకమారీదారిన మరణం నూరు జన్మలకు సమానం
వీరుల త్యాగం చూసిన హృదయం పలికిందీ

వసంతీ ఓ వసంతీ రంగివ్వవే వసంతీ
రంగివ్వవే రంగివ్వవే రంగివ్వవే వసంతీ నీలా
నా దుస్తులకు నీ కెంపునివ్వవే వసంతీ
నీ కెంపుల ఉడుపులు ధరించే పోరె
ప్రాణం తృణ ప్రాయంగా వీర శివాజీ
నీ కెంపుల కవచ ధారిణి ఝాన్సీ రాణి
తన గౌరవ తారగ నిలిచె పోరులో
నేడా కెంపులె అద్దకాలుగా అద్దకాలుగా
దద్దరిల్లగా కదిలిందీ దేశభక్తుల దండు
వసంతీ ఓ వసంతీ రంగివ్వవే వసంతీ
రంగివ్వవే రంగివ్వవే రంగివ్వవే వసంతీ నీలా
నా దుస్తులకు కెంపునివ్వవే వసంతీ నీలా

హిందీ మూలం : రాంప్రసాద్ బిస్మిల్
నేపథ్య వివరణ, అనువాదం : రామతీర్థ
98492 00385

రచనలకు ఆహ్వానం

ఈ పేజీలో ప్రచురణార్థం రచయితల నుంచి సాహిత్య వ్యాసాలను, సాహిత్య విమర్శలను ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలను కంపోజు చేసి పంపేవారు సాఫ్ట్ కాపీని, పిడిఎఫ్‌ని కలిపి పంపాలి. సమకాలీన రచనలపై విమర్శనాత్మక వ్యాసాలకు ప్రాధాన్యం ఉంటుంది. సమీక్ష కోసం పుస్తకాలను పంపేవారు రెండు కాపీలను పంపాలి. పుస్తకాలను, వ్యాసాలను కింది చిరునామాకు పంపాలి. అక్షరం, ప్రజాశక్తి కార్యాలయం, ఎంబి విజ్ఞాన కేంద్రం, గవర్నరుపేట, విజయవాడ-2. prajasavvadi@gmail.com

బహుముఖి పోరాట యోధుడు బాపు

రామతీర్థ

సమాచార మాధ్యమాలు అతి తక్కువగా ఉన్నకాలంలో జన ప్రయోజన రాజకీయ ఆచరణను ప్రజలకు తెలియచేసిన విజయవంతమైన నాయకుడు గాంధీజీ. విస్తృత స్థాయిలో తన వ్యక్తీకరణలు చేరాలని భిన్న పద్ధతులు ఉపయోగించిన విలక్షణ సామాజికుడు ఆయన. నిజానికి పొలిటీషియన్ అంటే సామాజికవేత్త అనే అర్థం. అనంతరకాలంలో అది ఒక సంకుచిత అర్థంలో రాజకీయవేత్త అయింది. సమాచార సాంకేతిక వ్యవస్థలు అంతంతమాత్రంగా ఉన్నప్పుడు వందేళ్లక్రితం ఆయన ఏ విధానాల ద్వారా, ఏ వ్యక్తీకరణలద్వారా దేశ ప్రజలకు స్వాతంత్ర్య పోరాట అవసరాన్ని తెలియజేసి, బ్రిటిష్ సామ్రాజ్య దురహంకార వలసవాద ప్రభుత్వానికి సవాలుగా నిలిచారన్నది గమనిస్తే గాంధీజీ విలక్షణ శైలి వెల్లడవుతుంది. ఒకపక్క విశాల ప్రజారాశిని కూడగట్టి, ఉద్యమాన్ని విస్తృతం చేయడంతోపాటు, తన కాలపు ప్రధాన సమాచార వ్యవస్థ పత్రికలేనని గుర్తించి పాత్రికేయునిగా వారిలో జాతీయోద్వేగ భరిత స్వాతంత్ర్య పోరాట కాంక్షను రగిల్చారు. దక్షిణాఫ్రికాలో ఉండగా ఒక పత్రికకు, మన దేశంలో మూడు పత్రికలకు సంపాదకత్వం వహించిన గాంధీజీ ఉత్తమశ్రేణి పత్రికా రచయిత అని చెప్పవచ్చు.

దక్షిణాఫ్రికాలో భారతీయుల ఆత్మగౌరవ పోరాటం సమయంలోనే పత్రికల ద్వారా ప్రభుత్వంతో సంభాషించే సంస్కృతిని అలవరుచుకుని 'ఇండియన్ ఒపీనియన్' పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వర్తించారు. ఆ తర్వాత యంగ్ ఇండియా, హరిజన్, నవజీవన్ వంటి పత్రికలను నడిపారు. రాజకీయవేత్తలకు అవసరం అయిన మాటతీరు, ప్రసంగకళతోపాటు గాంధీజీకి రాత నైపుణ్యంకూడా ఉంది. ఏ విషయాన్నయినా గుజరాతీ, హిందీ భాషల్లో సూటిగా సరళంగా చెప్పడం ఆయనకే చెల్లింది. అన్నిటికీ మించి 'టైమింగ్'(సరైన సమయంలో ప్రబలమైన పని చేయడం)ను విజయవంతంగా అమలు చేశారు. కాంగ్రెస్ కేవలం సంపన్నులకు, మధ్యతరగతికి పరిమితమైన దశలో గాంధీజీ ప్రవేశించి పునాది వర్గాలైన అట్టడుగు ప్రజానీకం, రైతులు, పేదలతో సజీవ సంబంధాలు నెలకొల్పారు. చంపారన్, నీల్‌ఛాస్(నీలిమందు పంట పండించటం) రైతుల ప్రయోజనాలకోసం పనిచేశారు. బ్రిటిష్ పాలకులకు నిర్మాణాత్మక పోరాటం ఎలా ఉంటుందో చవిచూపించారు. బాబూ రాజేంద్ర ప్రసాద్ వంటి బీహార్ యువ నేతలతో అధ్యయనం చేయించి వందలాదిమంది రైతుల కడగండ్ల గురించి సవివరమైన నివేదికను రూపొందించి బ్రిటిష్ ప్రభుత్వానికి సమర్పించారు. మొదట్లో గాంధీజీని కట్టడి చేయడానికి ప్రయత్నించి విఫలమైన ప్రభుత్వం చివరకు ఆ నివేదిక ఆధారంగా 1918 ఫిబ్రవరిలో నీలిమందు రైతుల కష్టాలను తీర్చడానికి చంపారన్ వ్యవసాయ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. తదుపరి కాలంలో అహ్మదాబాద్ కార్మికుల హక్కుల పోరాటం, రౌలట్ బిల్లు వ్యతిరేక ఆందోళన, సహాయ నిరాకరణ, సత్యాగ్రహం, చౌరీచౌరా జనాగ్రహం వంటి పరిణామాలు సాగుతున్నా భారత జాతీయోద్యమం పట్ల ప్రపంచ దృష్టి ఉండాల్సిన స్థాయిలో లేదని గాంధీజీ భావించారు. ఉప్పు సత్యాగ్రహం సమయానికి సమాచార రంగంలో కీలక మార్పు చోటు చేసుకుంది. 1929లో ఇంపీరియల్ కమ్యూనికేషన్స్ కంపెనీ అంతవరకూ పరిమితంగా ఉన్న కేబుల్ సమాచార వ్యవస్థను అట్లాంటిక్ సముద్రానికి ఆవల ఇంగ్లాండ్, యూరప్, బ్రిటిష్ వలసపాలిత ప్రాంతాకు విస్తరించింది. ఈ వ్యవస్థ ద్వారా వార్తలు అతి వేగంగా ప్రపంచానికంతకూ చేరతాయని గ్రహించిన గాంధీజీ, ఇతర నాయకులు దండియాత్ర, సత్యాగ్రహం వంటి పోరాటాలపై ప్రపంచ పౌరుల్లో అవగాహన పెంచారు. దీని ఫలితంగా మన స్వాతంత్ర్య పోరాటంపై అంతర్జాతీయంగా ఆసక్తి ఏర్పడింది. మనకు నైతికంగా మద్దతునిచ్చేవారు అంతకంతకు పెరిగారు.



గాంధీ ఇంగ్లీష్ సంతకం అందరికీ తెలిసిందే. కాని తెలుగువారి కోసం ఆయన తెలుగులో చేసిన అరుదైన సంతకం పైన చూడవచ్చు.



1930-31ల్లో టైం మేగజైన్ ముఖచిత్రాలు

అమెరికా నుంచి వెలువడే టైమ్ పత్రిక రెండేళ్లలో రెండుసార్లు–1930లో 'సెయింట్ గాంధీ' అంటూ, 1931లో 'మాన్ ఆఫ్ ద ఇయర్' అంటూ గాంధీజీపై కవర్ పేజీ కథనాలను ఛాయాచిత్రాన్ని ముఖపత్రంగా ప్రచురించింది. ఆయన గ్రామగ్రామాన సాగించిన యాత్రలపై అంతర్జాతీయ మీడియాలో ప్రముఖంగా కథనాలు వెలువడటం బ్రిటిష్ పాలకుల్లో కూడా మార్పు తెచ్చింది. దండియాత్రకు ముందు చర్చలకు సిద్ధమని, అవసరమైతే యాత్ర కూడా నిలుపుదల చేస్తామని గాంధీజీ చెప్పినా పట్టించుకోని ఆ పాలకులు ఆ తర్వాత పునరాలోచనలో పడి చర్చలకు ఆహ్వానించారు. ఫలితంగా గాంధీ–ఇర్విన్ ఒడంబడిక సాధ్యపడింది. ఉప్పు సత్యాగ్రహం సందర్భంగా సాగిన ఆందోళనలు, అరెస్టులు, లాఠీచార్జ్‌ల గురించి అమెరికన్ పాత్రికేయుడు వెబ్ మిల్లర్ పంపిన వార్తాకథనం గమనిస్తే ఆ ఆందోళన ఏ స్థాయిలో జరిగిందో అర్థమవుతుంది. 'ఒక్క సత్యాగ్రహి కూడా తనపై పడుతున్న దెబ్బలను ప్రతిఘటించలేదు. ఏ రక్షణా లేని తలలపై లాఠీ దెబ్బలు పడే శబ్దం నాకు వెగటు, రోత కలిగించింది. మైదానమంతా తలలు పగిలినవారూ, భుజాల ఎముకలు విరిగినవారూ చేస్తున్న రోదనలతో నిండిపోయింది. వారి తెల్లని దుస్తులపై రక్తం మడుగులు కట్టింది. వరుసలో మిగిలినవారు కూడా ఏ మాత్రం జంకకుండా తమ వంతు వచ్చేవరకూ నడిచి పోలీసుల ముందుకు రావడం, దెబ్బలు తినిపడిపోవడం కనబడింది. ఈ అహింసాత్మక నిరసనకు పోలీసులు విసుగుచెంది ఒక్కుమ్మడిగా సత్యాగ్రహులందరిపై విరుచుకుపడి ఎక్కడబడితే అక్కడ లాఠీలతో బాదారు. వారిని వంద అడుగుల వరకూ ఈడ్చుకెళ్లి పక్కనున్న పొదలు, తుప్పల్లోకి లాగి పారేశారు'. ఈ ఉద్యమంపై రూపొందిన మిల్లర్ నివేదికను బయటకు పొక్కకుండా ఆపేందుకు బ్రిటిష్ పాలకులు విశ్వ ప్రయత్నం చేశారు. చివరకు ప్రపంచ ప్రజల ఆగ్రహానికి జడిసి దాన్ని బయటపెట్టారు. ప్రపంచవ్యాప్తంగా 1,350 పత్రికలు దాన్ని ప్రచురించాయి. భారత్‌ను తాము న్యాయబద్ధంగా పాలిస్తున్నామంటూ వలస పాలకులు చెబుతున్నదంతా బూటకమని దండియాత్ర దండోరా వేసింది. వారి పాలనపై దండి సత్యాగ్రహం తొలి గొడ్డలి వేటు.

భిన్న మార్గాల్లో ప్రజలతో నిరంతరం సంబంధబాంధవ్యాలను నెలకొల్పుకోవటం, సాధారణ దుస్తులు ధరించి సామాన్యులతో కలిసిపోవటం గాంధీజీకే చెల్లింది. శ్రేయోదాయక సామాజిక లక్ష్యాన్ని సంకల్పించి, అందుకోసం ఎంతగానో కృషి చేసి తన జీవితకాలంలోనే దాన్ని సాధించిన అరుదైన ప్రపంచ రాజకీయ నాయకుల్లో గాంధీజీ ముఖ్యులు. నిరంతర జన సంపర్కం, నిరాడంబరత, పట్టుదల, అద్భుతమైన భావవ్యక్తీకరణ ఆయన నుంచి ఈ తరం నేర్వదగిన గొప్ప సుగుణాలు. ఈ ఏడాది పొడవునా దేశ ప్రజలు జాతిపితను భిన్న కోణాల్లో అధ్యయనం చేయడం ద్వారా ఆయన స్ఫూర్తి పరివ్యాప్తం కావడానికి కృషి చేస్తారని ఆశిద్దాం.

–రామతీర్థ, ప్రముఖ కవి ః మొబైల్: 9849200385

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు,భాద్రపద మాసం,తిథి బ.అష్టమి రా.12.25 వరకు,తదుపరి నవమి, నక్షత్రం ఆరుద్ర రా.11.01 వరకు,తదుపరి పునర్వసు,వర్జ్యం ఉ.8.21 నుంచి 9.54 వరకు,దుర్ముహూర్తం ఉ.8.16 నుంచి 9.03 వరకు తదుపరి రా.10.37 నుంచి 11.25 వరకు అమృతఘడియలు ప.1.37 నుంచి 3.06 వరకు.

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం : 5.47
రాహుకాలం : ప. 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
టోల్ ఫ్రీ నం: 1800 270 1083

33 ఏళ్ళకు మళ్లీ ఏపీ సాహిత్య అకాడెమీ!

కొద్దిరోజుల ముందర ఆంధ్రప్రదేశ్ సాహితి అకాడెమీ ఏర్పాటు పూర్తిస్థాయి ప్రకటన వెలువడింది. ముప్పై మూడేళ్ళ తరువాత, తెలుగు రచయితలకు ఈపాటి ఆలంబన ఏర్పడడం జరుగుతున్నది. అలనాడు 1980ల్లో ఎన్టీఆర్ ప్రభుత్వం అటు మద్య నిషేధం, ఇటు అకాడెమీల రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నది. అకాడెమీలను తెలుగు విశ్వవిద్యాలయం పరిపాలనా వ్యవహారాల్లో భాగం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. మద్యనిషేధంపై కొద్దికాలంలోనే సమీక్ష జరిగి దాన్ని తొలగించారు. అది రెవెన్యూకి, ప్రభుత్వాదాయానికి సంబంధించిన విషయం కావడంవల్ల సత్వర నిర్ణయం తీసుకున్నారు అనుకున్నా, తరువాత వచ్చిన ఏ ప్రభుత్వం కూడా రాష్ట్రంలో సాహిత్య, సంగీత, నాటక అకాడెమీలు అవసరం అని భావించలేదు. అది వారికి ఎన్నికలలో కలిసివచ్చే అంశమూ కాదు. కానీ జాతి సాహిత్య సాంస్కృతిక స్థాయికి చాలా అవసరమైన ప్రభుత్వ కట్టుబాటు, అంకితభావనలకు చెందినది. ఇది లేకపోతే ఏమి నష్టం జరగాలో, అదే తెలుగువారికి గత 35 ఏళ్ళుగా జరుగుతున్నది.

అలా 1956 తరువాత, దక్షిణాది రాష్ట్రాల్లో అటు కేరళ, 1961లో కర్నాటకలో ఏర్పడ్డ ఆ రాష్ట్రాల సాహిత్య అకాడెమీలు నేటికీ అరవై ఏళ్ళు పైబడి పనిచేస్తూ ఉండగా, మనం తెలుగు ప్రజలం మాత్రం, మన పని రాజకీయ వర్గాల పుణ్యమాని మధ్యలోనే గండికొట్టబడి, గత మూడున్నర దశాబ్దాలుగా, సాహిత్య అనాథలుగా బతుకుతూ వచ్చాము. తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించే వార్షిక పురస్కారాలు కొంత లోటు దీర్చినా, కొందరి పేర్లపై వారి కుటుంబ సభ్యులు, తెలుగు విశ్వవిద్యాలయ నిర్వహణలో జరిగేలా ఎండోమెంటులు ఇచ్చి 'ధర్మనిధి పురస్కారాలు' అంటూ కొంత కార్యక్రమాలు జరిగినా, అవేవీ కూడా, ఒక రాష్ట్ర సాహిత్య అకాడెమీ స్థాయిని చేరుకునే అంశాలు కావు.

పూర్తిగా తెలుగు సాహిత్య, సాంస్కృతిక సమాజం ఎటువంటి ప్రభుత్వ గుర్తింపు, మద్దతు లేకుండా 1985 నుంచీ 2019 వరకూ అవస్థలు పడుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, రెండేళ్ళ కిందటలో ఒక భాషా దినోత్సవం నాడు, ఏడు అకాడెమీలు ఏర్పాటుచేస్తామని ప్రకటించింది. గత ఏడాది నాటక అకాడెమీ ఏర్పాటుచేశారు. ఈ ఏడాది సాహిత్య, సంగీత అకాడెమీలకు కూడా ముందు ఛైర్మన్‌లను ప్రకటించి, కొద్ది రోజుల ముందరే కమిటీల విషయమై స్పష్టత, సభ్యుల వివరాలు ప్రకటించారు. ఆచార్య కొలకలూరి ఇనాక్ రాష్ట్ర సాహిత్య అకాడెమీ అధ్యక్షులుగా, వందేమాతరం శ్రీనివాస్ సంగీత అకాడెమీ అధ్యక్షులుగా జానపద కళలు అకాడెమీకి పొట్లూరి హరికృష్ణ అధ్యక్షులుగా నియమితులయ్యారు. రచయితలు అట్టాడ అప్పలనాయుడు ఉపాధ్యక్షులుగా, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, జగద్ధాత్రి, కత్తిమండ ప్రతాప్, రసరాజు, పాటిబండ్ల రజని, కంతేటి శివరామ్ కుమార్, పి.దక్షిణామూర్తి, నాగభైరవ ఆదినారాయణ, ఆర్.ఎం.ఉమామహేశ్వరరావు, వి.ఆర్.రాసాని సభ్యులుగా ప్రకటించారు.

తెలుగు సాహిత్యంలో ఎనభై ఏళ్ల వయసులో, నిరంతర శ్రమ, సాహిత్య రచన, అనువాదాలు, సాహిత్య వ్యాసాలు వెలువరిస్తూ, తన కృషికి తగు గుర్తింపులు పొందుతూ వస్తున్న సృజనశీలిగా, ఇనాక్‌గారి ఎంపిక, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అధ్యక్షులుగా సరైనది. క్రియాశీలకంగా ఎన్నో పదవులు నిర్వహించిన అనుభవశాలిగా కొలకలూరి ఇనాక్‌గారి మార్గదర్శకత్వంలో కొలువుదీరే ఈ అకాడెమీ ముందర పనుల దొంతర ఉన్నది. ఇతర దక్షిణాది రాష్ట్రాల సాహిత్య అకాడెమీలతో పోలిస్తే, మనం మూడున్నర దశాబ్దాలుగా వెనుకబడి ఉన్నాము. అరవై ఏళ్ళకు మించి నిరంతర కృషి, సమిష్టి భాగస్వామ్యం, ప్రభుత్వాల మద్దతుతో అటు కర్నాటక, ఇటు కేరళ అకాడెమీలు కూడా చాలా ప్రగతి సాధించిన సందర్భంలో, ప్రస్తుతం తెలుగు సాహిత్య అకాడెమీ రూపొంది, తన కార్యక్రమ ప్రణాళికను సిద్ధం చేసుకోవలసి ఉన్నది. దీనికై ముందర, అకాడెమీ ఏర్పడగానే, రచయితల బృందాలు అటు కర్నాటక, ఇటు కేరళ అకాడెమీలు కూడా చాలా ప్రగతి సాధించిన సందర్భంలో, ప్రస్తుత తెలుగు సాహిత్య అకాడెమీ రూపొంది, తన కార్యక్రమ ప్రణాళికను సిద్ధం చేసుకోవలసి వున్నది.

దీనికై ముందర, అకాడెమీ ఏర్పడగానే, రచయితల బృందాలు, అటు కర్నాటక, ఇటు కేరళ రాష్ట్రాలకు అధ్యయన యాత్రలుగా వెళ్లి, అక్కడ, ఈ ముప్పై అయిదేళ్లుగా జరుగుతూ వచ్చిన ప్రగతిని ఆకళింపు చేసుకోవాలి. ఈ రెండు రాష్ట్రాల్లో అకాడెమీలు డిజిటల్ ప్రతులుగా సాహిత్యాన్ని భద్రపర్చడంలో ముందంజవేశాయి. రచయితలకు గుర్తింపులు, ప్రయాణ / పరిశోధన గ్రాంట్‌లు, పురస్కారాలు అందించడంలో మంచి కృషి చేస్తున్నాయి. అనువాద లక్ష్యాలను ఖరారు చేసుకుని కూడా తమ భాషా సాహిత్యాలు, తగు సమయంలో దేశంలో ఇతర భాషలకు, ఆంగ్లంలోనికి చేరేలా పనిచేస్తున్నారు.

2015లో కన్నడ సాహిత్య అకాదమీ అయిదుగురు రచయితలకు జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేసింది. ఏదో ఒక సాహిత్య ప్రక్రియలకు ఒక ఏడాది కాకుండా, భిన్న సాహిత్య శాఖల్లో తమ వార్షిక పురస్కారాలను ప్రకటిస్తున్నది. అలా చూసుకుంటే, ఏకంగా పదహారు మంది రచయితలకు సాహిత్య విశిష్ట పురస్కారాలు అందజేసింది. ఇవి కాకుండా ఎండోమెంట్ అవార్డులుగా అచ్చులో వున్న పుస్తకానికి సహాయాలు, అలాగే నవల, ఆత్మకథ, సాహిత్య విమర్శ, సృజనాత్మక అనువాదం, తొలి రచనకి అవార్డు, కన్నడ నుంచి ఇంగ్లీషుకి అనువాదం- ఇలా దాదాపు ఇరవై మూడు రంగాల్లో సాహిత్య ప్రగతి, పరిణామ దశలకు తాను ప్రోత్సాహ వేదికగా నిలుస్తున్నది. ఒక ఏడాదికి ఒకరికే అవార్డు అనే రోజులు పోయాయి. బహుళ రూపాల్లో సాహిత్య రచన, సమాజాన్ని చిత్రించే రోజుల్లోకి వచ్చాము. ఆ రూపాలనన్నిటినీ ఇతర అకాడెమీలు గుర్తిస్తున్నట్టే మనం కూడా చేయాలి. అనువాదాలు రియల్ టైమ్‌లో అంటే, ఒక మంచి రచన వచ్చిన రెండు మూడేళ్లలో జరిగేలా, అక్కడి అకాడెమీలు శ్రద్ధ తీసుకుంటున్నాయి. మనమూ పాటించవలసిన మంచి క్రమశిక్షణ ఇది. కన్నడ దేశంలో, ఈ సాహిత్య అకాడెమీ మాత్రమే కాకుండా, కన్నడ అనువాద పరిషత్ కూడా వున్నది. కర్నాటక సాహిత్య అకాడెమీని డైరెక్టరేట్ ఆఫ్ కన్నడ మరియు కల్చర్ శాఖ ప్రభుత్వ నిధులతో అటానమస్ సంస్థగా నడుపుతున్నారు. 1961 నుంచీ ఈ సంస్థ పనిచేస్తున్నది. ట్రావెల్ గ్రాంట్లు, సెమినార్లు, వర్క్‌షాపులు, సాహిత్య షార్ట్ ప్రైస్ గ్రాంట్స్, యువకవి సమ్మేళనాలు వీరి సాధారణ వార్షిక కార్యక్రమాలుగా రాష్ట్రం అంతటా జరుగుతున్నాయి.

1956 నుంచి త్రిసూర్‌లో కేరళ సాహిత్య అకాడెమీ పనిచేస్తున్నది. ఇది కూడా అటానమస్ సంస్థ. పాలన వ్యవహార మండలి రచయితలతో కూడి ఉండగా, ఆర్థిక మండలి, జిల్లా కలెక్టర్ నియంత్రణలో పనిచేస్తున్నది. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ప్రతినిధులు కూడా ఈ సభ్య మండలిలో ఉంటారు. సాహిత్య చక్రవలం మాసపత్రిక, సాహిత్యలోకం ద్వైమాసిక పత్రిక, అలాగే మలయాళం లిటరేచర్ సర్వేపై ఒక త్రైమాసిక ఆంగ్లంలో నడుపుతున్నారు. మలయాళం, ఇంగ్లీష్‌లో విరివిగా సాహిత్య అకాడెమీ పుస్తక ప్రచురణలు చేస్తున్నది. ఏడాదికి ఎనిమిది మంది సాహిత్యవేత్తలకు పురస్కారాలు అందజేస్తున్నది. కవిత్వం, నవల, కథ, నాటకం, సాహిత్య విమర్శ, ఆత్మకథ, జీవిత కథ, యాత్రా సాహిత్యం, బాలల సాహిత్యం, హాస్యరచనలు, భాషా శాస్త్ర రచనలు, అనువాదం, అలాగే జీవితకాల సాహిత్యరంగ సేవలకుగాను అయిదుగురికి ప్రత్యేక అవార్డులు వీరు 2016లో ప్రకటించారు.

ఇలా చూస్తే, దక్షిణాదిలో తెలుగు అగ్రగామి భాషగా, మనం రూపొందించుకోవలసిన లక్ష్యాలు, వీరు అమలుపరుస్తున్న వాటికి అవకాశం ఇస్తూ, మన సాహిత్య ఉన్నతి, జరుగవలసిన పరిశోధన రంగాలకు తగు విలువ, భాషా శాస్త్ర నిర్మాణాలు, భాష ఆధునీకరణ ప్రాగ్రూపాలు నమోదయ్యే ప్రణాళికలు, పుస్తకాల ప్రచురణలు, డిజిటల్ ప్రక్రియ, స్పష్టమైన లక్ష్యాలతో సాహిత్య అనువాద విధానం, రచయితల సమాజానికి పని ప్రగతితో కూడిన ఖచ్చితమైన ప్రోత్సాహాలు, అకాడెమీ తరపున తెలుగు, అలాగే ఇంగ్లీష్ భాషల్లో, మాస, ద్విమాస పత్రికలు ప్రచురణ, ట్రావెల్ గ్రాంట్‌లు, విరివిగా పనుల కాలెండర్ తయారుచేసుకుని తెలుగు సాహిత్య అకాదమీ, వెనుకబడ్డ వాస్తవాన్ని గుర్తించి, వేగంగా, లెవెల్ ఫీల్డ్‌కి వెళ్ళే రోడ్ మాప్ (దారిపటం) ఆవిష్కరణ అమలు, ఆచరణాత్మక సమీక్షలతో ముందుకు వెళ్తే తప్ప, కనీసం మనం తోటి దక్షిణాది భాషలు అకాడెమీల రూపేణా సాధించిన ప్రగతిని అందుకోలేము.

ఇందుకై, వైస్ ఛాన్సలర్‌గా పనిచేసి, దశాబ్దాల బోధనానుభవం, పాలనానుభవం గలవారు, పలు గుర్తింపుల గౌరవాలు పొందిన సీనియర్ రచయిత, ఉదార దృష్టిగల ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాదమీ అధ్యక్షులుగా, వారు వారి బృందం ముందరున్న కార్య సంభరిత సదవకాశాలు, తెలుగు జాతి గర్వించేలా ఫలితాలు అందించాలని, అస్తిత్వం కోల్పోయిన మూడున్నర దశాబ్దాలకు తిరిగి ఏర్పడ్డ అకాడెమీకి తెలుగు ప్రజలు స్వాగతం పలుకుతున్నారు. పూర్ణకుంభం లోగోగా గల మన రాష్ట్ర సాహిత్య అకాడెమీ, కళాభవన్ సైఫాబాద్ నుంచి పనిచేసింది. ఈ లోగో మనం ఇప్పుడు కూడా వాడుకోవచ్చును. ఇలా ఎన్నో సాహిత్య సంక్రాంతులకు మళ్లీ వీరు శ్రీకారం చుట్టి, సాహిత్య, సామాజిక సర్వతోముఖ వికాస హేతువులుగా వీరి ఆచరణ ఉండాలని హృదయపూర్వకంగా ప్రజలు ఆశిస్తున్నారు.

- రామతీర్థ, 9849200385

శూన్యంలోంచి .. శూన్యంలోకి ...

సాహిత్యమే శ్వాసగా బతికారు ఇద్దరూ. ఎక్కడ ఏ సాహిత్య సభ జరిగినా వారిద్దరి హాజరూ తప్పనిసరి. ఆయన ప్రసంగ ఝరి. ఆమె ఆత్మీయ సిరి. రామతీర్థ – జగద్ధాత్రి అంటే విడదీయలేని ప్రేమానుబంధం. ఎక్కడ తారాడినా ఒక గురుతుగా ప్రవహించే సుగంధ చందం.

రామతీర్థతో జగద్ధాత్రి (ఫైల్ ఫోటో)

ఈ ఏడాది మే 30. ఆ జంటలో ఒక సాహిత్య నగం రామతీర్థం ఆకస్మికంగా వొరిగిపోయింది. అప్పుడే ఆమె సగం 'ప్రాణం' పోయింది! ఎప్పుడూ చిరు నగవులు చిందే మోము వాడిపోయింది. మాటల్లో జలపాత జోరు స్తంభించిపోయింది. ఉత్తరాంధ్ర వెటకారం మూగవోయింది.

ఓరోజు ఫోన్లో 'ఎలా ఉన్నారు' అనడిగితే– 'ఉండాలో లేదో తేల్చుకోలేకపోతున్నాను' అన్నారు జగద్ధాత్రి.

'అయ్యో. అలా అనకండి. మీరు చేయాల్సింది చాలా ఉంది. రామతీర్థ చాలా మిగిల్చి వెళ్లిపోయారు. అవన్నీ మీరు చేయాలి.' అన్నాను.

జగద్ధాత్రి ప్రేమతోనూ, ప్రేమలోనూ బతికే మనిషి. బయటి ప్రపంచం ఏమాత్రం తెలీని మనిషి. నిత్యం రామ్ రామ్ అని కలవరించిన మనిషి. రామ్‌ని కోట్ చేయకుండా, రామ్‌ని తలవకుండా, రామ్‌ని పిలవకుండా మాట్లాడ్డం ఎరగని మనిషి. రామే సర్వస్వంగా బతికిన మనిషి. రామ్ నిష్క్రమణంతో ఒంటరై పోయింది. ఒంటరితనమై పోయింది.

దాన్నించి బయటపడటానికి ప్రయత్నమూ చేసింది.

'ఒక కథ రాశాను. పంపిస్తాను' అన్నారొక రోజు.

చాలా సంతోషం వేసింది.

'వెంటనే పంపండి' అన్నాను.

శూన్యంలోంచి బయటపడటానికి అది గట్టి ప్రయత్నం అనుకున్నాను. కథ (రేపటి టీచర్లు) పంపారు. ఆ రెండో వారమే (జులై 13, 2019) ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహలో వేశాము.

'థ్యాంక్స్' అన్నారు.

'ఇంకా రాయండి' అన్నాను.

రాస్తానని మాటిచ్చారు.

మరిన్ని రాస్తారనే అనుకున్నాను.

మరోసారి అడిగారు : 'ప్రజాశక్తిలో అనువాదాలు ఏమన్నా ఉంటే ఇవ్వండి. చేస్తాను ..' అని. 'కచ్చితంగా... బాధ్యులకు చెపుతాను' అన్నాను. రెండు వారాల క్రితం ప్రజాశక్తి బుక్ హౌస్ రచయితలూ, అనువాదకులతో జరిపిన సమావేశానికి రమ్మని పిలిచాము. ఆ ఆదివారం వైజాగ్లో కార్యక్రమం ఉందని, ఈసరికి రాలేనని అన్నారు. మరోసారి వస్తారని అనుకున్నాను.

నెమ్మది నెమ్మదిగా ఒంటరితనం నుంచి బయట పడుతున్నారనే అనిపించింది. కానీ, దాన్లో కూరుకుపోతున్నారని అనుకోలేదు. అదే మింగేస్తుందని అనుకోలేదు..

ఆమె సున్నితమైన భావుకురాలు. గతంలో తన మరదలు అకాలంగా చనిపోతే – కుంగిపోయారు. అప్పుడు రామతీర్థ వెన్నంటి ఉన్నారు. ఇప్పుడు రామతీర్థే ఆ వెలితికి, శూన్యానికీ కారణం అయ్యారు. అమ్మలా, అక్కలా, మంచి స్నేహితురాలిలా అందరితో అల్లుకుపోయిన జగతి తనను తానే ఒంటరిని చేసుకొని– శూన్యంలోకి, అనంత బాధాంబుధిలోకీ జారిపోయింది!

తెలుగు సాహిత్యరంగం నెలల వ్యవధిలో ఒక సాహిత్య జంటను కోల్పోయింది. ఒక అరుదైన, అపురూపమైన సాహిత్య స్నేహం విషాదంగా ముగిసిపోయింది! మిత్రులకు జగమంత దుఃఖం మిగిల్చి .. ఆమె సహ చరణ గీతం ఆలాపిస్తూ.. వెళ్లిపోయింది!

– సత్యాజీ

ఘాజీపై సాహితీవేత్తల అటాక్

- చరిత్రను వక్రీకరించి సినిమా తీయడం దారుణం
- సాహితీవేత్త రామతీర్థ విమర్శ

సీతంపేట(విశాఖ నార్త్) : కళాత్మక స్వేచ్ఛ పేరుతో చరిత్రను వక్రీకరించడం సిగ్గుచేటని ప్రముఖ సాహితీవేత్త, విమర్శకుడు రామతీర్థ విమర్శించారు. ఇటీవల విడుదలైన ఘాజీ (ది అటాక్) సినిమాపై మొజాయిక్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ పరిశీలనాత్మక చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రతో తమకు సంబంధం లేదని చెప్పుకుంటున్నా, సినీ నిర్మాతలు వాడుకున్న ఘాజీ పేరుగానీ, ఈస్ట్రన్ నావల్ కమాండ్ గానీ, 1971 యుద్ధంగానీ భారత, పాకిస్తాన్ దేశాల చరిత్రలో అవిభాజ్యమైనవని తెలిపారు. వాస్తవాలు వక్రీకరించి సినిమా తీయడంలో అర్థమేంటో బోధపడడంలేదన్నారు. ఘాజీ సినిమాలో రెండు సబ్‌మెరైన్ల మధ్య యుద్ధంగా చూపించారని, కానీ వాస్తవంగా ఆ విధంగా జరగలేదని ఖండించారు. వాస్తవంగా, ఘాజీ చిట్టగాంగ్ రావడానికి కరాచీ నుంచి బయలుదేరి అరేబియా మహాసముద్రం, శ్రీలంక మీదుగా 3వేల కిలోమీటర్లు ప్రయాణించి హిందూ మహా సముద్రంలోకి ప్రవేశించి విక్రాంత్‌ను ధ్వంసం చేయడానికి నిరీక్షించిందన్నారు. ఈ విషయం తెలుసుకున్న ఇండియన్ నేవీ విశాఖ తీరంలోనే విక్రాంత్ ఉందన్న భ్రమ కల్పించారన్న విషయం చిత్రంలో రాలేదన్నారు. ఆనాటి వైస్ అడ్మిరల్ నీలకంఠకృష్ణన్ వ్యూహంలో భాగంగా విక్రాంత్ ఇక్కడ ఉన్నట్లుగా ఘాజీకి ఎరవేసినట్లు పేర్కొన్నారు.

మాట్లాడుతున్న రామతీర్థ

విక్రాంత్‌ను మట్టుబెట్టడం, లేదా విశాఖ ఓడలు వచ్చి చానల్‌ను ధ్వంసం చేయడమే లక్ష్యంగా ఘాజీ వచ్చిందన్నారు. విక్రాంత్ విషయాన్ని పూర్తిగా విస్మరించి ఈస్ట్రన్ నావల్ కమాండ్ పేరుతో ఇంకొక సబ్‌మెరైన్‌ను ప్రవేశపెట్టి, రెండింటి మధ్య యుద్ధం జరిగినట్లు చిత్రంలో చూపారని, ఇది వాస్తవానికి పూర్తి విరుద్ధమని ఖండించారు. చరిత్రతో ముడిపడిన చిత్రాలు తీసేటప్పుడు పూర్తివాస్తవాలు తెలుసుకొని నిర్మించాలన్నారు. లేదంటే చరిత్ర తెలియని భావితరాలు చిత్రంలో చూపిందే వాస్తవమని నమ్మే ప్రమాదముందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రచయితలు జగద్ధాత్రి, మాటూరి శ్రీనివాస్, వృద్ధుల కల్యాణరామారావు పాల్గొన్నారు.

సాక్షి Mon, 27 February 2017
epaper.sakshi.com//c/17166889

సాహితీ సేవకులకు కన్నీటి అక్షరాంజలి

సాహిత్యమే ఊపిరిగా జీవించిన రామతీర్థ

17-7-1960 న పలాసలో పుట్టిన యాబలూరు సుందర రాంబాబు రామతీర్థగా సాహితీలోకంలో సుపరిచితుడు. తెలుగు, ఇంగ్లిష్, బెంగాలి, ఒరియా, ఉర్దూ భాషా సాహిత్యాలను మధించాడు. 1961లో పారాదీప్‌లో కార్మిక రక్షణ విభాగంలో ఉద్యోగం చేసి, శ్రీమతి కామేశ్వరిని పెళ్ళాడి, విశాఖకు బదిలీ అయ్యి ఇక్కడే స్థిరపడి అనునిత్య సాహితీ సేవలో ధన్యుడయ్యాడు. తెల్ల మిరియం కవితా సంపుటి, శతాబ్ది శ్రీశ్రీ, జన స్వరాంజలి, టాగూర్ నాటిక పోస్టాఫీస్‌కు అనువాదం, కన్యాశుల్క కవితోత్సవం, డా. రాచకొండ నరసింహశర్మ ఆంగ్ల కవితలకు అనువాదం 'అన్నపూర్ణాక్షరం' నిర్భయ జ్యోతి మొదలైన రచనలతో 'సంఘటనాత్మక కవి'గా సుప్రసిద్ధుడయ్యాడు. ఎక్కడ అన్యాయం జరిగినా నిరసన గళం వెంటనే వినిపించిన చైతన్యమూర్తి. ఆయన ఆలోచన, ఆవేశం అక్షరాలలో దూరి కదిలిస్తాయి. మృగాడు, హీరోగి, శెనిమా, రేప్ క్లాక్ వంటి పదాలను కాయినేజ్ చేశాడు. గురజాడ, వీరేశలింగం అంటే వీరాభిమాని. వీరి భావనా విలువలు సమాజంలోకి చొచ్చుకు పోయేందుకు శ్రమించాడు. 2003లో సాహితీ బాంధవి జగద్ధాత్రితో కలిసి మొజాయిక్ సాహితీ సంస్థ స్థాపించి, జాతీయ సదస్సులు, సెమినార్లు, పుస్తకా విష్కరణలు, ఒరియా కవుల పరిచయాలు, సమీక్షలు, చర్చలు వంటి అనేక సాహిత్య కార్యక్రమాలు పబ్లిక్ లైబ్రరి వేదికగా నిర్వహించాడు. అమెరికాలోని న్యూయార్క్‌లో నల్లజాతి వారి నిరసన గళం వినిపించే సాహిత్య సంస్థ 'మొజాయిక్'. ఆ పేరునే ఎంచుకోవటంలో రామతీర్థ ఆలోచన, ఆచరణ కనిపిస్తాయి. ఇదొక కళ కూడా. చిన్నచిన్న రంగు పలకలతో గోడలపై నగిషీలతో చిత్రాలను అద్దే కళ. అంటే భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అన్నమాట. 'మండే మొజాయిక్' పేర ప్రతి సోమవారం సాయంత్రం లైబ్రరీలో సాహితీ సందడి చేసేవాడు. మొజాయిక్ పత్రికతోపాటు వారం వారం వెబ్ మాగజైన్ ప్రచురించాడు. మొజాయిక్ తరఫున 10 వేల రూపాయల పారితోషికం ఏర్పాటు చేసి మొదటగా 2019 శ్రీ ఉపాధ్యాయుల నరసింహం గారికి అందజేశాడు. మొజాయిక్ సాహిత్య సురభి, రిత్విక్ ఫౌండేషన్ కలిసి 'అక్షర గోదావరి' పురస్కారాలు అందించాడు. చలం కథలను పాత్రాభినయం చేశాడు. విశాఖ రేడియో కేంద్రం నుంచి ఉత్తరాంధ్ర ప్రాముఖ్యతను 'సాహితీ సమీరాలు'గా తెలియ జేశాడు. ప్రముఖ ఆంగ్లకవి టి.ఎస్.ఇలియట్ 'వేస్ట్ లాండ్'ను 'వృధా ధాత్రి'గా అనువదించటమేకాక 'సత్యవతీ

వార్త: ఏప్రిల్ 28, 29, 30 తేదిలలో విజయవాడలో 'విప్లవ రచయితల సంఘం' అధ్వర్యంలో వరవర రావు, సాయిబాబు తదితర జాతీయ రచయితల విడుదల కోరుతూ ధర్నా కార్యక్రమం జరిగింది.

సమాజం, సాహిత్యం, సాంస్కృతికత, సాంకేతికత, సార్వజనీనత లక్ష్యంగా
గత పదేళ్ళుగా ఎన్నో కొత్త దారులు వేసిన విలక్షణ సాహిత్య వేదిక

మొజాయిక్ సాహిత్య సంస్థ

మొజాయిక్ సాహిత్య సంస్థ
దశాబ్ది ఉత్సవ సభా పర్వం

17, 18, 19 ఆగష్టు 2014 తేదీలలో సా॥ 5.30 గం॥లకు
విశాఖ పౌర గ్రంథాలయం ఏ.సి. సమావేశ మందిరంలో జరిగే
ఈ విశేష కార్యక్రమాలకు మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాము.

17-08-2014

స్వాగతం : జగద్ధాత్రి
అధ్యక్షత : ఎల్.ఆర్. స్వామి
దశాబ్ది ఉత్సవాల ప్రారంభకులు
డా॥ కాళీపట్నం రామారావు
ఎస్కే ఫౌండేషన్ అధ్యక్షులు
డా॥ కె. ఎన్. రావు గారికి
సుమాంజలి
దశాబ్ద ప్రస్తావన
డా॥ డి.వి. సూర్యారావు
ఆత్మీయ స్పందన
డా॥ బి.ఎస్.ఆర్. మూర్తి
పేరి రవికుమార్
చీకటి దివాకర్
విజయభాను కోటే
సౌహార్ద కామన - సీతారాం

" పూలండోయ్ పూలు "

ప్రసాదమూర్తి
కవిత్వ సంపుటి
ఆవిష్కరణ
అమిత్ దహియా బాద్‌షా
సమీక్ష : ఖాదర్ మొహియుద్దీన్

" సిక్స్త్ ఎలిమెంట్ "

ముఖ్వా శ్రీనివాసరావు
కవిత్వ సంపుటి
ఆవిష్కరణ
చలసాని ప్రసాద్
సమీక్ష : నండూరి రాజగోపాల్

కవుల స్పందన

18-08-2014

స్వాగతం : పి. రాజేష్
అధ్యక్షత : పి. జయశీలరావు
దశాబ్ద ప్రస్తావన
వి. కళ్యాణ రామారావు
ఆత్మీయ స్పందన
శేఖరమంత్రి ప్రభాకరరావు
చింతా అప్పలనాయుడు
ఎ.వి.ఆర్. మూర్తి
వెలుగు రామినాయుడు

" జ్యోతిర్మయి గజల్స్"

ఆల్బమ్ ఆవిష్కరణ
కళ్ళు చిదంబరం

"అసంఖ్యాక నక్షత్రాలు - ఒక ఆకాశం"

విజయచంద్ర
కవిత్వ సంపుటి ఆవిష్కరణ
డా॥ చాగంటి తులసి
కవి పరిచయం :
డా॥ డి.సహదేవరావు
సమీక్ష : రామతీర్థ

"ఎగిరిపోతున్న పిట్టల కోసం"

గంటేడ
గౌరు నాయుడు
కవిత్వ సంపుటి ఆవిష్కరణ
ద్విభాష్యం రాజేశ్వరరావు
సమీక్ష : డా॥ చందు సుబ్బారావు

కవుల స్పందన

19-08-2014

స్వాగతం : పి. అనంతరావు
అధ్యక్షత : జగద్ధాత్రి
దశాబ్ద ప్రస్తావన
పి. లక్ష్మణరావు
ఆత్మీయ స్పందన
కె. విజయ్ కుమార్
భళ్ళమూడి రామ్మూర్తి
ఆచార్య వెలమల సిమ్మన్న
మాధవి సనారా

మొజాయిక్
విడియో సమర్పణ
ప్రారంభకులు
డా॥ కె. నాగేశ్వరరావు
చైర్మన్, ఎ.బి.సి. హాస్పిటల్స్

" స్వరధార "

డా॥ మాటూరి శ్రీనివాస్
తెలుగు అనువాదంలో
భారతీయ కవిత్వం
ఆవిష్కరణ
పుణ్య ప్రవా
మహంతి
ముఖ్య అతిథి &
ప్రథమ ప్రతి స్వీకర్త
అమిత్ దహియా బాద్‌షా
వ్యవస్థాపకులు, ఢిల్లీ పొయిట్రీ సర్కిల్
సమీక్ష
ఎల్.ఆర్. స్వామి, రామతీర్థ

అనువాద కవి స్పందన

ప్రతి రోజు సా॥ 5.30 నుండి 6.00 గం.ల వరకు తేనీటి విందు. సమావేశాలు
ఖచ్చితంగా 6.00 గం.లకు మొదలవుతాయి. సమయపాలన చేయ ప్రార్థన

శుభాకాంక్షలతో

ఎమ్.వి.ఎస్. శర్మ, ఎమ్.ఎల్.సి.
పెద్దిభొట్ల సుబ్బరామయ్య
డా॥ అద్దేపల్లి రామ్మోహనరావు
కె. శివారెడ్డి, నగ్నముని
సయ్యద్ సలీం, దేవిప్రియ
పెనుగొండ లక్ష్మీ నారాయణ
రాచపాళెం చంద్రశేఖరరెడ్డి
కడియాల రామ్మోహనరాయ్
కె. రామచంద్రమూర్తి
దాట్ల దేవదానం రాజు
డా॥ ఎండ్లూరి సుధాకర్
అట్టాడ అప్పలనాయుడు
ఆశారాజు, గుడిపాటి
రామాచంద్రమౌళి
అఱ్నాద్, కొసనా
డా॥ యు.ఎ. నర్సింహమూర్తి
వేంపల్లి గంగాధర్
డా॥ పి.వి. కృష్ణయ్య
కె. మధుసూధన్
రాంభట్ల నృసింహశర్మ
ఎస్.ఎస్. జనార్దన్
ఆనందరావు పట్నాయిక్
డా॥ పి.బి.డి. వరప్రసాద్
ఎమ్మెస్సీ గంగరాజు
జీవన్ కుమార్
కెనారా, మంజరి
ఎస్.పి. ఆదినారాయణ
సిరికి స్వామినాయుడు
మల్లిపురం జగదీష్
మానాపురం చంద్రశేఖర్
అదపా రామకృష్ణ
దామరాజు విశాలాక్షి
బులుసు సరోజిని
డా॥ కె.జి. వేణు, గంటి మురళి
డా॥ ఇమ్మిడిశెట్టి చక్రపాణి
డా॥ తలతోటి పృథ్వీరాజ్
ఎమ్.బి.డి. శ్యామల
పాయల మురళీకృష్ణ
ఇందూ రమణ, వి. కూర్మారావు
గుండాన జోగారావు
డా॥ యాకూబ్, అద్దేపల్లి ప్రభు
డా॥ జి.వి. పూర్ణచందు
కె. వరలక్ష్మి, అరుణ్ జీ
మంత్రి కృష్ణ మోహన్
వేంపల్లి షరీఫ్, ర్యాలి ప్రసాద్
నాగళ్ళ దుర్గాప్రసాదరావు
చాగంటి కృష్ణ కుమారి
మంగు శివరాం ప్రసాద్
సి.యస్. రావు. ఐ.ఎ.ఎస్. (రి)
తెలకపల్లి రవి, మునిపల్లె రాజు
ఎ. మల్లేశ్వరరావు
డా॥ సి.ఎల్.ఎల్. జయప్రద
డా॥ తుర్లపాటి రాజేశ్వరి
ఎన్.ఎస్. మూర్తి, జి.ఎస్. చలం
మండపాక లింగమూర్తి
అమర జ్యోతి
ఎమ్. వరహాలచెట్టి
ఆచార్య కె. సుదర్శనరాజు
డా॥ బి.వి.ఎ. రామారావునాయుడు
వి.వి.న. మూర్తి, రెడ్డి రామకృష్ణ
ప్రొఫెసర్ బాబి వర్ధన్
కొయిలాడ బాబు

రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్

ఎం.ఐ.జి. -8, సీతమ్మధార, విశాఖపట్నం 13
99490 75859 / 94413 60083

తేదీ: 20.07.2016

పత్రికా ప్రకటన.

నమస్తే

రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ప్రారంభ సమాచారం - అవార్డు ప్రకటన

తెలుగు ఆధునిక సాహిత్యంలో విశాఖపట్నం తన కార్య క్షేత్రంగా, విస్తారమైన సాహిత్యసృజనకు పేరు మోసిన వారు రాచకొండ విశ్వనాథ శాస్త్రి. రా.వి.శాస్త్రిగా పేరు సాహితీలోకానికి చిరపరిచితులు. సుప్రసిద్ధులు. అభ్యుదయ భావనలకు, ధారాపాతంగా వచన రచనకు శాస్త్రి గారి రచనలు మణిపూసల వంటి ఉదాహరణలు. కథలు, నవలలు, నాటకాలు, రాసి, స్వయానా నాటకాలలో నటించి,జువ్వాడి గౌతమ రావు గారి పద్యాలను చెవి ఒగ్గి విన్న ఉత్తమ సాహిత్యాభిరుచి గల అసమాన ప్రతిభ శాలి, తన వచన రచన శైలి తో కొండంత ఎదిగి నిలిచిన రా.వి.శాస్త్రి గారి పేరిట విశాఖపట్నం నుంచి రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్ ఏర్పాటు చేస్తున్నాము. రావి శాస్త్రి గారి సోదరులు, కవి అనువాదకులు, సాహితీవేత్త,రాచకొండ నరసింహ శర్మ ఈ ట్రస్ట్ ను సెట్లర్ గా, చైర్మన్ మరియు ఫౌండర్ గా ఏర్పాటు చేస్తారు.

వారి కుటుంబ సభ్యులు ముగ్గురు ఈ ట్రస్టులో కుటుంబం తరపున కొనసాగుతారు. సాహిత్య రంగం తరపున **చందు సుబ్బారావు, ఎల్.ఆర్.స్వామి, వి.కల్యాణరామారావు, పి.జయశీలరావు, జగద్ధాత్రి** బాధ్యతలు వహిస్తారు. ప్రతి ఏటా జులై 30 రావి శాస్త్రి జయంతి సందర్భంగా ఎంపిక చేసిన సాహిత్య రంగ ప్రముఖులకు **రావిశాస్త్రి అవార్డు** పేరిట పదివేల రూపాయల పురస్కారం, మెమెంటో, విశాఖపట్నంలో అందచేస్తారు. ఇందుకు మూల నిధిగా మూడు లక్షల రూపాయలు ఏర్పాటు చేసి దానిపై వడ్డీ తో ఈ కార్యక్రమాలు ప్రతి ఏటా కొనసాగుతాయి.

రామతీర్థ కు తొలి ఏడాది రావిశాస్త్రి అవార్డు ప్రదానం.

కవిత్వం, విమర్శ, అనువాదం, రంగాలలో దశాబ్దాల కృషి, సాహిత్యం ముందు తరాలకు తగు సాంకేతిక రూపాలలో అందేలా చేస్తున్న సమన్వయ కార్యాచరణ, గురజాడ, శ్రీశ్రీ, ఆరుద్ర, రావి శాస్త్రి మున్నగువారి సాహిత్య పరివ్యాప్తిలో భాగంగా ఫోటో ప్రదర్శనలు, రేడియో రూపకాలు, తెలుగు, ఆంగ్లంలో పరిశీలనాత్మక వ్యాసాలు, రావి శాస్త్రి రచనల అనువాదాలు చేసిన సాహిత్య కార్యకర్త, రామతీర్థ కు రావిశాస్త్రి లిటరరీ ట్రస్ట్, స్ఫూర్తి దాయక శుభ కామనలతో ఈ అవార్డు ప్రకటిస్తున్నది. ప్రదానోత్సవ సభ రావి శాస్త్రి జయంతి జులై 30,2016 న సాయంత్రం, విశాఖ పౌర గ్రంథాలయంలో సాయంత్రం ఆరు గంటలకు నిర్వహిస్తున్నాము.

ఈ సభకు మీ విలువైన పత్రిక / దృశ్య మాధ్యమం నుంచి ప్రతినిధులను పంపి మీ అమూల్య సహాయ సహకారాలను అందచేయగలరని ఆశిస్తున్నాము.

ఎల్.ఆర్. స్వామి
99490 75859

రాచకొండ నరసింహశర్మ
0891 6671471

చందు సుబ్బారావు
94413 60083

మునిపల్లె రాజు

సాహిత్య పురస్కార సమితి

సైనిక్ పురి, సికందరాబాద్ , తెలంగాణ

తేదీ: 04.03.2019

సంపాదకులు
పత్రిక / దృశ్య మాధ్యమం
విశాఖపట్నం / విజయవాడ / హైదరాబాద్

నమస్తే.

సుప్రసిద్ధ కథా, నవలా రచయిత, సాహిత్య అకాడెమీ అవార్డ్ పొందిన సాహిత్య వేత్త మునిపల్లె రాజు గారి పుట్టినరోజు 16.03.2019 సందర్భంగా, వారి కుటుంబ సభ్యులు, సాహితీ మిత్రుల సహకారంతో మునిపల్లెరాజు సాహిత్య పురస్కార సమితి ఏర్పాటు చేశారు.

రాజు గారి పేరిట ఒక వార్షిక సాహిత్య పురస్కారం ప్రదానం చేయడానికి నిర్ణయం జరిగింది. మునిపల్లెరాజు సాహిత్య పురస్కారం పేరిట, వారి జన్మదినం మార్చ్ 16న, ఈ అవార్డ్ ప్రదానం చేయడం జరుగుతుంది. 2019 వత్సరానికి గాను, ప్రముఖ కవి, కథకులు, అనువాదకులు, విమర్శకులు, సాహిత్య పరిశోధకులు, ప్రసంగకర్త, రామతీర్థ కి, విలువైన సాహిత్య కృషికి, తొలి మునిపల్లెరాజు సాహిత్య పురస్కారాన్ని, ఈ సమితి ప్రకటిస్తున్నది.

అవార్డ్ రూపేణా పది వేల రూపాయల నగదు, సైటేషన్, సత్కార సభ,మునిపల్లె రాజు సాహిత్యావలోకనం , 16.03.2019 సాయంత్రం, విశాఖపట్నం ద్వారకానగర్ లో గల పబ్లిక్ లైబ్రరీ ఏ.సి. హాల్ లో నిర్వహిస్తున్నాము.

ఈ వార్తను మీ విలువైన పత్రికా / దృశ్య మాధ్యమం ద్వారా ప్రచురణ / ప్రసారం చేసి, ప్రజలకు తెలిసేందుకు, మీ అమూల్య సహాయ సహకారాలు అందచేయగలరని విజ్ఞప్తి చేస్తున్నాము.

కృతజ్ఞతా పూర్వక ధన్యవాదాలతో,

మునిపల్లెరాజు సాహిత్య పురస్కార సమితి తరఫున

ఆంధ్ర విశ్వకళాపరిషత్

మొజాయిక్ సాహిత్య సంస్థ

సాదరాహ్వానం

కందుకూరి శతవర్ధంతి సమాపనోత్సవం

సాహితీ సాంస్కృతిక సంధ్య

డాక్టర్ వై.వి.ఎస్. మూర్తి సభా మందిరం, ఎ.యు. ఇంజనీరింగ్ కళాశాల (అటానమస్)
తేది 1 జూన్ 2019 సాయంత్రం గం॥ 5.30 ని॥లకు

ముఖ్య అతిథి
భారత ఉప రాష్ట్రపతి
మాన్యశ్రీ ముప్పవరపు వెంకయ్య నాయుడు గారు

జాతీయ గీతాలాపన

కందుకూరి చిత్రపటావిష్కరణ

అధ్యక్షోపన్యాసం
కల్నల్ ఆచార్య గొల్లపల్లి నాగేశ్వర రావు, ఉపకులపతి, ఆంధ్ర విశ్వకళాపరిషత్

లఘు ప్రసంగాలు

శ్రీ తూమాటి సంజీవ రావు, చెన్నై తెలుగు వాణి, కందుకూరి స్మృతి కార్యక్రమ సంచాలకులు
శ్రీమతి జగద్ధాత్రి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమి సభ్యురాలు
శ్రీ ఎల్.ఆర్. స్వామి, కేంద్ర సాహిత్య అకాడమి అనువాద పురస్కార స్వీకర్త
ఆచార్య ఎం. చంద్రశేఖర్, ఇండియన్ ఇన్స్‌టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, విశాఖపట్నం

పుస్తకావిష్కరణలు

కందుకూరి వారి నవలిక **"సత్యవతీ చరిత్రము"** ఆంగ్లానువాదము

కందుకూరి స్మృతి లహరి (శతవర్ధంతి సంచిక)

పుస్తకాల సంక్షిప్త పరిచయం
శ్రీ రామతీర్థ, అనువాదకులు, సంపాదక కూర్పరి

ముఖ్య అతిథి సందేశం
కందుకూరి వారి లఘు నాటిక - "అపూర్వ బ్రహ్మ చర్య ప్రహసనము" ప్రదర్శన

జాతీయ గీతాలాపన

1. ఈ ఆహ్వాన పత్రిక బదిలీ చేయకూడదు. 2 ముఖ్య అతిథి, భారత ఉప రాష్ట్రపతి ఆగమనానికి 30 నిమిషాలు ముందుగా సభాసదులు సమావేశ మందిరంలో దయచేసి ఆసీనులై ఉండవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము. 3. ఈ ఆహ్వానపత్రిక ఒరిజినల్ కాపీ మరియు మీ ఐడెంటిటీ కార్డు తీసుకొని రండి. 4. బ్రీఫ్‌కేసులు, హాండ్‌బ్యాగులు, ఏ రకమైన ఆయుధాలు, కెమెరా మొదలైనవి అనుమతించబడవు. 5. మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్‌లో ఉంచండి.

శ్రీ రామతీర్థ గారు రచించిన "తెల్ల మిరియం" కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న
మేటి కవి, సినీ రచయిత ఆరుద్ర

రచనలు

తెల్లమిరియం

నిర్భయజ్యోతి

హుదూద్

కన్యాశుల్క కవితోత్సవం

పోస్టాఫీసు (రవీంద్రనాథ్ టాగూర్ రచనకు అనువాదం)

జోన్ (అంతర్జాతీయ కవిత్వం)

నూరేళ్ల జనగణమన

కెన్ సారో వివా స్మృతికి పదేళ్ళు సంపుటి

శతాబ్ది శ్రీశ్రీ

వృధాత్రి

నజ్రుల్ ఇస్లాం బిద్రోహి కవిత్వం (బెంగాలీ నుండి తెలుగులోకి అనువాదం)

అన్నపూర్ణాక్షరం (రాచకొండ నరసింహ శర్మ ఆంగ్ల కవితలకు తెలుగు

యాబలూరు సుందర రాంబాబు, తెలుగు సాహిత్యానికి రామతీర్థగానే పరిచయం.ఇతను ఓ కవి, చదువరి, విమర్శకుడు, అనువాదకుడు. తెలుగుతోపాటు హిందీ, బెంగాలీ, ఉర్దూ, ఒరియా, ఇంగ్లీష్ భాషల సాహిత్యాన్ని అధ్యయనం చేశారు.

జననం

రామతీర్థ 1960 జూలై 17 న పలాస ప్రాంతంలో పుట్టారు. ఇతని తండ్రి ఓ రైల్వే ఉద్యోగి. ఖుర్దారోడ్‌లో కొంతకాలం ఉన్నాక, రామతీర్థ విశాఖపట్నం వచ్చాడు. వంగ, కళింగ భాషల్ని జన్మతహా అబ్బించుకున్నాడు. ఒడియా కవి ఫకీర్ మోహన్ సేనాపతి అంటే ఇతనికి అమితమైన ప్రేమ. నేవల్ డాక్‌యార్డులో ఉద్యోగం చేస్తూ మూడేళ్ల సర్వీసు ఉండగా రామతీర్థ విఆర్ఎస్ తీసుకున్నాడు

'కవిత సాహితీ సాంస్కృతిక వేదిక' ఇతని తొలి కవిత్వ పాఠశాల. 1993లో రాసిన 'తెల్ల మిరియం' కవితాసంపుటికి ఆరుద్ర ''బోణీ'' అనే పేరుతో ముందు మాట రాశారు. 'నిర్భయ జ్యోతి', 'హుదూద్' లాంటి సంగ్రహాణాత్మక దీర్ఘ కవితలను రాశాడు. ''హీరోగి'', ''శనిమా'', ''రేప్ క్లాక్'', ''మృగాడు'' ఇలా అనేక పదాలు ఇతని సొంత తయారీ. ఇతను రాసిన కన్యాశుల్క కవితోత్సవం గురించి చెప్పాలంటే బహుశా ఇలాంటి ప్రయత్నం వేరే ఎవ్వరూ చేయలేదు. ఒక నాటకానికి నివాళులు అర్పించడానికి 52 కవితలు రాశారు. అలాగే కన్యాశుల్కం 1887 మొదటి ప్రతిని సేకరించి డిజిటల్ రూపంలో భద్రపరిచారు. కాలగర్భంలో కలిసిపోయిన కందుకూరి ఆంగ్ల ప్రసంగాన్ని వెలికితీసి సాహిత్య లోకానికి పరిచయం చేశారు. చెన్నై తెలుగు సంస్థ, చెన్నై తెలుగు ప్రకాశంతో కలిసి క్రాంతదర్శి కందుకూరి శతవర్ధంతి సంచిక ప్రచురణలో భాగస్వామిగా పనిచేశాడు. కన్యాశుల్కంలో గురజాడ అందించిన విలువలు ప్రజలలోకి చొచ్చుకువెళ్లాలని అహర్నిశలు కృషి చేశాడు రామతీర్థ.

2003 వరకు రామతీర్థ కవి, ప్రాసంగికుడు మాత్రమే. 2003లో సాహితీ బాంధవిగా జగద్ధాత్రితో కలిసి మొజాయిక్ సాహితీ సంస్థని స్థాపించాడు. ఒకే లాంటి సాహితీ అభిరుచి వారిద్దరి సహజీవనానికి కారణమయింది. ఎన్నో విమర్శలకి గురి అయినా వారి సాహిత్య అనురాగాల ముందు అవి పటాపంచలయ్యాయి. కవిత్వం, కథా రచన, అనువాదమూ, గేయ రచన, రేడియో రూపక రచన, నిర్మాణం, నాటికలు, సాహిత్య విమర్శ, పరిశోధన, పత్రికా సంపాదకత్వం, సమకాలీన జాతీయ / ప్రపంచ సాహిత్య విషయంగా శక్తివంతమైన ప్రసంగాలు, తెలుగు ఇంకా ఇంగ్లీష్ భాషల్లో వ్యాసరచన, సమాంతరంగా ప్రాచీన ఆధునిక ధోరణుల్లో సామాజిక నిష్ఠ, భాషా చరిత్రలో పరిపూర్ణ సదవగాహన... వెరసి రామతీర్థ. జగద్ధాత్రి, రామతీర్థలు ఇరువురూ ''మండే మొజాయిక్'' పేరున ప్రతి సోమవారం సాయంత్రం విశాఖ పౌర గ్రంథాలయంలో సాహితీసభలు నిర్వహించేవారు. ఆకాశవాణి విశాఖపట్నంలో రామతీర్థ, జగద్ధాత్రి కలిసి 'సాహితీ సమీరాలు' పేరుతో ఉత్తరాంధ్ర ప్రాముఖ్యతని సైతం తెలియజేసేవారు

మొజాయిక్ సాహిత్య సురభి, ఋత్విక్ ఫౌండేషన్లతో కలిసి ''అక్షర గోదావరి'' పురస్కారాలను కథకు కవిత్వానికి, విమర్శకు ప్రతీ ఏడాది అందించేవారు. రామతీర్థ వ్యాసాలు హన్స్ ఇండియా, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ప్రజాశక్తి, తెలుగు వెలుగు, లీడర్ మొదలైన పత్రికలలో ప్రచురితమయ్యాయి. 2019 మే 30 న రామతీర్థ విశాఖపట్నంలో గుండెపోటుతో మరణించాడు. అతను మరణించిన కొద్ది నెలలకు సహచరి జగద్ధాత్రి కూడా ఆత్మహత్యకు పాల్పడింది.

పురస్కారాలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుండి గిడుగు రామ్మూర్తి పురస్కారం

రంజని కుందుర్తి పురస్కారం, చాసో పురస్కారం

శ్రీశ్రీ వచన కవిత్వ పురస్కారం, రావిశాస్త్రి పురస్కారం

ఒడిస్సా వారి ఉత్కల్ సాంస్కృతిక సమ్మాన్

గురజాడ పురస్కారం, లైన్స్‌క్లబ్ విశాఖ అవార్డు, మునిపల్లి రాజు స్మారక పురస్కారం

Shri Y. Ramatheertha (Telugu Critic, Poet and Writer) receiving Gidugu Ramamoorthy Puraskaram from Government of AP